బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

21 & 22, ఫిబ్రవరి 2022

భావీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 18 - Issue. 2 - Spl. Edition - February 2022 - ISSN No. : 2456-4702



నిర్వహణ :

తెలుగు విభాగం

మద్రాసు విశ్వవిద్యాలయం

మెరినా ఆవరణ, చెన్నై, తమిళనాడు.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - *Special Issue* - 2 - February 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor
PITTA SANTHI
M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,
C/o. Dr. Busi Venkataswamy
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu (Rtd.),** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Associate Professor,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ ప్రత్యేక సంచిక

ఫిబ్రవరి - 2022

ప్రధాన సంపాదకులు :

ఆచార్య విస్తాలి శంకరరావు

సహ సంపాదకులు :

డా॥. పాండురంగం కాళీయప్ప

డా॥. మాదా శంకరబాబు

బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

ప్రథమ ముద్రణ	:	**ఫిబ్రవరి 2022**
ప్రతులు	:	**500**
కాపీలకు	:	**మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు - 522 002.**
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

మద్రాసు విశ్వవిద్యాలయం

Re-accredited at the 'A' Grade Level by NAAC and Conferred with the 'University with Potential for Excellence' status by UGC

మెరీనా ఆవరణం, చైన్నై - 600 005, తమిళనాడు.

ఆచార్య విస్తాలి శంకరరావు

తెలుగు శాఖాధ్యక్షులు



సదస్సు ఉద్దేశం - లక్ష్యం

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగి అద్భుతమైన సాహిత్య సృష్టితో సామాజిక చైతన్యాన్ని ఆశించి జాతిని జాగృతం చేసిన మహాకవి బోయి భీమన్నగారు. భీమన్న గారి వ్యక్తిత్వం, సాహిత్యం విశిష్టం. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి జాతి సమైక్యతే ధ్యేయంగా ముందుకుసాగి 84 ఏళ్ళు పాటు శ్రమించి దాదాపు 70కి పైగా గ్రంథాలను రాసి తనకంటూ సాహిత్య చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకున్న మహోన్నతమైన వ్యక్తి.

మహాకవిగా, సాహితీ వసంతగా, పద్మశ్రీగా, నవయుగ కవిసార్వభౌమునిగా, పద్మభూషణ్‌గా అనేక బిరుదులు అందుకోవడమే కాక అనేక సత్కారాలు, సన్మానాలు పొంది పలువురిచేత ప్రశంసలు అందుకున్న బోయి భీమన్నగారి సాహిత్యం ఎందరికో ఆదర్శ ప్రాయంగా నిలిచింది అనడంలో సందేహం లేదు.

సాధారణంగా గొప్పగొప్ప మహాకవులుగా కీర్తించబడినవారు ఎన్ని రచనలు చేసిన ఆ కవి పేరు చెప్పిన వెంటనే ఎదో ఒకటి, రెండు రచనల పేర్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. కాని బోయి భీమన్న గారి రచనల పేర్లు భీమన్నగారి పేరుకంటే మరింత ఆదరణపొందాయి. ముఖ్యంగా భీమన్నగారి పేరు చెబితే వెంటనే గుర్తుకువచ్చే రచనలు పాలేరు, జానపదుని జాబులు, పడిపోతున్న అడ్డుగోడలు, రాగవాసిష్ఠం, త్రిపదులు, శ్రీ పిల్లి శతకం, గుడిసెలు కాలిపోతున్నాయి, అంబేద్కర్ సుప్రభాతం, కులనిర్మూలన ఇలా ఎన్నో రచనలు పాఠకుల మనసులో స్ఫురణకు వస్తాయి. ప్రతి రచనను ఎంతో వైవిధ్యంగా తీర్చిదిద్దిన వైనం

పాఠకులను ఆలోచింపజేసేవిగా ఉంటాయి. అటువంటి వీరి సాహిత్యాన్ని ఒక్కసారి సమీక్షించుకుందామనే సంకల్పంతో మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ భీమన్నగారి సాహిత్యంపై "బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన" అనే శీర్షికతో అంతర్జాతీయ అంతర్జాల సదస్సుకు శ్రీకారం చుట్టింది.

ఈ సదస్సులో సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, పరిశోధక మిత్రులు ఎంతో ఉత్సాహంతో భీమన్నగారి సాహిత్యంపై వివిధ కోణాలలో, విలక్షణమైన పరిశోధనాత్మకమైన విలువైన వ్యాసాలను సకాలంలో అందించడంలో ఆ సదస్సులో చదివిన పత్రాలు అన్ని పుస్తక రూపంలో తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగడంతో ఈ రోజు మీ చేతిలో ఈ పరిశోధనాత్మక గ్రంథం రూపుదిద్దుకుంది. ఈ వ్యాసాలు పరిశీలించిన తర్వాత ఏ ఉద్దేశంతోనైతే ఈ సదస్సుకు శ్రీకారం చుట్టామో ఆ లక్ష్యం నెరవేరిందనే విశ్వాసం కలిగిందని భావిస్తూ..... అదే ఈ సదస్సు లక్ష్యంగా విశ్వసిస్తూ.....

నమస్కారాలతో
మీ
ఆచార్య బిస్తాల శంకరరావు



శ్రీమతి హైమవతి భీమన్న

అధ్యక్షులు, భీమన్న సాహితీ నిధి,

హైదరాబాదు.

మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ 'డా॥ బోయి భీమన్న గారి సాహిత్యం సమాలోచనం' పేరిట మదరాసులో వున్న మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అంతర్జాలంలో అంతర్జాతీయ సదస్సును 21 & 22 ఫిబ్రవరి, 2022 న జరపడానికి నిశ్చయించింది. డా.భీమన్నగారికి తెలుగు సాహిత్యంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు వుంది వివిధ ప్రక్రియలలో 70పైగా వారు రచనలు చేశారు. ఆయన సాహిత్యమంతా రసాద్వైతం. హరిజనులు ఆర్యులే శివసోషలిజం వంటి సిద్ధాంతాలు చుట్టూ అల్లుకొన్నది.

కవిగా, రచయితగా ఆయనని వందలాది పురస్కారాలు వరించాయి. మచ్చుకు కేంద్రసాహిత్య అకాడమి పురస్కారం, జాషువా పురస్కారం, రాజ్యలక్ష్మీ సాహిత్య పురస్కారం వంటివి. మచ్చుకు కొన్ని కనకాభిషేకం, గండపెండేర సన్మానాలు కూడా అందుకొన్నాడు. అంతటి మహాకవి పేరిట చెన్నై విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించడం భీమన్న పట్ల వారికున్న గౌరవాదరాలే. మరోక ప్రత్యేకత ఏమిటంటే సదస్సులో అనేకమంది ఎంతో ఉత్సాహంతో పత్ర సమర్పణలు చేస్తున్నారు వారందరికి నా అభినందనలు ఈ సదస్సులో వచ్చిన పత్రాలన్నీ గ్రంథరూపంలో వస్తుందని నిర్వహకులు తెలిపారు. నిజంగా వారి కృషి బహుదా అభినందనీయం. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని తలపెట్టి కార్యక్రమ విజయానికి అహర్నిశలూ కృషి చేస్తున్న మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధ్యక్షులు, కవి, రచయిత, గాయకుడు అయిన ఆచార్య విస్తాలి శంకరరావు గారిని మనసారా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను ఆయన తలపెట్టిన ఈ మహత్తర కార్యక్రమం విజయవంతమవాలని కోరుతూ శుభాకాంక్షలతో.....

మీ

హైమవతి భీమన్న

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మద్రాసు విశ్వవిద్యాలయం

Re-accredited at the 'A' Grade Level by NAAC and Conferred with the 'University with Potential for Excellence' status by UGC

మెరీనా ఆవరణం, చైన్నై - 600 005, తమిళనాడు.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్
విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు



ఆత్మీయతాభినందనలు

బోయి భీమన్న, ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియలతో ముడిపడిన పేరు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి మారుపేరు. మామూలు కవి నుంచి, మహాకవిదాకా ఎదిగిన కవి. సత్యాన్వేషణ కావించే వ్యక్తిగా కాక తానే సత్యమై నిలిచిన వ్యక్తి. సాహిత్యపరంగానూ, మానవతాపరంగానూ ఉన్నత శిఖరాలను అధిరోహించిన శక్తి. ఆయన రచనలు ప్రశంసలు అందుకోవడమే కాదు, ప్రకంపనలు కూడా సృష్టించాయి. ఆయన వ్యక్తిత్వం, కవిత్వం రెండూ కూడా మానవత్వంవైపు నడిచినవే, నడిపించినవే. కవిత్వానికి నిలువెత్తురూపంలా నిలిచిన వ్యక్తి భీమన్న. నిండైన జీవితం, నిండైన కవిత్వం, నిండైన వ్యక్తిత్వం. సామాన్య జనం నుంచి మహాకవులవరకూ భీమన్నగారిని అభిమానించని వారు లేరు. అన్ని వర్గాల అభిమానాన్ని పొందిన కవి ఆయన.

పద్మశ్రీ, పద్మభూషణ్ లాంటి అత్యున్నతమైన పురస్కారాలు, కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం, అనేక విశ్వవిద్యాలయాలనుంచి డాక్టరేట్లు, కళాప్రపూర్ణలు, గండపెండేరాలు, కనకాభిషేకాలు, పుష్పాభిషేకాలు, విశిష్టపురస్కారాలు ఇలా లెక్కకు మించినవి ఆయన్ను వరించాయి. ఎంతోమంది దళిత యువకులు వాడలు వదిలి మేడల్లోకి మారడానికి ఆయన రచనలు ఉత్ప్రేరకాలుగా పనిచేశాయి. చదువుకోవాల్సిన అవసరాన్ని అడుగడుగునా గుర్తుచేస్తూ ఆయన రచనలు దళిత యువతను ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దాయి. డెబ్భైకిపైగా ఆయన రచనలు ఆ కాలం నుంచి ఈ కాలం వరకూ కూడా ప్రేరకశక్తిగా పనిచేస్తూనే ఉన్నాయి. సామాజిక ప్రయోజనం తప్ప మరేమీ ఆశించకుండా రచనలు

చేసిన భీమన్న అన్ని వర్గాల వారిని ఆకట్టుకోగలిగారు. అదే సమయంలో ఆయన ఎలాంటి ప్రలోభాలకు, ప్రభావాలకు తలవొగ్గకుండా, నిక్కచ్చిగా, నిటారుగా నిలబడి తన సాహిత్య వ్యాసంగం సాగించారు. ఉపాధ్యాయుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, అధికారిగా ఏ ఉద్యోగంలో ఉన్నా ఆ ఉద్యోగానికి గౌరవం తెచ్చేవిధంగా పనిచేశారు.

కాకినాడ పి.ఆర్.కాలేజీలో బి.ఎ. ముగించిన తరువాత 1935లో ఆయన మద్రాసులోని జనవాణి పత్రికలో ఉపసంపాదకుడిగా చేరారు. ఆ తరువాత 1938లో మద్రాసులోనే ప్రజామిత్ర పత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశారు. తరువాత 1939లో మద్రాసునుంచి నడిచిన నవజీవన పత్రికలో సంపాదకుడిగా చేరారు. ఆ తరువాత 1950-55 మధ్యకాలంలో మద్రాసులోని ఆంధ్రప్రభలో పనిచేశారు. ఇలా ఆయనకు మద్రాసుతో దీర్ఘకాల అనుబంధం ఉంది.

ఈ రోజు మద్రాసు విశ్వవిద్యాలయంలో "బోయి భీమన్న సాహిత్యం-సమాలోచన" అన్న అంతర్జాతీయ సదస్సు జరగడం ముదావహమైన విషయం. అందుకు కారకులైన ఆచార్య విస్తాలి శంకరరావు అభినందనీయులు. ఈ సదస్సులో సాహిత్యమిత్రులు అనేకులు పాల్గొని భీమన్నగారి సాహిత్య వైశిష్ట్యాన్ని వివరించేవిధంగా పత్రాలు సమర్పించారు. అందులో కొన్ని పత్రాలను పుస్తకం రూపంలో తీసుకొని వచ్చి సదస్సు రోజునే ఆవిష్కరించడం ఈ సదస్సు ప్రత్యేకత. ఈ సదస్సును అతి తక్కువ సమయంలో రూపకల్పన చేసి ఇన్ని పత్రాలతో 'భావవీణ' పత్రికను ప్రత్యేక సంచికగా తీసుకొని రావడంద్వారా ఈ సదస్సుకు సార్థకత చేకూర్చారు. వీటిలోని ఉత్తమ పత్రాలకు బహుమతులు ప్రకటించడం ఈ సదస్సులోని మరో ప్రత్యేకత. ఈ పత్రాలు బోయి భీమన్నగారి సాహిత్యాన్ని, ఆయన బహుముఖీనమైన ప్రతిభను మనముందుంచాయి. వీటిద్వారా భవిష్యత్తులో భీమన్నగారిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవకాశం కలుగుతుంది. అనతికాలంలో భీమన్నగారి విస్తృతమైన సాహిత్యాన్ని పరిశోధించి పత్రాలు సమర్పించిన పత్రసమర్పకులకు, వాటికి గ్రంథరూపాన్ని ఇచ్చిన ఆచార్య విస్తాలి శంకరరావుగారికి, వాటిని ముద్రించి పాఠకలోకానికి అందించిన 'భావవీణ' పత్రిక నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తున్నాను.

– మూడభూషి సంపత్ కుమార్

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

హైదరాబాద్, తెలంగాణ.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

తెలుగుశాఖ అధ్యక్షుడు, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్



శుభాకాంక్షలు

ప్రముఖ కవి, సామాజిక పరివర్తన దార్శనికుడు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత, భారతదేశ అత్యున్నత పురస్కాం ల్లో ఒకటైన పద్మభూషణ్ అవార్డు పొందిన గొప్ప వ్యక్తి బోయి భీమన్నగారు. ఈయన రాసిన 'పాలేరు' నాటకం వందలాదిమంది జీవితాల్ని మార్చింది. చదువుకోవడంలో ఉన్న సామాజిక గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని పొందడమెలాగో నేర్పింది. ఈయన రాసిన రచనలన్నింటిలోను భారత జాతీయ సమగ్రత కనిపిస్తుంది. ఈయన జీవితం, సాహిత్యాన్ని విశ్లేషించుకునే దిశగా మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ వారు రెండు రోజుల పాటు (21,22 ఫిబ్రవరి 2022) అంతర్జాలం ద్వారా "బోయి భీమన్న సాహిత్యం-సమాలోచన" పేరుతో అంతర్జాతీయ సదస్సుని నిర్వహిస్తున్నందుకు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు గార్ని ముందుగా అభినందిస్తున్నాను.

తెలుగు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ఉత్తమ పరిశోధన వ్యాసాలకు నగదు బహుమతిని ప్రకటించడం బహుశా ఇదే ప్రథమం అనుకుంటున్నాను. ఆచార్యవిస్తాలి శంకరరావుగారు ఏ సదస్సు నిర్వహించినా ఎంతో నిబద్ధతతో నిర్వహిస్తూ, సంబంధిత రంగాల్లో విశేషమైన కృషిచేసేవారిని ఆ సదస్సుల్లో భాగస్వామ్యం చేస్తుంటారు. ఈ సదస్సులో సుమారు 88 మంది తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తున్నారు. చాలామంది సదస్సులను నిర్వహించడంతో తమ పని అయిపోయిందనుకొనేపరిస్థితుల్లో, ఆ సదస్సు

పరిశోధన పత్రాలను ముందుగానే రప్పించి, సదస్సులోనే సెమినార్ ప్రొసీడింగ్స్ ని ఒక పుస్తకరూపంలో తీసుకురావడం సామాన్యమైన విషయం కాదు. దాన్ని సుసాధ్యం చేయడం ఆచార్య విస్తాలి శంకరరావుగారి నాయకత్వ సామర్థ్యాన్ని, ఆయనకు సహకరించేవారి శిష్య బృంద కృషినీ తెలియజేస్తుంది.

ఈ అంతర్జాలం, అంతర్జాతీయ సదస్సు నిర్వహణలో తమ పూర్తి సహకారాన్ని అందిస్తున్న బోయి భీమన్నగారి సతీమణి శ్రీమతి హైమవతీ భీమన్న గారు స్వయంగా మంచి సాహితీవేత్త. అందువల్ల సాహిత్యం సమాజంలో తీసుకొచ్చే పరివర్తన, దాని ప్రభావం బాగా తెలుసు కనుక, బోయి భీమన్నగారి సాహిత్యాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొని రావడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్నింటికీ వారు తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంటారు. అందుకు గాను శ్రీమతి హైమవతిగార్కి నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను.

ఈ సదస్సు తెలుగు సాహిత్యలోకంలో బోయి భీమన్నగారి వ్యక్తిత్వాన్నీ, సాహిత్యాన్నీ అనేక కోణాల్లో అధ్యయనం చేయడానికి ప్రేరణగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. ఈ సదస్సు జయప్రదం కావడానికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

- ఆచార్య దర్భా వెంకటేశ్వరరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆంధ్ర విశ్వకళా పరిషత్

Accredited by NAAC with 'A' Grade ISO 9001 : 2015 Certified

విశాఖపట్టణం

డా॥. బూసి వెంకటస్వామి

సహాచార్యులు, తెలుగు విభాగం.



శుభాకాంక్షలు

భీమన్న చెట్టంత మనిషి. చెట్టు ఏ విధంగా మానవాళికి ఉపయోగపడుతుందో భీమన్న సాహిత్యం కూడా సమాజానికి ఆ విధంగా ఉపయోగపడుతుంది. సమాజంలో తిష్ట వేసిన సామాజిక రుగ్మతలకు సాహిత్యమే దివ్యౌషధం అన్ని నమ్మిన భీమన్న తన రచనల ద్వారా సమాజ ప్రక్షాళనకు పూనుకొని అందులో కృతార్థులయ్యారు. ముఖ్యంగా అణగారిన వర్గాలలో అక్షరాభ్యాసం లేని మనుషులను మనీషులుగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకొని ఆ దిశగా రచనలు చేసి వారిలో ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం నింపటానికి రచనలనే ఆయుధంగా మలుచుకున్న మహనీయుడు బోయిభీమన్న. వారి రచనలకు స్ఫూర్తి, ప్రేరణ పొందిన ఎందరో తమ జీవితాలను రహదారి పట్టించి ఆ మార్గంలో మరెందరో పయనించటానికి కారణభూతులయ్యారు.ఒక వైపు జాతీయతను మరొక వైపుమానవతను తన రచనల్లో పొందుపరచి సమాజానికి ఆ అమృత కలశాన్ని అందించారు. అటువంటి మహానీయునిపై మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం అంతర్జాతీయ సదస్సు నిర్వహించటానికి పూనుకోవటం ముదావహం. మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య విస్తాలి శంకరరావు గారు ప్రవేశించటం ఆ శాఖ చేసుకున్న అదృష్టమే. ఆచార్య విస్తాలి శంకరరావు గారు ఇప్పటికే ఏన్నో జాతీయ అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు. వారి చేపట్టిన ఏ కార్యక్రమమైనా దిగ్విజయంగా, విజయవంతంగా పూర్తి కావటమే. అదే వారి నిబద్ధత,ప్రణాళిక. ఏ

సదస్సునైనా క్రొత్తదనంతో ముందుకు నడిపిస్తూ, చిన్న పెద్ద తారతమ్య లేకుండా అందరినీ కలుపుకుపోతూ, అందరికీ సమ ప్రాధాన్యతనిస్తూ,అందరినీ ఉత్సాహపరుస్తూ,సదస్సుకు కావలసిన ముడి సరుకును తానే సమకూరుస్తూ సదస్సు అనే ప్రయాణాన్ని సాఫీగా సాగేలా చేస్తారు. అదే వారి ప్రత్యేకత. ఈ అంతర్జాతీయ సదస్సుకు ప్రత్యేక ఒరవడిని తీసుకువచ్చారు. అదే భీమన్న గారి సతీమణి హైమావతి భీమన్న గారు.వారు పరిశోధక విద్యార్థులను ప్రోత్సహించాలనే ప్రయత్నం చేయటం. అందుకు గాని మంచి పరిశోధనా పత్రాలకు నగదు బహుమతిని ప్రకటించటం ఏంతో ఆనందదాయకం. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

పరిశోధనా సమర్పకులు రెట్టించిన ఉత్సాహంతో తమ పరిశోధనా పత్రాలను పంపి భీమన్నసాహిత్యంలో విభిన్న భావాలను వెల్లడించారు.భావి పరిశోధకులకు మార్గదర్శకమైన సిద్ధాంతాలను విశ్లేషణ చేయటం చేత భావి పరిశోధకులు సులభంగా అవగాహన చేసుకోవటానికి లోతైన పరిశోధన చేయటానికి దోహదపడుతుంది. ఇటువంటి మహా యజ్ఞంలో భావవీణ సాహిత్య మాసపత్రికకు భాగస్వామ్యం కల్పించి సదస్సు ప్రత్యేక సంచిక తీసుకు రావటానికి అవకాశం కల్పించిన సదస్సు సంచాలకులు ఆచార్య విస్తాలి శంకరరావు ప్రత్యేక కృతజ్ఞతలు. వారికి నిరంతరం సహకరిస్తున్న అధ్యాపక మిత్రులు డా పాండురంగం కాళియప్ప, డా. మాదా శంకరబాబుకు నా ఆశీస్సులు.

ఇటువంటి మహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న ఆచార్య విస్తాలి శంకరరావు గారికి అభినందనలు తెలియజేస్తూ మున్ముందు మరెన్నో కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలతో...

– డా॥. బూసి వెంకటస్వామి

మధురై కామరాజ విశ్వవిద్యాలయం

మధురై, తమిళనాడు.

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
తెలుగు శాఖాధ్యక్షులు



శుభాకాంక్షలు

మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావుగారు ఒక అంశాన్ని ఎన్నుకోవడంలోనూ, ఎంచుకున్న కార్యాన్ని ఒక మహాయజ్ఞంలా చేయడంలోనూ, దానిని ముందుకు తీసుకెళ్ళడంలోనూ వారి ప్రత్యేకత కనిపిస్తుంది. అంబేద్కర్ ఆలోచనలను అనుసరించిన కవులలో భీమన్నగారు ముందు వరుసలో ఉంటారు. వీరి రచనల మీద సదస్సులు, మరెన్నో పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉంది. ఇలాంటి తరుణంలో 'బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన' అనే అంశంపై అంతర్జాల అంతర్జాతీయ సదస్సుకు చేయడానికి శ్రీకారం చుట్టడం, దానికి విశేష స్పందన లభించటం అనేవి సదస్సు విజయవంతం కావడానికి సంకేతాలు. దీనిని పుస్తక రూపంలో తీసుకురావాలని అనుకోవడం అనేది కూడా చాలా మంచి నిర్ణయం. ఈ సదస్సును ఈ స్థాయిలో నిర్వహిస్తున్న సందర్భంగా ఆచార్య విస్తాలి శంకరరావు గారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

వీరు ఇలాంటి బృహత్ కార్యక్రమాలు ఎన్నో, మరెన్నో చేయాలని, వీరు చేస్తున్న ఈ సదస్సు జయప్రదం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.....

- డా॥ జొన్నలగడ్డ వెంకటరమణ

డా. కోయి కోటేశ్వరరావు

పాలక మండలి సభ్యులు

మహాత్మగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ.

తెలుగు సహాయ ఆచార్యులు ,

ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్.



భమన్న సాహిత్యం పై కొత్త వెలుగులు ప్రసరిస్తున్న చారిత్రాత్మక సదస్సు

మహాకవిబోయి భీమన్నసాహిత్యం ఊట చెలిమ లాంటిది. తవ్వేకొద్దీ ఊట పై పైకి ఉబికి వచ్చినట్లుగా అధ్యయనం చేసే కొద్దీ భీమన్న సాహిత్యం సార్వకాలికమైన అనుభూతినికలిగిస్తుంది. సమకాలీన సమాజ వికాసానికి అవసరమైన సాంస్కృతిక విలువలను అందిస్తుంది.వజ్రానికి అనేక ముఖాలు ఉన్నట్లుగా భీమన్న సాహిత్యానికి కూడా బహుముఖీన పార్శ్వాలున్నాయి. ఈ వైవిధ్యాన్ని,సృజన వైదుష్యాన్ని అస్తిత్వ ఉద్యమాల ఎరుకతో ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసుకోవాల్సిన అవసరముంది. ఇందుకు సాహిత్య సదస్సులు మరింతగా దోహదపడతాయి. భీమన్న సాహిత్య పీఠం, భీమన్నసాహిత్య నిధిట్రస్ట్ తదితర సంస్థలు భీమన్న సాహిత్యం పై గతంలో అనేక సదస్సులు నిర్వహించాయి. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ అంతర్జాల సదస్సు ప్రతిష్టాత్మక మైనది. జాతీయ ,అతర్జాతీయ సాహితీవేత్తలు, అనుభవజ్ఞులైన ఆచార్యులు, పాతతరం కొత్త తరం పరిశోధకులు జిజ్ఞాసతో ఈ సదస్సులో పాల్గొంటున్నారు. చారిత్రాత్మకమైన ఈ సదస్సులో భారీ స్థాయిలో 88 మంది పరిశోధకులు తమ పత్రాలను సమర్పించటం అత్యంత అరుదైన విషయం. బహుశా ఇది ఒక రికార్డ్ కావచ్చు. ఆ పరిశోధనాపత్రాలతోకూడిన సంకలనాన్ని కూడా అంతర్జాల అంతర్జాతీయసదస్సు ప్రారంభసభలో ఆవిష్కరించటం అభినందననీయం. పత్రసమర్పకుల పట్ల వాత్సల్యం తో శ్రీమతి హైమవతీ భీమన్నగారు ఎంతో శ్రమకోర్చి భీమన్నరచనల PDF ప్రతులను అందరికీ అందుబాటులోవుంచారు. భీమన్న సాహిత్యాన్ని వడ్డించిన విస్తరి లాగా వాట్సాప్ గ్రూప్ లో పెట్టారు. పరిశోధకులకు కొంగుబంగారంగా నిలిచారు. ఉత్తమ పరిశోధనాపత్రాలకు ఆత్మీయంగా ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించి సదస్సుకుకొండంత ఉత్తేజాన్నిఅందించారు. అసాధారణ స్ఫూర్తిని అందించిన అమ్మగారికి ధన్యవాదాలు. సదస్సుసంచాలకులు ఆచార్య విస్తాలిశంకరరావుగారు పటిష్టమైన ప్రణాళికతో, అంకితభావంతో , నిబద్ధతతో మహత్తరమైన ఈసదస్సువిజవంతం కావడానికి బృహత్తరమైన కృషి చేశారు. వాట్సాప్ గ్రూప్ నే ఒక డిజిటల్ కార్యాలయంగా మలచుకొని మూడు వారాలపాటు అవిశ్రాంతంగా, బాధ్యతాయుతంగా శ్రమించడమేకాకుండా, ఈ సదస్సుద్వారా భీమన్నసాహిత్యం పై కొత్త వెలుగులు ప్రసరిస్తున్నఆచార్య శంకర రావుగారికి,వారి మిత్రబృందానికి హృదయపూర్వక అభినందనలు. శుభాకాంక్షలు.

'ధ్యేయమును బట్టి ప్రతి పనీ దివ్యమగును'



డా॥. ప్రసాద్ తోటకూర

తానా పూర్వాధ్యక్షులు మరియు
ప్రస్తుత "తానా ప్రపంచ సాహిత్య వేదిక" నిర్వాహకులు
డాలస్, టెక్సాస్, అమెరికా.

పద్మభూషణ్ బోయి భీమన్న

తాను పుట్టిన కులం కారణంగా తొలినాళ్లలో అంబేద్కర్ లాగా కొన్ని అవమానాలను ఎదుర్కొన్నా, ఎంతో పట్టుదలతో చదువుకుని, తన కలాన్ని అస్త్రంగా చేసుకుని ఆనాటి సమాజంలో ఉన్న అనేక రుగ్మతలపై పోరాడి విజయం సాధించిన ధీశాలి భీమన్న. తన 94 సంవత్సరాల జీవిత కాలంలో అనేక ఎత్తు పల్లాలను చవి చూసిన భీమన్న జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఎంతటి కష్టం వచ్చినా ధైర్యాన్ని కోల్పోకుండా సహనంతో, కృషితో విజయవంతంగా సాగించిన భీమన్న జీవితం భావితరాలకు ఆదర్శప్రాయం. వంద సంవత్సరాల క్రితం ఆనాటి సమాజంలో నెలకొనిఉన్న ఛాందస భావాల సంప్రదాయాల సాగరంలో మూఢనమ్మకాల మొసళ్ళను, తిమింగలాలను తప్పుకుంటూ సమవర్ధవంతంగా ఎదురీది కేవలం ఒడ్డుకు చేరుకోవడమే గాక సాహిత్య శిఖరాగ్రానికి చేరుకున్న సాహితీ స్రష్ట భీమన్న.

తన 80 ఏళ్ళ సాహితీ జీవితంలో పద్యం, వచనం, గేయం, నాటకం, భావ గీతాలు, సంగీత నృత్య రూపకాలు, విమర్శలు, వ్యంగ రచనలు, లేఖా సాహిత్యం మొదలైన అన్ని ప్రక్రియలలోనూ 70 కి పైగా రచనలు భీమన్న కలం నుండి వెలువడ్డాయి. నిర్మొహమాటం గా తాను చెప్పదలచుకున్న విషయాన్నిసూటిగా చెప్పడం, ఎలాంటి వర్గాల మెప్పుకూ ప్రాకులాడకుండా సాహిత్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సాహితీ స్రష్ట బోయి భీమన్న. అచంచలమైన ఆత్మ విశ్వాసం భీమన్న ఆస్తి.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి బోయి భీమన్న సాహిత్యంపై ప్రతిష్టాత్మక మద్రాసు విశ్వవిద్యాలయం వారు తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు గారి సారధ్యంలో రెండు రోజులపాటు అంతర్జాలంలో "బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన" అనే అంతర్జాతీయ సదస్సు జరపడం, సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతైనా ముదావహం. ఈ బృహత్తర ప్రణాళిక లో భాగస్వాములైన వారందరికీ ప్రవాసాంధ్రుల తరపున హార్ధిక శుభాకాంక్షలను అందజేస్తున్నాను.

ధన్యవాదాలు, బుధజన విధేయుడు

డా॥. ప్రసాద్ తోటకూర



శ్రీ సీతారం లంకా

ఫానెక్స్, అమెరికా.

శుభాభినందనలు

మహాకవిగా, కళావసంతగా, కళాప్రపూర్ణగా, పద్మభూషణ్‌గా ఇలా అనేక బిరుదులు అందుకున్న మహనీయుడు బోయి భీమన్న. వీరు సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. భీమన్న ప్రజల నాడిని తెలుసుకొని ప్రజల గురించి, ప్రజల కోసం, ప్రజల భాషలో కవిత్వం రాసిన ప్రజాకవిగా కీర్తికెక్కారు. జీవితం యొక్క తడి తెలిసిన వ్యక్తి కనుకే తన రచనలో సమాజాన్ని చైతన్యవంతం చేసే దిశగా వారి రచనలు చేస్తూనే, అంతర్లీనంగా అంబేద్కర్ భావజాలాన్ని అందులో ప్రవహింపజేశారు.

సమాజాన్ని నిత్యం దర్శిస్తూ అసమసమాజంలోని రుగ్మతలను బట్టబయలు చేశారు. వీరి పాలేరుగాని, గుడిసెలుకాలిపోతునైకాని, జానపదజాబులుకాని ఇలా అనేక రచనలు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా కూడా ఉన్నాయి. అంతేకాదు వాటి నిర్మూలనకై నిరంతరయాంగా అక్షర తూణీరాల్ని సంధిస్తూ 'నా కవిత లక్ష్యం/ చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు/ వాళ్ళను తిట్టైనా కొట్టైనా సరే అక్కడ నుండి లేపడం/ అరుణోదయం కేసి తరమడం' అంటూ పలికిన ఆ సాహితీ మూర్తి, చైతన్య శీలిని స్మరించుకుంటూ... మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా "బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన" అనే పేరుతో రెండు రోజులపాటు అంతర్జాల అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం ఆనందదాయకం.

ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టిన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యలు ఆచార్య విస్తాలి శంకరరావు, ఇతర అధ్యాపక వర్గానికి, వారి విద్యార్థులకు ఈ సదస్సుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినవారి అందరికి అభినందనలు. ఇలాంటి మహోన్నతమైన సదస్సులు మరెన్నో చేయాలని, చేయగలరని ఆశిస్తూ...

నమస్కారాలతో
మీ
సీతారం లంకా

కృతజ్ఞతలు

మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు "బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన"ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ముందుగా ఈ సదస్సు నిర్వహణకు అనుమతితో పాటు, ఎంతగానో ప్రోత్సహించిన మద్రాసు విశ్వవిద్యాలయం అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

పద్మశ్రీ బోయి భీమన్నగారి సాహిత్యంపై సదస్సును నిర్వహించాలని నిర్ణయించినప్పుడు ప్రధానంగా ఏర్పడిన సమస్య భీమన్నగారి రచనలు అందుబాటులో లేకపోవడం. భీమన్నగారు ముద్రిత రచనలే మొత్తం 70 దాక ఉన్నాయి. వాటిలో అనేకం ప్రజా బాహుళ్యంలో ఉన్నవే. ఈ సమస్యను అధిగమించడం ఎంతో కష్టమైంది.

అదే సమయంలో మిత్రుడు డా॥ యం. ప్రసాద్ తన దగ్గర ఉన్న కొన్ని పుస్తకాలు పి.డి.యఫ్ ను పంపడంతో కొంత ఉపసమనం కలిగింది. అందుకు మిత్రునికి కృతజ్ఞతలు.

భీమన్నగారి పుస్తకాలు పేర్లు అన్నీ వెలుగులోకి వచ్చిన తరువాత పరిశోధకులు ఆ పుస్తకాల కోసం ఎంతో శ్రమించారు. అయినా అందుబాటులో లేక వాటి కోసం నాతో సంప్రదిస్తుంటే నాకు అయోమయంగా ఉండేది. అలాంటి సమయంలో పద్మభూషణ్ బోయి భీమన్నగారి సతీమణి శ్రీమతి హైమవతి భీమన్న గారు తమ దగ్గర ఉన్న భీమన్నగారి రచనలు అన్నీ పి.డి.యఫ్ రూపంలో అందుబాటులోకి ఉంచేసరికి వ్యాసరచయితల్లో ఎంతో ఆనందం కనిపించేది. దానితో ఏ ఉద్దేశంతో అయితే నేను సదస్సును నిర్వహించాలని సంకల్పించానో ఆ మార్గం మరింత అందమైన పూలబాటలా మారింది. కనుక ఈ నేపథ్యంలో శ్రీమతి హైమతి భీమన్న గారికి ఈ సదస్సు పక్షాన, పరిశోధక మిత్రులు పక్షాన, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఎప్పుడైతే భీమన్నగారి రచనలు అందుబాటులోకి వచ్చాయో పరిశోధక మిత్రులు వైవిధ్యమైన అంశాలతో విశిష్టమైన పరిశోధనా వ్యాసాలను అందించారు. అంతేకాక ఉత్తమ పరిశోధనా వ్యాసాలకు కూడా రూ. 10,116/-, రూ. 5,116/-, రూ. 3,116/-, రూ. 1,116/- లు బహుమతులుగా ప్రకటించడంతో వ్యాస రచయితలలో మరింత ఉత్సాహంతో ఉత్తమమైన వ్యాసాలు అందించారు. అందుకు శ్రీమతి హైమవతి భీమన్న గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.

ఈ సదస్సు మొత్తం 85 పత్రాలు వచ్చాయి. అవి అన్ని పుస్తక రూపంలో తీసుకురావాలనే ఆలోచనలో భాగంగా మిత్రులు డా. బూసి వెంకటస్వామికి సంప్రదించగా 'భావవీణ' పత్రికలో ప్రచురించడానికి అంగీకరించినందుకు డా. బూసి వెంకటస్వామి గారికి, పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన మిత్రులు ప్రకాష్ గారికి, వారి బృందానికి కృతజ్ఞతలు.

సదస్సు నిర్వాహణలో ఆహ్వాన పత్రిక కీలకమైన అంశం. ఈ సదస్సుకు సంబంధించి మూడు రకాల ఆహ్వాన పత్రికలను, అలాగే అందమైన బ్యానర్‌ను తయారు చేసి సకాలంలో అందిస్తూ, సదస్సును

మరింత వేగం చేసిన సోదరులు, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షులు డా॥ జొన్నలగడ్డ వెంకటరమణకు హృదయపూర్వక నమస్సులు.

ప్రారంభ సమావేశంలోను, సమాపనోత్సవంలోను కీలకోపన్యాసాలు చేయడమేకాక అనునిత్యం వెన్నంట ఉంటూ ప్రోత్సహిస్తూ తగిన సలహాలిస్తున్న సాహితీవేత్తలు హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, ప్రభుత్వ సిటి కళాశాల, హైదరాబాదు ఆచార్యులు, మిత్రులు డా॥ కోయి కోటేశ్వరరావుగార్లకు కృతజ్ఞతలు.

ఈ సదస్సు ప్రత్యేక సంచికకు తమ అమూల్యమైన అభిప్రాయాలు అందించిన మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ పూర్వఅధ్యక్షులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, శ్రీమతి హైమవతి భీమన్న మొదలైన వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సదస్సు వివరాలను నలు దశలకు వ్యాప్తి చేసిన పత్రికలు ఆంధ్రజ్యోతి, ఈనాడు, సాక్షి, చెన్నై తెలుగు న్యూస్ టైమ్స్ మొదలైన పత్రికల అధికారులకు ధన్యవాదాలు.

ఒక సదస్సు నిర్వహించడమంటే ఎంత కష్టమో, అది విజయవంతం కావాలంటే దాని వెనుక ఎందరో శ్రమ దాగి ఉంటుంది. అలా నాకు వెన్నుదన్నుగా నిలిచినవారేకాక ఈ సదస్సుకు సహ సంపాదకులుగా ఉన్న మద్రాసు విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా॥ పాండురంగం కాళియప్ప, డా॥ మాదా శంకరబాబు లకు ధన్యవాదాలు.

తెలుగుశాఖ నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలకభూమికను పోషించేవారు విద్యార్థులు. వారి శ్రమకు వెలకట్టలేము. ముఖ్యంగా పరిశోధక మిత్రులు మన్నారు కోటీశ్వర్లు, పులి జ్యోతి, ఎస్. శశికళ, ఉసురుపాటి లావణ్య, జి. రోజా, వి. నీలిమ, దాసరి శాంతి మొదలైన వారికి ఆశీస్సులు. వారు ఉన్నతంగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నాను.

ఈ సదస్సులో అతిథులుగా పాల్గొన్నవారు శ్రీ కె. అనిల్‌కుమార్ రెడ్డిగారు, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌గారు, శ్రీ తోటకూర ప్రసాద్(అమెరికా), డా॥ శ్రీగణేశ్ తొట్టెంపూడి (జర్మని), శ్రీ మోటమర్రి సారధి గారు (ఆస్ట్రేలియా), శ్రీ సీతారాం లంకా (అమెరికా), ఆచార్య ఏటూరి జ్యోతి, డా. జి. వెంకట రామయ్య, డా.భూక్య తిరుపతి, శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, డా. యజ్ఞశేఖర్, శ్రీమతి మంగిపూడి రాధిక గార్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

ఈ అంతర్జాతీయ సదస్సు దిగ్విజయంగా పూర్తికావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను.

మీ

ఆచార్య విస్సాప్రగడ శంకరరావు

Contents (విషయ సూచిక)

1. బోయిభీమన్న సాహిత్యం - భారత జాతీయ దృక్పథం	- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు	23
2. రాగవాశిష్ఠం - సామాజిక చైతన్యం	- భీమవరపు వెంకటేష్	26
2. ఋషివంటి భీమన్న రెండవ వ్యాసుడు	- డా॥. సిహెచ్. బాబావలిరావు	29
3. బొయి భీమన్న కవిత్వం - సామాజిక దృక్పథం	- బసవరాజప్ప	34
4. బోయిభీమన్న కవిత్వం - వర్ణ భేద రాహిత్యం	- సి.హెచ్. రాధాకృష్ణ	37
5. పాలేరు నాటకం - దళిత చైతన్యం	- డా॥. కె. చెన్నకేశవ రెడ్డి	40
7. 'గుడిసెలు కాలిపోతున్నై - సామాజిక దృక్పథం	- డా॥. జరుపుల రమేష్	43
8. పాలేరు నాటకం - ప్రగత శీలదాయకం	- డా॥. వై.వి.సి.హెచ్ లీలాపద్మజ	52
9. డా॥ బోయిభీమన్న గారి సాహిత్యం - రసపోషణ	- డా॥. పులపర్తి శ్రీనివాసరావు	56
10. బోయి భీమన్నగారి 'కుల నిర్మూలన' - అనువాద నైపుణ్యం	- డా॥. యం. ప్రసాద్	60
11. ఆధునిక దళిత మహాకవి - బోయి భీమన్న	- ఆచార్య ఎం.రామనాథం నాయుడు	65
12. తమస్సుపై దండయాత్ర - దీపసభ	- డా॥. టేకుమళ్ళ వెంకటప్పయ్య	69
13. భీమన్న 'త్రిపద'లు - హేతువాద గుళికలు	- డా॥. పి. జయచంద్రుడు	73
14. బోయిభీమన్న రచన 'ధర్మం కోసం పోరాటం' దళిత చైతన్యం	- కె. అనిల్ బాబు	77
15. బోయి భీమన్న 'ఉగాదులు' కవిత్వం - సామాజికత	- భూక్యా కాశీరామ్	80
16. ఓటరు జాబితాపై భీమన్న స్వరం	- కోష్ట గోవిందరావు	84
17. రాగవాసిష్ఠం - నాటక వైశిష్ట్యం	- డా॥. బి. మల్లికార్జున రాజు	89
18. "మానవ వ్యక్తిత్వానికి మార్గదర్శకత్వం-డా॥. బోయి భీమన్న వచన కవిత్వం"	- మామిడి మౌనిక	93
19. కూలీరాజు నాటకం - సామాజిక చైతన్యం	- డా॥. జూరెడ్డి నిర్మల	97
20. బోయిభీమన్న సాహితీవ్యాసాలు - పురాణాలలో హరిజన మనీషులు..	- రుద్రపాక జితేంద్ర కుమార్	101
21. పాలేరు సాంఘిక నాటకం - పాత్రల వైశిష్ట్యం	- డా॥. గుమ్మడి రామలక్ష్మి	104
22. డా॥. బోయి భీమన్న సాహిత్యం - ఆదిమ గిరిజనుల దృక్పథం	- డా॥. నునావత్ రాంబాబు	109
23. బోయి భీమన్న గారి "పడిపోతున్న అడ్డగోడలు" - సమసమాజ స్థాపన	- డా॥. జి. శైలమ్మ	117
24. నీవే మైనా చేయగలవు	- డా॥. యస్.సి. సంజీవ రెడ్డి	122
25. డా. బోయి భీమన్న 'అంబేడ్కరిజం' గ్రంథం - మౌలికాంశాలు	- డా॥. గిన్నారపు ఆదినారాయణ	124
26. రాగవాసిష్ఠం - పరిచయం	- డా॥. ఎ. ఆంబ్రూణి	129
27. బోయి భీమన్న కవిత్వం - హేతువాదం	- డా॥. దార్లపూడి శివరామకృష్ణ	135
28. "అకాండ తాండవం" కావ్యంలో బోయి భీమన్న ఆధ్యాత్మిక చింతన	- డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి	137

29. బోయి భీమన్న - అంబేద్కరిజం - డా॥. జి.దయామణి 141
30. కూలిరాజు నాటకం వైశిష్ట్యం - డా॥. ఎన్. ఎలిజబెత్ జయకుమారి 145
31. విప్లవాత్మక అభ్యుదయ నాటకం - పాలేరు - డా॥. కసుకుర్తి ఈశ్వరమ్మ 150
32. ప్రతీకల కవిత్వం... గుడిసెలు కాలిపోతున్నై - భమిడిపాటి గౌరీశంకర్ 153
33. అభ్యుదయ దృక్పథాన్ని ప్రతిబింబించిన "పాలేరు" నాటకం - షేక్ జరీనా 156
34. "బోయి భీమన్న సాహిత్యం - సామాజిక దృక్పథం" - కొనుకు శ్రీనివాసరావు 160
35. "అనాదికొన నుంచి అనంతత్వంలోకి" ఒక పరిచయం - డా॥. వి.కె.టి. మహాలక్ష్మి 163
36. పడిపోతున్న అడ్డుగోడలు - సామాజిక స్పృహ - అలువాల మహేందర్ 167
37. అంబేడ్కర సుప్రభాతం - బోయి భీమన్న దృక్పథం - జాగర్ల మహేందర్ 170
38. బోయి భీమన్న నాటకాలు - సామాజిక దృక్పథం - డా॥. లింగాల మంగమ్మ 174
39. 'జన్మాంతర వైరమ్' - సమాకాలీనత - డా॥. ఎం.మురళి 180
40. బోయి భీమన్న జానపదుని జాబులు - సమసమాజ కాంక్ష - మళ్ళా పెంచల ప్రసాద్ 184
41. బోయి భీమన్న కవిత్వం - వస్తు వైవిధ్యం - ఆర్. లక్ష్మీ ప్రసన్న కుమార్ 188
42. బోయి భీమన్న పేరడీలు - డా॥ జి. రవికుమార్ 193
43. పాలేరు నాటకం - పాత్రలు, విశ్లేషణ - సి. రవీంద్ర 197
44. డా. బోయి భీమన్నగారి జీవితం - వ్యక్తిత్వం - డా॥. సత్యగాయత్రి జనమంచి 200
45. డా. బోయి భీమన్న 'రాగవాసిష్ఠం' నాటకం - విశ్లేషణ - డా॥. కటుకం శారద 205
46. భీమన్న గారి సాంఘిక విజయం - పాలేరు నాటకం - డా॥. పట్టపు శివకుమార్ 210
47. బోయి భీమన్నలో వైరుధ్య దృక్పథాలు - డా॥. పెళ్లూరు సునీల్ 213
48. దళిత చైతన్య దీప్తి - పంచమ స్వరం - డా॥. సంగుల సునీల్ కుమార్ 218
49. ప్రశ్నించే ధిక్కార స్వరం భీమన్న "ఒంటరి గొంతు" - ఆర్. ఎన్. స్వరూప 222
50. "త్రి పదలులోని తాత్విక వికాసం" - తుమ్మలపల్లి సోమశేఖర్ (తుషా) 225
51. సామాన్యుడి దీపసభ - డా॥. పోగుల విశ్వ ప్రసాదు 229
52. ఆత్మాశ్రయ కవిత్వ కౌశలం - బోయి భీమన్న - డా॥. జి. అరుణ 233
53. జానపదుని జాబులులో గ్రామీణ ఆర్థిక స్థితిగతులు - డా॥. బి. భీమమ్మ 236
54. తెలుగు సాహితీ మెరునగ ధీరుడు బోయి భీమన్న - భూతం ముత్యాలు 241
55. డా.బోయి భీమన్న నాటక సాహిత్యం - సామాజిక విశ్లేషణ - డా॥. ఈతకోట ఈశ్వరరావు 244
56. డా. బోయి భీమన్న త్రిపదలు - పరిశీలన - డా॥. కసప నరేందర్ 248
57. సమాజ చైతన్య సాహితీమూర్తి - బోయి భీమన్న - డా॥. మూడే నాగేంద్ర నాయక్ 253
58. వాకిట్లో వసంతలక్ష్మి - భీమన్న వాదం - పట్నాన ధర్మారావు 256
59. భీమన్న కవితలు ... సామాజిక సందేశాలు - డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ 260
60. బోయి భీమన్న - సర్యోదయ భావనే - దీప సభ - యం. ప్రదీప్ 263
61. ప్రణయ కవిత్వానికి ప్రతిబింబం - బోయిభీమన్న "బొమ్మ" - డా॥. ఇస్తర్ల ప్రసూన కుమారి 266

62. ఆధునిక తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ సుప్రభాతం - డా॥. తరపట్ల సత్యనారాయణ 270
63. పాలేరు నాటకంలోని సాహిత్య సౌందర్యం - డా॥. సూరపరాజు వసంత కుమారి 275
64. బోయిభీమన్న బాలయోగీయం - ఆధ్యాత్మిక సామాజిక దృక్పథం... - అతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) 279
65. 'ఒంటరిగొంతు' కవిత్వం - వస్తు వైవిధ్యం - డా॥. బి. విజయ్ కుమార్ 283
66. జానపదుని దర్శనం - సామాజిక జీవనం - డా॥. ఉడాలి విష్ణుప్రియ 287
67. పాలేరు నాటకంలోని దళిత జీవన చిత్రం - డి. పవిత్ర 291
68. బోయి భీమన్న ప్రగతి పాత్ర - స్త్రీ చైతన్యం - పి. జ్యోతి 295
69. సమరస భావవికాసమే బోయి భీమన్న స్వప్నం - డా॥. పాండురంగం కాళియప్ప 300
70. డా. బోయి భీమన్న - అంబేడ్కర మతం - సమాలోచన - డా॥. ఎల్. కస్తూరి 306
71. వాస్తవిక చిత్రణలో జీవ చైతన్యం - భీమన్న సాహిత్యం - యం. కోటిశ్వరులు 311
72. అసూయ నాటకంలో - బోయి భీమన్న ఆశించిన గ్రామ పున:ర్నిమాణం - యు. లావణ్య 318
73. లేఖాసాహిత్యంలో "జానపదుని జాబులు" - విశిష్టత - డా॥. మాదా శంకరబాబు 321
74. జగత్ సత్యం బ్రహ్మమిథ్య - భీమన్న సమసమాజ దృక్పథం - డా॥. టి. మోహనశ్రీ 327
75. భీమన్న ప్రాచీన - ఆధునిక కవిత్వాలకు వారిధి - డా॥. మందలపు నటరాజ్ 331
76. బోయి భీమన్న - చాండాలిక రచనా వైభవం - డా॥. పి. ఎస్. మైథిలి 335
77. బోయి భీమన్న జీవితం - సాహిత్యం - ఎస్. శశికళ 338
78. డా. బోయి భీమన్న గారి సాహిత్యంలో వార్ధక్యం - డా॥. గురజాడ శోభా పేరిందేవి 344
79. బోయి భీమన్న సృష్టి రహస్యం - బ్రహ్మ ఐదవ ముఖం సమాన భావన - కాపర్తి స్వరాజ్యం 348
80. గుడిసెలు కాలిపోతున్నై - సామాజిక చైతన్య భూమిక - డా॥. బూర్గుల స్వరూప 354
81. బోయి భీమన్న ఆశించిన నవ సమాజం - ఆచార్య విస్తాలి శంకరరావు 356
82. బోయ భీమన్న పాటల్లో సామాజిక సందేశం - డా॥. కె.వి.యన్.డి. వరప్రసాద్ 359
83. బోయి భీమన్న 'చండాలిక' - దళితుల చిత్రణ - డా॥. జె. వెంకటరమణ 363
84. నవీన సాహిత్య దార్శనికుడు డా॥. బోయి భీమన్న - డా॥. కోయి కోటేశ్వరరావు 367
85. పాలేరు నాటకంలో సాంఘిక, మత పరిస్థితులు - డా॥. డి. నల్లన్న 371
86. పాలేరు నాటకం - బోయిభీమన్న సామాజిక స్వప్నం - డా॥. గోపవరం పద్మప్రియ 374
87. బోయి భీమన్న - దువ్వు సూరిబాబు 378
88. "మానవతా విలువలను నిలుపుటద్దం-గుడిసెలు కాలిపోతున్నై" - డా॥. పెండ్యాల లావణ్య
- డా॥. బూసి వెంకటస్వామి 380
89. సమకాలీన సామాజిక స్పందన బోయి భీమన్న పిల్లి శతకం - డా॥. కె. రమేశ్ 385
90. బోయి భీమన్న పౌరాణిక నాటకాలు - హేతువాద దృక్పథం - డా॥. రత్నశేఖర్ కట్టెపోగు 391
91. బోయి భీమన్న సాహిత్యం - ఇతివృత్త వైవిధ్యం - లోపింటి గిరీష్ కుమార్ 398
92. "హరిజనులు ఆర్యులే" బోయి భీమన్న వాదం - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న 401

బోయిభీమన్న సాహిత్యం – భారత జాతీయ దృక్పథం

– ఆచార్య దొర్ల వెంకటేశ్వరరెడ్డి, తెలుగుశాఖ అధ్యక్షుడు, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్,
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

డా॥ బోయి భీమన్న సుమారు 70 పుస్తకాల్ని రాసినట్లు తెలుస్తుంది. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకా లను కూడా రాశారు. వివిధ పుస్తకాలకు రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్నేవో కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని రాశారు. వీటన్నింటితో పాటు అంబేద్కర్ రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశారు.వీరు రాసిన "జయ జయ జయ అంబేడ్కర!" దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతుంది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డా॥బోయి భీమన్న పేరుతో ఒక సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసి, వీరి రచనలన్నింటినీ ప్రచురిస్తున్నారు. నిజానికివన్నీ విశ్లేషిస్తే గాని, భీమన్న సమగ్ర సాహిత్య దృక్పథం స్పష్టం కాదు. ఈయనే కాదు, ఏ రచయిత దృక్పథాన్నైనా అంచనా వేయాలంటే, వివిధ పరిణామాలుగా సాగిన రచన లన్నింటినీ స్పర్శించగలిగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. అలా కాకుండా, దళిత పదాన్ని ప్రయోగించలేదనీ, దాన్ని వ్యతిరేకించాడనీ, భారతదేశంలో కులం లేదన్నారనీ, ఆయన వర్గాన్నే సమర్థించారనీ, కులం గురించి రాయలేదనీ వక్రీకరించే వాళ్ళని చూసిన తర్వాత ఆయన సాహిత్యదృక్పథాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందని పిస్తుంది.

ఇప్పటికే అనేకమంది భీమన్న రచనలపై పరిశోధనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ సదస్సులు జరుగు తున్నాయి. వీటన్నింటికీ ఒక మార్గదర్శనాన్ని కల్గించిన గ్రంథం ఒకటి ఉంది. అది శ్రీమతి హైమావతీ గారు చక్కని కథనాత్మక శైలిలో రాసిన "పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయిభీమన్న" గ్రంథం. ఇది వీరి సాహిత్య దృక్పథాన్ని తెలిపే చుక్కానిలాంటిది. దానిలోని సూచనల్ని గమనిస్తే, ఆయన రాసిన రచనల్లో పరిశోధకులకు, విమర్శకులకు తమదైన విశ్లేషణకు ప్రేరణ దొరుకు తుంది. భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం'లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుందనీ, ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయ వాది అనీ ఆ గ్రంథం ప్రతిపాదిస్తుంది.

భారతజాతీయదృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాలి. అంబేద్కర్ విశ్లేషించిందీ, భీమన్న రాసిందీ అదే! తన జీవితాంతం ఆయన జాతీయవాదిగానే ఉన్నారు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయవాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష ఉంటుంది.

ఒకప్పుడు "బ్రాహ్మణ" శబ్దాన్ని చదువుకున్నవాళ్ళకీ, ఆలోచనాపరుల్నీ సూచించడానికీ ప్రయోగించారు. సామాజిక నిర్మాణంలో చాతుర్వర్ణవ్యవస్థలోకి చేరిన తర్వాత కులసూచికగా మారిపోయింది. తమ తెలివి తేటలతో ఆధిపత్యంలో ఉన్న వాళ్ళు, క్రమేపీ ఒక వర్గంగా తయారైయ్యారు. ఈ ఆలోచనాపరులు ఒక క్రమబద్ధమైన జీవన విధానాన్ని మతమని ప్రబోధిస్తూనే, ఆచార, వ్యవహారాల పేరుతో, కర్మ సిద్ధాంతం వైపు నడిపించుకొని పోయిన హిందూమతంపైనే డా॥ అంబేద్కర్ ముందుగా తన దృష్టిని కేంద్రీకరించారు. కొన్ని వందల సంవత్స రాలుగా పాతుకుపోయిన హిందూమతంతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్న వాళ్ళు, తమకు బోధించిన ధర్మ

శాస్త్రాల వల్ల మానసికంగా, అస్పృశ్యులుగా ఉండిపోవ డానికైనా సిద్ధపడతారు. పురాణేతిహాసాలు, సంప్రదాయ సాహిత్యాల పేరుతో పాలకవర్గాలతో "ఆలోచనాపరులు" కలిసి కొనసాగించిన కుట్ర ఫలితంగా, నేటికీ కులాధిపత్య సాహిత్యమే ఉత్తమసాహిత్యంగా కొనసాగిపోతోంది. దురదృష్టమేమిటంటే, నాటి భావజాలాన్ని నేటికీ కొన సాగించడాన్ని ఆ భావజాలం వల్ల నష్టపోయిన, ఇంకా నష్టపోతున్న వాళ్ళు వ్యతిరేకిస్తుంటే, నాటి ఆధిపత్య భావజాలానికి ప్రతినిధుల్లా వాటిని సమర్థించేవాళ్ళు కొంతమంది తయారయ్యారు. అందుకనే తన ప్రజలంతా దేని వల్లనెక్కడ మోసపోతున్నారో, దాన్నుండి రక్షించు కోవడానికి ప్రత్యక్షంగా సామాజిక ఉద్యమాన్ని నడిపే బాటలో పయనించిన వాడు అంబేద్కర్. అలాంటి ఆశయాన్నే సాహిత్యంలో కొనసాగించిన రచయిత బోయిభీమన్న కూడా!

డా॥ బోయిభీమన్న సమగ్రసాహిత్యం పేరుతో మొదటి సంపుటిని తెలుగు విశ్వవిద్యాలయం వారు ఇటీవలే విడుదల చేశారు. దీనిలో "పాటలలో అంబేద్కర్" (పుటలు : 306 - 462) ఉంది. దీనిలో అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని వర్ణించిన 118 పాటలున్నాయి. దీనిలోనే భీమన్న అనేక పాటల్లో దళిత పదాన్ని ప్రయోగించారు. కానీ, దళిత పదాన్ని వాడడం ఇష్టం లేదని ఆయన తన చివరి రోజుల్లో ప్రకటించారు. దానికి అనేక కారణాలున్నాయి. దాన్ని మరోసారి చర్చించు కుందాం."దళిత జనులకంబేడ్కరు, ధర్మమె మత మన్నాడు, బౌద్ధధర్మమొకటేరా, భారతీయమన్నాడు" అని ఒక చోట, " దళితులనుద్ధరించని ధర్మం కుంటి దంటూ.." ఒక పాటకు దళిత పదాన్ని శీర్షికలోనే పెట్టి మరీ మరోచోట రాశారు. దళితుల్ని ఈయన అవర్ణులు, పంచములు, హరిజనులనే పేర్లతో వర్ణించడం కని పిస్తుంది. కులనిర్మూలనను బలంగా వ్యతిరేకించిన నాటకం పాలేరు. 1988 నాటికి పాలేరు నాటకానికి ఏభై యేళ్ళొందని రచయితే చెప్పుకున్నారు. అంటే, ఆ నాటకం 1938లో రాసినట్లు స్పష్టమవుతుంది.

భీమన్న రాసిన "పాలేరు" నాటకంలో వెంకన్నావన బాలల ప్రేమకథలోను,1959లో రాసిన "రాగవాసిష్ఠం" నాటకంలో గల అరుంధతీవశిష్ఠుల ప్రణయగాథలోను, మరికొన్ని రచనల్లోను కులాంతర వివాహాల పేరుతో కులనిర్మూలన అవకాశాల్ని చర్చించారు.

సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు. పాలేరుగా పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవమర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెండ్లి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సి వస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుభేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు.చివరికి "ఉపకారి" మాస్టారు సహాయంతో చదువుకుని వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డు కుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సాహించే వాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని దీని ద్వారా ప్రేరేపించారు రచయిత.

సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కాదనీ, మంచి వాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. ఈ పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుంటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర?కులతత్వ వాదులు లేని వాళ్ళూ ఉం టారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు.

వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి, తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మసిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణభూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా వివరించారు. నిజజీవితంలో అటు అంబేద్కర్, ఇటు భీమన్న ఇరువురి జీవితాల్నీ పాలేరు

నాటకం స్ఫురింపజేసేటట్లుంది. ఇరువురూ కులం వల్ల అనేక అవమానాల్ని ఎదుర్కొన్నవాళ్ళే. ఇరువురూ చదువు కోవడం వల్లనే అనేకమంది దళితులకి ఆదర్శం కాగలి గారు. యాదృచ్ఛికంగా ఇరువురూ కులాంతర వివాహాలనే చేసుకున్నారు. తాము చెప్పిన వాటిని నిజజీవితంలో ఆచరించి చూపి మరీ ఆదర్శవంతులెయ్యారు.

రాగవాసిష్ఠంలో అరుంధతీదేవి మాహాత్మ్యాన్ని వివరించడానికి, పురాణేతిహాసాల్లోని కులాంతర వివాహాల్ని సృజనీకరణ ప్రతిభతో భారత జాతీయదృక్పథాన్ని ప్రదర్శించారు. దీనికి ఆర్యద్రావిడ వాదాల్ని కూడా నాటకంలో అంతర్భాగం చేశారు. సనాతన సంప్రదాయ వాది భావాల్ని "ప్రాచీనుడు" అనే పాత్ర ద్వారా వర్ణించారు. నిష్కళంకమైన ప్రేమకు సంప్రదాయం ఎలా అడ్డంకిగా మారుతుందో వివరిస్తూనే, ఆ ప్రేమలో నిజాయితీ ఉంటే, అన్నింటినీ జయిస్తుందని నిరూపించారు. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు తోడ్పడతాయని చెప్పినట్లైనా, తర్వాత వాళ్ళకు పుట్టే పిల్లల సామాజిక స్థితి గతుల్ని చర్చించవలసిన అవసరం ఉంది. నేడు కులాంతర వివాహాలు జరిగినా, మళ్ళీ తండ్రిది గానీ, తల్లిదిగాని కుల గుర్తింపేవస్తే, కుల నిర్మూలన జరిగినట్లెలా అవుతుందో ఆలోచించాల్సిందే!

"గుడిసెలు కాలిపోతున్నై" (1973) కావ్యంలో ఏడాదికోసారి దళితుల గుడిసెలెందుకు కాలిపోతున్నాయో, మరలా కొత్తగుడిసెలు మాత్రమే ఎందుకు వస్తున్నాయో ఓట్లకోసం వచ్చేవారిని నిలదీసే చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులకు, పాములను కులదోపిడీదారులకు ప్రతీకలుగా చేసి దానిలో వర్ణించారు. దళితుల మధ్య ఉండాల్సిన సమైక్యత ప్రబోధిస్తారు. తమని "కూలిరాజు" (1946) నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడా స్పర్శించారు."ధర్మం కోసం పోరాటం""లో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించడానికి సూచనలు చేశారు.

వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదల్కొన వాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు రాసిన భారత, రామాయణ, భారతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

హింసావాదానికి భీమన్న వ్యతిరేకి. దళితులందరూ శ్రామికులనే వారిని భీమన్న వ్యతిరేకించారు. కమ్యూనిస్టుపార్టీలో పనిచేసి, కులం, వర్గం వేరని వాదించిన కోనాడ సూర్యప్రకాశరావుకి పాలేరు నాటకాన్ని అంకితమిచ్చారు. భీమన్న రచనల గురించి మాట్లాడుతున్న వాళ్ళు మూడు ప్రధానాంశాల్ని గుర్తించాలి. ఆర్య - అనార్య సిద్ధాంతాన్ని అంబేద్కర్ ఆలోచనతోనే 'రాగవాసిష్ఠం' లాంటి నాటకాన్ని రాశారు. రెండవది వర్ణం విషయంలో భారత దేశంలో కులమనే అవగాహన చేసుకోవాలి. ఇది ప్రపంచ దేశాలన్నింటికీ సమన్వయించినప్పుడు కుదరదు. దీన్ని కూడా అంబేద్కర్ ఆంత్రోపాలజీ, సామాజిక శాస్త్రాల్ని ఆధారంగా చేసుకుని చెప్పిన సిద్ధాంతమే. దీన్నే భీమన్న కూడా తన రచనల్లో సమన్వయించారు. పాలేరు నాటకానికి రాసిన ముందుమాటలో భీమన్న స్పష్టంగానే వర్గం,కులం పట్ల తన అభిప్రాయాల్ని ప్రకటించారు. "భారత్‌లో వర్గపద్ధతి (class) లేదు. వర్ణవ్యవస్థ అంటే కుల వ్యవస్థ (caste system) వుంది. ఇక్కడ కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి" అన్నారు. వర్గపోరాటాలు జరుగుతున్న తీరుని విమర్శిస్తూ " నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టి మాత్రమే కలిగిన ధనిక సవర్ణులు" అని ప్రకటించారు. ఇంత స్పష్టంగా కులనిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయసదస్సుల్లో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. మూడవది వర్ణాంతవివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్నీ బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలనమే భీమన్న సాహిత్యమని గుర్తించాల్సి ఉంది.

రాగవాశిష్ఠం - సామాజిక చైతన్యం

- భీమవరపు వెంకటేష్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సాహిత్యం అనాదికాలం నుండి మానవ జీవితంలో ఒక భాగంలా ఉంటూ వస్తుంది. ఆదికవి నన్నయ నుండి తెలుగు సాహిత్యం రాజాస్థానాల పోషణలో పండితులకు పట్టుపరుపులా ఉంటూ, సామాన్యులకు మేరు పర్వతంలా తయారైంది. ఆధునిక సాహిత్యం వచ్చే వరకు సామాన్యుడి చెమట చుక్కను గుర్తించలేదు. సాహిత్య ప్రక్రియలో కథ, నవల, నాటకం, కవిత్వం వచ్చి సామాన్యుల జీవితాలకు అద్దం పట్టాయి. సాహిత్యం సామాన్యులకు మరింత దగ్గరయింది. 'హితేన సహితం సాహిత్యం' అనే వాక్యానికి నిజమైన అర్థం, పరమార్థం ఆధునిక సాహిత్యం వల్లే సార్థకమయింది. సాహిత్యాన్ని సామాన్యులకు చేరువ చేసిన వారిలో బోయి భీమన్న గారు ముందు వరుసలో ఉండవలసిన వారని ఘంటా పథంగా చెప్పవచ్చు. దానికి ఆయన రచనలే అక్షర సాక్ష్యాలు.

తెలుగు సాహిత్యంలో దాదాపుగా అన్ని ప్రక్రియలలో రచనలు చేసిన భోయి భీమన్న గారు 1911 సెప్టెంబరు 19న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించారు. భీమన్న కుటుంబంలో అన్నదమ్ములు ఐదుగురు ఉండేవారు. వారికి పంచపాండవుల పేర్లను పెట్టారు. భీమన్న గారు 2వ సంతానం కాబట్టి అందు వలన ఆయనకు భీముడు పేరు వచ్చేలా ఆ పేరు పెట్టారు. దళిత పాలేరు ఇంట జన్మించిన భీమన్న పేదరికంతో పాటు అంటరానితనం వంటి దురాచారాలు కూడా అనుభవిస్తూనే పెరిగారు. సహజంగానే ఆయన వీటిని నిరసించాడు. ఆ ప్రభావంతో అంటరానితనాన్ని రూపుమాపాలనే ఉద్దేశ్యంతో చేసిన రచనలు చాలా ఉన్నాయి. పాలేరు, కూలిరాజు, గుడిసెలు కాలిపోతున్నై మొదలయిన రచనలు చేశారు. గుడిసెలు కాలిపోతున్నై రచన ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టింది. భీమన్నగారు దశాధికంగా నాటక రచన చేశారు. వాటిలో పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, పడిపోతున్న గోడలు, రాగవాశిష్ఠం మొదలైన ప్రముఖ నాటకాలు ఉన్నాయి. సామాజిక చైతన్యం, సమానత్వం లక్ష్యాలుగా చేసుకొని రచించిన రాగవాశిష్ఠం నాటకం గురించి మనం తెలుసుకుందాం.

'కావ్యేషు నాటకం రమ్యమ్' అని ఆర్యోక్తి. దృశ్య కావ్యమైన నాటకం అక్షర నిరక్షరాస్యత భేదం లేకుండా జన బాహుళ్యంలోనికి వేగంగా ప్రసరిస్తుంది. అందుచేతనే భీమన్నగారు ఈ ప్రక్రియను చేపట్టి, పౌరాణిక పాత్రలను ఎంచుకొని పురాణ సంబంధి అయిన ఇతివృత్తంను సాంఘిక ఇతివృత్తంగా మలచుటలో సఫలులయ్యారు. 1959లో 12 రంగాలతో రచించిన ఈ నాటకము తాలూకు బీజము ఆయన విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే ఈ నాటకము రాయడానికి పురికొల్పిందనీ, అంతేగాక 'హరిజనులు ఆర్యులే' అని ఋజువు చేసేందుకు గల కారణాలను కూడా ప్రస్తావనలోనే వివరంగా పేర్కొన్నారు.

రాగవాశిష్ఠం ఇతివృత్త విషయముకు వస్తే పంచమ కన్య అయిన అరుంధతి - తపోధనుడు, బ్రాహ్మణ శ్రేష్ఠుడైన వశిష్టుని ప్రేమ కథయే ఈ నాటకం ఇతివృత్తం. వశిష్టుడు, అరుంధతి, సంధ్య, ప్రాచీనుడు, కులగిరి, శివోహం, పరమశివుడు మొదలైనవి ముఖ్యపాత్రలు. మేలుకో మేలుకో అంటూ సంధ్య పాత్ర ద్వారా నాటకం ప్రారంభమవుతుంది. మేలుకో అన్న ఒక్క పదముతో ఈ నాటకం ముఖ్య లక్ష్యమును, రాబోవు కథను నాటకకర్త మనకు సూక్ష్మప్రాయంగా తెలియజేశాడు.

ఈ నాటకంలో అస్పృశ్య భావన మనకు మొదటగా పరిచయమయ్యేది కులగిరి పాత్రతోనే. తృతీయ

రంగంలో కులగిరి ప్రవేశించిన తరువాత మృగ గాండ్రింపు వలన భయకంపితుడై శివోహంను గట్టిగా పట్టుకుంటాడు. శివోహం తాను మునిపల్లెకు చెందినవాడినని చెప్పగా కులగిరి దూరంగా జరిగి అక్కడి నుండి వెళ్తూ "పులి నోట్లోనన్నాచ్చస్తాను గాని, నిన్ను ముట్టుకోను" అని అంటాడు. కులగిరి మాటల ద్వారా వారి సిద్ధాంతాలు, భావాలు ఏవిధంగా ఉన్నాయనే విషయం మనకు తేట తెల్లమవుతుంది. హరిజనులను తాకటం కంటే చావడం మేలని భావించే వారి ఆలోచనా సరళి సమాజానికి ఎంత ప్రమాదకరమైనదో మనం భావింపవచ్చు. ఆ విధమైన ఆలోచన తప్పని చెబుతూ పులి వలన భయపడుతున్న కులగిరితో శివోహం "ఓరి నిన్ను తగలెయ్యా! నిన్ను తరిమే పెద్దపులి బైటిది కాదురా, లోపటిదిరా, నీ లోపటిది!!" అని అతనిని వారిస్తాడు. శివోహం మాటల ద్వారా భీమన్న గారు సమాజంలో ఉన్న అసమానతలను పెద్దపులితో పోల్చి చెప్పటం మనం గమనించవచ్చు.

ఒక నాటకం సఫలమవ్వాలంటే ప్రధానంగా ఉండ వలసినవి సంభాషణా నైపుణ్యం మరియు సంఘర్షణలు, రాగవాశిష్ఠం నాటకంలో సంభాషణలకు కొదవలేదు. వశిష్టుడు, అరుంధతీ మధ్య సంభాషణలు ఆసక్తిగానూ, ఆలోచింపజేసేవిగాను ఉంటాయి. అలాగే జరుగబోవు కథను సూచించే విధంగాను ఉంటాయి. అరుంధతి వశిష్టుడిని ఉద్ధేశిస్తూ "మానవత్వం నుంచి దివ్యత్వానికి పురోగమిస్తూ ఇప్పుడు మీరు మధ్య దారిలో ఉన్నారు" అంటుంది. ఈ మాటలను బట్టి రాబోవు కథలో వశిష్టుడు తరువాత తను ఎదుర్కోబోయే పరిణామాలను, అతను కుల, మతాలకు సంబంధం లేకుండా అరుంధతిని కోరుకుంటాడని దివ్యత్వం వైపుగా అడుగులు వేస్తాడని నాటకకర్త సూచనాప్రాయంగా తెలియజేసాడు.

వశిష్టుడు అరుంధతిని గురించి "నీవు గొప్పతాత్వికురాలివి, అరుంధతీ! స్త్రీలలో ఇటువంటి బ్రహ్మజ్ఞత్వం అరుదుగదా! అని అనగానే అరుంధతి బ్రహ్మపదార్థానికి స్త్రీ పురుష భేదమా" అంటుంది. ఈ మాటవలన దేవుని సృష్టిలో అందరూ సమానమేనని ఎవరు ఎక్కువ తక్కువలు కాదని ముఖ్యంగా స్త్రీ పురుషులు కూడా సమానులేనని, సమాజంలో లింగ భేదానికి తావు లేకుండా చేసి సమాజంలో చైతన్యాన్ని మనకు కలిగించటం రచయిత యొక్క ఉద్ధేశ్యమని భావింప వచ్చు. తాత్వికమైన కొన్ని మాటలు కూడా వారిరివురి సంభాషణలో ఉంటాయి. ఈ మాటల వలనే వశిష్టునికి అరుంధతిపై ప్రేమ ఎక్కువ అవుతుంది. అంతలో ప్రాచీనుడి రాకతో ఒక్కసారిగా పరిస్థితి అంతా మారి పోతుంది. ప్రాచీనుడు ఆర్యజాతి భవిష్యత్తు అంతా అతని భుజస్కందాల మీద మోసేవాడిలా అతను ఆర్యజాతి సంరక్షుడని భావించే వ్యక్తి. అరుంధతి పేరు వినగానే ఆమె పంచమ కన్య అని ప్రాచీనుడికి తెలుస్తుంది. అప్పటి వరకు అరుంధతి కులం తెలియని వశిష్టుడు ఒక్కసారిగా ఎలా ప్రతిస్పందించాలో తెలియక కోపంతో వెళ్ళిపోతున్న ప్రాచీనుడిని పిలుస్తూ అతని వెంట వశిష్టుడు కూడా వెళ్ళిపోతాడు. వశిష్టుడు నిష్క్రమించడంతో అరుంధతి అలాగే పాషాణం వలె కదలక నిశ్చేష్టురాలౌతుంది.

"ముఖబింబమందు సంపుల్లమై బ్రహ్మ తే
జము సహస్రాబ్జతేజమున వెలుగు!
జిహ్వాగ్రమందు రాజీవాసనుని రాణి
నాల్గు వేదములతో నాట్యమాడు!
నేత్రాంచలములందు నిఖిలలోకములేలు
ప్రణయ పరంజ్యోతి పర్యటించు!
తనుపల్లియందు సుందరకళాకల్యాణ
విశ్వమోహన రుచి విన్యసించు!
దివ్యబాల అరుంధతీదేవి, అమృత
హృదయ నస్పృశ్యయనగ నో రెట్లు వచ్చె?
నరుని వెలిబెట్టి హింసించు నరుడు నరుడె?
మానవాభ్యుదయము కిది మంచిదగునె?"

అరుంధతిని విడిచి వచ్చినందుకు పశ్చాత్తాపం చెందు తున్న అరుంధతి గుణగణాల గురించి తలుచుకుంటూ బ్రహ్మ తేజస్సుతో వెలుగుతున్న ముఖాన్ని, నాలుగు

వేదాలను చక్కగా చెప్పగల దివ్యమైన హృదయం గల అరుంధతిని అస్పృశ్యురాలు అనడానికి ప్రాచీనుడికి నోరు ఎలా వచ్చిందో అని బాధపడుతూ "నరుని వెలిబెట్టి హింసించు నరుడు నరుడె? మానవాభ్యుదయముకిది మంచిదగునే"? అని అంటాడు. కులమతాల పేరును చూపి మనిషికి మనిషిని దూరం చేసేవాడు అసలు మనిషే కాడని, మానవ మనుగడకు, పురోగమనానికి ఇది ఏమాత్రం మంచిది కాదని వివరించే ప్రయత్నం చేసారు. ఆ తర్వాత అరుంధతి యోగ ముద్రలోకి వెళ్ళడం, ఆశ్రమాలన్నీ కరువుతో అల్లాడడం, ప్రజలు ఆకలి ఆకలంటూ వెళ్ళి మునిపల్లె ఆశ్రమంలో చేరడం ఇవన్నీ నాటకంలోని తరువాతి ఘట్టాలు.

మానవులందరిలో కుల, మత భేదాలు రూపుమాపి సామాజిక చైతన్యంను వారిలో కలిగించుటకు భీమన్న చేసిన ప్రయత్నం "మనుష్యులందరినీ సమానంగా సృష్టిస్తున్నాను, మీలో మీరు భేదాలు పెట్టుకొని ఒకళ్ళ నొక్కళ్ళు హింసించుకుంటున్నారు." అని స్వయంగా బ్రహ్మదేవుడి చేత చెప్పించడం. పరమ శివుడు ఒక మామూలు మానవుడిలా వచ్చి ఆర్య - అనార్య బేధం లేదని, ద్రావిడులు, ఆర్యులు ఏక జాతికి చెందిన వారని వివరిస్తూ-

"అలనాడు తొలి హిమ ప్రళయమ్మునకు ముందు
ఉత్తర ధ్రువ భూము లుద్ధరించి,
ఆ వెన్క, సైబీరియా యెడారులలోన
తిండి, బట్టయు లేక తిరిగి తిరిగి,
క్రమముగ, పారసీకపు నీటి పట్టుల
స్థిమితమ్ముగా కాపురములు పెట్టి
చాలక భరత దేశము జేరి, శాంతి సు
స్థిరతలు కనుగొన్న నరులలోన
భూరి సత్వులు ద్రవిడులు మొదటి జట్టు
వెనుకవచ్చిన దాతర్యులు, వీరు వారు
అన్నదమ్ముల కలహాల దన్నుకొనిరి
ఎవ్వరార్యులు, ద్రావిడులెవరు, నేడు?"

ఆర్యులు, ద్రావిడులు వేరు వేరు కాదని అందరూ ఒకే జాతికి చెందినవారని వివరిస్తూ మానవ జీవన చక్రాన్ని ప్రాచీనుడికి మిగిలిన ప్రజలందరికీ తెలిపి వారికి కనువిప్పు కలిగేలా చేస్తాడు. తరువాత తపోవహ్నిలో కాలిపోతున్న అరుంధతిని తన కమండలంలోని నీటితో కాపాడి, వశిష్టుడు-అరుంధతినీ ఆశీర్వదిస్తాడు. అంతేగాక ద్యో మండలంలో నీ భర్త చెంత ఒక శాశ్వత స్థానం లభించ గలదు అని వరమిస్తాడు. అంతటితో ఈ నాటకం ముగుస్తుంది.

అని అందరూ సమానులే అని వివరించటంతో ప్రాచీనునికి, మిగిలిన ప్రజలందరికి కనువిప్పు కలుగు తుంది. అరుంధతిని తపో వహ్ని నుండి కాపాడి ఆశీర్వ దించి, వరాన్నిస్తాడు. అంతటితో ఈ నాటకం ముగుస్తుంది.

ఈ నాటకం ద్వారా బోయి భీమన్న గారు కుల, మత భేదాలను రూపు మాపే ప్రయత్నం చేస్తూ, అందరూ సమానులేనని, మానవ మూలాలన్ని ఒక చోట నుండే వచ్చాయని, మనమందరం సర్వమానం సౌభ్రాతృత్వంతో మెలగాలని, ఆఖరికి భగవంతుడు కూడా అదే కాంక్షి స్తాడని, అలా ఉంటేనే మానవజన్మకు అర్ధం, పరమార్ధం చేకూరుతుందని, అలా ఉంటేనే ప్రజలందరిలో సామాజిక చైతన్యం కలుగుతుందని ఈ నాటకం ద్వారా బోయి భీమన్న గారు తెలియజేసారు. ప్రజలందరిలో సామాజిక చైతన్యాన్ని నింపారు.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
2) రాగవాశిష్ఠం - నాటక వైశిష్ట్యం - డా॥ దార్ల వెంకటేశ్వరరావు
3) రాగవాశిష్ఠం - బోయిభీమన్న

ఋషివంటి భీమన్న రెండవ వ్యాసుడు

– డా॥. సిహెచ్. బాబూకలిరెడ్డి, హైదరాబాద్.

ఇరవయ్యో శతాబ్దపు ఆధునికకవులలో సుప్రసిద్ధులలో డా. బోయి భీమన్న ఒకరు. వారు పాలేరు మొదలుకుని కులనిర్మూలన వరకుచతుష్షష్టి పైగా గ్రంథాల్ని ఈ సంఘానికి సమర్పించారు. అన్ని గ్రంథాలు సమాజంలో గల రుగ్మతల్ని గుర్తించి రూపుమాపడానికి అవసరమయ్యే దివ్యమైన ఔషధాలే. ఎంతోసమర్థంగా అవి పనిచేసి సమాజం రూపాన్ని మార్చివేశాయి. పాలేరు నాటకం వల్ల ఎందరో ఆ బానిసబ్రతుకులకు స్వస్తిచెప్పి విద్యావంతులై తమ తమ జీవితాల్ని అనేకరంగాల్లో పండించుకున్నారు. కావ్యప్రయోజనం కళ్ల ముందు కన్పించింది.

భీమన్నగారు వ్యక్తకవి. తాము చెప్పదలచింది స్పష్టంగా ధైర్యంగా సానుకూలమార్గంలో చెబుతారు. కవి, కవిత్వం, రససిద్ధి, శాశ్వతత్వం, సమకాలీనత, మౌలికత మొదలైన విషయాలలో కూలంకషమైన వివేచన కలవారు. ''ఇతివృత్తంలో సమకాలీనత, కావ్య నాయకుడిలో విశ్వమానవత, రచనాశిల్పంలో రసభావ రమణీయత ఉంటే అది క్లాసిక్‌మహాకావ్యం. వాల్మీకికి రాముడు సమకాలికుడు, వ్యాసుడికి ధర్మరాజు సమ కాలికుడు. నాకు పాలేరు వెంకన్న సమకాలికుడు. పట్టాభిరాముడికన్నా, ధర్మరాజు కన్నా పాలేరు వెంకన్న ఏవిధంగాను తక్కువవాడు కాదు".

''వాస్తవవస్తుచిత్రణ ఫొటోగ్రాఫ్ అవుతుంది. డాక్యు మెంటరీ అవుతుంది. ఆ చిత్రణరసభావ సమేతమై, కళాత్మకమై అభివ్యక్తమైనపుడే అది సాహిత్యమవుతుంది. సమకాలీన సాహిత్యానికి సర్వజనీనత తోడైనప్పుడు దానికి సజీవసుస్థిరత్వం సిద్ధిస్తుంది. వేదపురాణాలు, రామాయణమహాభారతాలు ఆనాటి జీవితసరళికి కళాత్మకచిత్రణలు. అందుకే వాటికి కాలదోషం లేదు. మొదట ఏకాలంలో, ఏదేశంలో, ఏ భాషలో వెలువడి నప్పటికీ అవి అన్ని కాలాలకూ, అన్ని దేశాలకూ, అన్ని భాషలకూ చెందినవే. అట్టి విశ్వసాహిత్యాన్ని ఎవరైనా ఎప్పుడైనా తమ భాషలోకి అనువదించుకోవచ్చు. అను వదించుకోవాలి కూడా. అయితే అట్టి అనువాదాలు మౌలికసాహిత్యం కావు". కావున తెలుగులో మౌలిక సాహిత్యం తక్కువే. మౌళిక సాహిత్యమే ఎక్కువ. ఒక విధంగా ఇంతవరకూ తెలుగులో మౌలికసాహిత్యం జానపదసాహిత్యమే అవుతుంది. కొన్ని శతకాలు, వేమన పద్యాలు, ఎంకిపాటలు, కిన్నెరసానిపాటలు ఈ కోవకు వస్తాయి.

పాలేరుకు కాలదోషం అంటదా అనే ప్రశ్నకు ఇలా సమాధానమిచ్చాడు. గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులా భారం, సత్యహరిశ్చంద్ర వంటి నాటకాలు ఎలాంటివో ఇదీ అటువంటిదే. అవి పౌరాణికాలు కదా అంటారా? రేపటికిదీ పౌరాణికం అవుతుంది అన్నారు. గొప్ప సమర్థన. కాలం గడిచేకొద్దీ సాంఘికం చారిత్రకంగా, చారిత్రకం ఇతిహాసంగా, ఇతిహాసం పౌరాణికంగా రూపాంతరం చెందుతాయి. నమ్మశక్యంగానంతంగా మారిపోయి నిలుస్తాయి. కవి నేలవిడిచి సాము చేయరాదు. తన కాలానికి చెందిన సాంఘిక. రాజకీయ,సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలన్నీ తన రచనలో ప్రతిబింబింప జేయాలి. అపుడే ఆ రచన సజీవసాహిత్యమవుతుంది. రామాయణ భారతాదులు అట్టి సమకాలీనతకు దర్ప ణాలు. అందుకే మహాకావ్యాలు (క్లాసిక్సు). రస విషయంలోనూ వారికి ఒక దృక్పథం ఉంది. శృంగారం ముఖ్యరసమనే చెప్పారు. పాత్రల్ని ప్రేమమయంగా తీర్చిదిద్దినపుడే విశ్వసాహిత్యస్థితి అబ్బుతుంది. ప్రేమ అదే శృంగారం ఉగాది పచ్చడట. అందుకే అమృతరసాను భవం. ''శృంగారం భగ్నమైతే కరుణరసం. నిరోధింపబడితే

వీరరసం" అన్నారు కూడా. కావ్యం పెద్దది కావచ్చు చిన్నది కావచ్చు. రసాన్ని పుష్కలంగా అందించవచ్చు. రసాత్మక మైన వాక్యాన్నే కావ్యమన్నారు మనవారు. పరిమాణం ముఖ్యం కాదన్న దర్శనమే అది. రసానుభూతికైన సుముఖత ఉండాలి. పాలేరులో అది సాధింపబడింది. వేలకొలది ప్రదర్శనలు జరిగాయి. లక్షలాది ప్రతులు అమ్ముడుపోయాయి. 1953లో గుంటూరులో ఒక నాటకబృందం నూరు ప్రదర్శనలిచ్చిన సందర్భంగా చెరుకుపల్లిలో మంత్రి సంజీవయ్యగారి అధ్యక్షతలలో పదివేలమంది పగటి దివిటీలతో బ్రహ్మరథం పట్టి ఊరేగించి గండపెండేరం తొడిగారట. అది పాలేరు సాధించిన రసవిజయం. ప్రజారంజనం. అయితే పండిత లోకంలో సన్మానాలు జరగలేదు. నాది దళితవర్గం. ఆ ప్రతిభ సవర్ణపండితులకు నచ్చదు. పండితులు మత్సరగ్రస్తులు. సాటివారినే మెచ్చరు. మరి నావంటి అవర్ణుడిని మెచ్చుతారా?

నాటకం విషయంలోనూ వారి అభిప్రాయం అనుసరణీయం. నాటకం లలితకళల సమాహారం. సంగీత సాహిత్య నాట్య చిత్ర శిల్పకళల సమగ్ర సమన్వయ స్వరూపం. వచన నాటకాల కన్నా పద్యాలు, పాటలు, నృత్యాలు గలవే మనోరంజకాలు. నేను వచననాటకాలు వ్రాయనన్నారు. నాటకం నిజజీవితానికి దగ్గరగా కళాత్మకంగా ఉండాలి. వాస్తవాన్ని అందంగా తీర్చిదిద్దాలి. పాలేరు ఆవిధంగా తీర్చిదిద్దబడింది. పద్యాలలో పాటలలో ఏడుస్తారా? అనే విమర్శలోకజ్ఞతలేనిది. గాఢమైన భావాల్ని, ఆవేశాల్ని, రసాల్ని ఆవిష్కరించడానికి వట్టి మాటల కన్నా పద్యాలు, పాటలు, నృత్యాలు మేలైనవి.

లక్ష్యాన్ని సాధించిన రచనే అజరామరం. ఆనంద దాయకమైనా ఆచరణ సాధ్యంగాని లక్ష్యాల్ని చూపించే రచన ఎండమావే. "కేవలకల్పనాకథలు కృత్రిమరత్నాలనే"ది వట్టి జడవాదం. కేవల కల్పన ఎక్కడా ఉండదు. ప్రతి ఊహ, ప్రతిశిల్పం, ప్రతి కల్పన నిరాధారంగా రాదు. ఏదో ఒక వాస్తవాన్ని ఆశ్రయించుకునే పుట్టుతుంది. పాలేరు లోని పాత్రలు కల్పితాలే. అయితే వారి వెనుక సంఘంలో వేలమందిఉన్నారు. ఈ సాహితీకల్పన సాంఘిక విప్లవానికి కారణమైంది. సాంఘికంగా వచ్చిన మార్పును ఆర్థికరాజకీయరంగాలు అనుసరించి తీరతాయి. ఈ సాంఘికమైన మార్పునే మన పెద్దలు వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం వంటివారు సాంస్కృతిక పునరుజ్జీవనమన్నారు. విప్లవవాదం తేలేని మార్పును ఒక్క నాటకం తెచ్చింది. అదే సాహిత్య ప్రభావం. ప్రయోజనం. ఆ విప్లవానికి ఈ సాహిత్యమే పునాది, ప్రేరణ. రక్తపాతంతో వచ్చిన మార్పు సరైంది కాదు. పురోగమనం దెబ్బతింటుంది.

ఆంగ్లేయుల, క్రైస్తవ మిషనరీల రాకవల్లే హరిజన గిరిజన ప్రజల బ్రతుకుల్లో వెలుగు వచ్చిందన్నారు. "ఆర్తత్రాణపరాయణుడైన భగవంతుడు అందుకోసం అప్పుడప్పుడూ అవతారాలు ఎత్తుతాడనే భావనలో కొంచెమైనా నిజముంటే, ఈదేశంలో అట్టి ఆర్తులైన హరిజనగిరిజన దీనుల్ని ఉద్ధరించడానికి ఆంగ్లేయుల్ని పంపాడేమో అనిపిస్తుంది నాకు చరిత్రను పరిశీలిస్తే"అన్నారు. ఎంతో ఆవేదనతో అన్నమాటలివి. ఆ వచ్చినవారు ఏకుమేకైతే గబ్బిలం ద్వారా కబురు విని ఆ భగవంతుడు గాంధీజీ అంబేద్కర్ వంటివార్ని పంపాడనాలి. వీరి ప్రభావంతో స్వతంత్ర భారతంలో హరిజన గిరిజనులు అన్నివిధాల అభివృద్ధి చెందారు. పాలనలోనూ భాగస్వాములయ్యారు. ఇందుకే పూనా ఒప్పందంలో అంబేద్కర్ సంతకం చేశారట.

అంబేద్కర్ అంటే భీమన్నగారికి దైవంతో సమానం. ఆయన విశిష్ట వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని వేనోళ్ల కీర్తించారు. ఆయన్ని ఎవ్వరు ఏమన్నా సహించరు. ఎందరో మనకు ప్రవక్తలున్నారు. వాల్మీకి వ్యాసుల దగ్గర నుంచి గాంధీ అంబేద్కర్ వరకు. వీరందరి కన్నా అంబేద్కర్ మానవతా సూర్యుడు. అఖండవిప్లవజ్యోతి. ఏకైకసాంఘికప్రవక్త. ప్రవర్తలందరూ అగ్రవర్ణీకులు. వారు దళితవర్గం గూర్చి ఒక ఉద్యమస్థాయిలో ప్రయత్నించలేదు. లేకుంటే

ఎప్పుడో అంటరానితనం, అసమానతలు తొలగిపోయే వన్నారు.

సమసమాజనిర్మాణంలో మార్క్సు మార్గం కన్నా అంబేద్కర్ మార్గం మిన్న. ఏమార్గంలోనైనా అధికారం సాధించడం మార్క్సు అభిమతం. సమన్వయంతో మానసికమైన మార్పుతో సాధించడాన్ని అంబేద్కర్ చెప్పారు. సత్యధర్మసాధువాదం అది. స్నేహవాత్సల్య కారుణ్యాలు ఖడ్గతుల్యాలు కావాలి. మతాలన్నీ ప్రజలంతా సమానులని చెప్పినవే. అయితే పాటించవు.

చదువు మానవత్వాన్ని, సత్యధర్మాల్ని, ఔదార్యం, పరోపకారబుద్ధి మొదలైనవాటిని ఇవ్వాలి. ఈరోజున ఇవి కొరవడుతున్నాయి.

పూర్వకాలంలో వ్యక్తిబలమే బలం. బలవంతుడే రాజు. ఈనాడు సంఘమే బలం. సంఘబలం కలవాడే రాజ్యాధినేత. ఆ సంఘటితశక్తి చైతన్యం వల్ల వస్తుంది.

మొత్తంగా హిందూమతాన్ని ఆయన ద్వేషించలేదు. మార్పుకై ప్రయత్నించారు. ఇరవై సంవత్సరాలుమతం మారలేదు. విసిగి వేసారి బౌద్ధం స్వీకరించారు. హిందూ ధర్మంలోని సూత్రాలే బుద్ధుడూ చెప్పాడు. మాటల్లోనే మార్పు. భావం ఒక్కటే. దీనజనోద్ధరణకు బుద్ధుడు చేసింది ఏమీలేదు. బుద్ధుడు కన్నా అంబేద్కరే మిన్న. అందుకే నేను "భీమం శరణం గచ్ఛామి" అంటున్నాను. హిందూమతం అంత అనాగరకమైనది కాదు. మొత్తం ప్రపంచానికే ఉత్తమజ్ఞానభిక్ష పెట్టింది. ఈవిషయం అంబేద్కర్ గుర్తించే దాని శాఖ అయిన బౌద్ధంలో చేరారు. పుట్టినగడ్డకు అపకారం చేయలేదు. అంతటి వ్యక్తిత్వం ఆయనది. పరాయి మతాల జోలికి పోలేదు. ఆయన బౌద్ధం పుచ్చుకున్నారని దళితులంతా బౌద్ధం స్వీకరించ పనిలేదు. ఈ మాటలు సామాన్యులు చెప్పలేరు.

గాంధీజీ కోరగా అంబేద్కర్ నెహ్రూ మంత్రివర్గంలో చేరారు. ఇతరదళితమేధావులు దానిని వ్యతిరేకిం చారు. కానీ భీమన్నగారు చేరడం మంచిదని గట్టిగా సమర్థించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంటరానితనం తగ్గింది. హరిజనోద్ధరణ చాలా వరకు జరిగింది. అయితే కులతత్వం పెరిగింది. ఇది పోవాలంటే కులాంతర వర్ణాంతర వివాహాలు జరగాలన్నారు. నేడు అధికంగా జరుగుతున్నాయి. ఇంకో అర్ధశతాబ్దానికి కులం ఉండదు. తాను ముందుగా స్థాపించి నడుపుతున్న షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ను రద్దుచేశారు. దానికి బదులు రిపబ్లికన్ పార్టీని స్థాపించారు. కులం పేరుతో గల పార్టీ సార్వజనీనం కాలేదు. ఇంకా కొంతకాలం అంబేద్కర్ బ్రతికి ఉంటే రాంమనోహర్ లోహియాగారి జాతీయ సోషలిస్టు పార్టీలో కలిసిపోయేది.

రిజర్వేషన్లు తప్పనిసరి. లేకుంటే ఈ మాత్రం అభివృద్ధైనా జరిగి ఉండేది కాదు. ఇందుకు గుళ్ళపు పందేల విషయం చెప్పారు. బలమైనవి, బలహీనమైనవి కలిసి పరుగెడితే వాటిని తుల్యబలం గలవాటిని చేయడానికి బలం గల వాటిపైన ఎక్కువ బరువు వేస్తే బలహీనమైన వాటిపైన తక్కువ బరువు వేస్తారట. అపుడు పందెంలో సమబలంగలవి అవుతాయి. విజయం కూడా లభిస్తుంది. లేకుంటే ఎక్కడి గొంగళి అక్కడే. కొంతైనా వ్యక్తిగతమైన ఆస్తి ఉండాలని, సామాజిక స్థాయి సంపద మాత్రమే జాతీయం కావాలని అంబేద్కర్ సిద్ధాంతం.

న్యాయమైన కోర్కెల్ని తీర్చుకోవాలి. చంపుకోకూడదు. మానవుడు సంతోషంగా జీవించడానికి కూడు, గుడ్డ, గూడే కాదని విశాలమైన మానసిక ప్రశాంతి అవసరమని, అపుడే వికాసం అందుతుందని ఆయన అభిమతం. హిందూ మతం ఒక క్షీరాన్న కలశం. అందులోగల కులవర్ణభేదాలు, అంటరానితనం అందులో పడి చచ్చిన ఈగలు, బొద్దింకలు. వాటిని తొలగించి తినవచ్చు. బల్లులుపడితేనే ప్రమాదం. సౌజన్యమే మతమని వివేకానందుడి వాక్కు. అది పెరిగితే అంతా సంతోషమే.

బోయి భీమన్నగారు చివరగా దళితసమాజానికి చక్కని హితమే బోధించారు. న్యూనతను తగ్గించుకోండి. మనకు ఘనచరిత్ర ఉంది. మతంగ ధర్మవ్యాధ వాల్మీకి వ్యాసులు,

అరుంధతి, అదృశ్యంతి, అంజనలు మన పూర్వీకులే. సవర్ణపండితులు ఒప్పుకొంటున్నారు. దళితసోదరులే అంగీకరించడంలేదు. అదే విచిత్రం! బ్రహ్మజ్ఞానం కలవాళ్లే బ్రాహ్మణులు. బ్రాహ్మణత్వం గుణం వల్ల వచ్చేది. జన్మ వల్ల కాదు. జ్ఞానులంతా, విద్యావంతులంతా, వివేకు లంతా బ్రాహ్మణులే. అద్దంతో పోల్చి బ్రహ్మపదార్థాన్ని వివరించారు.అద్దం ముందు భాగంతోనే మన పని. వెనుకభాగంతో పనిలేదు. అయితే ఈ ముందుకు వెనుక ఒక ఆధారం ఉంది అనేది సత్యమే గదా!ఈ సత్యాన్ని తెలియడమేజ్ఞానం. ఆ వెనుక భాగమైన సత్యమే బ్రహ్మం. ముందుదంతా ప్రకృతి, సృష్టి. ఇది నాదృష్టిలో వైదిక ధర్మసూత్రం. నిజమైన బ్రహ్మజ్ఞాని ధరింపవలసింది ఈ సూత్రాన్ని. నూలుదారాన్ని కాదన్నారు. మతాలను మైనారిటీలుగా గుర్తించరాదు. వీరి హక్కులు మెజారిటీ లకు హాని కల్పించరాదు.

"నేను ప్రధానంగా కవిని. రాజకీయాలు నా కార్య రంగం కాదు. అగ్రశ్రేణి కవిగా కీర్తిప్రతిష్ఠలు, గౌరవ సన్మానాలు అందుకొన్నవాణ్ణి. దళితుడిగా పుట్టినా దళితత్వం లేని విశ్వజనీన సాహిత్య సమారాధకుడిగా జీవిస్తున్నవాణ్ణి. నేను అందరివాణ్ణి. కులమతరాజకీయాల జోలికి పోవలసిన అవసరం నాకు లేదు". అయితే ఈ మాటలు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించుకుని "మీ కోసం చెబుతున్నా, మీ దాస్యాన్ని, దైన్యాన్ని, న్యూనతా భావాన్ని తొలగించడానికి చెబుతున్నా, మీ మనస్సుల్లో నాటుకొని ఉన్న చీకటిని నా సాహిత్యదీపంతో నిర్మూలించ డానికి వ్రాస్తున్నానన్నారు. ఇంతటి సమన్వయవాదిని మనం చూడలేం. అందుకే నండూరి రామకృష్ణమా చార్యులు అంతటివారు నిండు సభలో బోయి భీమన్నగార్ని వ్యాసుడన్నారు. అయితే గర్వపడలేదట. ఆనందాశ్చర్య సంభ్రమాలు ముప్పిరికొనగా, నండూరివారి ఔదార్య ప్రతిభాప్రాభవాలకు చేతులు మోడ్చారట. ఇంతటివారు కాబట్టే వీరి 'దీపసభ' గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ నిడుదవోలు వేంకటరావుగారు "జాతీయకవి, గేయకవి, మహాకవియునగు భీమనకవి విశ్వకవి అయినాడు" అన్నారు.

భీమన్నగారు పరమపరేంగితజ్ఞాని. అంబేద్కర్ గారిని వీరు అర్థం చేసుకున్నట్లు వేరెవరు అర్థం చేసుకోలేదు. ఆ విషయంలో ఒక మాట చెబుతాను

"అంబేద్కర్ మహాశయుడు
హిందూమతాన్ని కాంగ్రెసు పార్టీని
గాంధీమహాత్ముడిని ఎదిరించి దెప్పడం
వ్యతిరేకించి నిందించడం
ఇలాంటిదన్నాడు కవితల్లజుడు
బోయి భీమన్న ఏనాడొ
అది ఎట్టిదంటేను
గయోపాఖ్యానంలో అర్జునుడు కృష్ణుడిని దెప్పినట్లంట
రామాంజనేయయుద్ధాన
పావని శ్రీరాముడిని ఎత్తిపొడిచినట్లంట
ఆ మాత్రమనకుంటే దళితవర్గానికి
ఇంతైన దక్కేది కాదంట
అగ్రనాయకులు విషయసమరావేశంలో
పరస్పరం ఒకరినొకరు నిందించుకోవడం
సహజాతిసహజమంట
దానినంతగమనం పట్టించుకోవడం తగదంట
నిత్యసత్యరత్నాల మూటలీమాటలు
రాజకీయాలలో శాశ్వతమిత్రులు సుస్థిరశత్రువులు
ఉండరనేది వింటున్న మాటలు చూస్తున్నదృశ్యాలు

1988 ప్రాంతంలో విజయవాడలో కనకాభిషేకం జరిగింది. అపుడు సరస్వతీదేవినిట్లు స్తుతించారు.

"బ్రహ్మరథముపట్టి పగటి దివిటీలతో
వేయించితివి గండపెండేరమును
అందించితివి భారతాధ్యక్ష గిరిచేత
మహనీయమైన పద్మా అవార్డు

కలిగించితివి గుడిసెల కావ్యమునకు జా
తీయ పురస్కార ధీయశస్సు
ఆంధ్ర కాశీద్ధ విద్యాపీఠముల నుండి
గారవించితివి డాక్టర్ బిరుదుల
శాసన పరిషత్తు సభ్యత్వమొసగితీ
ర్చితివి నాలోని రాజరిక తృష్ణ
ఇంతగా నన్ను భూషించి ఇపుడు దీని
కంతకు కిరీటమన కనకాభిషేక
ధన్యతను గూర్చినావు నాతల్లి! బ్రాహ్మి!
బాపురే పోలవరపు సుబ్రావుగారి
హృదయ పద్మాసనము నుండి ఎంత కరుణ!"

భీమన్నగారు తనకు సహకరించిన వారిని హృదయ పూర్వకంగా అభినందిస్తారు. అది వారి సుజనత్వం. పాలేరు గ్రంథాన్ని అంకితమిచ్చిన కోనాడ సూర్య ప్రకాశరావు గార్ని, అంబేద్కరిజం గ్రంథాన్ని అంకితం ఇచ్చిన జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగార్ని గూర్చి చెప్పిన మాటలు అక్షరలక్షలు. కృతజ్ఞతాభరిత హృదయా విర్భావాలు. ఇట్టి విశిష్ట గుణవరిష్ఠుడు కాబట్టే నేను "ఋషివంటి భీమన్న రెండవ వ్యాసుడు" అన్నాను.

❁❁❁

బొయి భీమన్న కవిత్వం - సామాజిక దృక్పథం

- బసవరాజప్ప , అధ్యాపకులు, నలందా ఉపాధ్యాయ విద్యా శిక్షణ కళాశాల, మహబూబ్‌నగర్, తెలంగాణ.

"హితాన్ని చేకూర్చేది సాహిత్యం" కాలాన్ని బట్టి సంస్కృతి బట్టి, ఏది హితమైన సాహిత్యం సామాజిక చైతన్యాన్ని ఆశించి సర్వజనులకు ఉపకరించేవి, మానవజాతి పురోగమానానికి జ్ఞానం ఎంత ఆవశ్యకమో ముందే గుర్తించిన కవి. పేదరికంతో పాటు, అంటరాని తనం, దురాచారాల వంటివి చవిచూసిన మహమనిషి. ఆత్మవిశ్వాసంతో నరమానవులకు తన సృజన ద్వారా వారి హృదయలను మేలుకొలుపుతు, ఆత్మగౌరవాన్ని పెంపొందించిన మహాధీరుడు. సమజాన్ని పరిశీలించి, పరిశోధించి విభిన్న ప్రక్రియలలో అనేక రచనలు చేశాడు. సమాజంలోని దురాచారాలను నిర్భయంగా విమర్శించుతు వ్యంగంగా చెప్పగల సమర్థమూర్తి. తన రచనల ద్వారా అనాటి కుట్రలను కుట్రంతాలను తన వివేచనతో, సృజనాత్మకతతో విప్లవాత్మక, ప్రేరణాత్మకతతో ప్రజలను చైతన్యవంతం చేసిన మానవతావాది. ప్రతి రచనలోను సహజత్వాన్ని, నూతనత్వాన్ని సంతరించుకొన్నవి. భారతీయ సమాజంలో చతుర్వర్ణ వ్యవస్థ కొనసాగింది. దాన్ని అనుసరించి కులవ్యవస్థ రూపొందింది. ప్రధానంగా కులవివక్షను ఆధారం చేసుకొని దళితులపైన, అస్పృశ్యతపైన, ప్రేమ, సాంఘిక, రాజకీయ, సమస్యలపై తన బహుముఖ ప్రజ్ఞతో అవిరళ కృషితో కవిత్వం, నాటకలతో, పద్య, గేయ, వచన, లేఖల వంటి ప్రక్రియలన్నింటి ద్వారా నవ నిర్మాణం జరగాలి. దేశంను సుసంపన్నం చేయాలి అన్న ధీరశాలి.

ప్రజలను వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసేవారు మానవతశీలీ ప్రజాల ఆర్తుడు బోయి భీమన్న గారు.

నా సుఖలు, సంతోషలు, గౌరవాలు,
సమస్తము సరస్వతీ ప్రీత్యర్థం
నా కష్టాలు, నష్టలు, దురదృష్టలు
అన్ని శివార్పణం...

అంటూ తన సర్వసం కష్టాసుఖలు సరస్వతీ, శివయ్యకే సమర్పణం అంటాడు. భీమన్న పేదగా పుట్టిన, పేదగా పెరిగిన, పేదగా బ్రతికిన వారు కష్టాలు బాధాలు ఎన్నో అనుభావిస్తు కూడా నిత్యం సంతోషంగా జీవించడు. వ్యక్తుల వికాసమే, జాతుల వికాసం, జాతుల వికాసమే, వస్తుదైక సామాజం. కవి ఏ కాలంలో జీవిస్తున్నాడో ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సంస్కృతిక, ఆధ్యాత్మిక విషయలపై వారివారి రచనల్లో ప్రతిబింబించాలి.

భారతదేశంలో వ్యవసాయం ప్రధానమైన దేశం అందువల్ల గ్రామల్లో నివాసం ఎక్కువ. గ్రామంలోని ప్రతి ఇల్లు విద్య అభివృద్ధి చెందితేనే మనదేశం సుసంపన్నంగా, సస్యశ్యామలంగా ఉంటుంది. అయితే గ్రామలు ఎలా ఉన్నాయి వారి జీవితాలు ఎలా ఉంటాయి అనే విషయాలను వివరిస్తు గ్రామాల్లోని దళితులు, పేదల, జీవితలను చిత్రిస్తు పల్లెటూరి లేఖలు అనే పేరుతో 1932లో జనవాణి పత్రికలోను,1933లో జానపదుని జాబులు అనే పేరుతో వచన కవితసంపుటిని ప్రచరించారు. పేదరికం వల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం వెళ్లి పల్లెటురి పనుల్లో మునిగిపాయిన జానపదుడు (పల్లెటురివారు) పట్నంలోని శ్రీమంతుడైన మిత్రుడికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను లేఖల రూపంలో రాస్తాడు.

రాగవైశాఖ కవిత సంపుటిలో మార్గశిరి అనే కవితలో

ఈ చలిలోఈచల్లని వెన్నెలలో
ఒత్తుగా మెత్తుగ ఎదలకు
ఒకరినొకరు హత్తుకొని
ఎల్లజగము నిదురపోవ

ఎవ్వడవో ఒంటరిగా
వస్తావని ఏ సోమరి
బద్దకించి కుర్చున్నదో
వీలులేక ఏ సుందరి
విరహగుల ఒడియున్నదో
కవ్వించే కలువలతో
కయ్యానికి దిగబోకుమ
మత్తు చల్లి మంచుచల్లి
చిత్తుచేయు జాబిల్లి
నా మనసును చదివి
పాడుతున్నది ఉద్వాన రామ.

ఇది శృంగార కావ్యం నవరసాలలో శృంగారానికి అక్షర రూపం దాల్చిన కావ్యం శృంగార రసాబ్ధిలో తెలియ బడుతుంది. ఆలోచన తరంగాల ప్రకంపనలో మునిగితెలే రససాగరమే ఈ రాగవైశాఖి.

చివరి మెట్టు మీది శివుడు అనే కవిత సంపుటిలో ఏమున్నది గర్వకరణం అనే కవితలో

ఏ గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్ళిన,
ఏమున్నది గర్వకారణం
పేరున్న ప్రతి డాక్టర్
ఇంటికి రమ్మన్నవాడే
సొంత క్లినికులున్నవాడే

పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయివేటు దవాఖానలో ఫీజు దోపిడీని తట్టుకొలేక ప్రభుత్వ దవాఖానకు వెళ్ళితే అక్కడ సరిఅయిన వసతులు ఉండవు, మరియు అక్కడ పనిచేసే డాక్టర్‌లే ప్రయివేటుగా దవాఖానలను ఏర్పాటు చేసుకొని ఇక్కడికి వచ్చిన పేషెంట్ లను మయ మాటలు చెప్పి వారి సొంత దవాఖానకు రప్పించుకొంటు అక్రమ ఫిజు దోపిడీలకు పాలుపడుతారు కొందరు డాక్టర్లు, అదేవిధంగా ప్రభుత్వ ఆఫీసులో, పాఠశాలలో జరిగే విషయలపై కవి సమాజంలో జరిగే దుర్మార్గ చర్యలను ఎండగడుతు ప్రజలను చైతన్య పరచడం తనకు ఉన్న మానవత దృక్పథం, ప్రజాశ్రేయస్సే తన ధేయ్యం అని అంటాడు కవి.

నీవుచేయు ఒకొక్క దోపిడీ
నిన్నె దోపిడీ చేయుచున్నది
ఆత్మయే కొల్లవాడుచున్నది
అంధుడా జాగ్రత్త పడార
పని మొనర్పక, తేరతేరగ
పరుల సంపద దోచువాడు
ఆత్మకాంతులు అరిపొయి
అందభూతమె అవునురా

అఖండతాండవం అనే కవితసంపుటిలో... మానవులు చేయు అనేక అక్రమాలు, దోపిడీలను చూసి కవి హృదయం చలించిపొయి దుర్మార్గపు పనులను, దోపిడీ లను చేయు నరమానవులను హెచ్చరించుతు, నీవు చేయు దోపిడీ నిన్నె దోపిడీ చేయువిధంగా చేసుకుంటున్నారు, నీ ఆత్మను నీవే పోగొటుకుంటున్నారు జాగ్రత్త పడు కళ్లు ఉన్న అంధుడా ఇతరుల సంపదను కొల్లగొట్టువారు వారి ఆత్మకాంతులను అరిపొయే విధంగా అని కవి హెచ్చరించారు. భీమన్న కళ్లు, నిత్యం సౌందర్యాన్వేషి, ఎల్లప్పుడూ దేనికొసమో వెతుకుతుంటాడు.

పురుషుడికి, స్త్రీ అందం
స్త్రీకి పురుషుడు ఆనందం
స్త్రీపురుషుల సంగతేం లేకుంటే
లేదు భావం
రసభావల సంగతేం లేకుంటే
లేదు కల్పం,
లేదు సంకల్పం,
కల్పం, సంకల్పం, సంగతేం లేకుంటే,
లేవు నీవు,
లేను నేను
మన ఇద్దరం లేకపోతే
మరేముంది ప్రపంచం.

అంటూ ఈ సృష్టికి మూలం స్త్రీ పురుషులు. స్త్రీ పురుషుల అందం, ఆనందం, సంగతేం, వారి రసభావలు లేకపోతే అంతా శూన్యం. అందుకే స్త్రీపురుషుల అందం, ఆనందం (మానసిక ఆనందం) సంకల్పాలు, సంగతేం, అవసరం అంటాడు. అనాదికొనం నుంచి అనంత తత్వంలో అనే కవిత సంపుటిలో రసం భావం అనే కవిత ద్వారా

దైవం, స్వర్గం, నరకం అంటు
భక్తి, జ్ఞానం, వైరాగ్యం అంటు
సంసార సాగరం దుఃఖం కనుక
సర్వసంగ పరిత్యాగంతో
సన్యాసులుగా బ్రతుకాలంటారు
ఎన్నో చెప్పారు, చెపుతున్నారు నేటికీ,
జననమరణాల విషవలయం నుంచి,
విడువడమే మోక్షం అంటున్నాను,
సరే, అంటే అననీ
ఎవరి ఊహలు వారివి
అయితే, మోక్షం పొందడానికి
కొందరు మాత్రమే అర్హులు అంటున్నారు,
మోక్ష మార్గంలో నడవడానికి
షరతులు పెడుతున్నారేమిటి
మోక్షం పొందే హక్కు కొందరికే కాదు,
అందరికి కలదంటున్నా నేను
అందుకు ఏ నియమాలు అక్కరలేదంటున్నాను.

సామాజిక వ్యవస్థలో విప్లవాత్మకమైన నవ్యతను సంతరించుకొన్నది. యావత్ విశ్వజానవాళి మోక్షం విషయంలో జప, తప, పుజ వంటివి నేటి వరకు నెలకొల్పి నడుపుతున్నారు. మహాపురుషులు, గురువులు, పీఠాధిపతులు, పూజారులు ప్రజలను ఏవిధంగా పెడమర్గం పట్టిస్తున్నారో మోక్షం నా జన్మహక్కు అనే కవిత సంపుటి ద్వారా స్పష్టపరుస్తున్నారు. మోక్షం పొందే హక్కు కొందరికి కాదు అందరికి ఉంటుంది. అందుకు ఏ నియమాలు అవసరం లేదు అని కవి బావన.

ఒక నిబద్ధతతో, బలమైన భావాలతో సమాజంలో బడుగు, బలహీన, దళితుల జీవితంలోని అణచివేతను, అసమానతలను, హింసను స్వయంగా చవిచూసి, దళిత జీవన వాస్తవికత, మానసిక సంక్షోభం వేదన, ఆర్తిని నిశితంగా పరిశీలించి, అద్భుతమైన అక్షరశిల్పితో, భావ వ్యక్తికరణతో సమాజంలో ఇంతటి దారుణమైన పరిస్థితులు దర్శనం ఇస్తున్నాయి అనే ఆవేదనతో సామాజిక చైతన్య పరిణామక్రమానికి కవిత్వం కీలకపాత్ర వహిస్తుంది అని సమానమాజ నిర్మాణానికి కంకణ బద్ధులైన మానవతవాది.

విశిష్ట వ్యక్తిత్వం గల ధీరుడు బోయి భీమన్న గారు. వారు ఆశయాలను, వారి బావజాలంను నేటి, రాబోయే తరలవారికి స్ఫూర్తిదాయకం.

ఆధారగ్రంధాలు :

1. రాగ వైశాఖి
2. అఖండతండవం
3. జానపదునిజాబులు
4. చివరిమెట్టుమీద శివుడు
5. వివిధ కవిత సంపుటిలు
6. మోక్షం నా జన్మహక్కు

బోయిభీమన్న కవిత్వం - వర్ణ భేద రాహిత్యం

- సి.హెచ్. రాధాకృష్ణ , పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

మన తెలుగు భాషలో పూర్వం ఆదికవి నన్నయకాలం నుండి చిన్నయసూరి కాలం వరకు కవిత్వమంటే గ్రాంధికలో చెప్పే పద్య, గద్యాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేవారు. తరువాత కాలంలో సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. పరవస్తు చిన్నయసూరి తర్వాత కాలాన్ని ఆధునిక యుగమంటారు. ఈ ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యంలో ఛందోబద్ధమైన కవిత్వం నుండి ఆధునిక కవులు వచన కవిత్వం వైపు అడుగులు వేసారు. పాశ్చాత్య సాహిత్యము ప్రభావంతో అనేక నూతన ప్రక్రియలు వచన కవిత్వంలో ప్రారంభిస్తూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిపుష్ఠము చేసాయి. ఈ వచన కవిత్వానికి ఆద్యుడు, పితామహుడుగా కుందుర్తి ఆంజనేయులను చెప్పుకుంటారు. ఈయన సమకాలీన కవులు, ఇతర కవులు వచన కవిత్వాన్ని చెప్పటానికి ఆసక్తి చూపారు. అందులో ఒకరు బోయిభీమన్నగారు. ఈయన వచన కవిత్వంలో గుడిసెలు కాలిపోతున్నై అనే గద్య కవితా సంపుటిని రాశారు. ఇది భీమన్న కలం నుండి జాలువారిన గొప్ప అభ్యుదయ భావాలు కలిగిన వచన కవిత్వం. ఇందులో కుల, మత - సాంఘిక ఆర్థిక, రాజకీయ అసమానతలను ఎత్తి చూపుతూ ప్రజలకు ఉద్బోధ చేసారు. ఈ రచనకుగాను 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం జరిగింది.

కవి పరిచయం :

తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు అనే మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంటిలో పుట్టిన భీమన్నగారు పేదరికంతో పాటు అంటరానితనం, అస్పృశ్యత వంటి అనేక దురాచారాలను ఎదుర్కొన్నారు. తన చిన్నప్పటి నుండి సమాజంలో కులమతాల పేర్లుతో అగ్రవర్ణాలు వారు - బడుగు బలహీన వర్గాలైన హరిజనులు, గిరిజనులపై అధికారం చెలాయిస్తూ వారిని అంధకారంలోనికి నెట్టి వేస్తున్నారు. దీనికి నిరసించిన బోయిభీమన్న గారు తన కవిత్వంతో అనేక కవితలు కథలు, నాటకాలు ద్వారా బడుగు బలహీన వర్గాలలో చైతన్యం రావాలని ఆకాంక్షిస్తూ, మరో ప్రక్క బడుగు బలహీన వర్గాలపై అగ్రవర్ణాలు వారు చేస్తున్నా దౌర్జన్యాలను, హింసను. అందరికి తెలిసేలా బహిర్గతం చేస్తూ బడుగు బలహీన వర్గాల పక్షాన ఉంటూ వారికి ఉద్యమకర్తగా, సారధ్యము వహించాడు. డా॥ అంబేడ్కర్ రచనలను తర్జుమా చేసారు.

సామాజికాంశం :

ఆదిమకాలంలో ఏకత్వములో ఉన్న భారతదేశం ఆధునిక కాలంలో అభివృద్ధి చెందుతున్న కొలది భిన్నత్వములోనికి జారిపోయింది. ఈ పరిణామానికి కారణం సమాజంలోని కులాల మతాల, వర్ణాల పేరిట సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రెండు వర్గాలుగా విభజించబడింది. ఇందులో ధనికులు - పేదలుగా, అగ్రవర్ణాలు వారు - నిమ్నజాతులుగా, మేధావులు - నిరక్షరాస్యులుగా విభజించబడినారు. హైందవ దేశంలో అగ్రవర్ణాల వారి ఆదివత్యములో తరతరాలుగా బలైపోతున్నా దళిత పేద ప్రజల ఆర్తనాదాలతో బడుగు బలహీన వర్గాల వారి గొంతుకతో బోయిభీమన్న గారు సమాజ చైతన్యానికి 'గుడిసెలు కాలిపోతున్నై' అంటూ దండోరా వేయించారు.

గుడిసెలు కాలిపోతున్నై అనే కవితా సంపుటి మత, రాజకీయ, సాంఘిక విమర్శతో వచన కవితా ప్రక్రియలు 57 కవితల సమాహారము. ఇందులో "కల్తీ రాజ్యపు దేవుడుగారంటూనే' 'సర్వసామాన్యుడైన మానవుడే బ్రహ్మజ్ఞాని అంటూ మతం పేరిట జరుగుతున్న మోసాలు,

హేతువాద దృష్టితో బహిర్గతము చేస్తూ దళితుల - నిమ్నజాతుల చైతన్యానికి ప్రశ్నలు సంధిస్తూ తనకుతానే సమాధానము పరుచుకుంటూ, మేలుకొలుపు గీతములా అజ్ఞానము నశించి చైతన్యము వెల్లివిరిసేలా గుడిసెలు కాలిపోతున్నై కవిత సంపుటిని రచించారు.

గుడిసె అనునది పేదవాడి యదార్ధ జీవన గమనానికి ప్రతీక. సాధారణంగా గడ్డి తాటి యాకులు మొ॥ వాటితో ఏర్పరచిన చిన్న ఇల్లు, కుటీరం, పాక అను నైఘంటిక అర్థాలు కనపడుతున్నాయి. అంతేకాకుండా ఒక కవి తన భావనా రవళిని యదార్ధ దృశ్యాన్ని చూసినప్పుడు, అది సమాజంలోని బడుగు బలహీన జీవితాలను కరిగిస్తున్న ప్పుడు, ఆ కన్నీటి ధారే కవికలానికీ ఇంకుగా, ప్రతీ అక్షరంలో మనకు దర్శింపచేస్తుంది. అలాంటి భావావేశమే మనకు బోయిభీమన్న కవితా కలంలో దర్శనమిస్తుంది. 'గుడిసెలు కాలిపోతున్నై' అనే ఖండికలో-

"గుడిసెలు కాలిపోతున్నై
ఓహో కాలిపోతున్నై!
ఎవరి గుడిసెలో పాపం
మాలమాదిగలే అయి వుంటై
గుడిసెలు మరెవరి కుంటై?"

పై కవితను గమనించినట్లయితే రచయిత యొక్క ప్రశ్నించేతత్వం వ్యక్తమౌతుంది. ఎందుకంటే బడుగు బలహీన వర్గాలపై అగ్రవర్ణాలు వారు పెత్తనం చెలాయిస్తూ వారి అభివృద్ధిని అధో పాతాళముకి త్రొక్కివెయ్యడం జరుగుతుంది. అందుకే తన ప్రశ్నకు తానే జవాబు వెతుక్కుంటున్నాడు. మన దేశ హైందవ ధర్మము వలన కులవ్యవస్థ మతవ్యవస్థలు పూర్తిగా నాటుకుపోయాయి. ఆ ఫలితంగా తరతరాలు మారినప్పటికి దేశంలోని కొన్ని కులాలు వారు ఊరికి దూరంగా గుడిసెలలో ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతూ సమాజం నుండి వేరు చేయబడినారు. ఇలా సమాజం నుండి వెలియేయబడిన వారిని నిమ్నజాతులుగా, బడుగు బలహీన వర్గాలుగా, దళితులుగా పిలవబడిన వారే మాల మాదిగలు. ఇప్పటికీ వీరి జీవితం మార్పు లేక అంధకారంలోనే కొట్టుమిట్టాడు తుంది. ఇప్పటికీ వారు గుడిసెల్లో జీవించటం వారి ఆర్థిక దుస్థితి, పేదరికాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజం మారుతున్న సమయాన వారి జీవితం మార్పు చెందక పోవటానికి చైతన్యం లేకపోవటం నిరక్షరాస్యులుగా ఉం డటంతో పాటు వార్ని సమాజంలో ఉన్న అగ్రవర్ణాలవారు రాజకీయంగాను, సాంఘికంగాను, ఆర్థికంగాను అణిచివేసి వారిని మానసికంగాను, శారీరకంగాను శ్రమదోపిడి చేసి దోచుకుంటున్నారు.

"చాలామందికే వుంటైలే
అసలు ఈ దేశధర్మమే అంత!
అయితే ఈ గుడిసెలు
ఏడాది కొకసారైనా కాలిపోతుంటై!"

అంటూ ఈ దేశ సనాతన ధర్మము మీద తన భావజాల వ్యతిరేకతను ప్రదర్శించాడు. ధర్మము అంటే అందరికీ సమానంగా ఉండాలని ఒక్కొక్క వర్గానికీ ఒక్కో విధంగా ప్రవర్తించే తీరు మార్చుకోవాలని ఉద్బోధించారు. అభివృద్ధి పేరున దళితుల గుడిసెలను ఖాళీ చేసి, వాటి స్థానంలో మేడలు కట్టాలని చూస్తున్న స్వార్థపరులను, వారికి అండగా ఉంటున్న నాయకులకు, భీమన్నగారు భవిష్యత్‌లో ఈ దళితులే ఒక శక్తిగా ఎదిగే చైతన్యాన్ని ఈ ఖండికలో భవిష్యత్ దర్శనం గావించారు.

"అవును - నిజమే!
ఒకసారి కాలిపోయన గుడిసెలు
ఎక్కడి నుంచి వస్తుంటై?"

అంటూ నూటిగా తన అభిప్రాయాన్ని నిర్మొహ మాటంగా చెప్పటం భీమన్న నైజం. పై వాక్యాలను బట్టి గుడిసెలు కాలిపోయాయి. మళ్ళీ రూపుదిద్ద కుంటున్నాయి అనే భావనగా అవగతం చేసుకోవాలా! చైతన్యం పొంది మళ్ళీ స్వార్థపరులకు, ప్రతినిధులకు ఎదురొడ్డి నిర్మించుకున్నారో! ఏదేమైనా సరే వారిలో చైతన్య స్ఫూర్తి మాత్రం వచ్చిందని భావించవచ్చు. ఇంకా

"అదే మనధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాప నార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!
పోతుంటై
పుట్టుకొస్తుంటై"

అంటూ వ్యంగ్యాత్మకమైన బాణాలను సంధించడం పైవాక్యాల్లో గమనించదగినది. పై కవిత ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలు చైతన్యం పొంది. ఒకసారి ఆగిపోయిన దగ్గరే ఉండకుండా, ప్రగతి పథం (మార్గం)లో ముందుకు సాగాలని కవి కాంక్షించారు. గుడిసెల స్థానంలో మేడలు రావడం ప్రగతి. అయితే ఈ ప్రగతి వారి జీవితంలోనే రావాలి. అంతేగానీ స్వార్థపరులైన ప్రతినిధుల జీవితాల్లో కాదు.

"ఈ విషవలయం సాగడం
ఎంత వరకు?
రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు!"

అంటూ కాలిపోతున్న గుడిసెల స్థానంలో మళ్ళీ ఈ గుడిసెలు రావన, ఎప్పుడైతే ఈ మంటల్లో కింది వర్ణాల జీవితాలు ఉన్నాయో, దానిలోనే వాళ్ల యొక్క అజ్ఞానం, అన్నీ బూడితలై, సరికొత్త ప్రాపంచిక విజ్ఞాన పరుడిగా అవతరించాలని మరియు రానున్న కాలంలో దళితులు కూడా అన్ని రంగాల్లో చైతన్యం పొంది తమ అస్థిత్వాన్ని నింపుకుని అజ్ఞాన జ్యోతి నుంచి జ్ఞాన జ్యోతిగా వెలుగుతారని భావించవచ్చు.

పై ఖండిక సారాంశాన్ని ఒక సారి గమనించు కొన్నట్లయితే, భీమన్న గారి కవిత్వం ఒక మతానికి గానీ, ఒక వర్ణానాకీ గానీ, ఒక కులానికి గానీ పట్టం కట్టదు. దేశ అభివృద్ధిలో సగభాగంగా ఉంటూ శ్రామికులు, దేశ అభివృద్ధి అనే వాహనానికి చక్రాలుగా ఉంటూ ముందుకు సాగిస్తున్నారు. అంటువంటి అభివృద్ధి కారకులైన శ్రామికులను, అగ్రవర్ణాలవారు హీనంగా చూస్తున్న దుస్థితి మారాలని, వారిలో కూడా చైతన్యం వచ్చి భారతీయ సనాతన ధర్మం ప్రకారం ఎక్కువ తక్కువలు ఉండరాదని ప్రబోధించారు.

ఆధారగ్రంథాలు :

1) గుడిసెలు కాలిపోతున్నై - బోయి భీమన్న
2) పాలేరు నుండి పద్మశ్రీ వరకు - హైమావతి



పాలేరు నాటకం - దళిత చైతన్యం

- డా॥. కె. చెన్నకేశవ రెడ్డి , తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), కడప.

నాటకం సమహారకళ. లలిత కళల్ని స్వీకరించి రసజ్ఞు లను రంజింపచేసే కళ నాటకం. దృశ్య కావ్యమైనా నాటకా నికి సాహితీరంగంలో విశేషమైన, విశిష్టమైన స్థానముంది. ఏ సామాజిక ప్రక్రియ అయినా సామాజికుల అభిరుచు లను, ఆలోచనలను ప్రతిబింబిస్తూ ఆయా కాలాలలో ఉన్న సమస్యలను చిత్రిస్తుంది. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే ప్రక్రియ నాటకం. సంఘాన్ని సంస్కరించాలన్నా తపనతో అన్ని భాషలలో నాటకం పుట్టింది. తెలుగు నాటకం సంఘసంస్కరణోద్యమం నుండి శ్రీకారం చుట్టి నేటి తెలుగుభాషా పరిరక్షణోద్యమం వరకూ అన్ని ఉ ద్యమాలకు నాటకం తనదైన రీతిలో స్పందించింది.

నాటకం దృశ్యకావ్యం కాబట్టి రంగస్థలం మీద విషయాన్ని ప్రేక్షకులు త్వరితగతిన అర్థం చేసుకొని స్పందిస్తారు. ఈ నేపథ్యంలో సమాజములో ఉన్న అనేక సమస్యలకంటే ఆనాడు బలంగా ఉన్న సమస్య కుల సమస్య. ముఖ్యంగా హరిజనుల సమస్య. బోయి భీమన్నగారు పేద దళిత వర్గంలో పుట్టివారు కావున హరిజనుల సమస్యలను స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు కాబట్టి హరిజనుల సమస్యలను ఉన్నవి ఉన్నట్లుగా ఘాటుగా, సూటిగా, నిర్భయంగా, నిర్మోహ మాటంగా పాలేరు నాటకంలో హరిజనుల సమస్యలను చిత్రించడమేకాక వారి కష్టాలకు పరిష్కారమార్గాలను సూచించారు. పాలేరు నాటకం పేరు వినగానే బోయి భీమన్నగారు, బోయి భీమన్నగారి పేరు వినగానే పాలేరు నాటకం జ్ఞప్తికి వస్తాయి. డా॥ బోయి భీమన్నగారు పాలేరు స్థాయి నుండి పద్మశ్రీ స్థాయికి ఎదిగినా గొప్ప రచయిత.

యుగయుగాలుగా అంటరానితనంతో ఆర్థిక దారిద్ర్యంతో బాధపడుతున్న హరిజనులను స్వార్థపరుల చేతుల్లో బందీలుగా చిక్కి, స్వేచ్ఛలేక స్వాతంత్ర్యంలేక బానిసలుగా, పాలేరులుగా జీవనం సాగించడం చారిత్రక సత్యం. ఇటువంటి ప్రజానికాన్ని విముక్తి కల్గించడానికి పాలేరు నాటకంలో దళిత అభ్యుదయాన్ని కాంక్షించాడు బోయి భీమన్నగారు. భూస్వాముల కండకావరం, అహం కారం, అధిపత్యాలను అధిగమించి పాలేరు నుండి డిప్యూటీ కలెక్టరు స్థాయికి ఎదిగినా ఒక దళిత యువకుని కథను బోయి భీమన్నగారు పాలేరు నాటకంగా తీర్చి దిద్దారు. నిరుపేదల ఆకలి మంటలు, వెట్టి చాకిరి వికృత స్వరూపాన్ని భీమన్నగారు ఈ నాటకంలో అత్యద్భుతంగా చిత్రించారు. చేసిన అప్పులను తీర్చలేక భూస్వాముల వద్ద పాలేర్లుగా మారి దయనీయమైన జీవితాలను గడుపుతున్న నిరుపేదల బాధలు, గాథలను గుండెలను పిండేలాగా రచయిత ఈ నాటకంలో చిత్రించారు. అంటరానితనం, నిరక్షరాస్యత, అజ్ఞానం, జమీందారులు రైతులపై చేసే పెత్తనం - ఆనాటి సమాజంలో హెచ్చుతగ్గులు వీటన్నింటి సంఘర్షణల మధ్య ఉదయించిందే భీమన్నగారి పాలేరు నాటకం.

ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రచించినా పాలేరు నాటకం దళిత చైతన్య నాటకాలకు ఒక ఆదర్శ వంతమైన అడుగుజాడగా నిలిచింది. హరిజను లను దారుణంగా హింసిస్తున్నా పెత్తందారీతనం పోవాలని ఉన్నవారు లేనివారు అనే తేడాలులేని సమసమాజం రావా లనే సందేశంతో ఈ నాటకం రచింపబడింది. ఈ నాటకం లోని ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశాలు ప్రతి నిత్యం మన కళ్ళముందు కనిపించేవే. అందుకే పాలేరు నాటకం అత్యంత ప్రజాదరణ పొందింది.

బోయి భీమన్నగారి ''పాలేరు'' నాటకం ఆనాటి సమాజానికి అద్దం పడుతుంది. తరతరాలుగా వస్తున్న జమీందారీతనం, 'కామందు - పాలేరు' అన్న వ్యక్తుల

మధ్య అంతరం ప్రస్ఫుటంగా కనిపించేది. అనాటి సమాజంలో వారసత్వంగా ధనవంతుడు (కామందు). పేదవాడు (పాలేరు) ఇదీ అనాటి సంప్రదాయం. ఇటు వంటి పరిస్థితుల్లో కథానాయకుడైన వెంకన్న పాలేరుగా జీవిస్తూ ప్రపంచదేశాలు చైతన్యం అవుతున్న తరుణంలో ఈ దాస్య జీవితం ఎంతకాలం అని ఆలోచించడమే ఈ నాటకానికి ఆరంభం.

ఈ నాటకంలోని ప్రధాన పాత్ర వెంకన్న దళిత పాలేరు పుల్లయ్య కొడుకు. తండ్రికొడుకులిద్దరు కుబేర్రావు అనే ఒక భూస్వామి దగ్గర పాలేర్లుగా పనిచేస్తుంటారు. కుబేర్రావు ఆ గ్రామ సామ్రాజ్యానికి చక్రవర్తి. హరిజనులంటే చిన్నచూపు కలవాడు. ఆ ఊరిలోనే ఉపకారి అనే బడి పంతులు ఉంటాడు. ఈయన సంస్కారి, సమాజహితం కోసం పాటుపడుతుంటాడు. ఈ నాటకంలో మరో పాత్ర సుందరం అనే ఒక కాలేజి విద్యార్థి. ఇతడు అభ్యుదయ భావాలున్నవాడు. సుందరం చెల్లెలు వనబాల. అన్నగారి సంస్కారభావాలు ఒంటబట్టిన యువతి అంతేగాక వెంకన్నకు చిన్ననాటి స్నేహితురాలు. సుందరం స్నేహితుడు రామం. ఇతడు కాకినాడ అనాధ శరణాలయంలో మేనేజరు. వీరంతా అగ్రకులాలకు చెందిన వారు. వీరే కాక పుల్లయ్యతమ్ముడు వీరేశు అతని ప్రియురాలు సీత వీళ్ళు హరిజనులే. ఇంకా దొంగ రామన్న, బంట్రోతు కొంతమంది రైతులు కూడా ఈ నాటకంలో భాగస్వాములే.

పాలేరు నాటకంలో ప్రధాన సమస్య హరిజనులు చదువుకొని డబ్బు అధికారం హోదాలు సంపాదించు కొమ్మని చెప్పడమేకాక చదువుకున్న హరిజనులు వర్ణాంతర వివాహాలు కూడ చేసుకొని కుల నిర్మూలనకు పునాదులు వేయండనే సూచన కూడ కనిపిస్తుంది.

పాలేరుగా, పశువుల కాపరిగా జీవితాన్ని సాగిస్తున్న వెంకన్న ఒక హరిజన బాలుడు. తన పాలేరు వృత్తికి మంగళంపాడి అష్టకష్టాలు పడి డిప్యూటి కలెక్టరు అవుతాడు. ఈ నాటకంలో హరిజనులు విద్యావంతులు కావాలన్నదే రచయిత ముఖ్య ఉద్దేశ్యం. వెంకన్న తాను గొప్పవాడు అయిన తర్వాత తన చిన్ననాటి స్నేహితురాలు అగ్రవర్ణానికి చెందిన వనబాలను వర్ణాంతర వివాహం చేసుకొంటాడు. ఈ నాటకంలో వెంకన్న వనబాల వివాహం ద్వారా రచయిత గొప్ప సామాజిక చైతన్యానికి బాటలు వేశారు. వర్ణాంతర వివాహాలు ప్రొత్సహించినపుడే సమాజం అభ్యుదయపథంలో పయానిస్తుందని భీమన్నగారు గట్టి సందేశమిచ్చారు. వర్ణాంతర వివాహాలను ప్రొత్సహిస్తూ ప్రజలకు ఆలోచనా కల్గించినా నాటకాలలో పాలేరు నాటకం మొదటిదిగా పేర్కొనవచ్చు.

పాలేరుగా జీవితాన్ని ఆరంభించి పాలకుడుగా ఎదిగినా వెంకన్న తనవాళ్ళను కష్టాల నుండి గట్టెకిస్తాడు. కుబేర్రావుచే కాలి తన్నులు తిని దరిద్రపుమాటలు పడలేక అగ్రవర్ణాలకు చెందిన బాల, ఉపకారి, రామం సహాయ సహకారాలు పొంది వెంకన్న అంటరానితనం నుండి విముక్తి పొందుతాడు. సమాజ ప్రగతికి సవాలుగా నిలిచిన కులవ్యవస్థ, పెత్తందారీతనం, అంటరానితనం, వెట్టిచాకిరి వంటి అవలక్షణాలపై బోయి భీమన్నగారు ఈ నాటకం ద్వారా అస్త్రాలను ఎక్కుపెట్టారు.

భూస్వాముల దౌర్జన్యాలు, రైతుకూలీల ఆక్రందనలు ఇద్దరి మధ్య ఉన్న అంతరాలు తొలగిపోయి విద్య మూలంగానే చైతన్యం వస్తుందని బడుగుజీవులు కూడా విద్యను అభ్యసించాలని ఈ నాటకం వివరిస్తుంది. అడుగడుగునా సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూ పాలేరు నాటకాన్ని భీమన్నగారు రచించినా తీరు హృద్యంగా ఉంటుంది. అందుకే తెలుగు నాటక రంగ చరిత్రలో పాలేరు నాటకం ఒక మైలు రాయిగా నిలిచింది. దళిత చైతన్య ఉద్యమానికి బలమైన పునాదులు వేసిన పాలేరు నాటకం ఒక ప్రభంజనాన్ని సృష్టించింది.

ఆంధ్రరాష్ట్రమంతటా ఉర్రూతలూపిన బోయి భీమన్న నాటకాల్లో పాలేరు, కూలిరాజు ముఖ్యమైనవి. ఒక దురాచారాన్ని కళ్ళకుకట్టినట్లుగా చూపిస్తే సామాజికులలో

వెంటనే మార్పు కలగవచ్చు. ఈ నాటకాలు నేర్చుకోవడానికి పల్లెల్లోని దళితవర్గాల వారు చదువుకున్నారంటే ఈ నాటకాలు ఎంత ప్రభావితం చేశాయో ఊహించవచ్చు. పాలేరు నాటకం చూసి పాలేరు పనిమాని చదువుకుని కలెక్టర్లుగా ఉన్నతోద్యోగులుగా, జీవితాన్ని గడిపే దళిత వర్గ యువకులు అనేకం. చదువు సారమెరిగిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఐ.ఎ.యస్ ఆఫీసర్ శ్రీ కాకి మాధవరావు గారి మాటల్లో "నేను పాలేరుని. పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు నేర్చుకొని, చదివి కలెక్టరయ్యాను. పాలేరు నాటక ప్రభావం నామీద నా ప్రజల మీద ఎంతగానో ఉంది. ఈ నాటకం రాకపోతే నేను పాలేరుగానే అనామకుడిగా మిగిలి పోయేవాడిని. బోయి భీమన్న గారి ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది" అని ఎన్నో సందర్భాల్లో అన్నారు.

ఆధార గ్రంథాలు :

1. పాలేరు నాటకం - డా. బోయి భీమన్న
2. తెలుగు నాటకం ఉద్యమ నాటకం - డా. కందిమళ్ల సాంబశివరావు
3. హరిజనాభ్యుదయం తెలుగు నాటకం - డా. వి. పోతన్న
4. తెలుగు నాటకం - డా. యస్ గంగప్ప

'గుడిసెలు కాలిపోతున్నై - సామాజిక దృక్పథం

- డా॥. జరుపుల రమేష్, హెడ్ & అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్, ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం.

'నా కావ్యాలలో దేన్ని ఎక్కడ తెరిచినా
గంటెడు ఓదార్పైనా లభించక పోదు
గుక్కెడు మధువైనా దొరక్కపోదు" అంటూ నినాదం చేసి ప్రపంచానికి, సాహిత్యం పట్ల సామాజిక దృక్పథం కలిగిన వ్యవస్థకు ఓదార్పును ఇచ్చిన భారతీయ కవి బోయి భీమన్న.

'ఏదీ నమ్మకండి, ఎక్కడ చదివినా సరే, ఎవరు చెప్పినా సరే
ఆఖరుకు నేను చెప్పినా సరే

అది మీ తర్కానికి, మీ లోక జ్ఞానానికి అంగీకారమైతే తప్ప' అని గౌతమ బుద్ధుడు అన్న మాటలు నిజానికి భీమన్న జీవితానికి సరిపోతాయి. భీమన్న తాను నమ్మిన వ్యవస్థ కోసం, ప్రజల కోసం పాటు పడిన ఆదర్శమైన వ్యక్తి. యువ సంపద కలిగిన దేశం మనది. వాళ్ళను సామాజిక చైతన్యం చేయడం కోసం 'జనరేషన్ గేప్ అంటే ఇదీ. యువకులు ముందుకుపోవడం అంటే ఇది. ఏభైయేళ్ల నాటి యువకుల్లో గల అట్టి అభ్యుదయ భావాలు, కార్యదీక్ష, ధైర్య సాహసాలు ఈ నాటి యువకుల్లో వున్నాయా?' అన్న మాటలను ఆధారంగా చేసుకొని భీమన్న గారు సాహిత్యం ద్వారా ఇచ్చిన స్ఫూర్తితో నేను ఈ వ్యాసాన్ని రాయడానికి ప్రయత్నం చేశాను.

"If there is no struggle, there is no progress. I am lighthouse rather than lifeboat. I do not rescue, but instead help others to find their way to shore, guiding them by my example. The happiest people I know are those who lose themselves in the service of others".

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప భారతీయ కవి. సమాజం 'అంటరాని తనాన్ని' విశ్వవ్యాప్తం చేసి ప్రచారం చేస్తూ, ప్రజలను సమాజానికి దూరం చేస్తున్న తరుణంలో ఒక మారుమూల పల్లెలో 1911 సెప్టెంబరు 19 న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో జన్మించాడు. వీరి తల్లిదండ్రులు నాగమ్మ, పుల్లయ్య. విచిత్ర మేమిటంటే ఏ సమాజం, ఏ గ్రంథాలైతే అంటరాని తనాన్ని ప్రచారం చేశాయో పుల్లయ్య వాటి ఆదర్శాలకు వెళ్ళి తనకు జన్మించిన ఐదుగురు కొడుకులకు (పంచ పాండవుల) పేర్లే పెట్టాడు. ఏ ధర్మానికి హరిజనులు అర్హులు కారో, ఏ విలువలను వారికి దక్కకుండా చేశాయో, అవి ఒక్కరి సొత్తు కాదు, ప్రపంచ సొత్తు అని భీమన్న గారి తండ్రి ఆశించి ఆ పేర్లు పెట్టి నిరూపణ చేశాడనిపిస్తుంది.

భీమన్న మారుమూల పల్లెలో జన్మించినా, ఏనాడు కృంగిపోలేదు. భారతీయ సమాజమే ఆధైర్యానికీ, సేవకు, విలువలకు, మానవతామూర్తిత్వం కలిగిన వ్యక్తికి 'పద్మ భూషణ్ అవార్డు ఇచ్చి గౌరవించడమే కాకుండా, సాహిత్యంలో తాను చేసిన కృషికి 'గుడిసెలు కాలిపోతున్నై' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు ఇచ్చి గౌరవించారు.

భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుందనీ, ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది అనీ ఆయన రచనలు చెపుతున్నాయి. భారత జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూ మతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించు కోవాలి. అంబేడ్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ కూడా అదే!

తన జీవితాంతం ఆయన జాతీయవాదిగానే ఉన్నాడు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయవాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్షను ఎలుగెత్తి చాటాడు.

భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' రచనను 1973 సంవత్సరంలో వెలువరించారు. ఇందులో 57 కవితలు ఉన్నాయి...గుడిసెలు కాలిపోతున్నై ప్రధాన శీర్షికతో పాటు ఇతర మూడు రకాలైన అంశాలతో కూడిన కవితలు ఇందులో ఉన్నాయి. వాటిలో 'అమ్మో దున్నలు! దున్నలు!' 'పాపం ప్రజలు' 'మారని వాడు'. ఈ మూడు ఎందుకు చేర్చాల్సి వచ్చిందో ఈ పుస్తక పీఠికలో చెప్పుకున్నాడు.

''కేవలం సాంఘిక, మత, రాజకీయ విమర్శకు సంబంధించిన రచనలను మాత్రమే ఈ సంపుటిలో చేర్చాలని మొదట అనుకున్నాను. దీనికి 'గుడిసెలు కాలిపోతున్నై' అనే పేరు పెట్టిందందుకే. అయితే నేను అనుకొన్నదొకటైతే, జరిగిందొకటైంది. నాదొక విచిత్రమైన మనస్తత్వం. వంద పేజీల పుస్తకం ప్రెస్‌లో ఇస్తే అది ప్రెస్ నుంచి బైటికి వచ్చేటప్పటికి రెండువందల పేజీలవుతుంది. ఈ గ్రంథం కూడా అలానే పెరిగింది. 'అమ్మో దున్నలు' కవితను చేర్చమన్నారు కొందరు మిత్రులు. 'వాల్మీకి వనితఅయి వుంటే' కవిత లేకపోతే ఎలా అన్నారొకరు. 'రసాదైత్వం?' గుర్తుచేశారొకరు. 'మారని వాడి మాట?' అన్నా రింకొకరు'' (ముందుమాట. 09) అని ఇందులో చేర్చడానికి కారణాలు చెప్పుకున్నారు.నేను మాత్రం కేవలం 'గుడిసెలు కాలిపోతున్నై' పరిధిలోనే కవితలను తీసుకొని ఈ వ్యాసాన్ని రాయడం జరిగింది.

భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' రచనను 1973లో రాసినా దేశంలో 1975 రానున్న 'ఎమర్జెన్సీ'ని ముందుగానే పసిగట్టాడనిపిస్తుంది. బహుశా అందుకే నేమో తన చిన్న తనంలో అటువంటి సంఘటనలు చూసినా, సరైనా సమయంలో దాన్ని వెలువరించారు.

గుడిసెలు కాలిపోతున్నై - ప్రాపంచిక దృక్పథాలు

వీనీలాకాశంలో పాఠకుడు కవి హృదయంతో సమానమైన హృదయం కలవాడుగా ఉండాలని అలం కారికులు చెబుతారు. నిరంతర కావ్య పరిశీలన వలన కావచ్చు, విభిన్న ప్రపంచ సాహిత్య పరిశీలన వలన కావచ్చు. తద్వారా అతని హృదయం విశలమవుతుంది.

'యేషాం కావ్యానుశీలనవశా ద్విశదీభూతే మనో ముకురే
వర్ణనీయ తన్మయీ భవన యోగ్యతా

తే హృదయసంవాద భాజ: సహృదయా:' అని అభినవ గుప్తుడు నిర్వచించాడు. సహృదయత్వం లేనివాడు రసాస్వాద యోగ్యుడు కాలేడని అర్థం. అలంకారికులు చెప్పినట్లు భీమన్న సాహిత్యం అర్థమవాలంటే భారతీయ సాహిత్య దృక్పథాలు, ప్రాపంచిక కోణాలు ముందుగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాహిత్యంలో ప్రధానంగా రెండు విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. 1. మన కవులను ఏ కోణంలో చూస్తున్నామూ? 2. కవులు రాసినటువంటి రచన ఆధారంగా దాన్ని పరిధిలో కవిని చూస్తున్నామా? ఈ రెండు విషయాలను దృష్టిలో పెట్టు కొని, ప్రాంత పరిధి, జాతీయ పరిధి, ప్రపంచ పరిధిలో కవులను చూడాల్సిన అవసరం ఉంది. ఈ దృష్టి కోణంలో చూస్తే భీమన్నది ప్రపంచ పరిధి కల్గిన సాహిత్యంగా గుర్తించాలి. భీమన్న తన రచనల్లో ఈ విషయాన్ని కూడా చెప్పాడు. నేను ఇప్పుడు ప్రజలకు అర్థం కాకపోవుచ్చు. వేరుగా అర్థం కావచ్చు అనడంలో ప్రధాన ఉద్దేశం పాఠకులు భీమన్నను చూసే దృష్టి కోణమే కారణం.

''కవి అవగాహన, సంస్కారం, కళాత్మక దృష్టి పాఠకుడి అవగాహనతో సంస్కారంతో కళాత్మకతతో ఏకీభవించాల్సిన పనిలేదు. పూర్తిగా ఏకీభవించడమూ అసాధ్యమే. ఏ పాఠకుడికైనా తన జీవితానుభవం, ప్రపంచ పరిశీలన, హృదయ ధర్మం, సిద్ధాంత పరిచయం మొదలైన వాటిని బట్టి ఒకానొక ప్రాపంచిక దృక్పథం ఏర్పడుతుంది. ఇది వ్యక్తిగత దృక్పథం. ఈ దృక్పథాన్ని విడిచి పాఠకుడు ఒక రచనను అనుశీలించలేడు. అంటే పాఠకుడు ఒక రచనను ఎంత వస్తుగత దృష్టితో చూస్తాడో అంతే వ్యక్తిగత

దృష్టితోనూ చూస్తాడని గమనించాలి'' అని పాపినేని అన్నారు.

కాబట్టి, పాఠకుడి వ్యక్తిగత దృక్పథం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితమైంది కాదు. అనేక అంశాలకు లోబడి ఉంటుంది. ఈ రోజు భీమన్న సాహిత్యం కూడా దానికి లోబడే ఉంటుందని మనం చెప్పుకోవాలి. కారణం పాఠకుడే రచనను విశ్వవ్యాప్తి చేస్తాడు. కాబట్టి సాహిత్యాన్ని పరిశీలించడానికి సాహిత్యానికి మాత్రమే పరిమితమైన ప్రమాణం గానీ, దృక్పథం గానీ, సిద్ధాంతం గానీ ఉండవు. అది జీవితంతో ముడిపడి ఉంది.భీమన్న సాహిత్యాన్ని పరిశీలించడానికి విశాలమైన ప్రాపంచిక దృక్పథం ఉండాలి తప్ప సాధారణ దృష్టికోణం సరిపోదు. అందుకే నేను అతనిని 'ప్రాపంచిక దృక్పథం' కలిగిన కవిగా అభివర్ణిస్తున్నాను.

సామాజిక దృక్పథం

"For successfull revolution it is not enough that there is discontent. what is required is a profound and thorough conviction of the justice, necessity and importance of political and social rights"

- Dr. B.R. Ambedkar

"Virtue, by definition, is the moral excellence of a person. Morally excellent people have a character made-up of virtues valued as good. They are honest, respectful, courageous, forgiving, and kind, for example... Virtues need to be cultivated to become more prevalent in life" భీమన్న కూడా సామాజిక ధర్మమే కోరుకున్నాడు. వాటి కోసం పరితపించాడు. దానిని సాధించడానికి తనకున్న శక్తిని ఉపయోగించాడు. అందుకు ప్రపంచాన్ని తన వెంట నడిపాడు. అందరూ కలిసి నాటుకుపోయిన రుగ్మతలను పారదోలుదాం అన్నాడు. దానికోసం ఎలా రాశాడో కవితలను పరిశీలిద్దాం.

భోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కవితలో ''గుడిసెలు కాలిపోతున్నై /ఓహో, కాలిపోతున్నై /ఎవరి గుడిసెలు, పాపం!/మాల మాదిగలవే అయివుంటై/ గుడిసెలు మరెవరికుంటై?/చాలా మందికే వుంటైలే / అసలు ఈ దేశ ధర్మమే అంత!/అయితే - ఈ గుడిసెలు / ఏడాది కొకసారైనా కాలిపోతుంటై! / ఒకసారి కాలి పోయిన గుడిసెలు /మరి మళ్ళీ కాలిపోవడానికి / ఎక్కడి నుంచి వస్తుంటై? / అవును - నిజమే! / ఎక్కడి నుంచి వస్తుంటై?'' (పుట: 01)

గుడిసెల్లో పుట్టి, గుడిసెల మధ్య పెరిగిన భీమన్నకు గుడిసెలు ఎందుకు కాల్తాయి. ఆ గుడిసెల స్థానంలో వేరే గుడిసెలు ఎలా లేస్తాయి మొదలైన విషయాల పట్ల అవగాహన ఉంది. భీమన్న చిన్నప్పుడు స్కూల్లో చదువుతున్నప్పుడు పక్కన హరిజన గుడిసెలు కాలిపోతున్న సందర్భంలో నేరుగా వెళ్ళి వాటిని ఆర్పిన అనుభవమే ఈ రచనకు మూల నేపథ్యం.

ఎందుకు మాల మాదిగల గుడిసెలు కాలిపోతాయి? వాటి వెనుక ఉన్న తాత్విక కోణం ఏమిటి? ప్రపంచంలోనేనా? లేక మన దేశంలోనా? ఎవరి గుడిసెలు కాలిపోకుండా వీరివే ఎందుకు కాలిపోతాయి? ఇప్పుడేనా? తరతరాలుగా కాలిపోతున్నాయి? అనే ప్రశ్నలు ఈ సమాజానికి అందించాడు కవి. వీటికి సమాధానం నిచ్చెనమెట్ల వ్యవస్థలో పాతుకుపోయిన 'కులం' అని చెప్పవచ్చు.

''కుల వ్యవస్థ అందరికీ ఒకే విధంగా వర్తించే కార్య రంగాన్ని నిరోధిస్తుంది. తద్వారా హిందువులు తమదైన సామాన్య జీవన విధానం, చైతన్యాలతో ఒక సమాజంగా ఏర్పడకుండా నిరోధించింది. వ్యక్తులు ఎవరికి వారుగా మొత్తం పనిలో తమ వంతు పని చేసే వారుగా విడివడి వుండటానికి మాత్రమే అది అనుమతిస్తుంది'' అని డా. బి.ఆర్. అంబేద్కర్ అన్నారు.

ఇందులో ఉన్న అంతర్యం చూస్తే... హిందూ కుల సమాజంలో వైరుధ్యాలు ఎన్ని వున్నా ప్రజల మధ్య లోతైన సాంస్కృతిక ఐక్యత ఉంది. అలా ఉన్నప్పుడు మిగితా

విషయాల్లో సాంస్కృతికంగా ఒకేతాటి పై ఉండగలరు. తద్వారా అనేక సమస్యలు సమసిపోతాయి. ఈ సామాజిక ధర్మమే ఈ గుడిసెలు కాలిపోతున్నాయి. వీటిని ఆపడానికి దేశం నలుమూలల నుండి చైతన్యం వస్తే సరిపోదు. చైతన్యం రావాల్సిదే సామాజిక ధర్మంలో. సామాజిక ధర్మంలో చైతన్యం రానంతవరకు ఈ గుడిసెలు ఇలాగే కాలిపోతుంటాయి.

'అదే మన ధర్మంలోని రహస్యం / ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు/మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!/ పోతుంటై/ పుట్టుకొస్తుంటై!/ ఈ విషవలయం సాగడం ఎంత వరకు/ రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు!" (పుట:1,2)

హిందువులలో వెనుకబడ్డ శ్రేణుల వర్ణ వ్యవస్థ వలన ప్రత్యక్ష కార్య చరణకు పూనుకోలేపోయారు. ఎందుకంటే ఆ వ్యవస్థ వారిని పూర్తి స్థాయిలో వైకల్యానికి గురి చేసింది. కాని సమాజం అట్టడుగున వున్న వెనుకబడ్డ జాతులు తాము వున్న స్థితి నుండి తప్పించుకునే మార్గం లేక, తప్పించుకోడమెలాగో తెలియక నిరంతర దాస్యంతో రాజీపడ్డాయి. ఏ వ్యవస్థ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ఆ ధర్మాన్ని, ఆ రూపాన్ని భీమన్న ఈ కవిత ద్వారా మన కళ్ళ ముందు ఉంచాడు. విశాలమైన దృష్టికోణంతోనే 'అదే మన ధర్మంలోని రహస్యం' అనే పంక్తులను వాడాడు.

ఈ దేశంలో గుడిసెలకు కేరాఫ్ ఆడ్రస్ మాల మాదిగలేనా! లేక ఈ దేశమే గుడిసెలకు కేరాఫ్ ఆడ్రస్ అని భావించవుచ్చునెమో! ఎవరి మనస్సులో 'వికసించిన చైతన్యం', 'శ్రామిక చైతన్యం', 'వలస చైతన్యం' పట్ల అవగాహన ఉండదో వాళ్ళందరూ గుడిసె వాసులే అని భావించవచ్చు. కానీ, ఇక్కడ పేదరికంతో జీవితాన్ని గడుపుతున్న మాల మాదిగలు ఆ గుడిసెల్లో ఉన్నంత వరకు సామాజిక ఎదుగుదల, అభివృద్ధి ఫలాలు పొందలేరు. నిత్యం వాళ్ళు పేదరికాన్ని అనుభవించాలే కాని, వాటి నుండి బయటపడటానికి ఈ సమాజం అవకాశం ఇవ్వడం లేదు. ఒకవేళ వాళ్ళు ఆ వ్యవస్థ నుండి బయటికి రావడానికి ప్రయత్నిస్తే అటువంటి అవకాశం ఈ సమాజం కల్పించడం లేదు. దళితులు అభ్యున్నతిని కాంక్షించకుండా, వారు ఏ పేదరికంలో ఉన్నారో, ఏ గుడిసెల్లో జీవనాన్ని గడుపుతున్నారో అక్కడే ఉంచి, దాని చుట్టూ బయటికి రాకుండా ఈ సమాజం 'విషవలయం' సృష్టించిందని పరోక్షంగా నిందిస్తారు. సమాజంలో మనమే అవకాశాన్ని సృష్టించుకోవాలి. కాలిపోతున్న గుడిసెల స్థానంలో మరో గుడిసెను కాకుండా భవనాలు లేపుకోవాలని, ఆధునిక భావాలను నూతనంగా ఆలోచింప చేశాడు భీమన్న. వాటి నుండి కొత్త ఉషస్సులు, ఉగాది పుట్టుకు రావాలని ఆదేశిస్తున్నాడు. పాతది పూర్తిగా సమిసిపోకుండా కొత్తది తేవాలనే 'వలస చైతన్యాన్ని' అభ్యుదయ కోణంలో కవి ఆశిస్తున్నాడు. అంటే సాహిత్యంలో భీమన్న నూతనంగా 'వలస చైతన్యాన్ని' ఆశించాడు. ఒక గుడిసె స్థానంలో మరొక గుడిసె మళ్ళీ మళ్ళీ ఆవిర్భావించడంలో సంచారిక జీవనాన్ని తెలిపాడు.

'మానవుడంటే ఒక జంతువు / మతం అంటే ఒక రకం పిచ్చి / ఒకొక జంతువుకి ఒకొక పిచ్చి/ మానవుడికి మత పిచ్చి/ హిందువుడికి అదనంగా / ఒక విశ్వ సమన్వయ పిచ్చి" (మతం ఒక పిచ్చి. పుట:08)లో చెప్పాడు. వాస్తవానికి పీఠికలో " మానవులను నేను మూడు తరహాలుగా విభజిస్తున్నాను. 1. పులులు 2. నక్కలు 3. గొర్రెలు" అని (పుట:12) వివరించాడు.

"సమాజానికి మతం అవసరం లేదని కొంతమంది అనుకుంటారు. కాని నేను దీంతో ఏకీభవించబోను. మతం, దాని పునాదులు మానవ జీవితానికి సమాజపు కట్టుబాట్లకు, ఆచార వ్యవహారాలకు అత్యవసరమైన వన్నది నా భావన" అని అంబేద్కర్ అభిప్రాయ పడ్డాడు.

కానీ, ఆధునిక కాలంలో దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. మంచి కంటే చెడుయే ఎక్కువగా ఉంది. ఎక్కడికైనా వెళితే ఏ కులస్తుడు అనే ప్రశ్నతో పాటు ఏ మతస్తుడు అనే ప్రశ్నలు విరివిరిగా ఎదురౌతున్నాయి.

అందుకే దీన్ని అంతంలోనే అరికట్టాలనే కవి కోరిక నేటికీ నెరవెరలేదు. వ్యవస్థలో ఉన్న దుర్మార్గాన్ని మాత్రం నేటి ప్రజలు ముందుగానే గ్రహించగలిగారు! అందుకే కవి పైన వివరించిన మూడు రకాలైన మనుషులను చెప్పడంలో అర్థం కూడా ఇదే. జంతువులకు పులులకు, నక్కలకు, గొర్రెలకు లేని కులం, మతం మనుషులకు ఎందుకు అని విమర్శించాడు. ప్రకృతిలో సాధారణంగా పులిని చూసి నక్కలు భయపడడం, నక్కను చూసి గొర్రెలు భయపడడం సామాజిక ధర్మం. కానీ ఇదే ధర్మం మానవుల్లో ఎందుకు అని కవి ఆశ. తెలియకుండానే చాలా ప్రబలంగానే నాటుకుపోయింది.దాన్ని నిర్మూలించడమే ప్రధాన ధ్యేయం అంటూ ఇలా అంటాడు.

"ఓరి, మూర్ఖుడా, మతం విషం రా, విషం / నల్ల మందన్నాడెవడో, అది అబద్ధం/ మతం విషం, ఆత్మనే చంపుతున్న విషం/ నానా విషాలు కలిపిన కషాయం/ అమృతం అవుతుందా, బాబూ?/ నీ నానామత సమన్వయ ప్రయత్నమూ అంతే/ అది విషం, దాన్ని సాంతం నిర్మూలించి పారెయ్" (పుట:9)

మనిషిని స్వతంత్రమైన నైతిక జీవనానికి అనుర్ముడుని చేసి, సమాజం విధించిన నిబంధనలకు కట్టుబడి మనిషి జీవించేలా చేసే ఈ మతాన్ని నాశనం చేయాలని కవి ఆలోచన. మన హిందూ ధర్మంలోని మతం అనే పేరుతో చెలామణి అవుతున్నది మతం కాదనీ...అది ఒక కషాయం అని కవి భావించాడు. అందువల్ల సమాజం వెనుకబడడానికి కారణమైన వాటిలో బలమైనది మతమే అని, దాన్ని సర్వనాశనం చేయాలని ఆశిస్తున్నాడు. మతం పేరుతో చెలమణి అవుతున్న చట్టాలను రద్దు చేసి సమన్యాయం కలిగించాలని, లేదంటే జీవితంలో అమృతం అని చెప్పి అందులో విషం కలిపే వాటిని పసిగట్టాలనీ, లేదంటే 'నానా విషాలు కలిపిన కషాయం'లాగే ఉండిపోతుందని ఆవేదన చెందుతాడు. వాటినే ఈ కవితలో వివరించాడు.

తాత్విక కోణం

"The oppressed are allowed once every few years to decide which particular representatives of the oppressing class are to represent and repress them" (Karl Marx) అన్నారు. కార్ల్ మార్క్స్ అన్నట్లు అణిచివేతకు గురవ్వడానికి తాత్విక కోణాలు కూడా ప్రధానమైన కారణం. తాత్విక విధానంలో జీవన సారం దాగి ఉంటుంది.వాటి వెంబడి ప్రజలు తిరుగుతుంటారు. ఆ బరువును మోసుకుంటూ వెళ్తారు. దాన్ని భీమన్న కూడా చాలా చక్కగా వింగడించారు.

భీమన్న రాసిన 'కాల్తీ రాజ్యపు దేవుడు గారు' అనే కవితను చూస్తే " దేవుడు గారా, నమస్కారం!/ మస్కా కదండీ, నమస్కా / ఆ తర్వాత 'రం' వుంది లెండి/ రండి, కూర్చోండి" (పుట:3) అంటూ తాత్విక కోణాన్ని ఆవిష్కరింపజేశాడు. భీమన్న ఈ కవితలో సర్వ మతాల సారాంశం ఒక్కటే నన్నట్లు అందరిని ఒకేచోట చేర్చాడు. 'చక్రం, శూలం, శిలువ, చంద్రవంక / నామం, విభూతి, పిలక, గెడ్డం/ గళ్ళలుంగీ, నెక్ టై, దొర టోపీ/ అదేం వేష మండోయ్, బాబు / విశ్వమతోన్మాదు లందరికీ / ఏకైక ప్రతినిధా ఏమిటి మీరు?" (పుట:04) ఈ కవిత టైటిల్‌లోనే చాలా గమ్మత్తైనా అర్థాలు గోచరిస్తాయి. కొన్ని శతాబ్దాల అణచివేత కనిపిస్తుంది. ఈ దేశంలో మతం ముసుగులో, దేవుడు పేరు చెప్పి చేసే మోసాలు ఎన్నో. ఆ కోణం బలంగా ఈ దేశంలో నాటుకుపోయింది. నాటుకోపోయిన ఆ కాల్తీ దేవుళ్ళను తరిమేద్దాం. నిజమైన వాటి కోసం అందరూ కలిసి వెతుకుదాం.దాన్ని సాధించడం కోసం అందరూ కలిసి పోరాడుదాం అనే లౌకిక సత్యాన్ని చెప్పడంలో కవి యొక్క గొప్పతనం కనిపిస్తుంది.

విశ్వాన్ని నేడు శాసించే కోణాన్ని విప్పి ప్రక్షాళన చేయాల్సిన సమయం ఎంతో దూరంలో లేదు. నేడు అన్ని విధానాలు ఒకేచోటు చేరాల్సిన సమయం ఆసన్నం అయింది. అందుకే ' మా జాతీయ పిండివంట రెడీగా వుంది/ కొంచెం అరగించి వెళ్ళండి' అంటూ సమైక్యతను చాటుతాడు.

మరొక కవితలో ' కులమతాలకు ఉమ్మడి కాష్ఠం' లో జీవన సత్యాన్ని ఆవిష్కరిస్తాడు.''క్షణం ముందు వరకూ/ అదొక కోట్ల విలువైన మహా విమానం/ ఇప్పుడది వట్టి మసి, మట్టి!/ అందులోని ప్రయాణికులు/ కోటీశ్వరులు, కుబేరుని వారసులు/ ఇప్పుడు వట్టి పీనుగు పెంటలు" (పుట:13) ఈ దేశంలో డబ్బు,హోదా, కులం, మతం అన్ని వీర్రవీగే చోట చివరికి తాను చేరాల్సిన ప్రాంతాన్ని చాలా గొప్పగా ఈ కవితలో చిత్రించాడు. నేడు కరోనాతో ప్రపంచం అంతా ధనిక, పేద లేకుండా ఎటువంటి మరణాలను చూశామో కవి కొన్ని దశాబ్దాల ముందే మనకు అటువంటి దృశ్యాన్ని ఒక విమానం కూలిపోయిన సంఘటన రూపంలో చిత్రించాడు. "స్త్రీలు, పురుషులు, బాలలు, వృద్ధులు / హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు/ మంత్రులు, ఉద్యోగులు, వ్యాపారులు, చారులు/ క్షణం ముందు వరకూ ఎన్నో రకాల వాళ్లు / ఇప్పుడందరూ ఒకే రకం కళేబరాలు / జాతి వృత్తి మతాతీత మాంసపిండాలు" (పుట:13) ప్రపంచం యొక్క గోప్యతను చెప్పాడు. జీవితాన్ని ఎంతో చక్కగా అవగాహన చేసుకుని ముందు చూపును ప్రదర్శించాడు. ఇటువంటి సంఘటనలు నిత్యం జరుగుతుంటాయి. కానీ, వాటిని ఒకే చోట చేర్చి 'సమానత్వం' కావాలని కోరడం అభ్యుదయ భావాన్ని కోరుకున్నాడు కవి. మన అంతర్గత శక్తిని ఎంత ఎక్స్‌ప్రెస్ చేస్తే అది అంతగా సృజనాత్మకతకు దారితీస్తుంది.

ఇక కవి యొక్క అసలైన కోణాన్ని చూస్తే ...కులం మెడలో వేసుకుని తిరిగే వ్యక్తుల మధ్య, కోట్లకు వారసులని చెప్పుకునే వారికి 'ఇప్పుడందరూ ఒకే రకం కళేబరాలు' అనడంలో ఎంతో జీవన సత్యం దాగి ఉంది. ఇక్కడ కులం లేదు, మతం లేదు. అందరూ ఒకే రకం కళేబరాలు ఉన్నాయి. కళేబరాలు నాది ఏ కులం అని అడగడం లేదు, నన్ను కేవలం మా జాతి, మా కులం వాళ్ళే చూడాలనే వాదనను కూడా అక్కడ చెప్పడం లేదు. కాబట్టి ప్రపంచం ఇటువంటి దృష్టికోణం లేకుండా ఉండకూడదని, విశాలదృక్పథం కలిగి 'కులం' అనే జాడ్యాన్ని వదలాలనే భావనను ఈ కవిత ద్వారా వివరించాడు.

నేడు జరుగుతున్న ఈ పరిణామాలకు కారణం ఎవరూ? జీవితంలో మౌలికమైన అంశాలను, ప్రక్రియలను పవిత్రీకరించడం ద్వారా వాటి పరిరక్షణకు సమాజం బాధ్యత వహించాలి. అప్పుడు సమాజం విధించిన నియమ నిబంధనలను కూడా అది పవిత్రీకరిస్తుంది. కులం, మతానికి మధ్య గల నైతికత సంబంధాన్ని కవి చెప్పాడు. సమాజంలో సమానత్వం ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రపంచ మానవుడిది ఒకటే కులం, ఒకటే మతం. మనుషుల్లో తేడాలు లేవు. కాలమే తమ అవసరాల కోసం వాటిని సృష్టించిందనే భావాన్ని చెప్పాడు. 'ఏది ముఖం, ఏది నడుం, ఏది కాలు, ఏది చేయి' అనే పంక్తుల్లో చాతుర్వర్ణ వ్యవస్థ కనిపిస్తుంది. మనిషి ఎలా పుట్టాడో మనువు చెప్పిన వాక్యాలు మనందరికీ తెలిసిందే. కానీ మరణంలో అందరూ ఒకేచోట కలిసిపోయారు. అందరూ సమానులే అనే అంతిమ జ్ఞానాన్ని ఈ సమాజం గ్రహించాలనే లౌకిక రాజ్య భావనను కవి ఆశిస్తున్నాడు.

అందుకే 'భగవంతుడొక కొట్టిన పిండి' కవితలో "దేనికైనా, బ్రహ్మజ్ఞానే సమర్థుడు, స్వామీ/ బ్రహ్మజ్ఞాన సంపన్నుడికి / భగవంతుడొక కొట్టిన పిండి/ దానితో అతడు పకోడీలు వండుకు తినవచ్చు" (పుట:15) నేటి అగ్రవర్ణ వ్యవస్థ చేసే పనిని తెలియజేశాడు. ఉన్నత వర్గాల్లో కొన్ని కులాల వాళ్ళు మాత్రమే ఈ రాజ్యాన్ని నడుపుతున్నారు. సామాన్యుడు, దళితుడు, గిరిజనులు వాళ్ళను భుజం పై మోస్తున్నారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల వాళ్ళు కూడా రాజు అయ్యే కాలం ఎప్పుడొస్తుందో చూడాలి. భగవంతుడు అనే వాడు ఉన్నాడో లేడో? తెలియదు కానీ, ఆధునిక కాలంలో మాత్రం ఆ జ్ఞానం ఉంటే ఎక్కడైనా తన మాటల ద్వారా బతికెయ్య వచ్చు. మిగతా వాళ్ళు శ్రమ చేసినా కూడా

బతకలేని తరుణం ఉన్న ఈ దేశంలో మార్పు ఎప్పుడోస్తుందోనని ఆశిస్తున్నాడు కవి.

'నా వారసత్వపు హక్కులు' కవితలో "విశ్వాన్నే ఆర్యం చెయ్యాలనుకొని/ తాను కులంలేని వాడైనా బ్రహ్మర్షి అయి / నమ్మదగ్గ భార్య కోసం/ నానా దేశాలూ వెతుకుతున్న వశిష్ఠుడికి/ ఆ మాల మాదిగ పిల్ల అరుంధతే దొరక్కుండావుంటే" (పుట:06) ఈ కవితలో నిజాన్ని బద్దలుకొట్టిన విధానం కనిపిస్తుంది. ఈ దేశంలో నేను కులం అనే పదం వల్ల ఈ సమాజానికి అంటరాని వానిగా ఉన్నానో, ఏ వ్యవస్థ నన్ను నాగరిక సమాజానికి దూరం చేసిందో, ఏ వ్యవస్థ నన్ను మనుషుల్ని తాకనీయకుండా చేసిందో వాటన్నింటికి సమాదానం వాటికి సమాధానాన్ని చాలా సున్నితంగా కవి ఈ కవితలో చిత్రించాడు. ఆ నాడు అరుంధతి లేకపోతే అనే ప్రశ్నను ఎవరు వేసుకోవాలి? సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

కవి అక్కడితో ఆగిపోకుండా తన అస్తిత్వాన్ని ఇలా అంటున్నాడు. "ఆర్య జాతి వ్యక్తిత్వానికే ఆదిపురుషుడు/ వ్యాసుడు మాలమాదిగ వాడే కదా? ఈ నాడు అతడు అగ్రవర్ణం వాడు/ అతడి వంశం వాణ్నినేను అంత్యజుణ్ని/ ఇదే మన భారతీయ సమాజ ధర్మం/ నేటి దాకా సాధించిన పురోగమనం"(పుట:07) నిక్కమైన నిజాన్ని చరిత్రలో ఎలా దాచారో వివరించాడు. వారికి ఒక న్యాయమా!, మాకు ఒక న్యాయమా! కాదు, కాకూడదు. అందరికి ఒక్కటే న్యాయం కావాలి. చరిత్ర అందరికి సమానమే. చరిత్రను మార్చకూడదు. నిజాన్ని స్వీకరించే గుణం ఉంటే చాలు. మేము ఆ వారసులమే నని వారి హృదయంలో ఉంటే చాలు. ఆర్యజాతి మేమే మూల పురుషులనే నిజం కఠినంగా ఉండవచ్చు కానీ, ఏదో ఒక రోజు వారి చేత పుస్తకాలు రాసే రోజు ఎంతో దూరం లేదు, అతి తొందర్లోనే ఉందనే భావనను తెలియజేశాడు. అందుకే కవి "వీటిని త్రవ్వి తీసి/ ఇవి నావని ప్రపంచానికి చూపి/ ఆ తర్వాత, గర్వంగా అవతల పారేస్తాను/ ఠీవితో తలెత్తుకు తిరుగుతాను"(పుట:7) అంటూ సగర్వంగా తాను ఏ వంశ వారసుడో వివరంగా చెప్పాడు. సమాజం దాచిన నిజాన్ని, సమాజమే ఈ ప్రపంచానికి చాటి చెప్పాలి.

"మన కంటికి కనిపించే బాహ్య వాస్తవికతకీ సాహిత్యంలో కన్పించే వాస్తవికతకీ స్వభావంలో తేడాలు లేకపోయినా, అవి రెండూ వేర్వేరు. నిజానికి సాహిత్యంలో కన్పించేది వాస్తవ ప్రతిఫలనమేగాని కేవల వాస్తవం కాదు. అదే సమయంలో అది అవాస్తవం లేదా మిథ్య కాదు. ఈ వాస్తవానికీ వాస్తవ ప్రతి ఫలనానికీ వున్న భేదాన్ని కళాత్మకం నిర్ణయిస్తుంది" (పాపినేని. పుట: 21) అన్నాడు. అందుకే కవి తలెత్తుకు తిరుగుతాను' అనే ధైర్యాన్ని ఈ సమాజానికి విసిరాడు. దాన్ని స్వీకరించే ధైర్యం కావాలి! ఆ ధైర్యాన్ని నేనే నని, అందుకు తలెత్తుకు తిరుగుతాను' అని తన కవితా వారసత్వాన్ని ఈ సమాజాన్ని అందిచాడు కవి. హెన్రీ అన్న మాటలు చూస్తే... "It can not be necessary to prove to anybody who reads this work that ideas govern the world, or throw it into chaos, in other words, that all social mechanism rests upon opinions" భీమన్నకు సరిపోతాయి. కాబట్టి నిజం నిరూపించడానికి ఎవరి దగ్గర కెళ్ళవలసిన అవసరం లేదని సత్యాన్ని గ్రహించాలని అర్థమౌతుంది.

డెమోక్రసీ - మేము - నా అస్తిత్వం :

" The democracy will cease to exist when you take away from those who are willing to work and give to those who would not" (Thomas Jefferson)

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం.భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం.అనేక మతాలకు, కులాలకు నిలయ స్థానం. ఇంత పెద్ద దేశాన్ని నడిపే హక్కు సామాన్య ప్రజల ఓటు హక్కు. అనాడు బి.ఆర్. అంబేద్కర్ ఎంతో కష్టపడి రాజ్యాంగంలో అందరికి ఓటుహక్కును కల్పించాడు. ఈ దేశంలో 'నేను అనే ధోరణి నుండి నా వరకు స్వార్థం చేరిపోయి కుటుంబ పాలన వరకు చేరుకుందనే భావన. కాబట్టి ఈ దేశంలో అస్తిత్వం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అందుకే కార్ల్ మార్క్స్ "Democracy is the road to socialism"

అని అభిప్రాయపడ్డాడు. భీమన్న ఈ కోణంలో చెప్పిన కవితలు ఇప్పుడు చూద్దాం.

'గుద్ది పారేస్తాం' కవితలో "అభ్యర్థి గారికి స్వాగతం/ గతం కాదండీ,మీకు మా / అదే నండి, అదే వోటు కాగితం/ మా వోటు కాగితాలన్నీ మీకే నండి/ మా అంటే గౌరవవాచకం కాదండి, బాబు/ అది బహువచనేం/ మీ ఏక వచనమే/ మా బహువచనం/ మీ రొక్కరు / మేం లక్షా పదివేల వోటు కాగితాలం/ మా వోట్లన్నీ మీకే నండి/ మా గుడిసెలన్నీ మీవే నండి/ మీరేం చెప్పక్కర్లేదు/ మీరు చెప్పదలిచిందంతా/ మాకు కంఠంతా గానే వుందండి/ మీ (ఎన్నికల) గుర్తా/ మీ గుర్తు తెలియక పోవడమేమిటి/ గుర్తుపట్టి గుద్దడమే గా/ ఓ, మా వాళ్ళకు తిక్కరేగాలే గాని/ ఒకే గుద్దడం గుద్ది పారేస్తారు/ ఇక వెళ్ళిరండి, బాబు!/ మేం ఇంకా గంజి కాచుకోలేదు" (పుట:2,3)

అంబేద్కర్ దృష్టిలో 'ఒక వ్యక్తి ఒక ఓటు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే దైనందిన వ్యవహారాల్లోనూ, ఒక నిర్దిష్ట సమయం ముగిసిన అనంతరం ప్రభుత్వ పనితీరును సమీక్షించే అవకాశం ఓటర్లకు కల్పించడం. భీమన్న దృష్టిలో కూడా ఓటు అంటే సామాన్యుడు గుద్ది పారేస్తారు' అనే ధోరణిని వ్యక్తం చేశాడు. ఇక్కడ ప్రధానంగా మూడు అంశాలను గమనించాలి. 1. ప్రజలు 2. ప్రాంతం 3. పేదరికం.

ముందుగా ప్రజలను పరిశీలిస్తే...ఓటు ఎటువంటి ప్రజలు ఉపయోగించుకుంటారు. సాధారణంగా ఓటు హక్కును అందరికి కల్పించడం జరిగింది. కానీ, ఈ దేశంలో అత్యధిక ఓటు హక్కును ఉపయోగించుకునేది పేదవాళ్ళే కొన్ని సర్వేలు చెపుతున్నాయి. ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వం యొక్క ఒక రూపం కాదు, సామాజిక సంబంధ రూపం. సానుకూల, సామాజిక వ్యవస్థ ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు ముఖ్యావసరమని చెప్పవచ్చు. దీనికి ఆయుధం ప్రజలు. భీమన్న 'మా వాళ్ళకు తిక్కరేగాలే గాని" అనే పంక్తుల్లో ఈ దేశ అజ్ఞానం దాగి ఉంది. రెండోది ప్రాంతం. ఓటు హక్కుకు ప్రాంతం కూడా చాలా విలువైనది. ఏ ప్రాంతంలో ఎటువంటి ప్రజలు ఉంటారు! వాళ్ళ దగ్గర ఎటువంటి కల్తీ విధానంతో కూడిన మాటలు వాడాలో ఈ దేశంలో చాలామంది నాయకులు ముందే చదివేశారు. ఆ పుస్తకం ఎక్కడ దొరుకుతుందో ఇంతవరకు అడ్రాస్ తెలియలేదు. మీ గుర్తు తెలియక పోవడమేమిటి? అనడంలో వ్యంగ్యాత్మక ఉంది.

మూడోది పేదరికం. దీన్ని వెనుక ఉన్న అసలు రహస్యం పేదరికం. పేదరికం మనిషిని చాలా దూరం తీసుకెళ్తుంది. 'మేం లక్షా పదివేల వోటు కాగితాలం/ మా వోట్లన్నీ మీకే నండి/ మా గుడిసెలన్నీ మీవే నండి' అంటూ దేశంలో ఉన్న ఓటులో దాగిన పేదరికాన్ని తెలిపాడు. కాబట్టి మానవులు ఒక క్రమపద్ధతిలో సాగేలా నియంత్రించి వారిని ఒకరిగా కలిపి ఉంచే సామాజిక, ఆర్థిక, రాజకీయ విలువల రూపకల్పనతో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం, కల్పించే అవసరాన్ని పెంపొందింపచేసే జీవన విధానమే ఈ డెమోక్రసీ యొక్క ప్రధాన సిద్ధాంతం. అటువంటి విధానం కేవలం పేపర్ వరకే పరిమితం కాకూడదు. ఆచరణలో పెట్టాలి. దాని ఫలితాలను ప్రజల దాకా తీసుకెళ్ళ గలగాలి. అప్పుడుగాని 'ఓటు' విలువ మరింత పదునుగా తయారవుతుంది. కానీ ఇన్నేళ్ళ భారతదేశంలో ఓట్లు వేస్తున్నా అభివృద్ధి అనేది అక్కడే ఉండిపోయింది. భారతదేశ చరిత్రలో అస్పృశ్యులకు రాజకీయ ఉనికిని ఓటుహక్కు ద్వారా లభించింది.

'బానిసల జాబితా' కవితలో "ప్రభూ! మా పేర్లనూ/ వోటర్ల జాబితా నుంచి తొలగించి/ బానిసల జాబితాలో చేర్పించండి!/ చచ్చి మీ కడుపున పుడుతాం!/ బానిసల జాబితా అనేది ఇప్పుడు లేదంటారా!/ పూర్వం రాజుల పాలనలో వుండేదే!/ ఇప్పుడిది ప్రజల పాలన అంటారా!/ బానిసల జాబితా స్థానంలో/ వోటర్ల జాబితా వచ్చిందంటారా?/...ఆ వోట్లేవో మీ దొరలే వుంచేసుకోండి/ మా గుడిసెల్లో మమ్ము బ్రతక నివ్వండి/ మేం వెనకబడ్డ వాళ్ళం, బలహీన వర్గాల వాళ్ళం/ విలువైన దేన్నీ

కాపాడుకోలే...ఈ వోట్ల చెలగాట్లతో మమ్మల్ని చంపకండి/ దయచేసి జాబితా మార్చెయ్యండి''(పుట:12) ఈ దేశం లో దళితులు జీవనతత్వం కనిపిస్తుంది. భీమన్న ఉద్దేశంలో కూడా మా జీవితాలను రోడ్డుకు లాగకండి, దయచేసి మా బతుకులు బతకనియ్యండి అనే ధోరణిని కవి చెప్పాడు. అందుకే కవి మరొక కవితలో ఇలా అంటున్నాడు.

''ఈ మానవ లోకంలో/ ఒకొక్కడి కొకొక్క రోగం/ పైకి బాగానే కనిపిస్తారు/ లోపల ఏదో కుళ్ళు, ఏవో వుళ్ళు!''(పుట:23) ఆధునిక లోకం పోకడే ఇది. దీన్ని ఏనాడో భీమన్న ఈ కవిత ద్వారా విప్పి చెప్పాడు. అందుకే బోయి భీమన్న 'ప్రాపంచిక దృక్పథం' కలిగిన కవిగా, అభ్యుదయ భావాలు కలిగినవాడిగా, ఆదర్శమైన వ్యక్తిత్వం కలిగిన మనిషిగా మనకు ఈ కవితల ద్వారా కనిపిస్తాడు. ఇలా అనేక విషయాలు మిగిలిన కవితల్లో వివరించాడు.

చివరగా...

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఎందుకు ఇప్పుడు భీమన్నను మళ్ళీ చదవాలి? అనే ప్రశ్న వేసుకుంటే ''గత కాలం మేలు వచ్చు కాలం కంటెన్' నన్నయ అన్నారు. ఈ సమాజంలో దళితుల అభివృద్ధి ఎంతమేరకు ఉంది, నిజాంగా ఆ గుడిసెల నుండి బయటికి వచ్చి, అభివృద్ధి చెందారా! అంటే ఇంకా దూరంగానే ఉన్నారని చెప్పాలి. సరైన దిశలో ఫలాలు అందాల్సిన అవసరం ఉంది.

చివర భీమన్న ప్రాపంచిక సాహిత్య దృక్పథాన్ని ''మనిషి యొక్క ఆనందం ఏదో ఒకటి పొందడంలో లేదు / కానీ తన కంటే గొప్పదైన ఒక పనికి తనను తాను అంకితం చేసుకోవడంలో ఉంది'' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ వాక్యాలు భీమన్న సాహిత్య కృషికి అక్షరాల సరిపోతాయి. కాబట్టి జ్ఞానం కలిగి ఉండడం వేరు, జ్ఞానం వల్ల రూపాంతరం చెందడం వేరు. జ్ఞానం అనేది సమాచారాల సమాహారం. తన విశాలమైన జ్ఞానం ద్వారా ఈ ప్రపంచాన్ని నిద్ర లేపిన కవి భీమన్న. అట్టడగు వర్గాల వారికి ఒక వరాన్ని ప్రసాదించిన వ్యక్తి. తన కవితా శక్తి ద్వారా ఈ సమాజానికి ఎన్నో ప్రశ్నలు వేసి, తద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన, నిజమైన సామాజిక దృక్పథం కల్గించిన వ్యక్తి మన 'పద్మభూషణ్ బోయి భీమన్న'. భీమన్న సాహిత్యం ప్రపంచంలో ఏ గుడిసె కాల నంతవరకు సజీవంగానే బతికి ఉంటుంది. కుల మత జాడ్యాలు వదిలే వరకు, మనుషుల్లో సమానత్వం వచ్చే వరకు, మనిషికి మనిషే కేరాఫ్ అడ్రస్‌గా మారేంత వరకు భీమన్న 'సాహిత్యం' సజీవమే....ఒక చైతన్యమే.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆచార్య కాకర్ల వెంకటరామనరసింహం. 1982. ఆధునికాంధ్ర కవితా సమీక్ష, గంగాధర పబ్లికేషన్సు, విజయవాడ-2.
2. డా. పాపినేని శివశంకర్. 1996. సాహిత్యం - మౌలిక భావనలు. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. డబ్లు. ఎన్. కుబేర్. 2008. డాక్టర్. బాబాసాహెబ్. అంబేద్కర్ - విశ్లేషణాత్మక అధ్యయనం, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు.
4. బోయి భీమన్న. గుడిసెలు కాలిపోతున్నై. 1973.సుఖేలా నికేతన్, హైదరాబాదు.
5. రామ్‌దాస్. 2003. కారల్ మార్క్స్ జీవిత కథ. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు.
6. Henry D.Aiken.1956.The Age of Ideology.New York,N.Y.:New American Library.

పాలేరు నాటకం – ప్రగత శీలదాయకం

– డా॥. వై.వి.సి.హెచ్ లీలాపద్మజ, తెలుగుశాఖాధ్యక్షులు, జి.డి.సి, టెక్కలి.

కులమతాలు గీచుకున్న గీతలజొచ్చి పంజరాన కట్టుడను నేను అన్న జాషువా వలె కులతత్వాన్ని ఎదిరించి సంప్రదాయాలకు ఎదురీది అగ్రగామియైనాడు బోయి భీమన్న. ఏ మనిషి ఎదుగుదలకూ పేదరికమే ఒక త్రిపిబందకమైతే భీమన్న వంటి దళితులకు కులం కూడా వారి ఎదుగుదలకు మరింత బలమైన త్రిపిబంధకమైన రోజులవి కానీ అనుకూల పరిస్థితుల్ని ఎదురొడ్డి పోరాడ డమే కార్య సాధకుడి లక్షణం. అలాగే భీమన్న సంఘమనే విస్తరిలో అవమానమనే భోజనం చేస్తూ కూడా తనేమిటో నిరూపించుకున్న కార్యశీలి. భూమిని చీల్చుచకుంటూ విత్తనం మొలకెత్తినట్లు భీమన్న తానేమిటో, తన సత్తా ఏమిటో చూపారు. ఆయన మాటలో ఆయన జీవన విధానం ఎలా చెప్పారో చూడండి.

"నా సుఖాలు సంతోషాలు
సమస్తమూ సరస్వతీ ప్రత్యీర్థం
నా కష్టాలు, నష్టాలూ దురదృష్టాలూ
అన్నీ శివార్పణం" అన్నారు.

ఆయన సంతోషంగా ఉన్న సమయంమంతా రచనకే కేటాయించి వాటిని సరస్వతీ ప్రీత్యర్థం చేశారు. ఇక దోషాలు తొలగించి చెడును గ్రహించే శివునికి తన కష్టాలు నష్టాలు అర్పణం చేశారు. ఆయన రచనలు పూర్తిగా సమాజచైతన్యం కలిగించే విధంగానూ, ధర్మం కోసం చేసే పోరాటంగానూ దళితోద్ధరణే ప్రధాన థ్యేయంగా వున్నాయి. పాలేరు, రాగవాశిష్టం, పైరుపాట, కూలిరాజు మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. ఆయన రచనలు ఎంతగా సమాజాన్ని చైతన్యం పరిచాయో, దళితుల జీవితాల్ని ఎంతగా మెరుగు పరచాయో చెప్పడానికి ఉదా॥నకు పల్లెల్లోని దళిత వర్ణాల యువకులు ఈ నాటకాలక ప్రభావితులై చదువుకోవడమే పాలేరు నాటకం చూసి, పాలేరు పని మానేసి చదువుకొని కలెక్టర్లుగా ఉన్నతోద్యోగులుగా మారారు. అందులో కాకి మాధవరావుగారు ఐ.ఎ.యస్ ఆఫీసర్ పాలేరు నాటకం రాకపోతే తన జీవితం పాలేరుగానే ముగిసి పోయేదని పాలేరు నాటకం ద్వారా తనని ప్రబోధించినందుకు ఎంతగానో భీమన్నకు తాను బుణపడి వున్నాను అని చెప్పారు. పాలేరు నాటకంలో వనబాల, వెంకన్న, సుందరం, ఉపకారి మాస్టారు, పుల్లయ్య, సీతమ్మ, వీరేశు లాంటి పాత్రల ద్వారా వినిపించిన పాటలో జాతిని ఎంతో ప్రబోధించడం మనకు కనిపిస్తుంది. విద్య మనిషికి ఎలా గౌరవాన్ని తెచ్చిపెడుతుంది అనే సందేశాన్ని అందించారు. ఉన్నస్థితినుండి ఉన్నత స్థితికి మార్చేది విద్య. పల్లెలకు మరలండి అనే ఉద్యమాన్ని చేపట్టిన సుందరం ఒక అభ్యుదయ భావాలున్న యువకుడిగా కనిపిస్తాడు. దళితుల ఉన్నతికి కొద్ది మంది దళితేతరులు కూడా పాటు పడినట్లు కనిపిస్తుంది. కుబేర్రావు పాత్ర దళితుల్ని అణచిపెట్టాలన్న ధోరణితో కులవ్యత్యాసం వుండి తీరాలన్న ధోరణితో కనిపిస్తుంది. అలాంటి పాత్ర నాటకం చివరలో మార్పు చెందింది. ఇదే సమాజంలో కవి కోరే మార్పు.

క్లుప్తంగా కథా వస్తువు ఇది! రైతువాడ గ్రామంలో కేబేరావు అనే భూస్వామి దగ్గర తరాలుగా పాలేరు తన వారసత్వంగా చేస్తున్న పుల్లయ్య తన కొడుకును కూడా పాలేరుగా పెట్టాడు. తన కొడుకు వెంకన్న చదువు కొంటానన్నా అది తమకు అచ్చిరాదన్న కుబేర్రావు మాటల మీద విశ్వాసం వుంచి పాలేరు తనం చేయని బ్రతుకు బ్రతుకే కాదనుకుంటూ తన యజమాని పట్ల అపారమైన స్వామి భక్తితో వ్యవహరిస్తాడు. అయితే అలాంటి పుల్లయ్యను దిక్కులేని వాడిగా తరిమెయ్యడానికి కూడా వెనుకాడని క్రూరుడు కుబేర్రావు. వనబాల, సుందరం

అన్నా చెల్లెళ్ళు. వారిలోవున్న అభ్యుదయ భావాలతో వెంకన్న చదువుకోవడానికి సహాయపడతారు. ఇక ఉపకారి మేష్టారు సరేసరి ఊరిలో ఉన్న పిల్లలందరూ విద్యావంతులు కావాలని, అలా తల్లిదండ్రులు వారిని చదివించాలని కూలి డబ్బులతో జీవితం శాశ్వతంగా వెళ్ళిపోదని వారికి శాశ్వత గౌరవాన్ని ఇచ్చే చదువునేర్పాలని తల్లి దండ్రులకు హితబోధ చేస్తూ వారు తిట్టినా భరిస్తూ ఉపకారి మేష్టారు తన పేరును సార్థకం చేసుకున్నాడు. అలాంటి ఉపకారి మాష్టారు సహాయంతో పశువుల్ని కాస్తూనే యజమానితో తన్నులు తింటూనే పస్తులుంటూనే కథానాయకుడు వెంకన్న చాటుమాటుగా పుస్తకాలు చదివాడు. మెల్లగా ఈ ముగ్గురి సహాయంతో సుందరం స్నేహితుడు రామం తండ్రి నిర్వహిస్తున్న కాకినాడలోని అనాధ శరణాలయానికి వెళ్ళి అక్కడ క్రమంగా చదువుకొని డిగ్రీ పాస్ కావడం తర్వాత అలా పాసయిన వెంకన్నను డిప్యూటీ కలెక్టర్ పోస్ట్‌కి దరఖాస్తు చేయమని రామం చెప్పిన మాటలకు వెంకన్న చెప్పిన జవాబు వెనకబడిన కులాల వారికి హెచ్చరికగా వుంది. తాము చేసిన పాలేరుతనం కంటె ఉద్యోగం ద్వారా చేసే బానిసత్వం భిన్నంకాదని అందుకు తాను ఉద్యోగం చేయదలచుకోలేదని ఉపకారి మాష్టారు ఆధ్వర్యంలో తనలాంటి ఎంతో మంది దళితుల్ని వృద్ధిలోకి తీసుకురావాలని వుందని అలా సమాజసేవ చేయడం తన ఆదర్శమని చెప్పాడు. అయితే రామం జవాబు అలా సేవ చేయాలనుకునే నీకు తప్పని సరిగా ఒక హోదా అధికారం వుండడం తప్పని సరిగా అవసరమని సలహా చెప్పడంతో వెంకన్న డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వరులుగా అవడం తన గ్రామానికి రావడం అక్కడ కుబేర్రావులో పరివర్తనం వచ్చేటట్లుగా ఒక కేసులో అతడిని క్షమించడం తద్వారా పశ్చాతాపం పొందిన కుబేర్రావు అరే ఒరే అని పిలిచిన వెంకన్నను గౌరవించడం అతని తండ్రిని అప్పగించడం చేస్తాడు. వనబాలను రామానికిచ్చి చేయాలని ఆమె మనసు తెలియని సుందరం నిర్ణయించడం, కానీ తర్వాత విషయం తెలుసుకున్న రామం, సుందరం ఇద్దరూ కూడా వనబాలను వెంకటేశ్వరావుకిచ్చి వివాహం చేయడంతో కథ సుఖాంతమౌతుంది. కుబేర్రావు ప్రవర్తన, తన కొడుకు సత్ప్రవర్తన వీటి ద్వారా పశ్చాతాపం పొందిన పుల్లయ్య తల్లిదండ్రులను ప్రబోధిస్తూ పాటలు పాడుతాడు. కుబేర్రావు దగ్గర పనిచేసే వీరేశు అనబడే పనివాడు పుల్లయ్య మరదలు సీతను వివాహమాడినపుడు వాళ్ళ ద్వారా కవి చెప్పించిన మాటలు ఎంతో ప్రబోధాత్మకంగా వుంటాయి. కుబేర్రావు ఎన్ని విధాలా ప్రలోభ పరిచినా సీత ఏవిధంగానూ లొంగక పోవడం అలాగే వీరేశు నిష్కల్మశమైన ప్రేమకు ఆమె అతడిని వివాహమాడడం వీరేశు సీతల ప్రేమ ఒప్పందంలో వాళ్ళు మాట్లాడుకొనే మాటలు వాళ్ళ నిష్కల్మష ప్రేమను తెలియజేస్తూ ఇలా వుంటాయి. "ఎప్పుడూ నన్ను అన్యాయం చెయ్యవుగంద" అన్న సీతను వీరేశు చేతిలో చెయ్యివేసి "పచ్చని చెట్టుకింద నిలబడ్డాం. ఈ చెట్టు సాక్ష్యం, ఆ చుక్కలు సాక్ష్యం నిన్ను లక్ష్మిలాగా చూసుకుంటాను అంటాడు. అంటే చెట్టు ఆశ్రయానికి ప్రతీక, చుక్కలు అంధకారంలో దారి చూపేపిగా వున్నాయి. కాటి సాక్ష్యం అని వీరేశు అనడం అంతే కాదు లక్ష్మి అంటే మంగళకరం కదా మరి శుభంగా లక్ష్మిని చూసుకుంటాను అని వాగ్దానం చెయ్యడం అలాగే పట్నమెళ్ళి పాదామన్న వీరేశుతో సీత.....

పట్నమెల్లిపోదాము
పెళ్ళి చేసుకుందాం
పనిచేసుకొనీ
బంగారంలా బతుకుదాము అంటుంది.

అంటే ఇతరుల దయా ధర్మం ఆశించుకుండా ఒళ్ళు వంచి కష్టపడడం కంటె బంగారం లాంటి బ్రతుకు మరొకటి లేదంటుంది. బంగారు బొమ్మా నీ కంటి నిండ కనబడతా పువ్వుల కొమ్మా అంటాడు వీరేశు. అంటే ఆమె కళ్ళల్లోని ఆశ తానై ఆమె కంటినిండా తానయి తనకు దారిచూపే చూపు తానవుతానంటూ అమాయకంగా చెప్పిన వీరేశు మాటల్లో ఏ ప్రబంధ నాయకునికి తీసిపోని

విధంగా పూబోణీ అన్నదానికి పువ్వుల కొమ్మా అన్నాడు. ప్రేమగా వుండడం స్వేచ్ఛగా వుండడం తమ అబిలాషగా ఇద్దరూ చెప్పుకున్నారు. వీరేశును పోలీసు స్టేషన్‌లో పెట్టినపుడు వనబాల సీతకు కొంతడబ్బుస్తాను లేదా వస్తువిస్తాను తీసుకొని బ్రతకమన్నప్పుడు సీత చెప్పిన మాటలు గుణానికి, ఆత్మాభిమానానికి కులం ఏవిధంగానూ అడ్డుకాదన్నట్లుగా వుంటాయి. ఇతరుల సొమ్ము మాకొద్దు, మా రెక్క కాలు సుఖంగా వుండి మా పాలేరు విడుదలయివస్తే బంగారంలా పనిచేసుకు బతుకుతాం అంటుంది. నిజంగా వ్యక్తిత్వం అంటే ఇంతకంటే వేరే ఏం ఉంటుంది. అలాగే వనబాల వెంకన్నను ప్రేమించాననన్నప్పుడు మా కులంలో పైకొచ్చే వాళ్ళే తక్కువ. ఆ వచ్చిన వాళ్ళను కూడా పెద్ద కులస్తులే తీసుకుపోతే మా కులస్తులగతి ఏమిటి? అని నిర్మొహ మాటంగా అంటుంది. అయితే వనబాల వ్యక్తిత్వం, మనన్తత్వం తెలునుగనుక వారి వివాహానికి సహాయపరడుతుంది. సీత పాత్ర పరంగా వుండవలసిన ఆత్మ స్థైర్యాన్ని చెబుతాడు. సంస్కారమనేది జీవికి నహజంగా వస్తుంది. కులం చేత అవి పోవని తెలుపుతాడు. అలాగే భీమన్నగారిలోని స్త్రీవాద దృక్పథం కూడా మనకు వనబాల, సీత మొ॥ పాత్రల ద్వారా తెలుస్తుంది.

రైతువాడలో పస్తులున్న వెంకన్నకు తల్లి తనకిచ్చిన కొబ్బరిని చాటుగా పెడదామనుకున్నప్పుడు వెంకన్న నిరాకరిస్తాడు. అయితే వనబాల కోపంతో దాన్ని విసిరేస్తాను అంటుంది. అప్పుడు ఆమెలో వెంకన్నతో కవి చెప్పించిన మాటలు ఏనాటి సమాజానికైనా శిరోధార్యాలు అవి. "ఆహారాని పండించాలే గాని నాశనం చేయకూడదు" అని అంటే మన స్థోమత వుందని పదార్థాలను వృధా చేసే హక్కు ఎవరికి లేదు, వీలయితే పండించాలేగానీ నాశనం చేయకూడదు వెంకన్న ఆత్మగౌరవం గలవాడిగా చిన్న నాటి నుండి తీర్చబడ్డ పాత్ర.

దళితుల అభ్యుదయానికి పాటుపడ్డ డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పనట్లు బోధించు, సమీకరించు, పోరాడు అనే తత్వంలో దళితుల్ని ప్రబోధించాలంటే ముందుగా వారిని విద్యావంతుల్ని చెయ్యాలి కనుక ఈ నాటకంలో విద్యావశ్యకతను తెలియ చేసే విధంగా వెంకన్న ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్య మహపాతకమే అని చెప్పబడుతున్నా ఇక్కడ విద్యాధికతను చెప్పడానికి చదువు కంటె చదువులేని బ్రతుకు గొప్పది కాదు అనిపించినా వనబాల అడ్డుకోవడంతో వెంకన్న జీవితం కొత్తమలుపు తిరిగి తాననుకున్న ఉన్న శిఖరాల్ని అందుకోగల్గి బాబుగారు అనవలసిన సుందరం, రాములను కూడా తన చదువు సంస్కారంతో మిత్ర భావంతో ఒరే సుందరం, ఒరే రామం అనే స్థితికెదిగాడు. అలాంటి ఆత్మీయుల సహాయంతో సార్థకమైన విద్య పొందగలిగాడు. ఎదిగే వాడికి చేయందించే వారు వుండాలి. ఇది ఒక ప్రబోధం.

ఏ రచనకైనా ఉత్తమత్వం చేకూరాలంటే ఔపదేశికత్వం అనే కావ్య ప్రయోజనం చేకూరాలి. అది మహకావ్యాలలో సాధించడం సులభం కావచ్చు కానీ పాలేరు లాంటి చిన్న నాటకంలో దాన్ని సాధించడం కొంచెం కష్టమే అయినా అసాధ్యం మాత్రం కాదు అని నిరూపించుకున్నారు బోయి భీమన్న. సమకాలీన పాత్ర అయిన దళితుడైన పాలేరు వెంకన్న పాత్రను తీసుకుని అతడి చుట్టూ అల్లిన కథలో కవి తనలో వున్న అభ్యుదయ విప్లవాత్మక మార్పుల్ని చూపించాడు. విప్లవాత్మకం అంటే సంచలనాత్మకమైన ఒక మంచి మార్పు లేదా అప్పటి వరకు ఉన్న వ్యవస్థపై తిరుగుబాటు అని చెప్పనూవచ్చు. అలా చూస్తే ప్రధానంగా కథా నాయకుడైన వెంకన్నలో ఈ విప్లవాత్మక మార్పు వచ్చింది. అది తన ఇంటిలో అంతకు ముందు తరాల వారెవరూ చదువుకోకపోయినా తమకు చదువు ఆనవాయితీ కాదనే మూడనమ్మకాన్ని ఎదిరించి చదువుకొన్నాడు. అలాగే అతడు చేసుకున్న వర్ణాంతర వివాహం కూడా ఆనాటికి

ఇంకా అనాచారంగా భావించబడుతున్న వనబాల, వెంకన్న దాన్ని అధిగమించారు.

ఉత్తమ కవిత్వానికి ఔపదేశికత్వమే కాక మనిషి మనుగడను స్పృశించినదిగా వుంటే మరింతగా ప్రజలను చేరువ అవుతుంది. మరి పాలేరు నాటకం అలనాటి పాలేరు జీవితాన్ని విశ్లేషించి ఆ జీవితానికో మంచి ముగింపునిచ్చింది. మరి అలాంటి పాలేళ్ళందరి జీవితాలకో సందేశాన్నిచ్చింది. ఒకడు దొర, ఒకడు బానిసగా లేని సమసమాజాన్ని అభిలషించింది. ప్రగతి శీలదాయకమైంది పాలేరు నాటకం.

ఆధారగ్రంథాలు :

1. బోయిభీమన్న - పాలేరు నాటకం పాలేరు నుండి పద్మశ్రీ వరకు
2. సాహిత్యదర్శనం - కె.వి.ఆర్ నరసింహం
3. సాహిత్యసోపానములు - దివాకర్ల వెంకటావధాని

డా॥ బోయిభీమన్న గారి సాహిత్యం- రసపోషణ

- డా॥. కులపర్తి శ్రీనివాసరెడ్డి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

హితాన్ని బోధించి, ధర్మాన్ని ఉపదేశించేది సాహిత్యం. సాహిత్యానికి "సాహిత్యం భావ: భావ: సాహిత్యమ్" అనే నిర్వచనం ఉంది. సకలశాస్త్ర రహస్యాలతో కూడినది అని అర్థం. సాహిత్యం ప్రాచీన కాలం నుండి సమాజ శ్రేయస్సును కోరేదిగా ఉంది. ఇది ఆధునిక సాహిత్యంలో మరీ ఎక్కువగా కనిపిస్తుంది. సమాజం సజీవమైనది కనుక అనేక మార్పులకు లోనవతూ ఉంటుంది. సమాజంలో ఉండే స్తబ్ధత అధైర్యం, అవగాహన రాహిత్యం మొదలైన అనేక ఋగ్మతలను సాహిత్యం సరిచేస్తూ సమాజ అభ్యున్నతిలో తనవంతు పాత్రను నిర్వహిస్తూ, సమాజానికి చేరువై చైతన్యవంతంగా మారుస్తుంది. ఈ కోవలో సమాజ జాగృతి, ఆనందం సాహిత్యం ప్రయోజనంగా సమాజ అభ్యున్నతి కొరకు రచనలు చేసినవారు ఎందరో ఉన్నారు. వారిలో 'పద్మభూషణ్' బోయి భీమన్నగారు ఒకరు.

తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటు ప్రత్యేక స్థానాన్ని స్వయం కృషితో ఏర్పడుకున్న తెలుగు వాల్మీకి బోయి భీమన్నగారు 1911 సెప్టెంబర్ 19న జన్మించారు. ఐదవ తరగతిలో తొలి రచన చేసారు.తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. సుమారు యాభైకి పైగా రచనలు ముద్రింపబడినాయి. మరికొన్ని రచనలు అముద్రితాలు. సాహితీ వసంత బిరుదాంకితులయిన ఈ అక్షర ఋషి జనవాణి పత్రికా గుమస్తాగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి సాహిత్య ప్రవేశం వల్ల, కవిత్వం చెప్పడం వల్ల అతి తక్కువ వ్యవధిలోనే జనవాణి పత్రికకు ఉపసంపాదకునిగా ఎదిగారు. కార్మికుల సమ్మెలో పాల్గొన్న నెపంతో తన ఉద్యోగాన్ని పోగొట్టుకున్న భీమన్నగారు ఉపాధ్యాయుడుగా కూడా పని చేశారు. అనేక రంగాలలో వృత్తిని చేపట్టిన భీమన్నకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీని 1973లో ప్రధానం చేసింది. 'గుడిసెలు కాలిపోతున్నాయి' కవితా సంపుటికి 1975వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 2001వ సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మభూషణ్ ని ప్రదానం చేసింది.

బోయిభీమన్న గొప్ప నాటక రచయిత, ఎన్నో సాహిత్య ప్రక్రియలను చేపట్టిన సాహితేకృషీవలుడు. కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, పీఠికాధిపతిగా, సంపాదకునిగా అనేక బాధ్యతలు చేపట్టి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుని పాలేరు నుండి పద్మవిభూషణ్ స్థాయికి ఎదిగారు. ఇలాంటి మహోన్నత కవి తాలూకు కృతుల పరిశీలనలో రసం ఏవిధంగా పోషించబడిందో తెలియజేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

భీమన్న కృతులు : రసపోషణ :

రసం సాధారణంగా ఇతివృత్తాన్ని ఆశ్రయించి ఉంటుంది. కారణం ఇతివృత్తం అనగానే పాత్రలుంటాయి. ఈ ఇతివృత్తాన్ని అనుసరించే పాత్రపోషణ ఉంటుంది. ఇది రసపోషణకు అనుగుణంగానే సాగుతుంది. బోయిభీమన్నగారు నూటికి నూరుపాళ్ళు పాత్ర చిత్రణ విషయంలో రసపోషణకు ప్రాధాన్యమిచ్చారు. భీమన్న గారి రచనలో ప్రధానంగా కొంత శృంగార దృష్టి కని పిస్తుంది. కనుకనే ఆయన సాహిత్యంలో అధికంగా ఈ రసానికే ప్రాముఖ్యతనిచ్చారు. 'మధుగీత', 'మధుబాల', 'మణిమానసం' వంటి పద్యకృతుల్లో నాయికా నాయకులది అచ్చమైన శృంగారం. పరిశీలించి చూస్తే ప్రత్యేకించి 'మధుబాల'లో కొంత ఆర్ష సంస్కృతి కనిపించడంవల్ల శాంతరసమని అనుకున్నప్పటికీ అది నాయికానాయకుల పవిత్ర శృంగారానికి పోషకంగానే ఉంది. ఇక 'కేదారేశ్వరి' అనే చిన్న పద్యకృతిలో పచ్చని ప్రకృతి దృశ్యాలు, కోనసీమ

దృశ్యాలు, వరిమాగాణాలు ఇలా తెలుగు దేశీయ ప్రకృతి దర్శనమిస్తుంది. సస్యశ్యామలతను చెప్పడంలో భోమన్న గారి శృంగార దృష్టి, ప్రకృతి వర్ణనలో శృంగార శాంత రస సమ్మేళనాలు స్పష్టంగా కనిపిస్తాయి. అశోకవనిలో రాముడు, ప్రకృతిలో మానవ ప్రకృతి, భీమన్న కావ్య కుసుమాలు వంటి గ్రంథాల్లో శృంగారమే ప్రధానంగా విహరించిందని చెప్పకతప్పదు.

'బొమ్మ' గేయ కృతిలో శృంగార భావం పరాకాష్ఠ నొందింది. మానవుని ఊహా ప్రేయసికి బొమ్మ ఒక ప్రతీకగా చెప్పవచ్చు . నాయిక కోసం నాయకుడు చేసే మధురా రాధనే బొమ్మ, జీవితంలోని రాగమధుర సౌందర్యాలను ఈ ఆరాధనా మార్గంలో సంపూర్ణంగా దర్శింపచేసే కృతి బొమ్మ. రసాద్వైతానికి మూలాధారం బొమ్మ. ఇంకా అకాండ తాండవంలో స్త్రీమూర్తిని శక్తి స్వరూపిణిగా వర్ణించడం జరిగింది. స్త్రీ చైతన్యాన్ని వర్ణించడంతోపాటుగా, మానవునికి ఆ స్త్రీ మూర్తితో గల అవినాభావ సంబంధం ఇరువురి నిరతిశయానందానికి ప్రతీకగా అకాండ తాండవం రూపొందింది. ఒక రకంగా పార్వతీ పరమేశ్వర నాట్యమే లోకంలో స్త్రీపురుషుల ప్రణయం. భీమన్నగారి పైరు పాటలోని నాయికా నయకుల ముగ్ధ శృంగారం ఇలాంటిదేనని చెప్పవచ్చు.

ఇక నవలల విషయంలో భీమన్నగారి 'క్షీరసాగర' నవలను పరిశీలిస్తే, దీనిలో వాస్తవ శృంగారాన్ని స్వీకరించి, దాన్ని పవిత్ర దశదాకా తీసుకెళ్ళగలిగారు భీమన్నగారు. ఈ రకమైన ప్రేమ స్వచ్ఛమైన, అమాయకమైన హృదయాల్లోంచి పుడుంతుంది. ఈ క్షీరసాగర నవలలోని పాత్రలన్నీ అవిధమైనవే. ఈ నవలలో చాలా వరకూ భీమన్నగారి జీవితఘట్టమే ప్రతిబింబిస్తుంది. నాయికా నాయకుల ముగ్ధప్రేమకు ప్రాధాన్యమిచ్చి పాత్రచిత్రణ చేయడం వల్ల ఇది అచ్చమైన శృంగారరస ప్రాధాన్యకళికగా చెప్పుకోవచ్చు.

నాటకం విషయంలో ప్రధానంగా చెప్పుకోవలసింది 'పాలేరు'. ఈ నాటకంలో ఏ పుట విప్పినా విప్రలంభ శృంగారమే తొణికిసలాడుతుంది. అలాగే వియోగ శృంగారం గల సంచలన నాటకం పాలేరు. సాంఘికమైన కులమత పదవీత్యాదులు, డబ్బు, వృత్తులు ఏవీ అచ్చమైన ప్రేమకు ఆధారాలు కావు. పవిత్రప్రేమ ఇటు వంటి అడ్డుగోడలను అధిగమించిపోయిందనడానికి ఒక అద్భుత నిదర్శనం 'రాగవాశిష్ఠం'. ఇది సాంఘిక, పౌరాణిక సమ్మిళిత నాటకం. ఈ నాటకంలో ఎక్కువభాగం శృంగారం, తక్కువ భాగం శాంతం. వర్ణాంతర వివాహానికి అనుగుణంగా అరుంధతీ వశిష్ఠుల వివాహబంధాన్ని చెప్పడం ప్రధాన ఇతివృత్తం. ఈ నాటకంలో సమస్య సాంఘికంగా కనిపించినా, చివరకు పరిష్కారం మాత్రం పౌరానికమనే చెపాలి. ప్రధాన రసం శృంగారమైనా, శాంతరసం కూడా చాలా సందర్భాల్లో పోషించపబడింది. శివుడు వచ్చి అరుంధతీ వశిష్ఠుల వివాహం జరిపించడం శాంతం. అరుంధతీ వశిష్ఠులు ప్రాచీనుడనే ఋషి వల్ల కొంతకాలం వియోగం పొందారు. కొంత కాలం అరుంధతి వశిష్ఠునికోసం తపస్సు చేసింది. అందువల్లనే కళ్యాణం జరిగింది. కాబట్టి స్థూలంగా పరిశీలిస్తే ఈ నాటకంలో శృంగారమే ప్రధానంగా పోషించబడిందని చెప్పవచ్చు.

ఇక ఇదే నాటకంలో సంధ్య అనే అరుంధతి చెల్లెలు కూడా శృంగార రసానుకూల పాత్రే. సందర్భానుకూలంగా భీమన్న చేసిన ప్రకృతి వర్ణనలో కూడా అమోఘమైన శృంగార వర్ణన కనిపిస్తుంది.

తెలుగునేలలో మరో సంచలన కావ్యం 'రాగవైశాఖి8 అనే శృంగార కావ్యం. ఇందులో ఉన్న శృంగారం స్వేచ్ఛా శృంగారం. ఈ కావ్యంలోని ప్రతీవాక్యం ఒక శృంగార సూక్తం. సాంఘిక నియమనిబంధనలు, శృంగారపు అంచులకు అడ్డుకారాదు. అందుచేతనే స్వేచ్ఛాపూరిత, స్వచ్ఛమైన మార్గంలో శృంగారం సాగిపోతుంది. శృంగార మంటే మానవుని భావమాధురి. కాబట్టే సాంఘిక శృంఖలాలను తెంచుకుని ఎగిసిపోయిన ప్రణయ శకుంతం వంటిది రాగవైశాఖి అని చెప్పవచ్చు.

ఇలా బోయిభీమన్న కృతుల్లో అధికభాగం స్వచ్ఛమైన, అలౌకికమైన శృంగారం పోషింపబడింది. ఈ శృంగార

ప్రాధాన్య కృతుల్లో అక్కడక్కడ ఇతర రసాలపోషణ ఉన్నా, అవన్నీ శృంగార పుష్టికోసమే తప్ప మరొకటి కాదని చెప్పకతప్పదు.

బోయిభీమన్నగారు పోషించిన శృంగారం నిజానికి ఆరాధ్యం. అది నాయికా నాయక హృదయాలను ఆలంబనగా చేసికొని మహోన్నత దశకు పెరిగిపోయేది. లౌకిక కష్టనష్టాలతో, సుఖాలతో, భావ సంబంధాలతో సంబంధం లేనిది. భీమన్న కృతుల్లో ఇది దివ్యంగా కనిపిస్తుంది. ఈయన శృంగారానికి ఒక తాత్త్విక స్పృహ ఉంటుంది. తాను చెప్పేది ఎలా ఉన్నా, పరోక్షంగా చాలామంది నిజజీవితాలకు దగ్గరగా ఉంటుంది. ఇంకా చెప్పాలంటే, అంతగాఢంగా, మనసుకు హత్తుకునేంత నిగూఢంగా శృంగార రసపోషణ చేయగల సమర్థుడు బోయిభీమన్న అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

భీమన్నగారి కొన్ని నాటకాల్లో శాంతరసపోషణ కూడా చేశారు. 'ఆదికవి వాల్మీకి' లో వాల్మీకీ చేసిన తపస్సు రామాయణాన్ని చూసిన దార్శనిక వైశిష్ట్యం, ఆశ్రమం, పరిసరాలు అన్నీ ప్రత్యక్షంగా ప్రశాంత వాతావరణాన్ని స్ఫురింపచేసేవే. వాల్మీకి ఋషి కావున అతని ధ్యానం శాంత సంబంధమైంది. ఆధ్యాత్మిక చింతనకు ఈ ఋషి కథ సంబంధించినది. 'వేదవ్యాసుడు' కూడా ఇంతే అష్టాదశపురాణ, ఉపపురాణ కర్తయైన వ్యాసుడు సత్యవతీ పుత్రుడు. మేరుపర్వతంపై తపస్సు చేసినట్లు పురాణం (మహాభాగవతం:బమ్మెరపోతన) తెలుపుతుంది. వేద వ్యాసుడు విష్ణుతుల్యుడు, మహాదార్శనికుడు కావున పురుషార్థాలను కావ్యరీతిలో రచించగలిగాడు. ఆ ఋషి కథ కూడా శాంత రస ప్రధానంగా రాశాడు

మరొక కావ్యం 'మానవుని మరొక మజిలీ' కూడా శాంత రసప్రధానమే. అలాగే భీమన్న రాసిన 'ధర్మ వ్యాధుడు' నాటకానికి మహాభారత అరణ్యపర్వంలోని ధర్మవ్యాధుని కథమూలం. ఈ నాటంకలోని వస్తువు సాంఘికమైంది. వర్ణాంతర వివాహం గురించి ఈ నాటకంలో చెప్పబడింది. ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞాని కనుకనే కౌశికునకు బ్రహ్మవిద్యను ధారపోశాడు. ఇలాంటి ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యమివ్వడం వల్ల ఇందులో శాంతరసం పోషింపబడింది అని చెప్పవచ్చు.

ఇంకా 'అనాది కొస నుంచి అనంతత్వంలోకి' మరియు 'మోక్షం నా జన్మహక్కు' అనే కావ్యాల్లో కూడా శాంతరసమే పోషించబడింది. ఈ కావ్యాల్లో తాత్త్విక స్పృహ ఉంది. కావున శాంతరసమున్నట్లేనని చెప్పొచ్చు. అలాగే 'జన్మాంతరవైరం'లో కూడా పునర్జన్మ ప్రస్తావన చేశారు భీమన్నగారు. కారణం కర్మఫలమని చెప్పడం వల్ల ఇది కూడా శాంతరస ప్రధానంగానే పేర్కోవచ్చు.

ఈ విధంగా భీమన్నగారు శృంగార రసాద్వైత దృష్టి కలిగి ఉన్నా, శాంతరస ప్రధాన కృతులను రాశారు. శాంతం అంటే సహజానందం. శృంగారం కూడా సహజానంద దాయకమే. ఒకరకంగా చూస్తే భీమన్నగారిది తాత్త్విక దృష్టి. ఇది తండ్రి ప్రేరణ నుండి వచ్చింది. జాన్ రస్కిన్ తన 'మోడర్న్ పెయింటర్స్'లో చెప్పినట్లు "ఒక కవిలో తప్పక ఒక తాత్త్వికుడుంటాడు" అన్నట్లు భీమన్నలో తాత్త్వికుడే కాదు, తార్కికుడు కూడా ఉన్నాడు. అందుచేత భీమన్న కవితాతత్త్వం శాంతాన్ని పునాదిగా చేసికొని ఉంటుంది. ఇలా బోయిభీమన్నగారి కృతుల్లో అక్కడక్కడా శాంతరసం కూడా పోషించబడింది. నిజానికి సర్వరసాలు శాంత రసంలో సంగమిస్తాయని ఆలంకారికుల అభిప్రాయం (అభినవ భారతి: అభినవగుప్తుడు). అలాంటి శాంతాన్ని శృంగారానికి ఆలంబనగా చేసుకొన్న కవి బోయిభీమన్న అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

భీమన్నగారు కరుణ రసానికి కూడా కొంత ప్రాధన్యమిచ్చారు. స్వయంగా భీమన్నగారి జీవితం కరుణరస భరితం. కులపరంగా పేదరికం, నిరుద్యోగం, భార్య వియోగం మొదలైన అంశాలన్నీ కరుణరస ఘట్టాలుగానే పరిగణించాలి. అలాగే కొంత ఆయన కృతుల్లో కూడా దర్శనమిచ్చింది. ముఖ్యంగా అంబేడ్కర్ జీవిత ఘట్టాలను చెప్పడంలో కరుణరసాన్నే పోషించాడు. ముఖ్యంగా

'కులనిర్మూలన' వంటి గ్రంథాల్లో కులం కారణంగా భీమన్న అనుభవించిన వ్యథలను కరుణరసాత్మకంగా చిత్రించారు. ఇంకా 'అశోకవనిలో రాముడు'అఓ సీతా రాములను కరుణ విప్రలంబంలో వర్ణించాడు. 'గుడిసెలు కాలిపోతున్నై'లో పేదల అగచాట్ల చిత్రణలో కరుణరసమే దర్శనమిస్తుంది.

హాస్యాన్ని కూడా తగుమాత్రంగా పోషించారు భీమన్న గారు. హాస్యం ఆలంకారిక అభిప్రాయం మేరకు వికృత స్వరూపం, వికార చేష్టలు, వెటకారపు మాటలు, వెటకారపు చూపులు, వింత అనుకరణ మొదలైన అంశాల ఆలం బనగా పుడుతుంది. ఇలాంటివేవీ లేకుండానే హాస్యరసాన్ని పండించారు భీమన్నగారు. అది కూడా శతక ప్రక్రియలో. పిల్లి శతకం, కూలీ శతకం, టెంకాయచిప్ప శతకం వంటివి భీమన్నగారి హాస్య రచనలు. సమాజంలో మనిషి కన్నా పిల్లినయం అనిచెప్పడం, కూలి శతకంలో అతన్ని జాగృత పరచడానికి హాస్యాన్ని మార్గంగా ఎంచుకోవడం, టెంకాయ చిప్ప శతకం పేరులోనే హాస్యం కనబడటం వంటివి చూస్తే భీమన్నగారు హాస్యాన్ని కూడా తన కృతులందు చొప్పించారని తెలుసుకోవచ్చు.

ఇక మిగిలిన రసాలైన వీర, రౌద్ర, భయానక, బీభత్సాలు భీమన్నగారి సాహిత్యంలో అంతగా కనిపించవు. కొన్ని కృతుల్లో దోపిడీ విధానం మీద పేదల తిరుగుబాటు ద్వారా నిరసన తెలిపాడు. ఈ నిరసన, తిరుగుబాటు తత్వాన్ని వీర, రౌద్ర రసాలనవచ్చు. మొత్తాన్ని నవరసాల్లో మిక్కిలి రసాలకు ప్రాధాన్యం కల్పించి, తన కృతుల్లో రసపోషణకు ప్రాముఖ్యతనిచ్చారు భీమన్నగారు. ఏ కృతి చూసినా ఏదో ఒక రస ప్రాధాన్యంగా కనిపించడం ఈయన రచనా వైశిష్ట్యానికి నిదర్శనం. అయినప్పటికీ భీమన్నగారిది శృంగారాద్వైతం. కావున అదే అధికంగా ఆయన సాహిత్యంలో దర్శనమిచ్చింది. స్థూలంగా చెప్పాలంటే భీమన్నగారి రసపోషణ ఆయన కవితాత్మకి ప్రతీక.

ముగింపు :

మాథ్యూ ఆర్నాల్డ్ చెప్పినట్లు - "Literature at the bottom is a criticism of life" అన్నది సార్థకం. జీవితానుభవాలే కావ్యంలో వ్యక్తీకరింపబడతాయి. అయినప్పటికీ భీమన్నగారు ఇతివృత్తానికనుగుణంగా రసాన్ని పోషించి, సందేశాత్మకంగా సాహిత్యాన్ని తీర్చిదిద్ది, సమాజహితంగా తన సాహిత్యానంతా సాగించి సమాజం దృష్టిలో, పాఠకుల హృదయాలలో నిలిచిపోయారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగుసాహిత్య విమర్శ సిద్ధాంతాలు: ఆచార్య వెలమల సిమ్మన్న
2. పాలేరు నుండి పద్మశ్రీ వరకు- హైమవతి
3. బోయి భీమన్న కృతులు: బోయి భీమన్న
4. భీమన్న సన్మాన సంచిక(1960)
5. భీమన్న షష్ఠిపూర్తి సంచిక(1983)
6. రస సిద్ధాంతం -ఆంధ్రుల వరివస్య: టి.రామకృష్ణమూర్తి
7. శృంగార ప్రకాశం: భోజుడు
8. సాహిత్య సౌందర్య దర్శనం: చర్ల గణపతిశాస్త్రి
9. సాంఘికోద్యమ రూపకాలు:ఆచార్య సజ్జా మోహనరావు

బోయి భీమన్నగారి 'కుల నిర్మూలన' - అనువాద నైపుణ్యం

- డా॥. యం. ప్రసాద్, పాఠశాల సహాయకులు (తెలుగు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాపూరు, నెల్లూరు.

తెలుగు సాహిత్యాన్ని ఎంతోమంది కవులు, రచయితలు తమ రచనల ద్వారా సుసంపన్నం చేశారు. అలాంటి కవులలో దళిత సాహిత్యంలో గుఱ్ఱం జాషువా పద్యానికి పట్టం కట్టారు. వారి తరువాత దళిత సాహిత్యంలో పద్యానికి, పాటకు పట్టంకడుతూ తెలుగులో నూతన ఒరవడులు సృష్టించిన కవిగా బోయి భీమన్నను చెప్పవచ్చు. సమాజం పట్ల గురుతర బాధ్యత కలిగిన భావుకత కలిగిన కవిగా కనిపిస్తారు. వీరి కలం నుండి జాలువారిన 60కి పైగా రచనలు వీరి పాండిత్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అంబేడ్కర్ భావజాలంతో సమాజంలోని అసమానతలను తన రచనలలో ప్రతిఫలింపజేస్తూ ధిక్కార స్వరాన్ని వినిపించిన నిఖార్సయిన కవిగా ద్యోతకమవుతాడు. వీరి సాహిత్యంలో ప్రేమ, సమసమాజ స్థాపన అనే అంశాలే ప్రధానంగా గోచరిస్తాయి. పాలేరు కుటుంబంలో పుట్టి పద్మశ్రీ వరకు అందనంత స్థాయికి ఎదిగిన సాహితీ మేరువు బోయి భీమన్న.

ప్రపంచ మేధావి, బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్. బి.ఆర్.అంబేడ్కర్ భావజాలంతో తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ ఆశయాలను, ఆదర్శాలను తన రచనల ద్వారా తెలుగు పాఠక లోకానికి ఎలుగెత్తి చాటిన కవి వరేణ్యులు బోయి భీమన్న. అంబేడ్కర్ సుప్రభాతం, అంబేడ్కరిజం, పాటలలో అంబేడ్కర్ వంటి రచనలు చేశారు. అంతేగాకుండా 'ధర్మంకోసం పోరాటం' గ్రంథాన్ని అంబేడ్కర్‌కి అంకితం చేశారు. తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్‌కి సంబంధించిన విషయాలు లభ్యమవుతున్నాయంటే దానికి ప్రధాన కారణమైన కుటుంబంగా బోయి భీమన్న కుటుంబాన్ని చెప్పవచ్చు. బోయి భీమన్న అంబేడ్కర్ గురించి కొన్ని రచనలు చేస్తే, వారి తనయ డాక్టర్ బోయి విజయ భారతి తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని 'అంబేడ్కర్ ప్రసంగాలు' పేరుతో అంబేడ్కర్ సాహిత్యాన్ని తెలుగు పాఠకలోకానికి చేరువ చేశారు. అంబేడ్కర్ ఆంగ్లంలో రాసుకున్న 'కులనిర్మూలన'అనే ఉపన్యాస వ్యాసం పుస్తక రూపాన్ని సంతరించుకుంది. ఆ గ్రంథాన్ని బోయి భీమన్న తెలుగులోకి అనువదించారు. వీరి అనువాద నైపుణ్యాన్ని గురించి తెలియజేయడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

భీమన్న అనువాద నైపుణ్యం :

'కులనిర్మూలన' గ్రంథాన్ని తర్జుమా చేసే సందర్భంలో స్వేచ్ఛానువాద పద్ధతిని అనుసరించారు. ఆంగ్లం నుండి అనువదించే క్రమంలో కొన్ని పదాలను, వాక్యాలను యథాతథంగా అనువదించడానికి సాధ్యం కాదు. అలాంటి సన్నివేశాలను, సంఘటనలను భీమన్న చాకచక్యంగా తమదైన శైలిలో అనువదించారు. బోయి భీమన్న చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగా, సూటిగా చెప్పారు. మూలంలోని కొన్ని ఆంగ్ల పదాలను లిప్యంతరీకరణ చేశారు. వీరి అనువాదం నల్లేరు మీద నడకలా సాగిందని తెలుస్తుంది.

నేపథ్యం :

లాహోర్ లోని జాత్ పాత్ - తోడక్ మండలి సవర్ణ హిందూ సంఘసంస్కర్తల సంస్థ. ఇది హిందూ సంఘం నుంచి కులవ్యవస్థను నిర్మూలించడమే దీని ప్రధాన లక్ష్యం. దీనికి శ్రీ సంపత్ రామ్ కార్యదర్శిగా ఉండేవారు. వీరు 1936లో లాహోర్‌లో జాత్ పాత్ - తోడక్ మండలి వార్షికోత్సవ సభకు భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్‌ని అధ్యక్షత వహించవలసిందిగా కోరారు. ఆ సమావేశంలో అంబేడ్కర్ కులనిర్మూలన గురించి ఉపన్యసించడానికి ఉపన్యాస వ్యాసాన్ని తయారు చేసుకున్నారు. అందులో హిందూ మతానికి సంబంధించిన

అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయనే నెపంతో సమావేశాన్ని వాయిదా వేస్తూ వస్తారు. ఈ వ్యాసాన్ని పుస్తకంగా ముద్రిస్తారు. గాంధీజీ హరిజన పత్రిక ద్వారా అంబేడ్కర్ వాదాన్ని ఖండిస్తాడు. దానికి బదులుగా అంబేడ్కర్ గాంధీజీకి తనదైన శైలిలలో సమాధానం చెబుతాడు. బోయి భీమన్న 'కులనిర్మూలన' గ్రంథాన్ని అనువదించే తరుణంలో అనువాద నైపుణ్యం ఎలా ఉందో కింది సంఘటనలను పరిశీలిస్తే తెలుస్తుంది.1. నేతి సంఘటన

ఒక అస్పృశ్యుడు విందు భోజనంలో నేతిని ఉపయోగించాడనే నెపంతో ఉన్నత వర్గాల దుర్మార్గపు చర్య ఎలా ఉందో తెలియజేసే సంఘటన ఇది. ఈ విషయాన్ని భీమన్న అక్కడ జరిగిన సంఘటనను కళ్ళముందు సాక్షాత్కారించేలా అనువదించిన తీరు వారి అనువాద నైపుణ్యానికి తార్కాణంగా చెప్పవచ్చు.

"గుజరాత్ రాష్ట్రంలోని జయపూర్ గ్రామానికి చెందిన ఒక అస్పృశ్యుడు యాత్ర వేసుకొని తిరిగి వచ్చి, ఆ గ్రామంలోని తన తోడి అస్పృశ్యులకు మత విషయమైన ఒక విందు ఏర్పాటుచేశాడు. విందు కొంచెం బాగా చేద్దాం అనుకొన్నాడు. విందులో వడ్డించిన వివిధ పదార్థాలలో నేయి ఒకటి భోజనం వడ్డించారు. అతిథులందరూ తినడం ప్రారంభించారు. అంతలోనే ఆ గ్రామానికి చెందిన హిందువులు వందలాదిమంది హఠాత్తుగా విందు పార్టీని ముట్టడించి విందారగిస్తున్న అస్పృశ్యుల పైబడి అంది నంతమందిని చావమోది, ఆహార పదార్థాలను చిందర వందర చేసి, నానా బీభత్సమూ చేసివేశారు. అమాయకంగా అన్నం తింటున్న అసహాయులైన అస్పృశ్యుల మీదకు ఇంతటి దౌర్జన్యంగా దండెత్తడం ఎందుకు జరిగినట్లు? అందుకు హిందువులు చెప్పిన కారణం ఒకే ఒకటి ఆ విందులో నేయి ఉపయోగించడం.

అస్పృశ్యుడైన వ్యక్తి విందులో నేయి వడ్డించడం అస్పృశ్యులు దానిని తినడం! అస్పృశ్యులు నేతిని వాడడం గర్వపోతుతనాన్ని ప్రదర్శించడము. అది హిందువుల దర్జాపెత్తందారులకు భంగకరమట. అదే హిందువులు జరిపిన అంతటి అఘాయిత్యానికి కారణం నేయి. కలిగినవాడు తినే భోగభోజ్యం కావచ్చు కాని అది ఉన్నతస్థాయికి సూచకం అని ఎవరంటారు? అంటే, అస్పృశ్యుడు తాము కొనుక్కోగల శక్తి ఉన్నా సరే నేతిని ఉపయోగించడం, అహంకార సూచనన్న మాట. ఆహారంలో నేతిని వాడుకొనే ప్రత్యేక హక్కుగల హిందువుడి ఔన్నత్యాన్ని భంగపరచడం." (కులనిర్మూలన, పుట - 49)

కులవ్యవస్థ కలుషితం :

కులం అనేది ఎలా ఏర్పడుతుంది. అలా ఏర్పడడానికి కారణాలను అంబేడ్కర్ తన అభిప్రాయాన్ని మూలంలో తెలియజేశారు. దానిని తనదైన శైలిలో భీమన్న ఇలా తర్జుమా చేశారు.

"కులం అనేది కొన్ని మత విశ్వాసాల కారణంగా ఏర్పడిన వ్యవస్థ. ఆ మత విశ్వాసాలకు శాస్త్రాల మద్దతు ఉంది. ఆ శాస్త్రాలు దైవ సమానులైన ఋషులచే ప్రతిపాదించబడినట్టివనే ప్రతీతి ఉంది. ఆ ఋషులు మానవాతీత శక్తులు కలవారనీ మహాజ్ఞానులనీ, అట్టివారి ఆదేశాలను ధిక్కరించడం మహాపాపమనీ, ప్రజలలో ఒక నమ్మకం ఉంది. అందువల్ల కులవ్యవస్థను వదులు కొమ్మని ప్రజలను, ప్రాధమిక మతభావాలకు విరుద్ధంగా నడుచుకోవాలని వారిని కోరడమే." (కులనిర్మూలన, పుట - 91)

హిందూ పదం అవిర్భావం :

భారతదేశాన్ని హిందూ దేశంగా పిలుస్తారు. సింధూ అనే పదం హిందూ పదంగా మారిందని కొందరి అభిమతం. అంబేడ్కర్ హిందూ పదం గురించి చెప్పిన వాస్తవ విషయాన్ని భీమన్న తన అనువాదంలో ఇలా వ్యక్తం చేస్తారు.

"ఇంతకూ ప్రప్రథమంగా మనం గుర్తించ వలసింది ఏమిటంటే అసలు హిందూ సమాజమే ఒక పుక్కిటి పురాణం. "హిందూ" అనే పదమే ఒక విదేశీ పదం.

మహమ్మదీయులు తమ ప్రత్యేకతను తెలియజేసు కునేందుకు ఈ దేశపు ప్రజలకు 'హిందువులు' అని పేరు పెట్టారు. మహమ్మదీయుల దండయాత్రకు పూర్వం ఏ సంస్కృత గ్రంధంలోనూ ''హిందూ'' అనే శబ్దం కని పించదు. ఈ దేశపు ప్రజలు తమందరూ కలిసి ఒకే ఒక పేరు ఉండడం అవసరమని అనుకొని ఉండలేదు. ఎందుకంటే తామంతా ఒక జాతిప్రజల మనే భావమే వారికి లేదు. హిందూ సమాజం అనేది ఒకటి ఏదీ లేదు. ఉన్నది ఒకటే అది కొన్ని కులాల సముదాయం. ప్రతి కులానికీ తాము బ్రతకడం ఒక్కటే లక్ష్యం, పరమార్థం. ఈ కులాలు వేని కవే అవి అన్నీకలిసి ఒక సమాఖ్యగా అయినా ఏర్పడలేదు.'' (కులనిర్మూలన, పుట - 62)

చాతుర్వర్ణ వ్యవస్థ :

''లోకానాంతు వివృద్ధ్యర్థం ముఖబాహూరుపాదతః
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రం చ నిరవర్తయత్''
(మనుస్మృతి)

బ్రహ్మ లోకాన్ని విస్తరింపజేయడానికి తన ముఖం, బాహువులు, ఊరువులు, పాదాల నుండి వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను సృష్టించాడని మనుస్మృతి చెబుతుంది. అయితే ఈ అస్పృశ్యత అనేది ఉన్నత వర్ణాల మధ్య కూడా ఉందనే విషయాన్ని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని బోయి భీమన్న తన అను సృజనలో ఇలా తెలియజేస్తారు.

''చాతుర్వర్ణ్యం క్రొత్తదేమీ కాదు. వేదాలు ఎంత ప్రాచీనమైనవో చాతుర్వర్ణ్యం కూడ అంత ప్రాచీనమైనదే. అందుకే ఆర్యసమాజకులు దీని ప్రాశస్త్యాన్ని గురించి ఆలోచించవలసిందిగా మనల్ని అడుగుతున్నారు. సమాజ వ్యవస్థాపనలో ఒక పద్ధతిగా దీని గత చరిత్రను పరిశీలించి చూస్తే, ఈ పద్ధతి అమలుకు పెట్టారనీ, ఆచరణలో అది విఫలమైందని స్పష్టపడుతుంది. బ్రాహ్మణులు మొత్తం క్షత్రియ జాతినే ఎన్నిసార్లు దుంపనాశనం చెయ్యలేదు? క్షత్రియులు ఎన్నిసార్లు బ్రాహ్మణులను నిర్మూలనం చెయ్యలేదు? మహాభారతం నిండా, పురాణాల నిండా, ఉన్నదంతా ఎక్కువగా బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ మధ్య జరిగిన సంఘర్షణల చరిత్రే కాదా!

బ్రాహ్మణుడూ, క్షత్రియుడూ వీధిలో తారస పడినప్పుడు - ఎవరు ఎవరికి ముందు నమస్కరించాలి? ఎవరు తప్పుకొని ఎవరికి దారి ఇవ్వాలి? అనే అల్ప విషయాలలో కూడ బ్రాహ్మణులూ, క్షత్రియులూ కొట్లాలకు సిద్ధపడేవారు కాదా!'' (కులనిర్మూలన, పుట - 82)

సాంఘిక విప్లవం రాకోవడానికి కారణం :

అన్యాయం, అక్రమం, జరిగినప్పుడు లేదా తమ హక్కులకు భంగం కలిగినప్పుడు గానీ ఒక సమూహంలో విప్లవం రావడం పరిపాటి. కానీ అస్పృశ్యులలో సాంఘిక విప్లవం రావడానికి చతుర్వర్ణ వ్యవస్థ మూల కారణం అనే విషయాన్ని మూలంలోని విషయాన్ని మార్పు చేయకుండా అంబేడ్కర్ మూలంలో ఎలా చెప్పారో అలాగే చెప్పి తన అనువాద పటిమను భీమన్న ప్రస్పుటింపజేశారు.

''ప్రపంచంలో అన్ని దేశాలలోను సాంఘిక విప్లవాలు జరిగినై, భారత దేశంలో సాంఘిక విప్లవాలు ఎందుకు జరగలేదన్నది నిరంతరం నన్ను వేధించే ప్రశ్న. బహుశ అందుకు ఒకే ఒకటి కారణమై ఉండవచ్చు. అది హిందువు లలోని దిగువ తరగతుల ప్రజలను పనికిమాలిన చాతుర్వర్ణ్య వ్యవస్థ పేరుతో అణచిపెట్టి ఉంచి ప్రత్యక్ష చర్యకు పూర్తిగా పనికిరాకుండా చేయడమే. వారు ఆయుధాలు ధరించకూడదు. ఆయుధాలు లేకుండా తిరుగుబాటు సాధ్యంకాదు. వాళ్ళు సేద్యగాండ్రుగా నిర్ణయించబడ్డారు. కాని తమ నాగళ్ళ కర్రు కోలలనైనా ఖడ్గాలుగా చేసుకోవడానికి వారికి వీలులేదు. ఏరకమైన ఆయుధాలూ వారికిలేవు. అందువల్లనే ప్రతివారూ వాళ్ళ తలపై ఎక్కి కూర్చున్నారు.

చాతుర్వర్ణ్య వ్యవస్థ కారణంగానే ఈ దిగువ కులాల ప్రజలు విద్యను ఆర్జించలేక పోయారు. విముక్తిని గురించి

స్వయంగా ఆలోచించుకొనే శక్తిని కోల్పోయారు. తమ విమోచనకు తాము ఏవిధంగా పాటుపడాలో గుర్తించలేని అజ్ఞానులైనారు. సంఘంలో హీనులుగా, దీనులుగా అణగద్రొక్కి ఉంచడం వల్ల, ఈ ప్రజలు "అంతా మన కర్మ" అనుకొంటూ, శాశ్వత బానిసవృత్తికి అలవాటై పోయారు." (కులనిర్మూలన, పుట - 81)

కులనిర్మూలన మార్గాలు :

కులాన్ని నిర్మూలించినప్పుడే సమసమాజం ఏర్పడు తుందని కులనిర్మూలన కర్తల ఆలోచనా దృక్పథం. అందులో భాగంగానే కులం గురించి బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇలా అంటారు. "కులం పునాదుల మీద మీరు దేన్నీ నిర్మించలేరు. ఒక జాతినీ నిర్మించలేరు. ఒక నీతిని నిర్మించలేరు. కులం పునాదుల మీద ఏదైనా నిర్మిస్తే అది పగిలి ముక్కలు కావడం తప్పదు. అలాంటి దేదీ ఒక సంపూర్ణ నిర్మాణంగా మన జాలదు." అంబేడ్కర్ సూచించిన కుల నిర్మాణ మార్గాలను బోయి భీమన్న ఇలా విపులీకరిస్తారు.

"కుల నిర్మూలనకు సరైన పద్ధతి వర్ణాంతర వివాహా లేసని నాదృఢవిశ్వాసం. రక్తసమ్మిశ్రేణ ఒక్కటే మానవు లలో అన్యోన్య అనుబంధభావాన్ని, బాంధవ్యాన్ని కలిగి స్తుంది. అట్టి బంధు భావ ప్రభావం లేనిదే కులం కల్పించిన విభేదాలను, వివక్షతలను రూపుమాపలేం. వివిధ కులాల మధ్య స్నేహాను బంధాలను కలిగించా లంటే, ఆయా కులాల వ్యక్తుల నడుమ రక్త సంబంధాలను కల్పించక తప్పదు"

హిందువుల సాంఘిక జీవనంలో వర్ణాంతర వివాహాలు, హైందవేతరులలో శాఖాంతర వివాహాలకంటే అత్యధిక ప్రాధాన్యం వహించాలి. హైందవేతరులలో సాంఘిక సమైక్యానికి ఇతర శక్తులు ఎన్నో పనిచేస్తూ ఉంటే కనుక, ఈ వివాహాలు అంత ప్రాధాన్యం వహించనక్కరలేదు. అవి ఒక సాధారణ సంఘటనలు మాత్రమే హిందూ సమాజం కులాల వల్లా, ఉపకులాల వల్లా చిన్నాభిన్నం చెయ్యబడి ఉంది. కనుక, వారందరినీ కలిపి ఒక సుసంఘటిత మైన సమాజంగా తీర్చి దిద్దాలంటే, అందుకు వర్ణాంతర వివాహాలు తప్పనిసరైన తక్షణ కర్తవ్యం. కులవ్యవస్థను రద్దుచేయడానికి సరైన మందు వర్ణాంతర వివాహాలే మరొకటేదీ పనికిరాదు." (కుల నిర్మూలన, పుట - 88)

ధర్మసూత్రాలు - బ్రాహ్మణులు :

మనుస్మృతిలోని ద్వంద్వ నీతులను, బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణిని బోయి భీమన్న ఇలా భాషాంతరీకరణ చేశారు. 'తక్కిన హిందువులందరివల్ల కూడ, గొప్ప పూజలందుకొంటున్న మేధావి వర్గం ఈ బ్రాహ్మణులే. బ్రాహ్మణులు భూదేవతలని హిందువులకందరికీ బోధించారు. బ్రాహ్మణులు మాత్రమే గురువులుగా ఉండాలని హిందువులకందరికీ చెప్పారు. "వర్ణానాం బ్రాహ్మణో గురుః"

"ప్రత్యేకంగా పేర్కొనబడని ధర్మ సూత్రాల విషయంలో ఏమి చెయ్యాలి. వాటి నెలా తెలిసికోవాలి .అని సంశయం వచ్చినప్పుడు నైష్ఠికులైన బ్రాహ్మణులు ఏది చెప్పితే దానినే న్యాయబద్ధమైన ధర్మంగా స్వీకరించాలి" అని మనువు అన్నాడు.

"అనామ్నాతేషు ధర్మేషు కథం స్యాదితి చేద్భవేత్।
యం శిష్టా బ్రాహ్మణా బ్రూయుఃస ధర్మఃస్యాద శంకితఃll'

అటువంటి మేధావి వర్గం తక్కిన సమాజాన్నంతా తన గుప్పిటిలో పెట్టుకొని ఉన్న మేధావి వర్గం కుల సంస్కరణకు వ్యతిరేకమై ఉండగా, కులవ్యవస్థను నిర్మూలించే ఉద్యమం ఫలప్రదం అయ్యే అవకాశాలు చాలా తక్కువ అని నా అభిప్రాయం." (కులనిర్మూలన, పుట - 94)

"వేదంగాని, స్మృతిగాని చెప్పేదాని అర్థం గురించి అనుమానం వచ్చినప్పుడు అట్టి వేద భాగానికో, స్మృతి భాగానికి సరైన అర్థం చెప్పుకోవడం ఎలా? ఇది చాలా

ముఖ్యమైన ప్రశ్న కాదా? ఈ ప్రశ్నకు మనువు చెప్పిన జవాబు ఎంత స్పష్టంగా ఉందో చూడండి.

"యోఅవ మన్యేత తేమూలే హేతు శాస్త్రాశ్రయాత్ ద్విజః।
ససాధుభిర్బహిష్కార్యోనాస్తికో వేదనిందకః॥"

ఈ నిబంధన ప్రకారం వేదాలకు, స్మృతులకు అర్థం చెప్పుకోవడంలో హేతువాదానికి తావులేకుండా చేశారు. హేతుబద్ధంగా వేదాదులకు అర్థం చెప్పడం నాస్తికత్వం వంటి దుష్టత్వమని హెచ్చరించారు. అందుకు శిక్ష సాంఘిక బహిష్కారం (వెలి) అని కూడ నిర్దేశించారు." (కులనిర్మూలన, పుట - 96)

కులం దృఢమైన గోడ :

కులనిర్మూలన జరగడానికి ఏమి చేయాలో అంబేడ్కర్ అస్పృశ్యులకు ఒక సందేశాన్నిస్తాడు. దీనిని అనువదించాడానికి, చెప్పడానికి ఏ కవి అయినా కొంచెం సంకోచిస్తాడు. కానీ భీమన్న చెప్పదలుచుకున్న ఆ విషయాన్ని స్థైర్యంతో,ధైర్యంగా అనుసృజన చేశారు.

"కులానికి చుట్టూ నిర్మించబడ్డ గోడ అజేయమైనట్టిది ఆ గోడకు ఉపయోగించిన పదార్థం హేతువాదానికి కాని, నైతిక శక్తికి కాని సోలనిది, కాలనిది దీనికి తోడు ఆ గోడ లోపల ఉన్న వాళ్ళు బ్రాహ్మణ సైన్యం. బ్రాహ్మణులంటే ఎలాంటి బ్రాహ్మణులు వర్గంగా రూపొందిన బ్రాహ్మణులు. హిందువులకు సహజ నాయకులైన బ్రాహ్మణులు. దేశ రక్షణకు నియమించే మామూలు సైనికులు కాదు. తమ సంస్థాన రక్షణ కోసం ఒక సైన్యంగా సంఘటితులై పోరాడే బ్రాహ్మణులు. ఇప్పుడు ఆలోచించి చూడండి - హిందువులలో కుల వ్యవస్థను భేదించడం దుస్సాధ్యమని నేను ఎందుకు అంటున్నానో మీకు అవగాహన అవుతుంది. ఏ విధంగా చూచినా, ఈ కోట గోడను భేదించడానికి కనీసం ఒక చిన్న పగులు అయినా కొట్టడానికి - యుగాలు పట్టవచ్చునని నా ఉద్దేశం.

ఏది ఏమైనా - ఈ గోడను భేదించడానికి యుగాలు పట్టినా, లేక ఆ పని వెంటనే జరిగినా -కుల వ్యవస్థను భేదించడానికి మీరు నిర్ణయించుకుంటే ఒక్క సంగతి మాత్రం మీరు మరిచిపోకూడదు. అదేమిటంటే అలా భేదించడానికి మీరుపయోగించే డైనమైటును (ప్రేలుడు మందును) వేదాలపైన, శాస్త్రాలపైన ప్రయోగించ వలసి ఉంటుంది. హేతువాదానికి కాని, నైతికశక్తికి కాని స్థానం లేకుండా చేస్తున్నవి. వాటిని భేదిస్తేనే తప్ప కులవ్యవస్థను భేదించలేరు. శ్రుతుల యొక్క, స్మృతుల యొక్క మతాన్ని మీరు నాశనం చెయ్యవలసి వుంది.మరి దేనివల్లనూ మీకృషి ఫలించదు.ఈ విషయంపై ఇది నా నిశ్చితాభిప్రాయం." (కులనిర్మూలన, పుట - 99)

బోయి భీమన్న 'కుల నిర్మూలన' అనుసృజన అంబేడ్కర్ తాత్వికతను, కులం గురించి, కులనిర్మూలన గురించి, చెప్పిన విషయాలను ఆంగ్లంలో చదివి అర్థం చేసుకోలేని తెలుగు పాఠకులకు కరదీపికనుట అతిశయోక్తికాదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కుల నిర్మూలన - బోయి భీమన్న
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - బోయి భీమన్న సాహిత్య పీఠం
3. మనుస్మృతి - నల్లందిగళ్ లక్ష్మీనరసింహాచార్యులు
4. ూఅఅఱ్ఱఱశ్రీఱ్ఱశీఅ శీట ఱ్ఱుర్ - ణతీ.దీ.=ూఎఎవనఱ్ఱుతీ

ఆధునిక దళిత మహాకవి – బోయి భీమన్న

– ఆచార్య ఎం. రామనాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి,మైసూరు.

ఆధునికయుగంలో పేద పాలేరు కుటుంబంలో జన్మించిన ప్రతిభామూర్తి బోయి భీమన్న. తాను పుట్టి పెరిగిన వాతావరణం, ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు అతని ఆలోచనల్లో మార్పు తెచ్చాయి. దృక్పథంలో నవ్యతను చొప్పించాయి. బానిసత్వ తిరస్కరణ, ఆత్మ గౌరవ పరిరక్షణ అతనిలోని మేధావి తనాన్ని నిదుర లేపాయి. జాతి జాగృతికి దోహదం చేసేట్టు చేశాయి.

సమసమాజాన్ని నిర్మించాలంటే సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుంది. బలంగా నమ్మినవారిలో భీమన్న ఒకరు. అందుకే ఆయన శక్తివంచనలేకుండా తెలుగు సాహితీవనంలో వివిధ ప్రక్రియల్లో విలువైన రచనలు చేసి, సమాజాన్ని, తన జాతిని జాగృతి పరచి, విద్యావంతులుగా చేయాలని, వివేక వంతులుగా మార్చాలని, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలన్న ఆశయంతో ఎంతో తాపత్రయ పడ్డ మేటి దళిత కవి.

భీమన్న తన బలమైన చేతితో, విలువైన కలంపట్టి, సిరాచుక్కలతో, అక్షరాలను సంధించి, పేదల హృదయాలను సూటి పోటి మాటలనే పిడి గుద్దులు గుద్ది, మేల్కొల్పిన సహృదయుడు. ప్రతిభావంతుడు. పద్యమైనా, గద్యమైనా, నాటకమైనా, వచనమైనా అలవోకగా, అతి సరళంగా రాయగలిగిన నేర్పరి భీమన్న. ఆయన ప్రతిమాట, ప్రతి ఆలోచనా తన జాతికోసమే చేశాడు. జీవితాంతం నిస్వార్థంతో కష్టించి, దళితులకు న్యాయం చేయాలని, గౌరవం తీసుకురావాలని ఆశించాడు. జాతి సమైక్యత, కుల నిర్మూలన వంటివి సాధించాలంటే యువశక్తివల్లనే సాధ్యమవుతుందని భావించిన భావోద్వేగి.

సమాజంలో తిండి, గుడ్డ, నీడ అత్యంత అవసరమైన వని, నాటికి కూడా నోచుకోని బడుగు బలహీనులకు తోడుగా నిలవాలన్నారు. శ్రీ-వాణి-గిరిజలు తోడుంటే ఏ జాతి, మతము అడ్డురావని బలంగా విశ్వసించిన కవి భీమన్న. అలాగే సమాజాన్ని అనుభవంతో లోతుగా అధ్యయనం చేసిన యోగివేమన వాస్తవికతను తెలుసుకుని "కులములేనివాడు కలిమిచే వెలయును

కలిమిలేనివాడు కులము దిగును
కులము కన్నా భువిని కలిమి ఎక్కువసుమీ!" అని తెలి పాడు.

నిరుపేద కుటుంబంలో జన్మించి, సంఘర్షణాత్మక జీవితపు ఒడిదుడుకులకులోనై, అందరిలాగే బలవంతులకు, వారి దౌర్జన్యాలకులోనుగాక, ధైర్య సాహసాలతో, సరస్వతీదేవి కృపాకటాక్షంతో నిర్విరామంగా కృషి సల్పి, అమూల్యమైన రచనలు గావించి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలిగి, తెలుగు భాషామతల్లికి ఎనలేని కృషి చేసిన సాహితీ కృషీవలుడు బోయి భీమన్న.

దళిత మహోదయాన్ని రచించిన దళిత మహాకవి బోయి భీమన్న. గొప్ప ఉపన్యాసకుడు, అభ్యుదయవాది, మానవతావాది. కుల, మత, వర్గ రహిత సమాజం కోరుకున్నవాడు. చీకటిలో బ్రతుకుతున్న నా వాళ్ళను మెప్పించడం కాదు నా కవితా లక్ష్యం. వాళ్ళను తిట్టి, కొట్టి అయినా సరే చీకటి నుండి వెలుగులోకి, కలుగులోంచి బయటకు తీసుకురావడం అని భీమన్న తన వ్యక్తిత్వాన్ని చక్కగా ఆవిష్కరించుకున్నాడు. తన వారికోసం అహర్నిశలు శ్రమించిన శ్రామిక కవి.

బోయిభీమన్నగారు దళితులు చేసే పనులన్నింటి గురించి చెబుతూ

"నీరుగట్టి, మళ్ళుగట్టి, నారుగట్టి
కంచెలనుగట్టి నిన్ను పోషించి రెవరు
అతని మొక్కను నేను విశ్వావకాశ
వీధులందిష్టమైనట్లు పెరుగుచుంటి" అని దళితులు అగ్రకులాల వారిని పోషిస్తుంటారని, ఆ విధంగా తనను ఎవరూ పోషించరనీ, తాను ఈ విశ్వవీధుల్లో అనాథగా

పెరుగుతూ వుంటానని, ఆవేదనా భరితంగా వ్యక్తం చేశాడు.

అలాగే

"ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై
ఈ విషవలయం సాగడం ఎంత వరకు
రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసే వరకు" అని అట్టడుగున వున్న పేద ప్రజలను కళ్ళు తెరవమని ఉద్బోధించాడు. 'గుడిసెలు కాలిపోతున్నై' భీమన్నగారి అభ్యుదయ భావానికి దర్పణం. ఈ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. స్వయంగా దారిద్ర్యపు బాధలను అనుభవించిన భీమన్న నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు తమ జీవితాలను తామే బాగు చేసుకోవాలని మార్గం చూపిన మార్గదర్శకుడు.

"నీవు దుక్కిటెద్దువుకాదు
జీవజ్జగతికి నలుమోముల పెద్దవు
ఇక వద్దు నిద్ర
అందుకో రాజముద్ర" అంటూ బోయి భీమన్న తన జాతిని "దుక్కిటెద్దువుకావు" అనే కవితలో మేల్కొలుపు తాడు. అలాగే ఎముకల్లోని మూలుగను కూడా పీల్చేసే రాబందులు, నక్కలు; చెరుకులో రసం పీల్చి పిప్పిచేసే ధనమదాందుల కుట్రలను దళితులు పసిగట్టాలని, ఎరను వేసి ఏనుగును లాగే మోసపూరిత వ్యవస్థను నమ్మి బురదలో పడవద్దని, ధనికుల వక్రదృష్టిని పసిగట్టాలని దళితులను హెచ్చరించాడు.

'వర్షాల కమిటీ' అనే కవితలో చాలా చక్కటి వ్యంగ్యాస్త్రాన్ని, వెటకారంతో సంధించాడు భీమన్న.

"ధర్మరాజు పరిపాలనలో
నెలకు మూడు వర్షాలట
కావచ్చు-
ఆనాడు ఒక్కడే ధర్మరాజు
ఈనాడు
అందరూ ధర్మరాజులే-యమ" అని చెప్పడంలో పాఠకుడికి వెటకారం సూటిగా తగులుతుంది. 'యమ'ను చేర్చడంలో కవితకు సౌందర్యంతో కూడిన కొసమెరుపు దక్కించడం భీమన్నకే సాధ్యం అయింది.

సమాజంలోని దళితుల జీవితాలను యథాతథంగా ఆవిష్కరించడం, వారందరినీ సంఘటితంచేసి, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం, సమస్యలను తమకు తామే పరిష్కరించుకోవడానికి భీమన్న గారు చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు. సమాజంలో కులమత భేదాలు మాపి ఏకైక భారత జాతిని తయారుచేసి, రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా సమత్వం స్థాపించాలన్నదే భీమన్నగారి ఉన్నతాశయం. సామాజిక అభ్యున్నతికి తోడ్పడాలన్నదే ఆయన మతం.

నాటకం జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. జీవితం నాటకాన్ని అనుసరిస్తుంది. నాటక సాహిత్యం సాంస్కృతిక సంపదకు చిహ్నం. నాటకాల్లోని పాత్రలు, సన్నివేశాలు, కథా కథనాలు నాటికీ, నేటికీ సామాజిక పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. నాటకం నర్మగర్భంగా సమాజానికి సందేశాన్నిస్తుంది. నాటకంలోని పాత్రలు చెప్పే సందేశాన్ని, సారాంశాన్ని అవగతం చేసుకోవాలి. నాటక సాహిత్యంలో సామాజిక విలువలను పెంపొందించి సమాజంలో చైతన్యం తీసుకువచ్చి, జీవితాలను మార్చిన వైనం చూడవచ్చు.

ఇటువంటి నాటక సాహిత్యాన్ని పసిగట్టిన బోయి భీమన్న గారు నాటక సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్య పరచాలని భావించాడు. నాటకంలోని పాత్రల సన్నివేశాలను, మానవ సంబంధాలను, భావోద్వేగాలను, బల హీనతలను కళ్ళకుకట్టినట్టు సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యేరీతిలో మలచి మన ముందుంచాడు భీమన్న. ఇతను తన నాటకాల్లోని పాత్రలలోకి పరకాయ ప్రవేశం చేసి, పాత్రల స్వభావాన్ని తెలిపి, రూపకల్పన చేసి, దానికి తగినట్టుగా సంభాషణల రూపంలో సన్నివేశాలను రక్తికట్టించి, తన జాతిని మేల్కొల్పిన ఉన్నతుడు.

బోయి భీమన్నగారు సమాజంలోని కులవ్యవస్థను కళ్ళకు కట్టినట్టు, ఉన్నది వున్నట్టు తమ నాటకాలలో పొందుపరచాడు.

''పాలేరు తనం చేసుకు బ్రతికే తాత్తుకొడుక్కి చదువేమిటిరా చదువు'' అన్న ఒక్కమాటలో అర్థం అవుతుంది అగ్రకులాల దురహంకారం.

''మాలను గావించి పాలేరు జేసి
కామందు కాలికి గట్టినావు
అంటరాదని జెప్పి పెంటల పాల్జేసి
నీచులమనుపేర నిల్పినావు
చదువు సంధ్యలు లేక జంతువులనుబోలె
ఊరి వెల్పల చావ నుంచినావు
అజ్ఞాన తిమిరాల యడుగున బడద్రోసి
బరిగీసి యెదనొక్కి పట్టినావు'' అని దళితుల బాధను భీమన్న తన గొంతుకనుండి వెలువరించాడు.

అగ్రకులాలు దళితుల్ని బానిసలుగా చేసుకుని, వారి ధనమాన ప్రాణాలను అపహరించడాన్ని కవి తీవ్రంగా ఖండించాడు.

ఒక స్త్రీని ధనవంతుడు బలాత్కారం చేయగా, ఆమె లొంగకపోగా ''నీవు పాలేరు దానివి. నేను కామందును. నేను చెప్పింది నువ్వు చెయ్యాలి. కామందంటే సగం మొగుడు'' అని, పాలేరులంటే తన కాలికింద చెప్పులని భావించే స్వభావం కలవారని కవి అగ్రవర్ణ దౌష్ట్యాన్ని, ఆర్థిక దర్పాన్ని, దోపిడీ వ్యవస్థను తమ రచనల ద్వారా చూపించాడు. అలాగే ''అడుక్కుతింటాం గాని మానాన్ని పోగొట్టుకోం'' అనే ఆత్మగౌరపు మాటలను స్త్రీల చేత ఉన్నతంగా పలికించాడు కవి.

అజ్ఞానం అనే అంధకారంలో బతుకులీడుస్తున్న పీడిత వర్గాలకు చదువు సంధ్యలు తమ బిడ్డలకు నేర్పించాలి, ఆ చదువుతోనే బానిసత్వం మారుతుందని

''శక్తికంతకు మూలము చదువుగాన
బడికి పంపుడు మీ వంశ వర్ధనులను'' అంటూ భీమన్నగారు ప్రబోధం చేశాడు. అలాగే ''బ్రతుకు ఉద్యమం''లో ''బతుకుదెరువు''లో సంఘర్షణ సహజం. బ్రతుకే ఒక సమరం అని హెచ్చరించాడు. శాంతి, సత్యాలకు సత్తువ కలుగజేయమన్నాడు. సమాజంలో మొక్కగా మొలచి, బలంగా బలిసిన ముళ్ళ పొదలను తెగనరికి ముత్యాలను పండించి, సన్మార్గంలో నడవాలని యువతకు ఉపదేశం చేశాడు.

దళితులు తమ బతుకులకు చదువెందుకని, అజ్ఞాన అంధకారంలో జీవిస్తూ, మహాకవులు తమ రచనల ద్వారా ఎంత మార్చాలని ప్రయత్నించినా, వారు మారకపోగా, భీమన్నగారు 'మారనివాడు' అనే సుదీర్ఘమైన కవితలో హరిజనుని స్థితిగతులు ఈనాటికీ మారలేదన్న వ్యధను అత్యంత హృదయ విచారకంగా చిత్రించారు.

''మనిషి మారినా - సమాజం మారినా
లోకమే మారినా - వాడు మాత్రం మారడు!
అంత మారని ఆత్మారాముడు - ఎవడు అంటున్నారా!
వాడు ఆత్మారాముడు కాదండీ
హరిజనుడు - వట్టి అంటరానివాడు.
ఎప్పుడైనా చూచారా వాడి కాళ్ళు
ఆ కాళ్ళకింద ఎంత చండాలం
అందుకే వాడ్ని చండాలుడన్నారేమో!
లోకంలోని సమస్త పంకిలాన్నీ
తొక్కేసు కొస్తున్నట్టున్నాడు!
వాడుకట్టిన ఆ మురికితోలు
ఏనాడు చచ్చిన ఏ జంతువుదో!
వీడికెన్ని రిజర్వేషన్లు కల్పించినా
ఎంత సానుభూతితో రాసుకు తిరిగినా
ఎన్ని చట్టాల రాజ్యాంగ రథాలపై వీణ్ని
కాస్త ముందుకు తోలుకు పోదామనుకొన్నా
వీడు ఒక్క అడుగైనా - ముందుకు కదలడు''
అని ఎంతో వాపోయాడు బోయి భీమన్నగారు.

కవిత్వం విలువ తెలుసుకున్న కవి పుంగవుడు. చదువు విలువ తెలిసిన మహాజ్ఞాని. కులం కంటే గుణం ముఖ్యమని తెలిపిన మేధావి. 'అడవిలో మేక ముట్టని చెట్టు లేనట్టు' సమాజంలోని దళితుల జీవన విధానాన్ని

హృదయ విదారకంగా వివిధ రచనల ద్వారా, వివిధ ప్రక్రియల ద్వారా కళ్ళకు కట్టి చూపించడంలో మేటి రచయిత, మహాకవి భీమన్న. తన మేధా సంపత్తునంతా బడుగుల ఉన్నతీకరణకు ఉపయోగించిన ఉన్నతుడు. తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాలకు అర్పించిన త్యాగమూర్తి.

భావ విప్లవం, జాతి సమైక్యత, కుల నిర్మూలన, సమసమాజ స్థాపన, శ్రేయోరాజ్య సిద్ధి - ఈ పంచ లక్ష్యాలను యువత సాధిస్తుందని బలంగా నమ్మిన కవి భీమన్న. అలాగే జిజ్ఞాసను, జ్ఞానపిపాసను, విశ్వజనైక దృష్టినీ, మానవ బాధ్యతను రేపటి పౌరులలో ప్రజ్వలింప జేయ్యడమే నా రచనా లక్ష్యమని చెప్పారు. మానవ జీవిత లక్ష్యం మధురంగా బ్రతకడం. ఈ లక్ష్య సాధనకు మతం, వర్గం, స్వార్థం లేని సమాజం ఏర్పడాలని భావించాడు కవి.

బోధలకు బుద్ధీ, నీతులకు మానవ స్వభావం మారదు. మతానికి, దేవుడికి, భక్తికి కట్టుబడి వున్నంత కాలం ప్రజలు నిద్ర మత్తునుండి మేలుకోలేరు. ప్రజలను యుగయుగాలుగా అంధకారంలో వుంచుతున్నట్టి మత్తు మతం, దేవుడు, భక్తిదే. వీటి నుండి విమోచనం పొంద వలసినదిగా ప్రజలకు ఉద్బోధ చేశాడు భీమన్న.

సమాజంలోని వాళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదని, మంచి వాళ్ళు కూడా వుంటారనడం భీమన్నగారి రచనల్లో కనిపించే మంచి గుణం. ఆయన మతం అనే భావనకు వ్యతిరేకం. 'మతం ఒక పిచ్చి' అనే కవితలో

"మానవ భావన నుంచి
మతాన్ని తొలగించ గలిగితేచాలు
విశ్వమానవ శ్రేయస్సు
సర్వ మానవ సమతోషస్సు
సద్య సముద్భూతమవుతుంది!
మబ్బు విడిచిన సూర్యుడిలో
మానవాత్మ జాజ్వల్యమానమవుతుంది"

అని మతాన్ని పారద్రోలమన్నాడు. దాంతో విశ్వమానవ శ్రేయస్సు ఏర్పడుతుందని భావించిన మహాజ్ఞాని బోయి భీమన్నగారు.

దళిత మహాకవి బోయి భీమన్నగారు తన సుదీర్ఘ జీవన పయనంలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సమాజసేవకు కూడా ఎంతో పాటుపడ్డారు. ఆయన సమాజాన్ని చైతన్యపరచడానికి వివిధ రచనలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు.

దీపసభ, పాలేరు, రాగవాసిష్టం, పైరుపాట, త్రిపదలు, జానపదుని జాబులు, పిల్లిశతకం, ధర్మంకోసం పోరాటం, ఆదికవి వాల్మీకి, గుడిసెలు కాలిపోతున్నై వంటివి భీమన్నకు అత్యంత కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి.

మహాకవి భీమన్న అందుకోని సన్మానం గాని, బిరుదులుగాని లేవంటే అతిశయోక్తి కాదు. అత్యంత గౌరవ పూర్వకమైన పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులు భారత ప్రభుత్వం నుండి స్వీకరించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నుండి 'కళాప్రపూర్ణ' పొందారు. కాశీ విద్యాపీఠం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు.

తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు నందు బోయి భీమన్న గారి పేరిట సాహిత్య పీఠాన్ని స్థాపించి, అతని రచనలపై పరిశోధనలు చేయిస్తూ, పరిశోధనాత్మక గ్రంథాలను వెలుగులోనికి తీసుకువస్తున్నారు.

ఆధునిక దళిత మహాకవిగా ఖ్యాతి గడించిన బోయి భీమన్నగారు పరిశోధనాత్మక దృష్టితో సమాజం ముందు కొత్త ప్రతిపాదనలను, కొత్త సిద్ధాంతాలను వుంచాడు. ఇది పరిశోధకులకు, విమర్శకులకు తనదైన విశ్లేషణకు ప్రేరణ అవుతుంది. "కొండ అద్దమందు కొంచెమై కనుపించదా" అన్నట్టు బోయి భీమన్నగారి సాహిత్య రచనలను ఈ పరిశోధనాత్మక వ్యాసంలో పొందుపరచాను.

ఆధార గ్రంథాలు :

ఆంధ్రుల జానపద విజ్ఞానం, 1983, ఆర్వీయస్ సుందరం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

తమస్సుపై దండయాత్ర - దీపసభ

- డా॥. టేకుమళ్ళ వెంకటప్పయ్య, నెల్లూరు విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

దీపం పరబ్రహ్మ స్వరూపం. పరాయణత్వం కలిగినది. పాప ప్రక్షాళన చేసేది. దీపం లేని ఇల్లు ప్రాణం లేని శరీరం వంటిది. ఈ మానవశరీరం పంచభూతాత్మికమైనది. దీపపుప్రమిద శరీరానికి ప్రతీక. వెలిగేజ్యోతి మనలోని జ్ఞానం. జ్ఞానమే ఆత్మస్వరూపం. ఆ జ్ఞానం సర్వతో ముఖంగా వికసించాలని బోయి భీమన్న చేసిన ప్రయత్నమే "దీపసభ" కావ్యం. "గుడిసెలు కాలిపోతున్నై" అని తరువాయి కాలంలో అన్న భీమన్న భావనలోని తాత్వికబీజం ఈ కావ్యంతోనే పడిందని చెప్పవచ్చు. దీపసభ కావ్యంలోని పాత్రలు దీపాలు. అది ఈ కావ్యం లోని దీపం అనే విషయాన్ని ఏక సూత్రత క్రింద భావించ వచ్చు. కానీ రూపాన్ని, ప్రయోజనాన్నిబట్టి, దీపాలు వేరువేరుగా దృశ్యమానం చేస్తాడు భీమన్న. అందువల్ల దీన్ని ఒక అపూర్వ ఖండకావ్యంగా భావించినా తప్పులేదేమో అని నా భావన. వాటి వెలుతురు వ్యాపించే ప్రాంతాలు, దృశ్యాలు కూడా భిన్నంగానే ఉంటాయి. అదే జీవన-జీవిత వైవిధ్యం. ఆ వైవిధ్యం వలననే దీపసభకు అంతటి వైశిష్ట్యం చేకూరింది. అంతే కాదు కావ్యంలో తాత్వికత పలుచోట్ల తొంగి చూస్తూ ఉంటుంది.

కావ్యానుక్రమణం :

ఈ కావ్యకథకు కథకుడు రైతుకూలీ. ఆయన ఇంట్లో దీపానికిసైతం నూనెలేని కడు నిరుపేద. వెలుగునిచ్చే దీపంకోసమే అతని నిత్యఆరాటం. ఆరిపోయినన దీపపుకాంతి ఆకాశమార్గాన పయనిస్తుంటే కథకుడు కన్నులు మూసి ఆదీపాన్ని అనుసరిస్తూ వెళ్తాడు. ఆకాశంలో దీపసభను చూస్తాడు. కార్తీక పౌర్ణమి వెన్నెలకాంతి అధ్యక్షతన ఆసభ జరిగుతుంది. వెన్నెలను స్త్రీగా సంభావించిన కవి ఆమె ముఖపద్మ కాంతులను అద్భుతంగా పోల్చటం ద్వారా అటు రైతన్నల వ్యవసాయ సంస్కృతిని, ఇటు శ్రమైక సౌందర్యాన్ని ఏకకాలంలో మనకు సాక్షాత్కరింపజేశాడు భీమన్న. భీమన్న ఈ కావ్యాన్ని అనేక శీర్షికలతో కొన్ని రనవత్తరమైన ఖండికలుగా విభజించారు. వాటిని అదేవరుసలో పరిశీలిద్దాం.

వెలుగు :

ఈ పద్యకావ్యం "వెలుగు" అనే ఖండికతో ప్రారంభం అవుతుంది. రైతుకూలి నాయకుడు గనుక అతని ఆత్మనివేదనంతో కావ్యం ప్రారంభమౌతుంది. "తైలము లేదు మేనునొక దమ్మిడియైనను చేతలేక అంటూ "ప్రసన్నవుగమ్ము ప్రసన్న తేజమా!" (పుట.6) అని ఆర్తితో ప్రార్థిస్తూ..ముగిస్తాడు భీమన్న.

చీకటి :

అంధకారాన్ని వర్ణించే ఖండికలో, చిమ్మచీకటి ఎంత భయంకరంగా ఉంటుందో చెబుతూ ఆ సమయంలో తరకలనుండి వచ్చే కాంతి రేఖలు ఎంత హృద్యమో చెప్పారు. "వెలిగింపవెలిగి, తైలము కలిగిన కాసంతసేపు కాంతినొసగి, యావల మాసిపోవు దివ్వెకు, ఫలమేమిటి? వెలుగుకిట్టి బ్రతుకేమిటికో" (పుట.9) అంటాడు.

ప్రగతి :

అలా చీకటి గురించి యోచిస్తూ ఒక్కసారి కన్నులు మూసుకోగానే "పైగెగసెను నా దీపము, పైకెగసితి నేనునొక్క పర్వేందు కళాశికరమై" (పుట.10) అంటే ఒక మంచు బిందువులాగా కన్నులు మూసి ఆ దీపాన్ని అనుసరిస్తూ పైకి వెళ్ళాడట. అక్కడ తారామండలంలో ఎన్నో అద్భుతాలను చూశాడు. ఉల్కలను, తారలను, కాంతిమయ మండలాలను దర్శించాక "మనోహర వివిమోహనారుణారుణ నవ కోకనద మొకండు రాగరుచి పద్మరాగ సౌరభ్యమేదొ నను సమాకృష్ట చేసుకొన్నది బిరాన" (పుట.14) అంటే ఒక చెంగలువ మనసులో

వికసించి ఆ సౌరభ్యము కవిని అత్యంత వేగంగా ఆకర్షించిందని ముగించాడు ఈ ఖండం.

పరిషత్తు :

ఈ ఖండికలోనే కవికి దీపనభాసాక్షాత్కారం జరుగుతుంది. కార్తీక పౌర్ణమి వెన్నెల కాంతి అధ్యక్షతన ఆ సభ జరిగుతుంది. వెన్నెలను స్త్రీగా భావించి ఒక దేవిని చూచి దీపాలన్నీ న,రి,గ,మ,వ,ద,ని కిన్నెరపై నొక్కొక్కదానిని" (పుట.20) మ్రోగిస్తున్నాయట. దీనిలో కార్తీక మాస కాంతులను, వివిధ ఋతువులలోని వర్ణ కాంతులను వైవిధ్యభరితంగా వర్ణించడం ఉంది.

మైనపుదీపం :

ఈ ఖండంలో మైనపువొత్తి దీపం శరీరానికి దాకి చురుక్కుమనగా కళ్ళు తెరుస్తాడు కావ్య నాయకుడు. దీనిలో నటరాజును, సంగీతాన్ని, కవిత్వాన్ని బహుధా వర్ణించి చివరలో "ప్రతి పురుషుడు బ్రహ్మయె, ప్రతి సతియు సరస్వతియె" నాటికి నేటికీ ఇదే వాస్తవము ఈ ధరలో అని చెప్పే సందేశం ఉంది.

బండిదీపం :

మానవావసరాలు దీర్చే బండిదీపం ఖండంలో ఒక గుర్రపు బండిలో కొంతమంది ప్రయాణీకులు ఎక్కి మాట్లాడుకున్న విధము, దారిలో ఎదురైన వింత అనుభవాలను, చీకటిమాటున జరిగే కల్తీల గురించి ఉగ్గడిస్తూ "బెల్లమున నల్లమన్ను, కాఫీ పొడుమున చింతగింజల ధూళిని చేర్చి తూచు, ఈవిధమ్మున దనకు దానే విషమ్ము నంజుకొని గింజుకొనును మానవుడు తల్లి" (పుట.27) అని వ్యాఖ్యానిస్తాడు.

హరికేనులైటు :

ఈ ఖండంలో ఒక రైతు ఇంటిలో ఉన్న హరికేను లైట్లను గురించి వర్ణిస్తాడు. ఒక లైటు తన గోడును "ఎల్లరును నాతో సేవ చేయించుకొనుచు, కొంచెమైనను నన్ను గుర్తించరొర" (పుట.44) అని వాపోతుంది. రైతుపొలంలో కోయించి ఉంచిన కొబ్బరికాయల రాశిలో కొంత దొంగలు అపహరించారన్న వార్త తెలిసి పొలానికి వెళ్ళి వాపోతూ అక్కడే పొలంలో కాపలాగా నిద్రపోతాడు.

ఉల్క :

మానవుడిలోని క్రూరత్వానికి పతనమై నుగ్గు నుగ్గుయై రాలిపోయిన ఉల్కే సాక్షీభూతంగా పేర్కొన్న ఈ ఖండికలో "గౌతముడు బుద్ధుడయె, ఏసు క్రైస్తవయ్యె, అందరిని మించి గాంధి మహాత్ముడయ్యె, ఎవ్వరేమైనగాని, ఈ ఇలను నరుని రక్తదహమ్ము నార్పలేరైరి తల్లి" (పుట.57) అని వాపోతాడు కవి.

కొబ్బరితుంట :

ప్రకృతి జీవితంతో మమేకమై ప్రకృతి ప్రసాదించిన నైర్మల్యాన్ని పొదవుకున్న కష్టజీవులను వారిలోని కారుణ్యాన్ని చూపే ఖండిక ఇది. పెంటకుప్పల మధ్య యిరుకు సందుల్లో నివసిస్తున్న శ్రమైక జీవులు తేళ్ళు, పాములతో సహజీవనం చేస్తున్నారని చెబుతూ వారి బ్రతుకులను బాగుచేయాలనే తలంపుతో కొబ్బరితుంట "మొఱుపువలె నీ తలంపెద నొరసిన తక్షణము, చెంతనొదిగిన కొంపన్ కరమంది పుచ్చుకొని, భీకర రూపము దాల్చి పేతగాల్చితినంతన్" (పుట.73) ఆ విధంగా వినూత్న సృష్టికి పూనుకొంది కొబ్బరితుంట.

గుడిదీపము :

ఈ ఖండికలో గుడిదీపం వెలుగులో ఆలయ శిల్పకళా వైభవన్ని చూసి ఆశ్చర్యం చెందే స్త్రీలు కొందరైతే తమ స్వార్థపరమైన కోరికలు తీరాలని తపించేవారిగురించి, సినిమా నిర్మాతలు, నాయికా నాయికలను గురించి మరికొందరిగురించి చెప్తాడు. "అతడు తీసినదొక పతివ్రత చరిత్ర, నాయికా పాత్రం వాడకంతకును వదినె" అని వ్యంగాస్త్రం వదిలాడు కవి.

కొలువి దయ్యం :

మంచికి దేవుడిని చెడుకు దయ్యాన్ని తలచుకునే జీవుల సహజ మనస్తత్వం కాకుండా దయ్యం ప్రేమ తత్వానికి తడసి ముద్దైనట్లు చూపిస్తాడు. "ఆనందాను

భవమ్మది, మానవునిదె ప్రేమదాని మహితావధి, యంలానముగా ప్రేమాదానం దానుభవమ్మొందు టొకటి దైవత్వమిలన్'' (పుట.90) అంటూ దయ్యాలను సైతం కరిగించగల ప్రేమతత్వం విప్పి చెబుతాడు.

వీధిలాంతరు :

మంచి చెడులకు-ఆశానిరాశలకు మధ్య ఊగిసలాడే జీవి మానవుడు. ఈ ఆరాట పోరాటాలకు సజీవ సాక్ష్యం ఈ రాత్రి వీధిలాంతరు. ఒక ఎంగిలి విస్తారాకులో మిగిలిన ఆహారం ఒక పంది, ఒక మనిషి, ఒక గోవు ఆప్యాయంగా స్వీకరిస్తుండగా వారిపైకి ఒక కుక్క దూకింది. దాన్ని తరిమి నిలబడ్డాడు ఆ మనిషి. అప్పుడు ''ఆత్మమ్మునకు మరి యనాత్మమ్మునకు, భేదమరయ జాలినట్టి నరుడు, తల్లి! కుక్కతోడి పొట్టకూటికి పోరాడు, స్థితిని జూచి నేను సిగ్గుపడితి'' (పుట.99) అంటాడు. ఆకలి యొక్క భయంకర విశ్వరూపాన్ని మనకు దృశ్యమానం చేస్తాడు.

విద్యుద్దీపము :

ఈ ఖండికలో దేశానికి ఎలాంటి మంత్రులు ఉండాలి అనే విషయం చెబుతూ వారు విద్యుల్లతలలా ప్రగతి కోసమే దోహదం చేయాలని సందేశం ఇస్తాడు. ''కూలి పేటలకు వీడ్కోలిచ్చి, క్రొత్తగా గ్రామమ్ములను పెంచి.. తీవ్రయోచన నిక కొన్ని తిరుగుచుండ, మంత్రి పనిచేయుచున్నాడు మౌనివోలె'' (పుట.107) అని ఆశాభావం వ్యక్తంచేస్తాడు.

సెజ్జ దివ్వె :

ఈ ఖండికలో కవి తన ప్రణయ స్వేచ్ఛను చాటి చెప్పాడు. ''ప్రేమము దివ్య మయ్యది లభించిన జీవులు ధన్యులైనన్'' (పుట.119) అని చాటుతాడు. ఎప్పుడూ ప్రేమతో ఉన్న హృదయమే ప్రేమను పలువురికి పంచ గలుగుతుంది. ప్రేమ పంచిన చోట సమసమతా భావం వెల్లివిరిస్తుందని ఆశిస్తాడు కవి.

మిణుగురు :

ఈ ఖండికలో స్వచ్ఛమైన ప్రకృతి సౌందర్యాన్ని, ప్రేమను వివరిస్తుంది. ''మల్లెమొగడలతో తలంబ్రాలు పోసి, తల్లి వనలక్ష్మి ప్రణయోత్సవము జేసె, ప్రకృతి రెండర్థములు పరస్పరము జేరి, పూర్ణతను గోరుకొని కేలుమోడ్చి నిలువ'' (పుట.135) అని స్వచ్ఛమైన ప్రకృతిసౌందర్యాన్ని వర్ణిస్తాడు.

కలకలం :

ఈ ఖండికలో దీపాలలో చెలరేగిన కలకలాన్ని వర్ణిస్తాడు. ''బండి కావచ్చు, యోడ కావచ్చు, నేన ఆగిపొమ్మన్న, టక్కున నాగిపోవు, నా మాహాత్యమ్ము వర్ణింతునా! యటంచు యెర్రదీవంబొకడు గొంతెత్తెనపుడు'' (పుట.139) అంటాడు ఇలా అన్నీ దీపాలు తమ ఆధిక్యాన్ని వెలువరిస్తూ కలకలం సృష్టిస్తాయి.

ప్రమిదె దీపం :

సమస్త ప్రపంచాన్ని ప్రేమమయం చేయగల కవి దర్శనాన్ని బహిర్గతం చేసింది ఈ ప్రమిదె దీపం ఖండిక. ''కష్టము కాదు సుఖము కాదు బ్రతుకు, అదొక ధర్మము, దాని జయప్రదముగ నిర్వహించుటకవకాశము నివ్వ వలయు, ఉద్ధతమ్మగునపుడు సర్వోదయమ్ము'' (పుట.167) అంటాడు కవి. ఇలా 17 ఖండికలుగా, సుమారు 590 పైచిలుకు పద్యాలతో సాగిన ఈ కావ్యంలో కొన్ని విశేషాలను చూద్దాం.

ఛందస్సు :

ఈ కావ్యం మొత్తం చంపక, ఉత్పల మాలలు, కంద, సీస, తేటగీతులలో నిండి ఉన్నప్పటికి కవి స్వతంత్రించి కొన్ని నూతన ఛందస్సులను ప్రవేశపెట్టాడు. పరిషత్తు ఖండికలో 12 పంక్తులతో నొకటి (పుట.15), కొబ్బరి తుంట ఖండికలో నొక ఆరు పంక్తులు ముత్యాల సరాల మాదిరి మాత్రా ఛందస్సుతో ఉన్నవి. అలాగే సెజ్జదివ్వెలో (పుట.121) 12చరణాలు, 123, 124 పుటలలో 4 మరియూ 12 చరణములు ఇలాంటి నూతనమైన ఛందస్సులు ఉన్నాయి. అప్పకవి తప్పుగా భావించిన ఋు-

ర యతిని వాడడం ఉంది. అఖండ యతులు కొన్ని ధారాళముగా వాడినప్పటికి పూర్వం కొంత మంది కవులు అలాంటివి వాడి ఉండడం వల్ల ప్రత్యేకంగా పేర్కొన వలసిన అవసరంలేదు. కావ్యం చివరలో ఈ ఛందస్సుల నిబంధనలు ఇచ్చి ఉంటే భావిరచయితలు నూతన ఛందస్సులను అనుసరించడానికి వీలుగా ఉండేది.

భాషా ప్రయోగాలు :

ఇది ఆధునిక కావ్యం కావడంవల్ల దీనిలో భాషా ప్రయోగాలు అనేకం.

అన్యదేశ పదాలు :

అన్యదేశ పదాలను, ఆంగ్లపదాలను వాడారు. లాంతరు, ప్లీడరు, కాఫీ, పచ్చనోట్లు, సిగరెట్టు, ప్రోగ్రాము, రూలు, బాక్సాఫీసు, రౌడీ, బనియను, బైసికిలు వంటి పదాలను వాడారు. వీటిలో చాలాభాగము నిఘంటువుల కెక్కినవే!

మాండలికాలు :

ప్రయుక్తమైన మాండలికాలు - స్థానికమైన పదములు పరిశీలిస్తే చిల్లీలు (గుండ్రముగా తిరుగు), తుల్లముగ (ఎక్కువగా), కట్టవలు (చెట్ల వరునలు), పుచ్చె (కొబ్బరిపిందె), తుంట (ఆకులతో కట్టిన కాగడా) వంటివి ఎన్నో మనకు కనిపిస్తాయి

వ్యవహారిక ప్రయోగాలు :

అగుపించగుపించని, పోదామని, పాడినాను, సేవించినాను వంటి వ్యవహారికాలను చూడవచ్చు

కావ్య పరమార్థం :

భక్తి చాటున దోపిడీ, ద్వేషం, అవినీతి, లంచగొండి తనంతో మలినపడిన జీవితాల మనుగడ ఎలా సాగి పోతున్నదో గుడిదీపం చూపిస్తే, వీధి లాంతరు వెలుగు పగలంతా కంకర తట్టలు, మట్టి తట్టలుమోసి, రాత్రి ఆత్మ వికాసానికి చదువుకొనే దీపం ఇంట లేక గుడిసెల నుండి పుస్తకాలతో వీధిలోకి చేరే పిల్లలను చూపుతుంది. ప్రకృతి సిద్ధములైన ధర్మముల తోడ, సంఘధర్మాలకేనాడు సంధి లేకపోవటాన్ని గురించిన గ్రహింపు విద్యుద్దీపానిది. వీటన్నిటికీ పరిష్కారం సర్వోదయ సమాజ నిర్మాణంలోనే ఉన్నదని చెప్పటమే దీపసభ కావ్య పరమార్థమని చెప్పవచ్చు.

ముగింపు :

ఈ కావ్యంలో ప్రధానంగా సమతా దృక్పథం ఉంది. దానిలోని అంశాలైన అవినీతిపట్ల నిరనన, అమానుషత్వంపై విముఖత, దారిద్ర్య నిర్మూలనాపేక్ష, కారుణ్యం, కృషీవల ప్రశంస, స్వేచ్ఛాతపన, ఆదర్శ నాయకత్వ వివరణ, ప్రేమ తత్వం, స్త్రీ-పురుష సమానత్వం వంటి అనేక అంశాలను చూడవచ్చు.

కావ్యానికి ముదుమాట వ్రాసిన నిడదవోలు వెంకటరావుగారు "పూర్ణవికాసం కోసం, సంపూర్ణ సాఫల్యం కోసం అజరామరత్వాన్ని కోరి చీకటిపై వెలుగు, చావుపై బ్రతుకు జరుపుతున్న నిరంతర సమర యాత్రే ప్రగతి. ఈ జైత్రయాత్ర పురోగతిలో ప్రతి అడుగూ నవనవోన్మేష సౌందర్య విలసితమే! ప్రతి విజయమూ నవజీవన సమావిర్భవ పులకితమే!" అని కావ్య సారాన్ని ఒక్క మాటలో చెప్పారు.

"దీపానికి వివక్ష లేదు. వాడే మానవుడికి తప్ప. వెలుగుకు వివక్ష లేదు. ఉపయోగించే మనిషికితప్ప. మనిషి మేధై వెలుగైతే వివక్ష దూరమై సమత వెల్లి విరిస్తుంది. ఆ కాంతిపుంజాల కాంక్షే దీప సభ" అన్న ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గారి మాట అక్షర సత్యమని తోస్తుంది.

విశ్వశ్రేయస్సు నాకాంక్షించి చేసే విధినిర్వహణలో కవీ, దీపం రెండూ ఒకేవిధమైన ఆదర్శంతో ఉన్నవే. రెండూ అంధకారాన్ని పారద్రోలాలనే కృషి సల్పుతాయి. కానీ లోకంలో అటు దీపానికి ఇటు కవికీ రెండింటికి గుర్తింపు లేదు. అయినప్పటికి వారిరువురూ నిరంతరంగా అవిచ్ఛిన్నంగా తమ దండయాత్ర జరుపుతూనే ఉన్నారు. లోకానికి దారి చూపుతూనే ఉన్నారు. జ్ఞానభిక్షను పంచుతూనే ఉన్నారు. కవి భీమన్నే ఒక దీపంగా మారి దారిదీపం చూపే దివ్య తాత్విక ప్రబంధం ఈ దీపసభ.

భీమన్న 'త్రిపద'లు – హేతువాద గుళికలు

– డా॥. పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

భాష మానవజాతిని ఏకం చేస్తే సాహిత్యం మానవజాతి మననులను రంజింపజేసింది. ఆలోచింపచేసింది. చైతన్యవంతం చేసింది. ఏ భాషాసాహిత్యమైనా ఆ జాతి సమకాలీన సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. తెలుగు ప్రాచీన సాహిత్యం సమాజ సమస్యలకంటే పురాణాలకు, ఇతిహాసాలకు ప్రాధాన్యమిచ్చింది. ప్రాచీన సాహిత్యం పరిధి చాలా చిన్నది. ఆధునిక సాహిత్యం విశ్వమంత విశాలంగా తన పరిధిని విస్తరింపజేసింది. ఏదో ఒక వర్గానికి మాత్రం పరిమితమైన ప్రాచీన సాహిత్యం కుల, మత, వర్ణ, వర్గ, వివక్షత లేకుండా ఆధునిక సాహిత్యం సాగింది. ఆధునిక సాహిత్యం వాస్తవిక సాహిత్యప్రయోజనాల్ని చేకూర్చాయి. ప్రజల సమస్యల్ని సమాజమంతా తెలిసేలా ఆవిష్కరించాయి. ప్రాచీన సాహిత్యం ప్రక్రియలు పరిమితమైనది. ఆధునిక సాహిత్యం ప్రక్రియా బాహుళ్యం కలది. ఆధునిక సాహిత్యం సమాజంలోని ప్రతి సమస్యను గుర్తించి విశ్లేషించింది. ధనికవర్గానికో, పాలితవర్గానికో పరిమితమై ఆకాశంలో విహరిస్తున్న సాహిత్యాన్ని అణగారిన జీవితాలను ఆవిష్కరించడానికి ఆధునిక సాహిత్యం నేలపై పయనించింది. కందుకూరి వీరేశలింగం సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించి సంఘసంస్కరణలకు పూనుకున్నాడు. గురజాడ అప్పారావు తన భాషాసంస్కరణతో సమాజంలో ప్రతి వర్గంలోని లొసుగులను బయటకు తీసాడు. ముఖ్యంగా బాల్యవివాహాలు, కన్యాశుల్కం మునుగుల్లో స్త్రీలు అనుభవిస్తున్న దుర్భరమైన జీవితాలను ఆవిష్కరించి స్త్రీ జాతిని చైతన్యవంతం చేయడానికి ప్రయత్నించాడు. అలాగే వర్ణప్రధాన సమాజమైన మన భారతసమాజంలో పంచమజాతి అనుభవిస్తున్న హేయమైన జీవితాలను ఆవిష్కరించడానికి ఎందరో కవులు పుట్టుకొచ్చారు. దళితుల గురించి మొట్టమొదటి సారిగా శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించినా దళితుల బాగోగులను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. దళితజాతి సమస్యలను దళిత జాతే పరిష్కరిస్తుందని దళితకవులు ముందుకొచ్చారు. అలాంటి దళితకవుల శ్రేష్ఠులలో బోయి భీమన్న ఒకరు. బోయి భీమన్న తన కవితాఖడ్గంతో దళితసమస్యల్ని ఖండించ ప్రయత్నించాడు. భీమన్నగారి పాలేరు నాటకం దళిత సమస్యల చిత్రీకరణకు, దళిత అభ్యుదయానికి ఒక కరదీపిక. బోయి భీమన్న దళిత సమస్యలనే కాకుండా నమాజంలోని రుగ్మతలను, మానవజీవితంలో సంభవించు నిత్యసత్యాలను ఆవిష్కరించడానికి 'త్రిపద' అనే నూతన ప్రక్రియకు నాంది పలికాడు.

తెలుగు సాహిత్యంలో ద్విపద ప్రక్రియ సుపరిచితమే. కానీ ద్విపద ప్రక్రియవలె త్రిపదలను సృష్టించిన ఘనత భీమన్నది. కన్నడ సాహిత్యంలో త్రిపదలున్నట్లు పెద్దలభిప్రాయం. వాటికి వీటికి ఎలాంటి సంబంధం లేదు. చిన్నిచిన్ని పాదాలతో స్పష్టమైన భావాలతో పాఠకుల హృదయంలో మెరుపులాంటి ఆనందాన్ని కల్గిస్తుంది. మేథస్సుకు పదునుపెడుతుంది ఈ త్రిపదలు. నేటి అత్యాధునిక కవిత్వంలోని హైకూలు వలె, మినీ కవితలవలె భీమన్న త్రిపదలు భాసిస్తాయి. ఈ త్రిపదులలో భీమన్న తన అనుభవాలతో సమాజాన్ని ఎలా ఆవిష్కరించాడో చూడవచ్చు. ఇందులో ప్రతీది హేతువాదబద్ధమైంది. ప్రతిదీ నిత్యసత్యమైంది. అన్ని కాలాలకు వర్తించే అంశాలు ఈ త్రిపదుల్లో చూడవచ్చు. సమాజంలో తనకెదురైన, తాను అనుభవించిన, తాను తెలుసుకున్న నిత్యసత్యాలను త్రిపదుల్లో ఎలా ఆవిష్కరించాడో పరిశీలించడం నా పత్రోద్దేశం.

భారతదేశం వేదభూమి, కర్మభూమి. అలాంటి దేశంలో వర్ణవ్యవస్థ మానవజాతిని విభజించింది. అది

మానవజాతి అభివృద్ధికి మొదటి ఆటంకం. తర్వాత కాలానికి పంచమకులాన్ని సృష్టించారు. దేశానికి తమ శ్రమతో రక్తం ధారపోసి దళితులు అణగారిన వర్గంగా జీవించడం జరిగింది. సమాజంలో అనేక అవమానాలకు గురికావాల్సి వచ్చింది. దేశానికి తిండిపెడుతున్నా ఆకలిమంటలతో అల్లాడవలసివచ్చింది. దేశప్రజలకు చెప్పులా తోడ్పడినా చెప్పులు లేని నడకతో జీవించింది పంచమకులం. మనుషులతో మనిషిగా జీవించలేని స్థితి. మనశ్శాంతికి దైవదర్శనానికి నోచుకోని అభాగ్యులు. ఇలా సమాజంలో అన్నివిధాలుగా దుర్భరజీవితాల్ని అనుభవించాల్సి వచ్చింది. దళితులు, పంచమకులం, అణగారిన వర్గమని చులకనకు గురై అజ్ఞానంలో జీవించారు. అలాంటి పంచమకులంలో పుట్టి, పంచమజాతి ఉద్ధరణకు కలమెత్తిన, గళమెత్తిన కవిసైనికుడు. భారత దేశంలోని ప్రజలంతా అన్నదమ్ములవలె జీవించాలని, సమైక్యత భారతదేశమని, లౌకికరాజ్యమని చెప్పుకోవడమే గానీ ఆచరణలో వివక్షత ఎప్పటికీ ఉన్నదని అధిక వర్గం అణగారినవర్గాన్ని వేరుగానే చూస్తుందని తన అనుభవాలను క్రిందివిధంగా కవిత్వీకరించాడు.

"అందరి శరీరాలు దేవాలయాలే అయితే
అందరి ఆత్మలు పరంజ్యోతులే అయితే
ఫలాని వ్యక్తినే ప్రేమించానంటాడేం మనిషి?"
"చూడగా చూడగా నాకనిపిస్తున్నదీ -
శరీరమే సత్యం, తక్కినదంతా అసత్యమని!
అందుకే నీవూ, నేనూ ఒక్కరం కాదని"
"ప్రేమించాను, ప్రేమించబడ్డాను
ఆనందబ్రహ్మలో ఐక్యం కూడా అయ్యాను
అయినా ఎందుకో శరీరం కోసం ఈ తపన!"

బోయిభీమన్న ప్రబోధించిన నిత్యసత్యాల్లో ఒకటి మానవుడు ఇంతవరకు తాను పొందాల్సిన ఆనందం, చేరాల్సిన లక్ష్యం ఇంకా చేరలేదనేది. మానవుడు ఆటవిక జీవితం నుంచి నాగరికత జీవితానికి ఎదిగినా ఆనంద దాయకమైన, శాంతియుత జీవితాన్ని పొందలేదని భీమన్న పేర్కొన్నాడు. సకలసృష్టిలో మానవుడు ఒక అద్భుతమైన జీవి. ఆలోచనాశక్తి కల్గిన విచక్షణాజీవి. కానీ ఇప్పటికీ మానవుడు విచక్షణ కోల్పోయి తాను పొందాల్సిన ఆనందాన్ని, తాను సాధించాల్సిన లక్ష్యాన్ని ఇప్పటికీ పొందలేదని, చేరుకోలేదని ఇంకా మానవుని మేథస్సు శాంతియుత, అహింసామార్గంలో నడిచి సమైక్యతవైపు, సమసమాజం వైపు నడవాలని ఆశిస్తున్నాడు.

"సౌందర్యం నగ్నం, దాన్ని చూడలేడు మనిషి!
సత్యం నగ్నం దాన్ని ధరించలేడు మనిషి!
పరబ్రహ్మం నగ్నం దాన్ని పొందలేడు మనిషి!"
"ప్రవక్తలు పుట్టనీ భగవంతుడవతరించనీ,
సత్యం సత్యమే లోకంలో -
స్వార్థం ముందు పరమార్థం వెనక మనిషికి!"

మానవజీవితం సమస్తం స్వార్థపూరితమని, స్వార్థం కోసం సత్యాన్ని దాచగలరని, స్వార్థమే పరమార్థమని నేటి సమాజం ప్రవర్తిస్తున్నదని, ఈ స్వార్థంవల్ల బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధికి, ఆనందానికి నోచుకోలేదని, స్వార్థమే సకల సమస్యలకు కారణమని హేతువాద దృక్పథంతో తన అభిప్రాయాల్ని వెలిబుచ్చాడు. స్వార్థం కోసం శత్రువులు మిత్రులుగా, మిత్రులు శత్రువులుగా తయారవుతున్నారని క్రింది విధంగా కవిత్వీకరించాడు.

"శత్రువు శత్రువూ కాదు, మిత్రుడు మిత్రుడూ కాదు
ఎవ్వరికీ, ఎల్లప్పుడూ ప్రపంచంలో
ఎల్లప్పుడూ ఉండేది ఒక్కటే - అది స్వార్థం!"
"స్వార్థం లేకుండా వ్యక్తి లేడు
వ్యక్తి లేకుండా సమాజం లేదు
సమాజం లేకుండా భగవంతుడే లేడు!"

మానవుడు తన ఆధిక్యత కోసం, తన స్వార్థపరతకోసం ఎదుటివారిని అణగత్రొక్కి అందలమెక్కుతాడు. తన స్వార్థంకోసం ఇతరులను పీడించడం, హింసించడం చేయడం మానవస్వభావం. పశువు ఆకలేస్తే గడ్డి తింటుంది. క్రూరమృగం ఆకలేస్తే మాంసం తింటుంది.

కానీ మానవుడు ఆకలేయకపోయినా అడ్డమైన గడ్డికోసం సమాజాన్ని మాంసముద్దలా మింగేసే స్వార్థపరుడని, ఆ స్వార్థంవల్లే సమాజంలో వర్గభేదాలు, వర్ణభేదాలు పుట్టుకొచ్చాయని వాపోయాడు. మానవుడు తాను స్వార్థ పరుడైనా ఎదుటివారిని నిందిస్తూ లౌక్యంగా ప్రవర్తిస్తున్నా డని, మానవుడు గోముఖ వ్యాఘ్రమని అభివర్ణించాడు.

"తనకు లేదని, ఎదుటివాడికున్నదనీ ఏడుస్తూ
పైకి అరుస్తాడు "అతినీతి" అంటూ లౌక్యుడు!
వ్యాఘ్రం కంటె గోముఖవ్యాఘ్రం ప్రమాదకం"

"గోవు గడ్డి తింటుంది, వ్యాఘ్రం మాంసం తింటుంది
ప్రతి జీవికీ ఒక విశిష్ట స్వభావం ఉంది
మనిషి ఒక్కడే గోముఖ వ్యాఘ్రం"

లోకంలో నీతివర్తనులు నేతిబీరకాయ వలె ప్రవర్తిస్తున్నారని, సమాజంలో నీతి శూన్యమని ప్రబోధిం చాడు. నీతి రత్నాలకంటే గొప్పదని పలికే మానవుడు రత్నాలకిచ్చే విలువ నీతికివ్వడం లేదు. నీతికి విలువిచ్చే మానవుడే నిజమైన ధనవంతుడని భీమన్న అభిప్రాయ పడ్డాడు. రత్నాలు ఆకలి తీర్చవని, నీతిమార్గం పాటిస్తే ఆకలికేకలు ఉండవని భీమన్న భావన. ఈ విషయాన్ని భీమన్న ఈ క్రింది త్రిపదలలో సూత్రీకరించాడు.

"తిండి కొనగలవు రత్నాలు
తినడానికి మాత్రం పనికిరావవి!
అలాంటివే నీతులు, లోకంలో!"

"రత్నాలకంటే నీతులు ప్రాచీనం
రత్నాలకంటే నీతులు సురక్షితం
రత్నవర్తకుల కంటే నీతివర్తకులే ధనికులు!"

మానవుడు ఎంత బుద్ధిమంతుడైనా అంతే అజ్ఞాని, ఎంత పరాక్రమవంతుడైనా అంతటి భయస్థుడు. మానవుడు నిరంతరం ప్రతి విషయానికి భయపడుతూ జీవిస్తాడు. భయం మరణంతో సమానం. ధైర్యం జీవించడంతో సమానం. భయపడుతూ బ్రతకడం కన్నా మరణం మేలని, మరణానికి మించిన నష్టం మనిషికి మరొకటి లేదని, మనిషి జీవితంలో దేనికీ భయపడాల్సిన అవసరంలేదని ప్రబోధించాడు.

"మృత్యువును మించి జరిగే హాని లేదు
మృత్యువుకు జడిసి లాభమూ లేదు జీవికి!
ఇంకెందుకో మరొకరికి భయపడటం!"

"ఒక రథం పోతే మరొక రథం విజయప్రతుడికి
సంసారసాగరంలో కూడా అంతే!
శరీరం సాధనమే, ఫలితార్థం కాదు!"

"తన మాటను తానే నమ్మని జీవి -
తన పని తనకే నచ్చని జీవి -
తన వ్యూహకు తానే బెదిరే జీవి - మనిషి!"

మానవసేవే మాధవసేవ. మానవుడే మాధవుడని పెద్దలు సెలవిచ్చారు. అంటే దానర్థం మాధవుడు మానవ రూపంలోనే ఉంటాడని, మానవుని గౌరవిస్తే మాధవుని ఆరాధించినట్లేనని ఈ మాటలకు తాత్పర్యాలు. మనిషిని మనిషిగా చూడని తత్వం మంచిదికాదని, భగవత్ప్రార్థన కంటే మానవుని అభిమానించడం గొప్పదని భీమన్న వాదం. భక్తిమానవుని అహంకారవ్యాధికి ఔషధమని భీమన్న వేదం. భగవంతుడు తనకు మానవుడి నుండి కోరుకునేది ఆరాధన కాదని, సహ మానవులపట్ల ప్రేమాభి మానాలు చూపించడం భగవంతుని పట్ల చూపే నిజమైన కర్తవ్యమని భీమన్న అభిప్రాయం. ప్రజలంతా వివక్ష లేకుండా అన్నదమ్ములవలె జీవించాలన్నది భగవంతుని అభిప్రాయమని భీమన్న తన త్రిపదలో కవిత్వీకరించారు.

"భగవత్ప్రార్థన అవసరమే మనిషికి
అయితే అది భగవంతుడి బాగుకోసమా?
తన అహంకార వ్యాధికే ఔషధం అది!"

"భగవంతుడు కోరేది వట్టి భజన కాదు
తానిచ్చిన పనిని చక్కగా నిర్వహించడం
తండ్రి కోరేది బిడ్డల ప్రయోజకత్వం మాత్రం!"

ఆధునికయుగం శాస్త్రసాంకేతిక యుగం. కాలం వేగంగా తిరుగుతున్నది. మనిషి కాలంతో పాటు

తిరుగుతూ కాలాన్ని జయించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలో మనిషికి విశ్రాంతి దొరకడం లేదు. విశ్రాంతి లేని మనిషికి సుఖం మాయమయ్యింది. సుఖం లేక మనిషికి చివరికి దుఃఖమే మిగిలిందని భీమన్న వాపోయాడు. పూర్వకాలంలో మనిషి ప్రశాంతంగా తినేవాడు. నేటికాలంలో మనిషి నిలబడితింటున్నాడని, రాబోయే రాకెట్‌కాలంలో పరిగెడుతూ తింటాడేమోనని తన త్రిపదుల్లో చమత్కరించాడు.

"కూర్చుని తినేవాడు పూర్వం మనిషి
నిలబడి తింటున్నాడీ మెషీనుకాలంలో
పరిగెడుతూ తింటాడిక రాకెట్ యుగంలో!"

"మనిషి వేగం పెరిగి విశ్రాంతి తరిగింది
విశ్రాంతి తరిగి సుఖం విరిగింది
సుఖం విరిగి దుఃఖం వెల్లివిరిసింది!"

ఇలా బోయి భీమన్న తన త్రిపదలలో నిత్యసత్యాలను హేతువాద దృక్పథంతో కవిత్వీకరించాడు. నిజాన్ని నిర్భయంగా చెప్పేవాళ్ళను సమాజంలోని రాక్షస స్వభావం గల వాళ్ళు బాధిస్తారని, అణచివేస్తారని హెచ్చరించాడు. స్వార్థపరుడైన మానవుడు అల్పుడై ఆనందంకోసం వెంపర్లాడుతాడు. నీతిశతకాలు ఎన్ని నీతులు ప్రబోధించినా మానవుడు ఆచరణలో పెట్టడని, తన స్వార్థం కోసమే పాటుపడతాడని భావించాడు. మానవుడు స్వార్థాన్ని విడిచి నిస్వార్థంగా జీవిస్తే మహా పురుషుడౌతాడని భీమన్నగారి అభిప్రాయం. జీవితం అందమైన పుస్తకమని, ఆ పుస్తకంలో ఉన్న తప్పుల్ని దిద్దుకుంటే జీవితం పరమానందభరితమని, మంచిని పెంచమని, మంచిని పంచమని, తాను ఆనందిస్తూ, ఇతరులు ఆనందంగా ఉండేటట్లు చూడటంలో మానవ జీవిత పరమార్థం దాగివుందని భీమన్న గారి జీవితానుభవం.

"జీవితం ఒక అకౌంటు పుస్తకం
ఒకటి రెండు తప్పుల్ని దిద్దుకోవచ్చు అందులోనే,
అన్నీ తప్పులే అయితే పుస్తకాన్నే మార్చకతప్పదు!"

"పది గ్రంథాలను ఒక్కసారి చదివే కంటే
ఒక్క మంచి గ్రంథాన్ని పదిసార్లు చదువు!
ఒక్క జీవమంత్రాన్ని వందసార్లు పఠించు!"

పరిశీలనా గ్రంథాలు :

1. త్రిపదలు - భీమన్న బోయి
2. తెలుగు సాహిత్యచరిత్ర - శాస్త్రి. ద్వా.నా
3. గబ్బిలము - జాషువా గుర్రం
4. పాలేరు నాటకం - భీమన్న బోయి

బోయిభీమన్న రచన 'ధర్మం కోసం పోరాటం' దళిత చైతన్యం

– కె. అనిల్ బాబు, తెలుగు అధ్యాపకులు, పి.బి.సిద్ధార్థ కళాశాల (స్వ.ప్ర), విజయవాడ.

తెలుగు సుసంపన్నమైన మౌఖిక, లిఖితసాహిత్య సంప్రదాయం ఉంది." హితేన సహితం సాహిత్యం "అంటే మేలును చేకూర్చేది సాహిత్యం అని అర్థం.ఇటువంటి తెలుగుసాహిత్యంలోని ఉవ్వెత్తున ఎగసిపడే సాహిత్య ప్రక్రియలైన 'అభ్యుదయ, భావ, విప్లవ, దిగంబర, దళితవాదం వంటివి ఎన్నో చోటుచేసుకున్నాయి. ఆధునిక తెలుగుసాహిత్యంలో 'స్వతంత్ర విప్లవతార'గా అనునిత్యం ప్రకాశించిన విశిష్టమైన కవి 'బోయి భీమన్న' వ్రాసిన గ్రంథం నుండి ఈ అంతర్జాలఅంతర్జాతీయసదస్సులో భాగంగా 'ధర్మం కోసం పోరాటం - ఒక పరిశీలన' అనే అంశంపై నేను పత్రసమర్పణ చేస్తున్నాను.

దళిత ప్రణాళిక

దళితుల సంక్షేమం, దళితుల ఐక్యత దళితుల హక్కులకోసం మరియు కుల నిర్మూలన గురించి ఈనాటి సమాజంలో జరుగుతున్న సర్వత్రా చర్చలు వంటి అంశాలు ఎన్నో పరిశీలించి విస్తృతంగా విశ్లేషించి చర్చిస్తూ నాలుగు దశాబ్దాల క్రితమే భీమన్న గారు తనరచనలో దళితవిముక్తి కోనంఅభ్యుదయానికి నిర్మాణాత్మకమైన దళిత ప్రణాళికను ప్రకటించారు.

దర్మం అంటే సర్వమానవ సమానత్వమే అంబ్కేర్ అభిలషించిన సమతా మార్గాన్ని సుగమం చేసుకోవటమే సాంఘిక ధర్మమని భీమన్న భావించాడు.కులవ్యవస్థ నిర్మూలన వర్గ కుల పోరాటాల తిరుతెన్నులు - సాంస్కృతిక చైతన్యం సంస్కరణ ఉద్యమాల వైఫల్యం వాటి స్థితిగతులను రచయిత ధర్మం కోసం పోరాటంలో సమీక్షించడమే కాకుండా దళిత విముక్తి సామాజిక విముక్తి ఒక పరిష్కార మార్గాన్ని సూచించాడు.

లక్షమంది కార్మికుల చెమట బొట్ల కంటే ఒక మార్క్స్ సిద్ధాంతం బలమైనది. లక్షమంది మార్క్స్‌ల సిద్ధాంతం కంటే ఒక్క మహాత్ముడి రాజనీతి బలమైనది.లక్షమంది మహాత్ముల కంటే ఒక్క అంబేద్కర్ మానవ సమతా ధర్మం బలమైనది.అపూర్వమైన బోయిభీమన్నగారి ఈ భావన మనల్ని చైతన్య పరుస్తుంది.

దళితుల వినాశనం

దళితుల వినాశనానికి హిందూమతం కంకణం కట్టుకున్నదని భీమన్న గారు ధర్మంకోసం పోరాటంలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగ కులవ్యవస్థయే కాకుండా అధర్మానికి, అన్యాయానికి, అనైక్యతకు, ఆత్మవంచనకు హిందూమతమే ప్రధానశత్రువు అని భీమన్న నిర్ధారించాడు.

వీరి రాజకీయ, ఆర్థిక ప్రాబల్యం కోసం రూపొందించుకున్న సాంఘికపథకమే హిందూమతం. వీరి వైఖరి భరించలేక చాలా మంది ప్రజలు ఇతరమతాల్లోకి వలసవెళ్ళిపోతున్నారని చెప్పడం జరిగింది. చాతుర్వర్ణ వ్యవస్థను ఆమోదించే గాంధీజీ గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించాడు. డాక్టర్ అంబేద్కర్ భయంకరుడు. చేతికేది దొరికితే దానితో ఈ హిందూకుక్కను కొట్టడానికి జంకడు. అన్న గాంధీజీ మాటల్ని గుర్తు చేస్తూ హైందవధర్మాన్ని వ్యతిరేకించాడు.

సామాజిక వ్యవస్థ అనేది వ్యవసాయక్షేత్రం వంటిది ఈ క్షేత్రంలో శాసనాలను విధినిషేధాలను నిర్మూలించుకుంటు, కలుపు తీసుకుంటూ, బూజు దులుపుకుంటూ దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. కానీ హిందూ సమాజంలో అలా జరగలేదని హిందూమత వైఫల్యాన్ని విశ్లేషించాడు. ఈ విధంగా ''దళితుల వినాశనానికి హిందూమతమే ప్రధానమైన కారణమని కుల సమస్య తీవ్రతను ఎత్తిచూపి దాని పరిష్కారావశ్యకతను నొక్కి చెప్పాడు.

దళిత విముక్తి

"దళిత విముక్తి కోసం సత్యవాదిలా కులవ్యవస్థ నేరాలను 'మాలమాదిగ సమస్య' అనాథప్రేతం వంటిదని దాన్ని చూసి భయపడిన వారే కాని దహన సంస్కారం చేసిన వారెవరూ లేరని రచయిత "ధర్మం కోసం పోరాటం" అనే గ్రంథంలో వివరించాడు. బ్రహ్మసమాజం, ఆర్య సమాజం బ్రాహ్మణుల్లో మార్పు తీసుకురావటం ద్వారా కుల సమస్యను పరిష్కరించవచ్చునని నిజానికి పునాది దగ్గర నుండి మార్పు ప్రారంభం కావాలని తెలియజేశాడు.

దళిత విముక్తి విషయంలో విప్లవ మహానాయకు లందరూ నేలవిడిచి సాము చేశారు. వీరంతా స్వదేశీయ తాత్వికభావజాల పరిధిలోనే నిబద్ధతతో ప్రదక్షిణలు చేశారు.

దళితాభ్యుదయ సాధనలో ప్రభుత్వానికి కూడా ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఖండించాడు.

"లక్ష ఎకరాలన్ని దోసెడు నీళ్ళతో సాగుచెయ్యడానికి జరుగుతున్న కృషి అంటువంటిదే" అని భీమన్న గారు ప్రభుత్వ కంటితుడుపు చర్యల్ని ఈ గ్రంథంలో తెలియ చేశారు.

దళితులు విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులు కావాలని భారతదేశంలో సోష్టలిస్టు సమా జాన్ని నిర్మించే శక్తి మాలమాదిగలకు మాత్రమే ఉందని ఆయన తెలిపాడు. దళితులే సాంఘిక విప్లవ నిర్మాతలని, దానిని సాధించటమే వారి తక్షణ కర్తవ్యం అని తన జాతిజనుల పట్ల అపారమైన నమ్మకాన్ని గ్రంథరచయిత ప్రదర్శించాడు.

కమిటీలు, కమీషన్లు, సెమినార్లు, చర్చలు, పథకాలు, నిధుల కేటాయింపులు, గ్రాంట్లు, ఖర్చుల మంజూర్లు,రుణాలు మొదలగు చర్యలన్ని అవినీతి అగాధంలో పడిపోతున్నాయి తప్ప అణగారిన ప్రజాజీవన ప్రమాణాలను పెంచటం లేదని రచయిత ఎంతో అవేదన చెందారు.

దళితుల మధ్య ఉండాల్సిన సమైక్యత

ధర్మం కోసం పోరాటం అనే బోయిభీమన్నగారి గ్రంథంలో 'మాలమాదిగల ఐక్యత' అన్న అంశం సింహభాగంగా కనిపించే ప్రబోధం "మాలమాదిగ యువకులారా ఏకం కండి" అనే నినాదం రచయిత స్వయంగా ఈ గ్రంథానికి కేంద్రబిందువుగా ప్రకటించాడు. దళితులఐక్యత చారిత్రకంగా ఎంత అవసరమో నిరూపిస్తూ సాగే చర్చ గమనించదగినది. మాల,మాదిగ అనే రెండు పదాలకు బదులుగా 'మాలు' (మాల మాదిగలు)అనే ఏకపదాన్ని సృష్టించి సమైక్యధర్మాన్ని సమాజాన బలంగా చాటిచెప్పారు.

భీమన్నగారు స్వయంగా వివిధజిల్లాలో,అనేకగ్రామాల్లో పర్యటించి మాల-మాదిగ పల్లెలకు మధ్య ఉన్న అగాధాన్ని ప్రత్యక్షంగా చూసి, ఇరువర్గాల మధ్య భగ్గు మంటున్న అంతర్గత అంటరానితనం వారి హృదయాన్ని కాల్చివేసింది. "మాలమదిగలు ఏకం కావాలి అలా కాకుంటే ఏమంచి పని జరగదు" అంటూ దేశంలో ప్రజలక్షేమం గురించి స్పష్టత ఇస్తారు. దళితుల ఐక్యత అనేది చాలాఅవసరమని కొన్ని ప్రాంతాల్లో మాలలు, మరికొన్ని ప్రాంతాల్లో మాదిగలు ఎక్కువుగా ఉంటారని,ఏ ప్రాంతంలో ఎక్కువమెజార్టీ ఉంటే ఆ ప్రాంతకులస్థులు ఐక్యతవిషయంలో పట్టుదలతో, సహనంతో, త్యాగ బుద్ధితో, వ్యవహరించాలని భీమన్నగారు తెలిపారు.

శత్రువుతో నిజాంగా పోరాడాలనుకునే వాడు కలిసి వచ్చే నిజమైన మిత్రులు కోసం వెతుకుతాడు అని అంబేద్కర్ చెప్పినట్లుగా "ఎవరి భాష వారిది, ఎవరి విశ్వాసం వారిది, ఎవరి ఆనందం వారిది అంటూ పరస్పర గౌరవ మర్యాధలతో కలసి బ్రతకటమే సమైక్యం" అంటూ ధర్మకోసం పోరాటం గ్రంథంలో కొత్త అర్థాన్ని వివరించిన భీమన్న గారి మాటల ప్రాధాన్యతను మనం తప్పకుండా గమనించాలి.

ముగింపు

ఆధునిక తెలుగుసాహిత్యంలో తనదైన ముద్రతో

కవిగా, నాటక కర్తగా, సంఘసంస్కరణ వాదిగా, మహోన్నత వ్యక్తిగా కనిపించే బోయి భీమన్న గారి ధర్మం కోసం పోరాటం అనే గ్రంథం ద్వారా దళిత ప్రణాళిక, దళితుల వినాశనం, దళిత విముక్తి, దళితుల మధ్య సమైక్యత మొదలగు అంశాలను నా పత్ర సమర్పణలో చర్చించటమైనది.

ఆధార గ్రంథాలు

1. ధర్మం కోసం పోరాటం - బోయిభీమన్న.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొ ॥ వి. సిమన్న.
3. అంబేద్కర్ సూర్యుడు - శివసాగర్.
4. బోయిభీమన్న సాహిత్యం -దళిత దృక్పథం/ప్రధాన సంపాదకులు - డా॥ అపుల మంజులత.

బోయి భీమన్న 'ఉగాదులు' కవిత్వం - సామాజికత

- భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

బోయి భీమన్న రాసిన రచనల్ని కూడా దాదాపు సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలపై ప్రతి స్పందించి రాసిన రచనలుగా చెప్పవచ్చు. భీమన్న మారుమూల పల్లెలో దళిత పాలేరు కుటుంబంలో జన్మించాడు. తన చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులు పేదరికం, అంటరానితనం, సాంఘిక దురాచారాలు వంటివి ప్రభావితం చేయడంతో సామాజిక చైతన్యం ప్రేరేపించేలా రచనలు చేశాడు. బోయి భీమన్న రచనలను గుర్తించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ లాంటి అనేక సన్మానాలను అందుకున్నాడు. అంబేద్కర్ రాసిన 'కులనిర్మూలన' పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం కూడా చేశారు.

బోయి భీమన్న కవిత్వంలో ప్రధానంగా మానవీయ దృక్పథాలు కన్పిస్తుంటాయి. వస్తువు ఏదైనా సామాజిక చైతన్యం, మానవత్వాన్ని ప్రేరేపించేలా రచనలు చేయడం జరిగింది. అయితే బోయి భీమన్న ఒక ప్రక్రియతోనే పరిమితం కాకుండా పద్యం, గద్యం, నాటకాలు, నాటికలు, గేయాలు వంటి అనేక ప్రక్రియలలోను రచనలు రాశారు.

బోయి భీమన్న రాసిన రచనల్లో 'భీమన్న ఉగాదులు' ఉగాది కవితల సంపుటిని ఈ సదస్సు పత్ర సమర్పణ కోసం తీసుకున్నాను. అయితే భీమన్న రాసిన ఉగాదులు కవిత సంపుటిలో కేవలం ఉగాది కవితలే కాకుండా సామాజికతకు సంబంధించిన కవితలు కూడా ఉన్నాయి. బంగ్లా యుద్ధ విజయం తరువాత కొన్ని సంవత్సరాల పాటు మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. భీమన్న గారి ముప్పై ఏళ్ళ స్వరాజ్య పాలనలో కూడా ధనికవర్గ దోపిడీ తగ్గకపోతే, పేదవర్గాలకు అభ్యుదయం కలగకపోతే, పరిస్థితిని అదుపు చెయ్యడానికి ఎమర్జెన్సీని విధించడం కంటే గత్యంతరం ఏముంది అని ఇటువంటి చారిత్రక సంఘటనలకు సంబంధించిన కవితలు సామాజిక కోణంలో ఈ కవిత సంపుటిలో రాయడం జరిగింది.

'బొమ్మల బజారు' ఖండికలో బోయి భీమన్న ఉగాది పండుగ వచ్చినప్పుడు పిల్లలతో షాపింగులకి వెళ్ళినపుడు పిల్లలను ఆకర్షించే బొమ్మలు కొనడానికి తగినంత డబ్బులు లేని పరిస్థితిని కవి ఇలా అంటాడు.

"చూచే కొలదీ చూడాలనిపిస్తున్న బొమ్మలు
ఉండే కొలదీ ఉండాలనిపిస్తున్న బజారు
ఒకదానిని మించి ఒకటి
ఆకర్షిస్తున్న షాపులు
తమ అర చేతులలో
మనకు చూపుతున్న స్వర్గాలు
అరచేతిలో పెట్టి
మోచేతి వరకూ నాకిస్తున్న అప్సరలు!" (పుట.8)

ఈ కవితలో ప్రధానంగా ఆర్థిక పరిస్థితిని కవి వివరించాడు. బజారులో అక్కడ ఉన్నటువంటి బొమ్మలు ఒకటికి మించి మరొకటి చూడాలనే కోరిక ఉంటుంది. అక్కడ షాపుల అలంకరణలను చూసి ఆకర్షించేలా ఉంటాయి. కాని కొనలేని స్థితి. ఆర్థిక పరిస్థితి దారిద్ర్యం, పేదరికంలో ప్రధాన సమస్యగా ఉంటుంది.

"వాకిట్లో వసంతలక్ష్మి" కవిత ఖండికలో కూడా పేదరికాన్ని గురించి చెప్పే కవిత అందులో -

"గతరాత్రి చచ్చిపోయింది పాత ఏడాది
దాని చితి నుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది
పాత కన్నీళ్ళు రాలిపోకపోతే
కొత్త వెలుగులకు చోటెక్కడిది!" (పుట.17)

- ఈ కవితలో కవి మనిషి జీవిత సారాన్ని చెప్పాడు. గతాన్ని మరిచి వర్తమానాన్ని స్వాగతం పలకాలి. లేకుంటే అంతర్గతంగా ఎన్నో బాధలతో బాధపడతారని చెప్పవచ్చు.

కొత్త వెలుగు కోసం కవి ఆహ్వానం పలుకుతున్నాడు. అలాగే పండుగ వచ్చినప్పుడు పరిస్థితిని ఇక్కడ ఇలా అంటాడు -

"మనకేమున్నదో, ఏం లేదో
పండుగ కేం తెలుస్తుంది?
పండుగకు కావలసింది గుండె!
అది మనకుంది. చెప్పు స్వాగతం!" (పుట.17)

నిజంగా ఈ కవితలో కవి పండుగలకు ఏం తెలుస్తుంది, తన కాలాన్ని బట్టి వస్తుంది ప్రతి సంవత్సరం. కాని ధనిక, పేద వర్గ భేదాలు ఉండవు. అయిన పండుగ కావాల్సింది కేవలం మంచి మనసున్న హృదయం అని, అది తమకి ఉందని పండుగని స్వాగతం చెబుతున్నాడు కవి. నిజంగా సమకాలీన సమాజంలో ఎంతో మంది తమ స్థాయిని బట్టి పండుగలు జరుపుకుంటారు. ఉన్నవాడు ఉన్నతంగా జరుపుకుంటాడు, లేనివాడు తన పరిస్థితిని బట్టి చేసుకోవడం జరుగుతుంది. అయితే ఉన్నతంగా చేయాలని ఏం లేదు. మంచి హృదయంతో స్వాగతం పలకాలని ఉగాది పండుగ నాటి పరిస్థితిని సామాజిక పరంగా ఆలోచించి రాసిన కవితగా చెప్పవచ్చు.

'దేశం ముందడుగు వెయ్యాలి' కవితా ఖండికలో సమాజంలో ప్రతి మనిషి తన బాధ్యత మరిచి పురోగతి చెందకుండా అన్యాయాన్ని, కులం, మతం అంటూ హింసాత్మకంగా మారిన తీరును ఈ కవితలో ఇలా అంటాడు -

"ఆగష్టు ప్రజా విప్లవం
దాస్య విమోచన మహా విప్లవం అయిన చోటికి
స్వాతంత్ర్య చండ భాస్కరుడు
మన సమదృష్టిని సంహరించిన చోటికి
స్మగ్లర్లు, హోర్డర్లు, కల్తీ విషపు పురుగులు
అధిక ధనాశాపరులు, కుల మతోన్మాదులు
పదవీ దురోదరులు ఇంకా పుట్టి పెరగని ఆనాడు
పవిత్ర భారత సమ సమాజ నిర్మాణోద్యమం
ఎక్కడ ఆగిపోయిందో అక్కడికి
వెనుతిరిగి కదలండి" (పుట.98)

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా కూడా మానవ పురోగతి చెందలేదని దేశం ఇంకా ముందడుగు కాక వెనుకడుగు వేయాలని కవి ఆవేదన చెందుతున్నాడు. నిజానికి ఎంతో పవిత్ర భారతావని గౌరవించే దేశంలో కులం, మతం, జాతి, రాజకీయం కోసం డబ్బుకి ఆశపడే ఆశాపరులు వంటి వారెందరి వల్ల దేశం అపవిత్రమైందని, పవిత్రమైన భారతదేశం కావాలంటే సమసమాజ నిర్మాణం ఎక్కడైతే ఆగిందో మళ్ళీ అక్కడే నవనిర్మాణానికి నాంది పలకాలని కవి ఒక భారతీయుడిగా ఆవేదన ప్రకటిస్తున్నారు. నిజానికి పదవి కోసం ఎంత హీనంగా రాజకీయ నాయకులు అన్యాయంగా రాజ్యాన్ని దోచుకోవడం, కులం, మతం కోసం మతోన్మాదులుగా హింసాత్మకమైన చర్యలు చేయడం, స్మగ్లర్లు, విషపురుగులు లాంటి వారెందరో మనిషి స్వేచ్ఛను భంగపరుస్తున్నారు. అటువంటి సమాజంలో ఇంకా దేశం ముందడుగు వెయ్యాలని కవి ఆశిస్తున్నాడు. నమ నమాజ నిర్మాణోద్యమం జరగాలని, అప్పుడే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కవి ఆకాంక్ష.

'సమర గీత' ఖండికలో శాంతియుత సమాజాన్ని కవి ఆశిస్తున్నాడు.

"నిరంతరం శాంతి జపం చేసే ఈ ఆర్ష సమాజం
అశాంతం అశాంతిలో మునుగుతున్న దెందుకు?
స్వార్థాలకు కళ్లాలు పెట్టలేక!
అర్థ కామాలకు అంకుశాలు పట్టలేక!
బిడ్డలు పసివాళ్ళూ, నిరాయుధులూ అయివుండి
దున్నలు ఉంచి చిమ్మూతూ పై బడుతున్నప్పుడు
తల్లి మహాలక్ష్మి అయినా
బరిసగొని బరి మీదకు రాక తప్పదు!" (పుట.58)

శాంతియుత సమాజాన్ని గురించి చెప్పిన కవి. ప్రతి మనిషి స్వార్థంతో నిండి అశాంతిలో మునుగుతున్నాడు. నిజానికి శాంతి కోరుకునే సమాజంలో అన్యాయాలు,

అత్యాచారాలు, కామంతో కూడిన మనుషులు ఎందు కున్నారని ప్రశ్నిస్తున్నాడు కవి. నీతులు, నినాదాలు, లక్ష్యాలు పాటిస్తే మనిషి మానవత్వంలో కలిగి ఉంటాడు. కాని ఆచరించే వారు లేరని కవి సమాజంలో మనుషుల ప్రవర్తనల తీరును వమర్శిస్తున్నాడు.

నిత్య అవసర సరుకులకు సంబంధించిన ధరలు పెరిగినప్పుడు మధ్యతరగతి జీవనాన్ని గడిపే మనిషి ఆర్థిక స్థితిని తెలియజేసి కవితలో ఇలా అంటున్నాడు -

"ఇది వట్టి సంత
సంత గోల తప్ప, సరసమైన దేదీ లేదిక్కడ!
కళా లేదు, కాంతీ లేదు;
పూర్వం ఎంతో వుండేది
అంతా అందరికీ దొరికేది
నా వాళ్లకే కాదు
నానా జాతులకూ అందేది!" (పుట.62)

'సంత' అంటే మార్కెట్ అని అర్థం. నిజానికి సంతలో తక్కువగా ధరలు ఉంటాయని ప్రజలు నిత్యవసర సరుకులు కొనడానికి వెళ్తారు. కాని ప్రపంచీకరణ ప్రభావం మూలంగా మనిషి జీవితం తలకిందులుగా మారిందని చెప్పవచ్చు. ఎందుకంటే ధరలు ఏమైనా కూడా అధికంగా ఉండడం జరుగుతుంది. పూర్వం సంత అంటే రూపాయలకి, పావలాలకి సరుకులు తీసుకునేవారు ఒక్క జాతి అంటూ కాకుండా అన్ని జాతులు సరసమైన ధరలలో తమకు కావాల్సిన సరుకులు తీసుకునేవాళ్ళు. కాని నేడు ధరలు అకాశాన్నంటుతున్నాయి. సంతలలో కళ లేదని, పూర్వం ఎంతో వైభవంగా ఉండేదని కవి ప్రపంచీకరణ ప్రభావం మూలంగా పెరిగిన ధరలను గూర్చి రాసిన కవిత.

మనిషి స్వార్థాన్ని తెలిపే కవిత "పిట్ట గూళ్ళు ఈ మెదళ్ళు' -

"నమ్మకు ప్రియా!
దేనినీ మూర్ఖంగా నమ్మెయ్యకు!
ఏ మనిషీ సర్వజ్ఞుడు కాదు!
ప్రతి మనిషికీ స్వార్థం ఉంది.
యౌవనంలో కామమే పరమార్థ మనుకొన్నవాడు
అది చచ్చిపోయిన చాలా కాలానికి చచ్చిపోతే
పునర్జన్మ ఎత్తది ఏది?" (పుట.69)

సమాజంలో ప్రతి మనిషికి స్వార్థం ఉంది. స్వార్థంతో తప్పులు చేస్తూ, చివరికి మంచివాడిగా నటించడం జరుగుతుంది. అధికార బలంతో ఆర్థిక బలంతో మనిషి మనిషిని హింసించే తత్వాన్ని నిరూపిస్తున్నాడు. యుక్త వయస్సులో కామంతో రగిలిపోతూ, నీచమైన పనులకు పాల్పడుతున్నాడు. చివరి దశకు చేరుకున్నప్పుడు మోక్షం కోసం తాపత్రయం పడుతుంటారు. కాబట్టి మనిషి స్వార్థానికి బలైపోతున్నాడని కవి అంటున్నాడు.

"అందరిదీ ఈ వసంతం" ఈ కవిత వసంతకాలం గురించి తెలియజేసే కవిత.

కత్తి, గొడ్డలి, బాణం, తుపాకీ
ఆటవికుని ఆహార సాధనాలు
మతం, మంత్రం, దోపిడీ, దౌర్జన్యం
నాగరికుడి భోగ సోపానాలు
వసంతం మాత్రం అందరిదీ,
ఎవరికీ దీనిపై ప్రత్యేక హక్కు లేదు. (పుట.82)

ప్రతి మనిషి జీవితంలో పండుగలు, వసంతాలు, సహజమైనవి. ఎవరికి వర్తించేవి కావు. అందరికి అనుభవించేవి. ఆటవికుని జీవనం కత్తి, గొడ్డలి, బాణం, తుపాకీ వీటిపై ఆధారపడి ఉంటుంది. అలాగే నాగరికుడు సమాజంలో మతం, దోపిడి, దౌర్జన్యం, మంత్రాలు వేస్తూ జీవిస్తుంటాడు. కానీ వసంతాలపై ఎవరికి హక్కు లేదు. ఎవరైనా వసంతాలను ఆస్వాదించవచ్చని కవి అభిప్రాయం. ఇటువంటి ప్రకృతితో ముడిపడిన వసంతాలను ప్రతి మనిషి నిస్వార్థంగా ఆనందించాలని కవి ఆశిస్తున్నాడు.

ఈ విధంగా బోయి భీమన్న తన 'ఉగాదులు' కవితల సంపుటిలో సామాజికతకు సంబంధించిన అంశాలను ప్రతిపాదించారు. ఈ 'ఉగాదులు' కవిత సంపుటిలో

ప్రకృతి ధర్మాలనే కాక కాలవైపరీత్యాలనూ, దేశ పరిస్థితులనూ, అధినాయకుల ప్రభావాలను కూడా ప్రతిబింబిస్తూ చారిత్రకమైన కవితలను రాయడం సమాజంలో సామాజికతను నిరూపణ చేశారు బోయి భీమన్న గారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. భీమన్న, బోయి 1983, భీమన్న ఉగాదులు, సాహితీ సష్టిపూర్తి ప్రచురణ
2. వెంకటేశ్వరరావు, దార్ల, 2008, లలిత సాహిత్యం - మాదిగ దృక్పథం, సొసైటి & ఎడ్యుకేషన్ ట్రస్ట్
3. హైమావతి, 1982, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, సుఖేలా నికేతన్ ప్రచురణలు
4. ఇనాక్, కొలకలూరి, 1985, సాహిత్య దర్శిని, జ్యోతి గ్రంథమాల

ఓటరు జాబితాపై భీమన్న స్వరం

- కోట్ల గోవిందరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం. హైదరాబాద్.

1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన భారత దేశంలో కులమత వర్గ వర్ణ లింగ వయో భేదం లేకుండా ప్రజలందరికీ వయోజన ఓటు హక్కు కల్పించామని, సమానత్వాన్ని సాధించామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుతున్నాయి గానీ ప్రజల పరిస్థితి మాత్రం అంతకు ముందు కంటే దీనంగా హీనంగా తయారైందని చెప్పవచ్చు. ఎందుకంటే అంతకుముందు ప్రజలు ముఖ్యంగా దళితులు ఏ విధంగా ఉండేవారో ఆ తరువాత పరిస్థితులు కొంచెం తారుమారయ్యాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వయోజన ఓటు హక్కు వచ్చిన తరువాత దళితులపై ఎక్కువగా ఒత్తిడి, బెదిరింపులు, దాడులు పెరిగాయనే చెప్పవచ్చు. ఏవిధంగా అంటే ఓటు కోసం రాజకీయ నాయకుల యొక్క విభజించు - పాలించు సిద్ధాంతాలు, గ్రామాల్లోని అధికారులు, ఖామంధులు, జమిందారులు మొదలైన వారు భేద దండోపాయాలను ప్రయోగిస్తూ అమాయకులైన, అక్షరజ్ఞానం లేని, ముఖ్యంగా ఓటు విలువ తెలియని దళితుల్ని భయభ్రాంతుల్ని చేస్తూ, వేధిస్తూ బాధించేవారని తెలుస్తుంది. అందువల్ల ఈ ఓటు హక్కు కంటే బానిసత్వమే ఎంతో ప్రశాంతతని ఇస్తుందనీ, తెలియ జేస్తూ మహాకవి, కళాప్రపూర్ణ బోయిభీమన్న గారు గుడిసెలు కాలిపోతున్నై అనే కవితా సంపుటిలో ఓటరు జాబితాను బానిసల జాబితాగా వర్ణిస్తూ దళిత ఓటర్ల దుస్థితిని తెలియజేసారు.

తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు అనే మారు మూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టిన భీమన్నగారు పేదరికంతో పాటు అంటరానితనం, అస్పృశ్యత వంటి దురాచారాలను చిన్నప్పటి నుంచే అనుభవించడం వలన సహజంగానే వీటిని నిరసించారు. ఈయన అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన రచనలు తర్జుమా చేస్తూ, సమాజంలో దళితులు అనుభవిస్తున్న అసాధారణ సమస్యలతో పాటు వివిధ సందర్భాల్లో జరుగుతున్న హింస, దౌర్జన్యాలను తెలియజేయడంతో పాటు వారి పట్ల జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలతో పాటు వాళ్ళను అజ్ఞానుల్ని చేసి దోచుకుంటున్న ప్రభుత్వ అధికార వర్గంపై అగ్రవర్ణ నాయకత్వంపై ఆయన అనేక కవితలు, కథలు, నాటకాల ద్వారా బహిర్గతం చేస్తూ దళితోద్యమానికి సారథ్యం వహించారు. భీమన్నగారు రచించిన పద్య, గేయ, వచన రచనల్లోనూ, వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లోనూ పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. అవి కొన్ని కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాలని చెప్పినట్లుంటుంది. ఈయన రచించిన పద్య, గేయ, వచన, నాటకాది రచనలు సమాజంలోని లోపాలను ఎత్తి చూపుతూ, అహంభావాన్ని ప్రశ్నిస్తూ, దళితుల్ని, నిమ్న వర్గాల వారిని చైతన్య పరుస్తూ దళితుల భవిష్యత్ కార్యచరణకు మార్గదర్శకమవుతున్నాయి. పురాణేతి హాసాలు, సాంప్రదాయ సాహిత్యం పేరుతో పాలక వర్గాలతో ఆలోచనాపరులు కలిసి కొనసాగించిన కుట్ర ఫలితంగా నేటికీ కులాధిపత్య సాహిత్యమే కొనసాగుతోంది. దురదృష్టమేమిటంటే నాటి భావజాలాన్ని నేటికీ కొనసాగడాన్ని ఆ భావజాలం వల్ల నష్టపోయిన ఇంకా నష్టపోతున్న వాళ్ళు వ్యతిరేకిస్తుంటే, నాటి ఆధిపత్య భావజాలాన్ని సమర్థించే వాళ్ళు కూడా నేటి సమాజంలో ఉన్నారు. నేటికీ అగ్రవర్ణాల వామన పాదాల క్రింది నలిగిపోతున్న దళితులు ప్రజాస్వామ్య బద్ధమైన తమ హక్కుల్ని కాపాడుకోవడంలో, సాధించుకోవడంలో సంపూర్ణమైన స్వేచ్ఛ అనేది లేదు. దళితుల యొక్క నిరక్షరాస్యత, అజ్ఞానం వలన తమ హక్కుల్ని గుర్తించగ

పోగా తిరిగి బానిసత్వంలోకి పోతున్నారని బోయిభీమన్న గారు ఆక్రోశిస్తూ "బానిసల జాబితా" అను కవితను రాయడం జరిగింది. ముఖ్యంగా రాబందుల ప్రజాస్వామ్య వ్యవస్థలో సారా పాకెట్లకు కొందరు, చీరాజాకెట్లకు కొందరు, ఉచిత హామీల హోరుకు మరికొందరు నిరక్ష రాస్యులై, అజ్ఞానంలో నాయకులకు వంగి, తలవంచి వారి చెప్పుచేతల్లోకి పోవడం వలన నేటికీ దళితుల స్థితిగతులు అస్యవ్యస్తంగానే ఉన్నాయి. అటువంటి పరిస్థితులను తెలియజేస్తూ ఓటర్లు ఏ విధంగా ప్రభావితం అవుతున్నారో ముఖ్యంగా దళితులకు ఖామందులు, భూస్వాముల కబంధ హస్తాల్లో బానిసబ్రతుకులు వెల్ల దీయడాన్ని బానిసల జాబితాలో తెలియజేసారు బోయి భీమన్నగారు.

"ప్రభూ! మా పేర్లను
వోటర్ల జాబితా నుంచి తొలగించి
బానిసల జాబితాలో చేర్పించండి!
చచ్చి, మీ కడుపున పుడతాం!
బానిసల జాబితా అనేది ఇప్పుడు లేదంటారా?
పూర్వం రాజుల పాలనలో వుండేదే
ఇప్పుడిది ప్రజల పాలన అంటారా?
బానిసల జాబితా స్థానంలో
వోటర్ల జాబితా వచ్చిందంటారా?"

కవిత ప్రారంభంలోనే ఓటరుగా తమ యొక్క అంటే దళితులు పేదవారి యొక్క సమస్యలను ఏకరువు పెడుతూ ఓటరు జాబితావలన మాకు జరిగిన మేలు ఏమీ లేదు సరికదా కీడే ఎక్కువగా వుందని అందుకు భీమన్నగారు పాలక వర్గానికి వినతి చేస్తూ ప్రభూ! అని సంబోధిస్తూ తన బాధలను తరతరాలుగా విముక్తి చెందని దళితుల రోదనలను ప్రభుత్వానికి వినతి పత్రంలో తెలియజేస్తున్నారు. ప్రభూ మా పేర్లను ప్రజాస్వామ్యంలో గొప్పగా చెప్పుకునే ఆ వోటర్ల జాబితా నుండి తొలగించండి, బానిసల జాబితాలో చేర్పించండి అంటూ, అలా మీరు చేయడం వలన తరతరాలుగా మేమంతా మీకు రుణపడి ఉంటామని హృదయ విదారకంగా విన్నవిస్తున్నారు భీమన్నగారు. ఎందుకంటే భారతదేశంలో ఈ ఓటరు జాబితా వలన సామాన్య ప్రజలకు జరిగిన ప్రయోజనమేమీ లేదు. చాలామందికి అసలు తమ పేర్లు అందులో ఉన్నయని కూడా తెలియదు. తెలిసినా దానిని వారు ఉపయోగించుకునే సామర్థ్యం, జ్ఞానం అసలే లేవు. దాని కారణంగా ఇంకా వారు అదే బానిసత్వంలో బ్రతుకులు వెల్లదీస్తున్నారు. దళితుల బ్రతుకులు అప్పటికీ, ఇప్పటికీ ఒకేవిధంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మాత్రం దళితులకు, పేదవారికి ఏదో ఉద్ధరిస్తున్నట్లు ఆర్భాటాలు చేస్తున్నాయని, అందువల్ల తమని ఓటర్ల జాబితా నుండి తొలగించి బానిసల జాబితాలో చేర్చాలని అలా అయితే కనీసం ప్రభుత్వాలు తమని కొంచెమైన గుర్తించుకుని మార్పు కోసం ప్రయత్నాలు చేయవచ్చుననే ఆశ ఉంటుందని కాబోలు భీమన్నగారు బానిసల జాబితాలో చేర్చమని విన్నవించారు అని చెప్పవచ్చు. పేర్లను వోటరు జాబితా నుంచి తొలగించి బానిసల జాబితాలో చేర్పించమని ప్రార్థిస్తూనే మళ్ళీ ప్రశ్నను సంధిస్తూ, దానికి సమాధానాన్ని సైతం ఆయనే చెప్పుకోవడం అనేది వైవిధ్యంగాను, విలక్షణంగానూ ఉంది. గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో చాలావరకు కవితలు ఇదే ధోరణిలో తానే ప్రశ్నించుకుంటూ వాటికి సమాధానాలు కూడా తానే చెప్పుకుంటూ విలక్షనమైన కవితా విధానాన్ని అనుసరించారు.

కవితలో మొదటి భాగంలో విన్నపాన్ని మళ్ళీ ప్రశ్నలు సంధిస్తూ సమాధానాలు చెప్పుకుంటున్నారు భీమన్నగారు. ముఖ్యంగా బానిసల జాబితా అనేది ప్రస్తుతకాలంలో లేదంటారా పూర్వం రాజుల పాలనలో వుండేదే అంటున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నూతన రాజ్యాంగాన్ని అంబేద్కరు అందించడం జరిగింది. దానితో ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగింది. అందులో భాగమైనదే బానిసత్వాన్ని రద్దు చేయడం,

వెట్టిచాకిరి రద్దు చేయడం, ఓటుహక్కు కల్పించడం మొదలైనవి. అందువల్ల ప్రస్తుతం బానిసల జాబితా లేదని, పూర్వకాలంలో బానిసల జాబితా ఉండేదని అంటూనే ఇప్పుడిది ప్రజల పాలన అంటారా అంటూ ప్రశ్నించాడు. పూర్వం రాజుల పాలనలో పరాజితులైన ఇతర రాజ్యాల సైనికులు, అంటరానివారు, పేదలు, దారి దోపిడీ దొంగలు, ఖైదీలు మొదలైనవారిని బానిసలుగా మార్చి వెట్టి చాకిరీ చేయించుకునేవారు. నేటికీ ఆ వెట్టి చాకిరీ క్రింద అనేక మంది దళితులు ఊడిగం చేయడం జరుగుతుంది. కానీ ప్రస్తుతం స్వాతంత్ర్యా నంతర ప్రభుత్వాలు నూతన చట్టాలను చేస్తూ రాచరికాన్ని రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అంటే ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజల పాలన, అందుకేనేమో బానిసల జాబితా స్థానంలో ఓటర్ల జాబితా వచ్చిందంటారా అంటూ తన ప్రశ్నకు తానే సమాధానపరుచుకున్నాడు. ఇదిప్రజా ప్రభుత్వం కాబట్టి వారిని నేరుగా బానిసలు అంటే సమంజనంగా ఉండదు కాబట్టి ఓటర్లు అంటున్నారని వ్యంగ్యంగా విమర్శించారు భీమన్నగారు.

"అయ్యో బానిసలమై ఉంటే
ఏ అబ్రహం లింకన్ వంటి వాడి కోసమో అయినా
ఎదురు చూస్తూ బ్రతికే వాళ్ళమే
ఈ ఓటర్ల జాబితా నుండి
మమ్ము ఏ దేవుడుద్ధరించగలడు
అదేమిటయ్య, అలా ఏడుస్తారు?
వోటంటే ఏమిటనుకుంటున్నారు?"

మేము బానిసలమై ఉంటే మమ్మల్ని కాపాడడానికి అబ్రహంలింకన్ వంటి వాళ్ళకోసము అయినా ఎదురు చేస్తూ బ్రతికే వాళ్ళమని చెప్పారు భీమన్నగారు. లింకన్ ఏ విధంగానైతే ఆర్థిక సాంఘిక సమానత్వానికి కృషి చేశాడో అదే విధంగా మమ్మల్ని కూడా అలా ఎవరైనా వచ్చి ఈ సామాజిక దురవస్థల నుండి, అంటరానితనం అనే దురాచారం నుండి కాపాడడానికి వస్తారని జీవితాలను పణంగా పెట్టి ఎదురు చూసే వాళ్ళమనీ కానీ ఇప్పుడు ఈ ఓటరు జాబితా నుండి రక్షించడానికి ఏ దేవుడూ సాహసించరని వాపోయారు. ఈ వేదభూమిలో ముక్కోటి దేవతలు ఉన్నా అందులో మా గోడు వినే దేవుడు ఒక్కరైనా లేరని కేవలం అగ్రవర్ణాల వారికి, ధనవంతులకు మాత్రమే దేవుడు ఉన్నాడనీ, కావున మమ్ము కాపాడడానికి ఎవరైనా అంబేద్కరులా యుగ పురుషుడు రావాలని ఆకాంక్షిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. అదేమిటయ్య అలా ఏడుస్తారు? ఓటంటే ఏమిటనుకున్నారు అను ప్రశ్నకు సమాధానంగా...

"అది మా పాలిటి శని, ప్రభూ!
ఒక ప్రక్క రకరకాల జెండాల వాళ్ళు
మరో ప్రక్క మా వూరి ఖామందుల వార్లు
ఈ వోటు అమ్మోరు కోసం
మాప్రాణాలు తోడేస్తున్నారు
మా గుడిసెలు తగలబెట్టేస్తున్నారు
బానిసలకుండే సుఖశాంతులు సైతం
మా పేద వోటర్లకు లేవు, మహాప్రభో!"

ఓటు హక్కు అనేది దళితులు మరియు పేదల పాలిట ఏ విధంగా ప్రభావితం చూపిస్తుందో తెలియ జేస్తున్నారు బోయిభీమన్నగారు. హైందవులు భయభ్రాంతు లతో ఉలిక్కిపడే మాట శని. అలాంటి ఈ ఓటు హక్కు కూడా మా పాలిట శనిగా దాపురించిందని అంటున్నారు భీమన్నగారు. ప్రభూ ఓటుహక్కు అనేది దళితుల మరియు పేదల పాలిట శని ఎందుకంటే ప్రజాస్వామ్య దేశంలో వీధికో నాయకుడు, ఊరికో పార్టీ చొప్పున రంగు రంగుల జెండాలు, రకరకాల అజెండాలు, చిత్రవిచిత్రమైన మేనిఫెస్టోలతో ఎన్నికలంటే చాలు ప్రచార ఆర్భాటాలకు, ఉచిత హామీలతో ప్రజల్ని వూదరగొడుతూ, సందిగ్ధంలో ముంచేసిన రాజకీయ పార్టీలు అసంబద్ధ, అనైతిక, అయోమయ అతిశయోక్తులతో కూడిన వరాల జల్లులతో ప్రజలను మాయచేసి, నాయకులు పొట్టలు నింపు కుంటుంటే, మరోవైపు గ్రామాల్లో జమిందార్లు, ఖామందులు, ఇతర పెద్దల యొక్క బెదిరింపులు,

చెండశాసనాలు, ఇంకా శృతిమించితే మారణకాండలతో నరమేధానికే పూనుకుంటున్న గ్రామ పెద్దల పట్ల భయభక్తులతో కూడిన సందిగ్ధ భావనతో మాన ప్రాణాలు పోగొట్టుకుంటున్న గ్రామీణులకు అటు రాజకీయ నాయకులు, ఇటు గ్రామ ఖామందులు వోటు అమ్మోరు కోసం ప్రాణాలు తోడేస్తున్నారనే వాపోయాడు. గ్రామాల్లో గ్రామ దేవత ఆలయంలో విచిత్ర పరిస్థితి నెలకొంటుంది. గ్రామాల్లో అమ్మోరు పండుగ సమయంలో అంగరంగ వైభవంగా ఉన్న ఆలయాలు సాధారణ సమయాల్లో కనీసం దీపం కూడా వుండదు. అదే విధంగా ఈ వోటు కూడా అలాంటి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఎన్నికల కోసం అటు రాజకీయ నాయకులు, ఇటు గ్రామీణ పెద్దలు, పోటీ పడుతూ సామదాన బేద దండోపాయాలను ప్రయోగించి మానసికంగా శారీరకంగా వారిని హింసకు గురిచేయడం జరుగుతుంది. అదే విధంగా ఎన్నికల సమయంలో అనేక విధమైన గొడవలు, డొమ్మీలు, మాటల యుద్ధాలు, దాడులు జరుగుతుంటాయి. కానీ అవి ఒక్కొక్కసారి ఎంతటి తీవ్ర రూపాన్ని సంతరించుకుంటాయంటే మనుషుల్ని చంపేసేంతలా, వాళ్ళ గుడిసెలు, ఇళ్ళు కాల్చి దగ్ధం చేసేంతలా ఉంటాయి. ఈ ఎన్నికల సమయాలలో అశువులు కోల్పోయిన ఓటరులెంతమందో, కాలి బూడిదైన గుడిసెలెన్నో, అందుకే గుడసెలు కాలిపోతున్నై అనే కవితలో అంటారు ఈ గుడిసెలు ఎన్నిసార్లు కాలిపోయిన మళ్ళీ అవతరిస్తూనే ఉంటాయని బోయిభీమన్న గారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటర్లు ఎన్ని కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారో తెలియజేస్తూ, బానిసలకు ఉండే సుఖశాంతులు కూడా మా పేద ఓటర్లకు లేవు.బానిసలు ఏ పూటకాపూట తిని ఎటువంటి చీకుచింత లేకుండా వాళ్ళ పనుల్లో వారుంటారు. కానీ ఓటర్లకు అలా కాదు. ఏ పార్టీవారు వస్తారో తెలీదు, ఏమంటారో తెలీదు, ఎన్నికల 10 రోజులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బ్రతకాలి, అందువల్ల బానిసలకున్న సుఖశాంతులు లేవని వాపోయారు భీమన్నగారు. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రభుత్వంలో ప్రజలకే రక్షణ లేదు, సుఖశాంతులు లేవు. కానీ మాయచేసిన నాయకులు మాత్రం అంగబలం, అర్ధబలంతో దినదినాభివృద్ధి చెందుతున్నారని, ఈ రాజ్యంలో ఓటర్లు కన్నా బానిస బ్రతుకులు మేలని తెలియజేసారు.

"ఆ వోట్లేవో మీ దొరలే వుంచేసుకోండి
మా గుడిసెల్లో మమ్ము బ్రతకనివ్వండి
మేం వెనుకబడ్డవాళ్ళం, బలహీన వర్గాల వాళ్ళం
విలువైన దేన్నీ కాపాడకోలేం!"

అందువలన ఆ ఓట్లు అనేవి మీ దొరలూ, నాయకులు, పాలకులే ఉంచుకోండి, మా గుడిసెల్లో మమ్ము ప్రశాంతంగా బ్రతకనివ్వండి, విలువైన వస్తువుల్ని కాపాడకోవలంటే, రక్షణ కల్పించాలంటే దానికి తగిన అంగబలం, అర్ధబలం వుండాలి. అప్పుడే దాన్ని కాపాడగలం, అందువల్ల ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటును కాపాడుకునే అర్హత, స్థోమత మాకు లేవు. మాకు అనగా మేము వెనుకబడ్డ వాళ్ళం మరియు బలహీనవర్గాల వాళ్ళం. కావున విలువైన ఓటు కాపాడుకోలేం. కావున ఆ వోట్లేవో మీ దొరలు, నాయకులు పాలక వర్గాలవారే ఉంచుకోండని, మా గుడిసెల్లో మమ్ము బ్రతకనివ్వండి చాలని ఆవేదన వ్యక్తం చేసారు.

"ఈ దేశంలో పేదలకు వోటుండడం
పక్కలో పాముండడమే
ఈ వోట్ల చెలగాట్లతో మమ్మల్ని చంపకండి!
దయచేసి, జాబితా మార్చెయ్యండి!"

పాము ఉన్నదని అనుమానపడ్డ ఇంట్లో ఉంటేనే అనుక్షణం భయాందోళనతో మనశ్శాంతి లేక కలవర పడుతూ వుంటామా అలాంటిది అదే పాము పక్కలో నిత్యం ఉన్నట్లయితే మనిషి బిక్కచచ్చిపోయి, ఉచ్వాస నిశ్వాసాలకు కూడా భయపడుతూ ఏ విధంగా ఉంటాడో అలానే ఈ భారతదేశంలో పేదలకు ఓటు హక్కు ఉం

డడం కూడా అలాంటిదేనని ఓటున్న పేదలు, దళితులు ప్రశాంతంగా ఉండలేరని కావున ఈ ఓటుతో చెలగాట మాడుతూ మమ్మల్ని చంపకండి అంటూనే దయచేసి ఆ ఓటరు జాబితా మార్చేయండి అంటూ దీనంగా ప్రార్థిస్తున్నారు బోయి భీమన్నగారు.

ప్రజాస్వామ్య దేశాలలో పేద, నిమ్నవర్గ, దళిత, నిరక్ష్యరాస్యులైన ప్రజలు ఓటుహక్కుని ఎంతవరకు వినియోగించుకుంటున్నారు అనేది ప్రశ్నార్థకంగా మారిందని, వీరి మీద ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్ళు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛగా వినయోగిస్తున్నారనేది సందేహమేనని, మరీ ముఖ్యంగా ఈ ఓటుహక్కు వచ్చిన తరువాత పేదలు, దళితులపై దాడులు పెరిగాయనీ, ఎన్నికల సమయాలలో ఈ దాడులు మరింత విజృంబించి, మారణ హోమాలకు దారి తీస్తున్నాయని తెలియజేస్తూ, ఆ ఓటు వలన తాము పడుతున్న అగచాట్లను సూక్ష్మ పరిశీలనతో కవిత్వీకరించారు బోయి భీమన్నగారు.

ఆధార గ్రంథాలు :

1) పాలేరు నుండి పద్మశ్రీవరకు - హైమావతి
2) గుడిసెలు కాలిపోతున్నై - భీమన్న



రాగవాసిష్ఠం - నాటక వైశిష్ట్యం

- డా॥. ఖి. మల్లికార్జున రాజు, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల, కడప జిల్లా.

బోయి భీమన్న :

సాహిత్యంలో నూతన సృష్టి గావించడమే భీమన్న ప్రధానోద్దేశం. రాయడం ఆయనకొక సరదా. అందుకే నిర్విరామంగా రాస్తూనే వున్నారు. పద్యం, గద్యం, గేయం, నాటకం, నోక, లేఖలు, శతకం, వ్యాసం, వచనకవిత్వం ఇలా అన్ని ప్రక్రియలలోనూ డెబ్భై వరకు గ్రంథాలు రాసిన సాహితీమూర్తి భీమన్న. ఆయన ప్రతీ రచనలోనూ సహజత్వాన్ని, నూతనత్వాన్ని సాధించారు. తనకావ్యాలకు తానే వాఖ్యాల రూపంలో అద్భుతమ్మెన పీఠికలు రాయడం ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక నూతన ప్రక్రియను ప్రవేశ పెట్టారు.ఆయన రచనలు జాతీయ దృక్పధాన్ని కలిగిస్తూ పిడిబాకుల్కె సూటి గా హృదయాన్ని తాకుతాయి.

సామాన్యుల జీవితాల్లోకి తొంగి చూసి రాస్తారేమో ఆర్ద్రత కూడా మనసును పట్టి లాగుతుంది. భీమన్న భావకుడే కాక కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించిన తత్వవేత్త. విమర్శకుడు, వ్యాఖ్యాత పరిణితి చెందిన రాజకీయ వేత్తగా కూడా దర్శనమిస్తారు. ఆయనతన రచనా వ్కెవిధ్యం, ఆలోచనామృతం ద్వారా ఎందరో కవులకు మార్గదర్శకుడయ్యారు. అందుకే తెలుగు సాహిత్య కవులలో ఆదికవి బోయి భీమన్న అనడంలో అతిశయోక్తి లేదు.

1911 సెప్టెంబరు 19న తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో భీమన్న పుట్టాడు. నాగమ్మ మరియు పుల్లయ్య ఇతని తల్లిదండ్రులు. వీరికి పంచపాండవుల వలె ఐదుగురు మగపిల్లలు మరియు ఒక ఆడపిల్ల జన్మించారు. పుల్లయ్య తన మగపిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టాడు. భీమన్న 1935లో బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై 1937లో బి.ఇడి. పూర్తి చేశాడు. గుడిసెలు కాలిపోతున్నాయ్ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వరించింది. 2001లో భారత ప్రభుత్వం భూమన్నను పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2005 డిసెంబర్ 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

బోయి భీమన్న ప్రముఖ రచయిత. ఈయన సుమారు 70 పుస్తకాల్ని రాసినట్లు తెలుస్తోంది. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశాడు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్నేవో కొత్తప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణి లో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని వ్రాశాడు. వీటన్నింటితో పాటు అంబేడ్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశాడు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేడ్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

నాటక వైశిష్ట్యం :

పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ - వసిష్ఠుల ప్రణయ గాథను ఆధారంగా చేసుకొని వచ్చిన నాటకమే రాగ వాసిష్ఠం దీన్ని బోయి భీమన్న గారు 1959లో రాశారు. 12 రంగాలు గల ఈ నాటకం రావడం వెనుక కుల సమస్యను, దళితుల సంస్కృతీ పరమైన విషయాలను చర్చించాలనే లక్ష్యం కనిపిస్తుంది. భారతదేశంలో ఆర్య-ద్రావిడ జాతుల పుట్టుకకు సంబంధించిన చారిత్రక లోతులెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. పౌరాణిక ఇతి వృత్తాన్ని తీసుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యను లోతుగా చర్చించి, "భారతీయులంతా ఒక్కటే"

అనే జాతీయతా వాదాన్ని స్థాపించే నాటకంగా దీన్ని అభివర్ణించవచ్చు.

అరుంధతీదేవి కథ పురాణ ప్రసిద్ధమైనదని ముందే చెప్పుకున్నాం. అయితే, పురాణాల్లో ముఖ్యంగా శ్రీదేవీ భాగవతం, శివపురాణం, భాగవతం, భారతం తదితర పురాణేతిహాసాల్లో వసిష్ఠుని గురించి చెప్పే కథా సందర్భంలో ఆయన ధర్మపత్నిగా అరుంధతీదేవి ప్రస్తావన వస్తుంది.

అరుంధతీదేవి గురించి ప్రచారంలో ఉన్న కథల్లో పాఠకులకు రకరకాల అనుమానాలు కూడా వ్యక్తమవు తుంటాయి. ఆ పద్ధతిలోనే అరుంధతీదేవికి సంబంధించిన కథలు పుస్తక రూపంలో కనిపిస్తున్నాయి. ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించి స్పష్టంగా వివరించకపోయినా, ఆమె ఒక చండాల వంశానికి చెందిన స్త్రీగానూ, గొప్ప సత్య వంతురాలు, పతివ్రతా ధర్మం గల స్త్రీ అని ఎంతో మంది వర్ణించారు.

బోయి భీమన్న గారు మాత్రం అరుంధతీదేవి కథను ఆర్య - అనార్య భేదాలను చర్చించి, శూద్రులు, చండాలురు, మాల, మాదిగల వంటి పేర్లతో పిలిచే వారంతా ఈ దేశ మూల వాసులే కాకుండా, అసలైన ఆర్య జాతీయులవుతారని వాదించే దిశగా ఈ నాటకాన్ని పౌరాణిక - సాంఘిక నాటకంగా తీర్చిదిద్దారు

కథా సారాంశం :

యమునా నదీ తీరాన వేదవనంలో నిష్ఠగా తపస్సు చేసుకొనే యువతపస్వి వశిష్ఠుడు, సంధవార్చడానికి నదీతీరానికి వచ్చి ప్రమాదవశాత్తు నదిలో కాలుజారి పడగా అరుంధతి రక్షిస్తుంది. తరువాత వారిద్దరూ పరస్పరం అనురక్తులౌతారు. ఒకరోజు అరుంధతీ వసిష్ఠులు నదీతీరాన ఉండగా వశిష్ఠుని సంరక్షకుడు, ఆశ్రమాధిపతీ అయిన ప్రాచీనుడు తటస్థ పడతాడు. అరుంధతి మాతంగకన్య అని అప్పుడు వశిష్ఠునకు తెలుస్తుంది. ప్రాచీనుడు అతనికి ఈ ప్రేమలోని వైరస్యాన్ని సూచించే సరికి వశిష్ఠుడు అరుంధతిని వదిలివస్తాడు. తరువాత అరుంధతి వశిష్ఠుని గెలుచుకోవడానికి తపశ్చర్య పూనుతుంది. వశిష్ఠుడు తనలోతాను సతమతమైపోయి ప్రాచీనుడిని ధిక్కరించే సమయానికి అరుంధతి తపస్సు వల్ల లోకం కాటకంతో తల్లడిల్లుతుంది. తనమాట సాగదని తెలిసిన ప్రాచీనుడు పిడికెడు ఇసుక చేతబట్టి ఇసుకను అన్నంగా వండిపెట్టే స్త్రీ నీకు భార్య అవుతుందని అంక్ష పెడతాడు. కాటకంతో ఋషులు త్రిమూర్తుల వద్దకు రాయబారం పోతారు. చివరకు అరుంధతితో పాటు తానూ యోగాగ్నికి దగ్ధుడనౌతానని వశిష్ఠుడు సిద్ధ పడడంతో పరమేశ్వరుడు ప్రత్యక్షమౌతాడు. పరమేశ్వరుని సన్నిధిలో అరుంధతిని పత్నిగా స్వీకరిస్తాడు వశిష్ఠుడు. అరుంధతి పాతివ్రత్యం వల్ల కాటకం తీరేవిధంగా కొండరాళ్ళు పిండి వంటలవుతాయి. ఇసుక అన్నంగా మారుతుంది. పరమేశ్వరుడు అమెకు వ్యోమమండలంలో భర్తృసన్నిధానంలో స్థానమిచ్చి ప్రశంసిస్తాడు. ఇదీ ఈ నాటకంలోని కథ. ఆర్య - అనార్య భేదభావాన్ని తునాతునకలు చేసి ప్రాచీనుడి నోరు మూయించి ఈ పారతంత్ర్య వాతావరణం నుండి వశిష్ఠుడు బయట పడటం ఈ నాటకంలోని పరమార్థం.

నాటక సంవిధానం :

నాందీ, ప్రస్తావనల కంటే, నాటకాన్ని 12 రంగాలుగా విభజించి, మొదటి రంగంలోనే జరగబోయే కథను చక్కగా సూచించగలిగారు. నాటక ప్రదర్శనలో పంచ సంధులను ఉపయోగించుకున్నారు.

"మేలుకో మేలుకో" పాటతో వసిష్ఠుడు తపస్సు నుండి మేల్కొనడం, మూఢత్వాన్ని వదిలి జ్ఞానం వైపు పయ నించడం జరిగింది. సంధ్య ద్వారా పరిచయమై, అరుంధతీదేవిని చేరి, జలగండం నుండి రక్షించినట్లు మొదటి రంగాన్ని బట్టి తెలుస్తుంది. జలగండాలేమైనా సంభవించినప్పుడు వాటి నుండి రక్షించుకోవడానికి యోగ ముద్రను దాల్చవచ్చనీ అలా అరుంధతీదేవి చేసిందన్నట్లు రంగాన్ని వర్ణించారు.

తరువాత కథలో కూడా ఇదే రకంగా జరుగుతుంది. వసిష్ఠుడిని ప్రేమించడం, ఆ విషయం ప్రాచీనుడికి తెలియడం. ఆమె చండాల కన్య అని వసిష్ఠుడికి , ప్రాచీనుడికీ తెలిసినా, ఆమెకు ఆ విషయం తెలియ కుండానే సాలభంజికగా మారిపోవడం, మళ్ళీ సమస్య పరిష్కరింపబడిన తర్వాత ఆమె యోగ ముద్రను దాల్చడం, దాన్ని వీడటం వంటివన్నీ ఒక దాని తర్వాత మరొకటి జరిగిపోతాయి.

ఇది గొప్ప సంవిధానం. గొప్ప నాటక శిల్పం. నాందీ, ప్రస్తావనలు లేకుండానే పంచ సంధులు, కార్యావస్థలతో కథా కథనాన్ని ముందుకి నడిపించడంలో ఉన్న శిల్ప ప్రత్యేకత.

పాత్రలు - చిత్రణ :

ప్రాచీనుడు :

ప్రాచీనుడు సంఘర్షణాత్మక పాత్రలు. సంప్రదాయాన్ని చెక్కు చెదరనీయకుండా కాపాడేందుకు ప్రాచీన ధర్మాలన్నింటినీ పాటించమని వాదించేవాడు ప్రాచీనుడు.

వసిష్ఠుడు :

స్నేహం, పరస్పర అవగాహన, మానవీయతా గుణాలే ప్రధానమని నమ్మి, వాటి ముందు జాతి భేదాలు నిల బడవని వాదించే స్వభావం వసిష్ఠుడిది. అర్ష సంప్ర దాయానికీ, మార్పుని కోరుకొనే అభ్యుదయ వర్గానికీ మధ్య పాత్రోచితంగా ఈ పాత్రలను తీర్చిదిద్దారు రచయిత.

కులగిరి :

కులగిరి ప్రాచీనుడి శిష్యుడు. నదాచారాన్నే నమ్ముకునేవాడు. నత్తి నత్తిగా మాట్లాడుతూ, వచ్చీ రాని శ్లోకాలతో పురాణేతిహాసాలను ప్రామాణిక వాక్యాలుగా చెప్తుంటాడు. అయినా, సందర్భాన్ని బట్టి గురువు దగ్గర కూడా అబద్ధమాడడానికి వెనుకాడడు. మాదిగ లేదా కింది వర్ణాల వారిని వ్యతిరేకిస్తూనే, అందగత్తె అయితే, ఆమె మాదిగమ్మాయి అయినా, ఆమె వల్ల ఆనందం కలుగుతుందంటే దాన్ని పొందడానికి వెనుకాడని వాడు. అగ్రవర్ణమని చెప్పుకుంటూనే, కింది వర్ణాలనబడే వారిని అవసరానికి అనుగుణంగా ఎలా వాడుకుంటూ ఉం టారో కులగిరి పాత్ర ద్వారా రచయిత సూచించే ప్రయత్నం చేశారు.

సంధ్య :

సంధ్య పాత్ర ప్రకృతి చైతన్యానికి ప్రతీకాత్మకంగా ఎన్నుకున్నారు రచయిత.

అరుంధతీదేవి :

అరుంధతీదేవి పాత్ర ఒక స్వచ్ఛమైన ప్రేమ మూర్తిగా, ఆదర్శనారిగా, వర్ణభేదాలేమీ తెలియని నిష్కల్మష మూర్తిగా, అందరి సుఖసంతోషాలను కాంక్షించే వర ప్రదాయినిగా ఈ పాత్రను గొప్ప ఔచిత్యంతో తీర్చిదిద్దారు.

పరమశివుడు :

ఈ పాత్ర ద్వారా మానవులంతా ఒకే జాతి వారనీ, స్థల, కుల భేదాలను బట్టి, తాత్కాలిక అవసరాలను బట్టి అలా రూపొందించుకున్నారు తప్ప, భేదాలేమీ లేవని చెప్పడం ద్వారా ఈ నాటకం ద్వారా రచయిత సూచించే ప్రయత్నం చేశారు.

అలాగే కుంభోదరం, గోష్పాధం పాత్రలు కూడా సనాతన సంప్రదాయంలో కొనసాగే అవకాశవాద పెద్ద మనుషులకు ప్రతీకగానే తీర్చిదిద్దారు.

నాటకసందేశం :

నాటకంలో వసిష్ఠుడు, ప్రాచీనుడు, శివుడు పాత్రల గతంగా పలికించిన సంభాషణల్లో ఆర్య - అనార్య భేదాలు భారతదేశంలో నెలకొన్నాయనీ, అవి మానవ జీవనాన్ని హెచ్చు తగ్గుల సమాజంగా విభజించి, మానసిక, భౌతిక సంఘర్షణలకు కారణమవుతున్నాయనీ, వాటిలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని చెప్పించరు. నిష్కల్మషమైన జీవనానికి మానవుల మధ్య వర్ణ భేదాలు అవసరం లేదు. అవన్నీ కొంతమంది స్వార్థంకోసం, తమ ఆధిక్యం కోసం

సృష్టించుకొన్నవి, వాటిని ఎంత త్వరగా విస్మరించి నిర్మూలించగలిగితే, అంత త్వరగా భారతీయత సమైక్యంగా బలపడుతుందనేది ఈ నాటకం ఇచ్చే సందేశం.

ఆధార గ్రంథాలు :

1. భీమన్న బోయి. 1959, రాగ వాశిష్ఠం, హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు.
2. జ్ఞానానందకవి యన్.టి.,1997, షెడ్యూలు కులాలు అంటరానివా! కాకినాడ : సురగాలి ప్రచురణలు.
3. మూర్తి.బి.బి.యస్.,1992, దళిత కథామంజరి, రాజమండ్రి : త్రివేణి ప్రింటర్స్ ప్రచురణలు.
4. నరసింహాచార్య యన్.యల్. (వ్యాఖ్యాత), 2000, మనుస్మృతి, (తెలుగు తాత్పర్యం సహితం) హైదరాబాదు: గాయత్రీ ప్రచురణలు.

"మానవ వ్యక్తిత్వానికి మార్గదర్శకత్వం - డా॥. బోయి భీమన్న వచన కవిత్వం"

- మూమిడి మౌనిక, పరిశోధక విద్యార్థిని, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

"సాహిత్యం సమాజహితం" కోరుతుందనడానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణగా డా॥ బోయి భీమన్న గారిని చెప్పవచ్చు. వారి కలం నుండి జాలువారిన అనేక రచనలు సమాజంలోని అనేక సమస్యలను కళ్ళకు కట్టినట్లుగా చూపాయి. పద్యం, వచనం, కథ, నవల, నాటకం ఇలా ప్రక్రియ ఏదైనా తనకంటూ ఒక ప్రత్యేక శైలితో ముఖ్యంగా సమాజ అభివృద్ధి కాంక్షించి భీమన్న రచనలు చేశారు. వారి సాహిత్య సేవకుగాను కళాప్రపూర్ణ (1971), పద్మ శ్రీ (1973), పద్మభూషణ్ (2001) మొదలగు పురస్కారాలను పొందారు. మహాకవి, సాహితీ వసంత, నవయుగ కవిసార్వభౌమ వంటి బిరుదులతో పాటు అనేక గౌరవ డాక్టరేట్లను కూడా పొందిన సాహితీమూర్తి డా॥ బోయి భీమన్న. వీరు రాసిన పాలేరు నాటకంతో ఎందరో యువత విద్యయొక్క విలువను గ్రహించి ఉన్నత విద్యావంతులుగా మారారు. అభ్యుదయ అంశాలతో, దళిత సమస్యలతో, సామాజిక పరిరక్షణ ధ్యేయంగా భీమన్న విభిన్న రచనలు చేశారు.

వివిధ ప్రక్రియల్లో భాగంగానే కవితారంగంలో కూడా భీమన్న విశిష్ట స్థానాన్ని పొందారు. దోపిడీవ్యవస్థ, దళిత పీడన, మూఢ విశ్వాసాలు మొదలగు అనేక సామాజిక అంశాలతో ప్రజలను చైతన్యపరచే విధంగా వచన కవితలు రాశారు. వీరు రాసిన "గుడిసెలు కాలిపోతున్నాయి" (1973) వచన కవితా సంపుటికి 1975 కేంద్రసాహిత్య అకాడమీ అవార్డ్ వచ్చింది. 1962లో రాసిన "అనాదికొసనుంచి అనంతత్వంలోకి" కవితాసంపుటితో వీరు వచన కవిత్వాన్ని ప్రారంభించారు. ఈ కవితా సంపుటిని ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి గారికి అంకితం ఇచ్చారు. ఈ కవితా సంపుటిలో మానవుని నిత్యజీవన అలవాట్లు మొదలగు అనేక అంశాలను భీమన్న రాశారు. మానవుని వ్యక్తిత్వానికి మార్గదర్శకంగా నిలిచిన భీమన్నగారి సాహిత్యంలో ఒక భాగమే "అనాదికొననుంచి అనంతత్వంలోకి". ఈ వచన కవితా సంపుటిలోని కవితా వైభవాన్ని తెలియచేయడమే ఈ పరిశోధన వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

పుట్టుపూర్వోత్తరాలు :

బ్రతుకొక తెల్లని మెరుపు తీగ
దాని పుట్టుక ఒక నల్లని మేఘం!
బ్రతుకొక పవిత్ర పరిశుభ్ర పద్మం
దాని పుట్టుక ఒక బురద కోనేరు!
ఎందుకు త్రవ్వుకోవడం పుట్టు పూర్వోత్తరాలు?
బ్రతుక్కు ముఖ్యం దాని పుష్పఫల వైభవాలు!

వ్యక్తి యొక్క ప్రస్తుతమే ముఖ్యం కాని వారి పుట్టు పూర్వోత్తరాలతో ఏమి సంబంధమనే ఆలోచనను ఈ కవిత కలిగిస్తుంది. ఒక మెరుపు అంత కాంతివంతంగా మెరిసినా దాని మూలం ఒక నల్లని మేఘం, కంటికి ఎంతో అందంగా కనిపించే పద్మం యొక్క మూలం ఒక బురద కోనేరు. మెరుపయినా, పద్మమయినా అది ఎలా ఉంది, మనకు ఆనందం కలిగిస్తుందా లేదా అనేది ప్రధానం కాని వాటి పుట్టుపూర్వోత్తరాల కోసం సాధారణంగా ఆలోచించడం జరగదు. కాని ఒక వ్యక్తి యొక్క కృషి మనకు ఆనందం కలిగించినా కూడా అతడి పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రతీవారు ఆలోచిస్తారు. మనకంటే తక్కువ అయితే అధికారం చెలాయించడం, మనతో సమానులైతే మనవారే అని చెప్పడం, మనకంటే గొప్పవారయితే పొగడ్తలతో ఆకర్షించడం ఇలాంటి వాటికి పుట్టుపూర్వోత్తరాలు ఉపయోగపడతాయి. ఈ విధంగా మనిషి ప్రవర్తనను మార్చే పుట్టుపూర్వోత్తరాల గురించి అంత ఆసక్తి కనబరచడం ఎందుకని ప్రశ్నించారు భీమన్న.

మానవ జీవితానికి ముఖ్యం తన తోటివారితో కలిసి నడవడమేననే సందేశాన్ని ఈ కవిత అందిస్తుంది.

మంత్రబలం :

ప్రతి అక్షరం బీజాక్షరమే
ప్రతి మాటా మంత్రమే, మనిషికి!
తెలిసి తెలివిగా వాడుకుంటే
అక్షరాలే అక్షరలక్షలు పండుతై!
మాటలే మాణిక్య వీణ లవుతై!
బెడిస్తే - కస్సున లేస్తై అవే మిన్నాగులై!
కనుక, ప్రియతమా! ఇవిగో
ఆనందసుధా నిక్షేపాలు, పూలు!
మాధుర్యం నింపుకో బ్రతుకు నిండా,
మంత్రముగ్ధం చేసెయ్యి జగత్తు నంతా!

మానవుని మాటతీరు యొక్క ప్రాధాన్యతను ఈ కవిత తెలుపుతుంది. "నోరు మంచిదైతే ఊరు మంచిదవు తుంది"అనే సామెతను ఈ కవిత బలపరుస్తుంది. ఏ కాలంలో అయినా మానవునికి ఉండే ప్రధానమైన ఆయుధం అతడి వాక్కు. ఆ మాటతోనే ఒకరిని బాధ పడేలా, మరొకరిని సంతోషపడేలా చేయవచ్చు. అంతటి శక్తిగల ప్రతిమాట కూడా మనిషికి ఒక మంత్రమే అని ఈ కవిత తెలియచేస్తుంది. అటువంటి మాటలను తెలివిగా తగిన సందర్భానుసారంగా వాడితే ఉజ్జ్వల భవిష్యత్ లభిస్తుంది. అవే మాటలు హీనంగా మారితే ఎదుటివారిని మనకు శత్రువులను చేసే అవకాశం ఉ ంది. అందుకేనేమో ఆ మాటల మాధుర్యాన్ని బ్రతుకులో నింపుకొని, దానితో జగత్తుని మంత్రముగ్ధం చేస్తూ జీవనం గడపాలనే విషయాన్ని ఈ కవిత వివరించింది.

ఒక జత దుస్తులు :

మనుషుల్ని మనస్తత్వాల్నీ
వేషం చూచే పోల్చుకొంటాం తరుచు!
ఈ వేషాలు మనం వేసుకొన్నవి
ఈ దుస్తులు మనం మార్చుకోగలవి!
పరమేశ్వరుడే మనికిచ్చిన దుస్తులు శరీరాలు,
ఉద్రేకపడి మాపుకోకు వీటిని!
జాతికొక జత మాత్రమే ఇవి,
భద్రంగా వుండనీ మన జతను.

ఎదుటివారు వేసుకునే వస్త్రాలు, ఆభరణాలను చూసి వారిని గుర్తించడమనేది సాధారణంగా జరుగుతుంది. శాలువా కప్పుకొంటే పండితుడు, తల పెంచితే కవి, సూటు వేసుకొంటే అధికారి, పంచెకడితే పురుషుడు, చీర కడితే స్త్రీ ఇలా వేషం చూసి వ్యక్తుల్ని పోల్చడం సాధారణం. ఈ వేషాలు, దానికి తగిన దుస్తులు అన్నీ మనం వేసుకున్నవే, మనం మార్చుకోగలిగినవేనని ఈ కవిత తెలుపుతుంది. ఈ వస్త్రాలు, ఆభరణాలు అనేవి ఒకటి కాకపోతే మరొకటి, కానీ మనకున్న జీవితం ఒక్కటే. అటువంటి ఒక్క జీవితాన్ని కోపాలతో నాశనం చేయకుండా భద్రంగా చూసుకోవాలనే బాధ్యతను ఈ కవిత్వం వివరిస్తుంది. మనుషుల్ని వారి మనస్తత్వాల్ని వేషధారణను బట్టి పోల్చడం సరికాదనే భావనను ఈ కవిత కలిగిస్తుంది.

ఆ మూల పుష్పం :

పువ్వు వైరైతే
వేరులా పోషణభారం వహించాలి!
వేరు పువ్వైతే
పువ్వులా లోకాన్ని మోహింప చెయ్యాలి!
అదీ ఇదీ, ఇది అదీ అవుతూనే వున్నైగా?
పనినిబట్టి విలువ,
స్థానాన్ని బట్టి పేరు,
వ్యక్తిత్వాన్ని బట్టి సాఫల్యం!
ఎందుకు మరి ఈ
అధికత్వాల్పత్వ వ్యర్థ కురుక్షేత్రం!

ఈ సృష్టిలో ప్రతీదీ తనకంటూ ఒక కర్తవ్యాన్ని కలిగి ఉంటుంది. పువ్వు పని పువ్వుకి ఉంటే, వేరు పని వేరుకు ఉంటుంది. మానవుడు కూడా తన వృత్తిలో తాను పడే కష్టాన్నిబట్టి విలువను పొందుతాడు. ఆ విలువే సమాజంలో మనిషికి ఒక స్థానాన్ని ఇచ్చి పేరు ప్రఖ్యాతలు తెస్తుంది. ఎంత పేరు పొందినా మానవుని జీవితానికి

సార్థకత చేకూర్చేది మాత్రం అతని వ్యక్తిత్వమే అనే సందేశం ఈ కవిత ద్వారా తెలుస్తుంది. మానవ వ్యక్తిత్వమే ప్రధానం అయినప్పుడు ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువనే భావనలు ఎందుకని ప్రశ్నించడం ద్వారా విభేదాలు లేని సమాజాన్ని భీమన్న కాంక్షించారు.

నిన్నూ అంటారు :

అసూయతో, అసహనంతో
తమకులేని అందం, చందం, ఆనందం
నీకున్నదన్న యేడ్పుతో
"నిన్నూ అంటారు", కానీ-
పడ్డవాళ్ళు చెడ్డవారు కారెప్పుడూ,
పడేవాళ్ళే తారలు చరిత్రలో!
ప్రణయం పవిత్రం ప్రకృతికి!
ఆనందం అమృతం జీవితానికి!

సమాజంలోని వ్యక్తుల ద్వారా ప్రతి ఒక్కరూ ఏదొక విధంగా విమర్శకు గురయినవారే అనే విషయాన్ని ఈ కవిత తెలుపుతుంది. మేనక, ఊర్వశి, రాధ, గంగ, ద్రౌపది, సీత, అనార్కలి, రంగాజమ్మ, యెంకి ఇలా ప్రతి ఒక్కరిని ఏదోకటి అంటూనే ఉంది ఈ సమాజం. ఇంతటి చరిత్ర కలవారినే విమర్శించిన వ్యక్తులు తన తోటివారిని మాత్రం ఎందుకు విమర్శించకుండా ఉంటారు? ఏదోకటి నిన్నూ అంటారు. కానీ ఆ దుర్విమర్శలను గురించి వ్యక్తి బాధపడనవసరం లేదు. దానికి కారణం విమర్శింపబడిన వారు ఎంతో చరిత్ర, గొప్పగుణాలు కలిగి ఉన్నారు. అది ఓర్వలేని అసూయపరులు చేసే విమర్శలను లెక్కలోకి తీసుకోనవసరం లేదు. పడ్డవాళ్ళు ఎప్పుడూ చెడ్డవాళ్ళు కాదని నిరూపించి చరిత్రలో నిలిచిన ఎందరో తారలను ఆదర్శంగా తీసుకొని జీవితానికి ఆనందమనే అమృతాన్ని అందించాలనే విషయాన్ని ఈ కవిత వివరిస్తుంది.

స్వర్గమంటే :

నేటి నీవూ, నేనూ రేపు వుండం!
వుండేది సుకృతమేనే, సఖీ!
నీ ఆనందం కోసం నేను,
నా ఆనందం కోసం నీవు,
చేసే త్యాగమే సుకృత మంటే!
అది ఎవరిది వారిదేనే, సఖీ!
నీ సుఖదుఃఖాలకు నీవే కర్తవు,
నీ భవిష్యత్తుకు నీవే నిర్మాతవు,
పరులతో పోల్చుకుని ఏడ్వడం నరకం!
స్వర్గమంటే నిన్ను నీవు దిద్దుకోవడమేనే, సఖీ!

మొన్నటి తాతాఅవ్వా నిన్నలేరు, నిన్నటి అమ్మానాన్నా నేడు లేరు, నేటి నీవు నేను కూడా రేపు ఉండం, మిగిలేది మనం చేసిన మంచి మాత్రమే అనే అంశాన్ని ఈ కవిత ప్రస్తావించింది. కరోనా మహమ్మారి ప్రభావంగా ఎన్నో కుటుంబాలు వారి కుటుంబ సభ్యులను కోల్పోయారు. మొన్న మనం చూసిన మనుషులు నేడు మనకు లేరని తెలియగానే మనకు గుర్తుకు వచ్చేది వారు చేసిన మంచిపనులు. అటువంటి సమయంలో మనిషికి మరో మనిషే సహాయంగా నిలవాలి తప్ప మరో అవకాశం లేదు. ఈ రోజు మనం ఒకరికి చేసిన సహాయం, రేపు మరొకరిని మనకు సహాయం చేసేలా చేస్తుంది. ఆ విధంగా చూసినప్పుడు మనకు కలిగే సుఖదుఃఖాలకు మనమే కర్తగా మారడం జరుగుతుంది. మన భవిష్యత్‌కు కూడా నిర్మాతలం మనమే, అది మంచి లేదా చెడు ఏదైనా జరగవచ్చు. సమాజంలో మనచుట్టూ ఉన్నవారితో పోల్చుకొని వారి గురించే ఆలోచించడమంత నరకం మరొకటి లేదు. అలాగే మన తప్పొప్పులను సరిదిద్దుకుంటూ ఆనందంగా బతకడమంతా స్వర్గం మరొకటి లేదనే భావనను ఈ కవిత కలిగిస్తుంది.

రైలు ప్రయాణం :

నవ్వుతూ ఎక్కి, ఏడుస్తూ దిగేవాళ్ళు
ప్రక్కవాళ్ళతో స్నేహంచేసి
ఆడీపాడీ ఆనందం కూర్చేవాళ్ళు
ప్రక్కను మనుషులున్నారన్న గుర్తే లేక
ఊసీ, చీదీ అసహ్యం చేసేవాళ్ళు

దిగేవాళ్ళకు కన్నీటితో వీడ్కోలిస్తూ
ఎక్కేవాళ్ళను ఆశతో తిలకించేవాళ్ళు
ఏడుస్తూ ఎక్కి నవ్వుతూ దిగేవాళ్ళు
అప్పుడే దిగిపోతున్నావా అంటూనే
పీడ విరగడయిందని నిట్టూర్చే వాళ్ళు
వెళ్ళి రమ్మని చెప్పి
వెళ్ళిపోయినందు కేడ్చేవాళ్ళు
బండెక్కించి, కేకలు పెట్టి సలహాలిచ్చే వాళ్ళు
బండిపోయినా స్టేషన్ను వదలని వాళ్ళు
రకరకాల మనస్తత్వాలు!

ప్రతి ఒక్కరి జీవితంలో సాధారణ అంశమైన రైలు ప్రయాణాన్ని ఒక కవితాంశంగా స్వీకరించి దాని ద్వారా వ్యక్తుల మనస్తత్వాన్ని వివరించారు భీమన్న. రైలు ప్రయాణం మనకు కొత్త అనుభవాన్ని కలిగించి, కొన్ని తెలియని విషయాలు ఎదుటివారి నుంచి తెలుసుకొనేలా చేస్తుంది. ఇతరులతో ఎలా ఉండాలి, ఏ విధంగా ఉండకూడదనే అంశాన్ని ఈ ప్రయాణం మనకు నేర్పు తుంది. ఎన్నో బాధలు, మరెన్నో బాధ్యతలు, వాటికి తగినట్లుగా ఉరుకుల పరుగుల మన జీవిత ప్రయాణంలో ఒక భాగమైపోయింది రైలు ప్రయాణం. అనేక ఒడిదుడుకులతో ఎంతో దూరం, ఎన్నో రోజులు, ఎందరో ప్రయాణికులను వారి నిర్దేశిత స్థలానికి చేరుస్తుంది రైలు ప్రయాణం. ఒక్క రైలు ప్రయాణంలోనే ఇంత విషయం ఉంటే మన జీవిత ప్రయాణంలో మనం ఎన్ని విషయాలు నేర్చుకోవాలి, ఎంతగా సుఖదుఃఖాలను అలవాటు చేసుకోవాలి మొదలగు అనేక ఆలోచనలను ఈ కవిత అందిస్తుంది.

ముగింపు :

"బెంగలను బాధలను తొలగించి
నిరాశ నిస్పృహలను ఊదని
మనుషులను ఉత్తేజపరచి
ఆత్మను అలరించేది కవిత"

అని భీమన్నగారు చెప్పిన విధంగానే ప్రజలందరినీ అలరించడమే కాక, ఆలోచించే విధంగా కూడా కవితలు రాశారు. ఈ "అనాదికొస నుండి అనంతత్వంలోకి" వచన కవితా సంపుటిలో పైన తెలిపిన కవితలతో పాటు మనిషికి మార్గం మనసే, అక్షరగంగ, గాలిపటం, మనకథ, విలయవైభవం - హద్దులేదా, ఉన్న అందాన్ని చెరపకు, గీతా రహస్యం వెతక్కు దేన్నీ, జీవిత స్వరూపం, దివా రాత్రులు, లక్ష్యజాగృతి మొదలగు కవితాంశాలతో మానవుని వ్యక్తిత్వానికి మార్గదర్శకంగా నిలిచాయని చెప్పవచ్చు. ప్రకృతిని ఆరాధించడం, ప్రజాశ్రేయస్సును కాంక్షించడం, సమాజ సంస్కరణే ధ్యేయంగా రచనలు చేసి ప్రజలతో సామాజిక చైతన్యం కలిగించి సాహితీ లోకంలో ధృవతారగా వెలిగిన మహాకవి డా॥ బోయి భీమన్న. ప్రతి వ్యక్తి యొక్క సాధారణ జీవితంలో ఈ కవితాంశాలు నిత్యం ఎదురుపడడం గమనించవచ్చు. అటువంటి కవితా అంశాలతో మానవ వ్యక్తిత్వానికి మార్గదర్శకత్వం వహించే విధంగా డా॥ బోయి భీమన్న వచన కవిత్వాన్ని పరిపూర్ణం చేశారు.

ఆధారగ్రంథాలు

1. అనాదికొస నుంచి అనంతత్వంలోకి
2. డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి 3, వచన కవితలు భాగం 1

కూలీరాజు నాటకం – సామాజిక చైతన్యం

– డా॥. జొరెడ్డి నిర్మల, తెలుగు అధ్యాపకురాలు, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం - 4.

తెలుగు సాహిత్యంలో సంఘసంస్కరణతో పాటు సాంఘిక చైతన్యాన్ని ప్రబోధిస్తూ కావ్యాలు, నాటకాలు ఎన్నో కనిపిస్తాయి . ప్రజల సాంఘిక జీవన విధానంలోని కుల,మత, ఆర్థిక,రాజకీయ,నైతికాంశాలు ,పాలకుల పాలితుల మనోభావాలు , సంఘర్షణలు, సమర శంఖా రావాలు ,ఉద్యమ నేపథ్యాలు ఇలా అనేకాంశాలతో ప్రస్తావన కనిపిస్తుంది . అయితే సమాజంలో జరిగిన, జరుగుతున్న విషయాలే కాని కాలంతో పాటు ప్రజల్లోను, పాలకుల్లోను మార్పు రావడం, ఆ మార్పులో నుంచి సరికొత్త సాంఘిక చైతన్యం పుట్టుకు రావడమనేది చెప్పుకోదగ్గ అంశంగా భావించాలి . ఇటువంటి అంశాలతో కూడిన నాటక సాహిత్యాన్ని తిరగవస్తే స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం ఎంతోమంది రచయితలు, కవులు సామాజికాంశాల్ని వస్తువుగా తీసుకొని కుల, మత, వర్గ రహిత సమసమాజ స్థాపనకు కలాన్ని, గళాన్ని ఆయుధంగా చేసుకుని సజీవ చిత్రణతో, ఉదాత్తమమైన భావాలతో చైతన్యవంతమైన సంస్కరణ కథనాలను తెరమీదికి తెచ్చి మన కళ్ళ ముందు నాటక రూపంగా ప్రదర్శింప చేసిన ఆయా రచయితలందరికి శిరస్సు వంచి నమస్కరించవలసిందే .

నాటక ప్రక్రియ గురించి ఆర్యులు "కావ్యేషు నాటకమ్ రమ్యమ్" అని అలాగే "నాటకాంతంహి సాహిత్యమని" కొనియాడారు . నాటక మనేది సమాజ పరివర్తన కోసం, ప్రతిస్పందన కోసం, సాంఘిక చైతన్యం అనే విషయాన్ని గమనించాలి. అటువంటి నాటకాలు ఎంతో ఖ్యాతిని పొందుతాయి. అటువంటి సాంఘిక చైతన్యాన్ని ప్రబోధించిన నాటకాలో "కూలీరాజు" నాటకం చెప్పుకోదగ్గది.

నాటక రచన – పూర్వ రంగం

పాలేరు నుండి పద్మశ్రీ వరకు ఎదిగిన బోయి భీమన్న గారు సుధీర్ఘమైన సాహితీ నందన వనంలో వివిధ ప్రక్రియల్లో వైవిధ్యం కలిగిన అనేక రచనల్ని వెలువరించారు. ఆయన కలం స్పృశించని రచనా రూపంకానీ, విషయం కానీ లేదనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియల్ని చేపట్టి, వాటిని తీర్చిదిద్దడంలో తనదైన ముద్రణను వేసి మహోన్నత సాహిత్యవేత్తగా వెలు గొందారు. డా.. బోయి భీమన్న గారు "కష్టజీవి" అనే పేరుతో స్వాతంత్ర్యానికి ముందు అనగా 1942లో దీనిని రాశారు. ఆ తరువాత 'నవజీవనం' అనే పత్రికలో 'ధన్యజీవి' అనే పేరుతో సీరియల్‌గా ప్రచురింపబడింది. ఆ తరువాత కొన్ని మార్పులు చేర్పులతో 1948లో "కూలీరాజు" పేరుతో సాహితీ లోకానికి పరిచయం అయ్యింది.

భీమన్నగారు మనదేశానికి స్వాతంత్ర్యం రావడానికి 5 సం..లు ముందుగానే ఈ నాటకాన్ని రాసినా స్వాతంత్ర్యం వచ్చిన ఒక సంవత్సరం తరువాత కూలీ రాజుగా వచ్చి సాంఘికోద్యమ నాటకాల్లో రారాజుగా నిలబడిందీ నాటకం. ఈ నాటకం కూలి ఉద్యమ ప్రచారానికి ఎంతగానో తోడ్పడటమే కాకుండా, దళితుల ఐక్యతకు, శ్రమ జీవుల పోరాటానికి, కులాంతర వివాహాలకు బాటలు వేసింది.

పాత్రలు

ఈ నాటకం 12 అంకాలతో గద్య పద్య గేయ సమ్మిశ్రితమై ఉంది . మధుమూర్తి, పరంజ్యోతి, మిత్ర, నిష్కుల యోగి, భయంకరరావు, విశ్వనాధ రావు, ప్రేమకుమార్, దయానంద రావు, శివరామకృష్ణ బ్రహ్మం, జోగులు అనే పది పాత్రలతో నడిచే ఇతివృత్తం. ఇక ప్రధాన పాత్రల విషయానికొస్తే మధుమూర్తి పాత్రను భీమన్నగారు కాలేజి చదువును పూర్తి చేసుకొని, వచ్చిన ఉద్యోగాన్ని వదిలి

వేసి, కూలి ఉద్యమ నాయకుడిగా, త్యాగశీలిగా చిత్రించారు. పరంజ్యోతి పాత్రను రాజనీతిజ్ఞతకు, మంచితనానికీ నిదర్శనంగా, గాంధీజీ కలలు గన్న దళిత అభ్యుదయానికి ప్రతీకగా, స్వతంత్ర భారతకు తొలి అధ్యక్ష స్థానంలో హరిజన మహిళ ఎన్నుకోబడాలని హరిజన పత్రికలో గాంధీజీ చేసిన ప్రకటనకు అక్షర రూపాన్నిచ్చి ఆశయ సాధనలో అధ్యక్ష పదవిని వరించిన మొట్టమొదటి తొలి మహిళాధ్యక్షురాలు పరంజ్యోతి. పెట్టుబడి దారితనం, భూస్వామ్యం అనేవి నశించాలనీ, హెచ్చుతగ్గులు తొలగిపోతే గాని సమాజంలో సుఖశాంతులు నెలకొనవని, శ్రమకు తగిన కూలీరేట్లు కోసం, ఉద్యమించాల్సిన అవసరాన్ని గురించి ప్రచారం చేస్తూ, కూలీ ఉద్యమ రథ సారధిగా తన జీవితాన్ని సమాజం కోసం, త్యాగం చేసిన ఉదాత్తమైన పాత్ర నిష్కలయోగి.

భూస్వామి అయిన విశ్వనాధ కొడుకు ప్రేమకుమార్ .ఇతని పూర్తి పేరు ప్రేమకుమార్ సుందర్ దివాకర్ లావణ్యమూర్తి. నాటకీకరణ పరంగా ఇతడు నాయకుడని చెప్పవచ్చు. ఈ పాత్రను ఒక ఆదర్శవంతమైన, అభ్యుదయ భావాలతో కూడిన యువ చైతన్యానికి ప్రతీకగా, కులాంతర వివాహానికి ఆదర్శప్రాయుడుగా ఆచరణ శీలిగా, పేదల కష్టాలను గుర్తించి కూలీల ఉద్యమం కోసం పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా చిత్రించారు భీమన్న గారు. దయానంద పాత్రను ఆదర్శవంతమైన మంచి రైతుగా, కూలీ సమస్యల్ని సహృదయంతో అర్ధం చేసుకునే పాత్రగా చిత్రించారు. ఇక భూస్వామి విశ్వనాధ పాత్రను అభివృద్ధి నిరోధక శక్తికి ప్రతినిధిగా చిత్రించారు. గ్రామాల్లో జరుగుతున్న భూస్వాముల ఆగడాలను, వారి చేతిలో నలిగిపోతున్న కూలీలు, వారి కాముకత్వానికి బలైపుతున్న ఎందరో స్త్రీల మానప్రాణాలు, వారి దౌర్జన్యాలకు ప్రతీకగా సమాజంలో ఉన్న పెత్తందార్లకు, భూస్వామ్య వ్యవస్థకు ప్రతినిధిగాఈ పాత్రను సృష్టించారు. అలాగే మిత్ర పాత్ర కూడా ఒక ప్రత్యేకత సాధించింది. మధుమూర్తి ప్రియురాలిగా, కూలి పిల్లగా ఈ పాత్రను సృష్టించి కూలీ ఉద్యమంలో పరంజ్యోతితో పాటు మిత్ర కూడ తనదైనొక ప్రత్యేకతను సంతరించుకుంది. నిష్పక్షపాత ధోరణి నిర్ధుష్టమైన వ్యక్తిత్వం గల నాయకురాలుగా నాటక కథాగమనానికి సహకరిస్తుంది. అలాగే జోగులు పాత్ర ద్వారా పాలేరుతనంలోని అవమానాన్ని,బానిసత్వాన్ని, వారి పస్తులు, కన్నీళ్ళు చిత్రించారు. అలాగే భయంకరరావు పాత్రలో ఆనాటి భూస్వాములు ఏవిధంగా రౌడీలను పోషించేవారో, వారి చేత అనేక తప్పులు, ఏవిధమైన చెడుపనులు చేయించేవారో తెలియజేశారు. వివిధ ప్రవృత్తులు గల పాత్రలు, వారి స్వభావాలను ప్రధాన పాత్రలుగా మలిచారు భీమన్న గారు.

ఈ నాటకంలో ప్రతిబింబించే పాత్రలన్నీ మన కళ్ళ ముందు జరిగిన, జరుగుతున్న సంఘటనలకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా కనిపిస్తారు. ఇది నాటి సమస్యే కాదు. నేటికీ కొనసాగుతున్న సమస్యే.

వస్తువిశ్లేషణ

భీమన్న గారు కూలీరాజును సాంఘిక చైతన్యానికి, అభ్యుదయ భావవిస్తరణకు, కులమత నిరసనకు, ఛాందస భావవ్యతిరేకతకు, భూస్వాముల దోపిడీలపై తిరుగుబాటుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిపారు. పేరు పెట్టడంలోనే ఒక విప్లవం, ఒక అభ్యుదయం కనిపిస్తుంది.

రైతు దేశానికి వెన్నెముక. అలాంటి రైతుకు అన్ని ఎముకలే. అటువంటి కూలీల్ని విస్మరించడం, శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వకపోవడం, కూలీలు చాలీచాలని వేతనాలతో అమాయకంగా, నిరక్షరాస్యులుగా, పేదరికంలో ఉండేవారు. నాటి గ్రామీణ పేదరైతు కూలీల్లో, హరిజనుల్లో విద్యాగంధం లేకపోవడం వల్ల చైతన్యం బొత్తిగా లేదు. పొట్ట చింపినా అక్షర ముక్క రాని ప్రజలతో నాటి సంఘం ఉంది. ఈవిధంగా నాడు ఎంతోమంది హరిజనులు భూస్వాముల వద్ద పాలేరులుగా ఉండిపోయేవారు. నిష్కలయోగి వంటి ఉద్యమకారులు ప్రోత్సహించినా ముందుకు వచ్చేవారు కాదు. విశ్వనాధ రావు వంటి భూస్వాములు అభ్యుదయ నిరోధకులుగా

ఉండేవారు. పేదలు చదువుకుంటే తమను మించిపోతారని భావించేవారు. బానిసలుగా భూస్వాముల చెప్పు చేతల్లో మెలగవలసిన కూలీలు సంఘం పెట్టుకోవడం సంప్రదాయ విరుద్ధమని భావించేవారు. అందుచే కూలీ స్థాయి సమావేశాన్ని ఊర్లో జరపడానికి, భూస్వామి విశ్వనాధరావు అనుమతించక పోవడం. కూలీలకు వారి కష్టానికి తగిన డబ్బులు ఇవ్వకుండా ఎగవేయడం, అన్ని విధాలుగా అవమానించడం, చాకిరీ చేయించుకోవడమే కాకుండా కామ పిశాచిగా మారి స్త్రీల మాన ప్రాణాలు హరించడం. గిట్టుబాటు కూలీలు ఇప్పించమని అడగటం కోసం కూలీ యూనియన్ సభ్యులు వెళ్ళినప్పుడు యూనియన్ నాయకురాలు పరంజ్యోతి పట్ల పదిమందిలో అవమానంగా అశ్లీలంగా మాట్లాడటం. ఉద్యమంలో పాల్గొంటే రౌడీ భయంకర రావు చేత బెదిరించడం, దాడి చేయించడం, హత్యా ప్రయత్నాలు చేయడం, పాలేరు జోగులుపై విచక్షణా రహితంగా ప్రవర్తించి వెళ్ళగొట్టడం, కూలీ నాయకులపై దొంగ కేసులు పెట్టించడం. ఇవన్నీ బలవంతులైన భూస్వాములు చేసే దురాగతాలను భీమన్న గారు విశ్వనాధ పాత్ర ద్వారా చూపించారు.

ఈ నాటకంలో నిష్కులయోగి కూలీలు ఎప్పటికైనా సంఘటితం కావాలని, వారి హక్కుల కోసం ఉద్యమించాలని ఒక గొప్ప ప్రబోధకునిగా, ఉపన్యాసకునిగా, ప్రణాళిక ప్రకారం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాడు. భూస్వామి విశ్వనాధరావు ఎన్ని ఎత్తులు వేసినా, ఎన్ని కుట్రలు పన్నినా సాగలేదు.. మధుమూర్తి చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాన్ని వదిలి మిత్ర, పరంజ్యోతి కోరిక మేరకు, ఆశయ సాధన కోసం కూలీ ఉద్యమంలో పాల్గొనడమే కాదు. కూలీ యూనియన్‌కు ప్రెసిడెంట్‌గా ఉండి, చివరికి ఉద్యమాన్ని నడపడం, తన మిత్రుడైన ప్రేమకుమార్ తన తండ్రి ఆలోచనలకు భిన్నంగా ఒక అభ్యుదయ, ప్రగతిశీల భావవాదిగా కూలీ యూనియన్ సభకు రావడం చెప్పుకోదగ్గ విషయం. కూలీ యూనియన్ చివరకు రాజకీయ పార్టీగా మారి రాష్ట్రాలకు విస్తరించడం. కార్మికులు, కర్షకులు, కూలీలు ఒక్కటవ్వడం, ముస్లింలైన మైనార్టీ ప్రజలు కూడా వారిని ప్రోత్సహించడం వల్ల నిష్కులయోగి పిలుపు పిలుపు మేరకు అందరూ ఏకమై పోలింగ్ కేంద్రాలకు తీర్థయాత్రల తరలిరావడం, చివరకు కూలీ యూనియన్ దేశవ్యాప్తంగా అత్యధిక మోజారిటీతో ఘన విజయాన్ని సాధించడం, స్వతంత్ర భారత అధ్యక్షురాలిగా పరంజ్యోతి ఎన్నికవ్వడం చెప్పుకోదగ్గ విషయం. ఆ తర్వాత కుల మత వర్గ బేధాలకు స్వస్తి చెప్పి అగ్ర కులానికి చెందిన భూస్వామి కొడుకైన ప్రేమ కుమార్, కూలీ నాయకురాలైన పరంజ్యోతిని పెళ్ళి చేసుకొని ఆమె ఉద్యమాలకు బాసటగా నిలుస్తాడు. అలాగే ఉద్యమంలో పాల్గొన్న మధుమూర్తి , కూలీ పిల్ల మిత్రను పెళ్ళి చేసుకోవడం ఈ నాటకంలో ప్రధాన వస్తువు. అంతేకాదు ఈ నాటకంలో మద్యపాన నిషేధం కూడా ఒక ప్రత్యేక అంశంగా తీసుకోబడింది.

భరత వాక్యం

ఈ నాటకంలో రచయిత నిష్కులయోగి, పరంజ్యోతి, మిత్ర పాత్రల ద్వారా కూలీలు భూస్వామి కింద గొఱ్ఱెల లాగా బానిసలై పడి వుంటే ప్రగతి లేదని తమలో నుంచే నాయకులు పుట్టుకు వచ్చి, పేదలు రాజ్యం ఏర్పాటు చేయవలసిన సాంఘిక అవసరాన్ని, దళితుల్ని సంఘటిత పరచడం, చైతన్యవంతుల్ని చేయడం వారిలో భావ వికాసాన్ని తీసుకురావడం, తమ భవిష్యత్తుని తామే తీర్చుదిద్దుకోవాలని సూచించారు. అంతేకాకుండా స్త్రీ, దళిత స్త్రీ ప్రగతిని, రాజ్యాధికారాన్ని రచయిత కాంక్షించారని తెలుస్తుంది.

సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ, పేరుకు పోయిన అవినీతి అన్నిచోట్ల స్వైర విహారం చేస్తున్న ధనాధిపతులు ధరాధిపతులు విషపూరిత అధికార దర్పం. ప్రపంచానికి అన్నం పెడుతున్న శ్రామిక జీవులదుర్భర దారిద్ర్య అవస్థల వ్యవస్థ ఆకలి కేకలతో ఆరాట పోరాటాలు చేస్తూ నిత్యం పడి లేస్తున్న ఈ కూలీలున్న ఈ సువిశాల భారతావన్ని చూచి చలించి పోయిన భీమన్న కలం కూలీరాజు నాటక రచనకు శ్రీకారం

చుట్టింది. అందుకే ఈ నాటకంలో కూలీల కష్టాల్ని, హరిజన అభ్యుదయ భావాల్ని, కులాంతర, మతాంతర వివాహ ప్రోత్సాహ సిద్ధాంతాన్ని , స్త్రీల హక్కుల సాధనలో భాగస్వామ్యాన్ని , మద్యపాన నిషేధ వ్యసనాన్ని వస్తువుగా చేసుకుని సంఘ చైతన్యాన్ని నింపింది. అందుకే నాటికి నేటికి ఈ నాటకం అవసరమైంది. కార్మిక, కర్షక, కూలీ నాలి జనాల సమస్యలకు పరిష్కార మార్గంగా నిలిచింది.

ఈ నాటకంలో ఉన్న సమస్యలు నేటికీ ఉత్పన్న మవుతూనే ఉన్నాయి. పరిష్కార మార్గాలు ఎన్ని ఉన్నా అవి అంత ఆశాజనకంగా, ప్రయోజనకరంగా కనబడటం లేదు. పాలకుల్లోను, పాలితుల్లోను అడుగడుగునా స్వార్థం. అవినీతి రాజ్యమేలుతున్నాయి. ఎప్పుడైతే ప్రజాప్రతినిధుల్లోను, ప్రజా నాయకుల్లోను పరివర్తన వస్తుందో అప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుంది.

ఆధార గ్రంథాలు

1. కూలీరాజు - డా. బోయి భీమన్న
2. దళిత సాహిత్యం - డా. ఇ. సుదర్శన రాజు

❁❁❁

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయిభీమన్న సాహితీవ్యాసాలు – పురాణాలలో హరిజన మనీషులు – పరిశీలన

– రుద్రపాక జితేంద్ర కుమార్, తెలుగు అధ్యాపకులు, పి.బి.సిద్ధార్థ కళాశాల (స్వ.ప్ర), విజయవాడ.

అమృతతుల్యమైన భాష మన తెలుగుభాష. అనంత మైన మన తెలుగుభాషా సాహిత్యంలో అనేక సాహిత్య ప్రక్రియలతోపాటు వివిధ సాహితీ ధోరణులు కూడా కనిపిస్తాయి. సమాజంలో మార్పులను సాహిత్యం ఎప్పటి కప్పుడు తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. ఒక్కోసారి సమాజంలోసంభవించే పెనుమార్పులు చక్కని సాహిత్య సృష్టికి కారణమౌతాయి. ఈ విధంగా సామాజికమార్పును కోరుతూ వచ్చినటువంటి సాహితీ ధోరణులలో పరిశీలించ వలసిన సాహిత్యం దళితసాహిత్యం.మన తెలుగు సాహిత్యంలో పద్యకవిగా, గేయకవిగా, వచనకవిగా, నాటకకర్తగా అద్భుత సాహిత్యప్రతిభను కనపరించినటు వంటి బోయి భీమన్న వారి సాహిత్య సంబంధమైన వ్యాసాల ఆధారంగా "పురాణలలో హరిజన మనీషులు - పరిశీలన" అనే అంశంపై ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సు నందు పరిశోధనాపత్రం సమర్పిస్తున్నాను. ఈ పరిశోధనాపత్రంలో శివుడు, పుల్కసుడు,గురుమనీషి, వీరబహుడు, వాల్మీకి.....పవిత్ర మూర్తుల గురించి చర్చించటం జరిగింది.

శివుడు – పరిశీలన

త్రిమూర్తులలో లయకారుడు. ఆది భిక్షువు. కాటి కాపరి. పూర్వకాలంలో కాటికాపరులుగా హరిజనులు ఉండేవారు. అందువల్ల హరిజన పురాణపురుషుల్లో శివుడుని చేర్చవచ్చు. శివుడు నటరాజు. ఆయనకు ప్రియమైన వాద్యాలు బుడబుక్క (ఢమరు), కొమ్ముబూర. ఇవి రెండూ హరిజనులు వాడేవే.అచ్చంగా శివుని వేషంతో బుడబుక్క వాయించుకుంటూ, గారడీలు చేసుకుంటూ కాటికాపరులు మాలమాదిగ పేటల్లో తిరుగుతూ వుండడం ఒక నిత్య దృశ్యం.

శివతాండవం యొక్క పరిమిత సూక్ష్మరూపమే చిందు. తాండవ సూక్ష్మమైన ఈ చిందు హరిజనులకు సాంప్రదాయకంగా వస్తున్న క్రీడ. కోపం వచ్చినప్పుడు ప్రతివాళ్ళూ చిందులు త్రొక్కుతారు. హరిజనులు మాత్రం కళగా ఆరాధిస్తారు.శివుడు ఏపని చేసిన విశ్వశ్రేయస్సు కోసమే చేశాడు. పురాణ సంఘటనలన్నీ అదే చెప్తున్నాయి. ఆకాశగంగను భూమిమీదకు దింపడం సామాన్య కార్యమా? లోకానికి ఒక నీతిని బోధించవలసి వచ్చి నప్పుడు శివుడు తప్పకుండా చండాలుడుగా మారేవాడు. లేదా చండాలుడైనా అయ్యేవాడు, చెంచు అయినా అయ్యేవాడు.

శివుడు వేషమే ఒక అద్భుతం. తలపై చంద్రుడు, మెడపై పాములు, తలపై మరోప్రక్క గంగ, నొసట అగ్ని, మొలకు చర్మవస్త్రం, చేతిలో బుడబుక్క, కాళ్ళకు గజ్జలు ,ప్రక్క అర్ధాంగి గిరిజ, వాహనం ఎద్దు. కూమరులలో వినాయకుడి వాహనం ఎలుక, షణ్ముఖుడి వాహనం నెమలి. ఈ కుమారులు ఇద్దరూ దత్తపుత్రులే. అది దంపతులైన శివగిరిజలకు లోకమంతా సంతానమే. అటువంటి శివుడు, గిరిజలు ఇద్దరూ వేషభాషలలోను, వృత్తి విహారాలలోను హరిజనులే. ఈ విధంగా బోయి భీమన్న గారి వ్యాసం ద్వారా పరమ శివుడు హరిజన పురాణపురుషుడుగా మనకు దర్శనమిస్తాడు.

పుల్కసుడు- పరిశీలన

రంతిదేవుడనే రాజు ఒకప్పుడు యజ్ఞం చేస్తూ ఆ యజ్ఞంలో చర్మం తీసివేసిన రెండు వేలగోవులను ప్రతి రోజూ సమర్పిస్తూ అతిథులకు సంతర్పణ చేసేవాడు. ఆ సమయంలో గుట్టలుగా పడేవేసిన గోవుల చర్మాలనుండి

ఊరిన నీరు ఒక నదిగా 'చర్మణ్వతి'గా ఏర్పడింది. ఏ యజ్ఞమైన పూర్తిచేసిన తరువాత ఆ యజమాని తన దగ్గరున్న సమస్తసంపదను దానంచెయ్యాలనే నియమాన్ని బట్టి రంతిదేవుడు భోజనానికి ఉపక్రమించాడు.సమస్తం దానంచేసిన తరువాత రంతిదేవుడు భోజనంగా కేవలం మంచినీళ్ళు మాత్రమే తాగాలనుకుంటుండగా అక్కడకి పుల్కసుడు అనే చండాలుడు (హరిజనుడు) తనకు ఏమైనా దానం చేయమనగా త్రాగుతున్న మంచినీటిని కూడా పుల్కసునికి ఇచ్చేశాడు. బోయి భీమన్న గారి ఈ సాహితీవ్యాసం ద్వారా ఒక హరిజనుడు అతి పవిత్రమైన యజ్ఞవాటికలో రాజు భోజనం చేసే అంతఃపురందాకా ఎలా రాగలిగాడూ? రాగలిగాడు సరే.....అలా వచ్చి నందుకు రాజు విసుక్కోలేదు, కోపపడనూలేదు. పైగా మంచినీరు ఇవ్వగా హరిజనుడైన పుల్కసుడు త్రాగేసి వెళ్ళిపోయాడు.అంటే అనాటి కాలంలో వర్ణభేదమే కాని, అంటరానితనం లేదన్న విషయం మనకు తెలియ వస్తున్నది.

గురుమనీషి - పరిశీలన

హిందూమత పునరుద్ధరణ కోసం చిన్నప్పుడే సన్య సించిన మహాత్ముడు, వేదాంగాలన్నీ క్షుణ్ణంగా పరిశీ లించినవాడు పండితుడు, నైష్ఠికుడు, కులాచార బద్ధుడు అయిన శంకరాచార్యుడు కాశీపట్టణాన గంగానది మార్గంలో వెళ్ళుతుండగ ఒక చండాలుడు ఎదురుగా నడచివచ్చాడు. అతడిని చూడగనే అసహ్యంతో హే చండాలాధమ ! ప్రక్కకు తొలగమనగా... ఆ చండాలుడు శంకరాచార్యునితో 'నీవు తొలగిపొమ్మంటున్నది... శరీరాన్నా? ఆత్మనా? మన ఇద్దరి శరీరాలు అన్నరసం నుంచి పుట్టినవే - అన్నమయ కోశాలే - రెండిటికీ ప్రస్తుతం భేదం లేదు.ఒకదానినుంచి మరొకదానిని పొమ్మనడంలో అర్థం లేదు. ఇంకా ఆత్మనుంచి ఆత్మను తొలగి పొమ్మంటున్నావా ? మన ఇద్దరి ఆత్మలు ఒకే పరమాత్మ కాదా?

'ఏకో దేవః నర్వ భూతేషు' అనే నత్యం నీ అవగాహనకు ఇంకా అందలేదా ? ప్రజ్ఞానంతో చూడు..... ఆనంద బ్రహ్మలో ఎవడు బ్రాహ్మణుడు, ఎవడు చండాలుడు (హరిజనుడు). ఇలా చండాలుడు మాట్లాడిన మాటలకు శంకరాచార్యుడు తన కమండలువులోని గంగాజలం చండాలుని (హరిజనుడి) కాళ్ళపై వంచేసి సాష్టాంగ నమస్కారం చేశాడు. బోయి భీమన్న గారి ఈ సాహితీ వ్యాసం ద్వారా హైందవ మతోద్ధరణ విజయ వంతం కావాలంటే కులభేదాలను తప్పకుండా నిర్మూ లించాలన్న సత్యాన్ని శంకరాచార్యులు ఒక చండాలుని ద్వారా అనగా గురుబోధ చేసిన గురు మనీషి(హరిజనుడు) ద్వారా గ్రహించటాన్ని మనం గమనించవచ్చు. ఆ గురు మనీషి ఏ దైవమో తెలియదుకాని చండాలరూపాన్ని ధరించిన పూర్ణగురుస్వరూపం.

వీరబాహుడు - పరిశీలన

హరిశ్చంద్రుడు రాజ్యాన్ని (అయెధ్య)పరిపాలిస్తున్న సమయంలో విశ్వామిత్ర మహర్షి హరిశ్చంద్రుని పరీక్షించాలని అనుకొని ఒక రోజున తాను చేయబోయే యజ్ఞంకు విరాళమడిగాడు.

హరిశ్చంద్రుడు ఎంత కావలిస్తే అంత తీసుకు వెళ్ళమన్నాడు. తరువాత తీసుకుంటానన్నాడు విశ్వా మిత్రుడు.

ఒకనాడు హరిశ్చంద్రుడు పంటలను నాశనంచేస్తున్న క్రూరజంతువులను వేటాడుతుండగ,ఇద్దరు మాతంగ కన్యలు వచ్చి నాట్యంచేసి బహుమతిగా తమనుపెళ్ళి చేసుకోమన్నారు.అందుకు హరిశ్చంద్రుడు నిరాకరించగా, వాళ్ళు సమీపంలోనే ఉన్న విశ్వామిత్రుడికి తెలియజేశాడు. తన రాజ్యమైన ఇస్తాను కానీ ఆ కన్యలను వివాహమాడ లేనని హరిశ్చంద్రుడు చెప్పినమాటకు అయితే రాజ్యమేఇవ్వమన్నాడు విశ్వామిత్రుడు.

తన రాజ్యమంతా మునికి ధారబోసి,భార్య చంద్రమతి తోను , కొడకు లోహితుడితోను అయోధ్యను విడిచి పోతున్న హరిశ్చంద్రుణ్ణి బాకీ గురించి అడిగాడు విశ్వామిత్రుడు.ఏం బాకీ ?అదే, తాను తరువాత తీసుకు వెళతానన్న ధనం !ఎంత? పదికోట్ల బంగారు నాణెములు...!

బాకీ తీర్చడానికి నెలరోజుల గడువు అడిగిన హరిశ్చంద్రుడు కాశీపట్టణంలో కాలకౌశకుడనే బ్రాహ్మణునికి తన భార్యాబిడ్డలను అమ్మగా వచ్చిన ధనం ముని బాకీ తీర్చటానికి చాలకపోవడంతో తనను తానే అమ్మకానికి పెట్టుకున్నాడు. అటుగా వస్తున్న వీర బాహుడనే మాలవాడు హరిశ్చంద్ర చక్రవర్తిని చూచి జాలిపడి విశ్వామిత్రుని మాటతో కొనుగోలు చేశాడు. వీరబాహుడు ఎంతో జాలిపడి కాటికాపరిగా హరిశ్చంద్రునికి ఉద్యోగం ఇచ్చాడు. ఈ విధంగా హరిశ్చంద్రుడు కాటికావరి వృత్తితో వీరబాహుని (హరిజనుడు) సాహచర్యంలో జీవితాన్ని కొనసాగించెను. బోయి భీమన్న గారి ఈసాహతీ వ్యాసంలో కాశీపట్టణంలో వీరబాహుడనే చండాలుడు స్వేచ్ఛగా సంచరించటం, అధిక ధనం ఇచ్చి హరిశ్చంద్రుని కొనుగోలు చేయటం గమనిస్తే అనాటి కాలంలో వర్ణభేదాలు లేవని, హరిజనులలో కూడా గొప్ప సంపన్నులు ఉన్నారని వీరబాహుడి(హరిజనుడు)ద్వారా మనకు తెలియవస్తున్నది.

వాల్మీకి - పరిశీలన

తన కాలంలోని ఒక మహావీరుడు, ఉత్తమ పురుషుడు, ఆదర్శచక్రవర్తి అయిన అయోధ్య రాముణ్ణి కావ్యనాయకుడుగా గ్రహించి రామాయణమహాకావ్యాన్ని నిర్మించినవాడు వాల్మీకి. రసజగత్తుకే స్రష్ట అయ్యాడు. తమసా నదీతీరంలోని ఆశ్రమం వాల్మీకిది. పురాణాల ప్రకారం వాల్మీకి బ్రహ్మపుత్రుడు. తల్లీ, తండ్రి తెలియని వాళ్ళను ఆ కాలంలో బ్రహ్మపుత్రులు అనేవారు. అయితే వాల్మీకి నిజంగానే బ్రహ్మపుత్రుడు. స్వర్గంలో పుట్టినా, పుట్టుకతోనే ఆకలి బాధపట్టుకొన్నది అతణ్ణి. ఆకలి తీర్చలేని తండ్రి అగ్రహించి చండాలుడవు కమ్మని శపించగా, దళితుడైపోయాడు.

దళితుడైన వాల్మీకి హరిజనవాడ నుంచి అరణ్యాలకు పారిపోయి, అక్కడే ఒక గిరిజనకన్యను పెళ్ళాడి కాపురం పెట్టాడు. వేటతోపాటు దారిదోపిడీ కూడా వృత్తిగా మారింది, ఎందుకంటే సంతానం పెరిగింది. ఒక రోజున దోపిడి చేస్తూ అరణ్యానికి వచ్చిన సప్తఋషులను బాధించగా, సప్తఋషులు నీవు చేస్తున్న పాపాన్ని, నీ సంపాదనలాగానే నీ భార్యాబిడ్డలు పంచుకుంటారా ?అని ప్రశ్నించగా, భార్యాబిడ్డల నుండి స్వార్థపూరిత సమాధానం గమనించిన హరిజనుడు సప్తఋషుల చేత 'రా మ' అనే మంత్రాన్ని గ్రహించి చాలాకాలం తనని తానే మరిచిపోయి తనపై పుట్ట(వల్మీకము) పోయగా తిరిగి ఆ పుట్టనుండి గొప్పతపస్విగా బయటకువచ్చాడు హరిజనుడైన వాల్మీకి.

బోయిభీమన్నగారి ఈ సాహితీవ్యానం ద్వారా స్వయంగా బ్రహ్మపుత్రుడైన వాల్మీకి తన తండ్రి శాపంతో హరిజనుడిగా అవతరించటం ,అవతారమూర్తి అయిన శ్రీరామచంద్రుని గూర్చి అద్భుతకావ్యం వ్రాయటం మనం గమనించదగిన సత్యం.

ముగింపు

భారతీయ సంస్కృతిని ప్రకాశింప చేసే పురాణాలు మనం నిత్యం స్మరించదగినవి. అటువంటి పురాణాలలో పరిశోధన అంశంగా స్వీకరించటానికి కావలసినంత ముడి సరుకు ఉన్నది.అయితే ఈ పురాణాలను ఆధారంగా చేసుకొని విభిన్నమైన పరిశోధనలు చేయవచ్చు.ఆ మార్గం లోనే బోయి భీమన్న గారి సమగ్ర సాహిత్య దృష్టిని ఆధారంగా చేసుకొని విభిన్నమైనఅంశంగా ప్రకాశించేలా 'పురాణాలలో హరిజన మనీషులు - పరిశీలన' అనే పరిశోధనాపత్రం సమర్పణ చేయడమైనది.

ఆధార గ్రంథాలు

1. తెలుగు సాహిత్యచరిత్ర - డా॥జి.నాగయ్య.
2. బోయిభీమన్న సమగ్ర సాహిత్యం / ప్రధానసంపాదకులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య. (సంపుటి - 4 , వచన గ్రంథాలు భాగం - 2)

పాలేరు సాంఘిక నాటకం - పాత్రల వైశిష్ట్యం

- డా॥. గుమ్మడి రాజలక్ష్మి, ఐ.ఐ.టి., చెన్నై

సుప్రసిద్ధ కవి, రచయిత బోయి భీమన్న రచించిన సాంఘిక నాటకాలలో "పాలేరు" ఒకటి. 1940లో బోయి భీమన్న రచించిన ఈ పాలేరు నాటకం వ్యవసాయ కూలీ వర్గాలలో ఒక గొప్ప విప్లవ చరిత్రను సృష్టించింది. దీని ప్రథమ ముద్రణ బెజవాడలోని బొందలపాటి శకుంతలా దేవి, శివరామకృష్ణగార్ల దేశికవితామండలి నుండి వెలువడింది, ఆ తర్వాత అనేక మార్లు పునర్ముద్రణలు పొందింది, బోయి భీమన్న "పాలేరు" నాటకాన్ని తన మిత్రుడు, స్థిత ప్రజ్ఞ అయిన కోనాడ సూర్యప్రకాశరావు గారికి అంకిత మిచ్చారు.

నాటి సమాజంలో దళిత వర్గానికి చెందిన పాలేర్ల జీవితం, జీవనవిధానమే కథగా సాగుతుంది పాలేరు నాటకం. 23 రంగాలు కలిగిన ఈ నాటకంలో భూస్వాముల కామందుల దురాక్రమణలు పాలేర్లపై వారి అరాచకాలు, వ్యవసాయ ఆడకూలీలపై లైంగిక వేధింపులు వివరించారు భీమన్న. దళితుల అవిద్య, కులభేదం ఇత్యాది అంశాల నేపథ్యంగా నాటకం ఇతివృత్తం వుంటుంది. సమాజంలో మార్పుని ఆశించి బోయి భీమన్న "పాలేరు" నాటకం రాసారని చెప్పొచ్చు. పాలేరు నాటకంలో వెంకన్న, కుబేరరావు, సుందరం, ఉపకారి, వీరేశ, పుల్లయ్య, రామం, వనబాల, సీత, ప్రధాన పాత్రలయితే దొంగరామన్న, రౌడీరంగడు, బంట్రోతు, కొందరు రైతులు కూలీలు చిన్న చిన్న పాత్రలతో రసవత్తరంగా వుంటుంది. ఈ పాత్రలన్నీ కల్పితాలు కావు నాటి సమాజంలోని వాస్తవ సంఘటనలతో యదార్థ పాత్రల ఆధారంగా బోయి భీమన్న పాలేరు నటకాన్ని మలిచారు.

ఇతివృత్తం

గోదావరీ తీరంలో రైతువాడ అనే గ్రామంలో కుబేరయ్య అనే సవర్ణ భూస్వామి దగ్గర పుల్లయ్య, అతని కొడుకు వెంకన్న మరియు వీరేశు అని మరొకరు పాలేరుగా పనిచేస్తూంటారు. వీరు అవర్ణులు. వెంకన్నకు బడికి పోవాలని, చదువుకోవాలని కోరిక, అయితే పుల్లయ్య, కుబేరయ్య అతని చదువుని వ్యతిరేకించి అనేక కష్టాలు పెడుతారు. అవూరి బడి పంతులు ఉపకారి, విద్యార్థిని వనబాల వెంకన్నను చదవాటానికి ప్రోత్సాహిస్తారు. వనబాల, ఆమె అన్న సుందరం సవర్ణులూ, ఉన్నత సంపన్న కుటుంబానికి చెందిన వారు, సంస్కార వంతులు, అలాగే సుందరం మిత్రుడు రామం కూడా. భూస్వామి, పుల్లయ్య పెట్టే హింసలను తట్టుకోలేక వెంకన్న ఉపకారి సహాయంతో కాకినాడుకు పారిపోయి అక్కడ సుందరం, రామం సహాయంతో అనాధ శరణాలయంలో వుండి వెంకటేశ్వర రావుగా ప్రైవేటు పరీక్షలు రాస్తాడు, బి.ఏ. చదివి ఆ తర్వాత డిప్యూటీ కలెక్టరవుతాడు. ఈ మధ్యలో వనబాల తన కాసుల పేరు ఉపకారికివ్వడం, అది దొంగరామన్న దొంగిలించడం, వీరేశు సీతపై విసిరి పారిపోవడం, ఉపకారిని వీరేశుని పోలీసులు ఖైదు చేయడం జరుగుతుంది. డిప్యూటీ కలెక్టరు అయిన వెంకటేశ్వర రావు వారిని జైలు నుండి విడిపించడం, వనబాలను పెళ్ళి చేసుకోవడంతో ఈ నాటకం పూర్తవుతుంది.

పాత్రలు

వెంకన్న (వెంకటేశ్వరరావు)

బోయి భీమన్న పాలేరు నాటకంలో ప్రధాన పాత్ర వెంకన్న. ఇతడే కథానాయకుడు, పాలేరు. చదువుకుని ఎదగాలనే ఆశ కలవాడు. కాని తండ్రి పుల్లయ్య, కామందు కుబేరరావు అవరోధం కలిగిస్తారు. ఊళ్ళో కామందు చేత దెబ్బలు, ఇంటిలో తండ్రి చేత తన్నులుకి

వగచి వెంకన్న తనలోతాను విలపిస్తాడు. "ఓ పాలేరా! నీ జీవతం ఎంత ద:ఖకరం - అయ్యో పాలేరుకు చదువు పనికి రాదా? చదువు స్వతంత్ర భావాల్ని కలిగిస్తుందనా? అదిగో ఆ బడికి పోతున్న పిల్లలు ఆహా ఎంత కులాసాగా పోతున్నారు. బడికి వాళ్ళ యీడువాణ్ణి కానా నేను! వాళ్ళు పొందే అభివృద్ధికి నోచుకోలేదా నేను? అయ్యో తండ్రీ! ఈ రొంపిలో నన్ను తొక్కేశావే అని చింతించి ఆత్మహత్యాయత్నం చేయబోతాడు. పాలేరు వెంకన్న నిస్సహాయత, నీరసం, దీనమైన పరిస్థిని కళ్ళకు కట్టినట్లు భీమన్న చిత్రించారు. కామందు కొట్టిన చావు దెబ్బలకి జ్వరం వస్తే వెంకన్న మందుతాగనని పట్టుబడతాడు. అప్పుడు వనబాలతో "నీవు శ్రీ మంతురాలవు సాహసం చేసి స్వతంత్రంగా మెలగగలవు, నేను పాలేర్ని స్వతంత్రం లేదు, సాహసం చేయలేను చేసి నిలుపుకోలేను. అందుకే నీ కోరిక సఫలమౌతుంది. నీ జీవితం వికసిస్తుంది. నా కోరిక నాతోనే తుప్పు పట్టి నశించి పోతుంది" అని అంటాడు. నిరుపేద దౌర్భాగ్యాన్ని, నైరాశ్యతని, అస్వతంత్రాన్ని భీమన్న వ్యక్తీకరించారు. ''పాలేరు వెంకడెక్కడ? పట్ట పరీక్ష లెక్కడ? ఆవూరి పాకలెక్కడ? ఈ సుందర రాజభవనాలెక్కడ! ఓహో నక్కకూ నాగలోకానికి ఎంత దగ్గర? లక్షాధికార బిడ్డలతో ఒరే ఒరే అనుకుంటూ ఈ కాలేజీలో, పట్టణవీధుల్లో, విహరిస్తున్న నా అదృష్టానికి కారకులు ప్రోత్సాహకులు ఆపంతులు గారు ఆ వనబాల చేతులుమోడ్చి ఆ పాలేరుతనం కుళ్ళుతో నుంచి నన్ను ఉద్ధరించి, అభ్యుదయగతి చూపిన ఆయిద్ధరికీ నేను జీవిత కాలమంతా కృతజ్ఞుణ్ణయి వుంటాను." అని మనసులో అనుకుంటాడు. వెంకన్న కృతజ్ఞతా భావాన్ని, సంస్కార, చైతన్యాన్ని భీమన్న ఆవిష్కరించిన వైనం ప్రశంసీనీయంగా వుంటుంది. పాలేరు అనంతరం కాలేజీ చదువు చివరికి డిప్యూటీ కలెక్టరు హోదా పొందుతాడు. కుబేర రావు చేత క్షమాపణలు చెప్పించి ఉపకారిని, వీరేశుని ఖైదు నుండి విడిపిస్తాడు. అధికారిగా ఆవూరిలో సామాజిక సేవలను చేస్తాడు. విద్యతో విజ్ఞానవంతుడైన ఒక అవర్ణుని పాలేరు పాత్రలో పోతపోసి చెక్కారు బోయి భీమన్న.

కుబేర్రావు

పాలేరు నాటకంలో ప్రతినాయకుడు, అతడే భూస్వామి, కామందు, దళితులను పీడించేవాడు, దళితుల ఎదుగుదలను సహించలేని దుర్మార్గుడు, పశువులను కాస్తూ పాటలు పాడే పాలేరు వెంకన్నను ఎప్పుడూ కొడుతూ వండేవాడు "పాలేరు పీనుగకి పాట లెందు కంటూ పాడతాడని ఊరంతా గోలే. వీణ్ణి పాలేరుగా పెట్టుకుంట పాటలు పాడటానికా? ఇంతకీ ఆపంతులు గాణ్ణనాలి, వాడు ఈ వూరోచ్చినప్పట్నుంచి ఇదేగోల. పాటలు పుస్తకాలు చదువులు, ఎంతపంతులైతే మాత్రం చదువో అని ఏడవాలా? తక్కిన పంతుళ్ళలా జీతాలు తీసుకుంటూ సొంత పనులు చూసుకోవచ్చుగా? వీడేదో ఉద్ధరిస్తాడట. చూస్తా అంటాడు కుబేర్రావు కామందు కుబేరాయ్యకు దళితులంటే మంట వారి ఆటపాటలంటే మరీ మంట, కామందులకి వుండే అసూయాద్వేషాలను కుబేర్రావు పాత్రతో భీమన్న చక్కగా వ్యక్తీకరించారు. వెంకన్న రాత్రి బడి వెళ్తున్నాడని వీరేశు చాడీలు చెప్పినపుడు కుబేరయ్య "పేడ పిసుక్కునే వెధవలకి చదువులూ సంగీతాలూనా? అని పుల్లయ్యను పిలిపిస్తాడు. పుల్లయ్యతో కుబేరయ్య ఇలా అంటాడు "ఓరి దున్నపోతు కొడుకా! మీ యింటా వంటా ఎప్పుడైనా చదువుందిరా? పాలేరుతనం చేసుక బ్రతికే తొత్తు కొడుక్కి చదువేమిటిరా చదువు" పనిముట్టుకోవడం లేదు అస్తమానం పాటలూ పుస్తకాలూ పాలేరు తనం మానిపించెయ్ చదివించి కలగటేరు పని చేయించుపో? అనే సంభాషణలో నాటి కామందులకున్న కడుపు మంట, దళితులను ఎదగనివ్వకుండా తమ క్రిందే పనిచేయాలనే దురాలోచన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి, కుబేరయ్యకు తన దగ్గర పనిచేస్తున్న ఆడకూలీ సీతని పాడు చేయాలని ప్రయత్నం చేస్తుంటాడు, "నువ్వు పాలేరు దానవు నేను కామందును నేను చెప్పింది నువ్వు చెయ్యాలి. నేను

కామందుని. కామందంటే సగం మొగుడు అని సీతను కుబేరయ్య బెదిరిస్తాడు, చీర, రవిక ఇస్తానని, తన షాపుకిరమ్మని అంటాడు, సీతను చెరచాలని ప్రయత్నం చేస్తాడు, ఈ విధంగా నాటి కామందులు దళిత స్త్రీలపై చేసే లైంగిక వేధింపులు, వారి తుచ్ఛమైన ప్రవర్తనని భీమన్న యదార్ధంగా చిత్రించారు.

ఉపకారి

పాలేరు నాటకంలో మరొక ముఖ్యమైన పాత్ర ఉపకారి, పల్లెటూరి బడిపంతులు, సంస్కారి, కులమత భేదాలు లేకుండా అందరూ చదివి విజ్ఞానం ఆర్జించాలను కుంటున్న సహృదయుడు. బానిసత్వానికి అవిద్యయే కారణమని, దేశం స్వేచ్ఛా, స్వాతంత్రాలతో సుఖంగా వుండాలంటే ప్రజలు విజ్ఞానవంతులుగా వుండాలని, అందుకు గాను చదువు అవసరమని పిల్లల్ని బడికి పంపమని ప్రబోధిస్తాడు. తమకన్న బిడ్డలను తామే పాలేరుతనానికి పంపించే కూలీలను చూసి పేద రైతుల్లోను, కూలీల్లోనూ విద్యా చైతన్యమే లేదని బాధపడ తాడు ఉపకారి. పెద్దవాళ్ళయిన పాలేళ్ళకీ, రైతులకీ చదువు చెప్పడానికి రాత్రి బడి ఏర్పాటు చేస్తాడు. వెంకన్నకు చదువుకోవటానికి పుస్తకాలు ఇస్తాడు. వెంకన్నను బడికి రావటానికి ప్రయత్నించమని ఎంతో ప్రోత్సహిస్తాడు, పుల్లయ్యతో వెంకన్న చదువు విషయమై "ఆ పిల్లవాడి వయస్సెంత? వాడు తెచ్చే జీతమెంత? పసిపిల్లల కష్టం తిని బ్రతికే తల్లిదండ్రులు మనుష్యుల్లో లెక్కేనా? నీవు పాలేరువు నీ బిడ్డను కూడా పాలేర్ని చేస్తావా? అంతకంటే ముందుకు పోనివ్వరా పాలేరు తరతరాలకు పాలేరే అన్నమాట? అని ఉపకారి ఎంతో సర్దిచెప్తాడు. అయినా మాటవినని పుల్లయ్య, కామందు వెంకన్నను బ్రతక నివ్వరని కాకినాడ అనాధశరణాలయంలో చదువుకోడానికి పంపేస్తాడు. వెంకన్న చదివి డిప్యూటి కలెక్టరు అవ్వడానికి కారకుడవుతాడు. వెంకన్న ఉపకారితో తనతోపాటు ఉ పకారిని ఉండిపొమ్మని కోరినప్పుడు ఉపకారి ఇలా అంటాడు. "అది స్వార్ధం అవుతుంది నీ వంటి కలెక్టర్లను ఎంతమందిని తయారు చెయ్యాలో నేను ఈ దళిత సంఘం నుండి" అంటాడు. ఉపకారి నిస్వార్ధత, దళితులను విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా చేయాలనే ఉన్నత ఆశయం వ్యక్తీకరించడం జరిగింది. ఆదర్శవంతమైన ఉత్తమ ఉపాధ్యాయ పాత్రను భీమన్న తీర్చారు.

సుందరం

పాత్ర సంస్కారానికి ప్రతీక, కాలేజీ విద్యార్థి సవర్ణుడు. సంపన్న కుటుంబం నుంచి వచ్చినవాడు ఒకసారి ఉప కారితో సుందరం "నిర్బంధ ప్రాధమిక విద్య అమలు జరపకుండా పేదల్ని మనం, బడి ఆకర్షించలేం - ప్రజల అలసత్వం కూడా కారణమే, నిరంతర ప్రబోధమే దాని మందు అని తన భావాన్ని తెలుపుతాడు, పట్నానికి బయలు దేరి దారితప్పి ఆత్మహత్య చేసుకోబోతున్న వెంకన్నను కాపాడి అనాధశరణాలయానికి తీసుకొస్తాడు. వెంకన్న చేత యింటి దగ్గరే ట్యూషను చెప్పించి ప్రైవేటుగా పరీక్షలు రాయిస్తాడు. బ్రహ్మసమాజంలో అందరూ మానవులే అందరూ సోదరులే, పవిత్ర వర్తనుడు ప్రజ్ఞాశాలి అయిన మానవుడు ఏకులమైనా ఒక్కటే నాకు" అనే భావాలు కల యువకుడు, అందుకే తన చెల్లెలు వనబాలను అవర్ణుడైన వెంకన్నకు ఇచ్చి పెళ్ళి చేస్తాడు. సుందరం పాత్రను విద్య సంస్కారం చైతన్యవంతమైన విశిష్టపాత్రగా బోయి భీమన్న రూపుదిద్దారు.

రామం

బోయి భీమన్న సృజించిన 'రామం' పాత్ర సభ్యత సంస్కారం మూర్తీభవించినది, కాకినాడ అనాధ శరణా లయం మేనేజరు గారి కుమారుడు, సుందరం మిత్రుడు, దళితుడైన వెంకన్నను ప్రోత్సహించిన వారిలో ఒకడు. వెంకన్నకు "సర్వీసర్ కమీషన్ ప్రకటన వచ్చిందని, డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఒక గ్రాడ్యుయేటు, షెడ్యూలు తరగతికి చెందినవాడు కావాలని ప్రకటటించాడురా? నీవు అప్లై చెయ్యి" అని ప్రోత్సహిస్తాడు సంఘసేవ చేసు కుంటానని చెప్పిన వెంకన్నతో ఇలా అంటాడు నీవు ఒక

సంఘ సేవకుడిగా కంటే అధికారిగా ఎక్కువ కృషి చేయగలవు కదా! అధికారంతో కళ్ళూ, చెవులూ, హృదయమూ కూడ మూసుకూ పోయే వాళ్ళు కొందరుంటారు. నీవలాంటి వాడివి కావు కాలేవు. పైగా పీడకులకు వివేకమూ, పీడితులకు చైతన్యము కలిగించాలంగే నీ వంటి వాళ్ళు అధికార్లకు తప్పదు అప్లయి చెయ్యి" అని వెంకన్నకు ప్రోద్బలం ఇస్తాడు. రామం సలహామేరకు వెంకన్న డివ్యూటీ కలెక్టరు అవుతాడు. రామం సంఘసంస్కర్త, దళిత, పీడిత ప్రజలకు ఆశ్రయాన్ని కల్పించే గొప్ప పాత్రగా, ఆదర్శప్రాయంగా బోయి భీమన్న మలచిన వైఖరి అద్భుతం.

వనబాల

వెంకన్న, వనబాల బాల్యమిత్రులు. వనబాల కరునామయి. వెంకన్న పస్తులున్నప్పుడు తన సంచిలోని ఆహారాన్ని యిచ్చి ఆకలి తీరుస్తుంది. కామందు దెబ్బలకు తాళలేక చనిపోవాలని మందుతాగకుండా వున్న వెంకన్నను స్వతంత్రుడిగా బ్రతకాలని హితబోధ చేసి మందుని త్రాగించి ప్రాణాలను కాపాడుతుంది. వెంకన్న పై చదువులకు గాను ఖర్చుపెట్టమని ఉపకారి చేతికి తన కాసుల పేరును ఇస్తుంది. చిన్నప్పటి నుంచి ఎరిగివున్న మిత్రుడ్ని విడనాడి - పరిచయం లేని పరాయివాణ్ణి పెండ్లాడడం ఎంత ఘోరం - ఎంత దు:ఖకరం అని విలపిస్తుంది చివరికి వెంకన్ననే పెండ్లాడుతుంది. వనబాల పాత్ర ఆత్మీయతగా, నెచ్చెలిగా, అన్నపూర్ణగా, ఆదర్శమహిళగా బోయి భీమన్న కలంలో విశిష్టంగా రూపుదిద్దుకుంది.

పుల్లయ్య

వెంకన్న తండ్రి కుబేరరావు దగ్గర పెద్దపాలేరు, అమాయకత్వం మూర్ఖత్వం కలబోసుకున్న అవివేకి పుల్లయ్య, కామందు కుబేరయ్య "మీలో చదువుకోవడం పాపంకదట్రా" అన్నప్పుడు " బోల్డంత పాపం బాబయ్య మహాగోర పాపం కాదండీ! అని పుల్లయ్య అంటాడు. చదువంటే పాపం అనుకునే మూర్ఖుడు పుల్లయ్య, వెంకన్నను చదివించమని ఉపకారి బ్రతిమాలినప్పుడు "చదువు మా వంశంలో లేదు చదువు మాకు అచ్చిరాదని మా కామందుగారు చెప్పారు అచ్చరాలా అంటే అ, ఆలు దిద్దమోయి మాతాత కాలిరిగి చచ్చాడంట, మాబాబు రాగం తియ్యమోతే పళ్ళురాలి చచ్చాడంట" ససేమిరా వెంకన్నను బడికి పంపనంటాడు. చివరికి "కామందే లోకం అనుకున్నాను. కామందు కోసమే నా జీవితం అంతా ఖర్చుపెట్టాను. కుటుంబాన్ని సర్వనాశనం చేసుకున్నాను" అని పుల్లయ్య పశ్చాత్తపం పడతాడు. విద్య, విజ్ఞానం లేకపోవడం వల్ల కామందే జీవితంగా గడిపిన అవివేకం, మూర్ఖత్వం, మూఢనమ్మకం కలిగిన నాటి సామాజిక పాత్రను వాస్తవంగా భీమన్న సృజించారు. వీరేశు- తోటి పాలేరు, వెంకన్న పినతండ్రి, చదువంటే నచ్చని మరోపాత్ర వీరేశు, నేను మొదట్లో మాబాబు బాధ పడలేక బళ్ళోకెళ్ళానండీ ఆ పంతులు రోజూ పట్టుకు తన్నేవోడు బళ్ళోకెళ్ళకపోతే మాబాబు తన్నేవోడండి, ఎందుకొచ్చిందిరా దిక్కుమాలిన చదువని పారిపోయి పాలేరుతనానికి కుదిరానండి అని పంతులు గారితో వెటకారంగా చెప్తాడు. చదువు ఎక్కని వీరేశు లాంటి మూర్ఖులు వుంటారనే ఈ పాత్ర ద్వారా తెలియ చేసారు భీమన్న.

సీతమ్మ

వెంకన్న పిన్ని. వెంకన్న తల్లిపోయినప్పటి నుండి వెంకన్నను పెంచేది ఆవిడే సీత, కామందు సీత మీద మోజుపడి చీరారైక ఇస్తానని, పదిరూపాయలు తీసుకోమని ఆశలు చూపుతాడు, " నేను బోగందాన్నికాను, ఈ పాటికి దయచెయ్యండి, అడుక్కుని తింటాం, మాడిచస్తాం గాని తన శీలాన్ని పోగొట్టుకోనని" నిర్భయంగా చెప్తుంది సీత. ఆ కామందుల లైంగిక వేధింపులకు గురవుతున్న దళిత స్త్రీల మనోభావాలు, ఆత్మాభిమానం, ఆత్మగౌరవాలను బోయి భీమన్న సీత పాత్రతో ఋజువు చేసారు. పాత్రల వైశిష్ట్యాన్ని వివరించారు. దొంగరామన్న, రౌడీరంగడు వంటిపాత్రలు కుబేరయ్య దగ్గర బేరాలు కుదుర్చుకుని కుబేరయ్య ఏం చెబితే అది చేసే మూర్ఖులు

అవివేకులు, ఇంకారైతులు, కూలీలు చిన్నచిన్న పాత్రలు నాటకంలో వచ్చి వెళుతుంటాయి. ఈ పాలేరు నాటకంలో బానిసలుగా అణచి వేతకు గురైన దళితుల జీవితాల్లో చదువు, విజ్ఞానం కలిగించడం, కులాంతర వివాహాల ద్వారా కుల భేద నిర్మూలనం, సమసమాజ నిర్మాణాన్ని ఆశిస్తూ బోయి భీమన్న రచించారు. సామాజిక చైతన్యం కోసం విశేష కృషి చేసిన ఆ మహనీయుడు బోయి భీమన్న చిరస్మరణీయులు..

డా॥. బోయి భీమన్న సాహిత్యం – ఆదిమ గిరిజనుల దృక్పథం

– డా॥. సునెకత్ రొంబాబు, సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు, నెల్లూరు.

మహాకవి, పద్మభూషణ్ డా॥ బోయి భీమన్నగారు తెలుగు సాహిత్యంలో పండించని ప్రక్రియా పంటలేదు. పద్యకావ్యం, గేయ కావ్యం, వచన కావ్యం, నాటకం, నాటికలు, సాహిత్య విమర్శ, పీఠికలు, తత్వశాస్త్రం ఇలా అనేక ప్రక్రియలలో తమదైన ముద్రతో రచనలు చేశారు. తెలుగు భాష మీద సాధికారత కలిగినవారు గనుకనే ఈ సాహిత్య ప్రక్రియలు అన్నింటిని సమర్థవంతంగా నిర్వహించ గలిగారు. అటువంటి ప్రక్రియలలో భాగమైన ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు వంటి పౌరాణిక నాటక ప్రక్రియలలో శూద్రులైన ఆదిమ గిరిజనుల దృక్పథాన్ని వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

బోయి భీమన్నగారు తమ నాటకాలలోని ఇతివృత్తాన్ని విశ్లేషిస్తూ బిగువైన పీఠికల్ని రాశారు. గిరిజనులు - హరిజనులు ఆర్యులేనన్న విషయాన్ని పౌరాణిక ఆధారాలతో సహా నిరూపించారు. ఆదికవి వాల్మీకి నాటకంలోని నాయకుడైన వాల్మీకి ఆటవికుడు. ఏడవ మన్వంతరానికి చెందిన అత్రిమహర్షి సంతతివాడని బ్రహ్మపురాణాన్ని ఆధారంగా చూపించారు. తద్వారా గిరిజనులూ ఆర్యులని చెప్పడం కవి ఉద్దేశ్యం. ధర్మవ్యాధుడు నాటకంలో 'వర్ణ బేధాలు మీలో మీరు కల్పించుకొన్నవే నాకు సర్వ ప్రాణులు సమాన మేనని మృత్యువు చేత అర్జునుడికి చెప్పించడం సర్వసమానత్వం కోసమే. వేదవ్యాసుడు నాటకంలో వ్యాసుని అభ్యుదయ భావాలున్న ప్రేమికుడిగా, శాంతి కాముకుడుగా చిత్రించాడు. కరుడు కట్టిన కులతత్వాన్ని, అంటరానితనాన్ని కూడా ప్రశ్నించారు. ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు నాటకాలలో ఉండే ఆదిమ గిరిజనులు, హరిజనులు గురించి అనేక విషయాలను బోయ భీమన్నగారు ప్రాచీన పౌరాణిక ఇతివృత్తానికి కావలసిన అంశాలను జోడించి ఈ నాటకాలను శాస్త్రీయ బద్ధంగా విశదీకరించారు. అందులో భాగంగా శూద్ర కులాలు (గిరిజన, హరిజన, బహుజన) ఆర్యులు అని పౌరాణికాన్ని నాటక రూపంలో బోయి భీమన్నగారు వివరించడం జరిగింది. 'ధర్మం కోసం పోరాటం'లో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించడానికి సూచనలు చేశారు.

'బోయిభీమన్న సాహిత్యంలో భారత జాతీయ దృక్పథం' అనే వ్యాసంలో 'ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు' తమ అభిప్రాయాన్ని ఇలా తెలియజేశారు. "వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైనవాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. దానిద్వారా శూద్రవర్ణవ్యవస్థలో దళితులు (గిరిజనులు, హరిజనులు, బహుజనులు) దళిత వ్యవస్థపై లోతుగా విశదీకరించి బోయిభీమన్న రచనలను చూడాలని, అందులో వాల్మీకి, వ్యాసుడు, ధర్మవ్యాధుడు మన పూర్వీకులు అనే అభిప్రాయానికి బోయిభీమన్న గారు చెప్పిన అభిప్రాయాలను ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు ఏకీభవించారు.... (సూర్యపత్రిక, ఫిబ్రవరి,28, 2011) నా అభిప్రాయంలో కూడా బోయిభీమన్న గారి పౌరాణిక, ఆధునిక రచనలలో దళిత, గిరిజన, బహుజనులు ప్రస్తుత సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసి, బహుజన దృక్పథం చూడవలసిన అవసరం ఆవశ్యకత ప్రస్తుత రోజుల్లో ఎంతైనై ఉంది. అప్పుడే బోయభీమన్న రచనలకు సార్థకత చేకూరుతుంది. ప్రాచీనం నుండి ఆధునిక కోణంలో ప్రస్తుత సమాజానికి అనుగుణంగా బోయిభీమన్న రచనలు మనం చూడవలసిన ఉంటుందని నా అభిప్రాయం.

ఆదికవి వాల్మీకి నాటకం :

ఈ నాటకంలోని ప్రధాన పాత్రధారి వాల్మీకి. ఆటవిక తెగలకు చెందిన అత్రి మహర్షి సంతతివాడని, తద్వారా ఆర్యసంతతి వారేనని చెప్పడమే రచయిత ముఖ్యోద్దేశ్యం. రాగవాసిష్ఠం (అరుంధతీ కళ్యాణం), ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మ వ్యాధుడు ఈ నాలుగు నాటకాలనూ, నేను వ్రాయటం శూద్రులైన దళితులు, గిరిజనులు ఆర్యులేననిరుజువు చేయడానికే. అందుకు బాహ్య (చారిత్రక సాక్ష్యాలనూ, ఆంతరంగిక (పురాణ గత) సాక్ష్యాలను కూడా విశేషంగా చూపాను. ఇంకా పరిశీలించే కొద్ది అందుకు సాక్ష్యాలు కుప్పలుతెప్పలుగ లభించగలవు. ఆత్మవంచన విడిచిపెట్టి అభిజ్ఞులైన వండితులు ప్రయత్నించండి" అని పీఠికలో బోయి భీమన్నగారు పేర్కొన్నారు. (వీరు తమ వాదానికి ఊతంగా షెడ్యూలు తరగతుల పుట్టుపూర్వోత్తరాలపై పరిశోధన జరిపి 'గిరిజనులలో వాల్మీకులు దళితులని, అస్పృశ్యులని' నిరూపించిన తులాబందుల నాగేశ్వరరావుగారి మాటల్ని ఈ సందర్భంగా భీమన్నగారు ఉదహరించారు.

రామాయణం కావ్యం ప్రారంభంలో- వాల్మీకి తన శిష్యగణంతో వెళ్తున్నప్పుడు 'ఒక కిరాతుడు' క్రౌంచ మిథునాన్ని చూచి, బాణంతో ఆ జంటలో ఒక దాన్ని గురి కొడతాడు. బాణం దెబ్బకు పక్షి చనిపోయి కిందపడిపోతుంది. రెండవ పక్షి భోరున విలపిస్తుంటుంది. ఆ సన్నివేశాన్ని చూచిన వాల్మీకి మహర్షి దయాహృదయంతో శోకిస్తూ శపిస్తాడు.

ఈ శ్లోకం ఈ కింద విధంగా ఉంది.

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమ గమశ్శాశ్వతీస్సమా:
యత్రెంచ మిథునాదేక మనథీఃకామమోహితం"

(తెలుగు విశ్వవిద్యాలయం, సదస్సు సంకలనం, పుట-228)

అనే శ్లోకంలోని కథ ఇలా ఉంది. వాల్మీకి - ఆ కిరాతుణ్ని శపించడం భీమన్న గారికి నచ్చలేదు. కిరాతుడి తప్పులేదని, వాల్మీకి చేసిన పని అనుచితమని, అతనిని ఇలా మందలిస్తున్నాడు.

మరొక శ్లోకంలో -

"వేటకు వచ్చినాడు, ఎవో పిట్టలు రెండగుపింప కొట్టినా/ డాటవికుండు తాను,
ఉచితానుచితమ్ముల ప్రశ్నలేదటన్/ నోటికి వచ్చినట్లతని నొవ్వగతిట్టితి వంతబోక..."

(తెలుగు విశ్వవిద్యాలయం, సదస్సు సంకలనం, పుట-228)

కిరాతుడు వేటకు వచ్చాడు. ఏవో రెండు పిట్టలు కన్పించాయి. అతడు బాణంతో కొట్టాడు. అతడు అడవి మనిషి, ఆ పిట్టలను కొట్టవచ్చు, కొట్టకూడదు అనే ప్రశ్నే రాదు. కాని నీవు నీ దారిన వెళ్ళకుండ అతనిని నోటికి వచ్చినట్లు అతడు బాధపడేటట్లు తిట్టావు - నీ మాటలు లయబద్ధంగా ఉన్నాయి, వేదాలు లయబద్ధాలే కదా? అని పొడిపొడి మాటలతో వ్యావహారికశైలిలో తిక్కనలాగా ఈ పద్యం చెప్పారు భీమన్నగారు. అంతటితో ఊరుకోక వేటకాడు పక్షిని కొట్టడం ధర్మమేనని వాల్మీకి మాత్రం, తానేమిటో, తన గతమేమిటో మరచిపోయి ప్రవర్తించాడనీ ఎంత నిష్ఠూరంగా చెప్పాడో చూడండి.

"ఈవు నిషాద వంశజుడవెందు నిషాదుని వృత్తి వేట కాదే? విధి బద్ధ శీలిని శపించితివుగ్రత, విస్మరించితే
మావలె నీవునున్ గత సమస్తము? పిట్లనె కాదు,
జట్లుగా త్రోవలబోవు నెల్లరను దోచిన బోయవు, జ్ఞప్తి లేదొకో!..."

(తెలుగు విశ్వవిద్యాలయం, సదస్సు సంకలనం, పుట-229)

వాల్మీకి మహాశయా? నీవు కూడా నిషాద వంశానికి చెందినవాడవే కదా? నిషాదుల కులవృత్తి వేటాడడమే కదా? అతడు తన కులవృత్తికి కట్టుబడినవాడు. అలా తన వర్ణధర్మానికి నిబద్ధుడైన అతనిని కోపంతో శపించావు. మాలాగా నీవు కూడ నీ గతాన్ని మరచిపోయావు. నీవు పక్షులనే కాదు దారులవెంట జట్లుజట్లుగా పోయే వారందరినీ

ఉన్నత పదవులు, ఉద్యోగాలు చేస్తూ, తమ గతాన్ని మరచిపోయారనీ, తిరిగి వెనుకకు చూడరనీ ఇలా అంటాడు భీమన్న

"కూలి పేటల నుండి పైకురికి వచ్చి
ఉన్నతోద్యోగ పదవులనున్నవారు
మరచిపోదురు, తిరిగి చూడరు గతమ్ము
వారలెల్ల నీ వంశము వారెయేమొ?"....

(సదస్సు సంకలనం పుట-229)

తాము ఏ సమాజం నుండి వచ్చారో ఆ సమాజంపట్ల రాజ్యాంగం ద్వారా తాను సంక్రమింపజేసిన రిజర్వేషనుల ద్వారా పైకి వచ్చిన వారు, తమ బాధ్యతను మరచి స్వార్థపరులుగా జీవిస్తున్నారని డా. బి.ఆర్.అంబేడ్కర్ గారు ఒక సభలో వ్యక్తం చేసిన ఆవేదన భీమన్నగారి ఈ పద్యంలో ధ్వనిస్తుంది. 'వారిపట్ల అతని కోపం - వారలెల్ల నీ వంశము వారెయేమొ' - అనే వాక్య ప్రయోగం ద్వారా వ్యక్తం చేస్తున్నారు. దళితుల పట్ల భీమన్నగారికి అపారమైన ప్రేమవుంది. దళితులకు సామాన్యమైన ఒక గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కలిగించడానికి ఆయన తపించారు.

భారతీయ జాతీయ కవులు ముగ్గురు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు. త్రేతా యుగానికి వాల్మీకి, ద్వాపర యుగానికి వ్యాసుడు, కలియుగానికి కాళిదాసు కవిత్రయం, రుషిమూలం, నదిమూలం వెదకవద్దని పెద్దలన్నా, వారి వంశవృక్షాన్ని సహేహాత్మకంగా పరిశీలించి వారు దళిత, గిరిజన, బహుజన కులాలకు చెందిన వారేనని తేల్చారు. దీనికి కారణం ఛాందసుల, పండితుల, కులతత్వవాదులకు తర్కంలోని కుటిలత్వాన్ని బట్ట బయలు చేయడమే.

సృష్టి, స్థితి ప్రణాళికలో పురాణాల ప్రకారం పద్నాలుగు మన్వంతరాలున్నా యట. అందులో ఏడవ మన్వంతరానికి చెందిన రుషివంశ శాఖల్లో అత్రివంశం ఒకటి. వేనరాజు ఆ వంశంలో పుట్టినవాడే. కొందరి స్వార్థపరుల చేతుల్లో పడి సమాజం నాశనం కాకుండా కాపాడడం కోసం వేనుడు శతవిధాలా ప్రయత్నించి హత్యకావించ బడడం తెలిసిందే. వేనరాజుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు నిషాదుడు, చిన్నవాడు పృధువు. నిషాదుడు తండ్రి విధానాన్నే అనుసరించడంవల్ల స్వార్థపరులైన అమాత్యులు, పురోహితులు అతడ్ని దేశం నుంచి వెళ్ళగొట్టి సాధుస్వభావుడైన పృధువును సింహాసనం ఎక్కించారు. ఈ విధంగా దేశ బహిష్కృతుడై, అడవులకు వెళ్లిపోయిన ఆ నిషాపల్లె, బోయ, ఎరుకల వంటి అటవిక తెగలకు మూల పురుషుడని బ్రహ్మపురాణం చెబుతోంది. బోయ, నిషాద వంటి ఆటవిక తెగలకు చెందిన వాల్మీకి, అత్రి మహర్షి వంశం వాడని భీమన్నగారు విశ్లేషించి చెప్పారు. దీన్నిబట్టి చూస్తే ఈనాడు ఆదివాసులుగా, దళితులుగా చెప్పబడుతున్న వాళ్ళు ఆర్యరుషులే అనడానికి ఇంతకంటే పౌరాణిక నిదర్శనం అవసరం లేదని భీమన్నగారు నొక్కి వక్కాణించారు.

సప్తరుషుల్లో ఒకడైన అత్రి భార్య అనసూయ. ఆమె అరుంధతికి అక్క. అనసూయ అరుంధతి మొదలైన ఏడుగురు అక్కల తర్వాత పుట్టినవాడు కపిల మహర్షి. వేదాంతంలో సాంఖ్య సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టినవాడు ఈ కపిల మహర్షి. వీరంతా ఈనాటి దళితులకు గిరిజనులకు పితరులే అని చెప్పారు భీమన్నగారు.

"ఆదిమ భాషయై భువన
మంతట రంజిలు దేవభాష యం
దాది మహా కవీంద్రుడయి
ఆది మహా కృతికర్తయై మహిం
ద్రాది సురార్చితుండగు మహా
ముని చంద్రుడునైన అమ్మహా
వేద విదుండు వాల్మీకి
పవిత్రుడు మున్ను నిషాదుడే కదా'.....

(వ్యాస సంకలనం, పుట-80)

ఆదికవిగా ప్రసిద్ధి పొందిన వాల్మీకి నిషాద వంశజుడే నని నిరుద్ధ భారతకర్త వివరించారు. ఇంతేగాక ఈ

విషయంపై ఎంతో కృషిచేసి, పరిశోధించిన మంగిపూడి వెంకటశర్మగారు వంటి ఎందరో పురాణ పురుషులు, స్త్రీలు దళితులని తమ నిరుద్ధ భారతంలో స్పష్టంచేశారు.

వాల్మీకి నాటక దృక్పథం :

ఉత్తర రామాయణంలోని వాల్మీకి చరిత్రను ఇతి వృత్తంగా తీసుకొని భీమన్న గారు ఈ రూపక రచన చేశారు. వీరు తమ దృక్పథానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు.ఈ రూపక ఇతివృత్తం పౌరాణికమైనా, సాంఘిక నాటకంగా భాసిస్తుంది. దీనికి కారణం సంఘపరమైన చర్చ ఎక్కువగా ఉంది. అది హేతువాద దృక్పథంతో సాగడమే. కుల మత అసమానతలున్న ఈ సమాజంలో బతకడంకంటే పర్వత, అరణ్య ప్రాంతాల్లో స్వేచ్ఛగా జీవించవచ్చని వాల్మీకి, మకరందలు అడవులకు వెళ్లతారు. అక్కడ కొండ జాతుల్లో కలిసిపోయి కిరాతక వృత్తిని అవలంబించి జంతువుల్ని వేటాడి భార్య, బిడ్డల్ని పోషిస్తుంటాడు వాల్మీకి. భోగాలకు దూరమైన తాను ఆ భోగాలు ఎలాంటివో చూడాలనుకున్నాడు. అయితే తాను చేసిన హింస కేవలం ఆహారంకోసం మాత్రమే. నాగరికులు భోగభాగ్యాలకోసం, అధికారాల కోసం అనేక రకాల హింసలు చేస్తుంటారు. ఈవిధంగా నాగరికుల హింసని, ఆటవికుల హింనని తులనాత్మక పరిశీలనచేసి, ఆటవికులు ఆహారం కోసం హింసకు పాల్పడగా, నాగరికులు అధికారాల కోసం, భోగ భాగ్యాలకోసం హింసకు పాల్పడుతున్నారని రచయిత వివరిస్తారు. నేటి సామాజిక పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని రచయిత ఈ వివరణ ఇచ్చినట్టు స్పష్టమవుతోంది.

ఈ నాటకంలో భీమన్నగారు తన భావాల్ని ఏ ఒక పాత్ర ద్వారానో కాకుండా సందర్భాన్నిబట్టి, అనేక పాత్రల ద్వారా దళితా, ఆదిమ గిరిజన ఆభ్యుదయానికి సంబంధించిన భావాల్ని వ్యక్తీకరించారు. ఇక్కడ వాల్మీకి జన్మత: నిషాద ఆటవిక తెగలకు చెందిన వారు కాబట్టే ఏవైనా సత్యాన్ని సూటిగా చెప్పగలిగారు బోయి భీమన్న గారు. దళిత, ఆదిమ తెగలు ఆర్యులు అన్న వాదాన్ని బలపరిచారు. ఈ నాటకం ద్వారా తమ ఉద్దేశాన్ని బలంగా చెప్పగలిగారు.

వేదవ్యాసుడు నాటకం :

భీమన్న గారి పౌరాణిక జీవిత కథాత్మక రూపకం వేదవ్యాసుడు. కవి జీవిత కథాత్మకాలలో రెండవది. ఏడు అంకాల పౌరాణిక సాంఘిక నాటకం ఇది. 1960 ప్రాంతంలో భీమన్న దీనిని రాసినా సెప్టెంబర్, 2000లో ముద్రించబడింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ శ్రీమతి ప్రతిభా భారతి గారికి అంకితం చేయబడింది.

వేదవ్యాసుడు-రచనా నేపథ్యం :

"అ చతుర్వదనో బ్రహ్మా
ద్వి బాహు రపరో హరిః
ఆ ఫాలలోచనః శంభు:
సాక్షాత్ త్రైః చాదరాణః"

(సదస్సు సంకలనం, పుట-140-141)

నాలుగు ముఖాలు లేని బ్రహ్మ, రెండు చేతులు మాత్రమేగల విష్ణువు, నుదుట మూడవకన్ను లేని శివుడు అంటే త్రిమూర్తులు కలిసిన ఏకైక మూర్తి వేదవ్యాసుడు అని అర్థం. ఇది ప్రాచీన శ్లోకం.

భీమన్న ఎప్పుడో చదివిన శ్లోకం. అంతటి వేద వ్యాసుడు, బ్రహ్మమూర్తి తమ పూర్వీకుడయినందుకు, తను ఆయన వారసుడు అయినందుకు గర్వపడుతూ ఆయన జీవితంలోని కొన్ని ఘట్టాలను తీసుకొని భీమన్న వేదవ్యాసుడు నాటకాన్ని రాశారు. తమ 'ఇంటి ఆడ పడచు' అయిన అరుంధతికి మునిమనవడు అయిన వ్యాసుని జీవితాన్ని రూపకీకరించారు. తాను కూడా ఈ వంశ వృక్షంలో పుట్టిన వాడేనని భీమన్న అభిప్రాయం.

"కృతయుగంలో ధర్మవ్యాధుడు బోయ
త్రేతా యుగంలో వాల్మీకి బోయ
ద్వాపర యుగంలో వ్యాసుడు బోయ
కలియుగంలో భీమన్న బోయ" అంటూ.

(సదస్సు సంకలనం, పుట- 141)

ఈ ఆత్మ ప్రత్యయంతో భీమన్న వ్రాసిన నాటకమే 'వేదవ్యాసుడు'. కృత యుగంలో మతంగ ధర్మవ్యాధులు - హరిజన గిరిజన - సమైక్యంగా పుట్టిన వంశవృక్షం తమదనీ, శాఖోపశాఖలుగా పెరుగుతూ వచ్చిన ప్రధాన విభాగంలో సాహిత్య శాఖకు వాల్మీకి, వ్యాసుడు అఖండ జ్యోతులనీ, అదే వరుసలో తాను ఒక చిన్న దీపాన్ని అనీ భీమన్న చెప్పుకున్నారు.వేదవ్యాసుడు నాటక గ్రంథంలో 'నా వంశవృక్షం - వివరణ' అనే శీర్షికలో దళిత , గిరిజన ఉనికిని ఈ క్రింది విధంగా పేర్కొన్నారు భీమన్నగారు.

మతంగుడే తొలి చండాలుడు. సమాజంపై తిరుగు బాటు చేసిన విప్లవకారుడు. చండ దేవుడు. సర్వ విద్యా సమగ్ర మేధావి. రామాయణ కాలం నాటికి కిష్కింధలో ఋష్యమూక పర్వతం మీద స్థిరపడినవాడు. అదే మాలాద్రి. మాలకొండ. గిరిజనుడైన ధర్మవ్యాధుడు తన కుమార్తెను మతంగుడి కుమారుడికిచ్చి వియ్యంకుడై నాడు. హరి నుంచి తన వంశం వాళ్ళు పారంపర్యంగా కవులు కావాలన్న వరం పొంది, హరిజనుడైనవాడు ధర్మవ్యాధుడు. హరిజన, గిరిజన మైత్రికి మతంగ ధర్మ వ్యాధుల బంధుత్వమే అది. మతంగ ధర్మవ్యాధుల బంధుత్వ కారణంగా విస్తరిల్లిన అవర్ణ ప్రజలలో గిరిజనులను అలా వుంచితే, హరిజనుల సంఖ్య దేశమంతటా అశేషంగా పెరిగింది. ఈనాడు ఆసేతు హిమాచలం మొత్తం దేశమంతటా విస్తరించి వున్న దళితులందరికీ మూల పురుషులు మతంగ ధర్మవ్యాధులే. అందులో మతంగుడి వంశ వృక్షం ఉన్నతోన్నతమైనది.

కృతయుగం నాటి ఈ కర్దముడు సరస్వతీ నదీ తీరంలో విష్ణు నామ సంకీర్తనం చేసుకొంటూ వుండేవాడు. ఇతని భార్య దేవహూతి. సంతానం తొమ్మిది మంది ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు. ఎనిమిదవ కూతురు అరుంధతి. పదవ వాడు కపిల మహర్షి. భక్తి జ్ఞానాదుల వల్ల కర్దముడు బ్రహ్మపదవినిపొందాడు. జ్ఞానం స్థానంలో జన్మవచ్చి, వర్గం స్థానంలో కులం వచ్చి కులాంతర సంతానం ... వర్ణ బాహ్యులైన తర్వాత, ఈ బహిష్కృత ప్రజావర్గంలోనే బ్రహ్మలూ, మేధావులూ, మహర్షులు పుట్టారనడానికి ఈ మహావ్యక్తులే నిదర్శనం.

భారత మేధో సంపత్తికి వారసులనీ నేటి ఆధునిక సమాజానికి తెలియజేయాలన్న ప్రయత్నంలో భాగమే భీమన్నగారి ఈ వేదవ్యాసుడి నాటకం. ఇదే భావాన్ని ఈ క్రింది మాటలలో ఆయనే స్వయంగా చెప్పటం జరిగింది. "పౌరాణిక వస్తువుని ఆధారంగా తీసుకొని నేను వ్రాసిన నాటకాలన్నీ దళిత, గిరిజనుల మూలబలం ఏమిటో ఎత్తి చూపేవే. వీళ్ళను బలవంతులను చేసేవే." "ధర్మవ్యాధుడి నాటకం మతంగుడితో ముడిపడి ఉంది. ఈ ఇద్దరిలో ధర్మవ్యాధుడు ఎస్.టి., మతంగుడు ఎస్.సి. ఈ వేదవ్యాసుడు నాటకం అరుంధతి, మత్స్యగంధి, కృష్ణద్వైపాయనులతో ముడిపడి వుంది. ఇందులో అరుంధతి ఎస్.సి., మత్స్యగంధి బి.సి., వ్యాసుడు ఎస్.సి. మొత్తం మీద ఈ జంటనాటకాలు ఎస్టీ, ఎస్సీ, బి.సీ., వర్గాల మూలాన్ని ప్రకటిస్తున్నవి." (సదస్సు సంకలనం, పూట.148)

"వ్యాసయుగ చతుష్కంగా పేర్కొనబడే నాలుగు యుగాల చరిత్ర నాది (అంటే భీమన్నగారి దృష్టిలో దళితుడిది) ఈ నాలుగు యుగాల భారతీయ హైందవ ధర్మానికి ఆత్మ వ్యాసుడే. పరమాత్మా వ్యాసుడే. వ్యాసపరంగా వచ్చే యుగాన్ని పంచమ యుగం అంటున్నాము."

"వ్యాస వాల్మీకులే కవులవని కెల్ల
కడమవారు వారల పాదకమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధు వ్రతాలె
అందు కడపంక్తి పసికందు నేను!"

(తెలుగు విశ్వవిద్యాలయం, సదస్సు సంకలనం,పుట.149.)

వేదవ్యాసుడు నాటక దృక్పథం :

వేదవ్యాసుడు ప్రదర్శన యోగ్యమైన చక్కని సాంఘిక, పౌరాణిక నాటకం. ఈ నాటకంలో ప్రతి అంకం రసభావ బంధురమైంది. ప్రేక్షకుల హృదయ కేదారాలలో ఆనంద

సన్యాలను ఇబ్బడి ముబ్బడిగా పండించగలిగినది. భీమన్నగారి జీవిత చారిత్రాత్మక నాటకాలు నాలుగింటిలో మిన్న అయింది వేదవ్యాసుడు. హృదయాకర్షకమైన కథ, బిగిసడలని నాటకీయ సంవిధానం, ఉదాత్త గంభీరమైన, మనోహ్లాద మైన సంభాషణలు, సహృదయ హృదయా వర్ణనీయమైన రసపోషణం, సజీవ పాత్ర చిత్రణ ఈ నాటకాలన్ని భీమన్నగారి జీవిత చారిత్రాత్మక రూపకాలలో అగ్రేసర భాస మానమైనదిగా చేశాయి. అడుగడుగునా దళిత స్పృహను ప్రేక్షకుల కనులముందు కదలాడించిన నాటకం వేదవ్యాసుడు. 'వ్యాస వాల్మీకులే కవులవని కెల్ల' అన్న భీమన్న మాటకు కళాత్మక దృశ్యరూపమే ఈ 'వేదవ్యాసుడు నాటకం'.

ధర్మవ్యాధుడు నాటక దృక్పథం :

ఈ నాటకంలో ముఖ్యపాత్ర ధర్మవ్యాధుడు. ధర్మ వ్యాధుడి వృత్తాంతానికి రెండు నేపథ్యాలున్నాయి. ఒకటి ఎర్రన ఆంధ్రీకృత మహాభారత భాగంలో అరణ్యపర్వం. అయిదో ఆశ్వాసం (27 పద్యం నుండి 145 పద్యం వరకు)లోనూ, వ్యాసుడు అష్టాదశ పురాణాలలో మొదటి దయిన వరాహ పురాణంలో కనిపిస్తాయి.

బాల్య ప్రేరణ :

బోయి భీమన్న బాల్యదశలో ఉన్నపుడే ధర్మవ్యాధుడు పాత్ర వృత్తాంతాలు అతన్ని బాగా ఆకర్షించాయి. 'ధర్మ వ్యాధుడు' నాటకం పీఠికలో 'నాకు నా బాల్యం నుంచీ కూడా ధర్మవ్యాధుడితో సాన్నిహిత్యం వుంది. చిన్నప్పటి క్లాసు వాచకాలలో నన్ను బాగా ఆకర్షించిన కథ 'కొంగ-కౌశికుడు' అని చెప్పడాన్నిబట్టి ఈ విషయం అర్థమవు తుంది. ఈ యిష్టాన్ని అలా మనసు వరకే పరిమితి చేయకుండా వయసు తోబాటుగా అభివృద్ధి చేసుకొన్నాడు. ప్రాచీన కథకు ఆధునిక భావాలు జోడించాడు. పౌరాణికేతి వృత్తాన్ని ఆధారంగా తీసుకొన్నప్పటికి అవసరమను కొన్నచోట్ల సాంఘికాంశాల్ని జోడించి ఏడంకాలతో 'పౌరాణిక సాంఘిక నాటకంగా తీర్చిదిద్దిన భీమన్న ఈ ఇతివృత్తాన్ని నాటకంగానే ఎందుకు రాయవలసి వచ్చిందో కూడా కారణం చెప్పారు. ధర్మవ్యాధుడి పట్ల నాకు ప్రీతిమెండు. అతడు నాటకంలో ఇమడడం లేదని నవలగా రాద్దామనుకొన్నాను. అది కష్టతరం కాగా చేతిశక్తి, కంటిచూపు తగ్గు తూరాగా టేపు రికార్డర్ తీసుకొని పద్యాలలో కావ్యంగా పాడసాగాను. అదీ తుద ముట్టదని గ్రహించి ఆ తొలిరూపంలోనే నాటకంగా ప్రకటిస్తున్నానని కారణం చెప్ప డాన్ని బట్టి ధర్మవ్యాధుడి వృత్తాంతం నాటకంగా రూపుదిద్దుకోడానికి భీమన్న ఎంతగా శ్రమించారో అర్థమవుతుంది. అక్కడక్కడ మూలానికి చిన్న చిన్న మార్పులు చేశారు .

నాటక రచన :

ఈ ఏడంకాల నాటకాన్ని కథాపరంగా పరిశీలిస్తే కౌశికుడి పాత్ర ప్రవేశంతో నాటకం మొదలవుతుంది మొదటి అంకం. కౌశికుడు అడవులలో పడి నడుస్తుం టాడు. అతని నడక ననుసరించి నేపథ్య వాణి ద్వారా అతని వృత్తి, ప్రవృత్తులు, పుట్టుపూర్వోత్తరాల్ని వినిపిస్తారు రచయిత. కౌశికుడు గురుకులంలో విద్య పూర్తి చేసుకొన్నాడు. చిన్న వయసులోనే ముక్తికోసం, లోకజ్ఞానం కోసం, ఇల్లును, కన్న తల్లిదండ్రుల్ని విడిచి ఋషి కుమారుడుగా అవతారమెత్తి అరణ్యమార్గంలో ప్రయాణిస్తుంటాడు.

మిథిలా నగరం పాలిమేరల్లోని మహారణ్యం మధ్య భాగంలో పారిపోతున్న ఒకఅడవి పంది. దానిని ధర్మ వ్యాధుడి కుమారుడు అర్జునుడు, కుమార్తె అర్జునకిలు బాణాలతో వెయ్యడానికి ప్రయత్నిస్తుంటారు. అది పారిపోతుంటుంది. ఈ దృశ్యంతో రెండో అంకం ప్రారంభ మవుతుంది. అర్జునుడు, అర్జునకిలు యుక్త వయస్కులు. ఊళ్లోనున్న కర్షకులకిచ్చిన మాట ప్రకారం పందిని వేటాడుతుంటారు. ఈ విధంగా నాటకం ప్రారంభ మవుతుంది.

కౌశికుడు తన మీద రెట్టను వేసిన కొంగను భస్మం చేసిన కౌశికుడు. భిక్షాటనకు వెళ్లి ఒక ఇల్లాలి ప్రబోధంతో తన తప్పు తెలుసుకున్నానని ఉత్సాహంతో అంటాడు.

ఆవిడ ఇచ్చిన సలహా మేరకు ధర్మవ్యాధుణ్ని వెతుక్కుంటూ ఇపుడు వస్తున్నానని తన వృత్తాంతాన్ని యావత్తు సోహంకు పూసగుచ్చినట్లు చెపుతాడు. అపుడు సోహం కౌశికుడికి ధర్మవ్యాధుడి ఇంటికి మార్గం చూపిస్తాడు. ఈ అంకంలో భీమన్న మాంసాహార - శాకాహారాల గురించిన చర్చను సోహం స్వగతంలో వినటం విశేషం. వరాహ పురాణంలో బీజప్రాయంగా ధర్మవ్యాధుడు మతంగునికి చెప్పిన దాని విస్తరణ రూపం, ఇక కొంగ-కౌశికుని వృత్తాంతం భారత కథానుసారమే. సోహం స్వగతం భీమన్నగారు కల్పన చేశారు.

నాలుగో అంకం అంతాకూడా ధార్మిక అంశాలకు సంబంధించింది. ఈ అంకం ఎక్కువగా పద్యరూపంలో సాగింది. ఈ పద్యాలన్నీ కౌశిక - ధర్మవ్యాధుల సంభాషణల్లో భాగంగా భీమన్నగారు రచించారు. వాళ్ళ సంభాషణ సారాంశం ఇలా ఉంటుంది. 'కులాలు వృత్తుల్ని బట్టి ఏర్పడ్డాయని కౌశికుని స్వగతంలో అనిపిస్తారు. హింస -అహింసల స్వరూపం, జనన - మరణాలు, కర్మ వీటి స్వరూప స్వభావాలు వివరించి చెబుతాడు. తల్లిదండ్రుల సేవను మించిన తపస్సులేదని చెప్పాడు ధర్మవ్యాధుడు. ధర్మవ్యాధునికి సాష్టాంగ నమస్కారంచేసి కౌశికుడు వెళ్ళిపోయాడు.

ఏడో అంకం పూర్తిగా ధర్మవ్యాధుడి తపస్సుకు సంబంధించింది. భూదేవికి తనెవరో ఆమెవరో వివరిస్తాడు. ఇది పూర్తిగా వరాహ పురాణ కథనానికి సంభాషణా రూపమే. హరి సంకీర్తనతోసహా, ధర్మవ్యాధునికి శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు. అపుడు ధర్మవ్యాధుడు -

"నాకు నానందనులకు
దయచేయు మాత్మ విద్యా యుక్త సకల క
ళావత్కవిత్వంబు దేవదేవ!
వసుమతిపై అధవా నిన్ను బుట్టింప...."

(వ్యాస సంకలనం, పుట - 181)

అంటూ వరం కోరతాడు. అప్పుడు శ్రీహరి 'ఓయి మహా కవీంద్ర! అద్భుతమైన వరం కోరవయ్యా! యుగ యుగాలుగా యుగకవులు నీ బోయ వంశంలో జనింతురు గాక! వాళ్ళు విద్యా, విజ్ఞాన, కళా, వేదాంత రంగాలలో నాతో సమానులైవుందురుగాక! ఇక నాలోకి వచ్చేయ్' అన్నాడు. ధర్మవ్యాధుడు శ్రీహరిలో లీన మయ్యాడు. ఏడో అంకంతోపాటు నాటకం ముగుస్తుంది.

స్థూలంగా ఇదీ నాటకంలోని కథ. నాటకంలో భీమన్న ప్రదర్శించిన దృక్పథం గురించి పరిశీలిస్తే నాటకంలోని ఇతివృత్తం పూర్తి దళిత, గిరిజన దృక్పథానికి సంబంధించిందే. ముఖ్యపాత్రలైన ధర్మవ్యాధుడు, మతంగ మహర్షి, వాళ్ళ సంతానం అంతాకూడా దళితులు. గిరిజన కథా కథనంలో కూడా సాధ్యమైనంతలో దళిత, గిరిజన దృక్పథంతో కూడిన అంశాల్ని చిత్రించడం కన్పిస్తుంది.

ముగింపు :

బోయి భీమన్నగారి వేదవ్యాసుడు, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు - మొదలైన పౌరాణిక రూపకాలు సామాజిక స్పృహతో నూతన భావాలతో వెలువడ్డాయి. రచయిత ఈ నాటకాలలో హరిజనులు, గిరిజనులు ఆర్యులెనన్న విషయాన్ని నొక్కిచెప్పడానికి ప్రయత్నించారు. ఈ రూపకాలను పరిశీలిస్తూ డా. కొండపల్లి సుదర్శనరాజు గారు తన 'పౌరాణిక రూపకాలు-భావవిప్లవం' అనే సిద్ధాంత గ్రంథంలో "ఒకప్రక్క కులవ్యవస్థను కూల్చడానికి ప్రయత్నిస్తూ, రెండవ ప్రక్క హరిజనులు, ఆదిమ గిరిజనులు ఆర్యులని, ఆర్యఋషులంతా హరిజనులని ప్రబోధించడం ఆర్యబ్రాహ్మణ వర్గాన్ని గొప్పవాటిగా భావించటమే అవుతుంది" అని పేర్కొన్నారు.

ఈ విధంగా భీమన్నగారు పౌరాణిక ఇతివృత్తానికి సమకాలీన సామాజికాంశాలను జోడించి మంచి నాటకాలు రాయడం చెప్పుకోదగ్గ అంశం. కొన్ని సంభాషణలు తన సృష్టి అయినప్పటికీ నాటకంలో ఇతివృత్తానికి, కథా కథనానికి, పాత్ర ప్రవర్తనకి చక్కగా అమరినట్లు చేయడం భీమన్న సామాజిక అవగాహన, సమతావాద భావానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

ఈ నాటకం ద్వారా ఎన్నో మూఢ విశ్వాసాలకి శాస్త్రీయతతో కూడిన జవాబుల్నిస్తూ, కులభేదాలు సమాజ వినాశనానికి కారకులే కాని, సమతావాదానికి సరిపడేవి కావని, అవి రూపుమాసిననాడే భారతావని అభ్యుదయ పథంలో పయనిస్తుందని, వ్యాస వాల్మీకిలెల్ల పూర్వ హరిజనులే' అన్నడం ద్వారా ఈ దేశం, దీనికి సాంస్కృతిక వారసత్వాన్ని అందించిన వారు ఈ దేశమూల నివాసులైన హరిజన, గిరిజన, బహుజన కులాలే అని పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. ఎవడు ఈ భారత సంస్కృతికి ఆధారమో, ఎవడు ఎల్లకాలం కష్టించి ఈ దేశానికి అన్నం పెడుతున్నాడో వాడిని అంటరానివాన్ని చేశారు. ఆర్య, అనార్య భేదములు కల్పించి మనుషుల మధ్య హెచ్చు తగ్గులను కల్పించి ఈ ఉర్విని పాడు చేశారు. అలాంటి ఘోర పాపాలు చేసినందుకే నరకం ప్రాప్తించిందని, అక్కడ పీడితుల ఆత్మలు అగ్గిరవ్వలై కాల్చివేశాయంటూ ఈ నాటకాలు ద్వారా బోయిభీమన్నగారు ఉద్బోధిస్తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. జ్ఞానేశ్వర్ గనుమల (సంపా). బోయి భీమన్న సాహితీ షష్ఠిపూర్తి సంచిక,హైద్రాబాద్: సుఖేలానికేతన్, ఇర్రం మంజిల్ కాలనీ, 1983.
2. పోతన్న,వి. హరిజనాభ్యుదయం - తెలుగు నాటకం, కర్నూలు: తేజో ప్రచురణలు, 1994.
3. భీమన్న,బోయి: వేదవ్యాసుడు, భీమన్న సాహితీ నిధి, ఐ.సి.-85, ఇర్రం మంజిల్ కాలనీ, హైద్రాబాద్, 2000.
4. బోయ భీమన్న సాహిత్యం-దళిత దృక్పథం. (సదస్సు పత్రాలు) పద్మభూషణ్ డా. బోయ భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.
5. భీమన్న, బోయి. ధర్మవ్యాధుడు, భీమన్న సాహితీ నిధి, హైద్రాబాద్: ఇర్రం మంజిల్ కాలనీ, 1999.
6. మరపట్ల,భాస్కరరావు. సామాజిక విలువల నేపథ్యంలో బోయి భీమన్న రూపకాలు విశ్లేషణాత్మక విమర్శ, విశాఖపట్నం: ప్రెస్ అండ్ పబ్లికేషన్స్, 2007.
7. రామాచార్యులు బి. తెలుగు కావ్యాలలో - గిరిజన సంస్కృతి, హైదరాబాద్,1993.
8. రాంబాబు, నునావత్. ఆంధ్ర మహాభారతం-గిరిజనుల సామాజిక జీవనం,(ప్రాజెక్ట్)ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయ భాషా సంస్థ, నెల్లూరు.2020.
9. రాంబాబు నునావత్. రామాయణంలో శబరి భక్తి తత్వము, చాందిని సాహితీ పబ్లికేషన్, హైదరాబాద్, 2017.
10. వేణుగోపాల్, విట్ట.ప్రాచీనాంధ్ర సాహిత్యంలో-గిరిజన జీవిత చరిత్ర (18వ శతాబ్దం వరకు) హైదరాబాద్.
11. హైమవతి. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయిభీమన్న, హైదరాబాద్: సుఖేలానికేతన్, ఇర్రంమంజిల్ కాలనీ (ద్విము.)1982.

బోయి భీమన్న గారి "పడిపోతున్న అడ్డుగోడలు" - సమసమాజ స్థాపన

- డా॥. జి. శైలమ్మ, సహాయ ఆచార్యులు, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సమాజంలో మనిషి నిరంతరం చలన జీవి. తను సాధించదలచుకున్న దాని కోసం అహర్నిశలు పోరాటం చేయడం అలవాటు చేసుకున్నాడు. మనిషి అభివృద్ధి చెందే క్రమంలో సాటి మనిషిని మనిషిగా ఎంచకుండా, మానవ విలువలను కాలరాచి తను కఠినంగా వ్యవహరిస్తాడు. ఈ క్రమంలో యుగపురుషతత్వజ్ఞులు ఆవిర్భవిస్తారు. వారు తమదైన రచనలతో, బోధనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తారు. అలా చెప్పుకోదగిన కొంతమందిలో బోయి భీమన్న ఒకరు. కలాన్ని చేతపట్టి అక్షర సేద్యం చేసిన కృషీవలుడు. కథ, నవల, నాటకం, పద్య, గద్యం ప్రక్రియ ఏదైనా సమాజ చైతన్యానికి పెద్దపీటవేస్తూ తమదైన శైలితో అక్కడక్కడ వాడటానికి యోగ్యమైన రీతిలో గేయాలని రాసి పాఠకునికి పఠనాసక్తిని పెంచడానికి ప్రయత్నం చేసి అఖండ సృజనాత్మక శైలిని కలిగున్న హృదయశీలి ఆచార్య బోయి భీమన్న.

మనిషిని మనిషే దూరం చేసుకోడానికి 'కులం' అన్న రెండక్షరాల పదం కోట్ల జనాభాలో చిచ్చు పెట్టింది. మానవత్వాని మరచిపోయేలా చేసింది. మానవ సమూహాల మధ్య అంతులేని అవాంతరాలేర్పడినాయి. దీనివల్ల అభివృద్ధి కొన్ని కులసమూహాల మధ్య జరిగితే, జనాభా పెరుగుదల కొన్ని సమూహాల మధ్య జరిగింది. మనుషుల మధ్య ధనిక పేద అవాంతరాలు ఏర్పడినాయి. మనిషి మరో మనిషికి బానిసగా తయారైనాడు. మనుషుల మధ్య ఏర్పడిననిచ్చెన మెట్ల వ్యవస్థను తీసేయాలంటే వర్ణాంతర వివాహాలు విరివిగా జరగాలి. అలా జరిగినప్పుడు మనుషులందరు ఒకటిగా జీవిస్తారు అని మేధావుల అభిప్రాయం. ఇదే క్రమంలో బోయిభీమన్న తరాల నుండి కట్టుకున్న కుల గోడలు వర్ణాంతర వివాహాలతో పడిపోతాయని ఒక ఏకాంకికను రాశారు. అదే ''పడిపోతున్న అడ్డుగోడలు''. బోయి భీమన్న స్వయంగా అంటరానితనమన్న దురాచార భావన నుండి పుట్టినటువంటివాడు. వర్ణాంతర వివాహం చేసుకోవాలంటే ఉన్నత సామాజిక వర్గంలో చైతన్యం రావాలి. కింది కులంతో వివాహ సంబంధాన్ని ఏర్పరచుకుంటే కింది కులంవారిని సమానంగా చూడగలిగే భావన ఉన్నత సామాజిక వర్గానికుండాలి. అలా లేకపోతే ఆ వివాహంలో కూడా కులానికి ప్రాధాన్యత పెరుగుతుంది.

బోయి భీమన్న రాసిన ''పడిపోతున్న అడ్డుగోడలు'' నాటకం ఉన్నత సామాజిక వర్గం బ్రాహ్మణ కుటుంబ పెద్ద శివరామశాస్త్రి నర్వోదయ ఉద్యమంలో నాయకుడిగా పని చేసే క్రియాశీల నాయకుడు. ఈయన భార్య ఛాదస్తంగా వున్నప్పట్టికి కులం పేరుతో కట్టిన గోడలను పునాదులు లేకుండా చేయాలనుకోవడం భీమన్న సంకల్పం. అందుకే రచయిత భావాలకు చక్కని నడకనిచ్చి, తక్కువ పాత్రలతో నాటకాన్ని రచించారు. ఒక దళిత (మాల) సామాజిక వర్గానికి చెందిన బాలిక ఒక బ్రాహ్మణ ఛాందసుల ప్రశంసకు కూడా పాత్రమైంది. తన కుమారుడు ప్రేమించిన అమ్మాయినే కోడలుగా గ్రహించబడ్డ కథ ఇందులోని ఇతివృత్తం. ఈ సందర్భంగా దళితులకు వర్ణవ్యవస్థను పడగొట్టాలంటే చేయాల్సిన కర్తవ్యాన్ని బోధిస్తాడు. ఇలా చేయడం వల్ల మనుషుల మధ్య వున్న అడ్డుగోడలు పడిపోతాయి అని బోయి భీమన్న గారి ఆశ.

దళిత సామాజిక వర్గం ఉన్నతవర్గానికి చెందిన వారితో వివాహం జరిగితే న్యూనతా భావంతో మెలగకూడదని సూచిస్తాడు. ''వర్ణాంతర వివాహాలు చేసుకునే హరిజన యువతీ యువకులు సుఖంగా వుండాలంటే వారిలో న్యూనతా భావం పూర్తిగా పోవాలి. అందుకు సంస్కారం

కావాలి. వట్టిపోజు పెట్టడం చాలదు. ఆర్ష సంస్కృతిని అర్థం చేసుకోవాలి. కావ్య పురాణాది పూర్వ గ్రంథాలను చదివి, వాటి రహస్యాలను గ్రహించాలి. వట్టి పరీక్షలు ప్యాసు కావడం చాలదు. లలిత కళలతో కొంచెమైనా పరిచయం సంపాదించాలి. మన మతాన్ని, మన వేదాంతాన్ని, మన ఆచార సంప్రదాయాలను శూన్యదృష్టితో గాక, ద్వేషబుద్ధితో గాని విమర్శనా దృష్టితో రహస్యాన్వేషణ జిజ్ఞాసతో సహృదయతతో పరిశీలించాలని దళిత (మాల, మాదిగ) సామాజిక వర్గాలనుద్దేశించి బోయి భీమన్న గారు వారికి హితోపదేశం చేస్తారు.

వర్ణవ్యవస్థ అనే దురాచారాన్ని రూపుమాపడానికి కవిత్వం ఆయుధమైంది. పాట ద్వారా అనేక మంది విని తాము చేస్తున్న పని మంచిది కాదని తెలుసుకుంటారు. బ్రాహ్మణ వీధుల్లో సర్వోదయ ఉద్యమం జరుగుతుంది. అక్కడ వారు మారని ఈ వ్యవస్థను పాటరూపంలో పాడుతుంటారు.

ఎవరు తండ్రీ!
దేశదాస్యము త్రుంచి, భారత
తేజమును పెంచిన మహాత్ముండెవరు తండ్రీ!
వేదవ్యాసుడు, యోగివేమన
వేలకొలది మహా ప్రవక్తలు
గెంట జాలని అంటుదోషము
మంటగలిపిన దెవరు తండ్రీ!

ఇలా సమాజంలో వున్న పలురకాల సాంఘిక దురాచారాలను వేదవ్యాసుడు, యోగివేమన వంటి వారు సైతం ఈ సమాజాన్ని రూపుమాపలేకపోయారన్న సంగతిని పాటరూపంలో తెలియజేయడంతో ఏకాంకిక ప్రారంభమవుతుంది.

ఈ పాటను అత్యధిక సంఖ్యాకులు నివాసముంటున్న ప్రాంతపు వీధిలో పాడుకొంటూ కొంతమంది సమూహంగా వెళుతుంటారు. ప్రధానమైన పాత్రలుగా ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయి ఒకరు. మరో అమ్మాయి దళిత వర్గానికి చెందిన అమ్మాయి. ఇద్దరు స్నేహితులు. బ్రాహ్మణులు దళితులను అంటరాని వారిగా పరిగణిస్తారు. వారిని మనుషులుగా కూడా చూడరు. ఆ కాలంలో సర్వోదయ ఉత్సవాలలో మనుషులను చైతన్యవంతులను చేస్తూ వీధులెంబడి పాటలు పాడుకొంటూ వెళ్లేవారు.

ఉమాదేవి బ్రాహ్మణ కులస్తురాలు. ఈమె తండ్రి అభ్యుదయ భావాలు కలవాడు. మనుషులందరు సమానమేనన్న భావనలను అంటరానితనం పాటించే వారికి బోధ చేస్తుంటారు. తండ్రి ఆలోచనలకు అద్దంపట్టినట్టుగా తన స్నేహితురాలైన రమాదేవిని ఇంటికి తీసుకుపోతుంది. బ్రాహ్మణ వర్ణంకు చెందిన ఉమాదేవి కుటుంబానికి దళితుల మీద ఎంత ప్రేమ వుందో చూపించడానికి అని అంటుంది.

"మీ హరిజనుల పట్ల మా బ్రాహ్మణులకు ఎంతటి సానుభూతి, సద్భావం, అనుకంప, ఆదరణ" పుట:298. ఉమాదేవి మాటలు వినడానికి బాగున్నాయి. ఆచరణలో అసమానత వుందని రమాదేవి అంటుంది.

"మాటల తియ్యదనంతో మాత్రమే తృప్తిపడి వుండవలసిన అభాగ్యులం గదా!" పుట:298 అని రమాదేవి అంటంది. మాటలు చెప్పడం చాల సులభం. ఆచరణలోనే లోపం వుందని వాస్తవిక విషయాన్ని రమాదేవి తెలియజేస్తుంది.

మనుషుల మధ్య వున్న ఈ అంతరం పోవాలంటే చేయాల్సిందల్లా ఒక్కటే వర్ణాంతర వివాహాలు చేయడమే. అప్పటికే గాంధీ మహాత్ముడు వీధివీధికి తిరిగి మనిషిని మనిషిగా చూడాలని నినాదాలు చేస్తుంటారు.

ఈ ఏకాంకికలో అప్పటి రోజుల్లో జరిగిన హరిజన దినోత్సవాలు ప్రత్యేకతలు చక్కగా వివరించారు. ఒకేచోట ఉన్నత, దళిత సామాజిక వర్గాల జనం కలిసిమెలసి భోజనం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటారు. ఆ రోజు పాఠశాల ప్రదేశంలో అందరు కలిసుంటారు.

దళిత కులస్తులు తమ కులాన్ని గురించి చెప్పకోడానికి వెనకాడతారు. కొంతమంది ధైర్యంగా చెప్పకలుగుతారు. ఉమాదేవి తన కుటుంబంలో రమాదేవితో కులాన్ని గురించి చెప్పవద్దని అంటుంది. ఇక్కడ నీ కులం ఎవరితోనూ చెప్పకూడదు. ఎటువంటి విపరీత పరిస్థితిలో కూడ నాకు అడ్డు చెప్పకూడదు'' పుట.300 ఉమాదేవి మాటలు రమాదేవిని కలవరపెడతాయి. ఎందుకు దాచాలి రమాదేవి అని ప్రశ్నిస్తుంది. ఉమాదేవి వర్ణవివక్ష గోడలు పడగొట్టాలంటే కొన్నిసార్లు అబద్ధాలు చెప్పవలసి వస్తుంది అని అంటుంది.

''కులం దాచుకోమంటావా? ఛా, ఛా, ఈ మాట నీవు అక్కడ రాజమండ్రిలోనే ఎందుకు చెప్పలేదు?'' పుట.300. ఉమాదేవి సంకల్పం వేరు. ఎవరైతే ''అంటరానితనం'' అన్న భావనను ప్రజల్లో కలిగించారో వారే ఆ భావనను తొలగించాల్సిన అవసరం వుందని రచయిత చాల స్పష్టంగా కథను, సంభాషణలతో ముందుకు నడిపిస్తాడు.

ఉమాదేవి తల్లి రమాదేవిని చూసి 'బంగారుబొమ్మ' అని సంబోధిస్తుంది. రమాదేవి కులం తెలియని ఉమాదేవి తల్లి రమాదేవిని ప్రేమగా పలకరిస్తుంది.

గాంధీ ఉద్యమాల్లో పాల్గొంటున్న ఉమాదేవి తండ్రి శివరామశాస్త్రి హరిజనసేవా సంఘకార్యదర్శి కావడంతో ఈయన కుమారుడు రామచంద్రంపై ఈయన ప్రభావం పడుతుంది. ఖద్దరు దుస్తులు ధరించి, తల మీద గాంధీ టోపీ ధరించి సమసమాజ భావనలు గానం చేస్తుండే వాడు. రామచంద్రం మనుషులు వుంటున్న తీరుని మంచి పాట ద్వారా రచయిత పాడిస్తారు.

''కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న,
దంత మాత్రాన ఇల చిన్నదనము లేదు
పెత్తనము చేయు నీ కన్ను పెద్దదైన!'' పు.302.

కన్ను చిన్నదైన శరీర అవయవం, దేహానికంతటికి దీపం వంటిది. ప్రపంచాన్ని చూస్తు మనిషి ఎటువైపు పయనించాలో దారి చూపు ''కన్ను''లా దళితులు చిన్న కులమని చిన్న బుచ్చుకోవాల్సిన అవసరం లేదని రామచంద్రం ద్వారా గానం చేయిస్తాడు.

రామంచంద్రం చదువుకోవడం వల్ల మనుషులందరు ఒకటే అన్న భావనలో వున్నాడు. ఇంకా అంటరాని తనమన్న భావన పోవాలంటే వర్ణాంతర వివాహాలు చేసుకోవాలని రామచంద్రం మనసుకి తడుతుంది. ఆంగ్ల చదువులభ్యసన చేయడం, అన్నీ కులాల వారికి చదువుకొనే అవకాశం కల్పించడం బ్రాహ్మణ సామాజిక వర్గం వారికి ఇష్టపుట్టడం లేదని రచయిత స్పష్టంగా తెలియజేస్తూ దళితులను జాగృతం చేస్తాడు.

''నేను కాపురానికి వచ్చింది మొదలు ఇంట్లో ఒకటేపోరు. తల్లీ
ఏమిటో హరిజనసేవట! ఇంగ్లీషు చదువులట! పట్నం పంపించారు.
అబ్బాయి మాకు కాకుండా పోయాడు కదా?'' పుట.303.

రామచంద్రం బ్రాహ్మణుడు. హరిజన అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆ అమ్మాయిని వివాహం చేసుకోవడం ఇష్టంలేని తల్లి ఈ విధంగా ఆవేదన చెందుతుంది.

ఉమాదేవి తల్లి లక్ష్మీదేవమ్మ రమాదేవితో ఆప్యాయంగా మాట్లాడం గమనించిన ఉమాదేవి తల్లితో రమాదేవిని కోడలుగా చేసుకోమని అడుగుతుంది. లక్ష్మీదేవి కోడలుగా రమాదేవి వుండాలని అనుకొంటుంది.

''అంత అదృష్టమటే? ఈ పుత్తడి బొమ్మే నా కోడలైతేనా? పువ్వుల్లో పెట్టి పూజించుకోనూ? పుట.304.

కులమేంటో తెలుసుకోకుండానే రమాదేవిని కోడలుగా అంగీకరించింది. కొడుకు హరిజన అమ్మాయిని ప్రేమించాడని తెలియగానే అతను ఆ అమ్మాయిని చేసుకోకూడదని రమాదేవిని కోరుతుంది తల్లి. రమాదేవి

హరిజన కులస్తురాలు. ఈ అమ్మాయినే లక్ష్మీదేవి కుమారుడు ప్రేమించడం విశేషం.

అందరు కలిసి భోజనాలు చేయాలి. ఇలా చేయడం ద్వారా కులసమస్య పోతుంది. అంటరానితనం దురాచారం అని తెలుస్తుంది. సహపంక్తి భోజనాలు చేసినంత మాత్రాన అంటరానితనమన్న భావన పోదన్నది కొందరి వాదన. దళితుల్లో రేకెత్తిన సందేహం.

"ఆయన హరిజనుడేనట. ఒక్కపూట కలిసి భోజనం చేసినంత
మాత్రాన మాకు ఒలికిందేమిటీ" పుట:301

అని సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినవారిని ఒక దళితుడు ప్రశ్నిస్తాడు.

ఈ మాటలు విన్న రామచంద్రం తండ్రితో అంటాడు. అవును దేవాలయ ప్రవేశాలు చేయించినంత మాత్రాన కుల సమస్య పోదు అడ్డుగోడలు పోవాలంటే వర్ణాంతర వివాహాలు జరగాలి. అది రామచంద్రంకు తల్లికి నచ్చిన హరిజన అమ్మాయినిచ్చి వివాహం చేయడానికి సంకల్పిస్తారు. హరిజనులు పలురకాలైన పనులు చేస్తూ జీవనం చేస్తుంటారు. బట్టలుతికే పని, మంగలిపని, కుమ్మరిపని, చెప్పులు కుట్టేపని, పశువులు మేపేపని ఇలా ఎన్నో పనులు వారి చేత చేయించుకొనే అగ్రవర్ణస్తులకు దళితులతో శారీరక పొత్తు మాత్రం ఎందుకు వుండదు. ఇలా లేకపోవడం వల్ల మనుషుల మధ్య కులమనే అడ్డుగోడ దృఢంగా తయారైపోయింది. ఇది వుండ కూడదంటే వర్ణాంతర వివాహాలు జరగాలి అని భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ మాటననుసరించి బ్రాహ్మణుడై శివరామశాస్త్రి అభ్యుదయ భావాలతో సమాజాన్ని చైతన్యపరుస్తుంటాడు. కేవలం నీతులు చెప్పడమే కాదు వాటిని అమలు చేయగల సమర్థుడు.

శివరామశాస్త్రి కుమార్తె ఉమాదేవి. ఆమెకు దళితులతో స్నేహంగా వుండడమంటే ఇష్టం. అందుకే తన స్నేహితురాలు రమాదేవి హరిజన కన్య. ఇద్దరు కుమారులు. పెద్దవాడు రామచంద్రం తండ్రితో హరిజనోద్ధరణ ఉద్యమాల్లో పాల్గొని గాంధీ టోపి ధరించి వుంటాడు. ఈయన హరిజన కన్యను ప్రేమిస్తాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలనుకొంటాడు. ఈ విషయం తల్లికి నచ్చదు. ఆ పిల్లను పెళ్ళి చేసుకోవద్దంటూ తల్లి వారిస్తుంది. కాని కుమార్తె స్నేహితురాలు రమాదేవి హరిజన కులస్తురాలు. తల్లికి తెలియకుండా జాగ్రత్తపడుతుంది. రమాదేవి చూడగానే ఎవరికైనా నచ్చే అమ్మాయి. ఈమెను చూసిన ఉమాదేవి తల్లి తన కుమారునికిచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకుంటుంది. భర్త పిల్లలు ఆమె కులం ఏంటో తెలుసుకోమని అంటారు. ఏ కులమైనా ఇష్టమే అన్న అభిప్రాయం ఆమె నోటి నుండి తీసుకుంటారు.

"ఎవరైనా సరే? ఏ చెంచుపిల్ల అయినా? ఏ మాల పిల్ల అయినా?" పుట.313 లక్ష్మీదేవి హరిజన పిల్లైనా సరే కోడలుగా స్వీకరించడానికి అంగీకరిస్తుంది. ఇలాంటి చైతన్యాన్ని అగ్రవర్ణస్తుల్లో వుండాలని కవి కోరుకున్నాడు.

"నేను దీవిస్తున్నానే అమ్మాయ్! కొత్త పెళ్ళికూతురువు కా" పుట.319 ఛాదస్తాలతో వుండే లక్ష్మీదేవమ్మ కూడా రమాదేవిని (హరిజనపిల్ల) తన కుమారునికిచ్చి వివాహం చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తుంది.

హరిజనులంటే ఎవరో అనాగరికులు అనుకొనే లక్ష్మీదేవమ్మ కుమార్తెను వరదల్లో కొట్టుకుపోతుంటే సాహసం చేసి రక్షించి ప్రాణం పోస్తాడు. ఉమాదేవి బ్రతికుందంటే అది రమాదేవి అన్న గారి పుణ్యమే అన్న విషయం లక్ష్మీదేవమ్మ తెలుసుకుంటుంది.

"నిజంగా? ప్రాణాలకు లెక్క చెయ్యకుండా ఆ మహాప్రవాహంలో ఉరికింది అతడేనా? ఐతే శ్రీరామదాసు గారూ! మీకు మేము చాల ఋణపడి వున్నామండీ!" పుట.317.

దళితులు మంచి పనులు చేస్తారని, చదువుకుని ఉద్యోగాలు చేయగలరని అందరికి తెలియాలి. అప్పుడే దళితులపట్ల వున్న చిన్నచూపు తొలగిపోతుందని బోయి భీమన్న గట్టి నమ్మకం.

శివరామశాస్త్రి బ్రాహ్మణుడు, శ్రీరాముడాను హరిజనుడు. వీరి పిల్లలు రామచంద్రం, చంద్రశేఖర్ ఇద్దరు మద్రాసులో ఒకే రూములో వుండి చదువు కొంటున్నారు. కులప్రస్తావన కాని ఏమి లేదు. తక్కువ కులాల వారిని తక్కువ చేసి చూడనంత కాలం, మంచి మనుషులుగా జీవించలేరు. కులమన్నది పోవాలంటే కులాంతర వివాహాలు జరగాలని ఒక చక్కని భావం. ఈ ఏకాంకిక ప్రదర్శించడానికి యోగ్యమైంది. రామచంద్రం ప్రేమించిన అమ్మాయి కూడా 'రమాదేవి' కావడం. తల్లి అమ్మాయిని చూసి లక్షణంగా వుందను కోవడం ఆమె కోడలుగా అంగీకరించేలా చేసి 'కుమనే' అడ్డుగోడలు పడగొట్టారు.

ఆధారగ్రంథం :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి.



నీవే మైనా చేయగలవు

– డా॥. యస్. సి. సంజీవ రెడ్డి , తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు, కడప జిల్లా.

కళాప్రపూర్ణ, మహాకవి బిరుదాంకితులు డా॥ బోయి భీమన్న గారు పదునెరిగిన పండితులు, జాతీయ భావములు మానవత్వము తొణికిసలాడు రచనలు చేయుట వీరి ప్రత్యేకత భీమన్న గారి పాటల తోట నుండి తీసుకున్న గేయం 'నీవేమైన చేయగలవు' మానవుడు మంచి మనసుతో దైవాన్నయినా దర్శించగలడు. ఆ మనస్సు పవిత్రంగా ఉండాలి. సంకల్పం దృఢంగాను, ఉన్నతంగాను ఉండాలి. మానవుడు ఏమైనా సాధించ గలడు. మిగిలిన జీవులకన్నా మనస్సునే దానికి ఆలోచించే శక్తి మానవునికే పరిమితం కనుక దానిని వినియోగించి దేశప్రగతి, మానవాళి అభ్యున్నతికి నీవేమైనా చేయగలవు అని ప్రజలను వెన్ను తట్టి చెప్పుచున్నారు. మనస్సును మళ్ళిస్తే పురోగతి, దాని బాటన నడిస్తే అధోగతి, దాని మంచి బాటను నడిపించే సంకల్పము మానవునికి కలదని రచయిత హెచ్చరిస్తున్నారు. ఈ భావముతో వ్రాసిన గేయ ఖండిక 'నీవేమైనా చేయగలవు' వేదాంత సంబధమైన గుఢార్థాన్ని ఇముడ్చుటలో డా॥బోయి భీమన గారి ప్రజ్ఞాకౌశలము ఈ రచనలో కనిపిస్తాయి.

మనస్సు :

నీమనసే నీకు దైవం, అన్నీ అదే అన్నింటిలో ప్రసాదించేది మనసే. మనసే సాధించే సాధనం, మానవుని ప్రజ్ఞ అంటే తెలివి తేటలు, శక్తి సామర్థ్యములు ప్రగతికి మూలం. మానవ జీవిత నిర్మాణానికి మానవుడే నిర్మాత అతని సుఖ శాంతులకు, ఆనందానికి, సేఖ్యానికి కర్త అతడే. మనం చేసే ప్రతి పనిని మనస్సు పరిశీలిస్తుంది. అంటే మనమే మన మనస్సు. మనిషి దైవంగా మారితేగాని, మనసు దైవంగా రూపొందదు. కనుక మనిషి సమాజంలో మంచి పనులు పరోపకారం చేస్తుండాలి. సహస్రదళ పద్మంపై సౌరభమే మనస్సు, మానవుడు విద్యలోనూ విజ్ఞానంలోనూ వేయి రేకుల పద్మంలా వికసించాలి. ఏ విధంగా అయితే రేకులన్నీ విడివిడిగా ఉన్న ఒకే పద్మానికి చెంది ఉంటాయో ఆ విధంగానే చదువులో పరిశోధనలు వేరు వేరుగా ఉన్నా వాటికి మూలం మానవుడు కాబట్టి మానవ శ్రేయస్సు ముఖ్యం. పద్మానికి సువాసన సహజం మానవ ప్రవృత్తికి, విజ్ఞానానికి శాంతి, పురోగతి ఫలితంగా ఉండాలి. ప్రశాంతతో కూడిన మావతావాద పరిమళం వ్యాపించాలి. మానవ తేజస్సుకు మూలకారణం మధురమైన మనోవిన్యాసమే! మనస్సు ఎన్ని రకాలుగా ప్రవర్తిస్తుందో చెప్పలేము. అయితే ఆ మనస్సు మధురంగా విహరించి మానవత్వాన్ని వ్యాపింప జేయాలి. మనస్సును గెలిస్తే, మనో వేగం కూడా సాధ్యమే. పూర్వకాలంలో మనో వేగం కలవాళ్ళు ఉన్నట్లు తెలుస్తుంది. అందని నక్షత్ర సమూహాలను మానవుడు అందుకుంటున్నాడు దానికి కారణం మనస్సును గెల్చుకోవటమే! మంచి మనస్సుతో పురుషోత్తముని కూడా గెలువ వచ్చు.

విశ్వం :

మనస్సు పవిత్రమైన కొలదీ ప్రపంచం అంతా ఒక్క కుటుంబం అనే భావన కలుగుతుంది. ప్రేమ తప్ప మరోకటి ఉండదు. సర్వమానవ సౌభ్రాతృత్వం వికసిస్తుంది. ఆరీతి పద్మము వికసించిన కొద్దీ పరిమళం వ్యాపిస్తుంది. ఏ పరిమళమైనా సరే వేగం పెరిగే కొద్ది విశ్వం వ్యాకోచిస్తుంది. విశ్వం ఎలా పుట్టింది అనే దానికి ఇంతవరకు సంతృప్తికరమైన సమాధానం లేదు. ఆధ్యాత్మిక విషయం లోపలికి వెళితే, ఎట్లా అర్థంకాదో, ఆధునిక శాస్త్రానికి లోపలి కంటా వెళితే, ఎట్లా అర్థంకాదో. చివరకు సైన్స్, మతం చెప్పేది ఒకలాగానే ఉంటాయి. ఇలాంటి చోటనే మతం, సైన్స్ కలుస్తాయి.

విశ్వం అంటే భూమి, చంద్రుడు గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలు మొదలైన వస్తువులు, వాటి మధ్య వుండే శు

న్యాన్ని కలుపుకొని విశ్వం అనవచ్చును. మొదట్లో విశ్వం చిన్నగా ఉండి తర్వాత జరిగిన వ్యాప్తి చెందింది. అది ఇంకా పెరుగుతునే ఉంటుందని చివరకు ఇదంతా మళ్లీ చిన్నదవుతుందని రకరకాలుగా చెపుతారు. ఇదే విషయాన్ని శ్రీశ్రీ "రాత్రిందివాల పరిణామాలలో, బ్రంహాండ గోళాల పరిభ్రమణాలలో" అంటాడు. అయితే మొత్తం మీద విశ్వం ఇప్పటికీ వ్యాకోచిస్తూనే వుంది.

మన వాళ్లు అతి ప్రాచీనకాలంలోనే విశ్వాన్ని గూర్చి ఇలా ఆలోచించారు.

"పూర్ణమద: పూర్ణ మిదం పూర్ణత్ పూర్ణ మదచ్చతే
పూర్ణస్య పూర్ణమదాయ పూర్ణమేవావ శిష్యతే"

ఇది మనకు తెలియాలంటే ఈవిధంగా చెప్పుకోవచ్చు. సున్నా ఒకటుంది దీనిలోంచి ఒకసున్నా తీస్తే సున్నా నే వచ్చేది. మళ్లీ కలిపితే సున్నాగానే ఉంటుంది. సున్నా నుంచి ఎన్ని సున్నాలు తీసినా, సున్నాకు నష్టం ఉండదు. అయితే ఇది అంత తేలికగా అర్థంకాదు. ఐనిస్టయిన్ "విశ్వం పరిమితమైంది" అయితే దానికి అవధులు లేవన్నాడు.

తారలు :

భౌతికంగా దూరగ్రహాలలో, తారాలోకములో ఏ వ్యవసాయం చేశారో? ఏలోకాంతర వాసులతో నెయ్యం గరిపేవో? అతర్లీనమైన మనోవృత్తులతో స్నేహము చేసావో గాని మనస్సును గెలిచావు. ఇకదాని వేగముతో లెక్కేమి? మనస్సును గెలిస్తే ప్రకృతిని జయించినట్లే! కనుక గుప్పిట్లో కోటి కాంతి వర్షాలను అనగా తేజో పుంజములను పట్టుకురాగలవు. మనశ్శక్తి అటువంటిది.

రాత్రిపూట ఆకాశం మీద మినుకు మినుకుమంటూ అసంఖ్యాక నక్షత్రాలు వెదజల్లబడినట్లుగా వుంటాయి. అవన్నీ ఎన్ని ఉంటాయో లెక్కపెట్టండి. చిన్నతనంలో లెక్కపెట్టనిచ్చే వారు కాదు పెద్దల కాని లెక్కపెడితే మూడు వేల దాకా ఉండవచ్చు. టెలీస్కోపులో కొన్ని కోట్ల నక్షత్రాలు కనిపిస్తాయి. అందుకే నన్నయ అమలిన తారకణ సముదయంబుల నెన్నను ..... విధాతృనకైనను నేర బోలునే" అని అన్నారు. ఆకాశంలో చుక్కలు లెక్క పెట్టడం ఆబ్రహ్మవల్ల కూడా కాదు. సూర్యుడు కూడా ఒక నక్షత్రమే! కాగా మనకు సూర్యుని తర్వాత దగ్గరగా ఉన్న నక్షత్రం పేరు "ఆల్ఫాసెంటారై" దీనికి మన భారతీయులు పెట్టిన పేరు త్రిశంకువు. ఇది మనకు సుమారు 4.3 కాంతి సంవత్సరాల దూరంలో వుంది. అంటే 26 లక్షల కోట్ల మైళ్ళు.

ఆకాశంలో గుంపులు గంపులుగా గత్తులు గుత్తలుగా ఉన్న నక్షత్రాలను మిల్కినే అంటారు. వీటిని మన వాళ్ళు పాలపుంత అన్నారు. గెలాక్సీలు అంటే ఇవే. వీటిల్లో పదివేలకోట్ల నక్షత్రాలు ఉన్నాయి. వీటినే నెభ్యులా అనేవారు. అంటే మబ్బు అని అర్థం. బుగ్వేదంలోనే భారతీయులు వీటిని గుర్తించి వీటిని నీహారికలు అన్నారు.

ఏ గ్రహాల, తారాసీమల ఏ సేద్యము చేసెనో? ఏ లోకాం తరవాసుల స్నేహం చేసెనో! అనగా తపస్సు, పరిశ్రమ చేసి పంచేద్రియాలకు మనస్సులో బడకుండ మనస్సును ఆతపస్సు ద్వారా, పరిశ్రమ ద్వారా గెలిచిన వాడవు. ఇక దానిలో నున్న వేగము లెక్కలేదు. మనస్సు గెలిస్తే ప్రకృతిని జయంచినట్లే! కనుక కోటి కాంతి వర్షాలను తేజో పుంజములను నీ ఆధీనంలో ఉంచుకొన గలవు. ఎంత ఉన్నతమైన ఆలోచన! ఈ మహా మహస్సునకు మనో వేగమే కారణము పవిత్రమైన మనస్సే పురుషోత్తముని గెలువగల మహా తేజస్సు. నీవు విచక్షణ శీలివి. కనుక ఏమైనా చేయగలవు అని ఉజ్జ్వలమైన భవిష్యత్తును దర్శించాడు కవి.

ఆధార గ్రంధాలు :

1. మహా ప్రస్థానం - శ్రీశ్రీ
2. ఆంధ్రమహా భారతం - నన్నయ
3. ఐనిస్టిన్ - సాపేక్ష సిద్ధాంతం
4. బ్రహ్మగుప్తుడు - శూన్య సిద్ధాంతం

డా. బోయి భీమన్న 'అంబేడ్కరిజం' గ్రంథం - మౌలికాంశాలు

- డా॥. గిన్నారపు ఆదినారాయణ, తెలుగు అధ్యాపకులు, మహాత్మ గాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ, తెలంగాణ.

కవిగా, రచయితగా, సామాజికవేత్తగా తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు పద్మభూషన్ డా. బోయి భీమన్న. సంప్రదాయ పద్య కవిత్వం మీద ఎంత పట్టు సాధించారో, ఆధునిక వచనం మీద కూడా అంతే పట్టు సాధించారు అని వారి రచనల చదివితే అర్థమవుతాయి. ఈయన సరిగ్గా మొదటి ప్రపంచ యుద్ధానికి మూడేండ్ల ముందు తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో సెప్టెంబర్, 19, 19011న జన్మించారు. భారతదేశానికి స్వతంత్ర్యం రావడానికి ముందు ఉన్న పరిస్థితులను, స్వతంత్ర్యం వచ్చిన తర్వాత పరిస్థితులను చాలా జాగ్రత్తగా గమనించిన వ్యక్తిగా మనకు కన్పిస్తారు భీమన్న. దళితుల స్థితిగతులను డా. బి.ఆర్. అంబేడ్కర్ భారతదేశంలో పోరాడిన విధానాన్ని ప్రత్యక్షంగా చూశారు. అంబేడ్కర్ ఎదుర్కున్న బాధలు, ఆయన కలలు కన్న సమాజం, అస్పృశ్యులు ఎదుర్కుంటున్న స్థితిగతులను తాను ప్రత్యక్షంగా అనుభవించారు. అందుకే అంబేడ్కరిజం దిశగా ఆలోచన చేశారు. అలాంటి రచనలు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో మిషనరీల ప్రభావం వల్ల ఎక్కువ మంది దళితులు చదువుకున్నప్పటికి బోయి భీమన్న కుటుంబం మాత్రం హిందూ సాంప్రదాయం ప్రకారం నడిచిందని కొన్ని ఆధారాలను బట్టి తెలుస్తుంది. తన తల్లిదండ్రులు నాగమ్మ, పుల్లయ్య. వీరికి ఐదుగురు మగ సంతానం ఒక ఆడసంతానం. మహాభారతం ప్రభావం తెలుగు సమాజంపై పడింది కాబట్టి తనపిల్లల పేర్లు కూడా పంచ పాండవుల పేర్లు పెట్టారు భీమన్న తల్లిదండ్రులు. ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని తన పిల్లలను పిలుచుకున్నారు. ఇందులో బోయి భీమన్న తెలుగు సాహిత్యంలో తన రచనల ద్వారా భీముని వలె బలశాలిగా సుస్థిర స్థానాన్ని సంపాదించాడు.

'అంబేడ్కరిజం' (అంబేడ్కర్ సాంఘిక, రాజకీయ కార్యప్రణాళికపై సిద్ధాంత గ్రంథం) అనే రచనను బోయి భీమన్న 1985లో ముద్రణ చేశారు. 26 శీర్షికలతో ఒక్కొక్క అంశాన్ని విపులంగా పరిచయం చేశారు. ఈ గ్రంథం రాయడానికి ప్రేరణ "1984 అక్టోబర్ 14 న హైదరాబాద్ లోని వీర్ నగర్‌లో అంబేడ్కర్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి నేను వెళ్ళాను. అక్కడ అంబేద్కర్ యువజన సంఘం యువకులు ఆ సభను నిర్వహిస్తున్నారు. ఆ సభలో నేను కొన్ని విషయాలు ప్రస్తావించాను. ఆవిషయాలు అక్కడి యువకులకు నచ్చాయి వారి ప్రోద్భలంతో నేను ఈ అంబేడ్కరిజం అనే గ్రంథ రచనకు పూనుకున్నాడు" అని ఈ రచన ముందుమాటలో చెప్పుకున్నారు . సరిగ్గా ఈ రచన రాయడానికి భోయి భీమన్న గారి వయస్సు 70 సంవత్సరాలకు పైబడే ఉన్నాయి. అప్పటికే సాహిత్యంలో అనేక గ్రంథాలను రాశారు. సామాజిక సాంఘిక అంశాలతో ఎందరో మహానుభావుల నుండి మన్ననలు పొందారు. తెలుగు సాహిత్యంతో పాటు సమాజాన్ని అర్థం చేసుకున్నారు. సాహిత్యాన్ని సమాజాన్ని సమపాళ్ళల్లో ముందు నడిపిన ఘనత బోయి భీమన్న గారికి దక్కుతుందని చెప్పవచ్చు.

అంబేడ్కరిజం నిర్వచనాలు :

అంబేడ్కరిజం గురించి చాలామంది వివిధ నిర్వచనాలను ఇచ్చే ప్రయత్నం చేశారు. అంబేడ్కరిజానికి అంబేడ్కరీయం, అంబేడ్కరత్వం, అంబేడ్కర్ తత్వం అనే పేర్లతో పిలుస్తారు.

"అన్ని రంగాలలోనూ సమాన హక్కులకోసం, సమాన అవకాశాల కోసం, సమాన సుఖశాంతుల కోసం మానవుడు జరిపే పోరాటమే అంబేడ్కరిజం."

- బోయి భీమన్న, అంబేడ్కరిజం, ముందుమాట

"అంబేడ్కరిజం అంటే అణగారిన వర్గాల మానవ హక్కులను స్థాపించడం. అంబేడ్కరిజం ఒక విప్లవం, ఇది యుగయుగాల జాతివాదం, కులం, అంటరానితనం, బానిసత్వం మరియు వెనుకబడిన కులాలపై కుల హిందువులు విధించిన అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది."

- డా. సందేష్ వాగ్, డిమాన్‌సేషన్ ఆఫ్ అంబేడ్కరిజం

"అస్పృశ్యతా నివారణ, కులవ్యవస్థానిర్మూలన, సమసమాజ స్థాపన, సర్వజన శ్రేయస్సాధన, సమైక్య సంబుద్ధభారత జాత్యవతరణ ఈ పంచ లక్ష్య సమగ్ర స్వరూపమే అంబేడ్కరిజం."

- బోయి భీమన్న, అంబేడ్కరిజం, పుట : 06

అంబేడ్కరిజం లక్ష్యం :

అంబేడ్కరిజాన్ని గురించి బోయి భీమన్న ప్రధానంగా ఐదు అంశాలుగా విభజించి చెప్పారు. అందులో

1. అంబేడ్కరు భయరహితుడు. భయంకరుడు. సవర్ణ హైందవ కులతత్వ మౌఢ్యంపై నిర్విరామంగా పోరాడినవాడు. మేకల్లా కాకుండా సింహాల్లా బ్రతకండంటూ దళితులకు బోధించినవాడు. స్వాతంత్ర్యం అనేది భిక్షమెత్తితే లభించే వస్తువు కాదని, పోరాడి సాధించుకోవలసినట్టిదని ఉద్బోధించినవాడు.
2. దళితుల విమోచనం వాళ్ళ రాజకీయ శక్తిమీద ఆధారపడివున్నదన్నాడు అంబేడ్కరు. రాజకీయ శక్తికోసం సంఘటితులు కావాలన్నాడు. అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నాడు. అట్టి పోరాటం ధనం కోసమో, పదవుల కోసమో కాదన్నాడు. సాంఘీక న్యాయం కోసమూ, సమానత్వం కోసమూ పోరాడా లన్నాడు. మనకు కావలసింది పదవి కాదు, అధికారం కావాలన్నాడు. అందుకే రాజ్యాధికారమే మాస్టర్ కీ అన్నారు.
3. దళితులు తమ బానిసత్వాన్ని తామే తొలగించు కోవాలి. తమ సంకెళ్ళను తామే విదలించుకోవాలి. ప్రవక్తలనూ, దేవుళ్ళనూ నమ్మవద్దు. మత గ్రంథాలలో దళితుల్ని రక్షించగలదేదీలేదు. స్వశక్తి మాత్రమే మోక్షసాధకము.
4. తాను ఏ అంటరాని జాతిలో పుట్టి పెరిగి జీవిస్తు న్నాడో, ఆ జాతి సేవలోనే మరణిస్తానన్నాడు అంబేడ్కరు. ప్రతి మానవుడూ ఏదో ఒక రోజున చావవలసిందేనని, మనం బానిసలంకామని, మనం యుద్ధ వీరులమని ఆయన జ్ఞాపకం చేశాడు. అగౌవరంగా బ్రతికేకంటే అవమానకరమైనదేదీ లేదన్నాడు.
5. హిందువులు తనను శత్రువుగా భావిస్తే అది వాళ్ళ దురదృష్టం అన్నాడు. తనను వాళ్లు అపార్థం చేసుకొంటున్నారన్నాడు. తాను వ్యక్తికంటే దేశాన్నే అధికంగా ప్రేమిస్తాననీ, ఏ దేశభక్తుడికి తాను తీసిపోనని స్పష్టం చేశాడు. అయితే దేశ ప్రజలలో ఒక ప్రధాన మార్గాన్ని అస్పృశ్యులుగా చేసి అవమానించడాన్ని మాత్రం సహించేది లేదన్నాడు.

ఇలా డా. బి.ఆర్. అంబేడ్కర్ జీవన ప్రమాణాన్ని స్పష్టంగా తెలియజేశారు. దళితుల స్థితిగతులను, వారి నడవడికను, నడుచుకోవాల్సిన తీరును స్పష్టంగా తెలుపుతూ, తాను ఎప్పటికి కూడా వ్యక్తికంటే దేశాన్ని అధికంగా ప్రేమిస్తానని ఈ దేశ ప్రజలలో అస్పృశ్యులను అవమానిస్తే మాత్రం ఊరుకునేదిలేదని అంబేడ్కర్ తన వాదాన్ని వివరించారు. డా. బి.ఆర్. అంబేడ్కర్ తాను కలలు కన్న సమాజం నెరవేరాలంటే అంబేడ్కరిష్టులకు ఒక ప్రత్యేక కార్యచరణ అవరసరం అని చెప్పారు భీమన్న.

అంబేడ్కరిజం కార్యరూప ప్రణాళిక :

అంబేడ్కరిజాన్ని కార్యరూపంలో పెట్టడానికి మనం చేపట్టవలసిన సాధనాలు మూడు అని తెలిపారు బోయి భీమన్న అవి. ధర్మం, సంఘం, భీమం. ఇప్పుడున్న యువత ఈ మూడు పద్ధతులు పాటిస్తే అంబేడ్కరిజం ముందుకు నడుస్తుంది అని తెలియజేశారు. కేవలం అంబేడ్కరిష్టులే కాకుండా ప్రతి మానవుడు కూడా ఈ

మూడు ధర్మాలను పాటించాలి అని అంటారు భీమన్న. అందులో 1. ధర్మం అంటే మానవ ధర్మం అని మానవు లంతా ఒకటే అని ప్రతి మానవుడికి అన్ని రకాల వసతులు అందాలనేది మొదటి ధర్మం. 2. సంఘం అంటే ఏక భాష, ఏక సంస్కృతి, ఏక దేశం కలిగిన ఒక మానవ సమూహం. అట్టి మానవ సమూహన్నే సంఘం, జాతి, దేశమని అంటాం. ఆ సంఘంలో కుల, మత, వర్గ భేదాలుండవచ్చు. అవి సాధారణ మానవ హక్కులకు భంగం కలిగించేవిగా వుండకూడదు. ఒకవేళ భంగం కలిగితే అట్టి దానిని అంబేడ్కరిష్టులు ప్రతిఘటించవలసి వుంది. 3. భీమం అంటే ధర్మాన్ని రక్షించడానికి, సంఘంలోని అసమానతలను తొలగించడానికి అనుస రించవలసిన మార్గమే భీమం. భీమం అంటే అంబేడ్కరు మనకిచ్చిన అంబేడ్కరిజం.

ఇలా అంబేడ్కరిజం ఒకకార్యరూపంగా ముందుకు వెళ్ళడానికి ఈ మూడు మార్గాలు ప్రధాన పాత్ర పోషిస్తా యని స్పష్టం చేశారు భీమన్న. ఈ భీమం అనే పదం ఒక యూనిటినికి చిహ్నం అని భీమన్న గారు కూడా 1968 లో రాష్ట్రీయ భీమసేన ను నెలకొల్పారు అని తెలుపుతూ అంబేడ్కర్ ఆశించిన తీరుకు అస్పృశ్యతా సమాజం మారాలంటే యువసేన భీమసేనగా మారాల్సిన అవసరం ఉంది అని తెలిపారు. దీన్ని కేంద్రంగా చేసుకొనే సమతా సైనిక్ దళ్ ఏర్పడింది అని చెప్పవచ్చు.

త్రిజాతి సిద్ధాంతం :

మన దేశానికి సాతంత్ర్యం రాగానే తొలి పంచవర్ష ప్రణాళిక అస్పృశ్యతా నివారణకు కులతత్వ నిర్మూలనకు, బడుగువర్గాల సముద్ధరణకు ఉద్దేశించి రూపొందించబడి వుంటే ఈనాడు దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలు అసలు తలెత్తి ఉండేవి కావు అనే విషయాన్ని స్పష్టం చేశారు. భారతదేశ వ్యాప్తంగా ముస్లింలు, హిందువులు అనే మత పోరులో మెజారిటి ఎక్కువగా ఉన్న ముస్లింలు మాకు ప్రత్యేక దేశం కావాలని పోరాడి ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ముస్లింలను పాలిస్తున్న జిన్నా రెండు జాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పుడు ముస్లింలకు అంటరానితనం లేదు. వాళ్ళే వేరు జాతి అయినప్పుడు అంటరాని తనంలో చస్తూ, హిందూ దేవుళ్ళను కూడా దర్శించే హక్కులేని దళితులు హిందువు లెలా అవుతారు అని మూడు జాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అంబేడ్కర్. ముస్లింలు వేరుపడి ప్రత్యేక దేశంగా ఏర్పడితే బాధలేదు, కాని దళితులు వేరుపడితే మనం ఎవరి మీద అజమాయిషి చెలాయించాలి అని గాంధీ హరిజనులను హిందువులుగానే ఉంచడానికి ఇష్టపడ్డాడు. అలా గాంధీజీ అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా దళితులు అందరూ హిందువులే హరిజనులు అందరూ హరి పిల్లలు (దేవుని పిల్లలే) అనే అంశాన్ని ప్రస్తావిస్తూ దళితులను హిందువులుగా ఉంచడానికి ఆమోదం తెలిపాడు. కాబట్టి దళితులను హిందూ మతం నుండి వేరుచేయలేక తానే బౌద్ధంలోకి వెళ్ళారు డా. బి.ఆర్. అంబేడ్కర్.

రిజర్వేషన్లు తప్పనిసరి :

రిజర్వేషన్లు అనేవి బడుగు బలహీన వర్గాలకు ప్రధాన ఆయుధాలు. వెనుకబడిన కులాలు రిజర్వేషన్ల పొందడం ద్వారానే అన్ని రంగాలలో అందరితో సమానంగా జీవించే అవకాశం లభిస్తుంది. కాబట్టి జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఉండాలనే ఆలోచనతో భారతదేశంలో ఓసి, బి.సి, ఎస్.సి, ఎస్.టి వర్గాలకు రిజర్వేషన్లు అమలవు తున్నాయి. ఈ రిజర్వేషన్ల ప్రతిపాదన అనేది అంబేడ్కర్ గారి దృష్టిలో ఇలా ఉండాలి అని తెలిపారు.

రిజర్వేషన్లు అనేవి సమానత్వాన్ని కోరుతాయి. సమన్యాయం చేకూర్చడం కోసం రిజర్వేషన్లు. దళితులకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల సమన్యాయం జరుగదు. సమన్యాయం జరగాలంటే రిజర్వేషన్లు తప్పనిసరి. రిజర్వేషన్లు అనేవి ఆర్థిక, అసమానతలను కేంద్రంగా చేసుకొని ఏర్పడాలి అని ఒక కుటుంబంలో ఏ సభ్యుడైనా వ్యాధిగ్రస్తుడై మంచానపడితే అతడు తిరిగి ఆరోగ్య వంతుడయ్యే వరకు ఆ కుటుంబమంతా రోగగ్రస్తమైనట్లే

బాధపడుతుంది. ఎంత ఖర్చైనా పెట్టి, ప్రత్యేక చికిత్సలతో ప్రత్యేక ఆహార విహారాలతో ఆ రోగిని త్వరత్వరగా బాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. హిందూ సమాజం అనే కుటుంబంలో అంటరానితనం అలాంటి భయంకర రోగం దానికి ప్రత్యేక చికిత్సలే రిజర్వేషన్లు. రిజర్వేషన్లను నిజాయితిగా అమలు జరపాలి. పబ్లిక్, ప్రైవేటు రంగాలన్నింటికి వర్తింపజేయాలి. రిజర్వేషన్లు రద్దయిన తర్వాత ఇప్పుడున్న నిష్పత్తిలోనే అంతకంటే ఎక్కువగా కూడా దళిత ప్రతినిధులు ఎన్నుకోబడగల స్థాయికి సమాజం ఎదగవలసి ఉంది అని స్పష్టంగా తెలియజేశారు భీమన్న.

దళితులకు బిడియం ఉండకూడదు :

ఆర్థికంగా వెనుకబడిన వారందరు దళితులు. ఈ దళితులకు బిడియం, బానిసత్వం ఉండకూడదు అని తెలియజేసేది అంబేడ్కరిజం. ఈ సమాజంలో అందరూ మానవులే వారి వారి ఆర్థిక విధివిధానాలను బట్టి మానవులలో ధైర్యం చేకూరుతుంది. ఈ సమాజాన్ని పాలించిన వ్యక్తులందరు కూడా కింది వర్గాల నుండి వచ్చినవారే కదా అని అంటూ సవర్ణులు, దళితులు ఒకే జాతికి చెందినవారు అని చరిత్ర చెబుతుంటే ఇంకా ఎందుకు మీరు నమ్మరు అని ప్రశ్నిస్తాడు. మాతంగ, ధర్మవ్యాధుడు, వ్యాసుడు, వాల్మీకి, అరుంధతి, అద్యంతి, అంజన వీరందరు కూడా దళిత కులాలకు చెందినవారు. సవర్ణులు ఎవరూ కూడా దీనిని కాదనడం లేదు కదా. వాస్తవ చరిత్ర చూసినట్లయితే అంజన కుమారుడు హనుమంతుడు. అంజన హరిజనురాలు అయినప్పుడు హనుమంతుడు హరిజనుడు కాదా, వేదవ్యాసుడు అరుంధతికి మునిమనుమడు. అరుందతి దళితురాలు అయినప్పుడు వేదవ్యాసుడు దళితుడు కాదా. వీళ్ళందరు దళితులు అయినప్పుడు మనం కూడా వారితో సమానమే కదా ఆ చరిత్ర చెప్పుకోవడానికి బిడియం, భయం ఎందుకు. ఈ రెండింటిని వదిలేయాలి అప్పుడే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతాం. స్వేచ్ఛగా ప్రశ్నించ గలుగుతాం అంబేద్కరిజం అదే తెలియజేస్తుంది అని అంటారు బోయి భీమన్న.

దాంతో పాటు బోయి భీమన్న అంబేడ్కరిజానికి మత ప్రమేయం వుండకూడదు అనే విషయాన్ని స్పష్టం చేశారు. ఏ వ్యక్తి ఏ మతానికి చెందినా, అంబేడ్కరు లక్ష్యాన్ని ఆమోదించి దాని సిద్ధి కోసం పోరాడాలనుకొన్నవాడు ఏమతం వాడైనా అంబేడ్కరిష్టు కావచ్చు అంటారు

అంబేడ్కర్‌కు మతమూ, దేవుడూ, భక్తి, మోక్షమూ వంటి ఆధ్యాత్మిక విషయాలేవీ ప్రధానం కాదు. ఆయన మతం మారింది కేవలం దళిత జనోద్ధరణ కోసమే. అంబేడ్కరు బౌద్ధాన్ని స్వీకరించడంలో ఒక దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టగలిగాడు. హిందు మతానికి గుణపాఠం నేర్పడం ఒకటి అయితే, హిందూ సమాజం నుండి దూరం కాకుండా దళితుల్ని కాపాడడం మరొకటి. ఒక్క బౌద్ధ మతావలంబనం వల్ల మాత్రమే లభించగల సత్ఫలితాలు ఈ రెండూ అని భీమన్న స్పష్టం చేశాడు. కాబట్టి అంబేడ్కరిజాన్ని నమ్ముకునే వారు ఎవరైనా కుల, మతాలతో సంబంధం లేకుండా పనిచేయవచ్చు అనే విషయాన్ని తేటతెల్ల చేశారు.

అంబేడ్కరిజాన్ని ఇంకా ఎలా అర్థంచేసుకోవాలంటే డా.బి.ఆర్. అంబేడ్కర్ కు బౌద్ధమతం కూడా సంతృప్తిని ఇవ్వలేదు. అందుకే దానిని తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్న ఫలితమే "బుద్ధుడూ అతడి ధర్మమూ" అనే ఆంగ్ల గ్రంథం. ఆ గ్రంథాన్ని నిశితంగా పరిశీలించి చూస్తే అందులోని చాలా విషయాలు డా.బి. ఆర్. అంబేడ్కర్ కు పరిపూర్ణ తృప్తిని ఇవ్వనట్లు కన్పిస్తుంది. అంబేడ్కరుకు సహజ సిద్ధమైన హేతువాదానికి బుద్ధుని ఆచారనియమాలూ, ఆధ్యాత్మిక భావాలు నిలవగలిగి లేవు. నిజంగా అంబేడ్కర్ కొంత కాలం జీవించి ఉంటే తనదైన ఒక కొత్త జీవిత విధానానికి, ఒకకొత్త ఇజానికి రూపం ఇవ్వగలిగేవాడు. ఆ బాధ్యత ఇప్పుడు మేధావులైన అంబేడ్కరీయుల మీద పడింది.

ఇంకో విషయాన్ని కూడా చాలా స్పష్టంగా తెలిపారు బోయి భీమన్న. అస్పృశ్యతను తొలగించి కులవ్యవస్థను నిర్మూలించడం అంబేడ్కరు ప్రధాన లక్ష్యం. అట్టి లక్ష్యాన్ని సాధించడం ఇతరులకు వీలుకాదు. ఈ లక్ష్యసాధనకు నడుంకట్టి నిలబడిపోరాడాలంటే హిందూమతంలో ఉండే పోరాడాలి. హిందువు కానివాడు హిందూమతాన్ని, దానిలోని చెడును విమర్శించడానికి గాని, తిరస్కరించడానికి గాని, సంస్కరించడానికి గారి అర్హుడు కాజాలడు. అది తన సొంత మతమైనప్పుడే దానిలోని లోపాలను సరిదిద్దడానికి అతడు ప్రయత్నించ గలుగుతాడు, పోరాడ గలుగుతాడు. పరాయిమతం వాడికి అలాంటి హక్కుండదు అని తెలిపాడు.

ముగింపు :

ఇలా ఈ గ్రంథం 97 పేజిలతో ముగిస్తు 34 అంశాలతో అంబేడ్కరిజం తెలిపే ప్రాథమిక సూత్రాలను విపులంగా విశ్లేషణాత్మకంగా తెలిపారు. డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఐడియాలజిని అర్థం చేసుకోవాడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక్కడొక వాస్తవాన్ని గుర్తించవలసి వుంది. చివరకు ఒక విషయాన్ని చాలా స్పష్టంగా తెలిపాడు బోయి భీమన్న అంబేడ్కరిజం గురించి. ఇంత కాలమూ పోరాడుకుంటూ వచ్చాం. అంటరానితనం కొంతవరకు పోయినట్టే, కులవ్యవస్థ కూడా తగ్గుముఖం పట్టింది. మరికొంతకాలం పోరాడితే సంపూర్ణ లక్ష్యసిద్ధి చేకూరడం తథ్యం. ఈనాడు ఎక్కడైనా అంటరానితనం పాటించబడుతున్నదంటే, అఘాయిత్యాలు జరపబడుతున్నాయంటే అందుకు ప్రధాన కారణాలు ఆర్థిక పెత్తందారీ తనమూ, రాజకీయ అధికారదాహము మాత్రమే. మత విశ్వాసాలు కాదు. అందుకే అంబేడ్కరిజాన్ని మతంతో ముడి పెట్టవద్దంటున్నాను అని చివరి వాక్యాలను అద్భుతంగా తెలిపారు బోయి భీమన్న.

ముఖ్యంగా అణగారిన పేద ప్రజలు అందరూ కూడా ఈ రచనను ఒక పవిత్ర గ్రంథంగా ప్రతి ఇంట్లో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ గ్రంథం ఆర్థికంగా వెనుకబడిన జాతిని చైతన్యం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను.

❁❁❁

రాగవాసిష్ఠం - పరిచయం

- డా॥. ఎ. ఆంబ్రోజి, తెలుగుశాఖాధ్యక్షురాలు, రాజధాని కళాశాల, చెన్నై.

బోయిభీమన్న 1911 సెప్టెంబర్ 19వ తేది తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురుగ్రామంలో జన్మించారు. ఇతని తండ్రి పుల్లయ్య, తల్లి నాగమ్మ. ఇతనిది ఉపాధ్యాయ వృత్తి. 2005 డిసెంబర్ 16వ తేది మరణించారు. ఇతని వయస్సు 94 సంవత్సరాలు.

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి ఎన్నో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ సన్మానలందుకున్న మహాకవి బోయిభీమన్న.

పేదరికంతో పాటు అంటరానితనం వంటి దురాచారాలు బాల్యం నుంగి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతడు దురాచారాల్ని నిరసించాడు. అంబేద్కర్ వ్రాసిన 'కులనిర్మూలన' పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేశారు.

ఇతను రచించిన 'రాగవాసిష్ఠం' అనే పౌరాణిక సాంఘిక నాటకం ఎంతో ప్రఖ్యాతి గాంచింది. పౌరాణికం, సంఘికం కలకలిసిన నాటకమిది.

హరిజనులు ఆర్యులే, అనే సిద్ధాంతానికి త్రోవ చూపిన వారు శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు. ఆయన మహాకవి, మహాఋషి. ఆయన వ్రాసిన 'నిరుద్ధభారతం' ఆధునిక సాహిత్యంలో మకుటాయమానమైది. ఇది ఒక్క హరిజనులకే భారతజాతి సమైక్యాన్ని కాంక్షించే గ్రంథమిది. నిత్య పారాయణ గ్రంథం ఇది.

తే॥ "వ్యాసముని చంద్రుగన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షియయ్యె
వేశ్యకును పుట్టి మాలెత బెండ్లియాడి
ఆ వసిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె"

తన విద్యార్థి దశలోనే ఈ పద్యం తనలో ఆలోచనను రేకెత్తించినట్లు పేర్కొన్నారు. హరిజనులు ఆర్యులే నన్న భావం ఈ పద్యం ఆధారంగా ఈ 'రాగవాసిష్ఠం' నాటకాన్ని వ్రాయడానికి పురికొల్పిందని పేర్కొన్నారు.

హరిజనులు ఆర్యులే అని రుజువు చేసే ముందు హరిజనులెవరో తెల్పాలని ఆంధ్రదేశంలో ముఖ్యంగా మాల, మాదిగ రెల్లి మొదలైన కులాలను హరిజనులు అని మహాత్ముడు అన్నారు. బోయిభీమన్న ఈ వ్యాసంలో హరిజన శబ్దాన్నే వాడారు.

హైందవ గ్రంథాలలో మాల, మాదిగ, మాతంగ శ్వచ, చండాల శబ్దాలు పర్యాయ పదాలుగా వాడబడ్డాయి. మారన కృతి 'హరిశ్చంద్రోపాఖ్యానం'లో నుంచి ఇందుకు ఒక్క ఉదాహరణను తెల్పారు. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుణ్ణి వీర బాహుడికి అమ్మ చూపినప్పుడు తనను చండాలుడికి అమ్మవద్దని హరిశ్చంద్రుడు బ్రతిమాలాడు.

"కరుణన్ జూడుము, కావు మిప్పుడు త్రిలో
క స్తుత్య చండాల సం
కర దోషమ్మును పొందకుండగ ననున్
గొకొమ్ము నీ బంటుగా....."

అని ఇలా బ్రతిమాలి మ్రొక్కగా, విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడితో....

"------ నను గొల్చు బంటవై
దక్కితిగాన మాలనికి
దక్కగ నమ్మితి నేను నిన్ను" అని ధనం తీసుకుపోయాడు.

ఇందులో మరి ఎక్కువగా వాడబడిన శబ్దం 'చండాల' శబ్దదం. అమరకోశంలో కూడా దీనికి నిర్వచనం వుంది.

"చండాలస్తు జనితో
బ్రాహ్మణ్యాం వృషలే నయ:"

బ్రాహ్మణ స్త్రీకి, శూద్రపురుషునికి పుట్టినవాడు చండాలుడు అని ఉంది.

మనుస్మృతి కూడా ఇదే అర్థాన్ని రూఢిపరుస్తుంది. శూద్రుని వలన వైశ్య స్త్రీకి పుట్టినవాడు అయోగవుడు, క్షత్రియు స్త్రీకి పుట్టినవాడు క్షత్ర, బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు చండాలుడని వీరంతా వర్ణసంకరులని, నాలుగు వర్ణాలలోను ఏవర్ణానికి చెందని వారని పేర్కొన్నారు.

ఆధునిక యుగంలో అట్టి పండితులు తిరిగి ఉద్ఘ వించడం ఆరంభమైంది. రారజారాంమోహనరాయలు, స్వామీ దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, జాతిపిత గాంధీ, అభినవ మనువు అంబేద్కరు, కందుకూరి వీరేశలింగ పంతులు మున్నగు ఎంతో మంది తిరిగి ఆర్య మతోద్ధరణకు కంకణం కట్టుకుని పనిచేశారు. ఆర్య ధర్మ పునర్వికాసానికి దెబ్బకొట్టే విధంగా ప్రవర్తిస్తూ రచనలు సాగిస్తూవున్నా అనేక మంది వైదికాచార ధర్మ పరులైన పెద్దలు, వృద్ధులు, కవులు, యువకులు, నాయకులు ముందుకు వచ్చి ఈనాడు కృణ్వంతో విశ్వమార్యం నినాదాన్ని చేపట్టడం వారందరికి జోహార్లు తెలిపారు.

హరిజనులు ఆర్యులేనని, ఆర్య ద్రావిడ భేదం కూడా కృతకమైందని, నిజమైంది కాదని ద్రావిడులు కూడా ఆర్యులేనని నిరూపించడం కోసమే ఈ నాటకాన్ని రాశానని చెప్పారు.

ఇంత వరకు యోగవాసిష్ఠం, జ్ఞానవాసిష్ఠం గ్రంథా లున్నాయి అందువల్ల ఈ పవిత్ర కల్యాణ గాథకు 'రాగవాసిష్ఠం' అని పేరుపెట్టారు.

ఇది 1959లో రాసిన నాటకం. ఇందులో పాత్రలు అరుంధతి, వసిష్ఠుడు, సంధ్య, పరమశివుడు, ప్రాచీనుడు, శివోహం, కులగిరి, గోప్పాదం, కుంభోదరం. ఇది 12 రంగాల నాటకమిది.

ప్రథమ రంగంలో పాట వినిపిస్తూ వుంటుంది. రంగం వేదవన కీకారణ్యంలో అరుంధతి ఆశ్రమం - ప్రకృతి చాలా దట్టంగా పువ్వులతో వికసిస్తూ వుంది. దూరంగా వినిపిస్తున్న పాట కొంచెం కొంచెంగా దగ్గరవుతూ.... పాడుతూ.... నృత్యం చేసుకుంటూ సధ్యరంగంలోకి ప్రవేశిస్తుంది. ఆమె సీతాకోక చిలుకవలె రమణీయంగా ఉంది. ఆమె నృత్యాన్ని మయూరాలు, గానాన్ని కోకిలలు అనుసరిస్తూ మధ్య మధ్య 'సఖి మేలుకో, సఖి మేలుకో' అని పలుకుతూ నృత్యం చేసుకుంటూ వస్తుండగా బాల ఋషి వసిష్ఠుడు ప్రవేశిస్తాడు. కర్ణపేయంగా సంధ్యను కీర్తిస్తున్న శకుంతగీతాలను ఆకర్షించి ఆస్వాదిస్తాడు.

వసిష్ఠుడు అరుణోదయమున 'మేలుకో' అన్న పాట వినిపించడా అతడు వెనక్కి తిరిగి చూశాడు. ఏమి కనిపించలేదు. ఇంతలో సంధ్య పాడుకుంటూ రంగంలోకి ప్రవేశించింది. వసిష్ఠుడు, తృయుడై ఆమెను చూస్తూ దృక్కుల్ని మరల్చుకోవాలని ప్రయత్నంలో అతడు నిలబడి చూస్తూ ఉండగా ఇంతలో ఎక్కడినుండో 'సంధ్యాను ఏనమయానికా రమణీయ రూపం ధరించి ధరిత్రిని రంజింపచేసే పరాశక్తి అని, ప్రకృతి సౌందర్య రాశిగా పేర్కొన్నారు.

వసిష్ఠుడు సంధ్యా వందనం చేస్తూ ఆ దివ్య సుందరిని తన మన: ఫలకం మీద ముద్రించుకున్నాడు.

ద్వితీయ రంగంలో అరుంధతిని చేతులలో పెట్టుకొని వసిష్ఠుడు ప్రవేశిస్తాడు. ఇరువురి వస్త్రాలు కొంచెం తడిసి వున్నాయి.ర పచ్చికపై పరుండబెట్టి నాడి పరీక్షించాడు. ఇంతలో సంధ్య రెండో ప్రక్క నుంచి పరిగెత్తుకొంటూవచ్చి అక్కా..... అక్కా.... అంటూ వసిష్ఠుణ్ణి చూచి ఆగిపోయింది. సంధ్యతో వసిష్ఠుడు మీ అక్కకేమీ భయం లేదన్నాడు. అరుంధతి పెదవులపై చిరునవ్వు కనబడగానే లేచి నిలబడి సంధ్యను చూచి, అతణ్ణి చూచింది. వసిష్ఠుడు కూడా సమ్మోహితుడై ఆమెను చూస్తున్నాడు. కుమారుల ఋణం తీర్చుకోలేమని, వసిష్ఠునితో నన్ను క్షమించాలని కోరింది.

వసిష్ఠుడు వెళ్లిపోతుంటే అరుంధతి, సంధ్య అతడు వెళ్లిన దారినే చూస్తూ నిలబడిపోతారు. అరుంధతి ఆర్ద్ర

నయనాలను, దివ్య సౌందర్యాన్ని చూచి నాట్యం చేస్తూ సంధ్య ఇలా పాడింది.

"మేలుకో! చెలి మేలుకో
విచ్చినదే తామరసము
త్రచ్చినదే ప్రేమరసము
ముచ్చటగా వెదకి, వెదకి
వెచ్చినదే నీ పెదవికి, మేలుకో చెలి మేలుకో!"

ఈ ద్వితీయ రంగంలో భీమన్న చూసిన ప్రేమానురాగం, వర్ణన ఎంతో అద్భుతంగా వుంది.

తృతీయరంగం. దట్టమైన అరణ్యంలో ఉంది. సూర్యోదయంతో అరణ్యం సద్దుమణిగింది. ఎక్కడి నుంచో ఒకపాట వినిపిస్తుంది. కులగిరి ఏదదో కనిపెట్టినట్లు చూస్తాడు. ఏమి వినిపించదు. వసిష్ఠుడే అదృష్టవంతుడు! అతడి తపస్సు ఫలించిది. రంభనో, ఊర్వశినో కనీసం తిలోత్తమనో సంపాదించుకోలేకపోతే తపస్సెందుకు తగుల బెట్టను?

కొంచెం ముందుకు వచ్చి వసిష్ఠుడు అక్కడే వుంటే బాగుంటుందని అనుకుంటాడు. సంధ్య వార్చి వస్తాడు. ఏమి ఇద్దభోగమని అనుకుంటూ, ఏం చెయ్యాలో తోచక శబ్దం వినిపించిన దిశ ఉంచి ఏదో ఒక మృగం బైటికి వచ్చి కులగిరిని చూచి పారిపోతుంది. "క్కాండ్రుమనే అనుపుతో శివోహం రంగంలోకి దూకుతాడు. కులగిరి కంగారెత్తి గెంతి శివోహాన్నే కౌగలించుంటాడు. శివోహం నీవీ పల్లెకు ఎప్పుడూ రాలేదు, ఇది మాదిగ పల్లె అంటే మాతంగ వాటిక అన్నాడు. శివోహం కొంటెగా నవ్వుతూ అటువెళితే పెద్ద పులిని కట్టేసి వచ్చాను. ఇందాక భయ పెట్టిందదే అని అన్నాడు. కులగిరి పులినోట్లో నన్నా చస్తానుగాని నిన్ను ముట్టుకోనంటాడు.

చతుర్థరంగం వేదవనంలో అరుంధతి ఆశ్రమం ఫలపుష్ప వృక్షాలతో మనోహరంగా వుంది. అతిలోక సౌందర్యవతి అరుంధతి ఆ వృక్ష చ్ఛాయలలో మధుర గానంలో తేలిపోతూ ఉంది. ఇంతలో సంధ్య ప్రవేశిస్తుంది. సంధ్యకు కూడ ఇది అపూర్వ దృశ్యమే. వసిష్ఠుని స్నేహంతో ఈమె పూర్తిగా నూతన వ్యక్తి అయిందని అంటుంది.

అరుంధతి ఒక పువ్వును చూపుతూ దీన్ని చంద్రబింబమనుకుంటున్నావా? కాదు ఇది పువ్వే!

"వర వసంతము లెన్ని వచ్చి పోయెను కాదు?
ఏ ఋతువుతెచ్చెనే ఇంత నూతన శోభ?
ఏ సుధా వర్షధారా సేచనమొ కాని
మార్చివైచిన దావ్రమము నొక్క ప్రొద్దులో!" అని చెప్పింది.

సంధ్య సత్యమే ప్రకృతి కనుగుణంగా నీవు కూడా మారావు అది.

అరుంధతి పుష్పాపచయం చేస్తూ పాడుకుంటూ వెళ్ళిపోతుంది. మరో ప్రక్క నుంచి వసిష్ఠుడు వసంత మధ్యాహ్నాల భోభను

"చింత నిప్పులవోలె వర్షించు చున్న
చండ భానుకరాలు శీర్షమున దాల్చి
ఆశ్రితుల కిందు కలశాల అమృత మొసగు
శివుని దలపించుచున్నవీ చెట్లగములు" ఈ ఆశ్రమం అతడికి రోజు రోజుకు క్రొత్తగా కనిపిస్తుంది.

అరుంధతీ! నిత్యము నిన్ను తన ఒడిలో పెట్టుకొని ముద్దులాడుతున్న ఈ ప్రకృతి ఎంత ధన్యురాలని అంటాడు. వసిష్ఠదడు ఆనందముతో ఆమెను తిలకిస్తాడు. అరంధతి ప్రణమిల్లుతుంది. వసిష్ఠుడు కంపితగాత్రుడై ఆమెను వారించబోతాడు. అరుంధతి అంజలి ఘటించి ఒక ప్రక్కగా నిలబడుతుంది. వసిష్ఠుడు వినమ్రతతో అది మీ ప్రతి బింబమే నని పలికింది. వసిష్ఠుడు జపమాల తీసి అరుంధతి మెడలో వేస్తాడు. వారిద్దరి మీద ఆశ్రమంలోని వృక్షలతాదులన్నీ పుష్పాలు కురిశాయి.

పంచమరంగంలో అరుంధతీ, వసిష్ఠులు కనిపిస్తారు. నాకు నూతన చైతన్యాన్ని, నవనూతన జీవిగా రూపొందిం

చిన నీ ప్రేమ శక్తికి సర్వదా కృతజ్ఞుణ్ణి అని వసిష్ఠుడు పలుకుతాడు. సంధ్య రావడం, సతీసాంబశివుల్లాగా ఉన్నారని, వారికి సంధ్య అంజలి ఘటిస్తుంది. అరుంధతి మీరడిగిన ప్రాత: సంధ్య కాదు ఈ సాయం సంధ్య ఇద్దరూ ఒకే రూపంలో ఉంటుంది. ఉదయం సాయంత్రం వంతులు వేసుకొని ఒకతెనా దగ్గర ఉంటుంది. ఒకతె పితరులను ఎవరెవరో, ఎవరు తెలుసుకోలేరు. సంధ్య మా అక్క మాటలు నమ్మకండి నేనొక్కతెనె ఇద్దరం అనుకుంటుంది.

మనం సంధ్య వార్చి వద్దాం అని అరుంధతి కమండలువు తీసుకుంటుంది. వసిష్ఠుడు పూలసెజ్జ తీసికొని ఇద్దరూ నదీ జలాల దగ్గరకు వెళ్లారు. అరుంధతీ వసిష్ఠులిద్దరూ సంభాషించుకుంటూ పరధ్యానంగా ముందుకు నడుస్తున్నారు.

ఇంతలో అక్కడ సంధ్యావందనం చేస్తూ ప్రాచీనుడు హఠాత్తుగా వారిని చూస్తాడు. ఏమి నాయదృష్టం. నా తపస్సు నేటికి ఫలించింది. సతీసాంబశివులే ప్రత్యక్షమై నారని వారి ముందు సాష్టాంగ పడినాడు. అరుంధతీ వసిష్ఠుడు దిగ్భ్రాంతులైనారు. అతనిని అరుంధతి ఎరుగదు. ఈ ప్రాచీనుడు ఎవరో వసిష్ఠునికి తెలుసు.

వారిద్దరూ ఒకే ఆశ్రమంలో వుంటున్నారు. ప్రాచీనుడు పెద్దవాడు, ఆచారపరుడు, కఠినవ్రతుడు, తీవ్ర మనస్తత్వం కలవాడు, హాస్యాన్ని, అనాచారాన్ని సహించడం అటువంటి వాడితో ఈ సంఘటన! నిజంగా వసిష్ఠునికి పై ప్రాణాలుపైనే పోయాయంటే అతిశయోక్తి కాదు.

మహర్షీ! నేను వసిష్ఠుణ్ణి మీరు నన్ను క్షమించ వలసివుంది. అని పలుకగా ప్రాచీనుడు ఏమిటీ? వసిష్ఠుడా? కాదు కాదు మీరు సాంబశివులే! క్షమాపణ కోరుకుంటున్నాడు.

ప్రాచీనుడు అనుమానంతో నిజమా? నీవు వసిష్ఠుడవే ఈమె ఎవరని అడుగగా వసిష్ఠుడు ఈమె ఒక తాపసకన్య అరుంధతి అని చెప్పాడు.

హరిహరీ! అంటరాని, చూడరాని, చెప్పరాని చండాలకన్యా అంటాడు.

ప్రాచీనా! ప్రాచీనా! అని వసిష్ఠుడు వెర్రిగా అతడి వెంట వెళ్తాడు. అరుంధతీ నిశ్చేష్ఠురాలైపోతుంది. సంధ్య అక్కా! చండాలకన్య కదూ! ఔను చండాల కన్య! అరుంధతివైపు సజల నేత్రాలతో దీక్షగా చూస్తుంది. క్రమంగా సంధ్యారాగం సడిలిపోయి అంధకారం అలము కొంటుంది.

ఆరవరంగంలో వసిష్ఠుని ఆశ్రమం యమునకు కొంచెం దూరం. అరుంధతీ ఆశ్రమంలో వుండే రామణీయకం ఇక్కడ లేదు.

వసిష్ఠుడు చండాల కన్య అన్నవాడే చండాలుడు 'మానవాభ్యుదయమునకిది మంచిదగునె' అని వసిష్ఠుడు అరుంధతిని చండాల కన్య అన్నందులకు, కులం పేరుతో అవమానించిన ప్రాచీనుని తిట్టుకుంటాడు. కులం పేరుతో అవమానించిన ప్రాచీనుడి నాలుక నాలుక కాదు!

వసిష్ఠుడు సంధ్యా నన్ను క్షమించు అంటూ వేగంగా వెళ్లూ కులగిరిని గుద్దుకుంటాడు. కులగిరి, ప్రాచీనుడు, వసిష్ఠుని పండంటి బ్రహ్మవంశంలో మాల కూడు కలిపేస్తున్నావ్! మాదిగ గూడెంలో నేర్పినవేనా? అని మాట్లడటం చండాలినీ స్నేహం, కుల, మత, స్త్రీ, పురుష విభేదాలను ఈ నాటకంలో తెల్పాడు.

కులగిరి -

"జన్మనా జాయతే శూద్ర:
కర్మణా జాయతే ద్విజ:
వేదపారంతు విప్రాణాం
బ్రహ్మ జ్ఞానేన బ్రాహ్మణ:"

వసిష్ఠా! మనం బ్రాహ్మలం! బ్రహ్మజ్ఞానమనే మాటనే ఉచ్చరించడానికి అర్హులు కాని యజ్ఞోపవీత ధారులంతా బ్రాహ్మణులేనా! మహర్షీ! అని హేళన చేస్తాడు.

ఇపుడు నీ నిర్ణయంపైన ఆర్య జాతి భవిష్యత్తు ఆధారపడి ఉంది. నీచ జాతి కన్యతో పవిత్రమైన

ఆర్యజాతిని సంకరం చేసి సర్వనాశనం చేయదలిచావా! అంటూ జాతి భేదాన్ని ఎత్తి చూపాడు ఈ కవి.

సప్తమ రంగంలో కులగిరి, సంధ్య ఒకరినొకరు తిట్టు కుంటారు. సంధ్య కులగిరిని గురువు గారికే పంగనామాలు పెట్టే మోసగాడివని తిడుతుంది. సంధ్య కోపాగ్నిలో కులగిరి అల్లాడిపోతాడు.

అష్టమ రంగంలో వసిష్ఠుడు చింతాక్రాంతుడైవుంటాడు. సంధ్య కంఠస్వరములో కాంతి హెచ్చింది. వసిష్ఠుడు అరుంధతి నా హృదయంలో వుంది. అటువంటి దివ్య శక్తిని ప్రాచీనుడు తూలనాడాడు.

"కాడపై పూవు వాడిపోగలదు కాని,
ఎరలలో తేనె సుఖమును పెంచగలదు
అకట! నన్ను బోలిన అనామకుని పట్ల
ప్రణయ సౌందర్య మెల్ల వ్యర్థమ్ముకాదె?"

ఇలా ఆందోళన పెరిగి వసిష్ఠుడు బెంగగా కనిపిస్తాడు. నాకు కావలిసింది అరుంధతి కాని స్త్రీ కాదు.

నవమరంగంలో వేద పనంలో ప్రకృతి అంతా ఆకులు లేని, పిట్టలులేని ప్రాంతంగా వుంటుంది. శ్లోకాలను వల్లిస్తూ కులగిరి ప్రవేశిస్తూ నిరాశగా ఉంటాడు. వసిష్ఠుడు లేకపోవటం వల్ల ఆశ్రమం దీపం తీసేసిన గదిలా ఉంది. ఈ రంగంలో కులగిరి పాత్ర ఎక్కువగా కని పిస్తుంది. శివోహం కులగిరి కాళ్ళు పట్టుకుంటాడు. కులగిరి తలబాదుకుంటూ "ఓరి భగవంతుడా!" అని అంటాడు. అందుకు శివోహం నన్నే భగవంతు డంటున్నారా! ఇలా ఒకరికొకరికి వాదం పెరుగుతుంది.

ఇందులో వర్ణ భేదం ఎక్కువగా కనిపిస్తుంది. దశమ రంగంలో వసిష్ఠుడు ఆశ్రమాన్ని వదలిపెట్టినది మొదలు అరిష్టాలు మొదలైనాయి. ప్రాచీనుడు తలపాస్తాడు. ఏ సాధుహింస, ఏ పతివ్రతా శాపాగ్ని ఈ ప్రళయాన్ని తెచ్చిపెట్టింది, శ్రీ మహావిష్ణువు దగ్గరకు వెళ్ళిన మహర్షులు రాలేదని, ప్రాచీనుడు వైకుంఠయాత్ర గురించి కులగిరిని అడుగుతాడు. కులగిరి ఆ పట్నం ఎంతో వైభవంగా ఉందని చెబుతాడు.

శివోహం ఒక్కసారికైనా ఆయాశ్రమంలో ప్రవేశించ గూడదు, లాభంలేదు మ పెద్దక్క తపస్సు చేస్తుంది. ప్రాచీనుడు మీ అక్క ధన్యురాలు ఆమెకు పరమేశ్వరుడే దర్శనమివ్వడానికి వస్తున్నాడు.

అరుంధతి తన తపో మహాత్మ్యంతో మా యక్క కాలిపోతున్నదని శివోహం మంటలు వైపుకు పరిగెడతాడు. కులగిరి, ప్రాచీనుడు నిలబడిపోతారు.

ఏకాదశ రంగంలో సరోవర తీరం ప్రకీతి అంతా ఏదో బెంగగా కనిపిస్తుంది. వసిష్ఠుడు మెల్లగా అడుగులు వేసుకుంటూ ప్రవేశిస్తాడు. అరుంధతినిగూర్చిన మనోవ్యధ తనను దగ్గరగా చేరినట్లుంది. అట్టిది సాధ్యమా! అతని పంచప్రాణాలు పంచభూతాలలో చేరి పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నట్లుగా వుంది. నిజంగానే పాట స్పష్టంగా వినిపిస్తుంది. ఇది సంధ్య నివేదనగా, అరుంధతి ఆరాధనగా తలంచబడింది.

"నీవే గతివి - నేవే పతివి -
నిఖిలావనికోదేవా!"

వసిష్ఠుడు సావధానంగా నిట్టూర్పు విడిచి లేచాడు.

అదే సమయానికి పరమ శివుడు ప్రవేశిస్తాడు. అతడు వసిష్ఠుణ్ణి చూచి ఎవరికి మరణం. మరణం గురించి నీనెందుకని మరణాలు అనేక రకాలున్నాయని అంటాడు.

వసిష్ఠుడు నాదారి నాదే అది మీకు అగమ్యం.

తే॥ "పద పదమ్మున కంటక వ్రజము కసుకు
కసుకు దిగుచుండ, కోటి కర్కశ కఠోర
నరకముల బాధతో నేను నడుచు చుంటి
కరుణలేని నిశీధ మార్గమ్మునందు"

అందుకు పరమశివుడు అటువంటి కర్కశ మార్గము నీకెందుకు? నామార్గంలో పాదాం. శాంతికి పూజాగృహం, కాంతికి రాచబాట, క్రాంతికి రంగస్థలం అని వసిష్ఠుని చేయిపట్టుకొని లాగుతాడు. మహాత్మ! మీ స్పర్శ అపూర్వ శక్తిని ప్రసాదించినట్టుంది. నా దారిని నన్ను పోనివ్వండి. బహుశ నీదొక భగ్న ప్రణయ చరిత్ర ఇలా పడద్రోసిన ఆ

కఠినాత్ములాలెవరో! ఆమె కాదు నేనే కఠినాత్ముణ్ణి అని వసిష్ఠుడు చెపుతాడు. నన్ను సర్వనాశనం చేసింది జాత్యంహంకారం.

ద్రావిడులు, ఆర్యులు ఒకే జాతికి చెందినవారు. సోదరు కారా? దితి, అదితుల సంతానం కారా? పెరుగుదలతో పరిసరాల బల్యం మినహాయిస్తే మానవ జాతి అంతా ఒక్కటే కాదా! 'బాలర్షీ' అని అంటాడు. వసిష్ఠుడు అజ్ఞానానికి మించిన పాపం మరేది లేదు. నేనామె క్షమాభిక్షు వేడుకుంటానని అంటాడు.

ఇంతలో గోష్పాదం, కుంభోదరం, కులగిరి, మరి కొందరు ప్రజలు ఆకలి అన్నం అంటూ వస్తారు. పరమ శివుణ్ణి చూచి ఆగుతారు.

పరమశివుడు కలిగిన దానితో సంతృప్తిపడే కష్టజీవులను కరువు బాధించదు. సంధ్య స్వామీ! అతడే ప్రాచీనుడు ఆర్య ధర్మమంతా అతని భుజాలమీద వున్నట్టు ఊహ.

ప్రాచీనుడు - ఒక మాదిగ పిల్ల తపస్సు చెయ్యడం ఎంత విపరీతం. ఇక ఆర్యజాతి అడుక్కుతిన్నట్లే అంటాడు. సంధ్యా, పరమశివులు కనిపిస్తారు. ఆశ్చర్య పోతాడు. అరుంధతీ, వసిష్ఠులనుకుంటాడు. నెత్తిబాదు కుంటాడు. చివరకు ఆ మాదిగ పిల్లనే చేరావా? ఈ ఘోర కవి నేను చూడలేనని అంటాడు. ప్రాచీనుడు అరుంధతి తపో మహాత్మ్యానికి చేతులు మోడ్చి సంధ్య ముందు నడుస్తుంది. పరమశివుని వెనుక ప్రాచీనుడు నడుస్తాడు.

ద్వాదశ రంగంలో - అరుంధతి ఆశ్రమం, అరుంధతి తపస్సు చేస్తూ వుంది. ఆమె చేతిలో వసిష్ఠుని కమం డలువు, జపమాల అలాగే వున్నాయి. ఆమె శరీరం నుంచి తెల్లటి మంటలు పైకి వస్తున్నాయి. అనావృష్టి ఏర్పడి, కరువుగా పర్యవసించింది. శివోహం ఏమితోచక ఒక పాత్రతో నీళ్ళుతీసుకొని అరుంధతి చుట్టూ తిరుగుతాడు. పరమశివుడు కమండలువులోని నీరు తీసి ఇద్దరి మీద చల్లి కల్యాణమస్తు అని దీవిస్తాడు.

ప్రాచీనుడు కూడా పుత్రపౌత్రాభిరస్తు అని దీవిస్తాడు. వసిష్ఠుడు శక్తిరూపిణులారా! నన్ను క్షమించండి. సంధ్య మంగళాభవతు అంటుంది. పరమశివుడు ఇద్దరి చేతులు కలుపుతాడు.

సంధ్య అక్కా! సెలవు ప్రణయ వాల్లభ్యదేవతవై ప్రణవాంశయైన వసిష్ఠుణ్ణి ఏలుకో.

అక్కడకు తిరిగి వచ్చిన శివోహాన్ని అరుంధతి తలని మిరింది. సంధ్యను కౌగిలించుకున్నది. వసిష్ఠుడు శివోహాన్ని సందిట్లోకి తీసుకున్నాడు. తర్వాత అరుంధతీ వసిష్ఠులిద్దరూ పరమశివునికి సాష్టాంగ నమస్కారం చేస్తారు. పరమశివుడు 'సుఖీభవ! శుభం భూయాత్ అని ఆశీర్వ దిస్తాడు.

ఇంతటితో 12 రంగాలతో నిండిన రాగవాసిష్ఠం పౌరాణిక-సాంఘిక నాటకం ముగుస్తుంది. ఇందులో వర్ణనలు, సరోవర, ఉద్యానవన, ప్రకృతి వర్ణనలు ఎంతో సుందరంగా కళ్ళకు కాంతులు విరజిమ్మేలాగా రచయిత వర్ణిస్తాడు. కులనిర్మూలన చక్కగా కళ్ళకు గట్టినట్లు అరుంధతి, వసిష్ఠులను ప్రధాన పాత్రలుగా తీసుకొని మధ్య మధ్య చిన్న చిన్న పాత్రలతో చక్కగా రచించారు.

ముగింపు :

అరుంధతిపై వసిష్ఠుడు చూపించిన ప్రేమానురాగం కారణంగా ఈ నాటకానికి 'రాగవాసిష్ఠం' అని నామకరణం చేశారు భీమన్న. అరుంధతీ వసిష్ఠుల కథ పౌరాణికమైనా అరుంధతీ, వసిష్ఠుల ప్రణయం సంఘానికి సంబంధించి నదే. అందుకే సాంఘిక నాటకమన్నారు.

❁❁❁

బోయి భీమన్న కవిత్వం – హేతువాదం

– డా॥. దొర్లపూడి శివరామకృష్ణ , తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పొందూరు.

"హేతువాది కానట్టి వాడెవ్వడేని
కారు మేధావి మేధావి కానివాడు
హేతువాదియుకాడు ఈ జాతిలోన
ఈ పరీక్షకు నిల్చున్నవాడెవడు లేడు" అని బోయి భీమన్నగారే పేర్కొన్నారు. హేతువాది ఎవడు అనేది కూడా అయన స్పష్టంగానే చెప్పారు.

అసలు హేతువాదమంటే ఏమిటి అనేది కూడా వర్తమానం ఓ చర్చనీయాంశమే. ప్రతిదానికి కారణాన్ని సాక్ష్యాన్ని అన్వేషించడమే హేతువాదం(రేషనలిజం). కారణమే జ్ఞానానికి మూలం అని హేతువాదులు విశ్వసిస్తారు. కారణం లేని దేనిని నమ్మరు. 19 వ శతాబ్దం నుంచి 'ఫ్రీథాట్' పేరుతో హేతువాదులు ఈ సంప్ర దాయాన్ని కొనసాగిస్తున్నారు. సమాజపరమైన మార్పులలో ఈ రేషనలిజం గట్టిగా కనిపించింది. 1931 ప్రాంతంలో బీజాలు పడినా (అంతకుముందు 1917 లోనే జస్టిస్ పార్టీ ఇందుకు కృషి చేసిందనే ఆధారాలున్నాయి) త్రిపురనేని (1887-1943) తాపీ ధర్మారావు, గో.రా. ఆవుల గోపాల కృష్ణమూర్తి, నార్ల వెంకటేశ్వరరావు, కట్టమంచి తదితరులు సాహిత్యంలో హేతువాదమును ప్రవేశపెట్టి రచనలు చేసి సామాజిక మార్పులకు పునాదులు వేసారు. 1940లో గో.రా. ముదునూరులో నాస్తిక కేంద్రం ప్రారంభించడంలో హేతువాదం ఉద్యమ రూపం దాల్చింది.

ఈ ఉద్యమ ప్రభావంతో, స్వీయానుభావాలలో ఎంతోమంది కవులు తమ రచనలను హేతువాదం ఓ వేదికగా చేసుకొన్నారు. మతం, కులం వంటి మనుషుల మధ్య మానవీయ విలువలు లుప్తం కావడానికి కారణమవుతున్నాయని భావించారు. ఆ దిశగా సామాజిక సంస్కరణకు సాహిత్యం ఓ ఆయుధమనుకున్నారు. మానవజాతి బాగుపడాలంటే మతం పట్టునుంచి విమోచన పొందాలని భీమన్నగారు నినదించారు. ఆ దిశగానే తమ రచనలను కొనసాగించారు.

'హేతువాదము పేరునూ రేగుకొండ
రజ్జులైనన్ను నిందించినందువలన
అట్టినిందను నిరసింతుకాని
సహజ హేతువులో నాడు స్పర్ధ లేదు' అంటరాయన. మరో సందర్భంలో అసలు హేతు వంటే ఏమిటని ప్రశ్నిస్తూనే. సమాధానంగా

నిజమునకు హేతువనమేమి? నీతి విరిచి
జాతి నిర్వీర్యమై దిగజారువేళ
హెచ్చరిక చేయునట్టిదే హేతువనగ

హెచ్చిరచ్చించు నాతడే హేతువాది ' అని నిష్కర్షగా చెప్పారు. అంతేకాదు.. " ధైర్యశాలి, క్రియాశీలి అయిన ఉత్తమోత్తమ హేతువాదే భగవంతుడన్నారని నా ఉద్దేశ్య' మని కూడా ప్రకటించారు. ఎంతో వ్యంగ్యాత్మకంగా అయన 'పిల్లి శతకాన్ని'హాస్యకావ్యంగా మలిచారు. పిల్లి మీదనున్న సామెతలను అయన ఈ కావ్యంలో హాస్యంగా వాడుకున్నారు. పిల్లి ఎదురైతే అనుభవమనే వారికి చెంపపెట్టుగా పిల్లిని చంకన వేసుకొని ఢిల్లీ వరకు వెళ్ళ వచ్చని చెబుతారు. అలా పిల్లితో వెళ్ళి కళాప్రపూర్ణ అందుకున్నానని తన అనుభవాన్ని కూడా చెప్పారు. తన ఇష్టదైవంగా పిల్లినే ఎంచుకున్నానన్నారు. దానిమీద ప్రార్ధనలు కూడా చేసానన్నారు. పిల్లి శతకంలో ఫలాశృతి ఆశీస్సులు కూడా వ్రాసారు. ఈ శతక రచన ద్వారా సమాజంలోని మూఢ నమ్మకాలను అపహాస్యం చేస్తూ తన హేతువాద ధృక్పథాన్ని చాటుకున్నారు.

కర్మయు క్రియమునెచాలను
ధర్మము కొనసాగ కర్తదర్శన మేలా
చర్మక్షుల కనువైదిక
మర్మము మా కిడెడు నీదె మహిమము పిల్లీ'

అవి వైదిక తత్వాన్ని అన్యోపదేశంగా సూచిస్తారు. 'మట్టి కదా నరుని మెదడు మహిమహో అని ముక్తాయిస్తారు. మూడున్నర దశాబ్దాల క్రితమే రిజర్వేషన్లు ఇంకెంతకాలమో ఉండవన్నారు. కాని,, వర్తమానంలో ఇందుకు భిన్న దృశ్యమే గోచరమవుతున్నది. తన అనుభవాలను మేళవించి ఆయన తన అభిప్రాయంగా

మతములు, నీతులు, శాసన
శతకమ్ములు, గుడులు, నుడులు, స్వర్గ నరకములు
మతిమంతులు బ్రతుకటకై

మతిహీనులు దోచుకొనెడి మార్గములు సుడి అన్నారు. 'రాగవాసిష్టం' 'ఆది కవి వాల్మీకి' 'అశోకవనిలో రాముడు' 'మణిమానడం వంటి రచనల్లో బోయి భీమన్నగా హేతు వాద దృష్టి హెచ్చుగానే కనిపిస్తుంది. కులమతాల మానవుడి కుట్రలో భాగ మంటారు. ఇక్కడ భీమన్నగారు ఎత్తుకున్న కులవ్యవస్థ పై తిరుగుబాటు కుట్రదారుల వేళ్ళతో వారే కళ్ళు పొడుచుకున్న విధంగా చేసిన వర్ణనలు అద్భుతం. వారి రచనా శైలికి ఓ అపురూప దర్పణం. జననంతో ఎవరి బతుకులు ఈ కులంలో ముడి పడవని చెబుతూ ఉదాహరణగా ఓ సంస్కృతి శ్లోకంను చెబుతారు.

'గణికా గర్భసంభూతో
వసిష్ఠశ్చ మహాముని:
తపసా బ్రాహ్మణో జాతః

సంస్కార, తత్రకారణం వేశ్య కడుపున పుట్టిన వశిష్ఠుడు సంస్కారం చేతనే బ్రాహ్మణుడయ్యాడంటారు. కులంచేత కాదు కదా అని ప్రశ్నిస్తారు. మతాలు, కులాలు లేవని మానవజాతికి ఒక్కటేనని హితబోధ చేస్తూ

వేదోక్త, మ్మిది సర్పజాతి సమతా
విష్కార తత్వమ్ము ; బ్రా
హ్మా దైవత్వము నొంది సాగు డొకటై
మేధావుల్ ఎల్లరున్

అయితే బోయి భీమన్నగారు సంఘ సంస్కరాణభి లాషతో కూడిన మానవతావాదం; జాతీయవాదతత్వం మద్య గందరగోళం ఆయన రచనల్లో కనిపిస్తుందనే సాహితీ విమర్శకులున్నారు. ముఖ్యంగా గుడిసెలు కాలిపోతున్నై 'కావ్యం'ను వెంకటస్వామిగారిని హేతువాదని అంకితమివ్వటం వంటివి ఉదాహరణలుగా వివరిస్తారు. కాని.. భీమన్నగారు తన ప్రతీ రచనలోనూ తన నిబద్ధతను శతశాతం ప్రస్పుటింపజేసారు. పద్యం, గద్యం, వచనం ఏది రాసినా సరే హేతువాద దృష్టిని విడనాడలేదు. తనను తానే తానెమిటో కూడా చెప్పకున్నారు నిజాయితీగా రచనలు చేసిన అరుదైన కవులలో బోయి భీమన్యగారిది అగ్రస్థానం. ఆయన మాటల్లోనే చెప్పాలంటే

'నా జీవితం ఒక తెలుగు కావ్యం,
గతానుగతికమే కాదు
వట్టి అచ్చుతప్పుల తరిక కూడ,
తప్పొప్పుల పట్టిక లేదు'

కులమతాలు లేవని భీమన్నగారు ధృఢంగానే చెప్పారు. తన కష్టాలు, కన్నీళ్ళు, అనుభవాలు తానే చెప్పటంలో సాహితీపరమైన స్వచ్ఛతను ఇవ్వగలిగారు. తన కష్టాలు వర్గ, వర్ణ వివక్షతలు తమ వర్గం వారే కాక ఎవరూ చేసినా నిరాకరించకూడదనే సృహను కూడా తెలిపారు. ఆయనే ఒక చోట ఇలా అంటారు..

'వినదగు నెవ్వరు చెప్పిన
విని ఆ చెప్పిన యతండు వేరే కులమా
మన కులమా అని చూడక
మనిషిని గుర్తించువాడే మనుజుడు పిల్లీ'

ఇది ఆయన హేతువాద దృక్పధానికి పరాకాష్ఠం.

ఆధార గ్రంథాలు :

1. 'పిల్లి శతకం' ' గుడిసెలు కాలిపోతున్నై' - బోయి భీమన్న
2. వ్యాస సంకలనం - తెలుగు విశ్వవిద్యాలయం, ప్రచురణ

"అకాండ తాండవం" కావ్యంలో బోయి భీమన్న ఆధ్యాత్మిక చింతన

– డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి , అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల కరీంనగర్, తెలంగాణ.

అంగికం భువనం యస్య వాచికం సర్వ వాఙ్మయం
ఆహార్యం చంద్రతారాదితం వందే సాత్వికం శివం

ఇది పరమాత్మ విశ్వరూపం. దీన్నే బోయి భీమన్న "అకాండ తాండవం" పేరుతో గేయ కావ్యంగా రాసాడు. పయనమై నీ మార్గమందే .... నాబాట నీతో చేరిపోనీ అంటూ శివుని కదలికలే సృష్టిగా, భంగిమలే జీవరాసులుగా భావించి స్వీయ అనుభవంతో రాసిన కావ్యం ఇది. భీమన్న కవితలలో శివుడు కొలువై, శివుని శిరముపై గంగుంటే, ఆ గంగే పొంగగా నలిల ధారలు ఇలాతలముపై తలోపాయగా ప్రవహించి, కవితల కొలనులో అక్షర అలలై కమ్మని భావామృతంగా శివుని నాట్యం జాలువారింది. సంపూర్ణ హిందూ సమాజంలో సమరస భావ వికాసమే బోయి భీమన్న కవిస్వప్నం. బోయి భీమన్న ఈ కావ్యంలో 189 గేయ ఖండికలను శివ నర్తనలోని గజ్జెలకు ప్రతీకగా తీసుకున్నాడు. శివుడి తాండవమే ఇతివృత్తంగా సాగిన ఈ కావ్యం మానవ అంతరంగం, దాని స్వభావం, అందులోని గుణ లేశ వర్ణన ఇందులో ప్రధానాంశంగా కనిపిస్తుంది. ఇందులోని గేయ ఖండికలను శివుని కాలి గజ్జెలుగా భావించి 'అకాండ తాండవం' గేయ కావ్యాన్ని 1966లో వెలువరించాడు. ఈ గేయ ఖండికలు 1960లో 'ఆరాధన' పత్రికలో ధారావాహికగా ప్రచురింపబడ్డాయి. ఈ కావ్యంలో ప్రకృతిని శివుని తాండవానికి ప్రతీకగా చూపించాడు. ఇందులో మానవుడు దారితప్పి తోటి మనిషికి మరియు ప్రకృతికి చేస్తున్న విధ్వంసాన్ని ఆపాలాని, సర్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందించుకోవాలని ప్రబోధించాడు. మనిషి మానవతా విలువలు పెంపొందించుకొని, ఆధ్యాత్మిక చింతనలో నడుస్తూ శివైక్యం చెందాలని సూచించాడు. శివుని నృత్యాన్ని నిత్య ప్రగతిగా భావించాడు. దీనికి ప్రతిగా మానవుడు అజ్ఞానాంధకారం ఆవహించి ఈశ్వరుడు అసత్యమని, తానే సర్వస్వమని నమ్ముతున్నాడు. ధనకాంక్ష, అధికార వ్యామోహంలో పడి సాటిమనిషిని హింసిస్తూ తను సాధించేదే ప్రగతని నమ్ముతున్నాడు. రాతికోటలు కట్టుకొని తానే రాజునని ప్రకటించుకున్నాడు. అణుబాంబులు సృష్టించి భూమండలాన్ని యుద్ధభూమిగా మార్చాడు. ఇలాంటి ప్రగతి అభ్యుదయం అనిపించుకోదని కవి ఈ కావ్యం ద్వారా స్పష్టం చేయదలుచుకున్నాడు. అందుకే మనిషి ప్రకృతిని జయించాలనే ఆకాంక్షతో ఇతరులను హింసించకుండా సాటివారి హృదయాన్ని గెలుచుకోవాలంటాడు. స్వార్థం వీడి తనలో ప్రేమతత్వం నింపుకున్నప్పుడే విశ్వ ప్రేమికుడు అవుతాడని ప్రబోధించాడు. స్వార్థపూరిత మాయ ఆవహించిన మనిషి లౌకిక భ్రాంతిలో పడి మనస్సును జయించలేక బలహీనపడిపోయాడంటాడు. తనకు సర్వం తెలుసుననే అహంకారంతో మానవుడు నేనే ఈ విధి కంతకు యజమానినని గర్విస్తున్నాడు. నిజమైన మనిషి అశాశ్వతమైన ఐహికానందాలు వదిలి ఇహములోనే పరము సాధించాలంటాడు. అది సాధించాలంటే సర్వమూ ఈశ్వర సంకల్పంగా భావించి శివైక్యం పొందడమే మనిషి కర్తవ్యమని బోధించాడు. భీమన్న ఈ కావ్యంలో ప్రకృతిలోని సహజ సౌందర్యమంతా శివమయం అంటాడు. సర్వమానవ సౌభ్రాతృత్వానికి, లోక కల్యాణానికి, బ్రహ్మానందమే పరమావధిగా నృత్య, సంగీత, సాహిత్యంలు తానై శివుడు నిత్యం తాండవం చేస్తున్నాడు. ఆ తాండవఖేలి నుండి వెలువడిన ధూళికణాలే మానవులకు ప్రతీకలుగా భీమన్న మనిషికి శివునికి అభేదం చెప్పాడు. మనిషి తానే శివుడు, శివుడే తాననే భావన గల్గినవాడు తోటి వారిని శివస్వరూపంగా భావిస్తాడు. తోటివారి ఆనందానుభూతులు తనవిగా భావిస్తాడు. ఈ విధంగా

శివతాండవంలో కలిసిపోయి శాశ్వతానందం పొందడమే మనిషి లక్ష్యమనే అద్వైత భావన కల్పించాడు. మనిషి ఆంతర్ముఖుడై ఆత్మను దర్శించుకోవాలి. ఆత్మ ప్రకాశం పెంపొందించుకున్నప్పుడే తన్ను ఆవహించిన అజ్ఞానాంధ కారం తొలగిపోతుంది.

సాధునిర్మితమెల్ల సంస్కృతి సాధు
చోదితమెల్ల ప్రగతి సాధు జీవన

సాధనమే శివనన్నిధికి చేర్చు మార్గము. కాబట్టి మానవుడు సత్వగుణాన్ని అలవర్చుకొని లోకకల్యాణానికి తోడ్పడాలని భీమన్న ఉద్బోధించాడు. మనిషివేసే ప్రతి అడుగు తనను సంస్కారవంతున్ని చేయాలి. సమాజాన్ని సన్మార్గంలో నడిపించాలి. అప్పుడే ఈ జన్మకు సాఫల్యం సిద్ధిస్తుంది.

చేసితిని రాకెట్లనందువు
చేయగలవా చిన్న చీమను?
బొమ్మరిండ్లను గట్టి, నేనే
బ్రహ్మనను కొనుటేమిలాభం?

మనవాభ్యుదయమే నిజమైన ప్రగతి దానికోసం అహర్నిశలు పాటుపడాలి. వేసే ప్రతిఅడుగు లోక ప్రగతికి సోపానం కావాలని ఆకాంక్షించాడు. శివునికి అందరూ సమానులే నీవొకండవు కావు శివునకు జీవులెల్లను ప్రియతనూజులే. గొప్పల కోసం పాకులాడే వాడు చావు తప్పించుకోగలడా? తోటివారికి ప్రయోజనం కలిగించలేని వాడు ఆకాశ గమనం చేసినా, గ్రహాంతరవాసం చేసినా గొప్పవాడవుతాడా? అంటూ భీమన్న సూటిగా ప్రశ్నిస్తాడు. ఒకరి తలలోని పేను మరొకరి తలలోకి ఎక్కినట్లు గ్రహాంతరయాత్ర కూడా అంతకన్న గొప్ప ప్రయాణమేమి కాదంటాడు. మనిషనే వాడు సృష్టిలోని అన్ని ప్రాణులను సమానంగా భావించి దైవత్వాన్ని పొందాలని ఈ కావ్యం ద్వారా ఉపదేశం ఇచ్చాడు. భీమన్న శివున్ని తన మనోరంగంలో నిరంతరం నర్తించే నర్తకుడిగా భావిస్తూ ఈ కావ్యాన్ని ఒక భావనాశిల్పంగా తీర్చి దిద్దాడు. అందుకే ప్రతివాడు శివతత్వాన్ని బయటెక్కడో కాకుండా తన అంతరంగంలో వెతకాలంటాడు.

అంబుజమదే విరిసియున్నది
అంధుడా! నీ ఇంటిముందే
మందుడా! నీచుట్టు ఇదిగో
మధుర నృత్య వసంతకేళి!

ఈ సృష్టి సౌందర్యరహస్యం నీలోనే ఉంది దర్శించ మంటాడు. మనుషులో ప్రేమతత్వం పెంపొందించే భావజాలం అంతర్లీనంగా ఈ కావ్యంలో అడుగడుగునా కానిపిస్తూంటుంది. భీమన్న శ్రమదోపిడిని నిరసిస్తూ స్వయం కృషితో పైకెదగాలంటాడు. అంతా శివైక్యమైన ఈ ప్రకృతిలో ఏదీ ఎవరి సొంతం కాదు. ప్రపంచమనే నాటక రంగంలో సూత్ర దారుడైన శివుడు నిర్దేశించిన పాత్ర మనం పోషించాలి. అంతే కాని సర్వం నాదేననే స్వార్థంతో తోటి వారికి కష్టం కలిగించరాదంటాడు. అలలపై లీలావిహారం చేసే నీటిబుడగల లాంటివి బ్రతుకులు. వీటిని పాత్రలు చేసి ఆడించేదే శివలీలా విలాసం. దీని అంతరార్థం ఎరిగి సుఖదుఃఖాలకతీతమైన జీవనం కొనసాగించాలి. ప్రకృతి నిన్నును, నీవు ప్రకృతిని ప్రగతిలో నడిపించినప్పుడే ప్రకృతే పార్వతి యౌనురా! పరమ శివుడు నీవురా! అంటూ అర్ధనారీశ్వర తత్వంలోని అంతరార్థం వివరించి చెప్పాడు. విశ్వవ్యాప్తమైన ఆ పరమ శివునిలో ఐక్యం కావడమే జీవుని పరమ లక్ష్యమనే సిద్ధాంతం ఈ కావ్యం ద్వారా రుజువు చేసాడు. మనిషి శివైక్యం చెందాలంటే స్వార్థం వీడాలి. స్వార్థం వీడిన నాడే సమాజ ప్రగతిని సాధించగలదు. అదే సర్వమానవ సమానత్వం, సామాజికాభివృద్ధి సాధించే నిజమైన మార్గమని భీమన్న తన శివతత్వాన్ని ఈ కావ్యంలో అంతర్లయగా ధ్వనింపచేశాడు. లౌకిక బంధాలు మనిషిని బలహీన పరుస్తాయి. తను సుఖదుఃఖాలకతీతుడు కావాలంటే శివైక్యం పొందాలి. అదే నిజమైన మోక్షమార్గం. శివైక్యం పొందడమంటే తనలో తాను ఐక్యం కావడమే. తన అంతరంగ జీవిత అంతరార్థం తెలుసుకోవడమే. నీ

విలాసము నుండి ఎగసి శివున్ని చేరుటే జీవ ధర్మమంటూ మనిషి జీవిత పరమార్థాన్ని బోధించాడు. నిరంతర ప్రగతికి ప్రతీకయైన శివుడు ఆటను ఆపేస్తే అది యుగాంతమేనని ఊహించాడు. శివుని పాదరేణువైన జీవుడు సత్యాన్ని మరిచి తానే సర్వస్వమనే గర్వాన్ని పొంది తన వినాశనానికి తానే కారణమవుతున్నాడు. యుద్ధోన్మాదియైన మానవుని శివుడు సహించలేడు.

అర్ధనారీశ్వరుడు తన స
ర్వార్ధ సృజనోన్మాట్య కళలో
ఓర్వగలడా? రణోద్యోగీ!
ఓ నియంతా! నీ దురంత!

కత్తి పట్టిన చేత్తోనే కలంపట్టి భుజబలాన్ని బుద్ధిబలంగా మార్చి సాటి వారికి తోడ్పడితేనే శివుడు సంతోషిస్తాడు. పుట్టిన ప్రతీ ప్రాణి గిట్టక మానదు. అలాంటి వారిని పనిగట్టుకొని చంపడం దేనికి, యుద్ధంలో మరణించినవారి సమాధులపై విజయ పతాకం ఎగరేసినా అది శాశ్వతం కాదు. మళ్లీ ఇంకొకడెవడో అదే ప్రయత్నం చేస్తాడు.

తమ్మితోటల నిప్పుకణములు చిమ్మబోకుము, క్రూరుడా! తపము చేయర మనుజుడా! ఆత్మ ప్రకాశం పెంచుకోరా! అంటూ శాంతి మంత్రాన్ని ప్రభోదిస్తాడు. రాజ్యకాంక్ష, పదవీకాంక్ష, స్వార్థపరత్వం వీడి ధర్మ సంస్థాపన చేయాలని సూచించాడు. దాని కోసం మనిషి తన్నావహించిన తమస్సు తొలగించుకొని జ్ఞానవంతుడు కావాలని, ఆ జ్ఞానాన్ని కలిగించేదే నిజమైన సాహిత్యమని నిరూపించాడు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మనిషి వినాశనానికే కారణమవుతుంది తప్ప ప్రగతికి కాదు, ఏ సిద్ధాంతమైనా మనిషి మనుగడకు తోడ్పడాలంటాడు. దానికోసం సర్వం శివమయంగా భావించి మృత్యుం జయునిలా సాగిపోవాలంటాడు. ప్రాణికోటిలో సర్వోన్నతు డైన మనిషే స్వార్థంతో కులమతాల అడ్డుగోడలు సృష్టించుకున్నాడు. సమన్వయం సాధించాల్సిన మనిషే సమస్యలు సృష్టిస్తున్నాడు. సృష్టి చేయలేని వాడికి వినాశం చేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నిస్తాడు. మృత్యువు శాశ్వతమైంది. శరీరం అశాశ్వతం. ఈ సత్యం తెలిసినవాడు లోభమోహాలను త్యజించి శివసన్నిధి చేరడమే పరమావధిగా బ్రతకాలి. మనో నేత్రాన్ని తెరచి శివ మార్గం కనుక్కోవాలి. తానే వెలుగై ఇతరులకు కూడా దారి చూపించాలి. చీకటితో నిండిన ఈ సృష్టికి వెలుగే శివుడు. అది తెలుసుకోవడమే జ్ఞానం. కంటికి కనిపించే ఈ జాగత్తంతా మిథ్య. శివతత్వమే నిజం అందులో ఐక్యం చెందడమే పరమ లక్ష్యంగా ఎన్ని అడ్డంకులేదురైనా ముందుకు సాగిపోవాలనే తత్వాన్ని ప్రబోధించాడు.

భీమన్న అకాండ తాండవం కావ్యంలో తాత్విక చింతన, సృష్టి ధర్మం, ప్రకృతి సహజగుణం అడుగడుగునా కన్పిస్తుంటాయి. ప్రతివాడు వాటిని దర్శించాలని కవి సూచించాడు. పాడే కోయిలకు జగత్తంతా ప్రేమ మయంగా కనిపిస్తే, వాడిగోళ్లు గల డేగకు యుద్ధరంగమే కనిపిస్తుంది. కళాహృదయంగల మానవుడు విశ్వజనీనమైన ప్రేమను అలవర్చుకొని శివరూపమై భాసించాలని ఈ కావ్యంద్వారా భీమన్న జ్ఞాన వెలుగును ప్రసాదించాడు. భీమన్న లోకంలోని అన్యాయం మీద, మనిషిలోని స్వార్థ బుద్ధిమీద, దోపిడీ స్వభావం మీద చేసిన 'అకాండ తాండవం' ఈ కావ్యం.

శక్తి కొలదిగ కష్టపడుచు
చాలినంతగ అనుభవించుచు
ఎవనిమట్టుకు వాడు బ్రతికిన
ఇలకు స్వర్గమె దిగదటోయ్

అన్న విశ్వాసంతో ఈ కావ్యాన్ని నడిపించాడు. శివుని డమరుకం లయలకు నాట్యం చేస్తూ బ్రహ్మానందంతో శివునిలో తాదాత్మ్యం పొందుతూ ఇహమే కైలాసంగా మనుజుడే శివుడై నర్తించాలంటాడు. గజ్జె విప్పుకు, కాంతి తీయకు గానమాపకు బ్రతుకు పాడవున అంటూ భూలోకాన్నే కైలాసంగా మార్చాలని బోయి భీమన్న "అకాండ తాండవం" కావ్యంలో ఆకాంక్షించాడు.

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న, తెలంగాణ సారస్వత పరిషత్ (పరణీత వాణి ప్రసంగం), 23-2-1995
2. సంపూర్ణ హిందూ సమాజంలో సమరస భావ వికాసమే బోయి భీమన్న కవి స్వప్నం, శ్యామ్ ప్రసాద్ రెడ్డి కొర్శిపాటి, విశ్వ సంవాద కేంద్ర, ఆంధ్రప్రదేశ్, 19 సెప్టెంబెర్, 2021.
3. అకాండ తాండవం, బోయి భీమన్న, సుఖేలా ప్రచురణ, 1966.
4. బోయి భీమన్న కవిత్వం - వస్తు వైవిధ్యం, ఆచార్య కాత్యాయనీ విద్మహే, నీలీరాగం, సాహిత్యవ్యాసాలు, కొలిమి, ప్రత్యామ్నాయ కళా సాహిత్య సాంస్కృతిక వేదిక, జూలై, 2020.
5. అకాండ తాండవం, బోయి భీమన్న, కవితా విశ్లేషణ, ఆచార్య బి.రుక్మిణి, ఆధునిక కవిత్వం, SDLCE, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, 2008.
6. భీమన్న భావవిప్లవం, ఆచార్య వెలిమల సిమ్మన్న, ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, 19, సెప్టెంబర్, 2013.
7. బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు 7 వ సంపుటి, డా. సి. నారాయణరెడ్డి (ప్ర. సం.) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు, 1992.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న - అంబేద్కరిజం

- డా॥. జి. దయామణి, అతిధిఅధ్యాపకులు, తెలుగుశాఖ, రాణిమేరికళాశాల, చెన్నై - 04

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి బోయి భీమన్న. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మించి గౌరవ సన్మానాలందుకున్న కవి బోయి భీమన్న. పేదరికంతో పాటు అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటి నుండి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతను వీటిని నిరసించాడు. కులం, మతం, పదవీ రాజకీయం ఈ మూడే మానవజాతిని తెలియ కుండా తినేస్తున్న విషక్రిములు, వాటి నిర్మూలించకుండా మానవజాతి ముందుకు నడువజాలదని తన విశ్వాసం అని తెలిపారు.

మానవ చరిత్రను పరిశీలించి చూస్తే అనాది నుంచి మనకు తెలియకుండానే కొన్ని కొన్ని అపాచారాలు, అపోహలు మనల్ని అంటుకొని వస్తూ వుండడం కని పిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక చోట ఆగి, సింహావలోకనం చేసుకొని, పున:పరిశీలన జరిపి, అవసర మైన ఆచారాలను వుంచుకొని, పనికిరానివాటినీ, కాల దోషం పట్టిన వాటిని విసర్జించి పారవేస్తూ వుండాలి. లేకపోతే మానవజీవితం ఒక శవ పేటికగానో మురికి గుంటగానో, ఒక కీకారణ్యంగానో తయారైపోతుంది.

సమానత్వం అంటే సమాన పరిస్థితులలో సమానత్వం కావాలి. పైన మేడ మీద వాళ్ళను, క్రింద వున్న వాళ్ళను ఎక్కడి వాళ్ళను అక్కడనే వుంచి అందరూ సమానమే అంటే కుదరదు. మేడమీద వాళ్ళను, క్రిందికైన దించాలి. లేదా క్రింద వారిని మేడ మీదకైన చేర్చాలి. లేకపోతే వాళ్ళను వీళ్ళను ఆ మధ్యలో ఒక సమ ప్రాంతంలోనైనా నిలపాలి. మొత్తం మీద పై వాళ్ళను క్రింద వాళ్ళకు కలిపి ఒకే సమాన స్థితిగతులను సమకూర్చుకుండా సమానత్వం ఏర్పడదని దానికి రిజర్వేషనులు తప్పక అవసరమని జస్టీస్ పతంజలిగారు చెబుతున్నారు.

కాబట్టి దేశంలో 1) చదువు పరంగాను, 2) ఉద్యోగ పరంగాను, 3) సమాజపరంగాను, 4)రాజకీయ పరంగాను రిజర్వేషనులు అన్ని రంగాలలోను కావాలి అని అంబేద్కరు పాటుపడ్డారు. తన జీవిత సర్వస్వాన్ని, తన బుద్ధి జ్ఞాన వైరాగ్యాలన్నింటీని లక్ష్య సాధనకోసం వినియోగించాడు. ఈ లక్ష్యసాధనకు అవలంభించిన విధానమే అంబేద్కరిజం.

అంబేద్కరిజం లక్ష్యం అస్పృశ్యతా నిర్మూలనం మాత్రం కాదు. ఒక దురాచారాన్ని తొలగించే సంస్కర ణోద్యమం కర్త మాత్రమే కాకుండా అంతకు మించిన ఉన్నతాశయుడు, బహువిధకార్యసాధకుడు. సర్వతో ముఖ వికాస భాస్కరుడు.

చదువుపరంగా చూచినట్లయితే..

అహింస సహజమైనదికాదు. హింస చెయ్యకుండ వుండడం సాధ్యం కాదని కృతయుగంలోనే ధర్మవ్యాధుడు హేతుబద్ధంగా పేర్కొనివున్నాడు. అహింసా సిద్ధాంతం అసహజమంటూ దానిని వ్యతిరేకించిన తొలి విప్లవ కారుడు ధర్మవ్యాధుడు.

"అహింస పరమధర్మం" అనే సూక్తి యొక్క విలువ చెప్పడం వరకే, చెయ్యడానికి పనికిరాదు. బలం కల వాళ్ళు అగ్రకులాలవాళ్ళు సాధువులైన ప్రజలను మోసగించి కూడా బెట్టుకున్న సంపదను రక్షించకోవడానికి, ప్రజలు తిరుగబడకుండా నిరోధించడానికి కల్పించిన సూత్రమే అదే విధంగా ఈ కథ చెబుతుంది.

శంబూకుడనే శూద్రుడు తపస్సు చేస్తున్నందువల్ల అకాల మరణాలు సంబవిస్తున్నాయని అందుకే బ్రహ్మణ బాలుడు మరణించినట్లు, ఆ తపస్సు బ్రహ్మణులే

చెయ్యాలి శూద్రుడు చేసినందున ఇట్టి మరణాలు సంభవిస్తున్నాయని అశరీరవాణి రామునితో శూద్రుడు తపస్సు చెయ్యకుండ అతనిని చంపాలని కోరుతాడు. వెంటనే రాముడు ఆ శూద్రుని చంపడానికి వెళ్లి అతనిని చూచి నప్పుడు ఎవరికి ఎటువంటి హానిచేయక తపస్సు చేస్తున్న శంబూకుణ్ని చూచి శూద్రుడై కులధర్మం అతిక్రమించా డని నేరం మోపి చంపడానికి రామునికి మనస్సు ఒప్ప లేదు. ధర్మం అనే పేరుతో చివరికి శంబూకుని చంపుతాడు. ఎవడో ఒక బలవంతుడైన శత్రురాజును దుష్టుడనే పేరుతో చంపివేయటం తప్ప. ఆ భగవదవతారాలు చేసిన నిర్వారం మాత్రం ఏమి లేదు. దీనిని బట్టి పురాణాలలోనే దళితులకు జ్ఞానం అనే సంపాదన లేకుండా అన్యాయం జరిగినట్లు చూస్తున్నాము.

శతాబ్దలుగా అవిద్య, అజ్ఞానం, చీకటి, మురికి, దారిద్ర్యం, దాస్యం కూపాలలో కుళ్ళిచచ్చేలా చేయబడిన అస్పృశ్య దళిత కులాలను అగ్రకులాల స్థాయికి తేవాలంటే 35 సంవత్సరాలే కాదు 300 సంవత్సరాలు పట్టినా మనం ఆశ్చర్యపడనక్కరలేదు. మన సాంఘిక ప్రగతి అంత మందకొడిగా వుంది.

శాంతి, సహజీవనం నాధ్యేయం
మనిషికి మనిషి దాస్యం చెయ్యడం హేయం
ముద్ద కోసం ముద్దు బిడ్డను అమ్ముకోకు
అన్నం లేకపోయినా అక్షరభ్యాసం మానకు.

సమాజపరంగా చూచినట్లయితే..

గృహ నిర్మాణాలు విషయంలో, దళిత జనులకు గృహాలు గ్రామాలకు వెలుపలకాదు. అవకాశం ఉంటే గ్రామాల మధ్యలోనూ, లేకపోతే గ్రామాలకు చేర్చి నిర్మించబడాలి.

వ్యవసాయ కూలీలను సంఘటిత పరచడం అత్య వసరంగా చేపట్టబడాలి. ప్రభుత్వం ప్రత్యేక అధికారులు ద్వారా ఈ పని చెయ్యాలి. వ్యవసాయ కూలీలు సంఘటితులు కాబడి, క్రమబద్ధమైన ఆదాయాలు ఇవ్వబడి సలక్షణమైన జీవితాలు గడిపే పరిస్థితు లేర్పడాలి.

మానవ సమాజాన్ని రెండు వర్గాలుగా విభజించాడు మార్క్స్. ధనికవర్గం అని, కార్మిక వర్గం అని. ధనికవర్గానికి భోగభాగ్యాలు, సౌకర్యాలు, పదవులు, పెత్తనాలు, అంహకారాలు, అధికారాలు, అన్ని సంపాదించి పెట్టేది కార్మికవర్గమే, సంపద అనే దానిని సృష్టించేదే కార్మికవర్గం, ధనికుల్ని అందలా లెక్కించి, తాము మోస్తున్నట్టిది కార్మికవర్గం.

అందుకే, అందలా లెక్కే ఉన్నత స్థితి కార్మికులకు అందకుండా జాగ్రత్త పడుతున్నారు ధనికులు " అందరూ అందలా లెక్కితే మోసేవాళ్లేవరు" అనేది వాళ్ళనీతి.

ప్రతి గ్రామంలోను దళితులకు, దళితేత్తర వర్గాలకూ మధ్య వుండే సంబంధాలను గురించి పరిశీలన జరగాలి. వాళ్ళ వాళ్ళ సమస్య లేమిటో గుర్తించబడాలి. వాటి పరిష్కారానికి వెంట వెంటనే చర్యలు తీసుకోబడాలి. అట్టి కార్యక్రమాలు నిర్వహించబడినప్పుడే అన్యాయాలు, అఘాయిత్యాలు అరికట్టబడతాయి. గత జలసేతు బంధనాలవల్ల చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు.

ఉద్యోగపరంగా చూచినట్లయితే..

"ఉద్యోగాలన్నీ, దళితులకే, కోటానుకోట్ల ధనమంతా దళితులకే" అనే ప్రచారం ఎంత గొప్పగా జరుగుతున్నాదో అంత చప్పగా వుంది దాని ఆచరణ. ఆ ప్రచారం వల్ల దళితులకు ఎంతో అపకారం జరుగుతూవుంది. ఇతర కులాలవాళ్లలో దళితుల పట్ల అసూయ, ద్వేషం పెరుగుతూ ఉంది. అంతా వాళ్ళకేనా అనే క్రోధం పెరుగుతూ వుంది.వాస్తవానికి జరుగుతున్న అభివృద్ధి ఏమిలేదు. ఎక్కడి గొంగళి అక్కడే వడివుంది. రిజర్వేషనులను నిజాయితీతో అమలు జరపాలి. పబ్లికు ప్రైవేటు రంగాలన్నింటికి వర్తింపజేయ్యాలి. రిజర్వేషనులు రద్దయిన తర్వాత ఇప్పుడున్న నిష్పత్తిలోనే, అంత కంటే

ఎక్కువగా కూడా దళితుల ప్రతినిధుల ఎన్నుకోబడగల స్థాయికి సమాజం ఎదగవలసి వుంది.

అగ్రకులాల అభ్యర్థులతో దళితుల అభ్యర్థులు వివిధ రంగాల ఉద్యోగాల కోసం, అధికార పదవుల కోసం పోటిస్థాయికి వారి స్థితిగతులు మెరుగుపడాలి.అంత వరకూ రిజర్వేషనులు కొనసాగక తప్పదు. ఈ విషయంలో అంబేద్కరియం ప్రత్యేక శ్రద్దాశవులై కృషి చేయవలసి ఉంది.

దళితులకు రిజర్వేషనులివ్వడం వల్ల ఉద్యోగాదులలో సామర్థ్యం దెబ్బ తింటున్నదన్న ప్రచారంలో రవ్వంత కూడా నిజం లేదు. అది పచ్చిమోసపు ప్రచారం.

రాజకీయపరంగా చూచినట్లయితే..

రాజకీయ సాంఘిక రంగాలలో ఏవో పార్టీల తరపున పదవుల లోకి వచ్చే వాళ్లు సైతం ఆయా పార్టీల పెద్దలకు కట్టుబానిసలుగా పడివుంటున్నారు. వాళ్ళకు కూడా ఉదర పోషణమే పరమార్థంగా వుంటున్నది. తాము ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో గుర్తులేక ప్రవర్తిస్తున్నారు. దళితుల నుంచి ఒక బలమైన నాయకత్వం రూపొందితే తప్ప, పరిస్థితులు చక్కబడేటట్టు లేవు.

రాజకీయ నాయకులు స్వార్థ రహితులు కావాలి. కులమత పక్షపాతాలు మానాలి. ప్రాంతీయ సంకు చితత్వాలు విడనాడాలి. సార్వజనిక జాతీయతా దృక్పథంతో కార్యవిధానాలను అమలుపరచాలి. అందుకే అంబేద్కరిజానికి ఒక పరిధిలేని కేంద్రాన్ని మాత్రమే నూచించాను. జాతీయ స్థాయిలో కొన్ని ప్రధాన విధానాలను మాత్రమే తెలిపానని బోయిభీమన్న పేర్కొన్నారు.

అగ్రకులాలకు చెందిన ప్రవక్తలు, వాళ్లెంత విశాల హృదయులు, దయాసముద్రులు, పరమ భాగవతులు అయినప్పటికీ, దళితకులాల వాళ్ల కష్టాలు తమ స్వానుభవంతో లేనివి కనుక అస్పృశ్యతా నివారణకుగాని, దళిత జనోద్ధరణకు గాని, ఒక ఉద్యమస్థాయిలో వాళ్ళు పూనుకోలేరు. కాబట్టి అంబేద్కర విగ్రహాలు ప్రతి గ్రామం లోనూ నెలకొల్పబడాలి. విగ్రహం వుండే ప్రతిచోట ఒక లైబ్రరీ ఉండాలి. అందులో అన్ని కులాలకూ అన్ని సంస్కృతులకూ చెందిన సాహిత్య గ్రంథాలుండాలి. పరిశోధనలు జరగాలి. సంగీత సాహిత్యాది కళలలో శిక్షణ ఇవ్వబడాలి. దళితవర్గాలు ఏరంగంలోనూ ఎవరికీ తీసి పోనంతటి ప్రజ్ఞాప్రాభవాలను గడించుకోవడానికి నిరం తరం కృషిచెయ్యాలి.

అన్యాయాలను, అవమానాలను, దరిద్ర్యాన్ని, దళిత తత్వాన్ని , ధైర్యసాహసాలతో ఎదరించి నిలవగల దిట్టలుగా ప్రజలను తయారుచెయ్యాలి. ''బానిసగా బ్రతకలేవా? అయితే బలం సంపాదించుకో'' అనే సూత్రాన్ని పటిష్టంగా అమలుపరచాలి.

ఒక రేసులో పదిగుర్రాలు పాల్గొంటున్నాయను కొందాం. ఆ పది గుర్రాలలోనూ కొన్ని గుర్రాలు శక్తివంతమైనవిగా ఉంటాయి. మరికొన్ని శక్తిహీనంగా వుంటాయి. అధికశక్తికలవాటికి, శక్తి లోపించిన వాటికి కూడా పందెంలో గెలిచే అవకాశం సమానంగా కల్పించ డానికి కొన్ని ఏర్పాట్లు చెయ్యబడతాయి. ఈ పదిగుర్రాల శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని అన్నిటికంటే శక్తిగల గుర్రం మీద 60 కిలోల బరువు వేస్తే, అన్నింటి కంటే తక్కువ శక్తిగల గుర్రం మీద 40 కిలోల బరువు మాత్రమే వెయ్యబడుతుంది. శక్తిగల గుర్రం 60 కిలోల బరువుతో పరుగెడితే, శక్తి తక్కువ గల గుర్రం 40 కిలోల బరువుతో పరుగెడుతుంది. ఆ విధంగా ఆ పదిగుర్రాలకు వాటి వాటికి తగిన బరువులను వేస్తూ వాటిన్నింటికి సమానంగా గెలిచే అవకాశం కల్పిస్తారు.

గుర్రాలకు కల్పించబడుతున్న ఈ సమతా న్యాయానికి మానవులు అర్హులుకారా? దరిద్రులుగా దళితులుగా అణచి పెట్టబడి వున్న వాళ్లకు రిజర్వేషనులను కల్పించడానికి కారణం ఇదే అని చెప్పవచ్చు.

వేల సంవత్సరాలుగా దళితులు చదువుకు, ఉద్యోగాలకు రాజకీయాలకు దూరం అయ్యారు కనుక

అగ్రకులాల అభ్యర్థులతో దళితుల అభ్యర్థులు వివిధ రంగాల ఉద్యోగాల కోసం, అధికార పదవుల కోసం పోటి పడగల స్థాయికి వారి స్థితిగతులు ఏవిధంగా ఎదగాలి అంటే "ఆర్థికంగా కాదు సామాజికంగా మెరుగుపడేవరకు" రిజర్వేషనులు కొనసాగాలి.

రిజర్వేషనులను నిజాయతితో అమలు జరపాలి. పబ్లికు ప్రైవాడు రంగాలన్నింటికీ వర్తింపజేయ్యాలి. రిజర్వేషనులు రద్దయిన తర్వాత ఇప్పుడున్న నిష్పత్తిలోనే అంతకంటే ఎక్కువగా దళితుల ప్రతినిధులను ఎన్నుకోబడగల స్థాయికి సమాజం ఎదగాలి. కాబట్టి న్యాయం గూర్చి, ధర్మం గూర్చి, దేవుని గూర్చి మాట్లాడే వాళ్ళు రిజర్వేషనులను వ్యతిరేకించకూడదు. ఒక వేళ వ్యతిరేకించినట్లయితే వారికి మానవత్వం లేదని దృడంగా చెప్పవచ్చు.

అంబేద్కరీయుడైన వాడు అస్పృశ్యతా నివారణ, కుల వ్యవస్థ నిర్మూలన, సమసమాజ స్థాపన, సర్వజన శ్రేయస్సాధన, సమైక్యసంబుద్ధ భారత జాత్యవతరణ ఈ పవిత్ర లక్ష్యాలను కార్యరూపంలో సాధించడం కోసం ఏ కార్యక్రమాన్ని అనుసరించినా, ఏ ఉద్యమాలు నడిపినా అంబేద్కరీయ ద్రుక్పథంతోనే చెయ్యాలి. నిర్వహించిన కార్యక్రమాలను నడిపించిన ఉద్యమాలను మార్గదర్శకులుగా తీసుకోవలసి ఉంది.

ఆధారగ్రంథాలు :

1. అంబేడ్కరిజం - బోయి భీమన్న
2. బోయి భీమన్న (భారతీయ సాహిత్య నిర్మాతలు) - బి.విజయభారతి.

కూలిరాజు నాటకం వైశిష్ట్యం

– డా॥. ఎన్. ఎలిజబెత్ జయకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, స్టెడెన్సీ కళాశాల, చెన్నై.

చేతికీ నోటికీ మధ్యఉన్నదే అనంత మానవ చరిత్ర

1. 1942లో ఈ నాటకం మొదట కష్టజీవి అనే పేరుతో ప్రదర్శింపబడింది. కొన్ని కష్టాలు పాలుకావడంతో కొన్ని మార్పులు చేసి ధన్యజీవి అయ్యింది. 1947లో నవజీవన పత్రికలో సీరియల్‌గా ప్రకటించారు. ఈ నాటకం మరి కొన్ని మార్పులకు లోనై కూలిరాజు అనే పేరుతో 1948లో ప్రజలకు అందించారు బోయిభీమన్న. మదరాసు నుండి పుస్తక రూపంలో ప్రకటించటం విశేషం.
2. ఈ నాటకాన్ని అప్పటి ఉమ్మడి మదరాసు రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వంలో వేముల కూర్మయ్య గారు మంత్రిగా ఉన్నారు. ఈ నాటకాన్ని కూర్మయ్య గారికి అంకితమిచ్చారు. ఈ నాటకం నాలుగో ముద్రణకు నోచుకుందంటే ఎంతటి అపారమైన ప్రజాదరణను పొందిందో చెప్పనక్కరలేదు.
3. నాటకంలో మొత్తం 12 రంగాలున్నాయి. 11 ముఖ్యమైన పాత్రలున్నాయి. కథాస్థలం ప్రజాపురం అనే ఊరు.
4. ఈ నాటకంలో అంక విభజనలేదు. రంగ విభజన కనిపిస్తుంది. రంగానికి రంగానికి వ్యవధి ఎక్కువ లేకుండా సంబంధం కలిగి. కథా సంవిధానం, రసనిర్వహణ కొనసాగింది. ఆలంకారికులు చెప్పిన అంక విభజన కనిపించదు. రంగాలలోనే ఈనాటకం ఇమిడి ఉంది.
5. నాయకుడు. మధుమూర్తి ధీరోదాత్త లక్షణంతో కనిపిస్తాడు.
6. నాయిక. మిత్ర ఈమె ఆలోచనా పరురాలైన ముగ్ధగా ఉంది. ప్రేమించిన మధుమూర్తిని నాటకాంతంలో పరిణయమాడుతుంది.
7. రసం.కరుణం శాంతం ప్రధానంగా కనిపిస్తుంది.
8. కూలిరాజునాటకంలో కుల మత నిదర్శనం కని పిస్తుంది. ఈ నాటకంలో గ్రామీణ జీవనం వాస్తవిక రూపంలో కనిపిస్తాయి. ఈ నాటకంలో చక్కని గీతాలు,రసవంతమైన సీసపద్యాలు మాండలిక భాషా ప్రయోగం ఎంతో రమణీయంగా ప్రయోగించారు భీమన్న. పాత్ర సన్నివేశం సంభాషణ వర్ణన ఇతివృత్తం వంటివాటిలో వాస్తవికత అభ్యుదయ మార్గంలో కనిపిస్తుంది.
9. పాత్రలు. నాయకుడు మధుమూర్తి విద్యావంతుడు. (కూలియువకుడు), పరంజ్యోతి మధు స్నేహితురాలు (కూలియువతి) నాయిక మిత్ర మధు ప్రియురాలు. నిష్కులయోగి కూలి ఉద్యమకారుడు. ప్రతినాయకుడు విశ్వనాథరావు (భూస్వామి). ఇతని గుమస్తా శివరామకృష్ణ బ్రహ్మం, ప్రేమ్‌కుమార్ విశ్వనాథరావు కుమారుడు అభ్యుదయవాది. జోగులు పాలేరు.
10. కూలిరాజు నాటకం మొదటి రంగంలో ప్రజాపురంలో వీధిలో ఓ కూలివాడు పాడుతూ రంగ ప్రవేశం చేస్తాడు అతని పేరు నిష్కుల్. పాటకు కొంతమంది అతనిని అనుసరిస్తూ. వీధుల్లో తిరుగుతారు.

లేవరా లేవరా కుమారా
లేవరా నిదుర
కొడికూసె కోకిలపాడె
కూలి వాకిటి గులాబి పూసె పుట-10

అనేది నాంది రూపంలో ఉండే పాటతో రంగం ప్రారంభమవుతుంది. రెండవ రంగంలో విశ్వనాథరావు గుమస్తాకి జోగుల మధ్య మూర్ఖత్వపు సంభాషణ, మూడు నాలుగు రంగాల్లో మధుమిత్రపై మక్కువ చూపటం

కూలీల జీవితాలను బాగు చేయాలనే తపన కన బడుతోంది.

కూలి రాజు నాటకంలో ఐదవ రంగం నుంచి ఎనిమి దవ రంగం వరకు మధు కూలి వ్యవస్థ బాగు కోసం కృషి చేయటం కనిపిస్తుంది. ప్రేమ్ కుమార్ నిష్కులయోగి వాళ్ళ సహకారంతో ఆశయం నెరవేర్చుకొనే అవకాశం కనిపిస్తుంది.

నాటకంలో తొమ్మిది పది పదకొండు రంగాలలో మధు కూలి వ్యవస్థను బాగు పరచే విధం కనిపిస్తుంది. మధు ఎలక్షను ద్వారా భూస్వామ్య వ్యవస్థను మార్చ గలిగే విధం పదకొండవ రంగంలో కనిపిస్తుంది. అందుకే మిత్ర మధుని చూచి ఇది యజ్ఞం మధూ . దీన్ని మధుకామేష్టి అంటారు. దీంట్లో నుంచి మధు వస్తాడు. అని పేర్కొన్న దాంట్లో వారిద్దరి ప్రేమ వ్యక్తమవుతోంది. చివరి రంగంలో జాతి కుల మత భేదాలు లేని సమాజ స్థాపన లక్ష్యంతో ఈ కథ ముగుస్తుంది.

11. ఇతివృత్తం.కూలి రేటు పెంచి ఆకలి తీర్చమన్న వ్యవసాయ కూలీల అభ్యర్థనని తోపిపుచ్చిన భూస్వామి విశ్వనాథరావు. ఇతని గుమస్తా శివరామకృష్ణ వబహ్మం. యజమాని అడుగులకు మడుగులు ఒత్తేవాడు. పట్టణంలో బాగా చదువు కొన్నాడు మధుమూర్తి. వ్యవసాయ కూలీల న్యాయ వరమైన తమ కోర్కెల నిమిత్తము భూ కామంధులపై తిరుగుబాటు చేసేవాడు. తనకు వచ్చిన వపభుత్వ ఉద్యోగాన్ని కాలతన్ని కూలీల కష్టాలు తీర్చటానికి ముందుకు వచ్చాడు. అతని స్నేహితురాలు పరంజ్యోతి. పరంజ్యోతి హరిజన స్త్రీ అయినా అభ్యుదయ భావాలున్న వ్యక్తిగా రచయిత చివతీకరించాడు. మిత్ర ప్రతి విషయంలో మధుకి సహకరిస్తుంది. విశ్వనాథరావు కుమారుడు వపేమ్‌కుమార్ అభ్యుదయ భావాలున్న వ్యక్తి. కష్ట జీవులను ఆదుకొనే గుణం కలిగినవాడు.

విశ్వనాథరావు అభ్యుదయాన్ని సహించలేని భూస్వామిగా భయంకరమైన రౌడీ నాయకుడిగా కనిపిస్తాడు. అభ్యుదయాన్ని అణచివేయటానికి విశ్వ నాథరావు చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. గూండాలతో అనేక కష్టాలు మధుకి, పరంజ్యోతికి మిత్రకి కలిగిస్తాడు.ఫలితం శూన్యం.

న్యాయపరమైన తమ కోర్కెల తీర్చుకోవటానికి కూలీలను కష్టాల నుండి వెదోలగించటానికి గత్యంతరం లేక మధు పరంజ్యోతి మిత్ర నాయకత్వంతో కలిసి భూస్వామ్య వ్యవస్థపై పోరాటం చేస్తారు. పంట కోత కోసే సమయంలో ఆ పనులకు కూలీలను వెళ్ళనీయ కుండా పొలాల గట్లపై కూలీలచేత సత్యాగ్రహం చేయిస్తారు.

అది గమనించిన ప్రేమ్‌కుమార్ వారికి నచ్చ చెబుతాడు. ప్రేమ్‌కుమార్ ప్రమేయంతో సత్యా గ్రహం చేస్తున్న కూలీలంతా విరమించుకుంటారు.

కూలీరాజ్య స్థాపనకు నిమ్నవర్గ స్త్రీని అధ్యక్షురాలుగా నిలబెట్టాలని మధు నిర్ణయిస్తారు. కొంతకాలానికి ఎన్నికలు వస్తాయి. గత్యంతరం లేక ప్రజాస్వామ్య విధానంతో వ్యవసాయ కూలీల సంఘం ఎన్నికల్లో హరిజన యువతి అయిన పరంజ్యోతిని భారత అధ్యక్షురాలుగా నిలబెడ తారు. ఘనవిజయం సాధిస్తుంది. గాంధీజీ పేర్కొన్న ఆశయం నెరవేరుతుంది. గాంధీజీని ఆచరించి వయోజన ఓటింగుతో కూలీలు అధికారంలోకి రావటం విశేషం.

నాటకం చివరలో మధు కూలీలకు నాయకుడు కావటం, కూలీల ఉద్యమం ఫలించటం, మధు ధర్మం కోసం పోరాటం చేసి విజయం సాధించాడు. మధుమిత్ర వివాహం, ప్రేమ్‌కుమార్ పరంజ్యోతి వర్ణాంతర వివాహంతో నాటకం ముగుస్తుంది.

12. వస్తువు. ఈ నాటకంలో భూ సమస్యే ప్రధాన మైనదిగా కనిపిస్తుంది. ఒకేవ్యక్తి చైతన్యవంతుడై సాటివారికి మేలుచేయటం ఈనాటకంలో కని పిస్తుంది. సామూహిక చైతన్యంతో కూలినాయకుడై

అహింసా మార్గంలో సంఘాన్ని పురోగతివైపు పయనింపజేయటం కనిపిస్తోంది.

13. మానవతా ప్రబోధం. సమాజంలో దారిద్ర్యం మౌఢ్యం పీడలు సామాన్యులను భాదిస్తుంటే వీటి నుంచి విముక్తి పొందే మార్గం ఈ నాటకంలో కనిపిస్తుంది. సంస్కరణాభిలాష ఈ నాటకంలో కనిపిస్తుంది. మానవులందరూ ఒక్కటే అని చాటి చెప్పటం, సమాజంలో రైతుల జీవితాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించబడ్డాయి.

లేవరా ఓ కూలిరాజా
లేవరా నిదుర
నీవేరా ఈ భూమికి భర్తవు
నీవేరా ఈ సృష్టికి కర్తవు
నీదేరా ఈ భారత రాజ్యం
నీదేరా స్వారాజ్యం పుట -90

అన్న ప్రబోధ గేయంలో కూలిరాజే ఈ భూమికి భర్త. సృష్టి కర్త . భారత రాజ్యానికి అధినేత. స్వరాజ్యానికి నిర్మాత అని పేర్కొనబడింది. ధైర్యంతో ముందుకు వస్తే కూలి రాజును ఎదిరించేవారు ఎవ్వరూ లేరు. దీక్షబూని కూలిని గెలిపించుకొంటే కూలిరాజ్యం ఏర్పడి ప్రజలందరికి కూడు గుడ్డ ఏర్పడతాయని ప్రబోధాత్మకంగా తెలియజేశారు భీమన్న.

14. సాంఘిక విమర్శనం. ఈ నాటకంలో సంఘంలోని ప్రజల మూర్ఖత్వం స్వార్థం దుష్టవర్తనం అవినీతి మొదలైనవి అనేక కోణాల్లో కనిపిస్తుంది. ఈ నాటకంలో భూమి ఇచ్చిన కూలీనే తీసుకుంటే సరిపోదా అనే మూర్ఖత్వం కలిగిన రైతు కూలీలుగా కొందరు కనిపిస్తారు.

15. మూర్ఖత్వం. కూలిరాజు నాటకంలో జోగులు మా బాబు నన్ను బళ్ళోయేశాడుగాడు, గాడిద కొడుకు, లేకపోతేనా అని చెప్పిన దాంట్లో పాలేర్ల మూర్ఖత్వం వెల్లడి అవుతుంది.

16. స్వార్థం. విశ్వనాథరావు ఎలుకలు, చిలుకలు తిని వేసినా సరేగాని మీ కూలీలకు గిద్దెడు కాదు ఒక్క గింజ కూడా ఎక్కువగా ఇవ్వను అని పలికిన మాటల్లో కఠినమైన స్వార్థం కనిపిస్తుంది.

17. దుష్ట వర్తనం. ఈ నాటకంలో విశ్వనాథరావును కూలీల రేట్లు పెంచమని కారుణ్యం చూపమని అడిగినపుడు పరంజ్యోతిని ఉద్దేశించి అది నీ మీద చూపగలను నీవుండి తక్కిన వాళ్ళని పంపెయ్యి. అన్న మాటల్లో మోసంతో కూడిన దుష్టవర్తనం బహిర్గత మవుతుంది.

18. అవినీతి. కూలీ రేటు పెంచమన్న వారితో విశ్వనాథరావు రోడ్డు మీద కంకర తిని బ్రతకండి అని ఈ సడించుకొన్న దాంట్లో అవినీతి క్రూరత్వం కనిపిస్తుంది.

19. రాజకీయ విమర్శనం. మిత్ర మనకు వచ్చింది స్వరాజ్యం కాదు స్వాతంత్ర్యం మాత్రం అనే మాటల్లో సమాజానికి స్వాతంత్ర్యం మాత్రమే ప్రధానం కాదని అన్నింట స్వరాజ్యం దృక్పథం కలగాలని చాటిచెప్పింది.

20. ఆర్థికవ్యవస్థ. వ్యవసాయ కూలీల చాలీ చాలని ఆర్థికవ్యవస్థ కనిపిస్తుంది. సంఘటితం కానపుడు వారుపడే ఇబ్బందులు చాలీచాలని కూలీ సరిపడని తిండి మొదలైనవి కనిపిస్తాయి.

అని పేదల శిథిలమైన ఆర్థిక స్వరూపాన్ని పేర్కొన్నట్టు కనిపిస్తుంది. మధు పరంజ్యోతి మిత్ర జోగులు అందరు పేద వర్గానికి కూలీల ఆర్థిక వ్యవస్థకు తార్కాణంగా కనిపిస్తారు. ధనిక వర్గానికి ప్రతీకగా విశ్వనాథరావు అభ్యుదయ గామిగా ప్రేమకుమార్ సహకారిగా దయా నందరావు కనిపిస్తారు.

21. పాలేరు వ్యవస్థ నిర్మూలన మార్గం. కూలి రాజు నాటకంలో మూగ కూలిజనులు రెచ్చిపోతే వారిని ఆపటానికి ఎవ్వరికీ సాధ్యం కాదనే విషయం తెలియజేస్తూ

కూటికి కరువైన కులమున బుట్టినన్
మనుజుల మనుమాట మరువ వలదు
ఆకటి మంటల నల్లాడుచున్నను
మానవంతుల మంచు మరువ వలదు
పాలేరు వృత్తి మీ పదసేవకులమైన
మహితాత్ముల మటంచు మరువ వలదు
ఇడుమలందైన మా హృదయాలు ప్రేమ మా
ధరిమమ్ము లనుమాట మరువ వలదు

కూటికి కరువై కులములో పుట్టిన మానవులు ఆకటి మంటలతో అల్లాడుతున్నారు. పాలేరు వృత్తి చేపట్టినా, కష్టాలున్నా వారి మనస్సుల్లో మాత్రం ప్రేమ మెండుగా ఉంటుంది. అటువంటి కూలీలంతారెచ్చిపోయిఏకమైతే కూలీ రాజ్యం స్థాపింపబడుతుంది. సంపదనంతా పంచుకునే స్వరాజ్యం వస్తుందనే సూచన కనిపిస్తుంది. కూలి రాజు అయ్యే రోజు వస్తుంది అని అంతర్గతంగా చెప్పబడింది.

22. కులం మతం. కర్మసిద్ధాంతం ద్వారా సామాన్య మానవులను బొమ్మలుగా ఆడించటం కని పిసిస్తుంది. కులం మతం వర్ణ మనేది అహంకారంతో కూడినపుడు అగ్రవర్ణం వారిదే పెత్తనం. అయినా, మారుతున్న సమాజంలో ఇవి అంతరిస్తేనే దేశం అభ్యుదయ మార్గంలో పయనిస్తుంది అని చెప్పబడింది.

కుల మత వర్ణభేదములు
కూలిన వాటి కతీతులై ధరా
స్థలి నరులెల్ల నొక్కటని
చాటుడు సర్వజనీన స్వామ్యసం
కలితా ప్రణాళికా పథక
కర్తలు కార్మిక నాయకుల్ సమ
ర్థులు తమ వోట్లొసంగి రయి
తుల్ గెలిపింపుడు శాంతి కాములై

కుల మత వర్గ భేదాల్ని కూల్చివేసి వాటికతీతంగా జనులందరు ఒక్కటేనని చాటే కూలి రాజ్యం ఏర్పడాలని స్వరాజ్యంస్థాపింపబడాలని పేర్కొనబడింది. నాటకం చివరిలో అగ్రవర్ణానికి చెందిన ప్రేమ్‌కుమార్ హరిజన యువతి అయిన పరంజ్యోతిని పెండ్లాడటం వర్ణాంతర వివాహం అయినా ప్రేమ ఆదర్శ వివాహంగా పేర్కొన వచ్చు.

23. విషాదాంత నాటక లక్షణాలు.మధుమూర్తికష్టాలు పాలుకావటం ఎదురు దెబ్బలు తినటం కొన్ని పరిస్థితులలో నిరుత్సాహ పడడం పరంజ్యోతికి కలిగినకష్టాలు విశ్వనాథరావుఉద్యమాన్ని అణచి వేయటానికి చేసిన ప్రయత్నాలు వంటి విషాద సన్నివేశంగా కనిపిస్తుంది. నాటకం చివరలో కూలీలకు నాయకుడిగా మధుమూర్తి తయారు కావడం కూలీలు ఉద్యమం ఫలవంతం కావటం మధుమిత్ర ల వివాహం పరంజ్యోతి ప్రేమ్ కుమార్ వివాహంవంటివి ఉదంత సంఘటనలుగా కని పిస్తాయి.

24. ఇది సాంఘిక నాటకమైనా అభ్యుదయ నాటకంగా పేర్కొనవచ్చు.

25. పాత్రలు ఈనాటకంలో కూలీలందరికీ నాయకుడు మధుమూర్తి తయారు కావటం సిష్కులయోగి ఉద్యమాన్ని ప్రబోధించటం మిత్ర మధుకి సహ కరించటం, పరంజ్యోతి ప్రేమ్‌కుమార్ ఉద్యమానికి సహాయం చేయటం వీరంతా అభ్యుదయ భావా లున్న పాత్రలుగా కనిపిస్తారు.

విశ్వనాథరావు అభ్యుదయాన్ని సహించలేని భూస్వామిగా భయంకరరావు రౌడీ నాయకుడిగా కని పిస్తాడు కులమత వర్గరహితమైన సామ్యవాద సమాజాన్ని గాంధేయ మార్గంలో స్థాపించవచ్చు అనే సామాజికపరమైన ఆలోచనలను రాజకీయమైన సన్నివేశంతో ఇతివృత్తంగా మార్చటం కనిపిస్తుంది.

26. సామాజికస్పృహ. కూలి రేటు పెంచి తమ ఆకలి తీర్చమని వ్యవసాయకూలీలు భూస్వామిని

అడగడం కూలి రాజు నాటకంలో కూలీలు రోజూ జీవితం సాగించే విధానాన్ని.. ...

మాతా కూలి మాతలనే
మల మల మాడిచివైవక తగనే
లోకముకంతా ఆకలి దీర్చే
కూలీ బిడ్డకు కూడు పెట్టవా
త్యాగమునకు పేదరిక మొక్కటే
ఫలితమటే ఓ భారతమాతా

అని పేర్కొన్న దానిలో వారి జీవన విధానం గోచరిస్తుంది. ఇది సామూహిక చైతన్యాన్ని కలుగజేస్తుంది. దీన్ని పాఠకులు ప్రేక్షకులు గమనిస్తే సామాజిక స్పహ తీరుతెన్నులు తెలుస్తాయి.అందుకే భోయి భీమన్నను సామాజిక వివల్ని అతిసామాన్యులకు కూడ అందించే సామాజిక స్పృహ కలిగిన ప్రముఖ నాటకకర్తగా పేర్కొన వచ్చు.

27. వ్యావహారిక భాష. ఈ నాటకంలో వ్యావహారిక భాషా ప్రయోగం కనిపిస్తుంది. సంగీత సాహిత్య నృత్య చిత్ర శిల్పకళల సమగ్ర సమన్వయ రూపాలు విద్యావంతుల మానుకొనేవారు. వచన నాటకాలతో సతమత మవుతుంటే గ్రామీణ ప్రజలు పద్యాలూ, పాటలూ గల సమగ్ర నాటకాలను అభిమానిస్తున్నారు. పాటలు పద్యాలు లేకుండా నాటకాలు వ్రాయను నాటకం జీవితానికి దగ్గరగా ఉండాలి. నకలుగా ఉండకూడదు. నాటకం సమస్త కళా సమామ్నాయం అని భీమన్నగారు పేర్కొన్న దాంట్లో వాస్తవం కనిపిస్తుంది.ఈ నాటకంలో భాష సంభాషణ పాట మొదలైనవి తీరు తెన్నులుగా కనిపిస్తున్నాయి. సంభాషణలు వ్యావహారిక భాషలో కనిపిస్తున్నాయి.

28. సూక్తులు. ఈ నాటకంలో నాటకానికి అనుగుణంగా భీమన్న కొన్ని సూక్తులను ప్రయోగించారు.

1. తులసి వనంలో గంజాయి మొక్క పుట 9
2. కప్పల తక్కెడ పీతల మంగళం పుట-18
3. పుడకల తోటే వాడు మారడం పుట-10
4. గోటితో త్రుంచెయ్యాక పోతే -గొడ్డలి దాకా వస్తుంది పుట-18
5. వినాశకాలే విపరీత బుద్ధి పుట -19
6. హనుమంతుడి దగ్గర కుప్పిగంతులా పుట-21
7. మాటల్లో మెరుపు చేతల్లో రేణువు పుట-27
8. వెయ్యిమంది దుర్మార్గుల కంటె ఒక సన్యాసి ఉత్తమం పుట -27
9. పడతి ఇంటి పెత్తనదారైతే గడప నిండా ముళ్ళ కంపే పుట-28
10. శీలం లేని వాడు సంఘానికిచీడ పురుగువంటి వాడు పుట-43

29. భరత వాక్యం. ఉద్యమం ఫలవంతమైన తర్వాత కూలీలంతాఆనందించే తరుణంలో ప్రబోధ గీతం...

ఉర్వియెల్ల. మేల్కొంచె అభ్యుదయమయ్యె
కూలియూన్యను స్వారాజ్యమేల దొడగె
సాగెస్వామ్య సామాజిక స్థాపనమ్ము
ఆకృతి ధరించె బాపూజీ ఆశయమ్ము
బాధ్యత వహించి ప్రజలార పడయు డింక
ఎల్ల సౌభాగ్యము సౌభాగ్యము లెల్లరుచులు
పుట-107

పై గేయంలో సమాజం బాగు పడాలనే ఆకాంక్ష పాలేర్లకుకూలీలకు శుభం కలగాలని నాయకులు కోరుకోవటం కనిపిస్తుంది.

30. ముగింపు. ఈ నాటకం పలుమార్లు ప్రచురించబటం వల్ల నాటక ప్రాశస్త్యం వ్యక్తమవుతోంది. బోయి భీమన్న సామ్యవాది. మతి వర్గ వర్ణ భేదాల్ని నిరసిస్తాడు. రైతు కూతీల కష్టసుఖాలకు భీమన్న హృదయం కరిగి పోతుంది. రైతు కూతీలను ప్రబోధిస్తాడు. బాపూజీ ఆశయమైన సమ సమాజ స్థాపన జరగాలని ఆశిస్తాడు. నాటకాంతంలో ప్రబోధ గీతాన్ని రచించాడు. దాదాపు దీన్ని మనం భరత వ్యాకంగా పరిగణించవచ్చు.

విప్లవాత్మక అభ్యుదయ నాటకం - పాలేరు

- డా॥. కసుకుర్తి ఈశ్వరమ్మ, తెలుగు విభాగము, దొడ్లా కౌసల్యమ్మ మహిళా కళాశాల, నెల్లూరు.

సమాజంలో కుల, వర్ణ, లింగ బేధాలు లేకుండా ప్రజలందరూ ఒక్కటే అని అందరూ భావిస్తే దేశం సుఖసంతోషాలతో ఉంటుంది. ప్రజలలో ఏదైనా పనిచేయాలనే పట్టుదల, సాధించాలనే తపన, సహనం, ఓర్పు దానికి తోడు కఠోర శ్రమ ఉంటే మనిషి సాధించ లేది ఏమిఉండదని ఈ పాలేరు నాటకం ఆదర్శ ప్రాయంగా నిలుస్తుంది.

సమాజంలో ఉన్న సామాజిక, సాంఘీక, ఆర్థిక, రాజకీయ అసమానతలను అద్దం పట్టేలా డా॥ బోయి భీమన్నగారు వెంకన్న పాత్ర ద్వారా వివరించారు. ఒక పదిహేను సం॥ల యువకుడు సమాజంలో ఉన్న బానిసత్వాన్ని నిర్మూలించాలని, అన్నీ కులాలవారు కలిసిమెలిసి ఉండి భారత భూమికి భాగ్యము చేకూర్చా లని, ధనికులకు, పేదవారికి మధ్య భేదం ఉండ కూడదని, ప్రపంచ దేశాలమధ్య సంబంధం ఉండాలని, ఒకడు తినుచూ మరొకడు పస్థలుండడం ధర్మం కాదని ప్రజలందరికి తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు ప్రజలందరూ కులబేధాలు లేకుండా సుఖసంతోషాలతో మెలగాలని ఆశిస్తాడు.

సమాజంలో పేరుకుపోయిన కులవ్యవస్థ పూర్తిగా అంతరించి తక్కువ కులస్థులైన బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు రావాలన్నదే ఈ నాటక సందేశం. తక్కువ కులంలో పుట్టిన వ్యక్తి బాగా చదివి కలెక్టరు ఉద్యోగం సంపాదించి తనకు కీడుచేసిన వారి పట్ల ప్రేమతో, మర్యాదతో, మెలగడం ఈ నాటకంలో ఇతి వృత్తం. అంటే తక్కువ కులస్థుల వారు ఉన్నత స్థానంలో ఉన్నా వెనకటి జీవిత నేపధ్యాన్ని మర్చిపోకూడదన్న నీతి ఈ నాటకంలో కన్పిస్తుంది.

గ్రామంలో ఉన్న వ్యవసాయ కూలీల పాలేళ్ళ జీవితాలను, సమస్యలను వివరిస్తూ ఆ గ్రామస్తులకు పరిష్కారాన్ని చూపించిన ఒక అపూర్వమైన సాంఘీక నాటకం. ఉన్నత వర్గాలతో తక్కువ కులాలవారు కేవలం ధనంతో తప్ప, ప్రేమ, మర్యాద, ఆప్యాయత, జ్ఞానంలో తక్కువ కాదని నిరూపించిన విప్లవాత్మక అభ్యుదయమైన నాటకం పాలేరు.

అగ్రకులాల ఆదిపత్యం, మూఢనమ్మకాలు, బానిసత్వం, బడుగు బలహీన వర్గాల అమాయకత్వం, దేవతారాధన, కృతజ్ఞతాభావం, కులాంతర వివాహాలు, విద్యాభ్యాసం, అనాధా ఆశ్రమాలు సమాజానికి ఉప కరించిన తీరు, స్త్రీల దయనీయ స్థితి, శ్రమదోపిడి, స్కౌట్ విభాగం, భోగం వ్యవస్థ, పట్టణ ప్రాంత మానవీయ సంభంధాలు, పాలేవ్యవస్థ, పరాష్కారం వంటివి మొద లైన సామాజిక పరిస్థితుల ప్రస్తావన ఈ నాటకంలో మనకు కనబడుతుంది.

అగ్రకులాల ఆధిపత్యం :

పాలేరు నాటకంలో కుబేర్రావు పాత్ర ద్వారా అగ్ర కులాల ఆధిపత్యం కనిపిస్తుంది. కుబేర్రావు ధనవంతుడు, తక్కువ జాతివారు తనకు బానిసలుగా ఉండాలని, అందుకే వారిని దేవుడు పుట్టించాడని నమ్మకం కలవాడు. తక్కువ కులస్థుల స్త్రీల పట్ల, పాలేరుల పట్ల, తాను ప్రవర్తించిన తీరు, పాలేర్లు పాలేర్లుగానే బ్రతకాలనే భావన కలవాడు.

బాల వెంకన్నకు చదువుకోమని పుస్తకమివ్వగా, పాలేర్లు అగ్రకులస్థుల పిల్లలతో మాట్లాడకూడదని వారితో స్నేహం చేయకూడదని, వారిపట్ల గౌరవంగా మెలగాలని, పుస్తకం ముట్టుకుంటే పాపమని కుబేర్రావు అంటాడు.

> "ఒరేయ్ గాడిదకొడకా:: నీవు బ్రతికే రోజులు లేవురా చదుకునే పిల్లలతో స్నేహమేంట్రా ? దున్నపోతా పుస్తకమా నీదే పాపంరా ! ఓరి పాపిస్టి ముండాకొడకా"

కుబేర్రావ్ మూర్ఖుడు అనేక మంది పాలేర్ల భార్యలను రెచ్చగొట్టిన కామాంధుడు. తన చేతిలో తక్కువ కులస్తుల భార్యలు ఎంతో మంది బలైపోయారని నగర్వంగా చెప్పుకుంటాడు.

"ఎంతమంది పాలేళ్ల పెళ్ళాల్ని లొంగదీసుకున్నానో
నా మజా నీకేం తెలుసు ? నీ యప్ప నాచేతిలోనే చచ్చిపోయింది తెలుసా?. . . ఈ మాటలు అగ్రకులాల ఆదిపత్యానికి బలైన సాధారణ స్త్రీ నిస్సాహాయతకు నిదర్శనం.

సామాజిక పరిస్థితులు :

ఆనాటి సమాజంలో ఉన్న సామాజిక స్థితిగతులకు పాలేరు నాటకం చక్కని ఉదాహరణ. ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులు సాంఘిక దురాచారాలు, అన్యాయాలు, దురాక్రమణలు, రచయిత పాత్రల సంభాషణ ద్వారా వ్యక్తపరిచారు.

అమాయకత్వం :

బోయి బీమన్నగారు పాలేరుల అమాయకత్వాన్ని, మూర్ఖత్వాన్ని చక్కగా వివరించారు. ఉపకారి మాస్టారు పుల్లయ్యతో తన కొడుకును బడికి పంపించమని అడిగే సందర్భంలో పుల్లయ్య అమాయకత్వం కనిపిస్తుంది.

"చదువు మా హయాంలో లేదు, మాకు చదువు అచ్చిరాదని
మా కామాందు గారు చెప్పారు. అచ్చరాల అంతే అ ఆ లు దిద్దబోయి
మా తాత చచ్చాడంట మా బాబు రాగం తీయబోతే పళ్ళురాలి చచ్చాడంట"

వెంకన్నను బడికి పంపకుండా మనం పాలేరు తనం మాత్రమే చేయాలని పుల్లయ్య చెప్పిన సందర్భంలో వెంకన్న తన తండ్రి మూర్ఖత్వాన్ని గురించి ఇలా వివరిస్తాడు.

"అయ్యో తండ్రీ ! ఈ రొంపిలో నన్ను త్రొక్కేశావే ! ఈ ఊబిలో నన్ను కూరేశావే : పాలేరు తనమే పరమా వధిని చేసేశావే ! ఓరి బాబు నీవు రాక్షసుడివా ! ఓ పెద్ద పాలేరా ! నీ కొడుకును చిన్న పాలేరును చేస్తావా! నీ చేతి కర్రని చెప్పుదెబ్బలు నీ గంజి కూడు తప్ప నీ ముద్దుల కొడుకును ఒక్క అడుగైన ముందుకు వెయ్యనీవా ? నీ నీచత్వానికి కారణం పేదరికం కాదు, తెలివి తక్కువ తనం, మూర్ఖత్వం"....అని అంటాడు.

విద్యావ్యవస్థ :

ఆనాడు సమాజంలో విద్యావ్యవస్థ ఏవిధంగా ఉండేదో ఉపకారి మాస్టారు పాత్ర ద్వారా రచయిత చక్కగా వివరించారు.

"గోచి పెట్టుట నేర్చుకొనగానే బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులారా ?
నడవనేర్చినతోనే బుడతని గొంపోయి
పాలేరు తనముంచు మాలలారా
పసిబిడ్డ తెచ్చు సంపాదనకాసించి
మనుగడలే మాపు జనకులారా"

దేశానికి ప్రజలే శక్తి, అట్టి శక్తి అజ్ఞానాంధకారముతో మునిగి ఉంటే దేశానికి బానిసత్వమే గతి, మన బానిసత్వానికి అవిధ్యయే ముఖ్యకారణము. దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సౌఖ్యవంతంగా కావాలంటే ప్రజలు విజ్ఞాన భూషితులు కావాలని ఉపకారి మాస్టారు కోరుకుంటారు.

శ్రమదోపిడి :

కష్టం చేసి పంటలను పండించిన రైతులకు, వ్యవసాయ కూలీలకు తిండి లేదని, వారి శ్రమను భూస్వామ్య వర్గం దోచుకుంటుందని, శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని, కూలీవారు తలచుకుంటే ఈ రాజ్యం వారిదే అవుతుందని, భీమన్నగారు . . .

"పోరాడ గలిగితే కూలోడా
ఈ రాజ్యమే నీది కూలోడా "... పాట ద్వారా వివరించారు.

భోగం వ్యవస్థ :

ఆనాటి సమాజంలో భోగం వృత్తి ఉండేది. ఆ వృత్తిలో

ఉండి భారంతో తమ కుటుంబాలు మోస్తున్న గడపలు ఉన్నాయని ఈ నాటకంలో కుబేర్రావుకు, సీత కు మధ్య నడచిన సంభాషణ ద్వారా తెలుస్తుంది.

పట్టణ ప్రాంతము మానవ సంబంధాలు :

గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకు పట్టణాల్లో నివ సిస్తున్న ప్రజలకు మధ్య మానవ సంబంధాలలో తేడాలుంటాయి. వారి మధ్య సాదృశ్యాలను చెబుతూ రచయిత గ్రామాలలో ఆర్థిక లేమి ఉన్నా ప్రజలు హాయిగా ఉంటూ ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. కానీ పట్టణాలలో అన్నీ ఉన్నా ఈ సహాయ ధోరణి కనిపించదు. పట్టణాల్లో ఉన్న మనుషులమధ్య బలహీనపడుతున్న మానవీయ సంబంధాలను రచయిత వెంకన్న పాత్ర ద్వారా చిత్రించారు.

పాలేరు వ్యవస్థ పరిష్కారం :

బానిసత్వం, పాలేరు పనిద్వారా పొట్టనిండదు. విద్య లేనివాడు వింత పశువుతో సమానము. పిల్లలకు విద్య చాలా అవసరం అని పుల్లయ్య తన స్వానుభవంతో తెలుసుకున్న తరువాత ఇక మీదట తనలాగా పాలేర్ల పిల్లలు పాలేర్లుగా ఉండకూడదని ఆశిస్తాడు. దీని ద్వారా పాలేరు వ్యవస్థకి విద్యను పరిష్కారంగా చూపిన విధానం తేటతెల్లమయింది.

కులవ్యవస్థ :

ఈ నాటకంలో కులవ్యవస్థ ప్రధానంగా కనబడు తుంది. బడుగు బలహీన వర్గాల వారిపట్ల భూస్వామ్య వర్గం వారు ఎలా ఆదిపత్యం చెలాయించారో సుందరం -బాల తో పలికిన మాటల ద్వారా తెలుపబడింది.

పైన తెలుపబడిన సామాజిక అంశాలతో పాటు ఈ నాటకంలో కులాంతర వివాహ వ్యవస్థ గురించి, కృతజ్ఞత భావం గురించి, విగ్రహారాధన వంటి మొదలైన అంశాల ప్రస్తావన కూడా మనకు కన్పిస్తుంది.

❁❁❁

ప్రతీకల కవిత్వం... గుడిసెలు కాలిపోతున్నై

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు శాఖాధిపతి, గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్.

"మనుషులందరూ ఒక్కటే... కాకపోతే కొన్ని వర్ణాల వారు కొంచెం ఎక్కువ... కొన్ని వర్ణాల వారు కొంచెం తక్కువ... అయినా మనుషలంతా ఒక్కటే"నని ఐదు దశాబ్దాల క్రితమే ముళ్ళపూడి వారు జోకేరు... సీరియస్ గానే...నిజమే... వర్ణ వ్యవస్థ ఏర్పాటు వెనుక హిందూధర్మం ఎన్నో రకాలైన శాస్త్ర ధర్మాలను వివరించింది. 'మనిషిని మనిషి దూరంగా ఉంచడం' ఏ ధర్మమో బహుశా వివ రించలేదు. వర్ణాలు ఎలా ఏర్పడ్డాయి అనేదానికి కూడా శాస్త్ర చర్చలతో సాక్ష్యాలు చూపినవారున్నారు. అంటరాని తనం నేటికి కూడా నేరమే కానీ... ఆ నేరం ఓ సామాజిక న్యాయంగా కొన'సాగు'తుండటం గమనార్హం. సాహిత్యంలో దళితవాదం ఓ ఉద్యమంగా కొనసాగింది. త్రిపురనేని రామస్వామిచౌదరి, నార్లవెంకటేశ్వరరావు, జాషువా, ఆ కోవలోనే డా॥ బోయిభీమన్న కూడా ఈ ధోరణిలో తన సాహిత్యాన్ని వెలువరించారు. కొకలూరి ఇనాక్ వంటి వారు కొనసాగిస్తున్నారు.. కొనసాగవలసిన అవసరం ఇంకా ఉందనటమే విషాదం. "భీమన్న గారు భిన్న ధృక్పథాల కూడలి. అయినా ఆయన ప్రధాన ధృక్పథం దళిత శంఖారావాన్ని పూరించడమే 'పాలేరుకు పుట్టిన నేను మామలకు (మాల, మాదిగలకు) ఋషి వారసత్వం అందించానని 'భీమన్న గారే చెప్పుకున్నా రంటారు' కె.ఆనందన్ గారు. 'నేను ఏ పల్లెనో జనించినను కానీ / విశ్వమెల్లను నాదిగా విసిరినాను' (పంచమస్వరం) అని భీమన్నగారంటారు. ఇక్కడ గమనించదగిన అంశ మేమిటంటే భీమన్న గారు దళితపదం పట్ల అయిష్టతను ప్రదర్శించిన దాఖలాలు లేదు. చాలా రచనల్లో 'తాను మాలవాడినని' స్పష్టంగా ఆత్మాభిమానంతో చెప్పుకొన్నారు. దళితంటే ఎవరో కూడా ఆయన 'పంచమస్వరం'లో వివరిస్తూ.

మాలమాదిగపేట మ్రగ్గుచున్నా
దీనులందరూ దళితులే దేశమందు
కలిమితో పైకివచ్చిన దళితులెల్ల
అగ్రగాములె, దేశనాయకులె, దొరలెనంటారు.

'పద్మశ్రీ' డా॥బోయిన భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన సాహితీమూర్తి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. ఓ మారుమూల పల్లెలో పాలేరు ఇంట పుట్టి స్వయంకృషితో కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మశ్రీ పురస్కారలందుకున్నారు. అంటరాని తనం, పేదరికం ఆయనకు అనుభవాలు, దురాచారాలను చూసాడు. చలించిపోయారు. త్రీవ్రంగా వాటిని నిరసించారు. అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన' పుస్తకాన్ని తెలుగులోనికి తర్జుమా చేసారు. డా॥. బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19న తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురులో జన్మించారు. 2005 డిశంబర్ 16న తన 94వ యేట మరణించారు. పుల్లయ్య, నాగమ్మలు అతని తల్లిదండ్రులు వీరికి పంచపాండవులు వలే ఐదుగురు పిల్లలు వారి పేర్లు కూడా పాండవులు పేర్లే. భీమన్న గారు 1935లో బి.ఏ.పరీక్ష పాసై, 1937లో బి.యిడి పూర్తి చేసారు. వీరి "గుడిసెలు కాలిపోతున్నాయి' ఈయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1945)కి లభించింది. 'పద్మశ్రీ' పురస్కారం (1973) అందుకున్నారు. ఆయనకు దాదాపుగా అన్నీ విశ్వవిద్యా లయాలు పురస్కారాలందించాయి. భీమన్న గారి రచనల్లో భిన్నత్వం కనిపిస్తుంది. కుల, మతాలకంటే మానవతే గొప్పదని నమ్మిన మానవతావాది.

భీమన్న గారి రచనలలో 'గుడిసెలు కాలిపోతున్నై (1973)' రచనను ప్రత్యేకంగా పేర్కొనాలి. ఈ కావ్యంలో ఏడాదికోసారి దళితుల గుడిసెలెందుకు కాలిపోతు

న్నాయో, మరలా కొత్త గుడిసెలు మాత్రమే ఎందుకు వస్తున్నాయో ఓ క్రొత్త ప్రశ్నాత్మక పంథాలో వివరిస్తారు. ఓట్ల కోసం వచ్చే వారిని నిలదీసే చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం ఈ కావ్యంలో కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులుగా, పాములను దోపిడిదారులకు ప్రతీకలుగా చిత్రిస్తారు. దళితుల మధ్య సమైక్యత అవసరమని ప్రబోధిస్తారు. కవితలు, నాటకాలు, వచన రచనలు అన్నింటిలోనూ దళితసృహ, చైతన్యం వంటివి విస్తారంగా చర్చిస్తారు. ఆయన రచనలో సంప్రదాయకత, ఆధునికత వడుగుపేకలా ఉంటాయి. ఆయన రచనాభివ్యక్తీ ప్రత్యేకం. గద్యమయినా, పద్యమయిన, వచనమైన ఈ ధోరణి స్పష్టంగా దృశ్యమానవుతుంది. ప్రతీకలు, నూతన వర్ణాలు, వినూత్న కవి సమయాలు, సరిక్రొత్త భావచిత్రాలు కనిపిస్తాయి. ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారన్నట్లు 'వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో కవులందరూ' 'మిన్నులతో రాయు సువర్ణ సౌధాలనే' దర్శించారు. మట్టిపొరలతో మమేకమై ఉన్న పూరి గుడిసెలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటువంటి ప్రయత్నం ఆధునిక కవిత్వంలో కనిపిస్తుంది. అటువంటి వారిలో బోయి భీమన్నది స్థిరమైన స్థానం.'

'గుడిసెలు కాలిపోతున్నై'లో గుడిసెలు కేవలం గుడిసెలు కావు. ఒకానొక భావానికి ప్రతీకలు. భీమన్న గారే 'గుడిసెలు కాలిపోతున్నై అంటే, అవి కాలిపోతే మాకేం అనుకోకండి. ఇప్పుడు కాలిపోతున్నట్టివి వట్టి గుడిసెలే కాదు. ఆ గుడిసెల్లోని అజ్ఞానము, అబలత్వమూ, చీకటి, మురికి కూడా కూలిపోతున్నై' అని అన్నారు. ఈ భావనతోనే కవి 'గుడిసెల్ని కాల్చేశారు...' గుడిసెలు కాలిపోవాల్సిందేనని హెచ్చరిక చేసారు. శీర్షికలో ఓ ప్రతీకాత్మకత కనిపిస్తుంది. బోయిభీమన్న గారు తన కవితాప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ 'ఆకాశంలో పద్యంగా ప్రవహించిన వాణ్ని/దూకి, గేయంలో పడ్డాను/అక్కడి నుండి గెంతిగద్యం మీద పడ్డాను' అన్నారు. ఎందుకిలా అనేది కూడా ఆయన వివరించారు. బోయిభీమన్న గారి 'గుడిసెలు కాలిపోతున్నై' రచనకు నేపథ్యంలో ప్రాచీన భారతదేశ వర్ణాశ్రమధర్మాలు గురించిన చర్చ కూడా అవసరమే. ఈ 'ధర్మమే' ఊరిచివర 'గుడిసెలకు' కారణమయింది. 'గుడిసెలలోని అజ్ఞానము' ఈ వర్ణాశ్రమ పుణ్యమే! అందుకే అంబేద్కర్ తన 'కులనిర్మూలన' గ్రంథంలో 'కుల వ్యవస్థ నిర్మూలించనిదే భారత సమాజానికి ముక్తిలేదంటారు'. 'గుడిసెలు కాలిపోతునై/ఎవరి గుడిసెలో పాపం/మాలమాదిగలవే అయి ఉంటాయి/ గుడిసెలు ఎవరికుంటై? వర్ణాశ్రమ వ్యవస్థలోని ధర్మాన్ని, అధర్మ రహస్యాన్ని కూడా విప్పి చెబుతూ 'అదే మన ధర్మంలోని రహస్యం' అంటారు. రహస్యం తెలిస్తేనే 'ఛేదన' సాధ్యమవుతుంది. అసలు గుడిసెల్ని సృష్టించిందెవరు? 'భవనాలు' (దోపిడికి ప్రతీకలు) ఈ రెంటి మధ్యనున్న పరస్పర సంబంధాన్ని 'సృష్టికర్తనే మార్చాలి' అనే కవితాఖండికలో 'పూరి గుడిసెల్ని సృష్టించింది మేడలైతే/మేడల్ని నిర్మించింది పూరిగుడిసెలే/స్వార్థానికి అమాయకత్వంబలి/అమాయకత్వానికి స్వార్థంపులి' అనే వాఖ్యానంలో ఎటువంటి వ్యవస్థను ఆశిస్తున్నారో స్పష్టం. సమాజంలో ఆటవిక న్యాయం అనాదిగా ఉన్నదే. నేటికి ఉన్నది. మనుషుల మధ్య వర్ణాల విభజన ఉంది. తద్వారా ఓ 'వన్య వ్యవస్థ' ఏర్పడిందని భీమన్నగా రంటారు. పులులు - సింహాలు - నక్కలు - తోడేళ్ళు, గొర్రెలు ఉన్న సమాజమిది. మనుషులనే జంతు ప్రతీకలుగా చెప్పుకుంటారు. కవి. 'గొర్రెవుకాకు' కవితలో మానవ సమాజం ఒక మహారణ్యంలా/ఉండాలంటాడు కేపిటలిస్టు/సింహానికి బర్రె, తోడేలుకు గొర్రె/డేగకు పావురం, గోవుకు గడ్డి / స్వేచ్ఛగా దొరకాలంటాడు అని హెచ్చరించటం వెనుక జాగ్రత్తలు కూడా ఉన్నాయి. కాని ఇది 'జూ' కాదు. అరణ్యం కాదు. ఇదో 'రేసు కోర్సు' అంటారు బోయిభీమన్న. కవితలకు 'వ్యంగ్యం' కొన్ని సందర్భాల్లో 'బలం'. పతంజలి. వంటి వారు బలంగానే ఈ విషయం చెప్పారు.

భీమన్న గారు తన 'టుమ్రీ'లలో ఓ సామాజిక స్వభావాన్ని ఎంతో సరళంగా చెబుతారు. 'బలం కలవాడు

పులి/తెలివిగలవాడు నక్క/ఈ ఇరువర్గాలకూ ఆహారంగా/ బ్రతుకుతున్న మూర్ఖులు గొర్రెలు. ఇక్కడ మరో విషయాన్ని ఆయన బలంగానే చెప్పారు. సమాజంంలో గొర్రెలు, పులులే ఉన్నాయి. బలం గల జాతి, బలహీనజాతి, దోపిడిదారు - దోచుకోబడినవారు. నిజానికి ఇవే సమాజాన్ని నిర్దేశిస్తున్నాయి. తొంభైతొమ్మిది మంది శ్రమజీవుల 'శక్తి' ఇద్దరి పెట్టుబడిదారుల 'సంపద' కనుకనే భీమన్న గారు కూడా 'నాలుగు వర్ణాలన్నది హిందూయిజం/ రెండు వర్ణాలన్నది కమ్యూనిజం/ఈ వర్ణ విభజన వర్ణ విభజనా కూడా/పులీ నక్క కలిసి చేసినట్టిదే ఇవే కదా గొర్రెలను తినేది. మరో ముగింపు వాక్యంగా 'నాడెంతో నేడూ అంతే -/అదే పులి! అదే నక్క! అవే గొర్రెలు/ఎంతో విశాలమైన భావ ప్రకటన.

వర్తమానంలో 'రాజకీయం' వ్యక్తులను 'మనుషులుగా' పరిగణించటం లేదు. కేవలం ఓట్లుగానే చూస్తున్నది. మతం, కులం ఇవే పదవులకు మంత్రాలు. డబ్బు వెదజల్లి 'గొర్రెలను కొనటం సర్వసాధారణ ప్రక్రియ అయి పోయింది. మనిషి ప్రాణానికి, కష్టానికి విలువ లేదు. ఐదేళ్ళకొకసారి మాత్రమే అతడిని 'మనిషి'గా చూస్తారు. ఓటు రూపంలో/నోటు పడేసి... ! 'బానిసల జాబితా' అనే కవితలో 'ఓటు'తో 'మా ప్రాణాలు తోడేస్తున్నారు / మా గుడిసెలు తగలబెట్టేస్తున్నారు/ బానిసలకుండే సుఖ శాంతులు సైతం/మా పేద ఓటర్లకు లేవు మహాప్రభో చివరిగా - ఈ దేశంలో పేదలకు వోటుండటం/ప్రక్కలో పాముండటమేనంటారు.

ఈ 'గుడిసెలు కాలిపోతున్నై'లో ఇటువంటి ఎన్నెన్నో విశేషాలు, శ్లేషాలు, చిత్రాలు, బోధలు కనిపిస్తాయి. శిల్పం, కవిత్వం వంటివి 'కవిత'ను ఎంతో ఆర్ధత, ఆవేదనలతో చదవరులను కట్టిపడేస్తాయి. ఎంతో వస్తువైవిధ్యం కనిపిస్తుంది. అజ్ఞానం, అవివేకం, పేదరికం వంటివి కాలిపోవలసివి అయితే 'గుడిసెలు కాలిపోవలసిందే' 'తిరగబడవలసిందే'. హక్కులు కోసం కాదు... స్వతంత్ర్య జీవిక కోసం. వ్యక్తిత్వ అస్తిత్వాల కోసం. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ మాటననుసరించి ఇది 'వన సమజాం' కాదు 'జన సమాజం' ఇక్కడ వర్ణాలు కాదు... 'వ్యక్తులు'గా గుర్తింపు అవసరం. అణచబడిన వర్ణాలు ఆక్రోశం చరిత్రపుటల్లో యుద్ధాలుగా మిగిలిపోతే జాతిజీవనానికి కొనసాగింపు ఉండదు. జాతీయ కవులను సహితం 'జాతి' కవులుగా ఎంపిక చేసుకొంటున్నారు కాని... వారి కవిత్వం లోని జాతీయతావాదాన్ని మాత్రం అనుసరించరు, అమలుపరచరు. జాషువా తరువాత అంత బలంగానూ దళితులను గూర్చి కవిత్వం వెలియించిన కవి పద్మశ్రీ డా॥ బోయిభీమన్న గారు. 'ఓ అహంకార కులాగ్రేసర!' 'నా హక్కులేనో నాకిలా పారేయ్!' 'హే పీడిత పిరికజనమా!' 'ఇవిగో మీ హక్కులు!' 'అధికారంతో అనుభవించండిక'

చివరిగా

"మైనారిటీ మతంలో కులాలుండే
ఆధునిక కులం మరో కులాన్ని
అనగద్రోక్కాలని చూస్తే
ఆ అనచివేతకు గురయ్యే
కులం వైపు నేను నిలబడతాను" అన్న పెరియార్ ఇ.వి.రామస్వామి గారి వాఖ్యానాన్ని తన సాహిత్యం ద్వారా మరోసారి సమాజానికి ప్రతీకాత్మకంగా కవిత్వీకరించిన కవి పద్మశ్రీ డా॥బోయిభీమన.

ఆధార గ్రంథాలు :

1. గుడిసెలు కాలిపోతున్నై - డా॥బోయిన భీమన్న
2. బోయిభీమన్న రచనలు - దళిత ధృక్పథం - వ్యాస సంకలనం

అభ్యుదయ దృక్పథాన్ని ప్రతిబింబించిన "పాలేరు" నాటకం

– షేక్ జలీనా, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు.

"వ్యక్తుల వికాసమే జాతి, జాతుల వికాసమే వసుధ, వసుధైక సామ్రాజ్యమే మానవలోక సంపూర్ణ ఫలం" అంటూ సంఘసంస్కరణకు, సామాజిక చైతన్యానికి తన రచనల ద్వారా బీజంవేసిన కవి బోయి భీమన్న గారు. దళితుల ఇంట పుట్టి, దళితుడిగా అనేక అవమానాలను అవహేళనలను భరించి వాటిని తన రచనలలో ప్రతి ఫలిస్తూ సమాజ మార్పుకు దోహదం చేసిన జాతీయకవి భీమన్న. అంబేద్కర్ భావజాలాన్ని, అణచివేయబడుతున్న కులాల పట్ల అభ్యుదయ కాంక్షనీ రచనల్లో వ్యక్తంచేసిన కవి భీమన్న.

సుమారు డెబ్భైవరకు పుస్తకాలు రాసిన భీమన్న ప్రతీ గ్రంథంలోనూ తనకున్న పరిశోధనాత్మక దృష్టినో, కొత్త సిద్ధాంతాన్నో, కొత్త ప్రతిపాదననో మనముందుంచుతాడు. ఆకాశవాణి కోసం భావగీతాలు కూడా రాసిన భీమన్న అంబేద్కర్ రచనలను తెలుగులోకి అనువదించాడు. వీరి గుడిసెలు కాలిపోతున్నాయి రచనకు 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. కళాప్రపూర్ణ, పద్మశ్రీ, పద్మభూషణ్'లతోపాటు గౌరవ డాక్టరేట్ కూడా పొంది విశిష్టకవిగా అందరిచేత కొనియాడబడ్డారు.

1940లో రాసిన 'పాలేరు' నాటకాన్ని ప్రశంసిస్తూ 'నాటక సాహిత్య మకుటం భీమన్న పాలేరునాటకం' అంటారు సవేరా. భూస్వామ్య వ్యవస్థలో పాతుకుపోయిన కుల వ్యవస్థనూ, దానిని ఆశ్రయించుకుని వున్న శ్రమదోపిడీని భీమన్న తీవ్రంగా నిరసించాడు. కులం పేరుతో జరుగుతున్న అవమానతల్ని, దీపిడీని చాలా బలంగా వ్యక్తపర్చడానికి నాటకాన్ని ఒక మాధ్యమంగా వాడుకుని సాంఘిక విప్లవానికి తెరతీసినవాడు భీమన్న. ప్రత్యేకించి 'పాలేరు' నాటకం ప్రజల్లో విపరీత మైన చైతన్యానికి పునాది వేసింది. దాదాపు రెండుదశాబ్దాల పాటు ఈ నాటకాన్ని చూడని దళితులు లేరంటే అతిశయోక్తి కాదు. ఆ నాటకాన్ని చూసిన ఎంతోమంది తండ్రులు, తల్లులు ఆ నాటకంలోని పాత్రలతో తమను తాము పోల్చుకుని తమ పిల్లలను 'పాలేరు' తనమనే రొంపిలో నుండి బయటకులాగి చదువు వైపు వారి దృష్టిని మళ్లించేలా చేసింది. భూస్వాములు, కామందుల్ని ఎదిరించి మరీ తమ పిల్లల్ని చదువులకు పంపించేవారు తల్లిదండ్రులు. అందువల్లే ఈ నాటక ప్రదర్శనను ఆపించడానికి పోలీసుల్ని వాడుకునేవారు కామందులు, భూస్వాములు. 'ఒక నాటకం ప్రదర్శించబడుతుండగా పోలీసులో రౌడీలో వచ్చి నటులను రంగస్థలం మీదనుంచి లాగి కొట్టి ప్రదర్శన భగ్నం చేయడం అనేది పాలేరు నాటకం విషయంలోనే జరిగింది' అంటారు మరపట్ల భాస్కరరావు. దెబ్బలు తిన్నప్పటికీ మళ్లీ ఆ నాటకాన్ని ప్రదర్శించడానికి ప్రజలు ఉత్సాహం చూపించడం ఈ పాలేరు నాటకానికి వున్న విశిష్టత.

"వాల్మీకికి అతని సమకాలికుడైన రాముడు కథా నాయకుడు. నాకు నా సమకాలికుడైన పాలేరు వెంకన్న కథానా యకుడు. అతని జీవితం నా నాటకానికి ఇతివృత్తం. సత్యహరిశ్చంద్ర నాటకం చూసి ఎంతమంది సత్యవంతులయ్యారో తెలియదు కానీ పాలేరు నాటకం చూసి వేలమంది పాలేళ్లు పాలేరుతనాలు వదిలేసి పాఠశాలల్లో చేరి చదువుకోవడం వాస్తవంగా జరిగింది" అంటారు భీమన్న.

నాటక వస్తువైవిధ్యం

పాలేరు వస్తువైవిధ్యాన్ని ప్రతిబింబించిన నాటకం. అప్పటివరకూ సమాజంలో వున్న నాటకాలకంటే భిన్నంగా పాలేరుతనమనే విషయాన్ని, అందులో వుండే సాధక బాధకాల ఇతివృత్తం ఈ నాటకంలో కనిపిస్తుంది.

అభ్యుదయాన్ని ఆకాంక్షించే బోయి భీమన్న సమకాలీన సమస్యను ఇతివృత్తంగా తీసుకుని, ఆ సమస్యను నిర్మూలించడానికి కావలసిన సూత్రాలను ఈ నాటకంలో ప్రతిపాదించారు. అవిద్య ప్రగతి నిరోధకమని, దోచుకునే వాళ్లు దోచుకోబడేవాళ్లు అనే భేదం వున్నంత వరకూ సమాజం అభివృద్ధికి దూరంగా వుంటుందని ప్రబోధించారు.

'పాలేరు' సాంఘిక విప్లవాన్ని సృష్టించిన నాటకమని చెప్తారు రచయిత. తిట్టినా, కొట్టినా, చివరికి ప్రాణంతీసినా నరే నమన్న హక్కుభుక్తాలన్నీ భూస్వాములవే, కామందులవే అనే పరిస్థితి నుండి చదువుద్వారా జీవితంలో వెలుగు నింపు కోవచ్చని సాటిచెప్పిన నాటకం పాలేరు. ఊరికి దూరంగా, సౌకర్యాలకు దూరంగా, చదువుకోవాలని వున్నా ఆశను లోపలే చంపుకుని తండ్రి పుల్లయ్యకి కూడా ఎదురుచెప్పకుండా కుబేరయ్య దగ్గర పాలేరుగా పనిచేస్తుంటాడు వెంకన్న. 'ఉపకారి' మాస్టారు, వనబాల ప్రోత్సాహంతో చదువుకున్న తర్వాత వెంకన్న వెంకటేశ్వరావుగా ఎదగడం, ఊరిలోని సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించడం మొదలైన విషయాలన్నీ ఈ నాటకంలో ఎంతో నిబద్ధతతో మనకు కనిపిస్తాయి.

కులాంతర వివాహాన్ని ప్రోత్సహించిన నాటకం:

పాలేరు నాటకం కులాంతర వివాహాల అవసరాన్ని గుర్తించింది. 'భారతదేశంలో కులాలు తప్ప వర్గాలు లేవు' అనేది బోయి భీమన్న ప్రతిపాదన. కులాంతర వివాహం సమకాలీన సమస్య. ప్రస్తుత కాలంలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ఎంత దారుణంగా చంపి వేస్తున్నారో మనకందరికీ అనుభవంలోనిదే. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా పరిస్థితి ఇలా వుంటే, స్వాతంత్ర్యానికి ముందు ఇంకెంత దారుణంగా వుందో మనకు తెలుస్తుంది. ఈ సమస్యను సమకాలీన సమస్యగా ఈ నాటకంలో చక్కగా చిత్రించారు. కులాంతర వివాహాన్ని ప్రోత్సహించారు. పాలేరు నాటకంలోని వెంకన్న "కులపు గొడ్డళ్లతో మొత్తుకొనెడు జాతి నిన్ను నన్నును ఒకటి కానిచ్చుటెట్లు" (పుట-79) అంటూ వనబాల ప్రేమ విషయం లో మధనపడుతుంటాడు. 1959లో రాసిన రాగవాశిష్టం నాటకంలో అరుంధతి-వశిష్టుల ప్రణయ గాథలోనూ కులాంతర వివాహం సమాజాన్ని కులం భావనకు దూరంగా వుంచుతుందని భీమన్న అభిప్రాయ పడ్డారు. రైతువాడ గ్రామంలో అభ్యుదయ సంపన్న కుటుంబానికి చెందిన వనబాల ఆధునిక భావాలున్న యువతి. కులంవల్ల అగౌరవంగా చూడబడు తున్న వెంకన్నను ఇష్టపడుతుంది. అగ్రకులంలో పుట్టిన అమ్మాయిని వివాహం చేసుకోవాలంటే ఎన్ని ఇబ్బందులు పడాలో ఈ నాటకంలో చెప్తారు రచయిత.

పాత్రలు - సంఘర్షణ :

పాలేరు నాటకంలో పాత్రచిత్రణ విలక్షణంగా కనిపిస్తుంది. తన తండ్రినుండి తనకు వారసత్వంగా సంక్రమించిన పాలేరుతనాన్ని తన కొడుకైన వెంకన్నకు కూడా వారసత్వంగా అందిస్తాడు పుల్లయ్య. "చదువు మన అనాయం కాదురా. ఐనా గడవనివాళ్లం, ఒక్కపూట తింటే రెండో పూటకి గతిలేనోళ్లం, కడజాతివాళ్లం, కూలోళ్లం. ఎలాగురా చదవడం" (పుట-38) అంటూ వెంకన్నలోని చదువుకోవాలనే అభిలాషకు ప్రగతినిరోధకంగా మాట్లాడుతుంటాడు. అయినా అతనిలో అంతర్లీనంగా చదువుకోవాలనే ఆసక్తి వుంటుంది. కానీ కులంవల్ల, పాలేరుతనం వల్ల ఆత్మన్యూనతాభావానికి లోనై ఆత్మహత్య చేసుకోవాలని తలుస్తాడు. అతనిని అమితంగా ఇష్టపడిన వనబాల ''ధైర్యము విడిచెదవా వీర! ధర్మము మరచెదవా!" (పుట-26) అంటూ అతని ఆత్మహత్యను నివారిస్తుంది.

ఈ నాటకంలో ఉపకారి పాత్ర కూడా అద్భుతసృష్టి. పరిస్థితులను మార్చుకోవడానికి చదువును సాధనంగా వాడు కోవాలనే ఆలోచనను ఉపకారి ఊరందరికీ చెప్తుంటాడు. 'శక్తికంతకు మూలము చదువు కాన బడికి పంపుము మీ వంశ వర్ధను'లను (పుట-8), 'బడికి పంపుడు, విద్య నేర్పుడు, రవంత ముందునకు

బోవనిండు మీ ముద్దునుతుల' (పు-10) అంటూ ఇంటింటికీ తిరిగి పిల్లల్ని స్కూలుకు పంపమని ప్రాధేయ పడుతుంటాడు. బతుకంతా పాలేరుతనంతో జీవించడం కంటే మరణించడం మేలని భావించిన వెంకన్నను 'బ్రతికియుండియె మనిషి శుభమ్ములొంద వలయు, చచ్చిన తరువాత బ్రతుకులేదు, బ్రతికి సాధింపవలెగాని వాంఛితములు చచ్చి సాధింతుననుట చచ్చుమాట' (పు-39) అనే మాటలు చెప్పి మొదట బ్రతుకుమీద ఆశను, పిదప చదువుమీద ధ్యాసను కలిగించే విధంగా ఉపకారి పాత్రను చిత్రించారు రచయిత.

కుబేరయ్య కరడుగట్టిన ప్రగతి నిరోధకుడిగా ఈ నాటకంలో కనిపిస్తాడు. చదువుకుంటే పాలేరుతనం చేయడానికి ఎవరూ వుండరని, చదువుకుంటానన్న వెంకడిని నిరోధించడానికి వీరేశాన్ని, పుల్లయ్యను ప్రయోగిస్తాడు. పశువులను మేపడానికి వెళ్లి పుస్తకం చదువుకుంటున్న వెంకడిని గొడ్డును బాదినట్లు బాదు తాడు. పిల్లల్ని బడికి పంపమంటూ తిరుగుతున్న ఉపకారి గురించి వెంకన్న తండ్రి పుల్లయ్యతో "పంతుళ్ళంటే ఏమనుకున్నావురా? వొట్టి దొంగలు, యీబాసా ర్లూను. బ్రతకలేని వాళ్ళంతా బడిపంతుళ్ళుగా తయారయ్యి వూళ్ళని తగలబెడుతున్నార్రా..." (పు-36) అంటూ పరోక్షంగా వెంకన్న చదువుకు ఆటంకం కలిగించాలని చూస్తాడు. 'కామందంటే సగం మొగుడం'టూ సీతను బలాత్కరించబోతాడు.

మనుషుల్లో అందరూ చెడ్డవారు కాదనీ, మంచివాళ్లు కూడా వుంటారని నమ్మినవారు భీమన్న. అందుకే ఈ నాటకంలో ఉపకారి పాత్రద్వారా చైతన్యానికి నాంది పలికారు. అగ్రకులానికి చెందినా మనుషుల్లో మానవత్వం చూడగలి గిన ఉన్నతమైన పాత్రగా 'వనబాల' మనకు కనిపిస్తుంది. వెంకన్న మీద అభిమానంతో, ఇష్టంతో అతనిపై శ్రద్ధ చూపి స్తుంది. అతనిలో చదువుకోవాలనే ఆశను ప్రేరేపిస్తుంది. ఉన్నత చదువులు చదవడానికి తన నగలను ఇవ్వడానికి కూడా వెనకాడదు. అతని పట్ల ప్రేమవున్నా దాన్ని బయటకు చెప్పకుండా తనలో తనే బాధపడే పాత్రగా మలిచారు ఈ నాటకంలో. అన్ని అవరోధాలను దాటుకుని చివరికి వెంకన్నను వివాహం చేసుకుంటుంది.

ఇంకా, ఈ నాటకంలోని ప్రతీ పాత్రను అద్భుతంగా చిత్రించారు. బాల అన్న సుందరం అభ్యుదయ కాంక్ష కలిగిన వ్యక్తి. రామం కూడా వెంకన్న చదువుకు సహాయం చేస్తాడు. పాలేరుగా పనిచేసే వీరేశం మొదట్లో వెంకన్నమీద కుబేరయ్యకు చాడీలు చెప్పినప్పటికీ తర్వాత తన తప్పు తెలుసుకుని చదువు ప్రాధాన్యాన్ని గుర్తిస్తాడు.

గేయాలు - పద్యాలు :

ఇక ఈ నాటకానికి తలమానికంగా, నాటక ప్రతిష్టను అగ్రభాగంలో నిలబెట్టడంలో పద్యాలు గేయాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. పాలేరు నాటకం 19వ ముద్రణకు రాసిన 'బాణాకర్ర' అనే ముందుమాటలో 'గాఢమైన ఆవేశాలను, రసాలను, ఫీలింగును వ్యక్తం చేయడా నికి పద్యాలు, పాటలు, నృత్యాలు వంటి కళాప్రక్రియలే సాధనాలు. నా నాటకాలన్నీ పద్యగేయ సంయుతాలే' (పు-ఇఱజ) అని చెప్తూ 'నేను పద్యాలు పాటలు లేకుండా నాటకాలు రాయను' అని కూడా చెప్తారు. ఈ నాటకం లోని దాదాపు 23 రంగాలలోనూ పద్యాలు, పాటలు మనకు కనిపిస్తాయి. ప్రతీపాటలోనూ వెల్లివిరిసే చైతన్యం కనిపిస్తుంది. నాటక ప్రారంభంలోనే 'బానిస తనమును బాపుమురా- భారతభూమికి భాగ్యము తేరా!' అంటూ బానిసతనం భవిష్యత్తుకు మంచిది కాదనే విషయాన్ని చెప్తారు. బానిసత్వంలో వున్న భారతజాతీయులను ఏకతాటిమీదకు నడపడంలో ఈ గేయం స్వాతంత్ర్యో ద్యమంలో కూడా ప్రముఖ పాత్ర వహించిన గేయంగా ప్రసిద్ధిలో వుంది.

బానిసతనం భరించలేక చనిపోవాలనుకున్న వెంకన్న "మాలను గావించి - పాలేరుగా జేసి కామందు కాలికి గట్టినావు, అంటరాదని చెప్పి పెంటల పాల్జేసి నీచుల మనుపేర నిల్పినావు, చదువుసంధ్యలు లేక జంతువులను

బోలె ఊరి వెల్పల చావ నుంచినావు, ఆన తిమిరాల యడుగున పడద్రోసి బరిగీసి యెదనొక్కి పట్టినావు" (పు-26) అంటూ తన పరిస్థితిని చెప్పి ఆత్మహత్యకు ప్రయత్నించడం అతని హృదయవిదారక పరిస్థితికి అద్దం పడుతుంది.

పాలేరుపనిలో కష్టముంటుంది గాని సుఖముండదు. ఎంత చాకిరీ చేసినా కనీసం తినడానికి తిండి కూడా లేని దుర్భర జీవితాన్ని గడుపుతుంటారు. భూస్వాములు, కామందుల పొలాలను తమ చాకిరీతో సస్యశ్యామలం చేసినా వచ్చే కూలీ తమ పొట్టనింపడానికి కూడా సరిపోదనే దైన్యాన్ని ఈ గేయంలో చెప్తారు. "ఎండలో వానలో కూలోడా! బండ చాకిరీ చేసి కూలోడా! పండించి పెడతావు కూలోడా! తిండి నీకేదిరా కూలోడా! నీ శక్తీ నీ బ్రతుకు కూలోడా! నేల కర్పిస్తావు కూలోడా! పోరాడ గలిగితే కూలోడా!ఈ రాజ్యమే నీది కూలోడా!" (పు-44) అంటూ కూలీల పరిస్థితిని వివరిస్తూనే వారిలో పోరాట పటిమను నింపడమే కాకుండా ప్రజల్లో చైతన్యాన్ని నింపుతారు.

వెంకన్న తండ్రి పుల్లయ్య. కుబేరయ్య మాటలు నమ్మి చదువుకుంటానన్న కొడుకు మాటలు వినకుండా కుబేరయ్య దగ్గర పాలేరుగా పెడతాడు. రోజులు గడిచేకొద్దీ కుబేరయ్య నిజస్వరూపాన్ని గ్రహించి తన తప్పుని తెలుసుకుంటాడు పుల్లయ్య. చదువుకోసం ఇంటిని వదిలి వెళ్లిన కొడుకుకోసం పుల్లయ్య కూడా ఊరిని విడిచిపెట్టి భిక్షాటన చేసుకుంటూ వెతుకుతుంటాడు. ఆ సందర్భంలో తన పరిస్థితిని "పేదమాలగా జన్మించాను, పెంటలపాలై జీవించాను, కష్టం కామందుకి ధారోసి ముష్టెత్తుకు వస్తుంటున్నాను, తల్లుల్లారా! తండ్రుల్లారా! యిన్నారమ్మా నా బోధ? కడుపున బుట్టిన కనుగాయల్ని కామందుల కాళ్లకు బలియ్యకండి, విద్యాబుద్ధులు చెప్పించండి, పాల్తేరనములో ఏమీలేదూ, బానిసకూడూ కడుపు నిండదూ, స్వేచ్ఛగా తలయెత్తుకు బతకండి' (పు-70) అంటూ చదువు ప్రాధాన్యాన్ని గుర్తించి పిల్లల్ని పాలేరుతనానికి పంపించవద్దని వేడుకుంటాడు.

వనబాలకు - వెంకటేశ్వరరావుకి పెళ్ళి కుదురుతుంది. ఆదర్శవివాహం. కట్టుబాట్లను కులమర్యాదల్ని కాదని జరగబోతున్న వివాహం, కులాంతర వివాహం. దాన్నొక సాంఘిక విప్లవంగా భావించిన ఉపకారి "ఒకవైపు సనాతన కుల దివాంధులు శపియించి నిప్పులు జల్లుచుండ, ఒకవైపు ప్రగతి కాముకులైన యువకులు ప్రేమకాన్కలు సమర్పించుచుండ, ఒకవైపు భారతాభ్యుదయ నిరోధకుల్ నోటి కత్తులు చాల నూరుచుండ, ఒకవైపు జాతి ఏకోన్ముఖ మగుచుండ, దాస్య బంధనలు బ్రద్ధలగుచుండ, కుటిల కులభేద కుడ్యాలు కూలద్రోసి పూర్వవైభవ శిఖరాల బూజు దులిపి తెలిసి, జాతి నిద్దుర లేచి, నిలిచి నడువ బాల పెండ్లాడె వెంకటేశ్వరుడు నేడు!(పు-101) అంటూ వారిరువురి వివాహాన్ని ఆదర్శప్రాయమైన వివాహంగా కీర్తిస్తాడు.

❁❁❁

"బోయి భీమన్న సాహిత్యం - సామాజిక ధృక్పథం"

- కొనుకు శ్రీనివాసరావు, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ఈదరాడ, మామిడికుదురు మండలం, తూ॥ గో॥ జిల్లా.

మహాకవి, కళాప్రపూర్ణ డా॥బోయి భీమన్న గారి రచనల్లోని సామాజిక ధృక్పథం నన్ను మిక్కిలి చలింప చేసినందున ఆయన రచనల పట్ల ఆకర్షితుడినై, ప్రభావితుడినై, ప్రేరేపితుడినై, నేను ఈ పరిశోధన పత్రాన్ని సమర్పించదలిచాను.

భీమన్న జీవన నేపథ్యం, ఆయన పుట్టి పెరిగిన ప్రాంతం; ఆయన చూసిన, అనుభవించిన దురాచార ఘట్టాలు అనేకనేకం ఆయన సృష్టించిన పాత్రల్లో సుస్పష్టంగా కన్పిస్తూనే వుంటాయి.

బాల్యం నుండి సమాజం పక్షపాత వైఖరిని గమనిస్తూ - ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి దశలో సాటి విద్యార్థుల్లో సహితం పాతుకు పోయిన వెలివేత చూపుల్ని కళ్ళార చూసి, చలించి, నిశితంగా పరిశీలించి ఎంత మదన పడకపోతే ఆయన కలం నుండి ఇన్ని కావ్యాలు వెలువరించబడ్డాయి.

భీమన్నగారు ఒక రోజు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం వెళ్తూ ప్రయాణ మధ్యలో ముంగండ అగ్రహారవాసి, ప్రముఖ అభ్యుదయ సాహితీమూర్తి శ్రీ మహీధర రామ మోహన్‌రావు గార్ని దర్శించి తిరిగి వెళ్తుండగా, జ్వరంతో ఉండి కూడా తనని వీధి చివరి వరకూ సాగనంపి, "నువ్వు ఈ ప్రాంతానికి కొత్త వ్యక్తిగా మా వాళ్ళు గుర్తించి నీ వివరాలు, నీ కులగోత్రాలు అడిగి నువ్వు మా వాడివి కాదని తెలుసుకుని నిన్ను దండిస్తారు. అందుకే నీకు తోడుగా ఈ వీధి చివరి వరకూ వచ్చాను." అని రామమోహన్‌రావు గారు అన్నప్పుడు భీమన్నగారి మదినదిలో చెలరేగిన ఆలోచన్ల అలలే 'జన్మాంతర వైరమ్' కావ్యానికి ప్రేరణ అని ఆయన రాసిన పీఠికలో చదివితే హృదయం ద్రవించక మానదు.

కాలం మారుతున్నకొద్దీ అనమానత తీరులు రూపాంతరం చెందుతూనే వున్నాయి తప్ప పూర్తిగా నమసిపోయి, అంతరించి పోలేదన్న ఉదంతాలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్న వైనాన్ని భీమన్నగారు ఎంతో లోతుగా అధ్యయనం చేసి ఆ సంఘటనల్నే వస్తువుగా స్వీకరించి సమస్యల్ని ఎత్తి చూపడంతోపాటు పరిష్కార మార్గాన్ని కూడా చూపుతూ తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగించిన కావ్య సూరుడు, కలం యోధుడు బోయి భీమన్న.

తన అనుభవంలోకి వచ్చిన విషయాల్నే కాదు, గత అగాధాల్లోకి తొంగి చూసి ఎన్నెన్నో కుటిల కులతత్వ సంకుచిత మకిలి పట్టిన భావాలకు సానబెడుతూ ఆయన సృష్టించిన సాహిత్యమంతటిలోనూ సామాజిక ధృక్పథమే దర్శనమిస్తోంది.

బోయి భీమన్న గారి 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటిలో ' చీమల పుట్టలు ' కవితలో రంగుల బేధాలతో కుమ్ముకు చచ్చే చీమల గురించి రాస్తూ అంతర్లీనంగా మనుషుల గురించి చురకలేసే రీతిలో సాగిన కవితలో " తమలో తాము కొట్టుకు చస్తూ తమ పుట్టల్ని పాములకు కట్టబెడుతున్న చీమలు " అంటూ చీమల్ని అన్యోపదేశంగా తీసుకుని మనుషులకు హితబోధ చేస్తూ కర్తవ్యాన్ని ప్రబోధించే రీతుల్లో రాసిన కవితలు అనేకం సామాజిక ధృకథాన్నే కాంక్షించాయి.

భీమన్నగారు రాసిన "పాలేరు నాటకం" ఆ రోజుల్లో ఆంధ్ర రాష్ట్రమంతటా ఒక సంచలనాన్ని సృష్టించడమే కాకుండా - ప్రయోజనాత్మకంగా నిల్చి - అప్పటి వరకూ పాలేరు వెట్టిచాకిరి కొలిమిలో మ్రగ్గిపోయే దళిత యువకులెందరెందరో ఆ రొచ్చుకూపం నుండి బయటి

పడి మరలా బడిదారి పట్టి, అక్షరం విలువ తెలుసుకుని చదువుకోవడమే కాదు పట్టబద్రులై ఉద్యోగ వెలుగుల్ని తమ తమ జీవితాల్లో నింపుకున్న యువతకు ప్రాణదీపమై నిల్చిన ''పాలేరు'' నాటకాన్ని మించిన నాటకం తెలుగు నాట వేరొకటి లేదన్న విషయం లోక సత్యం.

''మధ్యతరగతి సామాన్యుల కలలు
గ్రామంలో పాలిమేర పుంతల్లో
ఉద్యోగాలు వెతుక్కొంటున్నై
అధికారుల బంగారు పాదుకులను
ఆశ్రుజలంతో అభిషేకిస్తున్నై
వయసొచ్చిన ఆడ పిల్లల్ని భరించలేక
వరకట్నాల మొసళ్ళకు వదిలేస్తున్నై'' ''గుడిసెలు కాలి పోతున్నై'' కవితా సంపుటిలోని ఆక్రోశిత వాక్యాలివి. ఇప్పటికీ మాయని పచ్చిపుండు సలుపుతో సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతల్ని ఎత్తి చూపిన ముందు చూపుకు నిదర్శనం. భీమన్న సాహిత్యంలోని సామాజిక ధృక్పథం.

సామాజిక స్థితిగతుల్ని ఎంతగానో అధ్యయనం చేసి, పద్య, గద్య, పాట, వచన, నాటక ప్రక్రియల్లో ఎనలేని సాహిత్యాన్ని సృష్టించిన కవి బోయి భీమన్న. శాసన పరిషత్తులో ప్రవేశించాక ప్రజాహితాన్ని కోరుతూ ఆయన లేవనెత్తిన అంశాలు, సమస్యలకు మూల కారణాలు, పరిష్కారాలకు చూపే మార్గాలను ఒకసారి మనం మననం చేసుకుంటే - ఆయన పరిశీలన, అవగాహన మనకు అవగతమవుతుంది.

''ఏదైనా ఒక ప్రకటన గెజెట్‌లో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా ప్రకటించబడిన తర్వాత తీసుకో బడుతుంది.'' అనే దానిలో తెలుగులో అనే దానిని తొలగించి, ఇంగ్లీషులో అనే దానిని మాత్రమే ఉంచడం ఈ సవరణకు అభ్యంతరం చెప్పారు భీమన్న. లోపముంటే అధికార పక్షాన వుండి కూడా అభ్యంతరాన్ని వెలిబుచ్చ డానికి, విమర్శించడానికి వెనుకాడక, నిరుపయోగంగా చేసే చట్టాలను వ్యతిరేకిస్తూ, ప్రసంగిస్తూ ''పనికిరాని మగడు పక్కనుంటెనేం - పంచనుంటేనేం'' అని దీటుగా ప్రశ్నించిన సామాజిక ధృక్పథం కల్గిన బాధ్యతాయుతుడు బోయి భీమన్న.

స్వతహా కవి అయిన బోయి భీమన్న శాసన పరిషత్తులో ఇటు సాహితీ రంగానికి ఆటు దళిత రంగానికి ప్రోత్సహకరంగా కలుగ జేసుకుంటూ - ఆ రంగాలకు మేలు జరగాలని నిత్యం తపించేవాడు భీమన్న.

రాయలసీమ వంటి ప్రాంతాలు ఎడారులుగా మారే ప్రమాదముందని ఒక ప్రభుత్వ పక్ష సభ్యుడు లేవనెత్తిన అంశానికి స్పందిస్తూ స్వాతంత్ర్యం వచ్చి ముప్పై ఏళ్ళ తర్వాత ఈ మాట చెప్పడానికి సిగ్గుపడాలని కౌన్సిల్‌లో ఎదురు ప్రశ్న వేస్తూ - రిగ్గులు వాడకం ద్వారా భూగర్భ జలాల్ని తోడేస్తున్నారని, ఉన్న రిగ్గులకు నీరందక పోతే, ఇంకా బలమైన విదేశీ రిగ్గులు రప్పించి మరీ లోతుల్లోని నీటిని కూడా తోడివెయ్యడానికి యత్నిస్తున్నారని అందువల్ల రావి, మర్రి వంటి మహావృక్షాలు కూడా ఎండిపోయి, పుల్లరిగిపోయే ప్రమాద పరిస్థితులు ఏర్పడగలవని హెచ్చరించడంలో - మూలాల్ని గుర్తించాల్సిన బాధ్యతల్ని గుర్తు చేసిన సామాజిక హిత బోధకుడు బోయి భీమన్న.

ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు మాట, మాటకీ పెంచడం, దానికనుగుణంగా వస్తు ధరల్ని పెంచడం - ఈ ప్రక్రియకు పూర్తిగా వ్యతిరేకి భీమన్న. అధిక ధరల్ని భరించేవారు ఒక్క ఉద్యోగస్థులే కాదని జీతాల పెంపు నెపంతో వస్తు ధరల్ని పెంచడం సరికాదని, జీతాలు పెంచడానికి బదులు ధరలు నియంత్రిస్తే సరిపోతుంది కదా అని సూక్ష్మంలో మోక్షం దిశగా యోచించాలని సూచించిన ఆర్థిక అవగాహనపరుడు భీమన్న.

''అందరూ క్రిందికి చూస్తే నేను పైకి చూస్తాను.

అందరూ పైకి చూస్తే నేను క్రిందికి చూస్తాను '' అంటూ తను ఎక్కడ చూస్తే అక్కడ, క్షేమ కర, సౌందర్య, సౌభాగ్య, ఆనంద పరవళ్ళను తన దృష్టి కోణంలో కవితాత్మకంగా చూపగల అక్షరశిల్పి భావకుభేరుడైన

భీమన్న శాసన కౌన్సిల్‌లో కూడా తన వాక్‌చాతుర్యాన్ని సందర్భం చిక్కినప్పుడల్లా మరింత సమయస్ఫూర్తిగా ఛమత్కార, వ్యంగ్య ఛలోక్తులతో సభను రక్తి కట్టించిన సంధర్భాలనేకం.

"ఆస్థాన రౌడీ అక్కర్లేదా?" అని ఒక ప్రతిపక్ష సభ్యుడు అడగగా పూర్వం రాజుల ఆస్థానాలలో ఆస్థాన వస్తాదు లుండేవారని, ప్రతీ కళారంగం నుంచి విద్వాంసులను నియమించకోవచ్చునని, అయితే విద్వాంసులు అలంకార ప్రాయంగా మాత్రమే కాకుండా తమ తమ కళారంగాలలో యువకులకు శిక్షణనిచ్చే బాధ్యతను స్వీకరించాలని ఉ ద్బోధించారు భీమన్న.

మే ఒకటవ తేదీన సెలవు దినంగా ప్రకటించా లని శాసిస్తూ అప్పటి కార్మికశాఖామాత్యులు శ్రీ జి.వెంకటస్వామి గారు కౌన్సిల్‌లో ఒక బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు, భీమన్న కలగజేసుకుంటూ మే ఒకటి కంటే కూడా ఏప్రిల్ 14న భారత జాతికి పవిత్రమైనదని; కనుక ఆ రోజును సెలవు దినంగా ప్రకటించాలని కౌన్సిల్‌లో ఒకరిద్దరి మద్ధతును పొంది ఏప్రిల్ 14న అంబేడ్కర్ జన్మదినం నాడు సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించ డానికి, కారణభూతుడు, సామాజిక చైతన్యపరుడు, అంబేడ్కర్ వాది బోయి భీమన్న.

తెలుగు సాహితీ సాగరాన అనేకనేక కొత్త కొత్త ప్రక్రియలు ఉప నదుల్లా పుట్టుకొచ్చి సంగమిస్తున్న ఈ తరుణంలో కూడా నేను బోయి భీమన్న గారి సాహిత్యం సామాజిక ధృక్పథం ఎందుకు ఎంచుకున్నానంటే అయన ఆనాడు తీసుకున్న అంశాలు ఇప్పటికీ మానని పుండుగా సలుపుతూ పట్టిపీడిస్తున్న అసమానతలు ఇంకా పూర్తిగా తొలగిపోని వైనాన్ని ఎత్తి చూపడానికి భీమన్న గారి సాహిత్యంలోని సామాజిక ధృక్పథం ఎలా ఉపకరిస్తుందో చెప్పడానికి నేనీ అంశాన్ని స్వీకరించాను. "ఆనాడు దళితుడు పురవీధుల్లో ప్రవేశిస్తే అంటరాని తనానికి దొంగ తనం అంటగట్టి చావమోదడం, ఈనాడు మామిడి కాయలు ఏరుకుంటే ప్రాణం తీసిన వైనం" ఇప్పటికీ మార్పుచెందని సామాజిక అసమానతల్ని గమనిస్తు న్నప్పుడు భీమన్నగారి సాహిత్యం సామాజిక ధృక్పథం నన్ను మరింతగా ఆలోచింపజేస్తుంది. అంతేకాకుండా సున్నితంగా చెప్పినా "రాధతో ఎగ్జిబిషన్" రచనలో కూడా ఆనాటి రవీంద్రభారతి లాంటి కళావేదికలు కూడా ప్రతిభ గల కవులు కళాకారుల కన్నా - "కులం" బలం గల కుహనా పరులకే వేదికైన తీరును ఎండగట్టిన వైనం. "గుడిసెలు కాలిపోతున్నై" సంపుటిలో "నాకు జ్ఞాపకమున్నై దోసిలిపట్టి దాహం తీర్చుకున్న రోజులు" తను మదన పడ్డ వైనం ఇప్పటికీ సమసిపోని అసమానత సంఘటనలు దేశంలో, రంగు జాడ్యమీడని ప్రపంచంలో నిత్యం వెలుగు చూస్తునే వుండటాన్ని చూసి - భీమన్న గారి సాహిత్యంలోని సామాజిక ధృక్పథాన్ని స్పురింప చేసుకుంటూ - ఇప్పటికైనా కుల రుగ్మతలతో క్షోభిల్లే సమాజం నయమై ఆరోగ్యమయమవ్వాలని మార్పు చెంది బాగుపడి కోలు కోవాలని, మేలుకోవాలని ఆశిస్తున్నాను.

❁❁❁

"అనాదికొస నుంచి అనంతత్వంలోకి" ఒక పరిచయం

– డా॥. వి.కె.టి. మహాలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మర్రిపాలెం విశాఖ జిల్లా.

బోయి భీమన్న గారు ఒక పేద హరిజన కుటుంబంలో పుట్టి, అతి పిన్న వయసులోనే కలంపట్టి, అసంఖ్యాకమైన రచనలుచేసి అత్యున్నత సాహితీ శిఖరాలధిరోహించిన అపర ప్రజ్ఞావంతులు. లెక్కకు మించిన బిరుదులు, సన్మానాలు, అవార్డులు పొందిన కవివరేణ్యులు. పద్యం, గేయం, వచనం, నాటకం, విమర్శ, లేఖా సాహిత్యం మొదలైన అనేక సాహిత్య ప్రక్రియలను సంపద్వంతం చేసిన అశేష శేముషీ ధురంధరులు. ముఖ్యంగా వీరు రాసిన 'పాలేరు' నాటకం ఆనాటి సామాజికులలో గొప్ప చైతన్యం రగిల్చింది. ఈ నాటక ప్రభావంతో, ఎందరో యువకులు పాలేరు తనానికి స్వస్తిచెప్పి, ఉన్నత విద్యావంతులయ్యారు. ఈ మేటికవి రాసిన అసమాన రచనలలో ఒకటి. అనాది కొసనుండి అనంతత్వంలోకి.

భీమన్న గారు ఈ కావ్యానికి రాసిన ముందుమాటలో ఈ కావ్య నామధేయాన్ని గూర్చి, ఇందులో తాను ప్రస్తావించిన అంశాలను గూర్చి కొంత వివరించారు.

"అనాది కొసనుండి అనంతత్వంలోకి" అంటే ఏమిటి? "ఫ్రం ది ప్రజంట్ టు ది ఎటర్నిటీ" అని ఒకరు, "ఫ్రం ది మైనస్ ఇన్ఫినిట్ టు ది ప్లస్ ఇన్ఫినిట్" అని ఒకరూ మా మిత్రులు అర్థం చెప్పారు. ఎలాగైనా చెప్పుకోవచ్చు" అన్నారు.

"అనాది" అంటే ఆదిలేనిది, ఎప్పటినుండి ప్రారంభమైందో తెలియనిది. "అనంతం" అంటే తుదిలేని, మేరలేని, శాశ్వతము, నిత్యము, ఇత్యాది అర్థాలున్నాయి. "ఇన్ఫినిటి" అనే పదాన్ని గణితంలో "ఊహించటానికి వీల్లేనంత పెద్ద సంఖ్య అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఇందులో అనాది కొసనుండి అనంతంగా కొనసాగే ప్రకృతిని, మానవ ప్రకృతిని వర్ణించారు. ప్రకృతి పట్ల ప్రేమ, అనాదిగా సృష్టి కొనసాగటానికి మూలమైన స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమ, మానవ జీవన విధానంలో అనుసరించాల్సిన విషయాలు ఇత్యాది అంశాలను ఇందులో ప్రసక్తం చేశారు. ఉద్యానాన్ని, కవితోద్యానాన్ని సమన్వయించి ఒక లయలో నడిపించి సాహిత్య ప్రియులకు కానుకిచ్చారు.

"సర్వ ప్రకృతీ అర్ధనారీశ్వర కల్పనా చమత్కృతే" నని, క్రింద స్త్రీ పురుషులు, పైని తారా చంద్రులు, వీరి మధ్యగల సంబంధ బాంధవ్యాలే వివిధ ఋతు సంయుత కాలలీల, జీవలీల, విశ్వలీల అంటారు కవి.

"ఇందులోని ప్రేయసి కేవలం ప్రేయసని, ప్రియుడు కేవలం ప్రియుడని, ఆత్మ స్త్రీ అయితే, పరమాత్మ పురుషుడని, ఆత్మ పురుషుడైతే, పరమాత్మ స్త్రీ అని పేర్కొన్నారు" నీవు అన్నప్పుడు సందర్భాన్ని బట్టి ప్రేయసిగా, ప్రియుడిగా గ్రహించమన్నారు.

"అనాది కొసనుండి అనంతత్వంలోకి అనే ఈ రచన సార్థక నామధేయం కల్గింది. ఈ రచనను చదవటం ఒక దివ్యమైన అనుభూతి. దీన్ని చదువుతున్నప్పుడు సమస్త విశ్వం కళ్లముందు ప్రత్యక్షమౌతుంది. ఇందులో సుమారు '90' కవితలున్నాయి. ఇవి పరితల అంతరాంతర సీమలను వెలిగించే దివ్వెలు. ఈ రచన గురుముఖతః జీవన సార్థక మంత్రాన్ని గ్రహించిన అనుభూతి నిస్తుంది. జీవితం మీద అనంతమైన ప్రేమను కలిగిస్తుంది. జీవితం జీవించడానికన్న సత్యాన్ని, జీవితాన్ని ప్రేమించమనే సందేశాన్ని ప్రసాదిస్తుంది. "మానవ జీవితం వికసించాలి, పరిమళించాలి, ఫలించాలన్న" కవి ఆకాంక్ష ప్రతి అక్షరంలోనూ కన్పిస్తుంది.

"వసంత రచన" అనే కవితలో ప్రకృతిని చూసి మనిషి ఎలా పరవశిస్తాడో, కవి సృజన సహృదయులకు అలా ఆనందం కల్గించాలంటారు. "రచన రసభావ బంధురం కావాలని, ప్రత్యంశం సౌందర్యంతో నిండాలంటారు."

"అక్షర గంగ" కవితలో రాసేటప్పుడు కవి బ్రహ్మ కావాలని, తను రాసినదాన్ని తానే విమర్శించుకోవాలని, తానే సహృదయ పాఠకుడిగా మారి ఆనందించా లంటారు.

"నీవు వ్రాసిన దాన్ని నీవే పరిశీలిస్తున్నపుడు
పరమ విమర్శా నిశిత నేత్రుడివి నీవు
తుడిచి పారేస్తావు అనౌచిత్య దోహతతని
జాబిలి రబ్బరు బిళ్లతో
అరిగి అరిగీ అరిగీ
అమావాస్య అయిపోతూనే వుంటున్నది"

ఈ మూడు అవతారాలు ధరించినవారు భీమన్న గారు. అందుకే వారి రచనలకు అంత తీపిదనం. పఠితలకు బ్రహ్మానందం.

"మనోరథం" అనే మొదటి కవితలో మనిషి ఎన్ని కష్టాలైనా భరించి, జీవన మకరందాన్ని ఆస్వాదించాలనే భావాన్ని ఆలోచనాత్మకంగా వ్యక్తీకరించారు. పాఠకులకు ఇంతకు ముందు ఎక్కడా చవిచూడని అక్షర విందు చేశారు.

"పువ్వుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నాగులాబీ తోటలో
అందుకని
ముళ్లతోట అననా దీన్ని" .... ఇలా మొదలైన ఈ కవితలో

"లక్ష ముళ్ళ పొదల్ని భరించి
ఒక్క తోటైనా పెంచుకుందాం" అంటూ జీవన దృక్కోణం ఎలా ఉండాలో ఎరుకపరిచారు.

ఇందులో చివరి కవిత "రైలుబండి". మానవ జీవనయానం ఆద్యంతం ఇందు వర్ణితం. రైలుబండి వెలుగు చీకటి పట్టాలుగా సాగుతుందట. భూత భవిష్యత్తుల మధ్య వెలుగు వంతెనను దాటుతుందట...

"ఏ అభిజిత్సంకేతాన్ని కోరో
నిర్విరామంగా పోతున్న అభిసారిక
పాపం పుణ్యం లెక్క చేయక
అపార సంసార సాగరాలను
అసంఖ్యాకంగా మోస్తున్న మూలపుటమ్మ
ఈ ధూమవేణి"

ఈ రైలుబండిలో నవ్వేవాళ్లు, ఏడ్చేవాళ్ళు, రకరకాల మనుషులు, ఎన్నో రకాల మనస్తత్వాలు, ఈ అందరి మధ్య ఉంటూనే, స్త్రీ పురుషులు తమ ప్రయాణాన్ని విహారయాత్రగా మలుచుకోవాలని, ఆత్మను ఆనందంతో నింపుకోవాలంటారు. కాసింత జాగాలో సర్దుకుని ఉన్నదానితో తృప్తిపడి, వెన్నెలలో స్నానించమంటారు.

ఈ రచనలో ప్రకృతి వర్ణనలను పేర్కొనాలంటే ఈ రచనను మళ్ళీ తిరగరాయాల్సిందే. ఈ కావ్యమంతటా పరుచుకున్న ప్రకృతి విశ్వరూప సందర్శనం పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేస్తుంది.

"సమస్తంనాదే" కవితలో
"పూచే ప్రకృతి పువ్వు నాదే
పాడే ప్రతిపాట నాదే
మెరిసే ప్రతి మెరుపు నాదే
కురిసే ప్రతిజల్లు నాదే" అంటారు.

మానవుడిగా పుట్టినందుకు ప్రకృతిని ఆరాధించమని, ప్రకృతిని ఆస్వాదించమని, ప్రకృతిలో పరవశించమని తానే ప్రకృతిగా, ప్రకృతే తానుగా జీవించమని అక్షరక్షరంలో నినదిస్తారు.

"ఒక్కణ్ణి" కవితలో కవి పాలవెన్నెల పూలసజ్జపై ఒంటరిగా పడుకోలేక, అలా పొలం దగ్గరికి వెళ్లి, అక్కడా ఉండలేక అలా నది ఒడ్డుకు వెళ్ళాక, అక్కడా ఉండలేక తిరిగి సజ్జకు చేరేసరికి "నేనిప్పుడు ఒక్కణ్ణి కాను, సార్వత్రిక సౌందర్యజ్యోత్స్నలో జాబిల్లినై పోయానంటారు."

"ఎలా వుంటావో" కవితలో
"నిన్ను గురించిన ఊహ
నామనస్సరోజంపై చల్లగా వీచినప్పుడు
సువాసనలు గుప్పన రేగి

నరనరాలకు వ్యాపించి
నా శరీరం మొత్తం
ఒక కల్హారమే అయి గుబాళించింది" - చిత్తస్థితిని వర్ణించడానికి ప్రకృతినే ఆలంబన చేసుకున్నారు కవి.

ఇలా ఈ కావ్యమంతటా ప్రకృతి సౌందర్యం తొణికిసలాడుతుంది. ఈ కావ్యంలో కవి, స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమను అనేక రీతుల్లో అద్భుతంగా వ్యక్తీకరిస్తారు.

"రసం - భావం - కవిత"లో పురుషుడికి స్త్రీ అందం స్త్రీకి పురుషుడు అందం మనద్దిరం లేకుంటే ప్రపంచమే లేదంటారు. సత్యం శివం సుందరం కవితలో ప్రేయసిని సత్యం శివం సుందరంగా వర్ణిస్తారు. ఆమె తోడిదే లోకమని భావిస్తారు.

"నీ దరహాస రుచికంటే సుందరం
నీ అనురాగ వీక్షణకంటే శివం
నీ ఆనందం రూపం కంటే సత్యం
ఏముంది నాకు జగత్తులో
నీవు తప్ప
ఏమున్నదింక జగత్తు మాత్రం."

"ఇంట - బయట" కవితలో ఒక సన్యాసి జీవితానికి, ఒక సంసారి జీవితానికి గల తారతమ్యాన్ని వెల్లడిస్తూ,

కుటుంబం కోసం కష్టపడుతూ, ఉన్న దానితో తృప్తి పడుతూ సంసార సాగరంలో పడి తరిస్తున్న గృహస్థుడు ఇంటి లోపల ఉన్నాడు.

గృహాన్ని అజ్ఞానపు గూడుగా భావించి, తెలియని దాన్ని దేన్నో అన్వేషిస్తూ, బ్రతుకును తెల్లవార్చుకుంటున్న ఒక సన్యాసి ఇంటి బయట ఉన్నాడు.

"వెళ్ళే కొలదీ గహనం
వెతికే కొలదీ సూన్యం
యౌవనం, సౌందర్యం, కళ, ఆనందం
మనిషికి పరమేశ్వరుడిచ్చిన సమస్తం
పోగొట్టుకుని వచ్చి కూలబడ్డాడతడు
ఆ యింటి బైట అరుగుమీద"

ఆ గృహస్థుని లోకం అజ్ఞానిగా భావించినా, దైవం దృష్టిలో అతడే జ్ఞాని అంటారు కవి.

ఈ విశాల విశ్వంలో వృక్షాలు, గ్రహాలు, నక్షత్రాలు, అన్నీ కలిసే ఉంటాయని, వెలుగెక్కడ ఉంటే అక్కడ కుటుంబం ఉంటుందంటారు.

లలిత కళలు స్త్రీ పురుషుల మధ్య అనుబంధాన్ని పెంచడానికి సాధనాలంటారు.

భీమన్న గారు జీవన వైఖరిని విశదీకరించి మానవాళిని మేల్కొల్పుతారు.

"జీవితం ఒక నిత్యనవోద్యానం కాదు
అనుక్షణం మహారణ్యం అది
అక్కడ కేవలం మోదుగులే మోసులెత్తవు
వ్యాఘ్ర వదనాలు కూడా విప్పారతై" అంటూ అందర్నీ అప్రమత్తం చేస్తారు. లోకం ఒక సంక్లిష్ట కీకారణ్యమైనా, జీవితాన్ని నిత్య వసంతంగా మలుచుకోవాలంటారు. అమావాస్య అంతరించగానే పౌర్ణమి పలకరిస్తుందని ఆశావాదాన్ని విన్పిస్తారు. మనిషి తన సుఖదుఃఖాలకు తానే కర్తని, స్వర్గమంటే తనని తాను దిద్దుకోవడమేనంటారు. పైపై మెరుగులు చూసి మోసపోవద్దని హితవు పలికారు.

భీమన్న గారి సాహితీ ఆకాశంలో కోటానుకోట్ల భావనక్షత్రాలు, వీరి భావనా బలానికి సహృదయులు కైమోడ్పులర్పిస్తారు.

ఆలోచనల్ని ఒక మహాక్షేత్రంలోని తీర్థ ప్రజ్ఞతో పోల్చారు. జలం బద్ధకించి జడంగా మారిందన్నారు.

ఋతువులను, గ్రహాలను, నక్షత్రాలను గమ్మత్తుగా వర్ణించారు. నక్షత్రాలను ఒక చాంద్ర విశ్వకళాపరిషత్తులోని ఇరవైయేడు కాలేజీలుగా ఊహించారు.

తలాతోకాలేని కాలారగం వెన్నున కన్నులా మెరుస్తుంది వర్తమానం అని వర్ణించారు.

పాగమంచు పడగల్ని విప్పిందట హేమంతం
ఆకలిగొన్న సింహంలా దూకిందట శిశిరం

బుసగొట్టి విజృంభించిన చలిపురుగు, శివరాత్రితో శంకరాభరణ మైందట. ఇలా భీమన్న గారు "అనాది కొసనుంచి అనంతత్వం లోకి తాను పయనిస్తూ సహృదయ పాఠకులను తనవెంట తీసుకెళ్ళారు. వీరు తన కవితోద్యానాన్ని, విశ్వపర మోద్యానంలో ఒక చిన్ని భాగంగా నిర్మించి సాహిత్యాభి లాషులకు అందించారు.

ఉపయుక్త గ్రంథం :

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం.

❁❁❁

పడిపోతున్న అడ్డుగోడలు – సామాజిక స్పృహ

– అలువాల మహేందర్, తెలుగు ఉపన్యాసకులు, వివేకానంద డిగ్రీ & పిజి కళాశాల, కరీంనగర్.

బోయి భీమన్న సుప్రసిద్ధకవి. నాటక కర్త. 2005లో 90 ఏండ్లపై చిలుకు పండు వయస్సులో కీర్తి శేషులు అయినా ఆయన సాహిత్యకీర్తి ఆజరామరం. దళిత సమస్యలున్నంత వరకు ఆయన రచనలు అవసరం మన తెలుగు సమాజానికి ఉండనే ఉంటుంది.

భీమన్న గారిది తూర్పుగోదావరి జిల్లా రాజోలు ప్రాంతం. దళిత కుటుంబం.ఆ ప్రాంత హరిజనుల్లో ఇతని బాల్యం వరకే రాజకీయ చైతన్యం. విద్యావ్యాప్తి జరుగు తున్నది. అది వీరి పుట్టింటికంటే అత్తగారింటి వారిలో ఎక్కువ.మామ ఉపాధ్యాయుడు ఆ కాలంలోనే. ఆయన కూతుళ్లు టీచర్లు. భీమన్న తండ్రి, మామ మిత్రులు. అతడే ఇతని డిగ్రీచదువుకు మామ తోడ్పడ్డాడు. అందుకే అతని కూతురు నాగరత్నమ్మను భీమన్న ఇష్టపడి 1936లో పెళ్లి చేసుకున్నాడు.

పాటలు, పద్యాలు రాసే భీమన్న 1940 లోనే పాలేరు నాటకం రాశాడు. అది మన భారతదేశానికి స్వతంత్రం రాని ఆంగ్లపాలన కాలం 1939-45 రెండవ ప్రపంచ యుద్ధం. గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం సత్యాగ్రహాలు, హరిజనోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలం అదే ప్రభావంతో భీమన్న రచనలు వచ్చినై. ఆయన గాంధేయవాది.

భీమన్న గారి పాలేరు నాటకం ఆ కాలంలోనే కాదు. ఆ తర్వాత ఓ 20 ఏండ్ల వరకు ఊరురా ప్రదర్శింప బడింది. తెలంగాణలో కూడా పలుచోట్ల ప్రదర్శింప బడింది. ఒక పేద హరిజన యువకుడు దొరకు పాలేరు. విద్యావంతుడై అదే వూరికి ఉన్నతోద్యోగిగా రావటంతో మొదట దొరగారి కూతురుని ప్రేమించి తిరస్కరించబడినా తర్వాత వారిద్దరికి దొరగారే పెళ్లి చేయుట ఇందలి ఇతివృత్తం. గాంధీ హరిజనోద్యమానికి అభ్యుదయ వాదుల ఆదర్శానికి ప్రోత్సాహంగా ఈ నాటకం వ్యాప్తి చెందింది. తర్వాత వీరు రచించిన మరో నాటకం 'కూలిరాజు' మాత్రం కమ్యూనిజం ప్రభావంతో వచ్చింది. నిజానికి అప్పుడు కాంగ్రేసు కమ్యూనిస్టు పార్టీలు ఆ జిల్లాలో బలంగా ఉండేవి.

పాలేరు నాటకంలో దళిత పేదింటి యువకుడు అగ్రజాతి ధనిక పెత్తందారు కూతురును పెళ్లాడిన కథ. ఆ తర్వాత రాసినది కావచ్చు. భీమన్న గారి ఈ నాటిక 'పడిపోతున్న అడ్డుగోడలు' ఇందలి కథ పాలేరు కథకు విలోమం అదేమంటే ఇందులో బ్రాహ్మణ యువకుడు హరిజనయువతి వివాహం కథ. నిజానికి ఆ కాలంలో వచ్చిన 'మాలపిల్ల' సినిమా కథ ఇదే. కాంచనమాల కథానాయిక.

ఆ సినిమా ఈ నాటిక దేని ప్రభావం దేనిపై పడిందో తెలియదు. ఈ నాటిక రచనా కాలం సుమారు 1950 కావచ్చు.

పడిపోతున్న అడ్డుగోడలు దళిత సామాజిక స్పృహలో రాసిన నాటిక. రచన నిడివి. అచ్చుగా కేవలం ఇరవై పుటలు. ప్రదర్శనకాలం ఒక గంటలోపు ఏకాంకికలు. మనకు కొత్త సంస్కృత దశ రూపకములోని అంకము వేరు, సంస్కృత అలంకార శాస్త్రాల్లోని నాటిక కూడవేరు. ఆంగ్లంలోని 'వన్ ఆర్ట్ ప్లే'లో హిందీలో వ్యాప్తి అయిన ఏకాంకికల వంటివే.ఈ మన ఏకాంకికలు ఒకేరంగం తర్వాత పలు అంకాలున్న నాటకాలు కూడా ఒకే రంగంపై ప్రదర్శించేవి వచ్చినై. ఆ తర్వాత ఒకే రంగస్థలం వేదికపై ఏకకాలంలో 2,3 రంగాలు ప్రదర్శించే నాటకాలు కూడా వచ్చినై. నటుల దర్శకుల ఉత్సాహాన్ని ప్రేక్షకుల ప్రోత్సాహాన్ని పట్టి నూతన ప్రయోగాలు. ఈ ఏకాంకిక లోనిది. ఒకే ఒక రంగం. అది ఒకగ్రామంలోని బ్రాహ్మణ

కుటుంబం. అదే కథా నాయకుని గృహం అని తర్వాత తెలుస్తుంది. వీధిలో ఒక ఊరేగింపు తర్వాత కథా నాయకుని భవంతిలో ఈ కథ నడుస్తుంది.

ఇందలిపాత్రలు-బ్రాహ్మణ గృహిణి. ఆమె భర్త, ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె,ఈమె స్నేహితురాలు, మరి ఇద్దరు హరిజన నాయకులు నాటిక చివర వస్తారు.కథా నాయకుని(రామచంద్రం) చెల్లి ఉమ ఆమె స్నేహితురాలు రమ రాజమండ్రి కాలేజి నుంచి ఉత్సవానికి ఈ గ్రామం వస్తారు. రమ అన్న చంద్రశేఖర్ ఉమ అన్న మద్రాసులో ఉన్నతచదువులు కోసం(లా,ఐ.ఎ.ఎస్)ఒకే హాస్టల్‌లో ఉన్న మిత్రులు రామచంద్రం ఈ ఉత్సవం కోసం తమ గ్రామం వచ్చారు.

కథాగమనం:-ఉమ, రమతో సొంతూరికి వస్తుంది. వీధిలో రెండు ఊరేగింపు బృందాలను 'హరిజనాభ్యుదయ' గీతం పాడుతూ వెళ్లగాచూస్తారు.

ఇంటికి వెళ్లగానే ఉమ తల్లి లక్ష్మీదేవి ఆదరణ. ఆమె పాతకాలపు సంప్రదాయ గృహిణి. అందుకే కులంపేరు ఇతర వివరాలు ఏవి చెప్పవద్దంది. రమతో ఉమ. ముందే చెప్పింది. రమ అందం మర్యాద చూసి ఆనంద పడుతుంటే లక్ష్మీదేవిమాటల మధ్య ఆమె భర్త శివరామ దీక్షితులు హరిజనోద్ధరణోద్యమ నాయకుడని తెలుస్తుంది.ఉమ అన్న అలాగే పట్నం వెళ్లి సంప్రదాయం మరచి ఎవరో తమ కులం కాని హరిజనబాలికను పెళ్లి చేసుకుంటానంటున్నాడని వాపోయింది తల్లి. ఈ రమ అయితే పర్వాలేదు కదా! అని కూతురు అడిగితే సంతోషంగా అంగీకరిస్తుంది.ఈమె అందం అణుకువ నచ్చినై.

ఇంతలో రామచంద్రం వచ్చి తనకు నభవద్ద శ్రీరామదాను అనే నూతన హరిజననేతతో వాదన అయ్యిందని చెప్తాడు. అదేమంటే ఇక్కడ ఆ రాత్రికి జరిగే సర్వోదయ సకల కులాల పంక్తిభోజనాలు, ఈ మధ్య రాజమండ్రిలో జరిగిన హరిజనుల దేవాలయ ప్రవేశాలు, నిష్ప్రయోజనం కులాంతర వివాహాలతోనే కూర్పు, మన సమానత్వం సాధ్యం అని రామదాసు వాదనట. అప్పుడు రామచంద్రం రామదాసు బిడ్డనే పెళ్లాడతా అంటే అందుకు ఒప్పుకోక మరెవరినైనా హరిజన అమ్మాయిని పెళ్లాడుమన్నాడట.

ఇందంతా నాయకుని ఇంట్లో ఆ అయిదారు పాత్రల సంభాషణతో తెలుస్తుంది.ఉమ తమ్ముడు గిరి సభ భోజనాల ఏర్పాట్లు చూసి హడావుడిగా వచ్చినా అతని పాత్ర పెద్దగా లేదు. అనాచారపు భోజనానికి లక్ష్మీదేవి వెళ్ళనంది. రమ కూడా ఆమెతోఇంటనే ఉంటానంది. ఇంతలో ఊరి గిరిజననాయకుడు వెంకటయ్య అతిధి రామదాసుతో శివరామదీక్షితులు దర్శనానికి వస్తాడు. పరస్పర కుశల ప్రశ్నలు సంతోష ప్రకటనలు. ఈ రోజు రామదాసుతో మాట్లాడి వాదించిన యువకుడు రామ చంద్రం దీక్షితుల కొడుకే అని తెలుస్తుంది.

ఉమ ఈ ఇంటి కూతురే. రమ రామదాసు కూతురు. అన్న కోరికగా ఉమ, రమను తీసుకువచ్చి ఇంత కథ నడిపింది. ఈ విషయం మనకు కథ చివర తెలుస్తుంది. పంక్తి భోజనాలు రమ రామచంద్రం పెళ్లి ఒప్పందం శుభవార్తతో పడిపోతున్న అడ్డుగోడలు కులాలన్నమాట. ఈ ఏకాంకిక ముగుస్తుంది.

ఇక్కడ మరి రెండు మూడు ముఖ్యమైన సంగతులు చెప్పాలె. కథలోని మిగతా పేరు ఏవైనా, వధువు తండ్రి శ్రీరామదాను పాత్ర పేరు మాత్రం భీమన్న గారు. ఉన్నవ లక్ష్మీనారాయణవంతులు గారి మాలపల్లి నవలలోని ప్రధాన పాత్ర పేరును చూసి పెట్టి ఉంటారు. అనుకోవచ్చు.

కథ చివర శివరామధీక్షితులు నేటికి ఆ చివరా ఈ చివరా అందుకొంటున్నాం. భారతదేశ అభ్యుదయ వృత్తం నేటికి పూర్తి అయింది. ఇక అది దిగ్విజయంగా పురోగమించగలదు అన్నాడు. ఇది అచ్చంగా రచయిత ఆశయం అదీ భీమన్న గారి దళిత స్పృహ

మా వాళ్ళలో ఇంత మధుర మూర్తులుంటారని నాకేం తెల్సు ఇన్నాళ్ళు ఇంటికి బందిని చేసి లోకాన్ని చూడ

నీయంది మాతప్పే అంటుంది. లక్ష్మీదేవి ఆమె కుల వివక్షను మరచింది అంటే ..ఇది

ఎంచి చూడగ లోకమందున
మంచి చెడ్డలు రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే యౌదున్

- గురజాడ

గురజాడ గేయసూక్తికి ఆదరణ- ఆచరణ ఈ సన్నివేశం. మరొక్కమాట- ప్రదర్శన చివర్లో

"చూశావా మరి"ఎంత నాటకం. ఆడానో నీకోసం అని ఉమ అంటే ఆమె అన్న రామచంద్రం అన్నమాట ఇది చూడండి.

"పూర్తిగా నా కోసమేనా? ఇది నీ అసలు నాటకానికి పూర్వ రంగమేగా! ఏమిటి ఆ అసలు ఉత్తర రంగం? ఆలోచించండి. తెల్సిందా!

ఈమె రమ అన్న చంద్రశేఖరంను ఇష్టపడుతుందన్న మాట. ఇద్దరు మిత్రులు కుల ప్రసక్తి లేకుండా ఒకరి సోదరిని ఒకరు ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారన్నమాట. అందుకే ఈ నాటకమంతా.

చివరిమాట- ఈ ఏకాంకిక బోయి భీమన్న గారు తమ పాలేరు నాటకం తర్వాత 1950 సుమారుగా రచించి వుంటారని నేను ఊహించిన మాట నిజమే అదే సాక్ష్యం ఈ రచనలోనే ఉంది. ఎక్కడ? అంటే నాటిక ఆరంభపు గాంధీజీ స్తుతి గేయం మళ్లీ ఒకసారి చదవండి.

దేశదాస్యం త్రుంచి, అంటు దోషము మంట గలిపి, శాంతి సత్యంప్రగతి చూపిన లోక బాంధవుడు (గాంధీ) మహాత్ముడు-

"వాయు వేగము తోడ దేశము
వేయి గుర్రాల్ స్వారి గదలగ
నాయకత్వము నెఱ్ఱుకిచ్చి
నాకమెగిన దెవరు తండ్రీ! అని కదా ఉంది.

అంటే గాంధీజి అమరత్వం 31 జనవరి 1948 తర్వాతనే ఈ ఏకాంకిక రచన జరిగిందని నిశ్చయంగా చెప్పవచ్చు. బాపూజీ నాకం (స్వర్గం) వెళ్లిందనుటకు వీరికి అభ్యంతరం లేదు. స్వర్గ నరకాలు లేవనే చార్వాక, బౌద్ధ, హేతువాదాలకు ఆయన ఇందులో పోలేదు. సామ్య వాదం ప్రసక్తి కూడా లేదు. గాంధేయ గ్రామీణ వికాస సర్వోదయ మార్గాభిమానం, హరిజన సేవ ఆదర్శం.

నార్లవారు ఉన్నత కులాలనబడే కాపు, కమ్మ, రెడ్డి, రాజులు(వెలమ ను ఎందుకో వదిలారు) జాతుల బ్రాహ్మణుల హరిజనుల సులభంగా కలుపుకోవచ్చునని అన్నారని భీమన్న గారి పీఠికలో ఉంది. మతం జోలికి పోలేదు. అవర్ణులతోనే కాదు సవర్ణుల వివాహ బంధాలల్లోనూ ఆస్తులు, అంతస్తులు, పై చదువులు, ఉన్నత పదవులు, న్యూన గౌరవభావాలకు కారణ మౌతున్నది అనేది మనం నిత్యం చూస్తున్న లోక సత్యం.

డా॥ బోయి భీమన్నగారి "పడిపోతున్న అడ్డుగోడలు" ఏకాంకిక అచ్చమైన హరిజన స్నుహ కల రచన. చక్కని హితోపదేశ దృశ్యకావ్యం. రచయితకు ధన్యవాదాలు. మీకు నా కృతజ్ఞతలు

ఆధార గ్రంథాలు :

1. పడిపోతున్న అడ్డుగోడలు(ఏకాంకిక)- బోయి భీమన్న
2. బోయి భీమన్న ఇతర రచనలు
3. బోయి భీమన్న అభినందన సంచికలు- వ్యాసాలు

అంబేడ్కర సుప్రభాతం - బోయి భీమన్న దృక్పథం

- జొగర్ల మహేందర్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో అట్టడుగు వర్గాల దళిత సమూహలోంచి సమాజ చైతన్యాన్ని శిఖరాగ్ర స్థాయికి నిలిపిన ప్రసిద్ధులు కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న. నవయుగ వైతాళికుడు, మహాకవి బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19 నాడు, మామిడికుదురు, తూర్పుగోదావరి జిల్లాలో తండ్రి పుల్లయ్య, తల్లి నాగమ్మ లకు జన్మించారు. ఒక వ్యక్తి ద్వారా సమాజాన్ని సంస్కరించగలము కానీ, కొన్ని రుజువు కాని సిద్ధాంతాలతో సమసమాజం ఏర్పడదనేది బోయి భీమన్న దృక్పథం. బోయి భీమన్న అంబేద్కర్ వాది. ఈయన సామాజిక చైతన్యంతో సమాజాన్ని ముందుకు నడిపించే రచనలు చేశారు. నాటకకర్తగా, గేయకర్తగా, కవిగా, పీఠిక రచయితగా, పత్రికా సంపాదకుడుగా, అనువాదకుడిగా తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని 70 రచనలకు పైగా గ్రంథాలను వెలువరించారు.

ఈయన నాటకాలు-నాటికలు, పద్యకావ్యాలు, గేయ రచనలు, వచన కవిత్వం ఇలా అన్ని ప్రక్రియలను చూసినట్లయితే మార్క్సిజం, గాంధీయిజం, అంబేద్కరిజం సంబంధిత అంశాలు ప్రధానంగా కనబడుతున్నాయి. 1968 నుంచి బోయి భీమన్నపై అంబేద్కర్ ప్రభావం ఉంది. అంబేద్కర్ జీవితం ఆయనకు ఆదర్శం. అంబేద్కర్ వల్ల దళితుల జీవన ఉద్ధరణ జరుగుతుందని నమ్మిన వ్యక్తి. కుల, మత, వర్గ విభేదరహితమైన సమాజాన్ని కోరుకున్నారు. అందువల్ల ధర్మం కోసం పోరాటం, అంబేద్కరిజం, అంబేద్కరమతం, పాటలలో అంబేద్కర్, అంబేద్కర సుప్రభాతం రచనలు చేశారు.

అంబేద్కర్ సుప్రభాతం 1984లో వచ్చిన బోయి భీమన్న గారి పద్య కావ్యం. నవ భారత నిర్మాత, రాజ్యాంగపు ప్రదాత, భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు తన జీవితంలో అనుభవించిన పరిస్థితుల ఆధారంగా రూపొందించిన కావ్యమిది. అంబేద్కర్ను ఆత్మనగ్నంగా ప్రస్తుతించాడు. సనాతన ధర్మంతో పోరాటం చేసి, స్వాతంత్ర ఆకాంక్షను సాధించి, రాజ్యాంగం రాసి, మనుషులందరూ సమానమే అని సమస్త ప్రజలకు సమాన హక్కులు కల్పించిన బాబా సాహెబ్ గారి జీవిత చరిత్రను "నమస్సుల్ డాక్ట రంబెడ్కరా" అనే మకుటంతో అంబేద్కర సుప్రభాతం రచించారు.

ఈ రచనను కావ్యంగానూ ఇందులో అంబేద్కర్ను కావ్య నాయకుడిగా వర్ణించాడు. ఆయన దృష్టిలో కావ్య రూపాలు అనేకం కాబట్టి "కవిత ఒకటి, కావ్య వర్గములు పెక్కు" అంటాడు. అందువల్ల అంబేద్కర్ సుప్రభాతం కూడా కావ్యమే అన్నారు. ఈ కావ్యంలో ఆరాధన, ప్రశంస, భక్తి ఈ మూడు కూడా ఈ రచనకు జీవనాడులు అని పేర్కొన్నారు. సుప్రభాతం అంటే మంచి ప్రభాతం. అందమైన సూర్యోదయ సమయం. దీనినే ఆంగ్లంలో గుడ్ మార్నింగ్ అని సమానార్థకంగా వినియోగిస్తున్నాం. ఇప్పటి వరకు మనకు వెంకటేశ్వర సుప్రభాతం, పంచాక్షరి మంత్రం, అష్టాక్షరీ మంత్రం, గాయత్రి మంత్రం, ఇవన్నీ స్తుతులే. తమిళంలో తిరుప్పావై మరో విధమైన సుప్రభాత కావ్యం వచ్చింది. ఇప్పటివరకు దైవాన్ని స్తుతించడం సంబంధిత కావ్యాలు వచ్చాయి. కానీ వీటికి విభిన్నంగా బోయి భీమన్న గారు ఈ రెండు విధాల కంటే విలక్షణమైన రీతిలో సమాజం కోసం అంకితమైన అంబేద్కర్ను భారత ప్రజలకు, సహృదయులకు, సామాన్య వ్యక్తులకు దగ్గర చేయడానికి ఈ అంబేద్కర్ సుప్రభాతం రాశాడు.

తెలుగు సాహిత్యంలో దేవున్నీ మేలుకొలుపు సుప్రభాతం చూసాము కానీ, ఇది అలాంటిది కాదు. దీని ప్రత్యేకత చూస్తే మనల్ని(భారత దేశ ప్రజలను)

మేలుకొలిపే పవిత్ర గాథ ఇది. ఇందులో ప్రధానంగా శార్దూలం, మత్తేభం లక్షణాలు కలిగిన పద్యాలున్నాయి. దేవున్ని మెల్కొపేది సుప్రభాతం.... నిద్రపోతున్న ప్రజలను మేలుకొలిపేది అంబేద్కర సుప్రభాతం అని రచయిత పేర్కొన్నారు.

విశ్వ మానవతా దృక్పథం

స్వాతంత్ర్యమ్ముకరించు భిక్ష మగునే సాధించు కొండేకమై
రైతులు కార్మికు లంచు జీవపరమార్థమున్ నిరూపించి వ
ర్గాతీతమ్మగు విశ్వమానవత మాకందించవే ధార్మిక
స్రోతస్సుందర లోకమందిర నమస్సుల్ డాక్ట రంబెడ్కరా.(పుట2)

మానవులకు స్వాతంత్ర్యం అనేది ఒక వరం లాంటిది. అది అడుక్కుంటే దొరికేది కాదు. దాన్ని పోరాడి సాధించుకోవాలని రైతులకు, కార్మికులకు బోధించారు అంబేద్కర్. దళిత వర్గాలను ఉన్నత వర్గాల స్థాయికి పెంచాలని ఈ ఉద్యమంతో పాటు వర్గ అతీతమైన సమసమాజాన్ని నెలకొల్పాలని ఆయన ఆదర్శం. మానవ సమాజం క్రమ వికాసం పొందాలని అందుకు సత్యంతో కూడిన శాంతి విప్లవం శరణ్యమని అన్నారు. భారత స్వాతంత్ర్యాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించిన దేశభక్తుడు అఖిల జగత్తు కుటుంబీకుడు డాక్టర్ అంబేద్కర్ అని ఈ పద్యంలో విశ్వ మానవతా దృక్పథం తెలియజేశారు.

భయ శూన్యుండు భయంకరుండు మనబాబాసాహెబ్ ఏ కట్టెతో
నయినన్ గొట్టును హైందవంపు కులమూర్కులర్క తండమ్ములన్
జయమౌగాక అటంచు నీ పై ప్రశంసల్ గుప్పెడు గాంధీ హే
సుయశోభీమ కృషి త్రివిక్రమ నమస్సుల్ డాక్ట రంబెడ్కరా.(పుట 50)

అంబేద్కర్ భయం లేని వాడు. తనకు చేతికి ఏ కర్ర అందుతే ఆ కర్రతో సంశయం చేయకుండా హిందూ సవర్ణులను కొట్టడానికి వెనుదీయడు అని గాంధీ అన్నారు. నీ అంతటి కార్యదీక్షను, జ్ఞానాన్ని గాంధీ మెచ్చుకున్నాడు కానీ, దళితుల ప్రత్యేక రాజకీయ హక్కును ఇవ్వడానికి సిద్ధంగా లేను అని గాంధీ ప్రకటించాడు. ఇద్దరి మధ్య చర్చలో.....చివరికి దేశం కోసం స్వాతంత్ర్యము ప్రథమం అని భావించి దేశ ఆకాంక్షను కోరుకున్నాడు.

రాజ్యాధికార దృక్పథం

జనసామాన్య సమత్వ నిష్టము ప్రజాస్వామ్యమ్ము తద్భిన్న ల
క్షణ రోగిష్టము హైందవమ్ము కనుకన్ జాగ్రత్త సూచించి త
ర్జని చూపించు చు హెచ్చరించు చూ ప్రతి గ్రామమ్మునన్ నీవు నీ
ల్చోని మమొమ్ము సమగ్ర విగ్రహ నమస్సుల్ డాక్ట రంబెడ్కరా.(పుట 8)

ప్రజాస్వామ్యం అంటే తనకు తాను పరిపాలించడం. కాబట్టి తమను తామే ఎన్నుకుంటారు. అందరికీ సమానత్వం, సమాన అవకాశాలు, స్వేచ్ఛ ఉన్నప్పుడే ఈ పద్ధతి విజయవంతం అవుతుంది. ప్రజలు వివేకవంతులై ఉన్నప్పుడు మాత్రమే ప్రజాస్వామికకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. లేకుంటే కుల తంత్ర రోగం అంటే ఏ కులం వారు ఆ కులం వారికి ఓటు వేసుకుంటాడు. బలమైన వాడు రాజ్యమేలుతాడు బలహీనుడు దౌర్జన్యానికి లోనవుతాడు. అప్పుడు ప్రజాస్వామ్యం నాశనమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఓ దళిత ప్రజలారా మేల్కొండి జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. మెజార్టీ ప్రజల బహుజన రాజ్యాధికారాన్ని కోరుకున్న కీర్తిమంతుడు డాక్టర్ అంబేద్కరుడా అంటూ తన రాజ్యాధికార దృక్పథాన్ని తెలియజేశాడు.

కుల తత్వమున బ్రహ్మ తత్వ మహి మల్ కోల్పోయి స్వాతంత్ర్య హే
నులుగా మారిన భారతీయులన్ జ్ఞానోద్ధుద్ధులన్ జేసీ ఉ
జ్జ్వల సంపూర్ణ సమైక్య జాతి నొనరించన్ బునుకొన్నట్టి ని

స్తుల మేధా మధుమూర్తి నీ కివే నమస్సుల్ డాక్ట రంబెడ్కరా. (పుట 13)

తక్కువ కులం అనే కారణంగా బ్రహ్మతత్వం మహిమలు కోల్పోయిన భారతీయులు. రాజకీయ స్వాతంత్రాన్ని పొగొట్టుకొని, చాలా ఏళ్లుగా పీడనం అనుభవిస్తున్నారు. ప్రజలందరికీ జ్ఞానాన్ని బోధించి, కుల భేదాలు లేని తత్వాన్ని రూపొందించాలని సంపూర్ణమైన నమాఖ్య జాతిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మానవులందరి అభ్యున్నతిని కోరిన మేధావి అంబేద్కర ఇవే నా నమస్సులు.

క్షేమ సర్వైక సమాన భుక్తముగ సృజ్యమ్మయ్యే ఈ పంచ భూ
తములన్ కాదెది యేరి సొంతంమున్ స్వార్థ స్వామ్యమున్ ద్రుంచి స
తత్వములన్ పొందు డటం చేవండు ప్రజలన్ ధర్మజ్ఞులన్ జేసె తత్
సుమనో నాధ సమత్వ మాధవ నమస్సుల్ డాక్ట రంబెడ్కరా. (పుట 22)

భూలోకంలో ఉన్నటువంటి పంచభూతాలు(భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) వాటిని స్వాధీనం చేసుకొని ఏది కూడా ఎవరికి సొంతం కాకుండా చేసే స్వార్థపరులను ఎదిరించి వాళ్ళ ఆగడాలను అంతం చేయాలని కోరు తున్నాడు. ఈ పద్యములో అంబేద్కర్ మహా చెరువు పోరాటాన్ని తెలిపారు. భూమ్మీద ఒక్క మనుషులకే కాదు సృష్టిలో అన్ని ప్రాణులకు సమాన హక్కులు ఉన్నాయని తెలియజేశాడు. ఇలాంటి దౌర్జన్యాన్ని సహించ వద్దు అని అంబేద్కర్ అన్నారు.

నీ నా వర్ణ మవర్ణ మంచు జడమై నిర్వీర్యమై కుందు హిం
దూ నానాత్వము నేక జాతి నొనారింతును బ్రోతు నంచున్ దయన్
పూనా పెక్కున కొప్పుకొంటి వది నీ పుణ్యమ్ము పుం భారత
క్షోనీ సారథి వర్గ వారధి నమస్సుల్ డాక్ట రంబెడ్కరా.(పుట 38)

నీ వర్ణం, నా వర్ణం, స వర్ణం, అ వర్ణం అని వ్యత్యాసాల తో కూడిన సమాజంలో నశించిపోతున్న హిందూ జాతిని ఏక జాతినీ ఏకం చేసి, ఈ ప్రపంచంలో గౌరవ మర్యాదలు సమకూర్చాలని సంకల్పంతో పూనా ఒడం బడికకు ఒప్పుకున్నావు. గాంధీ ప్రాణం కోసం సవర్ణ హిందువులంతా ఏకమై అంబేద్కర్ మీద ఒత్తిడి తెచ్చారు. దేశం కోసం తన విశాల దృక్పథాన్ని ప్రగాఢ జాతీయతను ప్రదర్శించిన ఉత్తమోత్తమ జాతీయ నాయకుడు అందుకే నిన్ను ప్రపంచ వ్యాప్తంగా కొనియాడారు.

బోయి భీమన్న దృక్పథం

ఇందులో ప్రధానంగా విశ్వ మానవతా దృక్పథం, రాజ్యాధికార దృక్పథం, జ్ఞాన బోధ దృక్పథం, జాతీయ దృక్పథంతో పాటు పోరాటం, అంటరానితనం, భాష, దేశ విలువలు, త్యాగం, అంబేద్కర్ గొప్పతనం, కులము, మతము చాలా విషయాలపై పద్యలున్నాయి. ఈ కావ్యం ద్వారా బోయి భీమన్న ను గొప్ప హేతువాది, మానవతా వాదిగా చూడవచ్చు. భారతదేశంలో వర్ణ వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న పునర్జన్మ కర్మ సిద్ధాంతాన్ని తిరస్కరించిన హేతువాది ఈయన. దళిత వివక్ష ఎంత ప్రాచీనమైనదో బోయి భీమన్న గారు చక్కగా వివరించారు.

బోయి భీమన్న లక్ష్యం

గతంలో మన పూర్వీకులు అనుభవించిన కష్టాలకు బాధ్యులు ఆనాటి సవర్ణ పెద్దలు. తరతరాలుగా మనం అనుభవించిన అంటరానితనాన్ని ఇప్పటికీ అక్కడ అక్కడ కనిపిస్తూనే ఉంది. అందువల్ల మనం పోరాడాల్సింది సాంఘిక న్యాయం, సమానత్వం, దేశ పాలన, దేశ సంపదలో సమభాగం కోసం మాత్రమే అని మార్గనిర్దేశం చేశారు. మానవ జాతుల చరిత్రలు అన్ని చెప్పుకోదగ్గవి కాదు. అందులో దళితుల పరిస్థితి ఒకటి. అందుకే గతాన్ని వదిలేసి అంబేద్కర్ శకాన్ని ప్రారంభిద్దాం. తన ఆశయం అయినా సర్వమానవ సమానత్వాన్ని, శాంతిని సాధిద్దాం. అని కొత్త బాటలు వైపు నడిపించే ప్రయత్నం చేశారు.

ముగింపు

బోయి భీమన్న గారి దృష్టిలో జ్ఞానాన్ని చూసినట్లయితే విద్యాధికుడు బ్రాహ్మణుడు అంటాడు. ఉదాహరణకు జన్మ చేత వ్యాసుడు దళితుడు. అయినా బ్రహ్మ విద్య చేత బ్రాహ్మణుడయ్యాడు. అని అన్నాడు. వాల్మీకి, వ్యాసుడు మావాడే (దళితుడే) అంటాడు. ప్రాచీన సాహిత్యమంతా దళితులదే అని ప్రతిపాదిస్తాడు. అంబేద్కర్‌ను కూడా రాజ్యాంగం రాశాడు కాబట్టి జ్ఞానమంతా అనగారిన వర్గాలకే ఉంటుందని వాదించాడు. ఈ విధంగా బోయి భీమన్న గారి దృక్పథం అన్ని అంశాల్లో విస్తరించి ఉంది. ఈయన ప్రత్యేకత విశ్వ మానవత దృక్పథం.

ఆధార గ్రంథాలు :

1) భీమన్న. బోయి - అంబేడ్కర సుప్రభాతం, సాహితీ నిధి ప్రచురణ, భాగ్యనగరం, 1984.
2) భీమన్న. హైమవతి - పాలేరు నుంచి పద్మశ్రీ వరకు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1978.
3) రత్నాకర్. జి. వి - డా. అంబేద్కర్ జీవనం, భూమి బుక్ ట్రస్ట్, హైదరాబాద్, 2015.
4) పద్మారావు. కత్తి - తెలుగు సాహిత్య చరిత్ర, లోకాయత ప్రచురణలు, హైదరాబాద్, 2016.

బోయి భీమన్న నాటకాలు - సామాజిక దృక్పథం

- డా॥. లింగాల మంగమ్మ, పోస్ట్ డాక్టరల్ ఫెలో ఫర్ వుమెన్, యు.జి.సి., తెలుగు విభాగం,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మహాకవి, పద్మభూషణ్, కళాప్రపూర్ణ బిరుదులు పొందిన డా॥ బోయి భీమన్న గారు ప్రధానంగా సాహితీవేత్తగా పేరు గడించినప్పటికీ సంఘ సంస్కర్తగా, సాంస్కృతికోద్దీపకులుగా కూడా గుర్తింపు పొందారు. తెలుగు సమాజంలో విశిష్ట వ్యక్తిత్వం గల మంచి మనిషిగా, పండితుడుగా, రచయితగా తమ ప్రత్యేకతను నిలుపుకున్నారు. ఈయన సుమారు 70 పుస్తకాలు రాశారు. ఆయన ఇంగ్లీషులో 'The Seventh Season' అనే కవితా సంపుటిని రాశారు. ఆయన సాహిత్యంలో పద్యం, గద్యం, గేయం, శతకం, నవల, నాటకం, వచనం వంటి ప్రక్రియలను స్పృశించారు. వివిధ పుస్తకాలకు రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. ఆకాశవాణిలో ప్రసారంకోసం అనేక భావగీతాల్ని రాశారు. భీమన్న పాత్రికేయుడుగా, అనువాదకుడుగా, రాజకీయవేత్తగా అనేక రంగాలలో అపారమైన అనుభవం గడించారు. ఆయన తాత్వికుడు, సోషలిస్టు, హేతువాది, అన్నిటినీ మించి మానవతావాది. "పూవు పుట్టగానే పరిమళిస్తుంది" అన్నట్లుగా, మహాకవి శ్రీనాథ సార్వభౌమునివలె 'చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే' అన్నట్లుగా అంటే 5వ తరగతి చదువుతున్నప్పుడు 'శార్దూలం'ను రాసి, తమ భావి రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు బోయి భీమన్న గారు. అంబేద్కర్‌గారి రచనలను తెలుగులోకి అనువదించడంతోపాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశారు. వీరు రాసిన 'జయ జయ జయ అంబేద్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

1911 సెప్టెంబర్ 19న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో బోయి పుల్లయ్య, నాగమ్మ దంపతులకు భీమన్న జన్మించారు. తండ్రి అద్వైతి, వేదం తెలిసినవారు. కులమత భేదాలు లేని సీతారామయ్య వద్ద పాలేరుగా తండ్రి పని చేయడంవల్ల, ఆయన వద్దనే భాగవతంలోని పద్యాలను పుల్లయ్య నేర్చుకున్నారు. తల్లి జానపద గాయిని కావడంవల్ల ఊయల పాటలు, తుమ్మెద పాటలతో భీమన్నను నిద్రపుచ్చేది. దళితులలోనే కాక పల్లె జనుల్లో కూడా పుల్లయ్య, నాగమ్మ దంపతులు మంచి గౌరవ మర్యాదలు పొందారు.

భీమన్నగారు బాల్యం నుండే సాహిత్యంపట్ల మక్కువ చూపారు. థర్డ్‌ఫారం చదువుతున్నప్పుడే ఆంధ్ర మహాభారతం పద్దెనిమిది పర్వాలు, భాగవతాన్ని చదివాడు. కాకినాడలోని పి.ఆర్.కాలేజీ నుండి గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. ఆ రోజుల్లోనే గోరా (గోపరాజు రామచంద్రరావు)తోనే కాక బ్రహ్మర్షి వెంకటరత్నం నాయుడుతో కూడా మైత్రి పెంపొందింది. దీనితోపాటు భీమన్నపై పోతన, వేమనల ప్రభావం అమితంగా ఉంది. అందువల్లనే "నేను హేతువాదిని, మానవతావాదిని, నాకు మానవునిలోని అభ్యుదయంపై పూర్తి విశ్వాసమున్నది, దేవున్ని నమ్మను, పరమాత్మను నమ్ముతాను, దేవుడు వ్యక్తిగతమైనది, పరమాత్మ ప్రపంచకమైనది, ప్రపంచకమైనదే సత్యం. సత్యమే భగవత్స్వరూపం" అని తన తాత్విక దృక్పథాన్ని తెలిపారు.

నాటకాలు :

భీమన్న గారు రాసిన నాటకాల విషయానికి వస్తే కేవలం ముద్రిత రూపకాలే ఇరవై ఒకటి ఉన్నాయి. అముద్రితాలు, అసంపూర్ణాలు కలిపి మరో ఇరవై వరకూ ఉంటాయి. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి మొదలైన సాంఘిక నాటకాలనూ, దళిత ప్రజల పుట్టు

పూర్వోత్తరాలను తవ్వితీసిన రాగవాసిష్ఠం వంటి సాంఘిక పౌరాణిక నాటకాన్ని, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు వంటి పౌరాణిక నాటకాలనూ, బాల యోగీయం, పడిపోతున్న అడ్డుగోడలు, చిత్రకళాప్రదర్శన (పది సంగీత నృత్య నాటికల సంపుటి) మొదలైన నాటికలను, నాటకాలను బోయిభీమన్నగారు రాశారు.

అంతేగాక గేయరూపకాల విషయంలో భీమన్నగారిది అందెవేసిన చేయి. సుమారు 12 గేయరూపకాలను రాశారు. అవి- 1.దేవయాని 2.శ్రేయసి 3.పైరుసాట 4.మానవుని మరొక మజిలీ 5.మెదడులో మెరుపు 6.పాత ఊరు -కొత్తదారి 7.చిత్రకళా ప్రదర్శనం 8.వసంత స్వయంవరం 9.గులాబీ ప్రసవించింది 10.అంధకారంపై విజయం 11.సుభాస చంద్రుడు 12.చాండాలిక. ఇవి కేవలం ముద్రితాలు మాత్రమే. అముద్రితాలు, అపరిష్కృతాలు భీమన్నగారి వద్ద చాలా ఉన్నవి.

పాలేరు, కూలిరాజు, రాగవాసిష్టం, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు, బాలయోగి,పడిపోతున్న అడ్డుగోడలు నాటకాలలోని సామాజిక దృక్పథాన్ని పరిశీలించి విశ్లేషించడం ఈ పత్ర ఉద్దేశం.

పాలేరు :

బోయి భీమన్నగారి పాలేరు నాటకంలో దళిత దృక్పథాన్ని సునిశితంగా పరిశీలించి, పరిశోధించి అందలి విశిష్ట లక్షణాలను వెలుగులోకి తెచ్చారు. పాలేరు నాటకం ద్వారా నాటి భూస్వామ్య వ్యవస్థలోనూ, కుల వ్యవస్థలోనూ దాగి ఉన్న అంతఃకోణం 'అస్పృశ్యతను' నిర్మూలించడానికి, తాడిత పీడిత ప్రజానీకం పాలేరు తనపు బానిసత్వపు శృంఖలాలను ఛేదించడానికి ఏవిధంగా దళిత దృక్పథాన్ని స్పృశించారో విశ్లేషిస్తుంది. నాటి ప్రజల అభ్యుదయం తన అభ్యుదయంగా పేర్కొంటూ పెత్తందారీతనంపై, కామందుల పొగరు మీద విప్లవ బావుటాను పాలేరు నాటకంలోని విభిన్న పాత్రల ద్వారా ఎగరేయడం, తన సమన్యలను తమ కళ్ళెదుటే వివరించడానికి చేసిన ప్రయోగాన్ని ఒకసారి తనలో.. నేటికి కులవ్యవస్థ బాహుబంధాలలో చిక్కుకున్న అణగారిన దళిత ప్రజలను తమకోసం మరల ఉద్యమింప చేయడం పాలేరు నాటక ముఖ్య ఉద్దేశ్యం.

తెలుగులో స్వతంత్ర నాటకాలు చాలా తక్కువ. సామాజిక సమస్యలు తీసుకొని రాసిన నాటకాలు మరీ తక్కువ. తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి, పరిస్థితులు విశ్లేషణ చేసి, ఒక పరిష్కార మార్గాన్ని చూపించడం, దానిని తిరిగి జనంలో ప్రచారం చేయడం చాలాకష్టం. ఆ విధంగా సమకాలీన సమాజంలో జరుగుతున్న మార్పులను, మార్పుకోసం జనం పడుతున్న ఆరాటాన్ని, పోరాటాన్ని పట్టుకొని వాటిని ఇతివృత్తంగా తీసుకొని రచనలు చేసిన సంఘటనలు కొన్ని లేకపోలేదు. నడుస్తున్న ఉద్యమానికి ఒత్తాసు పలకడానికో, చేయూత నివ్వడానికో, ఉధృతం చేయడానికో రచనలు చేయడం అరుదైన విషయం అనుకొంటే రచన సాక్షాత్తు ఉద్యమానికి నాంది పలకడం, ఆ ఉద్యమాన్ని నడ్పించడం మరీ అరుదైన విషయం! ఇదేవిధంగా బోయి భీమన్నగారు సాక్షాత్తు 'పాలేరు' నాటకం ద్వారా ఒక ఉ ద్యమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నడిపించి ఒక సంక్షోభాన్ని సృష్టించారు.

కూలిరాజు :

కూలిరాజు నాటకం రాసేనాటికి దేశకాల పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. రచన నాటికే కమ్యూనిజం మన దేశంలో అవతరించింది. స్వాతంత్ర్య పోరాటం ఊపందు కోవడంతో కడవాడల సమీకరణ అయింది. గాంధీజీ చేపట్టిన హరిజనోద్యమ ప్రభావంతో భూస్వాములు - కూలీల నడుమ సామరస్యం పాడువుతుందని 'హరిజన నాయకుడు నవల నిరూపించింది. 1942 క్విట్ ఇండియా ఉద్యమం దేశకాల పరిస్థితుల్ని పూర్తిగా మార్చివేసింది. రాబోయే స్వాతంత్ర్య భారత తొలి రాష్ట్రపతి దళిత మహిళ కావాలనే ఆకాంక్షతో బోయి భీమన్న 1942లోనే కూలిరాజు నాటకాన్ని రాశారు. అప్పటికే వెలువడిన నంబూరి దుర్వాస మహర్షి 'నిరుపేద'. దళితుల ప్రతిభ అన్ని రంగాల్లో ఎలా

వ్యాపిస్తున్నదో వివరిస్తే, కూలిరాజు ఏకంగా భారత జాతి పాలనా పగ్గాల్ని చేపట్టే అంశాన్ని వివరిస్తుంది. 'ఎంత కోయిల పాట వృధయయ్యెనో కదా చిక్కు చీకటి వన సీమలందు' - అంటూ జాషువా ఆవేదన పడితే, కోయిల పాటలు వినే తీరిక లేదు తారల ఆటలు -కనే కోరిక లేదన్నాడు భీమన్న. హెచ్చుతగ్గుల సమాజాన్ని సమతలం చేసేందుకు భీమన్న పాలేరు నాటకం రాశారు. గాంధేయ వాద సిద్ధాంతంలోని నూతన కోణాన్ని స్పృశించే దేశ పాలన నినాదాన్ని లేపింది కూలిరాజు' రచన గ్రంథానికే పరిమితంగా సమాజంలోని దళిత జీవితాల్ని మార్చి, పాలనాధికారంకోసం మెల్కొల్పిన వైతాళికుడు భీమన్న.

ఆధునిక నాటకాలలో అట్టడుగు వర్గాల కథా నాయకులుగా భాసించిన నాటకాల్లో ముందుగా పేర్కొనదగినవి రెండే రెండు. 1. మాలపల్లి. 2. పాలేరు. మాలపల్లి నాటకానికంటే పాలేరు నాటకం రెట్టింపు ప్రదర్శనలతో ప్రజాదరణ పొందింది. పాలేరు నాటకం తర్వాత అంతటి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది 'కూలిరాజు' నాటకం. ఇది 1946లో రాయబడింది. 12 అంకాల్లో నాటక నిర్మాణం జరిగింది.

రాగవాసిష్టం :

భాగవత, బ్రహ్మ, వైవర్త పురాణాల్లోని అరుంధతి, వశిష్ఠులకు సంబంధించిన సంఘటనలు ఈ నాటక కథకు మూలం. అరుంధతి, వశిష్ఠుల వివాహాన్ని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. వశిష్ఠుడు తాను ప్రేమించిన అరుంధతి కులం తెలియగానే ఆమెకు దూరమవుతాడు. ఆ తర్వాత విరహం భరించలేక పశ్చాతాపంతో అరుంధతి వద్దకు వెళ్ళేసరికి ఆమె తపస్సులో నిమగ్నమైవుంటుంది. ఈ తపోగ్ని తాపానికి అక్కడ అంతా మండిపోయి కరువు కాటకాలు ఏర్పడతాయి. వశిష్ఠుడి తపోవనంలో కూడా ఆహారం, నీరు లేక ప్రజలు అనేక ఇక్కట్లు పడుతుంటారు. చివరకు ప్రజలు బ్రహ్మ సలహామేరకు ఈశ్వరుని వద్దకెళ్తారు. ఆ ఈశ్వరుడే అరుంధతి ఆశ్రమానికి వస్తాడు. పశ్చాతాపడిన వశిష్ఠుడు అప్పటికే ఆ ఆశ్రమానికి వచ్చి ఉంటాడు. ప్రాచీనుడు, పూర్వాచారనిష్ఠుడు మొదలైన వారందరూ అరుంధతి, వశిష్ఠుల వివాహాన్ని భగ్నం చేబడానికి ప్రయత్నం చేస్తారు. శివుడు వీరికి బుద్ధిచెప్పి వారిరువురికీ వివాహం జరిపిస్తాడు. ఈ నాటకంలో బోయి భీమన్న గారు శివుడు, బ్రహ్మ పాత్రల ద్వారా అభ్యుదయ భావాల్ని ప్రగర్శనరూపంలో అందజేశారు. అరుంధతి చండాలకన్య అయినప్పటికీ, శివుడు చేత ఒక బ్రాహ్మణుడికిచ్చి వివాహం జరిపించి, ఒకనాటి ఆర్య-అనార్యుల సమైక్యతావాదాన్ని పాదు కొల్పడమే కవి ఉద్దేశ్యంగా తెలుస్తుంది.

ఈ విధంగా పౌరాణిక ఇతివృత్తాల్ని తీసుకొని కథా కథనంలోనూ, భావంలోనూ, పాత్రపోషణలోనూ, నవ్యతను చొప్పించిన భీమన్నగారు జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పవచ్చు. అంతేగాక రాగవాసిష్టం నాటకాన్ని వర్ణ వ్యవస్థను ఆర్య అనార్య బేధాల్ని తొలగించడం కోనమే రాసినట్లు తెలుస్తుంది. ఈ నాటకంలో రాసిన పీఠికలో తన ఉద్దేశ్యాన్ని చెబుతూ జాతి సమైక్యత కోసం, కుల నిర్మూలన కోసం రాసినట్టుగా తెలియజేశారు. దీనివల్ల ఒక ప్రజ్ఞావంతుడు ప్రభావితుడైనచో నేను ధన్యునే అన్న భీమన్నగారి ఆశయం నెరవేరినట్లే.

ఆదికవి వాల్మీకి :

వాల్మీకి నాటకం దళితాభ్యుదయం. ఉత్తర రామాయణం లోని వాల్మీకి చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని భీమన్నగారు ఈ రూపక రచన చేశారు. వీరు తమ దృక్పథానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు.ఈ రూపక ఇతివృత్తం పౌరాణికమైనా, సాంఘిక నాటకంగా భాసిస్తుంది. దీనికి కారణం సంఘపరమైన చర్చ ఎక్కువగా ఉండి, అది హేతువాద దృక్పథంతో సాగడమే. కులగిరి, రామపాదం, శివోహం, మకరంద మొదలైన పాత్రలు కేవలం కల్పితం. కులపరమైన సంకుచిత స్వభావంతో కరడుగట్టిన రాయి అనే అర్థంలో కులగిరి పాత్ర సూచిస్తుంది. కులపరంగా ఏ వ్యక్తి గొప్పవాడు కాదని,

కులవ్యవస్థ కృతకం అని భావించే బోయి భీమన్నగారు ఈ రూపకంలోని శివోహం పాత్రలో దర్శనమిస్తారు. కుల మత అసమానతలున్న ఈ సమాజంలో బతకడంకంటే 'పర్వత, అరణ్య ప్రాంతాల్లో స్వేచ్ఛగా జీవించవచ్చని వాల్మీకి, మకరందలు అడవులకు వెళతారు. అక్కడ కొండ జాతుల్లో కలిసిపోయి కిరాతక వృత్తిని అవలంబించి జంతువుల్ని వేటాడి.'ఈ నాటకంలో బోయి భీమన్నగారు తన భావాల్ని ఏ ఒక పాత్ర ద్వారానో కాకుండా సందర్భాన్ని బట్టి, అనేక పాత్రల ద్వారా దళితాభ్యుదయానికి సంబంధించిన భావాల్ని వ్యక్తీకరించారు. ఈ సృష్టికి కారకుడైన బ్రహ్మకు ఇక్కడి మంచి చెడ్డలు, సుఖ దుఃఖాలు వర్తిస్తాయని చెప్పారు.

వేదవ్యాసుడు :

వేదవ్యాసుడు ప్రదర్శన యోగ్యమైన చక్కని సాంఘిక పౌరాణిక నాటకం. ఈ నాటకంలోని ప్రతి అంకం రసభావ బంధురమైంది. భీమన్నగారి జీవితాత్మక నాటకాలు నాలుగింటిలో మిన్న అయింది వేదవ్యాసుడు. హృదయా రకమైన కథ, బిగిసడలని నాటకీయ సంవిధానం, ఉదాత్త గంభీరమైన, మనోహ్లాదమైన సంభాషణలు, సహృదయ హృదయా వర్ణనీయమైన రసపోషణం, సజీవ పాత్రచిత్రణ ఈ నాటకాన్ని భీమన్నగారి జీవిత చారిత్రాత్మక రూపకాలలో ప్రధానమైనదిగా చేశాయి. అడుగడుగునా దళిత స్పృహను ప్రేక్షకుల కనులముందు కదలాడించిన నాటకం వేదవ్యాసుడు. 'వ్యాస వాల్మీకులే కవులవని కెల్ల' అన్న భీమన్న మాటకు కళాత్మక దృశ్యరూపమే ఈ 'వేదవ్యాసుడు' నాటకం.

వేదవ్యాసుడు నాటకం ద్వారా భీమన్నగారు దళిత జాతిని చైతన్యపరచిన తీరు, దళిత జాతి ఔన్నత్యాన్ని, దళితుడి ఆత్మగౌరవాన్ని ఆవిష్కరించిన విధానం చూస్తే "భారతజాతికి దళితులు తలమానికలే గాని తలవంచుకు తిరగాల్సిన పసలేని పసికందులు కారు" అంటూ వ్యాసుని రూపంలో దర్శనమిస్తాడు. మూడవ పౌరాణిక జీవిత కథాత్మక రూపకం వేదవ్యాసుడు. ఇది కవి జీవిత కథాత్మకాలలో రెండవది. ఏడు అంకాల పౌరాణిక సాంఘిక నాటకం ఇది.

ధర్మవ్యాధుడు :

భారత అరణ్యపర్వం పంచమాశ్వాసంలోని 27 నుంచి 145 వరకూ గల పద్యాల్లో విస్తరించిన ధర్మవ్యాధుడి కథ 'ధర్మవ్యాధుడు' నాటక ఇతివృత్తానికి మూలం. వేదకాలం నుంచి ఇప్పటి వరకు కూడా యుగాలవారిగా జరిగిన సంగతులను గూర్చిన అంశాలని అర్థం చేసు కోవచ్చు. అంటే వేదాలలో చెప్పబడ్డ కులవ్యవస్థకి ఆ తర్వాత ఏర్పడ్డ కులవ్యవస్థకి పొంతన లేకపోవడం, వృత్తిపరంగా నచ్చిన కులవ్యవస్థకి హెచ్చుతగ్గులు కల్పించి సమాజంలో కుల వర్ణ భేదాలు సృష్టించడాన్ని అహేతుక అంశాలుగా భావిస్తూ భీమన్నగారు పలికిన ఒక గొప్ప ఉవాచగా ఈ నాటకాన్ని భావించవచ్చు. 'అజ్ఞానంతో భారత జాతిని నాశనం చెయ్యవద్దు' అనే మాటలు భీమన్నగారు నేటి సమాజానికి ఇస్తున్న గొప్ప సందేశంగా భావించవచ్చు. ఈ సందేశం అలాంటి ఇలాంటిది కాదు. ఈ సందేశంలో వర్ణవ్యవస్థ మీదా సమాజంలోని హెచ్చుతగ్గుల మీదా నిరసనను తెలియజేస్తూనే మనిషిని మనిషిగా చూడమని, మానవీయ విలువలతో మనమన్న ధర్మ ప్రబోధం ఇమిడి ఉంది. అందుకే ఈ మాటని సార్వకాలికం, సార్వజనీనమయిందిగా భావించవచ్చు.

ఈ విధంగా భీమన్నగారు పౌరాణిక ఇతివృత్తానికి సమకాలీన సామాజికాంశాలను జోడించి ఒక మంచి నాటకం రాయడం చెప్పుకోదగ్గ అంశం. కొన్ని సంభాషణలు తన సృష్టి అయినప్పటికీ నాటకంలో ఇతివృత్తానికి, కథా కథనానికి, పాత్ర ప్రవర్తనకి చక్కగా అమరినట్లు చేయడం భీమన్న సామాజిక అవగాహన, సమతావాద భావానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ నాటకం ద్వారా ఎన్నో మూఢ విశ్వాసాలకి శాస్త్రీయతతో కూడిన జవాబుల్నిస్తూ, కులభేదాలు సమాజ వినాశనానికి కారకులేకాని, సమతావాదానికి సరిపడేవి కావని, అవి రూపుమాసిననాడే భారతావని అభ్యుదయ పథంలో

పయనిస్తుందని ఈ నాటకం ద్వారా భీమన్నగారు ఉద్బోధిస్తున్నారు.

బాలయోగి :

బోయి భీమన్నగారి కలం నుండి జాలువారి ఆయనచే యోగ-వేదాంత సాంఘిక కావ్యంగా అభివర్ణితమైనదే ''బాలయోగి'. బాలయోగి ఏడు అంకాల సాంఘిక నాటకం. సాంఘిక వ్యక్తులలో ముమ్మిడివరం బాలయోగికి సంబంధించిన నాటకమే బాలయోగి. 'బాలయోగి మహాయోగి. అతని కుండలిని-బాల శివున్ని చూచిన బాలవలె దానంతట అదే లేచి, తక్కిన ఏ మజిలీలోనూ ఆగకుండా, సరాసరి సహస్రారం చేరి, చిరయోగ జనిత సమావేశంతో, పరస శివుణ్ణి కౌగిలించు కొన్న చరిత్ర ముమ్మిడివరం బాలయోగిది' (బాలయోగి, పు. 260).

'ముమ్మిడివరం బాలయోగి గురించి నేను ఎన్నో పరిశీలనలు జరిపించాను. నాకు నమ్మకమైన వాళ్ళను నిఘావుంచాను. ఇటు నా మిత్రులు, అటు ప్రభుత్వపు సిఐడీలు కూడా అతనిలో ఏ లోపాన్నీ కనిపెట్ట లేక పోయారు. అతడి (బాలయోగి)లో ఏదో అతిలోక మహాత్మ్యం ఉంది. హి ఈజ్ నాట్ ఎ హోక్స్ (He is not a hoax). అటువంటి పరమేశ్వర స్వరూపుడైన బాలయోగి చుట్టూ నేను అల్లిన కథ ఈ నాటకం'. (బాలయోగి,పు.260) బోయి భీమన్నగారి మాటలుబట్టి ముమ్మిడివరం బాలయోగిగారు ఎంతటి మహోన్నత మైన వ్యక్తో మనకు అవగతమవుతుంది. ఈనాడు ఇలాంటి వ్యక్తులు మనకు ఎక్కడా కనిపించరు. బోయిభీమన్నగారు బాలయోగి నాటకం రాయకపోతే ఒక మహనీయున్ని గురించి తెలుసుకొనే అవకాశం కోల్పోయేవాళ్ళం. భీమన్న గారి రచనలు వాస్తవికతకు ప్రతీకలు.

పడిపోతున్న అడ్డుగోడలు :

కులభేదాలు సమసిపోవడానికి, నరద్వేషాలు నశించి పోవడానికి, మానవుడు మానవుడే అని చాటి చెప్పడానికి వర్ణాంతర వివాహమే తప్ప మరొకటి లేదన్న అభి ప్రాయాన్ని బోయి భీమన్నగారు ఈ ''పడిపోతున్న అడ్డుగోడలు'' ద్వారా బలంగా చాటారు. ఒకరిపై మరొకరికి కసి, ద్వేషం లేకుండా సమభావాలు, ఇచ్చిపుచ్చు కోవడాలు, విశాల దృక్పథాలు వుంటేనే మానవాళికి శాంతి, సౌఖ్యాలుంటాయని ప్రబోధించారు. నిజానికి ఈనాడు ఈ నాటికను ఊరూరా ప్రదర్శించవలసి అవసరం ఎంతైనా ఉంది.

అటు సంప్రదాయ మార్గంలోనూ, ఇటు ఆధునిక పథంలోనూ కలాన్ని సంధించగల సవ్యసాచి బోయి భీమన్న. దళిత కవులకు తేజోమయ మార్గదర్శకుడు, అసమాన్య సాహితీ కృషీవలుడు, ఏ ప్రభావానికి లోనుకాక తన మార్గాన్ని తానే నిర్దేశించుకొని సాగిన పథగామి. సంప్రదాయం, అభ్యుదయం, ఆధ్యాత్మికత, భావుకతలకు నెలవైనవాడు, సహృదయుడు బోయి భీమన్న.

డా॥ బోయి భీమన్నగారు నాటక సాహిత్యంలో దళితాభ్యుదయాంశాల్ని వెలికితీయడం జరిగింది. దళితుల సంవేదన, ఐక్యత, సంక్షేమం, హక్కుల సాధన కోసం కలంపట్టి సాహిత్యపు కుదుళ్ళనే కుదిపేస్తున్న ఈనాటి చారిత్రక సందర్భంలో భీమన్నగారు దళితుల సర్వతోముఖవికాసానికి అవసరమయ్యే సమగ్ర కార్యా చరణ ప్రణాళికను తన కావ్యాలలో పొందుపరిచారు. దళిత విముక్తికోసం న్యాయవాదిలా, సత్యవాదిలా కులవ్యవస్థ నేరాలను ఏకరువు పెట్టి వాటి ప్రక్షాళన కోసం నడుం బిగించారు. దళిత జనాభ్యుదయంకోసం అంబేద్కర్ సిద్ధాంతాల్ని, కృషిని, అందిపుచ్చుకొని దళితులు పొందవలసిన ప్రగతిని తెలియజేశారు.

నిజజీవితంలో అటు అంబేద్కర్‌గారు, ఇటు బోయిభీమన్నగారి ఇరువురి జీవితాలను పోలేరు నాటకం స్ఫురింపజేస్తుంది. వీరిరువురూ కులం వల్ల అనేక అవమానాలు, అసమానతలు ఎదుర్కొన్నవారే. వీరు చదువుకోవడం వల్లనే అనేకమంది దళితులకేగాక దళితేతరులకు కూడా ఆదర్శం కాగలిగారు. తాము చెప్పిన

వాటిని నిజజీవితంలో ఆచరించి చూపారు. రాగ వాసిష్టంలో అరుంధతీ మాహాత్మ్యం, పురాణేతిహాసాల్లోన్ని కులాంతర వివాహాలు, ఆర్యద్రావిడ వాదాలు మొదలైన వాటిని నాటకంలో అంతర్భాగం చేశారు. కూలిరాజు నాటకంలో కులంతోపాటు ఆర్థికాంశాల్ని కూడా ప్రస్తావించారు. వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైన వాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్నగారి దృక్పథాన్ని మరింత లోతుగా విశ్లేషించు కోవాల్సిన అవసరం, ఆవశ్యతక ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. జ్ఞానేశ్వర్ గనుమల (సంపా). బోయి భీమన్న సాహితీ షష్ఠిపూర్తి సంచిక,హైద్రాబాద్: సుఖేలానికేతన్, ఇర్రం మంజిల్ కాలనీ, 1983.
2. పోతన్న,వి. హరిజనాభ్యుదయం - తెలుగు నాటకం, కర్నూలు: తేజో ప్రచురణలు, 1994.
3. భీమన్న,బోయి. వేదవ్యాసుడు, భీమన్న సాహితీ నిధి, ఐ.సి.-85, ఇర్రం మంజిల్ కాలనీ, హైద్రాబాద్, 2000.
4. బోయి భీమన్న. ఆదికవి వాల్మీకి(రంకాల నాటకం).సన్మాన సంఘం.ఇర్రం మంజిల్ కాలనీ, హైద్రాబాద్, 1970.
5. భీమన్న, బోయి. ధర్మవ్యాధుడు, భీమన్న సాహితీ నిధి, హైద్రాబాద్: ఇర్రం మంజిల్ కాలనీ, 1999.
6. బోయి భీమన్న. బాలయోగి(ఏడంకాల నాటకం).శ్రీరామా పవర్ ప్రెస్, సికిద్రాబాద్, 1964.
7. బోయి భీమన్న సాహిత్యం-దళిత దృక్పథం. (సదస్సు పత్రాలు) పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.
8. మరపట్ల,భాస్కరరావు. సామాజిక విలువల నేపథ్యంలో బోయి భీమన్న రూపకాలు విశ్లేషణాత్మక విమర్శ, విశాఖపట్నం: ప్రెస్ అండ్ పబ్లికేషన్స్, 2007.
9. వెంకటేశ్వరరావు,దార్ల. బోయిభీమన్న సాహిత్యంలో భారత జాతీయ దృక్పథం, సూర్యపత్రిక, ఫిబ్రవరి,28, 2011.
10. సుదర్శనరాజు, కొండపల్లి. పౌరాణిక రూపకాలు - భావ విప్లవం, గుంటూరు: భావ విప్లవ ప్రచురణలు - 1996.
11. హైమవతి. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయిభీమన్న, హైదరాబాద్: సుఖేలానికేతన్, ఇర్రంమంజిల్ కాలనీ (ద్విము.)1982.

❁❁❁

'జన్మాంతర వైరమ్' - సమాకాలీనత

- డా॥. ఎం.మురళి

సంస్కరణ సాహిత్యానికి ఆటపట్టుగా నిలిచిన కవులలో కళాప్రపూర్ణ బోయి భీమన్న ముందు వరుసలో ఉంటారు.ఆర్షధర్మం లేదా హిందూధర్మ పరిరక్షణతో పాటు కులాల అడ్డుగోడల కూల్చివేత ఆవశ్యకతపై సుతిమెత్తగా హితవు,హెచ్చరికలతో రచనలు చేశారు. కులంపరంగా తాను అవమానాలపాల్కెనప్పటికీ మతాన్ని తప్పుపట్టనని, మతాన్ని వీడనని పదేపదే ప్రకటించారు. కొందరు పీఠాధిపతులు కారణంగా హిందూ మతంలోని కొన్ని వర్గాల వారు ఇబ్బంది పడడం వాస్తవమే. అలా అని ఈ మతాన్ని తక్కువ చేయలేనని స్పష్టం చేశారు. బంగారు నగలు తయారు చేసే వారు అవకతవకలకు పాల్పడినంత మాత్రాన బంగారాన్ని నిందించలేను' కదా అని పోలిక చెప్పారు. 'హిందూ మతం కేవలం న్కెతిక సూత్రాల గ్రంథంకానీ, ఒక ఆరోగ్య సూత్రాల శాస్త్రం కానీ కాదు. అది ఒక జీవిత వేదాంత దర్శనం అలాంటప్పుడు ఈ మతంపై ఎందుకు వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రశ్నించేవారికి, 'ఇది నామతం. ఇతర మతాలను విమర్శించలేను కనుక' అనీ వివరణ ఇచ్చారు.

కులమత వివక్షను నిరసించిన ఆయనే మత మార్పిడులను వ్యతిరేకించారు. 'నేను హిందువుగా పుట్టాను.మతం మార్చవలసిన అవసరంలేదు. పెనంలో నుండి పొయ్యిలోకి దూకడం దేనికి?' అని ప్రశ్నించారు 'జన్మాంతర వైరం' కావ్యంలో. నేను హిందువుని. ఈ జాతి, దేశమూ నావి. మతం మారవలసిన అవసరం ఏముంది?పోనీ నేనొక్కడిని మతం మారిపోతాననుకోండి. నాతో ఎంతమందిని తీసుకుపోగలను? అలా వచ్చే వారైన నా మీద గౌరవంతోన కానీ అవతలి మతం మీద విశ్వాసంతో కాదు కదా?' అంటూ బలవంతపు మత మార్పిళ్లను నిరాదరించారు.

కులవ్యవస్థ,ఇతర అంశాలపై భీమన్న రాసిన 'జన్మాంతర వైరమ్' కావ్యంలోని అంశాలను స్థాలీపులాకంగా విశ్లేషిస్తే....

ఈ కావ్యరచనకు 1937 ప్రాంతంలో తూర్పు గోదావరి జిల్లాలోని ముంగండ అగ్రహారంలో బీజం పడిరది.అప్పటి సమకాలీన పరిస్థితులపై భీమన్న పాతిక పద్యాలు రాశారు. కొన్నేళ్లకు మోరి గ్రామంలో తమ 'పాలేరు 'నాటకం ప్రదర్శన సందర్భంగా ఈ పద్యాలను స్వయంగా ఆలపించారు. నాటి సుప్రసిద్ధ యువ సామ్యవాద నాయకులు కుందెం సత్యనారాయణ లాంటి వారు ఎంతో మెచ్చుకున్నారు. ఆ పద్యాలు జాషువాను మరిపిస్తున్నాయని, వెంటనే ప్రచురించాలని సన్మానపూర్వకంగా కొంత నగదు కూడా బహూకరించారు. కరడుగట్టిన అస్పృశ్య భావాలు ఉన్న కాలంలో హరిజనేతరుల్కెన పెద్దలు, పండితులు కూడా ఈ పద్యకావ్యాన్ని ఆమోదించడాన్ని విశేషంగా చెప్పుకున్నారు కవి. కానీ కావ్యం ముద్రణకు నోచుకోలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అంటరానితనం నిర్మూలన, సమానత్వ పోకడలతో, పాతభావాలు మరుగున పడిపోతున్న దశలో కర్మలు, కర్మ సిద్ధాంతాలపై రచనలు, ముద్రణ అవసరంలేదను కున్నారట. అయితే క్రమేణ ఆధునిక యుగంలో కూడా గత సంఘటలను గుర్తుకు తెచ్చే సందర్భాలు తారస పడడంతో ఈ తరహా రచన వ్యాసంగాన్ని కొనసాగించారు. సుమారు నాలుగున్నర దశాబ్దాల తరువాత అంటే 1980 నాటికి ఇరవై అయిదు పద్యాలు 178 పద్యాలకు పెరిగి 'జన్మాంతర వైరమ్' కావ్యంగా వెలుగుచూసింది. ఇందులో కేవలం అంటరానితనమే కాదు...సమాజంలోని వివిధ అంశాలను, విపరీత పోకడలను ప్రస్తావించారు. నాటి పెద్దలు అన్నట్లు

జాషువా మహాకవి శ్కెలి కనిపించడమే కాదు వేమన, సుమతీ శతకాల రీతి స్ఫురిస్తుంది.

బోయి భీమన్న కులనిర్మూలనను మనసా వాచా ఆకాంక్షించారు. వర్ణాంత వివాహాల వల్ల ఇది సాధ్యమవు తుందని భావించారు. కులం పేరిట కుమ్ములాటను (కులాల కుంపట్లను) తీవ్రంగా నిరసించారు., కులవ్యవస్థ మాసిపోయి,అందరూ సమానమనే భావన కలిగితే సహజంగానే ఉన్నతిని సాధిస్తారన్నది ఆయన అభిప్రాయం.

'చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశ:'...గుణాలను బట్టి, వృత్తులను బట్టి మనుషులను నాలుగు వర్ణాలుగా సృష్టించానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. అలా...

'వృత్తి వర్ణాలె కులములెక్క వెలసె, జన్మ
కులముతో పుట్టె సంకర కులము లెన్నో' అని వ్యాఖ్యానించారు.

వర్ణ మేదెక్కెన రక్త సంబంధ మొకటె
స్థాన మేదెక్కెన జీవితా దర్శ మొకటె' అనీ సూత్రీ కరించారు.

పనికి తగిన ఫలితం, నేరానికి తగిన శిక్ష అనే సిద్ధాంతాన్నే విశ్వసిస్తే, గత జన్మలో అంటరానితనాన్ని పాటించిన వాడే మరుజన్మలో అస్పృశ్యుడిగా, అంటరాని వారిగా అవమానాల పాలెక్కిన వారు ఈ జన్మలో బ్రాహ్మణులుగా పుట్టి ఉంటారని కవి అభిప్రాయపడ్డారు.

'ద్విజుడన్కె నేను ఆనాడు ద్వేషబుద్ధి
నెవరి నస్పృశ్య లంచు హింసించి నానొ
వార లెల్ల నే డీ అగ్రహార మందు
బ్రాహ్మలెక్క పుట్టినారు నాపైని పగతొ ..'అంటూ 'చెరపకురా చెడేవు'అన్నట్లు కర్మ సిద్ధాంతాన్ని నమ్మే వారికి ఇది ఒక హెచ్చరికలాంటిది కూడా చేశారు.

రాజు కుమారుడికి రాజయ్యే అధికారం ఉన్నప్పుడు అగ్రవర్ణేతరులకు కనీసం అక్షర జ్ఞానం అవసరం లేదా?అన్నది భీమన్న ఆవేదన..

'చదువుకొని ఎవ్వడ్కెనను సత్యమెరిగి
తిరగబడు నేమొ అని నిషేధించినారు
చదువునే; రాజు కొడుకు రాజ నుచు చెప్పి
సహజ శక్తుల పెంపును చంపినారు'.. ...చదువు అబ్బితే ప్రశ్నించి, తిరుగుబాటు చేస్తారేమోననే భయంతోనే వారిని చదువుకు దూరంగా ఉంచారని అభిప్రాయ పడ్డారు. అందుకే....

'కూల గొట్టుడు కులమత కుటిలతలను
సమము చేయుడు మానవ స్వామ్యములను' అని నినదించారు. అయినప్పటికీ పట్టనట్లు ఉంటే పరి ణామాలు మరోలా ఉంటాయనీ సూచించారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ....

'పీడిత జనమ్ము న్యాయము వేడె నేని
మకర కుండలములు మిమ్ము మనుపు గలవె' అని ప్రశ్నించారు.

ఎవరి పని వారు చేసుకుంటూ ఎవరి ఆహారాన్ని వారు సంపాదించుకుంటూ బతికినన్నాళ్లు మానవ జాతి బాగానే ఉంది. స్వార్థం ముసిరినప్పుడే క్రూరత్వం బట్టబయలు అవుతుంది. అసామాన్యుడి నుంచి సామాన్యుడి వరకు నిత్యజీవితంలో అవసరమయ్యేవి తిండి, బట్ట, గూడు. ఆ తర్వాత ఎన్ని ఉన్నా విలాసమే. కానీ ఎంత మంది ఆ మూడు అవసరాలకు నోచుకుంటున్నారన్నది కవి ప్రశ్న.

'కూడు, గుడ్డ, కొంప - మూడే కదా నేడు
నరుడు కోరుకొనెడి వరము లెల్ల
మనిషి బ్రతుకు లక్ష్య మంతేన? ఆ మాత్ర
మునకు తేల నేల? మునగ నేల?

ఆయా రంగాలకు చెందిన వారు శక్తి కొద్దీ సంపా దిస్తారు. ఎవరు ఎంత ఆర్జించినప్పటికీ మొత్తం ఉమ్మడి సొత్తు. దానిని జాతి అంతా అనుభవించడం సార్వజనీన సమత, వేద సంస్కృతి అని పేర్కొన్నారు. కానీ ఆధునిక

కాలంలో ఆ నియమానికి కాలం చెల్లింది. సమష్టిగా అనుభవించడం అటుంచి పరుల కష్టాన్ని కూడా దోచుకునే దుష్ట సంస్కృతి పెరిగింది. మనిషి స్వార్థబుద్ధిని ఎత్తి చూపుతూ....

'ఒక్కడు బ్రతుకుటకై వే
రొక్కడు చావంగ వలెనె? ఉర్వీ ఫల మే
యొక్కరిదో కాదు, ఎల్లరి
హక్కది, బ్రతుకంగ వచ్చు నందరు దానన్'

'నీవు బాగుపడాలంటే ఎదుటి వాడు చెడిపోవాలా?' అని ప్రశ్నించారు కవి.ఆ తత్వం మంచిది కాదని, ప్రకృతి సంపదపై అందరికి హక్కు ఉందని,దానిని సమానంగా అనుభవించాలంటారు.అంతేకాదు. ఇతరులను పీడిరచి పబ్బం గడుపుకోవడం కంటే శక్తి మేరకు పాటుపడమే అభ్యుదయ మార్గమని హితవు చెప్పారు.

'బలవంతుడు బలహీనుని
బలిపశువుగ జేసి తినుట పరిపాటి; సము
జ్జ్వల శక్తి యుక్తుల్కె, సమ
ఫలితము గొని బ్రతుకు డార్ష భారత సరళిన్' అని ఆర్ష ధర్మాన్ని నొక్కి చెప్పారు.అంతేకాదు పరులను పీడిరచడం ద్వారా అయాచిత లబ్ధి పొందడం కంటే తెలిసిన పని చేసుకు జీవనం సాగించడం మేలని, అదే ఎదుగుదలకు బీజాలు అవుతాయని.....

'పరుల పీడిరచకుండగా పనికి తగిన
ఫలితమున్ గొని జీవించు ప్రాణికోటి
మాత్రమే చేరు తత్ సుఖ క్షేత్ర మందు
అభ్యుదయ సృష్టి కవియె బీజాణువు లగు' ...అన్నారు. కవి భావాన్నే...సంతృప్తికి మించిన సంపదలేదనే నిర్వచనంగా చెప్పుకోవచ్చు.

'నిత్య కృషి రోజువారీ సంపాదనే తప్ప నిలువ ఉంచుకోవాలనే సోమరిపోతు గుణాలు ఆనాడు లేవని కవి గుర్తు చేశారు. వేటకు వెళ్లిన వారు ఎవరెంత తెచ్చినప్పటికీ కలసి పంచుకునేవారు.సామ్యవాదం అన్నా, ఆర్షధర్మం అన్నా అదే. కానీ ఆర్ష సంప్రదాయ వారసులు ఆ విధానాన్ని పాటిస్తున్నారు? నిలదీశారు.

'పెరుగు కొలదియు జనసంఖ్య; తరుగు తిండి
తిండి కోసము పోటీలు మెండుకొనును
బలము కలవాడు కొనును సంపదల నెల్ల
పొట్ట కూటికి అబలుడు వెట్టిచేయు'.....'మంది పెరిగితే మజ్జిగ పలచన' అన్నట్లు..పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తిండిగింజల దిగుబడి కావడంలేదు. దానికి తోడు 'నల్ల బజారు' వ్యాపారం ఉండనే ఉంటుంది. ఫలితంగా బలహీనులు వెట్టిచాకిరితో పొట్టపోషించుకోవలసి వస్తుందన్న మాట నేటికీ వర్తించే పరిస్థితి.

ఏదోలా బతకేయడం కాదు. ఆ బతుకు అర్థవంతం, హుందాగా ఉండాలంటారు పెద్దలు. 'కాకిలా కలకాలం ఉండడం కంటే హంసలా ఆరుగాలం మనడం' మేలు అనే సామెత అలాగే పుట్టింది.

'ఏదో బ్రతుకుచు నుంటిమి
కదా అనుకొనగ వద్దు, కాకి బ్రతుకదే?
సోదరుల నడచి, నెత్తుటి
సాదము తిని, దాస్యవృత్తి సాగుట పరువే' ..పద్యంలో హంస ప్రసక్తి లేకపోయినప్పటికీ 'సోదరుల నడచి' అంటే సాటివారికి కష్టకలిగించి వారి ఎంగిలి కూడా తినడం సబబా? అని ప్రశ్నించారు.

పేర్ల చివర కుల సూచక పదాలను వాడకూడదనే కొందరి నోట ప్రతినలు వినవిస్తున్నాయని, కొందరు అలాంటి పదాలను వదిలేసుకున్నారని,అయితే వారిలో ఎందరు తమ కులతత్వాలను వదిలేసుకోగలిగారని ప్రశ్నించడంలో 'తలలు బోడుల్కెన తలపులు బోడులా...' అన్న వేమన మాటలు స్ఫురిస్తాయి. కానీ బీమన్న ఈ ప్రశ్న వేసేనాటికి ఉన్న పరిస్థితికి, వర్తమానానికి ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. ఒకప్పుడు పలానా సామాజిక వర్గం ఆ పేరుతో పిలిస్తే ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి. ఇప్పుడది హోదాగా మారింది. హిందూ మతం పరిఢ

విల్లేందుకు కులవ్యవస్థ నిర్మూలన అవసరం అన్న భీమన్న పిలుపునకు, నేటి పరిణామాలకు పొంతన కనిపించదు.

భీమన్న తమ రచనల ద్వారా గొప్ప గొప్ప సందేశాలు ఇవ్వాలనుకోలేదు కానీ సామాజిక చైతన్యాన్ని ఆశించారు. మహనీయులకు లేని కులాలు మానవులకు ఎందుకు అన్న చాలామంది అడిగే ప్రశ్ననే భీమన్న కూడా సంధించారు. పైగా పుట్టుకతో ఇతర కులస్థుల్కెన వారు అగ్రవర్ణాల జాబితాలో ఎలా చేరతారు? అనే దానిని.....

'బోయడు ధర్మవ్యాధుడు
బోయడు వాల్మీకి, ఆది బోయడె శివుడౌ
బోయడు వ్యాసుడు సాత్యవ
తేయుడు; ఈ బోయలెట్లు ద్విజు ల్కెరయ్యా?'అని సందేహం వ్యక్తం చేశారు.

అలాగే దేవుడి దృష్టిలో సర్వులు సమానమే. అందుకే నేమో...ఒక్కొక్కరితో ఒక్కొక్కరకం సేవ చేయించు కుంటాడు. పనిలో తేడా తప్ప పరమార్థంలో భేదం ఉండదంటారు.అలాంటప్పుడు అయినవారు, అంటరాని వారు అనే తేడాలెందుకు? అన్నది సందేహం.

'విశ్వమున కెల్ల మూలమౌ విష్ణువునకు
పీత వస్త్రమ్ము నేసిన నేతగాడు
పాద రక్ష లమర్చిన ప్రథమ శిల్పి
ఎప్పు డప్పబృశ్యు డయ్యెనో చెప్పగలవె?' అని అడిగారు. సామాజిక వర్గాలు,ఆర్థిక స్థోమతలకు అతీతంగా అందరికి మనసే ప్రధానమంటారు. శ్రద్ధాసక్తుల ముందు ఇతర అంశాలన్నీ తేలిపోతాయని,"కూలివాడె యైన కోటీశ్వరుం డైన/మనసు ఒకటె ఎల్ల మానవులకు/మనసు నెరుగు వాడె మానవుండు' అని హితవు చెప్పారు.

ఏ కులానికి ఆ కులం సంఘాలు పెట్టుకుంటూ వైరి వర్గాలుగా విడిపోతూ, సెగ్రగేట్ (వేరుచేయు) అయి పోతున్న నేటి రాజకీయ పదవీ రాక్షస యుగంలో కులాంతరీకరణను బోధిస్తున్నారని భీమన్న దశాబ్దాల క్రితం వాపోయారు. నేడది మహావృక్షంగా మారిందని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. దాదాపు అన్ని అంశాలలోనూ 'సామాజికవర్గం' కీలక భూమిక వహిస్తోందన్నది నడుస్తున్న చరిత్ర. ముఖ్యంగా ఎన్నికలలో అభ్యర్థుల జయాజయా లను నిర్ణయించేది కూడా అని బహిరంగంగానే చెబుతారు.

'లేదస్పృశ్యతలూ లేదు లేమి కులముల్
లేవు, ఆర్షలోకమ్ము తత్
భేదక్లేశము లెల్లతీరి, ధ్వజమెత్తన్ లోక శ్రేయస్సుకై
వేదోక్తమ్మిది సర్వజాతి సమ తావిష్కార తత్వమ్ము బ్రా
హ్మీ దైవత్వము నొంది సాగు డొకటె
మేధావుల్కె ఎల్లరున్'.. అని కర్తవ్య బోధ చేశారు.

'కావున, కుల నిర్మూలన
కావింపుడు, వే విహిత కార్యోన్ముఖులై
యావత్ విశ్వమ్మును ఆ
ర్యావర్తము చేసి వెలయు డద్వైత విధిన్' .అని కోరారు. ఏ కులానికి చెందిన యువత అయినా వివేకంతో వాస్తవాన్ని గుర్తించి భారత సమాజ పునర్నిర్మాణానికి పునరంకితులవుతారన్న ఆయన కల సాకారం కావాలని కోరుకుందాం.

❁❁❁

బోయి భీమన్న జానపదుని జాబులు – సమసమాజ కాంక్ష

– మళ్ళి పెంచల ప్రసాద్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

వ్యక్తుల మధ్యగానీ, సంస్థల మధ్యగానీ ఉన్న పరస్పర సంబంధాన్ని గుర్తుచేసుకుంటూ రాసుకునేవి లేఖలు. ఇవి ఆయా వ్యక్తులకు దేశకాల పరిస్థితుల పట్ల గల అభిప్రాయాలను, వివిధ వ్యక్తులతో, ప్రముఖులతో వారి కున్న సంబంధాలను, సమకాలీన జీవితంలో చోటుచేసు కున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితు లను తెలియజేస్తుంటాయి. లేఖ పదానికి ఉత్తరం, జాబు అనేవి పర్యాయపదాలు. లేఖా ప్రక్రియను గురించి ప్రస్తావిస్తూ ప్రముఖ రచయిత మలయశ్రీ 'ఉత్తరం రాయడమనేది ఒక కళ. అది ఆత్మీయతకు చిహ్నంగాను, మర్యాదకు లక్షణంగాను, అవసరానికి బంధువుగాను, అవేశానికి ఆయుధంగాను, ప్రేమకు కానుకగాను' ఉం టుందంటారు.

తెలుగు సాహిత్యంలో అనేక మంది ప్రముఖులు రాసుకున్న ఉత్తరాలు సాహిత్యంగా పేర్కొనబడు తున్నాయి. తెలుగు లేఖల ప్రాధాన్యాన్ని, అందలి సాహిత్యాన్ని ముందుగానే గుర్తించిన సి.పి.బ్రౌన్ అనేక వేల లేఖలను సేకరించి భద్రపరచిన విషయం మనందరికీ విదితమే. వీటితోపాటు చలం రాసిన 'ప్రేమలేఖలు', కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'శారద లేఖలు', వంగూరి సుబ్బారావు రాసిన 'వసంత లేఖలు' కూడా తెలుగు సాహిత్యంలో విశేష మన్ననలందుకుంటున్నాయి. ఈ కోవలోకి చేర్చదగినవే బోయి భీమన్న రాసిన జానపదుని జాబులు. ఈ జానపదుని జాబులు మొట్టమొదట 1932లో 'పల్లెటూరి లేఖలు' పేరిట జనవాణీ పత్రికలో ప్రచురించబడ్డాయి. తరువాత 1933లో ప్రజామిత్ర పత్రికవారు మరికొన్ని లేఖలను 'జానపదుని జాబులు' పేరిట ప్రచురించారు. వీటన్నింటినీ 'దేశికవితా ప్రచు రణల వారు' సేకరించి 'జానపదుని జాబులు' పేరిట ఒక సంపుటంగా తెచ్చారు. ఈ లేఖల సారాన్ని పరిశీలించినట్లైతే 'చదువుకొని బీదతనం వల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన ఒక జానపదుడు, పట్నంలోని శ్రీమంతు డైన మిత్రునికి తన అవస్థలను, పల్లెటూర్లలో ప్రబలంగా ఉన్న అసమత్వాలను, సాంఘిక దౌష్టాన్యాలను, స్వార్థ, నిరంకుశత్వాలను గురించి తెలియజేస్తూ, పల్లెటూరి ప్రజలకు చేయుతనందించాల్సిన ఆవశ్యకతను గురించి వివరిస్తాడు.

జానపదుని జాబులు – సమసమాజ కాంక్ష :

'ఈ సంఘం మనకు తగదు. దీనిని సంస్కరించడానికి కూడా సాధ్యపడదు. సంఘం ముసల్ది అయిపోయింది. ముసలి దానికి కాంచనాభరణాలు పెట్టినంత మాత్రాన నవయౌవ్వనాంగి కాలేదు కదా!, అందుకే కొత్త సంఘం, కొత్త ఉత్తేజం, కొత్తజీవనం కావాలి మనకు' అంటూ పీడిత వర్గ కంబంధ హస్తాలలో చిక్కుకున్న నిరుపేద బతుకుల్లో సమసమాజ కాంక్షను రగుల్కొల్పడానికి నడుంకట్టిన ఆధునిక తరం సంఘ సంస్కరణోద్యమ కారుడు బోయి భీమన్న. ఈయన రాసిన జానపదుని జాబుల్లో అణువణువునా సమసమాజ కాంక్ష, స్వార్థ, నిరంకుశత్వాలపై పేదలు తిరుగుబాటు చేయాల్సిన ఆవశ్యకతలు ప్రతిపదోక్తమౌతాయి. బోయి భీమన్న చిన్నతనం నుండి పల్లెటూరిలో పుట్టి పెరగడం వల్ల అక్కడి కూలీలు, దళితులు ఎదుర్కొనే సమస్యలను స్వయంగా చూసి వాటన్నింటికి అక్షర రూపాన్నిస్తూ జానపదుని జాబులను రచించి ఉంటారని చెప్పవచ్చు. ఈ జానపదుని జాబుల్లో ఆనాటి పల్లెటూర్ల సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఎంతో చక్కగా ఆవిష్కరించబడి ఉన్నాయి. ఒకప్పుడు పల్లెటూర్లు

ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టినిల్లుగా ఉండేవి. కానీ నేడు ఈ పల్లెటూర్లలో విద్వేషాలు, అసమత్వ భావనలు, స్వార్థ, నిరంకుశత్వాలు పెచ్చుమీరిపోయాయని, నిరుపేదల బ్రతుకులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయని భీమన్న జానపదుని జాబుల ద్వారా తెలియజేశాడు. ధనికులు, భూస్వాముల చేతుల్లో నిరుపేదల బ్రతుకులు కీలుబొమ్మలుగా మారిపోయాయని, తరాలు మారుతున్నప్పటికీ వాళ్ళ కబంధ హస్తాల్లో నుంచి బయటపడలేక కొట్టుమిట్టులాడుతున్నాయని తెలియజేస్తాడు. బానిసత్వానికి భయపడి మృగాలు, పక్షులే దూరంగా పారిపోతుంటే మేథో సంపన్నుడైన మానవుడు మాత్రం బానిసత్వమే జీవితంగా బ్రతకడం ఆశ్చర్యానికి గురి చేస్తుందంటాడు. బానిసత్వం లేకుంటే మానవులకు బతుకుదెరువే కనిపించడం లేదా అంటూ బానిసత్వాన్ని విడనాడి, ధైర్య సాహసాలతో పోరాడి సమత్వాన్ని సాధించుకోవాలని జానపదుని నోట పలికిస్తాడు. ఇలా సమసమాజ కాంక్షే ధ్యేయంగా బోయి భీమన్న జానపదుని జాబుల్లో అనేక సంఘటనలు చిత్రించి చదువరుల కళ్ళముందు ఆవిష్కరిస్తాడు. ఉదాహరణగా ఒకప్పుడు రైతులు, కూలీలు అన్నదమ్ములంటూ ప్రస్తావించబడిన కథ చదువరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఆ కథను ఇక్కడ పరిశీలిద్దాం.

ఒక తల్లికి ఇద్దరు కుమారులు. అందులో పెద్దవాడు సోమరి. చిన్నవాడు చురుకైనవాడు. ఒకసారి చిన్నవాడి చురుకుదనానికి మెచ్చుకొని అతడే తన మానవసృష్టి కంతటికీ ఆధార భూతుడు కాగలడని భావించిన భగవంతుడు అతడిముందు సాక్షాత్కరించి ఒక నాగలిని ప్రసాదిస్తాడు. ఆ నాగలిని తీసుకున్న చిన్నవాడు నాగలితో సేద్యంచేసి సమస్త ప్రపంచాన్ని పోషించమని భగవంతుని ఆజ్ఞ కాబోలు అనుకొని తిరిగి వెళ్తుంటే పెద్దవాడు ఎదురుపడి, తమ్ముడు నేను ఎంత ప్రయత్నించినా దేవుని దగ్గరకు చేరుకోలేకున్నాను. నీకు పుణ్యముంటుంది. ఈ నాగలి నాకిచ్చి, నువ్వు వెళ్ళి ఇంకొకటి అడిగి తెచ్చుకో అని బతిమాలుతాడు. అప్పుడు చిన్నవాడు సంతోషంగా ఆ నాగలిని పెద్దవాడికిచ్చి మళ్ళీ భగవంతుని ముందుకెళ్ళి జరిగిన విషయమంతా చెప్పి మరో నాగలిని ప్రసాదించమని కోరుతాడు. చిన్నవాడి మాటలకు కోపోద్రేకుడైన భగవంతుడు 'ఓరీ మూర్ఖుడా! ఇంకొకళ్ళకు దానం చేయమనే ఇచ్చానా నీకు? నీ తెలివితక్కువతనానికి ఫలితంగా నీ అన్నకు పాలేరుతనం చేసుకొని బతుకు అని శపించి అంతర్ధానమైపోతాడు. అలా ఆ నిర్భాగ్యుడు కూలీగాను, సోమరైన అన్న రైతుగాను స్థిరపడుతారు.

ఒకసారి ఈ కథను క్షుణ్ణంగా పరిశీలించినట్లైతే ఇందులోని సమసమాజ కాంక్షా మూలాలు మన కళ్ళముందు సాక్షాత్కారమౌతాయి. రైతు, పాలేరులు ఒక తల్లి బిడ్డలని మరచిపోయి జీవిస్తున్న నేటి సమాజానికి రచయిత తమ మూలాలను గుర్తుచేసి, అలమరికలన్ని మరచిపోయి తిరిగి మళ్ళీ ఒక తల్లి బిడ్డల్లా, అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలని ఉపదేశించడం చూడొచ్చు. ఇది రచయిత యొక్క సమసమాజ కాంక్షకు అద్దం పడుతుంది.

మరో సందర్భంలో జమీందారీ రైతు బిల్లును గురించి ప్రస్తావిస్తూ 'కుబేరావుకున్న పన్నెండువందల ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని ఊళ్ళోని పేద కుటుంబాలన్నింటికి తలో ఐదు ఎకరాలు పంచిపెడితే సమాజంలోని పేద,ధనిక భేదాలు నామరూపాల్లేకుండా పోతాయని, అదేవిధంగా దేశమంతటా భూస్వాముల చేతుల్లో చిక్కుబడి ఉన్న కొన్ని లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం చేజిక్కించుకొని లేనివాళ్లకు సరి సమానంగా పంచిపెడితే దేశం సుభిక్షమై సమసమాజం సాధించబడుతుందని హర్షం వ్యక్తం చేస్తాడు. అటువంటి జమీందారీ రైతు బిల్లును చట్టం చేసినట్లైతే భారత దేశంలోని ప్రజలు గాంధీజీని ఎలా పూజిస్తున్నారో, రైతు లోకం శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారిని అలా పూజిస్తారంటాడు. ఈ జమీందారి రైతు బిల్లే రైతు విప్లవానికి సోపానం కాగలదని ఆకాంక్షిస్తాడు. ఇక్కడ కూడా మనకు భీమన్నగారి సమసమాజ కాంక్షా తత్పరత సాక్షాత్కారమౌతుంది.

ఒకసారి జానపదుడు పంటచేలో పనిలో నిమగ్నమై ఉండగా దూరం నుండి కోయిల 'కుహూ కుహూ' గానము, ఆగానాన్ని అనుకరిస్తూ కుహూ కుహూ అంటూ ఎవరో అరుస్తున్నట్లు శబ్దము వినిపిస్తాయి. జానపదుడు అటువైపుగా వెళ్ళి పరిశీలిస్తే దూరంగా ఒక పాలేరు కుర్రాడు కుహూ కుహూ అంటూ కోయిల గానాన్ని అనుకరిస్తూ కనిపిస్తాడు. జానపదుడు ఆ కుర్రాడి దగ్గరకు వెళ్ళి అబ్బాయి ఆ కోయిలతో నీకు పందెం ఎందుకు. అది సుకుమారి. పొద్దుపొడిచింది మొదలుకొని ఆకుల నీడలో కూర్చొని జీవితం సాగించే భాగ్యవంతుల బిడ్డ. కమ్మని చిగురాకులు తింటూ, పూదేనెలు తాగుతూ జీవితం సాగిస్తుంటుంది. కానీ నీ జీవితం అందుకు పూర్తిగా భిన్నమైనది అంటే, ఆ మాటలు విన్న కుర్రవాడు 'నేను కష్టజీవినండి. నా మాటే ముందు సాగాలి - నేనే పందెంలో గెలవాలి' అంటాడు. అప్పుడు జానపదుడు ఆశ్చర్యపోయి నిలబడి 'చావలేదు... చావలేదు... ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర' అన్న మాటను స్పురణకు తెచ్చుకొని కూలీలు ఇంకా పూర్తిగా బానిసత్వం అలవాటైపోలేదు. వారిలో యే మూలనో ఒక మూల స్వేచ్ఛాలేశాలు ఇంకా బ్రతికే ఉన్నాయి వాటిని మేల్కొల్పితే కచ్చితంగా సమత్వమనే విజయం సుసాధ్యమౌతుందంటాడు.

ఎంత కాలం ఈ సమాజంలో ఒక పరిపూర్ణమైన పరిణామం రాకుండా ఉంటుందో అంత కాలం ఈ దేశ పరిస్థితుల్లో ఏవిధమైన మార్పులు చోటుచేసుకోవు. అంతకాలం ధనికులకు అధికారం, పేదలకు సేవకవృత్తి తప్పదు అంటూ, చిన్న చిన్న దేశాలు పెద్ద పెద్ద సామ్రాజ్యాలను ఏలడానికి ములం కారణం ఏమిటని ప్రశ్నించుకుంటే తరుణశక్తి ప్రాధాన్యత తెరపైకి వస్తుంది. ఆ తరుణశక్తే మనిషిని పరిపూర్ణమైన మనిషిగా తీర్చిదిద్దుతుంది. ఆ పరిపూర్ణత కోసం మనిషి నిరంతరం శ్రమించాలి, ఆలోచించాలి. ఆ ఆలోచనే ప్రపంచాన్ని నడిపిస్తుంది. కానీ నేడీ ఆలోచనా తత్పరత మనదేశంలో సుప్తావస్థలో ఉన్నట్లుంది. దానిని నిద్ర లేపి ప్రజలను జాగృత పరచి, చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి. భయం అనేది మానవ సంఘాభివృద్ధికి నిరోధకం. అది 'చురుకు పాలకు పిరికి మందు'. ఇంతటి సంపన్నమైన భారత దేశాన్ని విదేశీయులుకు అప్పగించేలా చేసింది ఆ భయమే. ఆ భయాన్ని ప్రజలందరూ విడనాడి పరాక్రమాన్ని అలవరచుకోవాలి. ప్రతి ఒక్కరు 'నాలాంటి మానవులకి నేనెందుకు లొంగి పనిచేయాలి, వ్యర్థంగా నేనెందుకు ఈ దారిద్రాన్ని అనుభవించాలి. నాలాంటి వాళ్ళు మేడల్లో ఉంటూ జీవితం సాగిస్తుంటే నేనెందుకు ఈ పూరి గుడిసెలో జీవించాలి' అంటూ తమను తామే ప్రశ్నించుకోవాలి. ఈ ప్రశ్నలు ఎప్పుడైతే మనిషి మనసులో మొదలౌతాయో అప్పుడు పేద ప్రజల గుండెల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలనే ఆకాంక్ష, కోరికలు బయలుదేరుతాయి. ఆ కోరికే పురుష ప్రయత్నానికి పురికొల్పి చివరకు సమసమాజ నిర్మాణానికి బాటలు వేస్తుంది అంటాడు.

మరోచోట ప్రపంచమంతా ఒకే రీతిలో ఉండాలన్నది ప్రకృతి ఆశయం. కానీ సంఘం కొందరు స్వార్థపరుల పక్షం వహించి ప్రకృతి ఆశయాన్ని అథ:పాతాళానికి తొక్కేస్తుంది. నిజానికి సంఘం ఒక్కటేకాదు మన పెద్దలూ - పాలకులూ కూడా మన అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. చిన్నతనం నుండే వాళ్ళు తమ పిల్లలకు ' నాయనా నీవు పాలేరుకు పుట్టావు. కామందు ఏమి చెప్పితే అది చేయాలి. ఎదిరిస్తే పాపం' అని నేర్పిస్తారు. అదే ఆ పిల్లలకు చదువుగా మారుతుంది. కామందుల ఇళ్లలో దూడలని కట్టేయడం, పాలు పితకడం, గడ్డి వేయడం, దూడలను పాలకు విడిచిపెట్టడం, ఇంట్లో కామందు రాలికి పనుల్లో సాయం చేయడం వంటి పనులు ఆ పిల్లలకు రోజువారి జీవనమౌతాయి. ఇవన్నీ సాంఘికాంతరాలే. ఈ సాంఘికాంతరాలు మాకు గిట్టవు. ఒకళ్ళ కింద మేము చాకిరీ చేయలేమని ఎదిరించిన తక్షణమే ఈ కులతత్వాలు, సాంఘికాంతరాలు మాయమైపోతాయి. అంటూ నిరుపేద బతుకుల్లో స్వేచ్ఛా కాంక్షకు బీజాలను వేయడానికి రచయిత ప్రయత్నిస్తాడు.

ఒకప్పుడు గ్రామీణులు కర్మసిద్ధాంతాన్ని నమ్ముకుని జీవితం సాగించేవారు. కానీ నేడు వాళ్ళు ఏ శక్తి ప్రపంచానికంతటికీ జీవనాధరమౌతుందో ఆ శక్తికి తామే దోహదకారులమని గ్రహించారు. అవిద్యే తమ దుస్థితికి మూలకారణమని తెలుసుకున్నారు. తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు. పల్లెటూర్లలో విప్లవ శక్తి పుట్టింది. అది లోలోపల అగ్ని పర్వతంలా రగిలిపోతుంది. ఎప్పుడో ఒకప్పుడు అది పేలక తప్పదు అంటూ పల్లె ప్రజల్లో వస్తున్న మార్పును రచయిత ముక్త కంఠంతో ప్రస్తావిస్తాడు. ఇది కూడా రచయిత యొక్క సమసమాజ కాంక్ష తార్కాణంగా నిలుస్తుంది.

మరొక సందర్భంలో సర్వసమత్వభావన స్నేహంలో ఉంది. నేడు కాలేజీలలో, స్కూల్లలో పేదలు, ధనికలు అనే భేదాలు లేకుండా కులమతాలకు అతీతంగా అందరూ కలిసి చదువుకుంటున్నారు. స్నేహ భావంతో మెలుగుతున్నారు. కానీ ఈ స్నేహభావం కాలేజీ వెలుపల ఎందుకు ఉండటం లేదు. అది విశ్వవ్యాప్తం ఎందుకు కాదు. సమత్వాన్ని సాధించడానికి మారణ విప్లవ మెందుకు. శాంతి విప్లవం చాలదా?, ముందు ప్రపంచా నంతటిని ఒకే స్నేహదృష్టితో చూచే గుణం సంఘానికి అలవడాలి. అప్పుడు గానీ సమసమాజ స్థాపన సుసాధ్యం కాదు అంటూ రచయిత జానపదుని నోట పలికిస్తాడు.

నేడు సమాజంలోని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు అమలుచేసినా, ఎన్ని బందో బస్తులు చేసినా - ఎన్ని రక్షణ విధానాలు అమల్లో పెట్టినా, దొంగతనాలు ఆగకపోవ డానికీ 'క్రైమ్' అనేది తగ్గకపోవడానికి కారణం కూడా ఈ అసమత్వభావనే. ఈ క్రైమ్‌ను నియంత్రించాలన్నా కూడా సంఘాన్ని ఆమూలాగ్రం సంస్కరించాల్సిన ఆవశ్యకత ఉంది. సంఘాన్ని సంస్కరించకుండా ఎన్ని కొత్త చట్టాలు తెచ్చినా, ఎన్ని కొత్త బందిఖానాలు ఏర్పాటు చేసినా ఏ ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వాస్తవాన్ని పరిశీలించి నట్లైతే దొంగలు అంటే వేరెవరో కాదు. సంఘ దౌర్జన్యాలను ఎదిరించే విప్లవకారులు. న్యాయానికి సంఘంలో స్థానం లేదని గ్రహించి అసమత్వాన్ని బహిరంగంగా ఎదిరించడానికి జంకి, వేరే మార్గాలు పట్టిన సంఘీయులు. వీరందరి కడుపులకు తిండి దొరికితే దొంగలనే మాటే సమాజంలో ఉండదు. అప్పుడు సమాజం స్వేచ్ఛా స్వర్గమౌతుంది. తద్వారా సమత్వం దానికదే సిద్ధిస్తుంది అంటాడు

ఇలా రచయిత బోయి భీమన్న అనేక సందర్భాలలో సమసమాజ కాంక్షను, నిరుపేదలు సమసమాజాన్ని సాధించుకోవలసిన ఆవశ్యకతను, ప్రభుత్వాలు సమ సమాజ నిర్మాణానికి చేపట్టవలసిన చర్యలను ఈ జానపదుని జాబులద్వారా వివరిస్తాడు.

ఆధార గ్రంథాలు :

1. జానపదుని జాబులు - బోయి భీమన్న
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - బోయి భీమన్న సమగ్ర సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆచార్య. ఆరుద్ర
4. మోక్షం నా జన్మ హక్కు - బోయి భీమన్న, సాహితీనిధి ప్రచురణలు
5. ధర్మం కోసం పోరాటం - బోయి భీమన్న

❁❁❁

బోయి భీమన్న కవిత్వం - వస్తు వైవిధ్యం

- ఆర్. లక్ష్మి ప్రసన్న కుమార్, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రముఖ కవి. మారుమూల పల్లెలో పాలేరు ఇంట పుట్టి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మ విభూషణతో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవప్రదమైన సన్మానాలు అందుకున్న కవితా ఉద్ధండుడు. వీరు నాటకాలు, గేయ కవిత్వం, వచన కవిత్వం వ్రాశాడు. అయితే ''ప్రక్రియల అన్నిటిలోనూ తనకు పద్యం అంటేనే ఎక్కువ ప్రీతి'' అని అంటారు. పద్యం ఒక సుందర శిల్పమని ఆయన అభిప్రాయం. పద్య కళ క్షీణించి పోతున్నదని బాధ కూడా భీమన్నకు ఉంది. ఆయన సాహిత్య సృజన ప్రారంభం కూడా పద్యంతోనే ఆరంభమైంది. ఆ తర్వాత భీమన్న గేయాన్ని బాగా ఇష్టపడ్డాడు. పైరు పాట, బొమ్మ, వంటి గేయ కావ్యాలు ఎన్నో వ్రాశారు. అంతేకాకుండా అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ పలు రచనలు రాశారు. వీరి కలం నుండి జాలువారిన ''జయ జయ జయ అంబేద్కర!'' అనే గేయం దళితులకు జాతీయ గేయమై నేటికీ ఊరూరా ప్రార్థన గీతంగా మార్మోగుతుంది.

వీరి రచనా ప్రక్రియలను బట్టి పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కావ్యాలుగా వర్గీకరించవచ్చు. వీరి కవిత్వంలోని వస్తు దృక్పథాలను బట్టి వర్గీకరించి పరిశీలించడం జరిగింది. ఆ విధంగా చూసినప్పుడు భీమన్న కవిత్వాన్ని స్థూలంగా 1.పౌరాణికం 2.ప్రేమ 3.జాతీయోద్యమం 4.జన జీవితం 5.దళిత చైతన్యం అని వర్గీకరించవచ్చు. వీరి కవిత్వంలోని వస్తు వైవిధ్యాన్ని తెలియజేయడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

పౌరాణికం :

పౌరాణిక ఇతివృత్తాలతో నాటకాలు వ్రాసినట్లుగానే కావ్యాలు కూడా వ్రాసారు భీమన్న. అశోక వనిలో రాముడు (1969) మణిమానసం (1972) ఆ కోవలోవి. ఈ కావ్యాలకు మూలం భీమన్న భావుక శక్తి. అశోకవనంలో రాముడు కావ్యాన్ని ఆయన సాంఘిక సంక్షేమ శాఖామంత్రి దాసరి పెరుమాళ్ళు గారికి అంకితం ఇచ్చారు. రావణ వధ అనంతరం ఆ రాత్రి రాముడు ఎవరికీ తెలియకుండా ఒంటరిగా సీతను రావణుడు చెరలో ఉంచిన అశోక వనానికి వెళ్లినట్లు చేసిన కల్పన దగ్గర ఈ కావ్యం ప్రారంభం అవుతుంది. సీతను అప్పటికే చెర విడిపించి సుగ్రీవుని సైనిక స్థావరానికి చేర్చటం జరిగింది. రాముడు అక్కడకు ఎందుకు వెళ్లినట్లు? 'సీత చెరబడి కుందిన తావు' ఎటు వంటిదో చూడకుండా పోవటం ఎట్లా అన్న మానుషత్వ లక్షణం వల్ల కావచ్చు. ఆమెకు నిలువ నీడనిచ్చిన అశోక వృక్షాన్ని చూసి తీరాలన్న సున్నిత హృదయ సంస్పందన వల్ల కావచ్చు. వెళ్లి ఏమి చేసాడు? సీతను చూసిన చెట్లూ, వస్తు జాలం అతనిని ఆహ్వానించి ఆమెతో, ఆమెకు తోడుగా తాము ఉన్న నంగతి చెప్పాయి. సీతను గురించి చెప్పాయి. ఆ ప్రకృతిలో ఒక్కడే తిరుగుతూ రకరకాల జ్ఞాపకాలతో భావాలతో, బాధలతో సతమతమై కన్నీరు కారుస్తూ ఆత్మగతమైన తాదాత్మ్యం పొందటం ఇందులో విషయం. 122 పద్యాలలో ఆధునిక భావ కావ్యం వలే సాగుతుంది ఈ కావ్యం.

భాగవతంలోని శ్యమంతకమణిని మానవ హృదయం గల ప్రేయసిగా ఊహించి వ్రాసిన కావ్యం మణిమానసం. భాగవత కథ ప్రకారం సత్రాజిత్తు వద్ద ఉన్న విలువైన శ్యమంతకమణి సత్యభామతో పాటు కృష్ణుడి సొమ్మయింది. శ్యమంతకమణి వట్టి పదార్థం అనుకుంటాం కానీ దానికి మనసు ఉన్నదని, సత్యవలెనే అది కూడా

కృష్ణుడి పట్ల మనసు పడ్డదని తన ప్రేమను ఆయన గుర్తించలేదని మూగవేదన పడిందని ఈ కావ్యకథను నడిపాడు భీమన్న. ఇందులో పద్యాలు 123.

ప్రేమ :

ప్రేమ భీమన్నకు చాలా ఇష్టమైన వస్తువు. ప్రేమ ప్రకృతి ప్రేమ, స్త్రీపురుష ప్రేమ రెండూ. స్త్రీపురుష ఆకర్షణ, అనురాగం ఆయనకు నిరంతర చింతనా విషయం. ఆ ప్రాతిపదిక మీదనే రసాద్వైతం అనే సొంత ఆధ్యాత్మిక సిద్ధాంతం కూడా చేసారు. ప్రేమ భీమన్నకు చాలా ఇష్టమైన వస్తువు. ప్రేమ ప్రకృతి ప్రేమ, స్త్రీపురుష ప్రేమ రెండూ. స్త్రీపురుష ఆకర్షణ, అనురాగం ఆయనకు నిరంతర చింతనా విషయం. ఆ ప్రాతిపదిక మీదనే రసాద్వైతం అనే సొంత ఆధ్యాత్మిక సిద్ధాంతం కూడా చేసాడు. అదే ఆనంద మార్గం అని చెప్పాడు. ప్రేమ వివాహానికి దారి తీయవచ్చు, లేక వివాహమే ప్రేమకు దోహదకారి కావచ్చు, సాంఘిక వైరస్యాల వల్ల భౌతికమైన ఏ సంబంధానికి వీలులేకపోవచ్చు. అయినా ఆత్మాను బంధం మాత్రం తెగిపోకూడదు అన్నది ఆయన వాంఛ. రాసాద్వైతం వలెనే ఆయన తను వ్రాసే ప్రేమగీతాలకు 'రాభీలు' అని పేరుపెట్టుకొనటం కూడా గమనించవచ్చు. ప్రకృతిలో రెండు ప్రవృత్తులు ఉన్నాయని, అందులో ఒకటి స్త్రీ సహజమైన రామము (సౌందర్యం). రెండవది పురుష సహజమైన భీమము (భయానకం) ఈ రెండు శక్తుల సంసార విన్యాసమే పూర్ణ ప్రకృతి వాటి సంయోగ వియోగాలే సుఖ దుఃఖాలు అని వివరణ కూడా ఇచ్చాడు (రాభీలు, ముందుమాట 1971). రాగోదయం (1954)తో మొదలుపెట్టి ఆ మార్గంలో మధుగీత (1957), రాగవైశాఖి (1965), రాభీలు (1971), బొమ్మ (1974) మొదలై కావ్యాలు వెలువరించాడు.

రాగోదయం గేయకావ్యం :

1954లో మొదటిసారి దేశి కవితా మండలి ప్రచురణగా వచ్చింది. అప్పుడపుడు వివిధ శీర్షికలతో వ్రాస్తూ వచ్చిన 39 ఖండికల సంపుటిది. ఇందులో ఖండికలన్నీ భావగీతాలు, ప్రేమమగీతాలు. విప్రలంభ శృంగారం అంటే నాయిక ఎడబాటులో నాయకుని విరహ వేదనా గీతాలివి. ప్రత్యూషం అనే శీర్షికతో ముందుమాట వ్రాసిన తిరుమల రామచంద్ర దీనిని 'ఛాయావాద రహస్యవాదాల సువాసనలు గుబాళించే కావ్యఖండికల కదంబం' అన్నాడు.' ఏ కవైనా జీవ సహజమైన శృంగార రసరాజాన్ని ఆరాధించటం అసహజమేమీ కాదని కూడా అంటాడు.

మధుగీత :

1957లో తొలి ప్రచురణ. సాహితీ పరులు, చిత్ర కారులు, ఉదార హృదయులు అయిన శేషు బాలకృష్ణ దంపతులకు అంకితమిచ్చారు. ప్రకృతి ప్రేమ, స్త్రీ పురుష ప్రేమ, మానవ ప్రేమ ఈ మూడూ కేంద్రంగా వచ్చిన కవిత్వం ఇది. బ్రతుకు అంటే రాజకీయాలు కాదు ప్రేమ అని భీమన్న భావన. ప్రియుడు ప్రియురాలిని ఉద్దేశించి వ్యక్తంచేసిన భావోద్వేగాల తీవ్రత ఈ కవిత్వంలో ప్రధానం. "హృదయములు రెండు, మనసులు రెండు, రెండు / కాయములు కూడ అద్దాల కరణి నొకట / నొకటి స్వచ్ఛమై ప్రతిఫలించుకొనవలయు /ఒకటి నొకటి విభిన్నత నొందరాదు" అని అద్వైతాన్ని ప్రతిపాదిస్తాడు. "స్వేచ్ఛ జీవ స్వభావము, స్వేచ్ఛ కొరకు / పెనుగులాడును జీవి దానణచబడిన" అని స్వేచ్ఛను ఒక విలువగా పేర్కొంటాడు. భావుకత్వపు అంచులు తాకిన ఒరవడిలో నిన్న నేడూ లేదు పొమ్మంటాడు భీమన్న. నేడు ఏది సుఖదాయకమో దానిని చేయటమే విధాయకం అంటాడు. రాగోదయం లోనూ "నిన్నతో పని లేదు / నేడు ప్రశ్నే కాదు" అని ఈ భావాన్నే ప్రతిపాదించటం గమనించవచ్చు.

రాగవైశాఖి :

1965లో అచ్చయినా రచన 1960 లోనే ప్రారంభ మైంది. ఒక అమ్మాయి ఒక అబ్బాయి ఏదో సందర్భంలో కలుసుకున్నారు. ఒకళ్లపట్ల ఒకళ్లకు ఇష్టం ఏర్పడింది. తరచు కలుసుకొనడం, ఇష్టం ప్రణయంగా మారి లేఖలు

వ్రాసుకొనటం ఇందులో విషయం. రసభావైక లేఖలు ఇవి. శృంగార లేఖా కావ్యం అని ఈ కావ్యానికి ఉప శీర్షిక. పద్యాలు, గేయాలు అక్కడక్కడ వున్నా ప్రధానంగా ఇది వచన కావ్యం. పది అధ్యయాలు ఉన్నాయి. ప్రేయసీ ప్రియులు ఆలంబనగా వ్రాసిన 310 గేయాల సంపుటి రాభీలు. ప్రేయసీ ప్రియులలో ఎవరో ఒకరు మరొకరిని ఉద్దేశించి అంటున్నట్లుగా వుండే ఈ గేయాల సంపుటిని 1971లో భీమన్న షష్ఠి పూర్తి సందర్భంగా సన్మాన సంఘం వారు ప్రచురించారు.

బొమ్మ గేయకావ్య రచనాకాలం 1952. 1962 నుండి అచ్చువేయటానికి జరిగిన ప్రయత్నాలు 1975 నాటికిగానీ సాకారం కాలేదు.అయినా రచనాకాలం నుండే ఇవి వివిధ సభలలో భీమన్న గానంతో సాహిత్య సమాజానికి సుపరిచితాలే. (బొమ్మ, ముందుమాట, బోయిభీమన్న సమగ్ర సాహిత్యం, గేయకావ్యాలు,2వ భాగం, 2009) కలిసి మెలిసి తిరిగిన స్త్రీపురుషులు ఒకరిపట్ల ఒకరికి కలిగిన ప్రేమను చెప్పుకోలేరు. అతను ఆమె ఫోటోను సంపాదించి దానితో ప్రేమ సంభాషణ సాగించే క్రమంలో సౌందర్యారాధకుడిగా ప్రారంభమై కవిగా మారి వేదాంతిగా పరిణితి చెందటం ఇందులో కథ.

జాతీయోద్యమం :

భీమన్న హృదయం ప్రేమ చుట్టూ పరిభ్రమిస్తే బుద్ధి జాతీయోద్యమం వైపు ప్రసరించింది. ఆయనకు ప్రకృతి, ప్రేయసి ఎంత ప్రేమ పాత్రమైనవో దేశం అంత కన్నా ఎక్కువ ప్రేమ పాత్రమైనది. వ్యక్తి స్వేచ్ఛను ఎంత ఆకాంక్షిస్తాడో సమిష్టి స్వాతంత్ర్యం కోసం అంత పరితపించాడు. ప్రకృతిలోనూ సాధారణ మానవప్రవృత్తిని అన్వేషిస్తాడు. ఆవిష్కరించి ఆనందిస్తాడు. అందువల్లనే ఆయన కావ్యాలు జాతీయోద్యమం నుండి జాతి జీవనం వరకు అనేకవిషయాలను పరామర్శిస్తాయి.

మధుబాల కావ్యం చూద్దాం. 1952లో ప్రచురించబడిన ఈ కావ్యం రచనా కాలం 1933. శృంగార కావ్యంగా మొదలై వీరరస కావ్యంగా ముగుస్తుంది. ఉప్పు సత్యాగ్రహ కాలం నేపధ్యంగా కథ ప్రవర్తిస్తుంది. వేకువనే లేచి వెళ్లిన మిత్రుడు సూర్యాస్తమయం అయినా రాలేదని అతనిని వెతుకుతూ అడవిలో చెట్లూ చేమల సంబోధిస్తూ తిరిగే ఒక వనకన్య చివరకు అతనిని ఒక మల్లికకల తీగలు అల్లుకున్న మంటపంలో చూడటం, మౌనంగావున్న అతనితో ఆమె తన వియోగ వ్యధను వినిపించటం, తాను వెళ్ళవలసిన సమయం వచ్చింది పోనిమ్మని, తనను మరిచిపొమ్మని అతను చెప్పటం, నేను ఆగిపోలేను, నిన్ను తీసుకుపోలేను అని అతడు నిస్సహాయతను ప్రకటించటం 185 పద్యాల వరకు ఇది విషయం. ప్రకృతి సౌందర్య సంబంధాలు, స్త్రీపురుష హృదయోద్వేగాలు విస్తృతంగా వర్ణించబడ్డాయి.

ఆ తరువాతి కథనం నాయకుడి చరిత్ర. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి తండ్రి మరణించాడు. ఆ వార్త విని తల్లి మరణించింది. ఆమె మీద బెంగతో చెల్లెలు తమ్ముడు కూడా నశించిపోయారు. అతను సేవాగ్రామంలో ఉన్న మహాత్ముని ఆదరాణాభిమానాలు పొంది సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నాడు. నాయకులందరూ జైళ్లపాలయి సత్యాగ్రహం అపజయం పాలయిందని అందరూ బాధపడుతుంటే హింసను హింస తోనే ఎదుర్కొనాలని విప్లవమార్గం పట్టి, ప్రభుత్వానికి పట్టుబడి చెరసాల పాలై అక్కడినుండి తప్పించుకొని అడవులలో తిరుగుతూ వన కన్యను చూసి స్నేహం చేశానని, ఇక తాను ఆ తావు వదిలి వెళ్లకపోతే ఆమెకు కూడా అపాయమే అని చెప్పి సెలవు తీసుకొనే ప్రయత్నం చేసాడు. అతని ఆదర్శాన్ని ఆమె ప్రస్తుతించటం ఇలా సాగిన కథ ఆమె ''ఎందుకోయీ సఖా! ఈ గూఢ జీవితము? మాతృదేవీ పాదార్చనమునకు / కల్పింపు మొక మంచి కార్యక్రమమ్ము / ఇరువురమును నిర్వహింతము దాని'' అనటంతో ఒక ఘట్టానికి చేరుతుంది.

ఆ తరువాత ఇద్దరూ కలిసి సమీపంలోని కోయగూడానికి పోవటం, అక్కడ మహాత్ముని తేజస్సు మూర్తిగొన్న ఒక యోగి ఎదురుపడి వాళ్ళను ఒక గుహలోకి

తీసుకొనివెళ్ళి పరపీడన, పారతంత్ర్యం, దారిద్ర్యం లోకంలోని సమస్యలని చెప్పి దానికి మందు సర్వోదయ సమాజ స్థాపనం అని చెప్పి మహాత్ముడు కన్న ఆ కలను సార్ధకం చేయమని వాళ్లకు ప్రబోధించాడు. పల్లె పల్లెకు బోయి ప్రజలకు స్వాతంత్ర్య దీక్ష నివ్వటానికి వాళ్ళు బద్ధకంకణులు కావటంతో ఈ కావ్యం ముగుస్తుంది. ''ఎవ్వరొ సంగుదురెవ్వరు కొందు/ రే బాల? స్వాతంత్ర్య మెవ్వరి సొమ్ము?/తనుదాన గుర్తించుకొనుట స్వాతంత్ర్య/ మాత్మ విశ్వాసమే అభ్యుదయమ్ము'' అన్న తాత్విక సందేశం ఇస్తుంది ఈ కావ్యం. ప్రేమకథా చట్రంలో జాతీయోద్యమ ఘట్టాల చిత్రణ ఇందులో విశేషం.

ప్రకృతిలో మానవ ప్రకృతి కావ్యంలో దానితో పాటు ప్రణయపారమ్యం, ఆగస్టు విప్లవము అనే మరో రెండు దీర్ఘ కావ్యఖండికలు ఉన్నాయి. 1963లో ప్రచురించ బడిన ఈ ఖండకావ్య సంపుటిని భీమన్న నిడదవోలు వెంకటరావుకు అంకితమిచ్చాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆకాశాన తిరిగే విమానం సముద్రంలోని నౌకపై బాంబు వేయటం, సబ్మెరైన్ విడిచిన శతఘ్నికి విమానం సముద్రంలో కూలటం దగ్గర ప్రణయ పారమ్యంలో కథ మొదలవుతుంది. మునిగిన విమానపు రెక్క మీద గాయపడిన వైమానికుడిని చూసిన జలాం తర్గామి నావికుడు చికిత్స చేస్తాననటం అతను నిరాకరిం చటం, ఈ లోగా నౌక మీద మరొక బాంబు పడటం, నౌక చిల్లుపడి మునిగి పోతుండగా నావికుడు వైమాని కుడిని కాపాడటానికి ప్రయత్నించటం ఈ క్రమంలో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ కావ్యా కథా విషయం. ఇద్దరూ ప్రేమలో భంగపడి సైన్యంలో చేరిన వాళ్ళే.

వాళ్లలో ఒక యువకుడు ఆగస్టు విప్లవం, క్విట్ ఇండియా ఉద్యమం తరువాత కాంగ్రెస్ వాళ్ళందరూ జైలుపాలు కాగా 'సైన్యమ్ముతో దాని సాధింప బూని జపాను వారితో చేరిన నేతాజీ' ఫౌజులో చేరి ఆంధ్ర సముద్రం లో అగుపించే ప్రతిపక్ష నౌకలను ముంచే పని మీద నావికాదళంలో పనిచేస్తున్నవాడు. 'ప్రణయ హృత్పద్మమ్ము గనిపెట్టలేక / పద్మమందలి హంస బట్టుకోలేక / మానసమ్ము కలంచి మాయమై పోయిన స్నేహితుడి వియోగాన్ని భరించలేక ఆత్మహత్య చేసు కొందామనుకొని దేశం కోసం యుద్ధంలో చావటం ఉత్తమ మార్గం కదా అని ఆ పని మానుకొని మిలటరీ శిక్షణాలయంలో చేరి పైలెట్ వృత్తిలో ప్రావీణ్యం పొందినవాడు మరొక యువకుడు. నావికుడిని తనను తాను కాపాడుకొనమని కోరుతూ వాలిపోతున్న వైమాని కుడిని ఒడిలోకి తీసుకొని దుస్తులు వదులుచేసేసరికి మగవేషంలో ఉన్న స్త్రీ అని, తన పూర్వ ప్రేయసి అని అతనికి అర్థం అవుతుంది. ఇద్దరూ మరణించటం కావ్యం ముగింపు.

గాఢమైన ఆకర్షణ, ప్రేమను వ్యక్తం చేయలేని మొహమాటం, తదితర అనేక అవాంతరాల మధ్య విడిపోయిన యువతీయువకులు శత్రువులుగా కలుసుకొనడం, స్నేహితులుగా సంభాషించుకొనటం, ఒకరి ఒడిలో ఒకరు మరణించటం అసలు కథా సూత్రం. ఈ సూత్రాన్ని రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో స్వాతంత్ర్య సముపార్జనకు ఎన్నుకొనబడిన రెండు మార్గా లతో కలిపి చెప్పటం విశేషం. ఒకటి కాంగ్రెస్ మార్గం. రెండవది నేతాజీ మార్గం.

భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే షరత్తు మీద రెండవ ప్రపంచయుద్ధంలో బ్రిటన్‌కు మద్దతు ఇవ్వవచ్చని కాంగ్రెస్ తొలుత భావించింది. కానీ అందుకు అవకాశాలు కలిసి రాక యుద్ధానికి మద్దతును ఇవ్వమని ప్రకటిం చింది. యుద్ధవ్యతిరేక ప్రచార కార్యక్రమం కూడా తీసుకున్నది. అయితే అది వ్యక్తి సత్యాగ్రహ రూపంలో అతి బలహీన కార్యక్రమంగా మారిందని విమర్శ వుంది. అయినా ఆ సమయంలో భారతదేశ యువత సైన్యంలోకి విస్తృతంగానే చేరింది. యువతి ఆ రకంగా చేరిన వాళ్లకు ప్రతినిధి అనుకోవచ్చు.

సుభాష్ చంద్రబోస్ రెండవ ప్రపంచయుద్ధంలో రెండు పక్షాలు సామ్రాజ్యవాద స్వభావంతోనే యుద్ధం చేస్తున్నాయి. కనుక బ్రిటన్‌తో కలిసి యుద్ధంలో పాల్గొనటం కాక బ్రిటన్ పై యుద్ధప్రకటనకు ఈ సందర్భాన్ని వాడుకోవాలని భావించాడు. జర్మనీ, జపాన్‌లతో చేతులు కలిపి బ్రిటిష్ ఇండియా పై దాడిచేయడం బ్రిటిష్ సైన్యంలోని భారతీయ సైనికులను కూడా ఆకర్షించి తనవైపు తిప్పుకొని అంతర్గత యుద్ధాన్ని ముమ్మరంచేయటం అతని లక్ష్యాలు. అందుకోసమే అతను భారత జాతీయ సైన్యాన్ని ఏర్పరచి నడిపించాడు. ఆ సైనికులకు ప్రతినిధి యువకుడు.

దళిత చైతన్యం :

గుడిసెలు కాలిపోతున్నై' (1973) కావ్యంలో ఏడాది కోసారి దళితుల గుడిసెలెందుకు కాలిపోతున్నాయో, మరలా కొత్తగుడిసెలు మాత్రమే ఎందుకు వస్తున్నాయో ఓట్ల కోసం వచ్చేవారిని నిలదీసే చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులకు, పాములను కుల దోపిడీదారులకు ప్రతీకలుగా చేసి దానిలో వర్ణించారు.

దళితుల మధ్య ఉండాల్సిన సమైక్యతను ప్రబోధిస్తారు. 'కూలిరాజు' (1946) నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడా స్పర్శించారు. 'ధర్మం కోసం పోరాటం'లో బహుజనులంతా రాజ్యాధికార దిశగా పయనించడానికి సూచనలు చేశారు. వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైనవాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు వ్రాసిన భారత, రామా యణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి - 1 - ఆచార్య అనుమండ్ల భూమయ్య
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి - 2 - ఆచార్య అనుమండ్ల భూమయ్య
3. గుడిసెలు కాలిపోతున్నై - బోయి భీమన్న
4. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు - శ్రీమతి హైమావతీ భీమన్న

బోయి భీమన్న పేరడీలు

– డా॥ జి. రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ - తెలుగు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు.

నేనేమి చేస్తే అది కళాఖండం
నేనేమి చెప్తే అది వేదం -

అన్న ఆత్మవిశ్వాసాన్ని జీవితంలోనూ, కవిత్వంలోనూ ప్రకటించిన ప్రజాకవి, లోకకవి బోయి భీమన్న. ఆంధ్ర దేశంలో హరిజనుల అభ్యుదయానికీ, ఆత్మగౌరవ ప్రకటనకు నిర్విరామ సాహిత్య కృషి చేసిన ప్రతిభావంతుడు భీమన్న.

బోయి భీమన్న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో నిరుపేద హరిజన పాలేర్ల కుటుంబంలో 1911 సెప్టెంబర్ 19న జన్మించారు. ఎన్ని కష్టాలు, బాధలు అనుభవించినా నిరంతరం నిత్య సంతోషంగా జీవించారు. అవమానాలను తుడిచేస్తూ, అభిమానాలను పదిలపరచుకుని, కులతత్వాన్ని ఎదిరించారు. అంటరానితనాన్ని, పేదరికాన్ని జీవితాంతం నిరసించారు. జీవించడం కోసం ఏ వృత్తిలో ఉన్నా సాహిత్యం ఊపిరిగా కవిత్వం ఆత్మగా కారణజన్ముడుగా జీవించాడు. బోయి భీమన్నకు ప్రకృతే తల్లి. పాఠాలన్నీ ఆమె వద్దనే నేర్చుకుని స్వయంకృషితో పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు.

భీమన్న బాల్యంలోనే గాంధీజీ సిద్ధాంతాలకు ప్రభావితుడై తన సాహిత్యానికి ఆయన భావాలనే తాత్విక భూమికగా స్వీకరించాడు. అంబేద్కర్ ప్రతిఘటన చైతన్యాన్ని గౌరవించారు. కులనిర్మూలనే తన కలానికి లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. నిమ్నజాతుల ఉద్ధరణ కోసం, సమసమాజ నిర్మాణం కోసం సాహిత్యాన్ని సాధనంగా మలచుకున్నారు.

తెలుగులో సాహిత్యంలో వీరు దాదాపు 75 గ్రంథాలకు పైగా రచించారు. ప్రస్తుత పత్రసమర్పణలో బోయి భీమన్న రాసిన 'చివరి మెట్టు మీద శివుడు' పేరడీల కవితా సంపుటిని పరిశీలించడమే ప్రధాన ఉద్దేశం.

బోయి భీమన్న గారు 'చివరిమెట్టు మీద శివుడు' అనే పేరడీ కవితా సంకలనాన్ని 1998 జనవరి 18 నుండి మే 18 వరకు ఈ నాల్గు నెలల వ్యవధిలో భీమన్నగారి జీవితానుభవాల్ని పేరడీలుగా రచించారు.

భారతదేశ 50 ఏళ్ళ స్వరాజ్యం అనే విషయంపై సభలు, సమావేశాలు, ఉత్సవాలు జరుగుతున్న కాలంలో (1988) హైదరాబాదులో ఒక సమావేశం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా భీమన్నగారు వెళ్ళాలి. ఆ సభకు వెళ్ళే ప్రయత్నంలో నిలబడి ప్యాంటు వేసుకుంటూ తూలిపోయాడు. ప్యాంటులో ఒక కాలు చిక్కుకుని ఉండడం వల్ల సదురుకోడానికి వీలు లేక అమాంతం కూలపడిపోయారు. తుంటి ప్రాంతం చుట్టూ నలిగిపోయింది. కమిలిపోయింది. ఆ తర్వాత ఆసుపత్రిలో చేరాడు. టెస్టులన్నీ చేశాక 3 వారాలు బెడ్ రెస్టు అవసరమని వైద్యులు తెలిపారు.

నిజానికి నేను ఆసుపత్రిలో ఉన్న నెలరోజుల పాటూ జరిగిన విశేషాలన్నీ చిత్రమైనట్టివీ, ఆసక్తి దాయకమైనట్టివీ, కొన్ని కొన్ని అపూర్వమైనట్టివీ వీటన్నిటినీ నా శైలిలో వ్రాయాలంటే ఒక్క చక్కని అవార్డు పొందగల నవలే అవుతుంది. ఒక యాభై, అరవై పేరడీలు ఒక చిన్న గ్రంథంగా ప్రచురించాలనుకొంటున్న స్థితిలో నాకీ ప్రమాదం జరగడం చాలా విచిత్రమనిపించింది. పేరడీల వరకూ గతానుభవాలే ఈ గ్రంథంలో కొత్త అనుభవాలు ఉండాలన్న నిర్ణయంతోనే విధి నన్నీ ఆస్పత్రికి పంపిందేమో అనిపించడంలో వింత ఏమీ లేదు. మానవ మనస్తత్వ ప్రవృత్తి ఇది. ఈ రచన వెనుక ఉన్న చరిత్రను పీఠికలో ప్రస్థావించారు.

బోయి భీమన్న ఆసుపత్రిలో వెల్లకిలా పడుకొని ఈ పేరడీ కావ్యాన్ని రచించాడు. మంచం మీద ఉన్నా విశ్రాంతి తీసుకోక కాగితాన్ని తీసుకొని పెన్సిల్ ముక్కతో పేరడీ కవితలు రాశారంట వీరికి సాహిత్యంపై ఎంతటి అభిమానమో తెలుస్తుంది. ఈ కవితలు రాసేటప్పుడు జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య గారి దైనందని ప్రోత్సాహం బాగా తోడ్పడిందని తెలిపారు. ఈ గ్రంథాన్ని తాను అంకితం తీసుకోగలననీ ముద్రణ ఖర్చుల విషయంలో బెంగ పెట్టుకోవద్దనీ డా॥ ఎస్.ఎన్. బూసి అన్నారనీ వీరిద్దరి ప్రోత్సాహంతోనే రాసిన ప్రతీ కవిత అచ్చు అయ్యిందని భీమన్న వారికి కృతజ్ఞతల్ని పీఠికలో తెలిపారు.

జనవరి 18 నుండి మే 18 వరకు నాల్గు నెలల బెడ్‌రెస్టు జీవితాన్ని ఒక చట్రంలో బిగించి, ఈ గ్రంథం లోని అనుభవాలను ఆనాలుగు నెలలకే పరిమితం చేశాను. ఈ కావ్య సంపుటికి మొదట "నాల్గు నెలల నా వర్తమానం" అనే పేరు పెట్టాలనుకన్నారు. కానీ చివరి నిమిషంలో ఆశీర్షికను కొట్టేసి "చివరి మెట్టు మీది శివుడు" శీర్షికతో గ్రంథాన్ని 1998లో ప్రకటించారు. ఈ సంపుటిలో 309 పద్యాలు, గేయాలు ఉన్నాయి. ప్రతీ కవితకూ ఒక్కో కథ ఉంది.

పేరడీ అంటే ఏమిటో కూడా భీమన్న గారు తెలిపారు. పేరడీ అనేది ఆంగ్ల పదం. ప్రసిద్ధమైన ఒక పూర్వ రచనను ఆక్షేపించే రచన. వక్రానుకరణను కూడా పేరడీ అనవచ్చు. ఒక ప్రసిద్ధ రచయిత రచనకు వంకపెట్టి వెక్కిరించడం పేరడీ. పులిని చూచి నక్క వాతలు పెట్టుకోవడం పేరడీయే. తెల్లదొరతనానికి నల్లదొరతనం ఒక గుడ్డి అనుకరణ ఒక పేరడి. అనువాదాలు పేడీలు కావు. అనుకరణలు మాత్రం నిజంగా పేరడీలే. ఒక మహాపురాణం లోని కథలను తీసుకొని కావ్యాలుగా వ్రాయడం పేరడీలు కావు. అందరి భావాలను దొంగిలిస్తే అవి పేరడీలు. ప్రజాస్వామికంలో వ్యక్తి ఆరాధన ఒక నికృష్టమైన పేరడీ. వ్యక్తుల పేర్లతో వెలసిన రాజకీయ పార్టీలన్నీ పేరడీలే. ప్రతిభను అవమానించి పైరవీ సింహాసనమెక్కి దోచుకొనే స్వార్థ విజయాలన్నీ పేరడీలే. ప్రజాస్వామ్య ఎన్నికలలోని విజయాలకు రిగ్గింగులు పేరడీలు అని పేరడీ ప్రక్రియకు సరికొత్త నిర్వచనాల్ని యిచ్చారు.

బమ్మెర పోతన, కృష్ణశాస్త్రి, వేమన, కవిచౌడప్ప, రామదాసు, సినీగీతాలు, శ్రీశ్రీ కవితలు, రాయప్రోలు, గరిమెళ్ళ సత్యనారాయణ, కుసుమ ధర్మన్న గేయాలకు, అన్నమయ్య, త్యాగరాజకృతులకు, భీమన్న శతకానికి మొదలైన పద్యాలకు, గేయాలకు పాటలకు పేరడీలు రాశారు. ఈ కవితా సంపుటిని జాతిరత్న డా॥ ఎస్.ఎన్. బూసి గారికి అంకితం ఇచ్చారు.

బోయి భీమన్నగారి తొలిపేరడీ దేవులపల్లి కృష్ణశాస్త్రి "కన్నీరు మున్నీరుగా ఏడ్వనీరు నన్ను" కవితను ఆక్షేపిస్తూ రాసిన పేరడీ.

ఏడుపే నీకు ముఖ్యమవునేని తండ్రి / వెక్కి వెక్కి ఎంతో ఏడ్చి వేయగలను
కాని, మగటిమి చచ్చి నీకాళ్ళను బడి / సేవ చేయు మటన్ననే చేయలేను"

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి శైలి, భావుకత, గాన సరళి భీమన్నగారికి నచ్చేవి. కాని ఆయనలోని విషాదం, ఏడుపు, భక్తి ప్రదర్శనలోని కౌటిల్యం నచ్చేవి కావని పీఠికలో భీమన్న తెలిపారు.

బోయిభీమన్న తన పేరడీలలో తన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు.

నా పేరడీలు కాల / క్షేప బఠానీలు, ఇవియె చివరివి, ఇక మీ
కీ పంటవి దొరకవు ఇవి / గోపట్టుడు, నములుకొలది క్రొంజవులూరన్!

'ఎక్కడమ్మా చంద్రుడు' అనే సినిమా పాటకు 'ఎవ్వడమ్మా దళితుడనే పేరడీ ద్వారా బోయి భీమన్న దళితుల మూలాలను తెలిపారు.

ఎవ్వడమ్మా దళితుడు/ ఎందులోన దళితుడు?
వేద విభజన చేసెనొకడు / రామచరితము వ్రాసె నొకడు

మానవేంద్రునె కొనియె నొకడు / ఇంద్ర సుతు భీకొట్టెనొకడు
శంకరుని కద్వైత మొనగిన / చండ దేవుడు దళితుడా?
సర్వములకురూపము ఘటించిన / హరిజనాఖ్యుడు దళితుడా?
విశ్వజననికె జనకుడ్తై, తన / వీణ నిడిన మతంగుడెవ్వడు?
ఆది జాంబవుడెవ్వడు? / వేదకారకుడెవ్వడు?
భారతరాజ్యాంగ మిచ్చిన / బాబా సాహెబు దళితుడా?
కె.ఆర్. నారాయణ దళితుడా? / బాలయోగి దళితుడా?

అంటూ ఆలోచింపజేశాడు.

నందితిమ్మన 'పారిజతాపహరణం' లోని 'జలజాతాసన వాసవాది' పద్యానికి భీమన్న రాసిన పేరడీ మత్తుకు బానిసలైన భర్తలు, ఆ బాధల్ని భరించలేని భార్యల తిరుగుబాటుని తెలుపుతుంది.

జలజాతాసన వాసవాది సురభోజ్యంబై మజాగొల్పు సో
మలతాసారము గ్రోలి, చాలక గుడంబాత్రాగి ఇల్జేర - రో
కలి బండన్ గొని మొత్తె పత్ని, అదె నిక్కంబైన ధర్మంబు! మూ
ర్ఖులు దుష్కర్మలుచేయ ఊరక సతుల్ కూర్చుందురే ఏడ్చుచున్! (371)

హరప్పా, మొహంజోదారో కాలం నాటి మత్తు పానీయం పేరు సోమలతా. దీన్ని తాగి చాలక గుడుంబా తాగి ఇళ్ళు చేరిన భర్తను భార్య సహించక బండ తీసుకుని కొట్టిందట. ఇది నిజమే, ధర్మమే. మూర్ఖులు చెడు ప్రవర్తనకు బానిసలవుతున్న వారిని చూస్తూ స్త్రీలు ఉండరు కదా అనే పేరడీని చక్కని భావంతో తెలిపాడు భీమన్న.

'తుది బాల్యం' పద్యంలో తన బాల్యాన్ని రెండు విధాలుగా వర్ణించాడు. తన చిన్నతనాన్ని శైశవ దశగా, ప్రస్తుతం ఆసుపత్రి బెడ్ మీద ఏమీ చేయలేని పరిస్థితిని తుదిబాల్యంగా చెబుతూ ఆ సమయాన్ని ఎలాగడపాలి అనే ఆలోచన నుండి పుట్టిందీ పద్యం.

"ఒడలు తెలియకుండ వెడలె శైశవమెల్ల / తెలివి వచ్చుసరికి తెల్లవారె!
ఎట్లు గడుచు ఇపుడు ఈతుదిబాల్యమ్ము / కలదు గాని తెలివి, కదల దొడలు (375)

దేశ ప్రజల్లోని దుర్బలాలను ఎత్తి చూపుతూ పాత కొత్త తరాల మధ్య అంతరాన్ని వందేమాతరం గేయానికి 'వందే మీతరం' అనే పేరడీ రాశారు భీమన్నగారు.

'వందే మీతరం / మందే ఈ తరం
దాస్య భారతం మీతరం / స్వతంత్ర భారత్ మాతరం
సుజాలం సుఫలాం మీతరం / విఫలాం విరసాం మాతరం ॥వం॥

ధూమజ్యోత్స్నా కలుషితయామినీ / దోమల బాధా పీడిత జీవనీం
క్షుధార్తినీం స్వకుక్ష మాత్రిణీం / రౌడీంగూడాం దోపిడీం మాతరం ॥వం॥

నూరుకోట్ల దుర్వీర్యమూర్ఖ దుర్బలే / కోటికోట్ల రూపాయలు స్వాహాదుర్వ్యయే
మెరిట్ నిషేధే క్రెడిట్ నిషాదే / అసమర్థ నరనారీ మాతే గతే ఖ్యాతే మాతరం ॥వం॥ (380)

దేశంలో పాతుకుపోయిన కులతత్వాన్ని గురించి రాయప్రోలు సుబ్బారావు గారి 'ఏ దేశమేగినా' గేయానికి భీమన్న రాసిన పేరడీ ఆలోచింపజేస్తుంది.

"ఏ దేశేమేగినా ఎందు కాలినా / పొగడరా నీ తల్లి భూమి భారతిని
లేదురా మనకున్న కులగజ్జి యెందు / లేదురా మన వంటి బాంచలింకెందు"

సొంతగోవుల నంట రాదంచు గెంటేసి / పొంత పులులను గోకి ముద్దు చేయుననీ
మా తాటి చెట్లను మంటలకు పారేసి / స్కాచి సారాత్రాగి బ్రతుకు చుండిన దీనీ (386)

భీమన్న (శ్రీశ్రీ కవిత) 'ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అనే శ్రీశ్రీ గేయానికి

ఏ గవర్నమెంటాస్పత్రి కెళ్ళినా ఏమున్నది గర్వకారణం?
పేరున్న ప్రతి డాక్టరూ / ఇంటికి రమ్మనే వాడే
సొంత క్లినిక్కులున్నవాడే
ఏ ప్రభుత్వ ఆఫీసు కెళ్ళినా / ఏమున్నది గర్వకారణం
ప్రతి ఉద్యోగీ తన ఉద్యోగాన్ని / డబ్బిచ్చి కొనుకున్నవాడే
తన బిడ్డలకూ కొనివ్వ వలసినవాడే!
ఏ సర్కోలీస్కూలు కెళ్ళినా / ఏమున్నది గర్వకారణం?
పరపతిగల ప్రతి టీచరూ / స్కూటర్లెక్కి తిరిగేవాడే
సొంత పనులు చేసుకొనేవాడే!

అంటూ ప్రభుత్వ ఆసుపత్రుల్ని, ప్రభుత్వ ఆఫీసుల్ని వారి ఉద్యోగాల్ని, ప్రభుత్వ స్కూళ్ళనీ వారి సొంత పనుల్ని గురించి ఆక్షేపించాడు.

నేటి షుగరు వ్యాధిగ్రస్థుల గురించి భీమన్న

గుడ్డు ముట్టరాదు, లడ్డూలూ తినరాదు / నోటబెట్టరాదు నూనెపంట!
సుఖములేని వెతలు, సుగరున్న బ్రతుకులు / వేలుబ్రతుకున్న మృతియె, భీమా (464)

సుఖంలేని ఈ షుగరు జీవితం కంటే మేలైనది మృతియె గొప్పదంటాడు.

దళితుల పట్ల చూపే అంటరానితనాన్ని, అస్పృశ్యతను అనాటి కులతత్వాన్ని చాలా సరళంగా 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అనే దేశభక్తి గేయానికి 'మా భరతమాతకు మల్లెపూదండ' అనే పేరడీని రాశారు భీమన్న గారు.

భగవంతుని దర్శనాల్లోని భేదభావాల్ని, ప్రజలకు ధనంపై ఉన్న మోహాన్ని, దేశంలో పెరిగిపోతున్న నల్లధనాన్ని గురించి 'నీకొండకు నీవే రప్పించుకో అనే పాటకు' 'నీ కొండను నీవే రక్షించుకో' అని తిరుమల స్వామికి తన పేరేడీ ద్వారా భీమన్నగారు సలహానిచ్చారు.

ముగింపు :

తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న రచనలు విశిష్టమైనవి. వీరు రచించిన ప్రతి రచన తన జీవిత అనుభవాలలో నుండి పుట్టినవే. అంటరానితనపు దురాచారానికి గురై, పేదరికంతో బాధపడిన ఆవేదన నుండి వీరి రచనలు జాలువారాయి. పద్యం, నాటకం, శతకం, పేరడీ ఏది రాసినా భీమన్న గారి జీవితం తప్పకుండా ఉంటుంది దనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇంతటి సాహిత్య కారుడి సదస్సు మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ చెన్నై వారు నిర్వహించడం అభినందనీయం. ఎంతోమంది యువ పరిశోధక మిత్రులకు ఈ సదస్సు బంగారు బాట వేస్తుందని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. చివరి మెట్టు మీది శివుడు - బోయి భీమన్న, ప్రథమ ముద్రణ 1998, రవిచంద్ర జవ గ్రాఫిక్స్ & క్రియేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాదు.
2. వేమన శతకం - వేమన
3. కృష్ణశాస్త్రి కవితలు - విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ.
4. మహాప్రస్థానం - శ్రీశ్రీ విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాదు.

పాలేరు నాటకం - పాత్రలు, విశ్లేషణ

- సి. రవీంద్ర, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలుచేసి, సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితలలో బోయి భీమన్న గారు ముందు వరుసలో ఉంటారు. భీమన్న గారు 1911 సెప్టెంబరు 19న మామిడి కుదురు గ్రామంలో నాగమ్మ, పుల్లయ్య దంపతులకు జన్మించాడు. ఈయన 1935లో బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై, 1937లో బి.ఇడి పూర్తి చేశాడు. బోర్డు హైస్కూలో చరిత్రోపాధ్యాయునిగా పనిచేశారు.

భీమన్న గారు తన 12వ ఏటనే కలం చేత పట్టి వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈయన పద్య, గేయం, వచన రచనలతో పాటు నాటకాలు కూడా రాశారు. దాదాపుగా 70 పుస్తకాలు రాశాడు. దళితునిగా పంచమ కులంలో జన్మించి అనేక రచనలు చేసి తన రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని పెంపొదిస్తూ అనేక సన్మానాలు అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 1971లో 'కళాప్రపూర్ణ' బిరుదు, 1973లో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదు, 2001లో 'పద్మభూషణ్' బిరుదు ఇచ్చి గౌరవించింది. వీరు రాసినా 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు వచ్చింది.

కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతియవాది. ఈయన రాసిన పాలేరు నాటకం సాంఘిక విప్లవాత్మకమైన గొప్ప సాంఘిక నాటకం. సామాజిక విద్యారంగంలో వ్యవసాయ కూలీ వర్గాలలో వచ్చిన మార్పులు ఒక మహత్తరమైన విప్లవ చరిత్ర ఈ పాలేరు నాటకం.

దళిత కులంలో పుట్టి, అంటరాని వారిగా పిలువ బడుతూ ఊరికి వెలుపల జీవిస్తూ అగ్రకులాల వారిచేత అణిచి వేయబడతూ, తరాతరాల నుండి పాలేరుగా వారి దగ్గరే గొడ్డు చాకిరి చేస్తుంటాడు పుల్లయ్య. పుల్లయ్య కొడుకు వెంకన్నను కూడా కామందు దగ్గర పాలేరుగా ఉంటారు. కులం వల్ల సమాజంలో గౌరవం పొందుతున్న కుటుంబం కుబేరయ్యది. ఈయన కూతురు వనబాల తక్కువ కులంగా పిలువబడుతున్న వెంకన్న ఇద్దరు ప్రేమించుకుంటారు. పాలేరు తనం చేయడం ఇష్టం లేని వెంకన్న చదుపై శ్రద్ధ చూపుతాడు. ఇది తెలిసి కుబేరయ్య వెంకన్నను ఎన్నో విధాలుగా బాధపెడతాడు, అవమాన పరుస్తూ ఉంటాడు కుబేరయ్య. ఉపకారి మాస్టరు సహాయంతో కాకినాడ పోయి వెంకన్న బాగా చదువుకొని డిప్యూటి కలెక్టర్ అయ్యి తిరిగి అదే గ్రామానికి వచ్చి భూస్వాముల అరాచకాలను అడ్డుకుని, అంటరాని తనాన్ని నిరోధిస్తాడు. కుబేరయ్య కూతురు అయిన వన బాలను కులాంతర వివాహం చేసుకుంటాడు. ఇది పాలేరు నాటకం ఇతివృత్తాతం.

పాలేరు నాటకం - పాత్రల విశ్లేషణ

వెంకన్న

వెంకన్న పాలేరు నాటకంలో కథానాయకుడు. వెంకన్న హరిజనుడైన పుల్లయ్య కొడుకు. పుల్లయ్య వెంకన్నను చిన్నతనంలోనే కుబేరయ్య దగ్గర పాలేరుగా పెడతాడు. కాని వెంకన్నకు బానిసల బ్రతకడం ఇష్టం ఉండదు. బాగా చదువుకోవాలి అనుకుంటాడు. అభ్యుదయ భావాలు కలవాడు వెంకన్న. బానిసత్వం అనేది ఉండకూడదని, అందరికి ఇళ్ళు, వాకిలి, బట్టలు ఉండాలని అందరు సమానంగా ఉండాలి అని పాడుతూ ఉంటాడు అప్పుడు కుబేరయ్య వచ్చి వెంకడిని దూడలు నువ్వు చేను మేస్తున్నాయి అని తిట్టి కొడతాడు.

వెంకన్న రాత్రిబడికి వెళుతున్నాడని తెలిసి కుబేరయ్య మళ్ళీ కొడతాడు. వెంకన్న తనలో బాధపడుతూ ఈ

పాలేరు జీవితం దుఃఖంగా ఉందని, పాలేరు తనం పశువుల్లాగా ఉందని, చదువుకోవడం వల్ల స్వతంత్రం భావాలు ఉంటాయని, ఈ నరకం నుండి తప్పించుకోవచ్చు అని బాధపడుతుంటాడు. అప్పుడు ఉపకారి మాస్టారి సహాయంతో కాకినాడ అనాథశరణాలయానికి వెళ్ళి కష్టపడి చదువుకొని బి.ఏ. పూర్తి చేస్తాడు. తరువాత డిప్యూటి కలెక్టరు అవుతాడు.

ఈ పాత్ర ద్వారా రచయిత చదువుకుంటే ఎవ్వరైన ఉన్నత స్థాయిలో ఉండవచ్చు అని, చదువు ద్వారా ఏదైనా సాధించవచ్చు అని, ఒక పాలేరుగా ఉండి చదువుకుని డిప్యూటి కలెక్టరు కావడానికి ఎన్నో బాధలు పడి చివరికి వెంకన్న వెంకటేశ్వరరావు ఏలా అయ్యాడు వివరించాడు.

కుబేరయ్య

ఈయన రైతువాడ గ్రామంలో భూస్వామి. ఈయన స్వార్థపరుడు. ఎవ్వరైన ఎదుగుతూ ఉంటే తట్టుకోలేడు. మాల, మాదిగలు అంటే అస్సలు గిట్టదు. వెంకన్న చదువుకుంటున్నాడు అని తెలిసి కొట్టి, తన్నేవాడు, ఏదో ఒక వంకతో వెంకన్నను చావబాదేవాడు. పని దొంగ అని ముద్ర వేసేవాడు. కుబేరయ్య స్త్రీ వ్యామోహి. తన దగ్గర పనిచేస్తున్న సీతను ఎలాగైన లొంగదీసుకోవాలని చాలా ప్రయత్నించేవాడు. వెంకన్న తండ్రి పుల్లయ్యను కొట్టి బయటికి గెంటి వేయిస్తాడు చివరికి తన తప్పు తెలుసుకొని మంచి వానిలాగా మారతాడు.

ఉపకారి మేష్టారు

ఈయన ఒక బడి పంతులు. సంస్కార భావాలు కలిగినవాడు. అందరు చదువుకుని విజ్ఞానవంతులు కావాలని గ్రామం అంత తిరుగుతూ అందరికి చదువు చెబుతుంటాడు. బడికి వచ్చేవారికే కాకుండా బడికి రాని పిల్లలందరిని బడిలో చేరిపించమని రైతులనూ, కూలీలకు చదువు యొక్క ప్రాముఖ్యాన్ని చెప్పి బడిలో చేరిపించమని బ్రతిమలాడుతుంటాడు. కుబేరయ్యను ఎదిరించి అందరిని బడికి పంపమని రాత్రి బడి కూడా పెడతాడు. వెంకన్నను ప్రోత్సహించి కాకినాడకు పంపిస్తాడు. కుబేరయ్య కక్ష కట్టి ఉపకారి మాస్టారుని జైలుకు పంపిస్తాడు. వెంకటేశ్వర రావు నిజం నిరూపించి జైలు నుండి విడిపిస్తాడు.

ఉపకారి లాంటి పంతులు ప్రతి గ్రామంలో ఉంటే పల్లెల్లోని బాల బాలికలు అందరు అక్షరాస్యులు అవుతారని చెప్పడంతో సందేహమే లేదు.

వన బాల

వన బాల కుబేరయ్య కూతురు. ఉన్నత కుటుంబంలో పుట్టినప్పటికి మనుష్యులు అంతా ఒక్కటే అని నమ్మిన వ్యక్తి. వెంకన్న పాటలు అంటే వన బాలకు చాలా ఇష్టం. వెంకన్నపై ప్రేమ పెంచుకొని అతనిని రెండుసార్లు ఆత్మహత్య నుండి కాపాడుతుంది. వెంకన్నకు దెబ్బలు తగిలితే ఎంతో అప్యాయతతో కట్టుకట్టి తినడానికి కొబ్బరి, పండ్లు ఇస్తుంది. వెంకన్న చదువుకు అవసరం అయిన డబ్బు కోసం తన కాసుల పేరు అమ్మి వెంకన్నకు ఇవ్వమని ఉపకారి మాష్టారుకి ఇచ్చి తన ప్రేమను చాటుకుంటుంది. అన్న అయిన సుందరం తనకు నచ్చని వ్యక్తిని పెళ్ళి చేసుకొమన్నప్పుడు వెంకన్న గుర్తు వచ్చి చాలా బాధపడుతుంది. చివరికి వెంకన్నను కులాంతర వివాహం చేసుకుని అదర్శంగా నిలుస్తుంది.

పుల్లయ్య

పుల్లయ్య వెంకన్న తండ్రి. కుబేరయ్య దగ్గర పెద్ద పాలేరు. వెంకన్న చదువుకుంటున్నాడని కామందు చెప్తే ఆయన మాటలు విని వెంకన్నను చదువుకోవద్దని చదువు అనేది తమ వంశంలోనే లేదని మానాన్న, వాళ్ళ న్నా, నేను కూడా పాలేరుగానే ఉన్నానని నువ్వు కూడా పాలేరుగానే ఉండాలని కొడతాడు. వెంకన్న చావుబతుకుల్లో ఉన్నాడని మందు ఇమ్మని కామందు దగ్గరికి వస్తే మాట వినని వాడు చావడమే మంచిదని చెప్తాడు. పుల్లయ్య తను కాయకష్టం చేసి పది రూపాముల కుబేరయ్యను లక్షల కుబేరునిగా చేశానని చెప్తాడు. కుబేరయ్య పుల్లయ్యను కొట్టించి అక్కడి నుండి తరిమివేస్తాడు. తనకు దిక్కులేక ముస్టి ఎత్తుకుంటాడు. చివరికి

వెంకన్నను కలుసుకుంటాడు. తన కొడుకు ఎదుగుదల చూసి సంతోషిస్తాడు.

పుల్లయ్య పాత్ర ద్వారా ఆనాడు భూస్వాములు పాలేరులను ఏ విదంగా హింసించేవారో, వారు చదువు కోవడం మహా పాపం అని అది తప్పు అని వారిని అమాయ కులను చేసి ఏ విధంగా పని చేపించుకునేవారో రచయిత తెలియజేసాడు.

రామం

రామం కాకినాడలోని అనాథశరణాలయం మేనేజరు గారి కొడుకు. చదువు కోసం వచ్చిన వెంకన్నను ఉన్నత చదువులు చదివించాలని తన తండ్రితో చెప్తాడు. మంచి స్వభావం కలిగిన వ్యక్తి వెంకన్నకు క్లాసుమేంట్. సుందరం తన చెల్లి వన బాలను పెళ్ళి చేసుకోమంటాడు. రామం ఒప్పుకుంటాడు. చివరికి వనబాల వెంకన్న ప్రేమించు కుంటున్నారు అని తెలిసి వనబాలకు వెంకటేశ్వరరావుకు సుందరం, రామం దగ్గర ఉండి పెళ్ళి చేస్తారు.

సీతమ్మ

పుల్లయ్యకు మరదలు, వెంకన్నకు పినతల్లి, కామందు దగ్గర పనికి వెళుతుంది. వీరుశు, సీతమ్మ ప్రేమించ కుంటారు. సీతపైకి వచ్చిన కుబేరయ్యను ఎదురిస్తుంది. కుబేరయ్య తమని చంపేస్తాడని భయపడి పారిపోతారు. పట్నం వెళ్ళాక పెళ్ళి చేసుకుంటారు వీరుశు, సీతమ్మ. పట్టణంలో పక్క పక్కన ఉన్న ఎవ్వరికి వారు ఉన్నారని, పల్లెలల్లో అందరు కుటుంబంలా ఉంటారని తమ వాళ్ళని చూడాలని ఉందని చెప్తుంది. ఎవరో చేసిన దొంగతనం వీరుశుపై వేసి జైలుకు తీసుకువెళతారు. వీరేసును చివరికి వెంకటేశ్వరరావు ద్వారా నిజం తెలిసి బయటకి వస్తాడు.

బోయి భీమన్న గారు పాలేరు నాటకంలో ఆనాడు భూస్వాములు ఏ విధంగా తక్కువ కులాల వారని, ఎలా హింసించేవారో, వారిని ఎన్ని ఇబ్బందులకు గురిచేసేవారో, వారు కష్టపడి చేసినది అంత తాము ఎలా సంపాదించు కునేవారో, వారికి తగిన ప్రతిఫలం లేకుండా, తినడానికి తిండి కూడా సరిగా ఉండేది కాదో చూపించారు.

ఈ నాటకంలో ఒక్కొక్క పాత్ర ద్వారా సమాజంలో చైతన్యాన్ని పెంపొందింపచేశాడు. ఆనాడు ఈ పాలేరు నాటకం చూసి ఎందరో పాలేరులు పాలేరుతనాన్ని వదిలి బడులల్లో చేరి, పెద్ద చదువులు చదివి ఆఫీసర్లుగా, ప్రొఫెసర్లుగా, రాజకీయ పండితులుగా అయ్యారు. ఈ నాటకం కన్యాశుల్కం, వరవిక్రయం వంటి నాకటాల సరసన ఉండదగినది. పాలేరు నాటకం బడుగు వర్గాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించింది. నాటి సంఘ ప్రవృత్తికి దర్పణంగా బోయి భీమన్న గారు రాశారు.

ఆధార గ్రంథాలు

1. పాలేరు - బోయి భీమన్న

డా. బోయి భీమన్నగారి జీవితం - వ్యక్తిత్వం

- డా॥. సత్యగాయత్రి జనమంచి, హైదరాబాదు.

బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన అనే అంతర్జాతీయ సదస్సు పత్రాన్ని రాయాలనుకున్నప్పుడు ఎన్నో రచనలు చేసి, అనేక పురస్కారాలను పొందిన భీమన్నగారి జీవితం, దృక్పథం, వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. అందుకే నేను హైమవతీ భీమన్నగారు రచించిన 'పాలేరు నుంచి పద్మశ్రీ వరకు' గ్రంథాన్ని ఆధారం చేసుకుని ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.

బోయి భీమన్న గారు వైనతేయ తీరంలో రాజోలు తాలూకాలో మామిడి కుదురు గ్రామంలో 1911 సెప్టెంబరు 19వ తేదిన పుట్టారు.

"కొబ్బరి ఎక్కడ కనిపించినా / నాకు దానిలో కొబ్బరి తోటలు కనిపిస్తై, / కోనసీమ ప్రత్యక్షమవుతుంది! / అమ్మ ఒడిలో చంటిపాపలా / అవశుణ్ణయిపోతా ఆ క్షణంలో ! / ప్రకృతి ధర్మమే అంత! / ఎక్కడ పుట్టిన జీవికి / అక్కడ ప్రకృతే ప్రవృత్తి! / గొదావరి తన సమస్త పుష్పఫలాలను, / ధనధాన్యాలను, సౌందర్యాలను / ప్రేమోపానంగా సంతరించుకొని / సముజ్వల మూర్తి అయి సాగరుని పాదాలముందు / సమర్పించుకొన్న పూర్ణ సువర్ణ పళ్లెరం కోనసీమ! / అక్కడ పుట్టిన నాకు / అక్కడ పుట్టిన దేది ఎక్కడ కనిపించినా / పరమాత్మ పూర్ణ సౌందర్య సాక్షాత్కారమే !" (శివాలికలు)

తండ్రి బోయి పల్లయ్య, తల్లి నాగమ్మ గార్లు. తండ్రి అద్వైతంలో దిట్ట. తల్లి మంచి గాయని. పల్లయ్య గారిది నివృత్తి భోగం, భీమన్న గారిది ప్రవృత్తి భోగం. పల్లయ్య గారు ఏకసంథాగ్రాహి. ఎన్నో పద్యాలు ఆయన అలవోకగా పాడగలరు. తండ్రి నుంచే భీమన్న గారికి పద్యాల మీద, కవిత్వం మీద ఆసక్తి కలిగింది. భీమన్నగారు తొమ్మిదేళ్ల వరకూ బడికి పోలేదు. అప్పుడే ఆ ఊరికి లేబరు ఎలిమెంటరీ స్కూల్ వచ్చింది. భీమన్నగారి దాయాది వెంకన్న గారు తెచ్చిన మహాభారతం, భాగవత గ్రంథాలు చిన్న పిల్లాడుగా వున్న భీమన్న గారికి పీటలుగా, తలదిండులుగా ఉండేవి.

భీమన్న గారి ఇంటి నుండి స్కూల్‌కి నాలుగు ఫర్లాంగుల దూరం వుంది. వర్షాకాలమంతా వరిగట్లతో, పచ్చికతో, బెండ, బీర పాదులతో, చేల నిండా నీళ్ళతో, చేపపిల్లలతో, రకరకాల పూలతో కళకళ్లాడుతూ వుండేది. అయా బుతువులు సౌందర్యంతో భీమన్నగారిని అలరించేవి. ఈ ప్రకృతి సౌందర్యమంతా భీమన్నగారు కవిత్వాన్ని రాయడానికి ప్రేరణను యిచ్చింది. ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుకున్న భీమన్న 1923 నగరం మిడిల్ స్కూల్లో చేరాడు. ఫోర్త్, ఫిఫ్త్ క్లాస్‌లు, ఫస్ట్ సెకండ్ థర్డ్ ఫారాలూ ఈ ఐదు సంవత్సరాలు భీమన్న గారికి భాష యోగ దశ. అనుభవాలతో, విద్యతోపాటు, భాషా జ్ఞానం కూడా పెరుగుతూ వచ్చింది. ఆ కాలంలోనే భీమన్నగారికి పంచతంత్రం దొరికింది. అంతకుముందు ఎవరో ఆయా పేజీలలో పదాలకు అర్థాల నోట్సు రాసుకున్న పాత పుస్తకం అది. అమరకోశం కూడా భీమన్నగారు కొనుక్కున్నారు. వసుచరిత్ర కూడా భీమన్న గారి దగ్గర చేరింది.

భీమన్న గారికి ఆయా గ్రంధాలు కంఠస్థం కాలేదు కానీ భాషా జ్ఞానం మాత్రం పెరిగింది. భీమన్నగారు తేగలు, సీతాఫలాలు అమ్మి ఆ డబ్బులతో కూడా పుస్తకాలే కొనేవారు. పస్ట్ ఫారమ్ లోనే భీమన్నగారు పద్యాలు రాయడం మొదలుపెట్టాడు. కానీ భీమన్న గారికి గణాలు కూడా తెలియదు. భీమన్న గారే స్వయంగా పరిశీలించి, పరిశోధించి గణాలు, ప్రాసల గురించి తెలుసుకున్నారు.

భీమన్న గారు సంఖ్యా శాస్త్రం, హస్తాసాముద్రికం, అదృష్ట దీపిక, ఇంద్ర జాలం, మహేంద్ర జాలం మొదలైన

ఎన్నో పుస్తకాలు చదివారు. భీమన్న గారి పద్య శిల్పానికి పోతన గారి దశమ స్కంధం ఆదర్శంగా వున్నా భావ ప్రేరణ మాత్రం తన చుట్టూ వున్న పల్లె పడుచుల నుంచే లభించేది. గుబ్బల వీరాస్వామి అనే మిత్రుడు వేసవి కాలం సెలవులలో ''కవిజనాశ్రయం'' లక్షణ గ్రంథాన్ని, అతడు రాసిన శ్రీపతి శతకాన్ని భీమన్న గారికి యిచ్చారు. భీమన్న గారికి సాహిత్యంపై ఎంత ఆసక్తి వుందో భాషపై అంత పట్టు వుంది. ఫోర్త్ ఫారమ్‌లో ట్రాన్స్‌లేషన్ పేపర్‌లో ఇరవైకి ఇరవై వచ్చాయి. నిషా వస్తువులను నిషేదించాలి అనే అంశంపై వ్యాసం మొదటి బహుమతి పొందాడు. భీమన్న గారి తొలి కావ్యం ప్రణయలహరి.

భీమన్నగారికి దేశం పట్ల, దేశనాయకుల పట్ల ఎంతో భక్తిప్రత్తలు ఉండేవి. గాంధీ గారు రాజోలు వస్తున్నారని తెలిసి మండుటెండలో కాళ్ళకు చెప్పులు లేకుండా, నెత్తిన గొడుగు లేకుండా వెళ్ళారు. కానీ అప్పటికే గాంధీ గారు వెళ్ళిపోయారు. చిన్నప్పటి నుండి కుల పరంగా అనేక యిబ్బందులను ఎదర్కొన్నారు. ఒక కులం అనుభవిస్తున్న దాస్యమే ఇంత ఘోరంగా వుంటే, ఒక మొత్తం దేశమే అనుభవించే దాస్యం ఎంత క్రూరంగా వుంటుందో భీమన్నగారు ఊహించుకోగలిగారు. ముందుగా దేశం దాస్యం తొలగిపోతే, కులదాస్య నిర్మూలన పోరాటం సులభవుతున్నదన్న నిర్ధారణకు వచ్చారు.

కులం, అంటరానితనం, పేదరికం, ఆర్థిక బాధ వంటి సామాజిక విషయాలు ఎక్కువగా భీమన్నగారిపై ప్రభావాన్ని చూపలేక పోయాయి. ప్రణయం సౌందర్యం, చిరునవ్వులు, చిలిపి చూపులు హృదయంలో చోటు చేసుకున్నాయి. భీమన్న గారు భోజన ప్రియుడు. రసాలెరిగిన వాడు. రుచులు మరిగిన వాడు. పేదగా పుట్టినా, పాలాల్లో బతికినా ఇతరులపై ఆధారపడకుండా తనకిష్టమైన మార్గాల్లో తనకు నచ్చిన సుఖాన్ని తానే సంపాదించుకునే స్వభావం భీమన్నగారిది. భీమన్న గారికి సెకండ్ ఫారమ్‌లో వచ్చిన స్కాలర్షిప్పు బి.ఏ అయ్యే వరకు కొనసాగింది. స్కాలషిప్పులోని పాతిక రూపాయలలో ఖర్చులుపోనూ ఆర్థిక సమర్థత లేని తోటి విద్యార్థులకు కూడా సహాయం చేసేవారు. హాస్టల్లో రాజకీయాలు, వాటి వల్ల కలిగే చికాకులు గాలికొదిలేసి స్నేహితులతో సరదాగా హాయిగా కాలం గడిపేవారు. రచనలో మునిగి పోయే వారు.

భీమన్న గారు ఎలిమెంటరీ, మిడిల్ హైస్కూళ్ళను దాటి కాకినాడ పి.ఆర్. కాలేజీలో చేరారు. భీమన్న గారు గ్రూప్ సబ్జెక్టుగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌తో పాటు తెలుగు కూడా తీసుకున్నారు. బి.ఏ చదువుతున్న రోజుల్లోనే భీమన్న గారు ఇంగ్లీషులో కూడా కవితలు రచించే వారు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే భీమన్న కృష్ణా పత్రికలో వ్యాసాలు రాసేవారు. భాగవతం, మేఘదూతం, భగ వద్గీత, పురాణాలు, హొమరు, కాల్రిడ్జి, వుమర్‌ఖయ్యాం మొదలైన గ్రంథాలను మొత్తం నాలుగు సంవత్సరాల్లో గంటకు నాలుగు గ్రంథాల చప్పున కాలేజీ లైబ్రరీ, బ్రహ్మ మందిరం లైబ్రరీలలో చదివేవారు. భీమన్న గారికి ఎక్కువ జ్ఞాపకం ఉండేది కాదు కానీ ఎంతో కొంత వంట పట్టేది. భీమన్నగారి విస్తృత పరిజ్ఞానం వల్ల సొంత వేదాంతం, సొంత శైలి ఆనాడే రూపుదిద్దుకున్నాయి. భీమన్నగారు ఎవరి మెప్పు కోసం ఏమీ చేసేవాడు కాదు. ఆయన మనసుకి సమంజసం అనిపిస్తేనే ఏపనైనా చేసేవారు. ఒకసారి బ్రహ్మసమాజ ప్రార్థనలో కళ్ళు మూసుకోకుండా ఉన్నప్పుడు అక్కడ అధికారి భీమన్నగారిని ప్రశ్నిస్తే కళ్ళు మూసుకుని నటించడం ఆత్మవంచన కాదా అని తిరిగి ఆయననే ప్రశ్నించారు.

భీమన్నగారికి పునర్జన్మ మీద నమ్మకం లేదు. తల్లి నాగమ్మ గారికి భీమన్న గారు దినం కర్మలు కూడా చెయ్య లేదు. జీవించి ఉండగానే ఏ సుఖాలైనా, మరణించిన తర్వాత మరేమి ఉండదు. ఏదైనా వున్నా, అది ఈ పిండం మెతుకులకు అశించేదై ఉండదు. అంత్యక్రియలూ, శాద్ధకర్మలూ అన్నీ ఒట్టి సాంఘిక క్రియలు అంటారు భీమన్న గారు. భీమన్నగారు పెళ్లికి కూడా ఏ సంప్ర దాయాన్ని అనుసరించలేదు సంప్రదాయాన్ని త్రోసిరాజని,

ముహూర్తాన్ని నిరాకరించి ఒక మిత్రుడి ఆచార్యకత్వంలో వివాహం చేసుకున్న మొట్టమొదటి యువకుడు భీమన్న గారే.

1940 సెప్టెంబర్ నెలలో భీమన్న గారికి తొలిసారిగా ముమ్మిడివరం వరం బోర్డు మిడిల్ స్కూల్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తర్వాత భీమన్నగారు గారు చిన్నప్పుడు తను చదువుకున్న స్కూల్‌కి హెడ్ మాస్టర్‌గా వెళ్లి ఆ స్కూల్ల్ పద్ధతిని చాలా సంస్కరించారు. భీమన్నగారు రాసిన చాలా గ్రంథాలు విశ్వవిద్యాలయాలలో పాఠ్య పుస్తకాలుగా కూడా పెట్టారు. అరుంధతి కళ్యాణం అదే తర్వాత రాగవాసిష్ఠం పేరుతో అచ్చయింది. భీమన్న గారు రాసిన దీపనభను మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ మోడర్న్ పొయిట్రిగా పెట్టారు. దీనిలోని చాలా పదాలను శబ్దరత్నాకరం నిఘంటువులో కూడా చేర్చారు. ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ వారికి పాఠ్య గ్రంథం కూడా అయింది. మానవుని మరొక మజిలీ ఆంధ్ర యూనివర్సిటీ ఎం.ఏ స్పెషల్ తెలుగు పాఠ్య గ్రంధంగా నిర్ణయించారు. భీమన్న గారు కొంత కాలం జనవాణి పత్రికకు సబ్ ఎడిటర్‌గా కుడా పనిచేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు 1944లో ఆంధ్రప్రదేశ్‌లోని రామచంద్రపురం వచ్చినప్పుడు బ్రహ్మాండమైన సభ జరిగింది అప్పుడే తొలిసారిగా అంబేద్కర్ గారిని భీమన్నగారు దర్శించుకున్నారు. అంబేద్కర్ గారి మీద భీమన్నగారు పద్యాలు రాసి ఒక ఫ్రేమ్ కట్టించి ఆయనకు సమర్పించారు. ఇది తన జీవితంలో చాలా గొప్ప సన్నివేశంగా భీమన్నగారు భావించారు.

పాలయ్య గారి సలహా మేరకు భీమన్నగారు తన టీచర్ ఉద్యోగానికి సెలవు పెట్టి రాజకీయాల్లోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ తరపున భీమన్నగారు ప్రచారం చేసేవారు ఎందుకంటే పార్టీ ఎంతో కొంత హరి జనులకు న్యాయం చేయగలదని వారు భావించారు. పిఠాపురం రాజా వారి సన్మానంలో భీమన్నగారు తన పద్యాలు వినిపించారు. రాజా గారు ఆ పద్యాలు విని ఎంతో ఆనందించి ఆనంద భాష్పాలు రాల్చారు. సభలో కూడా ఆ పద్యాలకు విశేష మైన స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ట్రాన్స్‌లేషన్ డిపార్టుమెంటు డైరెక్టరుగా వ్యవహరించారు. తర్వాత భీమన్నగారు హరిజన సేవా సంఘానికి అసిస్టెంట్ సెక్రటరీ అయ్యాడు. తర్వాత మద్రాసు ప్రభుత్వ సమాచార శాఖలో అసిస్టెంట్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా కూడా చేశారు.

ఉద్యోగ ధర్మం వెలుపల ఒక ఆత్మ ధర్మం కల విశిష్ట వ్యక్తి భీమన్నగారు. అన్నం కోసం పగలంతా పనిచేస్తూ రాత్రంతా ఆత్మ కోసం తపస్సు చేసే జీవలక్షణం వారిది. శరీర పోషణ కోసం అన్నం, హృదయ పోషణ కోసం సౌందర్యం, ఆత్మ పోషణ కోసం జ్ఞానం అవసరం అంటారు భీమన్న గారు. ఆ తత్వాన్ని అనుసరించి తన జీవితాన్ని నడుచుకుంటూ వచ్చారు. ఈ మూడు శక్తులన్నీ సమానంగా ఆరాధించి పరిపూర్ణుడైయ్యారు భీమన్నగారు. హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించవలసి ఉంది. అందుకు ఒక ప్రెస్సు, పేపరు ఉండాలి. మంచి వర్కర్లను తయారు చేయాలి, సాహిత్యాన్ని సృష్టించాలి. ఇది భీమన్న గారి స్కీము. కూర్మయ్య గారు పూర్తిగా ఏకీభవించారు. వీరిద్దరూ వ్యవసాయ కూలీ పత్రికను స్థాపించారు. ఈ సమయం లోనే భీమన్న గారి 'కూలీ రాజు' ప్రింటయింది. తరువాత భీమన్నగారు 'తోటమాలి' అనే గేయ కావ్యం 'జమీన్ రైతు' పత్రికలో సీరియల్‌గా ప్రచురింపబ ప్రచురింపబడింది. కానీ ఇప్పుడు లభ్యం కావడం లేదు. అలాగే ఉండ్రు సుబ్బారావు గారి హరిజన్ పత్రికలో 'ఇల్లాలు' అనే జానపద గేయ కథ. ఇదొక సమకాలీన వ్యవసాయ కూలి చరిత్ర. ఇది కూడా ఇప్పుడు లభ్యం కావడం లేదు.

మంచి ఎక్కడున్నా ప్రొత్సహించడం చెడు స్నేహితులలో ఉన్నా కూడా సహించలేకపోవడం భీమన్న గారి సహజ గుణం. భీమన్న భయంకరమైన మసూచి రోగం బారిన పడ్డారు ఆ సమయంలో వీరిని ఆంధ్ర శేషగిరిరావు గారు ఆదుకున్నారు.

వచ్చేపోయే బ్రతికిన చచ్చిన పైశాచిక వికృతంపు పీనుగులు
రాత్రింబవళ్ళు నా మృతి శయ్యకు ప్రదక్షిణలు సల్పుచుండినవి;
నరక కూపముల మృత్యు వేదనల నా ప్రాణము లడుగంటి పోయినవి;
తెలియదు చచ్చితినో, బ్రతికుంటినో దేవకన్యలో, నర్సులొ వీరు!

(పాలేరు నుంచి పద్మశ్రీ వరకు, పుట. 170)

తన చుట్టూ ఉన్న డాక్టర్లతో నర్సులతో కవితా కాలక్షేపం చేస్తూ ఆ సమయంలో కూడా వారి మీద పద్యాలు రచిస్తూ కాలాన్ని గడిపారు భీమన్నగారు. మిత్రుడి భార్య కలరా సోకితే దగ్గరుండి ఆమెకు సేవ చేసి ఆమెను బ్రతికించారు. మామిడికుదురులో పిత్రార్జితంగా తన వాటాకు వచ్చిన తోటను తండ్రి పుల్లయ్య గారి అనుమతితో నామమాత్రపు మూల్యం తీసుకొని అక్కడ హైస్కూల్‌కి ఇచ్చేసాడు. బోయోళ్ల మెరక పై తన వాటాను పక్కవాట వాళ్ళకి ఇచ్చేశారు. పాలేరు నాటకం వందకి పైగా ప్రదర్శనలు యిచ్చిన సందర్భంగా భీమన్న గారిని బంగారు గండపెండేరముతో సన్మానించారు. భీమన్న జీవితంలోని కొన్ని దశలలో చాలా పేదరికం అనుభవించారు. భీమన్నగారికి కులం కారణంగా ఎవరూ ఇల్లు కూడా అద్దెకు ఇవ్వలేదు. తెలుగులో తొలి పదకోశం భీమన్నగారి కృషితోనే రూపొందింది. నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు పదవిని భీమన్నగారు చేపట్టారు. ప్రపంచ మహా సభలకు కూడా బీజం పడింది భీమన్నగారి సారధ్యంలోనే. ఆంధ్ర నలందా సన్మానాన్ని కూడా భీమన్నగారు అందుకున్నారు. రజిత ఫలకంపై సువర్ణ అక్షరాలతో, పద్యాలతో లిఖించబడ్డసన్మాన పత్రాన్ని భీమన్నగారు పొందారు. భారతీయ రచయితల వరంగల్ మహాసభలలో భీమన్న గారు 'బేక్ టు వేదాస్' అనే నినాదాన్ని యిచ్చారు. 'పాండిత్య ప్రకర్షాలైన పెద్ద పెద్ద ఉపన్యాసాలివ్వడం భీమన్న గారికి చేతకాదు. చిన్న చిన్న నినాదాలతో, చమత్కార ప్రసంగాలతో, చనువుతో స్నేహంతో సత్యాన్ని సూటిగా వాచ్యం చేసి చేప్పే ధోరణితో సభను రజింప చేసేవారు'.

'సాహిత్య, సంఘ నిర్మాణ రంగాల్లోనే గాక వాస్తవ జీవితాలలో కూడా భీమన్నగారు వెలిగించిన దీపాలు అనేకం. ఎందరో నిరాశాపూరితులకు ధైర్యోత్సాహాలు కలిగించాడు. తెగిపోయిన అనుబంధాలను కలిపాడు. నిరుద్యోగులకు ఉద్యోగాలు యిప్పించాడు. సహాయం కోరి భీమన్నగారి దగ్గర వచ్చిన వారు దిగులుగా వెళ్ళి పోలేదు. ఈ విషయంలో కుల, వర్గ, మత భేదాన్ని చూడలేదు. అనుభవాన్ని మించిన సత్యం లేదని భీమన్నగారి సిద్ధాంతం. పద్య, గేయ ప్రక్రియల నుంచి, వచన కవితా ప్రక్రియకు భీమన్న గారు మారింది అనాది కొసనుంచి అనంతత్వంలోకి' నుంచే ఈ రచన తెలుగు సాహితీ రంగంలో పెద్ద సంచలనం కలిగించింది.

సరస్సు నుంచి తొలగస్తే / సరోరుహం లేదు / చంద్రిక నుంచి తొలగిస్తే / చంద్రుడు లేడు / పాట నుండి తొలిగస్తే / కోకిల లేదు / ప్రేమ నుంచి తొలగిసే / నీవు లేవు / నీ నుంచి తొలగిస్తే / నేను లేను / నా పూజా జ్యోతివి నీవు / నా జ్యోతి స్నేహ రసం నీవు / నా రస కవితా వసంతవు నీవు / నా వసంతోత్సవ శ్రీ వైశాఖివి నీవు. (అనాదికొస)

1963 నుండి 1963 వరకూ గురజాడ శతజయంతి ఉత్సవాలను అధ్భుతంగా నిర్వహించారు. తెలుగు అధికార భాషగా శిష్టవ్యవహారికమే వాడాలని భీమన్నగారు తీర్మానించారు. రాముడిని దేవుని చేసి పూజించడం భీమన్నగారికి ఇష్టం లేదు. 1968లో తెలుగు భాష రక్షణ సమితిని నెలకొల్పారు.1971లో జనవరి17న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ గారు కళాప్రపూర్ణ బిరుదును ప్రధానం చేశారు.1971 డిసెంబరు 13న మామిడి కుదురు షష్టిపూర్తి సన్మానం జరిగింది. నారాయణరెడ్డిగారు భీమన్న గారికి 'సాహితీ వసంత' బిరుదును ప్రధానం చేశారు. 1973 జనవరి 19న భీమన్నగారిని పద్మశ్రీ వరించింది.

సాహిత్య అకాడమీ సభ్యత్వం కూడా వచ్చింది. భీమన్న గారికి తమ రచనలంన్నింటిలో బాగా ఇష్టమైనది బొమ్మ కావ్యం. భీమన్న గారి కవితలు కుర్రకారుని ఉర్రూతలు ఊగించాయి. ఒకసారి భీమన్న గారు శిల - శివం కవితను వేదిక మీద చదివే సరికి యువకులంతా నృత్యం చేశారు.

దురదృష్టాలు, దుస్సంఘటనలు అపకారాలు ఏమీ భీమన్న గారికి జ్ఞాపకం ఉండవు. కష్టనష్టాలు అన్నింటినీ ఎప్పటికప్పుడు మరుపు అనే చెత్త కుండీలో విసిరి పారేస్తారు. తన సువర్ణమయ స్మృతి పేటికలో చాల విలువైన అందమైన ఆనంద ప్రదమైన అనుభవాలు మాత్రమే భద్రపరుచుకుంటారు. భీమన్న గారి గుడిసెలు కాలిపోతున్నాయికి జాతీయ అవార్డు వచ్చింది. కాశీ విద్యా పీఠం వారు భీమన్న గారికి గౌరవ డాక్టరేట్ యిచ్చారు. కేంద్ర సాంస్కృతిక శాఖ నుండి ఫెలోషిప్పు గ్రాంట్ కూడా వచ్చింది. భీమన్న గారు అంబేద్కర్ 'కులనిర్మూలన' గ్రంథాన్ని ఆంగ్లం నుండి తెలుగుకు అనువాదం చేశారు. రాష్ట్ర ఫిలిం అవార్డు బోర్డు సభ్యునిగా కూడా భీమన్న గారు వ్యవహరించారు. భీమన్న గారి ధర్మం కోసం పోరాటం 'దళిత్ కైవడి' పేరుతో కన్నుండంలోకి అనువదింపబడింది. భీమన్నగారు కొన్ని వందల సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. కావ్యాలు, గేయాలు, నాటకాలు, వ్యాసాలు రాశారు. భీమన్నగారికి భక్తి వుంది కానీ మూఢ భక్తి లేదు. విశ్వాసం వుంది కానీ అంధ విశ్వాసం లేదు. ప్రకృతిలోని ప్రతీ అందాన్ని చూసి తాదాత్మ్యం చెంది పరమశివుడి ఆనందకేళిగా దర్శించారు. జీవితంలోని ప్రతీ సంఘటనని పాటగానో, పద్యంగానో, కవితగానో మలచి అనంతమైన కావ్య సృజన చేశారు. అందుకే ''నా ప్రతీ రచనా నా ఆత్మకథే వేరే ఏం వ్రాయను'' అని భీమన్నగారు అన్నారు. భీమన్న గారి జీవిత చరిత్రను సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, చారిత్రకంగా ఇలా ఎన్నో కోణాలలో పరిశీలించవలసిన అవసరం ఉంది.

ఆధార గ్రంథాలు :

1. హైమవతీ భీమన్న, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.

❁❁❁

డా. బోయి భీమన్న 'రాగవాసిష్ఠం' నాటకం - విశ్లేషణ

- డా॥. కటుకం శారద, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, యస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

సామాజిక చైతన్యంతో సమాజాన్ని ముందుకు నడిపించే లక్ష్యంతో రచనలు చేసిన డా.బోయి భీమన్న తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలుకాలోని మామిడి కుదురు గ్రామంలో 1911 సెప్టెంబరు 19న పల్లయ్య నాగమ్మ దంపతులకు జన్మించారు. మామిడి కుదురు కోనసీమ ప్రాంతంలో ఉంది. భీమన్న కవిగా ఎదగడానికి, మంచి ప్రకృతి ప్రేమికులు కావడానికి ఆ కోనసీమ సౌందర్యం వారిని అమితంగా ఆకర్షించి ప్రభావాన్ని చూపించింది. రాజోలులో పాఠశాల విద్యను, కాకినాడ పి.ఆర్ కళాశాలలో ఇంటర్, బి.ఏ చదివారు.అక్కడే దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి వంటి కవులతో, సంఘ సంస్కర్తలతో, రాజకీయ నాయకులతో పరిచయం కలిగి వ్యక్తిత్వ వికాసం కలగడానికి దోహదం చేసింది.1932 లో బి.ఇడి పూర్తి చేశారు. వీరు కొద్ది కాలం ఉపాధ్యాయుడుగా పని చేశారు. జయభేరి, జనవాణి, ఆంధ్రప్రభ, ప్రజామిత్ర వంటి వివిధ పత్రికలలో చాలాకాలం పని చేశారు. పత్రికారంగమే అయన సిద్ధాంతాల ఆచరణకు, వ్యాప్తులకు దోహదం చేసి, కొండంత కీర్తిని ఆర్జించి పెట్టింది.

భీమన్న సాహితీరంగంలో చేపట్టని ప్రక్రియ లేదు. ఆయన నిరంతర సాహితీ కృషీవలుడు. ఈ విషయం వారి రచనలను గమనించినపుడు అర్థం అవుతుంది. పద్యం-గేయం-వచనం-నాటకం-నవల-సంగీత నృత్య రూపకం-శతకం-చాటువు-విమర్శ ఇలా విభిన్న ప్రక్రియలలో వారి సాహితీ సృజన కనిపిస్తుంది. శ్రీనాథుని వలె 'చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడె' రచనారంగంలో అడుగుపెట్టిన భీమన్న అరవై సంవత్సరాలలో అరవైకి పైగా రచనలు చేశారు. భీమన్న ప్రాచీన సంప్రదాయ కవిత్వానికి ఆధునిక కవిత్వానికి వారధి. వస్తువు, వ్యక్తీకరణ, శిల్పం వంటి విషయాలలో ఆధునికులకు ఆదర్శప్రాయుడు అని చెప్పవచ్చును.

తెలుగు సాహిత్యం కోసం ఎంతో కృషి చేసిన ఆయనను పలు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, భారత ప్రభుత్వం ఘనంగా సత్కరించినవి. మహాకవి, సాహితీ వసంతం, కళాప్రపూర్ణ, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటివి వారిని వరించిన బిరుదులు. గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, కాశీ విద్యాపీఠం వారణాసి వారి డి.లిట్, నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరి వారి గౌరవ డాక్టరేటు, పలు సంస్థల కనకాభిషేకాలు, పుష్పాభిషేకాలు అందుకున్నారు. వివిధ విశ్వవిద్యాలయాల పాలక మండలి సభ్యులుగాను, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులుగాను సేవలందించిన భీమన్న ధన్యజీవి. భీమన్న పురాణాలలో, ఇతిహాసాలలో ఉన్న కథలను తీసుకొని కొన్ని నాటకాలను రచించారు. వీరు పౌరాణిక ఇతివృత్తాన్ని తీసుకొని అందులో సమకాలీన సాంఘిక సమస్యలను చేర్చి వాటి పరిష్కార మార్గాల్ని సూచిస్తూ పౌరాణిక సాంఘిక నాటకంగా తీర్చిద్దిటం నాటకాలలోని ప్రత్యేకత అని చెప్పవచ్చును. రాగవాసిష్ఠం నాటకం మొదట 'అరుంధతీ కళ్యాణం' అనే పేరుతో 1941 లో రచించారు. 1959 లో రాగవాసిష్ఠం (సాంఘిక-పౌరాణిక నాటకం) పేరుతో ప్రచురించారు. 28 పుటలలో రాసిన ప్రస్తావనలో అనేక విషయాలను చాలా సుదీర్ఘంగా వివరించారు. ఈనాటకం 12 (ద్వాదశ) రంగాలతో పద్య, గద్య, పాటలతో ప్రదర్శనానుకూలంగా మలిచిన ఒక చక్కని నాటకం. ఇంతవరకు సాహిత్యంలో యోగవాసిష్ఠం,

జ్ఞానవాసిష్ఠం వంటి గ్రంథాలను చూసిన కవి తన నాటకానికి రాగవాసిష్ఠం అని పేరుపెట్టారు. ఇది పౌరాణిక ఇతివృత్తం గల సాంఘిక నాటకం. హిందూ సమాజ వ్యవస్థలో బ్రహ్మర్షి వసిష్ఠుడు, మాతంగకన్య అరుంధతిల కళ్యాణకారక గాధ అందరికీ ఆదర్శం, ఆరాధనీయం.ఈ నాటకాన్ని భీమన్న బాల్య స్నేహితుడు శ్రీ సాక పేములు గారికి అంకితం చేశారు.

భీమన్న విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే మంగిపూడి వేంకటశర్మగారు రాసిన 'నిరుద్ధ భారతం'లోని

'వ్యాస మునీంద్రుగన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షియయ్యె
వేశ్యకును పుట్టి మాలెత బెండ్లియాడి

ఆ వసిష్ఠ మహర్షి బ్రహ్మర్షియయ్యె' అన్న పద్యం వారిని ఆకర్షించి, ఆలోచనలను రేకెత్తించింది. హరిజనులు ఆర్యులేనన్న భావం కలగడానికి, అదే ఈ 'రాగవాసిష్ఠం' నాటకం రాయడానికి పురిగొల్పింది. అందుకే ఈ నాటక ఆరంభంలోనే 'హరిజనులార్యులంచు చూపి, జాతి నవైక్యమ్మును తెల్పిన మహితాత్ముడు' అని మంగిపూడి వారికి భక్త్యంజలి సమర్పించినాడు భీమన్న. ఈ నాటక ప్రస్తావనలో హరిశ్చంద్రోపాఖ్యానం, అమర కోశం, మనుస్మృతి, నిరుద్ధ బారతం, మహాభారతం, రఘువంశం, వాల్మీకి రామాయణం, వేమనశతకం వంటి రచనల్లో హరిజనులు ఆర్యులుగా చిత్రింపబడిన తీరును అనేక ఉదాహరణలతో వివరించారు. హరిజనులు ఆర్యులేనని, ఆర్య ద్రావిడ భేదం కూడా కల్పించినదే అని మాల, మాదిగ, ఛండాల,శ్వపచ, మాతంగ, పుల్కస వంటి పదాలన్నీ పర్యాయ పదాలుగానే వాడబడిన తీరును తెలిపాడు.

మతంగముని, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు,శక్తి మహర్షి, పరాశరుడు, శుక మహర్షి మొదలగువారు హరిజనులేనని వివరించారు. ఆర్యశబ్ధం జాతిని సూచించేది కాదని అది ఒక జీవన విధానమని, వర్ణం రంగును సూచించేది కాదని అది గుణాన్ని తద్వారా వృత్తిని సూచించేదని అభిప్రాయపడ్డారు. దేశదేశాలు తిరిగి వేద మతాన్ని వ్యాపింపచేసిన మహాఋషులు పుట్టిన దేశంలో శూద్రులు వేదం వినకూడదని, ఒకే జాతిలోని రెండు వృత్తి వర్గాల స్త్రీ పురుషులకు పుట్టినవాడు అస్పృశ్యుడుగా చెప్పబడటం, స్మృతియుగం నాటి శాసనాలను కాలానుగుణంగా సవరించకపోవటం, వాటినే ఈ నాటికీ అనుసరించటం వల్ల భారత ప్రజలు ఎందరో పర మతాలను ఆశ్రయించటం దురదృష్టకరంగా భావించాడు.

అరుంధతిని గురించిన విషయాలను నిరుద్ధ భారతం, భారతం, అష్టాదశపురాణాల ఆధారంగా పరిశీలించి కొత్త అంశాలను తెలియ చేశారు. దళితుల పుట్టుకను గురించి చారిత్రకాధారాలు, పురాణాలు, విజ్ఞాన సర్వస్వాల నుండి నూతన విషయాలను వెలికి చూపెట్టారు. పూర్వ గాథలను పరిశీలించినపుడు అరుంధతి గురించిన విషయాలు ఇలా ఉన్నాయి. బ్రహ్మమానస పుత్రిక అయిన సంధ్యాదేవి మేధాతిధి యజ్ఞంలో ప్రాతసంధ్య, అరుంధతి, సాయం సంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్టు ఒకగాధ ఉంది. కర్ధమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలలో అరుంధతి ఒకతి అని మరోగాథ ఉంది. ఆర్యమత ప్రచారకుడైన వసిష్ఠుడు అనుకులవతియైన భార్యకోసం వెతుకుతూ ఒక మాలపల్లెకు వచ్చి అక్కడ ఒక ఇంటి ముందు వడ్లు దంచుతున్న ఒక పిల్లను చూశాడు. ఆమెను తల్లి పిలవగా ఎత్తిన రోకలిని అలాగే వదిలేసి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే వరకు ఆ రోకలి అలాగే గాలిలో నిలిచి ఉన్నది. ఆ వింతను, ఆమె ఆజ్ఞాపాలనా తత్వాన్ని, ఆత్మశక్తిని చూసి ముగ్ధుడైన వసిష్ఠుడు ఆమెను పెళ్ళాడుతాడని మరో గాథ.ఈ విధంగా అనేక పౌరాణిక కథల ఆధారంగా తనదైన శైలిలో, కల్పనలతో ఈ నాటకం రచించారు.

నాటక ఇతివృత్తం

యమునానదీతీరంలో ప్రాతస్సంధ్యాసమయంలో ప్రకృతి రమణీయతకు ముగ్ధుడైన వసిష్ఠుడు అరుంధతి చెలికత్తె సంధ్య రాగాలాపాన్ని వింటాడు. అక్కడ సుడి

గుండంలో చిక్కుకున్న అరుంధతిని కాపాడుతాడు. క్షణకాలపు ఆత్మైక్యం అనంతయుగాల పరిచయంలా స్పందించి ఒకరినొకరు ప్రేమించుకుంటారు. అతడు ప్రేమకు గుర్తుగా జపమాలను ఇవ్వగా అరుంధతి పూలమాలను అతడికి సమర్పిస్తుంది. వసిష్టుడు ఆరాధించే అరుంధతి చండాల కన్య అని తెలుసుకున్న ప్రాచీనుడు కోపంతో మండిపడుతాడు.తనకు మిత్రుడు, సంరక్షకుడు ఐన ప్రాచీనుడి మీద గౌరవభావంతో ఎటూ తేల్చుకోలోక తీవ్ర సంఘర్షణకు గరియవుతాడు. ఆర్య జాతివారు, ఆశ్రమవాసులైన ప్రాచీనుడు, కులగిరి వర్ణసాంకర్యం చేసి ఆర్యజాతిని నిర్వీర్యం చేయవద్దని వసిష్ఠుని నిందిస్తారు. అతని పట్టుదలను గమనించిన ప్రాచీనుడు ఇనుకను అన్నంగా వండి పెట్ట గల శక్తి అరుంధతికి ఉంటే వివాహమాడవచ్చునని పరీక్ష పెడుతాడు. తోజోవతి, గుణవతి, తపశ్శాలిని అయిన అరుంధతి తప్పక పరీక్షలో నెగ్గుతుదని ఉత్సాహంతో ఆమె వద్దకు బయలు దేరుతాడు. కాని ఆమెను మోసం చేసి వెళ్లిన తన ముఖం చూస్తుందో లేదోనని దిగులుతో ఆస్మహత్యకు ప్రయత్నిస్తాడు.

అరుంధతి వసిష్టుడి కోసం కఠినమైన తపస్సు చేస్తుంది.ఆ తపస్శక్తికి ప్రకృతి అతలాకుతసం అవుతుంది. తీవ్ర కరువు ఏర్పడి మునులు, ప్రజలు అల్లాడిపోతారు. ఆ ఆపద నుండి కాపాడుమని మనులు, ప్రజలు బ్రహ్మను, విష్ణువును మొరపెట్టుకుంటారు.అది తమ వల్ల కాదని వారు శివుడి వద్దకు పంపిస్తారు.శివుడు అరుంధతి కోసం బయలుదేరి మార్గమధ్యంలో అరుంధతి ఎడ బాటును భరించలేక ఆత్మహత్మకు పాల్పడిన వసిష్టుడిని కాపాడుతాడు. అరుంధతి తపోధీక్ష నుండి అగ్నిజ్వాలలు లేస్తాయి. ఆమె భస్మమవుతుందని వసిష్ఠుడు యోగముద్ర లోకి వెళ్లుతాడు. శివుడు వారిరువురి ప్రయత్నాలను విరమింపచేసి, దంపతులుగా ఆశీర్వదించి వరాలను అనుగ్రహిస్తాడు. అరుంధతి తన పాతివ్రత్య ప్రభావంతో కొండరాళ్లను అన్నపురాసులుగా మార్చి ఆశ్రమవాసుల ఆకలిని తీర్చింది. ఇంతటితో నాటకం ముగుస్తుంది.

పాత్ర చిత్రణ

ఈ నాటకంలో అరుంధతి, వసిష్టుడు ప్రధాన పాత్రలు. ప్రాచీనుడు, కులగిరి, సంధ్య, పరమశివుడు, శివోహం, కుంభోదరం, గోష్పాదం వంటి ఏడు పాత్రలతో పాటు సంధర్భాన్ని బట్టి మునులు, ప్రజలు కనిపిస్తారు.

వసిష్ఠుడు యువకుడైన బ్రాహ్మణుడు. సదాచార పరాయణుడు, మహాతవస్సంపన్నుడు, వేదవేదాంగ పారంగతుడు, వివేకశాలి, యమనియమాది గుణ వసిష్టుడు. అతని తల్లి ఊర్వశి వదలి వెళ్లి న తర్వాత ప్రాచీనుడి సంరక్షణలో పెరుగుతాడు. తొలిచూపులోనే తవస్విని ఐన అరుంధతిని ప్రేమిస్తాడు. ఆమె చండాలకన్య అని, ఆమె ప్రేమ అనర్ధదాయకమని, వర్ణసాంకర్యం చేయవద్దని చెప్పిన ప్రాచీనుడి మాట కాదనలేక, అరుంధతి వంటి తపశ్శాలిని విడువలేక సంఘర్షణకు గురియై చివరకు ఆత్మహత్యకు సైతం పాల్పడుతాడు. తపోవృక్షానికి చీడపురుగు, ఆధ్యాత్మికానందానికి విషసర్పం స్త్రీ సాంగత్యం అన్న ప్రాచీనుడితో ప్రేమోపాసకుడు కానివాడు దైవోపాసకుడు కాలేడని, అరుంధతి చంద్రిక లేని వసిష్ఠుడు ఒక మంటిపెల్ల అని చెప్పడం ఆమె పట్ల అతడికి గల ప్రేమకు నిదర్శనం. ప్రేమకు కులాలతో సంబంధం లేదనివసిష్ఠుని ద్వారా భీమన్న చెప్పించాడు.పరమశివుడు సైతం వారిని లోకానికి ఆదర్శ దంపతులుగా వర్ధిల్లుమని ఆశీర్వదించి వరాలను ఇచ్చాడు.

అరుంధతి తపస్విని, బ్రహ్మవిదుషి, మాతంగకన్య, సర్వార్య సమారాధ్య, మాతంగ కులంలో పుట్టినా ఋషిపుంగవుడైన వసిష్ఠుని మెప్పించి అతని ప్రేమకు పాత్రమైనది. ప్రేమకు కులం అడ్డుకాదని నిరూపించింది. ప్రాచీనుడి వల్ల మనసు విరిగిన వసిష్ఠుని కోసం తీవ్రమైన తపస్సుకు కూడా వెనుకాడలేదు. ఆ తపస్సుకు లోకం అల్లాడిపోవటం, కరువు ఏర్పడటం ఆమె మహత్మ్యం

ప్రభావమే. చివరకు పరమేశ్వరుడే కైలాసగిరి దిగి వచ్చి ఆమెను అనుగ్రహిస్తాడు.తన పాతివ్రతా మహత్మ్యంతో కొండలను, రాళ్లను పిండి వంటలుగా చేసి ప్రజల ఆకలిని తీర్చిన అన్నపూర్ణ.

ప్రాచీనుడు వివేకి, బ్రాహ్మణుడు, అహంకారి, ఆచార పరుడు, కఠినవ్రతుడు, తీవ్రమనస్తత్వం కలవాడు. హాస్యాన్ని, అనాచారాన్ని సహించనివాడు.కులవ్యవస్థకు, క్రూరత్వానికి ప్రతినిధి. వసిష్ఠుడు, ప్రాచీనుడు ఒకే ఆశ్రమ వాసులు. అతడు తనను తాను ఆర్యమత సంరక్షణ కొరకు కంకణం కట్టుకున్నవానిగా భావిస్తాడు. వసిష్ఠుడు ఒక చండాల కన్యను ప్రేమించాడని తెలుసుకొని మండిపడుతాడు. తమ మధ్య గల స్నేహాన్ని గుర్తు చేసి అతని మనసు మార్చాలని ప్రయత్నిస్తాడు. ఆర్యజాతి సంరక్షకులమైన మనం తొందరపడి నిర్ణయాలు చేయ రాదని అంటాడు. సమిష్టి క్షేమం ముందు వ్యక్తిగత ప్రయోజనం తృణప్రాయం. నీ నిర్ణయం మీదనే ఆర్యజాతి భవిష్యత్తు అధారపడి ఉన్నది. నాటకం ఆరవ రంగంలో ''నీచజాతి కన్యతో పవిత్రమైన ఆర్యజాతిని సంకరం చేసి సర్వమాశనం చెయ్యదలిచావా'' (పుట 53) అని వసిష్ఠుడితో అనటం వర్ణ సంకరం వల్ల అనర్థాలు జరుగు తాయన్న వారి అభిప్రాయాన్ని ఈ పాత్ర ద్వారా భీమన్న వెల్లడించాడు. యుగయుగాలకు, జన్మజన్మాలకు సంబంధించిన సమస్యను క్షణాలపై పరిష్కరించవద్దని, స్వార్థం మానుకొని త్యాగబుద్ధిని ప్రదర్శించుమని కోరుతాడు. కులవ్యవస్థ, అస్పృశ్యత అన్న మూర్ఖపు జాడ్యాలు ఈనాటివి కావని, తరతరాల నుండి సాగుతున్న దని అర్థం అవుతున్నది. యౌవనం పాలపొంగు వంటిది. అది చల్లారితేనే తన చుట్టూ ఉండే ఆకర్షణలను నిగ్రహించగలవు. ప్రపంచానుభవంలేని యౌవనారంభం పెనుతుఫానులో విడువబడిన నౌక వంటిది. మిత్రుడు చుక్కాని పట్టినప్పుడే అది ఆశ్రమం చేరగలదు. కనుక నీకు తగిన కన్యను వివాహమాడి గృహస్థాశ్రమాన్ని స్వీకరించుమని హితబోధ చేసిన ఒక మంచి మిత్రుడిగా ప్రాచీనుడు కనిపిస్తాడు. కాని అతడు తన మాటను వినడని నిర్ధారించుకొని అతనికొక పరీక్ష పెడుతాడు. ఇసుకను అన్నంగా వండి పెడితో ఆమెను వివాహం చేసుకొమ్మని సలహా ఇస్తాడు.చండాలకన్య ఐన అరుంధతికి అంత శక్తిలేదని భావించిన మూర్ఖునిగా ప్రాచీనుడు కనిపిస్తాడు. అతడు మిత్రునికి చేసిన హిత బోధ వెనుక ఉద్దేశం కూడా వసిష్ఠుని మనసు మార్చి వర్ణసంకరం జరగకుండా ఆపడానికి మాత్రమే అని అర్థం అవుతుంది.

కులగిరి పాత్ర ద్వారా బ్రాహ్మణాధిపత్యాన్ని చెప్పడానికి భీమన్న ప్రయత్నించాడు. మాలపల్లె నివాసి శివోహం బలవంతుడు. పులులను కూడా నిలువరించ గలవాడు. మాలపల్లె అని తెలియక వచ్చిన కులగిరి 'పులినోట్లో నన్నా చస్తాను గాని నిన్ను ముట్టుకోను' అనటం వల్ల సంఘంలో అస్పృశ్యతా జాడ్యం పెద్దపులి వలె మనుష్యులను హింసిస్తున్నదని, వేదనకు గురిచేస్తున్నదని అర్థం అవుతుంది. 'నరుని వెలిబెట్టి హింసించు నరుడు నరుడె' మానవాభ్యుదయమున కిది మంచిదగునె' అని వశిష్ఠుడు వాపోవటం వల్ల ఇటువంటి అస్పృశ్యత జాతి పురోగమ నానికి అడ్డు అవుతుందని వెల్లడయింది. అరుంధతి తపస్సు వల్ల కరువు సంభవించినప్పుడు బ్రాహ్మణులు కుక్కలను తినే పరిస్థితికి రావటం వంటి పరిస్థితులు గమనించినపుడు కలిగిన దానితో సంతృప్తపడే కష్టజీవులను కరువు బాధించదని, శారీరక శ్రమ ద్వారా బతికేవారి శ్రమను దోచుకుతినే వర్గాల వారి నైజాన్ని బయటపెడు తాడు భీమన్న.

ఆర్య ద్రావిడుల మధ్య జరిగిన యుద్ధాల వల్ల సమాజంలో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. గుణాలనను సరించి వృత్తులు, వాటిననుసరించి వర్ణాలు ఏర్పడ్డాయి. అవే కులాలైనాయి.ఈ భేదాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కోసం ఏర్పడినవి. వీటిని శాశ్వతంగా పాటిం చటం సరికాదు. ద్రావిడులు, ఆర్యులు ఒకే జాతికి

చెందినవారు, సోదరులు. పెరుగుదలలో ప్రాబల్యాన్ని మినహాయిస్తే మానవజాతి అంతా ఒక్కటే. "మీరెంత కాలం వర్గ విభేదాలతో అజ్ఞానులై ప్రవర్తిస్తారో అంతకాలం మీకీ అరిష్టాలు తప్పవు"(పుట.103) అని పరమేశ్వరునిచేత పలికించి కుల వ్యవస్థ కుటిలత్వాన్ని నిరసిస్తాడు. వర్తమానకాలపు కులవ్యవస్థ, అస్పృశ్యతాజాడ్యాన్ని పౌరాణిక కథలో ప్రవేశపెట్టి సహేతుకమైన భావాలతో ఖండించటం జరిగింది.

ఆధార గ్రంధాలు

1. రాగవాసిష్ఠం- బోయి భీమన్న, శ్రీరామా పవర్ ప్రెస్, సికిందరాబాదు, ప్రథమ ముద్రణ 1959.
2. తెలుగులో చారిత్రక నాటకాలు - డా.పి.వెంకటరామశాస్త్రి, జాతీయ సాహిత్య పరిషత్తు ప్రచురణ, హైదరాబాదు, 2006.
3. బోయి భీమన్న రూపకాలు, తాత్విక చింతన- డా. తక్కెళ్ళ బాలరాజు, చైతన్య సాహితీ వరంగల్లు, 1996.
4. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, హైమవతి, సుఖేలానికేతన్, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాదు, 1978.

భీమన్న గారి సాంఘిక విజయం – పాలేరు నాటకం

– డా॥. పట్టపు శివకుమార్, తెలుగు ఉపన్యాసకులు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న గారు పాలేరు నాటకకర్తగా సుప్రసిద్ధులు. అంటరానితనం అనే అగ్రకుల అహంకార జాడ్యం వలన సమాజం నుంచి దూరంగా వెలి వేయబడిన కులంలో పుట్టి, తన జాతి పిల్లలు పాలేరు తనంతో బానిసత్వపు సంకెళ్ళలో చిక్కుకొని పతనమై పోతున్న దుర్మార్గాన్ని గ్రహించిన వారు భీమన్న గారు. అనాదిగా సమాజంలో నాటుకుపోయిన ఈ దుర్మార్గపు కట్టుబాటులను ఛేదించడం కేవలం చదువు వల్ల మాత్రమే సాధ్యమవుతుందనే సత్యాన్ని భీమన్న గారు ఎంతగానో విశ్వసించారు. తరతరాలుగా ఊరికి దూరంగా నివసిస్తూ, సంపన్నుల ఇండ్లలో పాలేరుతనం చేస్తూ ఉన్న సాటి మాల మాదిగ జాతుల యువకుల కష్టాలను నివారించడానికి, పాలేరు తనాన్ని ఎలాగైనా పూర్తిగా నిర్మూలించాలనే దృఢసంకల్పంతో భీమన్న గారు పాలేరు నాటకాన్ని రచించారు. 1939 లో రాసిన పాలేరు నాటకం ముద్రణకు ముందే అనేక ప్రదర్శనలకు నోచుకున్నది. 1940 లో ముద్రించబడిన ఈ నాటకం ప్రదర్శనలను భీమన్న గారు మాల మాదిగవాడలలో స్వయంగా పర్యవేక్షిస్తూ, అనేక తరాల దళిత యువకులను పాలేరు తనం నుంచి విముక్తులను చేశారు. అంతేకాకుండా ఈ నాటకం ద్వారా భీమన్న గారు తమ జీవితకాలంలోనే గొప్ప సాంఘిక విజయాన్ని సాధించి, భావితరాల దళిత యువకులకు బంగారు భవితను కానుకగా అందించారు.

ఇతివృత్తం :

బోయి భీమన్నగారు ఈ నాటకంలో సంఘంలో నెలకొని వున్న పాలేరు వ్యవస్థనూ, ఆనాటి పాలేరుల దుస్థితినీ, వాటికి తోడు కామందుల దుశ్చర్యలనూ విపులంగా తెలియజెప్పారు. నాటి పాలేరు వ్యవస్థ ముఖ్యంగా పేదలైన మాల మాదిగలు, తమ బిడ్డలకు గోచీ పెట్టుకోడం తెలియగానే వారి చేతికి ఒక కఱ్ఱను ఇచ్చేవారు. వారు నడవడం నేర్చుకోగానే వారిని తమ కామందుల వద్ద, లేక ధనవంతుల దగ్గర పాలేరులుగా ఉంచేవారు. కామందులు, చిన్న పాలేరులకు ఏడాదికి నాలుగు కుంచాల ధాన్యం ఇచ్చేవారు. పేదవారైన తల్లిదండ్రులు, తమ పసిబిడ్డల చిరు సంపాదనకు కూడా ఆశపడేవారు. ధనవంతులైన రైతుల్ని కామందులు అని పిలిచేవారు. తండ్రి కామందు వద్ద పెద్ద పాలేరుగా ఉంటే, అతడి కొడుకు కూడా ఆ కామందు వద్ద చిన్న పాలేరుగా ఉండేవాడు. పాలేరులు తమ కష్టాన్ని చిందించి కామందుని మరింత ధనవంతుణ్ణి చేసేవారు. ఇటువంటి నేపథ్యం గల సమాజంలో కుబేర్రావు అనే కామందుకు దళితుడైన పుల్లయ్య పెద్దపాలేరు. పుల్లయ్య కొడుకు వెంకన్న చిన్న పాలేరు. కుబేర్రావు అభివృద్ధి నిరోధక మనస్తత్వం కలవాడు. అయితే వెంకన్నకు చిన్ననాటి నుంచి కూడా పాలేరు తనం అంటే నచ్చదు. వెంకన్నకు అతని గ్రామంలోని ఉపకారి మేష్టారు చదువుపై ఆసక్తిని కలిగిస్తాడు. పనివాడైన పాలేరుకి పాటలూ, చదువులూ తగినవి కావని కుబేరయ్య అభిప్రాయం. ఈ విషయంలో పుల్లయ్య కూడా కామందుకు వత్తాసు పలుకుతాడు. ఉన్నత కులంలో పుట్టినప్పటికీ వనబాల, తమ ఇంట్లోనే పాలేరు పని చేసే దళితుడైన వెంకన్నపై అభిమానంతో అతణ్ణి చదువుకోవడానికి ప్రోత్సహిస్తుంది. వనబాల అన్న సహాయంతోను, ఉపకారి మేష్టారి సహకారం వల్లనూ, పాలేరు అయిన వెంకన్న కాకినాడలో చదివి, డిప్యూటీ కలెక్టరు అవుతాడు. ఆ తర్వాత వెంకన్న, తనను ఎంతగానో ప్రోత్సహించిన వనబాలను వర్ణాంతర వివాహం చేసి కొని గొప్ప సాంఘిక విజయానికి దోహదకారి అయ్యాడు. ఇదీ పాలేరు నాటకం లోని ప్రధాన ఇతివృత్తం.

పాలేరు తనం :

ఆనాడు అంటరాని కులాలకు చెందిన పాలేరులు కామందుల ఇళ్ళ వద్ద గొడ్డు చాకిరి చేస్తూ ఎంతో దుర్భరమైన జీవితాన్ని అనుభవించేవారు. పాలేరు కోడికూత తోనే నిద్ర లేవాలి. వెంటనే కామందు ఇంటికి వెళ్ళాలి. పశువుల పాకల నుంచి దూడల్ని మార్చాలి. దొడ్డి చిమ్మి, పాచి పని చేయాలి. దూడల్ని మేపడానికి పొలానికి తీసుకు వెళ్ళాలి. కామందులకు కోపం వస్తే పాలేరులకి ఆ పూట తిండి ఉండేది కాదు. కామందులు పాలేరులు ఆ పూట చప్పగా మాడ్చేవారు. పాలేరులు పాటలు పాడరాదు. వారు బడికి చదువుకోడానికి వెళ్ళరాదు. పాలేరులు అంటే, పేడ పిసుక్కొనే వెధవలని, కామందులు నమ్మేవారు. పాలేరులు చదువుకొంటే పాపమని కామందుల నమ్మకం.

కామందు వ్యవస్థ :

ధనవంతులైన రైతులు, పేద మాల మాదిగల్ని పాలేరులుగా పెట్టుకొనేవారు. పాలేరులు తరతరాలకూ పాలేరులుగానే ఉండాలని కామందులు కోరుకొనేవారు. కామందులు పాలేరులను నీచంగా తిట్టేవారు. ఈ నాటకంలో కుబేరయ్య అనే కామందు, తన పాలేరును అనవసరంగా దున్నపోతు అనీ, మొద్దు పీనుగ అనీ, ఎడ్డి గాడిద అనీ, పనిదొంగ అనీ తిట్టాడు. కుబేరయ్య తన పాలేరు వెంకన్న వీధిబడిలో చదువుకు వెళ్ళాడని తెలిసి, అతన్ని చచ్చేలా కొట్టాడు. తన కమతంలో పనిచేసే పాలేరులు అంటే కామందులకు లోకువ. కుబేరయ్య సీతను లొంగదీసుకోడానికి ప్రయత్నించి, కామందు అంటే సగం మొగుడు అని అంటాడు. ఇది నాటి కామందుల దౌర్జన్యానికీ, దుష్టత్వానికి మచ్చుతునక. విద్యాగంధము లేని సంఘము నాటి గ్రామీణ పేద రైతుల్లో, రైతు కూలీల్లో. దళితుల్లో విద్యా చైతన్యము బొత్తిగా లేదు. పొట్ట చింపినా అక్షరం ముక్కరాని ప్రజలతో నాటి సంఘము నిండి పోయింది. ఉపకారి వంటి మంచి టీచర్లు, తమ పిల్లలను బడికి పంపమని ప్రోత్సహించినా, ప్రజలు ముందుకు వచ్చేవారు కారు. తమకు భూవసతి ఉందనో, పిల్లల సంపాదనకు ఆశపడో, పిల్లల్ని చదివించేవారు కారు. ఈ విధంగా నాడు ఎంతోమంది హరిజనుల పిల్లలు, పిల్ల పాలేరులుగా, బాల కార్మికులుగా కట్టుబానిసలుగా ఉండిపోయేవారు.

సాంఘిక స్థితి :

గ్రామాల్లో ఆధునిక విద్యా సౌకర్యాలు లేవు. చిన్న బడులు ఉండేవి. ఉపకారి వంటి మేష్టార్లు, వయోజన రైతులకు రాత్రి వేళల్లో చదువు చెప్పేవారు. పేదలు చదువుకుంటే, తమకు పాలేరులు దొరకరని కుబేరయ్య వంటి అభ్యుదయ నిరోధకులు అందుకు అడ్డుపడేవారు. ఆనాడు పేదలకు కిరసనాయిలు కూడా దొరికేది కాదు. తమ మాట కాదన్న పాలేరులకు కామందులు, తమ కొట్లో సరకులను సైతం అమ్మేవారు కారు. బీద కూలీలు, యజమానులు తమకు ఇంత కల్లు పోయించి, నాలుగు డబ్బులు ఇస్తే ఏ పనయినా చేసేవారు. మహారాజా గారి వంటి దాతలు, అనాథల కోసం శరణాలయాన్ని పట్టణాల్లో నెలకొల్పి, బీదల చదువులకు సాయం చేసేవారు. రామం వంటి యువకులు బ్రహ్మసమాజ మతంలో చేరి, కులమత రహితంగా అందరికీ సాయం చేసేవారు. సుందరం వంటి గ్రామీణ యువకుడు కుబేరయ్య వంటి అభ్యుదయ నిరోధకుల్ని లెక్కచేయక తన చెల్లెల్ని హరిజన యువకునికి ఇచ్చి వర్ణాంతర వివాహం జరిపించాడు. వెంకటేశ్వరరావు వంటి మంచి అధికారులు ఉండేవారు. డిప్యూటీ కలెక్టర్లు క్యాంపులు వేసుకొని గ్రామాలలో తగవులను విచారించేవారు. పట్టణ జీవితంలో ఆ నాటికే మోటారులు రిక్షాలు వచ్చాయి. పట్టణ ప్రజలు పల్లె ప్రజల పలె తోటివారిపై సానుభూతి చూపేవారు కాదు. పాలేరు నాటకం, నాటి సంఘ వ్యవస్థకు, ముఖ్యంగా నాటి పేద దళితుల జీవన చిత్రానికి నిలువుటద్దం వంటిదని చెప్పవచ్చు.

సమకాలీనత :

ఈ నాటకం లోని పాలేరు బోయి భీమన్న గారి చుట్టూ

ఉన్న సమకాలీన సమాజం లోని వ్యక్తియే అని చెప్పాలి. భీమన్న గారి పాలేరు నాటకంలో సమకాలీన ఇతివృత్తం ఉంది. భీమన్న గారు తాను స్వయంగా చూసిన సమాజం లోని పాలేరు వ్యవస్థనూ, కామందుల పెత్తనాన్నీ, పిల్లల చదువులపై తల్లిదండ్రుల అనాసక్తిని, పిల్లల సంపాదనపై వారు ఆధారపడటాన్ని కూడా ఉన్నది ఉన్నట్లుగా ఈ నాటకంలో చిత్రించారు.

విశిష్టత :

భీమన్న గారు రచించిన పాలేరు నాటకంలోని విశిష్టత అంతా దాని ఇతివృత్తంలోని సమకాలీనతలోనే ఉందని చెప్పవచ్చు. దానికి తోడు కావ్యనాయకుని తీర్చిదిద్దడంలో భీమన్న గారు చూపిన నేర్పు, పాటించిన సంయమనం అనేవి కూడా ఈ నాటకానికి ఒక విశిష్టతను ఆపాదించాయని చెప్పవచ్చు. నాటక రచనా శిల్పంలో భీమన్న గారి కలం నుంచి జాలువారిన రసమయమైన భావ రామణీయకత కూడా పాలేరు నాటకానికి కలిగిన విశిష్టతకు కారణం అని చెప్పవచ్చు. ఒకప్పుడు సంఘంలో తీవ్రంగా ఉన్న పాలేరు వృత్తి ఈ నాటక ప్రభావం తోనే ఈనాడు సమాజంలో పూర్తిగా అంతరించి పోయింది. విప్లవాత్మకమైన ఈ సాంఘిక విజయానికి పాలేరు నాటకమే కారణం. కన్యాశుల్కము, వరవిక్రయం వంటి నాటకాల సరసన ఈ పాలేరు నాటకం కూడా చేరదగినది.

సాంఘిక మార్పు :

భీమన్న గారి పాలేరు నాటకం ఆనాటి సామాజిక విద్యారంగాల్లో, వ్యవసాయ కూలీవర్గాల్లో తెచ్చిన మార్పు ఒక మహత్తరమైన మార్పుకు అంకురార్పణ అని చెప్పాలి. ఈ సాంఘిక మార్పు ప్రధానంగా రెండు రకాలుగా కొనసాగింది. ముఖ్యంగా మాల మాదిగలు అంతవరకూ చేస్తున్న తమ పాలేరుతనాన్ని మాని, చదువుకొని మంచి ఉద్యోగులు కావడం మొదటి మార్పు. అంబేద్కర్ మహాశయుడు ఆశించినట్లుగా వర్ణాంతర వివాహాలు చేసికొని కులవ్యవస్థను నిర్మూలించడం అనేది రెండవది. భీమన్నగారు ఈ రెండు రకాల మార్పుల ద్వారా సాధించదగిన సాంఘిక విజయానికి ఈ పాలేరు నాటకం ద్వారా పునాది వేశారు.

ఈ నాటకంలో మొదట పాలేరు అయిన వెంకన్న, చదువుకొని ఆ తర్వాత గ్రాడ్యుయేట్ అయి కలక్టరు అయ్యాడు. అంతేకాకుండా వెంకన్న న్యాయం, ధర్మం కల మంచి అధికారి కూడా అయ్యాడు. వనబాలను ఆత్మహత్య నుండి కాపాడటమే కాకుండా వెంకన్న ఆమెను వర్ణాంతర వివాహం కూడా చేసికొన్నాడు. ఈ నాటకంలోని మార్పుకు సీతా వీరేశుల ప్రేమ దాంపత్యం ఒక చిహ్నం. సంపన్నుడైన సుందరం, తన చెల్లెల్ని హరిజనుడికి ఇచ్చి పెండ్లి చేయడం ఆహ్వానించదగిన పరిణామం.

ముగింపు :

ఆంధ్రదేశంలో పాలేరు నాటకం అనేక పర్యాయాలు విజయవంతంగా ప్రదర్శింపబడింది. అందువల్ల ఆనాటి ప్రేక్షకుల్లో రచయితగా బోయి భీమన్న గారు ఉద్దేశించిన సాంఘిక విజయం ఈ నాటకంలో కనిపించే అనేక సామాజిక మార్పుల రూపంలో సాకారమయిందని చెప్పవచ్చు. ఆనాడు పాలేరు నాటకాన్ని చూసిన ఎందరో మాలమాదిగలు, అంతవరకూ విధిలేక చేస్తున్న తమ పాలేరు తనం మానివేసి, ధైర్యంగా ముందడుగు వేసి పాఠశాలల్లోను, కళాశాలల్లోనూ చదివి, విద్యాధికులయ్యారు. తర్వాత అనేకమంది ప్రభుత్వరంగంలో పెద్ద పెద్ద అధికారులుగా స్థిరపడినారు. ఆ ప్రగతి అంతా పాలేరు నాటకం సాధించిన సాంఘిక విజయం తాలూకు ప్రతిఫలనమే అని చెప్పవచ్చు. సమాజంలో ఒకనాడు పాలేరు తనం అన్నది ఎడతెగని సమస్యగా ఉన్నది. దాన్ని నిర్మూలించాలని ప్రబోధించే ఈ నాటకం, నిత్య ప్రబోధాత్మకం. ఈ పాలేరు నాటకం సాధించిన సాంఘిక విజయం అపూర్వము.

ఆధార గ్రంథాలు : 1. పాలేరు - బోయి భీమన్న, 1940.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్నలో వైరుధ్య దృక్పథాలు

– డా॥. పెళ్లూరు సునీల్, ఉపాధ్యాయుడు, కోట, నెల్లూరు జిల్లా

20వ శతాబ్దాన్ని ఆసాంతం ఆక్రమించిన సాహితీ విరాణ్మూర్తి బోయిభీమన్న వీరు రాసిన అనేక పుస్తకాల ద్వారా తెలుగు జాతికి ఎనలేని సేవ చేశారు. కేవలం ఒక ప్రక్రియకి పరిమితం కాకుండా తెలుగులో సమకాలీన ప్రక్రియలన్నింటిలోనూ రచనలు చేసి, తన అభిప్రాయాలని నిక్కచ్చిగా, నిష్కర్షగా తెలియజేసిన ప్రతిభావంతుడు. పద్యాలు, నాటకాలు, వచన కవితలు, వచన గ్రంథాలు లేఖా సాహిత్యం ఇలాంటి అనేక ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు భీమన్న గారు.

భీమన్న కలం పట్టింది మొదలుకొని కడదాకా రాస్తూనే ఉన్నారు. రాయడం అంటే కేవలం కాలక్షేపంగా రాసింది కాదు. దళిత జాతి సముద్ధరణ కోసం కంకణం కట్టుకుని చేసిన పని అది. దాదాపు 60 గ్రంథాలు రచించిన భీమన్న ఎక్కడ తొణకలేదు బెణక లేదు. నిండుకుండలాంటి ఆయన హృదయాన్ని ప్రతి అక్షరంలోనూ మనకు అందించారు. భీమన్న పూర్తిగా సనాతనుడు కాదు అట్లని పూర్తిగా ఆధునికుడూ కాదు.

కులం కుళ్ళును కడగడానికి, దాని సహేతుకతను ప్రశ్నించడానికి, దాని వల్ల ఏర్పడుతున్న సమస్యల మూలాలను విప్పిచెప్పడానికి కలం పట్టిన యోధులలో బోయిభీమన్న ముందువరునలో నిలుచుంటారు. సమాజం చూపిన చిన్నచూపులోంచి తట్టుకొని నిలబడటమే కాక, తరువాతి తరాలవారికి మార్గదర్శకుడుగా ఎదిగిన గొప్ప వ్యక్తి భీమన్న. ముఖం చూసి కాక కులం చూసి మాట్లాడే సంఘంలో తన కలం ద్వారా చైతన్య కిరణాలను ప్రసరింపజేసిన స్ఫూర్తి ప్రదాత. ఆయన ఒక్క రోజులో తయారైన వాడు కాదు. అనేక ఆటుపోట్లలోంచి తనను తాను మెరుగు పెట్టుకున్న చైతన్యశీలి.

కుల వివక్షత నుంచి జాతిని ఉద్ధరించాలనే తలంపుతో వారు రాసిన గ్రంథాలన్నింటినీ పరిశీలిస్తే బోయిభీమన్న ఒక వ్యక్తిగా కాక బహుజన తత్వవేత్తగా మనకు కనిపిస్తాడు. ఈ వ్యాసంలో ఇతరుల దృక్పథానికి, భీమన్న దృక్పథానికి మధ్య ఉండే వైరుధ్యాలను వారు మాత్రమే ఎంచుకున్న దారులను స్థూలంగా పరిశీలిస్తాను.

దళితులు అంటరానివాళ్ళుగా చిత్రించబడి సమాజానికి దూరంగా నెట్టివేయడానికి ప్రధాన కారణం హిందూ మతంలోని కుల వ్యవస్థ. ఇది అందరూ ఒప్పుకున్న సత్యమే. ఇతర దళిత కవులు మేధావులు అందరూ హిందూమతంలోని ఈ లోపాన్ని పూర్తిగా వ్యతిరేకించి దానికి ప్రధానమైన కారణాలని విశ్లేషించారు. ఏ మతం వల్లయితే తాము వెలివేయబడ్డమో, ఏ మతం కారణంగా అవమానాల్ని ఎదుర్కొన్నామో ఆ మతాన్ని త్యజించి సర్వ సమానత్వాన్ని ప్రబోధించే మతాల వైపుకు దళిత సోదరులు అనివార్యంగా మొగ్గుచూపారు. కొందరు బౌద్ధ మతాన్ని అనుసరిస్తే, కొందరు క్రైస్తవాన్ని అనుగమించారు. ఎక్కువమంది దళితులు హిందూ మతాన్ని అందులోని లోపాలను ద్వేషిస్తూ మనం చెప్పుకున్న పై రెండు మతాలలోకి వెళ్లిపోతే, భీమన్న మాత్రం హిందూ మతాన్ని సమర్థించి అందులో ఉన్న లోపాల్ని మాత్రం కడిగి పారేశాడు.

ఎక్కువమంది బాబాసాహెబ్ అంబేద్కర్ గారు చూపిన మార్గంలో బౌద్ధం ప్రత్యామ్నాయ మతంగా భావించారు. అంబేద్కర్కు వీర భక్తుడు గాను, అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి దీక్ష తీసుకున్న వ్యక్తిగానూ కనిపించే బోయి భీమన్న మాత్రం హిందూ మతాన్ని వదిలి బౌద్ధ మతానికి వెళ్లడాన్ని వ్యతిరేకించాడు. బౌద్ధమతం పూర్తిగా హిందూ మతానికి ప్రత్యామ్నాయం కాదని చెప్పుకొచ్చాడు. హిందూ మతంలో ఉన్న లోపాలన్నింటిని ఒక్కొక్కటిగా ఏరి పారేసుకుంటూ, సర్వసమానత్వం వైపు ప్రజలందరూ

సౌభ్రాతృత్వంగా జీవించే వైపు వెళ్లడానికి ఆయన ప్రణాళికలు రచించారు. దేవుడు లేడు పరమాత్మ ఉన్నాడు అనే నినాదంతో భీమన్న అనేక గ్రంథాలను వ్రాశారు. ఈ విషయంలో దేవుడు లేకపోవడం ఏంటి? అంటే ఎవరికి వారు తమ దేవుడు గొప్ప తమ దేవుడు గొప్ప అని గిరి గీసుకొని బతుకుతున్న సమాజంలోంచి బయటకు రావాలనేది వారి ఉద్దేశం. మనం పూజించే విగ్రహాల్లోనూ, బొమ్మల్లోనూ దేవుడు లేడు. దేవుడు సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అని చెప్పడమే ఈ పరమాత్మ శబ్దానికి ఉన్న అసలు అంతరార్థం.

ప్రపంచ సాహిత్యాన్నతటిని మధించి, అణగారిన వర్గాల కోసం ఎన్నో గ్రంథాలు రాసి వారిలో చైతన్యాన్ని తెచ్చిన అంబేద్కర్ తాను హిందువుగా పుట్టినా, హిందువుగా మాత్రం చనిపోనని అందుకు ప్రత్యామ్నాయంగా బౌద్ధమతాన్ని స్వీకరించడం మనకు తెలిసిన విషయమే. అయితే బౌద్ధమతం పూర్తిగా లోపరహితం కాదని భీమన్న అంబేద్కర్ నిర్ణయాన్ని ఆక్షేపించాడు. బౌద్ధ మతంలో కూడా హిందూమతంలో లాగా అనేక లోపాలు ఉన్నాయని తెలియజేశాడు.

"ఆత్మ లేదన్నాడు బుద్ధుడు. పునర్జన్మ వున్నదన్నాడు. అందుకు ఆయన చేసిన తర్కం, చూపిన పోలికలు తృప్తికరంగా లేవు. హిందూమత బోధలకంటే, తన బోధలే ఎక్కువ విశిష్టమైనవిగా చూపడం కోసం ఆయన మరీ తొందర పడ్డాడనిపిస్తుంది. ఆధ్యాత్మిక గురువుగా, మానవజీవిత మార్గదర్శిగా ఆయన విఫలుడైంది అందుకే కావచ్చు."

(అంబేద్కరిజం, పుట.211)

మిగిలిన దళిత తత్వవేత్తలు అంతా అంబేద్కర్ గారి మార్గాన్ని అనుసరిస్తూ హిందుత్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడితే, భీమన్న మాత్రం దానికి ప్రత్యామ్నాయంగా హిందూమతంలోని శివారాధనను బలపరిచాడు. కారణం శివుడు ఆటవిక జాతి వాడని, ఆయన ధరించే ఆభరణాలు కట్టుకునే వస్త్రాలు ఇవన్నీ ఆటవిక జాతుల వాళ్లకు చెందినవని, ఆది కాలం నుంచి ఉన్న ఆటవిక దేవుడు శివుడేనని భీమన్న బలంగా నమ్మాడు. అంతేకాదు దళిత కులాల వాళ్ళంతా మూలవాసులని, మొదటినుంచి అడవుల్లో నివసించిన వాళ్ళని చెప్పారు. ఆటవిక జాతులకు దేవుడుగా శివుడ్ని అనుసరించాలని భీమన్న ఉద్దేశం.

మరొక విషయమేమిటంటే శివారాధనలో విగ్రహారాధన కాస్త తక్కువగా ఉంటుంది. ఒక రూపం లేకుండా లింగ రూపంగా శివుడ్ని పూజిస్తాం కాబట్టి పూర్తిగా విగ్రహారాధన అని చెప్పడానికి వీలులేదు. అంతేకాక శివుడు ఆది జాంబవంతుని రూపం అని సృష్టికి ముందు ఏర్పడిన వాడు సృష్టి చివరిదాకా ఉంటూ, అందరికంటే శక్తి వంతుడు ప్రళయ కాలంలోనూ నశించని వాడుగా శివుడ్ని భీమన్న కీర్తించాడు. ఇతర దళిత కవులు కంటే వైరుధ్యంగా ఈ విషయంలో ఆలోచించాడు, పద్యాలు వ్రాశాడు భీమన్న.

చిందు వేయు చునున్నాడు శివుడు, అతడే
ఆది జాంబవుడ, డవనికి ఆది నరుడు;
ఎప్పుడే రీతి నారిపోయినను గాని
మిగిలియుండు నొకే దీప దివ్వె వోలె!

(చాటువులు - స్వగతాలు, పుట.698)

కేవలం బ్రాహ్మణ వర్గల వల్ల మాత్రమే హిందూమతం అనేక ఇబ్బందులు పడిందని వీరు గుర్తించారు. తమను తాము ఉన్నతులుగా ప్రచారం చేసుకోవడం ద్వారా మిగిలిన వాళ్ళను అంటరాని వాళ్ళుగా చిత్రీకరించారని వీరి ప్రధాన ఆరోపణ. బ్రాహ్మణులు కేవలం ప్రజల్ని ఎమోషనల్‌గా ఉపయోగించుకుంటూ, వారిని ఎదగ నీయకుండా చేశారు. ఈ విషయాన్ని అంబేద్కర్, పూలే మొదలుకొని నిన్న మొన్నటి దళిత వేత్తలంతా నిర్ద్వందగా అంగీకరించారు. బ్రాహ్మణులు పాటించే విభూతి ధారణ, యజ్ఞోపవీతం మొదలైన వేషాలను కూడా వ్యతిరేకించారు. కాని భీమన్న తన చాటువుల్లో బొట్టు పెట్టుకోవడం గురించి చెప్పారు. శివుడికి మూడో కన్నుంటుంది. అలాగే ప్రతి

మనిషి కూడా తాను శివ స్వరూపుడిని అనే స్పృహ కలిగి ఉండటం కోసం భారతీయులంతా బొట్టు పెట్టు కుంటారు. ఆ బొట్టు పెట్టుకోవడం మూఢాచారం కాదు ఉత్తమ సంప్రదాయం అని ప్రతిపాదించారు. మిగిలిన మేధావులతో పోలిస్తే భీమన్నలోని మరో వైరుధ్యాంశమిది.

నెన్నుదుట బొట్టు మూడవ కన్ను గాన
బొట్టు పెట్టుడు, జ్ఞాన సంబుద్ధి గొనుడు;
బొట్టు మాత్రమె కాదది, భోగిని శి
రోమణి రాజయోగ సూర్యోదయమ్ము!

(చాటువులు - స్వగతాలు, పుట.698)

సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తే ఎక్కువమంది చెప్పేది సామాజిక అభివృద్ధి. లోకానికి మేలు చేకూర్చేదే సాహిత్యమని ఎక్కువ మంది అంగీకరించారు. కొంత మంది మాత్రం కళ కళకోసమే ఉన్నది, అది వ్యక్తిగత అనుభూతులను వ్యక్తీకరించడానికి మాత్రమే ఉన్నదని తెలియజేసారు. వీరిలో భీమన్న రెండో వర్గానికి చెందిన వారు. పరిశీలించి చూస్తే భీమన్న రచించిన గ్రంథాలన్నీ సామాజిక ప్రయోజనాన్ని ఆశించేవే. సమాజ అభ్యున్నతికోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కాని ఆయన కళ కళకోసమే అన్నది తన సిద్ధాంతం గాను కళా సృష్టి ఆనందం కోసం మాత్రమే ఉండాలని తెలియజేశాడు. ఇది వైరుధ్యమైన అంశం.

స్వీయ ఆనందంలోంచి వచ్చినది ప్రపంచానికి మొత్తం ఆపాదించబడి తద్వారా ప్రయోజనకారిగా తయారవుతున్న దనే వినూత్న వాదనను కూడా తీసుకొచ్చారు. అంటే సూక్ష్మంగా ఆలోచిస్తే కళ ఏ కళైనా సరే వ్యక్తిగత ఆనందంలోంచి మొదలై సామాజిక ప్రయోజనానికి దారితీస్తుందనే పరిణామ సూత్రాన్ని వీరు ప్రతిపాదించారు. ఈ విషయంలో చాలా మంది సాహితీ వేత్తలతో విభిన్నత పాటించారని చెప్పక తప్పదు.

"కళ కళ కోసమే అనేది నా సిద్ధాంతం. కళా సృష్టి ఆనందం కోసం. మార్కెట్టు సరుకుగా కల్పించబడేది కళ కాదు. కవి, గాయకుడు, చిత్ర శిల్పి, నర్తకుడు వంటి కళా జీవులు రూపావేశులై తమ ఆనందం కోసమే ఆయా కళలను సృష్టిస్తారు. ఆరాధిస్తారు. ఒక సర్వజ్ఞుడైన, సమగ్ర వ్యక్తి మంతుడైన వ్యక్తి స్వీయానందం కోసం సృష్టించుకొన్న దేదైనా సరే ప్రపంచం మొత్తానికి ప్రయోజనకారి అవుతుంది. తక్కిన మానవులందరికీ శ్రేయోదాయకం అవుతుంది."

(భీమన్న శంఖారావం, పుట.511)

కొందరు కవులు ఎంచుకున్న వస్తువు, ఉపయోగించిన భాష వేగంగా, బలంగా ఎంచుకుంటారు. పయోదర ప్రచండ ఘోషంలాగా కవితను నడిపిస్తూ పాఠకుల గుండెల్లో అభ్యుదయ విప్లవభావాలను పూయిస్తారు. మరికొందరు కోకిల గానంలాగా చల్లని పిల్ల గాలిలాగా మనసుకు హాయి గొల్పిస్తూ, అనుభూతి దొంతర్లోకి ప్రయాణం సాగింపచేస్తారు. ఎవరిదారి వారిదే. ప్రతి కవి ఏదో ఒక మార్గానికి కట్టుబడిపోతాడు. శ్రీశ్రీ లాంటి వాళ్ళు, కృష్ణశాస్త్రి లాంటి వాళ్ళు ఈ రెండు మార్గాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. మొదట్లో బలమైన పోరాట పటిమ కలిగిన కవితలను రాసినవారు ఇక తరువాత తరువాత అదే కోవలో ముందుకు సాగిపోతారు. బోయి భీమన్న మాత్రం ఒక్కోసారి కఠినాతి కఠినమైన పదాలను ఉపయోగిస్తాడు, ఒక్కోసారి నవనీత సమములైన భావాలను సృష్టిస్తాడు. నిజానికి దళిత కవిగా దళితుల్ని సామాజికంగా ఉద్ధరించాలనే తపన ఉన్న కవి పోరాట మార్గాన్ని అభ్యుదయ మార్గాన్ని వేగవంతమైన శైలిగలిగిన కవితా మార్గాన్ని ఎంచుకుంటారు. సమాజంలో దళిత వాదాన్ని తలకెత్తుకున్న మహాకవులు మద్దూరు నగేష్ బాబు దగ్గరినుంచి ఇటీవల పరమపదించిన ఎండ్లూరి సుధాకర్ వరకు వారి కవితల నిండా చైతన్యం ఉత్తేజం ఉద్వేగం మనకు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. కాని భీమన్నను ఒక్కొక్కసారి చూస్తే భావకవితా చాయలు, ఒక్కోసారి అభ్యుదయ మార్గపు చాయలు కలగాపులంగా కనిపిస్తాయి. అందుకు ఉదాహరణగా కింది రెండు కవితలను పరిశీలిస్తే భీమన్న శైలిలో వైరుధ్యాన్ని మనం గమనించవచ్చు.

అమ్మో, దున్నలు ! దున్నలు !
మంచితనాన్ని తొక్కేస్తున్నై
ప్రతిభను ప్రాసిక్యూట్ చేసేస్తున్నై
ప్రజల దైనందిన కాయకష్టాన్ని
సారాతో నంజుకు తినేస్తున్నై
గొర్రెలను మచ్చిక చేసుకొని
కసాయిలాకు అమ్మేస్తున్నై
తామే భోక్తలుగా కూర్చొని
తాజా విందులు ఆరగిస్తున్నై!

(గుడిసెలు కాలిపోతున్నై, పుట.78)

నన్నిచ్చి నిన్ను కొనుక్కున్నాను నేను !
మనిద్దరం ఒకళ్ల కొకళ్లం బానిసలం!
సంపూర్ణ దాస్యమే సంపూర్ణ విమోచనం!

(త్రిపదలు, పుట.9)

అంటరానితనాన్ని నిర్మూలించే క్రమంలో దళితుల్ని ఏమని పిలవాలని అనేకమంది చర్చలు చేసి, కొన్ని పదాల్ని సూచించారు. కొందరు నిమ్నజాతులన్నారు, కొందరు నిరుద్దులన్నారు, కొందరు ఆది జాతులన్నారు, కొందరు మూలవాసులన్నారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో పేరు సృష్టించారు. మహాత్మా గాంధీ హరిజన అనే పదాన్ని సూచించారు. తరువాత రాను రాను చర్చల్లో తేలిన విషయం ఏమంటే అన్నింటిలోకి దళిత పదమే అందరికీ ఆమోదయోగ్యంగా పరిగణించబడింది. ముఖ్యంగా తెలుగునాట దళిత ఉద్యమంలో ఆది ఆంధ్రులం, మూలవాసులం వంటి పదాలు అనేకం కనిపిస్తున్నా, దళిత శబ్దం అందరిలోకి చొచ్చుకు వెళ్ళగలిగింది. కానీ బోయి భీమన్న మాత్రం వీటన్నింటికంటే పంచములుగా పిలిపించుకోవడానికే ఇష్టపడ్డాడు. మిగిలిన వాటిల్లో లేని బలం పంచమంలో ఉందని హిందూ వ్యవస్థలో పంచమం అనేది కూడా ఒక భాగమని ఆయన విశ్వ సించారు. దాని గురించి అనేక గ్రంథాలలోను, వాటికి రాసిన పీఠికలలోను ఆయన నిర్మొహమాటంగా వెల్లడించారు.

ఐదవ వాడిగా ఉండడం అంటే అఖరి వాడిగా మనల్ని మనం అంగీకరించినట్టే కదా! కానీ భీమన్న ఈ విషయానికి అధిక ప్రాధాన్యత నిచ్చాడు. చాతుర్వర్ణ వ్యవస్థ కాకుండా మొదటి నుంచి భారతదేశంలో ఐదు వర్ణాల వ్యవస్థ ఉందని అవన్నీ సమ ప్రాధాన్యం కలిగినవేనని వారి వాదన. దళిత శబ్దం అణచబడిన అనే అర్థంలో అణచబడినవారు, అణగదొక్కేవారు వారిమధ్య సాగుతున్న అణచివేత వైఖరి ఇవన్నీ కూడా ప్రతిబింబిస్తాయి. అందుకే ఎక్కువ మంది దళిత శబ్దానికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది మిగిలిన దళిత తాత్వికులకు భీమన్నకు ఉన్న వైరుధ్యం.

పంచ భూతాలు, వర్ణాలు, ప్రాణములును
పంచ తంత్రాలు, ఖండాలు, వార్ధలిట్లు
పంచమము లెన్నో కలవు ప్రాపంచకమున !
పంచ జను డేను, నాది ప్రపంచ విభుత !
పంచకమేలు ; ద్రౌణ ప్రతి
పాదన లన్నియు నక్క జిత్తులే;
చెంచు విపంచి మీటి నర
సింహ రవోద్ధతి గొంతు విప్పుమా !

(పంచమ స్వరం, పుట.316)

ఏది ఏమైనప్పటికీ 20వ శతాబ్దంలో తెలుగునాట గొప్ప కవులలో బోయి భీమన్న ముందువరుసలో నిలబడతాడు. తను పడిన కష్టాల్లోంచి, తను పొందిన అవమానాల్లోంచి అనుక్షణం పదునెక్కి తన సాహితీ సేవ ద్వారా తన జాతి వారందరినీ చైతన్యం చేయాలనే మహత్తరమైన ఆశయంతో కలం పట్టిన యోధుడు భీమన్న. అయితే మిగిలిన ప్రవాహంతో కలిసి నడవకుండా తనదైన కొత్త మార్గాన్ని వేయడానికి, తనదైన ముద్రను చరిత్ర పై నిలపడానికి ఎంతగానో ప్రయత్నించాడని చెప్పక తప్పదు. ఆ కోణంలోదే ఈ వ్యాసంలో మనం చర్చించు కున్న విభిన్న అంశాలు.

ఆధార గ్రంథాలు :

1. అంబేద్కరిజం - బోయి భీమన్న
2. గుడిసెలు కాలిపోతున్నై - బోయి భీమన్న
3. చాటువులు - స్వగతాలు - బోయి భీమన్న
4. భీమన్న శంఖారావం - బోయి భీమన్న
5. త్రిపదలు - బోయి భీమన్న
6. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వానాశాస్త్రి
7. దళిత సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
8. పంచమ స్వరం - బోయి భీమన్న

దళిత చైతన్య దీప్తి - పంచమ స్వరం

- డా॥. సంగుల సునీల్ కుమార్, సీనియర్ అకడమిక్ ఫెలో (ICHR), తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఇటు పద్య సాహిత్యంలోనూ అటు వచన కవిత్వం లోనూ సవ్యసాచిగా చక్రం తిప్పిన అనన్య సామాన్య మైన కవి బోయి భీమన్న. వీరు పదుల సంఖ్యలో పుస్తకాలను వెలువరించి తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు. వీరి చేతి నుంచి జాలువారిన అనేక రచనల్లో పంచమస్వరం ఒకటి. 'పంచమం' అనే మాటకు కోకిల, ఇంపైనది అనే అర్థాలున్నాయి. కవి పంచమస్వరం పేరు పెట్టడంలో తన ఉద్దేశాన్ని తెలుపుతు, తను పంచముడిని కాబట్టి తన స్వరం తాను చెప్పాలనుకున్న విషయం ఇందులో రాశా నన్నారు. అట్లాగే కోకిల స్వరం లాగా అందరికి ఇష్ట పూర్వకంగా ఉంటుందనే అంతరార్థం కూడా ఇందులో ఉంది. పంచమస్వరం కావ్యం అంతా ఏకకాలంలో రాసింది కాదు. అనేక కాలాలలో వారు రాసిన పద్యాలను ఏర్చి కూర్చి 2000 సంవత్సరంలో పంచమ స్వరంగా వెలువరించారు.

ఈ నాడు మనం పంచమ శబ్దానికంటే 'దళిత' శబ్దాన్ని ఎక్కువగా వాడుతున్నాం. కాని బోయి భీమన్న పంచమ శబ్దం వైపుకే మొగ్గినట్లుగా ఈ పుస్తకం ద్వారా తెలుస్తుంది. కొంతమంది హరిజన మాట వద్దన్నారు. కొంత మంది దళిత అనే మాట వద్దన్నారు. కొంత మంది ఆది ఆంధ్రులం అన్నారు. కొంత మంది దాన్నీవద్దన్నారు. ఇలా దళితుల్ని ఎలా పిలుచుకోవాలో, తమను తాము ఎలా గౌరవించుకోవాలో చేసే వెతుకులాటలో కొంతమంది మాత్రమే ఈ పంచమ శబ్దానికి మొగ్గు చూపారు వారిలో భీమన్న ఒకరు. కాని తరువాత కాలంలో ఎక్కువమంది మేధావులు ఒప్పుకున్న పేరు దళితులు. ఈ విషయాన్ని గురించి బోయి భీమన్న మాట్లాడుతు ఈ ప్రపంచమే పంచమ శబ్దంతో నిండి ఉంది. మనిషికి ప్రాణాలు పంచ ప్రాణాలంటాం, పంచ భూతాలు కలిస్తే ప్రపంచం అయ్యింది. అందువల్ల 'పంచమ' శబ్దం గురించి తక్కువగా భావించ వద్దంటూ, పంచసంఖ్య పై ఎందుకీ పంచనామా అన్నారు. 'ఈ భరతమాత పంచమ స్వరగీత' అనే ప్రయోగం చేశారు. ఎందుకంటే ఆది మహర్షులంతా పంచములోంచి వచ్చినవాళ్ళే. భగవద్గీత చెప్పిన శ్రీకృష్ణుడు, వ్యాసవాల్మీకాదులు, పరాశర మహర్షిలాంటి వారంతా భారతజాతికి జ్ఞానభిక్ష పెట్టిన వాళ్ళే. వారు చూపిన మార్గంలోనే భారత జాతి నడుస్తుంది. కాబట్టి భరత మాతను పంచమ స్వరగీతగా ఆయన చాటిచెప్పారు. పంచములం అని చెప్పుకోటానికి మొహమాట పడాల్సిన అవసరం లేదని కింది పద్యం ద్వారా తెలిపారు.

పంచ భూతాలు కలిసి ప్రపంచమాయె,
పంచ ప్రాణాలు కలిసి జీవించు వ్యక్తి !
పంచ సంఖ్యపై ఎందుకీ పంచనామా?
పంచమ స్వర గీత మా భరతమాత

(పంచమ స్వరం, పుట.310)

దళితుల్ని దూరం పెట్టి వారికి విద్యనందకుండా చేసి తద్వారా తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి ఎంతో మంది ప్రయత్నించారు. దాని ఫలితంగా కొన్ని తరాల పాటు పంచములు అని పిలవబడేవాళ్ళు చదువుకు తిండికి దూరమయ్యారు. ఎప్పుడైతే జ్ఞానానికి దూర మయ్యారో అక్కడ నుంచి పతనం తప్ప పురోగతి ఉండదు. దీనంతటికి మొదట్లో మూలాలు పడినట్లుగా భీమన్న చెప్పారు. ద్రోణుడు బొటనవేలు ఖండించి ఏకలవ్యున్ని విద్యకు దూరం చేస్తే, అసలు పంచముడు ఉండకూడదని మనువు శాశించి దళిత జాతినంతా దూరం పెట్టే గొప్ప కుట్రను చేశాడు. పంచములు ఈ

విషయాల్ని తెలుసుకొని చైతన్య వంతులు కావాలని భీమన్న ఆశించారు. ఈనాడు కొన్ని స్వార్థపూరిత శక్తులు దళితుల్ని దూరం పెట్టి తమ పబ్బాన్ని గడుపుకోవాలని చూస్తున్నాయన్నారు.

పంచమాంగుళి ఖండించి, భరత బలము
కూల ద్రోసెను ఒక పొట్టకూటి గురువు;
పంచమమె నాస్తి అని బొంకి, భరత జాతి
కథనె ఖండించె శాసనకర్త మనువు!

(పంచమ స్వరం, పుట.315)

ప్రతిభ గల ఏకలవ్యుడిని తన గురుకులంలో చేర్చుకుని, తన మిగతా శిష్యులతోపాటు విద్యను నేర్పించి ఉన్నట్లయితే మహాభారతంలో ఏకలవ్యుడు ఒక గొప్ప వీరుడుగా కనిపించేవాడు. అయితే వీరత్వానికి, ప్రతిభకు కాకుండా పుట్టుకకు ప్రాధాన్యతనిచ్చిన అప్పటి వ్యక్తులు దళితుల్ని తీవ్రమైన అన్యాయాలకు గురి చేయడం అక్కడనుంచే కనబడుతుంది. ఏకలవ్యుడు తనకు తానుగా విద్య నేర్చుకున్నప్పటికీ, బొటన వేలు గురుదక్షణగా అడిగి ద్రోణుడు జాతికి తీవ్రమైన ద్రోహాన్ని చేశాడు. ఈ విషయాన్ని భీమన్న ఆక్షేపించాడు.

తరతరాలుగా ఎన్నో బాధలనుభవిస్తూ, సమాజానికి దూరమైన దళితులే ఒకనాటికి రాజ్యాన్ని పరిపాలించే రాజులవుతారు అని భీమన్న అభిలషించారు. అయితే ఇది జరగటానికి కేవలం ఆశిస్తూ కూర్చుంటే సరిపోదు గదా! ప్రజల్లో చైతన్యం రావాలి, ఆ చైతన్యంలోంచి కసి పుట్టాలి, కసిలోంచి ఉద్యమ స్ఫూర్తి రగలాలి అప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. అందుకే కేవలం కోకిలపాటలాగా కాకుండా సింహాలకు బోధిసత్వునిలాగా చెప్తున్నానని భీమన్న అభిప్రాయపడ్డారు. దళిత సోదర్లందరూ తమను తాము కించపరుచుకోవద్దని, బానిసత్వాన్ని, అంటరానితనాన్ని సహించి మిన్నకుండి పోవద్దని, ఉద్యమం ద్వారా మీలో ఉన్న శక్తిని తెలుసు కోండి అప్పుడే సుప్రభాతాలు కలుగుతాయని కవి ఆశిస్తున్నాడు.

తినడానికి, ఉండటానికి సరైన సౌకర్యాలు లేక అలమటించి పోతున్న పంచములు రాజ్యాధికారంగా నడవడానికి సరైన మార్గాన్ని ఎంచుకోవల్సిందిగా ఈ పంచమస్వరం గ్రంథంలో సూచించారు. ఇదే అంశాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ ఏనాడో మనకు చెప్పారు. ఇలానే ఉంటే బానిస సంఖ్యళ్ళు విడిపోవు. ఇలానే ఉండే అంటరాని తనం సమసిపోదు. ఇలానే ఉంటే వెట్టి చాకిరి నశించి పోదు. అందరూ చదువుకోవాలి, విజ్ఞానవంతులు కావాలి పోరాట యోధులు కావాలి ఎవరైతే ఏ వర్గాలవారైతే ఏ వర్ణాలవారైతే తమ స్వార్థం కోసం పంచముల్ని అణచి వేతకు గురిచేస్తున్నారో, వారి స్వార్థం కోసం అతఃపాతాళానికి పంచముల్ని తొక్కేస్తున్నారో వాళ్ళని గుర్తించి వారికి సలాంలు చేయటం కాకుండా పోరాటం చేయాలి, ఆ పోరాటం ద్వారా నిజమైన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను పంచములు సాధించుకోవాలని తెలిపారు.

మాలలు రాజు లౌదురు సు
మా అని కోకిల వోలె కాదు, సిం
హాలకు బోధిసత్వుని క్రి
యన్ గళమెత్తితి; మాల గూడులన్
మూలుగు చున్న మించు మల
మోదుగు లారా! వినుండు, లెండు, ! మి
త్రాలయ సుప్రభాతముల
స్వాగతముల్ గొని విక్రమింపుడీ !

(పంచమ స్వరం, పుట.335)

ఆనాటి కాలం నుంచి ఇంతకు ముందు వరకు అస్పృశ్యులుగా భావించి ఊరికి దూరంగా పెట్టి, అనేక అవమానాలకు గురిచేసి దొరలు సమాజాన్ని పరిపాలించారు. రానురాను చదువు వల్ల, విజ్ఞానం వల్ల ప్రజల్లో కొంత మార్పు వచ్చింది. ఇప్పుడు అందరూ దొరలే బానిసలెవరూ లేరు. ఉండకూడదు కూడా. ఇప్పటి వరకూ పాలించిన దొరలు చేసిన లాభం ఒనగూర్చిన ప్రయోజనం ఎలా ఉందో మనం అనుభవించాం. ఇకపై అలా ఉండకుండా ఉండాలంటే, పంచములంతా ఉన్నత

స్థితికి వెళ్ళాలంటే, వారు రాజ్యాధికారం సాధించుకోవాలి. అలా కాకుండా ఎప్పటికి దొరల పరిపాలనే సాగుతుంటే అగ్రవర్ణాల ఆదిపత్య భావజాలాల పరిపాలన నడుస్తూ ఉంటే భారత జాతి ముందుకు వెళ్ళదు సరికదా మళ్ళా మధ్య యుగాలనాటి చీకటి పరిపాలనలోకి వెళ్ళిపోతుంది. కనుక ఎప్పటికప్పుడు తెలివి తెచ్చుకోవాలి. చైతన్యాన్ని పుంజుకోవాలి, ఆ చైతన్యం రాజకీయ చైతన్యం అయి ఉండాలి. ఇంతకాలం అధికార రథాన్ని వాళ్ళు నడిపారు. దాని ఫలితాల్ని వాళ్ళే అనుభవించారు. ఆ సమయం మారింది దళితుల ఓట్లు లేకపోతే వాళ్ళు కూడా విజయం సాధించలేని పరిస్థితి మొదలైంది. కనుక పంచములమీద ప్రేమ చూపిస్తున్నట్లు నటించి వాళ్ళ పబ్బం గడుపు కోవడానికి చూస్తున్నారు. ఇది జరగకుండా ఉండాలంటే నిమ్నజాతుల వాళ్ళు రాజకీయ చైతన్యాన్ని పొంది. పరిపాలనా రంగంలోకి రావాలి. తమ తాత ముత్తాతలు అనుభవించిన కష్టాన్ని తమ తరువాతి తరం వారు అనుభవించకుండా నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందరూ చేపట్టేలాగా ప్రవర్తించాలని బలమైన గొంతుకతో నొక్కి చెప్పారు.

ఇంత వరకును వీరి నస్పృశ్యులనుచు
దూరమున నుంచి పాలించ్రి దొరలు ; నేడు
బడుగు వర్గాలు కళ్లెము పట్టకున్న
భరతజాతి చరిత్ర ఆఖ రయి పోవు !

(పంచమ స్వరం, పుట.339)

మనిషి ఏం సాధించాలనుకున్నా దానికి ప్రధానంగా ఆత్మవిశ్వాసం తోడవ్వాల్సిందే. ఆత్మ విశ్వాసం లేనివాడు చతికలపడిపోవడం తప్ప విజయం సాధించలేడు. అందుకే నిన్ను నువ్వు తక్కువగా అంచనా వేసుకోవడం చాలా తప్పు అంటారు పెద్దలు. ఈ విషయాన్ని భీమన్న ఉద్రేకమయిన స్వరంతో తెలియజేశారు. నేను సామాన్యుడ్ని కాదు, అంటరాని వాడ్ని కాదు, విక్రమ కుమారుడ్ని. లలితా సరస్వతుల చేత వరమాన్నం గోరుముద్దలుగా తిన్నవాడ్ని అంటారు. ఇక్కడ లలితా సరస్వతుల చేత వరమాన్నం తినడం అంటే బాగా చదువుకోవడం, తద్వారా ఉత్తమ జ్ఞానాన్ని ఆర్జించడం సరస్వతి దేవి కటాక్షం. శరీరధారుడ్యం పొందడం లలితా దేవి అనుగ్రహం. ఈ రెండు సంపూర్ణంగా సాధించిన నేను దేన్నయినా పొందగలను, సాధించగలను అని భీమన్న ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ఈనాడు పంచము లందరికి ఇది ప్రతిజ్ఞలాంటిది.

మాలను నేను, విక్రమ కు
మారుడ నేను, స్వతంత్ర విప్లవ
జ్వాలను నేను, కాంతియు ద
వాగ్నియు నేను పరాక్రమించినన్;
శ్రీ లలితా సరస్వతులు
చే పరమాన్నపు గోరుముద్దలన్
గ్రోలిన వాడ, నా కులము
గోత్రము నీవె కదమ్మ, హైందవీ !

(పంచమ స్వరం, పుట.349)

స్వార్థపూరిత రాజకీయ శక్తులమూలాన సంఘటితంగా ఉండాల్సిన పంచములు తమలో తాము కలహించు కోవడం విచారించాల్సిన విషయం. ఎందుకంటే రిజర్వేషన్లు, అందులో వర్గీకరణలు, ఏకీకరణలు వంటి వాటి మూలాన దళితుల్లో ప్రధాన శాఖలైన మాల, మాదిగల మధ్య అపారమైన అంతరం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఉమ్మడి శత్రువును ఎదుర్కోవల్సింది పోయి, తమలో తాము కలహించుకొని శత్రువుకు లాభాన్ని చేకూర్చుతున్నారు. ఎంతోమంది ఈ విషయంలో సయోధ్య చేయ్యాలని చూసినా వారికి నిరాశే మిగిలింది. వీరిద్దరు అన్నదమ్ములా కలిసి ఉండాలని భీమన్న కోరుకున్నాడు.

మాల లోనె కలదు మాదిగ అను మాట,
అన్న లోనె కలడు తమ్ము డెపుడు ;
గతము లోన కూడ కవు లిట్లె వ్రాసిరి
మాల అని అక్షమాల నేని

(పంచమ స్వరం, పుట.350)

ఈ నాడు ఎక్కడ చూసినా కులమతాలుగా విడిపోయి మతాల పేర్లతో, దేవుళ్ళ పేర్లతో కొట్టుకుంటున్న వారు స్వర్గానికి పోలేరు. ఎందుకంటే బేదభావాలున్నవారు స్వర్గానికి ప్రవేశించలేరు. మన మతం లేదా మన కులం మాత్రమే గొప్పది ఇతర కులాలు, మతాలు నీచమైనవి అనే భావన ఉన్నంత కాలం వ్యక్తికి విశ్వజనీనత ఏర్పడదు. విశ్వజనీనత లేనివాడు మోక్షానికి అర్హుడు కాదు. అలాగే మైల అనే పదం కూడా విచిత్రమైన మాట. ఒక చోట మైలపడిందనే వస్తువు ఇంకొకచోటఉంటే మైల పడలేదని జనాలు చెప్తుంటారు. ఉదాహరణకి బస్సుల్లోను, రైళ్ళలోను, విమానాలలోనూ మైల కనబడదు కాని, ఊర్లో, హరిజనవాడల్లో, దళితసోదర్ల ఇళ్ళలో మైల ఉందని, వాళ్ళు అంటరాని వాళ్ళని పక్కకు నెట్టేస్తుంటారు. ఇది విచిత్రమైన మనస్తత్వ ప్రవృత్తి. దీనికి చెంప పెట్టుగా పంచమస్వరంలో హెచ్చు స్వరంతో పద్యాన్ని అందించారు.

కులములుగా చీలి, కొట్లాడు కొనుచు చచ్చి,
స్వర్గమున కెట్లు పోదురు చవట లార?
రైలు పెట్టెలలో లేని మైల మిమ్ము
నులిమి చంపునె మాల పేటలను దాగి ?
(పంచమ స్వరం, పుట.355)

పంచమ స్వరం గ్రంథంలోని పద్యాలను పరిశీలిస్తే ఎక్కువవాటిల్లో దళితుల సంఘటిత పోరాటాన్ని భీమన్న పదే పదే గుర్తు చేసాడు. ఎస్సీ జాబితాను పరిశీలిస్తే ఎస్సీ కులాలు 60 దాకా ఉన్నాయి. ఇవన్నీ అంటరానివి గానే భావించబడుతున్నాయి. ఒక్కో కులం ఒక్కో ఉపకులం ఎవరికి వారుగా పోరాడితే లాభం పెద్దగా ఉండదు. అందరూ ఒక్కో అగ్నితో సమానం ఈ అగ్నులన్నీ కలిసి ఏకీకృతమైతే పెద్ద జ్వాల ఏర్పడుతుంది. దాంతో సమాజంలో ఉన్న దురాచారాల్ని దహించివేయవచ్చు. చిన్నదిగా ఉన్న జ్వాలను ఆర్పివేయడం సులభం. అదే భీకరమైన దావాగ్నిని ఆర్పివేయడం చాలా కష్టం. కనుక విప్లవమైన ఉద్యమమైన వ్యక్తుల, సంస్థల సంఘటితతోనే జరుగుతుంది. ఇదే విషయాన్ని గాంధీ, డా॥ బి.ఆర్. అంబేద్కర్ గార్లు కూడా ప్రబోదించారని భీమన్న తెలిపారు.

మాల మాదిగ రెల్లి సంబంధ కులము
లేబదికి పైన సర్కారు జాబితాలొ;
అన్నియు అవర్ణ కీల లే హైందవాగ్ని ;
కీల లన్నియు కలిసిన జ్వాల పంచ
మమ్ము; అది లేక అభ్యుదయమ్ము కలదె?
గాంధి అంబేద్కరుల చెల్మి కాదె కల్మి?
(పంచమ స్వరం, పుట.423)

లోకమంతా ఒక్కటవ్వాలి విశ్వమానవ సౌభ్రాతృత్వం వెల్లి విరియాలి అంటూ మనం చిన్నప్పటినుంచీ చదువుకుంటూ ఉంటాం. లోకమంతా ఒక్కటిగా మారినప్పుడే విశ్వమానవుడు రూపొందుతాడు. అందుకే జాషువ తనను 'విశ్వనరుడి'గా ప్రకటించుకున్నారు. అలాంటి విశ్వ మానవులతోనే ఉన్నతమైన వ్యవస్థ విశ్వం రూపొందుతుందని భీమన్న దళిత కులాల ప్రజలందరికి గొప్ప సందేశాన్ని అందిస్తున్నాడు.

కేవలం పంచమస్వరంలో దళితుల సంవేదనలే కాక, భారతీయ ఎన్నికల పద్ధతి, అధ్యక్ష తరహా పరిపాలన, పట్టణీకరణ, ప్రజలు ఓటు వేసే విధానం, పార్టీలు, సోషలిజం, నిర్భంద మిలటరీ శిక్షణ, సాంస్కృతిక పునరుజ్జీవనం ఇలాంటి అనేక విషయాలను గురించి కూడా పద్యాలు రాశారు. ప్రతి పద్యంలో రమణీయ భావాన్ని పొందుపరిచారు. నిజంగా ఇది కోకిల కంఠం లోంచి వినిపించే మధురమైన కమ్మని స్వరమే. ఇలాంటి రచనలు ఎల్లకాలం ప్రాసంగీకత కలిగి ఉంటాయి. ఇలాంటి రచనలు విద్యార్థులకు చైతన్యాన్ని కలిగిస్తాయి. బోయి భీమన్న లాంటి గొప్ప సాంఘిక తత్వవేత్తలు సాహిత్యం ద్వారా చేసిన ప్రయోగాలతో తెలుగు నేల ఎప్పటికి సస్యశ్యామలం కావాలని కోరుకుంటున్నాను.

ఆధార గ్రంథాలు :

1. పంచమ స్వరం - బోయి భీమన్న
2. తెలుగు సాహిత్య సమీక్ష - డా. జి. నాగయ్య

ప్రశ్నించే ధిక్కార స్వరం భీమన్న "ఒంటరి గొంతు"

– ఆర్. ఎన్. స్వరూప, గెస్ట్ లెక్చరర్, క్వీన్ మేరీస్ కాలేజ్, చెన్నై.

ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక కవిగా, దళిత కవిగా ప్రసిద్ధి చెందినవారు బోయి భీమన్న. దాదాపు బోయి భీమన్న రచనలు సామాజిక చైతన్యంతో కూడినవిగా ఉంటాయి. ఆయన దళిత పాలేరు కుటుంబంలో జన్మించినప్పటికి ప్రతి అంశాన్ని సామాజిక కోణంలో చూడడం జరిగింది. అతన్ని దళిత కవిగానే కాకుండా, సామాజిక కవిగా కూడా చెప్పవచ్చు. భీమన్న గారు అన్ని ప్రక్రియల్లో రచనలు చేయడం జరిగింది. పద్యం, గద్యం, నాటకం, కవిత్వం మొదలైన ప్రక్రియల్లో సుస్థిర స్థానం ఏర్పర్చుకున్నారు.

బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించారు. భీమన్న రాసిన 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. అలాగే 2001లో భారత ప్రభుత్వం పద్మభూషణ్

సంస్కృతంలో మహాకవి కాళిదాసు రచించిన మేఘ సందేశంలో 'మేఘం'తో సందేశం పంపించిన తీరును, అలాగే తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా తాను రచించిన 'గబ్బిలం' కావ్యంలో వస్తువు అంటరానివాడు 'గబ్బిలం' ద్వారా శివునికి తన బాధని వ్యక్తపరిచినట్టు, భీమన్న రాసిన 'ఒంటరి గొంతు' ఆత్మాశ్రయ కావ్యంలో 'కోకిల'ను వస్తువుగా తీసుకొని ఉగాదినాడు వచ్చిన కోకిలను ఆహ్వానం పలుకుతూ ఒంటరిగా కూసిన కోకిలను రాగాలు తన కావ్యం పలుకుతున్నాడు కవి బోయి భీమన్న.

"నా గొంతు ఎప్పుడూ ఒంటరిది కాదు.
నేను కో అంటే కోటి మంది చుట్టూ చేరేవాళ్లు
అప్పుడు నీవూ అంతేగా!
నీ చుట్టూ కోకిలలు గుంపులుగా వుండేవి
ఇప్పుడేది ఆ శోభ?" (పుట: 533)

ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ దుఃఖాలు ఉంటాయి. ఒకప్పుడు ఉన్న ఆనందం వర్తమానంలో ఉండదు, వర్తమానంలో ఉన్న బాధ భవిష్యత్తులో ఉండదు. కాలక్రమేణ జీవితంలో అనేక మార్పులు సంభవిస్తాయి. భీమన్న రాసిన 'గుంపులేమయ్యారు' కవితలో ఒంటరి జీవితాన్ని గురించి వివరించారు. కోకిల ఒంటరిగా అరుస్తున్న విధానాన్ని గుర్తించారు. ఒకప్పుడు గుంపులుగా తన చుట్టూ ఉండే కోకిలలు ఇప్పుడు లేదని గుంపులు గుంపులుగా ఉండే మీ కళ లేదని, ఒంటరితనాన్ని ప్రస్తావించారు. అందరూ ఉంటే ఆ సందడి వేరు. కాని ఒంటరిగా ఉంటే ఆ కళ ఉండదని కవితలో చెప్పారు.

"సహజ జడత్వం మంచి
మానవుడ్ని ఉద్ధరించాలని
ప్రతి ప్రవక్తా అరిచి చచ్చిన వాడే
స్వజనం చేతనే శిక్షింపబడ్డవాడే
ప్రతి ప్రవక్తదీ ఒంటరి గొంతే" (పుట : 549)

ప్రతి మనిషిని సరైన మార్గంలో నడవాలని ఎంతో మంది ప్రవక్తలు చెబుతుంటారు. నీతి, నియమాలతో, న్యాయం, ధర్మాలతో సన్మార్గంలో మానవత్వంతో జీవించాలని ఎందరో మహనీయులు బోధనలు చేశారు. కానీ చివరికి జనం వల్లనే మరణించడం జరుగుతుందని కవి నివేదనను ప్రకటిస్తున్నాడు. 'ఒంటరి చావులు' కవితలో మనిషికి మంచి కంటే చెడునే ఎక్కువగా సమాజంలో రూపుదిద్దుకుంటుందని, ఎవరు ఎంత హిత బోధన చేసినా కూడా వారిలో ప్రవర్తన మారదని చివరికి ఒంటరిగా మరణించడమేనని కవి సమాజంలోని మనిషి ప్రవర్తన తీరును ప్రస్తావించారు.

"సృష్టిలో మొదటి వాస్తవం ఏమిటి?
ఏదీ స్థిరం కాదన్నది!

ఏ వస్తువైనా ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు
ఏమైపోతుందో తెలియదు.
ముందూ తెలియదు, తరువాతా తెలియదు
ఈ నడుమ జీవితం
ఎంత కాలమో తెలియదు
ఎలా నడుస్తుందో తెలియదు." (పుట : 554)

సృష్టిలో ఏది శాశ్వతం కాదు. ఒక వస్తువు ఎలా ఆవిర్భవించిందో తెలియదు, చివరికి ఎమైపోతుందో తెలియదు. వర్తమానం, భవిష్యత్తు కూడా తెలియని పరిస్థితి. అటువంటి పరిస్థితులల్లో మనిషి జీవితం ఎంత కాలం ఉంటుంది? ఎలా ఉంటుంది? మనిషి దేని కోసం ఆరాట పడుతున్నాడు. ఎన్నో మోసాలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతులు చేస్తూ మనిషి మనుగడ దేనికోసం? స్వప్రయోజనాల కోసం మనిషి మనిషిని ఎందుకు హింసిస్తున్నాడు. అంటూ కవి "తెలియని గతం" కవితలో ఈ భూమ్మీద ఏది శాశ్వతం కాదని కవి ఆరోపిస్తున్నారు.

"సామాన్యుడికి వుండే భావాలే
నాయకుడికి వుంటై,
సామాన్యుడు చెయ్యలేని పనిని
నాయకుడు చెయ్యగలడు
సామాన్యుడంటే గతాన్ని అంటిపెట్టుకొని వుండే వాడు
గతంపై ఆధారపడి బ్రతికేవాడు
గతాన్ని అనుసరించి నడుచుకొనేవాడు
గతంలోని లోపాలను సహించేవాడు
ధిక్కరించే ధైర్యం లేనివాడు!" (పుట : 556)

ఈ కవితలో సామాన్య మానవుడికి నాయకుడికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. నిజానికి నాయకుడికి సామాన్యుడి జీవితంలా వుంటే తన కష్టాలు, బాధలు తెలుస్తాయి. అప్పుడు నాయకుడు దానిని పరిష్కారమార్గం చేస్తాడు. కానీ అటువంటి దృక్పథం నాయకుడిలో లేదని కవి చెబుతున్నాడు. సామాన్య మానవుడికి తనకు ప్రశ్నించే తత్వం ఉండదు కాబట్టి గతంలోనే మునుగుతుంటాడు. ఎప్పుడైతే సామాన్యుడిలా నాయకుడు ధిక్కార స్వరం వినిపిస్తాడో అప్పుడు వ్యవస్థ కూడా అభ్యున్నతి పొందుతుందని తెలుస్తుంది.

కవి అందుకే నాయకుడికి అధికారంలో ఉంటాడు కాబట్టి సగటు మానవుని జీవితంలో ప్రవేశించి ప్రకాశింప చేయాలని ఆశిస్తున్నాడు కవి. కాలాన్ని తన అనుకూలంగా మార్చుకొని కార్యసాధనకు పూనుకున్నవాడే 'ప్రవక్త' అని అంటారు.

"గతానుగతికంగా సాగిపోవడమే
స్వభావమైన సమాజాలు
ఇప్పటికి అలాగే సాగుతున్నై!
గతాన్ని పట్టుకొని వేలాడుతూ
వర్తమానాన్ని ముందుకు పోనివ్వడంలేదు
భవిష్యత్తు శమ వికాసం పట్ల
ఆసక్తి లేదు, అవగాహన లేదు" (పుట : 557)

ఈ కవితలో కవి సహజసిద్ధమైన జీవితంలో ఎలా ముందుకు నడవాలో చెప్పిన కవిత. ఎప్పుడైనా సరే గతాన్ని పట్టుకొని జీవనాన్ని కొనసాగించకూడదు. గతం గతః అంటూ ముందుకు నడుచుకోవాలి అప్పుడే వర్తమానంలో ఎటువంటి సమస్యలు ఉండవు. కాని గతాన్ని తవ్వే కొద్ది భవిష్యత్ కార్యాచరణ ఆగం అవుతుందని కవి చెబుతున్నారు. వాస్తవానికి గతాన్ని విస్మరిస్తేనేకాని రాబోయే రోజుల్లో క్రమ వికాసం చెందుతుంది.

"నమ్మకానికి రూపమూ లేదు,
బుద్ధికి నిలకడా లేదు!
అది నాదయినాగాని, మరొకరి దయినాకాని
నేను నమ్మేదంతా నాకు నిజమే
మరొకడికి అది నిజం కాకపోవచ్చు
నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలే!" (పుట : 561)

నిజానికి నమ్మకం అంటే ఏమిటి? దానికి రూపం లేదు కదా! మరి నమ్మకం ఎలా ఉంటుంది. అంటే మనిషి మనిషిని మాటలో కాని చేతల్లో కాని చేసి చెప్పడం

జరుగుతుంది. మానసిక బుద్ధిహీనంగా ఉంటాయి. అందరివి ఒకరి సిద్ధాంతాలు మరొకరికి నచ్చదు. కాబట్టి నమ్మకం అనేదే మూఢ నమ్మకాలు. కాబట్టి సృష్టిలో సృష్టికర్త ఒకడే అని చెప్పడం నిజం కాదని కవి అంటున్నాడు.

"చెడు నుంచి విముక్తిని కోరే మంచివాడు
ఎల్లప్పుడూ ముళ్ళ కిరీటాలు ధరించవలసిందేనా?
కళ్ల గంతలు లాగి పారేసి
న్యాయ దేవత సూటిగా లోకాన్ని చూడలేదా?
చెడు అనను, కనను, వినను అనే కోతులు
వికలాంగులుగా వుండి పోవలసిందేనా?"

(పుట : 562)

సమాజం మంచి కోరే అందరూ కూడా దోషులుగా చిత్రీకరిస్తారు. నిజానికి న్యాయం చెప్పే దేవత కోర్టులో కళ్ళకు గంతలు కట్టి వేస్తారు. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడే న్యాయదేవతకు అటువంటి దుస్థితిలో ఉంచాలా? అలాగే చెడు మాట్లాడకు, చెడు చూడకు, చెడు వినకు వంటి ధర్మాలు పాటించిన కూడా వికలాంగులుగా గుర్తించారంటూ కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనంతటికీ కారణం ఎవరు? సమాజంలో మంచి కోరే వారిని వికలాంగులుగా, అంధకారులుగా, చెవిటివారిగా, మూగవారిగా ఎందుకు చిత్రించారు. సమాజంలో ప్రజలు ఎందుకు మార్పు రావడం లేదు. దిగజారిపోతున్నారని కవి ప్రశ్నిస్తున్నాడు. 'వికలాంగులు' కవితలో సామాజిక చైతన్యం రావాలని, అభ్యున్నతి ప్రజలు పొందాలని కవి ఆశిస్తున్నాడు.

బోయి భీమన్న రాసిన 'ఒంటరి గొంతు' కవిత్వంలో తన సమకాలీన సమాజంలో ప్రబలిన అంశాలపై ప్రతిస్పందిస్తూ సామాజిక నేపథ్యంలో మానవీయ కోణంలో కవితలు రాశారని చెప్పవచ్చు. నిజానికి ఈ కవితలు ఉగాది పండుగ సందర్భంలో రాసినప్పటికి కూడా సమాజంలో అంశాలను వస్తువుగా తీసుకొని కవితలు రాశారు బోయి భీమన్న గారు. అందుకే సామాజిక కవిగా గుర్తింపు తెచ్చుకున్నారు బోయి భీమన్న.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఒంటరి గొంతు - బోయి భీమన్న
2. పాలేరు నుండి పద్మశ్రీ వరకు - హైమవతి

"త్రి పదలులోని తాత్విక వికాసం"

– తుమ్మలపల్లి సోమశేఖర్ (తుసో), పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల

ఈ విశాలమైన విశ్వంలో విశ్వజనీనమైన భావజాలంతో ప్రతి రచన వ్యక్తిలోని మానవతా వైశాల్యాన్ని పొందించే సౌభాతృతవం కలిగి అన్ని కులాల వర్ణాల వర్గాల ప్రాంతాల వారిని రచయితగా కవిగా విమర్శకుడిగా ఉపన్యానకుడిగా యోగిగా నూక్ష్మమైన నమాజ పరిశీలకుడిగా బహుముఖ ప్రజ్ఞావంతుడిగా అనేక పాత్రలలో పరికాయ ప్రవేశం చేసి ఎన్ని రచనలకు శ్రీకారం చుట్టి మన ముందు ఉంచి ఉన్నతమైన విలువలు కలిగిన ఉత్తమ పురుషుడు మన భోగి భీమ్.

వీరి ప్రతిభా పాటవాలకు హద్దులు లేవు అనంతమైన ఆకాశమే వారి రచన ప్రయాణానికి రాచబాట. వారి బాటలో నేడు ఎందరో కవులు రచయితలు వారి రచన ప్రయాణం కొనసాగించడానికి పునాది నిలిచారు బోయిన భీమన్న గారు. వీరు చిన్నతనం నుండే కలం పట్టి సాహిత్య వ్యవసాయం చేసిన సాహిత్య. వీరి నాన్న గారు వేదాంతి కావడం వలన వీరిలో కూడా వేదాంత భావజాలం స్పష్టంగ కనబడుతోంది అస్పృశ్యత వీధి సంకల్పం ముందు ఆమడ దూరం ఉండేది వీరు బురదలోని తామర కమలం ఇలాంటి వ్యక్తిత్వంతో వ్యవస్థను ప్రభావితం చేసిన ఆదర్శమైన వ్యక్తిగా నిలుస్తారు పట్టు పట్టిన ప్రతి అంశాన్ని పట్టు విడువక అందులో పరిణితి సాధించి వారి రచన కుసుమాలలోని పరిమళాన్ని పాఠకులకు అందించి అనగారిన ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన నికార్సైన సాహితీమూర్తి మన భీమన్న.

అంతులేని ఆత్మవిశ్వాసానికి వీరు నృష్టించిన సాహిత్యమే సాక్షిగా నిలుస్తోంది ఏడవ తరగతి నుంచి ఏమిట్ట ఈ ప్రపంచం అని ప్రశ్నిస్తూ ప్రతి క్షణం ఆత్మ పరిశీలనతో కదం తొక్కి పదం పలికిన పరిశీలకుడు పామరులకు సైతం అర్థమయ్యే పాలేరు లాంటి నాటకం రాసి పామరులను పావనం చేసిన పావన మూర్తి మన భీమన్న నా వారు రాసిన ఎన్నో రచనలు భాగంగా ఇప్పుడు మనం "త్రి పదలు" అనే రచనలు బోయి భీమన్న వ్యక్తి వికాసం కోసం నృష్టించిన సాహిత్యం స్థూలంగా కాక నూక్ష్మంగా పిరశీలించే ప్రయత్నం చేద్దాం నకల జీవరాసులలో మనిషికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది మనిషి పశుత్వం నుంచి మానవత్వం వైపు నడవడమే మాధువుడిగా ఎదగడమే భోయి భీమన్న భావన ఈ రచనలో వీరు ఓ ప్రత్యేకమైన ప్రక్రియను ఎంచుకొని అందులోని క్లిష్టమైన భావాన్ని సైతం స్పష్టంగా అల్ప అక్షరాలతో సరళమైన భాషలో భావ వ్యక్తీకరణ చేయడం జరిగింది.

త్రిపదలు అనగా మూడు పాదాలతో అక్షర నియమం లేకుండా అందరికీ అర్థమయ్యే లక్షణంతో తాగే ఓ అద్భుతమైన ఈ ప్రక్రియ ఈ త్రిపదలు.

త్రిపదలు పుస్తకంలో బోయి భీమన్న ఒక మాటలో త్రిపదల గురించి ఈ విధంగా చెప్పడం జరిగింది. మొన్న ఈ మధ్య ఏదో రాస్తూ ఉంటే భావం మూడు పాదాలలో నే ముగిసింది. దీనిని ఇలాగే వుంచేద్దాం ద్విపద లాగే త్రిపదలు ఎందుకు ఉండకూడదు తెలుగులో ఇంత వరకు ఉన్నట్టు లేదు లేకపోతే మాత్రం ఇప్పుడు రాయకూడదు అన్న ప్రశ్నతో ఈ ప్రక్రియను యధాతథంగా చేయడం జరిగింది. అలా అనుకొని వ్రాయడం మొదలు పెట్టినా భీమన్న వారం రోజుల్లోనే ఒక 100 స్వేచ్ఛా గీతాలై అనుకోకుండా నే మరో 50 వరకు వ్రాసి మరో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు భీమన్న గారు రాసిన త్రిపదుల గురించి తెలుసుకొని చందస్సులో త్రి పదుల వృత్తం ఉందని ని శ్రీ వడ్లమూడి వారు కన్నడంలో ఈ ప్రక్రియ ఉందని శ్రీ నిడదవోలు గారు అన్నారు వాటి

సంగతి ఏమిటో నాకు తెలియదు కానీ నాకు సహజంగా గురించిన ఈ భావన నా దృష్టిలో కొత్తగా తోచింది అని భీమన్న గారు తన మనసులోని మాటను వ్యక్తపరిచారు.

ప్రతి మనిషికి వారు పెరిగిన వాతావరణాన్ని బట్టి వారి జీవిత అనుభవం ఉంటుంది అలాగే భోయి భీమన్న గారు వారు సూచించిన అనుభవాలను త్రి పదుల రూపంలో మన ముందుకు తీసుకువచ్చారు ఇందులోని కొన్ని భావాలు కొందరు ఏకీభవించిన మరికొందరు ఏకీభవించకున్నా ఇవి నా అనుభవాలు అని కుండలు బద్దలు కొట్టి చెప్పిన నిర్భయ కుబేరుడు మోహమాటం లేని మోక్ష పరాయణుడు బోయి భీమన్న హృదయం నుంచి వచ్చిన కవిత్వమే ఈ త్రిపదలు అని ఇది ఎంతో సహజంగా నా నుంచి వచ్చిన నాణ్యమైన మేలిమి ముత్యాలు వంటివి అని ఇవి వ్యక్తి వికాసానికి తోడ్పడ తాయని వారి ప్రగాఢమైన నా విశ్వాసం అందులో మచ్చుకు కొన్నింటిని మనం ఇక్కడ చూద్దాం.

ప్రపంచం గురించి దాని స్వరూపం గురించి బోయి భీమన్న గారు ఇలా అన్నారు.

"నీవూ, నేను, మన చుట్టూ అమృత పదార్థము.
ఈ త్రికమే కదా ప్రపంచం అంటే
దాని నలుపు తెలుపు సమానాలే యీ త్రిపదలు"

ప్రపంచంలో మూడే మూడు పదార్థాలు ఉన్నవని అవి నీవు నేను అమృతం ఈ మూడింటికీ నలుపు తెలుపులు సమానమే అని ఏకత్వ భావాన్ని భావాన్ని చెప్పిన అద్వైతి మన బోయి భీమన్న.

"ఆకాశంలో ఎగురుతూ నేలపై ఎలా బ్రతకడం?
ఏదో ఒక హృదయం రథంలా అమరితే కాని
జీవిత రణరంగంలో పురోగతి ఎలా సాధ్యం".

ఈ పదాలను పరిశీలించినట్లయితే నేడు సమాజంలో మనిషి భూమిపై కాకుండా నేలపై నడవాలి అనుకోవడం గాలిలో మేడలు కట్టాలనుకోవడం సరైన ఆలోచన ఎంత మాత్రం కాదని అటువంటి ఆలోచన మనిషిని ఆందో ళనకు అస్వస్థతకు గురిచేస్తుందని అటువంటి ఆలోచన అత్యాశకు తార్కాణమని పతనానికి పునాది అని చెబుతూ మనిషి ఒకే లక్ష్యంతో ముందకు కదిలినప్పుడు మాత్రమే విజయం తన వెంట వీరంగం చేస్తుందని ప్రగాఢమైన ఆత్మ విశ్వాసంతో కదిలినప్పుడు పురోగతి ఉంటుందని బోయి భీమన్న ఈ మూడు పాదాలలో అల్ప అక్షరాలతో సరళమైన భాషతో వ్యక్తిలో చైతన్యాన్ని వాస్తవాన్ని కన్నులకు కట్టినట్లు చూపించారు.

"నీవు నా ఎదురుగా ఉండగా,
బొమ్మల్ని చూస్తూ కూర్చోలేను నేను,
అవెంతటి అమర్ చిత్రాలైనా సరే!".

విగ్ర ఆరాధనే ముక్తి అని బ్రతుకుతున్న మూడ భక్తి నుంచి అసలైన మానవత్వం వైపు అడుగులు వేయడమే సరి అయిన ఆరాధన అని పేదల పక్షాన మూగ జీవుల హృదయాన ప్రేమ కలిగి ప్రవర్తిండమే వ్యక్తిలో మహోన్నతమైన వికాసంగా బోయి భీమన్న భావించారు నేడు మనిషి కన్నా బొమ్మకే విలువ కనుకనే ఎన్ని అడుగుల విగ్రహం నిలిపాన్నది కాదు అందరిలో దైవాన్ని దర్శించడమే పరమాత్ముని దర్శనముని తోచిన సాయం చేస్తూ తోటివారికి సాయపడటం సాగడమే సాక్షాత్కారం అని చెప్పారు.

"అందరి శరీరాలు దేవాలయాలే అయితే,
అందరి ఆత్మలు పరంజ్యోతులే అయితే,
ఫలాన వ్యక్తినే ప్రేమించానంటాడెం మనిషి".

ఈ పాదాలను గమనించినట్లయితే మనిషి ఎటు వంటి తారతమ్య భేదాలు రాగద్వేషాలు వంటి భావాలకు అతీతమైన సమానత్వం స్థితి ప్రతి మనిషిలో వికాసం జరగాలని శరీరమే దేవాలయంగా మనిషి హృదయమే పరమాత్మగా భావించినప్పుడు ప్రతి మనిషిలోనూ పర మాత్మ స్వరూపాన్ని దర్శించగల మని బోయి భీమన్న తాత్విక దృష్టికి తార్కాణంగా ఈ పాదాలు నిలుస్తాయి.

"సుఖాన్ని కోరుతున్నది శరీరం
మడి కట్టుకుంటుంది మనసు
తపస్సు కొని చూస్తుంది ఆత్మ"

శరీరం సుఖాన్ని కోరుతుందని మనసు అనేక కట్టుబాట్లు సాంప్రదాయ ఆచారాలను పాటిస్తుందని ఆత్మ మాత్రమే వీటన్నింటికి సాక్షిగా నిలుస్తూ చూస్తోందని పైకి కనిపించే ప్రపంచాన్ని సాక్షిగా చూడడమే జీవ చైతన్యంగా భావించారు ప్రతి మనిషి ఈ విషయాన్ని గ్రహించి నట్లయితే ప్రతిక్షణం మన జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు సాక్షిగా నిలుస్తాం సాక్షిగా నిలిచినప్పుడు భయం ఆందోళన భద్రతా భావం వంటి భావాలకు అతీతంగా నిరంతరం నిశ్చలమైన స్థితిని అనుభవంలోకి తెచ్చుకో గలము ఇదే విషయాన్ని బోయి భీమన్న పై పాదాలలో తెలిపారు

"గౌరవం మర్యాద విందు వినోదం
ఇలాంటి ప్రభావాలు కాదు నేకోరేది
నీతో ఒక్క లెశం ఏకాంతం!"

నేడు మనిషి కీర్తి కోసంకాంత కోసం డబ్బు కోసం విందు వినోదాల కోనం వరుగులు తీస్తున్న ఆ సమయంలో ఇదే సత్యం అని భావిస్తున్న తరుణంలో దీనికి అతీతమైన అదృశ్యమైన శక్తితో ఒక క్షణమైనా కలవరి ఏకాంతాన్ని పొందాలని ఆ అదృశ్యమైన శక్తి ఎక్కడో లేదు అది మీ లోనే ఉంది అన్న అసలు సత్యం చాటుతూ తనలోకి తాను తొంగి చూసుకోవాలి అన్నా విషయాన్ని వ్యక్తీకరించారు ఈ పాదాలలో బోయి భీమన్న గారు

"దాచుకుంటే పోగొట్టుకుంటావు
ఇచ్చేయ్యడమే భద్రపరచుకోవడం
తనను తాను వదులుకోవడమే ముక్తి!"

వేలకోట్లు దాచుకొని వేదనను అనుభవించడం కాన్న ఉన్నదాన్ని పంచితే ఎందరో హృదయాలలో ఉన్న ప్రాణాన్ని పొందగలమని అటువంటి పంచే గుణం పెంపొందించుకోవాలని ఇతరుల కోసం జీవించడమే ఈశ్వరుడి లక్షణమని త్యాగం ఒక గొప్ప యోగం అని అది ప్రతి మనిషిలో వికసించినప్పుడే సమాజం ఉన్నతమైన సమాజంగా సమ సమాజంగా మారుతుందని బోయి భీమన్న గారి అభిప్రాయం వారి మాటలు అక్షర సత్యంగా నిలుస్తాయి పై పంతుల లోని గూడ అర్థాన్ని పరిశీలించినట్లయితే

"పేరు లేకుండా వృక్షం ఎలా వుంది?
పునాది లేకుండా సౌదం ఎలానిల్చింది?
నీవు లేకుండా నేనెలావున్నాను?"

పైకి కనిపించే ఎన్నో అద్భుతాలు వెనక నీ ఉన్నావు నీవు లేని లోకం లేదు అన్న నా భావనతో పేరులేని వృక్షం వెనుక పునాది లేని ఆకాశం వెనుక నువ్వు ఉన్నట్లే నా లోన నువ్వే ఉన్నావు అన్న భావనతో సృష్టి స్థితి లయ కారకుడివి నీవై విశ్వమంతా నిండి ఉన్నది ఈశ్వర స్వరూపమే అని తేల్చి చెప్పిన అద్వైత వాది బోయి భీమన్న.

"ఎన్నెన్ని నదులు ఒకటిగ కలిసినా
పెద్దదాని పేరే వస్తుంది ఆ నదికి!
ఎన్నో నీవులు కలిసిందే నేను"

నీవులన్నిటికి కేంద్రం నేను నీవు నేను ఒక్కటే అన్న తత్వ మరి అన్నభావన ఎంతో తేలికగా అల్ప అక్షరాలలో నీటి సమాజానికి తెలియజెప్పిన ఏకైక ఏకత్వ ఏకాంత నివాసి ఒక నది ఎన్నో ఉపనదులతో ప్రవహించినట్లు ఒక నేను మంచి ఎన్నో నీవులు సృష్టింపబడినాయి ఈ విషయాన్ని మూడు పాదాలలో తెలిపి జీవుడికి విముక్తిని కల్పించారు బోయి భీమన్న.

ఇటువంటి ఎన్నో తాత్వికమైన భావాలు మనిషిని చేస్తాయి మహర్షి తత్వమే మానవత్వంగా మానవత్వమే దైవత్వంగా దైవత్వం మే అద్వైతంగా చెప్పే త్రిపదలు ఎన్నో ఉన్నాయి అందులో కొన్ని మాత్రమే పైన కొడిక రించడం జరిగింది. లోతైన తాత్వికత ఆత్మ పరిశీలన వంటి అంశాలు ఎన్నో ఈ రచనలో మనకు కనిపిస్తాయి బోయి భీమన్న గారి తాత్విక దృష్టికి మచ్చుతునక లాంటివివి ఇంకా ఎన్నో ఇటువంటి ఈ గ్రంథంలో

తారసపడతాయి ఇటువంటి ఈ గ్రంథం చదివే అవకాశం కలిగినందుకు నేను ధన్యుడను. త్రిపదలు అనే గ్రంథం బోయి భీమన్న శతకానికి పైగా మూడు పదాలలో రాసేటప్పుడు పదే పదే వారి భావగారైన శ్రీ బి ఎస్ మూర్తి గారు జ్ఞాపకం వచ్చారు వారి జ్ఞాపకార్థం ఈ గ్రంథాన్ని వారికి అంకితం ఇచ్చారు వీరికి సమర్పణ చేస్తూ పోయింది ఏమన్నా ఇలా అన్నారు మీరు గురించి.

"దేశం దేశం ప్రజా ప్రజా అంటూ పరితపిస్తూ
వేదమాత రాల్చిన ఒక్క కన్నీటి బొట్టు నుంచి
పుట్టుకొని వచ్చినవాడు శ్రీబిఎన్ మూర్తి"

ఈ విధంగా 8 త్రిపదలులో వారి బావ గారి గురించి రాస్తూ వారికి సమర్పించడం జరిగింది వీరి అద్భుత ప్రతిభకు పరాకాష్ట ఈ త్రిపదలు.

ఈ వ్యాసాన్ని రాయడానికి ఈ అవకాశం కల్పించిన మద్రాసు తెలుగు శాఖ అధ్యక్షులు మా గురువుగారు విస్తాలి శంకర్ సార్ గారికి శంకర్‌బాబు అన్న కి కాలియప్ప సార్ గారికి మిగిలిన పరిశోధకలందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞత ధన్యవాదాలు అక్షర దోషాలు ఉన్నట్లయితే క్షమించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

❁❁❁

సామాన్యుడి దీపసభ

– డా॥. జొగుల విశ్వ ప్రసాదు, సహాయ ఆచార్యులు, ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

చీకట్లలోంచి వెలుగుల వైపు, అసమానత్వంలోంచి సమానత్వం వైపు దోపిడీ నుండి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలవైపు మనిషిని నడిపిస్తూ దీపధారిగా ఉండే సాహిత్యం సామాన్యుడికి చెందినది. ఎక్కడెక్కడ తాను మోసగించ బడుతున్నాడో, అవమానించబడుతున్నాడో తన శ్రమ నిష్ఫలంగామారి, తన ఉనికి ప్రశ్నార్థక మౌతుందో తెలిసి, తన అసహాతలను, క్రోధాన్నితిరుగుబాటుగా మార్చుకోలేని సామాన్య కర్షక కార్మికలను, గమ్యం వైపుగా అడుగులు వేయించేది, మార్గాన్ని సుగమం చేసేది శ్రామిక సాహిత్యం.

భీమన్న ఐదారేండ్ల వయస్సులో "అమ్మా! ఈ దీపాలన్న ఆరిపోయి, ఏమవుతాయి?" అని వాళ్ళమ్మనడిగాడు.ఈ దీపం యొక్క పుట్టుకకు సంబంధించిన ప్రశ్న భీమన్నలో చిన్న వయస్సులోనే వచ్చింది. "వెలుగుకి శాశ్వతత్వం ఎందుకు లేదు? అని ప్రశ్నించుకున్నారు. 'దీప సభ'లో ఈ చర్చంతా ఉంది. వెలుగుల్ని కాజేసినది ఎవరు? ఆ చీకట్లలోకి తోసిందెవరు? చీకటి వెలుగుల మధ్య అగడ్తల్ని సృష్టించిందెవరు? వెలుగు కూడ చీకటిని ఎందుకు చీదరించు కుంటుంది? వీటికి జవాబులు "దీపసభ" లో ఉన్నాయి. "పూర్ణ వికాసం కోసం, సంపూర్ణ సాఫల్యం కోసం. అజరామరత్వాన్ని కోరి చీకటి పై వెలుగు, చావు పై బ్రతుకు జరుపుతున్న నిరంతర సమర యాత్రే ప్రగతి" అంటూ ఈ లక్ష్యం వైపుగా మానవుడు పురోగమించాలి అంటాడు భీమన్న.

ఉన్నతమైన సమాజానికి మానవత్వం గీటురాయి. సమాజం యొక్క ఔన్నత్యం మానవ వికాసంలోనే ఉం టుంది.... పసి ప్రాయం నుండి క్రమేణా ఎదుగుతూ నిండైన మానవతామూర్తి గా వికాసం చెందడం మనిషి లక్ష్యం. కవి సమాజంలోని అమానుష సంఘటనలకు చలించిపోతూ, తన రచనల ద్వారా చీకటి సమాజం పై వెలుగును ప్రసరింప జేస్తాడు.

"దీపసభ" సర్వశక్తులు, సర్వకాంతులు మానవునిలోనే కలవని, ఆనందరూపమగు బ్రహ్మ మానవుడేనని ప్రకటిస్తూ, రమ్యము, పారమ్యమూ అయిన ఆ మహోదయము మధుర రుచులలో ఈ కావ్యం పర్యవసిస్తుందని " భీమన్న ముందుమాటలో చెప్పాడు.

'దీపసభ' లో పాత్రలన్నీ దీపాలే. ఒక్కో దీపాని ఒక్కో కథ, ఒక్కో ప్రయోజనమూ. మైనపు దీపము, బండి పోపము, హరికేను లైటు, ఉల్క, గుడి దీపము, వీధి లాంతరు, విద్యుద్దీ పము, సెజ్జ దివ్వె, ప్రమిద దీపము ఇలా అనేక దీపాలున్నాయి. ప్రధానంగా అన్ని దీపాలు సామాన్యుడి గురించి చర్చించాయి. ఈ చర్చలో దోపిడి, బరితెగింపు, మోసం, అజ్ఞానం, స్వార్థం, భ్రాంతి లాంటి చీకటి' చర్చలే కాక, సామాన్యుడు, సేవాభావం, నిజాయితి, సత్యం,సమానత్వం, శ్రమ విలువ, కష్ట ఫలితం లాంటి వెలుగుల ప్రస్థానాలు కూడా ఉన్నాయి. ఈ వ్యాసం వీటి మీదుగా సాగినది.

'వెలుగు - చీకటి - ప్రగతి' అనే క్రమంలో 'చీకటి' ని దాటి వెలుగుల దారిగుండా ప్రగతి వైపు ప్రయాణ ముండాలి అనే విషయం తెలుస్తుంది. ఈ కావ్యంలో "వెలుగు" కూడ సామాన్యుడి జీవితం పై తిరస్కార ధోరణితో ఉంటుంది.- "....అంధకారము పై దండయాత్ర మనది" అని దీపం వెలుగును ఆహ్వానిస్తుంది. మనిద్దరం వాస్తవమనీ, "పరరమ శక్తి"కి రెండు రూపాలమని అంటుంది. బీదవారి, కూలిన గోడల్లోని, చిరిగిన బతుకుల్లోకి వెళ్ళేందుకు వారికి స్వాంతన చేకూర్చేందుకు 'వెలుగు' నిరాకరిస్తుంది. దీపం ఈ విషయాన్ని గమనించి "హృదయముగద వాంఛితార్థ మిలనెవ్వరికిన్" అని - 'వెలుగు'లో హృదయం లేకుంటే, ఆ వెలుగే ప్రశ్నార్థక మంటుంది. "కలమి లేములు తేడాలు గలవు..... ఇదేమి/

చీదరింతువు తైలము లేదటంచు" అంటూ బీదవారి జీవితాలని అపహాస్యం చేసిన వెలుగును నిలదీస్తూ "లేని చోటు లేని, లేచిపోవుట లేని / జ్యోతి కేము పూజ చేతుమెపుడు" అంటూ వెలుగుకి శాశ్వతత్వం ఎందుకు లేదు?"'అన్న భీమన్న ప్రశ్నకు వెలుగు దారులు చూపించింది. "నీడను విదల్చి నిండుగ నిల్చి వెలిగి / దారి చూపుము శాశ్వతత్వమును కీవ" అని దిశానిర్దేశం చేస్తుంది.

"వెలుగు" ఎందుకు అనే ప్రశ్న వేస్తూ వెలుగుతున్న ప్రతీదీ ఒకప్పుడు ఆరిపోవాల్సిందేనా! శాశ్వతమైన వెలుగు ఎలా ఉంటుంది. అసలు ఉంటుందా? శాశ్వతత్వం రావాలంటే "వెలుగు"ల ప్రయాణం ఎలా ఉండాలి? అనే మానవ జీవన యానంలోని మానవీయ గుణాలను గుర్తుకు తెస్తుంది. శాశ్వతంగా ఉండేవి కీర్తులపకీర్తులేకాబట్టి మనిషి తాను స్వార్థరహితుడై, తన ఉనికికి ప్రయోజనాన్ని కల్పించుకున్నప్పుడే ఇది సాధ్యమౌతుంది" వెలిగింప వెలిగి తైలము/కలిగిన కానంత సేపు కాంతినొసగి, యా/ వల మాసిపోవు దివ్వెకు/ ఫలమేమిటి? వెలుగుకిట్టి బ్రతుకేమిటికో! అంటూ- చిన్న దివ్వే - తనకున్నకాంతితో జీవిత కాలం, ఇతరులకు సేవచేస్తూ, తైలము (జీవనము) అడగంట గానే, ఆరిపోయింది. కానీ శాశ్వతమైన 'వెలుగు'కీ దయాగుణమెందుకు లేదో అని బాధపడ్తుంది.

ప్రగతి మార్గానప్రయాణించే మానవుడి, జీవితం, అనేక పోరాటాలను చూడవలసి వస్తుంది. ఎదిరించి పోరాడవలసి వస్తుంది. ఒక ఆయుధం నిరుపయోగం కాగానే, వేరే మార్గాన్ని ఆయుధాన్ని, శక్తిని సమకూర్చు కోవాల్సి వస్తుంది. సమాజంలో సమతామార్గం. అంత సులువుగా ఏర్పడదు. "విప్లవము నుండి / అభ్యుదయ మందు నరుని శ్రేయస్సు వోలె" తాను బలపడాలి. అలా తననుతాను సమాజానికి అర్పించుకున్న వీరుడు- సదా స్మరణీయుడు అవుతాడు. చివరివరకు పోరాడే శక్తి, ధైర్యం సొంతమైతే ఎలాంటి పరిస్థితుల్లో నైనా విజయం సాధించగలమనే స్ఫూర్తిని గ్రహిస్తే, "నాకదు పూరింటి చిరుదివె పాదములకు/ భాగ్య సౌధాల దీపాలు ప్రాంజలించు అంటాడు కవి. చేసిన పని నిష్కల్మషంగా, స్వీయ ప్రయోజనాలకు దూరంగా చేస్తే శత్రువు, ప్రత్యర్థులుకూడ మనల్ని గౌరవిస్తారు. ఇదే క్రమం తప్పకుండా సాగినట్లయితే "ఒక వీధినె మేడలు, పూరి గొంపలున్ కనబడవింక, క్రొత్త పద/ కమ్మున నేనిపుడేఉ గుదారులన్" అని ప్రగతి పథం వైపు ప్రయాణపు సాధక బాధకాల్ని ఈ తెలివితో, ఓర్పుతో, ధైర్యంతో విజయ తీరాలను చేరే క్రమాన్ని వివరించాడు.

మనిషిలోని స్వార్థం, మోసం, దోపిడే మనస్తత్వాల కారణంగా సమాజంలో అసమతౌల్యం విపరీతంగా పెరిగి, మనిషికి మనిషికి మధ్య పూడ్చలేని అగాధాలేర్పడు తున్నాయి. జీవిక కోసం మనిషి ఎంతకైనా తెగించి, సాటి మనిషిని నిలువునా దోస్తూ దాన్ని హక్కు'గా భావించి దర్జాలు పోవడమ్మే గర్హనీయం. శ్రమ జీవికి శ్రమ తప్పదు. బతకాలంటే ధర్మ మార్గాన ఏదో పని చేసుకోవాలి. శ్రమ వారి పెట్టుబడి. కాని దాన్ని దోచుకునే దొంగలు, సోమరులనుండి రక్షించుమని 'హరికేనులైటు' అడుగు తుంది. జానా బెత్తెడు లేని జనపదాల్లోనే దోపిడి మొదలైందంటే, నగరాల్లోని దోపిడిని వర్ణించే తరము కాదు. "కాల దోషముపట్టె లోకమునకు తల్లీ" అని కవి వాపోతాడు. క్రూర జంతువులన్న అరణ్యాల్లో చింత లేకుండా జీవించవచ్చు. ఈ నగర ప్రజల మధ్య బడుగు జీవితం సాహసమనే చెప్పాలి.

అసలు ఒక వ్యక్తిని దోచుకునే దుర్మార్గమైన ఆలోచనే అమానవీయమైనది. వంచన చేసి జీవించడమనేది మనిషి పతనానికి పరాకాష్ఠ. ఎదుటి వ్యక్తి యొక్క అసహాయ పరిస్థితులను పట్టించుకోకున్నా ఫరవాలేదు కానీ, ఆ పరిస్థితులను కూడ స్వాధీన పరుచుకోవడమే వికృత క్రీడ" ప్రతీ వ్యక్తికి జీవించే హక్కు ఉంటుంది. ఈ హక్కును దోచుకోవడం రాక్షసత్వం, అలా కాకుండా "నీవ యితోధి కముగ/సత్తువను మానవుని గుండె కిత్తువేని/ క్రొత్త

దారులు నతడు పురోగమించు" కాబట్టి, సామాన్యుడు జివించే హక్కు హరించకుండా, కొంత సాయం చేస్తే, కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాడు. అక్కడ సుఖశాంతులు కాంతులీనుతాయి.

మనలో దాగిన అసహజపు మనస్తత్వం సమాజంలోని వ్యవస్థలపై వ్యతిరేక ప్రభావాన్ని చూపెడుతుంది. సమతౌల్యంలేని ఆలోచనలు సమాజంలో అలజడలని సృష్టిస్తాయి. కలిసి ముందుకెళ్ళాల్సిన తరుణంలో 'కత్తుల వంతెన' సమాజాన్ని అడ్డగోలుగా విభజిస్తుంది. ముందుకు సాగాల్సిన సమయంలో "కాస్త ముందున్న తనపైకి కత్తి విసరు/ వెనక వచ్చెడు తన పైనే విషము గ్రక్కు' అంటూ ముందువెనకలప్రయాణాన్ని కూడా నరక కూపంగా మార్చే దుర్మార్గులు ఉంటారంటాడు కవి. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు సమాజం, ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా "రూలు దారి రూలుది తన త్రోవ తనది/ నరుని బంధించు సూత్రమ్ము ధరణి లేదు.. అంటాడు భీమన్న.

బలహీనుల, పేదల శరీర కష్టమ్మీద మొలచిన బ్రహ్మ జెముడు లాంటి సుఖశరీరాలు హృదయాల్ని ఎప్పుడో తుంచేసుకుంటాయి. వారికి దోపిడీయే పరమార్థం ... దోచుకున్న జీవితం, సంపద, శక్తి వారికి ఏ మాత్రం ఉపయోగపడక పోయినా ఎదుటి ప్రాణాలను కనీసంగా గౌరవించలేని పెళుసు బారిన జీవితాలు వారివి. "ఎచట హృదయమ్ము లోపించు నచ్చట సిరులు/ రాసులై చేరి జీవసారములు పిండు/ఒక్కడాకలి వేయక ముక్కుచుండ/ పెక్కుడాకలి పొక్కుచుండు ఇలాంటి వారిని అంత రాత్మలను బలియిచ్చే వారని కవి నిరసిస్తాడు..

మనిషిని ఎంత హింసించినా, జీవితపు విలువ, బతుకులోని మాధుర్యం, చేసే పని పట్ల గౌరవం అతనిని బతికిస్తుంది. అయితే ముందుగా 'దాస్య విముక్తికై అతడు దారులు వెతుక్కోవాలి. ఎందుకంటే "ఆకు బనిసి క్రింద ననిగిపోయిన గడ్డి/ పరక నీరసించి పాలిపోవు/పారతంత్ర్య మందు బడియున్న జీవికి/ప్రగతి లేదు. కడకు బ్రతుకే లేదు. కాబట్టి, ఉపకారం మనిషిని నిలబెడుతుంది. ఎదుటి వారికి చేసిన సాయం పరిమాణంలో ఎంతైనా సమయానికి అది సంజీవని. "జీవరాశికి చేసిన సేవ తృణమే/యైన, నదికోటిసేయు, దివ్యత ఘటించు. తన చేయగలిగినది, చేయాల్సింది. తప్పకుండా చేయడం లోనే దివ్యత ఉంటుంది. సమానత్వం వైపు వేసే అడుగులకు ఇది ప్రారంభసూచికలాంటిది. ఈ సేవ' 'లేమి' ని పూరిస్తుంది. అప్పుడే "మనుజలోకమ్ము సంపూర్ణమై వెలారు"తుంది. తను పడిన శ్రమకు తగిన ఫలితం లభించిన సమయంలో "మానవుని యాననము జూతు/ మేని, నీ దివ్యకాంతించు నందు" అంటాడు కవి.

దుర్భేధ్యమైన ఈ అసమ గోడల్ని బద్దలు కొట్టు కుంటూ సామాన్యుడు ప్రయాణం సాగించాలి. ఈ క్రమంలో అతడు మరింత మహనీయుడు కావాలి. సమాజానికి మార్గదర్శనం చేయాలి. కుయుక్తుల్ని ఎదిరిస్తూ శక్తుల్నినమీకరించుకుంటూ దారులు వేసుకుంటూ, వెలుగుల్ని పూయిస్తూ దీపశిఖంగా మారాలి. అప్పుడు ",,,వారి అమృత గాన వర్షమ్ములో రాళ్ళే/ చివురులెత్తు, మ్రోళ్ళ చెప్పనేల" కాయ, కష్టము చేసి, సాగు చేసి, ఫల సాయము తీసి, దేశానికి అన్నం పెట్టి, తాను పస్తుంటే అతన్ని ఏమని పిలవాలి? "..... మించి వేరే యొక/ దైవము గల్గునే మానవావనిన్" అంటూ కీర్తిస్తాడు కవి. ఇలాంటి కార్మికుని గురించి ఏపుస్తకము రాయుదు. నీతి శాస్త్రాలపై నిలబడి అతడు నిర్ణయాన్ని కోరుతున్నాడు. రేపటితిండి గురించి, నిష్పాక్షికమైన నిర్ణయాన్ని తీసుకోలేకపోతే సంఘం చక్కదిద్దబడదు అంటాడు భీమన్న. ప్రమిద దీపాన్ని ప్రశిస్తూ కావీ-బ్రతుకు పోరాటంలో మనిషి ఏది దొరికితే దాన్ని అస్త్రంగా వాడు కుంటాడని, దాని వలన చక్కగా నిర్మాణం అవుతున్న సమాజం మళ్ళీ గాడి తప్పరాదని "...పంపు మెవ్వరి రాజ్యము వారికిచ్చి" పాలు పంచమంటున్నాడు కవి. కష్టమో, - సుఖామో జీవితాలు వారివి. ఒకరి జీవితాన్ని వేరొకరు శాసించకుండా, ఎవరి ధర్మం" వారు

చక్కగా నిర్వహిస్తే సర్వోదయమ్ము అని పొంగిపోతాడు కవి, నిజానికి ఫలితము కంటే కూడ దాని సాధనలో పడ్డ కష్టాలు, పొందిన అవమానాలు, బాధలు, దు:ఖాలు ఇవే కఠినమైనవి. ఈ కఠినతనే మనిషికి అనుభవాన్నిస్తుంది. భూమికి ఉండే ఓర్పు కర్షకునికి ఉందని - అతని కష్టార్జితము దోపిడీకి గురి కారాదని "... అతని గుండె నవనికిమ్ము" అని ప్రమిద దీపాన్ని ఆర్థిస్తాడు కవి. ఇలా, సామాన్యుని జీవితంలోని అనేక సమస్యల్ని, చీకట్లని చర్చిస్తాయి దీపాలు. చర్చించి, అతడి జీవితం లోనికి వెలుగులు ప్రసరింపజేసేందుకు సమాజం ఏమి చేయాలో సూచిస్తాయి. చీకట్ల నుండి వెలుగులవైపు సాగే ప్రయాణం -మనిషిలోని మానవత్వాన్ని పరిమళింప జేసి, శ్రేయో రాజ్యం వైపు దారి చూపే కాంతిపుంజంగా మనిషిని విస్తరింపజెసేందుకు దీపాలు ఏకసూత్రత పాటించాయి.

ఉపయోగ పడిన పుస్తకం :

1. 'దీపసభ' - బోయి భీమన్న



ఆత్మాశ్రయ కవిత్వ కౌశలం - బోయి భీమన్న

- డా॥. జి. అరుణ, సహాయాధ్యాపకురాలు, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు

"ప్రకరోతి ఇతిప్రకృతి:" ప్రపంచమునకు మూలకారణం ప్రకృతి అని అర్థం. వేదములలోని ప్రకృతివర్ణనలు చాలా వరకు స్వభావోక్తిరమ్యములు. ఇవి ఎక్కువగా వస్త్వాశ్రయ రీతిలో చేయబడినవే. ప్రకృతిని పరమాత్మ విరాట్ స్వరూపంగా భావించిరి. ప్రకృతితో ఆత్మవిషయములను చెప్పుకొనుట రామాయణముతోనే ప్రారంభమేనది. రామాయణంలో ప్రకృతి వర్ణన స్వభావోక్తిరమ్యంగానే చిత్రించిరి. బోయి భీమన్న రచించిన ఒంటరి గొంతుక కావ్యం ఆత్మాశ్రయ కవిత్వానికి నిలువుటద్దం. కవి ప్రకృతితో మమేకమై సమాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే ఖండికలు కలవు. ఇందులో కవి ఉన్నోదయ ప్రవక్తగా కవి చెప్పుకున్నాడు. ఈ కవితా సంపుటిలో దాదాపుగా 76 కవితా ఖండికలు ఉన్నాయి. ఈ కవితలో తేలికపాటి పదాలతో, ఆత్మీయభావనలతో మనసు కవిత్వంగా మలచినకవి బోయి భీమన్న. మానవ సంబంధాల్లోని చిన్నచిన్న ఆనందాలతోపాటు, సామాజిక చైతన్యాన్ని కలిగించాలనే ఉద్దేశ్యంతో ప్రకృతిలోని సౌందర్యభావాలను సామాజికతతో పేనవేసి అల్లుకున్న కవిత్వం "ఒంటరి గొంతుక" కవిత్వం. ఈ కవిత్వంలో ఆయన జీవితానుభవాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ కావ్యంలో కోకిల కవి మమేకమైనట్లుగా కవితల్లో కనిపిస్తుంది. భీమన్న కవితా సృజనకు అనేక ప్రసిద్ధ పురస్కారాలు అందుకున్నారు. బాల్యంలో పన్నెండేళ్ళ వయస్సులోనే మృదుమధురమైన పద్యకవిత వ్రాశారు. శతాధిక గ్రంథాలను రచించి ప్రచురించారు. బెనారస్, ఆంధ్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలనుండి కళాప్రపూర్ణ గౌరవాన్ని, గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. "గుడిసెలు కాలిపోతున్నాయ్" గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వరించింది. భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. భీమన్నగారు 95సంవత్సరాలు జీవించారు. చివరి రోజుల వరకు కవిత్వం చెబుతూనే ఉన్నారు.

భారతదేశంలోని "వైవిధ్యంలో ఏకత్వం" లాగే భీమన్న రచనల్లోనూ వైవిధ్యం కనిపిస్తుందనీ ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన వ్యక్తిగా తన రచనల్లో కనిపిస్తారు. భారతీయ జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాల్సి ఉంటుంది. అంబేద్కర్ విశ్లేషించింది భీమన్న వ్రాసింది అదే. తన జీవితాంతం మానవతావాదిగానే ఉన్నాడు. జాతీయతతో తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతను అనుగుణంగా ఉంటూ, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష ఆయన రచనల్లో, మాటల్లో, వ్యవహారంలో ప్రతిఫలిస్తుంది. ఈ ఆత్మాశ్రయ కవిత్వంలో సామాజిక వైరుధ్యాలు, జీవితాలలోని ఉత్థానపతనాలు నిమ్నన్నతల భావసంఘర్షణలే కనిపిస్తాయి. ఇందులో ఇతివృత్తం లోకానుభవానుభవానికివిపరీతంగా జరిగే ఘర్షణనే. "నేను పుట్టినప్పటి నుంచే కోకిల నా సహచరి. దానిలో ఇలాంటి ఒంటరితనంనే నేనెప్పుడూ చూడలేదు. వెంటనే నాకు ప్రవక్తల్నుపకం వచ్చారు. నా జీవిత ఘట్టాలు ఒక్కొక్కట్నేపకం రాసాగాయి. ఒక సమగ్ర కావ్యానికి అంకురార్పణ జరిగింది. కోకిల ఒంటరిగానే అరస్తూ వుంది. నేను నా కావ్యాన్ని పలుకుతూనే వున్నాను. ఈ ఉభయ సంధ్యల మధ్య నడుస్తున్న నిరంతర జీవన వాహినీ తరంగాలే" అని కవితాత్మకంగా ముందు మాటలో ప్రస్తావించుకున్నాడు కవి.

"ఒంటరి గొంతు" కవితా సంపుటిలోని 'వసంతకోకిల' అనే కవితా ఖండికలో కోకిల ను ప్రస్తావిస్తూ "కోకిల వసంత ఋతువుతో వస్తుందనీ, వర్ష ఋతువుతో వెళ్ళి

పోతుందనీ కవిసమయం అది నిజంకాదని అందరికి తెలిసు అయినా చాలా కవిసమయాలవలెనే ఇది కూడ ఒక లోకవాస్తవం అయింది. ప్రకృతిలో జరిగే చర్యలను నిరోధించగలమా అది సాధ్యంకాదుకదా నేను పుట్టినప్పటి నుంచి నీ గానాన్ని వింటూన్నాను నీ అనురాగాన్ని ఆస్వాదిస్తున్నాను. నీ అనుమతి అక్కరలేదులే అంటూ సాగే కవిత..".

"నీవు నీరవ నిగూఢ రసాలినీ కిసాలయాలలో
సమున్నత స్థాయిసో విహరించే విశ్వగాయినివి
నాకు అందవు, నేను అందుకోలేను
విశ్వమానవ పరిధులు
విశాల తరాలు, విషమ గమనాలు".....

అయితే కోకిలా నా గొంతు లాగే నీ గొంతు కూడా ఒంటరైయిందని కవిత ద్వారా కవి తెలియజేస్తున్నాడు.

'మరకత శ్యామ' కవితా ఖండికలో కోకిల గురించిన వర్ణన కనిపిస్తుంది.

"నీ వెలానూ మరకత శ్యామవే
నీ జంట నవరత్నాల కుప్ప
వెండి బంగారు తీగలకు నవరత్నాలు గుప్పినట్లు
ఎంత సుందరమైన పుంష్కోకిలం
.....
శుక పిక శారికలలో
నీవు మాత్రమే చేతికి చిక్కేదానివి కాదు."

పక్షి జాతుల్లో కొన్నిపక్షులు మాత్రమే పెంచు కోగలుగుతాము. అందులో కోకిలను పెంచుకోటానికి సాధ్యంకాదు. కోకిలకు ఎంత అందమైన స్వరంఉన్నా వీటిని ఇంట్లో పెంచుకోలేము కదా. 'పెంచుకోటానికి అనుకూలంగా ఉన్నాకోకిలను పట్టుకోలేము అని ఈ కవిత ద్వారా ప్రస్తావిస్తున్నాడు.

'భ్రమణ నాదం' కవితలో జీవితాభ్యుదయాన్ని కోకిలకు చెబుతూ... నీవు పాడుతూనే ఉంటావు అది నీ స్వభావం నేను నీ వెంటబడి వింటూనే ఉంటాను భావం అంటూ...

భూభ్రమణ స్వభావం
భ్రమణ వేగ నాద ప్రణవం
ఆ ప్రణవమే ప్రణయం కావటం దాని స్వభావం"

అని ప్రకృతి స్వభావాన్ని ఎలా వికసిస్తుంది. సహజ సిద్ధమైన స్వభావం ప్రకృతిది. కవిత ద్వారా తెలియజేశాడు.

హంపి సంస్కృతీ చైతన్యం అంతా నిశించిపోతుంది అని విలపిస్తూ కవి 'హంపి నిర్వేదం' కవిత ద్వారా తెలియజేస్తాడు.

"మన జాతి చరిత్రలో
సుందర సంస్కృతీ చైతన్యం అంతా
హంపీ క్షేత్రమే అవుతూ వచ్చింది కదూ
సాటిలేని సాంస్కృత వైభవమంతా
స్మశానమై పోతూ వచ్చింది
కారణలేమైనా
కల్యాణ వీరణాలు మృత్యు మృదంగాలవుతూ వచ్చాయి.
అష్టదిగ్గజాలు ఏమైపోయారంటూ
దు:ఖిస్తూ వుంది హంపి"....

శ్రీ కృష్ణదేవరాయలకాలంలో అష్టదిగ్గజకవులతో సాహిత్య వైభవంతో తులతూగుతుండేది. అటువంటి వైభవాన్ని పోగొట్టుకున్న సంస్కృతిగా చరిత్రలో నిలిచి పోయింది. హంపిక్షేత్రమే చరిత్రను తలచుకుని ఏడుస్తుందని కవి తన బాధను కోకిలతో పంచుకున్నాడు.

బోయి భీమన్న గారు మారని సంప్రదాలను ప్రస్తావిస్తూ కొని సంప్రదాలయాలు ఆచారాలు వదులు కోలేని వారికోసం 'మారని సంప్రదాలయాలు' అనే కవితా ఖండికలో ప్రస్తావిస్తూ...

"కరుడు గట్టిన సంప్రదాయం
మార్పును గుర్తించనీయదు
కాలం ఉన్నవోన్నతంగా మారుతున్నప్పుడు
తననుగుణంగా సంప్రదాయం కూడా మారాలికదా
ఒక్కక్షణం మార్పులో వేల సంప్రదాయాలు మారాలి.
ఒక్క క్షణం నిప్పులు
లక్షల లంకా దహనాలు జరగాలి

మానవుడు మహా మహితుడు కాకపోవడానికి
మార్పును సహించిన గతమే హేతువు
హేతువును తొలగించగలది నీ ధాతువు ఒక్కటే"

వర్ణవ్యవస్థను నిరసిస్తూ మారని సంప్రదాయాల ప్రస్తావను కోకిలకు తెలియజేశాడు కవి.

కోకిలను అభ్యుదయానికి ప్రతీకగా మలిచాడు కవి. ఈ ఒంటరి చావులు కవితా శీర్షికా ఖండికలో

"నీవు మధుమాస ప్రవక్తవు
నేను మానవలోక ప్రవర్తనా ప్రవక్తను
మానవులెక్కడున్నా ఏ ప్రవక్తమాటావినరు
సహజ జడత్వం నుంచి
మానవుడ్ని ఉద్ధరించాలని
ప్రతి ప్రవక్తా అరిచి చచ్చిన వాడే
స్వజనం చేతనే శిక్షింపబడ్డవాడే
ప్రతి ప్రవక్తదీ ఒంటరిగొంతే"

ప్రవక్తలు వస్తుంటారు పోతుంటారు. వారి మాటలను పట్టించుకొనే వారు ఉండరు. వారు సమాజానికి అభ్యుదయ పదంలో నడిపించాలనేది వారి ఉద్దేశం మనిషిఅభ్యున్నతి కోసం పాటు పడేవారిని ఎవ్వరూ గుర్తించరు. ఆ ప్రజలే ఆప్రవక్తను శిక్షింస్తారు. సమాజాభ్యున్నతి కోసం పోరాడేవారిని లోకం పట్టించుకోదు. ఈ కవిత ద్వారా సమాజంలో ఉండే ప్రవక్తల గురించి ప్రస్తావించాడు.

'నిత్యోన్నతం' కవితా ఖండికలో సృష్టి స్థితి లయలకూ ప్రయోజకత్వం ఉండాలని కోరుకుంటూ ఉన్నతమైన ఆలోచనలతో ఉన్నతమై ఉండాలి. వాస్తవికతను తెలుసుకొని ఉన్నోదయ ప్రవక్తగా కోకిలను కవిపిలుస్తాడు.

"తొలి నుంచి ప్రకృతి నాయకులం మనం
ప్రజాతంత్ర చోదకులం మనం
మన అంగీకమే శివతాండవం
మన వాచికమే విశ్వవ్యాయం
అతిశయంలో పుట్టాం
అహంకారంతో పెరిగాం"

ఇలాంటి భావాలతోనాయకులుగా, ప్రజాతంత్ర చోదకులంలాగా మనం అభ్యున్నతిని సాధించలేము.

"మనసూ మెదడూ వికసించిన మానవుడు
తదితర జీవరాశుల కంటే హీనంగా
బ్రతుకుతున్న ఈనాడు
జీవితానికి అర్థం రాజకీయం
అభ్యుదయానికి అర్థం వ్యాపారం
వ్యాపార రాజకీయాలు తప్ప
మానవ జీవితంలో మరింకేమున్నది"

'లక్ష్మీపతులూ - పృథ్వీపతులు' కవితా ఖండికలో ధనిక స్వామ్య భూస్వామ్య కూటాలు ఏర్పరచుకొని తామే విష్ణు పృథ్వీపతి అనే సిద్ధాంతం పుట్టింది. కళలన్ని ధనిక, భూస్వామ్యుల వినోదాల కోసం కాలక్షేపాలకు పుట్టినవే అని పై కవిత ద్వారా తెలియజేస్తున్నాడు

"ఒంటరి గొంతుక" కవితా ఖండికలు ప్రజా పాలన, అభ్యున్నతి, వర్ణవైరుధ్యాలను నిర్మూలన, కొల్పోతున్న మానవతా విలువలు, జాతీయ సోషలిజం గురించిన కవితలు కనిపిస్తాయి. మానవ సంబంధాన్ని నెలకొల్పడమే విప్లవోద్యమానికి నాంది. అపూర్వమైన అనుభవాన్ని ఆదర్శంగా లోకానికి అందివ్వడమే ఈ కావ్యం యొక్క ప్రధాన ఉద్దేశం సామాజిక పురోగమనానికి దోహదం చేసే నూతన స్వప్నాలన కల్పనా జగత్తులోనికి తీసుకొని రావటమే నవయుగ సాహిత్య సంప్రదాయలలో ఒకటి అని స్పష్టం చేసిన కవి బోయ భీమన్న.

ఈ విధంగా తన ఆత్మాశ్రయ కవిత్వ కౌశలాన్ని ప్రదర్శించారు భీమన్న ఉన్నోదయ ప్రవక్త ఒంటరి గొంతుక నవసమాజాన్ని నిర్మించటమే లక్ష్యంగా భావించిన కవి మన బోయ భీమన్న కవి.

ఆధార గ్రంథాలు :

1. డా. సి. నారాయణ రెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు
2. డా. బోయి భీమన్న - ఒంటరి గొంతు(సంపుటి)

జానపదుని జాబులులో గ్రామీణ ఆర్థిక స్థితిగతులు

– డా॥. ఖి. భీమమ్మ, తెలుగు అధ్యాపకురాలు, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నాంపల్లి, హైదరాబాద్.

జానపదుని జాబులు పేరుతో లేఖా రచనను డా॥. బోయి భీమన్న గారు రచించారు. వీరు తూర్పు గోదావరి జిల్లాలో మామిడికుదురు గ్రామంలో 19 సెప్టెంబర్ 1911 లో దళిత పేద దళిత కుటుంబంలో జన్మించారు. పుల్లయ్య, నాగమ్మ వీరి తల్లిదండ్రులు.

భీమన్న గారు కొంతకాలం పత్రికా జర్నలిస్టుగా పనిచేశారు. తర్వాత 1940-45 వరకు ఉపాధ్యాయునిగా పనిచేశారు. స్వాతంత్ర్య ఉద్యమకాలంలో క్విట్ ఇండియా ఉద్యమంలో దీక్షతో పాల్గొన్నారు.

వీరి సాహితీప్రస్థానం విస్తృతమైనది. పద్య, గేయ, వచన నాటకం రచనలను చేసిన భీమన్న, సుమారు 70 పుస్తకాలు రాయడం జరిగింది. భీమన్న ఈ రచనలపై వివిధ కోణాల్లో పరిశోధనలు జరిగాయి. వీరి సతీమణి హైమావతి భీమన్న ఆధ్వర్యంలో జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డా॥బోయి భీమన్న పేరుతో ఒక సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసి, వీరి రచనలన్నింటినీ ఎప్పటికప్పుడు ముద్రిస్తుంటారు.

వీరి రచనలు అన్నీ కూడా సామాజిక చైతన్యాన్ని ఆశించి చేసినవే. కాబట్టి వీరిని హృదయ కవి, ఉదయ రచయిత అంటూ కొందరు సాహితీవేత్తలు అభివర్ణించుకుంటారు. జయ జయ జయహే అంబేద్కరా అంటూ అణగారిన వర్గాలకు ఆత్మ గౌరవం నింపిన బోయి భీమన్న 2005 డిసెంబరు 16న కాలధర్మం చెందారు.

జానపదుని జాబులు నేపథ్యం :

చదువు మీద ఆసక్తి ఉన్న ఒక జానపదుడు పేదరికం కారణంగా చదువు కొనసాగించలేకపోతాడు. పట్నం నుండి తన పల్లెటూరుకు తిరిగి వెళ్ళిపోతాడు. పల్లెటూరిలో తన జీవితం ప్రారంభిస్తాడు. ఎన్నో అవస్థలు పడుతాడు. కష్ట నష్టాలు ఎదురుకుంటాడు. ఈ దీన పరిస్థితుల్లో జాన పదుడు ధనవంతుడైన తన మిత్రునికి ఉత్తరాలు రాయడం ప్రారంభిస్తాడు. పల్లెలో తన అవస్థలను తెలుపుతూ, అట్లాగే గ్రామాలలో నెలకొన్న దుర్భర పరిస్థితులను తెలుపుతూ తన వేదనను ఆవేదనను వ్యక్తపరుస్తాడు. ఇదంతా లేఖల రూపంలో ఉంటుంది.

నిచ్చెలీ, ప్రియసఖా, సుహృద్వరా, ప్రియమిత్రమా, చెలీ, అంటూ అంటూ భీమన్న తన స్నేహితుడిని సంభోదిస్తూ జాబులు రాసాడు. మొత్తం పదిహేడు ఉత్తరాలు ఉన్న ఈ వచన రచనలో గ్రామీణ సామాజిక ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా అర్థం అవుతాయి.

ముఖ్యంగా భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. గ్రామ ప్రజలు చదువుకొని అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీజీ ఆశించాడు. కానీ అప్పట్లో గ్రామాలు ఎలా ఉన్నాయి? గ్రామీణ ప్రజల జీవితాలు ఏ విధంగా ఉంటాయి? కనీస సౌకర్యాలు లేని పల్లెల్లో ప్రజల సాధారణ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుంది? తాగుడుకి బానిసలైన మగవాళ్ళ కారణంగా గ్రామీణ స్త్రీలు ఏవిధంగా ఇబ్బంది పడుతున్నారు? వాళ్ళ ఆకలి కేకలు ఏమిటీ? ఈ విషయాలను అన్నింటిని గ్రామాల్లోని దళితుల, పేదల జీవితాలను వివరిస్తూ..... "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలో భీమన్న లేఖా రచన చేశారు. తరువాత 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో "ప్రజామిత్ర"లోనూ మరికొన్ని లేఖలు రాసారు. ఇవన్నీ జనపదుని జాబులుగా ప్రచురింపబడ్డాయి.

సహజశైలి :

భీమన్నగారు తన జాబుల్లో సహజంగా అందరూ మాట్లాడుకునే శైలి ఉపయోగించారు. తాను తన

స్నేహితుడితో నిజంగా సంభాషిస్తున్నట్టుగా ఈ ఉత్తరాలు ఉంటాయి. ఎక్కడా కల్పన ఉండదు. గ్రామీణ స్థితి గతులు కళ్ళకి కట్టినట్టు ఉంటాయి. పల్లె ఇండ్లలో ప్రతినిత్యం కనబడే ఆవేదనలు, అంధకారాలు, తెలియజెప్పే క్రమంలో అక్కడక్కడా పద్య రచన కూడా చేసాడు. ఉదాహరణకు....

"ఘోర గంభీర ఘనాఘన మూల ఘోషల
కోమల చంచల రేఖ లవేమి
మృత్యుభీకరాఖీల తమస్సున
మిణుగురు బుర్యుల వెలుగేమి
నిజోద్రిక్త పూరుష పటుశక్తికి
నిదానమె ఈ రమణీరామము"! అంటూ కడుపు నిండని మట్టి తట్టలు మోసే పల్లె పడుచుల గురించి చెప్పే క్రమంలో ఈ పద్యం రాసాడు. తన సహజ శైలిలో గ్రామీణ అవస్థలను తెలియజెప్తూనే స్నేహితుడి పట్నవాసం బతుకు గురించి, పట్నంలో ఆధునిక స్త్రీల గురించి మాట్లాడాడు.

ఆకలి మంటలు తెలియజెప్పిన జాబు :

నెచ్చెలీ!

నిన్న సాయంకాలం ఇంటికి వస్తున్నాను.

సంజవేళ నూటికి తొంభై తొమ్మిది మంది గ్రామీణుల కొంపలు కూలే, సంజవేళ - ఆయాసంగా ఇంటికి వస్తున్నాను. గ్రామానికి ఒక మూల కల్లుపాక దగ్గర ప్రజలు కుమ్ములాడుతున్నారు. కేకలు, బొబ్బలు వేస్తున్నారు. చెల్లాచెదురైవుతున్నారు. మళ్ళీ కూడుకుంటున్నారు. చిత్తగొల్లుగా వుంది. రోజు అంతే.

ఉదయం నుంచి-సాయకాలం వరకూ రెక్కలు ముక్కలు చేసుకుని కొట్టుకుంటారు. రక్తం నీరుగా మార్చుకొని శ్రమిస్తారు. సాయంకాలానికి చేతికి వచ్చిన బేడ డబ్బులూ కల్లు దుకాణంలో సమర్పించుకొని - పీకల దాకా తాగుతారు. వట్టిచేతుల్తో తల గిర్రున తిరుగు తూంటుంది - తూలిపోతూ వుంటాడు, తాగుడు పిశాచి పూర్తిగా ఆవేశించిన దురదృష్ట కార్మికుడు వట్టి చేతులతో ఇంటికి పోతే - 'ఆకలి! ఆకలి! 'పిల్లాడు అడలుతుంటాడు - ఆకలని. తాగుబోతు - రెండు తన్నే సరికి, భార్య అడ్డం వస్తే, ఆమెకో రెండు - ఇక అడ్డం వచ్చే వాళ్ళెవళ్ళు? ఇరుగు - పొరుగు అంతా తప్పతాగి - వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో పెళ్లాలనీ పిల్లలనీ తన్నే వాళ్ళే. అంటూ సాగిన ఈ జాబు మొదటి ఉత్తరం. ఈ ఉత్తరంలో గ్రామాల్లో ప్రజల అలవాట్లను, అలవాట్ల కారణంగా నెలకొన్న అశాంతిని ఆకలిని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో ప్రజలు శ్రమ పడుతారు. ఆ శ్రమతో అలసి పోతారు. అలసట మర్చిపోవడానికి తాగుతారు. తాగుతూ సంసారాలను గుల్ల చేసుకుంటే ఆకలి పేదరికం తప్ప, దేశం ఏ విదంగా సుసంపన్నం అవుతుందనే వేదన భీమన్నలో కనిపించింది.

ఆనాటి సమాజంలో వడ్డీలకి అప్పు అనేది ఒక ఊబిలా ఉండేది. అప్పు తీసుకున్న ఎన్నో పేద కుటుంబాలు ఉన్న కొద్ది ఆస్తిని కూడా కోల్పోయిన సందర్భాలు ఎక్కువ. ఈ దుస్థితిని కూడా జనపదుని చేత పలికించిన భీమన్నలో కొండంత మానవీయత కనిపించింది.

"ఇచ్చే అప్పు ఎంత? ఏ విత్తనాలకో - ఏ కోడెదూడని కొనడానికో - ఏనాగలి చేయించుకోడానికో ఏ పాతికో, ఏ యాభైయో కానీ, ఆ డబ్బు వడ్డీకి వడ్డీ పదేళ్ళలో, ఈ మధ్య ఎన్నో తిరగరాతలు జరిగిపోతాయి. ఆ రైతుకు ఎంత మొత్తం చేసే సొంత ఆస్తి వుందో అంత మొత్తానికి, అసలీ ఫాయిదాలతో, పెరిగి వుంటుంది. సఖా! ఎన్ని కొంపలు కూలిస్తే గాని ఒక్క కొంప కోటికి పడగెత్తగలడు? వినోదించగలదు? ఎన్ని కొంపల కడుపులు మార్చి - ఏడ్పించితే గాని ఒక కొంప సుఖంగా వినోదించగలదు?" అంటూ భీమన్న ఆవేదనని ఆక్రోషాన్ని తెలియజేస్తున్నాయి.

అట్లాగే కావ్యాలలో - మేడలలో - ఉద్యానాలలో - సినిమా నాటక రంగాలలో - కనిపించే విలాసవతులనే ఆదర్శప్రాయలుగా భావించడంలో విరుద్ధ స్వభావం ఉన్నదని జానపదుడుగా అభిప్రాయపడ్డాడు. మగవాళ్ళతో

సమానంగా కష్టపడినప్పటికి బికారి జీవితాన్ని అనుభవిస్తున్న పల్లె స్త్రీలు అనుభవించే నరకం గురించి వాపోయాడు.

ఇదే ఉత్తరంలో రైతువిప్లవాన్ని కూడా జానపదుడుగా ఆశించాడు. గ్రామాల్లో సౌఖ్యం లేని కుటుంబాల కోసం రైతువిప్లవం ఒకదారిగా అభిప్రాయపడ్డాడు.

అభివృద్ధి కోసం స్నేహితుడిని అహ్వానించిన జాబు:

లేఖ ఆలస్యం అయినందుకు క్షమించాలి అని విన్నవించుకుంటూ ఈ ఉత్తరం మొదలవుతుంది. ఈ లేఖలో కాలం విలువ గురించి చర్చించబడుతుంది. పల్లెల్లో కాలం పట్నంలో మాదిరిగా ఉండదు. ఒకరోజు పని ఉంటే మరునాడు పని ఉండదు. స్థిరంగా ఈ వేళ ఇది చేయాలి - ఆవేళ అది చేయాలి - అని కార్యక్రమం తయారు చేసికొనడానికి ఏమీ అవకాశం ఉండదు అంటూ కాలం చాల విలువైనది అని జానపదుడు స్నేహితుడికి తెలియజేస్తాడు.

ముఖ్యంగా పల్లెలు బాగుపడాలంటే విద్యావంతులు పల్లెల్ని నడిపించాలి. మంచి చెడు వివరించాలి. కానీ చదువుకొన్న వాళ్ళంతా ఉద్యోగాలు చేస్తూ పట్నాలలో నాగరికత అనుభవిస్తూ, పుట్టి పెరిగిన పల్లెల్ని మరిచి పోతున్నారు. అందుకే పల్లెటూళ్ళు కన్నీరు కారుస్తున్నవి. గ్రామోద్ధరణం అంటూ పత్రికల్లో పెద్ద పెద్ద వ్యాసాలు రాస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సుదీర్ఘంగా ఉప న్యాసాలు ఇస్తున్నారు. ఇట్లా కేవలం వ్రాసుకొంటే పని కాదు. ఉపన్యాసాలిస్తే పని కాదు. పల్లెల్లోకి రావాలి. పల్లె జనంతో మమేకమై వాళ్లలో చైతన్యం తీసుకురావాలి. పల్లెల్లోకి రావడం అంటే రోడ్ల వెంట మోటారు కార్లలో నాలుగుసార్లు తిరిగి మైకుల్లో మాట్లాడటం కాదు, పల్లె జనాల మధ్య నివసించాలి. వాళ్ళ కష్టాన్ని నష్టాన్ని అవగాహన చేసుకోవాలి అని చెప్పుకొచ్చాడు. ఈ మాటల్లో కనిపించిన సంకల్పం భీమన్నకు పల్లె మీద ఉన్న ప్రేమను, పల్లెల అభివృద్ధి కోసం పడుతున్న తపనను తెలియ జేస్తున్నది.

పల్లె ప్రజలు చావుకు బతుక్కి మధ్య ఏవిధంగా నివసిస్తున్నారో కూడా ఈ జాబులో భీమన్న పేర్కొన్నాడు. రైతులు వేళకు పాలాలు దున్ని విత్తనాలు చల్లి - నీటి కొరకు - కూలి కొరకూ రేయింబవళ్ళు శ్రమిస్తారు. ఇందుకు రాత్రింబవళ్ళు పాలాలలోనే గడుపుతారు. వట్టి నేలమీదనే పడుకొని కాపలా కాస్తారు. కుట్టే జెర్రీలకూ, పొడిచే తేళ్ళకూ, కరిచే పాములకూ శరీరాన్ని అర్పిస్తూ - విసుగూ విరామమూ లేకుండా పాలాల్లో జీవిస్తారు. విత్తనాలు చల్లినప్పటి నుండి పైరు పెరిగే వరకు ఎండనక వాననక కష్ట పడుతారు. ఎరువులు వేసి, కలుపులు దీసి, పంట పండించి, పంటను ఎలుకలు, చిలుకలు తినివేయకుండా జాగ్రత్త పడుతారు - పంటను రాసులుగా పోసి తమ కడుపులు కాలుతూ ఉన్నా, కన్నీళ్ళు కారుతూ ఉన్నా -యజమానికి అప్పగిస్తారు. మిత్రమా!

ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టి చేతులు నలుపుకొంటూ ఇండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి ఎవరికి హృదయం కరిగించదు? కాబట్టి నీ వంటి పెద్ద మనసు ఉన్న వాళ్ళు పల్లెకు రావాలి. ఇక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ఒక గొప్ప మానవ సంఘాన్ని పల్లెల్లో ఏర్పాటు చేయాలి. అని భీమన్న స్నేహితుడిని అర్థించడంలో కేవలం పల్లె అభివృద్ధిని కాదు. దేశాభివృద్ధి ఆశించాడు.

పల్లెల్లో పట్నం జొరబాటును నిరసించిన జాబు:

ప్రియ మిత్రమా అంటూ సాగిన ఈ ఉత్తరం దసరా గురించి సంభాషిస్తుంది. పల్లెల్లో దసరా అంటే పూల హడావుడి. సంక్రాంతికి ముగ్గుల హడావుడి చేసినట్టు దసరా రాగానే గుమ్మాలకు పూల తోరణాల కోసం పల్లెప్రజలు తాపత్రయం పడుతుంటారు.

"దసరా వచ్చింది నవరాత్రులు ప్రారంభమైనాయి. బలే బోరుగా వుంది... ఉత్సవాల సంబరం భారతదేశానికి

అంతటికీ ఇది గొప్ప పండగ. డబ్బు లేని మా గ్రామాలలో కంటే, డబ్బు మురుగుతూ ఉండే పట్నాల్లో ఎక్కువ దర్జాగానూ, దుబారాగానూ ఉంటాయి ఉత్సవాలు....".

అంటూ దసరా ఉత్సవాలు గురించి ప్రారంభించిన పల్లెల్లో క్రమంగా చోటుచేసుకుంటున్న దీన పరిస్థితులను బాధతో వ్యక్తపర్చిన లేఖ.

పల్లెలు పంటకు నిలయాలు. పల్లెలు పండిస్తే పట్నాలు కొనుగోలు చేస్తాయి. అటువంటి పల్లెల్లో రైతులకి కాలానుగుణంగా ఎదురయ్యే పరిస్థితులు ఏవిదంగా ఉంటాయో చెబుతూ.. "ఇప్పుడు పల్లెల్లో పంటలు కోతకొచ్చాయి. ఒకవైపు వర్షాలు పడుతున్నాయి. నీళ్లతో పంట పొలాలు నిండి పంట మురిగిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఆ నీరంతా విడగొట్టడానికి రాత్రంతా పొలంలోనే జాగారం చేశాను. అని చెప్పుకున్నాడు. ఇందులో భీమన్నలో కృషివలుడిని మనం గమనించ వచ్చు. పంట పొలాలు రైతుకు ఆరోప్రాణం. ఈ ప్రాణాన్ని భీమన్నలో ఇక్కడ దర్శించగలిగాము.

"ఆంధ్రరాజ్యము మేము ఆదుకోవాలి
ఆంధ్రతేజము మమ్ము అలముకోవాలి
విజయమ్ము చేకూర్పు వీరాధి దేవతా !
శుభములు దయచేయు శుభ్రకాశీశ్వరీ!" అంటూ మా చెల్లెలు పాడుతూంది. అని కూడా కవి చెప్పడంలో పంటను కాపాడుకోవడం కోసం పల్లె జనాలు దైవాన్ని మనస్ఫూర్తిగా అర్థించడం ఒక్కటే కాదు, గ్రామీణుల స్వచ్ఛమైన నమ్మకాల మీద భీమన్నకు ఉన్న గౌరవాన్ని కూడా గమనించవచ్చు.

ఇట్లాంటి పరిస్థితుల్లో పల్లెల్లో కనిపించే కొన్ని విపరీత పరిస్థితులని వల్లెవేస్తూ పల్లె ప్రజలు పట్న వాసం వస్తువుల మీద మోజు చూపించడాన్ని నిరసించాడు... పల్లెలు కల్తీ లేనివి కాబట్టి కల్తీ వస్తువుల మీద అభిమానం వద్దు అనేది కవి భావన. ఇది గమనిస్తే..... చేమంతిపూలో - చేమంతి పూలో అంటూ వీధిలో కేకలు వేస్తూ పువ్వులు అమ్ముకొనే వాళ్ళు తిరుగుతుంటారు. ఆ పువ్వులు సహజమైనవి కావు. కృతిమంగా అచ్చం పువ్వుల మాదిరిగా తయారు చేసినవి. ఆ కేకలు విని జానపదుడు మేల్కొన్నాడు. అరుగు మీద నిల్చున్నాడు. పూలు అమ్ముతున్న వాడు తన పూలగంప అరుగు మీద పెట్టి "చేమంతిపూలండీ, పట్నానివి" అంటాడు. ఇదే కవికి కోపం తెప్పించింది. తన కోపాన్ని మొత్తంగా స్నేహితుడికి చెప్పుకున్నాడు.

"ఎంత దుస్థితి పట్టింది మా గ్రామాలకి ! ఏమి భూకంపాలు పుట్టాయి మా గ్రామసీమల్లో ! ఏమి ప్రళయం వచ్చింది. మా గ్రామసౌభాగ్యానికి ! అయ్యో ! మా జానపదాలు జారిపోలేదే. తోటలు నీటగలియలేదే - మా దొడ్లు దొర్లిపోలేదే. మా పచ్చదనం భస్మమై పోలేదే - మా గ్రామ సౌందర్యం ధూమం కాలేదే.

మా పల్లెటూళ్ళ కొచ్చి - పట్నాలు పువ్వులమ్మడమా? సిగ్గు సిగ్గు, వాసి వాసనా లేని పువ్వుల మీద వాసన, రంగు పొడర్లు చల్లి తెచ్చిన పువ్వులు, ఘుమఘుమలాడే మా గృహారామ పుష్పాల మీద దిగదుడుపుకయినా పనికిరాని పువ్వులు మా గ్రామాలలో అమ్మడమా? మా గ్రామవాసులు కొనడమా? అయ్యో ! ఆకాశం పటేలు మంది , భూమి పటేలు మంది. భగ్గుమంది నా వొళ్ళు. డబ్బు దండుకొనే పట్న వాసులకు సిగ్గేమిటి? సంసారాలు చక్కబెట్టుకొనే గ్రామీణులకు ఉండొద్దా బుద్ధి ...ఏమైనా నాలుగు డబ్బులుంటే, పట్నం పువ్వులకీ-పట్నం కాఫీలకీ పట్నం ముక్కుపుడకలకీ - పట్నం పొడర్లకీ - పట్నం షోకులకే కాజేస్తారు. పువ్వులు పట్నాల నుంచి రావలసిందే? కూరగాయలు పట్నాల నుంచి రావలసిందే? అపరదినుసులు పట్నాల నుంచి రావలసిందే ? ఎంత తగులబడిపోతుంది గ్రామసౌభాగ్యం ! ఎంత సోమరులై - మొద్దులై పోతున్నారు గ్రామవాసులు ! తమకు కావలసిన - తమకు చేతనైన - అవసరాల్ని కూడా వారు ఉత్పత్తి చేసుకోకపోతే మరెందుకు? పట్నాలకు శాశ్వతంగా దాసులైపోతారా గ్రామీణులు?" అంటూ అంతులేని ఆవేదన చెందాడు. ఇదంతా కవి గ్రామీణులను చైతన్యం

చేసే ప్రయత్నం. రైతు ఎప్పుడూ కూడా సోమరిగా మరవద్దు. పంటకు తానే పునాది అయినప్పుడు పట్నం అమ్మకాల మీద వ్యామోహం వద్దు అంటున్నాడు. పంట ఒక్కటే కాదు పల్లె స్వచ్ఛమైన అందాలను పట్నవాసపు కృత్రిమత్వంతో కప్పేయవద్దు అని కూడా వేడుకుంటున్నాడు. మొత్తానికి ఈ జాబు ఒక సందేశం. పల్లెల్లో జొరబడుతున్న పట్నం సంస్కృతి పట్ల నిరసన. పల్లెల మీద స్వచ్ఛమైన కవి ప్రేమ, అభిమానం, వాత్సల్యం గెలిచి నిలవాలి.

ముగింపు :

జానపదుని జాబులు అన్నీ కూడా పల్లెలు, దీన జనులు, రైతులు, అభివృద్ధిని ఆశిస్తూ రాయబడ్డాయి. పట్న వాసపుజీవితాన్ని, పల్లెటూరి జీవితంతో పోల్చి రాయడంలో పల్లెటూరి జీవితంలోని బాధలు రాయడంలో భీమన్నలో పేదలపక్షం కనిపించింది. పల్లెటూరి జీవితం, పట్నవానపు జీవితం పరస్పర విరుద్ధమైనవని అనే భావన జాబుల్లో వ్యక్తం అయ్యింది. ముఖ్యంగా ఈ జాబులను "మానవీయ లేఖలు" అనికూడా అభివర్ణించుకోవచ్చు. పల్లెటూరి జీవితంలో సుఖం, సౌకర్యాలు, తక్కువగా ఉంటాయి. కానీ, మనుషుల మధ్య స్నేహాభిమానాలు ఆత్మీయతలు ఎక్కువగా ఉంటాయి. కలిసి మెలిసి జీవిస్తూ ఒకరి కష్టసుఖాలలో ఒకరు పాలు పంచుకొంటారు. వాతావరణ కాలుష్యం ఉండదు. ప్రకృతిలో మమేకమై జీవిస్తారు. పట్టణ జీవితాలను గమనిస్తే.... పట్టణాలలో జీవితాలు సుఖంగా సంతోషంగా ఉంటాయి. ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి వ్యవసాయం ఉండదు. ఉద్యోగాలు మాత్రమే ఉంటాయి.. ప్రకృతితో సంబంధంలేని జీవితాలు కాలుష్యపు కోరల్లో నిత్యం నలుగుతూ ఉంటాయి. ఒకరిని ఒకరు పట్టించుకోరు. నిజమైన స్నేహాలు ఉండవు. అద్దె ఇండ్లు ఇరుకు ఇండ్లుగా ఉంటాయి. అంతా కృత్రిమంగా ఉంటుంది. వేగవంతంగా ఉంటుంది. అంటూ భీమన్న తన లేఖలు ద్వారా చెప్పుకొచ్చాడు.

భీమన్న ఆశించినట్టు పల్లెలు బాగుపడాలని ఆశిద్దాం. మనిషిని మనిషి ప్రేమిస్తూ బతికే జీవితాలకు స్వాగతం పలుకుదాం.

ఆధార గ్రంథాలు :

1. బోయిభీమన్న సమగ్ర సాహిత్యం - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.
2. డా॥బోయిభీమన్న సమగ్ర సాహిత్యం వచనకవితలు - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.
3. బోయిభీమన్న సమగ్రం సాహిత్యం నాటకాలు-భాగం-2 - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్

తెలుగు సాహితీ మెరునగ ధీరుడు బోయి భీమన్న

- భూతం ముత్యాలు

అణగారిన అట్టడుగు వర్గాల అభయున్నతికి, సమాజంలో వెల్లునుకున్న కులవ్యవస్థ ను కూకటివేళ్లతో పేకలించడానికి, ముడత్వాన్ని చేదించడానికి, సాహితీ చరిత్ర యవనికపై దళిత అస్తిత్వాన్ని వరిపుష్టం చేయడానికి పూనుకున్న మెరునగ ధీరులు డా. బోయి భీమన్న గారు. ఎందరో అభాగ్యులు వెలివాడల నిర్భాగ్యుల జీవితాలలో వెలుగు దివిటీలు పట్టిన అక్షర యోధుడు అంటరాని వాడలో పురుడు పోసుకున్న తేజోమూర్తి తెలుగు తేజం తెలుగు సాహితీ దిగ్గజం డా. బోయి భీమన్న గారు.

భీమన్న గారు 1911 సెప్టెంబరు 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో మాల కుటుంబంలో పుట్టాడు. 111 నాగమ్మ, పుల్లయ్య ఇతని తల్లిదండ్రులు పంచపాండవుల వలె ఐదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల జన్మించారు. పుల్లయ్య తన మగపిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టాడు. భీమన్న 1935లో బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై 1937లో బి.ఇడి. పూర్తి చేశాడు. గుడిసెలు కాలిపోతున్నాయ్ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వరించింది. 2001లో భార త ప్రభుత్వం భీమున్నను పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది.

గీత రచయితగా..

బోయి భీమన్న ప్రముఖ రచయిత. ఈయన సుమారు 70 పుస్తకాలు రాశాడు. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశాడు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్నేవో కొత్తప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్ని చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని వ్రాశాడు. వీటన్నింటితో పాటు అంబేడ్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశాడు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేడ్కర!' దళితులకు జాతీయగేయమై నేటికి ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

సాహితీ సేవ..

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డా బోయి భీమన్న పేరుతో ఒక సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసి, వీరి రచనలన్నింటినీ ప్రచురిస్తున్నారు. నిజానికివన్నీ విశ్లేషిస్తే గాని, భీమన్న సమగ్ర సాహిత్య దృక్పథం స్పష్టం కాదు. ఈయనే కాదు, ఏ రచయిత దృక్పథాన్నైనా అంచనా వేయాలంటే, వివిధ పరిణామాలుగా సాగిన రచన లన్నింటినీ స్పృశించగలిగినపుడే ఇది సాధ్యమవుతుంది. అలా కాకుండా, దళిత పదాన్ని ప్రయోగించలేదనీ, దాన్ని వ్యతిరేకించాడనీ, భారతదేశంలో కులం. లేదన్నాడనీ, ఆయన వర్గాన్నే సమర్థించాడనీ, కులం గురించి వ్రాయలేదనీ వక్రీకరించే వాళ్లని చూసిన తర్వాత ఆయన సాహిత్యదృక్పథాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

"పాలేరు నాటకం":

సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు. పాలేరుగా పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవ మర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెండ్లి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సివస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుభేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి "ఉపకారి" మాస్టారు సహాయంతో చదువుకుని వెంకటేశ్వర

రావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతో ద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డు కుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సాహించే వాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని రచయిత ఈ నాటకం. ద్వారా ప్రేరేపించారు.

సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కాదనీ, మంచి వాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. ఈ పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుంటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర? కులతత్వవాదులు లేని వాళ్ళూ ఉంటారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు. వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి, తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా వివరించారు. పాలేరు నాటకానికి వ్రాసిన ముందుమాటలో భీమన్న స్పష్టంగానే వర్గం, కులం పట్ల తన అభిప్రాయాల్ని నిస్సంకోచంగా వెలువరించారు. వర్ణవ్యవస్థ అంటే కుల వ్యవస్థ. ఇక్కడ కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరాని తనాన్ని తొలగించాలి' అన్నాడు. వర్గపోరాటాలు జరుగు తున్న తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితి గతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించాడు. ఇంత స్పష్టంగా కులనిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయసదస్సుల్లో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. మూడవది వర్ణాంతవివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్నీ బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంబేడ్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న సాహిత్యమని గుర్తించాల్సి ఉంది.

'గుడిసెలు కాలిపోతున్నై' (1973): కావ్యంలో ఏడాది కోసారి. దళితుల గుడిసెలెందుకు కాలిపోతున్నాయో, మరలా కొత్తగుడిసెలు మాత్రమే ఎందుకు వస్తున్నాయో ఓట్లకోసం వచ్చేవారిని నిలదీసే చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులకు, పాములను కులదోపిడీదారులకు ప్రతీక లుగా చేసి దానిలో వర్ణించారు. దళితుల మధ్య ఉం డాల్సిన సమైక్యత ప్రబోధిస్తారు. 'కూలిరాజు' (1946) నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడా తాడిమారు. ధర్మం కోసం పోరాటం'లో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించడానికి సూచనలు చేశారు. వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైనవాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు వ్రాసిన భారత, రామా యణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరంఉంది.

హింసావాదానికి భీమన్న వ్యతిరేకి, దళితులందరూ శ్రామికులనే వారిని భీమన్న వ్యతిరేకించారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి, కులం, వర్గం చేరని వాదించిన కోనాడ సూర్యప్రకాశరావుకి పాలేరు నాటకాన్ని అంకితమిచ్చాడు. భీమన్న రచనల గురించి. మాట్లాడుతున్న వాళ్ళు మూడు ప్రధానాంశాల్ని గుర్తించాలి. ఆర్యఅనార్య సిద్ధాంతాన్ని అంబేడ్కర్ ఆలోచనతోనే 'రాగవాసిష్టం" లాంటి నాటకాన్ని వ్రాశాడు. రెండవది, వర్ణం విషయంలో. భారతదేశంలో కులమనే అవగాహన చేసుకోవాలి. ఇది ప్రపంచ దేశాలన్నింటికీ సమన్వయించినప్పుడు కుదరదు. దీన్ని కూడా అంబేడ్కర్ ఆంత్రోపాలజీ, సామాజిక శాస్త్రాల్ని ఆధారంగా చేసుకుని చెప్పిన సిద్ధాంతమే. దీన్నే భీమన్న కూడా తన రచనల్లో సమన్వయించాడు.

బోయి భీమన్న, సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత, మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మ భూషణ్ తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ,

సన్మానాలందుకున్న కవి, బోయి భీమన్న పేదరికంతో పాటు, అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటినుండి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతను వీటిని నిరసించాడు. అంబేద్కర్ వ్రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేశాడు.

నిజజీవితంలో అటు అంబేద్కర్, ఇటు భీమన్న ఇరువురి జీవితాల్నీ పాలేరు నాటకం స్ఫూరింపజేసే టట్లుంది. ఇరువురూ కులం వల్ల అనేక అవమానాల్ని ఎదుర్కొన్నవాళ్ళే. ఇరువురూ చదువుకోవడం వల్లనే అనేక మంది దళితులకి ఆదర్శం. కాగలిగారు. యాదృచ్ఛికంగా ఇరువురూ కులాంతర వివాహాలనే చేసుకున్నారు. తాము చెప్పిన వాటిని నిజజీవితంలో ఆచరించి చూపి మరీ ఆదర్శవంతులయ్యారు. రాగవాసిష్ఠంలో అరుంధతీదేవి మహాత్మ్యాన్ని వివరించడానికి, పురాణేతిహాసాల్లోని కులాంతర వివాహాల్ని సృజనీకరణ ప్రతిభతో భారత జాతీయదృక్పథాన్ని ప్రదర్శించారు. దీనికి అర్యద్రావిడ వాదాల్ని కూడా నాటకంలో అంతర్భాగం చేశారు.

సనాతన సాంప్రదాయవాది భావాల్ని 'ప్రాచీనుడు' అనే పాత్ర ద్వారా వర్ణించారు. నిష్కళంకమైన ప్రేమకు సాంప్రదాయం ఎలా అడ్డంకిగా మారుతుందో వివరిస్తూనే, ఆ ప్రేమలో నిజాయితీ ఉంటే, అన్నింటినీ జయిస్తుందని నిరూపించారు. కుల నిర్మూలనకులాంతర వివాహాలు తోడ్పడతాయని చెప్పినట్లే, తర్వాత వాళ్ళకు పుట్టే పిల్లల సామాజిక స్థితి గతుల్ని చర్చించవలసిన అవసరం ఉంది. నేడు కులాంతర వివాహాలు జరిగినా, మళ్ళీ తండ్రిది గానీ, తల్లిదిగాని కుల గుర్తింపేవస్తే. కుల నిర్మూలన జరిగినట్లెలా అవుతుందో ఆలోచించాల్సిందే!..

భీమన్న ఆనాటి పత్రికా రంగంలో విశిష్టమైన సంపాదకులుగా ఆద రణ పొందారు. తాపీ ధర్మారావు, ఆంధ్ర శేషగిరిరావు, శ్రీశ్రీ, ఖాసా సుబ్బారావు, నార్ల వెంకటేశ్వర రావు, కాశీనాథుని నాగేశ్వరరావు, గోరా, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కళా వెంకట్రావు మొదలైన పత్రికా సంపాదకులతోనే కాక కాంగ్రెస్ నాయకులు, స్వతంత్ర సమరయోధు లు, హరిజన ఉద్యమ కారులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగిఉండేవారు. ఈ నేపథ్యంలో రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాలపైన, సాహిత్య అంశాల పట్ల మంచి అవగాహన కలిగి ఉండడంతో పత్రికా నిర్వహణ చాలా సులభంగా సాగించేవారు. నేటి తరానికి భీమన్న మహాకవిగానే తెలుసు, నైపుణ్యం గల పత్రికా సంపాదకులుగా చాలామంది ఎరుగు రు. వార్తలను ఒక సమగ్రమైన, అర్థవంతమైన ప్యాకేజీలో పాఠకులకు అందించడంలో భీమన్నది అందెవేసిన చెయ్యి. వార్తలకు శీర్షికలను పెట్టడంలో మంచి నేర్పరులు. భీమన్న వార్తలను ప్రచురించడంలో రాజీ పడేవారు కాదు. భీమన్న సంపాద కీయాలు చదివితే ఆయన మొండితనం, నిబద్ధత, గుండెధైర్యం అవగతమవుతాయి. భీమన్న తెలుగు పత్రికా రంగానికి పాత్రికేయునిగా చేసిన సేవలు చిరస్మరణీయం. 2005 డిసెంబర్ 16న హైదరాబాద్‌లో ఆయన పరమ పదించారు. వారిని స్మరించుకుందాం భావితరాలకు వారసత్వంగా వారి సాహిత్య సేవలను అందించుదామ్. తెలుగు సాహితీ యవనికపై అట్టడుగు వర్గాల జీవితాలను ఆవిష్కరించి సామాజిక అభ్యుదయానికి బాటలు పరచిన వారిని దశదిశలా చాటుదాం జై భీమ్..!

❁❁❁

డా.బోయి భీమన్న నాటక సాహిత్యం - సామాజిక విశ్లేషణ

- డా॥. ఈతకోట ఈశ్వరరావు, అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

మానవతా గుణసంపన్నుడిగా, సమతావాదిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తిగడించిన డా. బోయి భీమన్న 19సెప్టెంబర్ 1911సంవత్సరం ఆంధ్రరాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా, రాజోలు తాలూకా, మామిడికుదురు గ్రామంలో శ్రీమతి నాగమ్మ, శ్రీ పుల్లయ్య దంపతులకు జన్మించారు. తెలుగు సాహితీక్షేత్రంలో భీమన్నగారిది మహోన్నతమైన స్థానం. తొలి రచనను 1922 సంవత్సరం 5వ తరగతిలో ఉన్నప్పుడే ప్రారంభించి, తన జీవిత చరమాంకం వరకు సాహిత్య సృజన కొనసాగించారని. ఆ గుణమే 'పాలేరు నుండి పద్మశ్రీ' వరకు నడిపించిందని, హైమావతి భీమన్నగారు పేర్కొన్నారు. ఆమె రచించిన 'పాలేరు నుండి పద్మశ్రీ' వరకు అనే పుస్తకంలో భీమన్నగారి జీవితంలోని ముఖ్యమైన విషయాలను అన్నింటిని సర్గలుగా విభజించి విశ్లేషణ చేసారు. "నేను ఏ పల్లెలో జనించినను కాని విశ్వమెల్లను నాదిగా విరిసినాను" అని పంచమస్వరంలో వినిపించిన భీమన్నగారు విశ్వమెల్లా ఉన్న కవిగా కీర్తి గడించారు.

"ఆకాశంలో పద్యంగా ప్రవహించిన వాణ్ని దూకి గేయంలో పడ్డాను" అని 'పాత్రతో పనిలేదు' అనే కవితలో ప్రస్తావించినట్లు తను చేపట్టని సాహిత్యప్రక్రియ లేదు. తెలుగు సాహితీ క్షేత్రంలో భీమన్నగారు రచనా పరంగా అన్ని ప్రక్రియలను సృజించారు. దీపసభ, మధుబాల, రాగోదయం, భీమన్నకావ్యకుసుమాలు, భీమన్న ఉగాదులు, భీమన్న రాఖీలు, బొమ్మ, పంచమస్వరం, అంబేద్కర్ సుప్రభాతం, ఓయీ కవి కవిత్వం వ్రాయి, వంటి కవితా సంపుటాలను, మధుగీత, త్రిపదులు, చాటువల స్వగతాలు వంటి ముక్తకాల సంపుటాలను వెలువరించారు. పిల్లిశతకం, భీమన్న మాటవెలదులు, వంటి శతకాలను, అనాదికొన నుంచి అనంతత్వంలోకి, రాగవైశాఖీ, గుడిసెలుకాలిపోతునై వచనకవితలను అశోకవనంలోరాముడు, మణిమానసం, నా ఊహల్లో వాల్మీకి వంటిపద్యకావ్యాలను ధర్మంకోసం పోరాటం లాంటి సాంఘిక రాజకీయ సిద్ధాంత గ్రంథం, జన్మాంతర వైరమ్ అనే కర్మ సిద్ధాంత కావ్యం, ఇదిగో నా భగవద్గీత అనే విమర్శనా గ్రంథం, రాజకీయవీరుడు డాక్టరు ఖాను అనే జీవిత చరిత్ర, కులనిర్మూలన అనే అనువాద కావ్యం, మోక్షం నా జన్మహక్కు అనే వేదాంత దర్శనకావ్యం అన్ని రకాలుగా తనదైన విశ్లేషణాత్మకమైన దృష్టితో సాహితీసృజనను చేసి తెలుగుసాహిత్యంలో విశిష్టతను సంపాదించుకున్నారు.

డా.బోయి భీమన్న నాటక సాహిత్యం :

డా.బోయి భీమన్న తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో భాగంగా నాటక సాహిత్య ప్రక్రియను తనదైన శైలీలో సృష్టించారు. ఆదికవివాల్మీకి, వేదవ్యాసుడు, దేవయాని, ధర్మవ్యాదుడు, రాగవాసిష్టం, అంధకారంపై విజయం, జగత్ సత్యం బ్రహ్మమిధ్య వంటి పౌరాణిక దృక్పధం కలిగిన నాటకాలను, బాలయాగి, సుభాసు చంద్రుడు, చండాలిక, శ్రేయసి, చిత్రకళా ప్రదర్శనం, వంటి చారిత్రక ఇతివృత్తం కలిగిన నాటకాలును, అసూయ, కూలిరాజు, పడుపోతున్నఅడ్డుగోడలు, పాలేరు, పైరుపాట, ప్రగతి, స్నేహసుందరి, మానవునిమరొకమజిలి, మెదడులో మెరుపు, పాతఊరుకొత్తదారి, సాంఘికరూపకాలను, వీటిలో కొన్నింటిని 'చిత్రకళా ప్రదర్శనం' పేరుతో ప్రకృతిని ప్రతిబింబింప చేసేలా వసంతా స్వయంవరం, గులాబి ప్రసవించింది మొదలగు గేయరూపకాలతో కూడిన పది నాటికలను సంపుటీకరించారు. ఆధునిక తెలుగునాటక సాహిత్య వినీలాకాశంలో ధ్రువతారగ వెలుగొందిన 'పద్మభూషణ్' డా.బోయి భీమన్నగారు

సంఘాన్ని చైతన్యపరుస్తూ సామాజిక ప్రయోజనాన్ని కలిగించే నాటకాలను ఇరవై ఏడుకు పైగా రచించారు.

డా.బోయి భీమన్న పౌరాణిక/సంప్రదాయ నాటక సాహిత్యం - సామాజిక విశ్లేషణ :

ఆరు అంకాలు కలిగిన 'ఆదికవి వాల్మీకి' నాటకంలో 11వరకు పాత్రల నిడివితో, రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి హరిజనుడేనని సహేతుకంగా విశ్లేషించారు. వాల్మీకి జీవితంలోని ఘట్టాలను బాల, తరుణ, ప్రౌఢ వాల్మీకిగా విభజించారు. ఇతివృత్తం పౌరాణికమే కాని సామాజిక కోణంలో పాత్రోచిత సంభాషణల ద్వారా వాల్మీకి నాటకాన్ని రచించారు భీమన్న. సంస్కృత భారతాన్ని రాసిన వేదవ్యాసుడు కూడా పంచమకులస్థుడే అని 'వేదవ్యాసుడు' నాటకం ద్వారా తన సందేశాన్ని వినిపించారు భీమన్న. మహాభారతంలోని ఇతివృత్తాన్ని తీసుకొని 'చిత్రకళా ప్రదర్శనం' అనే నాటికా సంపుటిలో 'దేవయాని' అనే పేరుతో గేయనాటికను రాసారు. కచుడు-దేవయానిల మధ్య ప్రేమను ఆలంబనంగా చేసుకొని ఈ రూపకాన్ని మలిచారు. దేవయాని ప్రేమను కచుడు నిరాకరిస్తాడు. ఈనాటిక ద్వారా దేవయాని భగ్నప్రేమను తెరపై ఆవిష్కరించారు. ఏడు అంకాలు కలిగిన 'ధర్మవ్యాధుడు' నాటకం, ఆరు ప్రధాన పాత్రలు, తక్కిన ఇతర చిన్న పాత్రలతో ఆద్యంతం ఆసక్తి దాయకంగా రచన చేసి, కర్మసిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూనే హింస-అహింసల మధ్య వైషమ్యాలను, శాఖాహారులు, మాంసాహారుల మధ్య విభేధాలను వెల్లడిచేస్తూ శాఖాహారంలో కూడా ఎంతో హింస ఉందని తన భావవాదాన్ని సామాజిక దృష్టితో విశ్లేషించారు. ఇతివృత్తం పౌరాణికమే అయినా సాంఘిక విప్లవాన్ని రగిలించే తీరులో 12రంగాలుగా రాసిన రమణీయ దృశ్య రూపకం 'రాగ వాసిష్ఠం'. ఈనాటకానికి మరో పేరు 'అరుంధతి కల్యాణం'. పదికి పైగా పాత్రలతో సాగే ఈ నాటకంలోని కథ అరుంధతి, వశిష్టుడుల మధ్య చిగురించిన ప్రేమాను రాగమే. వశిష్టుడికి అరుంధతిపైగల రాగేమే 'రాగవాసిష్ఠం'. అరుంధతిలో అందం, అణుకువ అన్నీ నచ్చిన వశిష్టుడు ఆమెపై అనురాగాన్ని పెంచుకుంటాడు. ఆమె సవర్ణురాలు కాదు అవర్ణజాతికి చెందిన స్త్రీ అని ప్రాచీనుడి పాత్రచే తెలిసుకుని ముఖం చాటేస్తాడు. భగ్నపడిన అరుంధతి ఘోర తపస్సు చేస్తుంది. ఆ తపస్సుకు మెచ్చిన కైలాస నాధుడు శివుడే స్వయంగా వచ్చి అరుంధతి, వశిష్టుడుల వివాహం జరిగిస్తాడు.

'చిత్రకళా ప్రదర్శనం' అనే నాటికా సంపుటిలో మరో పౌరాణిక దృక్పధం కలిగిన గేయ నాటిక 'అంధకారంపై విజయం' ఈ గేయనాటికకు ఆధారం పురాగాథ అయిన నరకాసుర వధ. ప్రతీకవాద దృష్టితో రాసిన ఈనాటిక ఇతివృత్తం ఉత్తర భారతనరిహద్దు వివాదం చైనా దురాక్రమణను భారతసేన తిప్పికొట్టినవైనాన్ని ప్రధానంగా తీసుకుని 'అంధకారంపై విజయం' గేయనాటికను రచించారు. 'జగత్ సత్యం బ్రహ్మమిధ్య' నాటకంలో కవి నాయకుడుగా 'నేను' అనే పాత్రను తాను మలుచుకొని ప్రాచీన కవులైన వాల్మీకి, పోతనలను ఆత్మలను కంఠస్వరంగా వినిపింపచేస్తూ దైవపాత్రలైన బ్రహ్మ, సరస్వతిలతో సంభాషిస్తూ జగత్ మొత్తం సత్యం అయితే బ్రహ్మ మనేది కేవలం మిధ్య వట్టి భ్రమ అని వాదించటమే నాటికలోని ప్రధానాంశం. రచయితగా వేద, పురాణవ్యాయం నందుకల విశేష జ్ఞానాన్ని అంతా తన నాటకాల ద్వారా పాఠక, ప్రేక్షకులకు అందచేసారు. పైనాటకాల్లో సామాజిక జీవితాలను, ఆయాజీవితాల్లో మార్పును కోరుకున్నారు. మానవ సామాజిక సంబంధాల్లోని మతం,కులం, కుటుంబం,ప్రేమ,జాతి, నమ్మకాలు, ఆర్థిక సంబంధాలు, మానసిక సంఘర్షణ, మితిమీరిన ప్రవర్తనా ధోరణులను విశ్లేషించారు. 'ఆదికవి వాల్మీకి', 'వేదవ్యాసుడు' ఇద్దరూ పంచమకులస్థులే అని తన స్వేచ్ఛా భావవాదాన్ని వినిపించటం వెనుక సంఘంలో ఎక్కువైన వర్ణ వివక్షను ఎదుర్కోవటమే, వర్ణాంతర వివాహాలను తన నాటకాల్లో చూపించటం వెనుక అంబేద్కర్ కలలుకన్న కులనిర్మూలనను కాంక్షించటమే.

డా.బోయి భీమన్న సంప్రదాయ/ పౌరాణిక నాటక సాహిత్యం ద్వారా మానవీయ విలువలను పురాణ దృక్పథంతో స్పృషిస్తూ, సాంఘిక అంశాలను ఎన్నింటినో ఆధునిక దృష్టితో సమాజానికి అందించారు.

డా.బోయి భీమన్న చారిత్రక నాటక సాహిత్యం- సామాజిక విశ్లేషణ :

డా. బోయి భీమన్న చారిత్రక స్పృహతో సృజించిన నాటకాలు...బాలయోగి, సుభాసుచంద్రుడు, చండాలిక, శ్రేయసి, చిత్రకళా ప్రదర్శనం, నాటకాల్లో చారిత్రక ఇతివృత్తాన్ని జోడించి గేయ దృశ్య రూపకాలుగా మలి చారు. 1930సంవత్సరంలో భూమిపై అవతరించిన ఒక పుణ్యపురుషుడి గాథను వాస్తవిక చారిత్రక దృష్టితో 7 అంకాల్లో 15 పాత్రలతో బాలయోగి నాటకంగా ఆవిష్క రించారు. సుబ్బారావు అనే అసలు పేరుగల ఒక వ్యక్తి నిజ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారాన్ని అతని బాల్యం మొదలుకుని బాలయోగి గా మారిన వైనాన్ని చిత్రించారు. సాంఘిక దుష్టితైన పాలేరుతనం సమస్యను సృజిస్తూనే ఒక అవర్ణ పురుషుడైన సుబ్బారావు యోగిగా, మహిమాన్వితుడుగా వెలసిన వాస్తవికగాథను నాటకంగా కడు రమణీయంగా మలిచారు భీమన్న. 'చిత్రకళా ప్రదర్శనం' అనే నాటికా సంపుటిలో 'సుభాసుచంద్రుడు' అనే పేరుతో గేయ రూపకాన్ని రచించారు. 1897 సంవత్సరం కటక్ నగరంలో జన్మించిన స్వాతంత్ర్యసమర యోధుడైన సుభాసుచంద్రబోస్ జీవిత వృత్తాంతాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ చారిత్రక నాటకానికి రూపకల్పన చేసారు. మాతృదేశ స్వాతంత్ర్యసిద్ధికై సుభాసుచంద్రుని త్యాగనిరతని,వీరభావంతో అంకురిత దీక్షతో సల్పిన పోరాట పటిమను సుభాసుచంద్రుడు' గేయ నాటిక ద్వారా చూపించారు. 'చిత్రకళా ప్రదర్శనం' అనే నాటికా సంపుటిలో 'చండాలిక', 'శ్రేయసి', 'చిత్రకళా ప్రదర్శనం', 'అంధకారంపై విజయం' అనే పేర్లతో చారిత్రక ఇతివృత్తాన్ని స్వీకరించి సామాజిక స్పృహను కలిగించే విధంగా చరిత్రలో జీవించిన వ్యక్తుల జీవితాల్ని సమాజంలో జరిగే వాస్తనిక సంఘటనల సమాహారాన్ని పై చారిత్రక నాటకాల ద్వారా దర్శింప చేసారు భీమన్న.

డా.బోయి భీమన్న సాంఘిక నాటక సాహిత్యం - సామాజిక విశ్లేషణ :

'చిత్రకళా ప్రదర్శనం' పేరుతో 10 సంగీత నృత్య గేయ రూపకాలను రచించారు. భీమన్న వీటిలో కొన్నింటిని 'మానవునిమరొకమజిలి', 'మెదడులోమెరుపు', 'పాతఊరు కొత్తదారి', వ్యవసాయాభివృద్ధిని, సామాజిక సంఘటన లకు, సమస్యలకు పరిష్కార మార్గాలుచూపే సాంఘిక గేయ రూపకాలుగాను, మరికొన్నింటిని ప్రకృతిని ప్రతి బింబింప చేసేలా 'వసంతా స్వయంవరం', తెలుగు సంవత్సరాది ఉగాది పండగను ఆరు రుచుల సమ్మేళనాన్ని పాత్రలుగా సృష్టించి ప్రతీకవాదంతో కూడిన చక్కని గేయరూపకంగా రచించారు. 'గులాబి ప్రసవించింది' నాటికను ప్రకృతిలోని రమణీయ దృశ్యాలను, ప్రకృతిలేని మూగప్రాణులను పాత్రలుగా చేసి ఒక గులాబిమొక్క తీగాగ వృద్ధిచెంది,మొగ్గతొడిగి పువ్వుగా పూస్తుందో 'గులాబి ప్రసవించింది' గేయ నాటిక అత్యంత కడు రమణీయంగా వర్ణించారు.

సామాజిక ప్రయోజనానికి అద్ధంపట్టిన పాలేరు నాటకం, మధ్యతరగతి మానవుని ప్రగతిబాటకు స్థిరమైన కొత్తదారులను వేసింది. పాలేరు నాటకంలో ప్రధాన పాత్రైన వెంకన్న/వెంకటేశ్వర రావుకు పాలేరు తనం చేయటం ఇష్టం ఉండదు. ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగం చేయాలని ఆశ పడుతుంటాడు. తాను ఆశించిన విధంగానే జీవితంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని, ఉపకారి మాష్టరు ప్రోత్సాహంతో, బాల సోదరుడు సుందరం, స్నేహితుడు రామం సహవాసంతో పట్నంలో డిగ్రీ పూర్తిచేసి, వారి సహాయ,సలహాలతో ప్రభుత్వోద్యోగ పరీక్షలు రాసి, డిప్యూటి కలక్టర్‌గా ఉద్యోగం సంపాదించుకుంటాడు. అగ్రవర్ణ కులస్తు రాలు తన బాల్య స్నేహితురాలైన వనబాలను కులాంతర వివాహం చేసుకుంటాడు. తక్కువ జాతి వారిగా

పరిగణిస్తూ వారు మాత్రమే చేయాల్సిన పని పాలేరు పని అని నిర్ణయించిన కామందు కుబేరయ్య ల్లాంటి ధనిక, భూస్వామ్యుల చేతల్లో పాతుకుపోయిన సాంఘిక సమస్యను పాలేరునాటకం ద్వారా చూపించి అనేక మంది కళ్లు తెరిపించి సామాజిక ప్రయాజనాన్ని కలిగించారు. ఈ నాటకం చూసిన తరువాత చాలా మంది తమ పాలేరు వృత్తికి స్వస్థి పలికి ఉన్నత చదువులు అభ్యసించి మంచి మంచి ఉద్యోగాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించకొనేలా సామాజికుల్లో మార్పుతేవడం ద్వారా ఈ నాటకం ఎంతటి చైతన్యాన్ని రగిలించిందో అర్థంచేసుకోవచ్చు. సామాజిక అభ్యుదయాన్ని ఈ నాటకం రచనద్వారా భీమన్న కాంక్షించారు. 23 రంగాలగా 9కిపైగా ప్రధాన పాత్రలు, తక్కిన ఇతర చిన్నపాత్రలతో ఆధ్యంతం రసవత్తరంగా రక్తికట్టించారు. పాలేరు నాటకంద్వారా సామాజిక మార్పును ఆశించారు. పేద, ధనిక, అవర్ణ, అగ్రవర్ణకులాల మధ్య వైషమ్యాలను వెల్లడి చేసారు. సాంఘికంగా పాతుకు పోయిన వివక్షను వాస్తవిక దృష్టితో విశ్లేషించారు.

'కూలిరాజు 'నాటకం ద్వారా సర్వోదయ సోషలిజాన్ని కోరుకున్నారు. కూలీలంతా సమిష్టంగా ఉంటేనే భూస్వాముల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు కాబట్టి కూలీలకు కూడా రాజు/నాయకుడు అవసరాన్ని 'కూలి రాజు ' నాటకం ద్వారా చూపించటమే కాదు ఒక అవర్ణ స్త్రీని దేశానికే ప్రధమ పౌరురాలు నిలబెట్టి స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించారు.

'అసూయ' నాటకం ద్వారా విద్యార్థిదశలో జరిగే విద్యా రాజకీయాలను విద్యార్థి నాయకుల్లో ఉండే అసూయను చండా భాస్కరరావు పాత్రలో చూపించారు. ఈపాత్రలో ఉండే అసూయ కారణంగా రాజా, విశ్వం, రాత్రి, రేరాణి లాంటి అమాయికపాత్రలు ఎలా బలవుతారో ఈనాటకం ద్వారా రక్తికట్టించారు. 'రాగవానిష్టం' 'పడుపోతున్న అడ్డుగోడలు' 'పైరుపాట' 'ప్రగతి' 'స్నేహసుందరి' నాటకాల ద్వారా కులం అడ్డుగోడలను బద్దలకొట్టి కులాంతర వివాహాలను ప్రతీ నాటకం ముగింపులో జరిపి తన నాటక సాహిత్యాన్ని సుఖాంతలుగా ముగించారు. కులాంతర వివాహాలు జరగటం వలన కులనిర్మూలన జరిగి, కుల, మత, జాతి వర్గ వైషమ్యాలు తొలగి, భారతరత్న బాబా సాహేబ్ అంబేద్కర్ కోరుకున్న సమ సమాజ నిర్మాణ స్థాపన జరుగుతుందని డా.బోయి భీమన్న తాను రచించిన నాటక సాహిత్యం ద్వారా ఆకాంక్షించారు. సమాజంలో స్థిరంగా పాతుకుపోయిన వివిధ జాడ్యాలను, వ్యక్తుల మానసిక సంఘర్షణను, సాంఘిక విలువలను, మానవ సంబంధాలను, ప్రాపంచిక, సమూల మార్పు లను, వివక్షలను, పేద,ధనిక వైషమ్యాలను, అభివద్ధిని, శాంతిని వివిధ సామాజిక అంశాలను రచయిత తాను అనుభవించి, పరిశీలించి, అధ్యయనం చేసి నాటక సాహిత్య రూపంలో పాఠక, ప్రేక్షకులకు అందించారు డా.బోయి భీమన్న.

ఆధార గ్రంధాలు :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి-5 పౌరాణిక నాటకాలు భాగం-1, డా. బోయి భీమన్న
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి-4 సాంఘిక నాటకాలు భాగం-2, డా. బోయి భీమన్న
3. నాటక విజ్ఞాన సర్వస్వం- ఆనందన్.కె.
4. నాటక శిల్పం- ఆచార్య.మొదలి నాగభూషణశర్మ
5. బోయి భీమన్న,గిరీశ్ కర్నాడ్ నాటకాలు:పౌరాణిక దృక్పథం ఎంఫిల్ గ్రంధం -డా. ఈతకోట ఈశ్వరరావు
6. బోయి భీమన్న,గిరీశ్ కర్నాడ్ నాటకాలు:తులనాత్మక పరిశీలన పీహెచ్ డి థీసిస్ -డా. ఈతకోట ఈశ్వరరావు

డా. బోయి భీమన్న త్రిపదలు - పరిశీలన

- డా॥. కసప నరేందర్, అసిస్టెంట్‌ప్రొఫెసర్, తెలుగుశాఖ, నిజాం కళాశాల, ఓ.యు. హైదరాబాద్.

ఆధునిక తెలుగు సాహిత్యంలో శిఖరాయమాన రూపమైనకవులు ఎందరో ఉన్నారు. కవులు కావాలని అనుకున్నవారు కొందరైతే, కవిత్వం రాసిన తర్వాత కవులైనవారు కొందరు. సంప్రదాయ కవిత్వాన్ని వెల్లడించినవారు కొందరు. సృజనశీల కవిత్వాన్ని వెలువరించినవారు మరికొందరు. సిద్ధాంతాలకు తావులేని కవిత్వాన్ని కొందరు వెల్లడిస్తే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ కవిత్వం రాసినవారు మరికొందరు. కాబట్టి కవిత్వం ఒక మూసలో పోసిన లోహంలా కాకుండా అనేక పార్శ్వాలుగా విస్తరించిన నదిలా ఉంటుంది.

ప్రధానంగా ఆధునిక కవిత్వం మానవున్ని కేంద్ర బిందువుగా చేసుకుని ఆవిర్భవించింది. మానవుని బ్రతుకు, జీవితం గొప్పగా ఉండాలని! ఆస్తులు, అంతస్తులకంటే ప్రాథమికంగా కావల్సిన కూడు, గుడ్డ, నీడ వీటిని సమకూర్చు కోవడానికి 'ఉపాధి' ఉండాలని కవి పేర్కొన్నాడు. అప్పుడే మానవుడి జీవనం గొప్పగా ఉంటుందని అన్నారు.

మానవుని దయనీయమైన స్థితిని, గతిని వర్ణిస్తూ కవిత్వం చెప్పిన కవులు ఉన్నారు. మానవ విలువలు సమాజంలో ఉండాలని, మనిషిని మనిషిగా చూడాలని ఆవేదన వ్యక్తం చేసినవారు ఉన్నారు. అంతరాలు లేని సమాజం కోసం పాటుపడిన కవులు మానవునికే పట్టం గట్టారు. గురజాడ నుంచి బాలగంగాధర్ తిలక్ వరకు మానవుని బ్రతుకు గురించే కవిత్వం రాసారు. కుల మతాలకు అతీతంగా సామాజిక నిర్మాణం కోసం తపించారు కవులు. 'మబ్బు' నిండిన మానవుని బ్రతుకుల్లో వెలుగు నింపడానికి ప్రయత్నించినవారు నూతన వసంతంకోసం తపించిన వర్ణభేదం, వర్గభేదం లేని సమాజం కావాలని ఆశించారు. ఇంత ఉన్నతమైన ఆలోచనతో, ఆశయంతో ఉన్న కవులల్లో డా. బోయి భీమన్న గురించి చెప్పుకోకతప్పదు. తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలన్నింటిలోను దాదాపుగా రచనలు చేసిన సాహిత్యకారుడు. కలం- సిరాతో కన్నీళ్లు జమచేసి ఆర్తి, ఆవేదన, ఆత్మీయత, అనురాగం, ప్రేమలను దృశ్య మానం చేసిన కవిసామ్రాట్టు. ప్రతిరచన కొత్తగా ఉండేలా సృజనలో ఆయన రచనలు చేసాడు.

డా. బోయిభీమన్న కర్మసిద్ధాంతాన్ని నిరసించాడు, వర్ణాధిక్యతను, వర్గాధిపత్యాన్ని బద్దలుచేయాలన్నాడు. దళితుల బ్రతుకుల చైతన్యానికి అంబేద్కర్ ఆలోచనను అద్ది రచనలను సిద్ధం చేసాడు. చారిత్రక దళిత మహా పురుషుల జీవితాలను ఇప్పటి సమాజానికి తెలియ జేసాడు.

స్వచ్ఛమైన వచనంలో కవిత్వం రాసాడు. సరళ సుందరంగా భావం ఉట్టిపడేలా కవిత్వాన్ని తయారు చేసాడు.

సాంప్రదాయ ఛందస్సులలోనే కాకుండా కొత్తగా ఏదైనా ప్రయోగం చేస్తే బాగుంటుందనుకొని 'త్రిపదలు' అనే ఛందస్సులో వివిధ అంశాలలో వచన పద్యాలు రచించారు భీమన్న.

తెలుగు సాహిత్యంలో 'ద్విపద'లు ఉన్నాయి. ఇవి రెండు పాదాల పద్యం. పాల్కురికి సోమన బసవపురాణం ను పూర్తిగా ద్విపద ఛందస్సులోనే రచించాడు. గోనబుద్ధా రెడ్డి రంగనాథ రామాయణం కూడా ద్విపదలోనే రచిం చాడు. ఇది సరళమైనది. పాడుకోవడానికి వీలుగా ఉం టుంది.

'త్రిపద' ఇది మూడు పాదాలు ఉండి మాత్రా ఛందస్సులో కూర్చబడింది. శతకపద్యాలలాగే ఏ

పద్యానికదే స్వతంత్రంగా ఉండి భావాత్మకంగా, ఆత్మాశ్రయంగా ఉంటాయి.

భీమన్న వందల సంఖ్యల్లో 'త్రిపద'లను వెలువరించాడు. ఇవి ఆయన అనుకొని రాసినవు కావు. మొన్ననీ మధ్య ఏదో రాసుంటే భావం మూడు పాదాలలోనే ముగిసిపోతుంది. అలానే ఉంచేస్తేయేం అనుకున్నా నప్పుడు ద్విపదలాగే త్రిపద ఎందుకుండగూడదు? (త్రిపద ముందుమాటలలో నుంచి)

అలా తనను తాను ప్రశ్నించుకుంటూనే వందల సంఖ్యలో త్రిపదలను రాసి వాటిని స్వేచ్ఛాగీతికలన్నాడు.

'త్రిపద'లు - చారిత్రక నేపథ్యం

భీమన్న త్రిపదలు సృష్టించి 'త్రిపద' ఛందస్సులో స్వతంత్ర పద్యాలు రచించాడు. అవి ఇంతకు ముందు తెలుగుసాహిత్యంలో లేనివని అనుకున్నాడు. కాని భాషావేత్త వడ్లమూడి గోపాలకృష్ణయ్య త్రిపదలు కన్నడంలో ఉన్నాయన్నాడు.

'త్రిపదలు' కన్నడంలో వున్నట్టు మనకు పరిశోధనల ద్వారా తెలుస్తుంది. అవి కన్నడంలో 'త్రిపది' గా పిలువబడినాయి. సర్వజ్ఞుడు అనే కవి ఈ ఛందస్సులో పద్యాలు రాసాడు. అయితే అవి వచనాలుగా ప్రసిద్ధి పొందాయి.

'త్రిపద'లో సమాజంలోని లోపాలను, దోషాలను మూఢ విశ్వాసాలను నిర్మొహమాటంగా ముక్కుసూటిగా వెల్లడించే గుణముంటుంది. ఇంచు మించుగా శతక పద్యాల లాగే 'త్రిపద' ఉంటుంది. సర్వజ్ఞుడు మన వేమన లాగే ప్రసిద్ధి పొందాడు. ఆయన రెండు వేలకు పైగా త్రిపదలను భావాత్మకంగా, స్వతంత్రంగా వెలువరించాడు.

తెలుగులో 'త్రిపద' ఉన్నట్టు తెలుస్తుంది. అక్కర జాతి పద్యాలలో ఒకటిగా చెప్పబడింది. కేవలం ప్రాస మాత్రమే ఉండి యతి మాత్రం ఉండదు. అయితే ప్రాచీనకాలంలో ప్రాచుర్యంలో ఉండి నన్నయకాలానికి ఉపయోగంలో లేకపోవచ్చునని ప్రముఖ భాషా, శాసన పరిశోధకుడు సింగనభట్ల నర్సయ్య పేర్కొన్నాడు.

క్రీ.శ. 8వ శతాబ్దపు బాదామి చాళుక్యుల శాసనాలలో 'త్రిపదలు' కూడా ఉన్నాయని చెప్పాడు. త్రిపద గాయిత్రి ఛందమును పోలి ఉంటుందని కన్నడులకు త్రిపద గాయత్రి వంటిదని తెలుస్తుంది.

అయితే కన్నడ తెలుగు భాషా సాహిత్యాల మధ్య స్నేహబంధం ఉంది కనుక కాలప్రవాహంలో కన్నడ నుంచి త్రిపద తెలుగు లోకి వచ్చిందనే అభిప్రాయం ఉంది.

కవిజనాశ్రయంలో 'త్రిపద' లక్షణాలు చెప్పబడినాయి. మూడు పాదాలు కల్గింది 'త్రిపద' కాబట్టి మూడు పాదాలకు కలిపి 11 గణాలు ఉండాలి అనే నియమం ఉంది. తర్వాత ఈ నియమం 10 గణాలకు కూర్చ బడింది. అనంతుని ఛందో దర్పణంలో 10 గణాలు కన్పిస్తాయి. అయితే ఈ సంఖ్యానియమంలో త్రిపదలు కనిపించవు.

'త్రిపద'లో సూర్య, ఇంద్ర గణాలు ఉన్నట్లు కవిజనాశ్రయం, ఛందో దర్పణం లక్షణ గ్రంథాల వల్ల తెలుస్తుంది. అయితే మూడు పాదాలలో యతి లేకున్న ప్రాసయతి ఉండవచ్చు. ద్విపదలో గూడా యతి లేకుంటే ప్రాసయతి కూర్చ బడుతుంది. అందుకే దాన్ని మంజరి ద్విపద అన్నారు.

ద్విపదతోపాటు షట్పది ఛందము కూడా ఉంది. అయితే షట్పదిని విరిస్తే 'త్రిపది' అవుతుంది. వీటితో పాటు చౌపది, పంచపది అనేవి కూడా ఉన్నాయి. ఇవన్నీ గేయాత్మకమైనవే.

'త్రిపద' దేశీయ ఛందస్సు దీనికి పాదసంఖ్యయే ప్రమాణము. శిష్టకవిప్రయోగమున కానరాక, జానపద గేయములో ఉచ్చరించబడును. 'త్రిపద' లక్షణ గ్రంథములందుమాత్రమే నామవశిష్టమైపోయి నశించినది. (తెలుగులో దేశీ ఛందస్సు)

బహుశ శిష్ట ప్రామాణికత లేకపోవడం వల్లే 'త్రిపద' మాయమై ఉండవచ్చు. కవులు ఆదరించకపోవడం వల్ల

కూడా తెలుగు సాహిత్యంలో కనిపించకుండా పోవచ్చు. కన్నడ సాహిత్యంలో మాత్రం అది వికసించింది.

తెలుగు సాహిత్యంలో 'త్రిపద' నన్నయ కాలానికే తన ఉనికిని కోల్పోయింది. మళ్లీ బోయి భీమన్న వల్ల 'త్రిపద' వికసించింది. అయితే భీమన్న అనంతరం అవి మనకు తెలుగులో కనిపించవు.

పాల్కురికి సోమన ద్విపద, గురజాడ ముత్యాల సరాలు, సినారె ప్రపంచపదులు, భీమన్న 'త్రిపద'లు వారి వరకు మాత్రమే ఉన్నాయి. అనంతర కాలంలో ఆ ఛందస్సులల్లో రచనలు చేయకపోవడంవల్ల అవి కనుమరుగైనాయి. కొంతమేరకు ద్విపద చాలాకాలం వికసించింది.

ఏ ఛందమైనా ఉపయోగంలో, వాడుకలో ఉండాలి. లేకపోతే కనుమరుగు కావడం తప్పదు. ఎంత విలువైన వస్తువైనా వినియోగంలో లేకపోతే తుప్పుపట్టిపోయినట్టు. వాడుకలో లేని ఛందస్సు కూడా అలాగే మాయమై పోతుంది.

డా. బోయి భీమన్న త్రిపదలు - పరిశీలన

మామూలుగా త్రిపద ఎలా ఉంటుందో పరిశోధకులు లక్షణాలను నిర్వచించారు.

త్రిపద మూడు పాదాల పద్యంగా ఉండాలి. అది మాత్రాఛందస్సులో మాత్రమే ఉంటుంది. మొదటి పాదంలో 5+5+5+5=20 గణాలు రెండవ పాదం 5+4+1+5 = 19 గణాలు, మూడవ పాదం 5+4+4+1 = 14 గణాలు ఇలా త్రిపద ఉండాలి.

సర్వజ్ఞుడి త్రిపదలను పరిశీలిస్తే అందులో గణ నియమాల గురించి తెలుస్తుంది.

ఒబ్బన / ల్ల దె జగకె / ఇబ్బరుం / టేమత్తె / = 20 గణాలు మొదటి పాదం
5 5 5 5

ఒబ్బస / ర్వజ్ఞ / కర్త / ను / జగకెల్ల / = 19 గణాలు రెండవ పాదంలో
5 4 4 1 5

ఒబ్బనే / దైవ / సర్వ / జ్ఞ = 14 గణాలు మూడవ పాదంలో (తెలుగు కన్నడ తులనాత్మక వ్యాసాలు)
5 4 4 1

అయితే భీమన్న త్రిపదలు వీటికి భిన్నంగా ఉంటాయి. సంఖ్యా నియమం అధికంగా ఉంటుంది.

నీవు నా / యెదురుగా / వుండగా = 15 గణాలు మొదటి పాదంలో
5 5 5

బొమ్మల్ని / చూస్తూ / కూర్చోలే / ను నేను = 17 గణాలు రెండవ పాదంలో
4 4 4 4

అవెంత / టి అమర / చిత్ర శి / ల్పాలై / నా సరే = 24 గణాలు మూడవ పాదంలో
5 5 5 4 5

'త్రిపద' దేశీఛందము. దీని కిందలి పాదసంఖ్యయే ప్రమాణము. దేశి ఛందములకు నియత పాదవ్యవస్థ (చతుష్పాదత్వము) ఉండదు - (తెలుగులో దేశి ఛందస్సు -పేజి. నం. 288)

త్రిపదలు స్వతంత్రమైనవి కనుక ఏ 'త్రిపద'కు ఆ త్రిపద భావాత్మకమైనవి. భీమన్నగారే రకరకాల భావాలు, తోచినవి తోచినట్టుగా రాసాను అని ప్రారంభంలోనే చెప్పారు. అంతేకాదు 'త్రిపద'లోని భావం పైకి పరస్పర

వైరుధ్యాలున్ను కనిపించవచ్చు అన్నారు. ఈయన త్రిపదలను 1962వ సంవత్సరంలో రచించారు. కావ్యాలలో లాగే దైవస్తుతితో పాటు మిత్రులను, గాంధీజిని స్మరిస్తూ త్రిపదలు ప్రారంభించారు.

నీవూ, నేనూ మనచుట్టూ అమృత పదార్థమూ,
ఈత్రికమే కదా ప్రపంచం అంటే?
దాని నలుపు తెలుపు నమూనాలే యీ త్రిపదలు.

త్రిపదలను రాత్రి పగలుతో పోల్చుతూ త్రికమంటే మూడు లోకాలు. అదే ప్రపంచం. కానీ అవ్యక్తంగా ఇక్కడ త్రిపదలు అనే అర్థం వచ్చేలా చెప్పాడు.ఈ లోకంలో అందరూ ఉన్నారు. అందరి జీవితగమ్యాలను, గమనాలను త్రిపదలు స్పృశించాయి.

త్రిపదలలో భావకవిత్వపు ఛాయలు కనిపిస్తాయి. ప్రణయతత్వం, ప్రేమతత్వం ఉంటుంది. భీమన్న ప్రేయసిని ఆరాధిస్తూ కూడా త్రిపదలు రాసాడు.

నీవు నా యెదురుగా వుండగా
బొమ్మల్ని చూస్తూ కూర్చోలేను నేను,
అవెంతటి అమరచిత్ర శిల్పాలైనా సరే!

ప్రేయసి ఎదురుగా ఉన్నప్పుడు మరేదీ అతనికి పొసగదు. అది ఎంత గొప్పదైనా చివరికి అమరశిల్పమైనా!

సుఖానికి కారణం శరీరాలే అయినా అవి సహజంగా సృష్టిధర్మంగా కొన్ని సార్లు నడుచుకుంటాయి.

భీమన్నగారు మాత్రం శరీరసుఖం సహజత్వం అంటారు.

నీవూ శరీరాన్ని కోరడం లేదు
నేనూ శరీరాన్ని కోరడం లేదు
శరీరాలు మాత్రమే మనల్ని కోరుతున్నై

స్త్రీ,పురుషుల మధ్య సహజమైన ప్రేమ ఉంటుంది. అసజమైన ప్రేమ ఉంటుంది. అయితే సహజమైంది, స్వచ్ఛమైన ప్రేమ. స్వచ్ఛమైన ప్రేమ మనసుకు సంబంధించింది. అప్పుడు శరీరాలు యాదృచ్ఛికంగా దగ్గరవుతాయి. అసజ ప్రేమలో శరీరాలు మనసుతో సంబంధం లేకుండా దగ్గర కావాలనుకుంటాయి. భీమన్న స్త్రీ, పురుషుల మధ్య మనసులో వికసించే ప్రేమను కోరుకున్నాడు. ఇలాంటి త్రిపదలు ఎన్నో ప్రియురాలి గురించి చెప్పినవే కనిపిస్తాయి.

సమాజంలో దృష్టి చాలా గొప్పది. మనం చూసే చూపు, మాట్లాడే మాట మంచిదైతే మనకు అంతా మంచిగానే కనిపిస్తుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదైనట్టు.

ప్రేమతో చూస్తే గులాబిపూలతోట
ద్వేషంతో చూస్తే రాళ్ల గుట్ట ప్రపంచం
నీవు ఏది విసిరితే అదే నీకు తగులుద్ది

మనలో ప్రేమ ఉంటే అందరూ ప్రేమగా ఉంటారు. ద్వేషంతో ఉండే శత్రువులుగానే కనిపిస్తారు. కాబట్టి మనిషి ఎలా ఉంటే అతనికి ప్రపంచం అలాగే కనిపిస్తుంది. సుఖదుఖాలకు మూలం మనిషి నడతే అంటారు భీమన్న.

లోకంలో చాలామంది కష్టపడకుండా జీవితం గొప్పగా ఉండాలనుకుంటారు. పెట్టుబడి లేకుండా లక్షలు రావాలనుకుంటారు. ఇంకెవరో కష్టపడి తెచ్చిపెడితే కూర్చుని తిందామనుకుంటారు. చెమటచుక్కరాల్చకుండా బ్రతకాలనుకుంటారు. ఇది మనిషి స్వభావం. భీమన్న త్రిపదలో చక్కగా వర్ణించారు.

పనిచెయ్యి ఫలితం కొరకు - భగవదాదేశం
పని చెయ్యకు ఫలితం కోరు - మానవస్వభావం
పర్యవసానం - నిరంతర దేవదానవ యుద్ధం !

మనిషి పనిని ప్రేమించాలి కష్టపడాలి, నువ్వు చేసే పని చేసుకుంటూ వెళ్లు. ఫలితం దానంతట అదే వస్తుంది. ఇది భగవంతుని ఆదేశం. అంటే పనిచేయడం మనిషి వంతు - ఫలితం ఇవ్వడం దేవుని వంతు.

ఇపుడు కలికాలం నడుస్తుంది. ఏమీ చేయకుండా ఫలితం మాత్రం కోరుకుంటాడు మనిషి. ఇది మానవ సహజ స్వభావం అంటున్నారు భీమన్న. దానివల్ల ఏం జరుగుతుంది అంటే దేవదానవ యుద్ధం' మనిషి మంచి

జరిగితే దేవున్ని స్తుతించటం, లేదంటే ద్వేషించటం. కానీ! మనిషి తనకు కావలసిన సంపాదనను కష్టం చేస్తూ సమకూర్చుకుంటే... ఎలాంటి అశాంతి, అలజడి ఉండదు కదా!

ఇప్పుడంతా కంప్యూటర్ యుగం అనుకుంటూ, టెక్నాలజీకి మనిషి లొంగిపోయాడు. అరచేతిలో జీవితం ఉంది. అదే టెక్నాలజీ

కూర్చుని తినేవాడు పూర్వం మనిషి
నిలబడే తింటున్నాడీ మెషీను కాలంలో
పరిగెడుతూ తింటాడిక రాకెట్ యుగంలో

ఈ మాటలు 1962 నాటవి. ఇప్పుడు 2022 భీమన్న చెప్పినట్టు మనిషి పరిగెత్తుతూ తింటున్నాడు. పూర్వకాలం మనిషి స్తిమితమైన ఆలోచనాపరుడు. ఇప్పుడు స్తిమితం, ఆలోచన తగ్గినవాడుగా మారిపోయాడు. తినడానికి కనీసం సమయాన్ని కేటాయించలేకున్నాడు. 'ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్' ల చుట్టూ మనిషి తిరుగుతున్నాడు. 'సెల్‌ఫోన్' లో ప్రపంచాన్ని చుట్టేస్తున్నాడు... ఆకలి, దాహం, నిద్ర అన్ని అందులోనే... జీవితం అంతా అదే అయింది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ త్రిపదను చెప్పినట్టుంది భీమన్న.

జీవితం ఒక అకౌంటు పుస్తకం
ఒకటి రెండు తప్పుల్ని దిద్దుకోవచ్చు అందులోనే
అన్నీ తప్పులే అయితే, పుస్తకాన్నే మార్చక తప్పదు!

జీవితం చాలా విశాలమైంది, విస్తృతమైంది. అది ఒక అకౌంటు పుస్తకం. తప్పులు ఒకటి, రెండు అయితే సరిదిద్దుకోవచ్చు. లేదంటే పుస్తకమే మార్చుకోవల్సివస్తుంది. అందుకే తప్పులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనిషిది అంటాడు భీమన్నగారు. మనిషి చైతన్యవంతుడిగా ఉండాలని, పొరపాట్లు జరగకుండా చూసుకోవాలనే సందేశం ఈ పద్యంలో వ్యక్తమవుతుంది.

భీమన్న తెలుగు సాహిత్యంలో వెలుగురేఖ. చీకటిని చిదిమేసిన కాంతి. త్రిపదలు మానవజీవితాన్ని చిత్రించిన చిత్రశిల్పాలు. నూటిదనంతో ఉండి మార్పును ఆహ్వానిస్తాయి. ఉన్నతమైన మానవ జీవితాన్ని కోరుకుంటాయి. భీమన్న కలంలో తిరుగుబాటు, ప్రేమ, నిందాస్తుతి, చైతన్యం కన్పిస్తాయి.

ఆధునిక కవిత్వంలో భాషాపరంగా ఛందస్సు ప్రకారంగా నూతనప్రయోగాలు జరిగాయి. శిల్పంలోను ప్రయోగాలు కనిపిస్తాయి. ఒక కవి చేసిన ప్రయోగాలను ఇతర కవులు అనుసరిస్తే ఆ ప్రయోగాలు కాలాన్ని అనుసరిస్తాయి. లేకుంటే అవి ప్రయోగించిన కవులకు మాత్రమే పరిమితమవుతాయి. సంప్రదాయ చందస్సులో ఎన్నో రకాల చంధోబేధాలున్నాయి. వృత్త పద్యాలు, జాతి పద్యాలు, ఉపజాతి పద్యాల లాగ ప్రయోగించబడలేదు. కాలాంతరంలో మాత్రాచంధస్సులు కొన్ని కనుమరుగై పోయాయి.

ఆధారగ్రంథాలు :

1. తెలుగు కన్నడ తులనాత్మక అధ్యయనం - డా.జి.ఎస్.మోహన్
2. తెలుగులో దేశీఛందస్సు - డా. సంగనభట్ల నర్సయ్య
3. ఛందోదర్పణం - అనంతామాత్యుడు
4. కన్నడ సాహిత్య చరిత్ర - ఆర్. వి.యస్. సుందరం

❁❁❁

సమాజ చైతన్య సాహితీమూర్తి - బోయి భీమన్న

- డా॥. మూడే నాగేంద్ర నాయక్, అధ్యాపకులు, తెలుగు విభాగాధిపతి, శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ & పీజి కళాశాల, కడప, ఆంధ్రప్రదేశ్.

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి ఎన్నో రచనలు చేసి తెలుగు సాహిత్యానికి వెలుగులద్దినాడు. ఒక పల్లెలో దళిత పాలేరు యింట పుట్టిన భీమన్న పాలేరు నుండి పద్మశ్రీ స్థాయికి ఎదిగినాడు. ఆయన రచనలన్నీ అణగారిన వర్గాల ఆందోళనలను ప్రతిబింబిస్తాయి. ఇతని రచనలు ఇతన్ని పద్మశ్రీనే గాక, పద్మవిభూషణ్, కళాపూర్ణ, కళారత్న బిరుదులు వరించేటట్లు చేసినాయి. "గుడిసెలు కాలిపోతున్నాయి" (గద్య కవితా సంపుటి) అనే యితని రచనకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారము లభించింది. అత్యంత ప్రజాదరణ పొందిన రచన యిది. బోయి భీమన్న ఆలోచనాపరుడైన మహా రచయిత. మనిషి ఎదగడానికి ఏవేవి అడ్డంకులుగా ఉంటున్నాయో ఎత్తిచూపి, యువతను మేల్కొల్పినాడు. సంఘంలోని అసమానతలను గుర్తించిన భీమన్న మానవత్వాన్ని ఉద్దీపన చెయ్యడం కోసం అడుగులు వేసినాడు.

మతమనేది మానవజాతిని వర్గాలుగా విడదీసి కులమతాల చిచ్చులో పడేసి మానవజాతి పురోభివృద్ధికి ద్రోహం చేసిందన్నాడు. మతం రక్తపిపాసువు. మానవతకు పరమ శత్రువని, మన భావన నుంచి మతాన్ని తొలగించగల్గితే చాలు విశ్వమానవ శ్రేయస్సు సముద్భూత మవుతుందని అన్నాడు. మత సాంప్రదాయాలనబడే మురికి పాతల్ని చించి పారేసి, తరతరాల ఈ బూడిదను కడిగేసుకుంటే సమాజం చక్కబడుతుందని నొక్కి వక్కాణించినాడు. నేటి మతం మతం కాదు, అదొక రాజకీయ తద్ధితం అంటాడు. మతం రాజకీయ వ్యాఘ్రమయిపోయిందన్నాడు. "ఆత్మవత్ సర్వభూతాని, అహం బ్రహ్మాస్మి, సర్వేజనా స్సుఖినోభవంతు" అనే వేద వాక్యాలు యీనాటి సమాజంలో వొట్టి పోయినాయన్నాడు. మానవ సేవయే మాధవ సేవంటారు. అందుకని తమనే సేవించ మంటారు ఆధునిక స్వార్థపరులు. అన్నం సున్నం ఒకటే పరబ్రహ్మమంటారు. అన్నంతాము తిని, సున్నం యితర్లకు వదిలి పెడుతున్నారంటాడు.

"దేవుడనేది మన భ్రమ. శత్రువుల నుండి కాపాడ టానికి తన కోర్కెలు తీర్చడానికి ఒక దైవంత నకు కావాలని కోరుకుని, ఆ దైవానికి అభయహస్తం మాత్రమే పెట్టకుండా మరికొన్ని చేతులు మొలిపించి, ఆయుధాలు ధరింపజేసి, తనకు రక్షకుడుగా తన చుట్టూ ఉండాలని మనిషి ఆలోచన అన్నాడు. పుణ్యం పురుషార్థమూ, తీర్థము స్వార్థమూ యిందులో కలిసొచ్చేదొక్కటే. అది ధనం, ధనం. హోమాలు, ఊరేగింపులూ ఖర్చులకోసం భిక్షాటనం, వీటన్నింటిలో కూడా ఆరగింపు ఒక్కటే. అది డబ్బు, డబ్బు. ప్రజల దీపాలతో దేవుడు ఊరేగుతున్నాడు. దేవుడి దీపంతో పూజారి యిల్లు సర్దుకుంటున్నాడు. దేవుడి సంగతి ప్రజలకు తెలుసు, దేవుడి రహస్యం పూజారికి తెలుసునంటాడు.

గుడులన్నీ మట్టివి. దేవుళ్ళంతా మిణుగురులు. మతాలన్నీ దొంగల గుహలు. వీటిని నమ్ముకున్న మనుషులు బుర్రలేని బొమ్మలు. గుడిలో యిప్పుడు వెలిగించే దీపం దీపమే కాదంటాడు. ఎందుకంటే గుడులన్నీ ఒక దంతం మీదనో, మరొకటి కేశం మీదనో, చెదలు తిన్న ఒక తాళపత్ర గ్రంథం మీదనో, చవుడు తిన్న ఒక శిలాశాసనం లేదా ఒక శిలావిగ్రహం మీదనో నిర్మింపబడినవేనంటాడు. రాముడు, కృష్ణుడు మొదలైన పురాణపురుషులను, బుద్ధుని లాంటి చారిత్రక పురుషులను దేవుళ్ళను చేసేసి ప్రజల నుండి దూరం చేసిన అలవాటు పౌరాణికాలకుందని, కృష్ణుడు నిర్యాణం

చెందిన తర్వాత మరునాడే మరిదియైన అర్జునునికి దిక్కు లేకుండా పోయిందని, భ్రమ నుండి బైటపడ వలసిందని హెచ్చరించినాడు. నీవు కొట్టిన ఒక్కొక్క కొబ్బరి కాయకు ఒక్కొక్క మార్కయినా పడిందా? పురాణాల కాగితాలలో, సినిమా గుడ్డ తెరలో తప్ప దేవుణ్ణి యెప్పుడైన చూచామా? అని ప్రశ్నించాడు.

ఒకప్పుడు దేవుడు లేడనే వాడు నాస్తికుడు. కానీ నేడు మంచి చెడులతో నిమిత్తం లేకుండా మతాన్ని మాత్రమే పట్టుకొని వేలాడేవాడు నాస్తికుడని నిర్వచించాడు. ప్రార్థనలు, భజనలు అన్ని వట్టి శవజాగారాలు. మతమూ, భక్తీ నశించకుండా మనిషికి ప్రగతి లేదన్నాడు. గుడి, అది యేమతంవాళ్ళ గుడియైన దాని మీద భక్తి, మేలుకున్న మానవాత్మాకు నిద్రమాత్ర అన్నాడు. దేవుళ్ళ వతరించినారు. ప్రవక్తలుద్భవించినారు. నెత్తురు చిందించి నారు. నీతులూ బోధించినారు. మానవ నైజం మాత్రం గొంగళిలా ఎక్కడి దక్కడే ఉంది. ప్రతిరోజు సుప్రభాతం పాడితేగాని దేవుడికి మెలుకువ రాని స్థితికి దేవుని నెట్టేసిన యీ దేశంలో, ఎంతటి సత్యాన్నయినా ఎవరో వినిపిస్తే గాని మేలుకోలేని మనిషి తత్వం మన దేశంలో ఉందని మన దుస్థితిని దుయ్యబట్టినాడు.

స్పాంజిని నీళ్ళలో ముంచి పిండినట్లుగా, పౌరాణిక భక్తి గీతాలలో, సినిమా చిత్ర గీతాలలో ప్రతి మాటను సెక్సులో ముంచి పిండుతూ, అశ్లీల శిల్పంతో వర్ణనా చాతుర్యాన్ని చూపించే శృంగార కవులు యిదంతా భక్తులకు, ప్రజలకు ఆనందం కల్గించడానికేనని చెప్పుకుంటూంటే, కళాభిరుచిగల ప్రొడ్యూసర్లు దర్శకులు దృశ్యాలల్లో దేవుళ్ళను, నటులను కొంగుకుచెళ్ళు తొలగించి, తొంగిచూచే అవయవ సౌష్టవం తెరమీద కనబడుతుండాలనీ ఆశించి అందిస్తున్నారు. మనిషి తాను కల్పించుకున్న యిటువంటి తప్పుడు దైవభ్రాంతి నుండి తప్పించుకొని నిలబడినపుడే మరో మెట్టెక్కి బాగు పడగలడని స్పష్టం చేసినాడు.

చావు పుట్టుకల నిజస్థితిని గురించి, పాపపుణ్యాల గురించి, సరైన సమాధానం దొరకని సంఘటనలను కనిపించని ఆ దేవునికో, కర్మసిద్ధాంతానికో అంటగట్టి, బానిసబ్రతుకీడేకంటే, స్వయం శక్తిని నమ్మి, అన్యాయా లను ఎదిరించి బ్రతుకును చక్కబెట్టుకోమంటాడు. మత శాస్త్రాలు, ధర్మశాస్త్రాలు మనిషిని నిద్రపుచ్చుతున్నాయని, సోమరిపోతులను చేస్తున్నాయని అన్నాడు. క్రమశిక్షణ, గురుభక్తి, దైవభక్తి పేరుతో చెత్తబోధలు చేసి యువతను కట్టుబానిసలను చెయ్యకుండా బ్రతుకు తెరువులను కల్పించే మార్గాలను చూపమంటున్నాడు.

భీమన్న మతాన్ని, దేవుడిని, మూర్ఖభక్తిని నిరసిస్తాడు. కానీ నాస్తికుడు కాదు. విశ్వచైతన్య శక్తిని విశ్వసిస్తాడు. ప్రపంచమొక ప్రజ్ఞాన సత్తగా, అందులోని భౌతిక చైతన్యమూ, నైతిక చైతన్యమూ వెరసి మొత్తంగా 'బ్రహ్మం' పేరుతో పిలుచుకుంటున్నామని స్పష్టం చేస్తూ, ప్రవాహానికి భూమిలాగా, కాల ప్రవాహానికి ఆధారంగా ఉండేది బ్రహ్మమని, బ్రహ్మ క్షేత్రంలో ప్రతి కణమూ ఒక బీజం, అది వికసించడమే జీవితమని, బ్రహ్మ ఒక జీవక్షేత్రం, అందులోని పరమ బీజాణువులు అనంతకోటి జీవరాసు లని, ప్రతి జీవిదీ ఒక ప్రత్యేకమైన కార్య పరిధియనీ, బ్రహ్మ ఒక విత్తనాల మడియనీ, ఈ జీవక్షేత్రం నుండి మొలచిన ప్రతి అంకురం పెరిగి, పూచి, పండి, ఎండి, బీజమై మళ్ళీ వచ్చిన చోటకే వెల్లిపోతుందని, ముందూ అది బీజమే తర్వాతా అది బీజమే, పుట్టిన బీజం గిట్టి బీజమై పోతున్నదని చెప్పి అద్వైత సత్యాన్ని ఆవిష్క రించాడు. ప్రపంచాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్న ప్రజ్ఞావంతుడు భీమన్న.

'ఈ పరమ ప్రకృతి కంతకూ ప్రతినిధివి నీవు నీపమిటి కొంగకు ముడి వేసుకున్న ముడిని నేను. ముడిలో యేముంది వట్టి శూన్యం అని అనుకోని తత్వజ్ఞానిని నేను. ముడిని త్రెంచి భూమినే విలయంలో ముంచే యత్నం యీ తత్వజ్ఞానిది. ముడివై నీవు, ముడివడి నేనూ మురియడమే రస నైరంతర్య ప్రపంచం. నీ నృత్యానికి నా గానం, నా గానానికి నీ నృత్యం, చారుకేశి రాగంలో రసరమ్య స్వర్ణరాశుల్ని పండిస్తున్నది ఇహమంతా రసకేదారం పరమంతా ఆనందోద్యానం. విశ్వచైతన్య

బిందువు నీవు. నీవే సహస్రారమై వికసించే ముకుళించే ప్రజ్ఞన సత్తవు నీవే పరబ్రహ్మవు అని చెప్పి జీవబ్రహ్మల అభేదాన్ని, సమిష్టి స్వరూపాన్ని సుస్పష్టం చేసినాడు. ప్రకృతిలోని చైతన్య శక్తిని ''దేవి'' లేదా ''దేవత''గా వ్యవహరించుకోవడంలో తప్పు లేదని, చీరకట్టి సింగారించి మనిషి రూపంలో మలుచుకుంటేనే తప్పు అని వివరణ యివ్వడమేగాక, ఆ అజ్ఞాత శక్తిని ఇలా వేడుకుంటున్నాడు. మానవుడు తిరిగి మృగం కాదలుస్తున్న నేడు, లంచాలు, దొంగలాభాలు, మాయనాటకాలు, అధికార దుర్వినియోగాలు, నాయకుల నమ్మకద్రోహాలు, స్వప్రయోజక కులతత్వాలు, కరకు కోరల మత ఛాందసవాదులు యిలాంటి దున్నలను అంతమొందించమని కోరుకుంటున్నాడు.

కులాలను నిరసిస్తూ యిలా అంటాడు. కుల, వృత్తి విభేదాలతో అంతరాలు సృష్టించుకొని విరర్రవీగే మనిషి, ఒక విమాన ప్రమాదంలో కాలిపోతే, అప్పుడందరూ ఒకే రకం కళేబరాలు, జాతి మత వృత్తి మతాతీత మాంస పిండాలనీ, కైమా కొట్టిన ఒకే మాంసపు పోగు అని తెలుసుకుంటే, మానవుడొక్కడే, మానవత ఒక్కటేననే అనుభవం అబ్బుతుందని అన్నాడు.

నేటి ఓటరు విధానాన్ని, రాజకీయాలను దుయ్యబట్టినాడు.

ఓటంటే ఒక శనియని, రకరకాల జండాలవాళ్లు ఓటుకోసం ప్రాణాలు తోడేస్తున్నారని, గుడిసెలు తగలబెట్టేస్తున్నారని, ఈ దేశంలో పేదలకు ఓటుండడం పక్కలో పాముండడమేనని అన్నాడు. బలహీనులైన ఓటర్ల దుస్థితిని తెలియజేసినాడు. ఒకనాడు వీరుడు ఈనాడు రౌడీగా అవతారమెత్తినాడని, నేడు రౌడీలదే రాజ్యమయిపోయిందని, రాజ్యం వీరభోజ్యం అనే మాటను నేడు తనకు అనుకూలంగా మలుచుకొని రాజ్యం రౌడీల భోజ్యంగా చేసుకొన్నారు రాజకీయ నాయకులంటూ విమర్శించినాడు. ప్రజస్వామికంలోనయినా పైబడిన వాడే రాజు బలంతో దండుకునేవాడే నాయకుడంటాడు. ప్రజాస్వామికం నమః స్వామికమయి పోయిందని, బంట్రోతు నుండి మొదలు పెట్టితే ఆఫీసరు దాకా, మెంబరు నుండి మంత్రి దాకా, పూజారి నుండి దేవుడి దాకా, ఎందరెందరికో నమస్కారం పెట్టి మస్కాకొట్టి, గొర్రపోతునిచ్చి, పనులు జరిపించుకొనే అలవాటు పడిపోయినారు జనమంటూ నేటి యథార్థ స్థితిని వివరించినారు.

భీమన్న తన రచనల ద్వారా ముఖ్యంగా యువతను ఉద్బోధించినాడు. మనం ఆనందంగా ఉండాలంటే మన చుట్టుప్రక్కల అందరూ ఆనందంగా ఉండాలి కదా, కానీ తద్విరుద్ధమైన ఆకలి, దైన్యం, ఏడుపులు, దేవురింపులు, మురికి పేటలు, గుడిసెలు, మొదలయిన దరిద్రమంతా తాండవిస్తున్నది. దీన్నెలా భరించాలంటాడు. అనందాన్నిచ్చే అభివృద్ధి ఎక్కడుందో చెప్పమని అడుగుతున్నాడు.

జాతి సమైక్యం, కుల నిర్మూలన, సమసమాజ స్థాపన, శ్రేయోరాజ్య సిద్ధి, వీటన్నిటిని సాధించాలంటే అందుకు యువకులే సమర్థులని చెప్పుకుంటూ, తన కవితలలో ఒక పంక్తి అయినా ఒక హృదయంగల యువకుడిని చైతన్యపరిచి ఉత్తేజితుణ్ణి చేస్తే చాలునని ఆశించాడు. భీమన్న ప్రజలను మేలుకొలిపే వైతాళికుడుగా జీవించాడు. సమాజంలోని మూఢనమ్మకాలను తొలగించి, కులమతాలను నిర్మూలించడానికి ప్రయత్నించి, సత్యావిష్కరణ చెయ్యడానికే తన రచనలన్నీ ఉపయోగించినాడు.

బాలల మనస్సుల్లో జిజ్ఞాసను, జ్ఞానపిపాసను, విశ్వజనైకదృష్టిని ప్రజ్వలింప చేయడమే తన రచనల లక్ష్యమని స్వయానా చెప్పుకున్నాడు. భీమన్న వ్రాసిన ''గుడిసెలు కాలిపోతున్నై'' అనే గద్యకవితల సంపుటిలో ప్రతి కవితా, అందులోని ప్రతి వాక్యము ఒక సందేశాన్ని వినిపిస్తుంది.

ఆధార గ్రంథాలు : 1. గుడిసెలు కాలిపోతున్నై - బోయి భీమన్న

వాకిట్లో వసంతలక్ష్మి - భీమన్న వాదం

- పట్నాన ధర్మారావు, పరిశోధక విద్యార్థి (JRF), తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

మనిషి తన స్వార్థానికి కలిసి వచ్చే మాటను తప్ప మరొక మాటను వినడు. అది ఎంతటి వేదవాక్యమైనా సరే. అందుకే నాటి సమాజ స్థితిగతులను నేటి సమాజ స్థితిగతులతో ముడివేసి నీతులను ప్రబోధించకూడదు. సమాజం నాటి నుండి నేటికి ఎన్నో మార్పులకు ఆహ్వానం పలికింది. మహాభారతం, రామాయణం వంటి మహోత్కృష్ట గ్రంథాల సృష్టికి అనువైన కాలం కాదిది. ఇది ఖండ కావ్యాలయుగం. బుల్లి కవితలలో సమాజాన్ని ప్రభావితం చేసే తరమిది. ఇన్ని విధాలైన మార్పులు జరుగుతున్నా సమాజంలో అజ్ఞానం, అధర్మం, నిజాయితీ లోపించడానికీ, సరైన హేతువులు వెలివేయబడడానికీ మూలకారణం విజ్ఞానంతో సాగిన విజ్ఞానపు సమాజంతో ముందుకు సాగలేకపోవడంగా చెప్పవచ్చు.

''మనిషికి నీతులు చెప్పవద్దు, బ్రతికే మార్గం చూపండి'' అనేది బోయిభీమన్న సహృదయవాదం. అవకాశాలు ఉంటే అట్టడుగు వర్గాల వాళ్ళు కూడా కవులు కావచ్చు అన్న భీమన్న వాక్యం సమాజంలోని ప్రజల్ని మేల్కొలుపుతాయి.

'సరసవాక్యమ్మె కావ్యమై వరలునేని
కవిత నాదొక్కటొక మహాకావ్యమేయగు!
వేల కవితల తోటమాలినేను'' (1)

ప్రజలలో తరతరాలుగా, ఎన్నో యేండ్ల నుంచి లోలోతుల్లో పాతుకుపోయి ఉన్నటువంటి పాత భావాలను, ఆచారాలను, సంప్రదాయపు కట్టుబాట్లను రూపుమాపి ఆధునికి విజ్ఞానానికి అనుగుణంగా మానవుని ఆలోచనా సరళిని మార్చేదిగా ఉండాలి నేటి కవిత్వం. ఇటువంటి భావనను పరిచయం చేసే ఉద్దేశ్యమే నేటి నాయీ చిన్న ప్రయత్నం. ఆ ప్రయత్నంలో నేను ఆవిష్కరించబోతున్న కవిత - ''వాకిట్లో వసంత లక్ష్మి''.

వసంత ఋతువు అనగానే మనందరికీ ముందు గుర్తుకు వచ్చేదొక్కటే భావన ప్రకృతి అంతా రమణీయ కత్వమై తనను తాను మార్పులకు గురిచేసుకుంటూ విశ్వంలోని సర్వజీవకోటికి నూతన సుఖాన్ని, నూతన భావోద్వేగాల్ని పంచిపెడుతుంది. ఇటువంటి వసంత ఋతువులో యుగం ఆరంభంగా జరుపుకొనే పండుగ ఉగాది. ఇటువంటి ఉగాది కవి తన స్వీయాను భూతులను కలగలిపి అందించిన ఓ మధురమైన, సుందరమైన కావ్యఖండిక - ''వాకిట్లో వసంత లక్ష్మి''.

''ఒక ప్రక్క -
పంపులో నీళ్ళు లేవు
మార్కెట్లో కూరలు లేవు
జేబులో పైసలు లేవు''

పై వాక్యాలలో లేవు, లేవు అనే పదాలతో ఓ సాధారణ మానవుడికి అవసరమైన వస్తువులు కూడా తన దగ్గర కలిగి ఉండలేని పరిస్థితిని ఎంతో దయనీయంగా వివరించారు.

''మరో ప్రక్క-
వసంతలక్ష్మి వచ్చి
వాకిట్లో నిలబడింది!
ఏమిటలా చూస్తావు?
ఒత్తేసుకో కళ్ళల్లోని దైన్యాన్ని;
హత్తేసుకో వసంత లక్ష్మి హృదయాన్ని!''

అని అవసరానికి సరిపడ వస్తువులు ఉన్నా లేకున్నా గానీ ఇంటి వాకిట్లో వచ్చి నిలబడింది వసంత లక్ష్మి అంటూ వివరించారు భీమన్న. వసంతలక్ష్మి పేరులో లక్ష్మి ఉన్నా వారి జీవితంలో మాత్రం లక్ష్మి లేకుండా ఉన్నదని, వారి కళ్ళల్లో దాగి ఉన్న దైన్యత్వాన్ని, ఏమీ లేనితనాన్ని దాచుకొని మిత్రుడై చేరుకొన్న వసంతాగమాన్ని ఆహ్వానించాలనంటున్నారు.

"గతరాత్రి చచ్చిపోయింది పాత ఏడాది,
దాని చితి నుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది
మనకేమున్నదో, ఏం లేదో
పండగకేం తెలుస్తుంది?
పండుగకు కావల్సింది గుండె
అది మనకుంది, చెప్పు స్వాగతం"

మానవుని జీవితంలో ఎన్నో మార్పులు ఉంటుందన్నది జీవిత సత్యం. ఇందులో కొత్త ఏడాది రోజు గానీ, పాత ఏడాది రోజు గానీ ఏదో ఒక రకమైన రోజుగా వెళ్ళి పోతున్నదని కవి భావాంశం, ఈ ఖండికలో మునుపటి రాత్రి నాడే క్రిందటి సంవత్సరం చనిపోయిందంటూ, ఆ చనిపోయిన పాత ఏడాది చితి నుంచి కొత్త ఏడాది పుట్టు కొచ్చింది అని చెప్పసాగారు. అయితే ఏదైనా సందర్భంలో జీవితంలో ప్రవేశించే ముందు పాతకాలపు ఆలోచనలు, పద్ధతుల నుంచి వైదొలగితేనే కొత్తదైన ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, కొత్తదైన ఆలోచనా విధానాలు పుడతాయి అన్నదే ఈ ఖండిక ఉద్దేశ్యంగా చెప్పవచ్చు. పాతవైనటువంటి ఆలోచనలు, పద్ధతులు పోయినపుడు కొత్తదైన వెలుగులుతో సంస్కారాలు మానవ జీవితంలోకి చొరబడతాయి. పండుగ అన్నది సాధారణ బ్రతుకు బతికే సామాన్యుడికైనా, ఉన్నత సంపన్నపు వ్యక్తినైనా ఒకేలా పలకరిస్తుంది. కానీ పండుగపు పలకరింపును, ఆహ్వానాన్ని చూసే చూపుల్లో చాలా భేదం ఉంటుంది. ప్రతీ పండుగకు కావలసింది సహృదయము.అది మనకు ఉ ంది. అందుకే ఆ పండుగకు స్వాగతం పలకండి అని అంటున్నారు బోయి భీమన్న.

"పాత ఏడాదీ ఏడాది క్రితం
కొత్తగానే పుట్టింది కాదా?
పుట్టడం కాదు ముఖ్యం
పుట్టుక సార్థకం కావాలి;
కాలిపోయిన గుడిసె స్థానంలో
మరో గుడిసె లేస్తే ఏం లాభం
అభ్యుదయ ఎలా సాధ్యం
అని కదూ నీ ఆలోచన?"

అని అంటూ ప్రతీ సంవత్సరం కూడా అంతకు మునుపటి సంవత్సరంలాగానే కొత్తగానే పుడుతుంది. ఈ పుట్టుక అనే పదాన్ని భీమన్న ఎందుకో వినూత్న భావనతో వివరించారు. పుట్టడం అనేది ముఖ్యం కాదు. ఆ పుట్టుక అనేది జీవిత సాఫల్యత కొరకై ఉండే ప్రయత్నంలా చాలా ఉన్నతమై ఉండాలన్నది భీమన్నవాదం. అభ్యుదయం అనే పదాన్ని నిర్వచిస్తూ కాలిపోయిన గుడిసెల స్థానంలో మరో కొత్తవైన గుడిసెలు నిర్మింపజేస్తే ఏం ప్రయోజన ముంటుంది. ఆ గుడిసెల స్థానంలో వారికి ఎటువంటి ముప్పులకు గురికాని సరియైన సెలవులను నిర్మింప జేయడం ద్వారా వారి పురోగతి సాధింపవచ్చునని చెప్పవచ్చు.

"వందలు వేలు ఉగాదుల్ని
మనమే వ్యర్థం చేసుకొన్నాం
లోపం ఉగాదిది కాదు
అది ప్రతిసారీ నవ్వుతూనే వస్తున్నది
మనమే దాన్ని ఏడ్పించి పంపేస్తున్నాం!"

మానవుడు తనను తాను తెలుసుకున్న నాటి నుంచి నాగరికత మొదలైంది. సమాజాన్ని నిర్మించుకున్నాడు. వర్ణ వ్యవస్థను, విధివిధినాలను, పండుగలను, కట్టుబాట్లను మొదలైన వాటినన్నిటినీ ఏర్పరచుకున్నాడు. సమాజంలో మానవుడు తనకున్నటువంటి ఎన్నో కష్టనష్టాలను అధిగమించుకుంటూ ముందుకు సాగిపోయే తరుణంలో తాను ఏర్పరచుకున్న ఆనందకరమైన ఆచార విధానమే 'పండుగ'. ఈ పండుగలు ఎన్నో వేల సంవత్సరాల నుంచి జరుపుకుంటున్నాం. ఆ జరుపుకుంటున్న పండుగల నుంచి ఏమీ నేర్చుకోకపోగా సమాజం వర్ణవ్యవస్థ నాటి సమాజపు ఆచారాలను ఇంకా పాటిస్తూనే ఉన్నారు. నవోదయ లక్ష్మితో కలిసి నవజీవన ప్రణాళికలు నిర్మింపజేయు ఉద్దేశ్యమే ఈ కవితా ఖండిక అని చెప్పవచ్చు. ఇక్కడ లోపం వచ్చే పండుగది కాదు. దానిని మనమే ఏడుపుతో పంపించి వేస్తున్నాం, వచ్చే ప్రతి పండుగ నవ్వుల చందాలతోనే వస్తున్నదని భీమన్న వివరించారు.

"మనది రసాద్వైతం, మనమే ఆనంద బ్రహ్మ?
ఎందుకు చూస్తావలా ఉగాది పచ్చడిలా?
తీపితో చేదూ, చేదుతో వగరూ
కాపురాలు చెయ్యక తప్పదు;
అవిగో వస్తున్నై పంపులో నీళ్ళు;
ఇక కడిగి కళ్ళకద్దుకో వసంతలక్ష్మి కాళ్ళు!"

కవిత ఒక భోగ వస్తువు, ఆ భోగ వస్తువు కొంతమందికే సమాజంలోని జరిగే ప్రతి సంఘటన వెనుక ఏదో ఒక అలజడి ఉండకనే ఉంటుంది. ఆ అలజడికి కారణం మానవుల మధ్య ఏర్పడిన అహంకార భావన. ఇటువంటి సమాజంలో పెత్తందారులు చేతుల్లో కీలుబొమ్మలై నలిగిన వాళ్ళు కొందరు, వారి చేతుల్లో నిహతులైన వాళ్ళు కొందరు, ఇలా సమాజం ఎన్నో స్థితిగతులను చూస్తూ ముందుకు నడుస్తూంది. ఇక్కడ రచయిత ఉగాది పచ్చడిని వివరించీ ప్రయత్నంలా పైకి కన్పించినా అది పూర్తిగా సమాజంలో అట్టడుగు వర్గాల వారు ఏ విధంగా అలసి పోతున్నారో, అగ్రవర్ణాల వారి చేతుల్లో ఎలా నలిగి పోయారో వివరించారు. ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. ఇందులో తీపిని ప్రస్తావిస్తూ దానికి తోడుగ చేదు ఉంటుందని అంటే మనిషన్నవాడు. సుఖాన్ని తీయదనంగా ఆహ్వానిస్తూ, కష్టాన్ని మాత్రం వేప చిగురు లాగా చేదులాంటి భావనగా ప్రకటిస్తున్నాడు.

ఇక్కడ చేదుతో పాటు కొంచెం వగరూ కాపురాలు చేయక తప్పదు అంటూ హితబోధ చేసారు. అంటే సమాజంలోని మానవుడు తన తోటి వర్గాల వారిపట్ల సానుకూలతతో మెలిగి, వారినందరినీ తనతో సమానమైన వారు అనే భావన కల్పింపజేసుకున్నప్పుడే భీమన్న వారి వాదం అవగతమైనట్టు చెప్పవచ్చు.

"ఏ పరంజ్యోతి వెల్గి, ఈ ప్రపంచ
విధులు నెరవేర్చుకున్న దివ్వెలము మనము;
దీపికా! నిన్ను నన్నొక్క వాపిముంచు
అంధకారముపై దండయాత్ర మనది"

అని అంటూ మహాంధకారమై చీకటి మీద పోరాటం సలిపిన మహాపోరాట యోధుడు బోయిభీమన్న. దీపాలన్నిటికీ మూలదీపం పరంజ్యోతి. కాంతికీ, జీవనానికీ సర్వసృష్టికీ ఆమె మూలశక్తి. ఇటువంటి దీపమే సమాజంలో అట్టడుగు వర్గాల వారి ఇండ్లలో చేరి వారందరికీ వెలుగు చూపే నేస్తమై, వారి జీవన విధానంలో మార్పులు తెచ్చే ప్రయత్నం చేయు ప్రయత్న సాధనంగా చెప్పవచ్చు. అనేక విషయాలతో కూడినదై ముఖ్యంగా మత, రాజకీయ, సాంఘిక విమర్శతో, వచన కవితా ప్రక్రియలో వివిధ సందర్భాల కోసం బోయిభీమన్న కలం నుంచి జాలువారిన కవితా సంపుటి "గుడిసెలు కాలి పోతున్నై". ఇందులో ప్రతీ కవితా ఖండిక దేనికదే ప్రత్యేకతను సంతరించుకున్నది. "ఆలోచించే శక్తిని మత రాజకీయ పీఠాధిపతులు వారి స్వార్థంతో అణచివేస్తున్నారు. ఆలోచించడం మానవుని జన్మహక్కు అని గుర్తించి, ఆలోచించడం అభివృద్ధి చేసుకున్న అగ్రజన్మాల వారు ముందుగానే జాగ్రత్తపడి, తమ స్థాయికి ఇంకా పెరగని అనుజన్మలకు గుప్పిట్లో ఇముడ్చుకుని వాళ్ళ పెరుగుదలను అరికట్టాడంటాడు బోయిభీమన్న." (1)

'బ్రహ్మణేతరులలోను, హరిజనులలోను సమస్థాయికి వచ్చిన వాళ్ళునప్పుడు, అట్టి వాళ్ళను ప్రధాన పంక్తికి చేర్చుకుంటూ ఉండాలనేది భీమన్నవాదం'. జాతి సమైక్య విధానానికి ఈ ఆలోచన చాలా ప్రధానమైనది. చివర కొమ్మన పూచినావే చేతికందక నిల్చినావే అంటూ సమాజంలో ఏ వర్గం వారు అయినా వారి అభ్యుదయోన్నతికి సమాజంలోని వారు కృషి పడేలా విధానాలు ఉండాలన్నది భీమన్న ఆశయం. బోయిభీమన్న వారు నాటి సమాజంలోని హరిజనులు, అగ్రవర్ణాల వారి వలన ఎదుర్కొన్న ఇబ్బందులు, అగచాట్లను ఎంతో సున్నితంగా వివరించారు. కానీ నేటి ఈ 21వ శతాబ్దంలో పరిస్థితులు మారుతున్నాయి. సమాజంలో అంటరానితనం రూపు మాపడానికి ఎన్నో చట్టాలు పార్లమెంట్ వర్గ సభ్యులు చేసారు. అదే విధంగా వారి పురోగాభివృద్ధికి ఎన్నో చట్టాలు,

బిల్లులు ప్రవేశపెట్టి వారందరినీ సమాజపు ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి.

"రవికాంచని చోట కవి కాంచును" అన్న భట్టు మూర్తి వాక్యాన్ని, "కవి సృష్టిని సరిద్దిగల రూపశిల్పి" అన్న సాహితీవేత్తల పలుకులు ఆనాటి సమాజంలోని వెతలను వివరించగలవు. సమాజంలోని లోపాలను సుతిమెత్తనైన భావనలతో సరిదిద్ది, సృష్టిలోని అంతర్యాన్ని, అంతరాలను ప్రజలందరికీ అర్థమయ్యేట్టు వివరించి చూపగల కళాకారుడు ఒక్క కవి మాత్రమే. అటువంటి కళాకారుల్లో అగ్రగణ్యుడు బోయిభీమన్నగా చెప్పవచ్చు. ప్రకృతిలో మానవుని యొక్క ప్రకృతిని చూడడంతో పాటు దేశ సమైక్యతే లక్ష్యంగా సమసమాజ పరిరక్షణే ధ్యేయంగా రచనలు చేసి సమాజాన్ని మార్పుకై ఉన్నతించేవారు బోయిభీమన్న.

ఆధార గ్రంథాలు :

1) పాలేరు నుంచి పద్మశ్రీ వరకు
2) దీప సభ - కావ్యం
3) గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటి

❁❁❁

భీమన్న కవితలు ... సామాజిక సందేశాలు

– డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి పేరమాంబ, తెలుగు లెక్చరర్ (డెప్యుటేషన్),
జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు, రాజమహేంద్రవరం.

'భూలోకనందనం' అనే పేరుపొందిన కోనసీమలోని రాజోలు తాలూకా 'మామిడికుదురు' గ్రామంలో పుల్లయ్య, నాగమ్మలు నివసించేవారు. వారికి ఐదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. పుల్లయ్య ఐదుగురు మగపిల్లలకు పంచపాండవుల్లా ఉన్నారని, పాండవుల పేర్లు పెట్టారు. పంచపాండవులలో రెండవ వాడు భీమన్న ది. 19-09-1911న జన్మించారు. నగరం మిడిల్ స్కూల్లో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. రాజోలులో 1921-31 మధ్య కాలంలో ఉన్నత విద్య పూర్తిచేశారు. 1931-35 సంవత్సరాలలో కాకినాడ పి.ఆర్. కాలేజీలో ఇంటర్, బి.ఏ పూర్తి చేశారు. 1937లో రాజమహేంద్రవరంలో బి.ఇడి పూర్తి చేశారు.

భీమన్న గారి వివాహం నాగరత్నమ్మతో జరిగింది. వీరికి దత్తాత్రేయశర్మ, నాగవర్మ అనే కుమారులు కలిగారు. విజయభారతి, విజయలక్ష్మి అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. హైమవతి గారితో ద్వితీయ వివాహం జరిగింది. వీరికి విజయపల్లవి, విజయేందిర అనే కుమార్తెలు కలిగారు. ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, రాజోలు పాఠశాలలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు.

భీమన్న గారు 'పాలేరు' నాటకం ద్వారా ఎంతోమంది పేదల, దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాలేరు పని మాన్పించి పాఠశాలలో చేర్పించారు, అంతేకాదు ఈ నాటకం స్ఫూర్తితో ఎంతోమంది పేదలు, దళితులు బాగా చదువుకుని ఉన్నతపదవులు అధిష్ఠించారు. గుడిసెలు కాలిపోతున్నై, దీపసభ వంటి కవితా సంపుటులు, జానపదుని జాబులు వంటి లేఖలు, పాలేరు నుండి పద్మశ్రీ వరకు అనే స్వీయచరిత్ర, పిల్లీశతకం, రాగవైశాఖి, ఉశారులు మొదలగు గ్రంథాలు వ్రాసిన సాహితీమూర్తి భీమన్న, గుడిసెలు కాలిపోతున్నై రచనకు వీరికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. పద్యం, గద్యం, గేయం, నాటకం, లేఖ, శతకం, వ్యాసం, వచన కవిత్వం ఇలా అన్ని ప్రక్రియలలోను 70 వరకు గ్రంథాలు వ్రాసిన సాహితీమూర్తి భీమన్న. వీరు ప్రతి రచనలోను సహజత్వాన్ని, నూతనత్వాన్ని సాధించారు. తన కావ్యాలకు తానే వ్యాఖ్యాల రూపంలో అద్భుతమైన పీఠికలు వ్రాయడం ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక నూతన ప్రక్రియను ప్రవేశపెట్టారు.

భీమన్న బాల్యంలో పన్నెండేళ్ళ వయస్సులోనే మృదుమధురమైన పద్య కవిత వ్రాశారు. ఆరేళ్ళ వయసు నుండి పశువులను కాయడం, వ్యవసాయపు పనులు చేయడం, అరకలు దున్నడం, కుప్పలు నూర్చడం మొదలయిన పనులప్పుడు పాడుకున్న పాటలు అయనకు ఎనభయ్యవ సంవత్సరంలో కూడా లీలగా గుర్తుండడం మరో గొప్ప విశేషం.

"ఇటు తిరుగు తిరుగు తిరుగు
ఎక్కడికా పరుగు?
అందున్నది మిరపచేను
అణగును నీ పొగరు!"

పుట్టి నెలైనా కాని కోడెదూడ అందకుండా పరుగులు పెడుతున్నపుడు దానిని మరలించడానికి వెంట పరుగెడుతూ పాడిన పాట!

తల్లి వరినాట్లు వేస్తున్నపుడు, పనిచేస్తున్నపుడు, ఇంట్లో తీరికగా ఉన్నప్పుడు జానపద గేయాలెన్నింటినో పాడేది.

తండ్రి ఇంట్లో ఉన్నప్పుడు, తన శిష్యులతో గోష్టులు జరుపుతున్నపుడు వేదాంత గేయాలెన్నో పాడుతూ ఉండేవారు. ఇంటికి దగ్గరలోనే 'అన్నంనీడియతిరాజు' అనే బైరాగి ఏక్‌తారా మీటుకుంటూ పాడిన తత్వాలు భీమన్నలో ఒక పాటలతోటకు పాదులు వేశాయి, ఒక స్వరలయకు సాకారం తొడిగాయి.

కులం ఒక జాతిగా, మతం ఒక వర్గంగా నిత్యం పోరాడుతూ, అంతరించిపోతున్న జాతిని సమన్వయం ద్వారా సమైక్య పరచాలన్నదే భీమన్న అభిమతం.

"ఏది హిందూ ఏది ముస్లిం ఏది క్రైస్తవము
ఎల్ల మతముల సారమొకటే
హృదయమే మతము" అన ఎలుగెత్తి ఆకాశవాణి హైదరాబాద్ ద్వారా ఉద్బోధించాడు. అన్ని మతముల సారం ఒకటేనని చాటి చెప్పాడు. మనమనసే మన మతమన్నాడు.

"కృష్ణుడో క్రీస్తో మహమ్మదో
గీతయో బైబిలు ఖురానో
ప్రేమనే బోధించలేదా
ద్వేషమును నిరసించె కాదా" అన్నాడు. ఏ మత గ్రంధమయినా ప్రేమనే బోధిస్తుంది. ద్వేషమును తిరస్కరిస్తుంది.

"తూర్పు పడమర భేదమేలా
తోటకెల్ల వసంతుడొకడే
కరములెటురెవ రెటు మోడ్చి పిలిచినా
ఖంగుమను గుడిగంట ఒకటే" ఎవరు ఎటువేపు నుంచి నమస్కరించి, స్తుతించినా గుడిగంట ఖంగుమని ఒకే విధంగా శబ్దం చేస్తుందని భిన్నత్వంలో ఏకత్వాన్ని సృష్టించాడు.

"బానిస తనమును బాపుమురా
భారత భూమికి భాగ్యముతేరా
సకల దేశముల సర్వమానవుల
సామ్యము సాధింపుమురా" అంటూ ప్రభోధాత్మక మయిన గేయాన్ని పాడారు. బానిసత్వాన్ని రూపుమాపి, దేశమంతటికి సిరిసంపదలు కలిగించాలన్నారు. సకల దేశాల సర్వమానవులు సామరస్య భావంతో కలిసిమెలిసి జీవించాలన్నాడు భీమన్న.

"విశ్రమింపుము విశ్రమింపుము
విశ్రమింపుము మిత్రుడా!
నేడు పోయిన రేపు నీదే
విశ్రమింపుము మిత్రుడా!" అంటూ కూలీని మిత్రునిగా భావించి, కాయకష్టం చేసి అలసిపోయినపుడు కాసేపు విశ్రాంతి తీసుకోమంటాడు. నేడు కష్టాలతో గడిచిపోయినా, సుఖాలతో రేపు గడపవచ్చని, కాసేపు బడలిక తీర్చుకోమని కూలీల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. ఇలా కూలీని ఒక కూలివానిగా చూడకుండా, ఒక మిత్రునిగా భావించి విశ్రాంతి తీసుకోమనడంలో చాలా ఆర్ద్రత ఉంది.

"పదరా పదరా పల్లెలకు
పల్లెటూరురా భరతభాగ్యము
అజ్ఞానముతో, అధికారపు బహు
భారత లోహపు పదముల కింద
క్రిమి కీటకముల మాదిరి నలిగే
కృషికుల శ్రామికుల కాపాడుమురా" పల్లెటూళ్ళే భారతదేశానికి భాగ్యసీమలని, అందుకే పల్లెలకు వెళ్ళి వాటిని అభివృద్ధి చేయమని, పల్లెలకు పదమంటూ పిలుపునిచ్చాడు.

"ఏ గాలి వడి రాలి ఏధూళి దాగినదో
ఏ కబరి ముడి సడలి ఏదారి జారినదో
ఎత్తవోయికేల ఈబేల సుమబాల
ఎత్తవోయీ కేల ఈవేల సుమబాల" అని ఒక పూవుకు, సౌకుమార్యంగల స్త్రీకి తన భావాల సౌకుమార్యాలద్ది, సమాజంలోని అమానుష సంఘటనలకు చలించిపోయి, మానవత్వంకోసం అక్షరాలతో అన్వేషణ చేసిన వ్యక్తి భీమన్న.

"పదరా ముందుకు పదరా వీరా
విశ్వము సువిశాలమురా

వడి వడి ముందుకు పోయిన వానినె

విజయశ్రీ వరియించునురా" ఎవరయితే త్వరత్వరగా సాగిపోతారో వారినే విజయలక్ష్మి వరిస్తుందని, అందుకే వేగంగా ముందుకు దూసుకుపొమ్మని చెబుతున్నాడు.. అనుకున్న పనిని పూర్తి చేయాలంటే ముందుగా కృషి, పట్టుదల ఉంటేనే ఏపనయినా అవలీలగా చేయవచ్చని భీమన్న చెబుతున్నాడు.

"తల్లులారా! తండ్రులారా!
యీన్నారమ్మా నాబోధ
కడుపున పుట్టిన కసుగాయల్ని
కామందుల కాళ్ళకు బలియ్యకండి
విద్యాబుద్ధులు చెప్పించండి
పెంచండి పనికొచ్చేలాగ
పాలేర్తనముతో ఏమీ లేదు
బానిసకూడు కడుపునింపదు
స్వేచ్ఛగా తలయెత్తుకు బతకండి
జీవించండి శాంతముగా" పసిపిల్లలు తెచ్చే సంపాదనతో బ్రతకరాదని, ముక్కుపచ్చలారని పసిమొగ్గలకు చదువు చెప్పించి, సమాజం గర్వించే యువకులుగా తయారు చెయ్యాలంటారు భీమన్న. పేదరికంలో మగ్గిపోతున్న తల్లిదండ్రులంతా తమ పిల్లలకు చక్కని భవిష్యత్తు కల్పించాలని హితబోధ చేశాడు.

"మోహన రాగ రాగిణీ మోహ వాహినీ స్నేహవాహినీ
పూవులెన్ని యున్న గాని నీవు లేక వసంతమా
నీ మోహనలోని మోహినికి నాకింత దూరమా" అని అటు మోహన రాగాన్ని, ఒక భావుకత్వాన్ని కళ్ళముందుంచాడు భీమన్న కె.టి.కె. మోహనరాజు గారి గళంలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఇది పలుమార్లు ప్రసారమయ్యింది.

"లేవమ్మా మాలతీ ఇటు రావమ్మా మల్లికా
సంపంగి రావమ్మా విరజాజి రావమ్మా
చిగురాకులు చీరెలుగా పూరేకులు రవికెలుగా
సింగారించుకొని చిట్టి పొట్టి నడకలతో చేరరండమ్మా" ... అంటూ చక్కగా ప్రకృతిని పరిశీలించిన ఈ గేయం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది చాలాకాలం. ఈ విధంగా భీమన్న వ్రాసిన రాతలన్నీ ఆయన హృదయ స్పందనలే.

"ప్రతిభను తలెత్తనివ్వరు పండితులు
పాండిత్యాన్ని తలెత్తనివ్వరు పామరులు" అంటూ ఈనాడు సాహిత్యమంటే కులం, మతం, వర్ణం, ముఠా అని ధైర్యంగా తన మనసులోని భావాలని కలం ద్వారా, గళం ద్వారా వెలిబుచ్చిన కవి బోయి భీమన్న. జాతీయోద్యమం నుండి జాతిజీవనం వరకు అనేక విషయాలను పరామర్శించారు భీమన్న. సామాన్యుల జీవితాల్లోకి తొంగిచూసిందువల్లనేమో ఆర్ద్రతకూడా మనసును పట్టి లాగుతుంది. భీమన్న తన రచనల ద్వారా, ఆలోచనామృతం ద్వారా ఎందరో కవులకు మార్గదర్శకులయ్యారు.

- జైహింద్ -

ఆధార గ్రంథాలు :

1) భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి - 1
2) భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి - 2
3) అంతర్జాల ఉపన్యాసాలు
4) ఆకాశవాణి 'హైదరాబాద్' లలితగీతాలు

బోయి భీమన్న – సర్వోదయ భావనే – దీప సభ

– యం. ప్రదీప్, పరిశోధక విద్యార్థి, డి.కె.ప్రభుత్వ మహిళా కళాశాల, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

"ప్రపర్తితో దీప ఇవ ప్రదీపాత్....." అని కాళిదాసు రఘువంశంలో దీపం యొక్క విశిష్టతను తెలియజేశారు. సాహితీ భీముడైన బోయి భీమన్న వివిధరకాల కథా వస్తువులతో సహజ శిల్ప వైచిత్రతో అనేకానేక ప్రక్రియలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన జాతీయ కవి బోయి భీమన్న. భారత ప్రభుత్వం బోయి భీమన్నను పద్మభూషణ్‌తో సన్మానించడం తెలుగు కవితకు ఒక భూషణం 'రవి గాంచనిచో కవి గాంచునే కదా' అనే భట్టు మూర్తి మాటలకు బోయి భీమన్న గారి రచనలు అక్షర సాక్ష్యాలు.

ప్రాచీన సాహిత్యంలోనూ ఆధునిక సాహిత్యంలోనూ దీపమున కావ్య వస్తువుగా తీసుకున్న కవులెవరూ లేరని చెప్పవచ్చు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాధుడు, శ్రీనాధుడు మొదలైన వారి కావ్యాలలో దీపాల విశిష్టతను చెప్పారు కానీ దీపాన్ని కావ్య వస్తువుగా తీసుకుని రచన చేసిన కవి భోయి భీమన్న 'కాదేది కవితకనర్హం' అనే శ్రీ శ్రీ మాటలకు దీపసభ కావ్యం ఒక చక్కని ఉదాహరణ. మద్రాసు విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డా॥నిడదవోలు వెంకటరావు గారు దీపమే కథావస్తువుగా ఉన్న కావ్యాలు ఇంతవరకు ఏ భాషలోనూ రాలేదని' ప్రశంసించారు.

బోయి భీమన్నగారు రచనలను పరిశీలిస్తే ఒక్కొక్క రచన ఒక్కొక్క ఇతివృత్తంతో వైవిధ్యభరితంగా ఉంటాయి. దీపాన్ని ఇతివృత్తంగా తీసుకుని దీపసభను నిర్వహించిన ఘనుడు బోయిభీమన్న

"ఏ పరంజ్యోతి వెల్గి, ఈ ప్రపంచ
విధులు నెరవేర్చుచున్న దివ్వెలము మనము,
దీపికా! నిన్ను నన్నొక్క వాపి ముంచు
అంధకారముపై దండయాత్ర మనది' ..... అని

అంటూ భీమన్న దండెత్తిన మహాకావ్యం దీపసభ. ఈ కావ్యం 1955 సం॥లో రాయబడింది.

- బోయి భీమన్న చిన్నతనంలోనే వాళ్ళ అమ్మను - అమ్మా..... ఈ దీపాలన్నీ ఆరిపోయి ఎక్కడికి వెళతాయి అని అడిగాడట అప్పుడు ఆ తల్లి చెప్పిన కథను ఆధారం చేసుకుని రాసిందే ఈ దీపసభ కావ్యం.

ఇప్పటికీ జన వ్యవహారంలో ఉన్న ఒక జానపద కథను మనం పరిశీలిస్తే బహుశా బోయి భీమన్న గారి తల్లి ఇటువంటి కథనే చెప్పి ఉండవచ్చు. ఆ కథను చూద్దాం..... సాధారణంగా సాయంత్రం ఇళ్ళలో సంధ్య దీపం వెలిగించడం పరిపాటి. అయితే ఈ దీపం తొందరగా కొండెక్కాలని (ఆరిపోవాలని) అంటారు. ఆరిపోయింది అనే మాట అశుభం అని కొండెక్కిందని అనడం ఒక సాంప్రదాయం. ఇది ఇప్పుడు మనం చెప్పుకునే అర్థ విపరిణామంలో మృదూక్తికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇటువంటి కథనే ఆధారంగా చేసుకుని బోయి భీమన్న ఈ రచనా నిర్మాణం చేసి ఉండవచ్చు.

రచనలో తనకుంటూ ఒక ప్రత్యేక ముద్ర కలిగిన కవి బోయి భీమన్న. దీపాన్ని కథావస్తువుగా తీసుకుని ఇతివృత్తంలో వైవిధ్యం ప్రదర్శించిన ఈ కావ్యంలోని ప్రతిపద్యం తాత్వికతకు మంచి నిదర్శనాలు. ప్రజల శ్రేయస్సు కోసం వెలుగునిచ్చే దీపం తాను కాలిపోతూ అంధకారమనే చీకట్లను చీల్చి రేయికి వెలుగునిస్తుంది. కవి కూడా తన చుట్టూ ఉన్న ప్రజల అజ్ఞానమనే చీకట్లను తరిమి వేసేందుకు కృషి చేయాలని బోయి భీమన్న కాంక్షించారు. దీపానికి కవికి అభేదం చెప్తూ రాయబడిన అద్భుత వర్ణనాత్మక పద్యకావ్యం దీపసభ.

జగజ్జననికి రేయి పగలు ఎన్నెన్నో పనులు. తనకు ఎన్ని పనులున్నా దీపాలతో సభ చేసి 'మనుజ ప్రపంచ మందు వార్తలేమమ్మ దీపికా వజ్రములార' అని ఆ జగజ్జనని లోకంలోని విషయాలను ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకోవడం ఈ కావ్యంలోని విశేషం లోకంలోని విషయాలను దీపాల ద్వారా లోకమాతకు తెలియ జేయడంలో కవి ఒక కొత్తదనాన్ని చిత్రించాడు.

ఒక్కొక్క రంగానికి ఒక్కొక్క పరిస్థితికి ఒక్కొక్క దీపాన్ని ప్రతినిధిగా తీసుకున్నాడు భీమన్న. ఈ కావ్యంలో మైనపు దీపము, బండి దీపము, హాలికెను లైటు, ఉల్క, కొబ్బరితుంట, గుడి దీపము, కొఱివిదయ్యము, వీధి లాంతరు, విద్యుద్దీపము, సెజ్జదివ్వె, మిణుగురు, కలకలము, ప్రమిదె దీపము అనే దీపవిభాగాలు కలవు. ఇటువంటి దీపాలతో కలిపి ఒక సభను ఏర్పాటు చేసి, ఈ సభకు జగజ్జనని అధ్యక్షురాలిని చేసి జనుల బాధలను తెలియజేశారు బోయిభీమన్న. జగజ్జనని అధ్యక్షురాలిగా ఏర్పడ్డ ఈ దీప సభలో సర్వోదయ సమాజ నిర్మాణ భావనలు కలవు. సమాజ ప్రగతికీ, వ్యక్తి జీవిత వికాసానికి అవసరమైన అంశాలు ఈ దీపాల ద్వారా జగజ్జననికి చెప్పాడు. ఇటువంటి భావన నిజంగా అద్భుతమూ, అపూర్వమూ.

ఈ కావ్యంలో ఆనాటికి జనవ్యవహారంలో ఉన్న అన్యదేశ్యాలను, దేశీయ పదాలను చక్కగా ఉప యోగించుకున్నాడు. బోయి భీమన్న, ఛంద్రస్సులోను, రసంలోను, అలంకారంలోను, శైలిలోను తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర కలిగిన కవి బోయి భీమన్న.

ఒక్కొక్క దీపం దీపసభలో లోకంలోని విషయాలను జగజ్జననికి చెప్తున్నాయి. మైనపు దీపము, బండిదీపము... మొదలైన దీపాలు చెప్పగా చిన్న కవిదీపం (ప్రమిదె దీపం) చివరగా మాట్లాడింది. జనుల బాధలను కవి జగజ్జననికి చక్కని సాంప్రదాయకశైలిలో వివరించాడు.

"నీతి సూత్రాల కూర్పుపై నిల్చి, ధర్మ
నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు,
రేపు తిండి యెట్లను బెంగబాపకుండ
దేవి! సంఘమ్ము నెటు చక్కదిద్దలేము!
కూడు, గుడ్డ, కొంప -మూడే సుమా నేడు
నరుడు కోరుచున్న వరములెల్ల".. అంటూ

దేవి అనుజ్ఞపై కవి యొక్క ప్రమిద దీపం సమసమాజ నిర్మాణం జరగాలని చివరకు తీర్పు చెప్తుంది.

కథావస్తువు, ఇతివృత్తంలోనే కాక కావ్యం అంకితం ఇవ్వడంలోనూ నూతనత్వాన్ని ప్రదర్శించారు. బోయి భీమన్న. ఈ కావ్యాన్ని తన తల్లిదండ్రులైన వాగమ్మ, పుల్లయ్య దాసు గార్ల పేరుతో తిరుపతి కొండల దివ్య సౌందర్య శక్తికి అంకితం ఇచ్చాడు.

తిరుపతి కొండలకు కావ్యాన్ని అంకితం ఇవ్వటం లోని అంతర్యం ఏమిటో భీమన్న గారికే తెలియాలి. ఏడు కొండలకు వెలుగు వేంకటేశ్వరుడు అలాగే మన అజ్ఞాన మనే కొండలకు వెలుగు కవి వెలిగించే సాహిత్య దీపాలు కావచ్చుననేది నా భావన.

ఇంతటి విశిష్టత కలిగిన ఈ కావ్యానికి మద్రాసు విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డా॥నిడదవోలు వెంకటరావు గారు "స్వాగతము" అనే పేరుతో పరిచయ వాక్యాలను రాశారు. అంతేకాక తమ విశ్వ విద్యాలయం తెలుగు విద్యార్థులకు ఈ కావ్యాన్న పాఠ్యాంశముగా నిర్ణయించారు.

1983 ప్రాంతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ఈ కావ్యంలోని "విద్యుద్దీపం' అనే భాగాన్ని డిగ్రీ విద్యార్థులకు పాఠంగా నిర్ణయించారు. ఈ కావ్యములోని 'కొబ్బరి తుంట' అనే విభాగానికి కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన భారతీయ కవితా సంకలనంలో స్థానం లభించింది.

బోయి భీమన్న గారిని అనేక విశ్వ విద్యాలయాల గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు పద్మభూషణ్

డా॥బోయి భీమన్న సాహిత్య పీఠంను ఏర్పాటు చేశారు. మన దేశ అత్యున్నత పురస్కారాలలో ఒకటైన పద్మ భూషణ్, సాహిత్యంలో అత్యున్నతమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు బోయి భీమన్న కోరకనే వారిని కోరి వరించి తరించాయని చెప్పటం అతిశయోక్తి కాని విషయం.

పగటికి వెలుగు సూర్యుడు రేయికి వెలుగు దీపం. రేయిపగలు రెండింటికి వెలుగు కవి. కావున కవి, తన సాహిత్య సృష్టితో అజ్ఞాన జనుల అంధకారాలను తొలగించి విశ్వ శ్రేయస్సును ఆకాంక్షించాలన్న బోయి భీమన్న గారి సర్వోదయ భావనే - దీపసభ.

ఆధార గ్రంథాలు :

1. దీపసభ కావ్యం - డా॥ భీమన్న బోయి
   ప్రచురణ: దేశి కవితా మండలి, విజయవాడ
2. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు
   రచన : హైమావతీ భీమన్న
   ప్రచురణ: పద్మభూషణ్ డా॥బోయి భీమన్న సాహిత్య పీఠం
   పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు
3. భారతీయ సాహిత్య నిర్మాతలు - బోయిభీమన్న
   రచన: శ్రీమతి విజయభారతి బోయి
   ప్రచురణ: సాహిత్య అకాడమీ.

ప్రణయ కవిత్వానికి ప్రతిబింబం - బోయిభీమన్న "బొమ్మ"

- డా॥. ఇస్సర్ల ప్రసూన కుమారి, విశాఖపట్టణం.

పద్మభూషణ్ డా॥ బోయిభీమన్న గేయ కావ్యాలలో ప్రత్యేకతను కలిగిన కావ్యం 'బొమ్మ'. భీమన్న గారి ఈ 'బొమ్మ' కావ్యం ప్రణయ కవిత్వానికి పట్టుగొమ్మ అని చెప్పవచ్చు. వీరు ప్రణయ కవిత్వం ద్వారా తాత్విక దృష్టిని ప్రతిపాదించి క్రొత్త పుంతలు తొక్కారు.

డా॥ సి.నారాయణరెడ్డి గారు వీరితత్వాన్ని గూర్చి అభినందిస్తూ తక్కువ కాలంలో ఎక్కువ రచనలు చేసే వీరు

"ఎప్పుడు చూస్తారో మరి
ఎప్పుడు రాస్తావో, అరె
తెప్పలుగా తేల్చినావు తీయని కవితల్
కుప్పలుగా రాల్చినావు క్రొన్నన పలుకుల్" అని అన్నారు.

"బొమ్మ" గేయకావ్యం ప్రణయ కవిత్వానికి ఒక చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. శృంగారానికి నాయికా నాయకులే ఆలంబన విభావాలు. ప్రణయానికి అనురాగం గల ఏ రెండు జీవులైన కావచ్చు. అచేతనాన్ని కూడా ప్రణయానికి ఆలంబనంగా తీసుకున్న సన్నివేశాలు లేకపోలేదు.

కృష్ణశాస్త్రి గారి ఊర్వశి, బాపిరాజు గారి శశికళ, విశ్వనాథ వారి కిన్నెర, నండూరి వారి యెంకి మొ॥ పాత్రలు తెలుగు సాహిత్యంలో ప్రణయ కవిత్వాన్ని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. వీరు తమ ఊహా సుందరుల్ని ఆరాధిస్తూ ఆ ఊహా ప్రేయసుల పేర్లతోనే కావ్యాలకు నామకరణం చేశారు. ఇక్కడ భీమన్న గారు దీనికి కొంత భిన్నంగా ఈ బొమ్మ ప్రణయ కావ్యాన్ని రచించారు.

ఈ "బొమ్మ" గేయ కావ్యం 1952లో రచించబడింది. 1962 నుండి అచ్చు వేయడానికి అనేక ప్రయత్నాలు జరిగి 1975 నాటికి ఈ ప్రయత్నం ఫలించింది. ఈ "బొమ్మ" గేయ కావ్యంలో నాయికా నాయకులకి పేర్లు పెట్టబడలేదు. బహుశా 'అగస్త్యభ్రాత', 'నిగమశర్మ అక్క' అనే పాత్రలు ఎంత ఔన్నత్యాన్ని సంపాదించుకున్నాయో మనందరికి విదితమే ఆ ఉద్దేశంతోనే ఈ 'బొమ్మ' కావ్యంలో కవి నాయికా నాయకులకు పేర్లు పెట్టి వుండకపోవచ్చు.

ఇక 'బొమ్మ' కావ్య ఇతివృత్తానికి వస్తే ఇందులో నాయకుడు లబ్ధుడు. నాయిక గంభీర. ఇద్దరూ కలసిమెలసి తిరుగుతూ కష్టసుఖాలు, జీవిత అనుభవాలు పంచుకుంటారు. అయితే ప్రేమకు సంబంధించి పరస్పరం తమ భావాల్ని వెల్లడించుకోలేదు నాయికా నాయకులు. అయితే చివరకు నాయకుడు ధైర్యం తెచ్చుకొని నాయిక ఫొటో కావాలని అడుగుతాడు. నాయిక ఆనందంతో ఒక ఆల్బం తెచ్చి అతని ముందు ఉంచుతుంది. అతడు సిగ్గుతో, భయంతో, వణుకుతున్న చేతులతో ఆ ఆల్బం నుండి తనకు నచ్చిన ఫొటోను ఒక దానిని తీసుకుని ఇంటికి వెళతాడు ఆ క్షణం నుండి నాయకుడు ఆ ఫొటోను ఆరాధించడం ప్రారంభిస్తాడు. ఆ ఆరాధనే ఈ మధుర ప్రణయ కావ్యం.

ఈ కావ్యంలో నాయకుడు నాయికకు చెప్పుకోలేని ప్రేమను ప్రియురాలైన 'బొమ్మ'కు చెప్పుకుంటాడు. నాయికతో కలసి తిరిగినప్పటి అనేక మధుర క్షణాల్ని నెమరు వేసుకుంటూ విరహంలో మునిగిపోతాడు. ఆమె ఆరాధన క్రమేపి అతణ్ణి సౌందర్యారాధకునిగా, కవిగా, వేదాంతిగా మార్చివేస్తుంది. ఆ బొమ్మ ఒక ప్రతీక కాగా దాని ద్వారా విశ్వచైతన్య శక్తినే దర్శించి తన్మయుడౌతాడు నాయకుడు.

అనురాగం భోగానికి, భోగం త్యాగానికి, త్యాగం యోగానికి, మార్గదర్శకమవుతూ ఉంటాయనే విషయాన్ని

ఈ కావ్యం ద్వారా ప్రబోధించారు భీమన్నగారు. విశ్వజనీన మయిన అలౌకికానందం ఆర్ధత, ఆరాధన, అనురాగం ఈ బొమ్మలో కనిపిస్తాయి. అంతేకాదు ఇందులో అధ్యాత్మిక శోభ మాలలో దారంలా అంతర్వాహినిగా వుంది.

ఈ కావ్యంలో రసరమ్య భావబంధురమైన ప్రణయ మధువుని భావుకుడైన నాయకుడు అణువణువునా దర్శిస్తాడు.

"ఇవే పూలు, ఇదే పత్రీ
ఇవే పాలు, ఇవే పండ్లు
ఇదే దీప, మిదె ధూప
మిదెపాట, ఇదె ఆట
ఆపాదమస్తకము నేను
నీ మ్రోల
అర్చనా ద్రవ్యమైనాను"

అని నాయకుడు తన ప్రణయమూర్తిని తన నిజ జీవితంలో పొందలేక ఆమె బొమ్మను తెచ్చుకుని పూజిస్తూ ప్రేమ పూజారిగా మారతాడు. ఏ ముఖం చూచినా, ఆ ముఖంగా, ఏకాంతాన్ని విన్నా ఆమె కంఠంగా భావిస్తూ తన శరీరాన్ని పూలుగా, పత్రిగా, పాలుగా, పండ్లుగా, దీపంగా, ధూపంగా, పాటగా, ఆటగా మార్చి నీ ముందు నేను అర్చనా ద్రవ్యంగా మారిపోయాను అని నాయకుడు అనడంలో అతని ఆరాధన ఎంత ఉన్నతమైనదో తెలుస్తుంది.

అంతేకాకుండా ప్రకృతిలోని ప్రతి పువ్వుని తన ప్రియురాలిగా భావిస్తాడు నాయకుడు. అతని కోరికలు సీతాకోకచిలుకల్లాగా ఎగిరి ఆయా పూల మకరందాన్ని గ్రోలుతూ ప్రతిరోజు తన కోసం వికసించే నాయికను మల్లెపువ్వు తీసుకురాలేదని తన నాయికను తలచుకుని నాయకుడు బాధపడుతూ

"గడిపువ్వు కానిమ్ము
కలువయే కానిమ్ము
పరితృప్తి ఒక్కటే
ఫలము జీవనలతకు
ప్రణయమే ఫలరసమ్ము
రసపాన
రమణమే మధువశమ్ము"

అంటూ గడ్డిపూవుకైనా, కలువకైనా, ఇంకా ఏ జీవనలతకైనా ప్రణయం ఎంతో అవసరమని తెలియ జేస్తూ తనకు కలిగిన ప్రణయ అవరోధానికి ఈ భగ్న ప్రేమికుడు ఎంతో చింతిస్తాడు.

"పర్వం సహాసర్వ
సౌందర్య రుచులెల్ల
ఏడు రంగులలోనె
ఇముడు ననుకొంటి!
సకల జీవన కళాభ!
నీ శోభ
శతవర్ణ సంపత్ ప్రభ!"

తెల్ల గులాబీ తెల్లదనంలో, మందారంలోని ఎర్రదనంలో, మేఘంలోన నీలిరంగులో, మేలి బంగారం లోని వర్ణంలో, ఒకటేమిటి అనేక రంగుల్లో ఆమె రూపాన్ని దర్శిస్తాడు నాయకుడు.

ప్రతి ఋతువుకీ దేనికున్న ప్రత్యేకత దానికుంది. ఆయా ఋతువులలో జరిగే మార్పులు ఏదో ఒక అనుభూతిని ఆనందాన్ని కలిగిస్తాయి అని నాయకుడు

"ఏ రుతువు కారుతువువె
ఏ బ్రతుకు కాబ్రతుకె"
దేనిగతిదానిదే
దేనిరతిదానిదే
మధుబాలె పాడవలెనా
మై మఱువ
మామిళ్ళె పూయవలెనా!"

అంటూ నాయకుడు ప్రతి ఋతువులలో మనకు కన్పించే ప్రకృతీ అందాలలో అంటే మామిడి చిగురు

లలోను, నెమలి నాట్యంలోనూ, కోయిల కూతలోనూ నాయికను ఊహించుకుంటూ ముగ్ధమనోహరుడౌతాడు నాయికుడు.

నాయికుడు సముద్రతీరంలో విహరిస్తూ తన గతాన్ని తలచుకొని ఆవేదన చెందడం గమనిస్తే

"చెలువ నీహృదయమే క్షీరసాగరమే
ఒడ్డుపై కూర్చుండి
ఊహింప నమృతమ్ము
దానికది మదనమగునా
వచ్చి
త్రావుమని పెదవి నిడువా"

అంటూ నాయకుడు ఓ చెలీ! నీ హృదయం పాల సముద్రము ఒడ్డుపై కూర్చుని చూస్తే దానంతట అదే అమృతమౌతుందా! నీవు వచ్చి ఆ అమృతాన్ని నాకందించవా అంటూ సముద్రంలో అలలు ఏ విధంగా తీరాన చేరి పతనమై పోతాయో అదే విధంగా తన ప్రియురాలి కోసం కన్న కలలు పతనమైపోతున్నాయని, ఆ క్షీర సాగరాన్ని తన ప్రియురాలి హృదయంగా భావించి తన ప్రణయ కవ్వంతో చిలికి అమృతాన్ని ఆస్వాదించే అవకాశం లేదని నాయికనుతలచుకుంటూ నాయకుడు పరితపిస్తాడు.

ప్రతి నాదంలోనూ ఆమెను దర్శిస్తూ, మానస సరోవరంలోని హంసలు తమ రెక్కల కదలికల్ని ఆమే పమిట రెపరెపల నుండి నేర్చుకున్నాయని, "శివ రంజనియే రవించు ఒడలెల్ల సింధుభైరవి రహించు" నని భావించి అన్ని రాగాల్లోనూ ఆమెను దర్శిస్తాడు నాయకుడు.

"మూగవీణను నేను
రాగతాళము నీవు
నన్ను నిన్నును గూర్చి
నటరాజు రానేల
అందెలను కట్టనేల
మనముందు
చిందులను ద్రొక్కనేల"

అంటూ తాను తన ప్రియురాలు ఉన్నప్పుడు తమను కలవడం కోసం నటరాజు అందెలు కట్టుకువచ్చి, చిందులు వేయవలసిన అవసరం భావిస్తున్నాడు నాయకుడు.

నీతినియమాలకు సంప్రదాయ సహజీవనాలకు ప్రతిరూపమైన అపరవేదంగా తన ప్రేయసిని దర్శిస్తాడు నాయకుడు

"వేదాల కటు నుంచి
నాదమై ప్రసరించి
రసబిందువున నిట్లు
ప్రతి బింబమైనావు
పసిడి తామరపూల పల్లకి
నీ పూజ
పరమామృతానంద పల్లకి"

అంటూ నాయి కూడా బొమ్మను తన ప్రణయానికి ప్రతీకగా భావించి తన్మయుడవుతాడు.

ప్రణయ కవిత్వంతో పాటు రసాద్వైత సిద్ధాంతంకూడా ఇందులో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

రాయికాని రాతిని నీతిగా మార్చిన రామభద్రుని కంటే కటిక రాతిని కమనీయమూర్తిగా మలచిన శిల్పిని గొంతెత్తి కొనియాడతాడు. శిల్పి చెక్కిన బొమ్మ కవి ఎశింతీలో కావ్యం అవుతుంది. ఒకప్పుడామె "అష్టాంగ సుందరిగా" గోచరిస్తుంది. మరోక్షణంలో "ఆనంద షోడని"గా భాసిస్తుంది. రూపమేది అయినా లక్ష్యం ఒక్కటే అదే ఆనందం. ఆ లక్ష్యాన్ని చేరడానికి భీమన్నగారు ఈ బొమ్మ కావ్యాన్ని ప్రణయ కవితా ధోరణిలో నడిపించారు.

భీమన్నగారి సిద్ధాంతాల్లో మొదటిది రసాద్వైతం. వీరుతమ ఆధ్యాత్మిక సిద్ధాంతానికి పెట్టుకున్న పేరు రసాద్వైతం. "అహం బ్రహ్మాస్మి" అంటే దేవుడికి జీవుడికి

భేదం లేకపోవడం. జీవుడు దేవుడిలో లయమై పోతాడనే విషయాన్ని చెప్పేదే అద్వైతం. ఎటువంటి స్వార్థం గాని, ప్రయోజనం గాని లేకుండా పురుషుని స్త్రీయో, స్త్రీని పురుషుడో గాఢంగా ప్రేమించు కుని నిష్కల్మషంగా ఆత్మార్పణ చేసుకుంటే అదే రసాద్వైతం. రాతినో సమాధినో కాకుండా, మీ భార్యనో, మీ భర్తనో, నెచ్చెలినో, ఆరాధించుకోండి. అదే రసాద్వైతం అని భీమన్న గారు నొక్కి వక్కాణించారు.

ఈ బొమ్మ కావ్యంలో

"నిను తెచ్చుకోలేక
నీ బొమ్మను తెచ్చుకుని
పూజలో నెలకొల్పి
పూజారినైనాను"

అని బాధపడుతూ నిరాశ చెందక, ఆశపోనివ్వక

"ఆరాధకుడ నేను
ఆశపోనివ్వనే
హాలహలము మ్రింగి
అమృతమ్ముపంచెదరు
విశ్వాలు పెకలింతును
నీ కొరకు
విశ్వాలు పులకింతును"

అంటూ బొమ్మ ఆరాధనలోనే సంతృప్తుడౌతాడు నాయకుడు.

పద్మభూషణ్ భోయి భీమన్న గారు ప్రకృతిలోకి ప్రేమతత్వాన్ని ప్రోదిచేసి ప్రణయ కవిత్వానికి ప్రతి బింబంగా ఈ 'బొమ్మ' కావ్యాన్ని తీర్చిదిద్దారు. ఈ 'బొమ్మే' కావ్యం తెలుగు సాహిత్యంలోని ప్రణయ కావ్యాలతో పోల్చి చూస్తే చెక్కు చెదరని జాతి 'బొమ్మ'గా పరిగణించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1) బొమ్మ డా॥ బోయిభీమన్న
2) సుదర్శిని - డా॥ కొండపల్లి సుదర్శనరాజు
3) సులోచని - డా॥ కొండపల్లి సుదర్శనరాజు

ఆధునిక తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ సుప్రభాతం

– డా॥. తరపట్ల సత్యనారాయణ, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

ఆధునిక తెలుగు సాహిత్యం వాస్తవాలను ఆధారం చేసుకొని భౌతిక వాద దృక్పథంతో, హేతువాద భావన లతో, సంస్కరణల దిశగా పురోగమిస్తూ విమర్శ, ప్రతి విమర్శల కోణంలో పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగా అడుగులు వేస్తూ సమాజంలో జరిగిన, జరుగుతున్న విషయాలపై స్పందిస్తూ ప్రజల భావనలను, భావా వేశాలను, సంఘటనలను, సంఘర్షణలను, ప్రతిఘటన లను వస్తువుగా స్వీకరిస్తూ ప్రజల భాషలో విభిన్న ప్రక్రియలద్వారా అక్షర రూపంలో వ్యక్తీకరించే పదునైన ప్రజా సాహిత్యమే ఈ ఆధునిక సాహిత్యం. తరాలు మారినా తలరాతలు మారని కష్టజీవుల వ్యధలను కథలుగా, కవితలుగా, కావ్యాలుగా మరలచిన ఎందరో కవులు ఆధునిక తెలుగు సాహిత్య వీధిలో అడుగడుగునా దర్శనమిస్తారు. ప్రాచీన సాహిత్యం దేవతలకు, దేవుళ్ళకు, రాజులకు, రాణులకు, విలాసాలకు, వినోదాలకు, సింగారాలకు, శృంగారాలకు పట్టంకట్టి పల్లకి ఎక్కిస్తే ఆధునిక సాహిత్యం ప్రపంచానికి ముద్దపెడుతున్న శ్రమ జీవుల చెమట ధారలను, ఆకలి బాధలతో అలమటిస్తూ సమాజానికి సమస్తాన్ని సమకూరుస్తున్న సహస్రవృత్తుల శరీర కష్టాన్ని, బడివేరు, గుడివేరు చస్తే సమాధి వేరుగా, ఊరికి దూరంగా బ్రతుకుతూ ప్రపంచంలో ప్రశ్నార్థకంగా నిలచిన నిశిద్ధ జీవుల విషాద బ్రతుకులకు కొండంత అండగా నిలబడి నినదించిన అసలు సిసలైన సాహిత్యమే ఆధునిక సాహిత్యం. భాషలోను, భావంలోను, వస్తువు లోను, వర్ణనలోను నవ్యతను తీసుకొచ్చి సరికొత్త ఆవిష్కరణలతో ఆవిర్భవించిన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక సరికొత్త చరిత్రను సృష్టించుకొని పాలేరు నుండి పద్మశ్రీ వరకు ఎదిగిన పద్మభూషణుడు డా॥ బోయి భీమన్న గారు. వీరు వివిధ ప్రక్రియలతో వినూత్న రచనలుచేసి విస్మయం కలిగించిన నవ్య కవీశ్వరుడు.

ఉద్దేశ్యం :

జగమెరిగిన జనకవి, డా॥ బోయి భీమన్న రాసిన రచనలు నూతన ఆవిష్కరణలకు, చర్చనీయాంశాలకు, విమర్శలకు వేదికలౌతాయి. వాస్తవికతతోపాటు వస్తు స్వీకరణలో, వైవిధ్యంలోను నవ్యత కనిపిస్తుంది. నలుగురు నడిచే దారిలో నడిచే కవికాదు, నలుగురుతో నారాయణ అనే కవీకాదు. అన్నింటికి భిన్నంగా కనిపించే నిఖార్సైన విమర్శక కవి భీమన్న కవి. అనుకున్నది అనుకున్నట్లుగా వ్రాసి యదార్థతను యథాతథంగా వివరించే చెప్పే సమర్థతగల దిట్టకవి. భీమన్న రచించిన వినూత్న రచనే అంబేడ్కర్ సుప్రభాతం. తెలుగు సాహిత్య చరిత్రలో సరిక్రొత్త సంచలనాన్ని లేపి విమర్శకు ప్రతి విమర్శకు అస్త్రమై దళితజన హృదయాల్లో విజ్ఞాన సుప్రభాతమైంది. ఎంతో మంది కవులకు ప్రేరణ కలిగించింది. అప్పటి వరకు దేవాలయాల్లో వినబడే దేవుళ్ళ సుప్రభాతాలకు భిన్నంగా భారతరత్నమై ప్రకాశించిన, భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన త్యాగాలను, నడిపిన మార్గాలను చైతన్య పరచిన సందేశాలను కథావస్తువుగా తీసుకొని రచించిన అంబేడ్కర్ సుప్రభాతం లోని విషయాలను ప్రత్యేకంగా వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశ్యం.

రచనా నేపథ్యం :

ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు ఎన్నో పుట్టుకొచ్చాయి. వచన సాహిత్యంలో నేటికి ఏదో ప్రక్రియ నిత్యనూతనంగా ఆవిర్భవిస్తూనే ఉంది. ప్రాచీన సాహిత్య ప్రక్రియ పద్యమైతే ఆధునిక సాహిత్య ప్రక్రియ వచనం మరింత ప్రాచుర్యాన్ని, ప్రాధాన్యతను సంత

రించుకొని నేటికీ సజీవంగా నడుస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంలో డా॥ బోయి భీమన్న గారు సృష్టించిన నరిక్రొత్త ప్రక్రియల్లో కొన్నింటిని గమనిస్తే వారి ఆలోచనలు, ఆవిష్కరణలు, సరికొత్త ధోరణులు, నూతన కవితా మార్గానికి నాందిగీతాలుగా కనిపిస్తాయి. పద్య సాహిత్యంలో మనం ద్విపదులను చూస్తాం కాని వీరు త్రిపదలు రాసారు. ఉపాఖ్యానాలు, వ్యాఖ్యానాలు సహజంగా కనిపిస్తాయి, కాని వీరు ఏకపద్యోపాఖ్యానము వ్రాసారు. సుమతీభాస్కర శతకాలు, నీతిశతకాలు కని పిస్తాయి. కాని వీరు పిల్లి శతకం వ్రాసారు. ప్రాచీనులు ఆటవెలదులు వ్రాస్తే వీరు మాటవెలదులు వ్రాసారు. ఇటువంటి విభిన్నమైన రచనలుచేసి తెలుగు సాహిత్యంలో నరికొత్త సంచలనానికి కారకులయ్యారు. సాహితీ కేదారంలో ఇటువంటి సరికొత్త వంగడాలను సృష్టించి ఎన్నో కావ్యపంటలను పండించిన సాహితీ కృషీవలుడు డా॥ బోయి భీమన్నగారు. వీరు వ్రాసిన అంబేడ్కర్ సుప్రభాతం 1984-1991లో రెండు ముద్రణలుగా వచ్చాయి. తన చెల్లెలైన బోయి ద్రౌపది గారికి అంకితంగా ఇవ్వబడింది.

ఇప్పటి వరకు తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే దేవుళ్ళకు ప్రభాత సేవలు, ప్రభాత కీర్తనలు, పవళింపు సేవలు, మేల్కొల్పులు, మంగళహారతులు, కళ్యాణ సేవలు ఇలా ఎన్నో కనిపిస్తాయి. అలాగే వెంకటేశ్వర స్వామిని మేల్కొల్పే సుప్రభాత గీతాలు, శ్రీశైల మల్లికార్జున సుప్రభాత గీతాలు ఉన్నాయి. అలాగే తమిళంలో అండాళ్ళు (గోదాదేవి) వ్రాసిన తిరుప్పావై మరొక విధమైన సుప్రభాత గీతాలు కూడా కనిపిస్తాయి. ఇవన్నీ దేవుళ్ళకు సంబంధించిన సుప్రభాతాలు, కేవలం దేవుళ్ళను మేల్కొల్పడానికే ఇవన్నీ వ్రాయబడ్డాయి. కాని డా॥ బోయి భీమన్న గారు వ్రాసిన అంబేడ్కర్ సుప్రభాతం అంబేడ్కర్‌ను మేల్కొల్పడానికికాదు, నిద్రాణ వ్యవస్థలో ఉన్న అజ్ఞాన అంధకారంలో ఉన్న దళిత జనులను మేల్కొల్పడానికి, అంబేడ్కర్ మేల్కొల్పే పవిత్రగాథ ఇందులో కనిపిస్తుంది. ప్రతివారు ప్రతి ఉదయం పాడుకోవాల్సిన గీతమిది. సుప్రభాతం అంటే మంచి ప్రభాతం అని అర్థం. అనగా అందమైన సూర్యోదయ సమయం. దీనిని ఇంగ్లీష్‌లో కూడా ఇదే అర్థంలో గుడ్ మార్నింగ్ అని కూడా అంటున్నాము. ఈ సుప్రభాత కావ్యం 86 పద్యాల్లో ఉంది. నమస్సుల్ డాక్టర్ అంబేడ్కరా అనే మకుటంతో శార్దూల, మత్తేభ విక్రీడిత వృత్తాలతో వ్రాయబడిన రచన.

నవభారత రాజ్యాంగ నిర్మాతగా నిలచిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భీమన్న గారి దృష్టిలో నవభారత జాతిపితగా కనిపిస్తారు. వీరు అపర బుద్ధునిగా, అభినవ మనువుగా, ప్రపంచ మేధావిగా శ్లాఘింపబడుతూ వారి ఉద్యమాలను ఆలోచనా విధానాలను ప్రధాన కథావస్తువుగా తీసుకొని వ్రాయబడిన ఈ సుప్రభాతం సరికొత్త విప్లవాన్ని తెచ్చింది. సాహితీ వేత్తల మెదళ్ళలో ఎన్నో ఆలోచనలను రేకెత్తిం చింది. మనువాదపు కవనబృందపు మెదళ్ళలో అగ్నివర్షమై కురిసింది. కేవలం భీమన్న అక్షరానికి ఇంత విస్పోటనం కలిగిందంటే అయన ఆలోచనలోను వస్తు స్వీకరణలోను, తీసుకున్న నిర్ణయమే ప్రత్యేకతగా చెప్పవచ్చు.

ఇతివృత్త ప్రధానాంశాలు :

అంబేడ్కర్ సుప్రభాతాన్ని పరిశీలిస్తే అందులో ప్రధాన మైన పదిహేడు అంశాలపై విస్తృతమైన అధ్యయనం చేసినట్లు తెలుస్తుంది. మనువాదం దగ్గర నుండి మానవ తావాదం వరకు ఎన్నో అంశాలు ఇందులో ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా శ్రామికవాదం, బ్రాహ్మణీయ వాదం, ప్రాపంచిక వాదం, సామ్యవాదం, ఆధ్యాత్మిక వాదం, జాతివాదం, మతవాదం, హిందువాదం, ఆత్మగౌరవ నినాదం, హేతువాదం, నాస్తికవాదం, సోషలిస్ట్ మరియు కమ్యూనిస్టు వాద సిద్ధాంత ప్రభావాలు, స్వరాజ్యవాదం, బౌద్ధవాదం, అంబేడ్కర్ వాదం, ఇటువంటివి ఎన్నో వాదనలు అధ్యయనం చేస్తేగాని అర్థంకాదు. విభిన్న వాదాలతో కూడిన అధ్యయనంతో రాసిన ఉత్క ృష్ట కావ్యమే ఈ సుప్రభాతంగా భావించవచ్చు. ఇందులో

ప్రధానంగా దేవుళ్ళను మేల్కొల్పడంకాదనే సత్యాన్ని గ్రహించాలి. వెలివాడల జీవితాలకు, బడుగుజీవుల చీకటి బ్రతుకులకు దళిత జీవుల ఆకలి వేదనలకు, మత జాతి కుల అహంకార, అహంభావ మనస్తత్వ జీవుల నుండి విముక్తికి, అణగారిన బ్రతుకుల పోరులో ఒక భరోసా ఇవ్వడంకోసం అసమానతలతో కూడి ఉన్న సమాజానికి చైతన్యం రగిలించడానికి అంబేడ్కర్ చెప్పిన సిద్ధాంతాలు, బోధనలు, అంబేడ్కర్ సుప్రభాతంలో ప్రధానాంశాలు అయ్యాయి.

అంబేడ్కర్ సుప్రభాతంలో భక్తివాద సాంప్రదాయం, వాటిలో ఉన్న లోపాలు, సంస్కార దృక్పథం, సమతా ధోరణి, సంఘటిత పోరాట స్ఫూర్తి, సాంఘిక చైతన్య దీప్తి, కుల మత జాతి రహిత సమ సమాజ స్థాపన, శ్రేయోవాద రాజ్య స్థాపన, ఐక్యమత్యంతో అభివృద్ధి పథంలో చేరుకునే ఆలంబన మార్గాల ఉపదేశికత్వం, ధర్మ రక్షణ, సంఘ సంస్కరణ, ఋజుమార్గ ప్రవర్తన, ఆధార సహితమైన విజ్ఞాన శాస్త్రీయ పద్ధతులు వంటి ఎన్నో అంశాలపై డా॥ భీమన్న గారు విస్తృతమైన అధ్యయనంతో అంబేడ్కర్ జీవితాన్ని ఆధారం చేసుకుని రచించినట్లుగా తెలుస్తోంది. అందుకే ఒక సందర్భంలో డా॥ విజయభారతి గారు రాసిన అంబేడ్కర్ జీవితచరిత్ర చదవడం వల్ల ఈ ప్రేరణ కలిగిందని, అప్పటి నుండి అంబేడ్కర్ సిద్ధాంతాలు, రచనలు, వివిధ వాదాలు, అధ్యయనం చేయడంవల్ల ఈ రచన వెలుగుచూసిందని ప్రగాఢ విశాస్వాన్ని వ్యక్తంచేసారు. ఈనాటి సమాజానికి, ఈనాటి తరానికి అంబడ్కర్ సుప్రభాతం జీవితాల్లో ఆనంద ప్రభాతం కావాలని భీమన్న గారు ఆకాంక్షించారని తెలుస్తుంది.

అంబేడ్కర్ నినాదాలు పోరాట స్ఫూర్తి :

పద్మభూషణ్ బోయి భీమన్న గారు అంబేడ్కర్ నినాదాలను, ఉద్యమ పోరాటాలను, సందర్భానుసారంగా విషయ వివరణతో, ఉదాహరణ పూర్వకంగా వివరించే ప్రయత్నం ప్రధానంగా గుర్తించవచ్చు. అర్థ తాత్పర్య విశేషాలతో అర్థమయ్యే రీతిలో అంబేడ్కర్ సుప్రభాతాన్ని అవిష్కరించారు. అందులో బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదాలు ఒక క్రమ పద్ధతిలో అంబేడ్కర్ ఉద్యమాన్ని తెలియజేస్తున్నాయి. అందుకే స్వతంత్రత కలిగి జీవించాలని పిలుపునిస్తూ

స్వాతంత్ర్య మ్మొక రిచ్చు భిక్ష మగునే?
సాధించుకొం డేకమై
రైతుల్ కార్మికు, లంచు జీవ పరమా
ర్థమ్మున్ నిరూపించి, వ
ర్గాతీతమ్మగు విశ్వమానవత మా
కందించవే ! ధార్మిక
స్రోతస్సుందర ! లోక మందిర ! నమ
స్సుల్, డాక్ట రంబేడ్కరా !... అంటారు.

స్వాతంత్ర్యం అనేది ఎవరో ఒకరిచ్చే భిక్షకాదు. మరొకరు పుచ్చుకొనేదికాదు. అందుకే స్వతంత్రత కలిగి ధైర్యంగా కార్మిక, శ్రామికరైతు కూలీలందరూ సంఘటితమై సమైఖ్య శక్తిగా మారి ఉద్యమం ద్వారానే ఏదైనా సాధించుకోవచ్చనే భావనను, దగాపడిన దళిత జాతులకు, శ్రమ నిష్ఫలమైన శ్రామికులకు, పిలుపునిచ్చారు. విశ్వమానవతే ధ్యేయంగా లేవండని పిలుపునిస్తూ వర్గాతీతమైన జనశక్తి ప్రభంజనంగా మారాలని శ్రమపడుతున్న వర్గాన్ని కథనరంగానికి సిద్ధంచేస్తూ పోరాట బావుట ఎగరేస్తూ ఉద్యమ బాటకు నాంది గీతంలా ఈ పద్యం కనిపిస్తుంది. దీనికి ఆధారం అంబేడ్కర్ చెప్పినటువంటి యాచనలు, విజ్ఞాపనలు ద్వారా ఏదీ సాధించుకోలేమని, నిరంతర పోరాటం ద్వారానే ఏదైనా సాధించుకోవచ్చేనే నినాదం ఇందులో కనిపిస్తుంది.

అంబేడ్కర్ 1944లో ఏలూరు రావడం జరిగింది. అప్పటికే అంబేడ్కర్ వైశ్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కార్మిక సభ్యునిగా ఉన్నారు. ఆ పర్యటనలో భాగంగా ఆయన్ని చూడటానికి సందేశాన్ని వినడానికి వేలకు వేల సంఖ్యల్లో జనం రావడం చూసి అంబేడ్కర్ ఉద్వేగానికి గురయ్యారు. ఆ సందర్భంగా రైతు కూలీలను చూడగా వారి చేతుల్లో

కర్రలు కనిపించాయి, అప్పుడు ఇంత గొప్ప సైన్యంగా ఉన్న మీరు మీ హక్కుల రక్షణ కోసం మీ చేతుల్లో ఉన్న కర్రలను ఆయుధాలుగా మలచి ప్రాణాలను బలిచ్చైనా మీ హక్కులను సాధించుకునే ధైర్యం ఉందని ఇప్పుడు నేను మిమ్ములను చూస్తుంటే చాలా ధైర్యంగా ఉందని చెప్పడం మరిచిపోలేని విషయం.

ప్రీతిన్ నిత్యము చేతికర్రలతో ధా
త్రిన్ గొల్చు మా రైతు కూ
లీ తమ్ముల్ తమ స్వేచ్ఛ గెల్చుకొన లే
రే యంచు ప్రశ్నించి, స్వేచ
చ్ఛా తత్వమును బోధ చేసిన సుధీ
క్షా! సాంస్కృతీ విప్లవ
జ్యోతీ! అభ్యుదయ ప్రభాకర ! నమ
స్సుల్, డాక్ట రంబేడ్కరా !

రైతులు కూలీలు సంఘటితంగా పోరాటం చెయ్యాలనే నినాదం ఇందులో కనిపిస్తుంది. ఓ వ్యవసాయ కూలీల్లారా లోకంలోని ధర్మమనే మహాసౌధానికి మీరే ఇటుకలు వంటి వారు, మీరే లేకపోతే ధర్మము లేదు, సౌధము లేదు, మీరు ఏమాత్రము నిర్జీవ వస్తువులు కాదు. మీరు చైతన్యవంతమైన మనుషులున అని గుర్తుంచుకోండి. ఒకడికి ఒకడు బానిసకాదు. సంఘటితమై ఒక మహావృక్షంగా మారి జాతికి నాయకునిగా నిలబడు అన్న అంబేడ్కర్ ఆలోచన కార్యసాధనలోకి రావాలని కోరుకున్న నినాదం ఇందులో కనిపిస్తుంది.

కుల మత వ్యవస్థపై తిరుగుబాటు :

హిందు సమాజంలో కులతత్వం పెత్తన చేయడం వల్ల సమానత్వం మంటగలిసి పోయింది. దాంతో మూఢాచారాలు మర్రి వృక్షంలా పాతుకుపోయాయి. అజ్ఞానాంధకారం ముసుగులో విజ్ఞానం బంధీ అయి పోయింది. అటువంటి విష సంస్కృతి పునాదులను పెకళించవలసిన అవసరం ఉందని అంబేడ్కర్ చెప్పిన సిద్ధాంతం. సుప్రభాతంలో కనిపిస్తుంది. కుల తత్వమనే దోషంవల్ల బ్రహ్మతత్వ మహిమలు పోగొట్టుకుని భారతీయులు రాజకీయ స్వాతంత్ర్యయాన్ని పోగొట్టుకున్నాదన్నారు. వేదకాలం నాటికి ఇప్పటికీ ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ

కులతత్వమ్మున బ్రహ్మతత్వ మహిమల్
కోల్పోయి స్వాతంత్ర్య హీ
నులుగా మారిన భారతీయులను జ్ఞా
నోద్బుద్ధులన్ జేసి, ఉ
జ్జ్వల సంపూర్ణ సమైక్యజాతి నొసరిం
చన్ బూనుకొన్నట్టి ని
స్తుల మేధా మధుమూర్తి ! నీ కివె ! నమ
స్సుల్, డాక్ట రంబేడ్కరా !

ఈ దేశానికి గుదిబండగా మారి అన్నింటికి అడ్డంకిగా తయారైన ఈ కులతత్వం వల్ల దేశం పరువు పోయిందని, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇవన్నీ కులతత్వ ప్రాధాన్యతకు ప్రతీకగా నిలబడ్డాయని భావించవలసి ఉంటుంది. అసలు వేదకాలంలో ఉన్న సంస్కృతి వేరు, నేటి కాలపు సంస్కృతి వేరు. కాని చాలా వరకు సగానికి సగం పైగా ప్రక్షిత్తం చేయబడటం వల్ల భారతీయ సంస్కృతి పతనావస్థకు చేరుకుంది. మూఢభక్తి గణనీయంగా పెరిగిపోయింది. అందుకే జ్ఞానం కలిగే మనస్సు దయ చేయమని అభిలషించారు. వెలివేయబడిన వర్గం నుండి ఆకాశమంత ఎత్తు ఎదిగి విశ్వమేధావిగా గణనకెక్కిన అంబేడ్కర్ కీర్తిని శ్లాఘిస్తూ భీమన్న గారు ఆయన దీక్షా దక్షతను లోకోత్తమ నాయకత్వాన్ని చాటుతూ

వెలివేయంబడి నట్టి వర్గమున ఆ
విర్భావమున్ బొంది, ని
శ్చల దీక్షన్ చదువుల్ గడించి, కుల దా
స్య వ్యూహముల్ చెండి, సం
కెలలన్ ద్రెంచి, నిరుద్ధ భారత విము
క్తిన్ దెల్పి, కూలీలు రా
జులుగా జూచిన నాయకోత్తమ ! నమ
స్సుల్, డాక్ట రంబేడ్కరా !

భీమన్న గారు జాతీయ నాయకునిగా అంబేడ్కర్‌ని స్మరిస్తూ ఆయన కష్టాన్ని, శ్రమను గురించి ఆయన చదువుకున్నటువంటి, సాధించినటువంటి, విదేశాలలో విజ్ఞాన వికాసాన్ని ఈ తరానికి అందించే ప్రయత్నంగా అంబేడ్కరా మా జాతినాయకుడవంటూ కూలీలను కూడా రాజులుగా చూసిన నాయకుడవు నీవు. నిశ్చలమైన దీక్షతో చదువులు గడించినావు. మా దాస్య శృంఖలాలను చేధించే సాధనంగా మలిచావు. అలాగే భారతదేశంలో మనుష్యులను నాలుగు తెగలుగా విభజించి వర్ణబేధంతో వక్రీకరించిన తీరును నిరసించిన ఉద్యమశీలిగా అంబేడ్కర్‌ను ఆవిష్కరించారు.

బోయి భీమన్న గారు అంబేడ్కర్‌ని శ్లాఘిస్తూ నీకూ నాకూ పోలికలెన్నో ఉన్నాయంటూ నీవు మాకందరికి సూర్యుడవు, నేను ఒక దీపాన్ని అని చెబుతూ సూర్యుడికి, దీపానికి పోలికలున్నాయంటూ ఉభయత్రా వెలుగు వేడి ఉందని రెండింటిలోనూ పరోపకార పారాయణత ఉందని, పరిమితులు పరిధులు మాత్రం వేరని చెప్పటం అంబేడ్కర్ ఉద్యమస్ఫూర్తి అర్థమవుతుంది. అందుకే అంబేడ్కర్ జీవితం అందరికి ఆదర్శప్రాయంగా నిలవాలని కాంక్షించారు. చివరిగా అంబేడ్కర్‌ని దర్శిస్తూ

ఇది నే నిన్ కనుగొన్న దర్శనము, నా
హృద్దర్పణ మ్మిద్ధి; శా
రద సూర్యుండును, గ్రీష్మచంద్రుడును, మూ
లజ్యోతియున్ నీవె; నీ
ఉదయమ్మే అధునా మహోదయము, శ్రే
యోనీతి; మా ఆశ పూ
చు దయా ధర్మశుభాలికన్, ప్రభు ! నమ
స్సుల్, డాక్ట రంబేడ్కరా !

ఈ విధంగా బోయి భీమన్న గారు రాసినటువంటి అంబేడ్కర్ సుప్రభాతం ఈ తరానికి ఎన్నో విషయాలను విశిధపరచినట్లు గ్రహించాలి. అంబేడ్కర్ జీవితం ఎదుర్కొన్న అవమానాలు, సాధించిన విజయాలు పడిన కష్టాలు, అనుభవించిన అవమానాలు, దుర్భర ఆర్థిక స్థితి విదేశాల్లో చదివిన చదువులు సాధించిన అత్యున్నత డిగ్రీలు, రాజ్యాంగ రచన ప్రగతి, చట్టాల నిర్మాణం, సంస్కరణ, రిజర్వ్‌బాంక్ స్థాపన, పాకిస్థాన్ సమస్య - పరిష్కరణ, హక్కులు, మనువాదంపై ధిక్కరణ, సమత సైన్యం, బౌద్ధమత స్వీకరణ, ఉద్యమ నేపథ్యాలు ఇవన్నీ సుప్రభాతంలో ప్రధాన భూమికగా కనిపిస్తాయి. 86 పద్యాల్లో ఉన్న అంబేడ్కర్ సుప్రభాతం పాడుకోవడానికి వీలుగా, పఠించడానికి వీలుగా, ఆచరించడానికి అనువుగా చక్కని శైలిలో అర్థతాత్పర్య విశ్లేషణతో వ్రాసి కొత్త పంథాను అనుసరించారు. అందుకే బోయి భీమన్న గారు పద్మ విభూషణుడై సాహితీ జగత్తులో ఉత్తమ స్థానాన్ని చేరుకుని కవితా వైతాళికులయ్యారు. అంబేడ్కర్ ఆదర్శమంటూ ఆచరణలో చూపిన ఆదర్శ కవిగా నిలిచారు. ఈ తరానికి ఇటువంటి రచనలు సామాజిక చైతన్యాన్ని తీసుకు రావడంలో అంబేడ్కర్ ఔన్నత్యాన్ని తెలుసుకోవడంలో ఎంతగానో సహకరిస్తుందని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1) డా॥ బోయి భీమన్న - అంబేడ్కర్ సుప్రభాతం
2) డా॥ బోయి భీమన్న - ఏకపద్యోపాఖ్యానం
3) డా॥ సి. నారాయణరెడ్డి - ఆధునిక ఆంధ్రకవిత్వం, సాంప్రదాయాలు, ప్రయోగాలు

పాలేరు నాటకంలోని సాహిత్య సౌందర్యం

– డా॥. సూరపరాజు వసంత కుమారి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

గొప్ప రచయిత, మంచి మానవతా వేత్త, ఉత్తమ సాహితీవేత్త, సంఘసంస్కరణ వాది అయిన బోయి భీమన్న 1911 సెప్టెంబరు 19వ తేదీన నాగమ్మ, పుల్లయ్య దంపతులకు కోనసీమలోని మామిడి కుదురు గ్రామంలో జన్మించాడు. తన తండ్రిగారు తనకు పుట్టిన ఐదు మంది మగపిల్లలకు పంచపాండవుల పేర్లు పెట్టడంతో, రెండవ సంతానమైన వీరికి భీమన్న అన్న నామకరణం జరిగింది. 19వ శతాబ్దంలోని కాలమాన పరిస్థితుల్లో వున్న అంటరాని తనం, అట్టడుగు వర్గాల అవిద్య, బానిసత్వం వంటి దురాచారాలపట్ల ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి, సాంఘిక విప్లవాన్ని తనకలం ద్వారా సాధించి సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన ఉత్తముడు బోయి భీమన్న.

"నా సుఖాలు, సంతోషాలు
సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం
నాకష్టాలూ, నష్టాలూ, దురదృష్టాలూ
అన్ని శివార్పణం"

ఎన్ని కష్టనష్టాలెదురైనా తన జీవిత పరమార్థం సాహిత్య సేవ అని చెప్పుకున్న భీమన్న. సాహిత్యంలోని వివిధ ప్రక్రియలైన నాటకాలు, నవలలు, శతకాలు కావ్యాలు, కవితలు, వచనాలులో అనేక రచనలు చేసాడు. పద్మశ్రీ, కళాప్రపూర్ణ, డిలిట్ వంటి ఎన్నో పురస్కారాలు పొందిన బోయి భీమన్న అసామాన్యుడు, అద్వితీయుడు, కారణజన్ముడు.

సాహిత్య ప్రయోజనం సమాజ శ్రేయస్సే. బోయి భీమన్న రచించిన పాలేరు నాటకం ఎంతో ప్రత్యేకత సంతరించుకొని, ఆనాటి సమాజంలోని జానపదాల్లో లెక్కకు మిక్కిలిగా ప్రదర్శింపబడి ఎందరో జీవితాల్లో మార్పు తీసుకు రావడం ద్వారా, సాంఘిక విప్లవానికి కారణమైనది, రచయిత కీర్తికిరీటానికి మేలి తురాయిగా నిలిచింది.

పాలేరు నాటకం అంత ప్రాచుర్యాన్ని పొందడానికి వున్న అనేక కారణాల్లో అందులోని సాహిత్య సౌందర్యం ప్రధానమైనది. నాటకంలో రచయిత యొక్క రచనా శిల్ప రమణీయత పాఠకులను, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి వారి మనసులను గెలుచుకొంది.

పాలేరు నాటకంలోని కథ చాలా చిన్నది. అందులో ప్రధాన పాత్రధారుడు వెంకన్న. అంటరాని కులంలో జన్మించిన అతని తండ్రి, అతను ఇద్దరూ పాలేర్లుగా భూస్వామి కుబేరయ్య దగ్గర పనిచేస్తూ వుంటారు. వెంకన్నకు చదువుకోవాలనే కోరిక వున్నా కూడా తన తండ్రి మరియు భూస్వామిల వలన కుదరదు. భూస్వామి వారిని హింసిస్తూవుంటాడు. అగ్రకులంలోని సంపన్న కుటుంబంలో పుట్టిన మంచివారు వనబాల, ఆమె అన్న సుందరం. వారు వెంకన్నకు సహాయం చేస్తారు. అందరూ చదువుకోవాలని చెప్పే సంస్కార భావాలు కలిగిన ఆ వూరి బడి పంతులు ఉపకారి. వారి సహాయంతో కాకినాడకు వెళ్ళి బాగా చదువుకొని డిప్యూటి కలెక్టరుగా తన వూరికి తిరిగివచ్చి తనకు మంచిచేయని భూస్వామి కుబేరయ్యకు కూడా మేలు చేసి, తనను ఇష్టపడ్డ వనబాలను వివాహం చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

ఈ నాటక రచన వాడుక భాషలోని చిన్న చిన్న పదాలతో, సాధారణ జానపదులకు కూడా అర్థమయ్యేలా అత్యంత సరళంగా సాగిపోతూవుంటుంది. నాటకంలోని ఒక్కో పాత్ర తన భావాలకనుగుణంగా పాటల ద్వారా వ్యక్తం చేసే తీరులో వున్న సాహిత్య సౌందర్యం అమోఘం.

బానిసతనమును - బాపుమురా
భారతభూమికి - భాగ్యము తేరా!
సకల దేశముల - సర్వ మానవుల
సామ్యము - సాధింపుమురా?
ఒకడు తినుచు - మరియొకడు - పస్తుపడి
యుండుట - ధర్మము కాదురా!
కూడూ, గుడ్డ, కొంపయు సమానముగ
కూర్పుమురా లోకమున.
ప్రభువు - సేవకుడు లేని సంఘమును
పదిలముగా నిర్మింపురా!
సౌఖ్యము, సంతోషము మానవులకు
సమకూర్చుమురా!వీరా!

పాలేరుగా పశువులను కాస్తూ వున్న, కథానాయకుడైన వెంకన్న నాటక ప్రారంభంలో పాడే ఈ పాట ద్వారా రచయిత తన నాటకరచనలోని ప్రయోజకత్వం సమ సమాజ స్థాపనే అని తెలిపిన తీరు సుందరం.

విశ్రమింపుము, విశ్రమింపుము
విశ్రమింపుము, మిత్రుడా!
నేడు పోయిన, రేపు నీవే
విక్రమింతువు మిత్రుడా!
పగలు పగలు శ్రమించి జాతికి
ప్రాణ మిత్తువు మిత్రుడా!
కాంతులెల్ల హరించి చీకటి
కడలి ముంతురె మిత్రుడా!
విశ్వమునకే సేవకుడవై
విసిగిపోతివె మిత్రుడా!
రేయి వచ్చెను, విశ్రమింపుము
రేపు నీదే మిత్రుడా!

కథానాయకి వనబాల సాయంకాలపు వేళ బడినుండి ఇంటికి వెళ్తూ ఆ నీరెండ వేళ అస్తమించబోతున్న సూర్యుడి గురించి పాడిన పాటలోని సాహిత్యం సుందరం. ఇందులోని భావం మరొక కోణంలో కథా నాయకుడిని ఉద్దేశించి అంతర్గతంగా చెపుతున్నట్లు వుండడం విశేషం.

పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరెరా భారత భాగ్యము !
అజ్ఞానముతో, అధికారపు బహు
భారపు లోహపు పదముల కింద,
క్రిమి కీటకముల మాదిరి నలిగే
కృషికుల, శ్రమికుల కాపాడుమురా!
పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరెరా భారత భాగ్యము!

పల్లెటూర్లే భారతదేశ భాగ్యమని, వాటిని అక్కడున్న మనుషులను, కాపాడాలనే సందేశం సుందరం పాత్ర ద్వారా తెలిపిన తీరు సుందరం.

గోచిపెట్టుట నెర్చుకొనగానె బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులార!
నడువ నేర్చుటతోనే బుడతని గొంపోయి
పాలేరు తనముంచు దీనులార!
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులార!
వంటయిల్లొకటె ప్రపంచమ్ముగా చేసి
తనయుల నేడ్పించు తల్లులార!
జాతి శక్తి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసికొంటిరే గాఢ నిద్ర?
శక్తికంతకు మూలము చదువు కాన
బడికి బంపుడు మీ వంశవర్ధనులను.

ఆనాటి సమాజ పరిస్థితుల్లో తమ పిల్లలను పాలేర్లుగా చేసే తల్లిదండ్రులందరూ కళ్ళు తెరవాలని, పిల్లలను చదివించాలనే సందేశాన్ని ఉపాధ్యాయుడైన ఉపకారి పాత్ర ద్వారా రచయిత సమాజానికి చెప్పిన మంచి మాటలు మధురం.

పుణ్యభారత భారతీ పుత్రులారా?
కన్న బిడ్డ లజ్ఞానాంధకార మందు
ఒకరి నొక్కరు పట్టి కొట్టుకొనుచుండ
విద్య అనియెడు కాగడా వెలుగుజూపి
ఏల రక్షించుకొనరు మీ బాలకులను?

విద్యలేని మనుష్యులు వింత పశువు
లన వినరె? పశుత్వమ్మె మీక మృతమగునె?
బడికి పంపుడు, విద్య నేర్పుడు, రవంత
ముందునకు బోవనిండు మీ ముద్దుసుతుల

విద్యలేని మనుషులు వింత పశువులు, మీ పిల్లలను విద్యావంతులను చేయడం ద్వారా వారిలోని అజ్ఞానాంధ కారాలను పారద్రోలమనే సందేశాన్ని పై గీతం ద్వారా రచయిత వ్యక్తీకరించిన తీరు సుందరం.

ముళ్ళ మొక్కల ముద్దుల పూలు,
ముద్దు పూలలో మురిపెపు తేనెల్
నా కొరకేనా
నా తల్లి!
తెలుగు పాలములో తెల్లవారెనోయ్
పూవులు విరసీ తావులు పిలచే,
తెలుగు యువకుడా!
మెలకువ రాదా!
ముళ్ళు గుచ్చకే, పువ్వుల నీవే
తీరని దాహం తేనె తీర్చునే?
ఏమి చేతువో
ఏమో తల్లి?

ప్రకృతి రమణీయత, పుష్పాల సౌందర్యం అందులోని మకరందత వీటన్నింటిని కథానాయకైన వనబాల బడికిపోతూ పాడుకున్న పాట ద్వారా రచయిత వర్ణించిన తీరు సుందరం.

ఆశ విడవకురా! పాంథా
ఆలమటించుకురా!
ఆశే జీవము
ఆశే మార్గము
ఆశే అభయము
ఆశే విజయము
ఆశే సుందరము! పాంథా
ఆశే అందలము

ఆశ గురించి మానవత్వం గురించి పై పాటల్లో పాత్ర ద్వారా రచయిత తెలిపిన తీరు సుందరం.

ధైర్యము విడిచెదవా? వీరా!
ధర్మము మరిచెదవా?
పరకను పామని భయమెందుదువా?
పిరికివాడవై పరువెత్తుదువా?
బానిసత్వమని బాధపడుదువా?
స్వేచ్ఛా జీవిక అందరానిదా?
ఓ యువవీరా! ఉత్తేజముతో
సాగిన నీ దాస్యము విడిపోదా?
నిస్పృహ యేలా? నీ హృదయములో
సోమరితనముకు చోటీయకుమా!
విక్రమింపుమా, వీరుడవై
విజయము నీదేరా?

ధైర్యంతో ముందడుగు వేసి తమ జీవితాలను తీర్చి దిద్దుకోవాలనే పిలుపును పై పాటల ద్వారా ప్రజలకిచ్చిన రచయిత తీరు అద్భుతం.

ప్రేమామృతము పోసి పెంచుకొన్నానే,
ఫెళ్ళుమని విరుతువా, యీ పూలతీవ?
భూగర్భమందుండి కూర్చుకొన్నానే,
పుటుకుమని త్రెంతువా, నా రత్నమాల?
నీ కొరకు పైనమై నడివీధి బడితినే,
నిశితకంటకము లడుగడునకు పోతువా?
గాలిలో మేడలు కట్టుకున్నాను
ధూళిలో నాయాశ కూలద్రోసెదవా?
నా బ్రతుకు బ్రతుకెల్ల నమ్ముకొన్నానే
నా తల్లి భారతీ ! నాకేది మార్గమే?

కథానాయకీ నాయకులకు కాక వేరొకరితో కథా నాయకికీ వివాహం నిశ్చితమైన సందర్భంగా రచయిత కథానాయకి భావాలను పై పాట ద్వారా తెలిపిన తీరు సుందరం.

సుందరముగ, ఆనందముగా
శోభాకరముగ జీవితము
పీయూషముగా గ్రోలుదమే!
ప్రేమారామము లేలుదమే!

కథ సుఖాంతమై కథానాయకీ నాయకుల వివాహమై నాటకం ముగసేవేళ చివరగా వినిపించే పై పాట ద్వారా కులగోడలను బ్రద్ధలు కొట్టి సమాజంలో అందరూ సంతోషంగా జీవించాలన్న రచయిత సందేశం సుందరం.

పైవిధంగా పాలేరు నాటకంలోని ప్రతి పదమూ, పాట ఎంతో అద్భుతంగా రచింపబడినది. నాటకం లక్ష్యం సామాజిక మార్పు, సంఘ సంస్కరణే అయినా, ఆ రచనా శైలి రసజ్ఞం.

అందులో సాహిత్యం అత్యంత సౌందర్యం. అందుకే ఆ నాటకం అందరి మనసులను దోచుకొని, అత్యంత ప్రజాదరణ పొంది, ఇంత ప్రసిద్ధి గాంచినది. భావితరాల రచయితలకు మార్గదర్శనం చేసే పాలేరు నాటకంలోని సాహిత్య సౌందర్యాన్ని పాఠకులు అందరూ ఆస్వాదించి ఆనందిస్తారని ఆశిద్దాం.



బోయిభీమన్న బాలయోగీయం - ఆధ్యాత్మిక సామాజిక దృక్పథం - పరిశీలన

- ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి), సహాయక ఆచార్యులు, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

తెలుగు సాహిత్యపు పూదోటలో సుగంధ పరిమళాలను వెలువరించిన కావ్యకృషీవలుడు బోయి భీమన్న. వేదకాలపు విజ్ఞానాన్ని తెలుసుకున్నవాడు, ఆధునిక కాలపు అవసరాన్ని గ్రహించినవాడు భీమన్న. సనాతన భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ, మధ్యలో వచ్చిన అవాంఛనీయ వర్ణ వ్యత్యాసాలను సంస్కరించిన మేధావి, సాహితీవేత్త, సంస్కర్త బోయి భీమన్న.

భీమన్న రచనలలో విలక్షణమైనది. "బాలయోగీయం" ఇందులో ఒక మహాయోగి జీవితాన్ని చక్కటి కావ్యంగా మలచారు.

బాలయోగి :

బాలయోగి అసలు పేరు సుబ్బారావు. వారి ఇంటి పేరు "కటికదల". ఆంధ్రరాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాలోనిముమ్మిడివరంలో సాధారణ హరిజన కుటుంబంలో జన్మించారు. వీరి కుటుంబీకులు సాంఘిక న్యాయం కోసం, అస్పృశ్యతానివారణకోసం పోరాటాలు చేశారు.

బాలయోగిగా ప్రసిద్ధులైన సుబ్బారావు వది సంవత్సరాల వయస్సు వచ్చేవరకు మామూలుగా పిల్లలతో ఆడుకున్ననేవాడు. అక్షరాభ్యాసంగాని, బడికి వెళ్లటంగాని జరగలేదు. ఆ తరువాత ఐదారేండ్లపాటు పాలేరుగా పనిచేశాడు.

తన పదహారవయేట ఏ గురువు ప్రోత్సాహం లేకుండానే తనకు తానుగా తపస్సు ప్రారంభించాడు. ముమ్మిడివరంలో ప్రతిసంవత్సరం "లంకతల్లమ్మ" అనే దేవతకు ఉత్సవాలు జరుగుతూ ఉండేవి. ఆ తీర్థంలో శ్రీకృష్ణనారదులు ఉన్న ఒక చిత్రపటాన్ని కొనుక్కొని, ఒక సూర్యోదయ సమయంలో కొబ్బరిచెట్టు నీడలో ఉత్తర దిశాభిముఖంగా కూర్చొని, తాను కొన్న పటాన్ని ముందుంచుకొని, పుష్పాలతో అలంకరించి, పూజించి ధ్యాన నిమగ్నుడయ్యాడు. ఇక ఆనాటి నుండి మహా యోగిగా పరివర్తన చెందాడు. ఎండ, వానలకు కూడా చలించకుండా అందరికి ఆశ్చర్యాన్ని కలిగించాడు. మొదట్లో పండ్లు, పాలను అప్పుడప్పుడు ఆహారంగా తీసుకున్నప్పటి, రాను రాను నిరాహారిగా, నిశ్చలుడిగా మారిపోయాడు. భక్తులు వారిని దర్శించటానికి తండోప తండాలుగా కదిలివస్తుంటే, తపోభంగం కలుగుతుందని భావించి ఆయన ధ్యానం చేసుకుంటున్న గది తలుపులను మూయించారు. ప్రతి శివరాత్రికి తలుపులు తెరచి దర్శనం కలిగించేవారు. దాదాపు 37 సం॥లు ఈ విధంగా జరిగింది. వారి ఖ్యాతి ఆంధ్రదేశ హద్దులు దాటి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

కొందరు హేతువాదులు, నాస్తికులు పసిగట్టుకొని వారికి రహస్యంగా ఆహారం అందుతుందని ప్రచారం చేశారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి, వారి ఏకాంత తపస్సుపై నిఘా ఉంచి పరిశీలించారు. వారి తపస్సులో అనుమానించవలసినది ఏదీ లేదని వారి పరిశీలనలో తేలింది.

ఇలా బాలయోగి మహాయోగిగా మారిన ఘట్టాన్ని బోయి భీమన్న ఆధ్యాత్మిక, సామాజిక దృక్పథంతో వీక్షించి "బాలయోగీయ"మనే కావ్యాన్ని రాశారు.

బాలయోగీయం - ఆధ్యాత్మిక దృక్పథం :

భారతదేశం యోగభూమి. ఎందరో యోగులు ఈ

భూమి మీద పుట్టి, ప్రపంచ ప్రజలను ప్రభావితం చేశారు. యోగవిద్యకు భారతదేశం పుట్టినిల్లు. సింధులోయ నాగరికత కాలం నాటికే యోగుల బొమ్మలు కనిపించి నట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి.

యోగవిద్యకు అనేక సంప్రదాయాలున్నాయి. వాటిలో ప్రముఖమైనది పాతంజయోగం. దీనికి, పతంజలి మహర్షి రచించిన "యోగదర్శనం" ప్రామాణిక గ్రంథం. ఇందులో అష్టాంగాలున్నాయి. అవి 1.యమము, 2.నియమము, 3.ఆసనము, 4.ప్రాణాయామము, 5.ప్రత్యాహారము, 6.ధారణ, 7.ధ్యానము, 8.సమాధి.

వీటిని నద్గురువు వద్ద శిష్యులు క్రమపద్ధతిలో నేర్చుకుంటారు.

"బాలయోగీయం"లోని బాలయోగి అష్టాంగాలలోని ధ్యానాన్ని అవలంబించి సమాధి స్థితిని పొందారు. బాలయోగి వ్యాస, వాల్మీకుల వంటి వాడని భీమన్న అభిప్రాయం. వాల్మీకి మహర్షి తనచుట్టూ వల్మీకం (పుట్ట) పెరిగే వరకు తపస్సు చేశాడు. మన బాలయోగి కూడా సిద్ధాసనం వేసుకొని నిద్రాహారాలు మాని తపస్సు చేశాడు.

"అన్నపానములు కామ్యములెల్ల విడనాడి
కాల గర్భము వంటి గదిని చేరి
సిద్ధాసనము వేసి చిత్తము సరిచేసి
ఇష్టదైవము నాత్మ దృష్టి నిలిపి
మౌనము వహించి ధ్యానసమాధి మున్గి
వేదసారము వోలె దీపించు నీవు
పూర్వగాథల ఆర్ష భావుకతనేమొ
వాస్తవమ్ము నిరూపింప వచ్చినావో"

(బాలయోగీయం - పు.సం.2) అంటూ యోగం బాటనుబట్టిన బాలయోగిని భీమన వర్ణించాడు.

భారతదేశ ఆధ్యాత్మిక వారసుడు బాలయోగి :

భీమన్న అభిప్రాయం ప్రకారం బాలయోగి భారతదేశ ఆధ్యాత్మిక వారసుడు. వ్యాస వాల్మీకులు కూడా హరిజను లేనని, వారి సంకల్పాన్ని సఫలీకృతం చేయటానికే బాలయోగి జన్మించాడని అంటారు భీమన్న. ఆకలికి తట్టుకోలేక వ్యాసుడు కాశినగరాన్ని శపింపబోతే, అన్నపూర్ణా దేవి వ్యాసుణ్ణి మందలించి కాశినగరం నుండి బహిష్కరించినదని పురాణం.

ఆకలి వలన వ్యాసునికి జరిగిన అవమానాన్ని పోగొట్టటానికి బాలయోగి అవతరించాడని, నిరాహారిగా జీవించి నిదర్శం చూపాడని రచయిత భావించాడు.

"ఆకలి కాగలేని అదృఢాత్ముడు వ్యాసుడు కాశి దిట్టెనన్
కాకుల నింద బాపుటకు గా దిగి వచ్చితివీవు"
(బాలయోగీయం - పు.సం.9) అన్నారు.

ప్రకృతి నుండి దేనిని గ్రహించినా అది ఆహారమే. తినేది మాత్రమే అన్నం కాదు. తినేది, కనేది, వినేది, తాకేది, తలంచేది కూడా అన్నమే. అంటే పంచజ్ఞానేంద్రియాల ద్వారా మనసుగ్రహించే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలన్నీ ఆహారమే. యోగి అనేవాడు పరిపూర్ణ ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉంటాడు. ఆత్మ పరమాత్మలో లీనమైనప్పుడు అన్నపానీయాల ఆసక్తిని అధిగమిస్తాడు. ఇలాంటి ఆధ్యాత్మిక మహా సాధకుడే "బాలయోగి" అని భీమన్న వర్ణించాడు.

"అన్నమే పరమాత్మ, దేహమ్ము నిలువ
దన్నమున గాని అనుట వాస్తవమె, కాని
ఆత్మ సూటిగ పరమాత్మ ననుభవింప
అన్న మాధ్యస్థ్య మేల మీ యట్టిడులకు?"
(బాలయోగీహం - పు.సం.9) అని చెప్పి, సామాన్యులు ఆహారం లేకుండా జీవించలేరు గాని, యోగులు జీవించగలరని అంటారు భీమన్న.

అష్ట సిద్ధులకు అతీతుడు బాలయోగి :

సాధారణంగా యోగులకు అష్టసిద్ధులు లభిస్తాయని లోకంలో ప్రతీతి. అష్టసిద్ధులు ఎనిమిది. అణిమ, గరిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, వశిత్వము, ఈశత్వమనే ఎనిమిది సిద్ధులను యోగులు ప్రదర్శిస్తారు. ఐతే, అష్ట సిద్ధుల ప్రదర్శన లోకంలో ప్రాచుర్యాన్ని

పొందటానికి ఉపయోగపడతాయి కాని, సమాధి సిద్ధిని పొందటానికి ఆటంకాలుగా మారతాయి. అందుచేత బాలయోగి సిద్ధులన్నిటిని పరిత్యజించి బ్రహ్మర్షిత్వం వైపు ప్రయాణించిన మహాయోగి అని భీమన్న అభిమతం.

"సిద్ధులెల్ల పరిత్యజించిననె కాని
స్వచ్ఛమైన బ్రహ్మర్షి కాజాల రెవరు"

(బాలయోగీయం-పు.సం.23) అని బాలయోగి యొక్క బ్రహ్మర్షిత్వాన్ని స్థిరపరిచారు.

బాలయోగీయం - సామాజిక దృక్పథం :

బోయి భీమన్న 'బాలయోగీయం' కావ్యంలో బాలయోగిని తీర్చిదిద్దటంలో ఆధ్యాత్మిక దృక్పథమేకాక సామాజిక కోణం కూడ దాగి ఉంది. ఈ కావ్యంలో 'బాలయోగి' కల్పిత పాత్రకాదు. తన సమకాలంలో జీవించిన ఒక మహాయోగి చరిత్ర.

బాలయోగి ఒక సాధారణ హరిజన కుటుంబంలో జన్మించాడు. ఐనప్పటికి ఒక మహాయోగిగా ఎదిగాడు. గుణం ముఖ్యంగాని, కులం ముఖ్యంకాదని రుజువు చేశాడు. కొందరు స్వార్థపరులు కులం దృష్టిలో బాలయోగిని చూసినా, భక్తిభావం కలిగిన ప్రజలు మాత్రం ఆయనకు యోగిగానే చూశారంటారు భీమన్న.

"నీ కుల మేదో కనీసము తెలిసికో
దలచిరా భక్తి నిన్ గొలుచువారు?"

(బాలయోగీయం - పు.సం.43) అని ప్రశ్నించారు. నిజమైన భక్తులకు కులాలతో పనిలేదని, స్వార్థశక్తులే భేదాభిప్రాయాలను సృష్టిస్తాయని భావించారు రచయిత.

వేదకాలంలో భారతదేశంలో ఇప్పుడున్న కులవ్యవస్థ లేదని, అందరు నరులు సమానంగా జీవించారని భీమన్న అభిప్రాయం. కులానికి, జన్మకూ బ్రాహ్మణత్వంతో సంబంధంలేదని "The word Brahmana does not imply a caste in the Vedas" (The call of the Vedas by Abinash Chandra Bose) పండితులు తెలిపారు.

బాలయోగి జన్మరహస్యం :

"కృణ్వంతో విశ్వమార్యం" అంటూ వేదం, సర్వ ప్రపంచాన్ని ఆర్యీకరించమని చెప్పింది. వేదవ్యాసుడు వైదిక సమసమాజ మానవత్వాన్ని చాటిచెప్పాడు. అటువంటి వేదవ్యాసుడే కాశీ నగరం నుండి బహిష్కరింపబడ్డాడు.

ఆ విధంగా వేదవ్యాసుడి అవసానదశలో, కలియుగారంభంలో ఆయన పడిన అవస్థలకు, అవమానాలకూ, విరుగుడుగ బాలయోగి జన్మించాడని భీమన్న సిద్ధాంతం.

భారతదేశం యొక్క నిజమైన వేద స్వరూపాన్ని నిలబెట్టటానికే బాలయోగి అవతరించాడంటారు భీమన్న.

"బాలయోగి పుట్టుక వెనుక ఎంతో నిగూఢమైన, లోక పునరుద్ధారకమైన వేదరహస్యం నిక్షిప్తమె ఉన్నదన్నమాట" (బాలయోగీయం-ముందుమాట : పు.సం. ఇ) అని తన అభిప్రాయం చెప్పారు రచయిత.

బాలయోగి కావ్యరచనలో భీమన్న సమాజంలోని కుళ్ళును కడిగిపారేశారు. అన్నం మానుకున్న బాలయోగిని అనుమానించారు గాని, అనాన్ని దోచుకునేవారిని అడ్డుకోలేకపోయారని అన్నారు.

"అన్నము మానుకొన్న నిను
ఆరడి ఏయునె కాని, లోకమం
దున్న సమస్త అన్నమును
దోచుక దాచుక తామె మెక్కు బొ
జ్జన్నల నేమి సేయు నెవ
డైనను? (బాలయోగీయం-పు.సం.42) అని బాలయోగిని అనుమానించిన వారిని ప్రశ్నించారు.

ముగింపు :

బోయి భీమన్న 'బాలయోగీయం' రచనలలో వేదాంత (ఆధ్యాత్మిక) దృక్పథాన్ని, సామాజిక దృక్పథాన్ని అనుసరించాడు. ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేసిన బాలయోగి వంటి మహానుభావులకు అన్న పానాలతో అవసరం లేదని, నిశ్చల సమాధి ద్వారా లోకాన్ని శాంతింపచేస్తాడని భీమన్న భావించారు. అంతేకాక, ఈ

రచనలో సామాజిక దృక్పథం కూడా ఉంది. వేదకాలంలో లేని కులం తాలూకు అసమానతలు ఆధునిక కాలంలో అవతరించాయని, ఈ సమాజం కళ్ళు తెరిపించడానికి 'బాలయోగి' హరిజన కుటుంబంలో జన్మించాడని, బాలయోగి వంటి మహానుభావులను చూసి లోకం తన గుణాన్ని సవరించుకోవాలని సూచించారు భీమన్న.

ఆధార గ్రంథములు :

1. కొత్తపల్లి హనుమంతరావు - మహాయోగులు, ఋషి బుక్ హౌస్, విజయవాడ-2001
2. గౌరీ విజయ ప్రకాష్ - పతంజలి యోగ సూత్రములు -జె.పి.పబ్లికేషన్స్, విజయవాడ-2001.
3. బిరుదురాజు రామరాజు - ఆంధ్రయోగులు - నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్-2004.
4. బోయి భీమన్న - బాలయోగీయం - సాహితీనిధి ప్రచురణ, హైదరాబాద్ - 1986.
5. హైమావతి - పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - సన్మాన సంఘ ప్రచురణ, హైదరాబాద్ - 1978
6. M. hariharan - Hinduism and its Retionalism - Bharatiya Vidya Bhavan, Bombay - 1987.

❁❁❁

'ఒంటరిగొంతు' కవిత్వం - వస్తు వైవిధ్యం

- డా॥. ఐ. విజయ్ కుమార్, తెలుగుశాఖ అధ్యక్షులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఐఐఐటి, బాసర.

ఆధునిక తెలుగు సాహితీయుగంలో తన కవితా ముద్రను పదిలంగా ప్రతిష్ఠించుకున్న మహాకవి, పద్మభూషణ్ డా.బోయిభీమన్న. పద్యం రాసినా, గేయం రాసినా, కావ్యం రాసినా తన విశిష్టతను ప్రతి ప్రక్రియలో అద్భుతంగా ఆవిష్కరించిన కవి ఆయన. శబ్దగాంభీర్యం, భావగాఢత, లాలిత్యం, వాక్రౌఢిమ, అధిక్షేపం, చమత్కారం ఆయన కవిత్వంలో ప్రత్యేకంగా కనిపించే ప్రధానమైన లక్షణాలు.

ఇప్పుడు - ఈ 'ఒంటరిగొంతు' అనే కవితాసంపుటిని పరిశీలిస్తే బోయిభీమన్న సహృదయం ఆవిష్కృతమవు తుంది. కవి మనసులోని అనేక భావాల సమాహారం, అనేకానేక అనుభవాల సమాహారమే 'ఒంటరిగొంతు'లో వినిపిస్తాయి. కనిపిస్తాయి కూడా. ఇది కవిలోని భావ సాంద్రతకు ప్రతీకగానే కాదు - సమకాలీన సమాజంలోని పరిస్థితులకు, స్థితిగతులకు పట్టిన దర్పణంగా కూడా మనకు కనబడుతుంది. ఇందులోని కవితలన్నీ సరళమైన, సహజమైన శైలిలో రాసిన వచనకవితలే. ఎక్కడా కాఠిన్యం కాని, అర్థంకాని పదజాలం కాని కనబడవు. సగటు మనిషి వాస్తవిక జీవితాన్ని, అతని సాధకబాధకాలను కవిత్వీక రించిన తీరు ఇందులో కనిపిస్తుంది. మానవజీవన గతులను, పురోగమనాన్ని, తిరోగమనాన్ని గుండెగొంతుతో వినిపిస్తుంది ఈ 'ఒంటరిగొంతు' కవితాసంపుటి.

ఇందులో కవి ఎంచుకున్న ప్రతి వస్తువు మనిషి మూలాలను, అణగారిన బ్రతుకుల ఇతివృత్తాన్ని కళ్ళకు కట్టినట్లుగా వివరిస్తుందన్నది అక్షరసత్యం. ఈ కవితా సంపుటిలో 'కోకిల' ను ప్రధాన వస్తువుగా ఎంచుకొని కవి కవిత్వసంభాషణ చేస్తాడు. కోకిలతో తనకు చాలా కాలంగా స్నేహం ఉందని చెబుతున్నాడు. కారణం కోకిలను అణగారిన వర్గాల ప్రతినిధిగా కవి భావించి, చెప్పాలను కున్న విషయాన్ని సూటిగా, నిక్కచ్చిగా, నిష్కర్షగా చెప్పడం కవి ఆత్మాభిమానాన్ని చాటి చెబుతోంది.

'వసంత కోకిల' అనే కవితలో

అందని చంద్రుడు
అద్దంలో తనను పట్టుకోవద్దని
శాసించగలడా?
అందని వారి ఔన్నత్యాలు అలాంటివి
ఆకాంక్షల కైమోడ్పులు ఇలాంటివి
కోకిలా! ఈ పోలికలు నీవీ, నావీ!'

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - పు. 531)

అని అంటారు భీమన్న. ఇక్కడ - కవి దృష్టిలో 'కోకిల' ఔన్నత్యాలను అందిపుచ్చుకున్న మహోన్నత తేజ స్వరూపం. అందుకే, అందరాని చంద్రున్ని పట్టుకోవద్దని ఆ చంద్రుడు శాసించనట్లే నిన్ను చూడాలని నీ గాన మాధుర్యం వినాలని కోరుకునే నన్ను ఎవ్వరూ ప్రశ్నించ లేరు. అని కోకిలతో కవి ఆత్మావిష్కరణభరితంగా చెబు తాడు. 'కోకిల' కవిలోని భావాన్ని, అనుభవాన్ని విస్తృతంగా వ్యక్తపరిచే సాక్షిగా మనకు కనబడుతుంది. అంతేకాదు కవిలోని కవిత్వావేశానికి నిదర్శనంగా కూడా కనబడడం విశేషం.

అధిక్షేపం

అధిక్షేపం అనగా వ్యంగ్యం, హేళన, చమత్కారం అని అర్థం. అంటే సమాజంలో కనిపించిన అవినీతిని సుతి మెత్తగా నిందించడమనే అర్థం.అలాంటి అధిక్షేపంతో కూడిన కవితాపంక్తులు బోయిభీమన్న కవిత్వంలో కోకొల్లలుగా కనిపిస్తాయి.. మచ్చుకు..

'మారని సంప్రదాయం' అనే కవితలో -

'నీ మధుమాస ప్రభాతభేరి
చైత్రోదయంతో ప్రారంభమైనా
వాస్తవ వసంతోదయం
ఫాల్గుణోదయం నుంచే కదా!
నీ స్వాగత వచనాలు కూడా
ఫాల్గుణోదయంలోనే ప్రారంభమవుతై!
లోకులు గుర్తించలేదు!
నేనూ లోకుల్లో ఒకణ్ణే కనుక
వింటూ కూడా వినన‌ట్టే ఉండిపోయాను!
కరడు కట్టిన సంప్రదాయం మార్పును గుర్తించనీయదు'

(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం - పు. 547)

అంటారు. సమాజాన్ని ప్రశ్నించేతత్వం, కోపోద్రిక్తుడైన కవి అంతరంగ ఆవేదన పై పంక్తుల్లో అంతర్నిగూఢంగా కనిపిస్తుంది. కాని, ఎక్కడా కూడా శబ్దకాఠిన్యం కనబడదు. అది బోయిభీమన్న కవితాచాతుర్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కోకిల కూసేది చైత్రమాసంలోనే అయినా ఫాల్గుణమాసం నుంచే దానికై స్వాగతవచనాలు ప్రారంభమవుతాయి. ఫాల్గుణం శిశిరానికి నిలయం. శిశిరాన్ని వసంతోదయానికి నాందిగా కవి భావిస్తున్న తీరు ఇక్కడ కనిపిస్తుంది. ఈ విషయాన్ని లోకులు గుర్తించలేదన్న సత్యాన్ని చెబుతూనే తానూ లోకుల్లో ఒక్కడినే అని చెబుతున్నాడు. ఈ సమాజం కరడు కట్టిన సంప్రదాయపు చిహ్నమని, అందుకే మార్పును గుర్తించనీయదని, అంటే - చైతన్యాన్ని ఆకాంక్షించలేని స్థితిలో ఉందన్న సంగతిని స్పష్టం చేస్తున్నాడు. సంప్రదాయపు పునాదులమీద నిలబడి, కులహీనులని, అణగారిన జాతివారని హీనంగా, హేళనగా చూసే వారిపట్ల కవి అధిక్షేపధోరణితో 'కోకిల' ప్రత్యక్షసాక్షిగా, మధ్యవర్తిగా పెట్టి చెప్పిన పంక్తులివి. అలాగే

'లోకులు - కాకులు' అనే కవితలో

'లోకులు కాకులు!
కాకులు నిన్ను నిషేధించినా
నీ స్వరాన్ని నిషేధించలేవు కదా!'

(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం పు.548)

అని అంటారు. సున్నితమైన పదాలనే ఈటెలుగా విసిరిన తీరు పై పంక్తుల్లో కనబడుతుంది. లోకులు కాకులుగా అరిచి గోల చేసి, నిన్ను తమ దగ్గరకు రాకుండా ఆపినా నీ స్వరాన్ని నువ్వు వినిపించకుండా ఆపలేరు కదా! అంటున్నారు. అంటే ం నీచదృష్టితో బలవంతులు బలహీనులను ఎంత అడ్డుకున్నా వారి ప్రగతిని ఆపలేరు కదా! అనే భావనను వ్యక్తం చేస్తున్నారు భీమన్న.

ఏకాకితనం

సమాజంలోని అసమానతలను చూసినపుడు కవికి కలిగే వింత యాతనయే ఈ ఏకాకితనం..ఒంటరిగా కవి పడే బాధల సమాహారమే ఈ 'ఏకాకితనం'.

'బృందనాయకత్వం' అనే కవితలో

'నాదీ ఒంటరిగొంతు కాదు!
కవికోకిల జాషువా అన్నట్టు
'గవ్వకు సాటిరాని పలుగాకులు మూకలు అసూయచేత'
నాకు దూరమయ్యారు.
అలా - నాది ఒంటరిగొంతయింది
నేనెప్పుడూ నాకోసమే పాడుకున్నాను
లోకాభ్యుదయమే నా ధ్యేయం!
దానిని సాధించడానికే నా గేయం!'

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - పు.571)

అని చెబుతారు. కవి ఆవేదనకు ప్రతిబింబంగా ఈ కవిత మనకు కనబడుతుంది. తనది ఒంటరిగొంతే. అయినా, కవి ఎప్పుడు ఒంటరివాడు కాదు. అతడు సమాజచైతన్యానికి వారధి. సమాజంలోని మానవజగత్తుకు సాక్షీభూతంగా నిలుస్తాడన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంలో భీమన్న మహాకవి జాషువా మాటల్ని గుర్తుచేస్తున్నాడు. కొంతమంది పలుకాకుల అసూయ

ద్వేషాలతో నా వారు నాకు దూరమయ్యారు. అని చెబుతున్నాడు.కాని, తాను రాసింది, తాను చెబుతుంది, తన బాధ, గాథ అన్నీ లోకం కోసమే. లోకప్రగతియే తన ధ్యేయమని, అది సాధించడాని కోసమే తాను కవిత్వం రాస్తున్నానని, రాస్తానని కూడా చెబుతున్నాడు. లోకప్రగతి అనేది సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని సూచిస్తుంది. ఐకమత్యమే ప్రగతికి సోపానం అనేది కవి మాట. అందుకే ప్రజలందరిని ఒక్కటిగా కలిపి చూడాలనేదే కవి జీవితలక్ష్యమని పై కవిత ద్వారా తెలుస్తుంది.

'స్వేచ్ఛ' అనే కవితలో

'తన ఇచ్ఛ కొనసాగడమే
సుఖజీవితం!
భయభక్తులు దానికి సంకెళ్ళు!
కులంపేరుతో, మతం పేరుతో
పౌరసత్వం పేరుతో, సంఘనీతి పేరుతో
వివిధ నాయకులూ ప్రజల్ని పరిపాలిస్తున్నది
ఈ భయం భక్తుల ఆయుధాలతోనే!'

(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం పు. 575)

అని తెలియజేస్తున్నారు. స్వేచ్ఛలేని మనిషి బ్రతుకు నరకం. తను కోరుకున్నది ఎప్పుడైతే జరుగుతుందో అపుడే మనిషి బ్రతుకు సంతృప్తిగా ఉంటుంది. మనిషికి భయం ముసుగు వేసి, సంకెళ్ళతో బందీ చేసి, కుల,మతాల అడ్డుగోడలు పెట్టి, కొందరు నాయకులు ప్రజల్ని వంచన చేసి, పరిపాలిస్తున్నారని అంటున్నాడు. 'భయం' అనేది ప్రజలకు తెలియజేసి దానిని నాయకులు తమ ఆయుధంగా చేసుకుంటున్నారంటున్నాడు. ఇది మానవప్రగతి నిరోధకమని కవి ఆవేదనతో చెబుతున్న సత్యం.

అవలోకనం

తనలోని, తనదైన గతాన్ని, జరిగిన సంగతులను, జ్ఞాపకాలను నెమరువేసుకోవడమే ఈ 'అవలోకనం'. పరిశీలనా దృక్పథంతో రాసే కవితలని అర్థం.. సమాజాన్ని సునిశితంగా పరీక్షించే భావనతో భీమన్న రాసిన కవితలు ఎన్నో ఉన్నాయి.

'ఎవడికి వాడె' అనే కవితలో

'గతం నుంచి నేర్చుకోడు మనిషి
మనిషే కాదు, ఏ జీవి నేర్చుకోదు,
నేర్చుకోవడానికి గతంలో ఏముంది కనుక?'

(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం పు.578)

అంటారు. గతం జ్ఞాపకాలను మాత్రమే మిగిల్చింది. అదీ చేదు జ్ఞాపకాలే. మనిషి గతాన్ని అస్సలే అంగీకరించడు. అందులోనుంచి ఏమీ నేర్చుకోడు కూడా. మనిషే కాదు సకలజీవులు కూడా. గతంలో ఉన్న మార్గదర్శకులంతా, మహనీయులంతా ఎవరి దారి వారిదేనన్న ప్రబోధాన్ని పంచి ఇచ్చారు కదా! కాబట్టి ఎవరిదారి వారిదే అయినప్పుడు 'గతం' సకల మానవ ప్రగతిని, సౌభ్రాతృత్వాన్ని సాధించే జ్ఞానాన్ని ప్రసాదించ లేదని కవి కవితలోని అంతరార్థం.

మానవతాన్వేషణ

ఇది మానవత్వం కోసం వెదికే తపనను తెలియ జేస్తుంది. కవి హృదయంలోని మానవతాదృక్పథమే సకల ప్రపంచమంతటా మానవత్వాన్ని వెదికేలా చేస్తుంది.

'మానవత్వం' అనే కవితలో

'మానవత్వం అంటే హ్యూమనిజం
ఇతర జీవరాశులకువలెనే
మానవజీవికి కూడా
ఒక విశిష్టలక్షణం ఉన్నదనుకొని
మానవత్వం అన్నాను.
నిజంగా మానవుడికొక విశిష్టలక్షణం వున్నదా?
లేదనే నా ఉద్దేశ్యం!'

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పు.586)

అని తన ఆవేశాన్ని, ఆవేదనని ప్రకటిస్తారు. మనిషిలో మానవత్వం చచ్చిపోయిందన్న కవి బాధ ఈ కవితలో కనబడుతుంది. అందుకే - మానవత్వం కోసం అంతటా

అన్వేషిస్తున్నాడు. సమాజంలో ఎక్కడా మానవత్వం మచ్చుకైనా లేని స్థితిని గమనించిన కవిలో నిరాశా నిస్పృహలు, ఆవేదన ఎక్కువయ్యాయి. దాని ఫలితమే పై కవిత. ఈ కవితలో మనిషికి విశిష్టలక్షణం లేదని కవి అభిప్రాయం. ఆవు గడ్డి తిన్నట్టుగానే, పులి మాంసం తిన్నట్టుగానే ఈ రెండూ తినే ఆవు ముఖంతో కనిపించే పులి ఈనాటి మనిషి అని అంటున్నాడు. అంటే క్రూర మృగాలకంటే మనిషే ప్రమాదకరమని కవి భావన.

ఐకమత్యం

సకల జగత్తు ప్రజలందరిని ఒక్క త్రాటిపై నడిపించి లనే భావన కలిగి ఉండడమే ఐకమత్యం..సర్వమానవ సమానత్వాన్ని సాధించాలనే సంకల్పంతో భీమన్న రాసిన కవితల్ని చూద్దాం.

'జాతీయ సోషలిజం' అనే కవితలో

'సంస్కృతుల ప్రాతిపదికపై
జాతులను జాగృతం చేసి
జాతికొక దేశంగా
లోకాన్ని పునర్నిర్మించడం కోసం
జాతీయ సోషలిస్టు పద్ధతి ప్రతిపాదించాను'
(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం పు.590)

అని అంటారు. కవి లక్ష్యం సకలజాతులను జాగృత పరచి, ఐకమత్యం దిశగా నడిపించడమే కదా! ఇక్కడ భీమన్న కూడా జాతికొక దేశంగా ఈ ప్రపంచాన్ని పునర్నిర్మించే లక్ష్యంతో అడుగుముందుకేశారు. జాతీయ సోషలిజాన్ని కాంక్షించారు. సకలమానవ ప్రగతిని సాధించే దిశగా ప్రయాణిస్తున్న కవికి కవిత్వమే ఆయుధం. ఆ ఆయుధాన్ని పట్టుకుని అతడు ప్రయాణం చేస్తాడు. చేస్తూనే ఉంటాడు. ఎక్కడ అసమానతలు కనబడినా అతడు ఎలుగెత్తి ప్రశ్నిస్తాడు. శాంతి, సమానత్వం కనబడిన చోట చేతులెత్తి నమస్కరిస్తాడు.

అందుకే

'నవోష:కిరణాలు' అనే కవితలో ఇలా అంటారు భీమన్న.

'ఇంతకూ..
నీవు చెపుతున్నదీ
నేను వివరిస్తున్నదీ ఏమిటి?
సర్వమానవ సమతాధర్మం!
జాతీయతను ప్రాతిపదికగా తీసుకొని
దేశాలు ఏర్పడాలి!
ప్రతి దేశమూ తన జాతీయత ప్రకారం
సర్వమానవ సమతను
ప్రభుత్వధర్మంగా స్వీకరించాలి'.
(బోయిభీమన్న సమగ్ర సాహిత్యం పు.595)

తన కవితాలక్ష్యం సర్వమానవ సమతాధర్మం, సకలజాతి ప్రజల ఐక్యత అని చాటి చెప్పాడు. ప్రతి దేశం, ప్రతి ప్రాంతం ఐకమత్యంగా ముందుకు నడవాలని, అప్పుడే ప్రగతిని సాధించవచ్చని, మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ గారన్నట్లుగానే బోయిభీమన్న గారు కూడా సకలమానవచైతన్య వికాసాన్ని సాధించాలన్న భావనను తన కవితలో వినిపించారు.

ఇలా ఈ కవితాసంపుటిలో అధిక్షేపం, చమత్కారం, అవలోకనం, ప్రగతిశీల మానవతావాదం, ప్రబోధం మొ. వాటిని వివరిస్తుంది. ఇలా అద్భుతమైన, వినూత్నమైన వస్తువైవిధ్యాన్ని ఈ 'ఒంటరిగొంతు' కవితల్లో చూడవచ్చు. కవి ఆశించిన మానవప్రగతిని, కవిలోని అనుభవాల సమాహారాన్ని మనం గమనించవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1) ఒంటరిగొంతు (కవితాసంపుటి) - బోయిభీమన్న
2) రాగోదయం (కవితాసంపుటి) - బోయిభీమన్న
3) అనాది కొసనుంచి అనంతత్వంలోకి (కవితాసంపుటి) - బోయిభీమన్న
4) శబ్దం నుంచి శతాబ్దందాకా - గుంటూరు శేషేంద్రశర్మ

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపదుని దర్శనం – సామాజిక జీవనం

– డా॥. ఉడాలి విష్ణుప్రియ, తెలుగు శాఖాధ్యక్షులు, సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాదు.

గ్రామసీమలు దేశ సౌభాగ్యానికి పట్టుగొమ్మలు.. అని గాంధీజీ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ప్రకృతి శోభను దర్శించాలంటే గ్రామసీమలకు పోవడానికి మించిన విహారయాత్ర ఉండదు. మానవులకు కావలసిన తిండి, బట్ట గ్రామాల నుంచే వస్తుంది. పట్టణాభివృద్ధికి గ్రామాలు ఎంతగా తోడ్పడుతున్నాయో, అదే విధంగా గ్రామాభివృద్ధికి కూడా పట్టణమేమి చేస్తున్నదనే భీమన్న గారి ప్రశ్నలు 'జానపదుని జాబులు' లో ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.

వ్యక్తుల మధ్య, సంస్థల మధ్య పరస్పర సందర్భాన్ని, సంబంధాన్ని బట్టి వ్రాసుకొనేవి లేఖలు. లేఖా రచనను సామాజిక చైతన్యానికి, మహిళాభ్యుదయనికి, సాంఘికాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి చైతన్య వాహికగా పలువురు రచయితలు స్వీకరించారు. ప్రముఖ వ్యక్తుల ఉత్తరాలను సాహిత్య రచనలుగా పరిగణించడం సంప్రదాయంగా వస్తున్నది. ఆ వ్యక్తుల అభిప్రయాలను, వివిధ వ్యక్తులతో వారికున్న పరిచయాలను, సంబంధాలను సమకాలీన సమాజ జీవన విధానాన్ని వాటి పరిణామాలను ఈ లేఖా రచన తెలియజేస్తున్నది. లేఖలను విమర్శకులు మూడు రకాలుగా విభజించారు. వ్యక్తిగతమైనవి, వ్యాపార పరమైనవి మరియు బహిరంగ లేఖలు. ఈ వరుసలో 'శారద లేఖలు' వ్రాసిన కనుపర్తి వరలక్ష్మమ్మ, 'జానపదుని జాబులు' వ్రాసిన డా. బోయి భీమన్న, 'ప్రేమ లేఖలు' వ్రాసిన గుడిపాటి వెంకటాచలం వంటివారు మనకు ప్రముఖంగా కనిపిస్తారు. సమాజానికి ప్రతిబింబాలే ఈ లేఖా సాహిత్యం! పైన పేర్కొన్న ఏ లేఖ చదివినా పలు సామాజిక అంశాలే ద్యోతకమవుతాయి.

గ్రామాల్లోని దళితులను పేదల జీవితాలను చిత్రిస్తూ అస్పృశ్యతను 'పల్లెటూరి లేఖలు' అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలోనూ, 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో 'ప్రజామిత్ర'లోనూ ప్రచురింపబడ్డాయి. చదువుకొని పేదరికం వల్ల చదువు కొనసాగించలేక తన స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన జానపదుడు పట్టణంలోని శ్రీమంతుడైన మిత్రునికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను లేఖల రూపంలో వివరిస్తాడు. ఈ లేఖలను డా. బోయి భీమన్నగారు రచించారు. ఈయన తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో 19 సెప్టెంబరు 1911లో పేద దళిత కుటుంబంలో జన్మించారు. 'నేనేమి చేస్తే అది కళా ఖండం.. నేనేమి చెబితే అది వేదం' అని ఆత్మ విశ్వాసం ప్రకటిస్తూ దళితుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించిన కవి శిరోమణి బోయి భీమన్న! 'గుడిసెలు కాలిపోతున్నై' రచనకు 1975లో సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్న ఈయనని భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులతో గౌరవించింది. విద్యావేత్తగా, సాహితీవేత్తగా, పాత్రికేయులుగా వివిధ రంగాల్లో రాణించి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన మహామనీషి డా. బోయి భీమన్న! వీరి సాహిత్య ప్రక్రియలన్నీ కూడా సమాజంలోని అసమానతలను వెలికి తీసి ప్రజల్లో చైతన్య దీపికల్ని రగిలించాయి. ఈ క్రమంలో జానపదుని జాబులు సామాజిక పరిస్థితుల్ని తేటతెల్లం చేయడంలో ప్రముఖ పాత్ర వహించాయి.

జానపదుడు తన మిత్రునికి సర్వసమత్వం గురించి వ్రాసిన లేఖలో ఇలా ఉటంకించారు.. 'సర్వ సమత్వాన్ని సాధించాలంటే మారణ విప్లవం ఎందుకు? శాంతి విప్లవం చాలదా? అన్నారు. 'కాలేజీలో అసమత్వానికి చెందిన రాముడు, గర్వానికి చెందిన డేవిడు, నిరంకుశత్వానికి చెందిన రాఘవరావు, భాగ్యానికి చెందిన నీవు, పేదరికానికి చెందిన నేను, అడకువకు చెందిన మహమ్మదు ఖానూ

ఎంత స్నేహంగా ఉండేవాళ్లమో..' అని ఆయన గుర్తు చేసుకుంటాడు. ఈ వాక్యంలో సర్వమత సామరస్యంతో కూడిన తన మిత్రబృందాన్ని ఆయన పరిచయం చేస్తారు. దీనిని కొనసాగిస్తూ ఆయన ఇంకా ఇలా అంటారు.. 'ఆ స్నేహం కాలేజీకి వెలుపల ఎందుకు ఉండదు? అది విశ్వవ్యాప్తం ఎందుకు కాదు?' అని వాపోతారాయన.

మిత్రబృందాన్ని తలచుకొని తన పాకలో గడ్డిపోచల కింద దాచిన వ్రాత పుస్తకం, పెన్సిలు తీసి, కిరసనాయిలు బుడ్డి వెలుగులో ఈ పద్యం వ్రాశారు..

"నాలుగింటికే కళాశాల మూసిన నాటి
పైరు చేల్గట్ల విహారములను,
సెలవులలో వేడ్క చెలగు సంజల నాటి
వైనతేయ తటోపయానములును,
వెస పుస్తకములపై విసుగు పుట్టిన నాటి
నెలవైన వెన్నెల పులినములును,
పువ్వుకో కాయకో పుట్టువాదుల నాటి
క్షణికమ్ములగు ప్రేమ కలహములును,
మరపునకు రావు నెచ్చెలి, మరపురావు,
బ్రతుకు తెర్వుల వెన్నంటి వచ్చు తుదికి.
...
జీవిత పథాలు వేరయి, జీవయాత్ర
వెడలి దూరమై పోయెడి వేళకూడ."

పై పద్య పాదాలలో ఆయన వెదజల్లిన స్నేహ సౌరభాలను నేటికీ మనం ఆఘ్రాణించవచ్చు!

ఆయన దృష్టిలో పట్టణ వాసులకు పల్లెలోని నివాసాలైన కొబ్బరి చిగుళ్ల పాక తేలికగానూ, అసహ్యం గానూ కనిపిస్తాయి. కానీ అది గ్రామవాసులకు దివ్య భవనం, చర్చా సౌధం, సౌఖ్య వేదిక ఇంకా అదే విహారసీమ! తన జాబుల్లో జానపదుడు తమ జాతి జనులు ఎలాంటి శిథిలమయమైన నివాసాలలో బ్రతుకులీడుస్తారో ప్రస్ఫుటంగా వెల్లడిస్తాడు! ఆ మాటలు యథాతథంగా మీ ముందుంచుతాను..

"జోగయ్య ఒక మామూలు రైతు. సుబ్బయ్య ఒక ఈనాందారు దగ్గిర పాలేరు. ఈ ఇద్దరూ నా కు మిత్రులు. కుప్ప దగ్గిర కుప్పకు అనుకొని ఒక గట్టు. ఆ గట్టు మీద కొబ్బరి ఆకుల చివుళ్లతో ఒక పాక. ఆ పాకలో మేము పడుకొన్నాం.. వట్టి గడ్డే మాకు పరుపు. కొబ్బరి తుంటలే తల దిండులు. కొబ్బరి చాపలే దుప్పట్లు. వెల్లకిలా పడుకొన్నాం ముగ్గురమూ! మా పాకలో నుంచి మిణుకు మిణుకు నక్షత్రాలు ఎంతో హాయిగా ఉన్నై.. ఆ నక్షత్రాలు తొంగి చూసే సందుల్లో నుంచి చల్లగా మంచు సొన దిగజారుతోంది. చలి ఉహూహూహూ అని పిస్తుంది. కట్టుకొన్న పంచెలు ఆ చలిని ఆపలేకపోయినై. పంచెలు విప్పి కప్పుకొన్నాం.. చలి ఆగలేదు. దగ్గిర ఉన్న కొబ్బరి చాపలు మీదకు లాక్కొని, వాటి మీద వట్టి గడ్డి కప్పకొన్నాం.."!

ఈ మాటల్ని క్షుణ్ణంగా గమనిస్తే.. పల్లె వాసులు ఎంతటి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నా.. దానిని కూడా మెరిసే నక్షత్రాల సౌందర్యంలోనూ, కురిసే మంచు సొనల చల్లదనంలోనూ మరచిపోతూ కాలం వెళ్లదీయడం మనల్ని కలచివేస్తుంది!

జానపదుని జాబులు తన మిత్రుని కుశలములు విచారించడానికో.. తన పల్లె అందాలను వర్ణించడానికో ఉద్దేశించినవి కావు. నివురు గప్పిన నిప్పులా పల్లె గర్భంలో దాగిన చిచ్చును పట్టణ వాసులకు ఎరుక పరచడమే వాటి లక్ష్యం! అదే జానపదుని చేత మన గుండెల్లో ఈటెను దించే కరకు సత్యాల్ని బైట పెడుతోంది..

ఆకటి చిచ్చు చల్లారని బ్రతుకులకు సాక్షిగా ఆ పల్లెను తన జాబులో పేర్కొంటాడు జానపదుడు! పల్లె నుంచి భుక్తి కోసం దేశాంతరం పోయిన భర్తకై సంతోషంతో వైనతేయంలో దాక్కొన్న ఆ ముగ్ధ.. తన భర్త మరణ వార్త విని ఆకటి చిచ్చుతో అలమటిస్తూ తన బిడ్డల్తో కలిసి చెరువులో పడి ఈ స్వార్థ సంఘానికి వీడ్కోలు తెలిపిందం టాడు! ఈ ఉదంతాలన్నీ కూడా నాటి సామాజిక పరిస్థితుల్ని కళ్లకు కడతాయి! వారి జీవితం నిరంతర

పోరాటమేనని జానపదుడు తన మిత్రునికి వ్రాసిన జాబుల్లో చెప్పకనే చెబుతాడు!

ఒకసారి పట్టణం నుంచి వచ్చిన మిత్రుని ఉత్తరం చూసి ఖిన్నుడయ్యాడు జానపదుడు. ఎందుకంటే అందులో పట్నం స్నేహితుడు అనాటి దీపావళిని ఎంత విలాసంగా గడిపాడో వివరంగా వ్రాశాడు. కొత్త బట్టలకు, విందులు వినోదాలకలకు, బాణసంచాలకు అతనెంతెంత ఖర్చు చేశాడో గొప్పగా వర్ణించాడు. కానీ పల్లె జీవితం అలా లేదు కదా! అక్కడి జనం ఆ పండగ పూట ఎంత దైన్యంగా రోజు వెళ్లబుచ్చారో చెప్పాలంటే దానికి ఈ జానపద మిత్రుడే సాక్షి! స్నేహితుని జాబుకు జానపదుడు రాసిన జవాబులోనే మనకు పల్లె బ్రతుకులు ఎంతటి దయనీయమైనవో తెలుస్తాయి. "..కానీ ఆ వేళ మా పల్లెలో ఎంతమంది పస్తు ఉన్నారో! పండుగ పూట పస్తు ఉండరాదని తవ్వెడు, సోలెడు బియ్యం కోసం కొందరు ఎంత అవస్థ పడ్డారో తెలుసా..?" అంటూ పల్లె దృశ్యాన్ని వర్ణించాడు!

గ్రామంలో పండుగ సందడి ఎలా ఉందో చూద్దామని వచ్చిన ఆ ఊరి బడిపంతులుకు ఆ ఊళ్లో వృద్ధుడు తారస పడ్డాడు.. ఆ ముసలాయన బడి పంతులుతో.. "ఏం పండుగ బాబూ..! రోజులు మునుపటిలా లేవు. పూర్వం ఈ అరుగుల నిండా ప్రమిదలు వెలిగించేవాళ్లం.." అంటుంటే అతని గొంతు బొంగురు పోయింది! ఎంతో మందికి సంతర్పణ జరిగేదని, ఎంతో మందు (బాణ సంచా) కాల్చి పండుగను ఆనందంగా జరుపుకొనే వాళ్లమని పూర్వపు స్మృతులన్నీ నెమరు వేసుకొన్నాడు! జీవమున్న ఇంటికి ఆనవాలు వాకిలి ముందు ముగ్గు! కానీ ఈనాడీ పండుగ పూట ఇంటి ముందు ముగ్గులు కూడా నల్లమొగం చేసుకొన్నాయి! ఎందుకంటే ముగ్గ పిండి కూడా కొనే స్థోమత లేక ఇటిక అవములలోని బూడిదను ముగ్గులో కలుపుతారు. అందుకే వారి వాకిట్లో నల్లటి ముగ్గులే దర్శనమిస్తాయి!

ఆ పల్లెలో బియ్యం నిల్వ చేసే సంఘమొకటి ఉంది. ఆ సంఘానికి సంబంధించిన కుర్రాళ్లు చిన్న చిన్న సంచులతో ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యం సేకరిస్తారు. ఆ ఊరిలో రామాలయంలో వాటిని నిల్వ చేస్తారు. యువ హృదయాలకు తట్టిన విశ్వజనీన పద్ధతి ఇది. ఆ గదిలో బియ్యం సమృద్ధిగా ఉన్నా అన్నార్తితో నాలుగు బియ్యపు గింజలు కావాలని అడిగే అభాగ్యులు ఈ పల్లెలో లెక్కకు మించి ఉన్నారని భీమన్న సృష్టించిన జానపదుడు ఆవేదన చెందుతాడు. దేశంలో 90 వంతులు పల్లెటూర్లు అంధకారంతో, ఆకటి చిచ్చుతో, ఆవేదనతో కుమిలి కృశిస్తూ ఉన్నాయి. అన్నార్తులకు విముక్తి ఎప్పుడు లభిస్తుంది? పేద, ధనిక, చిన్న పెద్ద, కులమత భేదాలు మనుషుల్లో ఎప్పుడు నశిస్తాయో అప్పుడే మానవ సమాజం అభివృద్ధి చెందుతుంది. మానవ సంఘాభివృద్ధికి నిరోధక మేమిటని ఆలోచిస్తే.. భయమే దానికి మూలకారణం! ఈ భయమే మన భారత జాతిని విదేశీయుల చేతులకు అప్పగించి వేసిన పిశాచమని భీమన్న ఆక్రోశిస్తాడు! భయం చావాలి.. పరాక్రమం పుట్టాలి! మనం గౌరవింపబడాలంటే, ముందు మనవాళ్లని మనం గౌరవించుకోవాలి. దేశానికి గౌరవం రావాలంటే ముందు దేశీయులకు గౌరవం ఉండాలని భీమన్న గారు ఈ సంఘానికి చాటుతున్నారు!

గుఱజాడ గారి దేశభక్తి గేయంలోని పంక్తులను స్మరిస్తూ.. దేశం మట్టి కాదనీ, అది నిండైన మనుషుల కూడలి అనీ ఎలుగెత్తి పాడతారు. సకల సంపదలతో దేశం తులతూగుతూ ఉండాలంటే ఆ దేశ పౌరులకు తగిన ప్రాధాన్యం ఉండాలనీ, మనుషులకు గౌరవం లేనినాడు దేశానికే గౌరవం ఉండదనీ ఉపదేశిస్తారు. ఇది తెలుగు నేలకూ వర్తిస్తుందనీ, తెలుగువాడికీ, తెలుగు నాడికీ ఈ దుస్థితి పట్టిందంటే అది తెలుగు భాషకూ పట్టిన దౌర్భాగ్యమేననీ తన మిత్రునికి రాసిన జాబులో గర్హిస్తాడు జానపదుడు!

వదునైన తన ఆలోచనలనూ, అభ్యుదయ భావాలనూ జానపదుని ప్రతిమను ముందు పెట్టి తన

గొంతును అతని ద్వారా వినిపింపజేసిన డా. బోయి భీమన్న, ఈ ఉత్తరాంతరంగాల్లో ఎన్నో కోణాల్ని స్పృశించి తన మనసులోని భావాల్ని మనకు చేరవేస్తారు! సంఘ పునర్నిర్మాణం గురించి కూడా బోయి భీమన్నగారు జానపదుని చేత జాబు రాయిస్తారు! ఆనాటి సామాజిక స్థితిలో స్వాతంత్ర్య సమరానికి ఏ గ్రామాలూ పనికి రావన్నారు. ఎందుకంటే ఇప్పుడున్న గ్రామాల పునర్నిర్మాణం జరిగితేనే అవి పోరాటానికి సంపూర్ణంగా సిద్ధమైనట్లని ఆయన అభిప్రాయ పడతారు. ప్రజల్లో మిలిటరీ ఉద్దీపన, మిలిటరీ క్రమశిక్షణ అలవరచాలని, అన్యాయాన్ని ప్రతిఘటించే ధైర్యసాహసాలు పెంపొందించాలని జానపదుడు ఆవేశంగా చెబుతాడు. అప్పుడుగానీ ప్రజలు సైనికులు కాజాలరని మిత్రునికి వ్రాసిన లేఖలో నిష్కర్షగా వెల్లడిస్తాడు. వెరసి ఈ జాబుల ద్వారా వర్ణరంజితమైన పట్టణాలు భూలోక స్వర్గాలనీ, పల్లెలే దయనీయ స్థితిలో ఉన్నాయన్నది డా. బోయి భీమన్న గారి ముఖ్యోద్దేశం! "విజ్ఞాన నిధులకు గ్రామ వాటికలే ఆటపట్లు కావాలి. ఇది తప్పక సాధించాల్సిన లక్ష్యం" అన్నది ఈ జాబుల ద్వారా ఆనాడే బోయి భీమన్న గారు కన్న అపురూప స్వప్నం!!

ఉపయుక్త గ్రంథ పట్టిక :

1. జానపదుని జాబులు (పల్లెటూరి లేఖలు) - బోయి భీమన్న, దేశి ప్రచురణలు, విజయవాడ.
2. భీమన్న సాహితీ సౌరభం, సంపాదకుడు: లక్కావఝుల రామమూర్తి, ఎమెస్కో బుక్స్, విజయవాడ.
3. డా. బోయి భీమన్న రచనలు - సామాజిక స్పృహ - కె.ఎస్.సుబ్రహ్మణ్యం, ఎమ్.ఫిల్ సిద్ధాంత గ్రంథం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
4. భీమన్న సాహిత్యావలోకనం -డా. తాళ్లూరి అన్నపూర్ణ, విరించి పబ్లికేషన్స్, హైదరాబాద్.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాలేరు నాటకంలోని దళిత జీవన చిత్రం

– **డి. పవిత్ర,** పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై - 05.

మానవుడి సంఘజీవి. అతిని వ్యక్తిత్వ వికాసంపై సమాజ ప్రభావం పడక తప్పదు. అతని మానసిక స్థితి వల్ల సమాసంలో మార్పులు రాక మానవు. ఈ ప్రపంచ యావత్తు మొత్తాన అందరిని పీడించే ఒకే ఒక క్రిమి కీటకం లాగా జనాలను పట్టి పీడించేది, ముందుగా గుర్తుకు వచ్చేది కులం. ఈ కులం వల్ల ఆనాటి నుండి ఈనాటి వరకు జనాలను పీడిస్తూ ఉంది.

మన హిందూమతము పేరు మాత్రమే కాదు ఏమతం పేరు చెప్పగానే మొదట అందరికీ గుర్తుకు వచ్చేది కులాల సంగతి. హిందూ మతమునకు ప్రామాణ్యము వేదాలు అని అందరికీ తెలుసు. స్త్రీలు, శూద్రులకు వేదాధ్యయ నాధికారం లేదని అలా వేదాలలో ఉన్నదని చాలా మంది నమ్ముతున్నారు. కానీ వేదాలలో అలా లేదని చెప్పడానికి ఈ ప్రయత్నం. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. 'చాతుర్వర్ణం మయాసృష్ట్యం గుణకర్మ విభాగశ:' అని అన్నాడు. దీని అర్థం మొదట వారి గుణల బట్టి తర్వాత వారు చేసే పనుల బట్టి నాలుగు వర్ణాలు (కులాలు)చే (భగవంతుడిచే) సృష్టించబడ్డాయి. వేదాలలో నాలుగు వర్ణాల గురించి చెప్పారు కానీ వాటి మధ్య ఎక్కువ, తక్కువల గురించి చెప్పలేదు.

కులం అనేది సమాజంలో ఏ వ్యక్తినైనా తేలికగా గుర్తించడానికి ఆర్యులు రూపొందిచిన ఒక వ్యవస్థ. పూర్వం చాలా సులభంగా కులాలు, మతాలు, వర్గాలు అని విభజించారు. కానీ వీటి వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతారని, నష్టపోతారని ఊహించలేకపోయారు. బ్రిటీషు పరిపాలన జరిగేటప్పుడు వారి నుండి స్వాతంత్ర్యం దొరికితే చాలు అని భారతీయులు అను కున్నారు. ఎన్నో పోరాటాలు, ఆర్భాటాలు చేసి కొందరు ప్రాణాలను కోల్పోయి మరికొందరు జైలు పాలయ్యారు. ఇలా ఎన్నో ఇబ్బందులు పడి కొన్ని సంవత్సరాలు పోరాడి పోరాడి చివరికి స్వాతంత్ర్యాన్ని పొందారు. కాని భారతదేశానికి స్వాతంత్ర్యం పొందిన అసలైన స్వాతంత్ర్యం ప్రజలల్లో ఏర్పడలేదు.

ఈ సాంఘిక సమాజంలో స్వాతంత్ర్యం ముందు కంటే కులం అనే వ్యవస్థ ప్రజల్లో బాగా నాటుకు పోయింది. ప్రజల నరనరాల్లో రక్త కండరాల్లో ఊరిపోయినటువంటిది ఈ కులం. దీన్ని నిర్మూలించడానికి ఎంతో మంది గొప్ప గొప్ప పండితులు, నాయకులు ఎందరో మహానుభావులు ఏర్పాడి పోరాడి ఎన్నో కార్యక్రమాల్ని చేపట్టి ప్రజలకి అర్థమయ్యేలా ఎన్నో సభల్లో పద్య రూపంలోను, కవితల రూపంలోను, నాటక రూపంలోను, నవలల రూపంలోను, మాటల చేతలలోను వివరించిన ప్రజలు మూర్ఖత్వంగానే నడుచుకొనే వాళ్ళు నూరులో పది శాతం వరకే మార్పు వచ్చాయి.

భారతదేశంలో అన్ని రాష్ట్రాలలోను కులం పేరుతో ఎన్నో చట్టాలు, ఏర్పరిచి నేరాలు చేసేవారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధమైన కుల సమస్యలు ఏర్పడ్డాయి. ఎక్కువ కులం, తక్కువ కులం ధనవంతులు - బీద వాళ్ళు అని ఎన్నేన్నో సమస్యలు పుట్టగొడుగులా ఏర్పడ్డాయి. ముఖ్యంగా అధిక సమస్యలను ఎదుర్కొన్న వాళ్ళు దళితులు. వీరు అనుభవించిన నరకం అంతా ఇంతా కాదు. దళితుల్ని ఎక్కువ కులం వారు ధన వంతులు సమాజంలోని ప్రజలుగా అనుకొనేవారు కాదు. సమాజం నుండి దళితుల్ని వేరు చేసి వారిని ప్రక్కన పెట్టేవాళ. వాళ్ళు మంచి బట్టలు వేసుకోకూడదు. మంచి ఆహారం తినకూడదు ముఖ్యంగా ఎండయైనా, వాన యైనా చెప్పులు వేసుకోకూడదు. దళిత పిల్లలు చదువుకోకూడదు, గుళ్ళు గోపురాళ్ళకు రానించే వాళ్ళు కాదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నేన్నో ఉన్నాయి.

ఎందరో మహాను భావులు ఈ కులన్ని నిర్మూ లించాలని ఎన్నో రకాలుగా పోరాడారు. కాని కొంతవరకే మార్పుని తీసుకొని వచ్చారు. వారిలో ముఖ్యులు అంబేద్కర్‌గారు దళితులకోసం రాజ్యాంగంలోనే అనేక మార్పుల్ని తీసుకువచ్చారు. ఈ సంఘ సమాజంలో దళితులు కూడా మనుషులు అని తెలియపరిచారు. దళిత జాతిలో పుట్టి అబేద్కర్‌గారు చిన్ననాటినుండి తాను అనుభవించని కష్టాలు లేవు. అష్ట కాష్టాలు పడ్డారు. అందువల్ల ఆయన పడ్డ కష్టాలు ఆయన తర్వాత తరం వారు పడకూడదని ఎన్నో మార్పుల్ని తీసుకువచ్చారు. క్రొత్త రాజ్యంగాన్ని వ్రాశారు. కొంత వరకు మార్పు వచ్చినా ఇంకా రావాల్సినంత మార్పు రాలేకపోయింది. ఎందుకంటే కులం అనేది తమ రక్తంలో ఊరిపోయింది కనుక.

మన ఆంధ్రరాష్ట్రంలో ఎందరో కవులు తమ తమ సామార్థ్యంతో తమ రచనల ద్వారా ప్రజల్లో మార్పులు తీసుకురావాలని ప్రయత్నించారు. ఆ మహానుభావులలో దళిత కుటుంబంలో జన్మించిన వారే బోయి భీమన్నగారు. ఈయన ఎన్నో సార్లు కులం ఆటుపోట్లకు లోనైయ్యారు. అయినా వెనుకడుగు వేయకుండా ఈ సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును తీసుకువచ్చారు. బోయి భీమన్న అనేక రచనల్ని రచించారు. వాటిలో ముఖ్యంగా దళితులను ఉద్దేశించి వారికి జరిగిన అవమానాల్ని, నష్టాల్ని గురించి 'పాలేరు' అనే నాటికలో చక్కగా వివరించారు.

ఈ 'పాలేరు' బోయి భీమన్న రచించిన సాంఘిక నాటకం. దీనిలో ప్రధాన కథాంశం కులం నిర్మూలన. సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించు కుంటారు. పాలేరుగా పనిచేయాల్సినవాడు, అగ్రకులంగా గౌరవ మర్యాదల్ని పొదుతున్న అమ్మాయిని పెండ్లి చేసుకోవాలంటే ఎన్ని బాధలకు గురికావాల్సి వస్తుందో, అన్నింటినీ అగ్రకుల భూస్వామి కుభేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి ఉపకారి మాష్టారు సహాయంతో చదువుకుని వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోదోగం సాధిస్తాడు.

ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురా గతలను చట్టబద్ధంగా అడ్డుకుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనే ప్రోత్సాహించే వాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించు కోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని రచయిత ఈ నాటకం ద్వారా ప్రేరేపించారు. సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కాదని, మంచి వాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం.

ఈ పాలేరు నాటకంలో వలబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర్ఖ కులతత్వ వాదులు లేని వాళ్ళూ ఉంటారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు. వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా బోయి భీమన్న వివరించారు.

దళితుల గురించి భారతీయ సమాజంలో చతుర్వర్ణ వ్యవస్థ కోనసాగింది. దాన్ని అనుసరించి కులవ్యవస్థ రూపొందింది. ప్రధానంగా కుల వివక్షను ఆధారంగా చేసుకొనే దళితులను, దళిత సాహిత్యాన్ని సాహితీవేత్తలు గుర్తించి అనేక మార్పులు తీసుకురావాలని కృషిచేశారు.

భీమన్న రచనలో పాలేరు నాటకం అగ్రగణ్యమైనది. తెలుగు నాటకరంగ చరిత్రలోనే ఇది ఒక మైలు రాయి. అప్పటికి సామాజిక సమస్యలపైన కన్యాశుల్కం, మద్యపానం, వరకవిక్రయం, బహు భార్యత్వం, వేశ్యా ప్రియత్వం వంటి ఇతివృత్తాలతో నాటకాలు వచ్చాయి. పౌరాణిక నాటకాలు ప్రచారంలో ఉన్నాయి కానీ సమాజంలోని ఇతర ప్రక్రియలలోనూ ఈ సమస్యలపై

వచ్చిన రచనలు అతి తక్కువ. ఈ నాటకం మాల, మాదిగల ఆలోచనలో గొప్ప మార్పు తెచ్చింది. పాలేళ్ళ జీవితాలను అతి దగ్గరగా చూసిన భీమన్న వారి నిస్స హాయతనూ అగ్రకులాల దురహంకారాన్ని ఈ నాటకంలో చిత్రించారు.

కులవ్యవస్థ దేశాభ్యుదయానికి హానికరమని చెప్పారు. కామందుల దౌర్జన్యాలను, ఆడ కూలీలపై వారు చేసే లైంగిక అత్యాచారాలను, అంటరానితనం పాటించడం లోని దుర్మార్గాలను చెప్పడమే కాక సమస్యకు పరిష్కా రాన్ని కూడా సూచించారు. ప్రజలు తమంతట తామే చైతన్యవంతులయ్యేలాగా చేశారు. అంత వరకు పౌరాణిక నాటకాలనే చూసిన కిందికులాల ప్రజలు ఈ నాటకంలో తమనుతాము చూసుకుంటున్నారు. నిత్యమూ తనకు ఎదురయ్యే అనుభవాలను, సమస్యలను చూడగలిగారు. ఆచరణ సాధ్యంగా ఉన్న పరిష్కార మార్గాన్ని అర్థం చేసుకున్నారు. ఒకపాలేరు కుర్రాడు కామందు దౌర్జన్యం నుండి తప్పించుకుని బయటపడి చదువుకుని డిప్యూటీ కలెక్టరు కావటం పాలేరు నాటకంలోని ఇతివృత్తం.

వాల్మీకికి అతని సమకాలికుడైన రాముడు కథా నాయకుడు. నాకు నా సమకాలికుడైన పాలేరు వెంకన్న కథా నాయుకుడు అని, అతని జీవితం నా పాలేరు నాటకానికి ఇతివృత్తం అన్నారు. భీమన్న.

పాలేరు నాటకం లక్ష్యం సాంఘిక విప్లవం. అది సాధించబడింది. అని భీమన్న సంతృప్తి చెందారు. రామాయణం వంటి మహాకావ్యాలలో మాత్రమే సాధ్యం కాగల రస నిష్టన్నత పాలేరు వంటి చిన్న నాటకంలో సాధించారు భీమన్న అని పండితులు ప్రశంసించారు.

కొంతమంది అయితే భీమన్నను కులంపేరు చెప్పి చాలా హేలన కూడా చేశారు. ఉపాధ్యాయుడిగి ఉన్న రోజుల్లో భీమన్న ఒకసారి సెలవు ఖాళీలే నగరం స్కూలుకు హెడ్మాస్టరుగా వెళ్ళారు. అక్కడ స్కూలు ఉపాధ్యాయులు స్కూలుకు ఇష్టం వచ్చినప్పుడు రావటం పోవటం చేస్తుండే వారట 'మాల హెడ్మాస్టరు' అని దూకుడుగా ప్రవర్తించిన వారికి, "మాల హెడ్మాస్టరు కాదు స్కూలు హెడ్మాస్టరు" అని గుణపాఠం చెప్పి భీమన్న అందరి ప్రశంసలు అందుకున్నారు.

పిఠాపురం మహారాజావారి షష్ఠిపూర్తి సభలో పాల్గొనడం భీమన్న జీవితంలో ఒక మరపురాని ఘట్టం. సనాతన కవిపండిత లోకంలో హరిజన కవుల పట్ల వివక్షకు ఈ సంఘటన అద్దంపడుతుంది. పాఠశాల రోజుల నుండీ భీమన్న కులవివక్షను ఎదుర్కొంటూనే వచ్చారు. ఎంతో సంయమనంతో అగ్రవర్ణ మిత్రులతో సఖ్యం పాటిస్తూ మైత్రిబంధం కొనసాగించారు.

నిజ జీవితంలో అటు అంబేద్కర్, ఇటు భీమన్న ఇరువురి జీవితాల్ని పాలేరు నాటకం స్ఫురింపజేసే టట్లుంది. ఇరువురూ కులం వల్ల అనేక అవమానాల్ని ఎదుర్కొన్నవాళ్ళే. ఇరువురూ చదువుకోవడం వల్లనే అనేక మంది దళితులకి ఆదర్శం కాగలిగారు. యాదృచ్ఛికంగా ఇద్దరు కూడా కులాంతర వివాహాలనే చేసుకున్నారు. తాము చెప్పిన వాటిని నిజజీవితంలో ఆచరించి చూపి మరీ ఆదర్శ వంతులయ్యారు. రాగవానిష్ఠంలో అరుంధతీదేవి మహాత్మ్యాన్ని వివరించడానికి, పురాణేతి హాసాల్లోని కులాంతర వివాహాల్ని సృజనీకరణ ప్రతిభతో భారత జాతీయ దృక్పథాన్ని ప్రదర్శించారు. దీనికి ఆర్య ద్రావిడ వాదాల్ని కూడా నాటకంలో అంతర్భాగం చేశారు.

సనాతన సంప్రదాయవాది భావాల్ని 'ప్రాచీనుడు' అనే పాత్ర ద్వారా వర్ణించాడు. నిష్కళమైన ప్రేమకు సాంప్రదాయ ఎలా అడ్డంకిగా మారుతుందో వివరిస్తూనే ఆ ప్రేమలో నిజాయితీ ఉంటే అన్నింటినీ జయిస్తుందని నిరూపంచారు. కుల నిర్మూలకు కులాంతర వివాహాలు తోడ్పడతాయని చెప్పినట్లే, తర్వాత వాళ్ళకు పుట్టే పిల్లలు సామాజిక స్థితిగతుల్ని చర్చించవలసిన అవసరం ఉంది. నేడు కులాంతర వివాహాలు జరిగినా మళ్ళీ తండ్రిదిగానీ, తల్లిదిగాని కులం గుర్తింపే వస్తే కుల నిర్మూలన జరిగిన ట్లెలా అవుతందో ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.

మానవజాతి పురోగమనానికి జ్ఞానం ఎంత ఆవశ్యకమో కొన్ని దశాబ్దాల క్రితమే గుర్తించిన కవి బోయి భీమన్న. తెలుగు సాహిత్యంలో భీమన్న పేరును అజరామరం చేసిన రచన పాలేరు. జనం వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసినవాడే కవి, అన్నది ఆయన నిశ్చితాభిప్రాయం కావచ్చు. అందుకే పాలేర్లు, రైతుకూలీలు తమబిడ్డలను చదివించాలని, తద్వారా వారి అభివృద్ధికి బాటవేయాలని పాలేరు నాటకంలో ఉద్బోధించారు. కవికి సహజంగా ఉండవలసిన దృష్టి కూడా ఇదే కదా! వెంకన్న అనే పాలేరు యువకుడు, అగ్రకులంగా గౌరవ మర్యాదలు పొందుతున్న వనబాల అనే యువతి ప్రేమించి పెళ్లి చేసుకోడానికి ఎంత సంఘర్షన పడ్డారో ఇందులో చెప్పారు భీమన్న. ఉపకారి (ఉపాధ్యాయుడు) సలహా మేరకు వెంకన్న చదువుకుని, వెంకటేశ్వరరావుగా మారి, డిప్యూటి కలెక్టర్ హోదాలో స్వస్థలానికి వచ్చి భూస్వాముల ఆగడాలను ఎదుర్కొంటూ పాలేరు బానిస సంకెళ్ళను ఏవిధంగా తెగబడ్డాయో ఈ రచనలో చిత్రీకరించారు. సాహిత్యం అయన సిద్ధాంతం రసాద్వైతం కావచ్చు. అందుకేనేమో ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం భారతజాతిలో ఏకత్వం. పంచములుగా, ఎస్సిలుగా, హరిజనులుగా సమాజం పిలుస్తున్న వారి అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి, సమకాలీన సమాజంలో గౌరవానికి అర్హులయ్యేటట్లుగా చేయడం ఈ నాటకంలో కనిపించే సూక్ష్మి.

వాల్మీకి, వ్యాదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైన వాళ్ళు దళితులేనని వాదిస్తూ వాళ్ళు వ్రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. హింసావాదానికి భీమన్న వ్యతిరేకి. దళితులందరూ శ్రామికులనే వాదాన్ని భీమన్న వ్యతిరేకించారు. కమ్యూనిస్టుపార్టీలో పనిచేసి కులం, వర్గం వేరని వాదించిన కోనాడ సూర్యప్రకాశరావుకి పాలేరు నాటకాన్ని అంకితమిచ్చారు. భీమన్న రచనల గురించి మాట్లాడుతున్న వాళ్ళు మాటలో మూడు ప్రధానాంశాల్ని గుర్తించాలి. ఆర్య అనార్య సిద్ధాంతాన్ని అంబేద్కర్ ఆలోచనతోనే రాగవాసిష్ఠం లాంటి నాటకాన్ని వ్రాశారు. రెండవది వర్ణం విషయంలో భారతదేశంలో కులమనే అవగాహన చేసుకోవాలి. ఇది ప్రపంచ దేశాలన్నింటికీ సమన్వయించినప్పుడు కుదరదు. దీన్ని కూడా అంబేద్కర్ ఆంత్రోపాలజీ, సామాజిక శాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని చెప్పిన సిద్ధాంతమే దీన్నే భీమన్న కూడా తన రచనల్లో సమన్వయించాడు.

పాలేరు నాటకానికి వ్రాసిన ముందుమాటలో భీమన్న స్పష్టంగానే వర్గం, కులం పట్ల తన అభిప్రాయాన్ని ప్రకటించాడు. భారతదేశంలో వర్గ పద్ధతి లేదు. వర్ణ వ్యవస్థ అంటే కుల వ్యవస్థ వుంది. ఇక్కడ కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టి మాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించారు. ఇంత స్పష్టంగా కుల నిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయ సదస్సులో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. మూడవది వర్ణాంతర వివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్ని బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న సాహిత్యమని గుర్తించాల్సి ఉంది.

ఆధారగ్రంథాలు :

1. పాలేరు - బోయి భీమన్న
2. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన - డా॥ తక్కళ్ళ బాలరాజు

బోయి భీమన్న ప్రగతి పాత్ర - స్త్రీ చైతన్యం

– పి. జ్యోతి, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-05

కళ కళ కోసం కాదు సమాజ హితం కోసం అన్నట్టుగా బోయి భీమన్న గారి రచనలు కనిపిస్తాయి. వీరికి నాటక కర్తగా, వక్తగా, విమర్శకుడిగా, తాత్వికుడిగా ఆధునిక సాహిత్యంలో సుస్థిరమైన స్థానం కలదు.

వీరు మతము, దేవుడు, నీతిబోధనలు ఏవి వద్దు మానవుణ్ని మానవుడిగా గుర్తించి, సాముదాయక శ్రేయస్సునే దైవంగా ఆరాధించాలని అప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరు ప్రగతి మార్గంలో పయనించగలుగుతారు అని చెప్పారు. మానవజాతి అంతా ఒకే వర్గాకి చెందిన వారని, మనుషులు వారు చేసే వృతుల ఆధారంగా సమాజంలో కులాలు పుట్టాయని చెప్పారు. అన్ని జాతుల వంటిదే మానవ జాతి కూడా కాకపోతే ఒక్కొక్క జీవ జాతిలో ఒక్కొక్క గుణం ఏర్పడితే, అన్ని గుణాలు కలిగిన జాతి మానవ జాతి. అంటే మానవుడు సర్వగుణ సంపన్నుడే కాని సర్వగుణసద్గుణుడు మాత్రం కాదు. ఈ సమాజం కుల మత రహితంగా మారినప్పుడే మానవుడు సర్వగుణ సద్గుణుడుగా మారతాడని తెలిపారు.

బోయి భీమన్న గారు వారి రచనలలో స్త్రీకి ఒక ఉన్నతమైన స్థానం యిచ్చి స్త్రీ ఔనత్యం, విలువలు గురించి తెలియజేశారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానులే, పురుషుడికి సమాజంలో ఎంత స్వేచ్ఛ వుందో అంతే స్వేచ్ఛ స్త్రీకి వుంది అని, స్త్రీ తన హక్కులు కోసం తానే పోరాడాలని, ఇవి మాత్రమే కాకుండా శారీరక బల ప్రదర్శనలోను, శక్తి యుక్తులను ప్రదర్శించడంలోను, పురుషుడిని ఎదిరించగలిగే బుద్ధిబలాన్ని తాను కలిగి వుండాలని, తన సమస్యలను తానే పరిష్కరించుకోవాలి అని తెలియజేశారు. ఎటువంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా వాటి నుంచి తనని తాను కాపాడుకోగలగాలి. కాబట్టి అన్ని విద్యయందు ఆరితేరి ఉండాలని. స్త్రీ దృక్పథంతో వీరు చేసిన రచనే ప్రగతి నాటకం.

వీరు ప్రగతి నాటకాన్ని మొదట లక్కీ కుమారి అనే పేరుతో రచించారు, కొంతకాలం తరువాత

ఈ నాటకంలో కొన్ని మార్పులు చేర్పులు చేసి 'ప్రగతి' పేరుతో రూపుద్దిదారు. ఈ నాటకాన్ని 1979వ సంవత్సరంలో ప్రగతి ప్రెస్ వారు ప్రచురించారు. వీరి దృష్టిలో ప్రగతి అంటే ప్రకృతి సిద్ధమైన గమనం కాదు. అదొక విలక్షణమైన మానవ మేధస్సు, కేవలం మానవుడు మాత్రమే సాధించగల పురోగతి. మానవుడు తన సృజనాత్మకతో తాను తేజోవంతమైన మార్గంలో నడుస్తూ.... తన చుట్టూ వున్న పరిస్థితులను చక్కద్దితూ తనతో పాటు సమాజాన్ని కూడా ఒక శ్రేయస్కార మార్గంలో నడిపించడాన్ని ప్రగతి అంటారు అని చెప్పారు. ఈ భూమి మీద అనేక రకాలైన జీవులు వున్నాయి అందులో మానవుడు ఒక జీవి. మనిషి పుట్టడమే కులంతో పుట్టలేదు. కులాలనేవి అతను చేసే వృత్తుల నుంచి పుట్టాయి. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు వివిధ వృత్తులు చేస్తున్నప్పుడు వారి వృత్తుల వారితో సంబంధ బాంధవ్యాలు పెంచుకుంటూపోయాడు. ఆ విధంగా వృత్తులు రానూ రానూ తర్వాత కాలంలో కులాలుగా మారాయి. సమానత్వం పోయి అసమానత్వం పెరిగిపోయింది. తిరిగి మరల పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే కులం రద్దు కావాలి అప్పుడే మానవుడు నిజమైన ప్రగతిని సాధించగలుగుతాడు. సమాజం ప్రగతి మార్గంలో పయనించాలంటే స్త్రీ పురుషుల అవశ్యకత ఎంతో వుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అదే విధంగా లింగవివక్షత లేకుండా కలిసి పనిచేసినప్పుడే ప్రగతిని సాధించగలుగుతారు. కాని పురుషుడు తాను మగవాడు అనే అహంభావంతో ఇంటి బాధ్యతలన్నింటిని చూసుకోవాలస్సిన స్త్రీని కేవలం వంట ఇంటికి మాత్రమే

పరిమితం చేసి, ఒక వస్తువుగా మాత్రమే చూస్తూవచ్చాడు. పురుషులకు కాంత కనకాలు అంటే ప్రాణం. మేరుగిరులు, కనాకాభిషేకాలు, వెండికొండలు, స్వర్గ సౌఖ్యాలు మొదలగునవి అన్ని కూడా అతని ఊహసృష్టి మాత్రమే. బ్రతికివున్నంత కాలం వేటి కోసం తాపత్రయ పడుతాడో, చనిపోయిన తరువాత కూడా వాటి కోసం ఆశపడుతాడు. అయితే వేదకాలం నుంచి కూడా స్త్రీని ఆటబొమ్మగా, వస్తువుగానే చూస్తూవచ్చారు. స్త్రీని బయటకు పంప కూడదు ఆమెను కేవలం ఇంటికి మాత్రమే పరిమితం చేయాలని కొంతమంది మతాధికులు చెప్పడం మరియు కొంతమంది స్వప్రయోజకులు స్త్రీలకు కట్టుబాట్లు నియమాలను పెట్టడంతో వాటి ప్రకారమే స్త్రీలు నడుచుకోవల్సివచ్చింది. అయితే ఆదిలో తల్లి పెత్తనం నుంచి క్రమంగా తండ్రి పెత్తనంలోకి మారడానికి గల కారణాలను బోయి భీమన్న గారు ఈ విధంగా పేర్కొన్నారు. స్త్రీలకు ప్రకృతి కల్పించిన కొన్ని బలహీనతలు, ఆ బలహీనతలను పురుషుడిని కట్టి వుంచగలుగుతాయి కనుక అవి తన నుంచి దూరమైపోతాయని భయం, ఆందోళన. ప్రకృతి పురుషుడి పట్ల కనబరచిన ప్రత్యేకభి మానాల వల్ల అతడికి లభించిన వివిధ శక్తులు, సౌందర్యాలు. ఇవి అన్ని తనకు దూరమైపోతాయేమోనని స్త్రీని ఒక వస్తువుగానే చూస్తూ వచ్చాడు.అందుకే స్త్రీ అంటే పురుషుడికి అంత భయమేమో. స్త్రీ తనని తాను తక్కువ చేసుకున్నంత కాలం ఆమెలో మార్పు రాదు. తన హక్కుల కోసం తానే పోరాడుకోవాలి. తన సమస్యలను తానే పరిష్కరించుకోగలగాలి.

స్త్రీలు వారి తల్లిదండ్రుల సంపాదించిన ఆస్తులలో సమాన వాటాను ఎప్పుడు సంపాదించగలుగుతారో అప్పుడే వరకట్న దురాచారాలు తగ్గిపోతాయి. అంతే కాకుండా స్త్రీ తన హక్కులతో పాటు తన శక్తి యుక్తులతో కూడా పురుషుడిని ఎదుర్కొగలగాలి. అందుకుగాను స్త్రీలు అన్ని కళల యందు ఆరితేరిన వారై వుండాలి. అప్పుడే స్త్రీ అన్నింటిలోనూ విజయం సాధించగలుగు తుంది. ధనస్వామికం, పారిశ్రామికం, వ్యాపారికం వంటి వ్యవస్థలు ఇందులో నాయిక అయిన ప్రగతిని ఎన్ని అవస్థలు పెడుతూ వచ్చాయి. వాటిని ఆమె ఏవిధంగా ప్రతిఘటించింది అనే విషయాలను ఇతివృత్తం ద్వారా తెలుసుకుంద్దాం.

ఇతివృత్తం :

ఈ నాటకంలో కథనాయిక పేరు ప్రగతి. ఈమె స్వతంత్రం భావాలు మరియు స్వతంత్రంగా బ్రతకాలి అనే ఆలోచనలు కలిగిన నృత్యగానకళా విద్యార్థిని. అన్ని విద్యలను, కళలను నేర్చుకున్న నాయిక. ఈమె తండ్రి పేరు హరప్పా. ఈమె అభిమాన కవి గౌతమి పుత్ర. ఈయన కవితలన్న, పాటలన్న ప్రగతికి చాలా ఇష్టం. మార్గమిత్ర ఇందులో కథానాయకుడు. ఇతనే గౌతమీపుత్ర కవి కాని ఈ విషయం ప్రగతికి తెలియదు. మార్గమిత్ర, ప్రగతి వెన్నంటే వుంటూ ఆమెను అనుక్షణం తన పాటలు, కవితల ద్వారా చైతన్యవంతురాలిని చేస్తూవుంటాడు. ప్రచార్ అనే ఫోటో స్టూడియో వ్యాపారి ప్రగతిని చూసి ఇష్టపడుతాడు, ఆమెను ఏలాగైనా తన వశం చేసుకోవా లని దురుద్దేశంతో తన ఫోటోతో పాటు ప్రగతి ఫోటోను జత చేసి వాళ్ళ ఇంటికి పంపుతాడు. ఆ ఫోటోను చూసిన వాళ్ళ నాన్న ఆమెను ఇంటి నుంచి పంపేస్తాడు. ప్రగతి తాను ఏ తప్పు చేయలేదని చెప్పినా ఆమె తండ్రియైనా హరప్ప పట్టించుకోడు. ప్రచార్ ఆ ఫోటోతో ప్రగతిని తన వశంచేసుకోవాలని ఆమెను స్టూడియో దగ్గరకు రమ్మం టాడు. అక్కడి వెళ్ళినఆమెతో అసభ్యంగా ప్రవరిస్తాడు. ప్రగతి ప్రచార్‌పై ఎదురుదాడి చేసి తనని తాను రక్షించుకుంటుంది. అదే సమయంలో అక్కడికి శ్రీరాం అనే వ్యాపారవేత్త వస్తాడు. ఇతను సాంస్కృతిక రంగంలో పెట్టుబడులు పెడుతుంటాడు. ఇతను ప్రగతికి సాంస్కృతిక రంగంలో అవకాశాలు ఇప్పిస్తాను అని మాయ మాటలు చెప్పి లొంగదీసుకోవాలని చూస్తాడు. కాని ప్రగతి స్నేహితురాలు అయిన లక్కీ కుమారిని కూడా ఈ విధంగానే వీళ్ళ చేతిలో మోసపోయింది అని తెలుసుకున్న

ప్రగతి శ్రీరాంను ప్రతిఘటిస్తుంది. అంతలో అక్కడికి దొరబాబు వస్తాడు, ఇతను ప్రగతికి వరుసకు బావ అవుతాడు. ఇతను ఊరిలో అప్పుడే ఎదుగుతున్న భూస్వామి. ప్రగతి, ప్రచార్ ఫోటోను చూసిన దొరబాబు ప్రగతితో ఇలా అంటాడు. మీ నాన్న నీకు స్వేచ్ఛ యిచ్చి చదువుకోమంటే నువ్వు ఇలాంటి పాడు పనులు చేస్తావా కులం తక్కువగాడితో లేచిపోదామనుకున్నావా అని ఆమెను దుయ్యబడతాడు. అందుకు ప్రగతి తాను ఏ తప్పు చేయలేదని అది పోర్టరీ, ప్రచార్ నన్ను తన వశంచేసుకోవడానికి అతను ఇలా చేశాడని చెబుతుంది. ఇవే మాటలు మా నాన్నకు కూడా చెప్పాను కాని ఆయన బయట వాళ్ళ మాటకు ఇచ్చినంత విలువలో కూడా నామీద నమ్మకం లేకుండా పోయింది అని బాధపడుతుంది. దొరబాబు వివాహితుడైనా అయినా ప్రగతి తన సొంతం చేసుకోవాలని అనుకుంటాడు. అతనితో పాటు ఇంటికి రమ్మంటాడు. అతని వంకర బుద్ధి పసిగట్టిన ప్రగతి ఈ లోకంలో వివాహం కాని వాడిని యాభై శాతం నమ్మొచ్చు, కాని వివాహితుడిని నూరు శాతం నమ్మ కూడదు. కాబట్టి పులికోరల నుంచి వచ్చి సింహం నోట్లో దూరినట్టు అవుతుంది నా పరిస్థితి నీవెంటగాని నేను వచ్చినట్లయితే అతనిని ఎదురిస్తుంది. వారి మధ్య మాటల యుద్ధం జరుగతుండగా కృష్ణార్పణం అనే ఒక పారిశ్రామికవేత్త వస్తాడు. ఇంతమందిని ఎదిరించి పోరాడిన ప్రగతి అతనిని నమ్మి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడుగుతుంది. అందుకు అతను ఉద్యోగం యిప్పిస్తాను అని ఆమెను గెస్ట్ హౌస్‌కి తీసుకొని వెళ్ళతాడు. అతని దగ్గర అబ్బులు, సుబ్బులు పనిచేస్తుంటారు. వారి సహాయంతో కృష్ణార్పణం మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్‌ను ప్రగతికి తాగిస్తాడు. ఆమె స్పృహ కోల్పోవడంతో కృష్ణార్పణం సుబ్బులుతో లంకేశంకి ఫోన్ చేయమంటాడు. లంకేశం రాజకీయవేత్త. ఇతను కూడా ప్రగతిని బలవంతం చేయాలని అనుకుంటాడు కాని ప్రగతి అతని నుంచి తప్పించుకుంటుంది. ఎలాగైనా ప్రగతిని దక్కించుకోవాలని లంకేశం కృష్ణార్పణంతో ఈ పని చేయిస్తాడు. అంతలో గౌతమిపుత్ర కవిత్వం విని ప్రగతి మేల్కొని, చైతన్య వంతురాలవుతుంది వారిని ఎదురిస్తుంది. అక్కడికి మార్గమిత్ర, తన స్నేహితుడైన పోలీస్ అధికారి బుద్ధ మూర్తిని మరియు కొంతమంది పోలీసులతో అక్కడికి వచ్చి వారందరిని అరెస్ట్ చేస్తాడు. ప్రగతి అభిమానించే కవియైనా గౌతమీపుత్ర మరెవరో కాదు మార్గమిత్ర అని తెలుసుకుంటుంది. బుద్ధమూర్తి, ప్రగతి మార్గమిత్రలకు వివాహం చేస్తాడు.

ప్రగతి పాత్ర చిత్రణ :

బోయి భీమన్నగారు వారి రచనలయందు పురుషుని కంటే కూడా స్త్రీ పాత్రను అపురూపమైన భావాలతో తీర్చి దిద్దారు. స్త్రీని పురుషుని కంటే ఉన్నతంగా చిత్రించారు. వీరి రచనలయందు స్త్రీ పాత్రలు గొప్పప్రాధాన్యం వహిస్తాయి. ఈ రచనలో స్త్రీ పాత్రను వివేకవంతురాలిగా, శక్తియుక్తులు కలిగిన స్త్రీగా, సబలగా చిత్రించారు. ప్రగతి తనకు నమన్యలు ఎదురైనప్పుడు తాను తన తెలివితేటలతో ఏవిధంగా బయటపడింది. అటువంటి సందర్భాలలో భీమన్న గారు ప్రగతి పాత్ర ద్వారా స్త్రీలను చైతన్యవంతుల్ని చేయటానికి ఈమె నుంచి పలికించిన కొన్ని సందర్భాలను పరిశీలిద్దాం.

ప్రచార్, ప్రగతిని చెరబట్టాలని ఆమె దగ్గరకు వచ్చినప్పుడు ప్రగతి అతని చెంప పగలకొడుతుంది. ఆ సందర్భంలో ప్రగతి, ప్రచార్‌తో ''ఇలా ఆడపిల్లల వెంటబడి వేధించే రౌడీ గాడిదలకు గుండెలు వుండవు చెంపలె వుంటాయి'' అని ప్రగతి చేత భీమన్న గారు స్త్రీని చెరబట్టాలని చూసే వారితో పోరాడాలని చెప్పించారు. శ్రీరాం అనే సాంస్కృతిక రంగంలో పెట్టుబడిదారుడు ప్రగతిని వశం చేసుకోవాలని ఇలా అంటాడు

శ్రీరాం :

''ఈదేశంలో సాంస్కృతిక రంగం అంతా మన చేతల్లో వాళ్లే. మనం లేకుండా ఏప్రోగ్రాము నడవదు.నీకేం భయము లేదు - ఏ లెవల్లో కావాలంటే అంటే ఆ

లెవల్లో పెడతతాను నా క్కావాలసింది మెరిట్'' అని వక్రార్థంలో చెబుతాడు. అప్పుడు ప్రగతి తనలో తాను ఇలా అనుకుంటుంది. నన్ను కళాదేవతగా ప్రపంచ సింహాసనం మీద కూర్చో పెడతామంటూ నా వెంటపడ్డ మానవ సింహా కోరల నుంచి బ్రతికి బయటపడటం ఎలాగో తెలియటం లేదు. బలప్రయోగం ఎంతకాలం ఈ కళారాధకులంమంతా కామాంధులేనా అందుకే నేమో మానవుడు దైవత్వాన్ని కెదగడం లేదు అని భీమన్న గారు ప్రగతి పాత్ర ద్వారా సమాజంలో మానవుడి ఆలోచనలు అతడిని ఎలాంటి స్థితిలో వుంచాయో మరియు ఒక స్త్రీని కేవలం తనకు ఆనందం కలిగించే వస్తువుగా చూడ కూడదని, అలాంటి ఆలోచనల వలనే మానవుడిలో దైవత్వం పోయి క్రూరత్వం పెరుగుతుంది అని తెలియచేశాడు.

ప్రగతిని ఆమె తండ్రి ఇంటిని నుంచి పంపిచేస్తాడు అది తెలుసుకున్న దొరబాబు ప్రగతితో ఈవిధంగా అంటాడు

దొరబాబు : తల్లిదండ్రులంతా అంతే అదొక మూర్ఖజాతి, వీధిలో వెలుగు శంఖుస్థాపన చేసి, ఇంట్లో చీకటిని వ్యవస్థాపించే ధూర్తలలో మీ నాన్నది అగ్రస్థానం, అయితే హంసా (ప్రగతి) నీతత్వం తెలిసిన మేము నమ్మం అనుకో, లోకం ఏమనుకుంటుందో ఆలోచించావా?

ప్రగతి : లోకాన్ని నేను లెక్కచేయను

దొరబాబు : వేం చెయ్యాలి. నమాజంలో బ్రతకాలిగా, తప్పదు సరేగాని, ఇప్పుడు నువ్వేం చేస్తావ్? నీడలేని ఆడదాని పట్ల పిల్లి కూడా పులిలాగే ప్రవర్తిస్తుంది తెలుసుగా? మీ నాన్నకు కోపం తగ్గే వరకూ మా ఇంటికి రా పోదాం?

ఇంటిలో నుంచి బయటకు వచ్చిన స్త్రీని సమాజం ఎంతటి చులకన భావంతో చూస్తుంది మరియు ఆమె పట్ల ఇతరుల వైఖరి ఏవిధంగా ఉంటుంది అనే విషయాలను రచయిత దొరబాబు పాత్ర చేత చెప్పించారు. దొరబాబు ప్రగతిని తనతో పాటు అతని ఇంటికి రమ్మని పిలుస్తాడు ఆ సందర్భంలో ప్రగతి ఈవిధంగా అంటుంది

ప్రగతి : ఏ ఇంటికి

దొరబాబు : నీ ఇష్టం ఏ ఇంటికైనా సరే, ఇప్పుడన్నీ ఖాళీగానే వున్నై

ప్రగతి : పులి కోరల నుంచి తప్పుకొని , సింహం నోట్లో దూరినట్టవుతుంది వద్దులే బావా థేంక్సు

దొరబాబు : పాపం ఆడవాళ్ళు

ప్రగతి : ఏం? ఎందుకు? మగవాళ్ళకు లేని పాపం ఆడవాళ్ళ కేం వచ్చింది?

దొరబాబు : మగవాళ్ళను పులులూ, సింహాలూ అనుకొన్నంత కాలం మీ ఆడవాళ్ళు గొర్రెలూ, బర్రెలూగానే వుండిపోతారు. మీ దృక్పథంలో మార్పు రానంతకాలం మీ పరిస్థితిలోనూ మార్పురాదు, మగవాడు మహచేయగలిగిందేముంది? శారీరకమైన బలప్రయోగం, అంతేగా? ధైర్యమూ, యుక్తికల స్త్రీ ఆ మాత్రం దౌర్జన్యాన్ని సులువుగా ఎదిరించగలదు. మరి మగవాడంటే అంత బెదురెందుకు? అది నిజమైన భయమో, వట్టి నటనో అర్థంకాక- స్త్రీ బెదిరే కొలదీ పురుషుడు విజృంభిస్తాడు. మగవాళ్ళ అఘాయిత్యాలకు తొంభైశాతం కారణం ఆడవాళ్ళ బెదురే.

ఒక స్త్రీ తాను పురుషుడి కంటే బలంలోనూ, తెలివి తేటలలో తక్కువ అని అనుకున్నంతకాలం ఆమె వెనుకంజలో వుంటుంది. మగాడు పెత్తనం చెలాయిస్తూనే వుంటాడు. ఆమెను ప్రతి విషయంలో వెనుకబడేలా

చేస్తుంది అని రచయిత స్త్రీ జాతిని ఇకనైనా మేల్కొని పురుషులకు అన్నింటిలోను తాము తక్కువ కాదు అని స్త్రీ అంటే అబల కాదు సబల అని నిరూపించాలని స్త్రీలను చైతన్యవంతుల్ని చేశారు. దొరబాబు మాటలకు ప్రగతి ఈ విధంగా అంటుంది

ప్రగతి : నీ మాటలలో నిజం లేకపోలేదు బావా; పెళ్ళికి తప్పతాము మరెందుకు పనికిరామని ఆడవాళ్ళను కొంటారు. వాళ్ళను అలాంటి సరుకుగా తయారు చేసింది మగవాళ్ళేగా? ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతుందనుకో. పూర్తిగా మారే వరకైనా జాగ్రత్త అవసరంగా?

ఇప్పుడిప్పుడే స్త్రీలలో చైతన్యం కలుగుతుంది. అన్ని రంగాలలోను పురుషులతో సమానంగా వున్నారు.కాని మా జాగ్రత్తలో మేము వుండాలి కదా అని రచయిత స్త్రీలను ధైర్యంతో పాటు జాగ్రత్తగా కూడా వుండాలని చెప్పారు. దొరబాబు తను వివాహితుడ్ని నన్ను నమ్మోచ్చు అని ప్రగతితో అన్నప్పుడు అందుకు ఆమె ఇలా అంటుంది.

ప్రగతి : పెళ్ళైన వాళ్లే ఎక్కువ ప్రమాదాకరం బావా; ఇంద్రుడు, రావణుడు, సైంధవుడు, కీచకుడు, వగైరా ప్రసిద్ధ దుష్టులంతా పెళ్ళైనవాళ్ళే. బేచలర్‌ని యాభైశాతం నమ్మవచ్చు. వివాహితుణ్ని నూరుశాతం నమ్మగూడదు. అని చెబుతుంది.

ఇక్కడ రచయిత స్రీలను జాగృతం చేస్తూ, పురుషులను ఎవ్వరిని నమ్మవద్దు అని అందులో పెళ్ళై వారి అసలు నమ్మకూడదు అని పురాణాలలో రాక్షసులు అందరూ వివాహితులే అయినా పరస్త్రీలను మోహించిన వాళ్ళే అలాంటి చరిత్ర మనకు వుంది. కాబట్టి స్త్రీలు ఎవ్వరిని నమ్మకూడదు అని తెలియజేశారు.

నేటి కాలంలోని స్త్రీలకు ప్రగతి పాత్ర సందేశం:

నేటి కాలంలో స్త్రీలు పురుషులతో పాటు అన్ని రంగాలలో సమానంగా ఉన్నారు. స్త్రీలు రంగ ప్రవేశం చేయని చోటు ఏదీలేదు అంటే అతిశయోక్తి చెందనవసరం లేదు. ఇంకా చెప్పాలంటే ప్రస్తుతం పురుషుల అక్షరాస్యత కంటే స్త్రీల అక్షరాస్యత ఎక్కువ ఉంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సంపాదించుకున్నప్పటికి నేడు స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలు కూడా ఎక్కువే అని చెప్పవచ్చు. పురుషుడి శారీరక బలానికి స్త్రీ లొంగి పోకూడదు. ఆమె భయమే పురుషుడిని విజృంభించేలా చేస్తుందని, కాబట్టి స్త్రీలు ఎల్లప్పుడు ధైర్యసాహసాలను కలిగివుండాలని మరియు అన్ని విద్యలను నేర్చుకోవాలని బోయిభీమన్నగారు ప్రగతి పాత్ర ద్వారా స్త్రీలను చైతన్యవంతుల్ని చేశారు. లేదంటే మరల స్త్రీలు ఇంటికే పరిమితమయ్యే రోజులు పునరావృతం కావచ్చు.

కాబట్టి నేటి సమాజంలో ప్రతి స్త్రీ కూడా ప్రగతి వలె తనని తాను రక్షించుకోవాలి, తన పై జరిగే అన్యాయాలను ప్రతిఘటించాలి. అప్పుడే స్త్రీలు స్వతంత్రంగా జీవించగలుగుతారు అని ప్రతి స్త్రీ కూడా ప్రగతి కావాలని తెలియజేశారు.

ముగింపు :

స్త్రీకి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కలిగినప్పుడు తాను అభివృద్ధి పథంలో పయనించగలుగుతుంది. కాబట్టి స్త్రీలు పురుషుడి కంటే తాను తక్కువ అని అనుకున్నంత కాలం ఆమెలో మార్పు సాధ్యం కాదు.ముందుగా స్త్రీల ఆలోచన విధానంలో మార్పు కలగాలి. భయం లేకుండా అన్నింటిలోను ముందడుగు వేయాలి. అట్టి శక్తి ప్రతి స్త్రీకి ఉండాలి అని బోయి భీమన్న గారు ప్రగతి నాటకం ద్వారా నేటి సమాజంలోని స్త్రీలను చైతన్యవంతుల్ని చేశారు. నేటి కాలంలో స్త్రీలకు, ప్రగతి పాత్ర స్ఫూరిదాయకమైనది అని చెప్పవచ్చును.

ఉపయుక్త గ్రంథాలు : 1. ప్రగతి నాటకం - బోయి భీమన్న 2. బోయి భీమన్న - బి. విజయభారతి
3. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన - డా. తక్కళ్ళ బాలరాజు

సమరస భావవికాసమే బోయి భీమన్న స్వప్నం

– డా॥. పాండురంగం కాళియప్ప , అతిథి ఉపన్యాకుడు, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

సమాజానికి, సాహిత్యానికి విడదీయరాని అనుబంధం ఉంటుంది. సాహిత్యం నిత్యం సమాజాన్ని చైతన్యవంతం చేసే ఒక మహత్తరమైన ఆయుధం. అటువంటి పరికరాన్ని ఉపయోగించి కవులు, రచయితలు తమ కలం ద్వారా సమసమాజ నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అలా తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆ కోవలో ఎందరో కవులు, రచయితలు ఉన్నారు. అందులో ఒకరు ఇరవయ్యవ శతాబ్దపు రుషిగా సాహితీలోకం గౌరవించిన వ్యక్తి డా.బోయి భీమన్న. బోయి భీమన్న, సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత. తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకా, మామిడికుదురు ఆయన స్వస్థలం. తండ్రి బోయి పల్లయ్య, తల్లి నాగమ్మ. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ, సన్మానాలందుకున్న కవి, బోయి భీమన్న. కులభేదాలు రూపుమాపి ఒకే కులం గల భారత జాతిని తయారు చేసి రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వం సాధించడం వీరి ఆశయం. ఆ ఆశయానికి అనుగుణంగా వారి కలం నుండి జాలువారిన రచనల్లో సమరసభావమే అడుగడుగునా తారసపడుతుంది. ఈ కోణంలోనే వారి సాహిత్యంలోని సమరస భావవికాసమే బోయిభీమన్న ఆశయాన్ని గురించి చర్చించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

ఆధునిక సాహిత్యం – విశ్వకవి బోయిభీమన్న

ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని, స్థాయినీ సంపాదించుకున్న మహాకవి, కళా ప్రపూర్ణుడు, పద్మభూషణ్ డా. బోయి భీమన్న.

సాహిత్యంలో నూతన సృష్టి గావించడమే భీమన్న ప్రధానోద్ధేశం. రాయడం ఆయనకొక సరదా. అందుకే నిర్విరామంగా రాస్తూనే వున్నారు. ఆయన ప్రతీ రచన లోనూ సహజత్వాన్ని, నూతనత్వాన్ని సాధించారు. తన కావ్యాలకు తానే వ్యాఖ్యాల రూపంలో అద్భుతమ్మెన పీఠికలు రాయడం ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక నూతన ప్రక్రియను ప్రవేశ పెట్టారు. ఆయన రచనలు విశ్వజనీనమైన దృక్పథాన్ని కలిగిస్తూ పిడిబాకుల్కె సూటిగా హృదయాన్ని తాకుతాయి. అందుకే భీమన్న పేరు విశ్వకవుల జాబితాలోనే చేర్చవచ్చు. విశ్వకవులు ప్రకృతితో తాదాత్మ్యం చెంది రచనలు చేస్తారు. ఉదా॥ 'ఆకులో ఆకునై, పూవులో పూవునై' అని కృష్ణశాస్త్రి అంటే భీమన్న 'గడ్డి పూవ్వుగానైనా / కలువ పువ్వుగానైనా / నీ యడుగుల దరినైనా / నీ యెడ బాటుననైనా' (పైరుపాట - భీమన్న) అని సాంఘిక సమస్యలను తెలియజేస్తాడు.

మానవత్వం యొక్క సమగ్రత్వానికి తాను ప్రయత్నిస్తూ, సమాజం కూడా అదే స్థాయిలో ఎదగాలని కవి ఆశపడుతూ ఉంటాడు. అలా సామాన్యుల జీవితా ల్లోకి తొంగి చూసి రాస్తారేమో ఆర్ద్రత కూడా మనసును పట్టి లాగుతుంది. భీమన్న భావకుడే కాక కొన్ని సిద్ధాం తాలు ప్రతిపాదించిన తత్వవేత్త. విమర్శకుడు, వ్యాఖ్యాత, పరిణితి చెందిన రాజకీయ వేత్తగా కూడా దర్శనమిస్తారు. ఆయన తన రచనా వైవిద్యం, ఆలోచనామృతం ద్వారా ఎందరో కవులకు మార్గదర్శకుడయ్యారు. అందుకే తెలుగు సాహిత్య కవులలో ఆదికవి బోయి భీమన్న అనడంలో అతిశయోక్తి లేదు.

బోయిభీమన్న సాహిత్యం – మానవీయత

సమాజం యొక్క ఔన్నత్యం మానవ వికాసంతోనే ఉంటుందని, అలా తనను తాను వికసింపచేసుకున్న

మానవతామూర్తి భీమన్న. అందుకే ఆయన కవిత్వంలో మానవీయకోణాలు దర్శనమిస్తూ ఉంటాయి. వస్తువు ఏదైనా మానవీయ కోణాన్ని చూపించడం భీమన్న రచనల్లో కానవచ్చే ప్రత్యేకత.

మనిషిగా ఎదుగుతూ, అందరినీ మనుషులుగా ఎదగమని ఉద్బోధిస్తూ, సమాజంలో కానవచ్చే అమానుష సంఘటనలకు చలించిపోతూ, మానవత్వం కోసం అక్షరాలతో అన్వేషణ సాగించిన మహాద్రష్ట బోయి భీమన్న. సమాజంలోని అసమానతలను గుర్తించిన భీమన్న మానవ సంబంధాల మెరుగుకై ఆరాటపడ్డాడు. మానవత్వాన్ని ఉద్దీపనం చేయడంకోసం ముందుకు అడుగులు వేశారు.

'మేడలు మిద్దెలు వున్నా / మెత్తని పానుపులున్నా / హృదయం లేకున్నపుడు / వృధయే బ్రతుకంత' (పైరుపాట - భీమన్న) అని వ్యక్తి జీవిత సత్యాల్ని సూక్ష్మంగా తెలియజేశాడు. అలా తోటివారి హృదయాల్ని మేలుకొలిపి, వారిలో ఆత్మగౌరవ ఆకాంక్షను రగిలించిన పద్మ భూషణుడు బోయి భీమన్నకవి.

సమరస భావవికాసమే బోయిభీమన్న స్వప్నం

జీవితాన్ని సాహిత్యంతోను, సాహిత్యాన్ని జీవితంతోను మిళితం చేసుకొని ప్రగతివైపు సాగిన కవి భీమన్న. 'వ్యక్తుల వికాసమే జాతి. జాతుల వికాసమే వసుధ, వసుధైక సామ్రాజ్యమే మానవలోక పరిపూర్ణ ఫలం' అని సామాజిక వాస్తవికతకు కల్పనా జగత్తును మేళ వించటంతో ఆయన రచనలన్నింటా సమరస మాధుర్య గుణమే కనిపిస్తుంది. చీకటి లోతుల్లోకి పోయి కొత్త వెలుగును తెచ్చుకునే గుణం ఆయనలోనూ, ఆయన రచనలోనూ ఉంది.

మానవులందరు ఒకే జాతి అనేది ఆయన సిద్ధాంతం. ఉప జాతులు పరిస్థితులను బట్టి ఏర్పడతాయి. ఆ జాతుల మధ్య పోట్లాటలు స్వార్థపూరితాలే. 'పూర్వం కులాలున్నాయి. కులతత్వం లేదు.... ఇప్పుడు కులాలు లేవు, కులతత్వం ఉంది. జాతి జీవశక్తిని పీల్చేస్తూ...' అంటున్న మాటలను గమనిస్తే సమానత్వపు మార్పుకు గల ప్రయాణపు దారిని తెలియజేస్తున్నట్లు అనిపిస్తుంది.

చిన్ననాడే భీమన్న అమానుష భావాలతోకూడిన సామాజికవర్గ దోపిడీని అతి దగ్గర నుంచి చూశారు. కొన్నిసార్లు ఆ దోపిడీకి గురై, అణచివేతలను కూడా ఎదుర్కొన్నారు. పేదరికంతో పాటు, అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటినుండి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతను వీటిని నిరసించాడు. 'కీర్తి, ప్రతిభ అనేవి కొన్ని కులాల వారికే పుట్టుకతో వస్తాయనే ఆలోచనలను తుత్తునియలు చేసి సాధికారికమైన వ్యాఖ్యానాత్మకమైన రచనలతో కులభావనకు అతీతంగా ఎదిగారు' అని అంటారు విజయభారతి. (భారతీయ సాహిత్య నిర్మాతలు : బోయిభీమన్న - బి. విజయభారతి) అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేసి సమరస భావ వికాసమే నా స్వప్నం అని ఎలుగెత్తి చాటిన మహాకవి బోయి భీమన్న.

అంబేద్కర్, భీమన్న ఇరువురూ చదువుకోవటంవల్లనే సమాజానికి ఆదర్శం కాగలిగారు. అందుకేనేమో పాలేర్లు, రైతుకూలీలు తమబిడ్డలను చదివించాలని, తద్వారా వారి అభివృద్ధికి బాటలు వేయాలని 'పాలేరు' నాటకంలో ఉద్బోధించారు బోయి భీమన్న. అందులో ఒక పద్యం ఇలా ఉంది.

గోచిపెట్టుట నేర్చుకొనగానే బిడ్డకు చేతికి కర్రిచ్చు రైతులార!
నడవ నేర్చిన తోనె బుడతను గొంపోయి
పాలేరు దనముంచు మాలలార!
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులార!
వంట యిల్లే ప్రపంచమ్ముగా చేసి
తనయల మెడకోయు తల్లులార!
జాతి శక్తివిహీనమై చచ్చుచుండ
కనులను మూసి కొంటిరే గాఢనిద్ర
శక్తికంతకు మూలము చదువుకాన

చదువ బంపుడు మీ తనూజాళినింక

- (పాలేరు - బోయిభీమన్న)

'జనం వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసేవాడే కవి' అన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. అందుకే సమాజానికి మంచి విషయాన్ని పదే పదే ఉద్బోధించాలని అయన చెప్పేవారు.

"ప్రతిరోజూ సుప్రభాతం పాడితేనేకాని
దేవుడికే మెలకువరాని ఈ దేశంలో
ఎంతటి ప్రసిద్ధ సత్యం కానీ ఎవరో
అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే ఉండాలి మనిషికి"

అంటారు 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథంలో.

కులాంతర వివాహాలతో కుల పంకిలాన్ని కడిగెయ్యొచ్చు :

అంబేద్కర్, భీమన్నలిద్దరూ యాదృచ్ఛికంగా కులాంతర వివాహమే చేసుకున్నారు. తాము చెప్పిన వాటిని జీవితాంతం ఆచరించి చూపి మహానుభావులయ్యారు. కవి ఏ కాలంలో జీవించాడో, ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలన్నీ అతడి రచనల్లో ప్రతిఫలించాలని చెప్పిన బోయి భీమన్న కవిత్వం తెలుగు సంస్కృతికి అద్దంపడుతుంది. సాహిత్యంలో భీమన్న సృష్టించిన ఒరవడి అద్వితీయం, అజరామరం.

భీమన్న వ్రాసిన 'పాలేరు' నాటకంలో వెంకన్న, వనబాల ప్రేమకథలోనూ, 1959లో వ్రాసిన 'రాగవాసిష్ఠం' నాటకంలో గల అరుంధతి, వశిష్ఠుల ప్రణయ గాథలోనూ, మరికొన్ని రచనల్లోనూ కులాంతర వివాహాల పేరుతో కులనిర్మూలన అవకాశాల్ని చర్చించాడు. సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు.

పాలేరుగా పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవమర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సివస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుబేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి 'ఉపకారి' మాస్టారు సహాయంతో చదువుకుని, వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డుకుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సహించేవాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేడ్కర్ ఆశయాన్ని దీని ద్వారా ప్రేరేపించాడు భీమన్న. అంతేకాదు చదువు యొక్క ప్రాముఖ్యతను, చదువు వల్ల లభించే గౌరవాన్ని, తద్వారా ఒనగూరే ప్రయోజనాన్ని గూర్చి స్పష్టంగా వివరించారు భీమన్న కవి.

ద్వేషంతో కాదు ప్రేమతోనే సమానతను సాధించగలం :

"ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం ఒక్కటే అదే భారతజాతి ఏకత్వం". సమాజంలో చెడ్డవాళ్ళే కాదు, అనేకులు మంచివారు కూడా ఉంటారని తెలియజేయటం భీమన్న సాహిత్యంలోని విశిష్ట గుణం. పాలేరు నాటకంలో వనబాల, అగ్రవర్ణానికి చెందిన కుటుంబంలో నుండి వచ్చినదైనప్పటికీ, అలాంటి వాళ్ళలోనూ సంకుచిత మనస్తత్వం, కులతత్వం లేని వాళ్ళుంటారనే విషయాన్ని తెలియజేశారు. హరిజనులుగా సమాజంచే పిలువబడ్డవారి అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి, సమకాలీన సమాజంలో గౌరవానికి అర్హులయ్యేటట్లుగా చేయటం భీమన్న గారి సాహిత్య లక్ష్యం. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలలోనూ, 'జన్మాంతర వైరం', 'అంబేడ్కర్ సుప్రభాతం', 'అంబేడ్కరిజం', 'పంచమ స్వరం' మొదలైన కావ్యాలలోనూ ఈ తపన స్పష్టంగా గోచరిస్తుంది.

భీమన్న రచనలపై అనేకమంది పరిశోధనలు చేశారు. శ్రీమతి హైమవతి గారు చక్కని కథనాత్మక శైలిలో వ్రాసిన పరిశోధనాత్మక గ్రంథం "పాలేరు నుండి పద్మశ్రీ వరకు

బోయిభీమన్న''. ఇది వీరి సాహిత్య దృక్పథాన్ని తెలిపే చుక్కానిలాంటిది. దానిలోని సూచనల్ని గమనిస్తే, ఆయన వ్రాసిన రచనల్లో పరిశోధకులకు, విమర్శకులకు తమదైన విశ్లేషణకు ప్రేరణ దొరుకుతుంది.

భారతదేశంలోని 'వైవిధ్యంలో ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ వైవిధ్యం కనిపిస్తుందనీ, ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన 'జాతీయవాది' అనీ ఆ గ్రంథం ప్రతిపాదిస్తుంది. భారత జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాలి. అంబేడ్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ అదే! తన జీవితాంతం ఆయన జాతీయవాదిగానే ఉన్నాడు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష ఆయన రచనలలో, మాటలలో, వ్యవహారంలో ప్రతిఫలిస్తుంది.

''నాలుగు వర్ణాలన్నది హిందూయిజం - రెండు వర్గాలన్నది కమ్యూనిజం - మూడు వర్గాలంటున్నాను నేను - నాది పులీ నక్కా గొర్రెయిజం - వేదయుగం మనిషికీ నేటి మనిషికీ స్వభావంలో తేడా ఏముంది - నాడెంతో నేడూ అంతే - అదే పులి అదే నక్కా అదే గొర్రెలూ'' - అని భారతదేశ సాంస్కృతిక, వైదిక, పౌరాణిక, తాత్విక వారసత్వం అందించిన వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మ వ్యాధుడు మొదలైన వాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు వ్రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

వర్గపోరాటాలు జరుగుతున్న తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించారు.

మతం పట్ల భీమన్న దృక్పథం :

నేను హిందువుని, ఈ జాతీ, దేశమూ నావి. మతం మారాల్సిన అవసరమేముంది? ఏ మతమైన మనిషి ఉన్నతిని కోరుకుంటుంది. కాని నేడు జరుగుతున్న మతమార్పిడులపై కూడా ఆయన చాలా దృఢంగా, బలంగా స్పందించారు. 1980లో వెలువడిన 'జన్మాంతర వైరం' గ్రంథంలో వారు చర్చించిన ఈ విషయాలు గమనిస్తే...

''నేను హిందువుగా పుట్టాను, మతం మార్చవలసిన అవసరంలేదు. పెనంలో నుండి పొయ్యిలోకి దూకటం దేనికి? ఈ హిందూమత మూలపురుషులు, ఈ భారత సంస్కృతి మూలబుషులు నావాళ్ళు, నా హరిజనులు అని నేను విశ్వసిస్తున్నప్పుడు, నా వారసత్వపు హక్కుల్ని ఏదో విధంగా తిరిగి సంపాదిస్తానే గానీ పారిపోవడమనేది ఎందుకుంటుంది? మెజారిటీ జనం వాణ్ణి మైనారిటీగా ఎందుకు మారతాను?

కాగా, నేను హిందువుణ్ణి. ఈ జాతీ, ఈ దేశమూ నావి. పోనీ నేనొక్కడ్డీ మరో మతంలోకి పారిపోతాననుకోండి. నాతో కొంతమందిని తీసుకుపోతాననుకోండి. ఎంత మందిని తీసుకు పోగలను? లక్షా, రెండులక్షలా? వాళ్లయినా, నామీద గౌరవంతో వస్తారు. అవతలి మతంలో విశ్వాసంతో కాదు గదా?

ఔరంగజేబులాంటి ముస్లిం నిరంకుశ చక్రవర్తులు, బ్రిటిషర్లలాంటి సర్వశక్తిమంతులైన క్రైస్తవ పాలకులు - తమ అధీనంలోని చతురుపాయాలనూ ప్రయోగించి కూడా ఎంతమంది మావారిని (మాలలను, మాదిగలను) తమతమ మతాలలోకి ఆకర్షించగలిగారు?

గొంతెమ్మ, బతకమ్మ, మైసమ్మ పండుగలకు, బోనాలకు, గ్రామదేవతలకు, పసుపు కుంకుమతో దైవత్వం కల్పించబడ్డ రాళ్లకూ, చెట్లకూ, గదులలోని గోడలకూ ఆత్మార్పణ చేసుకునే ఈ నాకులం పదిహేనుకోట్ల మంది మాదిగలను నాతో తీసుకుపోగలనా?

వాళ్లతోనే ఉంటూ వాళ్ల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, ఒక్కొక్క అడుగే వాళ్లను ముందుకు నడిపించాలి. తరతరాల దాన్యంతో, దారిద్ర్యంతో నగం చచ్చిపోయి వున్నవాళ్లను మానసికంగా ఓదార్చాలి.

బ్రెయిన్వాష్ చేయబడిన వారి మెదళ్లకు తిరిగి స్వాస్థ్యం కలిగించాలి. పూర్వోన్నత్యాన్ని చూపి వాళ్లను పునశ్చేతనుల్ని చేయాలి. ఇప్పుడిదంతా నాకు భౌతికంగా సాధ్యం కాకపోవచ్చు. కర్తవ్యబోధ చేస్తే ఏ ఒక్క యువకుడైనా కంకణధారి కావచ్చు. ఏ కులానికాకులం కులసంఘాలు పెట్టుకుంటూ వైరి వర్గాలుగా విడిపోతూ సెగ్రగేట్ ఐపోతున్న ఈనాటి రాజకీయ పదవీ రాక్షస యుగంలో కులాంతరీకరణను బోధిస్తున్నాను ఎందుకు? హరిజన యువకులేకాదు, ఏ కులం యువకులైనా సరే వివేకంతో, యథార్థాన్ని గుర్తించి భారత సమాజ పునర్నిర్మాణం కోసం ముందుకు వస్తారన్న ఆశతో.." అని సామాన్యుల జీవితాల్లోకి తొంగి చూసి రాస్తారేమో అర్ధత కూడా మనసును పట్టి లాగుతుంది. భీమన్న భావకుడే కాక కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించిన తత్వవేత్త.

భీమన్న నిజమైన సమరసతావాది అని 'జన్మాంతర వైరం' కావ్యం చివరిలో గుడిగంటలు ద్వారా భీమన్న ధ్వనింపజేసిన సందేశమిలా ఉంది.

"లే దస్పృశ్యత, లేదు లేమి, కులముల్ లేవు,
ఆర్షలోకమ్ము తత్
భేదక్లేశము లెల్లతీరి, ధ్వజమెత్తెన్ లోక శ్రేయస్సుకై
వేదోక్తమ్మిది సర్వజాతి సమతావిష్కార తత్త్వమ్ము బ్రా
హ్మీదేవత్వము నొంది సాగుడొకటై, మేధావులై
ఎల్లరున్"
అనుచు వినిపించె మ్రోల శివాలయమున
ఠంగు మనుచున్న రుద్ధ ఘంటా స్వరాలు
సర్వమానవ సమ సమాజవ్యవస్థ
నవని కిడ బైలుదేరు డన్నట్టి పిలుపు.

పై రచనలో భీమన్న కులం లేదన్నారని పేర్కొంటూ వివిధ సాహితీ నదన్నుల్లో భీమన్న సాహిత్యాన్ని విమర్శిస్తున్నవారున్నారు.ఆయన భారతదేశంలో కుల నిర్మూలనను మనసా వాచా ఆకాంక్షించారన్నది సుస్పష్టం. కొందరు తమ సంకుచిత, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కుల వివక్ష పేరిట బాధిత ప్రజలను రెచ్చగొట్టడాన్ని, కుల వైషమ్యాలను మరింతగా రెచ్చగొట్టటాన్ని, కులం పేరిట కొట్టుకు చావటాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. వర్ణాంతర వివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. బాధిత వర్గాలు చదువుకోవలసిన అవసరాన్ని పదే పదే నొక్కి వక్కాణించారు. కులాల మధ్య వైరిభావాన్ని కాక, సోదర భావాన్ని సదా ఆకాంక్షించారు. తన వారు, వేరే వారని కాక సమాజం మొత్తాన్నీ సమదృష్టితో దర్శించారు. సమాజంలో సమరస భావం వికసించాలని సదా కాంక్షించారు.

ముగింపు

మానవులందరూ ప్రేమాభిమానాలతోను, ఆనందంతో సమానులై జీవించే మార్గాన్ని కల్గించే రససృష్టిగా రసాద్వైత సృష్టి చేసిన కళాస్రష్ట బోయిభీమన్న. "పెళ్ళికి ముందు ద్వైతం. పెళ్ళయిన కొత్తలో అద్వైతం. పిల్లలు పుట్టినాక విశిష్టాద్వైతం. ఈ అన్నిటిగండా ప్రవహించే ఏకాత్మతే మన రసాద్వైతం" అంటారు.

బానిసతనమును - బాపుమురా / భారతభూమికి - భాగ్యము తేరా
సకల దేశముల - సర్వమానవుల / సామ్యము - సాధింపుమురా ?

అంటూ ప్రభోధాత్మక గేయాన్ని పాడుతారు. సర్వ మానవులు సామరస్య భావంతో కలిసి మెలిసి జీవించాలాంరు భీమన్న. ఆశలో బ్రతికే పాలేరు సైతం ఉన్నత శిఖరాన్ని చేరుకోవచ్చని, వెనుకడుగు వేయకుండా, ముందుకు సాగాలని, అనుకున్నది సాధించాలని పాలేరుతో కొండత ఆశని నింపుతారు భీమన్న.

వదరా ముందుకు వదరా వీరా / విశ్వము సువిశాలమురా
వడివడి ముందుకు పోయిన వానినె / విజయశ్రీ వరియించునురా

ఎవరైతే త్వరత్వరగా ముందుకు సాగిపోతారో వారినే విజయలక్ష్మి వరిస్తుందని అందుకే వీరుడవై వేగంగా

ముందుకు పదమని ప్రబోధిస్తారు భీమన్న. సమాజంలోని సమస్యలను అవగాహన చేసుకొని, సమసమాజ లక్ష్యం దిశగా తత్త్వాన్వేషణ చేశారు.

కవిగా సమాజ ఔన్నత్యాన్ని స్వప్నించిన మహా స్వాప్నికుడు భీమన్న. సమాజశ్రేయస్సును కాంక్షిస్తూ మానవతను అభిలషిస్తూ ఆయన సృష్టించిన సాహిత్యం అజరామరం. అందుకే సమసమాజ స్థాపనలో అవి నిత్యం ప్రజలను ఉత్తేజ పరుస్తూనే ఉంటాయి. ''బ్రతుకు కష్టమూ కాదు, సుఖమూ కాదు అది ఒక ధర్మం. దానిని జయప్రదంగా నిర్వహించుకోవటానికి అవకాశం ఉండాలి. అదే సర్వోదయం'' అని సమరస భావవికాసమే తన స్వప్నం అంటారు భీమన్న.

ఆధార గ్రంథాలు

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయిభీమన్న - బోయి హైమవతి
2. భారతీయ సాహిత్య నిర్మాతలు : బోయిభీమన్న - బి. విజయభారతి
3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి-1 - ఆచార్య అనుమాండ్ల భూమయ్య (సం.)
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి-2 - ఆచార్య అనుమాండ్ల భూమయ్య (సం.)
5. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన - డా॥ తక్కళ్ళ బాలరాజు
6. భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక - గనుమల జ్ఞానేశ్వర్ (సం.)

డా. బోయి భీమన్న - అంబేడ్కర మతం - సమాలోచన

- డా॥. ఎల్. కస్తూరి, తెలుగు అధ్యాపకులు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

డా॥ బోయిభీమన్న 1911 సెప్టంబరు 19వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. తల్లి నాగమ్మ తండ్రి పుల్లయ్య. 1935లో బి.ఏ, 1937లో బి.ఇడి పూర్తి చేసి అధ్యాపక వృత్తిని చేపట్టారు.

రచనలు :

గుడిసెలు కాలిపోతున్నాయి, భీమన్న ఉగాదులు, మోక్షం నా జన్మహక్కు, భీమన్న కావ్యకుసుమాలు, కూలీశతకం, దీపసభ మొదలైనవి కవితలు. ఏకపద్యోపాఖ్యానం, జన్మాంతరవైరం, ధర్మంకోసం పోరాటం, అంబేడ్కరిజం, అంబేడ్కరమతం, జానపదుని జాబులు మొదలైనవి వచనరచనలు. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, రాగవాసిష్ఠం, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు, బాలయోగివంటి నాటకాలు రచించారు.

పురస్కారాలు :

కళాప్రపూర్ణ, పద్మశ్రీ, పద్మభూషన్, నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 'గుడిసెలు కాలిపోతున్నాయి' కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను పొందారు.

బోయిభీమన్న పేదరికంతోపాటు, అంటరానితనం వంటి దురాచారాలను చిన్నప్పటి నుంచి, అనుభవించడంవల్ల వీటిని నిరసించారు. అంబేడ్కర్ రాసిన 'కులనిర్మూలన' గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు.

బోయిభీమన్న కేవలం సామితీవేత్తేకాదు. దళితులు అభ్యున్నతికి రచనలు చేసిన తొలితరం దళిత రచయితల్లో అగ్రగామి. తొలితరం దళిత పాత్రికేయులు కూడా.

డా. బోయిభీమన్న 'అంబేడ్కర మతం' అనే వచన గ్రంథాన్ని 1993లో రచించారు.

మతం అంటే 'అభిప్రాయం' అని అర్థం. రెలిజియన్ (Religion) అనే ఆంగ్లపదానికి పర్యాయపదం మతం. మతం అంటే వ్యక్తిగత అభిప్రాయం అనే అర్థం మారిపోయి ఒక ప్రాంత ప్రజలు సామూహిక అభిప్రాయమనే అర్థం ప్రాచుర్యం పొందింది. మతం రెలిజియన్‌గా మారినప్పటి నుంచి మానవజాతి పురోభివృద్ధికి ఆటంకంగా మారి ప్రజల మధ్య పోటీలు, పోరాటాలు పెరిగి విశ్వమానవశాంతికి భంగం కలిగిస్తూ, రక్తపాతానికి, జననష్టానికి కారణమైంది.

రాక్షసంగా మారిన మతాన్ని విద్యావంతులు, మేధావులు, కవులు, తాత్వాకులు, ఊహలను నమ్మని హేతువాదులు ధిక్కరించారు.

విశ్వమానవ మనీషి కార్లమార్క్స్ 'మతం నల్లమందు' అని నిరసిస్తే, బోయిభీమన్న దేవుడనే భావన, మరణానంతర జీవితం, స్వర్గనరకాలు, మోక్షప్రాప్తి వంటివన్నీ కేవలం ఊహలే తప్ప, రుజువుచేయడానికి ఆధారాలు లేవు అని నిరసించారు.

భారతరాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ 'హిందూజాతి ఏకజాతిగా ఏర్పడాలంటే కులవ్యవస్థను నిర్మూలించక తప్పదని నిష్కర్షగా' చెప్పారు. ఈయన భావాల్ని పునికి పుచ్చుకొన్న బోయిభీమన్న కుల, మత వ్యవస్థల్ని నిర్మూలించాలని తన రచనలలో పేర్కొన్నారు.

మతం కేవలం సర్వమానవ సమసమాజ సంక్షేమాన్ని కోరే వివేకవంతుల సామూహిక అభిమతమని బోయిభీమన్న అంబేడ్కర్ మతాన్ని గురించి అభిప్రాయాలను ఈ పుస్తకంలో వివరించారు.

ఇందులో మతమూ-దేవుడు అంశం ప్రధానమైంది.

మతమూ - దేవుడు :

విభిన్న మనన్తత్వాలు, ఊహావైవిధ్యాలు గల మేధావుల దృష్టిలో మతం నాలుగు విధాలుగా ఉండవచ్చు అని బోయిభీమన్న ఈవిధంగా తెల్పారు.

1. మరనానంతర జీవితానికి, దేవుడికి, మోక్షానికి
2. ఆచారాలకూ సంప్రదాయాలకు, విధి నిషేదలకూ
3. నీతినియమాలకు, పాపపుణ్యాలకూ, స్వర్గ నరకాలకు
4. సమష్టి రక్షణకు, పురోభివృద్ధికి, శ్రేయస్సు మొదలైన వాటికి ప్రాధాన్యతనిచ్చేమతం.

"దేవుడు ఒక డ్రగ్గు అనీ, మతాలు ఆడ్రగ్గును పలు పేర్లతో మార్కెటు చేసి పోటీలు పడుతున్న మాఫియా ముఠాలనీ, వాటిలో ఆచార నిబంధనలు దేనివిదానివేననీ, పరముఠాలపై గుత్తాధిపత్యం సాధించడమే వాటి ధ్యేయ మనీ నేను విమర్శించేది మొదటి మూడు రకాల మతాలను గురించి" (పు.4) అని బోయిభీమన్న విమర్శించారు.

మతాలు - నాడూ, నేడూ :

పూర్వకాలంలో ఆయా జాతుల అవసరాలకు, యోగక్షేమాలకు అనుగుణమైన వేర్వేరు సమాజాలు, మతాలు ఏర్పడ్డాయి. ప్రపంచంలో తామొక్కరమే మానవజాతి అనుకొంటూ తమకు అర్థం కాని అనేక సమస్యలకు పరిష్కారంగా తమ ఊహకందిన ఒక అతీత శక్తిని కల్పించుకొన్నారు. ఆశక్తినే దేవుడన్నారు.

కాలక్రమంగా జాతులు, మతాలు, ఆచార వ్యవహారాలు, దేవుళ్ళ మధ్య విభేదాలు, పోటీలు, పోరాటాలు జరిగాయి. దీంతో చాలా జాతులు నశించి పోయాయి. జనాభా పెరిగి భుజబలం, ఆయుధబలం, బుద్ధిబలం పెరిగి కొన్ని జాతులు బలహీన జాతుల్ని నాశనం చేశాయి. 'బ్రతకటం కోసం పోరాటం, గెల్చినవాడు బ్రతకటం' (పు.7) అనే సూక్తి నిజమైందన్నారు బోయి భీమన్న.

మానవ పరిణామక్రమంలో సంఘ సమైక్యశక్తి అవసరమై మతానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఇది శాశ్వతంగా ఉండాలంటే ఒకే దేవుడుండాలి. మానవుల మధ్య పోటీ, పోరాటాలలో గెలుపును సాధించడం కోసం మతం తప్పనిసరి అయ్యింది.

మతం తప్పనిసరి :

అంబేడ్కర్ మానవుడికి మతం తప్పనిసరి అనీ, జాతివిస్తరణ, ఆత్మరక్షణ, శాంతిభద్రతలు, సుఖశ్రేయస్సు కోసమే మతాలు వస్తాయనీ, ప్రతిమనిషీ ఏదోఒక మతాన్ని కలిగి ఉండం అన్ని విధాల శ్రేయస్కరమని తెల్పారు.

ప్రస్తుత ప్రపంచంలో హిందూ, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయమనే నాలుగు మతాలు ప్రధానంగా ఉన్నాయి. వాటిలో హిందూమతం ప్రాచీనమైంది. హిందూమతం వేదకాలంలో సోషలిస్టు సమాజంగా ఉండేది. యోధులతో కూడిన వీరసమాజం. సర్వజన సమానత్వంగల ఉమ్మడి సమాజం. ఈనాటి కుల, వర్ణ, వర్గ భేదాలు ఆనాడు లేవు. విజాతీయులనూ, విమతస్థులనూ తమలో చేర్చుకోవాలని ఋగ్వేద ఋషులు నినదించారు. ఆకాలంలో పౌరుషం, బలం కలిగిన జాతిగా భారతజాతి ఉండేది.

కాలక్రమంగా హిందూమతం పతనంతో జినదేవుడు జైనమతాన్ని స్థాపించి హిందూ మతాన్ని సంస్కరించాడు. బుద్ధుడు నైతిక విలువలతో కూడిన బౌద్ధమతాన్ని స్థాపించాడు. ఈ విధంగా కొత్తమతాలు పుట్టుకొచ్చాయి.

తాను పుట్టిన మతంలో లోపాలను సరిదిద్ది ఎవరైతే దానికి కొత్త చైతన్యాన్ని కల్గిస్తారో వారి పేరుతోనే ఆ కొత్త మతం పిలవబడుతుంది. కనుక అంబేడ్కర్ సంస్కరణ సిద్ధాంతాలు మానవ సమాజంలో ప్రాచుర్యాని పొంది నందువల్ల 'అంబేడ్కర మతం' ప్రసిద్ధిలోకి రావలసిన అవసరముందన్నారు (పు.11).

బౌద్ధమతం మహాయానం, హీనయాఅమని రెండుగా విడిపోయాయి. దీన్ని అంబేడ్కర్ సంస్కరించి కొత్త రూపాన్నిచ్చి 'నవయానం' అన్నారు. అంతకముందున్న యానాలలో ఇదొకటి. దీనికి ఎలాంటి ప్రత్యేకతలు లేకుండా నామమాత్రంగా ఉండిపోకూడదని దీన్ని 'అంబేడ్కరు మతం' (పు.12) అని పిలువమన్నారు.

హిందూమతం గురించి తెలియని వాళ్ళు, ఇష్టంలేని వాళ్ళు తమది 'అంబేడ్కర మతం' అని చెప్పుకోవడం అన్ని విధాల శ్రేయస్కరమంటారు బోయిభీమన్న.

మానవుడు ప్రధానంగా గల మతం :

'మానవుడు ప్రధానంగా గల మతమే సరైన మతం' అని బోయిభీమన్న అభిప్రాయం. సమాజంలో తెలివైన వాళ్ళకు, మేధావులకు, తత్వవేత్తలకు, కవులకు, కళాకారులకు ఏ మతమూ అక్కరలేదు. కానీ సామన్య ప్రజలకు మతం అవసరం.

'మానవ ప్రవర్తన ముఖ్యం కాని దేవుడి ప్రసక్తి ముఖ్యం కాదని బుద్ధుడు బోధించాడు. బుద్ధుడ్ని బుద్ధ బగవానుడ్ని చేసి దేవుడి స్థానంలో ప్రతిష్టించారు. ఇలాంటి మానవ మనన్తత్వాన్ని గుర్తించాకే ప్రతిమనిషికీ ఒకమతమంటూ ఉండడం అవసరమని అంబేడ్కర్ చెప్పియుంటాడని బోయి భీమన్న తెల్పారు.

విశ్వజనీనమైన ఒక మతాన్ని, ఒక వ్యవస్థను, నిర్ధిష్ట మైన సిద్ధాంతాలను నిర్మించాల్సిన అవసరముంది. దీనికి ప్రవక్త అంబేడ్కరుడొక్కడే నా ఎదుట ప్రకాశిస్తూ ఉన్నాడు (పు.15)

దళితుల సమస్య సాంఘికమైంది. దానికి పరిష్కారం అంబేడ్కరు సూచించిన ఎడ్యుకేర్, ఆర్గనైజ్ అనే సూత్రమే. దానినే అంబేడ్కరు మతం అంటున్నాను. దళితులకు కావలసింది సమైక్య పోరాట శక్తి. అది బలమైంది. ధైర్యసాహసాలతో కూడుకొన్నది. మతం మార్పులో లభించేది కాదు అన్న విషయాన్ని బోయి భీమన్న ఈ క్రింది పద్యం ద్వారా తెల్పారు.

బలం కలవాడు రాజు
బలహీనుడు బానిస,
బానిసగా బ్రతకలేవా
బలం సంపాదించుకో! (పు.15) అన్నారు.

బౌద్ధమతం వుంది కదా! :

అవర్లులు సవర్లులు హిందువుల అమానుష వైఖరి, అంటరానితనం, వెలి, ఇతర మతాలతో చేరిన దళితుల పట్ల చూపే గౌరవ మర్యాదలు, హిందూ మతంలోని దళితుల పట్ల గల చులకన భావనను, హిందువుల దుర్మార్గాన్ని నిరసిస్తూ, తాను హిందువుడిగా చావనని అంబేడ్కర్ ప్రతిజ్ఞ చేశారు. 1932లో బౌద్ధమతంలో చేరారు.

''అంబేడ్కర్ బ్రాహ్మణులకు వ్యతిరేకిని కాననీ, బ్రాహ్మణ మతానికి మాత్రమే వ్యతిరేకినన్నారు. హిందూ మతంలో బ్రాహ్మణుల కంటే దళితుల శాతం అధికమని తమ జన్మహక్కులన్నింటిని వదులుకొని పారిపోవడం సమంజసం కాదు. అధికంగా ఉన్న బ్రాహ్మణేతరులు తిరగబడితే బ్రాహ్మణులు ఏమి చెయ్యగలరు'' అని కాకినాడలో జరిగిన సభలో ప్రసంగించారు.

అంబేడ్కర్ దేవుడికోసమో! స్వర్గం కోసమో మతం మారలేదు. హిందూమతాన్ని, హిందూదేశాన్ని వినాశనం నుంచి తప్పించడం కోసమే బౌద్ధమతంలోకి మారారు.

అంబేడ్కరు బౌద్ధమతాన్ని యధాతధంగా స్వీకరించక తనకనుకూలమైన రూపానికి మలచుకొని మార్పులు చేర్పులు చేసుకొని అందులో చేరారు.

హిందూమత బాధితులైన దళితులు తమకు జరుగు తున్న అన్యాయాల పట్ల ద్వేషంతో తొందరపడి పరమతాల గాలాల ఎరలకు చిక్కిపోతారేమో అనే భయంతో వారిని కాపాడాలనే ఔదార్యంతో అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించి ఉండవచ్చు (పు.23) అని బోయిభీమన్న అభిప్రాయ పడ్డారు.

'అంటరాని కులాలకు చెందిన దళితుల విమోచనం కోసం తన సర్వస్వాన్ని దారబోసి పోరాడిన మహా పురుషుడ్ని అనుసరించడం దళితుల ధర్మమనీ, అంబేడ్కరు శరణం గచ్చామి అంటూ పురోగమించడం దళితుల కర్తవ్యమని' బోయిభీమన్న చాటి చెప్పారు.

కులం మార్పిడి చట్టం :

హిందూమతాన్ని సంస్కరించి దాన్నొక బలమైన

జాతిగా తీర్చిదిద్దాలంటే కులవ్యవస్థను రద్దుచెయ్యడ మొక్కటే మార్గమని అంబేడ్కరు విశ్వసించారు. అందుకే 'కుల నిర్మూలన' (Annihilation of Caste) అనే గ్రంథాన్ని రచించారు.

హిందువులుగా పుట్టి, మతాన్ని ఆధునీకరించాలని ప్రయత్నం చేసిన మహావీరుడు, బుద్ధుడు, గురునానక్, రాజారామ్ మోహన్‌రాయ్, దయానంద సరస్వతి వంటి వారు కులవ్యవస్థను నిర్మూలించడానికి ప్రయత్నించి విఫలమైనారు. దీనికి కారణం సరైన మార్గాల్ని ఎన్నుకోక పోవడం. 'మత మార్పిడిలాగే కులమార్పిడి కూడా సాధ్యమయ్యేలా చట్టం చెయ్యాలని రిజిస్ట్రారు ఆఫీసులో 5 లేదా 10 రూపాయలు ఫీజు చెల్లించి ఏ కులంవాడైనా, మరే కులంలోకైనా మారగలిగేలా చట్టం చెయ్యాలని బోయిభీమన్న సూచిస్తూ పత్రికల్లో ప్రకటించారు.

''మతం కంటే కులం గొప్పదా? తాను పుట్టిన మతాన్ని, దేవుణ్ణీ కూడా మార్చుకోగలుగుతున్న భక్తుడు కులాన్నీ ఎందుకు మార్చుకోలేకపోతున్నాడు? ఇష్టమైన వాడు తన కులాన్ని మార్చుకోవాలనుకొన్నప్పుడు అందు కోసం కులం మార్పిడిని ప్రభుత్వం చట్టబద్ధం ఎందుకు చేయటం లేదు?''(.25) అని ధిక్కరిస్తూ -

నేను ఆనాడే రంగు బట్టలు కట్టుకొని వీధినపడివుంటే, కులం మార్పిడి చట్టబద్ధం అయ్యేది. ప్రజాస్వామ్యంలో ఏదైనా సాధించాలంటే డంబాచారానికి మించిన ఆయుధం లేదు. నేను అలాంటి సాహసం చెయ్యలేక పోయానంటూ బోయి భీమన్న వాపోయారు.

భక్తితత్వం :

ప్రపంచంలో ఏ మతమైనా భక్తి ప్రధానమైంది. ప్రతి మతానికి ఒక దేవుడుంటాడు. క్రైస్తవం యహోవా, మహమ్మదీయులకు అల్లా, బౌద్ధ మతానికి దేవుడు లేడు. కాని దేవుడిస్థానంలో బుద్ధుడు, హిందూమతంలో అనేకమంది దేవుళ్ళున్నా మూలశక్తి పరమాత్మ. దేవుళ్ళ పట్ల గల సేవాభావమే భక్తి.

ప్రతి మతానికీ ఒక దేవుడు. ఆ దేవుడికి అందరూ శరణాగతులు. వేర్వేరు మతాల వాళ్ళు వేర్వేరు జాతులకూ, సంప్రదాయాలకూ, స్వప్రయోజనాలకూ చెందినవాళ్ళున్నప్పుడు ఆ మతాల మధ్య నిరంతర సంఘర్షణ తప్పితే ఆత్మీయత ఎలా వుంటుందని బోయి భీమన్న తన అనుమానాన్ని వ్యక్తపరిచారు.

కపులు, ఋషులు, మేధావులు భక్తితత్వం గురించి ఇలా అన్నారు. భక్తి అంటే ఏదో ఒక దేవుడి పట్ల ఉండేది కాదు. విశ్వాసముండాలి. సర్వశక్తిపై సంపూర్ణమైన విశ్వాసం భక్తి. స్వశక్తిని పెంచుకోవడానికి చేసే సాధనే పూజ అంటూ 'శ్రీరాముడు, బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు, హరిశ్చంద్రుడు' ఈ నలుగురూ ఏకాగ్రత కలవారు. అదే భక్తి, స్థితప్రజ్ఞ, కర్మయోగం. ఏ వ్యక్తికైనా తన జీవితాదర్శమే తనలో మనశ్శక్తి రూపంలో ఉన్న పరమాత్మ. దానిపై కేంద్రీకృతమయ్యే సంకల్పమే భక్తి.

"డా॥ అంబేద్కర్ లక్ష్యం, కృషి కూడా అలాంటిదే కదా! అందుకే ఆయన మార్గాన్ని ఆయన పేరు మీదనే "అంబేడ్కరు మతం" అని, అంబేడ్కరు శరణం గచ్ఛామి" అంటూ ఆయన కార్యప్రణాళికను అమలు చేద్దామని" (పు.28) బోయి భీమన్న పిలుపునిచ్చారు.

అంబేడ్కరు మత స్వరూపం :

అంబేడ్కరు జీవితాదర్శమైన దళిత జనోద్ధరణతో బుద్ధుడికిగానీ, బౌద్ధ మతానికి గానీ ప్రత్యేక సంబంధంలేదు. కనుక హిందువుగా పుట్టి బౌద్ధుడిగా మారారు. 55 సం॥ వరకు హిందూమతాన్ని సంస్కరించడానికి పోరాడుతూ ఒక గొప్ప ఆధ్యాత్మిక యోధుడిగా, సాంఘిక సమరాంగణ చక్రవర్తిగా జీవించారు.

అంబేడ్కరు దేశంలోని మతంతోనూ, ప్రభుత్వంతోనూ, కాంగ్రెసు పార్టీతోనూ, గాంధీజీతోనూ పోరాడి దళితుల్ని విజయపథంలో నడిపించారు. ఆయనకు కావలిసింది మతం కాదు. దేవుడు కాదు, స్వర్గం కాదు, మోక్షం కాదు.

దళిత జనోద్ధరణ కావాలి. అందరికీ సమానమైన సాంఘీక న్యాయం, పరిపాలనలో సమానవకాశం, రాజకీయాధికారంలో సమాన భాగం, గౌరవ జీవితం. అగ్ర, అంత్య భేదం లేకుండా సమాన సుఖశాంతులుండాలని ఆశించాడు.

అంబేడ్కరు తన జీవితాన్ని, ప్రతిభను దళిత జనోద్ధరణకు, సమానత్వం కోసం దారబోశాడు. కనుక ఆయన దళితులకు, పీడిత జనులకు, సమానత్వాన్ని కాంక్షించే సమస్త మానవులకూ ఆరాధ్యుడు. అర్చనీయుడు, ఆదర్శ పురుషుడు. అందుకే ఏదైనా ఒక మతం తప్పకపోతే, ఆమతాన్ని ఆయన పేరుతో 'అంబేడ్కరు మతం' అందామని బోయి భీమన్న పిలుపునిచ్చారు. ఈమతం దళిత జనోద్ధరణకూ, అసమానతల నిర్మూలనకూ, సర్వజన శ్రేయస్సుకు సంబంధించింది.

మత శపదం :

అంబేడ్కరు సుప్రభాతం, అంబేడ్కరిజం, పాటలలో అంబేడ్కరు వంటి వాటిని మనం అంబేడ్కరు మతంగా గుర్తించి, వాటి అమలుకోసం తెగించి పోరాడతామనే శపదం తీసుకొంటే చాలు. అదే అంబేడ్కర మతం అవుతుంది.

దళిత జనోద్ధరణే, సాంఘిక న్యాయం, సర్వజన సమానత్వం, మహిళాజన సంక్షేమం, భారతజాతి సమైక్యం కోసం నీవు చేసిన పోరాటాలు అద్వితీయం. నీ సిద్ధాంతాలు మాకు మార్గదర్శకం. మేము జీవిక కోసం ఏ వృత్తిచేపట్టినా, లక్ష్యం కోసం ఏ మార్గంలో పయనించినా, నీ ఆత్మీయ మానవాభ్యుదయం కోసమే సంబుద్ధులవుతాం. సంఘటితులమై సమరం సాగిస్తాం. నీవు మలచిన నవమానవులం. మనస్సాక్షిగా ఇదే మాశపదం అని అందరిచేత శపదం చేయించారు బోయి భీమన్న.

కుల, మత, వర్గ, తెగ, జాతి విభేదాలు లేకుండా ప్రపంచంలోని ఏమానవుడైనా సరే ఈ శపదం చేసి సర్వ మానవ శ్రేయస్సు కోసం నిబద్ధతతో కృషి చేస్తే అతడు అంబేడ్కరీయుడే, అంబేడ్కరు మతస్థుడే, అంబేడ్కరిస్టే అవుతాడని బోయిభీమన్న నిష్కర్షగా నినదించారు.

దళితుల ఆశాజ్యోతి అంబేడ్కరు జీవితం, ప్రతిభా పాటవాలు, సంస్కార భావాలు, పోరాటపఠిమ, తాత్విక దృష్టి, దళితులందరికీ మార్గదర్శకాలు. అంబేడ్కరు దళిత జనోద్ధరణనే తన మతంగా భావించిన గొప్ప యోధుడు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి, ఆయన ఆశయాలను సిద్ధింపచేయడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గంథ్రాలు :

1. డా॥ బోయిభీమన్న - అంబేడ్కర మతం (1993) భీమన్న సాహితీనిధి, ఐ.సి.85, ఇర్రంమంజల్ కాలనీ, హైదరాబాదు -482.
2. యం.వి.రమణ - అంబేడ్కర్ మత విధానం, భీమ్ భేరీ, ప్రచురణలు, విశాఖపట్టణం (ద్వి.ప్ర.) 1992.

వాస్తవిక చిత్రణలో జీవ చైతన్యం - భీమన్న సాహిత్యం

- యం. కోటీశ్వరులు, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై - 05.

సమాజ హితం కోరి బోధించలేనిదేది సాహిత్యం కాదు. కవిత్వం అనలేకాదు. సమాజానికి, సాహిత్యానికి విడదీయరాని అనుబంధం ఉందన్న నిర్ధిష్టమైన అవగాహన భీమన్నకు కలదు. కనుకే వీరు సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. పేదరికంతో పాటు, అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటి నుండి భీమన్నకు అనుభవమే. అందుకే వారి రచనలో సహజంగానే వాటిని నిరసించారు.

మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషన్ బోయి భీమన్న ప్రజల గురించి, ప్రజల భాషలో, ప్రజల కోసం కవిత్వం రాసిన మహనీయుడు. ప్రజాక్షేత్రంలోనే ఉండి, ప్రజల పక్షం నిలిచి పాలకులను ప్రశ్నిస్తూ, ప్రశ్నించడం నేర్పిన వారు. ఆయనను క్షోభపెట్టిన ప్రతి సంఘటనను కవిత్వం చేసిన మహానుభావుడు. జీవితం తడి తెలిసిన వారే సంఘానికి కావాల్సిన రచనలను అందించగలుగుతారు. జీవితంలో భిన్న కోణాలు చూడగలగాలి, చూడటమే కాదు అనుభవించగలగాలి. ఆ అనుభవాలను పలకరించి పదాలను కట్టగలిగినవారే భవిష్యత్ దార్శనికులుగా నిలబడగలుగుతారు. భీమన్న దార్శనికుడు కాబట్టే తన ఎక్స్‌రే కళ్లతో సమాజాన్ని దర్శించి సాహిత్య సృష్టి చేశారు.

'భిన్నత్వంలోని ఏకత్వం'లాగే భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది అని వారి రచనల ద్వారా తెలుస్తుంది. భారతజాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాలి. అంబేద్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ అదే! తన జీవితాంతం ఆయన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించిన వ్యక్తి భీమన్న.

మానవత్వం యొక్క సమగ్రత్వానికి తాను ప్రయత్నిస్తూ, సమాజం కూడా అదే స్థాయిలో ఎదగాలని వారు ఆశించారు. చిన్ననాడే భీమన్న అమానుష భావాలతో కూడిన సామాజికవర్గ దోపిడిని అతి దగ్గర నుంచి చూశారు. కొన్నిసార్లు ఆ దోపిడీకి గురై, అణచివేతలను కూడా ఎదుర్కొన్నారు. సమాజం యొక్క ఔన్నత్యం మానవ వికాసంతోనే ఉంటుందని, తనను తాను వికసింప చేసుకున్న మానవతామూర్తి భీమన్న. అందుకే ఆయన కవిత్వంలో మానవీయకోణాలు దర్శనమిస్తూ ఉంటాయి. వస్తువు ఏదైనా మానవీయ కోణాన్ని చూపించడం వారి రచనల్లోని కానవచ్చే ఒక ప్రత్యేక లక్షణం. అలాంటి నిరంతర ఆలోచనాపరుడైన మహారచయిత కలం నుంచి పుంఖాను పుంఖాలుగా ప్రక్రియా వైవిధ్యంతో రచనలు పరవళ్లు త్రొక్కేవి. ఆ ప్రభావంతో ఆశ్చర్యానికి లోనైన సి.నా.రె గారు,

"ఎప్పుడు చూస్తానో మరి
ఎప్పుడు రాస్తానో, అరె
తెప్పలుగా తేల్చినావు తీయన కవితల్
కుప్పలుగా రాల్చినావు కొన్నన పలుకుల్"

అంటూ ప్రశంసల అక్షరాభిషేకం చేశారు.

మనిషిగా ఎదుగుతూ, అందరినీ మనుషులుగా ఎదగమని ఉద్బోధిస్తూ, సమాజంలో కానవచ్చే అమానుష సంఘటనలకు చలించిపోతూ, మానవత్వం కోసం అక్షరాలతో అన్వేషణ సాగించిన మహాద్రష్ట బోయి భీమన్న. సమాజంలోని అసమానతలను గుర్తించిన భీమన్న మానవ సంబంధాల మెరుగుకై అడుగు అడుగున ఆరాటపడ్డాడు. అంతేకాదు మానవత్వాన్ని ఉద్దీపనం చేయడంకోసం తన రచనల ద్వారా ముందుకు అడుగులు వేశారు.

భీమన్న కవిగా కలంపట్టేనాటికి, సమాజంలో తనకు సరిపడని విషయాలను అంటే సమస్యలను గుర్తించి వాటిపై అక్షరయుద్ధాన్ని ప్రకటించారు. ఇది కవులకు, రచయితలకు సహజమైన విషయమని, అలా సమాజంలో అక్షరయుద్ధం చేయడం వల్లనే కవి తనలో దాగిన ఉద్వేగాలను ప్రకటించే అవకాశం ఉందనే విషయాన్ని మహారచయిత చలం - "తనకు, సంఘానికి సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్భహి: యుద్ధారావమే కవిత్వం" అని తెలిపారు. భీమన్న రచనలు చలం అభిప్రాయాలలో ఒదిగిపోతాయి. మానవత్వం మూర్తీభవించిన కవిగా తమ రచనల ద్వారా సమాజ చైతన్యానికి ఎలా పాటుపడ్డారో మచ్చుకకు కొన్ని రచనలను పరిశీలిద్దాం.

పాలేరు :

మానవజాతి పురోగమనానికి జ్ఞానం ఎంత ఆవశ్యకమో కొన్ని దశాబ్దాల క్రితమే గుర్తించిన కవి బోయి భీమన్న. తెలుగు సాహిత్యంలో భీమన్న పేరును అజరామరం చేసిన రచన పాలేరు. జనం వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసినవాడే కవి, అన్నది ఆయన నిశ్చితాభిప్రాయం కావచ్చు. అందుకే పాలేర్లు, రైతుకూలీలు తమబిడ్డలను చదివించాలని, తద్వారా వారి అభివృద్ధికి బాటవేయాలని పాలేరు నాటకంలో ఉద్బోధించారు. కవికి సహజంగా ఉండవలసిన దృష్టి కూడా ఇదే కదా! వెంకన్న అనే పాలేరు యువకుడు, అగ్రకులంగా గౌరవ మర్యాదలు పొందుతున్న వనబాల అనే యువతి ప్రేమించి పెళ్లి చేసుకోడానికి ఎంత సంఘర్షణ పడ్డారో ఇందులో చెప్పారు భీమన్న. ఉపకారి (ఉపాధ్యాయుడు) సలహా మేరకు వెంకన్న చదువుకుని, వెంకటేశ్వరరావుగా మారి, డిప్యూటి కలెక్టర్ హోదాలో స్వస్థలానికి వచ్చి భూస్వాముల ఆగడాలను ఎదుర్కొంటూ పాలేరు బానిస సంకెళ్ళను ఏవిధంగా తెగబడ్డాయో ఈ రచనలో చిత్రీకరించారు. సాహిత్యం ఆయన సిద్ధాంతం రసాద్వైతం కావచ్చు. అందుకేనేమో ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం భారతజాతిలో ఏకత్వం. పంచములుగా, ఎస్సిలుగా, హరిజనులుగా సమాజం పిలుస్తున్న వారి అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి, సమకాలీన సమాజంలో గౌరవానికి అర్హులయ్యేటట్లుగా చేయడం ఈ నాటకంలో కనిపించే సూక్తి.

కూలిరాజు :

భీమన్న కలం నుండి జాలువారిన రచనలో మరో అద్భుతమైన రూపకం 'కూలిరాజు'. ఈ రూపకంలో వ్యవసాయ కూలీల పోరాటాలను ఇతివృత్తంగా తీసుకొని చిత్రించారు. సామ్యవాద సిద్ధాంతం ప్రాతిపదికగా సమ సమాజాన్ని నిర్మించడమే ఈ రచన యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ తాత్త్విక చింతనతో భీమన్న తన రచనలో గ్రామీణ వాతావరణాన్ని సజీవ పాత్రల్ని సహజమైనట్టి సంఘటనలతో సాధారణమైనట్టి సంభాషణతో రూపొందించారు.

కూలీలంతా ఏకం కావాలని, కూలి రాజ్యం స్థాపింపబడాలని రచయిత ఇందులో పిలుపునిచ్చారు. గాంధీయిజాన్ని ఆచరించి వయోజన ఓటింగుతో కూలీలు అధికారంలోకి రావాలని ఈ నాటకం ద్వారా భీమన్న ఆశించారు.

నేటికి ఈ రూపకం గాఢమైన ఆవేశానికి, చక్కని భావానికి పాఠకలోకంలో వ్యవసాయ కూలీల చైతన్యానికి, పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నది.

రాగవాశిష్టం :

ఇది 1959లో వెలువడిన నాటకం. భాగవత బ్రహ్మ వైవర్ణ పురాణాల్లోని అరుంధతి, వశిష్టులకు సంబంధించిన సంఘటనలే ఈ నాటక కథకు మూలం. అరుంధతి, వశిష్టుల వివాహం జరిగిన తీరు గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. తాను ప్రేమించిన అరుంధతి కులం తెలిశాక ఆమెకు దూరమవుతాడు వశిష్టుడు. ఆ తర్వాత విరహం భరించలేక పశ్చాత్తాపపడి ఆమె దగ్గరకు వెళతాడు. అయితే అంతలోనే ఆమె తపస్సులో నిమగ్నమై

ఉంటుంది. ఈ తపోగ్ని తాపానికి అక్కడ ప్రకృతి విలయ తాండవం చేస్తు కరువు కాటకాలు ఏర్పడతాయి. వశిష్టుడి తపోవనంలో కూడా తిండిలేక, నీరు లేక ప్రజలు బాధలు పడుతూ ఉంటారు.

ఇక ఈ కష్టాలు తాళలేక వీరంతా బ్రహ్మ దగ్గరికి వెళ్ళి తమ కష్టాలు కడతేర్చమని విన్నవించుకుంటారు. అప్పుడు ఆ ఈశ్వరుడే అరుంధతి ఆశ్రమానికి వస్తాడు. పశ్చాత్తాపం చెందిన వశిష్టుడు అప్పటికే ఆ ఆశ్రమానికి వచ్చి ఉంటాడు. అయితే ప్రాచీనుడు, ఇంకా ఇతర పూర్వాచార నిష్టులు అరుంధతి, వశిష్టుల వివాహాన్ని వ్యతిరేకిస్తూ ఉంటారు. శివుడు వారికి బుద్ధి చెప్పి వారి ఇరువురికి పెళ్ళి జరిపిస్తాడు. ఇది పౌరాణిక ఇతివృత్తం అయినా దీనికి కాస్త ఆధునిక పోకడలను అద్ది నేటి సమాజ పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దారు.

ఇలా బోయి భీమన్న సాంఘిక దురన్యాయాన్ని ఈ రూపకం ద్వారా నిరసిస్తూ... అరుంధతి, వశిష్ఠుల పాత్రల ద్వారా సమాజంలో కులాంతర వివాహాన్ని ప్రోత్స హించారు.

పడిపోతున్న అడ్డుగోడలు :

దళితుల స్థితిగతులపై అద్భుతమైన నాటకాలు రూపొందించిన బోయిభీమన్న రాసిన మరో ఏకాంకి 'పడి పోతున్న అడ్డుగోడలు'. మనిషికి మనిషికి మధ్యనున్న కులం అనే అడుగోడలు భవిష్యత్తులో తొలగిపోగలవనే ఆశా భావాన్ని ఈ నాటకంలో వ్యక్తం చేశారు.

కులం మనుషులను ఒకరితో ఒకరు కలవకుండా చేసే ఇటుకగోడలా లేదా ముళ్ళ కంచెలా? భౌతిక వస్తువు కాదు అది మనం పీకి పడెయ్యడానికి. కులం అనేది ఒక భావన, అది ఒక మానసిక స్థితి. అందువల్ల కులాన్ని నాశనం చేయడమంటే భౌతికమైన అడ్డుగోడను కూల్చడం లాంటిది కాదు. దాని అర్థం మనసిక భావనలో మార్పు.

ఇందులో ఒక దళిత బాలిక తనతోటి బ్రాహ్మణ విద్యార్థి ఇంటికి స్నేహ పూర్వకంగా వెళుతుంది. అక్కడ ఆ దళిత బాలిక పొందిన అనుభూతిని వ్యంగ్యంగాను, హాస్యంగానూ చిత్రించారు.

కుల పట్టింపు అర్థ రహితమని, మూఢ నమ్మకమని, అనాగరికమని ఇది తొలగిపోవాలని ఇందులో ప్రబోధం చేయబడుతుంది. నాటిక చివరలో వర్ణాంతర వివాహ పద్ధతిని ప్రవేశపెడుతూ మతాచారం ముఖ్యంకాదు నైతిక జీవనం ముఖ్యమనే తాత్వికతను సూత్రీకరించారు.

సమాజంలో ఈ కులాలు, మతాధిపత్యాన్ని వివరిస్తూ చైతన్యాన్ని కలిగించే విధంగా రచింపబడిన నాటకం 'పడిపోతున్న అడ్డుగోడలు' మనుషులందరూ సమానమే అని వారి మధ్యన ఉన్న ఈ కులాలు, మతాలు వంటి అడ్డుగోడలు కూలిపోవాలని ఆశిస్తూ నమనమాజ నిర్మాణానికి తన రచన ద్వారా దోహదపడ్డారు.

యదార్థ చిత్రీకరణకు ప్రాధాన్యమిచ్చి సాహితీ ప్రయోజనాన్ని, సామాజిక నైపుణ్యాన్ని రంగరించి రచించినటువంటి రచన ఇది. జీవితానికి అతుక్కుపోయే పాత్రలతో నాటకీయతకు సరియైన స్వరూపం ఇందులో కనిపిస్తుంది. కథానాయిక వ్యంగ్యధోరణిలో విశ్లేషణ అద్భుతంగా కొనసాగించి, తెలుగు భాషలోవున్న సొగసు, శక్తి, గొప్పతనం ఈ రూపకంలోని సంభాషణల ద్వారా స్పష్టం చేస్తూ చైతన్య శీలిగా నిలిచారు.

పైరుపాట :

ఈ రూపకంలో కథానాయిక స్నేహ ఒక మాల పిల్ల. పేదరికంలో పెరిగి పెద్దయిన యువతి. పైరుచేలగట్లలో పచ్చగడ్డి కోసుకొనేందుకు ప్రతి సాయంత్రమూ పొలాల్లోకి వస్తుంటుంది. ఒక కామందు ఇంట్లో పాలేరుతనానికి కుదురుకొంటుంది. యజమాని ఇంటిపనులు నిర్వర్తిం చడం, పశువుల మేతకోసం ప్రతిరోజూ పంటపొలాల్లో తిరిగి గడ్డి కోసుకొని ఇంటికి తిరిగి వెళ్ళటం, పంటతల్లి అందాలను ఆనందించటం ఆమె దినచర్య. శీల ఆమె స్నేహితురాలు ఆమెకూడా ఒక కామందు ఇంట్లో పనికి కుదిరినదే. శ్రీవత్స అనే అగ్రకుల విద్యావంతుడు ఆ

పొలాల్లోనే షికారుకు వచ్చి స్నేహను చూసి ఆమెతో స్నేహం చేస్తాడు. ఇద్దరి మనస్సులు ఆకర్షణకు లోనై స్నేహం ప్రణయంగా మారడాన్ని భీమన్నగారు చాలా సున్నితంగా చిత్రించారు. శీల తన స్నేహితురాలి చిత్తవిభ్రమాన్న గుర్తించి ఆమెను హెచ్చరిస్తూ ఉంటుంది.

స్నేహ తాను గతి తప్పుతున్నానేమో అని భయ పడుతుంది. ఎంత అభ్యుదయవాది అయినా అగ్ర కులస్థుడు, గొప్పోళ్ళ బిడ్డ అయిన శ్రీవత్స తనను పెళ్ళి చేసుకుంటాడో లేదో అని కలవరపడుతుంది. అందని దానికోసం ఎగబడుతున్నానేమో అని వెనకాడుతుంది. తన మనస్సును కట్టడి చేసుకొనే ప్రయత్నంలో అతనికి కనబడటం మానేస్తుంది. శీల అయోమయంలో పడుతుంది. శ్రీవత్సకు ఆందోళన కలుగుతుంది. శీలను అడిగి విషయం తెలుసుకొని ఆమె అనుమానాలను, అభ్యంతరాలను పరాస్త చేసి స్నేహను పెళ్ళి చేసు కుంటాడు.

ఈ రచన ద్వారా మన సమాజంలో కూడా ప్రేమించు కొన్న యువతి యువకులకు పెద్దలు అనుమతి ఇచ్చి కులాంతర వివాహాలను ప్రొత్సహించి, వారిని మనసారా ఆశీర్వాదిస్తే ఎంతో ఆదర్శంగా ఉంటుందనే ఆశను వ్యక్తపరిచారు.

కుందుర్తి చెప్పినట్టు 'రంగస్థలం మీద కవిత్వం చదువుతూంటే వింటున్నామనే చైతన్యం ప్రేక్షకుల్లో కలుగనీయకుండా కథా గమనంలో వారికి సత్యభ్రాంతి కల్పించగలిగేటంతగా నాటకీయత సాధించగలిగినప్పుడు కవితా నాటకాలు విజయవంతమవుతాయి' అంటారు. అలాంటి అనుభూతి, అలాంటి భావన మనం 'పైరుపాట'లో చూడగలం.

మధుగీత :

ప్రకృతి ప్రేమ, స్త్రీ పురుష ప్రేమ, మానవ ప్రేమ ఈ మూడూ కేంద్రంగా వచ్చిన కవిత్వం ఇది. బ్రతుకు అంటే రాజకీయాలు కాదు, ప్రేమ అని భీమన్న భావన. ప్రియుడు ప్రియురాలిని ఉద్దేశించి వ్యక్తంచేసిన భావోద్వేగాల తీవ్రత ఈ కవిత్వంలో ప్రధాన అంశం.

"హృదయములు రెండు, మనసులు రెండు, రెండు
కాయములు కూడ అద్దాల కరణి నొకట
నొకటి స్వచ్ఛమై ప్రతిఫలించుకొనవలయు
ఒకటి నొకటి విభిన్నత నొందరాదు"

అని అద్వైతాన్ని ప్రతిపాదిస్తాడు.

జానపదుని జాబులు :

బోయి భీమన్న సాహిత్య పునాది అసమానతల గుర్తింపు జ్ఞానం. నాటి పల్లెటూరి లేఖలు, జానపదుని జాబులు దేశీ ప్రచురణలోనే అది కనిపిస్తుంది. నూటికి తొంభై తొమ్మిదిమంది గ్రామీణుల కొంపలు కూల్చే సంజెవేళ సందర్భాలను ఒక జాబులో ప్రస్తావిస్తూ.... పగలంతా రెక్కలు ముక్కలుచేసుకొని రక్తం నీరుగా మరచుకొని శ్రమించి సంపాదించిన బేడ డబ్బులు కల్లు దుకాణంలో సమర్పించుకొనటం, ఇంట్లో పిల్లల ఆకలి, పిల్లలను పెళ్ళాన్ని కొట్టడం వంటి దృశ్యాలను చూసిస్తూ...

"ఎన్ని కొంపలు కూలిస్తేగాని ఒక్క కొంప కోటికి పడగెత్తగలదు?
ఎన్ని కొంపల్ని కడుపులు మాడ్చి - ఏడ్పించితే గాని
ఒక కొంప సుఖంగా వినోదించగలదు?"

అని వేసిన ప్రశ్నలలో ఆర్థిక వ్యత్యాసాల మూలకారణ స్పృహ స్పష్టంగా కనబరిచారు.

మరోక లేఖలో.....

"ఎంత క్రూర సంఘం ఇది!
ఒకరి ఏడుపుతో మరొకరికి సంతోషం కలిగిస్తుంది
ఒకరి ఆకలితో ఇంకొకరి కడుపు నింపుతోంది
ఒకరి రక్తంతో వేరొకరికి సౌఖ్య సౌధాలు నిర్మిస్తోంది"

అని చెప్పిన మాటలలో అసమానతలను అంటి పెట్టుకొని వుండే దోపిడి స్వభావాన్ని గురించిన అవగాహన కనబడుతుంది.

ఇంకో లేఖలో....

"ఈ కుప్ప దగ్గర మేమెందుకు చలికి వణుకుతూ బాధపడుతున్నాం?
కుప్పను దొంగలు దోచుకోకుండా చూడటానికి
దొంగలేందుకు దోస్తారు?
తిండిలేక!
తిండి గలిగితే దొంగలెందుకు దోస్తారు?"

ఇక్కడ ప్రశ్న సమాధానం తెలిసి వేసినదే. ఎన్ని చట్టాలు, ఎన్ని బందోబస్తులు చేసినా దొంగతనాలు ఆగకపోవటానికి, నేరాలు అనేది తగ్గకపోవటానికి కారణం సంఘంలో ఉన్న అసమనత్వమేనన్న స్పష్టమైన అవగాహన ఆ లేఖలలో కనబడుతుంది.

ప్రకృతిలో మానవ ప్రకృతి :

ప్రేమ, ఆరాధన, పరమతాత్విక చింతన వారి రచన లన్నింటిలోను అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. దానికి నిదర్శనమే ఈ రచన.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆకాశాన తిరిగే విమానం సముద్రంలోని నౌకపై బాంబు వేయటం, సబ్మరైన్ విడిచిన శతఘ్నికి విమానం సముద్రంలో కూలటం దగ్గర ప్రణయ పారమ్యంలో కథ మొదలవు తుంది. మునిగిన విమానపు రెక్క మీద గాయపడిన వైమానికుడిని చూసిన జలాంతర్గామి నావికుడు చికిత్స చేస్తాననటం అతను నిరాకరించటం, ఈ లోగా నౌక మీద మరొక బాంబు పడటం, నౌక చిల్లుపడి మునిగిపోతుండగా నావికుడు వైమానికుడని కాపాడటానికి ప్రయత్నించటం ఈ క్రమంలో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ కావ్య కథా విషయం.

ఇందులో అంశం కరుణ అనే భావం గురించిన చర్చ. వైమానికుడు తనను రక్షించాలని తహతహ చూపిస్తుంటే "శరణార్థి ననుకొని కరుణింతువేమొ! కరుణ కన్న విషమ్ము కలదె లోకమున" అని వారిస్తుంది. కరుణింపబడుట వీరోచితము కాదు, బ్రతుకు బిచ్చము కాదు అన్నది భీమన్న దృష్టి. కరుణ హృదయార్థలక్షణం కదా అది విషం ఎట్లా అవుతుంది అన్న తర్కాన్ని యువకుడి ముఖంగా లేవనెత్తుతాడు. దానికి జవాబుగా ఉన్న పద్యాలు రెండు గమనింపదగినవి.

"కరుణ ఇచ్చెడువానికగు నమృతమ్ము
అందుకొనెడు వానికది విషమౌను
కరుణకు కేల్చాచు నిరుపేద కెపుడు
నీటిధారలె గాని నిచ్చెనల్ లేవు"

మరో పద్యం.....

"పర సహాయముతోడ బ్రతికెడి బ్రతుకు
మృతకళేబరపు టూరేగింపె యౌను
మానమే ధర్మమైన మానవజాతి
పృథు హస్తమేనాడు క్రిందు కారాదు"

ఆత్మాభిమానం కలచోట కరుణకు పాత్రులు కావటం అనేది దుర్భరంగా ఉంటుంది. కరుణ చూపే వాళ్ళ ఔన్నత్యం కరుణ పొందేవాళ్ళ దైన్యం సాపేక్ష సంబంధంలో అసమానతలను సూచిస్తాయి. మనుషులను ఆధిపత్య అధీన స్థానాలలో ఎదురెదురుగా నిలుపుతాయి. భీమన్న అవగాహన అది. ఈ కోణం నుండి సంక్షేమ మనుషులను మానవత్వం నుండి ఎంత పరాకరిస్తాయో అర్థం చేసుకోవచ్చు.

జన్మాంతర వైర్యం :

మతం మార్పిడి వంటి సమస్యలపై ఆయన చాలా దృఢంగా, బలంగా స్పందించారు. నేను హిందువుగా పుట్టాను, మతం మార్చవలసిన అవసరంలేదు. పెనంలో నుండి పొయ్యిలోకి దూకటం దేనికి? అంటూ ఈ హిందుమత మూలపురుషులు, ఈ భారత సంస్కృతీ మూలబుషులు నావాళ్లు. నా హరిజనులు అని నేను విశ్వసిస్తున్నపుడు, నా వారసత్వపు హక్కుల్ని ఏదోవిధంగా తిరిగి సంపాదిస్తానేగాని, పారిపోవడమనేది ఎందు కుంటుంది? నా స్వార్థంకోసం, నా ప్రతిష్టకోసం నేను పారిపోకూడదు. గుడిసెలలో, దరిద్రంలో కూలీలుగా బ్రతుకుతూ భోగులుగా జీవిస్తున్న ఈ నా పదిహేను కోట్ల

మందినీ వదిలేసి నేను పారిపోకూడదు. నేను పారిపోతే నాకూడా వీళ్లు రారు, రాలేరు. నేనొక సిసలైన మనిషినైతే, నేనే నిజాయితీ కల మాల,మాదిగవాణ్ణయితే, ధర్మవ్యాధ, మాతంగ, వాల్మీకి, వ్యాస మహాపురుషుల వారసుణ్ణయితే, నేనే కనుక నా కులాన్ని దాస్యం నుంచి విమోచన కలిగించడం అనే ధర్మానికి కట్టుబడిన వాణ్ణయితే, నేను కనుక ఆర్షభారతజాతి సమగ్ర సంఘటిత శ్రేయస్సును కోరినవాణ్ణయితే నేను నా సమస్త పదవీ విద్యాప్రతిష్ఠా గర్వాలనన్నింటినీ పీకిపారేసి, ఈ నా గ్రామీణ హరిజన గుడిసెవాసులతో ఉండిపోవాలి. వాళ్లతోనే ఉంటూ వాళ్ల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, ఒక్కొక్క అడుగే వాళ్లను ముందుకు నడిపించాలి. కర్తవ్యబోధ చేస్తే ఏ ఒక్క యువకుడైనా కంకణధారి కావచ్చు. ఈ రాక్షస యుగంలో కులాంతరీకరణకు బోధిస్తూ హరిజన యువకులేకాదు ఏ కులం యువకులైనా సరే వివేకంతో యథార్థాన్ని గుర్తించి భారత సమాజ పునర్నిర్మాణం కోసం ముందుకు వస్తారన్న ఆశతో సాగిన రచనే 'జన్మాంతర వైరం'.

"నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు
వాళ్ళను తిట్టైనా కొట్టైనా సరే అక్కడ నుండి లేపడం
అరుణోదయం కేసి తరమడం"

ఈ ఒక్క కవిత చాలు ఆ సాహిత్యమూర్తి, చైతన్యశీల సాహిత్య గొప్పతనం ఏమిటో చెప్పడానికి. సమాజాన్ని అత్యంతగా ప్రభావితం చేయడంలో, ప్రజలను చైతన్య పరచడంలో, ఉద్యమాలకు ఉత్ప్రేకరంగా నిలవడంలో కవిత్వానిది క్రియాశీలమైన పాత్ర అని మనం ఒప్పుకోక తప్పదు.

సమాజాన్ని నిరంతరం గమనించిన భీమన్న అసమ సమాజంలోని రుగ్మతలను బట్టబయలు చేశారు. వాటి నిర్మూలనకై నిరంతరాయంగా అక్షర తూణీరాల్ని సంధించారు. సమాజానికి తన కవిత్వం ద్వారా దిశా నిర్దేశం చేశారు. సుఖసంతోషాలతో కూడిన సమసమాజ స్థాపన కోసం కలలు గన్నారు. ఆ కలలను సాకారం చేయమని తన సాహిత్యం ద్వారా ప్రజలకు ఉద్బోధించారు. కవిగా సమాజ ఔన్నత్యాన్ని స్వప్నించిన మహాస్వాప్నికుడు భీమన్న. సమాజశ్రేయస్సును కాంక్షిస్తూ మానవతను అభిలషిస్తూ ఆయన సృష్టించిన సాహిత్యం అజరామరం. అందుకే సమసమాజ స్థాపనలో అవి నిత్యమూ ప్రజలను ఉత్తేజ పరుస్తూనే ఉంటాయి. ఒక కవి రచనలకు అంతకంటే పరమార్థం ఏముంటుంది? అందుకే కవిగా బోయి భీమన్న ధన్యులు.

సమాజంలోని అసమానతలపై గళమెత్తిన భీమన్న సాహిత్యంలో, సమాజంలోని అన్ని కోణాలను స్పృశించిన సంఘటనలు కోకొల్లలు. అయినా కొందరు సంకుచిత దృష్టితో ఆయనను దళితకవిగా ప్రచారం చేయడం దురదృష్టకరం. ఆయన సాహిత్యంలోని నిమ్నవర్గాల సముద్ధరణ కోసం సృష్టించిన సాహిత్యం ఒక భాగం మాత్రమే. కానీ ఆయన సాహిత్యాన్నంతా దళిత సాహిత్యంగాను, ఆయన్ను దళితకవిగాను పేర్కొనడ మంటే ఆయన స్థాయిని తగ్గించినట్టే.

ఇలా బోయి భీమన్న సమాజంలో జరిగే వాస్తవిక సంఘటనలను ఆధారంగా చేసుకొని తన సాహిత్యం ద్వారా సమాజ చైతన్యం కోసం దోహదపడ్డారు.

ఏది ఏమైనా! తెలుగు భాషా సాహిత్యానికి వన్నె తెచ్చిన ఈ మహనీయుడు శాశ్వత నిద్రలో ఒరిగి పోయినా నేటికి వారు మనందరికీ చిరంజీవులే!

ఆధారగ్రంథాలు :

1. భారతీయ సాహిత్య నిర్మాత బోయి భీమన్న - బి. విజయభారతి
2. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన - డా॥ తక్కళ్ళ బాలరాజు

3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి-1 - ఆచార్య అనుమాండ్ల భూమయ్య
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి-2
5. భీమన్న సన్మాన సంచిక సుఖేలా నికేతన్ - హైదరాబాద్
6. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు - హైమవతి
7. భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక (సంపాదకులు) - గనుమల జ్ఞానేశ్వర్
8. భీమన్న సాహితీ దర్శనం - అమూల్య శ్రీ (అమ్ములయ్య)
9. సామాజిక విలువల నేపథ్యంలో డా. బోయి భీమన్న రూపకాలు - విశ్లేషణాత్మక విమర్శ - డా. మరపట్ల భాస్కరరావు

అసూయ నాటకంలో - బోయి భీమన్న ఆశించిన గ్రామ పున:ర్నిమాణం

- యు. లావణ్య, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై - 05

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో విశిష్టమైన రచనలు చేసి, అపారమైన సాహిత్య సంపదను సృష్టించిన మహకవి బోయి భీమన్న. వీరు సమాజంలోని సామాజిక అభివృద్ధికి దోహదం చేసే అంశాలను , ఇతివృత్తంగా ఎంచుకొని, విలక్షణమైన రచనలు చేశారు. వీరు పద్యం, గేయం, వచన, కథ, నాటకం ఇలా అనేక ప్రక్రియలలో అపారమైన విజ్ఞాన సంపదతో కూడిన సాహిత్యాన్ని సమాజానికి అందించారు.

వీరి ఒక్కొక్క రచన సందేశాత్మకంగా రూపుద్దిదుకుంది, వీరి రచనలు అన్నీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా వున్నాయి. బోయి భీమన్న అన్న వెంటనే గుర్తొచ్చే సాహిత్య ప్రక్రియ నాటకం. వీరు మొత్తం 11 నాటకాలు రాశారు, అవి పాలేరు, కూలిరాజు, పడిపోతున్న అడ్డగోడలు, పైరుపాట, రాగవాశిష్టం, చిత్రకళా ప్రదర్శన, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ప్రగతి, మానవుని మరొక మజిలి, అసూయ, ఒక్కొక్క రూపకం ఒక్కొక్క రూపం సంతరించు కుంది.ఆ రూపకాలలో ఒక విలక్షణమైన రచన అసూయ, ఈ నాటకం ఆధారంగా బోయి భీమన్న గ్రామ పునర్నిమాణాన్ని పరిశీలిద్దాం.

బోయి భీమన్న అసూయ నాటకంలోని పాత్రలు:

స్త్రీ పాత్రలు :

రాత్రి : విశ్వం చెల్లెలు, రాజా స్నేహితురాలు

రేరాణి : భూతాలు కూతురు

పురుష పాత్రలు :

రాజు : విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు

విశ్వం : రాజా మిత్రుడు,సహాధ్యాయుడు

చండ భాస్కర్‌రావు : రాజా సహాధ్యాయుడు, ధనికుడు

దినం : చండా మిత్రుడు

భూతాలు, తాతాలు. వీళ్ళు పల్లెటూరు పెద్దలు

ఈ నాటకంలో స్త్రీ పాత్రలు ఇద్దరు, పురుష పాత్రలు ఆరుమంది వున్నారు. ఈ నాటకంలోని పేర్లను భీమన్నగారు చాలా విచిత్రంగా పెట్టడం జరిగింది. ఈ పాత్రలకు ఇలాంటి పేర్లు పెట్టడానికి ఎదో ఒక ప్రత్యేకత ఉండి ఉంటుంది అని చెప్పవచ్చు. అసూయ అనే పేరు పెట్టడానికి కూడా ఏదో పరమార్థం దాగి ఉందని ఈ నాటకం ద్వారా మనం తెలుసుకోవచ్చు.

రాజా :

ఈ నాటకంలో రాజా యొక్క మనసు సహృదయంగా ఉంటుంది. నేను సామ్యవాదిని అంటాడు. ప్రజలకు ఎదో ఒకటి చేయాలనే తపన ఇతనిలో ఇమిడి ఉంటుంది. విశ్వమయమైన మహశక్తి దేవుడనే, దెయ్యమనే అంటామంటే ఆ శక్తిని పూజించడం అనవసరం అంటాడు రాజా. ప్రజల యొక్క మూఢవిశ్వాసాలకు బానిసలుగా మారుతున్నారు. మతం పేరుతో ప్రమాదం జరుగుతుంది. అలాంటి వాటికి అవకాశం ఇవ్వకూడదని రాజా అసూయ నాటకంలో తెలియజేస్తాడు.

విశ్వం :

విశ్వానికి ఒక చెల్లి వుంది. ఆమె పేరు రాత్రి. తను పాటలు చాలా చక్కగా పాడుతుంది. విశ్వానికి విప్లవ గీతాలన్న , ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే గట్టి నమ్మకం తన మనసులో ఇమిడి వుంటుంది. విశ్వం కూడా సర్పవరం గ్రామానికి ఏదో ఒకటి చేయాలి దానిని అభివృద్ధి మార్గంలో పయనింపచేయాలి అని ధృడ సంకల్పంతో ఉంటాడు.

రాత్రి :

రాత్రి, రాజా స్నేహితురాలు, విశ్వనికి చెల్లెలు, వీరి ముగ్గురు స్నేహితులు. ఈమెకు మంచి మానవత్వం కలిగి వుందని చెప్పవచ్చు. చదవడంలోను, సహయం చేయడం

లోను ఇతరులను నొప్పించకుండా వుండే మనస్తత్వం కలదని చెప్పవచ్చు. రాత్రి పాటలు చాలా అద్భుతంగా పాడుతుంది. ఈ అసూయ నాటకంలో ఈమె పాడిన ఒక పాట ఇది.

"చూడచక్కని వాడు, సుందరాకారుడే
శోభాయామానుడే మారాజు;
కలువ కన్నులవాడు చలువ చూపుల వాడు
చెలివంపు చెలికాడే మారాజు"

ఇతివృత్తం :

ఈ రూపకం మొదట బెజవాడలోని వల్లభనేని కాశీవిశ్వనాథం గారి పత్రికలో సిరీయల్ గా వచ్చింది. ఈ నాటకంలో విద్యార్థులు, గ్రామ పున:ర్నిమాణానికి ఎంతో కృషి చేశారు. అలాగే రాజకీయ పరంగాను, విద్యార్థులు మధ్య జరిగే గొడవలు ఇందులో ప్రధానంగా చూపించడం జరుగుతుంది. ఈ అసూయ నాటకంలో బోయి భీమన్న గారు చాలా అద్భుతంగా రాసి మన ముందుకు తీసుకొని వచ్చారు. వీరు రాసిన గుడిసెలు కాలిపోతున్నాయి, పాలేరు రూపకాలు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి.

బోయి భీమన్న కళకి పరమ ప్రయోజనం సహజ శ్రేయస్సు దానిని దృష్టిలో పెట్టుకొని అసూయ అనే రూపకం రాశారు. ఈ నాటకాన్ని బోయి భీమన్న 1935 సంవత్సరంలో రాశారు 1954 సంవత్సరంలో ఈ నాటకాన్ని ముద్రించారు. ఇందులో ఆరు రంగాలు వున్నాయి. ఈ రూపకంలో పంచతంత్రము లాంటి ఉపయోగాలు కలిగి వున్నాయి. ఈ రూపకంలో కథా నాయకుడు రాజా, ఇతను విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు. ఇతని చుట్టూ ఇతర పాత్రలు నడుస్తాయి. ఇందులో ముఖ్యమైన పాత్రలు రాజా కథానయకుడు, రాత్రి కథానాయికి, విశ్వం రాజా మిత్రుడు, చండాభాస్కర్ రావు ధనికుడు , దినం ధనికుని మిత్రుడు, రేరాణి భూతాలు కూతురు. భూతాలు, తంత్రాలు పల్లెటూరి పెద్దలు, ఇంకా ఇందులో ప్రజలు, పోలీసులు కూడా వుంటారు. విశ్వం చెల్లెలు రాత్రి, రాజాను ప్రేమిస్తుంది. ఇలా చివర బోయి భీమన్న తన రసద్వైత ప్రేమను ఈ ప్రతీకాత్మక పాత్రల ద్వారా తెలియజేశారు. దీనిలో మనుషులతో పాటు రాత్రి మరియు దినం అనే సమయాలు భూతాలు, తంత్రాలు అను నమ్మకాలు మొదలగు సమకాలీన సమాజపు మనుషుల మనస్తత్వాలకి ప్రతీకలుగా పాత్రలను కల్పించి రచించాడు బోయి భీమన్న ఇది గొప్ప రసాత్మకమైన రూపకం. ఉదాత్త జీవిత తత్వ నిరూపణకు భీమన్నను ప్రేరేపించిన అనేక సంఘటనల రూపమే ఈ అసూయ నాటకం అని చెప్పవచ్చు.

ఇక అసూయ రూపకం తిలకించినప్పుడు ఆరవ రంగంలో రచయిత రౌద్ర, రసపోషణ అనిపిస్తుంది. రౌద్ర రసం క్రోధం నుండి పుట్టునవి. శత్రువు నాశనము చూచునది రౌద్రం అని ఇందులో మనకు తెలియజేశారు. అసూయ నాటకంలో గ్రామ పున:ర్నిమాణం:

అసూయ నాటకంలో 'అసూయతో కూడుకున్నటు వంటి రెండు పాత్రలు ఇందులో దాగి వున్నారు. వారు దినం, చండా వీరిద్దరూ కూడా ఈ గ్రామం అభివృద్ధి చెందనీకుండా మంచి వాళ్ళ పై నిందలు వేసి వారి యొక్క వ్యక్తిత్వలపై దెబ్బకొడతారు "మంచివాణ్ణి ప్రజలకు చూపడమెలాగా? ప్రజల అభిమాన నాయకుణ్ణి . ప్రజల చేతనే కొట్టించడం ఎలా? ప్రజల్ని లోబరుచుకోవడానికి సులువైన మార్గం ఏది? త్యాగం ఏమి అవసరం లేకుండా అధికారా పదవులు ఎలా వస్తాయి? ఇంకొక్కణ్ణి ప్రేమించే స్త్రీని స్వాధీనం చేసుకోవడం ఎలాగా అని ఇలా పన్నాగాలు పన్నుతున్నారు. ఈ రెండు పాత్రలు ఈ నాటకం ద్వారా బోయి భీమన్న మన కళ్ళకుకట్టినట్లు చూపించారు.

ఈ నాటకంలో 'సర్పవరం' అనే గ్రామానికి సేవలు చేయడానికి గ్రామం అభివృద్ధి చెందడానికి ఈ విద్యార్థులు తమ వంతు కృషి చేస్తారు. రాత్రి, రాజా, విశ్వం, వీరు ముగ్గురు ఈ గ్రామాన్ని పేద గుడిసెలతో

గుడ్డిదీపాలతో అక్షరం ముక్క తెలియని ప్రజలు ఈ గ్రామంలో దాగి వున్నారని, ఈ గ్రామం ఎలాగైనా బాగు

పడలని బోయి భీమన్న ఈ నాటకంలో అభివృద్ధి పరచి మన ముందుకు నాటకం ద్వారా తెలియజేశారని చెప్పవచ్చు.

ఈ గ్రామం అభివృద్ధి పరచడానికి విద్యార్థులు బాగా బ్రతకాలని, శుభ్రంగా వుండాలని చదువుకోవాలని రాత్రి పూట బడి ఒకటి పెట్టి అందరూ చందా వేసుకొని మరి ఒక మంచి బావి తవ్వించి ఇచ్చారు. మరొక ప్రక్క కళాశాల ఆవరణలో విద్యార్థులంతా తిరుగుతూ నేటి విద్యార్థులు రేపటి పౌరులని మన కాంగ్రెస్ అభ్యుదయ మార్గంలలో పని చేయాలని, పూర్వ ఆచారాలను పెట్టుబడివారి విధానాన్ని ఎదిరించి పోరాడే సోషలిస్ట్ సంస్థగా మన కాంగ్రెస్ బలపడాలి, పురోగమించాలి అని ఇదొక అంశంగా బోయి భీమన్న రూపకంలో చెప్పడం జరిగింది.

ఈ నాటకంలో చండా పేరు పెట్టుకున్న పాత్ర నిజంగా చండాలుడే అని అతనికి తగిన విధంగా ఈ పాత్రకు ఆ పేరు పెట్టారు. విశ్వం, రాజా, రాత్రి వీళ్లు ముగ్గురు సర్పవర గ్రామానికి ఎనలేని కృషి చేశారు. తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. అలాగే ఈ గ్రామానికి చెందిన భూతాలు కూతురు రేరాణి కూడా పాటలు చాలా చక్కగా పాడుతుంది.

పగలనక రేయనక
పాటు పడి పండించి
ప్రజల కందిస్తారు మా రైతు
ప్రాణమర్పిస్తారు మాకూలి
భూదేవి సేవించి
శ్రీదేవి చేస్తాడు
పరుల కర్పిస్తాడు మా రైతు
పస్తుపడుకుంటాడు మా కూలీ
నేల దున్నేవాడ,
నేల పాలించరా
హాయిగా బ్రతకరా మా రైత
అభివృద్ధి పొందరా మా కూలీ.

బోయి భీమన్న ఈ నాటకం ద్వారా మనకు చక్కటి సందేశాన్ని అందించారు గ్రామాలు బాగుంటేనే పట్టణాలు బాగుంటాయి గ్రామాలు ఎప్పుడు కూడా అభివృద్ధి చెందాలి. అక్కడ వున్న వాళ్ళందరు అక్షర జ్ఞానం నేర్చుకోవాలని ఈ నాటకంలో మంచి చేసే మనస్తత్వం కలిగిన మనుషులు వున్నారు. అది చెడగొట్టె చెడ్డ వాళ్ళు వున్నారు. ప్రతి గ్రామం కూడా శోభయామానంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటూ. బోయి భీమన్న ఈ నాటకం ద్వారా గ్రామాల్లో నివసించేటువంటి ప్రజల గురించి వారు పడే అవస్థల గురించి ఇందులో చాలా వివరంగా తెలియజేశారు. సర్పవర గ్రామం అభివృద్ధి అయి నిండుదనంతో ఉందని ఈ నాటకం ద్వారా మనం తెలుసుకున్నాం. ఇంతటి అద్భుతమైన నాటకాన్ని అందించిన బోయి భీమన్న గారికి ఈ సమాజం ఋణపడివుందని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. బోయి భీమన్న - బి. విజయ భారతి
2. అసూయ నాటకం - బోయి భీమన్న
3. బోయి భీమన్న రూపకాలు తాత్త్విక చింతన - డా. తక్కళ్ళ బాలరాజు

❁❁❁

లేఖాసాహిత్యంలో "జానపదుని జాబులు" - విశిష్టత

- డా॥. మూడె శంకరబాబు, అతిథి అధ్యాపకులు, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-05

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆంగ్ల సాహిత్య పరిచయంతో ఎన్నో నూతన ప్రక్రియలు ఆవిర్భవించాయి. అవి నవల, కథానిక, జీవితచరిత్ర వంటి కొత్త ప్రక్రియలు ఆరంభమయ్యాయి. కొన్ని పాత ప్రక్రియలు సాహిత్య గౌరవాన్ని పొందాయి. అలాంటి వాటిలో లేఖ ఒకటి. లేఖ అనేది ఓ ఆత్మీయ స్పర్శ. అంతరంగాల భాష. ఆత్మీయతలు, ఆలోచనలు, అనుభూతులు, ఆవేదనలు, నివేదనలతో పెనవేసుకున్న భావాలు, పురి విప్పుకున్న అక్షరాల సంగమమే లేఖలు. లేఖ అనే పదానికి ఉత్తరం, జాబు అనేవి పర్యాయపదాలు. తెలుగు సాహితీపందరికి తోరణాలై భాషకూ భావానికి నిచ్చెనలై ఎల్లలు తెలియని సీమలను కలిపి అందరి మనోభావాలను మనముందు సాక్షాత్కరింపజేసేది లేఖాసాహిత్యం.

కావ్యం, ప్రబంధము, కథ, నవల, వ్యాసం ఇలా అనేక సాహిత్య ప్రక్రియల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న లేఖ ప్రక్రియాపరంగా రాసిన సంపుటాల్లోనూ తన స్థానాన్ని నిరూపించుకుంది. గుడిపాటి వెంకటచలం రాసిన ప్రేమ లేఖలు, కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన శారదలేఖలు, వంగూరి సుబ్బారావు రాసిన వసంత లేఖలు, బోయి భీమన్న రాసిన జానపదునిజాబులు ఈ కోవకు చెందినవే. లేఖాప్రక్రియలో సాగిన చలం ప్రేమలేఖలు అత్యంత ప్రజాదరణ పొందినవి. శారద లేఖలు స్త్రీలలో చైతన్యాన్ని కలిగించాయి. బోయి భీమన్న జానపదుని జాబులు తెలుగు భాష గొప్పతనాన్ని, ఆనాటి గ్రామీణ పరిస్థితులను తెలియజేశాయి. ఈ క్రమంలో బోయిభీమన్న రాసిన జానపదుని జాబులు రచనలోని విశిష్టతను గురించి తేలియజేయడమే నా పరిశోధనాంశం. నా పరిశోధన అంశం గురించి చెప్పబోయే ముందు మహాకవి అయిన బోయి భీమన్న గారి జీవితవిశేషాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

బోయి భీమన్న - జీవితవిశేషాలు :

ఆధునిక కవులలో బోయి భీమన్న విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన కవి. కళాప్రపూర్ణ, మహాకవి, పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులు పొందిన భీమన్న తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురులో 1911 సంవత్సరంలో సెప్టెంబర్ 19న బోయి నాగమ్మ, పల్లయ్య అనే పుణ్యదంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. అస్పృశ్యత ప్రబలంగా ఉన్న నాటి కాలంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విద్యనభ్యసించాడు. తెలియకుండానే రచనా రంగంలో అడుగు పెట్టిన భీమన్న గారు స్వయంకృషి చేత తన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా వికాసింప చేసుకున్న మేధావి. 1940 నుండి 1945 వరకు ఉపాధ్యాయులుగాను, 1950 నుండి 1955 వరకు ఆంధ్రప్రభ పత్రిక యొక్క సబ్‌ఎడియటర్‌గా పని చేశారు. అలాగే 1978 నుండి 1984 వరకు రాష్ట్రశాసన మండలి సభ్యునిగా ఉన్నారు. ఈయన తన తండ్రి తనకు గురువు అంటారు. అలాగే వేదాంత దృక్పథంలోనే తన తల్లి పాడే జానపదులు, తండ్రి జరిపే వేదాంత చర్చలు, ప్రకృతియే తన రచనలకు మూలం అంటారు. తన ప్రతి రచనా తన ఆత్మకథే అంటారు. స్పందించే హృదయం వుండాలేగాని ప్రతిది ఒక కావ్యమే. ప్రతిదానిలో అనుభూతిని పొందేది దానిలో పూర్తిగా నిమగ్నమైనప్పుడే అదే జరిగింది భీమన్న గారి జీవితంలో తన చుట్టూ ఉన్న ప్రతి విషయాన్ని వస్తువుగా తీసుకొని రచనలు చేశారు. సమాజంలో జరిగే ప్రతి సంఘటనను తన రచనలలో స్థానాన్ని ఇచ్చారు. తెలుగు సాహిత్యంలో తమ గ్రంథాలకు తామే పీఠికలు వ్రాసుకుంటూ గ్రంథంలో చెప్పబోయే అంశాన్ని పీఠికలలో స్పష్టపరచడం బోయి భీమన్న ప్రత్యేకతగా పేర్కొనవచ్చు.

తండ్రిగారి తాత్త్విక ప్రవృత్తి, తల్లిగారి కవితాశక్తి, గోదావరి కోనసీమ అందాల ప్రకృతియే వీరి సాహిత్య

వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాయి. మానవ జీవన ప్రశాంతి మనుగడ కోసం తన సాహిత్యాన్ని మార్గదర్శనం చేయించిన మహా మానవతమూర్తి బోయి భీమన్న. మార్గ దేశి కవితా రీతులలో వీరు సిద్ధహస్తులు. వీరి పద్య రచనకళ అనితరసాధ్యం. వీరి రచనలలో మాధుర్య గుణం పాలు ఎక్కువ. వీరు శివ సోషలిజాన్ని ప్రతిపాదించారు. బోయి భీమన్న తెలుగు సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియలలో 70 పైగా రచనలు చేసి తనదైన శైలిలో వెలువరించి పలువురి మన్ననలను పొందారు. ఆ సాహిత్య ప్రక్రియలలో ఒకటి లేఖ. లేఖాసాహిత్యంలో 'జానపదుని జాబులు' అనే రచన చేశారు భీమన్నగారు. ఇప్పుడు 'జానపదుని జాబులు' అనే రచనకు సంబంధించిన విశేషాలను పరిశీలిద్దాం.

జానపదుని జాబులు - రచన విశేషాలు :

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యంలో లేఖ సాహిత్య ప్రక్రియలో బోయి భీమన్న రచించిన 'జానపదుని జాబులు' (1940) మొదట అచ్చుపడిన రచన. ఈ రచనను దేశీ ప్రచురణ, విజయవాడ వారు 1957వ సంవత్సరంలో జూన్ నెల లో పునర్ముద్రణ చేశారు. ఈ రచనకు బొందలపాటి శకుంతలాదేవి, శివరామకృష్ణ సంపాదకులుగా ఉన్నారు. ఇది 148 పేజీల గల రచన. ఇందులో మొత్తం 17 లేఖలు ఉన్నాయి. ఇవన్ని చాలా పెద్ద లేఖలు కనీసం ఒక్కొక్క లేఖ ఐదు పేజీల నుంచి 15 పేజీల వరకు ఉంటుంది. భీమన్న గారు రాసిన 'జానపదుని జాబులు' లేఖాసంపుటిలోని 3వ లేఖను (నెచ్చలీ!) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు పదవ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠ్యాంశంగా తీసుకున్నారు.

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. అందు వల్లనే భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది అంటారు. ''గ్రామంలోని ప్రతి ఇల్లు విద్యాగంధంతో గుబాళించి, అభివృద్ధి చెందితేనే మనదేశం సుసంపన్నంగా, సస్య శ్యామలంగా ఉంటుంది'' అని మన జాతిపిత మహాత్మాగాంధీ అన్నారు. ఐతే గ్రామాలు ఎలా ఉన్నాయి? వారి జీవితాలు ఎలా ఉంటాయి? అనే విషయాలు వివరిస్తూ, గ్రామాల్లోని దళితులు, పేద ప్రజల జీవితాలను చిత్రిస్తూ ''పల్లెటూరి లేఖలు'' అనే పేరుతో 1932 సంవత్సరంలో 'జనవాణి' పత్రికలోనూ, 1933 సంవత్సరంలో ''జానపదుని జాబులు'' అనే పేరుతో 'ప్రజామిత్ర' పత్రికలోను ప్రచురించబడ్డాయిని 'జానపదుని జాబులు' గ్రంథంలోని ముందుభాగంలో చెప్పబడింది.

జానపదుని జాబులు - ఇతివృత్తం :

పట్నంలో కొంతకాలం చదువుకొని, బీదతనం వల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన అవస్థలను, ఆనాటి గ్రామాలలోని పరిస్థితులను 'లేఖల' రూపంలో తేలపడమే ''జానపదుని జాబులు'' రచన ఇతివృత్తంగా చెప్పవచ్చు.

మరోక విధంగా చెప్పలంటే ఆంధ్రదేశంలోని పల్లెటూరి వాతావరణం, పల్లెలలోని కూలీల దైన్యం, ఆ విద్య - నిరంతర యాతనామయమైన వారి జీవితాలు కళ్ళకు కట్టేట్లుగా వర్ణిస్తూ పట్టణంలోని మిత్రునికి రాసిన లేఖలే ''జానపదుని జాబులు''.

జానపదుని జాబులు - సంబోధనలు :

జానపదుని జాబులు రచనలోని లేఖలలో మిత్రుని రాసిన సంభోధనలు పరిశీలిస్తే ఒకటి మరియు మూడు లేఖలలో నెచ్చలీ! అని రెండు, ఆరు, పదమూడు, పదిహేను, పదిహారు, పదిహేడు అను సంఖ్య లేఖలలో ప్రియసఖా! అని, నాలుగవ లేఖలో చెలీ! అని, ఐదు, పదకొండు, పన్నెండు అను సంఖ్యగల లేఖలలో ప్రియ మిత్రమా! అని, ఏడు, పద్నాలుగు అను సంఖ్య గల లేఖలలో సుహృద్వరా! అని, ఎనిమిది అను సంఖ్య లేఖలో ప్రియ సుహృద్దీ! అని, తొమ్మిది, పది అను సంఖ్య లేఖలలో మిత్రమా! అని తన శ్రీమంతుడు మిత్రునికి జానపదుడు ఈ సంబోధనలతో లేఖలను ప్రారంభించి రాశారు భీమన్నగారు. ఈ క్రమంలో 'జానపదుని

జాబులు' రచనలో బోయి భీమన్న గారు పేర్కొన్న సామాజింకాంశాలు - విశ్లేషణను పరిశీలిద్దాం.

జానపదుని జాబులు - సామాజింకాంశాలు - విశ్లేషణ :

సమిష్టి జీవనాన్ని గడుపుతున్న మానవ సముహమే సమాజం. సమాజం వలలాగా అల్లబడిన వివిధ రకాల మానవ సంబంధాలను సూచిస్తుంది. సమాజం మానవుని సహజ ప్రేరణ వలన ఏర్పడుతుంది. సామాజిక శాస్త్రం భూత, వర్తమాన కాలాలలోని ఎన్నో అంశాలను చర్చిస్తూ భవిష్యత్ కాలానికి దిశానిర్దేశం చేస్తుంది. సాహిత్యాం శాలకు ప్రతీకగా నిలిచిన లేఖలే గాక సామాజింకాంశాలకు సమకాలీన చరిత్రకు ప్రాదాన్యతనిస్తూ సాగిన లేఖలలో బోయి భీమన్న గారు రాసిన 'జానపదుని జాబులు' రచనను కూడా ఒకటిగా చెప్పవచ్చు.

కష్టపడి చెమటోడ్చి సంపాదించిన డబ్బు మనిషి తాగుడికి ఖర్చు పెట్టెసి ఆ తాగిన మైకంలో మంచి చెడు విచక్షణ కోల్పోయి ఇంట్లో భార్య బిడ్డలపై చెయ్యి చేసుకోవడం ఇంటి పరిస్థితి ఎంత దుర్భరంగా మారుతుందో ఒక లేఖలో చిత్రించారు. అలాగే మరో లేఖలో తన పూర్వికుల ద్వారా తనకు వచ్చిన భూమిని తాకట్టు పెట్టి డబ్బు వృధాగా ఖర్చు చేస్తు దానితో అప్పు పెరిగి తాకట్టు పెట్టుకున్న వాడి హస్తగతం అయి పోవడంతో అతడి జీవితం ఎంత హీనంగా మారి పోయిందో కండ్ల కట్టినట్లు వివరించారు రచయిత.

మద్యపానం గురించి ఒక లేఖలో వివరిస్తూ ఓ సత్యాన్ని తెలియజేశారు రచయిత. సఖా! ఎన్ని కొంపలు కూలిస్తే గాని ఒక్క కొంప కోటికి పడగెత్తగలదు" అనే వాక్యం ఆనాటి ఆర్థిక సూత్రాల్లో ఒకటిగా చెప్పవచ్చు.

మోసం చేసినవాడే ధనికుడవుతాడు. నిజాయితీగా పనిచేసినవాడు దరిద్రుడి గానే ఉంటాడు. నిజాయితియే లేదా కష్టమే ధనికుడు అవ్వటానికి మూలమైతే ఎంత మంది కష్టజీవులు నిజాయితీగా ఉన్నవారు ఎందుకు ధనికులు కావటం లేదు అనే విషయాన్ని ఒక లేఖలో ప్రస్తావించారు.

పెదవాళ్లు ఎదుర్కొనే కష్టాలు వారు పడ్డ కష్టాలకు ప్రతిఫలం సరిగ్గా లభించుకపోవడంతో వాళ్ల జీవన కష్టాలు గురించి, చావు బ్రతుకులు మధ్య కార్మిక స్త్రీలు పొందే నరకయాతనలు, స్వార్థాన్ని ప్రతిరూపంగా నిలబడుతున్న ధనికుల ఎత్తుగడలకు బలిపోతున్న నిరుపేదలు, తాగుడు, జూదం, వెట్టిచాకిరికి బలైపోతున్న జీవితాలు సంబంధించిన మొదలయిన అంశాలు ఈ లేఖలలో ప్రధానంగా మనకు కనిపిస్తుంది. ఇన్ని సమస్యలలో వారి మధ్య ఉన్న అప్యాయతలు మాత్రం ఏమాత్రం తగ్గలేదని అవే వారికి జీవనం కోనసాగాడానికి ప్రేరకలుగా పనిచేస్తాయి అనే సత్యం ఈ లేఖలలో తేలియజేశారు బోయి భీమన్న గారు.

పల్లెటూరి జీవితం గురించి ఒక లేఖలో ఇలా ప్రస్తావించారు. పల్లెటూరి జీవితం ఎంతో మనోహరమైంది! అని అనుకుంటారు కాని "పస్తులుపడాలి, కష్టాలకు ఓర్చుకోవాలి. ఈ రెండు తప్పితే పల్లెటూరే ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిల్లు" అని భీమన్న గారు ఒక లేఖ ద్వారా మనకు తేలియజేశారు.

ఒక లేఖలో యజమాని సంక్రాంతి పండుగ రోజు ఒక పేద రైతు తన కూలీ డబ్బులు ఇప్పించండి అని దీనంగా ప్రార్థిస్తూ వున్న ఆ యజమాని 'ఈ వేళ లేవు' పోమ్మని గర్జించాడు. అలాగే ఆ చలిలో చెమటలు గ్రక్కుకొంటూ ఏవో మోసికొనిపోతున్నాడు తన కామందుకి ఒక పాలేరు. పనికి ఆలస్యంగా వచ్చాడని తన నౌకర్ని కొట్టడానికి తరుముతున్నాడు ఒక యజమాని. ఆ పండగ పూట అయినా సంతోషం లేదు. ప్రజలు తమ సంతోషాన్ని ధనదేవతకి బలి ఇస్తున్నారు. "ఎంత క్రూరసంఘం ఇది! ఒకరి ఏడుపుతో మరొకరికి సంతోషం కలిగిస్తుంది. ఒకరి ఆకటితో ఇంకొకరి కడుపు నింపుతోంది. ఒకరి రక్తంతో వేరోకరికి సౌఖ్యసౌదాలు నిర్మిస్తుందని తన మిత్రునికి రాసిన లేఖలో పేదవారిని యజమానులు పెట్టే ఇబ్బం

దులు సంబంధించిన అంశాలను సమాజానికి తెలియ జేశారు.

డబ్బు లేని చదువు ఇబ్బందులచేటు. కాలం జరిగిపోయేకొలది స్నేహలు పాతబడిపోతుంటాయి. క్రొత్త పరిచయాలు కలిగేకొలది పాత పరిచయాలు అడుగున పడిపోతూ వుంటాయి. ఇది ప్రపంచ స్వభావం అని ఒక లేఖలో రచయిత తెలిపారు.

మానవులకు అందులోనూ పేదలకు ఎంత కష్టం వచ్చింది. తమతో పాటు ఎన్నిజీవుల్ని, ఆవుల్ని, ఎద్దుల్ని ఇంకా ఎన్నో జంతువుల్ని కష్టపెడుతున్నాడు తమ స్వార్థానికి! ఈ దీనజీవికలు తరించే మార్గం లేదా ఒకటినాటికి. అందుకే సమత్వం రావాలి. సర్వసమత్వం రావాలి అంటూ ఒక లేఖలో నేటి సమాజానికి తేలియ జేశారు.

ధనికులు, భూస్వాములు చేతులలో నిరుపేదల కీలుబొమ్మలుగా మారిపోయాని, తరాలు మారిన వారి కబంధహస్తాలనుండి బయటపడలేక పోతున్నారని ఒక లేఖలో చిత్రించారు రచయిత.

పల్లె ప్రజలకు కష్టాలు రావడం ఉంటుంది కాని పోవడం ఉండదు అని ఒక లేఖ లో ఇలా ప్రస్తావించారు. "క్రిస్‌మేస్ వచ్చింది, పోయింది.సంక్రాంతి వస్తూవుంది అదీ అలాగే పోతుంది. కాని, మా కష్టాలు ఎప్పుడూ రావడమే పోవడం మాత్రం ఉండదని పేర్కొన్నారు. అలాగే భార్య, భర్త ,తల్లీ, తండ్రీ, కొడుకు, ఇంటిలోని పది మంది రెక్కలు ముక్కలు చేసుకొని వ్యవసాయం చేసిన కడుపునిండా కూడు(అన్నం) దొరకడం లేదు. ఆనాటి పల్లె ప్రజల జీవన కష్టాలను సమాజానికి లేఖలు ద్వారా సమాజానికి తెలియజేశారు.

ఆనాటి పల్లెటూళ్ల ప్రజల జీవన పరిస్థితులను మరియు యజమానులు కూలీలు, రైతులు, పాలేళ్ళు చూపే వైఖరి గురించి తన మిత్రునికి జానపదుడు ఒక లేఖలో ఇలా ప్రస్తావించారు.'నీవు నమ్మవుకాని అన్నం లేక ఎంతమంది చచ్చిపోతున్నారో పల్లెటూళ్ళలో లెక్కలు లేవు. కాయకసరూ, పండుఫలమూ, ఏవో ఎల్లప్పుడూ వుండే పల్లెటూళ్ళలో దరిద్రదేవతకు ఎంతో మంది బలి అయిపోతున్నారంటే, మరి ఆ దేవత భయంకర రూపం నీవే ఊహించుకో. పస్తులుపడి మాడిచస్తున్నారు పాపం ప్రజలు అని పనులు ఏమన్నా తక్కువ అవుతాయా ఉహు ఎప్పటిపనులు ఎప్పటి మాదిరిగానే వుంటాయి. తమ కూలీలు, పాలేగాళ్లు, తిన్నారా తినలేదా అని ఆలోచించరు యజమానులు. తిన్నాసరే తినకపోయినాసరే పనులు మాత్రం ఎప్పటిలాగే చేయాలి. తాము మాత్రం తృప్తిగా భుజించివచ్చి గట్ల మీద కూర్చుంటారు. ఈ లేఖ ద్వారా సమాజానికి పల్లే ప్రజలు ఆకలిబాధను, యజ మానులు పాలేగాళు, కూలీలపై చూపే ఆజామయిషిని గురించి సమాజానికి తేలియజేశారు.

ధనవంతులు ఎప్పుడు ధనవంతులుగా పేదవాళ్లు ఎప్పుడు పేదవారిగే ఉంటారు అనే ప్రశ్నకు ఒక లేఖలో ఇలా సమాధానం చెప్పారు. "ప్రపంచంలో బ్రతకడానికి మూడే మూడు విధాలు మార్గాలు ఉన్నాయి. ఒకటి కష్టపడి సంపాదించుకోవడం, రెండు భిక్షమెత్తుకోవడం, మూడు దొంగిలించడం. 'ధనికులు పనిచేయరు, ధని కులు భిక్షమెత్తుకోరు, ఇంకా ధనం ఎలా సంపాదిస్తారు అంటే అని ఒక కవి ప్రశ్నించినట్లే ప్రశ్నించుకొంటే, మన పల్లెటూరి పేదరైతుల, పేదకూలీల నోర్లుగొట్టి కూడాబెట్టిన ధనమే ధనికులకు ఆధారం అని రచయిత సమాజానికి తేలియజేశారు.

భారతదేశంలోని ఆనాటి గ్రామల పరిస్థితులను మరియు గ్రామల గొప్పతనాన్ని ఒక లేఖలో ఇలా ప్రస్తావించారు. మనదేశంలోని గ్రామలలో ఉండడానికి ఇళ్లులేనివాళ్ళు ఎన్నో లక్షలమంది ఉంటారు. వీరిలో బిక్షకులూ, కొండజాతులవారు కాకుండా. అలాగే జమిం దారుల, ఇనాందారుల, కామందుల భూముల్లో చిన్న చిన్న పాకలు వేసికొని అందులో నివసిస్తూ, వారికి చాకిరీచేస్తూ, జీవితకాలమంతా అదే మాదిరిగా, అదే

బ్రతుకు జీవనయాత్ర చేస్తారు. అలాగే గ్రామలు అనేవి అడవులుగావు 'శాంతిసదనారామాలు' నేడు ఎంత దుస్థితిలో ఉన్న ప్రపంచానికి మార్గదర్శకమయ్యేది ఒక్క గ్రామమే. గ్రామంలో ఉండే సౌఖ్యం మరెక్కడా ఉండదు. గ్రామం ప్రేమకు పుట్టిల్లు గా భీమన్న తన లేఖలలో గ్రామలు గొప్పతనాన్ని నేటి సమాజానికి తెలియజేశారు.

గ్రామ సీమలు విశిష్టతను తేలిపే ఒక పాటను ఒక లేఖలో ఇలా తెలిపారు.

> నూవులా చేలోన నూనె పొంగిందీ, - లేయావు పొదుగులో నేయి చేరిందీ,
> అమ్ముకోకుండగా ఆరగించండీ - చిమ్ముకోకుండగా చేవదేరండి
> మన గ్రామసీమల్లు మణులు పండాలీ.. - మన భారతీదేవి మహిమపొందాలీ!

గ్రామీణులు ఆనాడు ఎలా ఉన్నారు, నేడు ఎలా ఉన్నారు అనే విషయాన్ని ఒక లేఖలో ఇలా తెలిపారు. ఆనాడు గ్రామీణులు ప్రపంచం ఏమిటో ఎరగకుండా నూతిలో కప్పలలాగ ఉండేవారు. తమ పనేమిటో తామేమిటో అంతే తప్ప మిగిలిన విషయాలను పట్టించు కోరు. అలాగే కర్మసిద్ధాంతాన్ని నమ్ముకొని కలిగిన దానితో తృప్తిపడి వుండేవాళ్ళు. కాని నేటి గ్రామీణ ప్రజలు బాగా తెలివిమిరిపోయారు. ఏ శక్తి ప్రపంచానికంతకి జీవన మైందో, ఆ శక్తికి తామే దోహదకర్తలమనీ, అట్టి తమ శక్తి లోకకళ్యాణం కోసం కాక కొంత మంది స్వార్థపరుల స్వాభివృద్ధికి మాత్రమే వ్యర్థపరుపబడుతూ వుందనీ, రైతులూ, కూలీలూ ఇప్పుడు గ్రహించారు.

బానిసత్వాన్ని గురించి ఒక లేఖలో ఇలా ప్రస్తావించారు. ''బానిసత్వానికి భయపడి మృగాలు, పక్షులే దూరంగా పారిపోతుంటే మేధోసంపన్నుడైన మానవుడు బానిసత్వమే జీవితంగా బ్రతుకుతున్నడని ఒక లేఖలో తెలిపారు.

పట్నం జీవితానికి, పల్లెటూరి జీవితానికి గల వ్యత్యాసం గురించి ఒక లేఖలో ఇలా పేర్కొన్నారు. ''నీ పట్నజీవితానికి, నా పల్లెటూరి జీవితానికి పరస్పర విరుద్ధంగా వుంటుంది. నీ పట్న జీవితం సౌఖ్యమయం అయితే నా గ్రామజీవితం కష్టమయం. నీ పట్నవాసం ఆనందకరం అయితే నా గ్రామవాసం దు:ఖకరం అనే విషయాన్ని తెలిపారు.

పల్లెటూళ్లలలో రైతులు, కూలీలు రోజంతా శ్రమిస్తారు. ఆ శ్రమను మరిచిపోవాడానికి రాత్రులలో వారు చెప్పుకునే కథలు గురించి, వారి దినచర్య గురించి ఒక లేఖలో ఇలా ప్రస్తావించారు. ''ప్రతిరోజు తమకష్టాల్ని మరిచిపోవడానికి రాత్రి పూట ఏవో కథలు చెప్పుకుంటూ కాలం గడుపుతూ వుంటారు కృషికులు, కార్మికులు. ఇదంతా తాత్కాలిక ప్రశాంతి. ఎంతకాలం ఈ విధంగా రోజులు గడుస్తాయి? కాని రాత్రుళ్ళంతా యజమానులు పెట్టుబడిదార్లు పీడిస్తున్నట్లే కలలుగంటారు. వేకువ జామునే లేచి తిరిగి ఎవరిపనులకు పోతారు. ఇంతే. ఇదేవారి దినచర్య. ఇదే పల్లేటూళ్ళ జీవనగతి.ఈ గుడిగుడిగుంచం బ్రతుకుతోనే, ఈ చాలీచాలని జీవిత భృతితోనే, ఇదే విశాలప్రపంచం అనుకొంటూ రోజులు గడుపుకొంటున్నవి ఆనాటి పల్లెలలో జీవనవిధానం గురించి నేటి సమాజానికి తెలియజేశారు.

చివరి లేఖలో భీమన్న గారు మద్రాసు రైలు ప్రయాణం, మద్రాసులో తెలుగువారి పరిస్థితులు, తెలుగు భాష కు చెందిన అంశాలను ఈ లేఖలో ఇలా ప్రస్తావించారు. ''మద్రాసులో ఏ ట్రాములో చూచిన అరవమే. ఏ గోడమీద చూచిన అరవమే. ఏ ఎడ్వర్టైజు మెంటు చూచిన అరవమే. ఏ షావుముందు చూచిన అరవమే. అరవానికి ఇంగ్లీషు జత. తెలుగుకు ఎక్కడ తావులేదు. జనరల్ హాస్పిటల్‌లో కూడా అయా సెక్షనుల పేర్లు ఇంగ్లీషులోనూ అరవంలోనూ తప్ప తెలుగులో లేవు. మద్రాసులో ఉండే తెలుగువాళ్లుమేము తెలుగువాళ్లమని చెప్పుకొరు. అలాగే వారు తెలుగుభాష మాట్లాడరని ఆనాటి మద్రాసు నగరంలో తెలుగువారిని, తెలుగు భాషని గురించి తెలియజేశారు.

జానపదుని జాబులు - విశిష్టత :

బోయి భీమన్న గారు కవిత కంటే సులభంగా అర్థమయ్యే లేఖాసాహిత్యం ద్వారా సమాజంలోని లోపాలను ఎత్తిచూపారు. అలాగే గ్రామాలలో ప్రబలంగా ఉన్న అసమత్వాలను, సాంఘిక దౌష్టాన్యాలను, స్వార్థ, నిరంకుశత్వాలని గురించి ఈ లేఖలలో తేలియజేశారు. ఆనాటి పల్లెటూర సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గురించి ఈలేఖలలో ఎంతో చక్కగా వివరించారు రచయిత బోయి భీమన్నగారు. గ్రామాలలో నిరుపేదల అయిన దళితుల సమస్యలు సంబంధించిన అంశాలే ఈ జానపదుని జాబులు లేఖాసంపుటిలో ప్రధానంగా చిత్రించారు.

అలాగే పల్లెటూళ్ళు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్ళు, కష్టం రైతులది, సుఖం పట్నం బాబులది, వెనక్కి తిరిగి చూడు నిన్ను పోషిస్తున్న పల్లెను కాపాడు, డబ్బు లేని చదువు ఇబ్బందుల చేటు, కాలం జరిగిపోయే కొద్ది, పాత స్నేహాలు పాతబడి పోతు ఉంటాయి, మన ఇల్లు, మనం బాగుంటే తక్కిన ప్రపంచం అంతా మునిగి పోతున్నా మనం లెక్కచేయం, క్రొత్త పరిచయాలు కలిగేకొలది పాత పరిచయాలు అడుగునపడిపోతూ వుంటాయి మొ॥ నినాదాలు, సూక్తులు సందర్భనుసారంగా లేఖలలో అక్కడక్కడ ప్రస్తావించారు రచయిత బోయి భీమన్న గారు.

మానవ నంఘానికి పల్లెటూళ్ళు ఆనందాన్ని ఇస్తున్నాయి. పల్లెటూళ్ళు బాగుంటేనే ప్రతి మనిషికి తిండి అనేది దొరకుతుంది. అందుకే "పల్లెటూళ్ళు సుబిక్షంగా ఉంటే, దేశం సుబిక్షంగా ఉంటుంది" ఇది అక్షర సత్యంగా 'జానపదుని జాబులు' రచన ద్వారా సమాజానికి తేలియజేశాడు బోయి భీమన్న. ఆనాటి పల్లెటూళ్ల పరిస్థితులను, వారి జీవన విధానం, వారి ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు గురించి తేలియజేయడమే 'జానపదుని జాబులు' రచన విశిష్టతగా పేర్కొనవచ్చు.

ఆధారగ్రంథాలు :

1. జానపదుని జాబులు - బోయి భీమన్న
2. బోయి భీమన్న (భారతీయ సాహిత్య నిర్మాతలు) - బి.విజయభారతి
3. లేఖాసాహిత్య స్వరూప స్వభావాలు - డా॥ ధరణికోట వీణావాణి
4. బోయి భీమన్న రూపకాలు - తాత్విక చింతన - డా॥ తక్కళ్ళ బాలరాజు.

జగత్ సత్యం బ్రహ్మమిథ్య - భీమన్న సమసమాజ దృక్పథం

- డా॥. టి. మోహనశ్రీ, ప్రిన్సిపాల్, శ్రీ కన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై

జగత్ సత్యం బ్రహ్మ మిథ్య దృశ్యకావ్యకర్త పద్మశ్రీ బోయి భీమన్న. అంకితం భీమన్నగారి మాటల్లో జి.వి సుబ్రమణ్యం అనే పేరును జి.వి.యస్‌గా కుదించారు. వారి శిష్యులు జి.వి.యస్ షష్టిపూర్తిని ఒక మహోత్సవంగా, ఒక సారస్వతోద్యమంగా జరిపారు. సెప్టెంబరులో అయన జన్మోత్సవం జరిపి అనేక మంది కవిపండితులను ఆహ్వానించారు. అలాగే సన్మానించారు. అట్టి మహాసభలో సన్మానితులలో నేనూ ఒకడిని. జి.వి.యస్ పీఠికలు అనే గ్రంథాన్ని నాకు అంకితం చేశారు. అయన గొప్ప వ్యుత్పన్నుడు, మేధావి, ఉద్దంత పండితుడు, ఉన్నతోన్నత మానవత్వంగల మహా మనిషి. విశిష్ట వ్యక్తిత్వంగల మహావ్యక్తులలో ఈనాడు సుబ్రమణ్యంగారు, నా గ్రంథావిష్కరణ సభల్లో, సాహిత్య ఉత్సవాల్లో పాల్గొంటూ గ్రంథ పరిచయాలు చేసే అత్యున్నత వ్యక్తి, అభ్యుదయ భావసంపన్నుడు, అపార లోకజ్ఞతా వైభవ సముజ్వలుడు.

ఆనాటి సభ సారస్వత వైభవ వైజయంతిక సభలో పాల్గొని అంకితాన్ని అందుకొని, పొగడ్తలు విని ఆనందంలో తన్మయుడై ఇంటికి చేరిన నేను అదే ఆలోచనలతో నిద్రకు ఉపక్రమించినప్పుడు నా ముందు ప్రత్యక్షమైన దృశ్యం ఈ కావ్యం. దీని జరిగింది జరిగినట్టు దృశ్య దృశ్యకావ్యంగా ఆ రాత్రి వ్రాసాను సుబ్రహ్మణ్యం గారికే అంకితం చెయాలన్న ఆలోచన వచ్చింది. అంటూ బోయి భీమన్నగారి విశ్లేషణ ప్రకారం అంకితం ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి ఇచ్చారన్నది స్పష్టం.

బ్రహ్మ, సరస్వతి, భీమన్న (నేను) పాత్రలలో సంభాషణల దృశ్యకావ్యం జగత్ సత్యం బ్రహ్మమిథ్య. ఇది దృశ్యకావ్యమైననూ ఇతివృత్తంలో కథ లేదు. భీమన్నగారి మనసులోని కల్పనలకు కొద్దిపాటి విచిత్ర భావాలకు అక్షర రూపం. కళ మానవుని ఆచరణకి ఒక స్పష్టమైన దిశా నిర్దేశం చెయ్యగలడు. ఒక లక్ష్యాన్ని ఇవ్వగలడు. ఇది కళాకారుడికి లేదా రచయిత సౌందర్య సూత్రాల ద్వారా చేశాడు. ఆదర్శ వాస్తవంలోకి ప్రవహించే ఆలోచన చాలా లోతైనది. మానవుని వ్యక్తిగత జీవితంలో కూడా చాలా సత్యం ఉంది. భీమన్న రచనల్లో వాస్తవికత కన్పిస్తుంది. కవికి ఈ ప్రపంచం తృప్తిని కలిగించదు. అందువల్ల తన చైతన్యంతో దాన్ని మార్చాలనుకుంటాడు. అయితే ప్రపంచం తన సూత్రాలలోనే మార్పుచెందుతుంది. భీమన్న దృశ్యకావ్యం ఇందుకు తార్కాణం.

సమాజంలో వైరుధ్యాలు పురుగుతున్నప్పుడు కవి సాధారణంగా అన్యాయాల్ని ఖండిస్తూ రాస్తాడు. ఇలాంటివి జరగకుండా ఉంటే బాగుండుననే ఉద్దేశంతో పతనమైన విలువల్ని, మానవ దుర్మార్గాన్ని నిందిస్తూ రాస్తాడు. తన కోపాన్ని ఎవరి మీద గురిపెట్టాలో నిశ్చితంగా చెప్పడు. కానీ తన అసహనాన్ని ప్రకటిస్తాడు. దీన్ని విమర్శనాత్మక వాస్తవికత అంటాం. సరస్వతి నోట భీమన్న పలికినది

"ఆదిక్కు మాలిన విఐపి మనస్తత్వాన్ని
అలవర్చుకోవద్దని
ఎన్ని సార్లు చెప్పాను మీకు
..... మేధావుల సభల్లోకి ధైర్యంగా వెళ్ళలేరు
సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి వెళ్ళలేరు
బధిరాంధక విగ్రహాలై దాగుకొనే కంటే
ప్రజ్ఞానుల సూక్తుల్ని స్వయంగా విన
లోపాలను దిద్దుకోవడం లోకజ్ఞత కాదా
చైతత్వం వికసించిన కొలదీ వెలుగు ప్రసరిస్తున్న కొలదీ
స్త్రీ తన శక్తిని తను గుర్తిస్తున్నది
చరిత్రకు చాలా ప్రధానం
ఊహలు మట్టివంటివి

కుమ్మరి మట్టితో కుండలు చేసినట్టు
కవులు ఊహలలో చరిత్రలు సృష్టిస్తారు''

పీఠికలో భీమన్న ఉన్నదున్నట్టుగా నిజం చెప్పడం నా అలవాటు దాని వల్ల ఎన్నో నిష్మరాలు చుట్టుముడుతు, ఎంతోమంది స్నేహితులు దూరమైపోతారు. నిజం ఉగాది నాటి వేపపువ్వు పచ్చడిలాంటిది. ఆరోగ్యకరమే కావచ్చు. కానీ చేదుకాదా! దానిని వడ్డిస్తూనే ఉంటాను నేను. ఫలితాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ లెక్క చెయ్యను అంటాడు.

''బ్రహ్మతో కవి
ఎప్పుడో ఒకసారి సృష్టి చేసేసి
దాన్ని స్టీరియోకి ఎక్కించేశారు
ఇక కుప్ప తెప్పలుగా అవే నకళ్లు
శాల్తీలలో ఏ మార్పూ లేదు
గుణాలలో ఏ మార్పూ లేదు
నాడు ఒక్క ఇంద్రుడు, ఒక అహల్య
ఈనాడు లక్షల ఇంద్రులు, కోట్ల అహల్యలు
అహల్యలు చస్తున్నారు
ఇంద్రులు పదోన్నతి పొందుతున్నారు
అవే స్టీరియో నకళ్లు
మీరు కొత్తగా చేస్తున్న పనేమిటి!''

మరో చోట.....

బహ్మ - ''కర్మ అంటే పనిరా
చేసే పనిని బట్టి
ప్రతిఫలం ఉంటుంది''

కవి - ''ఎవడి జీవితానికి వాడే కర్త అన్నమాట
పనే సృష్టికర్త అన్నమాట
మరి వేరే బ్రహ్మ దేవుడుడెందుకు''

బ్రహ్మ అయిదవ ముఖం పలికిన మాటలలో కవి భావనలు స్పష్టం.

భారతీయ ప్రజలారా
సోదరీ సోదరీ మణులారా
నేను బ్రహ్మదేవుణి అయిదవ ముఖాన్ని
ఆయన పుట్టడయే అయిదు ముఖాలతో పుట్టాడు
నేను తక్కిన నాలుగు ముఖాలకు అధిపతిని
ఆ స్థితి నుంచి నే నెలా
అదృశ్యమై పోయానో అదొక పెద్దకథ
.....
నాపై దూకి నన్ను నరికి పారేశారు
బ్రహ్మను చతుర్ముఖ బ్రహ్మ అన్నారు.
పంచమ ముఖాన్ని గాడిద ముఖం అన్నారు
పంచముఖ బ్రహ్మను చతుర్ముఖడన్నట్లే
పలాన వర్ణ జాతిని చాతుర్వర్ణ్య జాతి అన్నారు.
ఆ విధంగా పంచములకు
అస్థిత్వం లేకుండా చేశారు
గిరిజనులకు నిర్వీర్యులను చేశారు
స్త్రీకి స్వాతంత్ర్యం అక్కర లేదని
పాంచాలి వంటి మహాశక్తిని
అవమానాల పాలు చేశారు'' అంటూ

నన్ను చూపుతూ (కవి)

ఈ మహాకవి
చూపిన సాహసం వల్ల
హరిజనులూ, గిరిజనులూ
మహిళలూ కలిసి
మూడు వర్గాలు ఏకమై
హకుల కోసం ముందుకు వచ్చారు
అధికారం చేపడతారు
ఆనందం అందరికీ పంచుతారు
రైతు కూలీ ప్రజారాజ్యం ఏర్పడుతుంది
వర్గాలు, పోరాటాలూ ఉండవు
ప్రపంచ మానవులంతా
ఏక కుటుంబంగా
జీవించ గలుగుతారు
సత్యం చెపుతున్నాను వినండి

ప్రకృతి సత్యం - పురుషుడు అంతర్వాహిని
సరస్వతి సత్యం - బ్రహ్మ అంతశ్శక్తి
జగత్తు సత్యం - పరబ్రహ్మ అంత: చేతన
కొబ్బరిచెట్టు కొబ్బరి కాయలే కాస్తుంది
ఎంత ప్రార్థించినా - గులాబి పువ్వులు పూయదు
అంధకారంలో అన్నీ సమానమే
వ్యక్తిత్వం లేని శక్తి వుండీ లేనట్లే!
అందుకే దానిని మిథ్య అన్నాడు కవి!
నిజమంతే! సత్యం పరబ్రహ్మ మిథ్యా!

పు. 631 నుండి 632

అనుభూతి లేని కవిత్వం ఏదీ ఉండదు. వేల సంవత్సరాలుగా ఈ అసమాన సమాజంలో ఒక సంఘటిత శక్తిగా, సమానత సాధించడానికి ఎన్నో రచనలు వచ్చాయి. భీమన్న ఈ రచన కూడా అలా వచ్చిందే. సమాజాన్ని గురించి చెప్పడం, ఉన్నదున్నట్లుగా చెప్పడం భీమన్న సామాజిక చింతన కనపడుతుంది.

బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య అనేది శంకరాచార్యుడి సిద్ధాంతం. సత్యం నుంచి పుట్టిదంతా సత్యమే అవుతుంది. కనుక జగత్తు కూడా సత్యమే అనేది సిద్ధాంతం. బ్రహ్మ శాశ్వత సత్యం కనుక జగత్తు కూడా సత్యమే అనేది నా సిద్ధాంతం. బ్రహ్మ శాశ్వత సత్యం అయితే జగత్తు తాత్కాలిక సత్యం కావచ్చు. జగత్తు ఎంత తాత్కాలిక మైనా, క్షణికమైన దైనా సత్యమే అవుతుంది కాని మిథ్య ఎలా అవుతుంది?

అయితే పరబ్రహ్మ ఒక శక్తి (ఎనర్జీ) అయినప్పుడు, ఆ శక్తికి జాగృతి లేనప్పుడు అది ఉన్నా లేనట్టే కదా!

దేవుడు ఉన్నా డనుకుంటే ఉన్నాడు. లేడనుకుంటే లేడు అని నా చిన్నప్పుడు మా అయ్య చెప్పిన మాట నా కిప్పటికీ వేదవాక్యమే. దేవుడ్ని ధ్యానించడం వల్ల, ప్రార్థించడం వల్ల, కోరికలు కోరడం వల్ల ఫలితం కనిపించక పోవడానికి కారణం ఇదే. జన్యు స్వభావం మారదు. యథా జన్యు తథా ఫలం. జన్యు స్వభావాన్ని మార్చడానికి సైంటిస్టులు ప్రయత్నిస్తున్నారు. ఫలితం ఉంటుందనీ, అది ప్రజలకు ఉపయుక్తం అవుతుందనీ నేను అనుకోవడం లేదు.

బ్రహ్మ మిథ్య అనేది ఈ కావ్యంలో బ్రహ్మ గారే చెప్పినట్లు చతుర్ముఖ బ్రహ్మను గురించినట్టిదే కావచ్చు.

ఎందుకంటే మనువు పంచమ వర్ణం లేదన్నట్లే, బ్రహ్మ యొక్క పంచమ ముఖాన్ని నరికి వేసినప్పుడే చాతుర్వర్ణ్య వ్యవస్థ నిర్వీర్యమైంది. అలాంటి చతుర్ముఖ బ్రహ్మను గానీ, ఆయన సృష్టిని గానీ మిత్య అన్నప్పుడు అది నిజంగా మిథ్యే. ఇప్పుడు అది ఉండీ లేనట్టే కదా! చాతుర్వర్ణ్య వ్యవస్థ చాతుర్కుల వ్యవస్థగా మారి హైందవ సమాజమే అన్ని విధాలా శక్తిహీనమై ఉంది కదా!

అందుకే ఈ కావ్యంలో బ్రహ్మ యొక్క పంచమ ముఖాన్నే సత్యంగా ప్రకటించాను. దానికి సరస్వతితో అవినాభావం కల్పించాను. బ్రహ్మ చేస్తున్న నాలుగు ముఖాల, నాలుగు రకాల సృష్టినీ కాదన్నాను. ఏక ముఖంతో ఏక జాతి సృష్టికి గుర్తింపు ఇచ్చాను. వర్ణ కుల బేధాలు, వృత్తి బేధాలు, వయోలింగ బేధాలు లేని ఏక జాతీయతను, ఏకైక మానవతను ప్రాచుర్యం లోకి తెచ్చాను. పురుషాధిపత్యం నుంచి అధినేతృత్వాన్ని పౌరుష గుణానికి మార్చాను. పౌరుషం ఎవరిలో ఉన్నా వాళ్లు అధిపత్యానికి అర్హులే. బ్రహ్మ సృష్టికి కాలదోషం పట్టింది. నరన్వతి యొక్క పంచమ ముఖ నత్య సృష్టి ప్రారంభమైంది.

ఈ కావ్యాన్ని దీని రచనకు మూల కారణమైన జీవియస్ గారికే అంకితమిస్తున్నాను. ఆయన పీఠికా సంకలన గ్రంథం నాకు అంకితమిస్తూ ఆయన ఇలా వ్రాశారు.

పాలేరు నుండి పద్మశ్రీ దాకా
ప్రస్థానం సాగించిన ప్రజానిధి
రాగ వైశాఖిలో రసాద్వైతాన్ని
సంధించిన రాజయోగి

ఉపనిషత్కాల సమ సమాజాన్ని
దర్శించిన కాలమేది
దీప సభలా కలకాలం
వెలుగొందే కావ్య శిల్పి
పద్మశ్రీ డా॥ బోయి భీమన్న గారికి
గౌరవ పురస్కారంగా అంకితం.

జగత్ సత్యం - బ్రహ్మమిథ్య అనే దృశ్యకావ్యం పీఠిక. వివరణలోని కవి మాటలకు అలాగే చెప్పడం జరిగింది. సత్యం కనుక వివరణ అవసరం లేదు. భాష సులభమైనది. భావం స్పష్టమైనది. ఆలోచనలు స్వచ్ఛమైనది. సమ సమాజం. పద్మశ్రీ బోయి భీమన్న ఉద్దేశాలకు నిదర్శనం. తప్పక పాఠక ప్రేమికులు చదవాల్సిన తరుణం.



భీమన్న ప్రాచీన - ఆధునిక కవిత్వాలకు వారిధి

- డా॥. మందలపు నటరాజ్, చెన్నై.

బోయిభీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనల చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత, మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ సన్మానాలందుకున్న కవి బోయిభీమన్న.

బోయిభీమన్న గారు సాహితీలోకానికే కాక యావత్ భారతదేశానికి పద్మశ్రీ భీమన్నగా, ఉత్తమ కవిగా సుపరిచితులు. తూర్పు గోదావరి, మామిడికుదురు గ్రామములో 1911 సెప్టెంబరు 19న బోయి పల్లయ్య, నాగమ్మ దంపతులకు బోయిభీమన్న జన్మించారు. భారత దేశంలోని ప్రధాన సౌందర్య కేంద్రాలలో కోనసీమ ఒకటి. కోనసీమ భూలోక స్వర్గంగాను, మామిడికుదురు ఒక మందార వనంగాను భీమన్న తన రచనల్లో అభి వర్ణించాడు. ఇతని బాల్యం ఈ సీమలోనే గడించింది.

భీమన్న 5వ తరగతిలోనే తొలిరచన చేశాడు. అది వారి సాహితీ జీవనానికి నాంది అయింది. ఒక వైపు పాఠం జరుగుతూ వుంటే క్లాస్‌లోనే తొలి రచన చేశాడు. స్కూల్లో చదివే వయస్సులోనే భారతం, భాగవతమూ పూర్తిగా చదవగలగాడు. బోయిభీమన్న పేదగా పుట్టి పేదగా పెరిగినా పేదగా బ్రతికినవాడు మాత్రం కాదు. కష్టాలూ, బాధలూ ఎన్నో అనుభవిస్తూ కూడ నిత్యసంతోషిగా జీవించినవాడు. అవమానాలను అవతల నెడుతూ అభిమానాలను పదిలపరుచుకుంటూ అగ్రస్థానానికి చేరుకున్నాడు బోయిభీమన్న.

గ్రామీణజీవనం, అచ్చటి వ్యక్తులు అక్కడి అనుభావాలు, జ్ఞాపకాలు భీమన్న రచనలన్నింటిలోను చోటుచేసుకున్నాయి. వేమన్న లాగే భీమన్న కూడా సహజ కవి. సంపూర్ణ సాహిత్యం అతనిది. ప్రకృతిలోని సహజ సౌందర్యమంతా అలంకరించిన కోనసీమలో ప్రకృతి పురుషుల్లాంటి తల్లిదండ్రుల సన్నిధిలో బాల్యం గడిపాడు భీమన్న. తన బాల్యంలో పొందిన అనుభూతులు, సంఘటనలు తన రచనల్లోనూ కనిపిస్తాయి. ఒక చోట భీమన్న ఇలా అంటారు.

"నగ్న సత్యం వేదాంతం
అలంకృత సత్యం కవిత్వం"

భీమన్న కవిగానే కాక అనేక ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో అనేక పదవులు నిర్వహించారు. 1940 నుండి 1945 వరకు ఉపాధ్యాయులుగానూ 1950 నుండి 1955 వరకు 'ఆంధ్రప్రభ' పత్రిక యొక్క సబ్‌ఎడిటర్‌గానూ పనిచేశాడు. 1960లో నవ్య సాహితీ సమితి అధ్యక్షులుగా అఖిల భారత ప్రథమ తెలుగు రచయితల సభలకు సారథ్యం వహించారు. ఆ తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘం సభ్యులుగానూ, 1978లో ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు సభ్యులుగా ప్రభుత్వంచే నియమింపబడ్డారు. ఇలా ఇంకా ఎన్నో హోదాలను భీమన్న నిర్వహించారు.

భీమన్న నాటక రచయితగా గొప్పపేరు గడించినా తెలుగులోనే కాక ఇంగ్లీషులో కూడా రచనలు చేశాడు. వీరి రచనలు పండితులకే గాక పామర జనానికి అర్థమయ్యే విధంగానూ హృదయానికి హత్తుకునే విధంగాను ఉండి ఆలోచింపజేస్తాయి. ఆయన లక్ష్యం, గమ్యం, ధ్యేయం, కవితారాధనే ఆయన ప్రతి రచన కూడా మౌళికమైనదే. వ్యక్తులు, సంఘటనలు, సన్నివేశాలు - ప్రకృతిలోని ప్రతి వస్తువు ఉచితమైన లయలో సముచితమైన ఛందస్సులో రూపుదిద్దుకొని ప్రతి రచన లోనూ కనిపిస్తాయి.

మధుబాల, అశోకవనిలో రాముడు, మణిమానసం వంటి లఘుకావ్యాలు, దీపసభ, రాగవైశాఖ అనే మహా

కావ్యాలు, అనాది కోన నుండి అనంతత్వంలోకి, గుడిసెలు కలిపోతున్నై, శివాలకలు వంటి వచన కవితా కావ్య సంపూటాలు. మానవుని మరొక మజిలి, పైరుపాట, పాలేరు, కొలిరాజు రాగ వాసిష్ఠం, బాలయోగి, ఆదికవి వాల్మీకి, పడిపోతున్న అడ్డగోడలు చిత్ర కళాప్రదర్శనం, ప్రగతి అసూయ వంటి రూపకాలు భీమన్న కలం నుండి వెలువడ్డాయి. భీమన్న సాహితీ సజన పద్యం, గేయం, వచనం, నతాటకం, నవల, సంగీత నృత్య రూపకం, చాటువు, విమర్శ తధితర ప్రక్రియల్లో విస్తరిల్లి పాఠకులను ఆకర్షించింది, ఆలోచింపజేసింది.

దీపసభ, మధుబాల వంటి కావ్యాలు ప్రజాదరణ పొందితే 'పాలేరు' నాటకం పలు ప్రదర్శనలు ఇచ్చింది. 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకుంది.

భీమన్న తనలోని ప్రత్యేకతను, విశిష్టతను గుర్తించు కొని వాటికి అనుగుణంగా తన జీవితాన్ని తీర్చిదిద్దు కున్నాడు. అంతే తప్ప ఇతరులను అనుకరించడం, అనుసరించడం తనకెంతో హానికరం అని గుర్తించాడు. స్వంత వ్యక్తిత్వం, మేధానైశిత్యం వున్న వ్యక్తి. భీమన్న ఎవర్ని ఆదర్శంగా తీసుకోలేదు. తనకు తానే ఆదర్శం " ఒక గొప్ప వ్యక్తి ఎప్పుడూ సామాన్యుల నుంచి సాధారణ వ్యక్తుల నుండి ఘర్షణను ఎదుర్కొవలసి ఉంటుంది". ఇది అక్షరారాల బోయిభీమన్న విషయంలో జరిగినట్టు అతని వ్యక్తిత్వం ద్వారా తెలుస్తుంది. ఇంకా భీమన్న వ్యక్తిత్వమేమిటో ఆయన రచనల ద్వారా, ఆయన చింతన ద్వారా మనకు తెలుస్తుంది. ముఖ్యంగా ప్రజా స్వామ్యం, మానవతా వాదం ఈ రెండూ భీమన్న జీవిత ధ్యేయాలు. విశ్వాన్నంతటినీ ఆకళింపు చేసుకున్న తత్వవేత్త. తన తాత్విక దృష్టితో ప్రపంచానికి కొత్త దారులు చూపించిన మహానీయుడు. గొప్ప మానవతావది.

అద్వైతం - శంకరాచార్యులు, విశిష్టాద్వైతం - రామానుజాచార్యులు బోధిస్తే భీమన్న - రసాద్వైతం బోధిస్తున్నాడు. ప్రేమ అభిమానం గౌరవం అందరూ సమానముగా పొందవలెనన్నాదే రసాద్వైతం.

తెలుగు భాషలో అట్టడుగు సమాజంగా భావిస్తున్న దళిత సమాజం నుండి ముందు తరంలో దూసుకొచ్చిన కవుల్లో కుసుమ ధర్మన్న, గుఱ్ఱం జాషువ, బోయిభీమన్న ప్రసిద్ధులు.

భీమన్న ప్రాచీన - ఆధునిక కవిత్వాలకు వారిధి. సామాజిక మార్పును ఇతివృత్తంగా తీసుకున్న ఆయన రచనలు సంప్రదాయ వాదులకు శిరోధార్యాలయ్యాయి. వస్తువు, వ్యక్తీకరణ, శిల్పం, రససిద్ధి తదితర విశిష్టతలతో ఆధునికులకు ఆరాధ్యుడయ్యాడు. భీమన్న కవిత్వంలో తెలుగు భాష పైరు పంటగా పండింది. అమ్మ నాగమ్మకు భక్త్యంజలి ఘటిస్తూ పైరుపాట గేయ నాటకంలో ఇలా అంటాడు.

పైరు చేల గట్టులలో
పచ్చగడ్డి పువ్వులలో
పల్లెటూరి పడుచులతో
పాటలెన్నో పాడుకొంటూ
చల్లని నా భావలతను పల్లవింపజేసిన
ఊడ్పుచేల మునుములలో
ఉయ్యేలా పాటలతో పరికన్నెల చిరుగుండెల
వరహాలను పండిస్తూ...
నా శైశవ హృదయంలో నందనాలు నాటిన
కొబ్బరి మామిడి తోటల
కోయిల తీయని పాటల
శ్రమనెంచక పాటుపడుచు
సంసారం దిద్దుకొనుచు
పెంకెతనపు నా గుండెను
ప్రేమార్ధమొనర్చిన.....

ఈ గేయ కవితలోని ప్రతి తెలుగు మాట ఒక సంస్కృతికి ఒక జీవన విధానానికి అద్దం పడుతున్నాయి. ఇందులో పైరుచేలు, గట్టులు, రురచక పల్లెటూరి పడుచులు, ఊడ్పుచేలు, మునుములు, ఉయ్యాల

పాటలు, వరికన్నెలు, కొబ్బరి మామిడి తోటలు, కోయిల పాటలు ఇవన్నీ గోదావరి గట్లు మీద నడిచినట్లే మనకి తలపింప చేస్తున్నాయి. భీమన్న తన రచనలో సామాజిక నేపథ్యాన్ని బలంగా చెప్పాడు.

గోదావరి ప్రకృతిలో ఆయన ఎంత పరవశించాడో, సామాజిక రుగ్మతుల పట్ల కూడా ఆయన అంత వ్యథ చెందాడు. భీమన్న కవితలో పూలమరిమళంతో పాటు అగ్నిసెగ కూడా దాగివుంది.

రగులుచున్నది అగ్ని పర్వత మొకొక్క
శ్రామికుని గుండెలో, అది రగిలి రగిలి
భళ్ళుమని బ్రద్దలై అగ్ని బరవు నేని
అపుడు చింతించి లాభమేమైన కలదె?

భీమన్న సమాజాన్ని రెండు పార్శ్వాల నుండి చూశాడు. ప్రకృతిలో రామణీయతను చూశాడు. మనిషి గుండెల్లో అగ్నిని చూశాడు. ప్రకృతిలాగే సమాజం సమతుల్యం కావాలంటే ప్రకృతిని, సమాజాన్ని సమన్వయించాలన్నాడు. సమతకోసం వెలుగెత్తాలనుకున్నాడు. అంతమాత్రాన మనిషి నిర్వీర్యం చెందకుండా ప్రకృతిలోని వెలుగుల్ని సంతరించుకోవాలని కూడా ప్రబోధించాడు. అదే భీమన్నలోని కవితా ఋషితత్వం.

ప్రాచీన కవుల్లో శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలతో బోయిభీమన్నను పోల్చవచ్చు. ఆయన కవితా సామర్థ్యం అనమానమైంది. ఒక భావాన్ని వ్యక్తీకరించడంలో భీమన్నకు వున్న తీవ్రత కృష్ణదేవరాయుల మాలదాసరి కథను తలపిస్తుంది. పదాలు కూర్చడంలోగాని వాటిని ఈటెలుగా విసరడంలోగాని భీమన్నకు భీమన్నే సాటి. తాను ఏ పునాదుల నుండి వచ్చాడో ఆ పునాదుల నుండే తాను కవిత్వం చెప్తాడు. అది గద్యమైనా, పద్యమైనా, నాటకమైనా ఆ పట్టు ఆ వరవడి సజీవంగా వుంటుంది.

అడిగితే కాని అమ్మైనా పెట్టదు
ఏడ్చే వాడికే పాలు పడుతుంది
ఆందోళన చేస్తేనే గాని
అవసరాలు గుర్తించబడవు
అందుకే మేల్కొనండి
ప్రజలను మేల్కొలపండి
ఏకం కండి
ఎలుగెత్తి అడగండి....

భీమన్న గారి ప్రతీ మాట ధ్వని సామర్థ్యం కలిగి మెదడును మేలుకొల్పి నిస్సత్తువ, నిర్వీర్యాన్ని తొలగించి సామాజిక విప్లవ సమరం చేస్తుంది. వివిధ విషయాలను గురించి విభిన్న దృక్పథాలతో భీమన్న వ్రాసిన రచనలు తాత్త్విక దర్శనాన్ని తెలుపుతాయి. ఒక చోట భీమన్న ఇలా అంటాడు.

1. నేను హేతువాదిని, మానవతావాదిని, నాకు మానవునిలోని వాని అభ్యుదయములోను పూర్తిగా విశ్వాసమున్నది.
2. దేవుని నమ్మను పరమాత్మను నమ్ముతాను. దేవుడు వ్యక్తిగతమైనది. పరమాత్మ ప్రపంచకమైనది. ప్రాపంచకమైనదే సత్యం. సత్యమే భగవత్స్వరూపం.

బోయి భీమన్నలో ఒక ప్రత్యేకత కలదు. వివిధ తత్త్వవేత్తలు భావాలను చదివి అర్థం చేసుకొని తనదంటూ ఒక సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. దానికి "రసాద్వైతమని' పేరు పెట్టారు.

చివరిగా భీమన్న తన సాహిత్య ఆశయం గూర్చి ఇలా అంటాడు.

"నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు
వాళ్ళను తిట్టైనా సరే
అక్కడ నుండి లేవడం
అరుణోదయం కేసి తరమడం..."

- అంటాడు. ఇలా భీమన్న సామాన్య ప్రజాజీవనానికి ప్రతిబంధకాలైన కుల-మత-వర్గ-లింగ వివక్షతలు, అనచివేతలు, దోపిడీ దౌర్జన్యాలు, నిరంకుశత్వం, అరాచకత్వం మొదలగు సమకాలీన సామాజిక రుగ్మతుల్ని

ఇతివృత్తాలుగా స్వీకరించి, సందేశాత్మక రచనలు రచించిన విశ్వవిఖ్యాత నాటకకర్త షేక్స్పియర్, జ్ఞానపీఠ అవార్డు గ్రహీతయైన గిరీష్ కర్నాడ్, అంతర్జాతీయ అవార్డు అందుకున్న మంజులా పద్మనాభన్ వంటి ప్రఖ్యాత రచయితల శ్రేణికి చెందిన వ్యక్తి పద్మభూషణ్ బోయి భీమన్న.

❁❁❁

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న – చాండాలిక రచనా వైభవం

– డా॥. పి. ఎస్. మైథిలి, సహాయాచార్యులు, తెలుగు శాఖ, శ్రీకన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై, తమిళనాడు.

"బానిసతనమును బాపుమురా
భారతభూమికి భాగ్యము తేరా!
సకల దేశముల సర్వ మానవుల
సామ్యము సాధింపుమురా"

అంటూ తన రచనలతో అణగారిన సమాజాన్ని ప్రేరేపించిన సమరసతా సాహిత్య సిద్ధాంతకర్త బోయి భీమన్న. పేదరికం, అంటరానితనం, అవమానాల స్వానుభవాలతో అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన ఈ సాహితీవేత్త, సెప్టెంబరు 19, 1911న జన్మించారు. తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు ఆయన స్వస్థలం. తండ్రి పుల్లయ్య, తల్లి నాగమ్మ. తండ్రి అయిదుగురు కొడుకులకు పంచపాండవుల పేర్లు పెట్టుకున్న క్రమంలో రెండో కుమారుడే 'భీమన్న' అయ్యారు! విద్యాభ్యాసం పూర్తయిన తొలిరోజుల్లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారాయన. ఆ తర్వాత జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, నవజీవన్, ఆంధ్రప్రభ పత్రికల్లో పనిచేశారు. "వ్యక్తుల వికాసమే జాతి. జాతుల వికాసమే వసుధ. వసుధైక సామ్రాజ్యమే మానవలోక సంపూర్ణ ఫలం" అన్నది భీమన్న తాత్విక భూమిక. "కవి ఏ కాలంలో జీవించాడో, ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక,ఆధ్యాత్మిక విషయాలన్నీ అతడి రచనల్లో ప్రతిఫలించాలి" అని చెప్పిన బోయి భీమన్న కవిత్వం తెలుగు సంస్కృతికి అద్దంపడుతుంది.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మ భూషణ్ తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ, సన్మానాలందుకున్న కవి, బోయి భీమన్న. పేదరికంతో పాటు, అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటినుండి భీమన్నకు అనుభవమే. సహజంగానే అతను వీటిని నిరసించాడు. అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేశారు .

బోయి భీమన్న ప్రముఖ రచయిత. ఈయన సుమారు 70పుస్తకాలు రాశారు. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా రాశారు. వివిధ పుస్తకాలకు రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్నేహో కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని రాశాడు. వీటన్నింటితో పాటు అంబేడ్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశాడు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేడ్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయ వాది. భారతజాతీయదృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించు కోవాలి. అంబేడ్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ అదే! తన జీవితాంతం ఆయన జాతీయవాది గానే ఉన్నాడు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష ఉంటుంది.

వీరు అనేక రచనలు చేసి సాహిత్య లోకంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించడమే కాక తన సాహిత్యం వైపు సాహిత్యలోకాన్నే తిరిగి చూసేలా చేసిన గొప్ప వ్యక్తి.

రచనలు :

కవితలు :

అనాది కొసనుంచి అనంతతత్వంలోకి , రాగవైశాఖి , రాఖీలు (కవితా సంకలనం) , గుడిసెలు కూలిపోతున్నై' కవితాసంపుటి 1975 (కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది), భీమన్న ఉగాదులు, భీమన్న కావ్య కుసుమాలు, మోక్షం నా జన్మహక్కు, చివరిమెట్టుమీద శివుడు, కూలీ శతకం, రాగోదయం, అకాండతాండవం, గిల్లిచెబుతున్నా, మధుబాల, మధుగీత , దీపసభ.

నాటకాలు :

పాలేరు, నాటకం - 1938 , కూలిరాజు, అసూయ, ప్రగతి , పడిపోతున్న గోడలు , రాగవాసిష్ఠం, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు, బాలయోగి, చిత్రకళా ప్రదర్శనం (నాటికల సంపుటి), నవజీవన్ పత్రిక, చండాలిక (టాగూర్ రచించిన చండాలిక నాటికకు అనువాదము). వచన రచనలు: ఏకపద్యాపాఖ్యానం, ఇదిగో ఇదీ భగవద్గీత, జన్మాంతరవైరం, పురాణాలలో హరి-గిరిజన మనీషులు, ధర్మం కోసం పోరాటం, అంబేద్కరిజ, అంబేద్కరమతం, జానపదుని జాబులు.

వీరి రచనలలో చండాలిక నాటిక టాగూర్ రచించిన చండాలిక నాటికకు అనువాదము.

'చాండాలిక' నాటికను ఠాగూర్ 1938లో రచించారు. చాండాలిక అంటరానిది, మాంత్రికురాలి కుమార్తె. అంటారిని వారు ఏ విషయాన్నైనా స్వతంత్రంగా చేయడానికి సమాజం అనుమతి ఇవ్వదని, అలాంటి అంటరాని వారికి సైతం మనసు ఉంటుందని వారి మానసిక ఆత్మ వేదనను, వారిలో చిగురించే భావాలకు ఒక రూపాన్నిచ్చి జీవం పోసిన వారు రవీంద్రనాథ్ ఠాగూర్‌గారు. వారు ఆంగ్లంలో చేసిన నాటికను తెలుగులో అనువదించి తెలుగు ప్రజల మనస్సులో ఎనలేని స్థానాన్ని ఆక్రమించిన వారు బోయిభీమన్నగారు.

"ఒక పల్లె సమీపం. దూరంలో గుడిసెలు, ఒక బావి, బావి ప్రక్క ఒకటి రెండు కుండలు, ఒక బండ, బండునానుకొని కాలిబాట, వైశాఖం, మధ్యాహ్నం, నిప్పులు చెరుగుతున్న ఎండ..

ప్రవేశం చాండాలిక, పద్దెనిమిదేళ్లు, వేకువలోని ఎర్రదామర మొగ్గ, విచ్చీవిచ్చని దశ, ఒక చేతిలో చేద... అంటూ నాటిక ప్రారంభమౌతాయి.

మండిపోతున్న ఎండలో చాండాలికా నడుస్తూ, నడవలేక, సూర్యుడు ఈ రోజు తన ప్రేమను చూపి పండుగ చేసుకుంటున్నాడు. ఎండమండిపోతుందని అనుకుంటూ సూర్యున్ని చూసి, జీవరాశులు, పశుపక్ష్యాదులు, మనుషులందరు నీ ఎండకు తట్టుకోలేక బాధపడుతున్నారు. ఎందుకు నీ తీవ్రతను చూపిస్తున్నావు. చల్లారమని, కుండలోని నీళ్లు దోసెడు తీసి సూర్యునివైపు చల్లి తాగి పొమ్మంటుంది.అవి అప్పుడే రంగంలో ప్రవేశించిన ఆనందుడిపై పడతాయి. అతడు ఉలిక్కిపడి, ఆ చల్లదనాన్ని ఆశ్వాదించి, నిట్టూర్చి ఒక చెట్టునీడలో నిలుస్తాడు ఆనందుడు బౌద్ధ సన్యాసి. చల్లటి నీటిని ఆశ్వాదించి, సేదదీరి, ఆనందుని చూసి సూర్యుడు వచ్చాడేమో అని అనుకుంది. తర్వాత నొచ్చుకుంది.

ఎండలకు గొంతు ఎండిపోతుంది. నీళ్ళు పోయని దోసిలి చాపగా, ఆమె నిజంగా ఆశ్చర్య పోయింది. తాను చండాల కన్య. అంటరానిది. అతడు బౌద్ధుడు, ఆ సూర్యునికంటే గొప్పవాడు. అటువంటి వారికి నీళ్ళు పొయ్యడమే? ఎంత పాపం అనుకుంటుంది. అనుకొని పొయ్యకపోతే ప్రాణాలకేమౌతుందో అని ఆపై ఊహించ లేనని, వణికిపోయి, ఉన్నట్లుండి, ఏమిటి ఉపద్రవం, ఏం చెయ్యాలి? తెలియ లేదనుకుంటుండగానే అతను మళ్ళీ అడిగాడు.

నీళ్ళు పోసి ప్రాణం కాపాడటమే పుణ్యమనగా నేను మాదిగదాన్ని, నేను నీళ్ళు పోస్తే మీకు పాపం వస్తుందని చెబుతుంది.

నీవు మనిషివి, నేను మనిషిని తారతమ్యాలు చూడటమే పాపం అంటాడు ఆనందుడు.

బైట వెలుగెంతయన్న లాభమ్ము లేదు
లోన చీకటియున్న! నీ మానసమ్ము
దివ్య దీపాలయమ్ముగా తెలిసికొమ్ము
బైట చీకటియున్నను బాధ లేదు
మానవుడు బుద్ధుడై, ధర్మమార్గమందు
సక్తుడై, ఏక సంఘాన స్వస్థుడై, వ
సించు కాలము నిన్ను పూజించగలదు
తెలిసికొని నిన్ను నీవు - వర్తింపు, మబల

అని ఆశీర్వదించి, ముందుకు నడపగా, ఆమె మనస్సులో ఏవీ తెలియని సంతోషం, మనలో అంటరాని తనం లేదనే ఒక మేల్కొలుపు. ఆనందుని మాటల ద్వారా చాండాలిక తను అపవిత్రం కాదని, ఇతరుల లాగే తను కూడా సర్వశక్తిమంతులన్న మేల్కొలుపు ఆమెలో కలిగింది. సమాజం కళంకానికి గురైన వ్యక్తిగా తనను తానే అంతర్గతంగా మార్చుకున్న చండాలికను నిజస్వరూపాన్ని, మనుషులందరు సమానులే అన్న భావనను తనలో కలిగించి, తమకు స్వతంత్రం ఉందన్న విషయాన్ని ఆ సిద్ధుడు తెలియజేస్తాడు.

అప్పటినుంచి ఆమె ప్రతిరోజు ఆనందుని కోసం ఎదురు చూస్తూ వుంటుంది. కాని ఆనందుడు రాడు. ఇలా రోజూ ఎదురు చూసి, ఎదురు చూసి ఒకరోజు తన తల్లితో జరిగిన విషయాన్ని చెప్పి, ఆమె మాంత్రిక శక్తితో ఆనందుని రప్పించమని చెప్పగా, తల్లి అలా ప్రయత్నిస్తుంది. అయినా ఆనందుడు రాలేదు. తల్లికి కోపం వచ్చి మంత్రదండాన్ని నేలకు కొడుతుంది. చాండాలిక తక్షణం వీర తాండవం చేస్తుంది. ప్రకృతి కల్లోలితమైపోయింది.

అప్పుడు చీకటి దెయ్యంలాంటి ఒక భయంకర రూపంలో ఆనందుడు మంత్ర వేదికపైకి వస్తాడు. చూసి చాండాలిక మూర్ఛపోయి, తేరుకొని, తప్పుచేసాని అతన్ని ప్రార్థించి క్షమించమంటుంది.

అంటురాని వారని సమాజంలో వేసిన ముద్ర, వారి మనస్సులో నాటుకుని స్వేచ్ఛా భావం లేకుండా, అభివృద్ధి చెందలేక కుంగిపోవడమేగాక, మనోవ్యధకు గురౌతారు. అలాంటి వారి మనస్సులో స్వేచ్ఛానుభావననే పుష్పాలను విచ్చుకోచేసిన ఆనందుని లాంటి వ్యక్తులను మళ్ళి చూడాలని, కలవాలని, ఆ స్త్రీ అనుకోవడం, మన మానసిక వికాశాన్ని తెలియజేసిన వ్యక్తితో మాట్లాడాలని అనుకోవడం, అంతా ఆమె మనస్సు మరింత వికాశాన్నిచ్చే వెలుగును చేకూరుస్తుందనే ఆశతో మాత్రమే!

ప్రకృతి యొక్క ప్రేమ స్వాధీనమైందిగా మారుతుంది. సన్యాసి ప్రకృతికి స్వేచ్ఛ స్వరూపాలుగా కనిపిస్తాడనేది నిజం. ప్రకృతి అనే పేరుగల అమ్మాయి వర్గ, కుల, లింగభేదాల వలయంలో ఎలా చిక్కుకుపోతుందో చూడటం నిజంగా విడ్డూరం.

ఈ నాటకంలో బోయిభీమన్నగారు అంటరానివారి మానసిక వ్యధను, ప్రకృతి సాంగత్యాన్ని చక్కగా వర్ణించారు. వర్ణనకవి చెప్పడంకన్నా వాస్తవమనే చెప్పాలి.

❁❁❁

బోయి భీమన్న జీవితం - సాహిత్యం

- ఎస్. శశికళ, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై - 05.

ఆధునికి తెలుగు సాహిత్య రంగంలో వివిధ కోణల్లో అనేక రచనలు వెలువడ్డాయి. ఆధునికి తెలుగు సాహిత్య చరిత్రకి నిండుదనాన్ని చేకూర్చాయి. నిజానికి మానవతా దృక్పథం అనే ఆలోచనే ఆధునికమైంది అని భావించ వచ్చు. ఇందుకు కారణం ఆధునికి యుగాన్ని స్వర్ణయుగంగా తీర్చిదిద్దిన ఘనత కవులు కృషి బలం చెప్పవచ్చు. సమాజంలో జరిగే ప్రతి సంఘటను తమ దృక్పథ కోణంతో ఆలోచించి ప్రజాసాహిత్యాన్ని సృష్టించే శక్తి కవులుకి నిరంతరం కృషి అవుతుంది. అటువంటి వారిలో మహామానవతామూర్తి బోయి భీమన్న ఒకరు. సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి కవిగానూ, రచయితగానూ, గొప్ప విమర్శకుడుగా, గేయ రచయితగా, వీటన్నిటినీ మించి ఒక గొప్ప మానవతావాదిగా అటు ప్రజలు హృదయాల్లోనూ, ఇటు సాహిత్య లోకంలోనూ స్థానం సంపాదించుకున్నారు. మానవతా దృక్పథంతో అనేక రచనలు సాగించారు.

సమాజంలో జరిగే అన్యాయాల్ని, ప్రజలపై జరిగే అంటరానితనాన్ని, గమనించి తన రచనలతో సమాజం వైపు పోరాటాన్ని కొనసాగించిన కళాకారుడు బోయి భీమన్నగారు అటువంటి గొప్ప మహనీయులైన భీమన్న గారి పరిచయాన్ని చుద్ధాం.

బాల్యం :

బోయి భీమన్న గారు 1911 సెప్టంబరు 19న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో, పల్లయ్య, నాగమ్మ, అను దంపతులకు జన్మించారు. వీరికి ఐదు మంది సంతానం, వీరిలో మూడోవారు బోయి భీమన్న గారు. భీమన్నగారు తండ్రి పల్లయ్యగారు భారత, భాగవతాలలోని పద్యాలను చాలా చక్కగా పాడేవారు. తల్లి జానపద గేయాలు, పాలం పనులకు వెళ్ళినప్పుడు పాలం పాటలు ఊయాల పాటలు ఇవన్నీ కూడా భీమన్నకు ఒక ఉత్సాహాన్ని కలిగించేవి. పల్లయ్యగారు పాడుకునే కందార్థ తత్వాలు, తల్లి పాడుకునే జానపద గీతాలు భీమన్నగారిపై బాల్యం నుండే ఎంతో ప్రభావం చూపింది. ఈ ప్రభావంతోనే ఇంటిలో, భారత భాగవతా లను తిరగేస్తూ సొంతంగా పద్యాలు రాసే ప్రయత్నం చేస్తుండేవారు.

తండ్రి గారి వేదాంత గోష్ఠులకు వెల్లడం వల్ల భీమన్నకు బాల్యంలోనె పద్యాలు రాయలనే ఉత్సాహం మరింత కలిగింది. అలానే తండ్రికి అన్నీ పనుల్లోనూ చేతోడుగా నిలిచేవారు. భీమన్నగారికి తన గ్రామం అంటే చాలా ఇష్టం. పంటపొలాలతో పనస, మామిడి, చెరుకు, కొబ్బరి, అరటి తోటలతో సస్యశ్యామలంగా ఆ గ్రామం కనిపించేది. అందుకే భీమన్నగారి మనుసుకీ ఎంతో ఆనందాన్ని కలిగించి మామిడి కుదురు గ్రామ సౌందర్యాల్ని తన రచనల్లో అభివర్ణించారు భీమన్నగారు. ఆ గ్రామీణ జీవనం, అక్కడ గల వ్యక్తుల వ్యక్తిత్వం, తనకి ఎదురైన అనుభవాలు, జ్ఞాపకాలు భీమన్న రచలన్నిటిలోనూ తెలియజేసారు. పాడి పశువులు, కొబ్బరి కాయల రాశులు, అరటి గెలలు మధ్య చుట్టు పక్కల పాలేర్ల పిల్లలతో, చక్కగా పాటలతో బాల్యం గడిచింది.

విద్యాభ్యాసం :

బోయి భీమన్న మామడి కుదురు సమీపంలో ఉన్న లేబరు స్కూల్లో చేరారు. ఈ గ్రామానికి సమీపంలో చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు చెందిన హరిజనలకు చెందిన పిల్లలు ఆ స్కూలుకే వచ్చేవారు. భీమన్నగారి చదు కుంటునే ఇంటి దగ్గర పాలం పనులోనూ, తండ్రికి సహాయం చేస్తూ మళ్ళీ స్కూలికి వెళ్ళేవారు. స్కూలు

నుంచి తిరిగి రాగానే మళ్ళీ పాలం పనుల్లోకి దిగిపోయే వారు.

ఒకటో తరగతి నుండి మూడో తరగతి వరకు లేబరు స్కూల్లో చదివారు. భీమన్నకు రెండో తరగతిలో ఉండగా నేలకు రెండున్నర రూపాయలు స్కాలర్‌షిప్ వచ్చింది. ఆ డబ్బుతో నగరం సంతలో తెనాలి రామకృష్ణుని కథలు, కాళిదాసు భోజరాజుల కథలు వంటి పుస్తకాలు కొనుక్కొని చదివేవారు. అలాగే గారడీ విద్యల పుస్తకాలు చదివి పక్కపిల్లలతో కలసి ఆ ప్రయోగాలు చేసేవారు ఇలా లేబరు స్కూలు విద్యాభ్యాసం పూర్తి అయ్యాక 1923లో నగరం మిడిల్ స్కూల్లో ఫస్టుఫారం చదువుతున్నప్పుడు చివరి బెంచీలో కూర్చోని స్త్రీల హాస్యోక్తులతో రావడాన్ని వర్ణిస్తూ పద్యం రాశారు.

"కోలన్ గెల్ పయిటన్ జయంటగొని, సంకీర్ణ ప్రలాపాను
హాస్యాలాపంబుల ముద్దు నవ్వుల విలాసార్ధింబు
యేలెంచునన్"

అంటూ మిడిల్ స్కూల్లో ఉండగానే చాలా పద్యాలు రాశారు. భీమన్నగారు ఫోర్త్, ఫిప్త్ క్లాసులు, ఫస్టు, సెకండు థర్డ్ ఫారాలు అక్కడే చదివారు. ఈ నగరం స్కూల్లోనే బోయి భీమన్న గారికి అంటరానితనం వలన తరగతి గదిలో పిల్లల్ని దూరంగా పెట్టడం సహించే వారు కాదు. కొందరు విద్యార్థులు తరగతి గదిలో అంటరాని తనం పాటించిన బయట మాత్రం కలిసి మెలిసి తిరిగేవారు. ఫోర్థ్, ఫిప్త్ క్లాసులకు నెలకు పదణాలు ఫీజు. అందులో సగం ఫీజు భీమన్నకి ఇచ్చేవారు. వేసవికాలంలో ఫీజు ఉండదు. భీమన్నగారు ఆ మూడు నెలలకు కూడా తండ్రి దగ్గర డబ్బులు తీసుకుని సంతలో పుస్తకాలు కొనుక్కునే వారు. "అమరకోశం" పుస్తకం ఖరీదు నాలుగణాలు పావలాకు అర్ధరూపాయికి మంచి పాత పుస్తకాలు దొరికేవి. అవన్నీ చదవటం వల్ల భాషా జ్ఞానం పెరిగింది.

భీమన్నకు ఏ ఆలోచన వచ్చినా మనసులో ఏ భావం కదిలాడిన, ఎవరినైనా తిట్టాలన్నా పద్య రూపంలోనే ఇలా అనే వారు.

"ఆ రోజే తెచ్చెదనని
ఈ రోజుకు కూడా తేవు ఏమనుకొదున్
ఔరా ఎంతటి మోసము
ఈరన్నా నమ్మగూడదింకన్ నిన్నున్"

అంటూ పెచ్చెట్టి వీరన్నతో పేచీ పడి పద్యం రాశారు. అయితే ఛందస్సు అంటే ఎమిటో తెలియదు. ధారా శుద్ధితో పద్యాలు చెప్పటం వరకే తెలుసు. ధర్మ ఫారం పూర్తియ్యేనాటికి గుబ్బలవీరస్వామి అనే పూర్వ విద్యార్థి భీమన్నను వెతుక్కుంటూ వచ్చి, ఆయనకు 'కవిజనాశ్రయం' పుస్తకమూ తను రాసిన శ్రీపతి శతకమూ ఇచ్చి, ఈ దేశంలో మనకు ఎవ్వరూ ఏమీ చెప్పరు, మనకు మనమే చదుకోవాలి' అని చెప్పారు. అప్పటికే భీమన్న భారతం 18 పర్వాలు, భాగవతము పూర్తిగా చదివేయ గలిగారు. పంచతంత్రం కూడా చదివేశారు. కవిజనాశ్రయం పుస్తకం భీమన్నగారికి వరప్రసాదమే అయింది. అలాగే రాజమండ్రి నుంచి 'అదృష్ట దీపిక' అనే పుస్తకం 'ఇంద్రజాల మహేంద్రజాలం' అనే పుస్తకమూ కొన్ని వీటితో కొన్ని ప్రయోగాలు కూడా చేశారు.

రాజోలు మాల పేటలో (బుడితి వారి పేట) ఒక గదిలో ఉంటూ కమ్మ వారి హోటల్లో భోజనం చేస్తూ హైస్కూలు చదువు పూర్తి చేశారు భీమన్నగారు. హైస్కూలులో ఉండగానే 'ప్రణయలహరి' అనే కావ్యం రాశారు.

భీమన్న కుటుంబ జీవితం :

బోయి భీమన్న గారి కుటుంబ జీవితాన్ని పరిశీలిస్తే తన సాహిత్యానికి కుటుంబ జీవనానికి కూడా ఎంతో అనుబంధం ఉన్నట్లుగా తెలుస్తుంది. వీరి జీవితంలో వివాహాన్ని గమనిస్తే గొల్ల చంద్రయ్య గారి రెండో కుమార్తె నాగరత్నమ్మను ఎంతో ఇష్టంతో వివాహం చేసుకున్నారు. ఎన్. చంద్రయ్యగారు ఆ రోజుల్లో ప్రముఖ హరిజన నాయకుడిగా ఎంతో ప్రసిద్ధి చెందిన వారు. నాగరత్నమ్మ కూడా సాహిత్యంలో మంచి అభిలాష ఉండటంతో అందులోను భీమన్నగారికి, చంద్రయ్యగారి కుటుంబంతో

అనుబంధం ఏర్పడటంతో వారి వివాహ బంధం ఎంతో విశిష్టంగా ముడిపడింది. ఉదా॥ భీమన్నగారిని ఎంతో ప్రేమతో చూసుకునేది అలాగే కవిత వ్యాసంగంలో కూడా ఎంతగానో ప్రోత్సహించేది అలాగే భీమన్న గారి సాహిత్య సృజనకు ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యవహరించేది. ఉదాహరణకు భీమన్నగారు మద్రాసులో ఉన్న కాలంలో రత్నమ్మ గారిని చెన్నై ఎగ్మూర్‌లోని కనిమేరి లైబ్రరిలో కూర్చొబెట్టి. తనకు కావలసిన పుస్తకాలలోని కాపీ చేసి భీమన్న గారి సాహితీ రచనకు మరింత ప్రోత్సహంగా ఉండేది. భీమన్నగారు నాలుగు రోజుల పాటు ఏమి రాయకుండా ఉంటే ఈ మధ్య ఏమి రాయలేదని సమాజం పట్ల తన బాధ్యతను గుర్తుచేశారు. వీరికి బోయి విజయభారతి అనే కూమారై కలదు. ఈమె తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నది.

బోయి భీమన్న తన పదవి విరమణానంతరం హైమావతిగారితో సహజీవనం చేశారు. వీరికి ఇద్దరు కూమారైలు వారే విజయపల్లవి, విజయేందిర. వీరు కష్టపడి చదివి తండ్రికి తగ్గ తనయులగా ఎదిగి, ఒకవైపు వారి వృత్తిని నిర్విగ్నంగా కొసాగిస్తూనే మరొవైపు తండ్రి సాహిత్య వారసత్వాన్ని అందుకోవడమేకాక వారి సాహిత్యాన్ని మరింత విస్తృత పరుస్తూ, విశేషమైన సాహిత్య సేవ చేస్తున్నారు. హైమావతి భీమన్నగారు భీమన్న సాహితీ నంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి దానికి అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ప్రతి యోటా భీమన్నగారి పేరుతో 25వేల రూపాయలతో పురస్కారం అందించడమేకాక భీమన్న సాహిత్యం పై జరిగే అనేక కార్యక్రమాలకు సహయసహకారాలు అందించారు.

మొత్తంమీద చూస్తే భీమన్నగారి కుటుంబ యావత్తు అందరు కూడా వారి వారి పదవులను విశిష్టంగా నిర్వహిస్తూనే భీమన్న గారి సాహితీ వికాసానికి ఎంతగానో తోడ్పడుతున్నారు.

భీమన్న గారి వ్యక్తిత్వం :

మహాకవి భీమన్న వినయ స్వభావం కలవారు. కఠినత్వము, అసూయ, ద్వేషము, తన మృదు స్వభావమునకు విరుద్ధములుగా చెప్పవచ్చు. ఇంకా బోయి భీమన్న వ్యక్తితత్వం ఏమటో ఆయన రచన ద్వారా, సాహిత్యం ద్వారా గమనిస్తే మనకు తెలుస్తుంది. భీమన్నగారు రైలో ప్రయాణం చేస్తున్నప్పుడు సీటు కోసం వెతుకుతున్న ఎవరినైన చూస్తే నవ్వుతూ లేచి కూర్చోండి అని తన పక్క సీటులో చోటు ఇచ్చేవారు, దోంతో భీమన్న గారి పక్కన కూర్చొన్న వారు కూడా ఆనందంగా మాట్లాడుతూ ప్రయాణం చేసేవాళ్ళు. దీని బట్టి గమనిస్తే భీమన్న గారి మనస్తత్వం ఎలాంటిదో అర్థమౌవుతుంది.

భీమన్నను ఇతరులతో పోల్చడం అంటే ఒప్పుకోరు. అలా పోల్చడం అతని వికాసానికి అడ్డుకట్టలు వేస్తున్నట్లు భావిస్తారు. బలమైన ఆత్మవిశ్వాసం గల వ్యక్తిత్వం వీరిది. భీమన్న తనలోని ప్రత్యేకతను గుర్తించుకుని వాటికి అనుగుణంగా తన జీవితాన్ని అమర్చుకునేవారు. అంతే తప్ప ఇతరులను అనుసరించడం, వారికి నచ్చేది కాదు. సొంత ఆలోచనలతో తమ సాహిత్య ప్రతిభను నడిపించిన మెధా శక్తి ఉన్న వ్యక్తి.

ముఖ్యంగా ప్రజాస్వామ్యం, మానవతా వాదం ఈ రెండూ ప్రపంచానికి కొత్త దారులు చూపించిన మహనీయులు దృష్టితో మానవతావాది. సాదరణంగా కవులు మనస్తత్వం, వ్యక్తిత్వం ఎలాంటిదో వాళ్ళు నడిపించిన సాహిత్యం ద్వారా తెలుస్తుంది. అదే విధంగా భీమన్న గారి వ్యక్తిత్వం కూడా తన సాహిత్య సేవలో గమనిస్తే అర్థమౌవుతుంది. పద్మశ్రీ బోయి భీమన్న గారి సాహిత్యం ద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని కల్గించడానికి ప్రజాస్వామ్యం, మానవతా దృక్పథం కలిగి సాహిత్యంతో సాహిత్య సేవ చేస్తున్న విశిష్టమైన వ్యక్తిత్వం కలవారు.

బోయి భీమన్న గారి సాహిత్యం :

బోయి భీమన్న గారు ఆధునికాంధ్ర కవులల్లో అగ్రగణ్యులు. చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి. వీరు గతకాలపు

వ్యవస్థల్ని వేటినీ ఆమోదించ లేదు. కనుకనే భీమన్న గారు సాహిత్య తత్వం సౌందర్యాల సమన్వయం. తెలుగు సాహిత్య జగత్తులో సృజనాత్మక రచనాశక్తి, విమర్శనా శక్తి కలిగిన వ్యక్తి పద్మశ్రీ బోయి భీమన్న గారు. ప్రముఖ తెలుగు పండితులు, కవి, నాటక రచయిత, విమర్శికులు అయిన డాక్టర్ బోయి భీమన్నగారు అనేక గ్రంథాలును రచించారు. అంతేకాదు ఆధునికి, సాంప్రదాయ రీతిలో కవిత్వాన్ని కూడా రాసి నవ సమాజానికి చక్కని సందేశాన్ని ఇచ్చారు. జీవితాన్ని సాహిత్యంతోనూ, సాహిత్యాన్ని జీవితం తోనూ సంగమింప చేసుకుని ప్రగతి పథం వైపు సాగి పోతున్న కవి భీమన్నగారు. మానవాతాభ్యుదయం పట్ల వీరి దృక్పథం అత్యంత తీవ్రమైనది బోయి భీమన్న కవితా తత్వం సాహిత్యాభివృద్ధికి చేసిన దోహదం చాలా విలువైనది.

నాటక కర్తగా, వక్తగా, విమర్శకుడిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో భీమన్న స్థానం సుస్థిరమైంది వీరి నాటకాలన్నీ దృశ్య కావ్యములే. వీరి రచనలు సాహితీ జగత్తులో ప్రశస్థిని పొంది ఉన్నాయి. వీరి రూపకాలలో 'రాగవాసిష్ఠం' 1959. గొప్ప కళాఖండం. వీరి 'పాలేరు' కూలీరాజు" పైరుపాట" ప్రగతి" చిత్రకళా" ప్రదర్శనం మొదలైన రూపకాలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకత కలిగి ఉన్నవి. ఒక్కొక్క రచన ఒక్కొక్క కోవకు చెందినవిగా ఉంటాయి. వీరి రచనలును పరిశీలిస్తే ప్రతి రచనలోను కవి ప్రజా సాహిత్యానికి ఒక గొప్ప సందేశాన్ని ప్రయోజనకరంగా అందించి విలువైన రచనలును అందించారు. అవి ఎంటో పరిశీలిస్తే ఉదాహణలు కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

సామాజిక రూపకాలు
పాలేరు - ప్రచురణ 1940
కూలిరాజు - ప్రచురణ 1947
పైరుపాట - ప్రచురణ 1959

ఐతిహాసిక రూపకాలు :

రాగవాసిష్ఠం - ప్రచురణ 1959
బాలయోగి - ప్రచురణ 1964
ఆదికవి వాల్మీకి - ప్రచురణ 1970

వ్యంగ్యాత్మక రూపకాలు :

పడిపోతున్న అడ్డుగోడలు - ప్రచురణ 1958
ప్రగతి - ప్రచురణ 1979
ప్రతీకాత్మక రూపకాలు
అసూయ - ప్రచురణ 1954
మానవుని మరొక మజిలీ - ప్రచురణ 1963
చిత్రకళా ప్రదర్శనం - ప్రచురణ 1963

ఇలా చెప్పుకుంటూ పోతే భీమన్నగారి సాహిత్యం ఒక పరిశోధన వ్యాసం అవుతుంది. వీరి ఒక్కొక్క రచన ఒక్కొక్క కోవకు చెందినవిగా ఉంటాయి. వీరి రచనలు పరిశీలిస్తే ప్రతి రచనల్లోనూ కవి మనసు చలించి సమాజానికి గొప్ప సందేశాన్ని తెలుపుతున్నట్లుగా ఉంటుంది. వీరి తెలుగు సాహిత్యానికి అందించిన ఆణి ముత్యాలాంటి రచనలు ఎంటో పరిశీలిద్దాం:

జానపదుని జాబులు 1940 :

భీమన్న గారి లేఖా సాహిత్యంలో ''జానపదుని జాబులు'' మొదట అచ్చుపడిన రచన ఇది. ఆంధ్ర దేశంలో పల్లెటూరి వాతావరణాన్ని పల్లెలోని కూలీన దైన్యం- అ విద్య- నిరంతరం వాళ్ళు పడే యాతనని రచయిత కళ్ళకట్టినట్లు వర్ణిస్తూ పట్టణంలోని మిత్రునికి రాసినట్లుగా ఉన్న లేఖలు ఇవి.

పాలేరు :

అస్పృశ్యతా నివారణనూ తెలుపుతూ ఈ రూపకంలో పద్యాలు పాటలు, చిన్న చిన్న మాటలు ఉన్నాయి. సామాన్యులకు అర్థమయ్యే విధంగా రచయిత సంభాషణలను అమర్చారు. వ్యవసాయానికి సంబందించినదిగా చిత్రించబడి భీమన్నగారు స్వతంత్ర నాటకం సామాజిక సమస్యలు కలిగినదీ నాటకం.

కూలీరాజు :

ఈ నాటకం 1947లో ప్రచురించబడింది. ఈ

కూలీరాజు ఇతివృత్త వ్యవసాయ కూలీల పోరాటాన్ని అర్థమయ్యే రీతిలో తాత్త్విక చింతనతో భీమన్న తన రచనలో గ్రామీణ వాతావరణాన్ని సజీవ పాత్రల్ని సహజమైన నట్టి సంఘటనల్ని అక్కడక్కడ పద్యాల్ని పాటల్ని విన్యాసాలు చేయించారు. గాంధీయిజాన్ని ఆచరించి వయోజన ఓటింగుతో కూలీలు అధికారంలోకి రావాలని ఈ నాటకం ద్వారా భీమన్న ఆశిస్తారు.

అసూయ :

ఈ రూపకం మొదట బెజవాడలోని వల్లభనేని కాశీవిశ్వనాధం గారి పత్రికలో సిరియల్‌గా వచ్చింది. గ్రామ పునర్నిర్మాణ కృషికి విద్యార్థులను ప్రబోధించే లక్ష్యంతో రాశారు. రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించటం అనే అంశంపైనా యువత దేశాభివృద్ధిలో పాలుపంచు కోవలసిన అవసరం అనే ధ్యేయంలో రాసిన నాటకంగా చెప్పవచ్చు. ఇందులో పాత్రలు కూడా రాజు, రాత్రి, దినం మొదలైన పేర్లు చాలా విచిత్రంగా కనిపిస్తాయి.

ప్రగతి :

"లక్కీ కుమారి" పేరుతో ఎప్పుడో రాసిన నాటకాన్ని నవీకరించి ఆరు దృశ్యాలుగా రాశారు కవి. మానవ మేధస్సు సాధించగల కళాత్మక అపవాదులు భూస్వాముల దౌర్జన్యాలు- ప్రగతి అన్ని మాయలను ఉపాయంతో ఎదుర్కోవటం వంటివి ఉత్కంఠభరితంగా చూపారు రచయిత.

ధర్మవ్యాధుడు :

నాటకంలో వివాహ జీవితాన్ని కలిపించే సమయమంలో అమ్మాయి తండ్రి గాని కుటుంబ సభ్యులు గానీ అబ్బాయి కుటుంబంతో ధైర్యంగా స్వతంత్రగా ప్రశ్నలు అడిగే విధంగా ఉండాలి. అలా లేకపోతే వివాహ జీవితాలు నష్టపోతాయి అని రచయిత చక్కని సందేశాన్ని ఈ నాటకం ద్వారా తెలియజేశారు. వేదవ్యాసుడు, బాలయోగి నాటకాలు కూడా ఈ కోవలోనిదే. అలాగే భీమన్న గారి గేయాలు శృతి సౌందర్య విలసితాలంటూ సంగీతకారులు ఆదరించారు. వీరి గేయరూపకాలు దాదాపు 15 ఉంటాయి. ఈ గేయ రూపకాలు ద్వారా కూడా సమాజం వైపు మంచి సందేశాన్ని ప్రకటటించేట్లు అందించారు.

గుడిసెలు కాలిపోతున్నై :

కావ్యంలో ఏడాది కోసారి దళితల గుడిసెలెందుకు కాలిపోతున్నాయో, మళ్ళీ కొత్త గుడిసెలు ఎందుకు నిర్మించుకుంటున్నాయో, ఇవన్నీ ఓట్లు కోసం వచ్చేవారిని నిలదీసే ధైర్యం ప్రజల్లో కలగాలని రచయిత ఈ గుడెసెలు కాలిపోతున్నాయి అనే కావ్యం ద్వారా చక్కటి సందేశాన్ని ప్రకటించారు. 'ధర్మకోసం పోరాటం' లో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించడానికి సూచనలు చేశారు. రాగవాసిష్ఠంలో అరుందతీదేవి మహాత్మ్యాన్ని వివరించ డానికి పురాణేతిహాసాల్లోని కులాంతర వివాహాల్ని సృజనీకరణ ప్రతిభతో భారత జాతీయ దృక్పథాన్ని ప్రదర్శించారు. దీనికి ఆర్యద్రావిడ వాదాల్ని కూడా నాటకంలో అంతర్భాగం చేశారు రచయిత. అలాగే వాల్మీకి, వ్యాదవ్యాసుడు మొదలైన వాళ్ళు దళితలేనని వాదిస్తూ వాళ్ళు వ్రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవే అని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

ముగింపు :

ఈ విధంగా ఆధునిక తెలుగు సాహిత్యానికి బోయి భీమన్నగారు చేసిన సేవ ఏంతో విశిష్టమైనది. సమాజ శ్రేయస్సు కోసం వీరి చేసిన పోరాటం సాహిత్యాలోకానికి ఒక వెలుగుని ఇచ్చింది. తెలుగు సాహిత్యానికి సేవ చేసిన మహనీయులకు కాలం ఆగినా, వీరు ఆధునిక తెలుగు సాహిత్యానికి అందించిన విలువైన రచనలకి, వీరు తీర్చిదిద్దిన సాహిత్య లోకానికి మాత్రం కాలం ఆగదు. నిత్య యవ్వనాన్ని సంతరించుకుంటూ మున్ముందుకు నడుస్తూనే వుంటుంది. బోయి భీమన్న గారు తను ఆశించిన ప్రజా సాహిత్యం కోసం వీరి జీవితాన్ని కూడా త్యాగం చేయడానికి సిద్ధం అయ్యారు అని చెప్పడంలో

ఆశ్చర్యంలేదు. సమాజ శ్రేయస్సు కోసం వీరు చేసిన కృషి ఎంతో ప్రయోజనకరమైనది. వీరి దృక్పథ కోణాల్ని గమనిస్తే సమాజంలో పేరుకుపోయిన అన్యాయం, అధర్మం, వర్ణ వివక్షత, కుల మత బేధాలు మొదలైన అంశాల మధ్య తేడాలను గమనించి, అంటరానితనంపై స్పందించి. సమాజానికి న్యాయం, ధర్మం, కులమత బేధాలు కోసం వీరి రచనలతో సమాజానికి వన్నెలను చేకూర్చారు.

ఉపయుక్త గ్రంధాలు :

1. బోయి భీమన్న - బి. విజయభారతి
2. "పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం" (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం) వారి ప్రచురణలు
3. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన - డా. తక్కళ్ళ బాలరాజు
4. భీమన్న సాహితీ దర్శనం - అమూల్య శ్రీ (అమ్ములయ్య)
5. భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక (1983) సంపాదకుడు గనుమల జ్ఞానేశ్వర్
6. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు - బి. హైమావతి

డా. బోయి భీమన్న గారి సాహిత్యంలో వార్ధక్యం

- డా॥. గురజాడ శోభా వేలిందేవి, రచయిత్రి.

అభివాదానశీలస్య,నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి పరివర్ధంతే,ఆయుర్విద్యా యశో బలమ్

ఎల్లప్పుడూ జ్ఞానవృద్ధులగువారికి నమస్కరిస్తూ వారికి సేవ గావిస్తూ ఉండేవారికి ఆయుష్షూ ,విద్యా, కీర్తీ, బలమూ వృద్ధిచెందుతాయని మనుధర్మశాస్త్రం తెలియ చేసింది.

ప్రముఖ పద్య, గేయ, కవి నాటకకర్త పద్మభూషణ్ డా.బోయిభీమన్న అద్భుతసాహిత్యం అన్నివయసుల వారినీ అనునిత్యం ఆకట్టుకుంటూ అసమానంగా అన్ని సాహిత్య ప్రక్రియలనూ స్పృశిస్తూ దిక్సూచిగా నిలిచి పోవడానికి వెనక వారి సాహిత్యం గొప్పతనమెంతుందో వారిసతీమణి హైమావతీ భీమన్నగారి అవిశ్రాంత పరిశ్రమ అంతుంది. పెద్దలను గౌరవించడం మన సంస్కారం అదే మన సంప్రదాయం అనే తీరులో ఆలోచిస్తూ ఆ రీతిలో ప్రవర్తిస్తూ ప్రతివారికీ పెద్దలను గౌరవించమని చెప్పే హైమావతిగారు అటు తన తల్లితండ్రులను ఇటు ఇతర పెద్దలనూ నిత్యం గౌరవిస్తూ వారికి సహకారం అందిస్తూ పతిదేవుడు తనకంటే ఒక తరం పెద్ద అయిన డా.భీమన్న గారిని సేవిస్తూ, సహకరిస్తూ వారిసాహిత్య యజ్ఞ నిర్వహణలో ముఖ్యభూమిక వహించిన తీరు అమోఘం.

'పాలేరు నుండి పద్మశ్రీ' వరకు అనే పేరుతో డా. భీమన్నగారి జీవితచరిత్ర నభూతో నభవిష్యతి అనే రీతిలో లిఖించి హైమావతిగారు చరితార్థులయ్యారు. భీమన్న గారు శివైక్యం పొందిన తర్వాత ఎంతెంతో పరిశ్రమించి భీమన్న సాహితీ నిధిని తెలుగు విశ్వవిద్యాలయంలో నెలకొల్పారు. భీమన్న గారి మీద విరివిగా పరిశోధనలు జరగడానికి, ఇతర భాషల్లోకి వారి రచనలు అనువదింపబడడానికీ, భీమన్నగారి పేరిట అవార్డులు అత్యుత్తమ కవులకు అందజేయడానికి వెనక హైమావతి గారి పట్టుదల,అనుకున్నది సాధించేదాకా నిద్రించని ఆమె తపోబలం గోచరమవుతున్నాయి. తాను పదవీ విరమణ చేసిన తర్వాత పగలూ రేయీ అనేది చూసుకోకుండా భీమన్నగారి సాహిత్యం సజీవం చేయాలనీ సత్సంకల్పంతో ఇప్పటి ఎనభయ్యవపడిలో సైతం కృషిచేయడం వందనీయమైన విషయం. వార్ధక్య ఎవ్వరికీ ఎప్పుడూ అడ్డంకి కాదు అనేమాట అక్షరసత్యం అనడానికి అసలైన ఉదాహరణలు శ్రీమతి హైమావతిగారు,పద్మభూషణ్ భీమన్నగారు.

డా. బోయిభీమన్నగారు కలం వీరులు. వారి కలం నవరసాలనూ పండించి పాఠకులను అలరిస్తుంది. అసలు భీమన్నగారు స్పృశించని, సృజించని అంశం లేదు. వారు వార్ధక్యానికి సంబంధించిన సంగతులెన్నింటినో తమ రచనలలో వివరించారు. తొంభైయేళ్ళకు పైగా జీవించి ఆవయసులో కూడా కింద కూర్చుని తోటపని చేస్తూ చురుకుగా రాస్తూ చదువుతూ చరించిన భీమన్నగారి జీవితం వృద్ధులందరికీ ఆదర్శం.

'నా ప్రతిరచనా ఆత్మకథే' అని చెప్పిన భీమన్నగారి తండ్రి పల్లయ్యగారు తనపుత్రుడు కవిత్వం రాస్తున్న సంగతి విని అభినందించకపోగా ''గచ్చ కాయా పుచ్చ కాయా కవిత్వమవుతాయా? వ్రాస్తే మహాభారతం లాంటిది వ్రాయాలి'' అన్నమాటను అక్షరసత్యం చేశారు భీమన్న. పాలేరు పుస్తకం అణచివేయబడ్డవారి పాలిట అపురూప వరమయ్యింది. ఆ నాటకం ఎక్కడ ప్రదర్శింప బడితే అక్కడ ప్రజలు జయజయ ధ్వానాలుచేశారు. విజయకేతనాన్ని ఎగురవేసే దిశగా అడుగులేశారు.' తల్లితండ్రులు తమ అనుభవంలోంచి ఇచ్చే సలహాలు సూచనలూ, వ్యక్తపరిచే అభిప్రాయాలలోంచి అనువైన వాటిని పిల్లలు తీసుకోవాలి. వారి మాటలు కొన్నింటిని

ఛాలెంజులుగా ఎంచుకుని ముందుకు సాగాలి' అని తాను అదే చేశానన్నారు భీమన్నగారు. మాలవాడు, వీడు, వాడు అని పిలవకుండా తన తండ్రి పల్లయ్యగారిని ఊరిపెద్దలు పల్లయ్యగారు అని పిలవడం ఆ వయసు లోనే గమనించి వ్యక్తి పుట్టుక ఏదైనా అతను తనదైన రీతిలో మార్గదర్శి అయితే ఖచ్చితంగా జనం గౌరవిస్తారని తెలుసుకున్నట్లు భీమన్నగారి సన్నిహితులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా యాభయ్యవపడిలో విద్యని అభ్యసించి ఆపైన మహాభారత గ్రంధాన్ని చదవగల్గిన తండ్రిపల్లయ్యగారు భీమన్నగారికి మార్గదర్శి అయ్యారు. 'అనుభవమును మించి సత్యమ్ము లేదు' అని 'మధుగీత'లో రాశారు భీమన్నగారు.చాలా చిన్నతనం నుండే చేపల బుట్టలు అల్లడం, చేదలు చాపలు బుట్టలు విసనకర్రలు లాంటివెన్నో చకచకా చేత్తో చేసుకుపోయిన చేతులాయనవి. బాల్యంలో నేర్చుకుంటే మెదడు, చేతులూ పనికి అలవాటుపడతాయని వారి పనితనం తెలియపరుస్తుంది. ఆ పనితనం, చురుకుదనం 80, 90 సంవత్సరాలు దాటాక కూడా భీమన్నగారిని అంటి పెట్టుకుని ఉండడం విశేషం.

'ప్రారబ్ధం పండుటాకులు వాకిట్లో జలజలా రాలినప్పుడు' అన్న వాక్యం,... భీమన్నగారి ఆలోచనల్లో ఒక మూల వార్ధక్య అంశం ఉందని తెలియచేస్తుంది. అందుకే వార్ధక్యానికి సంబంధించిన వాక్యాలు అక్కడక్కడ వారిరచనల్లో కనిపిస్తూ ఉంటాయి. తనబిడ్డల సంపాదన తాను ముట్టుకోకూడదనే నియమం పెట్టుకున్న పల్లయ్య గారి మార్గదర్శకత్వాన్ని తీసుకున్న భీమన్నగారు 'పిల్లల్ని సక్రమంగా పెంచి పెద్ద చేసే బాధ్యత కన్నవారికి వుంది' అని నొక్కివక్కాణించారు. తల్లి తండ్రుల బాధ్యత తీసుకోవలసిన అవసరం పిల్లలకి లేదని అలాగే పిల్లలకి తల్లితండ్రులు ఆస్తులు ఇవ్వక్కరలేదని ఆధునికంగా ఆలోచించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు భీమన్న గారు. తమ ఆస్తులతో మంచి వృద్ధారామంలో చేరి చివరికాలాన్ని వృద్ధులు విశేషవంతంగా వెళ్లదీయాలని అందుకు తోడ్పడే వృద్ధారామాల ఆవశ్యకత ఆధునిక కాలంలో అనివార్యమని చాలా ఏళ్ళ క్రితమే వివరించారు భీమన్నగారు.

'బ్రతుకుతూ బ్రతుకును నిందించకు
చస్తూచావుకు భయపడకు - అనాది కొస

ఇది పెద్దలకి భీమన్నగారు అందించిన సందేశం.

మృత్యువు నుంచి జీవం కురిసింది.
అమావాస్యనుంచి నెలవంక మొలిచింది.
షడ్వర్గయాతన నుంచి షడ్రసోపేతంగా
మళ్ళీ ఒక ఉగాది విరిసింది. - గుడిసెలు

పదవీ విరమణ తర్వాత అన్నివిధాలుగా వైరాగ్య చింతనతో గడపాలని అనుకునే వారికి అది కూడదని ఈ కింది వాక్యం ద్వారా సూచించారు.

'ఉన్నవి నిలుపుకుంటూ
లేనిది గెలుచుకోవాలి మనిషి'

అని తన టుమ్ రీ ల ద్వారా తెలియచేసి వార్ధక్యం కాలంలో వ్యక్తి ఏవిధంగా ఉండాలో కింది గేయాల ద్వారా తెలియచెప్పారు.

నేనే వృద్ధుడి ముఖంలోకైనా చూచినప్పుడు
నాకు కనిపించేది అతడి యవ్వనంలో ఔధత్వం
శరీరం సుష్కించే కొలదీ మేధావిత పెరుగుతూ ఉంటుంది.
జాతి అగ్రేసరం కావాలంటే యువదేహాలకు
వృద్ధమస్తిష్కాలను జోడించు

వృద్ధాప్య తత్వం
కొందరు పుట్టుకతోనే వృద్ధులు
కొందరు చచ్చినా వృద్ధులు కారు
బ్రహ్మ వృద్ధుడు
అతడి బాబు యువకుడు

వృద్ధోపదేశం

పుట్టి, పెరిగి, పెద్దదైన ఆల విరిగి తరిగిలయించి పోతుంది. ఇది సహజ క్రమం.

మృత్యువు ఒక హఠాత్ ఘటన కాదు

అమావాస్య హఠాత్తుగా రాదు
అదొక క్షణ క్షణ క్షీణాను క్రమణిక
ఒక్కొక్క శక్తే ముక్తమైపోతూ తుదకు
మూలశక్తిలో కలిసిపోతుంది.
ఎలా వచ్చిందో అలానే పోతుంది జీవితం
తర్వాతేంలేదు తన్మయత్వం తప్ప
వృద్ధులకిదే నా సిద్ధోపదేశం
ఆందోళన పడకండి.
ఆత్మైక్యం సహజమండి
వృద్ధులను అవమానించే యువత ఎన్నటికీ వృద్ధి పొందదు
వృద్ధాప్యాన్ని సుఖవంతం చెయ్యని జాతి ఎప్పటికీ ఫలవంతం కాదు,
ఏ జాతి కీర్తి గౌరవ సుఖ సంపదలైనా ఆ జాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే

వార్ధక్య లక్షణం

20 ఏళ్ళవాడికి 30 ఏళ్ళ వాడు వృద్ధుడు
40 ఏళ్ళ వాడికి 50 ఏళ్ళవాడు వృద్ధుడు
ప్రతీవాడికీ తనకంటే ముందున్నవాడు వృద్ధుడు
నా దృష్టిలో పనిచేసే ప్రతీవాడూ యువకుడే.
పనిచేయని ప్రతీవాడూ వృద్ధుడే.

డా. భీమన్నగారికి వార్ధక్యం మీదున్న అభిప్రాయాలు ఆలోచింపచేసే అక్షరసుమాలు అనడానికి పైన ఇచ్చిన ఉదాహరణలే సాక్ష్యాలు. వృద్ధులను గౌరవించమని సమాజానికి సందేశం ఇస్తూ పనితో వార్ధక్యాన్ని దూరం చేసుకోండి అని వృద్ధులకు సలహాలు ఇచ్చాయి ఆ వాక్యాలు.

"కుక్క మొరుగుతూనే ఉంది" పుస్తకంలో పదవీ విరమణ తర్వాత మనిషి ప్రవర్తనమీద మనస్తత్వ శాస్త్రవేత్తలా చిన్న వాక్యాల్లో విపులీకరించారు భీమన్నగారు. ఆ పుస్తకంలోని కొన్ని కవితలు తీసి అందులోని ముఖ్య వాక్యాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

అప్పుడే 58
ఇంతకూ మా ఆవిడ రిటైరవుతున్నది.
ముప్పై ఏళ్ళక్రితం
నాచేతిలోకి
ఒక ఎర్రగులాబీ మొగ్గలా వచ్చింది
ముద్దమందారంలా వికసించింది
పచ్చని ముద్దబంతిలానిలిచింది.
నేనొక విశ్వ మానవ దృష్టితో చూస్తే
ఆమె గమనంలో
కాలగమనం కనిపిస్తూ ఉంది.
ఆమె రూపలావణ్యాలలో
కాల పరిణామం కనిపిస్తూ ఉంది.
ప్రాయాహ్న సూర్య బింబానికీ
సాయాహ్న సూర్యబింబానికీ
తేడా కనిపిస్తూ ఉంది.

మరొకరికి పనికిరావు

నేనుచదువుకునే రోజులలో అంటూ
మొదలుపెట్టి సుత్తి కొట్టడం
పెద్దలందరికీ అలవాటే.
తన జీవిత చరిత్ర తప్ప
మరొకడి జీవిత చరిత్రను వినడం
ఏ శ్రోతకూ కిట్టదు.

మాట్లాడడమే తప్ప వినడం మానేసిన పెద్దలు తమని తాము మార్చుకోవాలన్న సూచన ఇచ్చిందీ కవిత.

శ్రద్ధ సాధ్యమా

నేను రిటైర్ అయిన తరువాత
నాకోసం వచ్చేవాళ్ళు తగ్గిపోతున్నారు.
తగ్గుతూ తగ్గుతూ నా చుట్టూ
ఒక బట్టతల తయారైంది.

వైరాగ్య భావాలు అలవరచుకుని ఏదీ ఆశించకుంటే వైరాగ్యం వేధించదని కవితలోని భావం.

ఇన్ఫీరియారిటీ

నన్ను ముదిమి ఆవహించే కొలదీ

అంతకుముందులేని ఇన్ ఫిరియారిటీ ఏదో
నాలో ప్రవేశించి
మా ఆవిడతో చేతులు కలపసాగింది
ఈ మధ్యనెను దేనినీ
సరియైన దృష్టితో
చూడలేకపోతున్నాను
విమర్శలను నవ్వుతూ స్వీకరించలేకపోతున్నాను
ఈ ఇన్ ఫిరియారిటీ కి కారణం
నన్ను ఆపాదమస్తకం
కౌగలించుకొని తన కౌగిలిని

క్షణ క్షణమూ బిగించి వేస్తున్న ముదిమి,వార్ధక్యం అంటూ కవితను ముగించిన భీమన్నగారు మందులేని వ్యాధి ముదిమి అంటూ ఎనభై దాటిన వృద్ధుడిని అయిదు లోపలబాలుడిని ఇద్దర్నీ సమానంగా చూడవలసి వుంది కదా. అనే భావాన్ని వ్యక్తపరిచారు.

అర్ధంలేని ప్రశ్నలు వేస్తూ విసిగిస్తాడు బాలుడు అనుభవంతో నలహాలు చెప్తూ విసిగిస్తాడు వృద్ధుడు. బాలుడ్ని ముద్దు చేస్తాం.వృద్ధుడి ని నిరసిస్తాం. బాలుడితో సమాన స్థాయి ఆదరణను వృద్ధుడు ఆశిస్తూ బాధపడడం, పక్కవారిని బాధ పెట్టడం కూడదని వృద్ధాప్యంలోని బాధ లన్నింటికీ వృద్ధులే కారణమని వివరించారు భీమన్నగారు.

వృద్ధారామాలు

ఉమ్మడి కుటుంబాల రోజులు పోయి చిన్న కుటుంబాలు వచ్చాక వృద్ధుల పరిస్థితి దిగజారిందని కాలానుగుణంగా వృద్ధ రక్షణ గృహాలు అత్యవసరమని సూచించారు భీమన్నగారు.

1974వ సంవత్సరంలో గాంధీ ఆసుపత్రిలో డయేరియా సమస్యమీద చేరారు భీమన్నగారు. అక్కడ డాక్టర్లు హౌస్ సర్జన్లు భీమన్నగారి చుట్టూ చేరారు. వారి పుస్తకాలగురించి చర్చించారు. అప్పుడు చుట్టుపక్కల మంచాల మీదున్న వ్యాధిగ్రస్తులు, వృద్ధుల అనారోగ్య సమస్యలు భీమన్నగారి మనను మూలల్లో చేరి వుండవచ్చు. అందుకే తర్వాతి కాలంలో అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చేరినప్పుడు అక్కడి డాక్టర్లకు కొన్ని సలహాలిచ్చారు. అన్ని వ్యాధులకూ నిపుణులు వున్నట్లే వృద్ధుల శారీరక మానసిక అనారోగ్యాలకు మందులేసి మంచిమాటలు చెప్పే జీరి యా ట్రిస్ట్ ల అవసరం ఉందని సోషల్ జిరియాట్రిస్టు లు సైతం కావాలని ఆ విద్యని అభ్యసించిన నిపుణులు వస్తే పెద్దల సమస్యలెన్నో పరిష్కరించబడతాయని వైద్యులకు చెప్పారు భీమన్న.

డా. బోయి భీమన్నగారు, హైమావతీ భీమన్నగారు వయోధికులందరికీ మార్గదర్శులు. ఆ పుణ్యదంపతులు దాంపత్యం అనే మాటకి అసలైన అర్థాన్నిస్తూ సంఘహితం కోసం సర్వదా శ్రమిస్తుంటారు. భర్తగారు రాసిన ప్రతీ పుస్తకమూ చిరస్థాయి అవ్వాలని ఎన్నో భాషల్లో పాఠకులకు అందాలని వారి పీఠం నిత్యకల్యాణం పచ్చతోరణంగా వెలుగొందాలని భీమన్నగారి నాటకాలు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పుడూ ప్రదర్శితం కావాలని, వారి సాహిత్యం పై సాహితీ చర్చలూ సెమినార్లు, పరిశోధనలో ఇంకింత జోరుగా సాగాలని పగలూ రెయన్నతేడా లేకుండా కృషి చేస్తున్న హైమావతిగారికి శ్రీమతి విజయేంద్రగారికి అభినందనలర్పిస్తున్నాను.

ముదిమి అనగానేమిముగ్గినపండది
రసము గ్రోలవలయు రాలు ముంచె
రాలిపోవు వెంక రాదిక మనకేసి
ఆలకించినావే ఆత్మలింగ ?
ముదిమి కుక్కలాగా మొరుగుచునుండును
ముదిమి హింసపెట్టు మొసలివోలె
ముదిమి కోడిపుంజు ముల్లోకములలోన
ముదిమి ఎలా నరుల ముంచునిట్లు?

ముదిమి మీద సాహిత్యం బాగా రావాలని పరోశోధన విఇస్తృతంగా జరగాలని డాక్టర్లకీ, వైస్ చాన్సెలర్లకీ నిత్యం వివరించే భీమన్నగారికి ఆశయం నెరవేరాలని మనసారా కోరుకుంటున్నాను.

బోయి భీమన్న సృష్టి రహస్యం - బ్రహ్మ ఐదవ ముఖం సమాన భావన

- కాపర్తి స్వరాజ్యం, పరిశోధక విద్యార్థి.

కవంటే కాలానికి ఎదురీదగలడు, కావ్యాన్ని రాయ గలడు, కొత్త సృష్టిని చేయగలడు. తరతరాల మూర్కత్వ బూజులు దులిపి నవ చేతన తత్వంతో కొత్త ఊపిరి పోయగలడు. బ్రహ్మ సృష్టిని ప్రశ్నించేను, తన కవితా శక్తితో నిలదీస్తాడు, అపూర్వ సృష్టిని చేయగలడు. సమాజం నుండి ఆటుపోట్లు ఎదుర్కొంటున్న ధైర్యంతో ప్రశ్నించా లనుకున్నవి, నిలదీయాలనుకున్న అనేక విషయాలను సంఘటనలను ముక్తకంఠంతో రాయగల సమర్థుడు. కవికోకిల జాషువా ,రాజ్యాంగ అధినేత అంబేద్కర్, పద్మశ్రీ బోయి భీమన్న మొదలైన ఎందరో కవులు ఈ కోవకు చెందినవారే.

సాహిత్యాన్ని సమభావన తో నింపి సమ సమాజానికి సందేశం అందించిన రచయిత బోయి భీమన్న. తన సాహిత్యంతో ప్రభుత్వానికి, కుల వివక్ష కులను ప్రశ్నిం చడమే కాదు ప్రజలను ఆలోచించేలా చేశాడు. వేద వ్యాసుడు, వాల్మీకి, ధర్మ వ్యాధులు మొదలైన వాళ్ళు తమ వాళ్ళని, రామాయణ, భారత, భాగవతాలు దృక్పథం విశ్లేషణ చేయాల్సిందే. పోతన, వ్యాసుడు, వాల్మీకి లాంటి ఎందరో కవులు రచనల్ని విమర్శించాడు. తాను చెప్పా లనుకున్న విషయాన్ని దేనికి భయపడకుండా, ఎవరికీ లొంగకుండా స్పష్టంగా చెప్పే తత్వం భీమన్నలో కని పిస్తుంది.

భారతదేశంలో కుల వ్యవస్థ రోజురోజుకు పెరిగి పోతోంది. ఆధునిక కాలంలో ఎంతో మంది ప్రతిభా మూర్తులు కులం అనే కత్తికి బలైన వారు ఉన్నారు. గుడిలో, బడిలో, భరత మాత ఒడిలో అన్ని చోట్ల అవమానాలకు గురై,తమ వేదనంతా సాహిత్యంగా మలచి ఎక్కడైతే అస్పృశ్యులు అనిపించుకున్నారో, అక్కడే, అదే సాహితీకారుల చేత పురస్కారాలు అందుకున్న వారెందరో ఉన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గా ఉన్న భారతదేశ సంప్రదాయం లో కులం అనే చీడపురుగు మాత్రం చావడం లేదు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఉన్న తొమ్మిది యుగాలకు చక్రవర్తిగా కీర్తించబడుతున్న జాషువా కూడా ఈ కుల వివక్షకు గురైన వారే.

చిక్కిన కాసుచే...
నలుదిక్కులు గల్గు లోకమున దిక్కరియున్న
యరుంధతి సుతుండొక్కడు జన్మమెత్తి
భరతోర్వరకుం గడకొట్టు బిడ్డడై

-గబ్బిలం, జాషువా, పద్యం, 08

ఈ దళిత వ్యవస్థను ,అస్పృశ్య జీవితాన్ని స్కెచ్ వేసి చూపించాడు. ఇంకా ఏందిరా సాహితీకారులు ఈ కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడినారు. బోయి భీమన్న సాహిత్యాన్ని దళిత సాహిత్యంగా చెప్పవచ్చు. కుల ప్రస్తావన ప్రత్యేకంగా చెప్పకపోయినా వీరి సాహిత్యంలో చాలా అంశాలు అణగారిన వర్గం గురించి ఉంటాయి. కులం కంటే గుణం మిన్న - ,మతం కంటే మానవతా వాదం వెయ్యి రెట్లు మిన్న. బోయి భీమన్న సాహిత్యంలో ఈ మానవతావాదం స్పష్టంగా కనిపిస్తుంది.

ఏ కులమని నన్నెవరు అడిగితే ఏమని చెప్పుదు లోకులకు, పలుగాకులకు అని కాలజ్ఞానం రాసిన బ్రహ్మం గారి శిష్యుడు సిద్ధయ్య అన్నట్లు కులాలు, మతాలు అడిగేది మనుషులు కాదని, వారు కాకులతో సమానం అని చెప్పాడు. అంతేకాదు కాకులకి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టీకరించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గౌరవిస్తూ, అంబేద్కర్ వంటి గొప్ప వారిని గుర్తు చేసుకుంటున్నాం కానీ వారి ఆశయాలు ఆచరించడం లేదు. వీరు రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని చిన్నప్పటినుండి పేదరికంతో పాటు, అంటరానితనం అనే

దురాచారానికి ఎదుర్కొన్న భీమన్న తెలుగులోకి అనువాదం చేయడమే కాదు, దళిత జాతీయ గేయం అయిన 'జయ జయ జయ అంబేద్కర్ ' అనే గేయాన్ని రాసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

అస్పృశ్యతకు గురి అవుతూ, అనేక బాధలు పడేవారు చివరికి ఎదురుతిరిగితే ఏం జరుగుతుందో మాలపల్లి నవలలో చూడవచ్చు. 1931-32 ప్రాంతంలో దాదాపు "ఆరు కోట్ల తిరుగుబాటు" అనే పద్య కావ్యం లో హరి జనులు తమ హక్కుల కోసం పోరాడిన తీరు బి ఎస్ మూర్తి గారు వివరించారు. ఒకవైపు గాంధీ, మరోవైపు అంబేద్కర్ హరిజనోద్ధరణ పేరిట చేస్తున్న పోరాటం మొదలైన పోరాటాలు వీరిలో ఒక ప్రశ్నను పుట్టించాయి. హరిజనులు ఎవరు? అంటరానితనం ఎందుకు వచ్చింది? ఇంకా అనేక సందేహాల నివృత్తికై వెతికినా దొరకలేదు. మెదడులో జరిగిన ఈ ప్రశ్నల సంఘర్షణలకు సమాధానంగా భీమన్న ఏడు సిద్ధాంతాలను రూపొం దించాడు.

పూర్వకాలంలో కులాలు, మతాలు వంటి ప్రత్యేకమైన నిశిద్దాలు లేవు. రామాయణ ,మహాభారత కాలంనాటి వ్యవస్థలో కులాల సమీకరణ కనిపిస్తుంది. వాల్మీకి బోయ వాడు అంటే గిరిజనుడు అంతేకాదు గిరిజనుల్లో మాలని, అసృశ్యులని వాదన కలదు. వ్యాసుడు మొదలైన వారి పుట్టుకకు సంబంధించిన ఇతివృత్తాలు ఇందుకు మూలాలు.

వేద విదుడు వాల్మీకి ప
విత్రుడు మును నిషాదడే కదా?
నిరుద్ధ భారతం, పద్యం, 12

వాల్మీకి రామాయణం రాయడమే కాదు భూమి ఉన్నంత కాలం కీర్తించబడుతునే ఉంటాడు. ఇంత గొప్ప వ్యక్తి కూడా నిషాదుడు కానీ నేడు నిషాదునికే స్థానం లేకుండా పోయింది అని భీమన్న అంతరార్థం. హరిజనులు అంటే అస్పృశ్య ల ని, అంటరానివారిని అనే భావనను ప్రజల్లో తుడిచి వేయడానికి 'వేదవ్యాసుడు " అనే రచన చేశాడు.

భీమన్న తన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో చెప్పినట్టు వేదాలు అనుష్టుప్ ఛందస్సులో వ్రాయబడ్డాయి. అనుష్టుప్ ఛందస్సు శూద్ర మైనదని ,వీరి బంధువుల కోసమే వేదాలు పురాణీకరించబ డ్డాయని వ్యవహారంలో కలదు. డీజే బంధువులు అంటే హరిజనులే అంటారు. ''జనితో బ్రాహ్మణ్యం వృషతే నమః''(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, బోయి భీమన్న, పుట:326). ఈ నిర్వచనం ప్రకారం హరిజనుల బ్రహ్మ బంధువులే మరి నేడు కుల వివక్ష ఎందుకు అనే భావన కనిపిస్తుంది. భీమన్న రచనలు అస్పృశ్య నివారణకు మార్గదర్శకాలను జి వి ఎస్ మాటల్లో

పాలేరు నుండి పద్మశ్రీ దాకా
ప్రస్థానం సాగించిన ప్రజా నిధి
రాగ వైశాఖిలో రసాద్వైతాన్ని
సాధించిన రాజయోగి
బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పుట 632.

అఖిల జగత్తుకి సృష్టికర్త బ్రహ్మ, త్రిమూర్తులలో ఒకరు. ప్రతి ప్రాణి పుట్టుకకు మూలకారకుడు. బ్రహ్మ చేసిన బొమ్మలకు ప్రాణం పోసి అమ్మ కడుపులో వేయగా పుట్టుక కలుగుతుందని హిందూ ధర్మం చెప్తుంది. ఓంకార నాదం కూడా బ్రహ్మ నుండి పుట్టాయని వేదాలు చెబు తున్నాయి. అట్టి బ్రహ్మ సృష్టిని ప్రశ్నించిన కవి భీమన్న,

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని స్వర్ణ మయం చేశారు. పద్మశ్రీ ,పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ వంటి పురస్కారాలు అందు కున్నారు. భారత దేశంలో వర్గ పద్ధతి లేదు ఉన్నదంతా కేవలం వర్ణ వ్యవస్థ (కుల వ్యవస్థ) అని తెలిపాడు. మనం అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరాని తనాన్ని తొలగించాలని సత్యాన్ని తెలిపి, కుల నిర్మూలనకు తన సాహిత్యాన్ని వారధిగా చేసుకుని కవి.

జగత్ సత్యం బ్రహ్మ మిథ్య అనే కావ్యంలో బ్రహ్మ చతుర్ముఖుడు అని అందరికీ తెలుసు. మనకు తెలియని ఏమిటంటే బ్రహ్మ పంచముఖం గురించి, అది నరికి వేయడానికి గల కారణాలను గురించి. భీమన్న ఇక్కడే

అద్భుతమైన కల్పన చేశాడు. ఈ లోకంలో పంచమ కులస్తులు ఎదుర్కొనే సవాళ్లను, కష్టాలను బ్రహ్మ ఐదవ ముఖం తో పోల్చిన తీరు హర్షణీయం. కావ్య ఆరంభంలోనే సరస్వతీదేవిని తలచుకోవడం భీమన్న కు గల వినయాన్ని తెలుపుతుంది.

బ్రహ్మ, సరస్వతితో భీమన్న జరిపిన సంభాషణ రూపంలో రాయబడిన ఈ కావ్యంలో చివరికి భీమన్న గెలుస్తాడు. కారణం తాను ఎంచుకున్న మార్గం లోకానికి వెలుగు చూపేది, నూతనమైనది. బ్రహ్మను సైతం మిథ్యగా పోల్చిన భీమన్న అక్షరాల దాటికి, బ్రహ్మే స్వయంగా దిగిరావడం ఊహనే కాని నిజం కాదు. ఈ కావ్యంలో వీరి మధ్య జరిగిన సంభాషణ చూస్తే మాత్రం బ్రహ్మ నిజంగా దిగి వచ్చాడా, భీమన్న చెప్పే నిజాల కోసం అని అన్నట్టు అనిపిస్తుంది.

కాలానికి సంకెళ్లు వేయడం సాధ్యం కాదు, భీమన్న ముక్కుసూటి సాహిత్యానికి కంచె వేయడం అసాధ్యం. జిఎస్ సభలో బ్రహ్మ మిథ్య కేవలం కనిపించేది మాత్రమే సత్యం అని చెప్తాడు. ఇక్కడ బ్రహ్మ తనను తాను తెలపడానికి భీమన్న తో సంఘర్షణ చేస్తాడు. ప్రాచ్యుల కాల గమనం ప్రకారం అర్ధరాత్రి 12 దాటితే మరుసటి రోజుగా లెక్కిస్తాము. అయితే బ్రహ్మ సృష్టిలో ఉదయం 6 నుండి మరుసటి రోజు ఉదయం 6 వరకు ఒక రోజు ఈ విషయాన్ని చెప్పి బ్రహ్మ ను నిలదీసిన తీరు...

మన లెక్కలో ఉదయంఆరు నుంచి
మళ్లీ ఉదయం ఆరు వరకు ఒక రోజు
మీరు బ్రహ్మ అయితే...
జగత్ సత్యం బ్రహ్మ మిథ్య, నేను, 09.

బ్రహ్మ భూలోకానికి వస్తే ప్రాచ్యుడిగా మారిపోతాడు అనేది భీమన్న తెలిపిన సత్యం. ఈ లోకంలో అందరూ సమానమే అనే భావన లేకుండా, ఎవరికి వారు తామే గొప్పవారమని విఱ్ఱవీగుతున్నారు. విద్యావంతులకు నిరక్ష రాస్యులకు, పదవిలో ఉన్నవారికి లేనివారికి ఇలా మనిషికి మనిషికి మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయి. నేనే గొప్ప అనుకునే వాళ్లంతా ఇతరులను తక్కువగా చూడడం, చిన్న పొరపాటు భూతద్దంలో పెట్టి ఎత్తి చూపడమే కాదు వారిని అక్కడే మధ్యలో వదిలేసి లేచి రావడం మొదలైన అసంఘటిత కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా సభలు సమావేశాలు జరిగినప్పుడు ప్రత్యేక అతిథిగా వచ్చిన వారికి ఏ కొంచెం అవమానం జరిగినా రగిలిపోతారు. అందరూ మనుషులే కాని, డబ్బు అధికారం ఉన్న వారికే విలువ ఈ అధికారం ఉన్న వ్యక్తుల గురించి తెలుపుతూ అధి కార పదవి ధనవంతులు సభలోకి ధైర్యంగా వెళ్తారు.

అధికార పదవీ ధన మత్తులు
మేధావుల సభలోకి ధైర్యంగా వెళ్లలేరు
సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి వెళ్లలేరు
బధిరాంధక విగ్రహాలై దాగుకొనే కంటే
ప్రజ్ఞానుల సూక్తుల్ని స్వయంగా విని
లోపాలను దిద్దుకోవడం లోకజ్ఞత కదా

సరస్వతి దేవి, పద్యం 12 సరస్వతి దేవి చేత భీమన్న చెప్పిన ఈ వాక్యాలు లోక సత్యాన్ని తెలిపేవి. నిజమే కదా డబ్బు ఉన్నవాడు, అధికారం ఉన్న వాడు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండలేడు. ఒంటరిగా ప్రయాణం చేయలేడు, తృప్తిగా నిద్రించ లేడు. సమాజంలోని ఈ నిజాన్ని తెలుపడమే కాదు నిజమైన వివేకులు చేయాల్సిన కర్తవ్యం తెలియజేశాడు. అందుకే బధిరాంధక (గుడ్డి, చెవిటి) విగ్రహాల వలె ఎక్కడో కనిపించకుండా, ఏమీ తెలుసుకోకుండా ఉండడం కంటే పండితులు అంటే తెలివైన వారు చెప్పే మాటలు విని తమ తప్పును సరి దిద్దుకోవాలని తెలిపాడు. సమాజం నేడు డబ్బు, అధికారం అనే చీకటిలో ఉండిపోయి మానవత్వం అనే వెలుగును చూడలేక పోతుంది. ఎదుటివారిలో లేని లోపాలు వెతికి వారిని వినిపించడమే కానీ మంచిని, తెలివిని గుర్తించలేక పోతుంది. అందుకే తమ కన్నుల పొరలను తొలగిస్తే మానవత్వమనే వెలుగు కనిపిస్తుంది అంటాడు భీమన్న.

సమాజం ఎంతగా అభివృద్ధి చెందిన సమానత్వం మాత్రం కరువైపోతుంది. ముఖ్యంగా ఈ లింగ వివక్ష కారణంగా స్త్రీలు అన్ని చోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, కుటుంబం మొదలైన అనేక రంగాల్లో కూడా స్త్రీలు వివక్షకు గురవుతున్నారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు అనడం కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయి. స్త్రీల అసమానతను గురించిన రచనలు ఎన్నో వచ్చాయి కానీ ప్రయోజనం లేకుండా పోయింది. స్త్రీ అంటే అబల కాదు సబల అని నిరూపించే సంఘటనలు ఎన్నో చరిత్ర పుటల్లో కనిపిస్తాయి. నరకునితో యుద్ధం చేసినప్పుడు శ్రీకృష్ణుడు మూర్ఛ పోగా, సత్యభామ తన శక్తితో నరకుని చంపిన ఘటన స్త్రీ లోకానికి ఆదర్శనీయం.

పాతివ్రత్యం అంటే భర్తను అనుసరించడం మాత్రమే కాదు బానిసత్వం కూడా. పాతివ్రత్యం శక్తి నివ్వదు, కేవలం తపస్సుతో మాత్రమే శక్తి వస్తుంది. స్త్రీకి తపస్సు స్వయంశక్తి అందుకే ఆమెకు కోపం వస్తే కాళికామాతలా మారుతుంది. అప్పుడు పరమేశ్వరుడు ఆయన పాదాల కింద పడాల్సిందే. ఇంత గొప్ప శ్రీ శక్తి స్వరూపాన్ని సరస్వతీ దేవితో చెప్పించిన భీమన్న...

పాతివ్రత్యం పతికి కట్టు బానిసతనం!
బానిసతనం శక్తి నివ్వదు.
నాశక్తి తపస్సుతో వచ్చినట్టిది
లక్ష్మీ పార్వతి కూడా
స్వయం శక్తి మంత్రులే
.....
ఎవరు చంపలేని మహిషాసురుడ్ని
చంపిందెవరు?
అది ఆమె తపశ్శక్తి,
విజృంభించిన శ్రీ శక్తి!

- జగత్ సత్యం బ్రహ్మ మిథ్య, 607.

శ్రీ శక్తి కి ఎదురు లేదు, కురుక్షేత్ర సంగ్రామానికి, కౌరవ వినాశనానికి కారణమైన ద్రౌపది స్త్రీ మూర్తియే. కాకతీయ వంశానికి మణి కిరీటమైన రుద్రమదేవి చిరస్మరణీయమే. ఒకవేళ శ్రీ విజృంభించితే తన శక్తిని ఎదుర్కొనే వారు ఉండరని తెలుస్తుంది.

బ్రహ్మ సృష్టి గురించి బ్రహ్మనే ప్రశ్నిస్తాడు భీమన్న. ప్రతి యుగంలో రాక్షససంహారం చేయడానికి భగవంతుడు ఏదో రూపంలో రావాల్సిందే. నాటి కాలంలో ఇంద్రుడు ఒక్కడే, అహల్య ఒక్కతే. రామ పాదంతో అహల్యకు తిరిగి ప్రాణం వచ్చింది గౌతముని సన్నిధి చేరింది. నేడు కలియుగం ఈ యుగంలో లక్షల మంది ఇంద్రులు, కోట్ల అహల్యలు. అంతే కాదు ఇందులో చేతుల్లో అహల్య చనిపోతున్నారు, ఇంద్రులు సింహాసనం పొందుతున్నారని వేదన చెందాడు భీమన్న. అందుకే బ్రహ్మతో ఎప్పుడో ఒకసారి సృష్టి చేసి యుగయుగాల వరకు అలాగే కొనసాగిస్తున్నారు నువ్వు చేసేది నకిలీ అంటాడు. యుగాలు మారిన అప్పుడు మీ ఆలోచన ఎందుకు మారడం లేదు అని ప్రశ్నిస్తాడు. భీమన్న రచనలు విలక్షణమైనవి, ఏదో ఒక వాదానికి చెందినవి కావు, ఎవరిని ఉద్దేశించినవి కాదు. అందుకే వీరి సాహిత్యాన్ని ఎంత లోతుగా పరిశీలిస్తే అంత చక్కని ముత్యాలు పొందవచ్చు.

మానవులు చనిపోయిన తర్వాత వారి శరీరం నుండి ఆత్మలు బయటకు వస్తాయని, అవి ఘోషిస్తాయి అని పెద్దల నమ్మకం. ఈ ఆత్మను వెంట్రుకలతో పోల్చి, బ్రహ్మ సృష్టిని విమర్శించాడు. పోతన, వాల్మీకి, గాంధీ, ధర్మరాజు మొదలైన ప్రతి ఒక్కరిని తన సాహిత్యంలో విమర్శించిన కవి భీమన్న. అంతే కాదు కర్మ సిద్ధాంతానికి సవాలు విసరడం ఈ కావ్యంలో చూడవచ్చు. చేసే పనిని బట్టి ప్రతిఫలం ఉంటుంది కదా దేవునితో పని ఏంటి, ఈ హంగులు, ఆర్భాటాలు ఎందుకు అంటాడు.

ఎవడి జీవితానికి వాడే కర్త అన్నమాట
పని సృష్టికర్త అన్నమాట
మరి వేరే బ్రహ్మదేవుడెందుకు?

- (జగత్ సత్యం బ్రహ్మం మిథ్య, 23).

తాము చేసే పనులకు ఫలితం మంచి అయినా, చెడు అయినా అనుభవించేది వారే. కాబట్టి ఎవరికి వారే సృష్టికర్తలు, ఇంకా వేరే దేవుడు అంటే బ్రహ్మాలా సృష్టి కర్త అవుతాడు అనడంలో మనిషి తాను చేయాల్సిన కర్తవ్యాన్ని బోధించాడు. గాలిలో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు అనడం ఎంత పొరపాటో, ఏ పని చేయక, ప్రయత్నించక నా బతుకు ఇంతే, తలరాత ఇంతే అని సరిపెట్టుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఈ సృష్టి పంచభూతాల కలయిక. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి వీటిచే భౌతిక సృష్టి చేయబడింది. ఇదంతా కేవలం పైకి కనిపించే సగమే, పాతాళ నా మరొక సగం దాగి ఉంది. ప్రతి వారు కనిపించే దానిని మాత్రమే చూస్తున్నారు, కనిపించని దాన్ని మాత్రం వెతకడం లేదు. పరమాత్మ నుండి శూన్యం, పంచ పదార్థాలు పుట్టి మనిషిలో నిండి పోయాయి. వీటి స్వరూపాన్ని విమాన తెలియజేసేందుకు ప్రయత్నించాడు.

ఈ సారస్వత విప్లవాన్ని ప్రారంభించి సాధించుమని చివరికి బ్రహ్మచేతనే అనిపించాడు. ఇది ఒక మార్పు, విప్లవం దీనికి నీవే సరైన వాడివని బ్రహ్మచేత భీమన్న చెప్పిన విధానం అమోఘం. ముందు భీమన్న తో వారించిన బ్రహ్మ, చివరికి నిజం తెలుసుకుని భీమన్నను ఆశీర్వదించిన భావన కలుగుతుంది.

"మా అయ్య నన్ను చిరునవ్వుతో కౌగిలించుకుని అదృశ్యమై పోయాడు" (జగత్ సత్యం బ్రహ్మ మిథ్య, పుట: 624). బ్రహ్మదేవుడు భీమన్నను ఆశీర్వదించి దైవ లోకానికి వెళ్ళి పోయాడు. భీమన్న తన సాహిత్యంలో గొప్ప విప్లవాన్ని సృష్టించాడు. భీమన్న చెప్పిన బ్రహ్మ ఐదవ ముఖం రహస్యం:

భీమన్న చిన్ననాటి నుండి పంచమ కులస్తుడిగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. లోకంలో మంచి వారికి ఎప్పుడూ కష్టాలు ఉంటాయని భావన కూడా ఉంది. నిజాలు చెప్తే లోకమే కాదు ఇంట్లో వారు కూడా దూషిస్తారు, దూరం చేస్తారు.

బ్రహ్మ ఐదవ ముఖం నిజం చెప్పినందుకే శిరస్సు నుండి వెలివేయబడిందని, అలాగే సమాజంలో నిజాలు చెప్పినందుకే పంచమ కులస్తుడిని ఈ సమాజం వెలి వేసింది తెలియజేశాడు. శివలింగం తుది, మొదలు చూడడానికి బ్రహ్మ, విష్ణువులు చెరో వైపు వెళ్లగా విష్ణువు తుది దొరకలేదని నిజం చెప్పాడు. బ్రహ్మ అ మాత్రం తన నాలుగు ముఖాలతో గోవు, మొగలిపువ్వు సాక్షాలుగా అబద్ధం చెప్తాడు. అప్పుడు ఐదవ ముఖం మాత్రమే తాను శివలింగం యొక్క మొదలు చూడలేదని నిజం చెప్తుంది. ఇది నచ్చని నాలుగు ముఖాలు ఐదవ ముఖాన్ని నరికివేసి, ఆ ముఖాన్ని గాడిద ముఖంగా చిత్రించి బ్రహ్మను చతుర్ముఖుడుగా చెప్పినట్టే, పంచవర్ణ జాతిని చాతుర్వర్ణ జాతిగా ఈ సమాజం చేసిందని వ్యక్తం చేశాడు.

వ్యక్తిత్వం లేని శక్తి
వుండీ లేనట్లే !
అందుకే దానిని
మిథ్య అన్నాడు కవి !
నిజమంతే ! సత్యం,
పరబ్రహ్మ మిథ్యే.

అంధకారంలో ఉండి నిజాలు చూడలేక పోతున్నాం. కేవలం శక్తి ఉంటే సరిపోదు, దానికి తగిన వ్యక్తిత్వం, నిజాన్ని గుర్తించి మనసు ఉండాలి. అప్పుడే సృష్టి రహస్యం తెలుస్తుంది. ఇది భీమన్న సృష్టి రహస్యం.

ముగింపు :

భీమన్న ఒక విప్లవం, ఒక సాహితీమూర్తి, ఒక నూతన శక్తి. వీరి సాహిత్య క్షేత్రంలో పండిన పంట అంతా బంగారమే. మీరు చెప్పే నిజాలు చేదుగా ఉన్నప్పటికీ, అందులోని ఔషధం తెలిస్తే వదిలివేయడం అసాధ్యమే. జగత్ సత్యం బ్రహ్మ నిత్య కావ్యంలో హరిజనులు, గిరిజనులు, మహిళలు మూడు వర్గాలు ఏకమై తమ హక్కుల కోసం పోరాడితే ఎలా ఉంటుందో తెలిపాడు. ప్రకృతిని సత్యంగా చూపించి మిగిలినదంతా కల్పనే

అనడంలో వాస్తవం లేకపోలేదు. ఏ చెట్టుకు ఆ పూలే పూస్తాయి, ఆ కాయలు కాస్తాయి ఎంత తపస్సు చేసినా ఇది మారదు. అదేవిధంగా మనం చేసే పనులను బట్టి ప్రతిఫలం ఉంటుంది కాని, పరమాత్మను, తలరాతను నమ్ముకుంటే ప్రయోజనం ఉండదు. నిజాలు చెప్పిన వాడు నిండిన పాలు కావాల్సిందే. దీనికి ఉదాహరణగా బ్రహ్మ ఐదవ ముఖాన్ని తెలిపాడు. ఇది అపూర్వ అంతా భావన. చాతుర్వర్ణ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. అలాంటప్పుడు బ్రహ్మ సృష్టి ఎందుకంటాడు. బ్రహ్మ మిథ్య అనడమే కాదు నాలుగు ముఖాలు, నాలుగు రకాల సృష్టిని కాదని ఏక(అయిదవ) ముఖం, ఏక జాతి కోరడం భీమన్న ప్రత్యేకత. పురుషాధిపత్యని పౌరుషంగా మలచి సరస్వతి దేవి చేత పంచముఖ సత్యాన్ని తెలిపి, సత్య సృష్టి చేసి, సృష్టికే సృష్టిని చేశాడు భీమన్న.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. జగత్తు సత్యం బ్రహ్మ మిథ్య, భీమన్న ,భీమన్న సాహితీ నిధి ప్రచురణలు, హైదరాబాద్, 2004.
2. వేదవ్యాసుడు, బోయి భీమన్న, కార్తిక్ గ్రాఫిక్స్, హైదరాబాద్, 2000.
3. బాలయోగి, బోయి భీమన్న, శ్రీ రామ పవర్ ప్రెస్, హైదరాబాద్, 1964.
4. ఆదికవి వాల్మీకి, బోయి భీమన్న, లలిత ప్రెస్, హైదరాబాద్, 1970.
5. నిరుద్ధభారతం, శ్రీ మంగిపూడి వెంకటేశ్వర శర్మ, 1915.
6. గబ్బిలం, జాషువా, విశాలాంధ్ర బుక్ హౌస్, విపి హెచ్ రెండవ ముద్రణ, హైదరాబాద్, 2004.
7. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం , భీమన్న, శ్రీరామ పవర్ ప్రెస్, హైదరాబాద్ 1964.

గుడిసెలు కాలిపోతున్నై – సామాజిక చైతన్య భూమిక

– డా॥. బూర్గుల స్వరూప, తెలుగు అధ్యాపకురాలు, యం.వి.యస్. ఆర్ట్స్ అండ్ సైన్స్, కళాశాల (అటానమస్), మహబుబ్‌నగర్.

సామాజిక పరిణామ క్రమానికి అనుగుణంగా కొత్త రూపాలను, ఇతివృత్తాలను సమకూర్చుకొంటూ, మానవ సంబంధాలలో రావలసిన మార్పును సూచిస్తూ వికసించటం, విస్తరించడం సజీవ సాహిత్య లక్షణం. ఆ జీవ లక్షణాలు కలిగిన కవిత్వం రచన బోయి భీమన్న గారి గుడిసెలు కాలిపోతున్నై, సామాజిక సమస్యల గురించి, సంబంధాల గురించి అభివృద్ధి చెందుతున్న నూతన ప్రజస్వామిక చైతన్యం కొరకు, పరితపించి తెలుగు సాహిత్యం ఒక ప్రత్యేక స్థానం పొందిన కవి భీమన్న గారు.

సమాజంలో జరుగుతున్న అనేక రుగ్మతలను తొలగించడానికి ప్రయత్నించిన కవి బోయి బీమన్న గారు. "దేశ సంపదను సృష్టిస్తూ" జాతి జాతినే పోషిస్తున్న కూలీలు తలదాచు కొంటున్న పేట ఇంత ఇరుకుదా! ఇది నరకం కంటే మురికిది కదా! ఈ చీకటి ఆకటి పొగ గుడిసెల్లోనా ఈ జాతి జీవన దాతలు, ఈ నిస్వార్థ శ్రమ జీవులు నివసిస్తున్నది! ఛీ! అసహ్యం! వీటిని తగలబెట్టి పారెస్తాను"! అంటూనే

మురికి సందుల, ఇరుకు గుడిసెలు
మూల్గుచున్న దరిద్రమున్ గన్
తగుల బెట్టగ బుద్ధి పుట్టెను
తల్లి! నా కపుడు

చేతకాని నరుడు, సిగ్గు నెగ్గును లేక
పాడు గుడిసెలందు బ్రతుకు గాక
చలము గల్గి, చేత బల మున్న చిచ్చేల
ఓగు గాల్చి, బాగు నోమ రాదు!

సమాజంలో నాడు సామాన్యుడికి జరుగుచున్న అన్యాయాన్ని తన కవిత్వం ద్వారా ప్రతిఫటించే ప్రయత్నం చేసారు. సామాజిక చైతన్యం మాత్రం పెద్దగ జరిగినట్లు కనిపించలేదు. దోపిడికి, అన్యాయానికి గురైతునే ఉన్నట్లు, ఒక మనిషి, మరో మనిషిని అనే రకాల హింసలకు గురి చేస్తూనే ఉన్నాడు. నాటి సమాజమే కాదు. నేడు కూడ అలాంటి దుస్థితికే గురైతున్నారు. కాకపోతే ఆధునికంగా మారిన సమాజంలో కొత్త రకగా అన్యాయానికి గురి కావడం, నేడు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కొంత మార్పు వచ్చినప్పటికి మానవ స్వరూపంలో సమతా జ్యోతి వెలుగలేదు అనే చెప్పాలి. అందుకే "కవి ఎంత ఏడ్చినా అది అరణ్య రోదన మేనా? అంటాడు. అదే విధంగా "వేద ఋషులు, వాల్మికి, వ్యాసుడు, కాళిదాసు వేమన్న - వీళ్లందరి ఏడుపూ నా ఏడుపులా అడవి గాసిన వెన్నెలేనా!" అని తన బాధను వ్యక్తం చేశారు కవి.

బోయ భీమన్న గారి గుడిసెలు కాలిపోతున్నై కవితలో నాటి పేదరికపు దుస్థితిని, రాజకీయపు కుట్రను కళ్ళకు గట్టినట్లు చూపించారు.

అదే మన ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాప నార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!
పోతుంటై
పుట్టుకొస్తుంటై!

మన సనాతన భారతీయ ధర్మం చెప్పిన ధర్మం సూత్రం ఇక్కడ ప్రస్తవించారు కవి గారు, కాని నాడు ధర్మ నశించిప్పడు. దాన్ని కాపడటానికి భగవంతుడు వస్తాడని నమ్మకం. ఇక్కడ పేద వారి గుడిసెలు కాలి పోతుంటై మళ్ళీ పుట్టు కొస్తుంటై, అంటే ధర్మం మళ్ళీ పుట్టిందని కాదు, స్వార్థపు రాజకీయాలు, ఆధిపత్య సమాజం చేసే కుట్రలు అని గుర్తించాలి. నాటి పేద

ప్రజలలే కాదు! నేటి నవ సమాజం కూడ ఇలాంటి కుట్రలకు కుతంత్రలకు పేదలు బలైతున్నారు. అనేది నగ్న సత్యం. సమాజంలో ఏ కాలంలోనైన మోసం, దోపిడి, అన్యాయం ఎప్పుడు జరుగుచునే ఉన్నాయి. విధానాలలో మాత్రమే మార్పు ఒక నాడు గుడిసెలు, కాలినవి మరొక నాడు ఇంకొ రకమైన కుట్రలో పేద ప్రజలను మోసం చేస్తునే ఉన్నారు. ఇల మోసపోవుచున్న సమాజాన్ని జాగృతం చేసే ప్రయత్నమే గుడిసెలు కాలి పోతున్నై కవిత.

ఎక్కడికో పోతున్నారు
మరేం చేస్తారు!
గ్రామ దేవతల నుండి బాబాల దాకా
చిత్తం పూజల మీద - ప్రజల మీద కాదు
టీచర్ల నుంచి ప్రొఫెసర్లు దాకా
దృష్టి జీతం మీద - చేతం మీద కాదు!

ఒక దేశ అభివృద్ధి, పాలకులపైన, పంతుళ్ళపైనే ఎక్కువగా ఉందని గుర్తించాలి కాని దురదృష్టం కొద్ది ఈ రెండు వ్యవస్థలు నేడు చాలా అస్తవ్యస్థంగా పని చేస్తున్నాయి. కవి చెప్పినట్లు గానే పాలకులు సక్రమంగా పాలించకపోతే కొంత కాలమే సమాజంలో ఇబ్బందులు రావచ్చు, కానీ విద్యా వ్యవస్థ సక్రమంగా పని చేయకపోతే, సరైన మార్గ నిర్దేశ్యం చేయకపోతే కొన్ని తరాలు సమాజం అస్తవ్యస్థంగా మారుతుంది. సమాజ గమానికి దిశ నిర్దేశ్యం చేసే గురువులు నేడు తమ ఆదర్శ జీవితాలను, జీతాల కొరకు, పాలకుల తమ ధర్మ పరిపాలన స్వార్థం కొరకు వినియోగిస్తున్నారు అని కవి ఆవేధన.

ఇలాంటి సమాజంలో జరుగుచున్న చర్యలు అన్ని మోసనికి దారి తీస్తాయా? మూర్ఖత్వనికి దారి తీస్తాయా? అంటే వాస్తవికత నుంచి, సత్యం నుండి, జాగృతి నుండి, చైతన్యత నుంచి ధర్మం నుంచి, ధర్మంకోసం పోరాటం నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి పెత్తందారీ వర్గాలు, కులతత్వ వర్గాలు చేసున్న తీవ్రయత్నంలో ఇదొక భాగం కావచ్చు. గొర్రెల్ని శాశ్వతంగా గొర్రెలుగానే వుంచడం, గుడిసెల్ని ఎల్లప్పుడు గుడిసెలు గానే అట్టి పెట్టడం ఆ మోసం! ధనిక వర్గానికి చెందిన యువకులలో కొందరు ఈ మోసానికి తోడ్పడే నిమిత్తం మీకు నాయకత్వం వహించడానికి కావచ్చు. అని కవి నమ నమాజ నిర్మాణంలో తమ బాధ్యతయుతమైన వైఖరిని వ్యక్త పరిచారు. అదే విధంగా " భావ విప్లవం జాతి సమైక్య, కుల నిర్మూలన, సమ సమాజ స్థాపన, శ్రేయో రాజ్య సిద్ధి - ఈ పంచ లక్ష్యాలనూ సాధించాలంటే, అందుకు ఒక్క యువకులే సమర్థులు అని కవిగా తను యువతను చైతన్యం చేయగలిగారు.

ఏ కాలంలోనైన మనిషి బ్రతకడానికి కనీసం " కూడు, గూడు, గుడ్డ"లు లోటు లేకుండా లభించాలి అలా లభించడానికి మతం, వర్గం, స్వార్థం అడ్డు వస్తున్నాయి. కనుక, వాటిని నిర్మూలించాలి అంటారు కవి.

తాను కల్పించుకొన్న దైవ భ్రాంతి నుంచి
తప్పించుకొని నిలబడి నప్పుడు,
కర్మ సిద్ధాంతాన్ని కాల రాచేసి నప్పుడు
తనను తాను తెలుసుకొని
తన్మయాత్ముడై నప్పుడు!

మానవుడు బాగుపడాలి అంటే ముందు తనను తాను తెలుసుకోవాలి. సత్యం, అహింస, న్యాయం, నిజాయితీ వంటి సద్గుణాలు అలవడ్చుకోవాలి. మంతం, కులం, జాతీ వంటి స్వార్థపు ఆలోచనల వల్ల, మానవుడు బాగు పడడం జరుగదని, దాని వల్ల సమాజంలో మానవ మను గడ అస్థ వ్యస్థంగా మారుతుందని దేశాభివృద్ధికి అవరోదం ఏర్పాడుతుందని కవి భావన. సమకాలీన సమాజంలోనే కాదు, సర్వ కాలంలోనూ అనుసర నీయమైనవి, ఆచ రించదగినవి. అలా ఆచరణలో ఉన్నప్పుడు సమ సమాజ నిర్మాణం జరుగుతుంది. బావి తరాలకు ఆదర్శ నీయులుగా దిశ నిర్దేశం చేసినట్లు అవుతుంది.

ఉపయుక్త గ్రంథాలు : 1. గుడిసెలు కాలిపోతున్నై. 2. పాలేరు నుండి పద్మశ్రీ వరకు.

బోయి భీమన్న ఆశించిన నవ సమాజం

– ఆచార్య విస్తాలి శంకరరావు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

తెలుగు సాహిత్యంలో మహాకవి, సాహితీవసంత, పద్మశ్రీ, నవయుగకవిసార్వభౌమ, పద్మభూషణ్ అనే బిరుదులు అందుకుని తన సాహిత్యంతో ప్రజలలో చైతన్యాన్ని రగిలించి నవ సమాజ నిర్మాణం జరగాలని ఆశించిన క్రాంత దర్శి బోయి భీమన్న.

వారి వ్యక్తిత్వం, సాహిత్యం ఎంతో విలక్షణమైనవి. ఎందుకంటే సామాజిక అవగాహనతో వికాసం చెందిన వ్యక్తిత్వం కనుక. ఆ వ్యక్తిత్వం ఆధారంగా వెలువడిన సాహిత్యం కాబట్టి వారి సాహిత్యం విలక్షణంగానే ఉంటుంది. చంధస్సులు ఏమి తెలియని రోజుల్లోనే పద్యం రాయడానికి సిద్ధపడినవారు కనుక ఆ ఆసక్తి క్రమక్రమంగా వికాసం చెందుతూ అద్భుతమైన సాహిత్య సృష్టికి కారణమైంది. సాహిత్య పరిజ్ఞానం పెంచుకోవడం ఒక ఎత్తు అయితే, ఆ సాహిత్యానికి నేపథ్యమైన అంశాలను ఎంపికచేసుకోవడంలో కూడా ఆ విశిష్టత కనిపిస్తుంది. ఎలా అంటే తన చుట్టు ప్రక్కల సమాజంలో జరిగే అనేకాంశాలను ప్రత్యక్షంగా చూడడమే కాక సమాజం పట్ల సరైన అవగాహన చేసుకుని అందులోని సమస్యలను అధ్యయనం చేయడం భీమన్న గారికి అలవాటుగా మారింది. ఇలా ఒకవైపు సాహిత్య అవగాహన, మరోవైపు సామాజిక అవగాహన సమృద్ధిగా భీమన్న గారిలో ఏర్పడంతో అది ఒక విశిష్టమైన వ్యక్తిత్వంగా ఆవిర్భవించింది. అందులోను ఏ అంశాన్ని అయినా నిర్భయంగా వ్యక్తం చేయగలిగిన ధైర్యసాహసాలు భీమన్న గారిలో పుష్కలంగా ఉండడంతో వారి మాటకు చేతను ఎంతో ప్రత్యేకత ఏర్పడింది. ఇలా భీమన్న గారిలో ఉన్న స్పష్టమైన అంశాలు సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

1. సాహిత్యంలో చక్కని పరిజ్ఞానం
2. సామాజికమైన అవగాహన
3. స్పష్టంగా చెప్పగలిగిన ధైర్యం

ఈ మూడు లక్షణాలు భీమన్నగారిలో పుష్కలంగా ఉండడంతో వారు వందమంది ఉన్న కూడా ఒక ప్రత్యేకత కలిగిన వ్యక్తిగా నిలిచారు. ఇలా భీమన్నగారి విలక్షణ వ్యక్తిత్వం నుండి జాలువారిన సాహిత్యం మరి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఎందుకంటే వారి కలం నుండి జాలువారిన ఏ రచనను పరిశీలించినా ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

సమాజాన్ని నిశితంగా పరిశీలించిన భీమన్నగారు ఒక్కొక్క సమస్యను సున్నితంగా అవగతం చేసుకునేవారు. నాటికి నేటికి సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యలో ఒకటి. కులసమస్య. మానవుడు వైజ్ఞానికంగా అభివృద్ధి చెంది పరుగులు తీస్తుంటే మరోవైపు అంతే వేగంగా సమాజంలో మూఢనమ్మకాలు అదే తరహాలో మరింత బలంగా ఒకవైపు ప్రజలలో వ్యాప్తి చెందుతున్నాయి. అదే సమాజంలో జీవించే భీమన్నగారు సమాజ స్థితిగతులను నిశితంగా పరిశీలించి ఆవేదన చెందారు. ఈ సమాజానికి శస్త్రచికిత్స అవసరమని భీమన్న భావించారు. అందుకు సాహిత్యాన్ని ఆయుధంగా ప్రయోగించారు. ఏ వ్యక్తి అయినా స్వప్రయోజనం, వ్యక్తి ధర్మం, వర్ణధర్మం, కులధర్మం మత ధర్మం వదిలినప్పుడే వారి చేసే పనులలో గొప్పతనం ఉంటుందని, సమసమాజం అప్పుడే సిద్ధిస్తుందని విశ్వసించారు. ఈ సామాజిక అభివృద్ధి జరగాలంటే ఏది అవసరమో భీమన్నగారు అవగాహనచేసుకున్నారు. ఆ అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకుని రచనలు ప్రారంభించారు. భీమన్నగారు ఏ అంశాన్ని అయినా స్పష్టమైన అవగాహన తెచ్చుకుని దాని ద్వారా సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేసించుకుంటూ తద్వారా సాహిత్యాన్ని సామాజిక సమస్యలపై అయుధంగా ప్రయోగిస్తారు. అది ఎలా అంటే భీమన్నకు సమాజపరంగా, రాజకీయపరంగా నిర్ధిష్టమైన ప్రణాళికలు ఉన్నాయి. ఎలా

అంటే సమాజంలో ఎన్ని కులాలు ఉన్నా జాతి ఒక్కటేనని, అలాగే ఎన్ని మతాలైన జాతి ఒక్కటేనని అదే భారతీయత ఔన్నత్యం అని విశ్వసించి దానికోసం పాటుపడ్డారు. అలాగే సమాజంలో ఉండే హెచ్చుతగ్గులు అంతరించిపోవాలి అనుకొన్నారు.

ఇలా సమాజంలో ఉన్న భిన్న వైరుద్యాలు మాసిపోయి అందరు ఏకదాటి మీదకు వస్తేనే ఈ అడ్డుగోడలు తొలగిపోతాయని విశ్వసించారు. కనుక తన సాహిత్యం ద్వారా సమాజంలోని అసమానతలను సరిదిద్దడానికి చేయవలసిన పనులు, అనుసరించాల్సిన విధానాలను సూచించారు. భీమన్నగారు చిన్నవయస్సు నుండి స్వతంత్రంగా ఆలోచించదగిన వ్యక్తి. అలాగే తన జీవనానికి అవసరమైన ఆర్థిక స్థితి సంమృద్ధిగా ఉండడం వారిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దాయి. అలాగే కుటుంబ జీవితం కూడా సంతృప్తికరంగా ఉండదు. అయినా భీమన్నగారకి అప్పటికే సమాజంలో రావాలసినంత గుర్తింపు కూడా వచ్చింది. కనుక వారు కీర్తికోసంగాని, ధనంకోసంగాని, గొప్పతనం కోసంగాని రాయవలసిన అవసరం లేదు కనుక వారు తన రచనలు అన్ని ఆశయాల కోసమే ఉపయోగించారు. అంతేకాదు తన సాహిత్యం ఎన్ని ప్రక్రియలు ఆవిర్భవించి ప్రజల చెంతకు తీసుకు పోగలమో అన్ని ప్రక్రియలను చేపట్టి సమాజిక ప్రగతికి శ్రీకారం చుట్టారు.

భీమన్నగారు రాసినది పాట కావచ్చు, నాటకం కావచ్చు, సిద్ధాంతం కావచ్చు. ఏదైన సరే సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని చేసిన రచనలే. ఆ ప్రక్రియలను ప్రయోగించడంలో కూడా తన పరిజ్ఞానాన్ని బాగా ఉపయోగించారు. ఎలా అంటే భీమన్నగారి తండ్రి పుల్లయ్యగారితో భీమన్న వేదాంతగోష్ఠులకు వెళ్లడం వలన ఆ తత్వ జిజ్ఞానలోని లోతులను దర్శించి అవగాహన చేసుకున్నారు. ఆ జ్ఞానం తన రచనలలో అవసరమైన చోట్ల తన దృక్పథాన్ని వెల్లడించడానికి ఎంతగానో ఉపయోగపడింది. అలాగే భీమన్న గారి తల్లి నాగమ్మ పాలాల పనులకు వెళ్లినప్పుడు భీమన్న ఆ పరిసర ప్రాంతాలను పరిశీలించడంతో పాటు గ్రామీణ పదాలు,పాటలు వారి సంస్కృతిని బాగా ఆకలింపు చేసుకునే అవకాశం దొరికింది. ఆ విజ్ఞానాన్ని భీమన్న చక్కగా తన సాహిత్యంలో ప్రయోగించారు. కనుకనే వారి రచనలను పరిశీలిస్తే ప్రతి రచనలలోను ఎన్నో వైవిధ్యమైన అంశాలు కనిపిస్తాయి. గ్రామీణ వాతావరణం చిత్రించబడుతుంది. పాత్రలు మనచుట్టు ప్రక్కల ఉన్నవారివివలే ఉంటాయి. కొనిసార్లు ఆ పాత్రలలో మన లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఉదా॥ భీమన్న గారి రచనలు....

పాలేరు, కూలిరాజు, రాగవాసిష్ఠం, జానపదుని జాబులు, దీపసభ, ధర్మంకోసం పోరాటం, జన్మాంతర వైరం, మొక్షం నా జన్మహక్కు, మానవునికి మరొక మజిలి, గుడెసెలు కాలిపోతున్నాయి, అంబేద్కరిజం, గిల్లి చెబుతున్న, ఇదిగో భగవద్గీత, అసూయ, ప్రగతి, పడిపోతున్న అడ్డుగోడలు, పైరుపాట మొదలగు రచనలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రతి రచన ఒక విలక్షణమైన అంశాన్ని చిత్రిస్తుంది. ఉదా॥ కొన్నిటిని చూద్దాం.

1940లో వచ్చిన పాలేరు నాటకాన్ని పరిశీలిస్తే గత కాలంలో ఉన్న పాలేరు వ్యవస్థలోని లోపాలను చిత్రికరిస్తూ వారిలో చైతన్యాన్ని రగిలించేదుకు అవసరమైన మార్గాన్ని సూచించారు. అలాగే కూలిరాజు నాటకంలో కూడా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీల స్థితిగతుల్ని ఆవిష్కరించారు.

అలాగే పట్నంలో చదువుకుని పేదరికం వలన చదువు మాని తన స్వగ్రామానికి వెళ్లిన వ్యక్తి వారి గ్రామ విశేషాలను వారి అవస్థలను తెలియజేసేదే 'జానపదుని జాబులు' అనే రచన. ఇలా చెప్పుకుంటూపోతే భీమన్నగారి ప్రతిరచన ఒక సమస్యను వెలుగెత్తి చూపడమేకాక దాని పరిష్కార మార్గాన్ని కూడా చూపించేదిగా ఉంటాయి. అలాగే భీమన్నగారి రచనలు హిందీ భాషలోకి కూడా అనువాదాలుగా మారి ఆయా సాహితీ లోకంలో

అడుగుపెట్టాయి. వీరు లేవనెత్తిన సమస్యలు సమాజంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు భీమన్న సాహిత్యం ఈ సమాజానికి చైతన్యం కలిగించడానికి అవసరం ఉంటుంది కనుక అది నిత్యం అవసరమే.

కులాల మధ్య, మతాల మధ్య, జాతుల మధ్య సమైక్యత అనేది కావాలని భీమన్న ఆశించారు. అదే ఈ సమాజానికి సరైన వర్గం అని, అలాగే ఈ దేశంలో గ్రామాలు పునర్నిర్మాణం జరగాలని తన రచనల ద్వారా తెలియజేశారు.

బోయి భీమన్నగారి సాహిత్యంలో ఒక విశిష్టమైన అంశంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ గురించి ఉంది. ఎలా అంటే బోయి భీమన్నకు డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ అన్న, వారి సిద్ధాంతాలు అన్నా ఎంతో ఇష్టం. అంబేద్కర్ రచనలు చదివి ఎంతగానో చైతన్యం పొంది వారి సిద్ధాంతం ఈ సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఎంతో అవసరమని భీమన్నగారు విశ్వసించి వారి సిద్ధాంతాన్ని, ఆశయాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దానిలో భాగంగానే 'అంబేద్కరిజమ్' అనే రచన అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ రాశారు. అలాగే అనేక సామాజిక గేయాల కూడా రచించారు. వాటిలో ప్రధానంగా ''జయ జయ జయ అంబేద్కర్' అనే పాట ఎంతో ప్రత్యేకమైనది. అంతే కాదు ఆ గేయంలో అంబేద్కర్ యొక్క మూలసూత్రాన్ని ఆవిష్కరింస్తుంది. అలాగే ఈ అసమానతలతో కూడిన ఈ సమాజానికి అంబేద్కర్ ఎంత అవసరమో అని వివరించే రచన ఇది. సాధారణంగా ఈ సమాజంలో సుప్రభాతం అనగానే ప్రసిద్ధి చెందినది 'శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం'. అలాగే దానికి సమానంగా సామాజిక చైతన్య స్ఫూర్తిని కలిగించే అంబేద్కర్ సుప్రభాతాన్ని రాసి సామాజిక చైతన్యాన్ని మేలుకొలుపు అందించారు. అలాగే హరిజనులు ఆర్యులే అనే సిద్ధాంతాన్ని ప్రకటించారు. ఏ అంశాన్ని అయినా ఎటువంటి లొసుగులు లేకుండా తన దృక్పథాన్ని వ్యక్తంచేయడంలో భీమన్నకు భీమన్నే సాటి అన్నంతగా వారి సాహిత్య దృక్పథం ప్రకటించారు. అలాగే వారు అందుకున్న బిరుదులుగాని, సత్కారాలుగాని, సన్మానాలుగాని అన్నీ కూడా తమ సాహిత్య రచనకు వచ్చిన పురస్కారాలుగానే భావించాలి.

ఇలా వారి రచనలో ఇంకా ''కుక్క మొరుగుతూ ఉంది, ఒంటరి గొంతు, ఎంత చీకటి ఎన్ని దీపాలు, భీమన్న పాటలతోట, పాటలలో అంబేద్కర్, పంచమ స్వరం కులనిర్మూలన (అనువాదం), శ్రీ పిల్లి శతకం, అనాది కొసనుంచి అనంతలోకి'' ఇలా ప్రతి రచన సమసమాజ సిద్ధించాలనే ఉద్దేశంలో రాసిన రచనలే. ఇలా సమాజం అనేక బేధాలలో ఉండడం అభివృద్ధికి తిరోగమనమని, ఆ హెచ్చుతగ్గులు పోవాలని, సమాజంలో దగాపడిన పేదలు అభివృద్ధి పదంలో పయనించాలని, దేశానికి పట్టుకొమ్మలయిన పల్లెలు విజ్ఞాన వంతంగా సకల సౌకర్యాలతో విలసిల్లాలని అప్పుడే ఈ దేశం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని, ఆ నవసమాజం సిద్ధించాలంటే భీమన్న లేవనెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని అప్పుడే భవిష్యత్తు దర్శనంలోని భీమన్న నవసమాజం సాధ్యమౌతుందని ఆశించారు.

ఇలా బోయి భీమన్న సాహిత్యం వ్యక్తిగత ప్రయోజనానికి తావులేకుండా సామాజిక దృష్టిలో చిత్రించిన విశిష్టమైన వ్యక్తిగా నిలిచారు. వారు ఆశించిన నవసమాజం ఎప్పటికైనా సిద్ధిస్తుందని, అప్పటి వరకు వారి సాహిత్య సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూనే ఉంటుంది అనడంలో సందేహం లేదు.

ఇలా పద్మభూషన్ బోయి భీమన్న సాహిత్యం రోజు రోజుకు నేటితరాల వారికి ఎంతో స్ఫూర్తిగా నిలుస్తుంది. ప్రతి రచనలో వారు కనబరిచిన చైతన్యం, పాత్రచిత్రణ, సంభాషణల శిల్పం, సామాజిక అవగాహన, సమస్యల చిత్రణ ఇలా అనేకాంశాలు నవసమాజ నిర్మాణానికి పునాదులుగా నిలిచి భవిష్యత్తు నవసమాజానికి శ్రీకారం చుడుతుందని స్పష్టంగా తెలుస్తుంది.

బోయ భీమన్న పాటల్లో సామాజిక సందేశం

– డా॥. కె.వి.యన్.డి. వర్రలసాద్, సహాయ ఆచార్యులు & తెలుగు శాఖాధిపతి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

మానవత్వం యొక్క సమగ్రత్వానికి తాను ప్రయత్నిస్తూ, సమాజం కూడా అదే స్థాయిలో ఎదగాలని కవి ఆశపడుతూ ఉంటాడు. చిన్ననాడే భీమన్న అమానుష భావాలతోకూడిన సామాజికవర్గ దోపిడీని అతి దగ్గర నుంచి చూశారు. కొన్నిసార్లు ఆ దోపిడీకి గురై, అణచివేతలను కూడా ఎదుర్కొన్నారు. సమాజం యొక్క ఔన్నత్యం మానవవికాసంతోనే ఉంటుందని, తనను తాను వికసింప చేసుకున్న మానవతామూర్తి భీమన్న. అందుకే ఆయన కవిత్వంలో మానవీయకోణాలు దర్శనమిస్తూ ఉంటాయి. వస్తువు ఏద్కెనా మానవీయ కోణాన్ని చూపించడం భీమన్న రచనల్లో కానవచ్చే ప్రత్యేకత. నిరంతర ఆలోచనాపరుడైన ఈ మహారచయిత కలం నుంచి పుంఖానుపుంఖాలుగా ప్రక్రియా వైవిధ్యంతో రచనలు పరవళ్లు త్రొక్కేవి. దీనికి విస్మయమందిన సి.నా.రె.

"ఎప్పుడు చూస్తానో మరి
ఎప్పుడు రాస్తానో, అరె
తెప్పలుగా తేల్చినావు తీయన కవితల్
కుప్పలుగా రాల్చినావు కొన్నన పలుకుల్"

అంటూ ప్రశంసల అక్షరాభిషేకం చేశారు.

మనిషిగా ఎదుగుతూ, అందరినీ మనుషులుగా ఎదగమని ఉద్బోధిస్తూ, సమాజంలో కానవచ్చే అమానుష సంఘటనలకు చలించిపోతూ, మానవత్వం కోసం అక్షరాలతో అన్వేషణ సాగించిన మహాద్రష్ట బోయి భీమన్న. సమాజంలోని అసమానతలను గుర్తించిన భీమన్న మానవ సంబంధాల మెరుగుకై ఆరాటపడ్డారు. మానవత్వాన్ని ఉద్దీపనం చేయడంకోసం ముందుకు అడుగులు వేశారు.

భీమన్న కవిగా కలంపట్టేనాటికి, సమాజంలో తనకు సరిపడని విషయాలను అంటే సమస్యలను గుర్తించి, వాటిపై అక్షరయుద్ధాన్ని ప్రకటించారు. ఇది కవులకు, రచయితలకు సహజమైన విషయమని, అలా సమాజంలో అక్షరయుద్ధం చేయడం వల్లనే కవి, తనలో దాగిన ఉద్వేగాలను ప్రకటించే అవకాశం ఉందనే విషయాన్ని మహారచయిత చలం - "తనకు, సంఘానికి సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్భహిః యుద్ధా రావమే కవిత్వం" అని తెలిపారు. భీమన్న రచనలు చలం అభిప్రాయాలలో ఒదిగిపోతాయి. మానవత్వం మూర్తీభవించిన కవిగా, భీమన్న సమాజంలో తనను ప్రభావితం చేసిన అనేక విషయాలపై తాను గేయాల్లో తన అభిప్రాయాలను ఏ విధంగా వ్యక్తం చేశారో పరిశీలిద్దాం.

దోపిడీ విధానం :

సమాజంలోని అసమానతలకు ఒక వర్గం మరో వర్గాన్ని దోచుకోవడమే కారణం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నా సమసమాజ స్థాపనే తన లక్ష్యమని దేశ తొలి ప్రధాని నెహ్రూ ప్రకటించిన లక్ష్యం నేటికీ కనుచూపు మేరలో లేదు. ఆకర్షణీయంగా కనిపించే పెట్టుబడిదారీ వ్యవస్థ రోజురోజుకూ బలాన్ని పుంజుకుంది. ఫలితంగా ధనికుడు మరింత ధనవంతుడౌతున్నాడు. పేదవాడు, పెట్టుబడిదారుడి సంపాదన పెంచే యంత్రంగా మిగిలి పోతున్నాడు. అతని శ్రమకు విలువ లేదు. అతని జీవన విధానంలో మార్పులేదు. అందుకే బోయిభీమన్న

"గంగిగోవుల వోలె కనిపించునవి యెల్ల
గోవులే అనుకోకుమా!
గోగోపకుల నడుమ గోముఖవ్యాఘ్రాలు
కొల్లలుగ ఉన్నవి సుమా!
శ్రమదొంగలున్నారు, జాగ్రత్త ప్రియతమా!
సంసిద్ధముగ కదులుమా!

అంటూ సామాన్యుణ్ణి హెచ్చరించాడు. సమాజంలో ప్రత్యేకంగా శిష్టులు, దుష్టులనే వారెవరూ లేరని పేర్కొంటూ, అణచివేత నుంచే తిరుగుబాటు పుట్టు కొస్తుందని, అయితే సామదానముల తరువాతే శస్త్ర ప్రయోగం చేయాలని

ఇంటగలుగు పాడిగోవు ఎంత సాధువైనను
కోపము కలిగింతుమేని కొమ్ములతో కుమ్మును!
మంచిని మచ్చికతో సాధించవచ్చు నోయీ!
సామదానముల పిదపే శస్త్రము గొనుమోయీ!

అంటూ అణచివేత ఎంతోకాలం కొనసాగదని, కానీ అత్యవసర పరిస్థితులోనే ఆయుధ ప్రయోగం చేయలాని హితోపదేశం చేశారు. అయితే జీవితాన్ని ఆనందంగా గడపాలంటే శస్త్ర విద్యలు నేర్వాలని, కలం పట్టిన చేత్తో కత్తిపట్టగల ధైర్యం కావాలంటూ ఉద్బోధించారు. సోషలిజం లాంటి మాటలు వల్లించడానికే తప్ప వాటి వల్ల ఉపయోగం లేదంటూ, వారందరూ మిలియనీర్లుగా మారుతున్న దృశ్యాన్ని కళ్ళకు కట్టిస్తూ

"న్యాయ ధర్మ పథాలు నగ్జలిజమైతే
నాది కూడా నగ్జలిజమే!"

అంటూ తిరుగుబాటుపై తన దృక్పథాన్ని వెల్లడించారు. అదే సమయంలో యుద్ధంతోపాటు శాంతి కూడా కలిసే ఉంటుందని

"కలుపు తీయన చేను కలగూర గంపయై
ఆశించిన ఫలితమ్ము నందీయదు
ప్రగతి విధ్వంసకుల ప్రతిఘటించగలేని
జాతి అభ్యుదయమ్ము సాధించదు"

అని యుద్ధాన్ని సమర్థించారు.

అసమ సమాజం :

సమాజంలోని అసమానతలపై గళమెత్తిన భీమన్న సాహిత్యంలో, సమాజంలోని అన్ని కోణాలను స్పృశించిన సంఘటనలు కోకొల్లలు. అయినా కొందరు సంకుచిత దృష్టితో ఆయనను దళితకవిగా ప్రచారం చేయడం దురదృష్టకరం. ఆయన సాహిత్యంలో నిమ్నవర్గాల సముద్ధరణ కోసం సృష్టించిన సాహిత్యం ఒక భాగం మాత్రమే. కానీ ఆయన సాహిత్యాన్నంతా దళిత సాహిత్యంగాను, ఆయన్ను దళితకవిగాను పేర్కొనడ మంటే ఆయన స్థాయిని తగ్గించినట్టే. పేద-ధనిక తారతమ్యాలను

"ఏడంతస్తుల మేడల ప్రక్క
ఏడుస్తున్న పూరి గుడిసెలు
ఇదియేనా నాగరిక జీవనం
ఇదియేనా మానవ సంస్కారం" ..... అంటూ ప్రశ్నిస్తారు.

రాజకీయాలు :

రాజకీయ మదం ప్రజలను ఉన్మత్తులుగా మార్చేస్తుం దని భీమన్న వాపోయారు. అయితే తాత్కాలికంగా ఆకర్షణీయంగా కనిపించినా, అది అల్పమైన భోగమని అభిప్రాయపడ్డారు.

"ధనం, పదవి, అధికారం
దానవ లక్ష్యములు
మూగుదురీకక్షుద్రలక్ష్య
ముల చుట్టూ సామాన్యులు"..... అని చెబుతూ
"అల్ప భోగముల కోసం
ఆరాటం పడకుమా!"..... అని ఉపదేశిస్తారు. అలాగే
"అధికారం చేతికి వచ్చిన తరువాత
ఆత్మీయుల మరచి పోకుమా!"..... అని చెబుతూ

పదవులు శాశ్వతమని మురిసి పోవద్దని, ఓటు వేసిన సామాన్యుణ్ణి నిర్లక్ష్యం చేస్తే ఆ పదవికి అతనే పోటీ దారుడుగా మారే అవకాశం ఉందని గుర్తుచేస్తారు.

పైరవీల ప్రాధాన్యం :

మన దేశంలో పైరవీల ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. భీమన్నగారు పేర్కొన్న కాలం కంటే ఇప్పుడే వాటికి మరింత డిమాండ్ ఉంది. ప్రతిభ ఉన్నా పైరవీ లేకపోతే ఉపయోగం సున్నా అనే అభిప్రాయం సమాజంలో ఉంది. అందుకే

"ఎంత ప్రజ్ఞ ఉన్నా
ఎంత ప్రతిభ ఉన్నా
పైరవీలు లేకుండా
పదవులు రావన్నా"

అన్న భీమన్నగారి మాటలు సమకాలీన సమాజంపై సంధించిన అక్షర తూణీరాలు. పైరవీలతో ప్రతిభను మరుగుపరచవద్దని చెబుతూ, పైరవీలు తాత్కాలికంగా మాత్రమే ప్రభావాన్ని చూపిస్తాయని, ప్రతిభ ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందని ఆశావహ దృక్పథాన్ని కలిగిస్తారు.

మతం :

సమాజాభివృద్ధికి నిరోధకంగా మారి, మనుషుల మధ్య అగాథాలు సృష్టిస్తున్న మతాన్ని భీమన్న తీవ్రంగా నిరసించారు.

వద్దయ్యా, రాజకీయ
వాగ్దానం, మిత్రమా!
నిత్యాత్మవు నీవైతే
నిరతము మాతోనుండుము!

అని కోరుకుంటారు. మతం కంటే మానవత్వం మిన్న అని చాటారు.

యువతకు ప్రబోధం :

యువతలో ఆత్మవిశ్వాసం ఉంటే, ఏదైనా సాధించ గలరని, ఎంత క్లిష్టపరిస్థితుల్లో ఉన్నా, దాని నుంచే పైకి రావాలని ఉద్బోధిస్తారు భీమన్న.

వెదురు పొదల జనించినా
వేణువుగా మెరయాలని
ములుకంపే లభించినా
గులాబివై విరియాలని

చెబుతూ మనం గొప్పగా చూసే వాటి చుట్టూ కూడా కొన్ని లోపాలు ఉంటాయని, వాటిని అధిగమించి సుఖాలను అందుకోవాలని ఆకాంక్షిస్తారు.

మానవత్వం :

సాటి మనిషిపట్ల ప్రేమాభిమానాలు తగ్గిపోయి, దైనందిన జీవితంలో పెరిగిపోయిన కృత్రిమత్వాన్ని భీమన్న ఖండించారు. మానవత్వం మనిషికి అత్యంత ప్రధాన మైనదని, మానవత్వం లేనివాడు మనిషే కాదంటూ

ఎన్ని పదవులలంకరించిన
ఎన్ని భోగములనుభవించిన
మానవత లేకున్నవాడు
మనిషి కాదన్నా! .... అంటూ

తన మానవతా వాదాన్ని చాటుకున్నారు భీమన్న.

ఐకమత్యం :

ఇతరులతో నాకు సంబంధంలేదు. ఈ ప్రపంచంలో నేను, నా కుటుంబం అనే స్వార్థం విపరీతంగా పెరిగి పోయింది. అందుకే ఒక మనిషి ప్రాణాపాయస్థితిలో ఉన్నా బిజీ జీవితం పేరుతో మానవత్వాన్నే మరచిపోతున్నాం. నరరూపరాక్షసులుగా మారిపోతున్నాం. దీనిపై ఆవేదన చెందిన భీమన్న ఎంత కష్టపడినా, వ్యక్తిగా సాధించే వృద్ధికంటే సమిష్టిగా కష్టపడితే ఎక్కువ వృద్ధి సాధించ వచ్చని, అసాధ్యాలుగా కనిపించే వాటిని కూడా సుసాధ్యాలుగా చేసుకోవచ్చని చెబుతూ

కలిస్తే - గెలుస్తాం
గెలిస్తే - నిలుస్తాం
గడ్డిపోచలమె అయినా
మదగజముల బంధిస్తా,
చలిచీమలమైన గాని
సర్పాలను పట్టేస్తాం!

ఐకమత్యంలో ఉండే బలాన్ని గొప్పదనాన్ని విశదీకరించారు.

తత్త్వం :

మనం చేసిన పరిశ్రమకు తగిన ప్రతిఫలాన్ని పొందుతామని వివరిస్తూ భీమన్న

నీ మనసే నీదైవం
నీ ప్రజ్ఞే నీ ప్రగతి
నీవే నీ జీవిత నిర్మాతవు

నీవే నీ సుఖశాంతుల కర్తవు!
ఫలవృక్షం పెంచేనా
ఫలము లాగరించేవు
ముళ్ళ మొక్క నాటేవా
ముళ్ళు గిచ్చి వగచేవు!

అంటూ తన తత్వాన్ని ప్రకటించారు.

సమాజాన్ని నిరంతరం గమనించిన భీమన్న అసమ సమాజంలోని రుగ్మతలను బట్టబయలు చేశారు. వాటి నిర్మూలనకై నిరంతరాయంగా అక్షర తూణీరాల్ని సంధించారు. సమాజానికి తన కవిత్వం ద్వారా దిశానిర్దేశం చేశారు. సుఖసంతోషాలతో కూడిన సమసమాజస్థాపన కోసం కలలు గన్నారు. ఆ కలలను సాకారం చేయమని తన సాహిత్యం ద్వారా ప్రజలకు ఉద్బోధించారు. కవిగా సమాజ ఔన్నత్యాన్ని స్వప్నించిన మహాస్వాప్నికుడు భీమన్న. సమాజశ్రేయస్సును కాంక్షిస్తూ మానవతను అభిలషిస్తూ ఆయన సృష్టించిన సాహిత్యం అజరామరం. అందుకే సమసమాజ స్థాపనలో అవి నిత్యమూ ప్రజలను ఉత్తేజ పరుస్తూనే ఉంటాయి. ఒక కవి రచనలకు అంతకంటే పరమార్థం ఏముంటుంది? అందుకే కవిగా బోయి భీమన్న ధన్యుడు.

❁❁❁

బోయి భీమన్న 'చండాలిక' - దళితుల చిత్రణ

- డా॥. జె. వెంకటరమణ, తెలుగు శాఖాధ్యక్షులు, మదురై కామరాజు విశ్వవిద్యాలయం, మదురై.

'చండాలిక' బౌద్ధ మతంలోని ఒక చిన్న కథను ఆధారంగా తీసుకొని చేసిన రచన. ఇది రవీంద్రనాథ్ ఠాగూర్ 1933లో రాసిన 'చండాలిక' అనే ఠాగూరుకు ఈ రచన ద్వారా చాలా మంచి పేరు వచ్చింది. దృశ్య రూపకంగా అనేక ప్రదర్శనలు జరిగాయి. తెలుగులో బోయి భీమన్న 'చండాలిక'ను ఐదు రంగాలతో ఉండే అనువాదం నాటిక. కానీ అనువాదం మూలంలోని ప్రధాన విషయాన్ని చెబుతూనే తెలుగు సంస్కృతిని, భీమన్న ఆనాటి సమకాలీన సమాజానికి ప్రతిబింబంగా కొన్ని అమూలకములైన మార్పులు చేసారు. దీనితో అది అనుసృజనలా కనిపిస్తుంది. ఈ 'చండాలిక'లో దళితులను చిత్రించిన విధానాన్ని తెలియజేయడమే ఈ పరిశోధనా పత్ర లక్ష్యం.

కథ

ఒక దళితవాడలో కథానాయక చండాలిక నివసిస్తుండేది. ఒక వేసవి కాలం మధ్యాహ్నపు వేళలో ఎండలో వాడిన మొక్కలకు నీళ్ళుపోస్తూ ఉంటుంది. ఆ సమయంలో అటుగా ఒక బౌద్ధ సన్యాసి దాహంతో వస్తాడు. తాగడానికి నీళ్ళు ఇవ్వమని ఆమెను అడుగుతాడు. మేము అట్టడుగు కులం వాళ్ళము. ఈ ప్రదేశం, ఈ బావిలో నీళ్ళు కూడా మైల పడ్డవి. మీరు తాగకూడదని చెబుతుంది. మనుషులంతా సమానమని, నీళ్ళకు మైల ఉండదని చెబుతాడు. ఆమెలో మార్పు తెచ్చిన అతడిని ఇష్టపడుతుంది. ఆ తర్వాత అతను మళ్లీ ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ ఉంటుంది. అతడితో తన వివాహం చేయమని తల్లిని అడుగుతుంది. మొదట వద్దని వారించినా, తర్వాత కూతురు మీద ప్రేమతోనూ అంగీకరిస్తుంది. ఆనందుడిని తన మంత్రశక్తికి లొంగకపోతే అది తన ప్రాణమే తీస్తుందని హెచ్చరిస్తుంది. ఆనందుని స్వాధీనం చేసుకోలేక ఆమె మరణిస్తుంది. చండాలిక ఆనందునిలో లీనమైపోయి అతని తేజస్సు మళ్ళీ వస్తుంది. గౌతమ బుద్ధుని, బౌద్ధ మతం యొక్క గొప్పతనం చెబుతూ నాటకం ముగుస్తుంది

పాత్రలు

ఇందులో ప్రధానంగా మూడు పాత్రలు మధ్యలో కనిపించే రెండు అప్రధాన పాత్రలు. వాటిలో తల్లి ఇద్దరు బట్టలు పాత్రలు మనకు కనిపిస్తాయి మహారాజు గారు అంకుల్ ని ఇంకా కొన్ని పాత్రల మనకు కనిపిస్తాయి ప్రధానంగా చండాలిక పాత్ర చుట్టూనే తిరుగుతుంది కాబట్టి ఆమె భావోద్వేగాలకు రూపం కనిపిస్తుంది

చండాలిక - నాటకంలో చండాలిక కథానాయిక. ఆమె చుట్టూనే కథంతా తిరుగుతుంది. ఈ పాత్ర పద్దెనిమిదేళ్ళ యౌవనంలో ఉన్న దళిత అమ్మాయి. తక్కువ కులంలో పుట్టానని, అది పెద్ద నేరమని ఆత్మన్యూనతతో కనిపిస్తుంది. కానీ ఆనందుని మాటల వలన ఆమె మారిపోతుంది. ఆమెలోని మానసిక భావోద్వేగాలు ప్రధానంగా కనిఎస్తాయి. మూలంలోని చండాలికలో పెద్దగా మార్పులేమీ కనిపించవు. రచనా కాలంనాటి సమాజంలోని విషయాలను ఈ నాటిక ప్రతిబింబిస్తుంది.

ఆనందుడు - బౌద్ధ సన్యాని. మంచి రూపము కల వాడు. ఇతర పాత్రల ద్వారా ఆనంద గుణగణాలు తెలుస్తాయి. బుద్ధుని యొక్క బోధనలతో స్వచ్ఛమైన వాడు. ప్రపంచంలోని అన్ని జీవులను ప్రేమిస్తాడు, జ్ఞానోదయాన్ని పంచాడు.

మాలి - చండాలిక తల్లి. సమాజంలో జరుగుతున్న సాంఘిక దురాచారాలకు ప్రతీకగా, సమకాలీన కాలంలో నాటకంలోని కనిపించే పాత్ర. చండాలిక తల్లి పాత్ర ఇది తన మంత్ర శక్తులతో ఇతరులకు సహాయ పడేది. తన

మంత్రశక్తితో ఆనందుడిని రప్పించి, తన కూతురికి ఇచ్చి, వివాహం చేయాలని అనుకుంటుంది. ఇది సాధ్యం కాకపోతే తన ప్రాణాలు పోతాయని తెలిసి ప్రయత్నిస్తుంది. దురదృష్టవశాత్తు తన కుమార్తె ప్రేమకు కోసం భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది, ఆమె కోసం త్యాగం చేసింది. ఈ భూమిపై జీవించిన ప్రతి ఇతర తల్లిలాగే ఆమె కూడా కూతురికి రక్షణగా ఉంది.

దళితుల చిత్రణ

నాటకంలో కొన్ని చోట్ల దళిత స్వభావ, జీవిత చిత్రణ చేశారు భీమన్న. ఆ సందర్భంలో వీరి మాటలు సమాజం దృష్టిలో దళితుల పట్లగల అభిప్రాయాలను తెలియజేస్తే, కొన్ని లోతుగా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి. ఏదో ఒక పాత్ర మాటలుగా కనిపించినా అవి రచయిత చెప్పాలనుకున్న భావాలను ప్రకటించేలా ఉన్నాయి. అలాంటి వాటిలో కొన్ని కింది విధంగా కనిపిస్తాయి.

మండుటెండలో దాహంతో నీళ్ళు అడిగిన ఆనందునితో చండాలిక ఇలా అంటుంది.

"ఇది మైల బావి, నే మాల మాదిగ దాన,
ఇవి మైల నీళ్ళు, నిను మట్టు పెట్టును ప్రభూ"
(చిత్రకళా ప్రదర్శన 215)

ఆ మాటలు విని నీళ్ళకు మైల ఉండదు. మనుషులలో తక్కువ, ఎక్కువ అనేది ఉండదు. మనుషులంతా సమానమే. నీవు నీళ్ళు ఇవ్వకపోతే నేను చనిపోతాను. దాని కారణం నీవే అవుతావు అది పాపానికి కారణమౌతుంది. కాబట్టి నీళ్ళు అందించి నా ప్రాణాలను కాపాడమంటూ ఆనందుడు ఇలా అంటాడు.

"ఆర్తరక్షణ పాపమా? అంబువులకు / మైలయా?
సాధు జనులు చండాలు రగున?
నేను మనిషిని, మనిషివి నీవుబీ మనము / బోధి
సత్వుని విశ్వైక బుద్ధిజులము
ఇర్వురము ఒక్కటే భేదమేమి లేదుబీ / భేద
మెంచుట పాపం బెంచుకొనుట.
నీళ్ళు ఏ బావి వైనను నీళ్ళు నీళ్ళే / సేద దేర్చును
ఎవరు పోసినను గాని
నేరముల నేరమౌ ఆత్మనింద మాని" (చిత్రకళా ప్రదర్శన 215)

అంటూ మీ కులములో జన్మించి లోకంలో అందరి చేత పూజింపబడుతున్న అరుంధతి నీకు ఆనందాన్నిచ్చునని చెప్పి, ఆమె ఇచ్చిన నీళ్ళు తాగి, మనసులోని అనుమానాలను దూరం చేసి వెళ్ళిపోతాడు.

దళితులలోగల గొప్పవారిని గురించి వివరిస్తాడు. ఆమెలో అంతకముందున్న ఆత్మన్యూనతను తొలగిస్తాడు. ఈ కారణంగానే ఆమె అతడిని ప్రేమిస్తుంది.

చండాలిక ఆమె తల్లితో తన ప్రేమను గురించి చెబుతుంది. చండాలికలో మార్పుకు కారణమైనది ఎవరనే విషయాన్ని చండాలికను అడిగేటపుడు భీమన్న వాడిన పదాలన్నీ దళిత జీవితాల్లో కనిపించేవి.

"కిన్నెర వంటి నీ హృదయాన్ని పగిల్చి / డప్పు కట్టి తిరుగుబాటు
దండోరా పలికిస్తున్న భౌతికుడు?/ మన యింటా, వొంటాలేని అవినయాన్ని
నీలో రగిల్చిన విప్లవకారుడు / ఎవడే ఆ దొర?
నీ మనస్సును ఆ కట్టిన ఒర?
(చిత్రకళా ప్రదర్శన 224)

దళిత కళాకారులు ఉపయోగించే వాయిద్యాలైన కిన్నెర, డప్పు లాంటి వాటిని ప్రయోగించాడు. ఈ పదాలతోపాటు తిరుగుబాటు, దండోరా, అవినయం, విప్లవకారుడు, దొర, ఒర మొదలగు పదాలు దళిత జీవితాలతో ముడిపడివున్న అంశాలు. వీటన్నిటిని మాలి పాత్ర ద్వారా చెప్పించడంలో ఔచిత్యంగా ఉంది. ఎందుకంటే వారికి పరిచయం కలిగిన వాటిని ఎన్నుకోవడం సహజత్వానికి కారణమైంది.

ఆనందుడిని ఇష్టపడడానికి కారణం చెబుతూ రచయిత కొన్ని మాటలను చండాలిక ద్వారా ఇలా అనిపించాడు.

"కర్మం అంటూ, కాలం అంటూ, / మనుషులమే కా
మనుకొంటూ,
ఊరి శివార్లలో / ఊడిగం చేసుకొంటూ / పురుగుల్లా
బ్రతికే చండాలుడు కూడా
పూజా పుష్పాలే భగవానుడి కన్నా డతడు!

(చిత్రకళా ప్రదర్శన 227)

ఇక్కడ దళితులుగా జన్మించడం పూర్వజన్మ కర్మమని ఛాందగ్య ఉపనిషత్తులో పుణ్యకర్మను చేసినవాడు బ్రాహ్మణుడిగానూ పాపకర్మను చేసిన వాడు కుక్క, పంది, చండాలులుగా పుడతారంటూ ప్రచారం చేసిన విషయాన్ని భీమన్న ప్రస్తావిస్తారు. మనుషులలో తిరగదగిన వారు కాదంటూ వెలివేయడం, వెట్టిచాకిరీ చేయడాన్ని చెబుతారు. అలాంటివారిని పురుగుల కంటే నీచంగా చూసే వారున్నారంటారు. కానీ దళితులు కూడా దేవునికి సమర్పించే పూజాపుష్పాలే అని ఆనందుడు అన్నాడు. కాబట్టి నాకు అతనితో వివాహం చేయించమని వాళ్ళమ్మతో చెబుతుంది.

రాజుగారు ఆహారంగా పక్షిని పట్టుకు రమ్మని, లేదంటే ప్రాణాలు పోతాయని భటులను పంపిస్తాడు. వారికి పక్షి జాడ చెప్పగలిగేది మాలి ఒక్కతే. ఆ సందర్భంలో భీమన్న చండాలికతో పలికించిన పలుకులివి.

"మాడే పొట్టకు / మాలకూడు మంచిదే మీకు! /
అపద్ధర్మం మీది!
అంతరాత్మలు లేవు మీకు! / అందుకే తాగండి
నీళ్ళు,
అమ్మ కాళ్ళపై బడి ఆపద గడుపుకోండి!"

(చిత్రకళా ప్రదర్శన 237)

ఆకలితో ఉండేవారికి ఆహారం కావాలిగానీ దానికి కులం కావాలా? అయినా దళితుల ఆహారం మంచిదే అంటాడు. రాజుగారి దగ్గర ప్రాణాలు పోకూడదంటే నీళ్ళు తాగితే మాలి ఎక్కడ ఉందో చెబుతానంటుంది చండాలిక.

ఈ మాటలు విని భటులు నీళ్ళు తాగుదామనుకుని నిర్ణయించుకున్న కింది విధంగా అనుకుంటారు. తాగక పోతే రాజుగారి చేతులలో ప్రాణాలు పోతాయి. దానికంటే ఇదే నయం. అనుకుని ఈ మైలను ప్రాయశ్చిత్తం చేసుకనే ఉపాయం లోకంలో ఉందనే విషయాన్ని భీమన్న వ్యంగ్యంగా పేర్కొంటారు.

"తాగుదాందా, బాబూ! / తర్వాత బంగారప్పుల్లతో
నాలుక గీసేకు కుందాం! / ప్రాయశ్చిత్తం చేసేసు
కుందాం!"

(చిత్రకళా ప్రదర్శన 236)

"తర్వాత బంగారం కత్తితో / పొట్టలో పొడిచేసు
కుందురుగాని,
బంగారం లాంటి కట్టెల మీద / పవిత్రంగా
కాలిపోదురుగాని"

(చిత్రకళా ప్రదర్శన 236)

చండాలిక పై మాటలు భటులను ఉద్దేశించి అనినప్పటికీ అవి సమాజంలో కనిపించే వాటిగా చెప్పుకోవచ్చు.

మాలి నాటికలో మంత్రతంత్రాలు తెలిసిన మంత్రగత్తె. రాజభటులు కూడా పక్షిని వెతుకుతూ, దాని జాడ కోసం మాలి సహాయం కోరుతారు. ఆ సందర్భంలో భటుల సంభాషణలో దళితుల మంత్రాలకు గురించి ఇలా కనిపిస్తుంది.

"మంత్రాలకు మాల మాదిగతన మేంట్రా,
నాయాలా!
బేపనయ్యకీ అదే మంత్రం / మాదిగయ్యకీ అదే మంత్రం
బెమ్మ దేవుడి నోటి తుంపర్లే / వీళ్ళ రెండు నోళ్ళలోవీ!
మంత్రాలకి పెట్టింది పేరు / మాలే నట్రా!

(చిత్రకళా ప్రదర్శన 234-35)

అంటూ చెప్పిన మాటలలో వీరి మంత్రాలకు గల ప్రత్యేకతను రెండవ భటుడు మొదటి భటునితో అంటాడు.

ప్రకృతి అంతా కూడా దళితమయమేనంటూ, ఎవరు ఏమనుకున్నా ఏమీ పరవాలేదంటూ కింది విధంగా అంటుంది.

"ఎక్కడ పుడితేనేం? / ఎందరు ఏమనుకొంటే యేం? / మేఘమాల మాలది
మెరుపుతీగ మాదిగది / వర్షఋతువే మాలమాదిగది" (239)

చండాలిక మాలి సంభాషణలో దళితులు ఎలాంటి స్వభావం కలిగిన వారో కింది మాటల ద్వారా తెలుస్తుంది.

"అమాయకులం / అన్యాయం ఎరగని వాళ్ళం / అందర్నీ సేవించే వాళ్ళం
స్వార్థం లేని వాళ్ళం / సంతృప్తితో బ్రతికే వాళ్ళం / ప్రపంచం ఎలా పోయినా
మన బ్రతుకేదో మనం బ్రతికే అనాసక్తులం / కేవలం సన్యాసులం-
అమృత లోకమేదైనా వుంటే / మనం గాక మరెవ్వరే అర్హులు దానికి!
నీ వన్నది నిజమే అనిపిస్తున్నాది నాకు!
(చిత్రకళా ప్రదర్శన 242)

పై మాటలలోని సత్యాన్ని గ్రహించిన మాలి దళితుల స్వభావం తెలుసుకొని, దళిత కులంలో పుట్టిన తన కూతురి కోసం ఆనందునితో వివాహం చేయించడానికి అంగీకరిస్తుంది.

చండాలిక కోరిక మేరకు ఆనందుడిని తన మంత్ర శక్తితో వశపరచుకోడానికి చూస్తుంది. ఎంత ప్రయత్నించినా అతడిని లొంగదీసుకోవడం సాధ్యం కాదు. ఆ సందర్భంలో మాలి ఈ కింది విధంగా చండాలికతో చెబుతుంది.

"మూఢనమ్మకాలు-సత్యం / మంత్రం మందబుద్ధికే గాని
మహితాత్ముడికి కాదే తల్లీ / జడ ప్రకృతి పైనే గాని,
జ్ఞానిపై పనిచేయదు మంత్రం! / వికల మనస్కతనే గాని
వివేకాన్ని తాకదు మంత్రం!
(చిత్రకళా ప్రదర్శన 243)

మంత్రతంత్రాలనేవి మూఢులను, తెలివిలేనివారిని, మతిచలించిన, నిశ్శేతులను వశంచేసుకోవచ్చును. అంతేగానీ మహాత్ములను, జ్ఞానులను, వివేకవంతులను మంత్రశక్తులేవీ ఏమీ చేయలేవని చెబుతుంది. అసలైన జ్ఞానులు దేనికీ లొంగరని చెబుతారు.

ముగింపు

ఈ విధంగా బోయి భీమన్న 'చండాలిక'లో దళిత చిత్రణ కనపిస్తుంది. ఇలాంటి అంశాలు మూలంలో కనపించవు. ఈ కోణం నుండి చూసినపుడు ఇది నాటకానికి దళిత స్పృహతో ఉన్నది.

ఉపయుక్త గ్రంథాలు

1. చిత్రకళా ప్రదర్శన - బోయి భీమన్న
2. చండాలిక - రవీంద్రనాథ్ ఠాగూర్

నవీన సాహిత్య దార్శనికుడు డా॥. బోయి భీమన్న

– డా॥. కోయి కోటేశ్వరరావు, పాలక మండలి సభ్యులు, మహాత్మగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ.
తెలుగు సహాయ ఆచార్యులు, ప్రభుత్వ సిటీ కళాశాల హైదరాబాద్.

1944 సంవత్సరం కాకినాడలో జరిగిన బహిరంగ సభలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రసంగించబోతుండగా ఖద్దరు పంచె, లాల్చి, శాలువా ధరించిన ఒక యువకుడు కవిత చదువుతానంటూ వేదిక మీదకు వచ్చాడు. అతని వేషధారణ చూసిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్క నిమిషంలో ముగించాలని అసహనంగా ఆదేశించాడు. యువకుడు అంబేద్కర్‌పై తానురాసిన ఆంగ్లకవితను అత్యంత లయబద్ధంగా, శ్రవణ శుభగంగాచదివాడు. కవిత విని ఎంతో ముగ్ధడైన అంబేద్కర్ యువకుడితో కరచాలనం చేసి అభినందించాడు. అంబేద్కర్ చొరవతో కొన్నాళ్ళ తరువాత ఆ కవిత కలకత్తా నుండి వెలువడే "పీపుల్స్ హెరాల్డ్" పత్రికా సంపాద కీయంగా ప్రచురించ బడింది. అప్పటికే జాతీయ నాయకుడిగా ప్రఖ్యాతిగాంచిన డా॥బి.ఆర్. అంబేడ్కర్ ప్రశంసలందుకున్న ఆ కవి పేరు డా॥ బోయి భీమన్న అంబేద్కర్ యొక్క గొప్పతనాన్ని గబ్బిలానికి పరిచయం చేస్తూ జాషువా "అతని మెప్పుల్ నీ జయారంభముల్" అని కీలకంగా వ్యాఖ్యానించాడు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ మెచ్చుకుంటే అది నీ విజయానికి తొలిమెట్టు అని జాషువా క్రాంత దర్శిత్వంతో గబ్బిలానికి తెలియజేశాడు. అదే విధంగా విశ్వవిజ్ఞానమూర్తి అంబేద్కర్ మెచ్చుకోలుతో ప్రారంభమైన భీమన్న అక్షర జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో "స్వతంత్ర విప్లవ జ్వాల"గా అనునిత్యం ప్రభాసించిన మహాకవి బోయి భీమన్న. అర్షమత ప్రభావ పథంలో గుండా అంబేడ్కర్ ఆశయ ప్రస్థానం వైపు వడివడిగా దూసుకుపోయిన అభ్యుదయ ఋషి ఆయన. ప్రగాఢమైన, వైవిధ్యభరితమైన తన రచనలతో సామాజిక పునర్నిర్మాణానికి భీమన్న వినూతన తాత్విక చైతన్యాన్నం దించాడు. ఆంధ్ర మహాసభ నుండి దళిత మహాసభ వరకు సాగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమాల ఎరుకతో ఆయన తనదైన విలక్షణ సాహిత్య దర్శనాన్ని ఆవిష్కరించాడు. "సృష్టి ఎప్పుడూ మట్టి నుంచే పుడు తుంది. మట్టి నారాధించే రైతు కూలీలే నిజమైన సృష్టికర్తలు. ప్రతిభ మట్టివంటిది. పాండిత్యం కార్ఖానా వంటిది. ఎప్పటి కప్పుడు సహజమైన ప్రతిభను చంపేస్తూ, కార్ఖానాలను పోషించుకుంటూ వచ్చారు. సాంప్రదాయ కులు (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు-పేజి 607) అంటూ తెలుగు సాహిత్య తీరుతెన్నులపై నిర్మాణాత్మక విమర్శ చేసి, మట్టి నారాధించే పాలేరులకు, కూలి రాజులకు, అసమ సమాజ పీడితులకు అక్షరాల పల్లకీ మోసిన బోయి, భీమన్న. "కుల, మత, వర్గ విభేద రహితమైన భారత జాతి ఆవిర్భవించాలనేదే నా ధ్యేయం" అంటూ ఎలుగెత్తి ప్రకటించి ఈ మహోన్నత ధ్యేయసాధన కోసం ఏడున్నర దశాబ్దాల తన సాహిత్యాన్ని అంకితం చేసిన ఆయన పద్మశ్రీగా, కళాప్రపూర్ణగా కవి పండితుల మన్ననలందుకున్నాడు. ఒక మహావృక్షం పరిసరాల చుట్టూ తన మూలాలను విస్తరింపజేసినట్లు భీమన్న నాటకం, నాటిక, పద్య కవిత్వం, వచన కవిత్వం, గేయకవిత్వం విమర్శ, గద్య సాహిత్యం, లేఖా రచన, అనువాదం తదితర ప్రక్రియల్లో ప్రామాణికమైన రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యంపై బలమైన ముద్రవేశాడు.

దళిత కుటుంబంలో జన్మించిన భీమన్న అంటరాని తనం రగిలించిన పెనుమంటల్లో, పేదరికం రాజేసిన ఆకలి మంటల్లో కరిగి ఒక తాత్విక ఆయుధంగా పదునెక్కి సామాజిక దుర్నీతిని ఖండించాడు. పంట పొలాల్లో తండ్రి పాడే వేదాంత తత్వగీతాలను ఆలకిస్తూ తల్లి మధుర

గాత్రంలో నుండి జాలువారే ఏలపాటల్లో, తుమ్మెద పాటల్లో మునిగి తేలుతూ, "కోమలారామ సీమ కొనసీమ" పచ్చని మైదానాల్లో విహరిస్తూ, ప్రకృతి అంద చందాలకు పరవశిస్తూ తదనుగుణమైన శైశవానుభూతులతో భీమన్న మౌలిక వేదాంత చింతనాపరుడిగా, సౌందర్యోపాసకుడిగా, ప్రేమతత్వారాధకుడిగా రూపుదిద్దుకున్నాడు. జాతీయోద్యమ నేపథ్యం, కాకినాడ పి.ఆర్. కళాశాల విద్యా వాతావరణం, వృక్షశాస్త్ర అధ్యాపకుడు గోరా భావజాల స్ఫూర్తి,

బ్రహ్మసమాజ ఆశయాల ప్రేరణ, దివ్యజ్ఞాన సమాజ నాయకులు తాడివేటి కుటుంబ శాస్త్రి, హరిజన నాయకులు ఈలివాడవల్లి, పాముర్రామమూర్తి, భాగ్యరెడ్డి వర్మ, తాపీ ధర్మారావు మొదలగు వారి పరిచయంతో భీమన్న ప్రగాఢమైన ప్రాపంచిక జ్ఞానాన్ని, సామాజిక చైతన్యాన్ని సమకూర్చుకున్నాడు. తనలో పొటెత్తుతున్న సృజనాత్మక ఆలోచనల పరంపరతో, తెలుగు పాఠక హృదయక్షేత్రాలను ముంచెత్తిన భావకవిత్వ ఉధృతితో పద్యకవిత్వాన్ని మరోమలుపు తిప్పిన జాషువ ప్రభావంతో భీమన్న అసాధారణ కవిగా అవతరించి నలుగురు నడిచిన దారిలో తలవంచుకు సాగిపోకుండా తనదైన మార్గంలో ముందుకు సాగిపోయాడు.

"కవి భీమన పలుకులలో కలదు జవం / కవి భీమన భావాలు నవన్నవం" అని దాశరథి కొనియాడినట్లుగా నవనవోన్మేష సృజన వారధిగా భీమన ప్రసిద్ధికెక్కాడు. వస్తు రూపాల్లో, దృక్పథంలో ఎంతో సాహసోపేతంగా స్వతంత్ర విప్లవనైజాన్ని ప్రదర్శించి ప్రయోగవాదిగా సిద్ధాంతకర్తగా విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. అద్వైతం విశిష్టాద్వైతాలకు భిన్నంగా, రసాద్వైతాన్ని సోషలిజానికి ప్రతిగా, "శివ సోషలిజాన్ని" వర్ణ, వర్గ వ్యవస్థలకు బదులుగా "వన్యవ్యవస్థ"లను ప్రతిపాదించి, సూక్ష్మ వివేచనతో నిర్వచించి తన రచనల ద్వారా వాటిని సమర్థవంతంగా ప్రచారం చేశాడు భీమన్న. మినీ కవితకు ప్రత్యామ్నాయంగా టుమ్రీలు, త్రిపదులు, వంటి లఘు కవితా రూపాలను సృజించి అపరిమితమైన ప్రణయ తత్వాన్ని అక్షరబద్ధం చేశాడు. ఆరు ఋతువుల కాల పరిధులను దాటి "ది సెవెంత్ సీజన్" అనే ప్రేమాన్వితమైన ఏడో ఋతువును రచనల్లో సృష్టించాడు. 'శివాలకులు' అనే కవితా సంపుటి ద్వారా ప్రేయసీ ప్రియుల మధ్య నడిచే ప్రేమలేఖల స్వరూప స్వభావాలను విలక్షణంగా కవిత్వీకరించాడు. "రాగ వైశాఖి" అనే శృంగారలేఖా కావ్యంతో భీమన్న తెలుగు కవిత్వానికి గొప్ప వైవిధ్యాన్ని చేకూర్చాడు. మధురగీత, పైరుపాట వంటి రచనలతో గేయ కవిత్వానికి కొత్త నడకలు నేర్పాడు.

బ్రిటీష్ వలసవాద పాలనలో జాతీయోద్యమ కాల ధర్మంతో ఆనాటి ప్రఖ్యాత కవులందరూ భారతదేశ పౌరాణిక చారిత్రక, సాంస్కృతిక వైభవప్రాభవాలను కీర్తిస్తుంటే అందుకు విభిన్నంగా భీమన్న భారదేశ ఆధ్యాత్మిక, పౌరాణిక, సాంస్కృతిక వారసత్వానికి పునాదులు నిర్మించింది హరిజనులేనని తన రచనల ద్వారా చాటిచెప్పాడు. 'ఆదికవివాల్మీకి' ధర్మవాథుడు, వేదవ్యాసుడు, రాగవాశిష్ఠం లాంటి పౌరాణిక నాటకాలతో హరిజనుల బహుముఖీన ఔన్నత్యాన్ని నిరూపించి నవ్య సంప్రదాయకవులకు అసలుసిసలైన భారతీయ వారసత్వ గరిమను, ఆదిభారతీయుల, మూలవాసుల మహిమను తేటతెల్లం చేశాడు. అరుంధతీ, వశిష్ఠుల కళ్యాణ చరిత్రను భీమన్న తిరగరాశాడు. ఆర్య, ద్రావిడ జాతుల ఆవిర్భావ వికాసాన్ని పునర్మూల్యాంకనం చేశాడు. పౌరాణిక పద్య నాటకాలను అత్యంత ప్రతిభావంతంగా రచించిన భీమన్న తెలుగు సాంఘిక నాటకానికి కూడా ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చాడు. పాలేరు, కూలిరాజు నాటకాల ద్వారా దళితుల్లో విద్యాచైతన్యాన్ని, రాజ్యాధికార భావనను పెంపొందింపజేయటంలో భీమన్న చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఆంధ్రదేశంలో కొన్ని వేలసార్లు ప్రదర్శింప బడిన పాలేరు నాటకాన్ని దర్శించి వ్యవసాయ కూలీలుగా బతుకులీడుస్తున్న వందలాది మంది దళితులు చదువు కొని కలక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన ఉదాహరణ

లెన్నో ఉన్నాయి. కాకి మాధవరావు వంటివారు నేను రిజైర్డ్ చీఫ్ సెక్రెటరీని మాత్రమే కాదు "నేను పాలేరు వెంకన్నను అని గర్వంగా చెప్పుకుంటాను" అంటూ ఒక సభలో పేర్కొనటం పాలేరు నాటకం గొప్పతనానికి నిదర్శనం. సామాజిక ప్రభావం కొలమానంగా భావించి విలువ కట్టినపుడు

కన్యాశుల్కం కంటే పాలేరు ఉన్నతమైన, ప్రయోజన వంతమైన నాటకమని ఖచ్చితంగా విశ్లేషించవచ్చు.

తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా బతుకు తత్వం రచనల్లో అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. దళిత స్పృహ ప్రారంభం నుండి భీమన్న కావ్యాల్లో స్పష్టంగా దర్శనమిస్తుంది. జన్మాంతరవైరం, గుడిసెలు కాలి పోతున్నయి, భీమన్న కావ్య సుమాలు వంటి రచనలు ఇందుకు తార్కాణంగా పేర్కొనవచ్చు. 1967 సం॥ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ "ఎన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్" అనే గ్రంథాన్ని కులనిర్మూలన పేరుతో అనువదించాడు. ఈ గ్రంథాను వాదం తరువాత భీమన్న సాహిత్య ప్రస్థానంలో ఒక గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది.

1968 సం॥ తరువాత గాంధీ భావజాల పరిమితులను దాటి భీమన్న అంబేడ్కర్ తాత్విక దృక్పథంవైపు పయ నించాడు. ధర్మంకోసం పోరాటం వచన గ్రంథం అంబేడ్కర్ సిద్ధాంతాలకు అక్షర దర్పణంగా దళిత మేనిఫెస్టోలాగా కనబడుతుంది. దళితుల ఐక్యత, దళిత సంక్షేమం, దళిత హక్కులు, కులనిర్మూలన గురించి నర్వత్రా చర్చలు జరుగుతున్న ఈనాటి చారిత్రక సందర్భంలో ఈ అంశాల పూర్వాపరాలను యాభై సంవత్స రాల క్రితమే ధర్మంకోసం పోరాటం గ్రంథంలో భీమన్న విస్తృతంగా చర్చించాడు. కులసమస్య తీవ్రత, దళితుల స్వీయ ఉద్ధరణ, వర్గ కుల పోరాటాల వైఖరి, సాంస్కృతిక చైతన్యం, సంస్కరణ ఉద్యమాల వైఫల్యం, ప్రభుత్వ మార్క్ సంక్షేమం, ప్రజాస్వామిక సోషలిజంలాంటి అంశా లను ఈ గ్రంథంలో భీమన్న శాస్త్రీయంగా విశ్లేషించాడు.

'ధర్మం' అంటే సర్వమానవ సమానత్వమే. అంబేద్కర్ అభిలషించిన సమతా మార్గాన్ని సుగమం చేసుకోవటమే ఈనాటి ఏకైక సాంఘీక ధర్మమని భీమన్న భావించాడు. "లంచం పుచ్చుకొన్న లక్ష రూపాయలకంటే ఒక్క తుపాకీ బలమైనది. తుపాకులు పుచ్చుకున్న లక్ష మంది సైన్యం కంటే ఒక్క ఆటంబాంబు బలమైనది. లక్ష ఆటంబాంబుల కంటే కార్మికుని ఒక్క చెమట బొట్టు బలమైనది. లక్ష మంది కార్మికుల చెమట బొట్ల కంటే ఒక మార్క్స్ సిద్ధాంతం బలమైనది. లక్ష మంది మార్క్సుల సిద్ధాంతం కంటే ఒక్క మహాత్ముడి రాజనీతి బలమైనది. లక్ష మంది మహాత్ముల కంటే ఒక్క అంబేద్కర్ మానవ సమతా ధర్మం బలమైనది" (ధర్మం కోసం పోరాటం-పేజి 93) అపూర్వ మైన సారూప్యంతో భీమన్న అంబేద్కర్ సమతా ధర్మ ప్రాధాన్యతను చాటిచెప్పాడు. సమతా ధర్మ పోరాటానికి సారథ్యం వహించే సామర్థ్యం దళితులకు మాత్రమే ఉందని, అందుకే దళితయువకులు ఈ కార్యసాధనకు కలసి రావాలని రచయిత ఆకాంక్షించాడు.

భారతదేశంలో ప్రజాస్వామ్య సోషలిజం నెలకొల్పబడా లంటే భూమిని, వ్యవసాయాన్ని, పరిశ్రమలను జాతీయం చేయాలని రచయిత సూచించాడు. భూమిని జాతీయం చేయకపోతే "భగవంతుడు లక్ష అవతారాలెత్తినా, లక్ష మంది మహాప్రవక్తలు తన్నుకు చచ్చినా కూడా సమాజానికి ప్రగతి లేదని" భీమన్న తెలిపాడు. ఆయన తన కార్యా చరణ ప్రణాళికను, లక్ష్యాలను, సిద్ధాంతాలను అమలు పరచడం కోసం భీమసేన అనే సంస్థ పేరుతో దళిత యువకులు ఆర్గనైజ్‌డు కావాలని భీమన్న ఉద్బోధించాడు. విద్యావంతులు కార్యశూరులైన భీమసైనికులు గ్రామ పునర్నిర్మాణానికి నడుం బిగించాలని పిలుపునిచ్చాడు. దళితుల సామాజిక, సాంస్కృతిక విముక్తికి కర్తవ్యోఎ దేశంతోపాటు కార్యాచరణ విధానాన్ని కూడా భీమన్న తన సాహిత్యంలో పొందుపరిచాడు.

సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కూడా కుల సమస్యను అర్థం

చేసుకోకుండా ఘోరంగా వైఫల్యం చెందాయని భీమన్న విశ్లేషించాడు. 'దళిత విముక్తి' విషయంలో విప్లవ మహా నాయకులందరూ నేలవిడిచి సాము చేశారని, వారంతా విదేశీయ తాత్విక భావజాల పరిధిలోనే నిబద్ధతతో ప్రదక్షిణలు చేశారని చెప్పాడు. వర్గ పోరాట ప్రభంజనంలో భీమన్న కొట్టుకుపోకుండా అగ్రకుల విప్లవవాదుల అవగాహనారాహిత్యాన్ని బట్టబయలు చేశాడు. దళితాభ్యుదయ సాధనలో ప్రభుత్వానికి కూడా ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఖండించాడు. "లక్ష ఎకరాల పాలాన్ని దోసెడు నీళ్ళతో సాగుచెయ్యడానికి ప్రయత్నించడం ఎలాంటిదో మాలమాదిగల అభివృద్ధికి నేడు జరుగుతున్న కృషి అటువంటిదే" అని భీమన్న ప్రభుత్వ కంటితుడుపు చర్యల్ని దుయ్యబట్టాడు. దళితుల స్వీయ ఉద్ధరణావశ్యకతను తన రచనల్లో ప్రముఖంగా తెలియజేశాడు. "నీరు గట్టి, మళ్ళుగట్టి, నారుగట్టి / కంచెలను గట్టి నన్ను పోషించ రెవరు" (భీమన్న-'కావ్యసుమాలు' పేజి.2) అని సంభావించాడు. దళిత జాతి ఉద్ధరణ ఆ జాతి జనుల సంఘటిత కృషి ద్వారానే సాధ్యమవుతుందని చెప్పాడు. దళిత ప్రగతి వడ్డించిన విస్తరికాదని, వడ్డనను, విస్తరిని సమకూర్చుకోవాల్సిన బాధ్యత అన్నార్హులైన ప్రజలదేనని రచయిత చెప్పాడు. సంస్కర్తలు, రాజ్యం, దాని బంధయంత్రాంగం దళితుల క్రియాశీల ప్రయత్నాన్ని వేగవంతం చేస్తాయని భీమన్న సూచించాడు. అందువల్ల అకుంఠిత దీక్షతో అనంతమైన త్యాగాలతో, పోరాటపటిమతో దళిత ప్రజలే తమ విముక్తికి ఉద్యమించాలని పిలుపునిచ్చాడు. మాల, మాదిగ, అనే ఉపకుల నామాలకు ప్రత్యామ్నాయంగా 'మామాలు' అనే ఏక పదాన్ని ప్రతిపాదించి 'నేను మా మాల ఋషి'ని అనే ఎంతో ఉదాత్తంగా దళితుల ఐక్యతను తెలియజెప్పాడు. డా॥ బి.ఆర్ అంబేడ్కర్ వ్యక్తిత్వ మహత్వాన్ని, ఆయన జీవిత చరిత్రలోని ఘట్టాలను ఆయన ఆశయాల ప్రాసంగికతను నిరూపిస్తూ భీమన్న అంబేడ్కర్ సుప్రభాతం, పాటల్లో అంబేడ్కర్, అంబేడ్కర్ మతం, అంబేడ్కరిజం అనే గ్రంథాలను రచించి ఆ సమతామూర్తికి అక్షర నీరాజనాలు పలికాడు. 'అంబేడ్కర్ శరణం గచ్ఛామి' అంటూ ఈ యుగానికి ఒక నినాదాన్ని అందించాడు.

అంబేడ్కరిజం ఆమోదించని ఎన్నో అభిప్రాయాలను కూడా భీమన్న వ్యక్తంచేశాడు. అంబేడ్కరిజానికి బద్ధవ్యతిరేకమైన "గో బ్యాక్ టు వేదాస్" అంటూ సంచలనాత్మకమైన పిలుపునిచ్చాడు. వేదకాలంలో కులం లేదని వృత్తి గతంగా మాత్రమే మనిషికి అస్తిత్వం ఉండేదని భీమన్న నమ్మకం. ఇలాంటి వైరుధ్యాలెన్నో భీమన్న సాహిత్యంలో కనబడతాయి. భీమన్న అత్యాధునిక సాహిత్య భీష్ముడు, కౌరవుల సార్వ భౌమాధికారాన్ని అంగీకరిస్తూనే భీష్ముడు పాండవుల విజయాన్ని అభిలషించినట్లుగా భీమన్న కూడా వైదిక సమాజవైభవాన్ని అమోదిస్తూనే అంబేడ్కర్ తాత్విక చైతన్యం భారతదేశంలో విస్తరించాలని ఆకాంక్షించాడు. కేవలం దళిత చైతన్యం దగ్గరే భీమన్న ఆగిపోకుండా మనవతా వాదం, ప్రేమతత్వం, జాతీయ దృష్టి, ప్రగతిశీల దృష్టి వంటి విశ్వజనీన ఆలోచనలను గూడా భీమన్న అద్భుతంగా కవిత్వీకరించాడు. అపూర్వ భావుకతతో, శిల్పనైపుణ్యంతో ఆయన రాసిన దీపసభ మహా కావ్యంగా భీమన్నకు అపారమైన కీర్తిని సంపాదించి పెట్టింది. జాషువ, శ్రీశ్రీల సాహిత్య వ్యక్తిత్వాన్ని వివేచిస్తూ ఆయన వెలువరించిన గ్రంథాల్లోను, తన కావ్యాలకు రాసుకున్న సుదీర్ఘమైన విశ్లేషణాత్మకమైన స్వీయ పీఠికల్లో భీమన్న విమర్శకునిగా కనిపిస్తాడు.

ఆధునిక సాహిత్యంలో భీమన్న సాహిత్యం 'దీపసభ' లాగా సమాజాన్ని కాంతివంతం చేస్తుంది. అత్యంత ప్రభావశీలమైన ఆయన సృజన కవిపండిత లోకానికి సమకాలీన సమాజానికి 'దారిదీపంలా' నిలుస్తుంది. బృహత్తరమైన మహత్తరమైన అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ద్వారా ఈ దీపకాంతిని దశదిశలా విస్తరింపజేస్తున్న మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ వారికి, సదస్సు సంచాలకులు ఆచార్య విస్తాలి శంకరరావుగారికి అభినందనలు.

పాలేరు నాటకంలో సాంఘిక, మత పరిస్థితులు

– డా॥. డి. నల్లన్న , అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి.

'కావ్యేషు నాటకం రమ్యమ్' అన్నది ప్రాచ్య పాశ్చాత్యులు ఒప్పుకొన్నమాట. శ్రవ్యం కన్నా దృశ్యం ప్రజలలో చైతన్యాన్ని రగిలిస్తుంది. పైగా నాటకేతివృత్తం కౌటుంబికమయితే సామాజిక భూమిక ఆధారంగా రచించినట్లయితే ఆ నాటక ప్రభావం ఇంతింతనడానికి వీలులేదు. పద్మభూషణ్ డా॥ బోయి భీమన్నగారి పాలేరు నాటకం అనేకసార్లు ప్రదర్శనలు నోచుకోవడానికి కారణం ఇతివృత్తం సమకాలీనత కావడం. మౌళికతకు ప్రాధాన్య మివ్వడం. జనరంజనార్థం పద్యాలు, పాటలకు, స్థాన మివ్వడం ప్రధాన కారణాలు కావచ్చు.

నీరుగట్టి మళ్ళుగట్టి నారుగట్టి
కంచెలును గట్టి నన్ను పోషించెవరు
అడవి మొక్కను నేను విశ్వావకాశ
వీధులందు ఇష్టమొచ్చినట్టు విరియుచుంటి

అని సగర్వంగా చెప్పుకున్న కవి బోయి భీమన్నగారు. ఈయన తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని మామిడికుదురులో 1911 సెప్టెంబరు 19న జన్మించారు. తల్లిదండ్రులు నాగమ్మ, పల్లయ్యలు. బాల్యంలోనే సంస్కృతాంధ్ర గ్రంథాలైన పంచతంత్రం, అమరకోశం, మనుచరిత్ర గ్రంథాలు అధ్యయనం చేశారు. భాషలో పట్టు సాధించారు. పగటిపూట వ్యవసాయం పనులు చేస్తూనే, రాత్రివేళ కిరసనాయిలు దీపం వెలుగులో విద్యను కొన సాగించారు. ఈ దీపం ముందే కూర్చొని 'దీపసభ' కావ్యానికి శ్రీకారం చుట్టారు. భీమన్నగారికి కళాశాల చదువుతున్న రోజుల్లోనే ప్రసిద్ధ కవులయిన దేవులపల్లి కృష్ణశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, అడవి బాపిరాజు వంటి వారితో పరిచయమేర్పడింది. ఆ తరువాత పత్రికా కార్యా లయాలలో కొంతకాలం పనిచేశారు. నవజీవన, జయభేరి వంటి పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు.

భీమన్నగారు పత్రికలలో పనిచేసిన అనుభవంతో అనువాదం వైపు మొగ్గుచూపారు. ఆ దిశలో ప్రభుత్వ కార్యాలయంలో అనువాదశాఖలో శాఖాధిపతిగా పని చేశారు. ప్రవృత్తిలో పేరు తెచ్చుకున్న బోయి భీమన్న ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడుగా, సంయుక్త కార్య దర్శిగా వివిధ హోదాలలో పనిచేసి ఆ పదవులకు వన్నెతెచ్చారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే ప్రవృత్తిపట్ల మక్కువతో వివిధ ప్రక్రియలలో ఏడు పదులకు పైగా రచనలు చేశారు. వీరి రచనలలో పాలేరు నాటకాన్ని పరిశీలనాత్మకంగా పరిచయం చేయడమే ఈ పత్రం ప్రధాన అంశం.

బోయి భీమన్నగారి పాలేరు నాటకం ముద్రణకు ముందే వందలసార్లు గ్రామాల్లో ప్రదర్శింపబడింది. రచనలో మార్పు చేసుకుంటూ 1970లో తొలి ముద్రణకు నోచుకుంది. ఈ నాటకం 19సార్లు ముద్రింపబడింది. చివరిగా 2009లో పునర్ముద్రితమైంది. మార్పులు చేబడుతూ గ్రంథం ముద్రితం కావడం గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వేంకటరాయశాస్త్రిగారి ప్రతాప రుద్రీయం, ధర్మవరం కృష్ణమాచార్యులవారి నాటకాలలో సహజలక్షణం.

పాలేరు 'సహజ మౌలిక రచన' అనీ బోయి భీమన్నగారి అభిప్రాయం. తెలుగువారు గర్వించే గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం బోయి భీమన్నగారి దృష్టిలో సార్వ జనీనత లేదు. ఒక కులానికి, మండలానికి పరిమిత మయినది. మౌలిక సాహిత్యం రాకపోవడానికి పాక్షిక, ప్రగతి నిరోధక మత్తుమందు మాత్రలను రచయితలు మింగడమే కారణమంటారు భీమన్నగారు.

పాలేరు నాటకం రచనాకాలం నాటికి భూస్వామ్య వ్యవస్థ వుంది. గ్రామీణ జీవనం స్థిరంగా ఉంది.

కామందుల పెత్తనానికి కొదువలేదు. యాంత్రిక వాతావరణం పురుడు పోసుకోలేదు. కాబట్టి వ్యవసాయ మంతా శ్రమశక్తిపైననే ఆధారపడి ఉంది. ఆ కారణం వల్ల కూలీల అండలేకుండా పనులు ముందుకు సాగవు. ఈ కూలీల వ్యవస్థ ఉచ్చుకు తలనమ్ముకున్నవారు, పడ్డవారు దళితులే. పంక్తిబాహ్యులు కాని వారి పనితనం కావాలి. శ్రమ కావాలి. వారక్కర్లేదు. వారి విధేయత కావాలి, వారెదురుగా రాకూడదు. వారు కట్టుబానిసలుగా ఉండడానికి తగినట్లు విద్య నిషేధం. వినోదాలు నిషేధం. అప్పటి వారి జీవన స్థితి పాలేరు నాటకంలోని ఉపకారి పాత్ర ద్వారా గోచిపెట్టుట పద్యంలో చక్కగా ఆవిష్కరించారు బోయి భీమన్నగారు. ఆ పద్యమిది.

గోచిపెట్టుట నేర్చుకొనగానే బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులారా?
నడువ నేర్చుటతోనె బుడతని గొంపోయి
పాలేరు తనమంచు దీనులారా
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులారా
వంట యిల్లొకటే ప్రపంచమ్ముగా చేసి
తనయుల నేర్పించు తల్లులార

జాతిశక్తి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసికొంటిరే గాఢనిద్ర
శక్తికంతకు మూలము చదువుగాన
బడికి బంపుడు మీ వంశ వర్ధనులను''

'కామందులు' పాలేళ్ళను చాలా నీచంగా చూడడం ఆనాటి వ్యవస్థలోని తీరుగా కనిపిస్తుంది. పేర్లు పెట్టి పిలవడం వారికిష్టం లేదు. ఎంతసేపు తిట్ల పురాణమే. బూతులే. నాటకంలోని కథానాయిక వనబాల దళితుడయిన వెంకన్నను పేరుపెట్టి పిలవడంతో వెంకన్న పులకించిపోవడం ఈ నాటకంలోని విచిత్ర సన్నివేశాలలో ఒకటి. కామందులు తమకు వినోదాలుండాలి గానీ దళితులకు ఉండరాదని ఆనాటి వ్యవస్థ - అందువల్ల కామందు కుబేర్రావు ''పాలేరు పీనుగుకి పాటలెందుకంట'' అని తిడతాడు. పాడితే పనులు జరుగవని పాటల వల్ల ఇతరుల్లో ఆలోచన, చైతన్యం వస్తుందని కుబేర్రావు బాధ. అందుకే వెంకన్నను, వీరేశును, పుల్లయ్యను పనిదొంగ గాడిదలంటాడు. ఆ కారణంగానే చదువు చెప్పే పంతుల్ని (ఉపకారి) కూడా ఆడిపోసుకుంటాడు. ఆనాటి పంతుల్లలో చాలామంది జీతాలు తీసుకుంటూ సొంత పనులు చూసుకొనేవారేమో, అందుకే పంతుల్ని తిడతాడు కుబేర్రావు.

కుబేర్రావు దళితులను విద్యకు దూరం చేసే ప్రయత్నంలోనే ఉపకారిని నిందిస్తాడు. వెంకన్న తండ్రి అయిన పుల్లయ్యతో 'నీ కుమారుని చదువు మాన్పించమంటాడు. అలా చేయకపోతే నీ అంతుచూస్తానని బెదిరిస్తాడు. వనబాల పట్టణంలో చదువుకుంటున్న వెంకన్న కోసం కాసుల పేర్లు పంపిస్తే దొంగిలింపచేసి నేరం ఇతరులమీదకి నెడతాడు. ఒంటరిగా ఉన్న సీత మీద కన్నేసి అకృత్యానికి సిద్ధపడతాడు.

'విద్యాగంధం లేని సమాజం' పాలేరు నాటకంలో స్పష్టంగా కనిపిస్తుంది. పల్లెల్లో బడులున్నా దళితులు తమ పిల్లలను పంపరు. ఒకవేళ పంపినా కొనసాగరు. కలవారి పిల్లలకే చదువులు. విద్యకు దూరమయితే అమాయకత్వం, ఛాందసభావాలు ప్రబలుతాయి. వీటికి ప్రతీక పాలేరు నాటకంలోని పుల్లయ్య పాత్ర. పుల్లయ్య తాత చదువుకోవాలని పుల్ల పట్టుకొంటే కాలు విరిగిందని ప్రచారం చేసి పుల్లయ్యను ఛాందసంలోనే పెరగనిచ్చాడు కుబేర్రావు. ''నీ జాతికి చదువు అచ్చిరాదురా'' అనే భ్రమలో ముంచుతాడు. హరిజనుల పిల్లలు పిల్ల పాలేళ్ళుగా, బాలకార్మికులుగా మారడమే ఆనాటి వ్యవస్థ లక్ష్యం.

'పాలేరు' నాటకం కాలం నాటికి గ్రామాలలో ఆధునిక సౌకర్యాలు అసలు లేవు. చిన్నబడులుండేవి. వయోజన రైతులు రాత్రివేళల్లో చదివేవారు. అయితే వీరికి ఇబ్బందులు తప్పలేదు. కుబేర్రావు లాంటి వారు రైతులు, కూలీలు చదువుకుంటే వ్యవసాయం ఎలా జరిగేదని వాపోయేవారు. పేదవారికి కిరసనాయిలు కూడా దొరికేవి

కాదు. పాలేర్లకు కామందులు అమ్మేవారు కాదు. కామందుల మాటలు నమ్మి కల్లు తాగి ఏ పనికయినా సిద్ధమవుతారు అనాటి అమాయక దళితులు.

పట్టణాలలో అనాథ శరణాలయాలుండేవి. అభ్యుదయ భావాలు కలవారు. సంఘంలో చిన్నచూపుకు గురవుతున్న హరిజనులు కూడా బాగుపడాలని వారికి విద్యాబుద్ధులు చెప్పించేవారు. ఇలాంటి అనాథ శరణాలయంలోనే వెంకన్న చదువుకున్నాడు. ఉన్నతాధికారిగా ఉద్యోగం సంపాదించాడు.

ఇక మతవిషయానికి వస్తే భీమన్నగారు పాలేరు నాటకంలో జాగ్రత్త పడ్డారు. వారు బ్రహ్మసమాజాన్ని సమర్థించారు. నాటకంలోని ఇరవై మూడవ రంగంలో బ్రహ్మ సమాజ పద్ధతులు అనే మాట గుర్తించదగ్గ అంశం. నాటకంలోని సుందరం బ్రహ్మసమాజ వ్యాప్తికి తోడ్పడే పాత్రగా భీమన్నగారు చిత్రించారు. బ్రహ్మసమాజ పద్ధతి వివాహానికి వ్యతిరేకతలు లేకపోలేదు. సనాతన కుల దివాంధులు శపియించి నిప్పులు చల్లుతున్నారట. భారతాభ్యుదయ నిరోధకులు నోటి కత్తులు నూరుతున్నారట.

ఈ నాటకంలో అవసరానికి భగవద్గీతను వాడుకునే పెద్దలు కూడా కనిపిస్తారు. కుబేర్రావు 'చాతుర్వర్ణాలను దేవుడే పుట్టించాడు. మనమేం చేత్తామోయ్' అని సమర్థించుకొంటాడు. అంతేగాకుండా కుబేర్రావు ఉపకారితో కులాలే పనికిరావంటున్నావే?' నీ తల మీద రెక్కల బాంబు బ్రద్దలవ్వా' అని కసి కక్కుతాడు.

ఆనాటి సంఘంలో న్యాయవ్యవస్థ భిన్నంగా ఉండేది. న్యాయస్థానాలు లేవు. డిప్యూటీ కలెక్టరే క్యాంపులు వేసుకొని తగవులు విచారించేవారు. పట్టణ ప్రజలకు పల్లెటూరి వారిపై సానుభూతి లేదు.

పాలేరు నాటకం ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడిన దళితుల జీవన చిత్రణకు నిలువుటద్దం అనడం స్వభావోక్తి.

నాటకంలో మారుతున్న వ్యవస్థకు ప్రతిబింబాలుగా కింది పంక్తులు కనిపిస్తున్నాయి.

'బానిసత్వం కంటే చావు మేలు'

'బ్రహ్మసమాజంలో అందరూ మానవులే అందరూ సమానులే'

ప్రజ్ఞాశాలియైన మానవుడు ఏ కులమైనా ఒక్కటే నాకు'

పంట పొలములు జాతిపరములు కావలె

కూలిపేటలలోని బాలబాలికలెల్ల విద్దె

సుద్దులు నేర్చి వెలయువలయు. మొదలైన అంశాలు భీమన్నగారి ఆలోచనలు ఆవిష్కరిస్తున్నాయి.



పాలేరు నాటకం - బోయిభీమన్న సామాజిక స్వప్నం

- డా॥. గోపవరం పద్మప్రియ, తెలుగు అధ్యాపకులు పి.ఆర్. ఆర్ & వి.యస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విడవలూరు.

హితేన సహితం సాహిత్యం. ఈ సాహిత్యం ఎవరి హితాన్ని కోరుతుంది? అని ప్రశ్నించుకుంటే ''సామాజిక హితం'' అనే జవాబు దొరుకుతుంది. సమాజంలో ఎవరిమేలును? అని తర్కిస్తే, ఎవరు అన్ని విధాల బాధలను అనుభవిస్తూ అణచివేతకు గురవుతున్నారో వారికి మేలు జరగాలి. మన భారతీయ సమాజంలో వేలాది సంవత్సరాలుగా సాంఘికంగా ఆర్థికంగా అణచి వేతకు గురవుతూ పేదరిక, సామాజిక రేఖకు దిగువన వున్న వారు దళితులే. వీరికే మేలు జరగాలి.

ఆర్థికంగా, రాజకీయంగా అన్ని స్థాయిల వారితో సమానమైన జీవనస్థాయిని వారికి కల్పించాలి. సామాజిక రంగంలో ప్రతిదానిలోను సమానమైన ప్రజాస్వామిక ప్రాతిపదికను వారికందించాలి. సమాజిక వ్యవస్థను సమూలంగా మార్చివేయాలి. దళితుల అభివృద్ధికి ప్రభుత్వాలు, రాజ్యాంగం అనేక పథకాలను రచిస్తున్నా అభివృద్ధి అంతంత మాత్రమే వుంది. దానికి కారణం వాటిని అందుకునే వర్గాలవారికి వాటికి సంబంధించిన సరైన జ్ఞానం లేకపోవడమే. అలాంటి దళితులలో చైతన్యాన్ని పురికొల్పడానికి అనేకమంది సాహితీమూర్తులు సామాజిక చైతన్య ఉద్యమంలో తమవంతు పాత్రను పోషించారు. వారిలో చైతన్యాన్ని నింపడానికి సుంబోధక మైన సాంఘిక నాటక ప్రక్రియను సృజించిన తొలితరం సాంఘిక నాటక రచయితల్లో బోయిభీమన్న ఒకరు. వీరు పేద దళిత వర్గంలో పుట్టి కష్టాలు బాధలు అనుభవించినా నిరంతరం సంతోషంగా జీవించాడు.

నా సుఖాలు, సంతోషాలు
సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం
నా కష్టాలు, నష్టాలు, దురదృష్టాలు
అన్నీ శివార్పణం - అంటూ జీవించాడు

అవమానాలను ఎదిరిస్తూ కులతత్వాన్ని వివరించి దళితుల సామాజిక చైతన్యానికి మార్గాలను అన్వేషించిన చైతన్యశీలి. ఈయన రచించిన పాలేరు, కూలిరాజు, పడిపోతున్న అడ్డుగోడలు, ప్రగతి, మానవుని మరోమజిలి, అనసూయ ఈ నాటకాలన్నీ ఆనాటి సమకాలిన సామాజిక ప్రతిబింబాలే. సమాజిక శ్రేయస్సే ఆధునిక నాటక ధ్యేయం.

సామాజిక బాధ్యతతో రచనలు చేసే ఏ రచయితకైనా నాలుగు ప్రశ్నలు ఎదురవుతాయని 'జాషువా స్వప్న సందేశం' సిద్ధాంత వ్యాసంలో రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారన్నారు అవి ఏమిటంటే?

1. తాను నివశిస్తున్న సమకాలీన సమాజం ఎలావుంది?
2. ఆ సమాజం అలా ఉండడానికి గల కారణాలేవి?
3. ఆ నమాజం ఎలా ఉండాలని రచయిత ఆశిస్తున్నాడు?
4. తాను కలలుగన్న సమాజం ఏర్పడ్డానికి గల పరిష్కారం మార్గాలేమిటి?

ఈ నాలుగు ప్రశ్నలకు రచయితకు దొరికే సమాధానమే రచయిత స్వప్నమవుతుంది. బోయిభీమన్న కూడా ఆనాటి సమాజం ఎలావుందో కళ్ళారా చూచి, అనుభవించారు గనుక దాన్ని ఇతివృత్తంగా స్వీకరించాడు. దానికి గల కారణాలను అన్వేషించి వాటి పరిష్కార మార్గాలను కనుగొన్న ద్రష్ట , స్రష్ట, నవ సమాజ నిర్మాత భీమన్న.

ఏ సమాజమైన వివక్షకు గురవడానికి కారణం అవిద్య, అజ్ఞానం, వీటికి కారణం భారతదేశంలో వేళ్ళూనుకొన్న కులతత్వం. ఈ రెండింటిని భారతీయ సమాజం నుంచి పారద్రోలడానికి బోయిభీమన్న సూచించిన రెండు మార్గాలు.

1. విద్య
2. కులాంతర వివాహాలు

ఈ రెండింటిని తన పాలేరు నాటకంలో ప్రతిపాదించాడు. భీమన్నగారి "కూలిపోతున్న అడ్డుగోడలు" కేవలం కులాంతర వివాహాలకి ప్రాధాన్యమిస్తుంది / ప్రధాన భూమిక వహిస్తుంది. పాలేరు నాటకంలో విద్య, కులాంతర వివాహం అనే ద్విముఖవ్యూహం ద్వారా సాంఘీక విప్లవానికి బోయిభీమన్న అంకురార్పణ గావించారు. భూస్వాములు కామంతో కబళించే దళిత స్త్రీల సమస్యలు సైతం చిత్రిస్తూనే తాను చెప్పదలచుకున్న ప్రధాన సమస్యలపై తన దృష్టిని కేంద్రీకరించి మిగిలిన సమస్యలన్నింటిని పాలేరుతనం చుట్టూ అల్లుకున్న దళిత జీవన విధానాన్ని ఈ నాటకంలో సమర్ధవంతంగా చెప్పగలిగారు.

ఇతివృత్తం : "ఇతివృత్తం నాట్యస్య శరీరం పరికల్పితం"

పాలేరు నాటక ఇతివృత్తాన్ని సంక్షిప్తంగా పరిశీలిస్తే గోదావరి తీరంలో కుబేరయ్యే అనే భూస్వామి ఉంటాడు. అతని దగ్గర పుల్లయ్య అనే పాలేరు పనిచేస్తుంటాడు. అతని కొడుకు వెంకన్నను పాలేరుగా నియమిస్తాడు. వెంకన్న తల్లిచనిపోగా పుల్లయ్య భార్య చెల్లెలు సీత వెంకన్న ఆలనా పాలనా చూస్తూవుంటుంది. కుబేరయ్య దగ్గర వీరేశు అనే పాలేరు కూడా వుంటాడు. వాడు భూస్వామి చెప్పిన పనిని తు.చ. తప్పక చేస్తుండేవాడు. వెంకన్న అన్న, అతని చదువు అన్న వీరేశుకు చులకన అదే ఊరిలో సమాజహితం కోరే ఉపకారి మాస్టారు ఉంటాడు. చదువు సమాజాన్ని మారుస్తుందని నమ్మే అభ్యుదయశీలి. అందరిని పాఠశాలకు రమ్మని ప్రభోదిస్తూ వుంటాడు. అదే ఊరిలో సంస్కారవంతమైన సంపన్న కుటుంబానికి చెందిన యువతి వనబాల వెంకన్నను ప్రేమిస్తుంది. వనబాల, ఉపకారి మాస్టారి సహాయంతో వెంకన్న కాకినాడలో అనాధాశ్రమం చేరి అక్కడ సుందరం (వనబాల అన్న) రామంల సహాయంతో చదువును సాగిస్తాడు. వీరేశు, సీత ప్రేమించుకుంటారు. సీతపై భూస్వామి కన్నేశాడని తెలుసుకొని సీతను తీసుకొని వీరేశు పారిపోతాడు. వెంకన్న అనాధ శరణాలయం వారి సహాయంతో బాగాచదువుకొని డిప్యూటి కలెక్టరయి వెంకటేశ్వరరావుగా మారతాడు. వెంకన్న ముందు దోషిగా నిలబడ్డ కుబేర్రావును క్షమిస్తాడు. రామం చేసుకోవాల్సిన వనబాలను, వెంకన్న, వనబాలల ప్రేమ వ్యవహారం తెలుసుకొని రామం, సుందరం వారి వివాహం జరిపిస్తారు. ఇదీ నాటక ఇతివృత్తం.

పాలేరు నాటక ప్రారంభంలోనే.

బానిసతనమును - బావుమురా
భారతభూమికి - భాగ్యము తేరా!
సకల దేశముల - సర్వ మానవుల
సామ్యము - సాధింపుమురా ?
ఒకడు తినుచు - మరియొకడు పస్తుపడి
యుండుట - ధర్మము కాదురా !
కూడూ , గుడ్డ, కొంపయు సమానముగ
కూర్పుమురా లోకమున.
ప్రభువు - సేవకుడు లేని సంఘమును
పదిలముగా నిర్మింపురా !
సౌఖ్యము, సంతోషము మానవులకు
సమకూర్చుమురా ! వీరా ?

ఈ పాట ఆనాటి సమాజాన్ని చిత్రీకరిస్తూ, కవికలగన్న సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. పాలితులు పాలకుల మధ్య వ్యత్యాసాలు లేని సమాజం నిర్మాణం చేయమని, అలా చేసేటప్పుడు జాగ్రత్త అవసరమని హెచ్చరిస్తాడు. ఈ ఒక్క గేయం నాటక సారాంశాన్ని, కవి స్వప్నాన్ని ఆవిష్కరిస్తుంది.

ఒకప్పటి హిందూ సమాజ ఆచార వ్యవహారాలు ఈనాడు లేకపోయినప్పటికి, వాటి ప్రభావం ఈ నాటికీ కనిపిస్తూనే వుంది. అస్పృశ్యులుగా గుర్తించబడిన అనేకమంది ఈనాటికి చదువుకు నోచుకోలేదు. ఎన్ని నంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా దళితుల్లోని అక్షరాస్యతను ఇతర కులాల అక్షరాస్యతలో పోలిస్తే చాలా తక్కువగానే కనిపిస్తుంది. అనేకమంది దళితపిల్లలు

ఈనాటికి పాలేర్లుగా కార్మికులుగా, కూలీలుగా పని చేయకపోతే గడవని కుటుంబాలు ఈరోజుకు వున్నాయి. ఇలాంటి సామాజిక, ఆర్థిక నేపథ్యంలో చదువు ప్రాధాన్యతను పాలేరు నాటకం వివరిస్తూ.

కన్నబిడ్డ లజ్ఞానాంధకార మందు
ఒకరి నొక్కరు పట్టి కొట్టుకొనుచుండ
విద్య అనియెడు కాగడా వెలుగుజూపి
ఏల రక్షించుకొనరు మీ బాలకులను ?
విద్యలేని మనష్యులు వింత పశువు
లన వినరె? పశుత్వమ్మె మీక మృతమగునె ?
బడికి పంపుడు, విద్యనేర్పుడు, రవంత
ముందునకు బోవనిండు మీ ముద్దుసుతుల

అంటూ పాలేర్లుగా బ్రతుకుతున్న చిన్నారుల జీవితాలను తీర్చిదిద్దాల్సిన తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తూ ఆలపించిన గీతమిది. ఈనాటి బాలకార్మిక వ్యవస్థ 60 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత స్వాతంత్ర్యానంతర ఫలశ్రుతిగానే మిగిలిపోయింది. పసి పిల్లల జీవితాన్ని పణంగా పెట్టవద్దని ఉపకారి "పసిబిడ్డ తెచ్చు సంపాదనకాశించి మనుగడ మాపు జనకులారా"! అని తల్లిదండ్రులను మానవత్వం మరచిన మనుషులుగా సంభోదిస్తాడు.

దళిత స్త్రీలలోను విద్యపట్ల ఆసక్తిని కలిగిస్తాడు. స్త్రీల యొక్క విద్యావశ్యకతను ప్రభోదిస్తాడు.

వంటయిల్లోకటె ప్రపంచమ్ముగా చేసి
తనయుల నేర్పించు తల్లులారా
జాతశక్కి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసికొంటిరే గాఢనిద్ర

చిన్నతనంలోనే పసిపిల్లల పెంపకం, ఇంటి చాకిరీ మోసే అమ్మాయి చదువుకోలేక నిరంతర శ్రమలోకి, అంతులేని చాకిరీలోకి తమకు తెలియకుండానే నెట్టివేసే ఆడపిల్లల తల్లుల అమాయకత్వాన్ని చిత్రిస్తూ ఉపకారి పాత్ర ద్వారా జాగృతం చేశాడు.

డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వరరావు తనగ్రామానికి తిరిగివచ్చి ఉపాధ్యాయుడైన ఉపకారితో మీ చలువ వల్లనే నేను ఇంత వాడినయ్యాను. మీరు నాదగ్గర ఉండాలి అని అడిగినప్పుడు.

"అది స్వార్థం అవుతుంది నీ వంటి కలెక్టర్లను ఎంతమందిని తయారు చెయ్యాలో నేను ఈ దళిత సంఘం నుండి ఒక కలెక్టర్ అన్న మాటేమిటి? ఒక్కసారి బడిలో చేరిన వాడు కోరికను బట్టి పట్టుదలను బట్టి ఇంజనీరు, డాక్టరు, ప్రొఫెసర్, లాయరు, జడ్జీ ఏదైనా కావచ్చు. నియమాతిక్రమణ చేయనక్కర్లేదు. న్యాయం కల్గిస్తుంటే చాలు"

ఇక్కడ ఉపకారి ఉపన్యాసం విన్నతర్వాత నేనూ మీ ఉద్యమంలో భాగమవుతానని వెంకటేశ్వరరావు అనడు. ఒక బాధ్యత గల నిజాయితీ ఆఫీసరుగానే చిత్రీకరించ బడ్డాడు. ఇక్కడ బోయిభీమన్న ఎదిగిన దళితుల పట్ల తన అపనమ్మకాన్ని చెప్పీ చెప్పక చెప్పాడు. పైకెదిగిన దళితులు క్రిందిస్థాయి దళితుల పట్ల నిర్లక్ష్యాన్ని వ్యక్తం చేస్తున్నారనే వైనాన్ని మౌనంగానే చిత్రీకరించాడు. నేను ఇక్కడ స్పష్టంగా చెప్పదలచిన మాటేమిటంటే దళిత అవకాశాలు పొంది ఉన్నతస్థాయికి వెళ్ళిన దళితులు, దళితాధికారులు వారితోటి పేదరికపు స్థితిలో వున్న దళితుల అభ్యున్నతి కోసం కృషి చేయలేదనడం సత్య దూరం కాదు.

పాలేరు వెంకన్న గ్రాడ్యుయేట్ అయి కలెక్టరయ్యాడు. దళితుల పిల్లలకు పేర్లుండవు. పేర్లున్నా పూర్తి పేరుతో ఏ పాలేరునూ పిలవరూ. అందుకే చదువుకోవడం వల్లనే పాలేరు వెంకన్న వెంకటేశ్వర రావయ్యాడు. ప్రభుత్వం దళితుల కోసం కేటాయించిన పోస్టును అందుకొని డిప్యూటీ కలెక్టరూ అయ్యాడు. ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు సఫలం కావాలంటే విద్య తప్పనిసరి అనే అంశాన్ని బోధిస్తుంది. విద్య ద్వారా హోదా, గుర్తింపు పొందిన వెంకన్న లాంటి వాస్తవమూర్తులు ఎవరైనా వున్నారా? ఈ నాటకం ఆశించిన ఫలితాన్ని సాధించిందా అని వితర్కించుకంటే -

ఆ రోజుల్లో ఆంధ్ర రాష్ట్రమంతటా పాలేరు కూలిరాజు, నాటకాలు గ్రామాల్లో ఉర్రూతలూపాయి పాలేరు నాటకాన్ని చూసి, పాలేరుపని మానేసి విద్యనభ్యసించి ఉన్నతోద్యోగాలు సంపాదించిన దళిత ప్రజానీకం అనాడు కోకొల్లలు. నాటక దిక్సూచిలో ముద్రించిన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ గారి మాటల్ని ఒకసారి పరిశీలిద్దాం. "నేను పాలేరుని. పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు నేర్చుకొని చదివి కలెక్టరయ్యాను. పాలేరు నాటక ప్రభావం నామీద, నా ప్రజలమీద ఎంతగానో వుంది. ఈ నాటకం రాకపోతే నేను పాలేరుగానే మిగిలిపోయేవాడిని. బోయిభీమన్న ఋణం జన్మజన్మలకు తీర్చుకోలేనిది" అని ఎన్నో సందర్భాల్లో అన్నారు. ఈ నాటకం సామాజికంగా విప్లవం తీసుకొచ్చిం దనడానికి ఇంతకంటె మరొక నిదర్శనం లేదు.

కవి తనస్వప్నం కోసం నూతన భావాలోచన గలిగిన ఒక పాత్రను ఎన్నుకొన్నాడు. వనబాల మోతుబరి రైతు కులానికి చెందిన అభ్యుదయవాది. అభ్యుదయ నవ సమాజ ఆలోచనపరంపర గలిగిన సోదరుడు సుందరం పాత్రను కవిసృష్టించుకున్నాడు. వారి వాదనకు, వేదనకు, నవసమాజ బోధనకు బ్రహ్మసమాజం వేదికయింది. కులరహిత, మతరహిత, వర్గరహిత సమాజం కోసం బ్రహ్మసమాజం ఏర్పడింది. బ్రహ్మ సమాజ నియమావళిని ఆచరిస్తూ నవ సమాజానికి వెలుగురేఖగా బోయిభీమన్న స్వాప్నిక దర్శనానికి నిదర్శనంగా వనబాల కలెక్టర్ వెంకటేశ్వరరావు వివాహం తరతరాల సంప్రదాయబద్ధమైన ఊరులో బ్రహ్మ సమాజ పద్ధతుల ప్రకారం జరగడం నవసమాజ అభ్యుదయ వేడుక.

అయితే ఇక్కడ కవి ఒక సందేహాన్ని సీతపాత్ర ద్వారా వ్యక్తం చేస్తాడు.

"పైకొచ్చిన వాణ్ణి పై వాళ్ళు పై నుంచే ఎగరేసుకుపోతే,
ఇక మాకు మిగిలిందేమిటండమ్మా"

అప్పుడు వనబాల నేను మీ వాడకీ వచ్చి ఉంటానని నమ్మబలుకుతుంది. ఇక్కడ కవి నేటి వాస్తవిక పరిస్థితిని వివరించినట్లైనది. నేటి సమాజంలో అందరూ వనబాల లాంటి వారు వుండరు కాబట్టి ఈ సందేహాన్ని కవి ఇక్కడ వ్యక్తం చేశాడు. గురజాడ అప్పారావుగారు చెప్పినట్లు దళితులు, అగ్రవర్ణాల వారు వివాహం చేసుకోమన్న భావాన్ని మొదట ఉన్నత దళిత వర్గం పాటిస్తే దళిత సమాజం సమ తౌల్యాన్ని పొందుతుంది. వృద్ధిచెందిన దళితుడు వృద్ధి చెందకుండా ఉన్న అదే దళితవాడకు చెందిన వారితో వివాహాలు కలుపుకుంటే కవి స్వప్నించిన నవసమాజం నిజంగా ఆవిష్కృతమవుతుంది.

రాముడు ఆదర్శమూర్తి. రామతత్వం ప్రజలకు జీవన శుబోధన వ్యక్తం వెంకన్న నవసమాజ రాముడు విద్యా జ్ఞాన ప్రబోధాన్ని తన సమాజానికి అందించి ఉన్నత శిఖరాలకు ఎదగమని ముందు దళిత వర్గాలకు వెన్ను తట్టిన వాడు అభినవ వెంకన్న. పాలేరుతనం నశించినా పాలేరు నాటకం అణచివేత, బానిసత్వం, అస్వతంత్ర్యత ఉన్నంతకాలం నిలచివుంటుంది. కాబట్టి ఇది ఎప్పటికీ క్లాసిక్కే.

బోయి భీమన్న

– దుక్క సూరిబాబు, స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

ఒక మనిషిని వందేళ్ళు గుర్తుపెట్టుకోవాలంటే ఆయన వందేళ్ళు బ్రతాకల్సిన అవసరం లేదు. ఆయన చేసిన సేవ, రచించిన గ్రంథాలు, ఆయన పొందిన అవార్డులు, ఆయన వేసిన నూతన, సమ సమాజ నిర్మాణ కృషి ఆయనను వందేళ్ళు ప్రజల గుండెల్ల నిలిచేలా చేస్తాయి. భారతజాతిని ఏకజాతిగా నడిపించడానికి శ్రమించిన మహానుభావుడు, మహామేధావి బోయి భీమన్న గారు.

కళా ప్రపూర్ణ, ప్రద్మశ్రీ, పద్మభూషణ్ బోయి భీమన్న గారు. 1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురులో జన్మించారు.

నేను హిందువుగా పుట్టాను - మతం మార్చివలసిన అవసరం లేదు.

పెనంలోంచి పొయ్యిలోనికి దూకడం దేనికి? అని గంభీరంగా పలకగలిగిన మహా మేధావి. ఈ హిందూ మత మూల పురుషులు. ఈ భారత సంస్కృత ఋషులు నావాళ్ళు. ఈ హరిజనులు అని నేను విశ్వసిస్తున్నపుడు నా వారసత్వపు హక్కుల్ని ఏదో విధంగా తిరిగి సంపాదిస్తానే గానీ, పారిపోవడం అనేది ఎందుకుంటుంది? మెజారిటీ జనంవాన్ని - మైనారిటీగా ఎందుకు మారతాను అంటూ తన జనం, జాతిని జాగృతం చేస్తూ, ఒక సందర్భంలో ఈ విధంగా అంటారు.

"నేను కనుక సిసలైన మనిషినైతే

నేనే కనుక నిజాయితీ కల్గిన మాల, మాదిగ వాళ్ళయితే

నేనే కనుక ధర్మవాధ, మాతంగ, వాల్మీకి, వ్యాస, మహాపురుషుల వారసుడనయితే నేనే కనుక నా కులాన్ని దాస్యం నుంచి - విమోచనం కలిగించే ధర్మానికి కట్టుబడిన వాన్ని అయితే

నేనే కనుక ఆర్య భారతజాతి సమగ్ర సంఘటిత శ్రేయస్సును కోరిన వాన్ని అయితే

నేను నా సమస్త పదవీ విద్యా ప్రతిష్టా గర్వాలు అన్నింటినీ పీకి పారేసి

ఈ నా గ్రామీణ హరిజన గుడిసెవానులతో వుండిపోవాలి.

వాళ్ళతోనే ఉంటూ, వాళ్ళు కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ, ఒక్కొక్క అడుగు వాళ్ళను ముందుకు నడిపించాలి. తరతరాల దాస్యంతో, దారిద్ర్యంతో సగం చచ్చిపోయిన వాళ్ళను మానసి కంగా ఓదార్చాలి అంటూ ఎంత ఎత్తులో ఉన్న, మనవాళ్ళను మర్చిపోకుండా

మన ఎదుగుదలే కాకుండా - మన చుట్టూ ఉన్న వారిని కూడా ఎదిగేలా చూడడం / చెయ్యడమే అసలైన మానవత్వం. దీనికి నిలువెత్తు నిదర్శనం బోయి భీమన్న.

భారతదేశంలోని "భిన్నత్వంలో ఏకత్వం" లాగానే భీమన్న రచనలలో ఆ లక్షణం కన్పిస్తుంది.

ఈయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది.

భీమన్న గారు తన జీవితాంతం జాతీయవాది గానే ఉన్నారు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన, దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష కల్గిన వ్యక్తి - భీమన్న గారు.

పేదరికంతో పాటు, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలను అనుభవించిన వ్యక్తి బోయి భీమన్న.

వేదకాలంలో కులం వారి గుణాలను బట్టి, తరువాత వారు చేసే వృత్తులను బట్టి విభజిం చారు. కానీ వాటి మధ్య హెచ్చుతగ్గులను, వర్ణ వ్యత్యాసాలను, వివక్షతను గురించి చెప్పలేదు.

యథేమంవాచం కళ్యాణీవధజనేభ్యః
బ్రహ్మరాజన్యాభ్యం శూద్రాయ

చర్యాయచ స్వయచరగాయ - యజుర్వేదం.

భావం : నేనే ఏ విధంగా ఈ కళ్యాణ వాక్కులను బ్రహ్మ మొదలు శూద్రుల వరకు సర్వ మానవులకు చెప్పానో నీవు అలానే చెప్పాలి.

పై విధంగా కులాల గురించి మన శాస్త్రాలు, వేదాలు బోధిస్తే, మన నేటి సమాజం మాత్రం తన స్వార్థం కోసం కులాగ్నిని ప్రజ్వలిస్తున్నారు. సంకుచితమైన నేటి కుల వ్యవస్థ శాస్త్రీయం కాదు.

భీమన్న గారి గొప్పతనం చెప్పాలంటే పదాలు సరిపోవు. కానీ ఒక్క మాటలో ఆయన విశిష్టతను చెప్పుకుంటే 'పాలేరు' నుంచి పద్మశ్రీ వరకు

దళితులు పక్షాన సాహిత్య రచనలు చేసి, వారి యొక్క మాన, ప్రాణ గౌరవాలకు అర్ధాన్ని ఇచ్చి, అద్దం పట్టిన మహాకవి భీమన్న గారు.

సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కారనీ, మంచి వాళ్లూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. పాలేరు నాటకంలో 'వనబాల' పాత్ర ద్వారా మనకు ఈ విధానాన్ని చూపించాడు.

నిష్కళంకమైన ప్రేమకు సాంప్రదాయం ఎలా అడ్డంగా మారుతుందో వివరిస్తూనే, ఆ ప్రేమలో నిజాయితీ ఉం అన్నింటినీ జయిస్తుందని నిరూపించారు భీమన్న గారు.

కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు తోడ్పడతా యని అభిప్రాయపడ్డారు.

గురజాడ వారు చెప్పినట్లు మతములన్నీయు మాపిపోవును జ్ఞానమొక్కటి నిలిచియుండును. వేల ఎరుగని ప్రేమబంధము కావాలన్నాడు ఎల్లలోకములు ఒక్క ఇల్లయి - మతము లెల్లకల్లయి అను భావనను స్ఫురించాడు మన భీమన్న గారు.

ఏడాదికి ఒకసారి దళితులు 'గుడిసెలు' ఎందుకు 'కాలిపోతున్నాయో' అని ఆలోచించాడు. చీమలను - శ్రామిక దళితులుగా, పాములను కుల దోపిడీ దారులకు ప్రతీకకగా వర్ణించారు భీమన్న గారు.

'కూలిరాజు' నాటకంలో కులంతోపాటు ఆర్థికాం శాల్ని కూడా స్పృశించారు.

'ధర్మం కోసం పోరాటం'లో బహుజనులు అందరూ రాజ్యాధికార దిశగా పయనించడానికి సూచనలు చేశారు కవి. వాల్మీకి, వ్యాసుడు, ధర్మవ్యాదుడు దళితులేనని వాదిస్తూ భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించు కోవలసిన అవసరం ఉంది.

హింసావాదానికి - భీమన్న వ్యతిరేఖి.

పాలేరు నాటకం ముందుమాటలో భీమన్న ఇలా రాశారు.

'భారత్‌లో వర్ణ పద్ధతి లేదు. వర్ణ వ్యవస్థ అంటే కుల వ్యవస్థ ఇక్కడ కులాలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి.

అంబేడ్కర్ గారి భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న గారి సాహిత్యం.

సామాన్య ప్రజల పట్ల కలం పట్టి, వారి పక్షాన గళం విప్పిన మహానుభావుడు. తాడితులు, పీడితులు, మూఢులు, అభాగ్యులు తిండికి, గుడ్డకు నోచుకోలేని ఊరవతల ఇళ్ళు కట్టుకుంటూ, సమజాంలో కనీన గౌరవాన్ని, సాధారణ గుర్తింపును కూడా నోచుకోలేని మనుషుల పట్ల కలం పట్టి వారి జీవితాన్ని వెలుగు నింపిన భీమన్న గారు. - అమరుడే !!!

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"మానవతా విలువలకు నిలువుటద్దం - గుడిసెలు కాలిపోతున్నై"

- డా॥. పెండ్యాల లావణ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

- డా॥. బూసి వెంకటస్వామి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత బోయి భీమన్న. బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో నాగమ్మ పుల్లయ్య దంపతులకు జన్మించారు. వీరు మొత్తం 5 మగ పిల్లలు, ఒక అమ్మాయి. వీరి తండ్రి గారు అందరికి పంచపాండవుల పేర్లతోనే పిలిచేవాడు. భీమన్న రెండవ సంతానం. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకకు మిక్కిలిగా గౌరవ, సన్మానాలను అందు కున్నారు. అటువంటి భీమన్న పేదరికంతోపాటు, అంట రానితనం దురాచారాలు కూడా చిన్నప్పటినుండి అనుభవించారు. సహజంగానే భీమన్న వీటన్నింటిని నిరసించాడు. అంబేడ్కర్ రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. భీమన్న పద్య, గద్య, గేయ, వచన రచనలతో నాటకాలను కూడా వ్రాశారు. భీమన్న తన పుస్తక పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. భీమన్న ఏ రచన చేసిన అందులో పాఠకుడికి క్రొత్త ప్రతిపాదల్ని, కొత్త సిద్ధాంతాల్ని చెప్తున్నట్లుగా ఉంటుంది.

వీరు ఆకాశవాణిలో అనేక భావగీతాల్ని ప్రసారం చేశారు. వీటన్నింటితోపాటు అంబేడ్కర్ వ్రాసిన అనేక రచనలను తెలుగులోకి అనువదించడంతోపాటు ఆయన వ్యక్తిత్వాన్ని జీవితాన్ని కీర్తించారు. భీమన్న రాసిన "జయ.. జయ...జయ.. అంబేద్కర్! దళితులకు జాతీయ గేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతుంది.

భీమన్న రచనలన్నింటిని విశ్లేషిస్తేగాని, వీరి సమగ్ర సాహిత్య దృక్పథం స్పష్టం కాదు. రచయితల దృక్పథాన్ని అంచనా వేయాలంటే వివిధ పరిణామాలుగా సాగిన రచనలన్నింటిని స్పృశించగలిగినపుడే అది సాధ్య మౌతుంది. భీమన్న రచనల్లో దళిత పదాన్ని ప్రయోగించ లేదని దాన్ని వ్యతిరేకించాడని, భారతదేశంలో కులం లేదన్నాడని, ఆయన వర్గాన్నే సమర్థించాడని కులం గురించి వ్రాయలేదని వక్రీకరించే వాళ్ళని చూసిన తర్వాత ఆయన సాహిత్య దృక్పథాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. భీమన్న రచనలపై అనేక పరిశోధనలు, సదస్సులు నిర్వహించారు. అయితే వీటన్నింటికీ బోయి భీమన్న భార్య బోయి హైమావతి కథాత్మక శైలిలో వ్రాసిన "పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న" గ్రంథం వీరి సాహిత్య దృక్పథాన్ని తెలిపే చుక్కానిలాంటిది.

భారతదేశ గొప్పదనం 'భిన్నత్వంలో ఏకత్వం' అటు వంటి ఏకత్వ లక్షణాలు భీమన్న రచనల్లో కనిపిస్తాయి. భీమన్న కులమతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది. భారత జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలోని కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాలి అంబేద్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసింది అదే! భీమన్న జీవితాంతం జాతీయవాదిగానే మిగిలిపోయారు.

బోయి భీమన్న గారి రచనలలో జాతీయ పునర్నిర్మా ణాన్ని స్మరించిన కావ్యం "గుడిసెలు కాలిపోతున్నై" కావ్యం. ఈ కావ్యంలో అవినీతి, పక్షపాతం, వర్ణ వ్యవస్థను విలక్షణంగా తీర్చిదిద్దారు. కులాలు, మతాలు వంటి వాటికి నిలయమైన నేపథ్యంలోనే జాతీయతకు విభేదం వాటిల్లుతుందని వివరించారు. 'మతం' అనే పిచ్చి వదులుకోవాలన్నారు. నవ సమాజంలో జాతీయ పునర్ని

ర్మాణం జరగవలసి ఉండగా గుడిసెలు కాలిపోతున్నా యన్నారు. వీరు పునర్నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలతో 'గుడిసెలు కాలిపోతున్నై' రచన చేశారు. ఈ రచనకు 1975వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. యుగాలు మారు తున్నాయి. యుగాలు మారుతున్న తీరుబట్టి మతం మారాలి. మార్పును అంగీకరించి మతం నిర్దిష్టమైన భావజాలంతో చలామణి అయితే అది మానవుని పురోగతికి ఆటంకాన్ని కలిగిస్తుంది. మానవ పరిణామ క్రమంలో కొన్ని విశ్వాసాలకులోనై కల్పించుకున్నదే మతం. మారుతున్న కాలనుగుణంగా అవే మత నియమాలు పాటించకూడదు. ఋగ్వేదకాలం నుండి హిందూమతం వర్ణవ్యవస్థకు కారణమైన శూద్రుల జీవితాన్ని జాతి ప్రధాన జీవన స్రవంతికి వెలుపలనే ఉంచేసింది. ఆ సమయంలో మత నియమాలు ఉల్లంఘిస్తే కఠినశిక్షలుండేవి. పురాణకాలం నుండి నేటి వరకు కూడా ఈ వర్ణ వ్యవస్థలో మార్పు రావలస్సిందిపోయి కులగజ్జితో మనుషులు రగిలి పోతున్నారు. ఎవడికులం వాడికి గొప్ప. అయితే ఇక్కడ నా కులమే గొప్పంటాడు. దీనితో గొడవలు చెలరేగి చరిత్రలో కులం వల్ల చిందించినంత రక్తపాతం మరే సంఘటన వలన చిందలేదంటారు. ఇది సామాజిక విప్లకారుల అభిప్రాయం. మతం ఆచరణ సాధ్యంకాని ధర్మాలను బోధిస్తుంది. అసలు మతం అవసరమా ఇంతమంది దేవుళ్ళు ఎందుకని భీమన్న ప్రశ్నిస్తున్నాడు.

'బరే రాం రహీం జాన్ నాయుడు శాస్త్రీ
మన కల్తీ పురపు జమిందారు గారు
దేవుడు గారు ఈ పూట ఇక్కడే తింటారు
కాళ్ళకు టించరైడిన్ ఇచ్చి
స్నానానికి పినాయిల్ తోడు'

(కల్తీ రాజ్యపు దేవుడు గారు, పుట : 3)

భీమన్న స్వచ్ఛమైన మతం లేదని అంతా కల్తీమయమైందని మత పిచ్చిలో కొట్టుకులాడే వాళ్ళని శరీరంతోపాటు మనసులను కూడా టించర్, ఫినాయిల్‌తో శుభ్రం చేయాలన్నారు.

మత పిచ్చితో మానవత్వం మరచిపోయిన వాళ్ళకోసం భీమన్న మతం ఒక పిచ్చి అని సంబోధించారు.

"ఓరి, మూర్ఖుడా మతం విషంరా, విషం!
నల్లమందన్నా డెవడో, అది అబద్ధం!
మతం విషం, ఆత్మనే చంపుత్ను విషం
నానా విషాలు కలిపిన కషాయం
అమృతం అవుతుందా, బాబూ?"

(మతం ఒక పిచ్చి, పుట : 9)

మతం మత్తు కన్నా మానవసేవే మాధవసేవ అని గుర్తించినప్పుడే ఈ సమాజంలో నవ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. మనిషి విచక్షణను చంపేసేది మతమని, అది మానవ భావన నుండి తొలగించాలని భీమన్న కోరుకున్నారు. ఎప్పుడైతే మతం పిచ్చిలో నుండి మనిషి బయటపడతాడో "మబ్బు విడిచిన సూర్యుడిలా మానవత్మా జాజ్వల మానమవుతుందన్నారు.

పురాణ పురుషుల్ని మతం మత్తు ఒక రకంగా చెప్పాలంటే పిచ్చిలో దేవుళ్ళను చేసింది. పురాణ పురుషు లందరు మానవులుగా జన్మించిన వారే అందరూ కూడా సాధక బాధకాలు ఎదుర్కొన్నవారే. తమ ప్రతిభా పాటవాలతో గడ్డు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించారు. ఆ విజయాల వెనుక వారి ఆలోచనా శక్తి, తార్కికబుద్ధి, సమయానుకూల ప్రవర్తన ప్రతిభావంతమైన శక్తి సామర్థ్యాలున్నాయి. అయితే వాటన్నింటిని ప్రక్కన పెట్టి మనంతట మనమే వాళ్ళం దరికి శక్తులున్నాయని భ్రమింపజేసుకుంటున్నాము. మనుషుల్ని దేవుళ్ళుగా కొలవడం సరియైనది కాదని భీమన్న గారి అభిప్రాయం.

ప్రతిభావంతుడైన ప్రతివాణ్ణీ
ఇలా పరమేశ్వరుణ్ని చేసేస్తూ
ప్రజల మధ్య నుండి తీసేస్తూ వుంటే
ఒక సామాన్యుడు పెరిగేదెలా?
సంఘాభ్యుదయం జరిగేదెలా?
దేవుడ్ని ఆదర్శంగా పెట్టుకోవడం

పులిని చూచి నక్కవాతలు పెట్టుకోవడం
(మనిషే మార్గ దర్శకుడు, పుట : 16)

మానవుడై పుట్టి మహాత్ముడిగా బ్రతికి మనుగడ చాలించిన ప్రతి గొప్పవాణ్ణి దేవుడిని చేసి దూరం చేయ కూడదు. నిజానికి మనిషికి మనిషే మార్గదర్శకుడు అవుతాడు కాని భగవంతుడు కాలేడు. అందుకే దేవుడిని ఆదర్శంగా పెట్టుకుంటే పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం లాంటిదని భీమన్న పేర్కొన్నారు.

ప్రపంచంలో ఎక్కడాలేని కులాలు భారతదేశంలో మాత్రమే ఉన్నాయి. హిందూమతం వికృత రూపమే కులం. మనిషి పుట్టిన తొలినాళ్ళలో కులం లేదు. అందరు సమభావంతో మెలిగారు. రానురాను మనిషి అభివృద్ధి దిశకు చేరువవుతూ అభ్యుదయ భావంతో మెలగాల్సింది పోయి తమ ఆధిపత్యం కోసం మూడు వర్ణాలను సృష్టించి ఏలారు. ఆ తరువాత మూడు కాస్తా నాలుగు వర్ణాలుగా చేశారు. ఇంకొంచెం పిచ్చితో ఐదో వర్ణంగా పంచమ వర్ణాన్ని సృష్టించారు. నేడు నాలుగు వేల కులాలతో భారత సమాజం 'కులమతాల ఉమ్మడి కాష్ఠం'గా మారిపోయింది. కులాల కారుచిచ్చు మనిషిలో విచక్షణను కోల్పోయేలా చేసింది. అస్పృశ్యతకు బీజాలు ఏర్పడ్డాయి.

"ఒరే, మానవుడా, మూర్ఖుడా, బుద్ధిహీనుడా!
అలా చూడు, ఆ శ్మశాన కాష్ఠ జ్వాలలు!
మానవుడొకడే, మానవత ఒకటే!
ఆ ఉమ్మడి అగ్ని సంస్కార జ్వాలలు
కులమత వృత్తి విభేదాలకు అంత్యక్రియలు
నేర్చుకో అనుభవం నుంచి
మార్చుకో దుస్తులు"
(కులమతాల ఉమ్మడి కాష్ఠం, పుట : 14)

భీమన్న గారు కుల పిచ్చితో రగిలిపోయే వాళ్ళందరికి స్మశానంలోని దహన జ్వాలలు చూడమన్నాడు. కులపిచ్చితో ఎంతగా ఎగిరిపడ్డావో అంతగా అగ్నిజ్వాలల్లో కలిసిపోవాల్సిందే. ఎంతగా మిడిసిపడినా చివరకు మిగిలేది బూడిదే అని వివరించారు. కాలే కట్టెలకు ఏ మినహాయింపు లేదు కాలి బూడిద కావల్సిందేనన్నారు.

ప్రతి గుడిలో దేవుడు లేనట్టే గుడిలోని ప్రతిమలో జీవం లేదు. ఉన్నవన్నీ ఏళ్ళనాటి శిథాలావశేషాలేనని భీమన్న అభిప్రాయం. ఎవరు ఏది చెపితే అది నమ్మే గొర్రెలాంటి ప్రజల్ని ఈ నిజం తెలుసుకోమన్నారు.

ఇదిగో మళ్ళండిటు!
ఇదీ మోక్షమార్గం
కుల, మత, వర్ణ, వర్గ విముక్తమైన
విశ్వైక మానవతా మార్గం!
అరుణ తరుణ గుణ వర్ధీయులకు ఆనంద రసాద్వైం
(ఇదిగో మోక్షమార్గం, పుట : 36)

ఏ సమాజంలో అయితే కుల, మత, వర్ణ, వర్గ భేదాలు లేకుండా మనుషులంతా సమానంగా బతుకుతారో అక్కడ మానవత్వం వెల్లివిరుస్తుందన్నారు. మతానికి, దేవుడికి, భక్తికి కట్టుబడి పోయినంతకాలం ప్రజలు మేలుకోలేరు. కొన్ని యుగాలుగా మనుషులు మతం, దేవుడు, భక్తి ఈ మూడు విషయాలు దృష్టిలో పెట్టుకుని మానవత్వం మరిచి మత్తు, మోసాల్లో బతికేస్తున్నారు. అందుకే భీమన్న గారు మతం నుంచి, దేవుడి నుంచి, భక్తి నుంచి విమోచన పొందవలసిందిగా నేను ప్రజల్ని కోరుతున్నాను (పీఠిక, దండోరా, పుట : 8). ఈ మాటల వలన బోయి భీమన్న గారు నాస్తికుడు కాదు. తన లాగా ప్రతి వ్యక్తిలోను విశ్వ చైతన్యశక్తిలా ఉండాలంటారు. ప్రతిమల్ని ఆరాధించే కంటే ప్రకృతినే ప్రేమించాలంటాడు కవి. ఈ వైషమ్యాలకు తావులేని సమతా ధర్మాన్ని ప్రకటించిన వేద వ్యవస్థ వైపుకు మళ్ళాలన్నారు.

సమాజంలో పేరుకుపోయిన స్వార్థ పూరిత రాజకీయ వ్యవస్థలను తర్కిస్తూ భీమన్న అవినీతి, లంచగొండితనం, పక్షపాత వైఖరి, హిపోక్రసీలు నిర్మూలింపబడిన రోజున జాతీయ పునర్నిర్మాణం సాధ్యమౌతుందన్నారు. స్వార్థపూరిత రాజకీయ నాయకులు పేదవాళ్ళ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లేనిపోని ఆశలు కలిగించి ఓట్లు

దండుకుంటున్నారు. గుడిసెల్లో ఉండేవాళ్ళకు రాజకీయ నాయకుడు ఈసారి తాము అధికారంలోకి వస్తే పక్కా ఇళ్లు కట్టిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి వెళ్ళిపోతారు. పేద ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తారు. ప్రజల ఓట్లతో గెలిచిన రాజకీయ నాయకులు గుడిసెల వైపు కన్నెత్తి చూడడు. ఎవరైనా వెళ్ళి అడిగినా ఏవో సాకులు చెప్పి తప్పించుకుంటారు. ఐదేళ్ళ పాలన ముగుస్తున్న తరుణంలో పేదోళ్ళ గుడిసెలు వాటంతటవే కాలి పోతాయి. నిప్పురాజేసిన వాళ్ళ గురించి పెద్దగా చెప్పనవసరం లేదు. రాజకీయ నాయకులు మళ్ళా వచ్చి ముసలి కన్నీళ్ళు కార్చి గుడిసెలు పునర్నిర్మాణానికి ధన సహాయం చేసి ఓట్లు దండుకుంటారు.

"గుడిసెలు కాలిపోతున్నై !
ఓహో కాలిపోతున్నై !
.....
.....
ఈ గుడిసెలు
ఏడాదికొకసారైనా కాలిపోతుంటై
అదే ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు మళ్ళీమళ్ళీ అవతరిస్తుంటై
పోతుంటై
పుట్టుకొస్తుంటై"

(గుడిసెలు కాలిపోతున్నై, పుట : 1)

ఇలా ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ఏదో ఒక స్వార్థంతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటున్నారు. అయితే విసిగెత్తిపోయిన పేదోడు ఎదురు తిరిగితే రాజకీయ నాయకుడి పరిస్థితి ఆలోచించుకోవాలి. కాని పేదరికం అడ్డుపడి పేదవాళ్ళు సుకుమారంగా సమాధానలు చెప్తారు.

"మీ రొక్కరు
మేం లక్షా పదివేల వోటుకాగితాలం !
మా వోట్లన్నీ మీకేనండి
మా గుడిసెలన్నీ మీవేనండి
ఓ, మా వాళ్ళకు తిక్కరేగాలే గాని
ఒకే గుద్దడం గుద్దిపారేస్తారు
ఇక వెళ్ళి రండి, బాబు !
మేం ఇంకా గంజికాచుకో లేదు"

(గుద్దిపారేస్తాం, పుట : 2)

పేదవాడికి ఓటు ఉండడం మహాపాపం. ఎందుకంటే పేదోడి ఓటు వాడికిష్టమైన విధంగా వేసుకోవడానికి లేదు. పేదోడు ఎవరికింద పనిచేస్తున్నాడో ఆ యజమాని తరపు వాడికో, లేదా బెదిరించే వాడికో వేయాలి. ప్రజాస్వామ్య దేశంలో 'ఒకే ఓటు - ఒకే విలువ' అయితే ఫ్యూడల్ వ్యవస్థలోని బానిసలకు ప్రజాస్వామ్య వ్యవస్థలోని ఓటర్లకు తేడా లేదు.

అది మా పాలిట శని ప్రభూ !
ఒక ప్రక్క రకరకాల జెండాల వాళ్ళు
మరో ప్రక్క ఊరి కామందుల వాళ్ళు
ఈ ఓటు అమ్మోరు కోసం
మా ప్రాణాలు తోడేస్తున్నారు
మా గుడిసెలు తగలబెట్టిస్తున్నారు
బానిసల కుండే సుఖశాంతులు సైతం
మాపేద ఓటర్లకు లేవు మహాప్రభో

(బానిసల జాబితా, పుట : 12)

రాజకీయ నాయకులు మంచి అనే ముసుగులో పేద ప్రజల్ని దోచుకుంటున్నారు. అహర్నిశలు పేదవాళ్ళను అనేక రకాలుగా ఇబ్బందులు పాలుచేస్తున్నారు. ఈ దోపిడీ ఒక్క రాజకీయ నాయకుడితోనే ఆగిపోదు. ఇది నిరంతర ప్రక్రియ. దోచుకున్నోడికి దోచుకున్నంతగా పేర్కొంటారు. అయితే ఇక్కడ భీమన్న ప్రజలు పూర్తిగా వెనుకబడి పోవడానికి ప్రధాన కారణం పైరవీ ప్రభువులే అని పేర్కొన్నారు.

జాతి మొత్తం అభివృద్ధి పథంలో పయనించక పోవడానికి ప్రధాన కారుకులు స్వార్థపరులు. స్వార్థపూరితులు ఎప్పుడైతే రాజ్యమేలుతారో అక్కడ

అభివృద్ధి కుంటుపడుతుంది. అభివృద్ధి కుంటుపడిన సమాజం ఎప్పటికీ రాణించలేదు. ఏళ్ళ తరబడి ఇదే తంతు దేశంలో సాగుతుంటే గుడిసెలు ఎన్నికల సమయంలోనే మళ్ళీ మళ్ళీ కాలిపోవడానికి తయారై పోతాయి. ఇది ఒక వలయం నిరంతరం జరుగుతూనే ఉంటుంది.

"అదే మన ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై
పోతుంటై
పుట్టుకొస్తుంటై
ఈ విష వలయం సాగడం ఎంత వరకు
రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు"
(గుడిసెలు కాలిపోతున్నై, పుట : 2)

సమాజంలో మతం, కులం, సామాజిక దోపిడీ, రాజకీయ అణచివేతలు, కారణంగా బడుగు వర్గాల ప్రజలు నిలదొక్కుకోలేకపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో సహాయ సహకారాలు అందకపోవడం, వార్షిక ప్రణాళికల్లో చూపిన లెక్కలు అభివృద్ధి కాగితాలకే పరిమితమై పేదవాడి గుమ్మాలకు చేరకపోవడం. సమస్యలకు నిర్మాణాత్మకమైన నిర్మూలన లేకపోవడం వలన, జాతి యావత్తు పతనావస్థకు చేరుకుందన్నారు. అందుకే భీమన్న సామాన్య మానవుడ్ని సైతం ఆలోచింపచేసే విధంగా రచనలు చేశారు. వీరి రచనల ద్వారానైనా కొంతలో కొంత మార్పు చెందిందనే భావించాలి.

ముగింపు :

భీమన్న మతం, వర్గం, స్వార్థం లేని సమాజం ఎప్పుడైతే సాక్షాత్కరిస్తుందో అప్పుడు ప్రతి మనిషి కూడు, గుడ్డ, నీడకు ఏ లోటు లేకుండా జీవిస్తారన్నారు. సామాజిక జీవితంలోని అన్ని రంగాలు నైతికంగా పతనమైయ్యాయి. భవిష్యత్తులో భారతజాతి, జాతీయతకు విఘాతం కలిగించే విధానాలు అనుసరించడం వలన జాతీయ నిర్మాణం కుంటుపడుతుందన్నారు. అస్థవ్యస్థంగా ఉన్నా వ్యవస్థకు జాతీయ పునర్నిర్మాణం దిశగా తీసుకెళ్ళే ఒక వారధిగా భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటి నొక్కి చెపుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాతికేళ్ళ జాతి జీవన గమనం ఈ రచనలో సాక్షాత్కరిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. గుడిసెలు కాలిపోతున్నై, బోయి భీమన్న, విశాలాంధ్ర పబ్లిషర్స్.
2. అంతర్జాలం ఆధారంగా తీసుకున్న విషయ సేకరణలు.

❁❁❁

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సమకాలీన సామాజిక స్పందన బోయి భీమన్న పిల్లి శతకం

– డా॥. కె. రమేశ్, సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

బోయి భీమన్న 1911 సెప్టెంబరు 19న తూర్పు గోదావరి జిలా మామిడికుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో జన్మించాడు. ఇతని తల్లిదండ్రులు నాగమ్మ, పుల్లయ్య వీరికి పంచపాండవుల వలె ఐదుగురు కొడులుకు, ఒక ఆడపిల్ల జన్మించారు. పుల్లయ్య తన మగపిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టాడు. భీమన్న తండ్రి పుల్లయ్య అద్వైతి, వేదం తెలిసినవారు. కులమత భేదాలు లేని సీతారామయ్య వద్ద పాలేరుగా తండ్రి పని చేయడంవల్ల, ఆయన వద్దనే భాగవతంలోని పద్యాలను పల్లయ్య నేర్చుకున్నారు. తల్లి జానపద గాయిని కావడంవల్ల ఊయల పాటలు, తుమ్మెద పాటలతో భీమన్నను నిద్రపుచ్చేది. దళితులలోనే కాక పల్లె జనుల్లో కూడా పల్లయ్య, నాగమ్మ దంపతులు మంచి గౌరవ మర్యాదలు పొందారు.

భీమున్న బాల్యం నుండే సాహిత్యంపట్ల మక్కువ చూపాడు. చిన్నతనంలోనే రామాయణ, భారత భాగవతా లతోపాటు వేమనలను బాగా చదివాడు. కాబట్టి భీమన్నపై పోతన, వేమనల ప్రభావం అమితంగా ఉంది కాబట్టే నేను హేతువాదిని, మానవతావాదిని. నాకు మానవుని లోని అభ్యుదయంపై పూర్తి విశ్వాసమున్నది. దేవున్ని నమ్మను, పరమాత్మను నమ్ముతాను. దేవుడు వ్యక్తిగత మైనది. పరమాత్మ ప్రపంచకమైనది. సత్యం. సత్యమే భగవత్స్వరూపం" అని తన తాత్విక దృక్పథాన్ని తెలిపారు. వీరు రచించిన 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. 2001లో భారత ప్రభుత్వం భీమన్నను పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2005 డిసెంబరు 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

బోయి భీమన్న ప్రధానంగా సాహితీ వేత్తగా పేరు గడించినప్పటికీ రాజకీయ వేత్తగా, సంఘ సంస్కర్తగా, సాంస్కృతికోద్ధీపకులుగా కూడా గుర్తింపు పొందారు. తెలుగు సమాజంలో విశిష్ట వ్యక్తిత్వంగల మంచి మనిషిగా, పండితుడుగా, రచయితగా తన ప్రత్యేకతను నిలుపు కున్నాడు. ఆయన ఇంగ్లీ షులో 'The Seventh Season%' అనే కవితా సంపుటిని రాశారు. ఆయన సాహిత్యంలో పద్యం, గద్యం, గేయం, శతకం, నవల, నాటకం, వచనం వంటి ప్రక్రియలను స్పృశించాడు. భీమన్న పాత్రికేయుడుగా, అనువాదకుడుగా, రాజకీయ వేత్తగా అనేక రంగాలలో అపారమైన అనుభవం గడిం చాడు. ఆయన తాత్వికుడు, సోషలిస్టు, హేతువాది, అన్నిటినీ మించి మానవతావాది. "పూవు పుట్టగానే పరి మళిస్తుంది" అన్నట్లుగా, మహాకవి శ్రీనాథ సార్వభౌముని వలె 'చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే' అన్నట్లుగా అంటే 5వ తరగతి చదువుతున్నప్పుడు 'శార్దూలం'ను రాసి, తన భావి రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టాడు.

బోయి భీమన్న రచనలు :

బోయి భీమన్న ప్రముఖ రచయిత. సుమారు 70 పుస్తకాలు రాశాడు. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశాడు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్ని కొత్తప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక గీతాల్ని వ్రాశాడు. వీటన్నింటితో పాటు అంబేడ్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ పాటలు రాశాడు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేడ్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

వ్యాస ఉద్దేశ్యం :

పిల్లీ శతకం 1967 మేలో ప్రకటింపబడింది. భీమన్నే దీనికి విపులమైన పీఠిక రాశారు. పిల్లీ శతకంలోని పద్యాలు కొన్ని దేవులపల్లి పర్యవేక్షణలో ఆకాశవాణి నుండి రసహృదయాలకు చేరాయి. వాణి, భారతి పత్రికలు దీన్ని ప్రశంసించాయి. మనిషి హృదయాన్ని తమోగుణం ఆవేశించడం వల్ల, అతడు స్వార్థపరుడై సిరినంపదలు, బిరుదులు, పదవులు, సత్కారాలు, పురస్కారాలు ఆశించి ప్రతిభావంతుల్ని ఎప్పటికప్పుడు అణిచివేసి, ఎప్పటికప్పుడు వేషాలు మార్చి మోసాలు నేర్చి, నాటకాలాడుతూ, లోకాన్ని నమ్మిస్తున్నాడని భీమన్న పీఠికలో వివరించాడు. ప్రతిభను అణచివేసే దుశ్చర్యను, ప్రజల శ్రేయస్సును పీల్చివేసే దుర్మార్గాన్ని భీమన్న పిల్లీ శతకంలో నిరసించాడు. ప్రతిభ, భావ స్వాతంత్ర్యం మనిషికున్న శ్రేష్ఠమైన వరాలనీ, వాటిని గుర్తించి, ప్రోత్సహించవలసిన బాధ్యత సమాజానిదని కవి స్పష్టం చేశాడు. నాటి సుమతి శతకర్త భీమన్న, నేటి పిల్లీ శతకకర్త. భీమన్న రూపాన అవతరించాడన్న పండితాభిప్రాయాన్ని అంగీకరించి. బోయి భీమన్న నాటి భీమన్న నేటి నేనేమో, నాటి సుమతి కౌటిల్యం బలిసి పిల్లి అవటం జరిగిందేమోనని, ఎందుకు కాకూడదని సమర్థించుకున్నాడు. పిల్లీ శతకాన్ని చదివినా, విన్నా, చంకను పెట్టుకున్నా దోషాలన్నీ తొలిగిపోతాయని ఫలశ్రుతిని భీమన్న శతకంలో తెలిపాడు. ఈ శతకంలో మకుటం పిల్లి. ఈ శతకంలో తెలిపినట్లు మానవ ప్రవృత్తి, సమకాలీన సమాజ పరిస్థితులను, బడుగు బలహీన వర్గాలు ఏ విధంగా అణచి వేతకు గురవుతున్నాయో చిత్రించడంతోపాటు నీతి, రాజకీయం, మానవ సంబంధాలు మొదలయిన వాటిని అధిక్షేపంగా, వ్యంగంగా, హాస్యోక్తంగా ఇందులో తెలియజేశాడు. ఈ వ్యాసంలో భీమన్న రచనా వైవిధ్యాన్ని విశదపరచడమే వ్యాస ఉద్దేశ్యం.

సమానత్వం :

వినదగు ఎవ్వరు చెప్పిన
విని ఆ చెప్పిన యతండు వేరే కులమా
మనకులమా అని చూడక
మనిషని గుర్తించు వాడే మనుజుడు పిల్లీ

పైపద్యంలో భీమన్న మంచి మాటలు. సూక్తులు ఎవరు చెప్పిన వినాలి కాని చెప్పినవాడు మన కులమా వేరే కులమా అని చూడకూడదు. అంటూ సర్వమానవ సమానత్వం పాటించాలని చెప్తూ తోటి వారిని కులాలతో వేరు చేయవద్దు అంటూ వారిని కూడా మనుషులుగా గుర్తించాలని కోరుకున్నాడు. దీనికి కారణం సమాజంలో అండరూ సమానమే అనే భావన లేకపోవడమే.

భీమన్న రసజ్ఞత :

అల్లన తక్కుచు తరచు
మెల్లన మ్యావనుచుమనను సమీపించుటకున్
చెల్లునె యెవ్వరికిని?నా
ఇల్లాలికి నీకు తప్ప ఇలలో పిల్లీ

పైపద్యంలో కవి రసజ్ఞత కనబడుతుంది. భార్య భర్తల దాంపత్యాన్ని, సన్నిహితాన్ని వర్ణించాడు. అంతేగాక భార్య తర్వాత నిర్మలమైన మనస్సున్న నీ లాంటి పిల్లికి తప్ప మరేవ్వరికి చెల్లును ఇలా ప్రేమగా దగ్గరకు చేరడం. ఇక్కడ దాంపత్య సన్నిహిత్య సన్నివేశాన్ని వర్ణించాడు .

నీతులతో, బూతులతో
భూతలమును మార్చలేవుబీ పుష్టిగ భూత
ప్రీతి యొనర్చుటే మార్గము
మేతకు మించినది లేదు మేదిని పిల్లీ

ఈ సమాజాన్ని నీతులతో, బూతులతో మార్చలేవు ఎందుకంటే సమాజంలో రాక్షసత్వం, అమానవీయత, లంచగొండితనం నిండుకొని పోయింది. దీన్ని మార్చాలంటే భూత వైద్యమే చేయాలని సూచిస్తున్నాడు.

వ్యంగ్యం :

ప్రాచుర్యము కోసరమై
ప్రాచీనపు గ్రంథములకు పండితుడేవో
మాచికలు వేసి తవను
వాచకములు లేవె! బ్రతుక వసుధన్

పై పద్యంలో పేరు ప్రఖ్యాతులకోసం కొందరు పండితులు ప్రాచీన గ్రంథాలకు మార్పులు చేసి వారి స్వంత రచనగా చెప్పుకొని కొందరు జీవిస్తున్నారని వ్యంగంగా వారిని గురించి కవి వ్యక్తపరిచాడు.

స్వార్థం :

వేదార్థమొకటి -యాజ్ఞిక
వేది, సభావేది. స్వహృహ వేదిన్ ఎన్నో
మాదిరుల భ్రష్టమైనది
ఏదైనను స్వార్థ జుష్టమేనే! పిల్లీ!

ఎప్పుడైతే మానవునిలో అవసరానికి మించి అత్యాశ కలుగుతుందో అప్పుడు వానిలో స్వార్థం మొదలవుతుంది. ప్రస్తుస్తుతం సమాజంలోని అని రంగాలలో, మనుషుల్లో స్వార్థం పేరుకొనిపోయి తనమన భేదం లేకుండా ఒకరికి ఒకరు మోసం చేసుకుంటున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశారు.

ఏదో ఒక స్వార్థము లే
కే దొరలును చెలిమిచేయ రెవ్వరితోనున్‌బీ
మీదెరిగి, కాలు గాలిన
మాదిరి తిరుగుటలు మాను మమ్మా! పిల్లీ!

పై పద్యంలో ఉన్నతులు, దొరలు స్వార్థము లేనిదే ఎవరితోను స్నేహం చేయరని చెప్తూ అది తెలిసే సమయానికి కాలుకాలిన పిల్లి వలే తిరగటం మానండి అని హితబోద చేస్తున్నాడు కవి.

ధర్మం :

కర్మయు క్రియయునె చాలును
ధర్మము కొనసాగ, కర్తదర్శనమేలా
చర్మాక్షుల కనువైదిక
మర్మము మాకిడేడు నీదే మహిమము! పిల్లీ!

సమాజంలో ధర్మం కొనసాగాలంటే కర్మ క్రియలు సరిపోతాయని కర్త దర్శనం ఎందుకని కవి తెలిపాడు. ఇక్కడ పిల్లి రూపంలోవైదిక మర్మాన్ని తెలిపాడు. పిల్లి ఎలాగైతే పాలను తాగి పారబోసి మనిషి వెళ్ళగానే మాయమవుతుంది. కాని అక్కడ జరగాల్సిన కార్య జరిగిపోతుంది. అలాగే ధర్మం నడవడానికి కర్త దర్శనం అవసరం లేదు అంటూ కర్మ క్రియ రెండు చాలునని అభిప్రాయాన్ని తెలిపాడు.

హితబోధ :

ఒద్దిక నుండుట, వేసిన
ముద్దను మాత్రమే తినుట, మరియు %--% ఇవియే
పెద్దల దయ సాధించెడి
విద్దెలు! ఇవి వద్దునీకు, వినవే! పిల్లీ

పెట్టింది తినడం, దొరికిన పనిచేయడం, అంతేగాక పెద్దల దయ వల్ల వచ్చే విద్యలుఇవన్నీ కూడ నీ ప్రతిభకు అడ్డంకులుగా మారుతాయి. నీకు నువ్వుగా సంపాదించుకున్న విద్యలే నీ ప్రతిభను విశ్వవ్యాప్తం చేస్తాయి అని మానవ సమాజానికి కవి హితబోధ చేశాడు.

బలహీన వర్గాలపై బలవంతుల పెత్తనం:
భయపెట్టెడి కుక్కలకే
భయపడుదురు, దేవుడేని భయపడరుసుమి
నయశాలియైనబీ కావున
భయపెట్టుము, పెత్తనములు పడయుము పిల్లీ!

పై పద్యంలో రావలసిన దాన్ని రాబట్టుకోవడానికి బలవంతులను సైతం ఎదిరించి రాబట్టుకోవాలని బలహీన వర్గాలకు కవి సూచించాడు. అంతేగాక వారిపై పెత్తనములు చేయాలని చెప్పాడు. బలహీన వర్గాలను దోపిడి చేస్తున్న పెత్తందార్లపై తిరగబడి సాధించుకోవాలని కూడా అధిక్షేపంగా సూచించాడు.

ఎలుక పయి పిల్లి, పిల్లిపై
ఎలుకను ఎక్కించు చెపుడు ఈ మనుజులు మీ
కులవైర మారనివ్వరు
కల హాశను లమ్మనరులు! కనవే పిల్లీ!

పై పద్యంలో మనుషుల కుటిల బుద్ధితోపాటు వాళ్ళు మనలో రగిలించే కుల వైరాలనుసైతం తెలిపాడు. వారు కులాల మధ్య ఎలా వైరం సృష్టిస్తారో దాని వల్ల

వారి పబ్బం గడుపుకొంటారని విమర్శించాడు. కుల వైరాలను లేకుండా లేని సమాజాన్ని కోరుకున్న ప్రస్తుత సమాజంలో బడా పెత్తందార్లు దాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నారు.

నూటికి తొంభై మందికి
కూటికి గుడ్డకును లేదుబీ కూర్చుంటావే
నోటికి తాళము వేసుక?
చాటింపుము వంటగదుల సవరణ! పిల్లీ!

సమాజంలో బడుగు వర్గాలకు ఇప్పటికీ సరైన భోజనం, గూడు లేని జీవితాలెన్నో ఉన్నాయి. ఇంకా అణగారిపోతున్న జాతులున్నాయి. వీరందరికీ కూడు. గూడు అందేలా గొంతెత్తి ప్రశ్నించాలని కవి సూచించాడు.

కుటిల బుద్ధి :

తనపదవులకోసము తన
అనుచరులను త్రొక్కియుంచి, అజ గళ దీర్ఘ
స్తనములు చూపుచు పోయెడి
మనుజుడె పో నీతిశాలి! మహిలో పిల్లీ!

సమాజంలో పక్క వారి అభివృద్ధిని చూసి ఓర్వలేని తనంతో ఇంకా తన స్వార్థ ప్రయోజనాలకోసమో తనమన, స్నేహిత అంటూ భేదం లేకుండా తోటి అనుచరులకే వెన్నుపోటు పొడిచే గుణం కలిగినవారు పెరిగిపోయారని చెప్తూ వ్యంగ్యంగా వారిని నిందిస్తూ అలాంటి వారే నీతిశాలని పేర్కొన్నాడు.

దొంగవలె దూకి ఎలుకను
భంగించెడి పనికి లజ్జపడనేలా? నీ
ముంగిటనె తోడి నరులనె
దొంగ బజార్లు తిండ్రు దొరలె పిల్లీ!
తన వారినె మోసముతో
తిని వేసెడి మనిషి కన్న దేవుడు నీకి
చ్చిన దానికి పరిమితమై
మనుగడ సాగించు నీవె మాన్యవుబీ పిల్లీ!

పై పద్యాల్లో సమాజంలో దొంగలందరు దొరలవలే బజార్లో ఎలా ఎగబడి తింటున్నారో అని తెలిపాడు. ఇక్కడ సమాజాని దోచుకుంటున్నారని తెలిపాడు. అంతేగాక తనవారినే మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నారని కవి అధిక్షేపించాడు.

కవి భుజగుడు కవి వృషభుడు
కవి పికుడని పిలువబడక కవి కాలేడా
కవితకు కాదా బిరుదులు
కవి బ్రతుకుకు తోకలమ్మ పిల్లీ

పై పద్యంలో కీర్తి కాంక్షకు, బిరుదులకోసం పరిగెత్తే కవులను గురించి అధిక్షేపించాడు.

మూఢనమ్మకం :

తిట్టుదురు ఎదురు వచ్చిన
కొట్టుదురు రపశకున మంచు, గొంకక నీకే
పెట్టుదురు పిల్లి శాపము!
మట్టి కదా నరుల మెదడు మహిలో! పిల్లీ!

మానవుల మూఢ నమ్మకాలలో ఒకటైన పిల్లి ఎదురు వచ్చినప్పుడు అపశకునముగా భావించడం వంటివి మూర?పుపని అంటూ దీన్ని నిందించాడు కవి. ఇలా పిల్లి ఎదురైతే అపశకునమనేది ఒక అభూతకల్పనే కాని శాస్త్రీయంగా ఇది నిరూపణకు నిలబడదని చెప్తూ దీన్ని నమ్మనవసరం లేదని తెలిపాడు.

స్వాతంత్ర్య సమావేశము
కై తరలెడు నపుడు నీవు కాదే యెదురై
జాతిపితకు జయ మొదగితి?
స్వాతంత్ర్యము మాకు నీ ప్రసాదమె, పిల్లీ!

పై పద్యంలో మూఢనమ్మకాన్ని నమ్మకూడదని తెలిపాడు. ఈ పైద్యంలో భారత స్వాతంత్ర్య సమావేశానికి వెళ్ళినప్పుడు జాతిపితకు పిల్లి ఎదురైన సంఘటనని గుర్తు చేస్తూ పిల్లి ఎదురైన కూడ శుభం కలుగుతుంది అని కవి భావన. కాని గుడ్డి నమ్మకాలను నమ్మకూడదని తెలిపాడు.

రాజనీతి :

కరపితివి పులికి విద్యలు

కరపవు చెట్టెక్కు టకటి గడుసుగ! నీ అ
బ్బురమైన రాజనీతికి
కరములు మోడ్చును జగాలు, కనవే! పిల్లీ!

లోక నానుడి అయిన పిల్లి పులికి విద్య నేర్పిందని కాని ఒక చెట్టు ఎక్కడం మాత్రం నేర్పలేదు. ఎందుకంటే పులి గుణం తెలిసిన పిల్లి కావచ్చు. చివరకు విద్య నేర్పిన పిల్లినే తినాలని చూస్తుంది పులి. అప్పుడు పిల్లి చెట్టెక్కుతుంది. పులి విస్మయంతో ఇది నాకు నేర్పించలేదు అంటే ఇది రాజనీతి అంటూ నువ్వు అన్నం పెట్టిన వారికే సున్నం పెట్టాలని చూసావు అంటుంది. ప్రస్తుత సమాజం కూడా ఇలానే ఉంది. ఈ కథ ఎలా ఉన్నా ఇక్కడ మాత్రం గొప్ప రాజనీతి కనబడుతుంది.

తిరుగుబాటు :

నిదురల కదిలిన నరునికె
బెదురుచు తుర్రుమను నీవె, పీకెదవు కనుల్
గది బెట్టి కొట్టినప్పుడు!
బ్రదుకు రహస్యమున కీవ బ్రహ్మవు! పిల్లీ!

'పిల్లి పులవుతుంది' అనే నానుడి ఇక్కడ మనం చెప్పుకోవచ్చు. నిజానికి పిల్లి చిన్న అలికిడి అయిన కూడ భయంతో పరుగెత్తుతుంది. కాని దాన్ని ఒక గదిలో వేసి కొట్టినప్పుడు మనపై దాడి చేసి ఓళ్లంతా రక్కుతుంది. కళ్ళు పీకెస్తుంది. అలాగే మన జీవితంలో కూడా ఎదైన సమస్య వచ్చినప్పుడు భయంతో కాకుండ ఎదురించి తిరుగుబాటు చేసి సాధించుకోవాలని కవి ఇక్కడ అధిక్షేపించాడు.

ఇంటి దొంగలు :

చేపల గంపకు పిల్లిని
కాపుంచిన యట్టు లనుచు కడు బల్కుచు, దా
సాపడుదురు దేవుని ని
క్షేపములను కూడ నరులు చెనటులు!పిల్లీ!

దొంగకు ఇంటి తాళములిచ్చినట్టు, చేపల గంపకు పిల్లిని కాపల పెట్టినట్టు ఈ సామెతలు చాల ప్రాచుర్యం పొదినాయి. అలాగే ఈ సమాజం కూడ దేవుని నిక్షేపాలకు నరులను కాపల పెట్టడం కూడా అలాంటిదే అని కవి చెప్తున్నాడు. ఇక్కడనే ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టలేనట్టు అనే నానుడి గుర్తుకువస్తుంది.

దోపిడి వ్యవస్థ :

ఎలుకయు పిల్లియు నొకటై
నిలిచినచో రైతు కొంప నీరై పోదా?
మెలకువ నీ కిటు కెరిగిన
తెలివియె పాలించు జగము! తెలియవె! పిల్లీ!

సమాజంలో దొంగలు, దొరలు, దోపిడి దారులు, దళారులు, గుత్తేదారులు ఇలా అందరు ఒకటైనప్పుడు ఆరుగాలం కష్టపడి పండించిన రైతు జీవితం నీరైపోదా అని కవి ప్రశ్నిస్తున్నాడు. ఇక్కడ ఉపాయం తెలిసిన వారే జగాన్ని పాలిస్తారని కవి అధిక్షేపించాడు.

దాంపత్య వర్ణన :

మా పక్కయింటి దంపతు
లే పొద్దును కీచులాడ్డ రేలో! ఏనా
డే పిల్లియు కుక్కయు నే
లోపమ్మున నట్లు పుట్టిరో కద! పిల్లీ
పిల్లికి చెలగాటము వలె
పెళ్ళానికి వేడ్క మగని పీడించుట! ఈ
పెళ్ళిళ్ళ తంతు లందుకె!
త ల్లగుటకు పెళ్ళియేల?తలపవె! పిల్లీ!

ప్రస్తుత కాలంలో సాంకేతికత, ఆధునికత, ఉద్యోగాల పేరుతో ఒకరికొకరు దూరంగా ఉండటం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకోలేక దాంపత్య జీవితంలో ఎల్లప్పుడూ గొడవపడుతూ జీవితం గడుపుతున్నారు. అలాగే భార్యలు భర్తలను వేధిస్తున్నారని కూడ తెలిపాడు. ఇలాంటి దాంపత్య జీవితం వద్దని ఎల్లప్పుడూ సంతోషకరమైన జీవితాన్ని గడపాలని కవి సూచిస్తున్నాడు.

ముగింపు :

పిల్లి శతకంలో భీమన్న సమకాలిన సమాజ పరిస్థితులతోపాటు సమాజంలో అణగారిణ వారిని

బలవంతులు ఏ విధంగా తొక్కిపడేస్తున్నారో ఇందులో విపులంగా తెలిపాడు. అంతేగాక ప్రతిభపాటవాలను కలిగిన వారిని కూడా అణగద్రొక్కిన సన్నివేశాలను కూడా వర్ణించారు. కీర్తి పురస్కారాలకు గడ్డితినే కవులను కూడా వ్యంగ్యంగా కవి విమర్శించారు. ఈ పిల్లి శతకం ఒక విలక్షణమైన రచనగా మనకు కనిపిస్తుంది.

ఉపయుకత గ్రంథాలు :

1. పిల్లి శతకం, బోయి భీమన్న, 1974, నాట్యకళ ప్రెస్, హైదరాబాద్
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి-2, 2015, డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
3. బోయి భీమన్న రచనలు -దళిత దృక్పథం (సదస్సు పత్రాలు), 2008, డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
4. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు, హైమవతీ భీమన్న, 2008, డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
5. పిల్లీ శతకం -దళిత దృక్పథం, కడప రమణయ్య, (సదస్సు పత్రాలు), 2008, డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
6. తెలుగెత్తి జైకొట్టు, శతాధిక తెలుగు సాహితీవేత్తల జీవితం- సాహిత్యం, సం. అనంతోజు మోహన్ కృష్ణ, 2019, నవతెలంగాణ ప్రింటర్స్, హైదరాబాద్
7. బోయి భీమన్న, నునావత్ రాంబాబు, తెలుగెత్తి జైకొట్టు, శతాధిక తెలుగు సాహితీవేత్తల జీవితం- సాహిత్యం, సం. అనంతోజు మోహన్ కృష్ణ, 2019, నవతెలంగాణ ప్రింటర్స్, హైదరాబాద్.
8. https://te.wikipedia.org/wiki/బోయి భీమన్న

బోయి భీమన్న పౌరాణిక నాటకాలు - హేతువాద దృక్పథం

- డా॥. రత్నశేఖర్ కట్టోగు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం,ఆంధ్రప్రదేశ్.

'నీ మనసే నీ దైవం, నీ ప్రజ్ఞే నీ ప్రగతి
నీవే నీ జాతి నిర్మాతవు
నీవే నీ సుఖశాంతుల కర్తవు' అంటూ మానవుడే అన్నిటికీ మూలమనే భావాన్ని, విధినీ, కర్మనూ నమ్మ వద్దని, మనసును జయిస్తే పురుషోత్తముడు అవుతాడనే విషయాన్ని మానవతావాద దృష్టితో బోయి భీమన్న తెలియజేశాడు.

తెలుగు సాహితీ లోకంలో కవిగా, నాటకకర్తగా, గేయ కర్తగా, పీఠికా రచయితగా, పత్రికా సంపాదకులుగా తనకంటూ ప్రత్యేకమైన విశిష్టమైన స్థానాన్ని సంపాదించు కున్న గొప్ప సాహితీవేత్త పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న. వీరు ఆరుపదులకు పైగా భిన్న ప్రక్రియల్లో రచనలు కొనసాగించారు. వీరు కావించిన కవితా సృష్టికి లభించిన అవార్డులు, రివార్డులు, బిరుదులు ప్రబల నిదర్శనాలు. వీరి రచనా వ్యాసాంగం చూస్తే సమాజంలోని హెచ్చుతగ్గులను, ముఖ్యంగా కులవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లు కనబడతాయి.

ఆ పరంపరలోనే పౌరాణిక నాటకాలు రాసినట్లు తెలు స్తుంది. రాగవాసిష్టం, వేదవ్యాసుడు, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాదుడు వంటి నాలుగు నాటకాలు రాశాడు. హేతువాద దృష్టితో ఆధునిక భావంతో రాసి అశేష తెలుగు ప్రజానికాన్ని మెప్పించాడు. ఈ రచనల్లో తనదైన నూతన శైలిని అణువణువునా ప్రతిఫలింపజేశాడు. ఆయన ప్రక్రియలన్నింటిలో పద్యమంటే ఎక్కువ ఇష్టమని స్వయంగా చెప్పుకున్నాడు. ఆయన దృష్టిలో పద్యం ఒక సుందరశిల్పంలాంటిది. ప్రాచీన కాలం నుండి పరంపరగా వచ్చిన పద్యం క్షీణించిపోతున్నదనే భావన ఆయనలో ఉంది. ఆ తరువాత గేయాన్ని, వచన కవితని అందిపుచ్చు కున్నాడు. ఆయన ఏ ప్రక్రియలో రాసినా తనకంటూ ఒక ప్రత్యేకతని వెలువరించి ఆంధ్ర సాహితీ వినీలా కాశంలో ధ్రువతారగా వెలుగొందాడు.

ఈ నాలుగు నాటకాలు సృష్టికి ప్రతిసృష్టిలా కని పిస్తాయి. ఎందుకంటే మన పౌరాణిక రచనలన్నీ ఒకే మూసలో కొనసాగాయి. వాటిని చదువుతుంటే పుక్కిటి పురాణాలనే భావన కలుగుతుంది. కానీ భీమన్న పౌరాణిక నాటకాలు చదువుతుంటే భిన్నమైన దృక్పథాన్ని ఏర్పరచి నట్లుగా, వాటిలో దాగున్న రహస్యాలను బట్టబయలు చేసినట్లుగా కనబడతాయి. సమాజానికి మార్పు అవసర మని, అది కేవలం యువత ఆలోచనవల్లే సాధ్యమని ఆయన రచనలు నిరూపించాయి. మనిషి ఆలోచనలే అభివృద్ధిపథంలోకి నడిపిస్తాయనే నగ్నసత్యాన్ని రచనల ద్వారా తెలియజేశారు. అందుకే అటువంటి నూతన సృష్టి ఒక్క భీమన్నగారికే సొంతమయింది. పౌరాణిక నాటకాల లోని హేతువాద భావాలను ముందుగా పరిశీలిద్దాం.

ఆదికవి వాల్మీకి :

ఈ నాటకంలో వాల్మీకి పాత్ర బాలవాల్మీకి, తరుణ వాల్మీకి, ప్రౌఢవాల్మీకి, వాల్మీకి అనే నాలుగు దశలుగా పేర్కొన్నారు. భీమన్న హరిజనులు ఆర్యులనే విషయాన్ని చెప్పే ప్రయత్నం ఈ నాటకం ద్వారా తెలియజేశాడు. బ్రహ్మ ఊర్వశి అందానికి మోహితుడై, మనోవికారానికి గురై రేతస్సు పతనమవగా అప్పుడు జరిగిన రసాభాసానికి, సిగ్గుపడుతూ ఆ రేతస్సుపై కాలితో మట్టినినెట్టి, దానిపై కాలిని అదిమిపట్టి ఉంచుతాడు. అంతలో బ్రహ్మ కాలి అడుగునుంచి ఒక కుర్రవాడు పుట్టి, ఇంద్రుడు, ఊర్వశి, అప్సరసల సమక్షంలో నాన్నా ఆకలి అంటాడు. ఇందరి సమక్షంలో పరువు పోయిందని సిగ్గుపడుతూ ఏమీ తెలియనట్లు 'ఎవడ్రానీవు'? ఏమిటి నీ ఆగడం అంటాడు.

'నేను నీలోవాణ్ణే, నీలోనుంచి వచ్చిన వాణ్ణే, నీవే నా నాన్నవు. నీ తేజాన్ని మట్టిలో చేర్చావుగా, మానవుణ్ణి

ధ్యానించావుగా, నా తప్పేముంది నరునిపట్ల నీ ఆత్మీయతే నా ఆకలి' అని బాలవాల్మీకి అంటాడు. దాంతో మిక్కిలి కోపోద్రేకుడైన బ్రహ్మ 'బిడ్డడు అయితే మాత్రం ఇంతమందిలో నా రహస్యం బట్టబయలు చేస్తాడా? నా పరువుకాస్తా తీసిపారేస్తాడా వెధవ! చండాలుడు పరమచండాలుడై పడిఏడవనీ, అదే వాడి అహంకారానికి శాస్తి' అని వాణ్ని శపిస్తాడు.

బ్రహ్మను అలా చిత్రించడం సంప్రదాయానికి విరుద్ధం. బ్రహ్మ ఆ బాలుణ్ణి చండాలుడివి కమ్మని శపించడం అహేతుకమనే విషయాన్ని చెప్పడానికే రచయిత ఈ సన్నివేశాన్ని ప్రవేశపెట్టాడు. బ్రహ్మశాపాన్ని ఊర్వశి విమర్శిస్తూ, 'అహంకారానికి శాస్తికాదు. సత్యం చెప్పినందుకు శాస్తి. ఆహా మగవాడు ఎంత దుర్మార్గుడు. రహస్యం దాచలేనివాళ్ళు, అబద్ధం చెప్పలేనివాళ్ళు, మోసం చేయలేనివాళ్ళు అంతా ఇలా చండాలురై పోవడం విచిత్రం' అంటుంది. రహస్యాల్ని దాచలేనివారు, అబద్ధాలు ఆడలేనివారు చండాలురై పోతున్నారనడంలో సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థనుండి చండాలురనే పంచమవర్ణం ఏర్పడడానికి ఇవే కారణాలని రచయిత అభిప్రాయం.

వాల్మీకి నోటనుండి శోకపూరిత శ్లోకం వెలువడగా బ్రహ్మ ప్రవేశించి వాత్సల్యంతో కూడిన చిరునవ్వు నవ్వుతూ వాల్మీకిని అభినందించిన తర్వాత వాల్మీకి

'ఇంత దు:ఖము నీవెసృష్టించినావో?
సృష్టియే ప్రతి సృష్టి చేసికొనినదియొ?
చావు బ్రతుకులలో ఏది సత్యమగునో?
తండ్రి నీ సృష్టి తప్పుల తడకకాదో'

అని బ్రహ్మను అమరికలు లేకుండా, నిర్భయంగా నిలదీసి అడుగుతాడు. సృష్టిలో జరిగే మంచికి, సుఖాలకు దేవుడు కారణం అంటూ చెడుకి, దు:ఖానికి కర్మఅని సరిపెట్టుకునే సంప్రదాయ వ్యతిరేకత ఇక్కడ కనిపిస్తుంది. అంతేకాకుండా తప్పు ఎవరుచేసినా తప్పేనని, భగవంతుడు కూడా ఇందుకు మినహాయింపు కాదనే హేతువాద ధోరణి కనబడుతుంది.

వాల్మీకి 'నాకు గతంతో పనిలేదు. భవిష్యత్తు మాటేమిటి? మానవుడి గతి ఏమిటి' అని బ్రహ్మను ప్రశ్నించడంతో నేటి సమాజంలోని అసమానతలకు ఎవరు కారణం అనే విషయాన్ని చర్చించడం కంటే మానవుని యొక్క భవిష్యత్తుకు మంచిబాటలు వేయాలనే సంఘ సంస్కరణ దృక్పథం కనిపిస్తుంది. ఈ సృష్టికి కారకుడైన బ్రహ్మకు ఇక్కడి మంచిచెడ్డలు, సుఖదు:ఖాలు వర్తిస్తాయని వాల్మీకి చెప్పుతాడు. అందుకే 'ఎంత బ్రాహ్మణుడవో నీవు అంత పంచముడవు. ఎంత గోవువో అంత ఉత్తముడవీవు! నాకు వలసినది కాదు, నరుడెవండు? మానవుడు తరియించెడి మార్గమేది?' అని ప్రశ్నిస్తాడు. ఈ విధంగా ప్రశ్నించడంలో బ్రాహ్మణులు నిజంగా గొప్పవారైతే బ్రహ్మ గొప్పవాడు. పంచములు తక్కువ వారైతే బ్రహ్మ తక్కువవాడు అనే విషయాన్ని చెప్పడం కాకుండా ఈ సామాజిక రుగ్మతల్ని అధిగమించే మార్గాన్ని చెప్పమని బ్రహ్మను అడుగుతాడు వాల్మీకి. ఆ ప్రశ్నకు ఇరకాటంలో పడిన బ్రహ్మ ఇక సత్యం చెప్పక తప్పదని భావించి 'నీవు చండాలుడవు కాన జీవసత్య మింత కటువుగా తెలిసికో నెంచినావు. చావు బ్రతుకులలోనేది సత్యమన్న చావు సత్యము, బ్రతుకును సత్యమగును' అని అంటాడు. ఇక్కడ వాల్మీకి జన్మత: చండాలుడు కాబట్టే జీవ సత్యాన్ని సూటిగా చెప్పగలిగాడని బ్రహ్మచేత చెప్పించడం భీమన్నగారు హరిజనులు ఆర్యులనే తమ దృక్పథాన్ని బలపరచినట్లుగా తెలుస్తుంది.

ధర్మవ్యాధుడు :

ఈ నాటకం పురాణ ఇతివృత్తమైనా, సంభాషణల తీరులో, భావంలో ఆధునికత కన్పిస్తుంది. సంఘంలోని అన్నిరకాల దురాచారాల్ని పెద్దవారు చేసే మంచిపనుల్ని, చెడ్డపనుల్ని, గుడ్డిగా అనుసరించే విధానాల్ని రచయిత వివరించాడు. అర్జునకి కుమారుణ్ణి పాము కాటువేయగా మరణించినపుడు, కాలుడు బ్రాహ్మణ బాలుడి మరణానికి

తాను బాధ్యుణ్ణికానని, అతడు చేసుకున్న కర్మఫలితంగానే వాడికి మరణం ప్రాప్తించిందని తెలియజేస్తాడు. దానికి 'కర్మ అంటే ఏమిటి? అది మీ ప్రయోజనాలకోసం చెప్పతున్న సాకుకాదుగదా!' అని అర్జునుడిచేత పలికించడంతో రచయిత కర్మ సిద్ధాంతాన్ని ప్రశ్నించినట్లు కన్పిస్తుంది.

ఈ రూపకంలోని నాయికా నాయకులైన అర్జునకి, ప్రసన్నులు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. కాని వారివారి కులాల తారతమ్యాల వల్ల, ముఖ్యంగా ఆహారపు అలవాట్లవల్ల వాళ్ళు ఒకటి కాకుండా ఉండడం అహేతుకమని చెప్పారు. అందుకే ప్రసన్నుడి మిత్రుడైన సోహంచేత 'మానవ మనస్తత్వం కంటె ఈ అరణ్యం కొంత సరళం. ఈ సమస్యలన్నీ మధ్యవర్తులు కల్పించినవే. మధ్యవర్తులు లేకపోతే సమస్యలే లేవు. పిల్ల కుటుంబం వాళ్ళు మాంసాహారులు, పిల్లవాడి కుటుంబం వాళ్ళు శాకాహారులు. ఇదొక పెద్ద సమస్యా? ఆమె మాంసం మానేస్తుంది, పోనీ అతడు మాంసం తింటాడు. లేదా ఇద్దరూ చెరొక కూరా వండుకుంటారు. ఏం కొంప మునిగిందనీ! గాఢంగా ప్రేమించుకొన్న ఇద్దరు యువతీ యువకుల్ని కేవలం కూరల కారణంగా వేరు చేయడమా?' అని పలికిస్తాడు.

ధర్మవ్యాధుడి కుటుంబం మాంసాహారాన్ని తీసుకుంటుంది. కాబట్టి వాళ్ళది రజోగుణం, మాతంగముని వాళ్ళు శాకాహారులు కాబట్టి తమోగుణం అయితే సత్వగుణం ఎవరిది? రాళ్ళదీ రప్పలదా? బహుశా మాంసం, శాకం తినేవాళ్ళే సత్వగుణ సంపన్నులేమో! అని సోహంచేత ప్రశ్నింపజేయడం హేతువాదతీవ్రతను తెలియజేస్తుంది. శాకాహార, మాంసాహారాల మధ్య నేడు సమాజంలో నెలకొని ఉన్న భావాల్ని పురాణకాలం నుండి రచయిత పరిశీలించాడు. కౌశికుడు తాను బ్రాహ్మణుడినని, శాకాహారినని గొప్పగా చెప్పుకున్నప్పుడు 'బ్రాహ్మలంతా శాకాహారులు కారు. ఆహారానికీ జానానికి సంబంధంలేదు. అగస్త్యులవారు నరమాంసమే తిన్నారు. రంతిదేవుల వారు కోరినట్లు తన జీవితంలో కోసిన మొత్తం డెబ్బైమూడుకోట్ల గోవుల్ని తిన్నవారంతా బ్రాహ్మలే' అని బదులు పలుకుతాడు సోహం. ఆహారపు అలవాట్లవలన ఎవరూ ఎక్కువ, తక్కువ కాదని చెప్పడం రచయిత ఉద్దేశం.

మతంగ మహర్షి తల్లి బ్రాహ్మణ కులస్తురాలు. తండ్రి శూద్రుడు. తల్లిదండ్రులనుంచే కులం సంక్రమిస్తుంది కాబట్టి, మతంగుడు బ్రాహ్మణుడుగాని, శూద్రుడుగాని కావాలి. కాని ఈ శూద్రబ్రాహ్మణుడు వర్ణబాహ్యుడు ఎలా అయ్యాడని రచయిత ప్రశ్నించాడు. బ్రాహ్మజ్ఞానం కలవారు బ్రాహ్మణులైతే మతంగ మహర్షి కూడా బ్రాహ్మణుడు కావాలని చెప్పాడు. కోపమే చండాలత్వమైతే దుర్వాసుడు, విశ్వామిత్రుడు, పరాశరుడు, రాముడిలాంటి వాళ్ళంతా ఎందుకు చండాలురు కాలేదని ప్రశ్నించాడు.

కౌశికుడు చెట్టుకింద కూర్చుని తపస్సు చేసుకుంటుంటే ఆ చెట్టుపై ఉన్న కొంగ రెట్టవేస్తుంది. దానికతడు కోపించి దానివైపు కోపంగా చూడగా అది భస్మమైపోతుంది. ఆ తర్వాత భిక్షకోసం ఒక ఇంటికి వెళ్ళగా, ఆ గృహస్థురాలు అతణ్ణి చూసినా ఆమె భర్తకు పరిచర్యలు చేస్తూ రెండు గంటలు గడిచాక భిక్షం తీసుకువ్రస్తుంది. ఆలస్యానికి దుర్వాసుడిలా తీక్షణంగా ఆమెను చూస్తాడు. అందుకు ఆమె తాను కొంగను కానని, తీక్షణ ప్రకృతిననీ, బ్రాహ్మణులకు కోపం పనికిరాదని చెపుతుంది. అంతేకాకుండా మిథిలానగరం వెళ్ళి సకల ధర్మసూక్ష్మాలు తెలిసిన ధర్మవ్యాధుడి దగ్గర ధర్మోపదేశాన్ని పొంద వలసిందిగా కౌశికునకు సలహా ఇస్తుంది. ఆ గృహిణి ఇచ్చిన సలహాను గూర్చి చర్చించుకునే సందర్భంలో సోహం కౌశికుడితో 'మాంసం అమ్ముకుని బ్రతికే ఒక నీచకులం వాడిదగ్గర ఒక సద్బ్రాహ్మణుడు ధర్మోపదేశం పొందడమా?' అని ప్రశ్నిస్తాడు.

కౌశికుడు కులం ఏవిధంగా ఏర్పడింది అనే విషయాన్ని గూర్చి 'కులం వృత్తికి సంబంధించింది ఒక

వృత్తిచేసే పదిమందీ కలిస్తే అదొక కులం అయింది. ఒక్కొక్క కులం ఒక్కొక్క పారిశ్రామిక కేంద్రం. అంతవరకే దాని ప్రాధాన్యం' అని వివరిస్తాడు. వృత్తి జీవనాధార మయింది. భుక్తికోసం చేసుకునే వృత్తికి, వ్యక్తి జ్ఞానానికి సంబంధంలేదు. ధర్మవ్యాధుడు మాంసవిక్రమాన్ని వృత్తిగా స్వీకరించినా, అతడు జ్ఞానికాబట్టి, కౌశికుడికి గురుదేవు డయ్యాడు.

'ఎవ్వరతడు? ఏమిటితను? ఏమిచేయు?
అనెడి ప్రశ్నలు, అజ్ఞాన జనితములగు
తొలకరించినచాలు, రైతులకు నెందు
నీటి నెందుండి గ్రోలిననేమి మబ్బు?' మేఘం వర్షించే నీరు రైతులకు అవసరంగాని, ఏనీరు ఆవిరైమబ్బుగా మారిందో అనే విషయం అవసరంలేదు. అలాగే జ్ఞానమున్న వ్యక్తిని గురువుగా భావించాలిగాని, కులాన్నిబట్టికాదు అని కౌశికునిచేత రచయిత పలికించడం నేటి సమాజానికి సయితం సందేశాన్నివ్వడమే.

ధర్మవ్యాధుడు ధర్మసూక్ష్మాల్ని గూర్చి కౌశికునికి వివరిస్తూ-

'జీవనమ్మును తినకుండ జీవనమ్ము
ప్రభవమందదు, పెరగదు, ఫలమునీదు
పెండలమ్మేదో, అదే మాంసఖండమునగు
వేసి చల్లిన మొలచునా విత్తనములు?' అని చెపు తాడు. ఇక్కడ జీవహింస చేయకుండా బ్రతకాలనేవాడు వెర్రివాడనే విషయాన్ని రచయిత తెలియజేశాడు.

పిలిచిన వెంటనే పలుకలేదని ప్రసన్నుడి తల్లి అయిన అజరాదేవి కోడలైన అర్జునుకిని 'జంతువులజంపి తినువారి జాతినీది ఇంతకన్నను బుద్ధి నీకెట్టులుండు?' అని నిందిస్తుంది. దానికి కోపం తెచ్చుకున్న అర్జునికి చెప్పకుండా పుట్టింటికి వెళ్ళిపోతుంది. కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకున్నప్పుడు, పైగా అది వర్ణాంతర వివాహం అయి నప్పుడు నేటి సమాజంలో అత్తలు కోడళ్ళను హింసించే విషయాలు అజరాదేవి పాత్ర ద్వారా రచయిత తెలియ జేశాడు.

ఇంటికి తిరిగి వెళ్ళిన అర్జునకి తండ్రి ధర్మవ్యాధుడు వెంటబెట్టుకొని మతంగముని ఆశ్రమానికి తీసుకొస్తాడు. అప్పుడు మతంగుడు సాదరంగా ఆహ్వానించగా, అతని భార్య తాను పొరపాటుగా అన్నమాటల్ని క్షమించమని అడుగుతుంది. ధర్మవ్యాధుడు సమస్య పరిష్కార మయిందని భావించి తిరిగి వెళుతూ 'ఇంటివద్ద నాకు చాలా పనులున్నై. నేను వెంటనే వెళ్ళవలసివుంది. అమ్మాయిని అప్పజెప్పిపోదామని తప్పనిసరిగా వచ్చాను. ధర్మంగా ఏలుకోండి. జాతి పేరుతోగాని, వంశం పేరుతో గాని, తల్లిదండ్రులు పేరుతోగాని వృత్తిపేరుతోగాని నిందించడం కూడనిపని, వ్యక్తికి ప్రధానం గుణం, కులంకాదు. ఏ మంచిగుణాన్నీ ఏ ఒక్కజాతీ గుత్తగొన లేదు. అజ్ఞానంతో భారతజాతిని నాశనం చెయ్యవద్దు' అని చెపుతాడు.

ఇక్కడ 'అజ్ఞానంతో భారతజాతిని నాశనం చెయ్యవద్దు' అనే మాటలు కేవలం నేటి సమాజానికి రచయిత ఇస్తున్న సందేశం. ఈ మాటని నాటక ఇతివృత్తపరంగా వర్ణ వ్యవస్థపైనా, వర్ణాంతర వివాహాల నిరసనపైనా ప్రశ్నించి నట్లు కన్పిస్తుంది.

ధర్మవ్యాధుణ్ణి భోజనంచేసి వెళ్ళవలసిందిగా అజరా దేవి, మతంగుడు కోరతారు. దానికి నేను మాంసం లేకుండా భోజనం చేయను, కాబట్టి దాన్ని మీరు పెట్టలేరుకదా! అంటాడు ధర్మవ్యాధుడు. మేము ఏది తింటే అదే మీకు పెడతామని బదులు చెపుతుంది అజరాదేవి. మీరు ఏమి తింటారు? అన్న ధర్మవ్యాధుడి మరో ప్రశ్నకు వడ్లు, గోధుమలు, యవలు, దుంపలు, కాయలు వంటి శాకాహార పదార్థాలంటుంది అజరాదేవి. మీరు తినే పదార్థాల్ని చూపించమని అడగ్గా, ఆమె గోధుమల్ని ఒక చాటనిండా తీసుకువచ్చి ధర్మవ్యాధుడి ముందు ఉంచుతుంది. అందులో గుప్పెడు గోధుమల్ని తీసుకుని-

'హరిహరీ వీటినా మీరు తినేది? ప్రతిపూటా ఇన్ని లక్షల జీవరాసుల్ని చంపి తింటున్నారా? హింస! ఘోర

హింస! నేను చంపేది రోజుకు ఒక జీవిని మాత్రమే. ఇన్ని లక్షల జీవుల్ని ప్రతి పూటా చంపితింటున్న మీ ఇంటి భోజనం పావభూయిష్టం కాదా!' అని ప్రశ్నిస్తాడు ధర్మవ్యాధుడు. ఈ సంభాషణద్వారా ప్రతీకాయలోనూ, ప్రతివిత్తులోనూ జీవం ఉంటుందని, కాబట్టి మాంసాహారులే జీవహింస చేస్తారనే కొందరి శాకాహారుల ఆలోచనలు అహేతుకాలని రచయిత స్పష్టంచేశారు.

'గాలినైన పీల్చగా లేరు సుడి మీరు
హింస విడిచి బ్రతుక నెంతురేని
జీవకణములను నశింప జేయునుగాన
పస్తులుండుటయును ప్రాణిహింసె!' అని హింసను

గూర్చి వివరిస్తూ గాలి పీల్చినా, నీరు త్రాగినా హింస జరుగుతుందన్నారు. అంతేగాక ఉపవాసాల పేరుతో పస్తులుండడం ద్వారా జీవిని హింసిస్తున్నారని, ఇది కూడా ఒక విధంగా జీవహింసే అవుతుందని రచయిత వివరించాడు. ఈ విధంగా నాటకంలోని ప్రతి సన్నివేశంలోనూ హేతువాద భావాలు కనిపిస్తాయి.

వేద వ్యాసుడు :

నాటకంలో వ్యాసుడు సుమంతుడితో మాట్లాడుతూ, తనచేత సృష్టించబడిన వేద సాహిత్యాన్ని గూర్చి ప్రజలు ఏమనుకుంటున్నారని ప్రశ్నిస్తాడు. 'పవిత్రమైన వేదాల్ని సులభశైలిలో సామాన్యులకు కూడా అర్థమయ్యేవిధంగా వ్రాయడం తప్పు అని, పండితులకు వ్యతిరేకంగా పామరజనోద్యమాన్ని ప్రారంభిస్తున్నారని అనుకుంటున్నారని' సుమంతుడు బదులు చెపుతాడు. దానికి వ్యాసుడు 'మానవోద్ధరణకు మహేశ్వరుడు ప్రసాదించిన వేదాలు పండితుల సొంత ఆస్తులా' అని ప్రశ్నిస్తాడు. వేదాలు ప్రజాభాషలో సామాన్యులకు కూడా లభ్యమయ్యే విధంగా ఉండాలనే భావాన్ని వ్యక్తీకరించడం వ్యావహారిక భాష అవసరాన్ని వ్యక్తీకరించడమేగాక, సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసే రచనలు నిరుపయోగమని చెప్తాడు. మానవజాతి ఉద్ధరణకోసం మహేశ్వరుడు ప్రతిపాదించిన వేదాలు సొంత ఆస్తులా? అని ప్రశ్నించడం ద్వారా, సమాజంలో ఉన్న అటువంటి భావాల్ని వ్యతిరేకించాడు. రచయిత దేవుణ్ణి మతాన్ని అంతగా విమర్శించకపోయినా వాటి కారణంగా వచ్చిన అసమానతల్ని, దోపిడీని విమర్శించాడు.

ఘృతాచి వేదవ్యాసుడితో నన్ను నేను మనస్ఫూర్తిగా మీకర్పించుకొన్నాను, మీ అనుగ్రహంతో మీలో, మీద్వారా, పరమాత్మలో లయమైపోయాను. నన్ను మీ యిష్టం వచ్చినట్లు ప్రవర్తింపజేసుకోండి' అన్నప్పుడు అతడు 'నా యిష్టం వచ్చినట్లు ప్రవర్తించే బానిసకూడా నాకు వద్దు' అని అంటాడు. ఈ నాటకంలో మిగిలిన నాటకాలవలె అంత దృక్పథ ప్రాధాన్యం కన్పించకపోయినా వ్యాసుడి వంశ క్రమాన్ని దృష్టిలో ఉంచుకొని, అతడిచేత అభ్యుదయ భావాల్ని వెల్లడించడంతో హేతువాద ఛాయలు కొన్ని కనిపిస్తాయి.

రాగవాసిష్టం :

ఈ నాటకం అరుంధతి వసిష్ఠుల ప్రేమకు, పెళ్ళికి సంబంధించినదైనప్పటికీ హేతువాద దృక్పథాన్ని రేకెత్తించేదిగా కనిపిస్తుంది. హరిజనులు ఆర్యులేనని, ఆర్య ఋషులంతా హరిజనులేనని చెప్పడంకోసం ఈ రచన చేసినా, ఆయా సందర్భాల్లో మత మౌఢ్యాన్ని, అహేతుక అంశాల్ని, పురాణాల్లోని అసందర్భ విషయాల్ని నిశితంగా విమర్శించారు. అరుంధతి సోదరులైన శివోహంచేత తమ భావాల్ని రచయిత వ్యక్తీకరించాడు. వసిష్ఠుని ఆశ్రమవాసి అయిన కులగిరి మిక్కిలి ఛాందస భావాలతో వేదాల్ని, వేదసంప్రదాయాల్ని గొప్పగా భావిస్తాడు. భిన్న దృక్పథాలతో కూడిన ఈ రెండు పాత్రలమధ్య సంభాషణ తర్కబద్ధంగా సాగుతుంది.

కట్టివేసిన పులి గాండ్రింపులకు మిక్కిలి భయపడిన కులగిరి, ప్రక్కనేఉన్న శివోహాన్ని గట్టిగా కౌగలించుకుంటాడు. తత్తరపాటునుండి తేరుకున్న తరువాత నీవెవరివని అడిగినదానికి, మాదిగ వాడనని శివోహం అంటాడు. ఇది వినగానే ఒక్కగంతులో దూరంగా తప్పుకొని 'చంపావురా కోతివెధవా' అంటాడు కులగిరి.

'అటువెళ్లావంటే నిజంగానే పులినోట్లో చస్తావు శివోహం. దానికి 'పులినోట్లోనయినా చస్తానుగాని, నిన్ను ముట్టుకోను' అంటాడు కులగిరి. ఎందుకని అడిగితే 'నువ్వు ఛండాలుడివి...' అంటాడు. 'ఏదోలే యేడువు మనిషినుండి మనిషిని విడదీయడానికి మహావాక్యాలు ఉదహరించ నక్కరలేదు' అంటాడు శివోహం. ఈ సంభాషణలో అస్పృశ్యతపై నిరసన, మతమౌఢ్యంపై వ్యతిరేకత కన్పిస్తుంది.

ఇలా సంభాషణ కొంతవరకు సాగిన తరువాత కులగిరిలాగే శివోహం కూడా 'ఒరే' అంటాడు. ఎదుటివారు గౌరవించనప్పుడు, వారిని గౌరవించాల్సిన అవసరం లేదనే భావం ఇక్కడ వ్యక్తమవుతుంది. కులగిరి నామాన్ని సార్థకంగా పెట్టారు రచయిత. కులగిరి అంటే పర్వతం, పాషాణమయం. కుల మూఢత్వం అనే అర్థాన్ని సూచిస్తుంది. అలాగే శివోహం పేరుకూడా నేను శివుణ్ణి అనే అర్థాన్ని వ్యక్తంచేస్తుంది. సంస్కరణకోసం సృష్టించబడిన ఈ పాత్రలో రచయిత భావాలు కనిపిస్తాయి.

వసిష్ఠుడు అరుంధతి కలిసి ఉండటాన్ని గమనించిన ప్రాచీనుడు 'ఈమె ఎవరు? పేరేమిటని అడుగుతాడు. అరుంధతి అని చెప్పడంతో అదిరిపడిన ప్రాచీనుడు 'హరిహరీ! అంటరాని పిల్ల, చెప్పరాని కులపు పిల్ల. చండాలకన్య' అని వెంటనే వెళ్ళిపోతాడు. అప్పటి వరకు అరుంధతి చండాల కన్య అని తెలియని వసిష్ఠుడు మోసపోయిన వాడిలా ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తూ తనలో తాను 'చండాలకన్య' అని గొణుగుకున్నాడు. ఇక్కడ అర్హతలున్నా, కులాన్నిబట్టి నీచత్వాన్ని ఆపాదించే మనస్తత్వాన్ని, సంకుచిత స్వభావాన్ని రచయిత నిశితంగా విమర్శించాడు.

ప్రేమోపాసకుడు కానివాడు దైవోపాసకుడు కాలేడు. కాబట్టి సకల భావోదయానికీ ప్రేమ పూర్వరంగంగా వుంటుంది. అందుకే వసిష్ఠుడు అరుంధతిని ప్రేమించడం మూలంగానే తనకు భావవికాసంతో పాటు మంచి దృక్పథాలు ఏర్పడ్డాయని చెపుతూ నాకు నూతన దృక్పథాన్ని కలిగించి, నన్ను నవనూతన జీవిగా రూపొందించిన నీ ప్రేమశక్తికి నేను సర్వదా కృతజ్ఞుణ్ణి అని అంటాడు. అలాగే సంప్రదాయానికి ప్రతీక అయిన కులగిరి పాత్రద్వారా 'దెయ్యాలు కూడా ఉన్నాయంటారు పెద్దలు. మనిషి చచ్చిన తర్వాత పునర్జన్మ ఎత్తుతూవుంటే, మధ్య దెయ్యాలెక్కణ్నుంచి పుడుతున్నాయ్ చెప్మా' అనే సంశయాన్ని వెలిబుచ్చారు. దెయ్యాలు ఉన్నాయనే మూఢనమ్మకాలపై విమర్శ ఇక్కడ కన్పిస్తుంది.

వసిష్ఠుడు అరుంధతిని విడిచిపెట్టి వెళ్ళినప్పుడు ఆమె ఘోర తపస్సుకు సిద్ధపడుతుంది. అప్పుడు ఆమె సోదరి అయిన సంధ్య 'ఎంతకాలం ఈ ఘోరతపస్సు! వేద బాహ్యం. ధర్మనిషిద్ధం. అభారతీయం ప్రకృతి విరుద్ధం అయిన ఈ వర్ణ భేద కాలుష్యాన్ని నీ తపోవహ్ని దహించ గలదా అక్కా' అని ప్రశ్నిస్తుంది. సమాజంలో వర్ణవ్యవస్థ రూపుమాపలేనంత జటిలంగా తయారయిందనే రచయిత ఆవేదన ఇక్కడ ధ్యోతరమవుతుంది.

ఘోర కామం సంభవించినప్పుడు ప్రజలంతా తండోపతండాలుగా తరలి వెళుతూవుంటే, వారిని ఎక్కడికి వెళుతున్నారని ప్రశ్నిస్తుంది సంధ్య. అపుడు ప్రజలు 'ఈశ్వరుడి దగ్గరకు, ఎక్కడికి బడితే అక్కడికే, కూడుదొరికే చోటుకి, ఆకలితీర్చే వాకిలిక' అని అంటారు. ఇదే సందర్భంలో కుంభోదరం 'అన్నం పెట్టలేనివాడు ఇంత మందిని ఎందుకు సృష్టించాడో నిలదీసి అడగాలి' అంటాడు. కష్టాలు తీర్చలేని దేవుడికన్నా, కుడ్భాధల్ని తీర్చే ప్రత్యక్ష దేవుళ్ళే గొప్ప అనేభావం ఇక్కడ వ్యక్తమవుతుంది. అంతేగాకుండా పరోక్షంగా నాస్తిక భావ ప్రబోధం కూడా కన్పిస్తుంది.

వసిష్ఠుడు ఉత్కృష్టవంశం వాడిననే భావంతో అరుంధతిని విడిచి వెళ్ళిన తర్వాత పశ్చాత్తాపంతో 'నేను కఠినాత్ముణ్ణి అమె మాధవీలత, నేను ఝుంఝూ మారుతాన్ని, జాత్యహంకారం స్వామీ! నన్ను సర్వనాశనం చేసింది, జాత్యహంకారం' అని పరమశివుడితో అంటాడు. అప్పుడు పరమశివుడు సర్వజాతులు, సర్వమానవాళి

ఒక్కటే అనే విషయాన్ని స్పష్టంచేశాడు. ఇందులో ఆర్యులు, ద్రావిడులు విదేశాలనుండి వచ్చిన ఒకే జాతివారనే చారిత్రక అంశాల్ని చెప్పడం ద్వారా, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని రచయిత కాంక్షించాడు. ఈ విధంగా ఇతివృత్తం పురాణానికి సంబంధించిందయినా ఆధునిక సమాజంలోని సమస్యల్ని దృష్టిలో వుంచుకొని, సాంఘిక నాటక బాణీలో రచించి హేతువాద దృక్పథాన్ని ప్రకటించారు.

భీమన్న ఈ నాలుగు పౌరాణిక నాటకాలను ఆధునిక దృక్పథంతో రాశాడు. నాటకాలలోని ఆయా పాత్రలద్వారా సామాజిక పరిస్థితులను హేతువాద దృష్టితో సృష్టించినట్లు కనిపిస్తుంది. అవన్నీ నేటి సమాజానికి కూడా అనుసరణీయాలుగా భావించవచ్చు. ముఖ్యంగా ఆధునిక సమాజంలోని కులవ్యవస్థను, ప్రాచీన కాలంలోని చాతుర్వర్ణ వ్యవస్థతో పోల్చిచెప్పిన సన్నివేశాలు భీమన్నను నిజమైన హేతువాదిగా నిలబెడతాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. పౌరాణిక నాటకాలు - బోయి భీమన్న
2. పౌరాణిక రూపకాలు భావవిప్లవం - కొండపల్లి సుదర్శనరాజు

బోయి భీమన్న సాహిత్యం - ఇతివృత్త వైవిధ్యం

- లోపింటి గిరీష్ కుమార్, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సమాజానికి సాహిత్యానికి ఉన్న అవినావభావ సంబంధాన్ని గుర్తించి సమాజం కొరకే సాహిత్యం అన్న సూత్రాన్ని తన రచనలు ద్వారా సుసంపన్నం చేసిన కవి బోయి భీమన్న. ఆయన రచనలు అన్ని కూడా సామజిక చైతన్యాన్ని ఆశించి చేసినవే అని ఒక్క మాటలో చెప్పవచ్చు. భీమన్న 1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో హరిజన కుటుంబంలో నాగమ్మ పుల్లయ్యలకు జన్మించారు. 1935లో బి.ఎ పరీక్షలూ ఉత్తిర్ణుడు అయ్యి, తరువాత ఉపాధ్యాయునిగా చరిత్రను భోదించారు.తర్వాత ఆంధ్ర ప్రదేశ్ అనువాద విభాగం డైరక్టర్ గా రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ గా 1964 వరకు పని చేసారు. పన్నెండవ ఏట నుంచే రచనలు చేయడం ప్రారంభించాడు భీమన్న. మధుబాల (1952). మధు గీత(1957), దీపసభ(1955),భీమన్న కావ్య కుసుమాలు(1957), ప్రకృతిలో మానవ ప్రకృతి, శ్రీ పిల్లి శతక , అశోక వనంలో రాముడు, కేదారేశ్వరి, జన్మాంతర వైరం, అంబేద్కర్ సుప్రభాతం, బాల యోగీయం, నా ఊహలలో వాల్మీకి, పంచమ స్వరం, చాటువులు, స్వగతాలు, మాట వెలదులు వీరి పద్య రచనలు. అనాది కొన నుంచి అనంత తత్వంలోకి, గుడిసెలు కాలిపోత్తున్నై (1973), రాగ వైశాఖి(1965), భీమన్న ఉగాదులు(1983), మోక్షం నా జన్మ హక్కు, చివరి మెట్టు మీద శివుడు మొదలైనవి వీరి వచన కవితా కావ్యాలు. రచయితగా ఈయన సుమారు 70కిపైగా రచనలు చేసారు. పద్య, గేయ, వచన, రచనలతో పాటు నాటకాలు కూడా రాసారు. అలాగే వివిధ పుస్తకాలకు ఆయన వ్రాసిన పీఠికలులో ఆయననుకున్న సూక్ష్మమైన పరిశోధన దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది.అలాగే ఆకాశవాణి ప్రసారాల కోసం భావ గీతాలను కూడా రాసారు. వాటితో పాటు అంబేద్కర్ రచనలను తెలుగులోకి అనువదించడంతో పాటు అయన వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రచనలు చేసారు.

"ఎప్పుడు చూస్తానో మరి
ఎప్పుడు రాస్తానో అరె
తెప్పలు తెప్పలుగా తెల్చినావు తీయన కవితల్
కుప్పలుగా రాల్చినావు కొన్నాన పలుకుల్" అని సినారే గారు ప్రశంసించారు అంటే కారణం ఆయన సాహిత్యంలో ఉన్న మావత శ్రేయస్సు,సమాజ అభివృద్ధికి ఆయన పడిన పాటును మానవ సంబంధాల కొరకు చేసిన కృషి ఎ మేర ఉందో తెలుస్తుంది.భీమన్న సాహిత్యం అంతా కూడా సామాజిక శ్రేయస్సు మనుషులు మధ్య తరతరాలుగా నిలిచిన కులం,మతం వంటి అడ్డుగోడలను తుంచడానికి వర్గాపోరాటాల నిర్మూలకైన తార్కిక దృష్టితో ఆయన చేసిన రచనలే కారణం.

సాహిత్యం :

బోయి భీమన్న గారి సాహిత్యంలో విశిష్టమైన పేరు ప్రఖ్యాతలను అందించిన నాటకాలలో ముందు ఉండేది పాలేరు(1940) నాటకం.అప్పటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టింది.ఆయనను ఒక విలక్షణ రచయితగా నిలబెట్టింది.ఏ నాటకానికి దక్కని ఆదరణ పాలేరు నాటకానికి దక్కింది అనడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉంది. ఎందువలన అంటే ఈ నాటకం ముద్రణ కంటే ముందే అనేక చోట్ల ప్రదర్శింపబడింది.దళిత కులాల్లో చాల వరకు చదివించే స్తోమత లేకనో మరికొన్ని కారణాల వలనో లేదా అక్కడ అగ్రకులాల అజమాయిషీ వలనో వారు పాలేర్లుగా ఉంటూ వారి బతుకులని వెల్లబుచ్చుతుంటారు. అటువంటి వారికి చదువును ఆయుధంగా ఇస్తే వారి జీవితాలు ఎలా మారుతాయో అన్న విషయాన్ని తెలియజేసిన నాటకం. ఆ జాతి ప్రజలు సమర్ధవంతంగా

ఉద్యోగాలు చేసే యోచనలో పడడానికి పాలేరు నాటకం నాటి కాలం కరదీపిక అయిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ నాటకం ఇతివృత్తం విషయానికొస్తే వెంకన్న అనే పాలేరు కుర్రవాడు అక్కడ పెత్తందార్ల దౌర్జన్యాన్ని తప్పించుకొని ఊరు వదిలి పారిపోయి అక్కడ ఉపాధ్యాయుడు ఉపకారి సహాయంతో చదువుకొని డిప్యూటి కలెక్టర్ కావడం నాటక ప్రధాన ఇతివృత్తం. నాటకంలో ప్రేమ,వర్ణాంతర వివాహం వంటి మరికొన్ని అంశాలు కూడా చర్చింపబడ్డాయి. అయితే ఆ అంశాలన్నింటి కంటే దళిత జాతి అభివృద్ధికి వారు చదువు అనే మార్గాన్ని ఎన్నుకొంటే వారి జీవితాలలో ఎటువంటి అద్భుతాలు సృష్టించవచ్చో తెలియజేసిన నాటకం అయ్యింది. నాటి కాలంలో చాల ఎక్కువ ప్రదర్సనలతో పాటు చాల మంది దళిత తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను దీని నుండి విముక్తి చేసి చదివించడానికి సిద్ధపడటం, అలాగే వీళ్ళు అందరు చదువుకొంటే మా దగ్గర పాలేరు పని చేసే వాళ్ళు ఎవరు అని పెత్తందార్లు అనుకోవడం రెండు జరిగాయి.

బోయి భీమన్న సాహిత్యంలో రాగ వాసిష్టం నాటకం మరొక ప్రత్యేకతను విశిష్టతను చాటుకొంది. పురాణం కథను ఇతివృత్తంగా తీసుకొని వశిష్టుడు, అరుంధతి, ప్రణయ వృత్తాంతాన్ని తీసుకొని ఈ నాటకం రచింప బడింది. ఈ నాటకంలో భీమన్న గారు తరతరాలుగా పెరుగుపోయి సమాజాన్ని అధఃపాతాళానికి తోక్కేస్తు పీడిస్తున్న కుల సమస్యని చర్చకు పెట్టడం ప్రధాన విశేషం. ఆర్య, అనార్యులు ఎవరు అనే దిశగా పరిశోధనాత్మకమైన సూక్ష్మ దృష్టితో రాశారు.ఈ నాటకం ఇతివృత్తం విషయానికొస్తే అనార్య యువతీ అయిన అరున్ధతిను ఆర్య జాతీయుడు అయిన వశిష్టుడు ఇష్టపడటం ఇద్దరి మనసులు కలవడం, ఈ విషయం తెలుసుకొన్న వశిష్టుడుకు గురుతుల్యుడు లాంటి ప్రాచీనుడుకు తెలిసి ఆమె అనార్య కన్య అని ఇలాంటివి చేయడం ద్వారా ఆర్య జాతి నాశనం అవుతుందని ప్రాచీనుడు హెచ్చరిస్తాడు. తర్వాత వశిష్టుడు మానసిక సంఘర్షణకు గురికావడం అరుంధతి ప్రణయ ఉహల్లో గడపడం జరుగుతుంది.చివరి సాక్షాత్తుశివుని నోటి నుండి భారత దేశంలో అలాంటి భేదాలు ఎం లేవని చెప్పడం నాటక ఇతివృత్తం. ఈ నాటకంలో భీమన్న గారు అనాధిగా వస్తున్న అనేక పురాణాలు, మనుస్మృతి, ఇతర వర్గ సమస్యలన్నింటిని కూడా చర్చకు పెట్టి సమసమాజ, కుల, వర్గ, రహిత, సమాజానికి ఈ నాటకం ద్వారాకృషి చేసారు. నిండా చాదస్తం కలిగిన పండితులు సైతం కాదనలేని సిద్ధాంతాలు భీమన్నవి అని హేమలత గారు పేర్కొన్నారు అంటే ఆయన ప్రస్తావించిన విషయాల లోతును మనం అర్ధం చేసుకోవచ్చును.

భీమన్న గారికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు తెచ్చి పెట్టిన మరొక రచన 'గుడిసెలు కాలిపోతున్నాయి'(1973). దళితుల ఆనాటి సాంఘిక రాజకీయ ఆర్ధిక కారణాల లో వారి జీవన స్థితిని వారి దుర్గతికి నిలువెత్తు నిదర్శనం ఈ రచన.

"గుడిసెలు కాలిపోతున్నె
ఓహొ కాలిపోతున్నవి
ఎవరి గుడిసెలో పాపం
మాల మదిగలవా అయివుంటై
గుడిసెలు మరేవరికుంటై" అంటూ అన్ని గుడిసెలు ఉన్న వారివే కాలడానికి కారణం ఏంటి ఇంకా ఎన్నాళ్ళు ఇవి ఇలాగే కొనసాగుతాయి అని ప్రశ్నించిన తీరు ఆయనిది. ఈ కవితల్లో సాధారణ ప్రజలను సైతం ప్రభావితం చేస్తున్న అనేక అనేక సమస్యలను అయన కవితలలో చూపించాడు.సమాజంలో కొన్ని జాతులు వెనుకబాటుతనాన్ని వాళ్ళ అభివృద్ధిని తన బహువులపై వేసుకొని వారి సమానత కోసం అకాక్షించిన జాతీయ కవి.

పడిపోతున్న అడ్డగోడలు (1958) అనే మరొక రచన సర్వమానవ సౌభ్రతత్వం కోసం చేసిన రచన సమాజంలో కులాలు మతాలు ఏ విధంగా మానవులను వాటి అధీనంలో ఉంచుకొని ఆధిపత్యం చలయిస్తున్నాయో అన్న విషయాన్ని చాల ముక్కుసూటిగా చైతన్య పరుస్తూ చేసిన రచన.అన్ని కులాలు సమానమేనని వర్ణాంతర

వివాహాలు జరగడం మూలాన ఈ బేధాలను అరికట్ట వేయవచ్చును అని తెలియజేసారు. కులాలు కూడా వారి జీవన వృత్తులు ఆధారంగా ఏర్పడ్డబడ్డాయని వాటిని తర్వాత రాను రాను స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని కొన్ని వర్గాలు వారు ధృడ పరిచారు అనే విషయాన్ని ఈ ఏకాంకిక ద్వారా తెలిపారు

సాహిత్యంలో తాను నమ్మిన భావజాలానికి సిద్ధాంతాలకు సూత్రాలకు జీవిత కాలం లోబడి రచనలు చేసిన వారిలో బోయి భీమన్న ఒకరు కులసమస్య మాసిపోయి అందరు సమానులే అన్న భావనను బలంగా కోరుకొన్న కవి.అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న.

ఆధార గ్రంథాలు :

1. పాలేరు నుండి పద్మ శ్రీ వరకు - హైమావతి
2. పాలేరు - బోయి భీమన్న
3. రాగ వాసిష్టం - బోయి భీమన్న
4. గుడిసెలు కాలిపోతున్నై - బోయి భీమన్న
5. పడిపోతున్న అడ్డుగోడలు - బోయి భీమన్న
6. దళిత సాహిత్యం మాదిగ దృక్పథం - దార్ల వెంకటేశ్వరరావు
7. నీలిరాగం సాహితి వ్యాసాలు - కాత్యాయని విద్మహే

"హరిజనులు ఆర్యులే" బోయి భీమన్న వాదం

-ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, విశాఖపట్నం.

"రాగవాసిష్ఠం (అరుంధతీ కళ్యాణం) ఆధికవి వాల్మీకి వేదవ్యాసడు, ధర్మవ్యాధుడు, ఈనాలుగు నాటకాలను నేను వ్రాయడం హరిజనులు ఆర్యులేనని రుజువు చేయడానికే అందుకు బాహ్య (చారిత్రిక) సాక్ష్యాలనూ అంతరంగికు పురాణగత సాక్ష్యాలను కూడా విశేషంగా చూపాను. ఇంకా పరిశీలించేకొలదీ అందుకు సాక్ష్యాలు కుప్పలు తెప్పలుగ లభించగలవు ఆత్మవంచన విడిచి పెట్టి, అభిజ్ఞులైన పండితులు ప్రయత్నించండి".

- పద్మభూషణ్, బోయిభీమన్న

కవిగా, నాటకకర్తగా, నవలాకారుడుగా, గేయకర్తగా, వచన రచయితగా, జీవిత చరిత్రలు రాసిన రచయితగా, వ్యాఖ్యాతగా, తులనాత్మక అధ్యయనకారుడుగా, స్వీయ పీఠికా రచయితగా, పత్రికా సంపాదకుడుగా ఉత్తమ అధ్యాపకుడుగా, తన కంటూ ప్రత్యేకమైన విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నారు భీమన్నగారు. అనేక భావాలు "కూడలి" భీమన్న గారు. వీరి సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా, విశ్లేణాత్మకంగా, తులనాత్మకంగా అధ్యాయనం చేస్తే అంబెద్కర్ వాదిగా, దళిత జనాద్ధారకుడుగా యదార్ధవాదిగా,సంఘసంస్కర్తగా, సమాజిక శాస్త్రవేత్తగా, మానవతావాదిగా, గాంధేయవాదిగా, కాంగ్రెస్‌వాదిగా, మార్క్సిస్టవాదిగా, నాస్తికుడుగా, ఆస్తికుడుగా, తాత్వికుడుగా, రసాద్వైత సిద్ధాంతకర్తగా, హేతువాదిగా, భావవిప్లవకారుడుగా మనకు కన్పిస్తారు.

సాహితీ విలువలు కోసం కలం పట్టిన సాహితీవేత్త భీమన్నగారు అక్షరాలనే ఆయుధాలుగా మలచిన యోధుడు ఆయన సామాజాన్ని జాగృతి చేయాలనే ఆద్దేశంతో వీరు రచనలు చేశారు. విశ్వమానవతా దృక్పథాన్ని, జాతీయ సమైక్యతా వాదాన్ని భీమన్నగారు తన సాహిత్యంలో ప్రతిబింబింప చేశారు. ఒక వ్యాక్తి తన జీవత కాలంలో చేయలేనంత సాహిత్యాన్ని సృష్టించారు భీమన్నగారు. అందుకోసం పడరాని పాట్లు పడ్డారు. వేదాలు వెతికారు. పురాణాల్ని శోధించారు ఇతిహాసాల్ని పరిశీలించారు. తన జాతివాళ్ళు ఎక్కడేమన్నారో, ఏ మూలన వున్నారో వెతికి వెతికి మరీ మరీ పట్టుకున్నారు. పంచములైన పంచజనుడు, మాతంగుడు, వ్యాసుడు, వాల్మీకి లాంటి వారి జీవిత చరిత్రల్ని విశ్లేషించారు. భీమన్న గారు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. అనుకున్న పని సాధించడంలో భీమన్నకు భీమన్నేసాటి.

వీరు రాగవాసిష్ఠం (1959), ఆదికవి వాల్మీకి (1970), ధర్మవ్యాథుడు (1999), వేదవ్యాసుడు(2000) అనే నాలుగు పౌరాణిక నాటకాలు రాశారు. ఈ నాటకాల్ని ఆధునిక దృక్పథంతో, భావవిప్లవం దృష్టితో రాశారు. భీమన్న గారు, ఈ పౌరాణిక నాటకాల ద్వారా "హరి జనులు ఆర్యులే" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. భీమన్న గారు తమ రచనలకు సుదీర్ఘ స్వీయ పీఠికలను రాసుకున్నారు. తెలుగు సాహిత్య పీఠికారచనలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. తాను ప్రతిపాదించిన సిద్ధాంతం శాస్త్రీయమైందనీ, సహేతుకమైయిందనీ, దృక్పథ ప్రాధన్యత గలదనీ, సమసమాజ స్థాపనకు ఈ సాహిత్యం తప్పనిసరిగా అవసరమనే విషయాన్ని సహృదయ పాఠకులు తెలుసుకోవాలనే తపనతో, ఆవేదనతో భీమన్న గారు పీఠికలు రాశారు. వీరి పీఠికలు వారి మేధా సంపదకి, పాండిత్య ప్రకర్షకు, పరిశోధనకు, గీటురాళ్ళుగా వుంటాయి.

తాను రాసిన నాటకానికి వేరేవారు వేరే అర్ధాల్లో అర్ధం చేసుకోకుండా వుండడానికి భీమన్న గారు తన నాటకాలకు తానే సుదీర్ఘ పీఠికలు రాసుకున్నారు. ఇలా

రాయడం వల్ల సహృదయ పాఠకుల్లో రచయిత సిద్ధాంతానికి గందరగోళం వుండదు. అటు రచయితకు ఇటు సహృదయ పాఠకులకు ఇది చాలా మంచి పరిణామం. భీమన్న గారికి పురాణంపై నిర్ధష్టమైన అభిప్రాయాలున్నాయి. రామాయణ భారత భాగవతాలకు సంబందించిన విషయాలు తీసుకొని పౌరాణిక సాహిత్యాన్ని శాస్త్రీయ దృష్టితో, హేతువాద దృక్పథంతో పరిశీలించారు. ఇంత సుదీర్ఘంగా భీమన్న గారు పీఠికలు రాయకపోతే ఎవరి కోణాల్లో వారు ఆలోచించే వారు. దానికి తెరదించారు భీమన్న గారు. వీరు తమ విప్లనాత్మకమైన భావాల్ని పీఠిక రూపంలో పొందుపర్చారు. పాత్రల స్వభాన్ని సామాజిక పరిస్థితుల్ని వశదీకరించారు. వీరి బహుగంథాపఠనం సహేతుక ఆలోచన, సత్యాన్వేషణ మెచ్చుకోదగ్గది. వారి పీఠికలను నిశితంగా పరిశీలిస్తే వారికి పురాణాలపై వుండే అవగాహన శాస్త్రీయ దృక్పథం, పరిశీలనా దృష్టి విషయ వివేచనా పరిజ్ఞానానికి అద్దంపడతాయి వీరి వాదాన్ని పండితులు, మేధావులు, కవులు, రచయితలు ప్రముఖులు ఎందరో ప్రశంసించారు. పరిశోధనలో పరిపక్వత చెందిన మహా మేధావి భీమన్న గారు.

రాగవాసిష్ఠం :

1959 లో ''రాగవాసిష్ఠం'' నాటకాన్ని భీమన్నగారు రాశారు. పన్నెండు దృశ్యాలతో పద్యగద్యపాటలతో ప్రదర్శనా యోగ్యంగా రాయబడిన ఓ అద్భుతమైన నాటకం ఇది. హిరిజనులు ఆర్యులేనని భీమన్నగారి వాదం. పురాణ ప్రసిద్ధమైన అరుంధతి, వశిష్ఠుల ప్రణయ గాథను ఆధారంగా చేసుకొని వచ్చిన పరిశీలనాత్మక నాటకం ''రాగవాసిష్ఠం'' ఇందులో అరుంధతి, వసిష్ఠుడు, సంధ్య, పరమశివుడు, ప్రాచీనుడు, శివోహం, కులగిరి, గోష్టాదం, కుంభోదరం మొదలైన పాత్రలున్నాయి. ఇందులోని పీఠిక భీమన్నగారి పాండిత్యానికి నిదర్శనంగా వుంది.

''హరిజనులు ఆర్యులే'' అనే తన సిద్ధాంతానికి మంగిపూడి వేంకటశర్మ గారి ''నిరుద్ధ భారతం'' తనకు అద్భుతమైన ప్రేరణ ఇచ్చిందని భీమన్నగారు చెప్పుకున్నారు. ఈ గ్రంథం గొప్పతనం గూర్చి వీరు చెప్పుతూ ''నిరుద్ధ భారతం భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతి వ్యక్తికీ పారాయణ గ్రంథం అని కొనియాడారు అంతేకాక నేను ''రాగవాసిష్ఠం'' రాయనికి ప్రధాన కారణం ''నిరుద్ధ భారతం'' కావ్యం అని చెప్పుకున్నారు. అరుంధతి, వశిష్ఠుల వివాహాన్ని కమనీయమైన నాటకంగా ''రాగవాసిష్ఠం''ను భీమన్న గారు రాశారు. ఇది పద్యగద్యగేయాత్మకమైన ప్రణయ నాటకం. వీరు నేటి వ్యవస్థని పట్టి పీడిస్తున్న అస్పృశ్యతా జాడ్యాన్ని అంతం చేయడం కోసం ఆర్య ఋషులంతా హరిజనులే అని, హరిజనులు ఆర్యులే అని చెప్పడం కోసం ఈ నాటకాన్ని రాశారు. ప్రతీ నాటకాన్ని పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగా తులనాత్మకంగా రాశారు.

''వ్యాసముని చంద్రగన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి యయ్యే
వేశ్యకును పుట్టి మాలెత బెండ్లియాడి
ఆ వశిష్ఠ మహర్షి బ్రమ్మర్షి యయ్యే
(నిరుద్ధ భారత)

శర్మగారు రాసిన ఈ పద్యం తనలో ఎంతో ఆలోచనా శక్తిని కలగుజేసిందని వున్నది వున్నట్లు భీమన్న గారు తెలియజేశారు.

హరిజనులు ఎవరు? పురాణాల్లో వారి ఉనికి ఏమిటి? అని చర్చించారు. హరిజనులు కులపరంగా హైందవ పురాణాల్లో కావ్యాల్లో ప్రయోగించబడిన అనేక పదాల్ని విపులీకరించారు. మారన ''హరిశ్చంద్రోపాఖ్యానం''లో విశ్వా మిత్రుడు హరిశ్చంద్రుడిని వీరబాహుడికి అమ్మేటప్పుడు తనను చండాలునకు అమ్మవద్దని హరిశ్చంద్రుడు అంటాడు. అప్పుడు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడితో

''.... నను గొల్చు బంటువై
దక్కితిగాక, మాలనికి
దక్కగా సమ్మితి నేనునిన్ను''

అని అంటాడు ఇక్కడ "చండాల", "మాల", శబ్దాలు రెండూ పర్యాయ పదాలుగానే ప్రయోగించబడ్డాయి. ఇలాగే పురాణ గ్రంధాలన్నింటిలోనూ మాల, మాదిక, మాతంగ, శ్వపచ, చాండాల మొదలైన శబ్దాలు కూడా పర్యాయ పదాలే. ఆర్యా, ద్రావిడుల ఉనికిని, అస్తిత్వాన్ని కూడా ఈ పీఠికలో పేర్కొంటూ భీమన్నగారు తమ వాదానికి బలంగా చూపారు. మతంగ మహర్షి వృత్తాంతం భారత అనుశాసిక పర్వంలోనూ, రఘువంశం ఐదవ సర్గలోనూ, వాల్మీకి రామాయణం కిష్కింధకాండలోనూ వుంది. మాతంగ మహర్షి ఆనాటి సాంఘిక నీతి సూత్రాలపై తీవ్రంగా తిరుగు పాటు చేశాడు. ఆర్యావర్తం నుండి దారి పొడుగునా హిందూ సమాజంతో పోరాటం పెట్టుకొంటూ దక్షిణాదికి వచ్చినవారు మాతంగుని సంతతి వారు అని చెప్పారు. అంతేకాక మనుస్మృతి వేమన పద్యాలు, చి.హెచ్. సత్యనారాయణ గారి పరిశోధన పత్రాలను కూడా పరిశీలించారు. చివరకు తేలిన సారాంశం ఏమంటే మాల, మాదిగలు, అసేతు హిమాచలం దేశమంతటా ప్రతీ గ్రామంలోనూ వ్యాపించి వున్నారని భీమన్న గారి వాదం.

అరుంధతికి సంబంధించి కూడా గొప్ప పరిశోధన చేశారు భీమన్న గారు. వీరు నిరుద్ధ భారతం, భారతం, అష్టదశ పురాణాలు, భారతీయ సంస్కృతి మొదలైన అనేక పుస్తకాలను కన్పించే విశేషాల్ని లోతుగా పరిశీలించి క్రొత్త క్రొత్త విషయాల్ని బయట పెట్టారు. అస్పృశ్యులుగా పిలువబడే మాతంగులలో పుట్టింది అరుంధతి. అంతేకాదు ఎంతో మంది నూతన వధూవరులకు ముత్తైదువుగా పురాణ ప్రసిద్ధి చెందింది. ఈమె ఉత్తమ ఇల్లాలు, మహా పతివ్రత కూడా, పురాణాల బట్టి అరుంధతి మాతంగ కన్య అని స్పష్టమైంది. మాతంగ కన్య అయిన అరుంధతిని వశిష్ఠుడు పెళ్ళి చేసుకున్నాడు. వీరికి శక్తి మహర్షి పుట్టాడు. ఇతడు మాలెతను పెళ్ళి చేసుకుంటాడు. వీరికి పరాశరుడు పుడతాడు. పరాశరుడు జాలారి కన్య అయిన మత్స్య గంధిని పెళ్ళి చేసుకుంటాడు. వీరికి వ్యాసుడు పుడతాడు. పాండవులు, కౌరవులు మొదలైన వారు కూడా వ్యాసుని సంతతి వారే.

పంచములచే రాయబడిన పంచముల చరిత్ర కాబట్టే "పంచమవేదం" అనే పేరు వచ్చిందని భీమన్న వాదం. కొంతెమ్మ (కుంతి అమ్మ) పండగను మాల, మాదిగలు మాత్రమే చేస్తారు. అందువల్ల తాము ఆ వంశానికి చెందినవారమని తులనాత్మక పరిశోధన చేసి నిగ్గు తెచ్చారు భీమన్న గారు. ఇదే వీరి వాదం. ద్రావిడులు ఆర్యులే, ఆర్యద్రావిడులు ఒకే జాతికి చెందివారు. ఈ విషయాన్ని హిందూ పురాణాలు కూడా తెలియజేస్తున్నాయని వీరి వాదన. "హరిజనులు ఆర్యులేనని, ఆర్య ద్రావిడ భేదం కూడా కృతకమైందేగాని నిజమైందికాదని, ద్రావిడులు కూడా ఆర్యులేనని నిరూపించడం కోసమే నేను ఈ నాటకాన్ని వ్రాశాను" అని ఘంటాపథంగా భీమన్నగారు చెప్పారు.

ఆదికవి వాల్మీకి :

ఈ నాటకం 1970లో వచ్చింది ఆరు అంకాల నాటకం ఇది. అందులో ఇతివృత్తం నీతవనవాసం నుంచి కుశలవుల జననం వరకు వున్న కథ. ఇందులో పాటలూ, పద్యాలూ, శ్లోకాలు చోటు చేసుకున్నాయి. దానిలో కులతత్వ వాదులు సృష్టించిన కొన్ని అపవాదాన్ని భీమన్న గారు తీవ్రాతితీవ్రాంగా ఖండించారు. ఇందులోని పీఠిక వీరి ప్రతిభకు నిదర్శనం ఈ నాటకం రామాయణానికి సంబంధించింది. ఈ నాటకంలో ప్రధాన పాత్ర వాల్మీకి అ ఉనిక తెగలకు (గిరిజన) అత్రిమహర్షి సంతతికి చెందిన వాడు. కాబట్టి హరిజన, గిరిజనులు అంతా ఆర్య సంతతికి చెందిన వారని భీమన్న గారి వాదం. ఈ నాటకంలో "హరిజనులు ఆర్యులే" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాధించారు. ఇదే విషయాల్ని పీఠికలో కూడా నొక్కవక్కాణించారు. భీమన్నగారు తమ వాదానికి ఆధారాలు కూడా ఇచ్చారు. షెడ్యూల్డు తరగతుల పుట్టుపూర్వోత్తరాలపై వీరు కనీ వినీ ఎరుగని లోతైన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా శ్రీతులాబందుల నాగేశ్వర రావుగారు " గిరిజనులలో

వాల్మీకులు మాలలనీ, అస్పృశ్యులనీ" చెప్పిన అభి ప్రాయాన్ని పూడా ఉదాహరించారు.

భారత జాతికి జాతీయ కవులు ఇద్దరే ఇద్దరు. ఒకరు వాల్మీకి రెండోవారు వ్యాసుడు. త్రేతాయుగానికి వాల్మీకి, ద్వాపరయుగానికి వ్యాసుడు కవిబ్రహ్మలు ఇక్కడ చర్చకు తావుకాదు. అందరిదీ ఒకే మాట. వారి వంశ వృక్షాన్ని హేతుబద్ధంగా, శాస్త్రీయంగా పరిశోధించి, వారు హరిజన, గిరిజన సంతతికి చెందిన వారేనని భీమన్నగారు చెప్పారు. మన పురాణాల ప్రకారం పదున్నాలుగు మన్వంత రాలున్నాయి. అందులో ఏడవ మన్వంతరంబు ఋషి ఋషివంశ శాఖల్లో అత్రి వంశం ఒకటి. ఈ వంశంలోనే పుట్టాడు వేనరాజు. ఇతడు సమసమాజం కోసం నిరం తరం కృషి చేశారు. అయినా కొంత మంది స్వార్థపరుల చేతుల్లో హత్య కావించ బడ్డాడు. వేనరాజుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు నిషాదుడు, రెండోవాడు పృథుడు నిషాదుడు తండ్రి మార్గాన్నే ఆయన భావజాలన్నే అనుసరిస్తాడు. స్వార్థపరులైన అమాత్యులు అతన్ని కావాలని దేశం నుంచి వెళ్ళకొడతారు.

పరమ సాధువైన పృథువును సింహాసనం ఎక్కిస్తారు. ఇలా దేశబహిష్కృతుడై అడవులకు వెళ్ళిన ఆ నిషాదుడే పల్లె, బోయ, ఎరుగల, వంటి ఆటవిక తెగలకు మూల పురుషుడు అని "బ్రహ్మపురాణం" చెప్పుతుంది. బోయ, నిషాదవంటి ఆటవిక తెగలకు చెందిన వాల్మీకి అత్రి మహర్షి వంశంవాడని చక్కగా విపులికరించారు భీమన్న గారు. దీన్ని బట్టి బాగా లోతుగా పరిశీలిస్తే ఆనాడు ఆదివాసులుగా, గిరిజనులుగా, చెప్పబడుతున్న వాళ్ళు ఆర్యఋషులే అనడానికి ఇంతకంటే వేరే మంచి పౌరాణిక నిదర్శనం అవసరం అక్కడ లేదని భీమన్నగారి వాదన.

సప్తఋషుల్లో ఒకడైన అత్రి భార్య అనసూయ అమె అరుంధతి అక్క. అనసూయ, అరుంధతి మొదలైన ఏడుగురు అక్కల తర్వాత పుట్టిన వాడు కపిలమహర్షి. వేదాంతంలో సాంఖ్యాసిద్ధాంతాలను ప్రవేశపెట్టినవాడు ఈ కపిల మహర్షే. వీరం తాతానాటి హరిజన, గిరిజనులకు పితరులే అని భీమన్న వాదం. మంగిపూడి వేంకటశర్మ గారు వాల్మీకి నిషాదవంశం వాడే అని తన "నిరుద్ధ భారతం"లో భేరీమోగించారు. అంతేకాదు తన గ్రంథంలో శర్మగారు ఎంతోమంది పురుషులు, స్త్రీలు హరిజనులు వున్నారని విశదీకరించారు. వాల్మీకి, పరశురాముడు, వేదవ్యాసుడు,శ్రీశుకుడు, సత్యవతి, రోహిదాసుడు, మాతంగుడు, కుంతి, దేణుక, మొదలైన వారంతా ఈ కోవకే చెందుతారని తన పరిశోధనలో తెలియజేశారు. వ్యాసుడు హరిజనుడు కాబట్ట తన ప్రజల కోసం వేద సారాన్ని పురాణ కథలుగా రాశాడని భీమన్న గారి వాదం. వీరు పురాణప్రసిద్ధమైన కథనే తీసుకొని తమ వాదాన్ని ప్రతిపాదించడం కోసం మార్పులు చేర్పులు చేసి "ఆదికవి వాల్మీకి" నాటకాన్ని రాశారు. వీరు పురాణగాథలనే ఆధరంగా తీసుకొని వాల్మీకి పుట్టిడానికి హేతువుగా అప్సరసల్లో ఒకరైన ఊర్వశిని ఈ నాటకంలో ఒక పాత్రగా సృష్టించారు. హిందూ సంస్కృతికి మూల పురుషులైన ఋషులంతా హరిజన గిరజనులే అయినప్పుడు అస్పృశ్యలే, కులవ్యవస్థ అర్థ రహితం అని అన్నారు. ఇదే దృక్పథం వీరి పీఠికలో చాలా స్పష్టంగా కన్పిస్తుంది.

ధర్మవ్యాధుడు :

ఈ నాటకం 1999 లో వచ్చింది. ధర్మవ్యాధుడు మానవత్వం మూర్తీభవించినవాడు. ఉదయాన్నే లేచి నిత్యమూ దైవారాధన చేస్తాడు. అంతే కాదు తల్లి దండ్రుల్ని పూజిస్తాడు తన జీవితం గడవడం కోసం మాంసం అమ్ముతాడు ధర్మవ్యాధుడు జ్ఞానాన్ని సంపా దించి బ్రహ్మజ్ఞుడు అవుతాడు. అంచేతనే భూత భవిష్యత్తు వర్తమానాన్ని చాలా స్పష్టంగా చెప్పగల ద్రష్ట అవుతాడు. తన ప్రతిభాశక్తి సామార్థ్యాలతో దైవబలం, మంత్రబలం, రెండూ సంపాదించాడని భీమన్న వాదం. ఈ నాటకం భారతానికి సంబంధించింది. భారత అరణ్య పర్వ పంచమాశ్వసంలోని 27 నుండి 145 వరకు గల పద్యాల్లో విస్తరించిన ధర్మవ్యాధుడి కథ ఈ నాటక ఇతివృత్తానికి మూలం. ఈ కథను తమ భావాలకు అనుగుణంగా,

భావంలోనూ, భాషలోనూ, ఆధునిక తను కనపరుస్తూ నాటకాన్ని రాశారు. నేటి సమాజంలోని అనేక రుగ్మతల్ని, అహేతుక సంప్రదాయాల్ని వివరిస్తూ పురాణ కథను తమ ప్రతిభాపాటవాలతో ఆధునీకం చేశారు. ఈ నాటకంలో భీమన్న గారు ప్రతీ సన్నివేశంలోనూ మూలానికి భిన్నంగా కథను మలుస్తూ ఆధునిక సామాజిక పరిస్థితుల్ని దృష్టిలో వుంచుకొని భావవిప్లవాన్ని స్ఫురించారు భీమన్న గారు.

వేదవ్యాసుడు :

2002లో ఈ నాటకం వచ్చింది వేదవ్యాసుడు త్రిమూర్తుల దూపమనీ, శక్తి మంతుడనీ, ధీమంతుడని భీమన్న గారు వశదీకరించాడు. వ్యాసుడికి కులవ్యవస్థలోని సౌకర్యం అర్ధమై సామాజిక వ్యవస్థను పునరుద్ధరించాలని వేదాల్ని వర్గీకరించాడని భీమన్న గారి వాదం. ఉప నిషత్తులు, బ్రహ్మ సూత్రాలు చివరకు భగవద్గీత ప్రకటించి సామాజానికి ఎంతో మేలు చేశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే సోషలిస్టు సమాజాన్ని ఆనాడే వ్యాసుడు పునరుద్ధరించాడని భీమన్న గారి వాదన. వ్యాసుడు అరుంధతికి మునిమనవుడు అనే విషయాన్ని తెలుసు కొన్నారు. అందుకే ఆవంశవృక్షాన్ని నిర్మించడానికి శత విధాలా ప్రయత్నించారు. ఆ వంశ వృక్షం వివరాలను జాగ్రత్తగా పరిశోధించి ఈ నాటకంలో చాలా స్పష్టంగా వివరించారు. ఆంధ్రమహాభారతంలోని ఆది పర్వం 387 వ పద్యం నుండి 420 వరకు గల పద్యాల్లో విస్తరించిన కథ ఈ నాటకం. ఇంకా ఆయా తావుల్లో కన్పించే వ్యాసునికి సంబంధించిన కొన్ని ఘట్టాలు ఈనాటక రచనకు మూలం వేదాలు సామానులకు కూడా అర్థ మయ్యే విధంగా వ్యాసుడు వ్యాసీకరిస్తున్నాడని పండితులు వమర్శిస్తూన్నారని సుమంతుడు చెప్పుతాడు. ఇది మూలానికి భిన్నమైంది. వ్యాసుడికి, ఘృతాచీకి మధ్య అమితమైన అనురాగం ఈనాటకంలో ప్రవేశపెట్టబడింది. మూలంలో వీరి ప్రణయాన్ని కన్నా ఇది ఎక్కువుగా కన్పిస్తుంది. ఇక్కడ వ్యాసుడు అభ్యుదయ భావాలు కలవాడిగా, ప్రేమికుడిగా దర్శనమిస్తాడు. భీమన్నగారు వ్యాసుణ్ణి చాలా ఉన్నతంగా చిత్రీకరించారు. ఈ నాటకంలో ఆయా పాత్రల భావాలు సంభాషణలు ఆధునిక సమాజాన్ని ప్రతిబించేవిగా వున్నాయి.

భీమన్న గారు మొదటి నుండి వ్యక్తిగా, సాహిత్య వేత్తగా బానిసత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వీరి రచనల్లో ఈ దృక్పథం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. వ్యాసుడి చేత కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తీకరింపచేయడం వారి ఆత్మీయతకు చక్కని నిదర్శనం వ్యాసుడి వంశ క్రమాన్ని దృష్టిలో వుంచుకొని, అతని చేత అభ్యుదయ భావాల్ని వెల్లడించడం ద్వారా భావ విప్లవాన్ని సృష్టించారు భీమన్న గారు వ్యాసునికి సంబందించి ఎంతరాసిన అసమగ్రమే అని వీరి అభిప్రాయం. హరిజనుల మూలాలని, వారి చరిత్రను, తెలియజేయానికి భీమన్నగారు ఈ నాటకాన్ని రాశారు. హరిజనుల పుట్టుకకు సంబందించిన అనేక చారిత్రక ఆధారాలను, పురాణాల నుండి, విజ్ఞాన సర్వస్వాల నుండి, అనే గ్రంథాల నుండి ఆదాహరణలు ఇచ్చిన భీమన్న గారి పరిశోధన, భావితరాలవారికి మార్గదర్శకం.

"జాతి సమైక్యతకోసం
కులతత్వ నిర్మూలన కోసం
నేనీపరిశోధన అంతా చేస్తున్నాను
దీనివల్ల ఒక్క ప్రజ్ఞా వంతుడు
ప్రభావితుడైనా నేను ధన్యుణ్ణే.

- బోయి భీమన్న

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - వెలమలసిమ్మన్న
2. తెలుగు సాహిత్య విమర్శసిద్ధాంతాలు - వెలమలసిమ్మన్న

3. పద్మ భూషణ్ డా॥ బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథ - భీమశింగి నమశ్శివాయ
4. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమతి
5. పౌరాణిక రూపకాలు - భావవిప్లవం - కొండపల్లి సుదర్శనరాజు
6. భీమన్న సాహితీ షష్ఠిపూర్తి సంచిక -సం॥గనుమల జ్ఞానేశ్వర
7. బోయి భీమన్న సాహిత్యం - జాతీయదృక్పథం - సం॥ బూర్గుల కేశవులు
8. బోయి భీమన్న సాహితీ సమాలోచన - వెలమల సిమ్మన్న

బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ~ 21 & 22, ఫిబ్రవరి 2022

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies



భీమన్న గారి సాహిత్యమంతా రసాద్వైతం. హరిజనులు ఆర్యులే శివసోషలిజం వంటి సిద్ధాంతాలు చుట్టూ అల్లుకొన్నది. మహత్తర కార్యక్రమాన్ని తలపెట్టే కార్యక్రమ విజయానికి అహర్నిశలూ కృషి చేస్తున్న మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు, కవి, రచయిత, గాయకుడు అయిన ఆచార్య విస్తాలి శంకరరావు గారిని మనసారా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

- కైమూరి భీమన్న



ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగి అద్భుతమైన సాహిత్య సృష్టితో సామాజిక చైతన్యాన్ని ఆశించి జాతిని జాగృతం చేసిన మహాకవి బోయి భీమన్న గారి వ్యక్తిత్వం, సాహిత్యం విశిష్టం. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి జాతి సమైక్యతే ధ్యేయంగా ముందుకుసాగి సాహిత్య చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్న మహోన్నతమైన వ్యక్తి భీమన్న.

- ఆచార్య విస్తాలి శంకరరావు



భీమన్న గారు చెట్టంత మనిషి. సాహిత్యం ద్వారా సామాజిక ప్రక్షాళనకు పూనుకొని ఎన్నో రచనలు చేశారు. వారి రచనలకు ఎందరో ప్రేరేపితులై తమ జీవితాలనే మార్చుకొని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దబడ్డారు. అటువంటి మహనీయునిపై మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అంతర్జాతీయ సదస్సుకు పూనుకోవటం ముదావహం. సదస్సు పరిశోధన పత్రాలను భావవీణ ద్వారా వెలుగులోనికి తీసుకురావటానికి అవకాశం కల్పించిన మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు గారికి ధన్యవాదాలు. సదస్సు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...

- డా॥ బోయి వెంకటస్వామి

తెలుగు విభాగం

మద్రాసు విశ్వవిద్యాలయం

మెరినా ఆవరణ, చెన్నై, తమిళనాడు.